కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య

# శంఖారావము

(శ్రీమద్భగవద్గీతా రహస్య ప్రకాశము - వ్యాఖ్యానము)



కులపతి బుక్ ట్రస్ట్

The content of this publication is given for free as an act of goodwill and for personal use only. It is our responsibility to keep it that way.
Commercialization by any means or on any platform is prohibited, as well as distribution and/or publication in whole or in part without the express written permission of the publisher. All rights reserved.

# శంఖారావము

(శ్రీమద్భగవద్గీతా రహస్య ప్రకాశము)

వ్యాఖ్యానము :

**కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య**

**కులపతి బుక్ ట్రస్ట్**

విశాఖపట్టణము - 530 002.

1వ ముద్రణము (1985) నుండి

| | | |
|---|---|---|
| 8వ ముద్రణము (2019) వరకు | ... | 9,500 ప్రతులు |
| 9వ ముద్రణము (2022) | ... | 1,000 ప్రతులు |
| మొత్తము | ... | 10,500 ప్రతులు |


© కులపతి బుక్ ట్రస్ట్

వెల : రూ॥ **300-00**

ప్రతులకు :

**కులపతి బుక్ ట్రస్ట్**

15-7-1, *ఏంజిల్స్ ఎన్క్లేవ్,*

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891 - 2565291.

**e-mail : kulapathibooktrust@gmail.com**

ISBN : 978-81-906949-1-9

*ముద్రణ :*

**ఓం నమశ్శివాయ జెరాక్స్**

మహారాణిపేట, విశాఖపట్నం.



“కృష్ణం వందే జగద్గురుమ్।”

# ప్రాశస్త్యము

**పాం**చజన్యము శ్రీకృష్ణుని శంఖము. అందుండి వెలువడు రవము ఓంకారస్వరూపుడైన శ్రీకృష్ణుడే! అంతర్యామి అయిన భగవంతుడు పాంచజన్యము నుండి వ్యక్తమగుచుండును. మానవ శరీరము పాంచభౌతిక మగుటవలన పాంచజన్యము. అందుండి కూడ అంతర్యామి అంతర్వాణిగా కాలానుగుణముగా వ్యక్తమై జీవుల నుద్ధరించుకొనుచుండును. జీవులను సృష్టించుట, పెంపుజేయుట, తన కున్ముఖులుగా జేయుట, తనయందు లయ మొనర్చుకొనుట అంతర్యామి అయిన భగవంతుని లీల.

భగవంతునియొక్క ఈ లీలను దివ్యప్రణాళికగ దర్శించినవారు ఋషులు. కాలము రూపమున భగవత్సంకల్పములను సందేశములుగా నెరిగి తదను గుణముగా ఋషులు వర్తించుచుందురు. అంతర్యామియొక్క దివ్యప్రణాళిక యందు వారు అంతర్భాగములై ప్రవర్తించుచుందురు. భగవత్సంకల్పములు వారి నుండి సందేశములుగ జీవుల కందుచుండును. వారు సందేశములను జీవుల కందించుటకై జీవుల నడుమ సహజముగా నర్తించుచుందురు. వారి సందేశము వలన, వారి సామీప్యము వలన, వారి సాయుజ్యము వలన జీవులు అంతర్యామి తత్త్వమునందు మేల్కొనుచుందురు. అట్లు జీవులను మేల్కొల్పుటకు దిగి వచ్చినవారు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యగారు (మాస్టర్ ఇ.కె.).

పరమగురువులైన మాస్టర్ ఇ.కె. నుండి మరియొక మారు నిత్యనూతన ముగా భగవద్వాణి వ్యక్తమై ఈ *"శంఖారావము"* అను గ్రంథముగా రూపొంది నది. సత్యాన్వేషకులను, సత్సాధకులను క్రమమైనటువంటి సాధన కున్ముఖులను చేయుటకై ఈ శంఖారావము వ్యక్తమైన దనిపించును. సాధనా రహస్యములను సులభ శైలిలో సాధకుల కందించుట ఇందు జరిగిన ఋషియత్నము. వివిధములు, అనేకములైనటువంటి అంశములయందును, విషయముల

యందును సాధన పేరిట చిక్కుపడిన వారికి ఈ గ్రంథము చిక్కు విడదీసి మార్గమును సుగమము చేయును.

సూటిగ అంతర్యామిని దర్శించుటకు ఇందు క్రమమైన సాధన నిర్దేశింప బడినది. నామ రూపాతీతమైన భగవంతుని, నామరూపాత్మకమగు జగత్తునందు కూడ దర్శించు యుక్తి ఇందు నిర్దేశింపబడినది. సగుణ, గుణాతీత మార్గములు చక్కగా సమన్వయింపబడినవి. భాష కందని భగవత్ తత్త్వము అతి సులభమైన భాషలో సామాన్య జనుల కందించుటలో అపారమైన ప్రేమతత్త్వము ప్రదర్శింప బడినది. ఇందలి పదములు, వాక్యములు చదివినపుడు, తాము చదువుటగాక, మాస్టరుగారే వినిపించుట ఒక విచిత్రము. ఒక సన్నిహితునివలె సాన్నిధ్యము నిచ్చి అంతర్యామిని దర్శింపజేయుట *"శంఖారావము"* చదువరుల అనుభూతి.

అవ్యక్తమగు విషయమునకు దర్పణము పట్టినట్టుగా గ్రంథస్థ విషయములు సూటిగ చదువరులను 'నేను' అను ప్రజ్ఞయందు నిలుపుట గ్రంథకర్తయొక్క సామర్థ్యము. మాస్టరుగారి ఈ ప్రయత్నము పరిపూర్ణము గావించిన చివుకుల రవిశర్మగారు ధన్యాత్ములు. నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారము నిష్ఠతో ఈ గ్రంథమును ప్రతిదినము 10 నిమిషములపాటు పఠించు సాధకులు సనాతనమైన మార్గమున పురోగతి చెందుదురనుట నిస్సందేహము. అట్టి ప్రయత్నము కొరకై ఎదురుచూచు వారికి ఈ గ్రంథ మొక పెన్నిధి. వారికే ఈ మా ప్రయత్నము సమర్పితము.

ఈ గ్రంథమును అతిరమణీయముగ ముద్రించి, తీర్చిదిద్దిన ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్ సోదరులకు మా కృతజ్ఞతాపూర్వక అభినందనలు.

22-7-1993
విశాఖపట్టణము

**కంభంపాటి పార్వతీకుమార్**
అధ్యక్షులు,
**కులపతి బుక్ ట్రస్ట్.**

# పీఠిక

**లో**కములోని ప్రతి వ్యక్తియు ఆనందముగా నుండవలెననియే కోరు చుండును. కాని తాను కోరిన ఆనందము వేరు, తనకు అవసరమైన ఆనందము వేరు అని గ్రహించగలిగిన వ్యక్తి నిజమైన ఆనందపథమున అడుగు పెట్ట గలుగును. పరబ్రహ్మ స్వరూపముగా చెప్పబడిన ఆనందము ననుభవించుటయే నిజమైన ఆనందమని వేదాంతు లందురు. ఇది ఒక స్థాయిలోని సత్యమేకాని సంపూర్ణ సత్యము కాదు. లౌకిక జీవులకు కావలసినది వారి స్థాయిలోని ఆనందము. ప్రతి వ్యక్తికిని వాని స్థాయిలో అసలైన ఆనందమనగా నేమో తెలియు మార్గమును ప్రసాదించువారు పరమగురువులు.

ఏ వ్యక్తియైనను తాను కోరినది పొందుటయే ఆనంద మనుకొనును. పొందలేనప్పుడు దుఃఖించును. పొందినను అది తాత్కాలికమే! మరల వేరొక కోరిక మొలకెత్తుటయు, మరల ఇట్టి చక్రమే ఆవృత్త మగుటయు జరుగును. ఈ సంసార బంధనము నుండి ఒక్కసారి విమోచనము చెందవలసిన స్థితి ప్రతి జీవునకు కలుగును. అప్పుడు మొదటి బంధచ్ఛేదనము (Break-Through) కలిగించువాడు గురువు. ఒక వ్యక్తి 'నాది' అనుకొన్న స్థాయికి కొంచెము పైగా, వాని స్వభావమున కనుగుణమైన ఒక కార్యక్రమమును రూపొందించి, అందులో ఆ వ్యక్తిని ప్రవేశపెట్టును. ఆ కార్య నిర్వహణములో అతడు లీనమై యుండగా క్రింది స్థాయిలో వాని అవసరము లన్నియు తీరుచుండును. వాని కోరికలు కూడ కొంతవరకు తీరుచుండును. కొంతకాలము గడచుసరికి అవసరములు, కోరికలు తీరుట యందలి ఆనందము తనంత తాను కలుగుచున్నదనియు, తాను దానికై వేరుగా యత్నింపవలసిన అవసరము లేదనియు అతడు గ్రహించును. అప్పటినుండి అతడు సాధకు డనబడును. కాని యీ స్థితిలో అతడు తన కార్యక్రమముపైనను దానిలో కలుగు ఆనందముపైనను మమకారము పెంచు

కొనును. సరిగా ఈ సమయములో గురువు మరియొక కార్యక్రమమును మరికొంత పై స్థాయిలో రూపొందించి సాధకున కందించును. ఇట్లు వ్యక్తియొక్క ఆసక్తి క్రిందస్థాయి ఆనందము నుండి పైస్థాయి ఆనందము లోనికి మారు చుండుటయే సరియైన సాధన మార్గము.

**జీవన ప్రాముఖ్యములు :**

ఈ సాధన మార్గములో మొదట సాధకుడు ముఖ్యముగా నిర్ణయించు కొనవలసిన విషయ మొకటి యున్నది. జీవితములో ముఖ్యమైన వేవి, అముఖ్యమైన వేవి? అను సంశము మానవులకు నిత్యనూతన సమస్యయై వేధించుచుండును. అన్ని స్థాయిలలోని మానవులకు, సాధకులకుకూడ ఈ సమస్య తప్పదు. దీని పరిష్కారమునకై బాహ్యప్రపంచము, సన్నివేశములు, రాగద్వేషాదులు మున్నగు చీకటిలో తడుముకొనువారు సంసారజీవులు. సమస్య తనది గనుక పరిష్కారము కూడ తనయందే కలదని గ్రహించి అన్వేషించుకొనువారు సాధకులు. అట్టి పరిష్కారములను ఇతరులకు ప్రేమగా పంచిపెట్టువారు సిద్ధజీవులు.

ఈ క్రింది స్థాయినుండి ఆ పై స్థాయివరకు గల మానవుల కందరికిని మార్గదర్శకము కాగల సర్వసమగ్రమగు మహాగ్రంథము ప్రపంచ వాఙ్మయములో 'మహాభారత' మొక్కటే! దాని సారాంశమైన నవనీతమును నారాయణుడైన భగవానుడు, నరుడైన అర్జుననకు ముద్దచేసి అందించెను. అదియే 'భగవద్గీత'. సర్వ వేద వేదాంగముల, ఉపనిషత్తుల జీవమైన సారమే భగవానుని వాక్కు. నేటి కైదువేల యేండ్ల క్రిందట కురుక్షేత్రములో భౌతికముగా జరిగిన ప్రపంచ మహాయుద్ధములో రెండు సేనల నడుమ, ప్రజ్ఞామయ స్థాయిలో జరిగిన ఈ ఉపదేశమును, వ్యాసుడు వాగ్రూపమున నిబంధించి లోకమునకు ప్రసాదించెను.

ఆధ్యాత్మిక సాధనమనగా లౌకిక జీవితముతో ఎక్కువ సంబంధము లేనిదని కొంద రనుకొందురు. అట్లే లౌకిక జీవితమున ఆధ్యాత్మిక సాధన ఉండదని మరికొంద రనుకొందురు. ఆత్మవిద్యను తూర్పున ఉదయించిన ఉషస్సుతోను, సంసార బంధములతో కూడిన లౌకిక జీవనమును పడమటతోను, అస్తమయము తోను పెద్దలు పోల్చి సంకేతించిరి. ఈ రెండును వేర్వేరుగా భావించువారు పొరబడినవారు. సూర్యోదయము అస్తమయములోనికి, సూర్యాస్తమయము

ఉదయములోనికి పరిణమించుచుండుట పొరబడనివారు గుర్తించగలరు. ఇట్లు గుర్తించినవారు లౌకిక జీవనములోనే ఆధ్యాత్మిక సాధనము సాధ్యమగునని గ్రహింతురు. ఆధ్యాత్మికసాధనలో లభించిన స్ఫూర్తి, లౌకిక జీవితమున ప్రసరింప జేయుట కూడా నేర్చుకొందురు. దీనిని రాజయోగ సాధన మార్గమని కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య మరల నిర్దేశించిరి. వారు లోకమునకు మరొకమారు ప్రసాదించిన అద్భుతమైన మార్గమిదియే! ఇందు పూర్వకర్మ దుఃఖానుభవములను భయంకరముగా ననుభవించు నావశ్యకత లేదు. పూర్వకర్మ ననుసరించి దుఃఖ కారణములు వచ్చుచు పోవుచుండుటయు, వానిని గూర్చి దుఃఖించుటకు సాధకు నకు తీరిక లేకుండుటయు ఇందలి వైచిత్రి. పరమగురువులు మాస్టర్ సి.వి.వి. ప్రసాదించిన భృక్తరహిత తారక రాజయోగ సాధన మార్గమునకు మాస్టరుగారు అనుగ్రహించిన అనుభూతిమయమగు వ్యాఖ్యానమే ఈ "శంఖారావము."

ఈ సాధన మార్గము సర్వసమగ్రముగా భగవద్గీతలోని రాజవిద్యా రాజగుహ్యా యోగమున ప్రసాదింపబడినది. వేల సంవత్సరములనుండి సామాన్య మానవు లకు గుహ్యముగా నుండిపోయిన ఈ మహావిద్యను మాస్టరుగారు ఈ అధ్యాయము నకు వ్యాఖ్యానముగా మానవ జాతికి ప్రసాదించిరి. దానికి ముందటి వేదికగా విజ్ఞాన యోగము, అక్షర పరబ్రహ్మ యోగముల వ్యాఖ్యానము నడచినది. శ్రీకృష్ణ భగవానుడు ప్రసాదించిన భగవద్గీతలో తొమ్మిదవ అధ్యాయమగు 'రాజవిద్యా రాజగుహ్య యోగము' ముఖ్యమైన మెట్టు. ఈ అధ్యాయము నవగాహన చేసుకొని సాధన మార్గమున పయనించు సాధకునకు తరువాతి మెట్టుగా విభూతి యోగము ప్రసాదింపబడినది. తనలో గాని, ఇతరులలో గాని కనిపించు ఉత్తమ లక్షణము లన్నియు తమ స్వంతము కావనియు, అవి యన్నియు అంతర్యామి లీలా విశేషము లనియు సాధకుడు దర్శించి, అనుభవింపవలెను. అప్పుడు ఈ సృష్టియం దంతటను, వేర్వేరు వ్యక్తుల, జీవుల రూపమున నున్న ఒకే అంతర్యామి పురుషుడు విశ్వరూపుడుగా దర్శనమిచ్చును. అతడు తానే అనియు; తాను వానియందు భాగమనియు కూడా దర్శనమిచ్చును. ఈ సృష్టి పుట్టుటయు, గిట్టుటయు కాలపురుషుని క్రీడ యనియు, అతడు విశ్వరూపుడే యనియు దర్శనమిచ్చును. ఆ తరువాత సాధన మంతయు లోకమున కనిపించు వ్యక్తులను, వారి ప్రవర్తన

లను వాసుదేవుని లీలా విశేషములుగా గమనించుచు, ఆ వాసుదేవమూర్తికి సర్వ సమర్పణముగా భక్తిమయ మార్గమున జీవితము సాగును.

**మూడు స్వభావములు :**

లోకములో ముఖ్యముగా మూడు తరహాల వ్యక్తులుందురు. "జీవితము దుఃఖమయము" అని ఒక తరహా వ్యక్తులు వడలిపోయిన ముఖములతో ప్రవచింతురు. "మనము నిరంతరము పోరాడి విజయము సాధించుకొన వలసినది" యని మరియొక తరహా వారి వీరోచిత ప్రసంగము. "జీవిత మొక యజ్ఞము. దానికి వలయు యజ్ఞవేదిక ఈ శరీరము." ఇది మరియొక తరహా వారి అంతఃస్మితోల్లసిత భావము.

పై మూడును తమోగుణము, రజోగుణము, సత్త్వగుణముల తరహాలు. మొదటి తరహావారు అలసులు, మందబుద్ధులు, నిద్రాసక్తులు, తిండిపోతులు, బాధ్యతారహితులునై యుందురు. రెండవ తరహావారికి జీవితముతో నిరంతర ఘర్షణముండును. ఉన్నది చాలదు, లేనిదానికై వెంపర్లాట; ఈ ప్రయత్నమున ఎన్నో మార్పులను, సమస్యలను కోరి ఆహ్వానించుటలో ఈ తరహావారు అగ్రగణ్యులు. ఇష్టమైన మార్పులు తన ప్రతిభయేయని మురిసిపోవుట, సమస్యలు మాత్రము ఇతరులెవరో తన నెత్తిన రుద్దినారని ఏడ్చుచుండుట వీరి కార్యక్రమము. కీర్తి ప్రతిష్ఠలకో, అహంభావ పరితృప్తికో దాన ధర్మాదులు చేయుట, ఒక ఆశయము కొరకు సర్వస్వమును త్యజించి, కుటుంబమును దిక్కులేని వారిని చేయుట ఈ తరహా వ్యక్తులలో మాత్రమే కనిపించును.

కాని చాలమంది ఈ రెండు తరహాల లక్షణములను అవికొన్ని, ఇవికొన్నిగా కలబోసుకొని జీవితమను సుడిగుండములో గిరగిర తిరుగుచు, మునుగుచు, తేలుచు, అదియే జీవన మాధుర్యమనుకొందురు. వీరు కష్టపడి పనిచేయరు. ఉన్నతస్థితి మాత్రము కావలెను. పదిమందిలో పేరు ప్రతిష్ఠలుండవలెను. భోజన నిద్రాది సుఖములకు ఆటంకముండరాదు. ఇట్లు సంకీర్ణభావ వికారములతో జీవించు వారికి సుఖములుగా లభించునది సుఖాభాసలు మాత్రమే. దుఃఖముల పరంపరలు గడచిపోవుచుండగా నడుమ లభించు అంతరము (gap) లను మాత్రమే వారు సుఖ మనుకొనుచున్నారు.

మరి వీరి దుఃఖ నివారణ మార్గమేది? బాహ్యలోకములో సన్నివేశములు మాత్రమే ఉండుననియు, సమస్యలు తన స్వభావమునుండి పుట్టుచున్నవనియు, కనుక సమస్యలకు పరిష్కారము కూడా తనయందే యుండుననియు తెలియుట దుఃఖ నివారణకు మొదటి మెట్టు. తన స్వభావము, దానినుండి పుట్టు భావములు, కర్తవ్య రూపములుగా తీసుకొనబడు నిర్ణయములు, వాని నాచరించు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు, ఈ మొత్తమును ఒక మహా వృక్షముగా కృష్ణుడు మనకు దర్శింపజేసెను. వ్రేళ్ళు పైన కారణ లోకములలోను, కొమ్మలు క్రింద భౌతిక లోకములలోను నిలబడియుండగా ఈ అశ్వత్థవృక్షము తలక్రిందులుగా నున్నదని కృష్ణుడు వర్ణించెను. మన స్వభావమునుండి భావము, భావమునుండి అభిప్రాయము, అభిప్రాయమునుండి ఆసక్తి, ఆసక్తి నుండి ఆదేశము, ఆదేశము నుండి కార్యము, కార్యమున కొక ఫలితము కలిగి, అది మరల మన స్వభావముతో సంగమించును. మరల నొక భావము. ఈ చక్రమిట్లే ఆవృత్త మగుచుండును. అనగా కారణములగు మన భావములు చేష్టలలోనికి, చేష్టలు మరల భావముల లోనికి చొచ్చుకొనిపోయి మనసును తమ వెంట త్రిప్పుచుండును. దీని అంతు చూడవలెనని బయలుదేరినచో కారణము వెంట కార్యమునకు, కార్యము వెంట కారణమునకు చక్రభ్రమణమై జీవితము తెల్లవారిపోవునేగాని, అంధకారము తొలగిపోదు. కనుక దీని యంతు చూచుట కది పద్ధతి కాదు. పై చెప్పిన చక్రక్రమములో ఆసక్తి అనుచోట మన స్వభావమున గల ముడిని తెగనరుక వలెను. అసంగము అను ఖడ్గముగా కృష్ణుడు దీనిని సంకేతించెను. తాను కోరినవి వేరు, తనకు కావలసినది వేరు. తనకు కావలసిన దానినే కోరుట తెలియనివానికి దుఃఖమే మిగులును. ఈ అంశము తెలిసినవానికి అసంగము అను ఖడ్గముపై గట్టి పట్టు చిక్కును. పనులు పదిమంది మేలునకై జరుగును. ఫలితాంశముగా తనకు కూడా మేలు జరుగును. ఈ ప్రాథమిక సత్యము తెలిసిన వానికి ఈ ఖడ్గ ప్రయోగములో కూడా కౌశల మేర్పడును.

ఈ వృక్షపు తత్త్వము నెరిగి దానియందు తాను నిర్వర్తించవలసిన తీరు తెలిసి, నిస్సంగుడై ప్రవర్తించిన వానికి తనలోని ముగ్గురు పురుషులు దర్శన మిత్తురు. భౌతిక శరీరము, ఇంద్రియ ప్రవృత్తులు, రాగద్వేషాదులు, తన స్వభావములతో కూడియున్న అహంకారమయుడగు క్షర పురుషుడు మొదటివాడు.

ఇతడు ఒక జన్మతో పుట్టి దానితో అంతరించును. ఇట్టి కొన్ని వేల జన్మల అనుభూతులను వాసనలుగా స్వీకరించి పరిణామక్రమమున సాగిపోవు అక్షర పురుషుడు రెండవవాడు. అతనిని జీవుడందురు. తన ఇన్ని వేల జన్మములను, వాని ప్రణాళికలను నిర్ణయించి, నడిపించువాడు మరొక డున్నాడు. సృష్టిలో తనవంటి జీవులు కోటానుకోట్లు ఉన్నారు. వారికిని వేల జన్మల ప్రణాళికలున్నవి. ఒకని ప్రణాళిక మరియొక ప్రణాళికకు భంగకరము కాని రీతిలో ఇన్ని కోట్ల ప్రణాళికలను నడుపవలెను. ఇంతటి అద్భుత కార్యము నిర్వర్తించు ఆ పురుషుని పేరు 'ఉత్తమ పురుషుడు' లేక పురుషోత్తముడు. ఆ పురుషోత్తముని ప్రతినిధియే యోగమునకు ఈశ్వరుడైన కృష్ణ భగవానుడు.

ఆధ్యాత్మిక విద్యకు ప్రాణ బిందువువంటి మూలసూత్ర మొకటి యున్నది. గురువు నుండి శిష్యుడు స్వీకరింపదగినది ఈ విద్య. గ్రంథము చదివి యోగస్థితిని పొందువాడు సృష్టిలో నింతవరకు పుట్టలేదు. మానవుడు సాధకుడు కావలెనన్నచో తన అభిప్రాయముల పట్టు సడలవలెను. కాని స్వభావబద్ధుడైన వానికి తనంతట అది సాధ్యము కాదు. దాని కొక నిపుణమైన ప్రచోదన మావశ్యకము. తనలో కొన్ని వందల జన్మల నుండి పేరుకొనియున్న వాసనలు లెక్కలేనన్ని యుండును. దేనిని ఎప్పు డెంతవరకు సడలింపవలెనో తెలిసి సహాయము చేయువాడు ఒకడుండవలెను. అట్టివాడు గురువని భారతీయ సంప్రదాయము పేర్కొను చున్నది. అట్టి యొక గురువును దైవముగా నమ్మి, భౌతికముగా ఆయన పాదములు పట్టి, శుశ్రూష చేసినవానికి మాత్రమే ఆధ్యాత్మిక విద్య అబ్బును. ఆధ్యాత్మిక విద్యా సర్వస్వమగు భగవద్గీత ఈ యంశమును 18వ అధ్యాయములో వ్యంగ్య వైభవముతో ప్రతిపాదించుచున్నది. "నాకు నమస్కరించుము. నీ కర్తవ్య నిర్ణయాధికారమును నాయందు సమర్పించి నన్నే శరణు పొందుము" అని కృష్ణుడు అర్జును నాదేశించుట గురు శిష్య యోగమునకే!

ఈ భగవద్గీతను అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతాది వివిధ మత సంప్రదాయము లకు అనుగుణముగా సమన్వయించిన వ్యాఖ్యానముల నాయా ఆచార్యపాదుల ద్వారా లోకము స్వీకరించినది. భక్తి, జ్ఞాన, కర్మ యోగములుగా సాధన మార్గమును విభజించుకొని, ఆ యా సాధన మార్గములకు వీలుగా భగవద్గీతను అన్వయించు ప్రయత్నములు జరిగినవి. అవి యన్నియు ఆయా కాలములలో

నున్న మానవుల జీవన విధానమునకు, మానసిక పరిణామమునకు అను గుణముగా కాలపురుషుని క్రీడయై వెలువడిన వ్యాఖ్యానములు. అసలు భగవద్గీతయే అనంతమై కాలపురుషుని లీలలో నొక ముఖ్య సన్నివేశముగా వెలువడినది!

అట్లే భగవద్గీత వెలువడిన ఐదువేల సంవత్సరముల తర్వాత నేటి మానవుల మానసిక పరిణామములో నొక ప్రత్యేకమైన మలుపు సంభవించినది. దీని కనుగుణముగా తనలో నిబిడీకృతమైయున్న మహా శక్తులను, ప్రజ్ఞలను మానవుడు వినియోగించుకొనదగిన సమయ మాసన్నమైనది. (ఆధునిక మనస్తత్త్వ, పరామనస్తత్త్వ శాస్త్రముల పరిశోధనకూడా ఈ మార్గముననే తడువులాటగా కొనసాగుచున్నది.) దీనికి సంబంధించిన ఆధ్యాత్మిక శరీర నిర్మాణ శాస్త్ర మంతయూ సర్వసమగ్రముగా గురుశిష్య పరంపరగా నేటివరకు అందింపబడుచు వచ్చుచునే యుండుట కాలపురుషుని లీలలో నొక భాగము. ఇట్లు గురు, శిష్య పరంపరలుగా అనుస్యూతమగుచున్న ఈ దర్శనమును గ్రంథ రూపముగా సామాన్య మానవులకు అందించు ప్రయత్నము 1972 డిసెంబరు నెలలో ప్రారంభమైనది. కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.) "శంఖారావము" అను పేర ఈ భగవద్గీతా సమన్వయమును రహస్యప్రకాశముగా "నావాణి" మాసపత్రికలో ధారావాహికముగా ప్రసాదించుట 1984 ఫిబ్రవరి వరకు జరిగినది.

ఈ రచన సాగుచుండగనే కీర్తిశేషులు కంచర్ల దత్తుగారి ఇంట అంతకు ముందు కొన్ని యేండ్లనుండి ప్రతి గురువారము సాయంత్రము భగవద్గీతా ప్రవచనము సాగుచుండెను. దత్తుగారి సతీమణి పూజ్యురాలు శ్రీమతి అన్నపూర్ణమ్మ భక్త్యాదరములతో ప్రవచనములకు వలయు ఏర్పాట్లు స్వయముగా చేయించి వినుచుండెడివారు. ఒకనాడు ఆ ప్రవచనమును గ్రంథ రూపమున ప్రచురించినచో బాగుండునను సంకల్పము ఆమెలో కలిగి మాస్టరుగారికి విన్నవించిరి. వాసుదేవుని ఆదేశముగా దానిని స్వీకరించిన మాస్టరుగారు వెంటనే అంగీకరించి, *'మంత్రగీత'* యను పేర భగవద్గీతా వ్యాఖ్యానమును రచించిరి. ఆ గ్రంథమును వ్రాసిపెట్టుచున్న సమయమున శ్రీ శంకర భగవత్పాదుల వ్యాఖ్యానములో లేని

అపూర్వమయిన సమన్వయములను మాస్టరుగారు ప్రసాదించుట నేను గమనించి, "ఆదిశంకరుల వ్యాఖ్యలోకూడా ఈ విశేషము లెక్కడనూ లేవు" అని అంటిని. మాస్టరుగారు చిరునవ్వు నవ్వి, "ఇది మన ప్రతిభ కాదు. ఆనాటికి అవసరమగు వ్యాఖ్యానమది. ఈ కాలమునకు కావలసిన సమన్వయము మన ద్వారా వచ్చినది. అంతే!" అనిరి. అనంతమైన కాల ప్రవాహమును, అందలి ఒక భాగమును కూడా దర్శింపగల్గిన మహర్షులకే ఇట్టి వివేకముండును.

అటుపిమ్మట భగవద్గీతనే "మంత్ర స్క్రిప్చర్" (Mandra Scripture) అను పేర ఆంగ్లమున మాస్టరుగారు ప్రసాదించిరి. ఇది భగవద్గీతకు వ్యాఖ్యానము కాదు, అనువాదము కాదు, వివరణము కాదు. ఇది ఆంగ్లములో మరల నొక భగవద్గీత. బుద్ధిమయ కక్ష్యలోనికి నేరుగా చొచ్చుకొనిపోవుచు భగవద్గీతాను భూతిని మంత్ర మార్గమున సూటిగా నందింపగల ప్రజ్ఞా విన్యాసము ఇందు గోచరించును.

తెలుగులోను, ఆంగ్లభాషలోను, ఎన్నో వ్యాఖ్యానములు ఎందరో ఆచార్య పాదులు, పండితులు ప్రసాదించినను, సామాన్య మానవున కవి అందుబాటులో లేకుండా పోయినవి. భగవద్గీతను పండితుల గ్రంథముగాను, శ్రోతలను సామాన్య మానవులుగాను పరిగణించి వ్రాసిన వ్యాఖ్యానములవి. తమ పాండిత్యములు గ్రంథ పఠనములో వినియోగించి, దాని సారాంశమును మాత్రము మానవునికి "వినియోగపడు" రీతిలో అందించు ప్రయత్నము ఎవ్వరును చేయలేకపోయిరి. భగవద్గీత ఆచరణాత్మక గ్రంథ మనియు, ఆచరింపవలసిన వాడు సామాన్య మానవుడనియు, సామాన్య మానవునకు వాని స్థాయిలోనే ఆచరణీయతను బోధింపవలె ననియు, జ్ఞప్తియందున్న వారు మాస్టరుగారు. సామాన్య మానవునకు వినియోగము తెలియవలెనన్నచో వాని స్థాయిలో వాని సమస్యలకు పరిష్కారము చూపవలెను. ప్రతి సమస్యకు పరిష్కారము తనలోనే యుండునని గ్రహించుట సమస్యాపరిష్కారమునకు మొదటి మెట్టు. కనుకనే తాను యజమానిగా అనగా కేంద్రముగా ఏ అంశమునైనా భావన చేయుట వేదములనుండి మనకు వచ్చిన సనాతన సంప్రదాయము. "దానిని ఎవడు గ్రహింపడో వాడు వేదముతో ఏమి చేసికొనగలడు?" అని వేదము హెచ్చరించుచున్నది. పంచభూతములు; బుద్ధి, మనస్సు అనే సూర్యచంద్రులు, 'తాను' అను యజమానియు కలిసి శివుని

అష్టమూర్తిగా భారతీయ సంప్రదాయము ప్రతిపాదించుచున్నది. ఈ సృష్టి అను యజ్ఞమున తన జీవితమను యజ్ఞమొక భాగమై, తన యజ్ఞమునకు తాను యజమానుడగుట రాజయోగ విధానము. ఈ మార్గమున జరుగు ప్రయత్న మంతయు సాధనామయ జీవిత మనబడును. ఈ సాధనలో మొట్టమొదటి మెట్టునుండి సిద్ధివరకు, సిద్ధి పొందిన తరువాత రాజయోగ మనబడు జీవిత విధాన నిర్వహణకు వలయు అంశములన్నియు ***"శంఖారావము"*** న మాస్టరుగారు మానవజాతికి ప్రసాదించిరి.

పనిచేయుచూ నేర్చుకొనుట, ఆ మొత్తమును భగవంతుని కర్పించుట అనునది కర్మ, జ్ఞాన, భక్తియోగముల సమన్వయమగు శ్రీకృష్ణుని మార్గము. మాస్టరుగారు తమ అనుయాయులకు నేర్పిన మార్గము కూడ ఇదియే! సిద్ధ పురుషుల రాజయోగ జీవితమునకు మాస్టరుగారి జీవితమే యొక ఉదాహరణము. వారి జీవితమును గమనించిన అనుయాయులలో నచ్చినవారికి నచ్చినంత, దక్కినవారికి దక్కినంత, ఆచరించినవారికి ఆచరించినంత భాగము రాజయోగాను భూతియే!

ఈ సమన్వయ వ్యాఖ్యానమును మాస్టరుగారు 1984 ఫిబ్రవరి వరకు మాత్రమే 'నావాణి'లో ధారావాహికముగా ప్రచురించిరి. 1984 మార్చి 17వ తేదీన మాస్టరుగారు భౌతిక శరీరము విడిచిరి. అప్పటికి 13 అధ్యాయములు, 14వ అధ్యాయములో 17వ శ్లోకము వరకు మాస్టరుగారి రచన సాధ్యమయ్యెను.

ఇందలి మొదటి ఆరు అధ్యాయములను "శంఖారావము" అను పేర మొదటి సంపుటముగా మాస్టరుగారి 60వ జన్మదినోత్సవ సందర్భమున 11-8-1985వ తేదీన ప్రచురించడం జరిగినది. రెండవ సంపుటముగా 1986 గురుపూజా మహోత్సవములలో 7 నుండి 12వ అధ్యాయము వరకు ప్రచురించబడినది.

మాస్టరుగారిచే రచింపబడక మిగిలిన భాగము 14వ అధ్యాయము 18 నుండి 27వ శ్లోకం వరకు, 15, 16, 17, 18 అధ్యాయములకు సమన్వయమును నేను రచించితిని. మాస్టరుగారి రచనా పద్ధతిని, సమన్వయ విధానమును, అంతకుముందు ప్రచనములలో వారు ఉపదేశించిన రహస్యములను దృష్టిలో

ఉంచుకొని మాస్టరుగారికి నమస్కరించుకొని నాకు చేతనయిన రీతిలో ఈ రహస్యప్రకాశ భాగమును రచించితిని.

ఇట్టి గ్రంథములు వ్రాయగల్గుట పెద్దల అనుగ్రహము వలన మాత్రమే సాధ్యము. ఇది పూర్తిగా మాస్టరుగారి అనుగ్రహమే. 13 నుండి 18 వరకు అధ్యాయములుగల మూడవ సంపుటము 1987 గురుపూజా మహోత్సవములలో ఆవిష్కరింపబడినది. ఇప్పుడు ఈ మూడు సంపుటములను కూర్చి ఒకే సంపుట ముగా మాస్టరుగారి 68వ జయంతి సందర్భముగా 11-8-1993వ తేదీన ప్రచురించితిమి. మాస్టరుగారి దివ్య పాదారవిందములకు ఈ సంపుటము సమర్పితము. మాస్టరుగారి పాదారవిందముల దివ్యకాంతులే సాధకులైన సోదర బృందమునకు జ్యోతిర్మయమైన పదములను నిర్మాణము చేసి నడిపించును గాక!

*"రాజయోగ ప్రవక్తారం శిష్యకోటి సుసేవితమ్ ।*
*మందహాస ముఖాంబుజం కృష్ణం వందే జగద్గురుమ్ ॥*

*మంద్రగాన సుధాసార వర్షిణం పరమం గురుమ్ ।*
*జ్యోతిర్మార్గ ప్రదాతారం కృష్ణం వందే జగద్గురుమ్ ॥*

*దివ్యజీవన పీయూష వర్షిణం భవ్య రూపిణమ్ ।*
*ఆచార్యాణాం శిరోరత్నం కృష్ణం వందే జగద్గురుమ్ ॥*

వైశాఖవేలీ
11-8-1993

**- చివుకుల రవిశర్మ**

# విషయ సూచిక


**నేపథ్యము** **21**

**రహస్య ప్రకాశము** **30**

**మొదటి అధ్యాయము : అర్జున విషాద యోగము** **31**

గీత–32; విషాదము – 34.

**రెండవ అధ్యాయము : సాంఖ్య యోగము** **35**

పరిష్కారములు–35; ఇంద్రియములు–మనస్సు–39; ఉన్నది–లేనిది –40; అంటుకొనుట–41; సుఖము–దుఃఖము–42; బుద్ధియోగము–43; క్షుద్రవేదవాదరతులు–46; భోగైశ్వర్యములు–49; త్రిగుణము–నిత్యసత్త్వము–51; ఆత్మవంతుడు–52; కర్మ–కర్మఫలము–53; బుద్ధిమంతుడు–55; సమాధిస్థితి–58; స్థితప్రజ్ఞుడు–61; తనలోనికి తాను–64; ప్రజ్ఞాప్రతిష్ఠితుడు–67; ప్రసన్నచేతసుడు–70; యుక్తుడు–73; నిజమైన వెలుగు–76; బ్రాహ్మీస్థితి–80.

**మూడవ అధ్యాయము : కర్మ యోగము** **83**

గురువు–శిష్యుడు–83; జ్ఞానము–కర్మ–86; నియతకర్మ–88; యజ్ఞము–92; దేవ యజ్ఞము–94; యజ్ఞశేషము–95; యజ్ఞ స్వరూపము–96; సృష్టి చక్రము–98; ఆత్మ తృప్తి–101; ఆచరణము–సిద్ధి–104; జ్ఞాని– అజ్ఞాని–106; తత్త్వవేత్త–109; అనుష్ఠానము–112; సత్కర్మ–అభ్యాసము –114; స్వధర్మము–117; కామక్రోధములు–120; పాపస్వరూపము–122; పంచ కోశములు–121.

**నాలుగవ అధ్యాయము : జ్ఞాన యోగము** **128**

ఆత్మవిద్య–129; అవతరణము–132; దివ్యజన్మ–దివ్యకర్మ–135; ఉపాశ్రయము–138; మానుష లోకము–148; నాలుగు వర్ణములు–141; కర్మ–అకర్మ–144; నిరశన వ్రతము–145; బ్రహ్మార్పణము–147; ప్రాణాపానములు–150; యజ్ఞశేషము–153; ద్రవ్య–జ్ఞాన యజ్ఞములు–155; జ్ఞానము–162; ఆత్మవంతుడు–165.

**ఐదవ అధ్యాయము : కర్మ సన్న్యాస యోగము** **168**

సన్న్యాసము–169; జితేంద్రియుడు–172; సమదర్శనము–178; బ్రహ్మవేత్త–181; అక్షయ సుఖము–183; బ్రహ్మ నిర్వాణము–185; విదితాత్ముడు–187; ఈశ్వర ప్రణిధానము–190.

**ఆరవ అధ్యాయము : ధ్యాన యోగము** **192**

కార్యం కర్మ–192; శమము–195; కూటస్థుడు–198; ఏకాగ్రత–202; నాది–నేను–205; నిజమైన సుఖము–207; మనో నిగ్రహము–210; సమదృష్టి–212; ఆత్మ సంయమము–216; యుక్తతముడు–219.

**ఏడవ అధ్యాయము : విజ్ఞాన యోగము** **222**

సమగ్ర జ్ఞానము–222; ప్రకృతి–పరాప్రకృతి–225; దైవీమాయ–228; చతుర్విధ భక్తులు–231; వాసుదేవోపాసనము–235.

**ఎనిమిదవ అధ్యాయము : అక్షర పరబ్రహ్మ యోగము** **242**

'నా' భావము–244; పురాణ పురుషుడు–246; యోగధారణము–249; ఓం–అక్షరము–250; బ్రహ్మ పగలు–రాత్రి–254; స్థూలము–సూక్ష్మము–256.

**తొమ్మిదవ అధ్యాయము : రాజవిద్యా రాజగుహ్య యోగము** **260**

'నా' యోగము–263; 'నా' వైభవము–269; దైవీ ప్రకృతి–272; ధ్యాన సోపానములు–275; స్వర్గ కామము–278; యజ్ఞభోక్త–283; సన్న్యాసయోగము–285.

**పదవ అధ్యాయము : విభూతి యోగము** **289**

సతత యుక్తులు–291; గుణ కీర్తనము–297; మరికొన్ని విభూతులు–320.

**పదునొకండవ అధ్యాయము : విశ్వరూప సందర్శన యోగము** **325**

నా దివ్య రూపములు–327; విశ్వరూపుడు–332; శాశ్వత ధర్మగోప్త–335; కాలాగ్ని స్వరూపుడు–344; కనువిప్పు–350.

**పంద్రెండవ అధ్యాయము : భక్తి యోగము** **358**

సాధన క్రమము-363.

**పదమూడవ అధ్యాయము : క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము** **369**

క్షేత్రజ్ఞానము-373; అనన్యయోగము-377; వెలుగులలో వెలుగు-380; ప్రకృతి-వికృతి-381; ప్రకృతి-గుణములు-383; సృష్టికర్త కర్తృత్వము-385.

**పదునాల్గవ అధ్యాయము : గుణత్రయ విభాగ యోగము** **389**

త్రిగుణముల గమనిక-389; త్రిగుణముల లక్షణములు-392; త్రిగుణముల ఆవశ్యకత-395; గుణసంగము-398; త్రిగుణముల లక్షణములు-400; గుణములు-ఫలములు-405; త్రిగుణముల స్థావరములు-408; సాధనక్రమము-407; గుణాతీతుడు-సాధన మార్గము-412; అవ్యభిచారి భక్తి-417; బ్రహ్మ ప్రజ్ఞ-419.

**పదునైదవ అధ్యాయము : పురుషోత్తమ ప్రాప్తి యోగము** **420**

లోకార్థము-వేదార్థము-421; అశ్వత్థ వృక్షము-422; నీలోని అశ్వత్థము-424; వృక్ష స్వరూపము-426; కోరిక-అవసరము-427; జీవుని పరిణామము-429; దివ్యజీవనము-430; వెలుగుల కవ్వల-431; రస స్వరూపము-437; వైశ్వానరుడు-438.

**పదునారవ అధ్యాయము : దైవాసుర సంపద్విభాగ యోగము** **447**

దివ్యగుణ సంపద-447; ఆసుర లక్షణములు-450.

**పదునేడవ అధ్యాయము : శ్రద్ధాత్రయ విభాగ యోగము** **460**

త్రివిధముల ఆరాధనము-461; రుచులు-463; యజ్ఞములు-464; తపస్సు-465; దానము-468; ఓం-తత్-సత్-470.

**పదునెనిమిదవ అధ్యాయము : మోక్ష సన్న్యాస యోగము** **474**

త్యాగ స్వరూపము-475; కర్మ సిద్ధి-కర్తృత్వ బుద్ధి-480; జ్ఞానము-483; కర్మాచరణము-485; కర్తృత్వము-487; బుద్ధి-491; ధారణము-492; సుఖము-495; నాలుగు వర్ణముల స్వభావములు-500; స్వభావము-స్వకర్మ-503; గురుశిష్య యోగము-517.

| | | | |
|---|---|---|---|
| శ్రీమద్భగవద్గీత – మూలము : | | | 526 |
| ౧. | అర్జున విషాద యోగః | 527 | |
| ౨. | సాంఖ్య యోగః | 532 | |
| ౩. | కర్మ యోగః | 539 | |
| ౪. | జ్ఞాన యోగః | 543 | |
| ౫. | కర్మ సన్న్యాస యోగః | 547 | |
| ౬. | ధ్యాన యోగః | 550 | |
| ౭. | విజ్ఞాన యోగః | 555 | |
| ౮. | అక్షర పరబ్రహ్మ యోగః | 558 | |
| ౯. | రాజవిద్యా రాజగుహ్య యోగః | 561 | |
| ౧౦. | విభూతి యోగః | 564 | |
| ౧౧. | విశ్వరూప సందర్శన యోగః | 568 | |
| ౧౨. | భక్తి యోగః | 574 | |
| ౧౩. | క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగః | 576 | |
| ౧౪. | గుణత్రయ విభాగ యోగః | 580 | |
| ౧౫. | పురుషోత్తమ ప్రాప్తి యోగః | 583 | |
| ౧౬. | దైవాసుర సంపద్విభాగ యోగః | 585 | |
| ౧౭. | శ్రద్ధాత్రయ విభాగ యోగః | 588 | |
| ౧౮. | మోక్ష సన్న్యాస యోగః | 591 | |
| శ్రీమద్భగవద్గీత – శ్లోకానుక్రమణిక | | | 599 |

# నేపథ్యము

ఇప్పటికి ఐదువేల సంవత్సరములకు పూర్వము భారతదేశమున, కురు క్షేత్రపు మైదానమున యావత్ప్రపంచ మహాసంగ్రామ మొకటి జరిగినది. అదే భారత యుద్ధము. దానికి తాత్కాలిక కారణము అన్నదమ్ముల బిడ్డల నడుమ కలిగిన విరోధము. కాని, దానికి వెనుక వ్యక్తుల మనస్సులలోని మంచి చెడ్డల సంఘర్షణ, మానవజాతిలో మరల మరల సంభవించు ధర్మాధర్మముల సంఘర్షణ యను జగత్కథ యున్నది. భౌతిక లోకములోని వ్యక్త సన్నివేశము ప్రతిదానికిని సూక్ష్మలోకములలో జరుగు ధర్మాధర్మముల కథ యొకటి ఉండి తీరును. బుద్ధిమంతుడైన వ్యాసభగవానుడు ఈ అన్ని లోకముల వృత్తాంతము లను జరిగిన సన్నివేశములతో సమన్వయించి, *'జయము'* అను ఇతిహాసమును సృష్టించెను. వాని శిష్యుడగు వైశంపాయనుడు సర్పయాగ విరమణ శుభ సమయమున వ్యాసుని యితిహాసమును తన ప్రవచనమున *'భారత'* మను పేరుతో ఉప బృంహణము చేసెను. దానిని వేదోప బృంహణమైన పవిత్ర పంచమ వేదముగా గ్రహించి, ద్రష్టయగు సూతుడు తన వివరణముతో, ఉపాఖ్యానము లతో, *'మహా భారతము'*గా విస్తరింపజేసెను. 'జయ' మనుపేర వ్యాసుడు నాటిన జ్ఞానపు మఱ్ఱిగింజ 'భారత' వటవృక్షమై, ఊడలు దిగి, 'మహాభారత' వృక్షముగా విస్తరించి, సంసార తాపార్తులకు ధర్మచ్ఛాయ నిచ్చి, పరిపూర్ణమగు విశ్రాంతిని నేటివరకు ప్రసాదించుచున్నది.

వేదములు సృష్టి సమస్త ధర్మస్వరూపములై, జీవుల స్వభావములను వాక్కుల ద్వారమున వేద గ్రంథములోనికి మంత్రరూపములుగా దిగివచ్చినవి. జీవులు ద్రష్టలై పొందిన బంధ విమోచన రూపమైన ఆనందానుభూతియే వేదసారమైన ఉపనిషత్తులుగా పుష్పించినది. సృష్టి కథలో జరుగుచున్న జీవుల కథలే అర్థవాదములుగా పురాణేతిహాసము లవతరించినవి. కనుక వేదము, ఉపనిషత్తు, పురాణము అను భారతీయ సంప్రదాయమునకు విత్తనము,

పుష్పము, వృక్షము - అను వాని నడుమగల విశ్వజనీనమైన శాశ్వత సంబంధ మున్నది. ఈ వాఙ్మయము లేనినాడు మానవులు కేవలము జీవులుగా మిగిలిపోయెడివారు. ఈ మొత్తమును దర్శనము చేసిన వ్యాసమహర్షి స్వయముగా నారాయణుని యంశ యనుటలో తప్పేమి?

సంఘర్షణము జీవుల పరిణామ కథలో నొక ఘట్టము. పరిణామ క్రమమున మానవునకు బాహ్యప్రపంచము నిమిత్తముగా తన లోపలి లోకము లలో మథనము జరుగును. కాలక్రమమున ఈ మథనము నుండి వివేకమను వెన్న వెలికి వచ్చుచుండును. ఇది సామూహికముగా జరుగక వ్యక్తిగతముగా జరుగును. కనుక శాశ్వతముగా జరుగుచునే యుండును. అనగా ఎప్పుడును ఒక్కొక్కనిలో ఒక్కొక్కస్థితి చొప్పున అందరిలోను అన్ని స్థితులును జరుగు చునే యుండును. క్రమోన్మీలనము చెందు వివేకము వలన నిత్యానిత్యతత్త్వ విభజనము జరుగును. ఇది జరిగిన వారికిని, జరుగనున్న వారికిని నడుమ భావ సంఘర్షణము జరుగుచుండును. ఇది కార్యరూపమున వ్యక్తమగుటయే యుద్ధము. మహాగ్రంథమునందలి అక్షరములవలె, ధర్మ సంఘర్షణకు జీవుల శరీరములు అనిత్యములైన నిమిత్తకారణము లగుచుండును. అక్షరముల పఠనము జరిగిపోవుచున్న కొలదియు వాని వినియోగము దాటిపోవుచుండు టయు, గ్రంథములోని మహార్థము స్థిరపడుచుండుటయు తప్పదు. అట్లే ధర్మాధర్మ సంఘర్షణమను జగత్కథలలో వ్యక్తుల శరీరములు చనిపోవుట, శాశ్వతపు విలువలు మరల మరల స్థిరపడుచుండుట జరుగుచుండును. తప్పని సరియైన ఈ పథమునందు అల్పదృష్టికి మృత్యువు, క్రాంత దృష్టికి అమృతత్త్వము గోచరించును. ఈ మహార్థమే భారతయుద్ధ సందర్భమున వ్యాసమహర్షిచే స్థాపింపబడినది. ఇట్టి యుద్ధసన్నివేశమును ఎదుర్కొను సమర్థతను కలుగజేసి, తద్గతమైన విఘ్నములను పారద్రోలుట కొక యుపదేశము నరుని కావశ్యకమై యున్నది. అదియే 'భగవద్గీత'. యుద్ధభూమిలో రెండు సైన్యముల నడుమ రథముపై అర్జునునకు శ్రీకృష్ణ భగవానుడు గీతోపదేశము చేసెను.

భౌతిక సమస్యలకు వ్యక్తిగత పరిష్కారము మృత్యువు. శరీరము చనిపోయినప్పుడు దానిని ధరించిన జీవి చనిపోవ డను సత్యము గ్రహించిన వానికి మృత్యు వొక నూతన కథారంభముగా పనిచేయును. మృత్యువు నొక

సర్వసామాన్య సన్నివేశముగా గ్రహింపగలవారికే ఈ యవకాశ ముండును. అట్లు గ్రహింప గల్గుటకు యుద్ధభూమిని మించిన సదవకాశము లేదు. చదువు, అధికారము, సంపద, అహంకారము, నాగరికత ఎంత యార్జించినను మృత్యువును నిశ్చలముగా నెదుర్కొనుటకు కావలసిన నైపుణి చేజిక్కదు. యుద్ధభూమిలో నిలబడినవాని కీ నైపుణి యే పాండిత్యమును లేకయే కరతలా మలక మగుచున్నది. ఈ యంశమును నిర్దేశించుటకే శ్రీకృష్ణుడు అర్జునునకు గీతోపదేశము చేయుటకు యుద్ధరంగమును ఉపదేశక్షేత్రముగా స్వీకరించినాడు.

భగవద్గీతను పఠన, ప్రవచన, పారాయణములు చేసినవారిలోను, వ్యాఖ్యానములు వ్రాసిన వారిలోను ఎవ్వరికిని అర్జునుని యుపదేశము వంటి యుపదేశమును పొందుట సాధ్యము కాదు. ధృతరాష్ట్రునకు భగవద్గీతాను భూతిని వినిపించిన సంజయుడే ఈ యంశము నంగీకరించినాడు. అర్జునుడు నిలబడినది వాస్తవమైన యుద్ధక్షేత్రము. భగవద్గీత నధ్యయన వ్యాఖ్యానాదులు చేయువారు నిలబడినదో, కూర్చుండినదో ప్రాణభీతి లేని వాతావరణము. ఐనను కంటి చూపునుబట్టి వెలుగు అనుభవింపబడును గదా! ఎంతటివారి కంతటి యుపదేశము భగవద్గీతవలన జరుగుచున్నది. అందు కొందరికి ద్వైతా ద్వైతములు, కొందరికి భక్తి, జ్ఞాన, కర్మ మార్గములు, మరికొందరికి వైరాగ్య సన్న్యాసములు లభించినవి. ఇవన్నియు ఆ ఉపదేశపు వెలుగు నుండి వారి వారి దృష్టి నాకర్షించిన కిరణములు.

## కురుక్షేత్రము :

మానవునిలో అంతర్లీనములైన శాశ్వత శక్తుల సంఘర్షణలకు బహిర్గత ముగా జరిగిన కథయే సంగ్రామముగా పరిణమించును. బాహ్యమైన సన్నివేశము తాత్కాలికము. ఈ తాత్కాలిక శాశ్వత శక్తుల సమన్వయమునే 'ఇతిహాస' మందురు. ఇతి + హ + ఆస = "ఈ విధముగనే జరిగెను సుమా!" అని ఈ పదమున కర్థము. "The Scripture is fulfilled" అను బైబిలులోని వాక్యము నకు కూడ అంతరార్థ మిదియే! మహాభారత కథలోని వ్యక్తుల పేర్లు, ప్రదేశముల పేర్లు, మానవునిలోని అంతర్లీనమైన శక్తులనుకూడ సూచించునట్లు రూపొంది యున్నవి. ఊళ్ళ పేర్లుగాని, వ్యక్తుల పేర్లుగాని అప్పటికప్పుడే పుట్టవు. అది

వరకున్న పేర్లతోనే నామకరణము జరుగును. ఆ పేర్ల చరిత్రలో అనేక వైజ్ఞాని కాంశములు, సంస్కృతిలోని పొరలు కాలక్రమమున నేర్పడుచుండును. ఉదాహరణకు కురుక్షేత్రమను పేరు ఆ ప్రదేశమునకు రాకముందు నుండి వాడుకలో నున్నది. అది శతాబ్దముల కాలక్రమములో జరిగిన భావ పరిణామము నకు దర్పణమువలె నున్నది. ఆ భావములన్నియు భారతయుద్ధ సంఘటనకు సమన్వయము చేయబడి యున్నవి. శాశ్వత సత్యములలో తాత్కాలిక సన్నివేశములకు స్థానము చూపుటయే పురాణ సంప్రదాయము. కురుక్షేత్రమను పదము కొనివచ్చిన భావపరంపర యెట్టిదో పరిశీలించుట యొక వైజ్ఞానికాంశము.

వేదములలో మంత్రభాగమున కురుక్షేత్రమను పదమున్నది. అచట నది సకల ధర్మములకు క్షేత్రమైన యాకాశమునకు సూచకముగా వాడబడినది. సర్వసృష్టియు ఆకాశమునుండి దిగివచ్చి ఆకాశములో లీనమగుచుండును. కనుక అందు సకల సృష్టి ధర్మములు అంతర్లీనములై యుండును. దీనికి సూచకముగా కురుక్షేత్రము ధర్మక్షేత్రమని భగవద్గీతలో కీర్తింపబడినది. "అవిముక్తము అనబడు క్షేత్రమే కురుక్షేత్రము. అందు దేవయజ్ఞము జరిగినది" అని బ్రాహ్మణములు చెప్పుచున్నవి. (*"అవిముక్తం వై కురుక్షేత్రమ్; తస్మిన్ దేవయజనమాస।"*) అవిముక్త మనగా హద్దులు లేనిది. ఇది ఆకాశమునే సూచించును. అది యొక పురుషుని దేహమువంటిది గాను, ఆ పురుషుడు పుట్టుక లేనివాడై యుండియు భిన్న జీవులుగా పుట్టుచుండుటకు అండము వంటిదిగాను పురుష సూక్తమున కీర్తింపబడినది. ధీరులు దాని నుత్పత్తి స్థానముగా చూతురనియును, కిరణముల మార్గమును సృష్టికర్తలు అందు అన్వేషించుచుందు రనియుకూడ చెప్పబడినది. ఈ జీవుల యుత్పత్తి జరుగు టకు సంకల్పముగా బయలుదేరి విడివడినవారే దేవతలనబడు ప్రజ్ఞలు. వారుచేయు జగత్కర్మయే పురుషమేధ మనబడు యజ్ఞముగా వర్ణింపబడినది. కనుక సృష్టి సమస్తము జరిగి జీవులు వేరై సంఘర్షణ సంభవించి, యుద్ధములు సాధింపబడి, మరల లీనమగునట్టి ప్రదేశమని కురుక్షేత్రమను పదమునకు వేదముల భావపరంపర అర్థము చెప్పుచున్నది. కనుకనే కురుక్షేత్రము భారత యుద్ధమునకు కూడ రంగమని వ్యాసుడు చిత్రించుటలో జరిగిన సంఘట నయు, కవితా కల్పనయు జతపడినవి.

ఇట్లు జతపడుట సాధ్యమా యను ప్రశ్న పుట్టవచ్చును. ఇది సాధ్య మగుటకు సృష్టిలో నొక రహస్యమున్నది. అంతర్లీనమైన సత్యమును ఋజువు పరచుటకు చెప్పబడు పిట్టకథల వంటివే జీవుల చరిత్రలు కూడను. సంఘటన లను కవి తన మనస్సులో కల్పించినచో కల్పన యందురు. భౌతిక ప్రపంచమున జరిగినచో సంఘటన యందురు. రెండును సృష్టికర్త భావనలో జరుగునవే. కవితా కల్పనమును మానవుని బుద్ధిలోని సృష్టికర్త నిర్వహించును. రెండవదానిని అసలైన సృష్టికర్త విశాలాకాశముననే నిర్వర్తించును. ఈ సమీకరణము కురుక్షేత్రమను వేద సంప్రదాయముగా భారతకాలము నాటికి పరాశరునిచే వ్యాసుని కందింపబడినది. పురాణములు కొన్ని వందలు వ్యాసుని కన్న ముందు వేద వాఙ్మయమున నున్నవి. బ్రాహ్మణములు చదివినచో నిది తెల్లమగును. అందు పదునెనిమిదింటిని స్వీకరించి, తన తండ్రి యుపదేశము ప్రకారము వ్యాసుడు ఆ కాలముననే విస్తరించెను. సంవత్సరమున ఋతు ధర్మములు మండలాకృతిగా పునరావృత్త మగుచుండును. ప్రతి సంవత్సరమునను చెట్లలో, జంతువులలో, మానవులలో, వాతావరణములో అవి తిరిగి తిరిగి వ్యక్తమగు చుండును. అట్టివే పురాణ కథలని భారతమున వ్యాసుని నిర్వచనము. కురు క్షేత్రము ఆ సంప్రదాయము లోనిది.

కురు వను మహారాజొకప్పుడు నిరుపయోగముగా పడియున్న భూమిని దున్నెను. ఆ దున్నుట యజ్ఞ మయినది. దాని వలన భూమి క్షేత్రమైనది. అందు పండిన ధర్మ మనబడు పైరుతో సస్యము నుత్పాదింపజేసి అతడు జీవరాశులను రక్షించెను. అప్పటి నుండి యతడు రాజయ్యెను. అప్పటి నుండియే ఆ భూమి కురుక్షేత్ర మయ్యెను. ఇది యొక చిత్రమైన పురాణగాథ. దీనిని అర్థవాద మందురు. అనగా అంతరార్థమును తనలో ఇముడ్చుకొన్న పిట్టకథ. ఇట్టి వానిని బ్రాహ్మణములలో ఇతిహాసము లందురు. నిరర్థకమైన భూమి, కృషివలన సార్థకమై సస్యవంతమగును. దాని సారము జీవరాశులు జీవించుట కుపయోగించును. ఇది భౌతిక శరీరమున కెట్లు సత్యమో, అట్లే ఆధ్యాత్మిక శరీరమునకు ధర్మ సస్యమును పండించుకొనుట సత్యము. ఈ విధమైన వ్యవసాయమునకు మానవుని జీవితమే కృషికర్మ. ఈ శరీరమే క్షేత్రము. "*ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే।*" అని శ్రీకృష్ణుడు గీతలో చెప్పెను.

వివేక మనబడు నాగటితో శాశ్వతములు, తాత్కాలికములు అగు విలువలు కలగలుపుగా బీడు పడియున్న భూమిని దున్నుకొనుట, తాత్కాలికములైన దుబ్బులను, కంటకములను, కలుపు మొక్కలను తొలగించుకొనుట, శాశ్వత విలువలు అనబడు సస్యములను పెంచుకొనుట ఆధ్యాత్మిక సృష్టియొక్క పథకము. దానిని తెలిసినవాడు క్షేత్రజ్ఞుడు. అనుభవము గల కర్షకులకు భూమిపని ఎట్లు తెలియునో, అట్లే అనుభవముగల ఆధ్యాత్మికులకు వివేకమను నాగలి లభించునని చెప్పబడినది. దీనివలన సాధించుకొను జ్ఞానమే శాశ్వతానంద కారకము. ఇట్టి జ్ఞానమును మించిన పవిత్రమైన వస్తువు లభింపదు. *("న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే,")* సత్యమును దర్శించిన తత్త్వదర్శనులు గురువులై యీ జ్ఞానము నుపదేశింతురు. *("ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః ।")* ఈ జ్ఞానము గురువుకు శరణాగతి చేయుట వలనను, జీవిత సన్నివేశములను గూర్చి పరిప్రశ్నము చేయుట వలనను, జీవరాశుల రూపమున దైవమును ప్రేమ మార్గమున సేవించుట వలన మాత్రమే తెలియనగును. *("తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।")* ఈ జ్ఞానమును సాధించినవాడు జ్ఞాని. జ్ఞాని యనగా 'నేను' అని 'నా' మతము. *("జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।")*

## యుద్ధక్షేత్రము :

కురుక్షేత్ర మనగా సమస్యలుగల మానవునకు యుద్ధ క్షేత్రము. మార్గము తెలిసిన మానవులకు ఆనందమును పండించుకొను భూమి. అనగా ధర్మక్షేత్రము. సమస్యల కాలమున ఇరుపక్షముల సైన్యములు ఈ క్షేత్రమున బారులుతీర్చి యుండును. అందొక పక్షమును *'మామకాః'* (నావారు) అనియును, మరియొక పక్షమును *'పాండవాః'* (తెల్లనివారు) అనియును ధృతరాష్ట్రుడు వ్యవహరించెను. వివేకములేని గ్రుడ్డితనమునకు సంకేతము ధృతరాష్ట్రుడు. ఈర్ష్య (దుర్యోధనుడు), మదము (దుశ్శాసనుడు) మున్నగు కౌరవులును, వారికి సహాయభూతులగు మోసము (శకుని), గర్వము, స్వాభిమానము (కర్ణుడు) మున్నగు వారును మామకులు. 'నాది, నావారు' అను భావములకు విన్యాసములే వీరు. పాండురాజు అనగా మనలోని వెలుగుబాటకు సంకేతము. వానిచే వెలిగింపబడిన పంచేంద్రియ ప్రవృత్తులే

పాండవులు. క్రియాశక్తి యనబడు సంకల్పమునకు సంకేతము ద్రౌపది. ఆమె దుష్టశక్తులచే ఆకర్షింపబడుట, తత్ఫలితముగా నుభయ శక్తులకు నడుమ వ్యవహారము పెరుగుట, యుద్ధము - అనునవి మానవ జీవితమున భారత విశేషములుగా నిరూపింపబడినవి. ఇందలి మంచి శక్తులకు విజయము చేకూర్చు 'నేను' అనబడు ప్రజ్ఞయే శ్రీకృష్ణుడు. ఈ జయాఖ్య కథను నిష్పక్షపాతముగా, సాక్షీభూతుడుగా చూచి గ్రంథస్థము చేయగల ప్రజ్ఞయే వ్యాసుడు.

ఉపనిషద్వాఙ్మయమున భౌతిక శరీరము రథముగా, ఇంద్రియములు గుఱ్ఱములుగా, మనస్సు పగ్గముగా, నరప్రజ్ఞ రథికుడుగా, 'నేను' అను పరమాత్మ సారథిగా నిరూపింపబడినది. ఈ ఉపమానమును ఆర్ష కవిసమయ ముగా స్వీకరించిన వేదవ్యాసుడు అర్జునుని రథమునకు తెల్లని గుఱ్ఱము లున్నట్లు వర్ణించినాడు. ఇంద్రియముల పరిశుద్ధి సత్యగ్రహణమునకును, సుఖావలంబనమునకును ముఖ్యము. ఈ విధమైన సంకేతములతో యోగ విద్యగా భగవద్గీతోపదేశము భారతమున చేయబడినది.

## '18' - కీలక సూత్రము :

భగవద్గీతకు పదునెనిమిది యధ్యాయములు కలవు. దీని నిముడ్చుకొనిన మహాభారతమునకు పదునెనిమిది పర్వములు కలవు. యుద్ధము జరిగినది పదునెనిమిది దినములు. అందు పాల్గొన్నది పదునెనిమిది యక్షౌహిణుల సైన్యము. సంఖ్యాక్షర నిఘంటువు ననుసరించి 'జ-య' అను అక్షరములకు 8, 1 సంఖ్యలు సంకేతింపబడినవి. *"అంకానాం వామతో గతిః"* అను సంప్రదాయ ముచే 'జయ' శబ్దమునకు 18 అని యర్థము. వ్యాసుడు వ్రాసిన మూలగ్రంథము పేరు జయము. ఈ '18' సంఖ్య కేమైన విశేషమున్నదా? లేకేమి? అదియే భారతములోని వివిధార్థములను విన్యాసముచేయు సంకేతములలో నొకటి. దీనిని విడదీయు సుళువు 'పర్వము' అను పదములోని శ్లేషార్థమున గలదు. పూర్ణిమ, అమావాస్యలను పర్వము లందురు. ఒక చాంద్ర సంవత్సరమున 12 పూర్ణిమలు, 12 అమావాస్యలు నుండును. మొత్తము 24 పర్వములు. దీనినే సంవత్సర పురుషుడగు ప్రజాపతి నామాంకితమైన గాయత్రీ ఛందస్సు

అందురు. ఇందు నాలుగింట మూడు వంతులు 18 అగును. ఇందు చెప్పబోవు సమన్వయమునకు వ్యాఖ్యానప్రాయమైన పునాదిని నిలుపుటకే సూతుడు మహాభారతమున మొదట సంవత్సర చక్రమును కీర్తించి జ్యోతిర్విద్యా విన్యాసము చేసినాడు.

"ఈ సృష్టియందు నాలుగవ వంతు ఈ దృశ్యమానమగు దేశ కాలబద్ధ మైన లోకములు. ఇవి జనన మరణములకు గురియగు చున్నవి. మిగిలిన మూడు వంతులును లోవెలుగునందు అమృతత్త్వమున తరగనిదై యున్నది" అని పురుష సూక్తము చెప్పుచున్నది (*'పాదోఽస్య విశ్వాభూతాని, త్రిపాదస్యాఽమృతం దివి।'*). సృష్టియంతయు చతుర్ముఖము. "చతుర్ముఖ బ్రహ్మచే నుచ్చ రింపబడిన వాగ్దేవిగా ఈ సృష్టి వెలువడుచున్నది. ఆ వాక్కునందు మూడు భాగములు గుహలో వలె అంతర్లీనములై యుండును. మిగిలిన నాల్గవ వంతును మాత్రమే మనుష్యులు ఉచ్చరించుచున్నారు. మిగిలిన మూడు వంతు లను దర్శించిన ప్రజ్ఞ గలవారే బ్రాహ్మణులు" అని ఋగ్వేదములోని సరస్వతీ మంత్రము* చెప్పుచున్నది.


ఈ సృష్టి మొత్తమునకు సంవత్సరము చిన్న చిత్రపటము (Blue Print) వంటిది. మానవ జన్మకు గర్భధారణము నుండి జననము వరకు గల సగటు కాలము తొమ్మిది సౌరమాసములు. అనగా సంవత్సరమున 3/4వ వంతు. ఇది జీవి శరీరము పెరుగుదలను, అహంకారము పెరుగుదలను సూచించును. మరియు పంచేంద్రియ ప్రవృత్తులు, దానితోబాటు పిండమును అవయవము లుగా బ్రద్దలుకొట్టు శక్తి (గాంధారి)ని, ఈ విభజనలో నుద్భవించు మామకులు అనబడు అహంకారాది అంధ సంతతి జననమును తెలియజేయును. దీనికి వివరణముగనే దైవాసురాంశలు భూమికి దిగివచ్చు కథ భారతమున నున్నది. వీరి నడుమనే 'నేను'గా దిగివచ్చు వాడు శ్రీకృష్ణుడు. కురుపాండవ శక్తులుగల ఈ క్షేత్రముననే ధర్మగ్లాని కలిగినపుడెల్ల, అధర్మము పెచ్చు పెరిగినపుడెల్ల 'నేను'గా తాను దిగివచ్చుచుందునని భగవద్గీతలో 'నా' వాగ్దానము. ఈ

---

* చత్వారి వా క్పరిమితా పదాని తాని విదు ర్బ్రాహ్మణా యే మనీషిణః ।
గుహా త్రీణి నిహితా నేంగయంతి తురీయం వాచో మనుష్యా వదంతి ॥

వాగ్దానమే సర్వజాతుల పవిత్ర గ్రంథముల యందు ప్రతిధ్వనించు "నా వాణి". ఇట్లు ప్రతిజీవి యందును సంవత్సర పరిభ్రమణమున దిగివచ్చు జనన మరణాత్మకములైన అంశములను, తదతీతమైన అంశమును సమన్వ యించుట వేద పురాణ వాఙ్మయమునందు పై జెప్పిన నాలుగింట మూడు భాగములుగా సంకేతింపబడినది. ఈ మొత్తమునందు అంతర్గూఢముగా జరుగు ప్రక్రియ మూడు వంతులుగను, బహిర్గతముగా జరుగునది నాల్గవ వంతుగను చెప్పబడినవి. ఇందు అంతర్గూఢమైన మూడు వంతులును జీవి గర్భస్థుడైయున్న తొమ్మిది మాసములతో నుపమానము చేయబడినది. ఈ తొమ్మిది మాసములలో తొమ్మిది పూర్ణిమలు, తొమ్మిది అమావాస్యలు వచ్చును. అవియే పదునెనిమిది పర్వములుగా భారతమున నిబద్ధము చేయబడినవి.

నాలుగింట మూడు వంతులు సూక్ష్మలోకములలో అనగా కారణ లోకములలో అమృతత్త్వమున నున్నవి. మిగిలిన నాలుగవ వంతు మాత్రము సృష్టిగా వ్యక్తమై వర్తించుచుండును. ఈ వ్యక్త సృష్టికి ఆది, అంతము నుండును. సూక్ష్మ కారణ లోకములలో ఆది, అంతము నుండవు. అవి అమృత మయములు. భౌతికలోకములో నున్న సమస్యలకు పరిష్కారము కావలె నన్నచో, సూక్ష్మ కారణము లోకముల వెలుగులో నన్వేషింపవలెనుగాని, భౌతిక సన్నివేశముల చీకటిలో తడవుకొనరాదు. సర్వ సమస్యలకు పరిష్కారము విన్యసించిన గ్రంథము ప్రపంచ వాఙ్మయమున మహాభారత మొక్కటే! అందలి కేంద్ర బిందువుగా నున్నది భగవద్గీత! వీని వినియోగమును సూచించుటకే '18' అను సంఖ్య మరల స్ఫురింపజేయబడినది.



# శంఖారావము

(శ్రీమద్భగవద్గీతా రహస్య ప్రకాశము)

## మొదటి అధ్యాయము

# అర్జున విషాద యోగము

**వ్య**క్తి కేది కావలయునో జాతికికూడ అదే కావలయును. అనగా తన కేది కావలయునో ఇతరులకు కూడ అదే కావలయునని యర్థము. దీనిని గుర్తించుటయే ధర్మమును గుర్తించుట. దీనిని గుర్తించునట్లు చేయు దివ్య వాక్కే *'శంఖారావము.'* శరీరము అను రథములోనుండి యిది వినిపించును. ఈ శంఖారావమును విని, తానును పూరింపవలసినవాడు దేహములోని జీవుడు. ఇందు వినుట, విని పూరించుట యను రెండు అంశము లున్నవి గనుక, మొదట వినిపించువాడు కూడ, విని పూరించువానితోబాటు ఈ శరీరమున నుండవలెను. వారిరువురును దేహమను రథమున యానము చేయుచున్నారు. మమకారపు భావము లనబడు గ్రుడ్డివాని కొడుకులకును, పాండురములగు భావములైన పాండురాజు కొడుకులకును నడుమ సమస్యల యుద్ధము జరుగుచుండగా, ఇరు పక్షముల సైన్యములు ధర్మమను క్షేత్రమున బారులు తీర్చియుండగా, రెండు సైన్యములకు నడుమ ఈ రథ మాగినది. అందున్న యిద్దరును నర నారాయణులు. నరు డనగా జీవిగా నున్న ప్రజ్ఞ. నారాయణు డనగా జీవులలోనున్న ప్రజ్ఞ. నారాయణుని నుండి పుట్టిన నరుడు సంకల్పము ననుసరించి దేహమను రథమును, ఇంద్రియములను గుఱ్ఱము లను సిద్ధపరచుకొనును. వాస్తవమునకు సారథియే వీనిని సిద్ధపరుపవలెను. కనుక నారాయణుడే సారథియైకూడ దిగివచ్చి సిద్ధపరచినాడు. ఈ దిగి వచ్చుటయే అవతరణము అనబడును. ఈ దిగివచ్చిన మూర్తినే అవతారము అందురు. దేహము, ఇంద్రియములు మున్నగునవి మానవున కున్నవిగాని, అవి కలుగుట మాత్రము దైవమునుండి దిగివచ్చిన సంకల్పమే. ఈ జగద్వ్యూహ మంతయు దివ్య సంకల్పమే గాని జీవ సంకల్పము కాదు. ఈ సంకల్పమునే 'మాయ' యందురు. ఇది భగవంతునిది. అనగా నారాయణునిది. నరుడైన జీవుడు మాత్రము ఈ వ్యూహముల సామరస్యమును అనగా పొందికను

గమనించుకొనవలసి యున్నది. ఈ సామరస్యమే యోగము. అది తిన్నగా కుదిరినప్పుడు దేహము తెల్లని గుఱ్ఱముల రథ మగును. అనగా ఇంద్రియ ములు పరిశుద్ధి చెందును.

**గీత :**

ఉభయ సైన్యముల మధ్య, ఇట్లు పొందిక కుదిరిన రథము నందు నారాయణుడు పూరించు శంఖారావము నరునకు (అనగా జీవునకు) ధర్మ బోధయై వినిపించును. ఈ బోధనే వ్యాసుడు *'భగవద్గీత'* యని వ్యవహరించి నాడు. *'గీత'* యనగా గానము చేయబడినది. అది శ్లోక రూపము, సంగీత రూపము మాత్రమేగాక, జీవు డలవరచుకొనవలసిన గానము. మనస్సునకు ఇంద్రియముల నుండి గోచరించు సృష్టియు, అందలి సన్నివేశములును పరస్పర సంఘర్షణ లేక, సంగీతము నందలి రాగ, తాళ, భావ, స్వరముల వలె సామరస్య మొందవలెను. ఒక గ్రంథమున మనము అక్షరములను, పదములను, వాక్యము లను చదువుచున్నను, అవిగాక, అందలి భావములు గాక, ఆ భావముల మొత్తముయొక్క సంస్కారమే ఎట్లు ప్రాధాన్యము వహించు చున్నదో, ఇదియు నట్లే మొత్తము సామరస్యము, ప్రాధాన్యము వహింపవలెను. ఆ సామరస్యమే దైవము. దానిలోని భిన్నాంశము జగత్తు. ఈ కారణముననే ధర్మ సందేశమగు నీ శంఖారావము వ్యాసునిచే 'గీత' యని వ్యవహరింపబడినది.

ఈ దేహమున వినిపించువా డొకడును, విని పూరించువా డొకడును ఉండుట నారాయణుని మాయ. ఈ విధముగా వేరైన జీవుని సృష్టి నారాయణుని నుండి దిగివచ్చిన సంకల్పము. అతడెన్నడును సంకల్పించడు. కాని వానినుండి సంకల్పము వెలువడుచుండును. మనము మనస్సునుండి ఊహలను పిలువ నపుడుకూడ ఊహలు తమంతతాము బయలుదేరి ఎట్లు వెలువడుచుండునో, అట్లే దైవసంకల్పము కూడను. వెలువడుచున్న సంకల్పమునకు దైవము సాక్షియేగాని దానియందు చిక్కుకొనడు. అట్లే వెలువడుచున్న భావములకు మానవుడు సాక్షిగానుండి, వానియందు చిక్కుకొనకున్నచో యోగి యగును. భావములను నిరోధించువాడు యోగి కాడు. అతడు మిథ్యాచారు డనబడును. నిరోధించుట కూడ ఒక యూహయే గనుక, నిరోధించువా డందు చిక్కు

కొనును. చిక్కుకొనకుండ వానిని గమనించినచో అవి చెడు మార్గము నుండి మంచి మార్గమునకు సర్దుకొనును. ఎంత దురాచారుడైనను ఈ అనన్య భావమున నారాయణుని భావించువాడు సాధువే యగును. ఈ చిక్కుకొన కుండుటకు ఒక నేర్పరితనము కావలెను. కనుక యోగ మనగా నిజమైన నేర్పరితనము.

ఈ దేహమున ధర్మమనబడు శంఖారావము సారథి రూపుడైన నారాయణునిచే చేయబడును. ఆ రావము మనస్సు నుండి పంచేంద్రియముల లోనికి దిగివచ్చి, పంచభూతాత్మకమైన శరీరమును నిర్వహించుచు, పంచ తన్మాత్రల మూలమున జన్యమైన సమన్వయముగా వినబడవలెను. కనుక శ్రీకృష్ణుడు ఊదిన శంఖము పేరు 'పాంచజన్యము'. ఇక నరుడు పూరించు శంఖము తన స్వంతము కాదు. దేవునిచే దత్తము. కనుక అర్జును డూదిన శంఖము పేరు దేవదత్తము. ప్రతి దేహము నందును నరనారాయణు లుందురు గనుక, ఒకరినుండి యింకొకరు యీ యుద్బోధ నందుకొందురు గనుక, అందించిన వానిలోని నారాయణుడు గురువు. అందుకొన్న వానిలోని నరుడు శిష్యుడు. ఈ సంబంధమునే గురు శిష్య సంబంధ మందురు. అందరిలో నున్న నారాయణుడు జగద్గురు వనియు, మన కందించినవాడు గురు వనియు సంప్రదాయము. కనుక నమ్మిన వానికి గురువే నారాయణుడు. అర్జునున కందించినవాడు స్వయముగా నారాయణుడే! ఈ గురుపరంపరకు మూల పురుషుడు కనుకనే కృష్ణుడు 'జగద్గురు' వని వ్యవహరింపబడినాడు. గురు పరంపర లేనిదే గురుశిష్య సంసర్గమైన యోగము లేదు.

ఈశ్వరుడు సర్వభూతములలోను హృదయములందు నిలచి, చక్కని యంత్ర వ్యూహమువలె జగత్తును నిర్వహించుచున్నాడు. కనుక అవసరమైన నాడు అతడే ఒకని రూపమై సమయమునకు గురువుగా శిష్యు నాకర్షించును. ఈ ఆకర్షణనే 'ఉపదేశ' మందురు. ఈ లోపున శిష్యుడు గురువుకొరకు తడవు లాడి ప్రయోజనము లేదు. అందు జీవితపరిమాణము వ్యర్థమగును. గురువు లభింప లేదని తహ తహ పడుచు, ఆ తహ తహయే జిజ్ఞాస యనుకొనువారు కొసవెట్టి వేదాంతులు. తనకు కనిపించు వారిలో నెవడు గొప్ప గురువో నిర్ణయించుటకు బాధపడుటయు, తాను శిష్యుడో, గురువో, అవతారమో

అని తెలిసికొనుటకు వితర్కించుటయు దురహంకారమును సూచించును. గురువు మాట మరచి, విశ్వప్రేమ మార్గమున సర్వాంతర్యామిగా నున్న జగద్గురువునకు తన భక్తి చెల్లించుచు, జీవుల యెడ తన కర్తవ్యమును నిర్లిప్తముగా నిర్వహించు చుండుటయే వాస్తవమైన యోగమార్గము.

## విషాదము :

భారత యుద్ధమునకై బారులు తీర్చిన కురుపాండవ సేనల నడుమ నిలబడి, అర్జునుడు ఉభయ సైన్యములను ఒకమారు పర్యాలోకనము చేసెను. పోరుటకు వచ్చినవా రందరును తన చుట్టములు, గురువులు, మిత్రులు. అందరును ఆత్మీయులు, వారిని చూచి అర్జునునకు జాలి కలిగెను. దుఃఖము పెల్లుబికి వచ్చెను. సారథియైన కృష్ణునితో నిట్లనెను : "ఈ స్వజనమును చూడుము. వీరితో మనము యుద్ధము చేయుట అన్యాయము. స్వజనముతో యుద్ధమేమి? ఇందెవరు చనిపోయినను మనకు దుఃఖమేగాని సంతోషము కలుగదు. ఇందు గెలిచినను అది యొక గెలుపగునా? మనము రాజ్యసుఖము లనుభవించుట యెవరిని సంతోష పెట్టుటకో, వారిని చంపి నెత్తుటి కూటివలె మన మీ రాజ్యమును కట్టబెట్టుకొని లాభమేమి? మరియు యుద్ధము హింసాత్మకము. ఆ మార్గ మవలంబించుటలో మనకు గల వివేకమేమి? తెలియక వారు సిద్ధపడినను, తెలిసి మన మేల తప్పు చేయవలెను? ఈ సందర్భమున వారు నన్ను చంపినను మనము తప్పు చేయుట కన్న చచ్చుటయే క్షేమము. ఈ కూడని పరిస్థితుల నెదుర్కొనిన నాకు చిత్తశాంతి నశించి మేను కంపరమెత్తు చున్నది. నేను యుద్ధము చేయను.'' ఇట్లు పలికి అర్జునుడు రథమున కూలబడిపోయెను.

## రెండవ అధ్యాయము

# సాంఖ్య యోగము

**భ**గవద్గీతలో యుద్ధమునకు భయపడి విషాదము చెందిన యర్జునుడు స్వధర్మమునకు భయపడిన సంసారజీవికి చిహ్నము. ఇందు యుద్ధమనగా యుద్ధ విషయ మొక్కటే కాదు. అర్జునుడు క్షత్రియుడు. దుష్టశిక్షణము అతనికి స్వధర్మము. అట్లే ఏ వృత్తి యందున్న వానికైనను వాని స్వధర్మాచరణము ముఖ్యము. అది చేయనినాడు జీవి ధర్మభ్రష్టు డగును. స్వధర్మాచరణము నుండి విముఖత జీవుల కేల కలుగును? దీనికి కారణము భగవద్గీతలో చక్కగా ప్రతిపాదింపబడినది. ఇష్టాయిష్టములే దీనికి కారణము. అవి రాగద్వేషములపై ఆధారపడి యుండును. నావారు, పైవారు అను భేదముచే రాగద్వేషము లుత్పన్న మగును. స్వ పర భేదము మనస్సుచే నారోపింపబడును. కనుక మనస్సు వీనికి కారణము. మనస్సునకు చాంచల్యము సహజము. జీవుడు నిశ్చలత్వ మందవలె నన్నచో మనస్సుయొక్క బంధమునుండి విమోచనము చెందవలెను. దాని కొరకై మనస్సు లీనమగు నేర్పరితనము నార్జించుకొనవలెను. ఇదియే యోగము.

యోగమార్గము నుపదేశించుటకు ముందు కృష్ణు డర్జునుని మనస్సున కేర్పడిన ప్రస్తుత సమస్యను పరిష్కరింప బూనెను. ఈ సమస్యయే మృత్యుభీతి. అనగా తన బంధువులు మరణింతురను భయము. ఈ భయము వలన అర్జునుడు స్వధర్మ భ్రష్టుడు కాకుండ కాపాడుటయే కృష్ణుని జగద్గురుత్వము. అర్జునునకు గల యీ మృత్యుభీతిని పోగొట్టవలెనన్నచో మృత్యువుయొక్క నిజస్వరూపము నర్జునునకు తొలుత బోధింపవలెను. రెండవ అధ్యాయమగు సాంఖ్యయోగమున నీ యుపదేశముతోనే భగవానుని గీతోపదేశ మారంభమగును.

**పరిష్కారములు :**

తన ఆవేగమును సమర్థించుకొనుటకు అర్జునుడు పలికిన వన్నియు

మంచి మాటలే! కాని ధర్మము సూక్ష్మ స్వరూపము. కోపము, దుఃఖము, జాలి మనస్సు నావేశించినప్పుడు కలిగిన భావములు ధర్మమువలె కనిపించు చున్నను, అది భావావేశమేగాని ధర్మము కాదు. ప్రశాంతచిత్తునకు తప్ప ధర్మమార్గము స్ఫురింపదు. ధర్మ మాచరించినప్పుడు సుఖము, తృప్తి, కర్మబంధ విమోచనము కలుగవలెను గాని విషాదము, అశాంతి, కంపరము కాదు.

జననము, మరణము మానవుని చేతిలోనివి కావని మొదటి యుపదేశము. తాను యుద్ధము చేయుట వలన బంధువులు చనిపోవుదురని అర్జునుడు తలచెను. అనగా వారి మరణమునకు తాను కారణ మగుదునని భ్రమ పడెను. వేయి సంవత్సరముల క్రిందట నర్జునుడుగాని, బంధువులుగాని పుట్టియుండ లేదు. అనగా లేరు. అటుపైన వేయి సంవత్సరముల తర్వాత వారెవ్వరునూ ఉండరు. ఈ యంశము జరుగుటకు అర్జునుడు యుద్ధము చేయనక్కరలేదు. కనుక ఎవరి జన్మమునకును, మరణమునకును అర్జునుడు బాధ్యుడు కాడు. ఇది కృష్ణుని మొదటి యుపదేశము. యుద్ధము మంచిది కాదని ఋజువు చేయుటకు అర్జునుడు ఒక కారణము చెప్పెను. యుద్ధము వలన అనేకులు మరణింతురు కనుక అది మంచిది కాదని అర్జునుని వాదము.

అర్జునుడు పూర్వమెన్నో యుద్ధములు చేసి, శత్రుసంహార మొనర్చి విజయము, కీర్తి గడించుకొన్నవాడు. ఆ సందర్భములలో నెప్పుడును యుద్ధము హింస యని స్ఫురింపలేదు. తన చుట్టములతో యుద్ధము జరుగవలసి వచ్చి నప్పుడు మాత్రము స్ఫురించినది. తన వారి కొక ధర్మము, పరులకు మరియొక ధర్మము! దీనినే శ్రీకృష్ణుడు క్షుద్రము, హృదయ దౌర్బల్యము అని యెత్తి చూపెను. అర్జునుడు చెప్పినవి మంచి మాటలే యైనను, ఈ క్షుద్రత్వముచే కలుషితములైనవి. మరియు శోకసంవేగ మందిన మనస్సుచే అర్జునునకు కలిగిన దయ అస్థాన పతితము. పరిస్థితులలోని ధర్మాధర్మములను బట్టి కర్తవ్య నిర్ణయము జరుగవలెను గాని, వ్యక్తులకు కలిగిన కామ క్రోధములను బట్టి కాదు. అధర్మము నణచి, ధర్మమును స్థాపించుట పరిపాలకుని కర్తవ్యము. ఆ ప్రయత్నమున ఒక్కొక్కప్పుడు యుద్ధ మావశ్యక మగును. అదియే ధర్మ యుద్ధము. దాని నాచరించుటకన్న క్షత్రియునకు శ్రేయస్సు ఉండబోదు. అట్టి యుద్ధమున చనిపోయినను, ఆ మృత్యువు స్వర్గద్వార మగునుగాని, మృత్యు

ద్వారము కాదు. కౌరవు లధర్మపరులై మాయా ద్యూతమున పాండవుల నోడించి రాజ్య మపహరించిరి. నియమ పరిపాలనము సక్రమముగా చేసిన పాండవులకు రాజ్యభాగము తిరిగి యిచ్చివేయుదుమని చెప్పికూడ వా రన్యాయమునకు పాల్పడిరి. దానిని దమించుటకు కలిగిన యుద్ధము ధర్మయుద్ధమే! అందు అర్జునుడు ధర్మమును స్థాపించు మార్గమున తన నిర్ణయము చేసికొని కర్తవ్య మాచరింపవలెను గాని, అకారణముగా దుండగుల యెడల మెత్తబడరాదు.

పై వాదములను విడచి ఆలోచించినచో ఎవనికి వాడు 'ప్రస్తుతము నా కర్తవ్యమేమి?' యని ప్రశ్నించుకొనుట మిగులును. ఏ పని చేయవలసినవాడు ఆ పని చేయుట సంఘమునకు శ్రేయస్సు. జనన మరణములు తప్పని జీవులతో సంఘమెట్లును నడచుచున్నది. దానికి శ్రేయస్సును మనము మనకు సహజ మైన మార్గమున చేకూర్చుటకు యత్నింపవలెను. అర్జునునకు సహజముగా, విశిష్టముగా అబ్బిన విద్య యుద్ధక్రీడ. అభ్యసించిన నాటి నుండి ప్రస్తుతము వర కతడు ఎదురులేనివాడు. ఇట్టి తన విద్యతో నతడు సంఘము నారాధించు మార్గమేమి? ధర్మాధర్మ నిర్ణయము తన బుద్ధితో చేసికొని, అధర్మ పక్షము నణచి, ధర్మమును రక్షించినచో, తనకన్న బలహీనులైన మంచివారందరు సుఖపడుదురు. కనుక క్షత్రియ ధర్మము సహజతతో మూర్తీభవించిన అర్జును నకు యుద్ధము చేసి ధర్మమును స్థాపించుట పరమ ధర్మము. ధర్మ యుద్ధము కన్న అట్టివానికి శ్రేయస్సు మరియొకటి ఏమి కలదు?

వలసిన యెడ శిక్షించుట కూడ క్షత్రియుని కర్తవ్యమే! శిక్షార్హులపై దయచూపుట యనగా ధర్మమును భగ్న మొనర్చుటయే. ధర్మమును కాపాడుటకు యుద్ధము చేయవలసిన చోట నీతివాక్యములను పలుకుట అప్రస్తుతము. దానివలన మంచితనము కూడ దక్కదు. దుష్టులు దాని నసమర్థతగా నిందింతురే గాని మెచ్చుకొనరు. అర్జును డిట్లు చేయబూనుట కూడ, వారు తన వారను మమకారమే గనుక, అది ధర్మచ్యుతి యగును.

ఇంతకును యుద్ధమున తనవారు చనిపోవుదురను జాలి మృత్యుభీతిపై నాధారపడి యున్నది. ఒకరు చనిపోవుదురని భయపడుట వలన వారిని చిరకాలము బ్రతికింపలేడు. మృత్యువు నొక కారణముగా జూచి యుద్ధము వలదని నిర్ణయించుటకు ముందు మృత్యువుయొక్క నిజస్వరూపమును

గ్రహించుట యావశ్యకము. మృత్యుభీతిని దాటుట జ్ఞాన సముపార్జనమునకు మొదటి మెట్టుగా కృష్ణునిచే వివరింపబడినది. కొంతకాలము క్రిందట మనము లేము. అనగా పుట్టియుండలేదు. కొంతకాలము తరువాత మనము ఉండము. జన్మము, మృత్యువు దేహమునకు సహజము. మృత్యువును తప్పింపగల వాడెవడునూ లేడు. కనుక మరణమను హేతువునుబట్టి యుద్ధము మంచిదా, కాదా యను నిర్ణయము చేయుట సరికాదు. ప్రవహించిపోవుచున్న నదిలో నొకడు తనకు కావలసిన తీరున పడవలో ప్రయాణించుచున్నంత మాత్రమున, ఆ ప్రయాణీకుడు నది నీటిని ప్రవహింపజేసినవా డగునా? కనుక మృత్యువు నాధారముగా గొని ధర్మ నిర్ణయము చేయబూనుట నీటిపై సద్గ్రంథమును వ్రాయబూనుట వంటిది. కనుకనే మృత్యువు యొక్క స్థానమును, స్వరూప మును కృష్ణుడు సాంఖ్యయోగమను ఈ అధ్యాయమున నిరూపించెను.

తనవారి మృత్యువు వలన తనకు దుఃఖము కలుగును. వారి క్షేమము వలన తనకు సంతోషము కలుగును. మృత్యువు అనివార్యము గనుక, దానిపై నాధారపడి కార్య నిర్ణయము చేయువానికి దుఃఖము తప్పదు. సుఖము, దుఃఖము అనునవి బాహ్య పరిస్థితులను బట్టి కలుగుచుండును. కనుక సుఖ దుఃఖ కారణములు అనివార్యములు. జీవి సుఖ దుఃఖముల నెన్నడును తప్పించుకొనలేడు. కనుక, వాని కారణముల కతీతుడుగా నుండవలెను. ఈ కారణములు పంచేంద్రియములపై పరిస్థితుల ప్రభావమున నేర్పడును గనుక, మానవుడు ఇంద్రియ ప్రభావములకు అతీతుడుగా జీవింపవలెను. తప్పనిసరియైన బాధలకు, సహించుటయే పరిహారము. ఈ సహనము బాధపడుట వలన గాక, బాధ కతీతుడుగా రూపొందుట వలన కలుగవలెను. దీనికి సాధన మావశ్యకము. అదియే యోగమునకు మొదటి మెట్టు.

నిమిత్తములు (శకునములు మొదలగునవి) విపరీతముగా కనిపించు చున్నవి గనుక, యుద్ధములో మనము గెలిచెదమా, ఓడిపోదుమా? యను సందేహము కలుగుచున్నదని అర్జునుడు మరియొక సాకు చెప్పెను. ఇదికూడ యుద్ధము మానవలె ననుటకు హేతువు కాజాలదు. ఫలితము కలుగదేమో యని సందేహించి మిగిలిన పనులను అతడు మానుకొనుచున్నాడా? చేయ దలచిన ప్రయత్నము చేయుట తప్పదు; దానికి ఫలితముండుట, లేకుండుట

అనునవియు తప్పు. అయినను తనకు మంచి పని యని తోచిన దానికై యత్నించుచు పరాజయము చెందినను తన మంచికి లోటురాదు గనుక అది ప్రశంసింపదగినదే. ధర్మ యుద్ధమున చచ్చుట పుణ్యకర్మలో ప్రాణములు విడుచుటయే కదా! అర్జునుడు యుద్ధములో గెలిచినచో రాజ్యము, ధర్మపరి పాలనము లభ్యమగును. యుద్ధమున చనిపోయినచో వీరస్వర్గము లభించును.

ఈ విధముగా కృష్ణుడు, అర్జునుడు చెప్పిన సాకులకు తావు లేకుండ చేసెను. అట్లు చేయనిదే యోగవిద్య నుపదేశించినచో నిష్ఫలమగును. ఉన్న సందేహములను, సాకులను, దౌర్బల్యములను త్రికరణముల వ్యత్యాసములను తొలగింపకయే సుఖపడు మార్గము బోధించినచో ఫలితము లేదు. వాస్తవమైన సుఖ మననేమో తెలిసి, నమ్మకము కలిగి నచ్చవలెనన్నచో, అంతకుముందు తత్ప్రతిబంధకములుగానున్న చిల్లర యభిప్రాయములను తొలగింపవలెను. చిలుము పట్టిన పాత్రను తోమి పరిశుభ్రము చేయకయే మంచి పానీయమును నింపి యిచ్చినచో అది రుచించునా? పాత్రదోషములు పానీయమునకు సంక్ర మించును. అట్లే వ్యక్తియొక్క పాత్రతలో దోషములు సత్యదృష్టిని అంటు పరచును. కనుక కృష్ణుడు యీ ప్రశ్నలకు తొలుత సమాధాన మిచ్చి రహితము చేసెను.

## ఇంద్రియములు - మనస్సు :

ఇంద్రియములు మనస్సునకు కిటికీల వంటివి. మనస్సు ఇంద్రియము లలో ప్రవర్తించినపుడు ఇంద్రియములు పనిచేయును. ప్రవర్తింపనపుడు పని చేయవు. కన్నులు తెరచుకొనియున్నను, మనస్సు మరియొక తావున నున్నప్పుడు కంటి కెదురుగా నున్న వస్తువు కనిపించదు గదా! ఇదే ఇంద్రియములను జయించుటకు మార్గము. రథమునకు కట్టిన గుఱ్ఱములు గడ్డిని చూచి ముందుకు సాగవచ్చును. ఆ గుఱ్ఱములే సుశిక్షితములై మంచి సారథిచే తోలబడు చున్నప్పుడు కూడ ముందునకు సాగును. ఈ సాగుట గడ్డివైపునకు గాక, సారథి తోలిన వైపునకు సాగుట జరుగును. కన్నులకు గడ్డి కనిపించు చున్నను సారథినిబట్టి యవి ముందుకు సాగును. గడ్డిని లెక్కింపవు. శరీరము రథము; ఇంద్రియములు గుఱ్ఱములు; మనస్సు పగ్గము; భగవంతుడు సారథి;

జీవుడు రథికుడు; మనస్సును భగవంతుని యధీనము చేసినచో నింద్రియములు విషయముల వైపునకు లాగవు. మనస్సునకు అభిలాషపడుట, వర్తించుచుండుట లక్షణములు. ఈ యభిలాషను ఇంద్రియములకన్న రుచికరమగు వస్తువుపైకి మరల్చ గలిగినపుడు మనస్సు ఇంద్రియార్థములను వదలి అతీతముగా వర్తించును. ఈ యభిలాషను మనస్సునకు నేర్పుటయే యోగము. ఈ నేర్పరితనమే గీతలో నుపదేశింపబడినది.

## ఉన్నది - లేనిది :

ఈ సృష్టిలో ఉన్న వస్తువెపుడును లేకుండపోదు. లేని వస్తువు క్రొత్తగా పుట్టదు. ఉదాహరణకు, ఆకాశము ఎప్పుడును రంగస్థలము వలె నిలిచి యుండును. దానినుండి యొక్కొక్క సూర్యుడు, గ్రహములు పుట్టును. ఒక్కొక్క గ్రహమున జీవులు పుట్టి పెరుగుదురు. మరల నన్నియు చోటులో లీనమగును. కనుక ముందు వెనుకల నడుమ చోటున్నది. అది రాలేదు, పోలేదు. సూర్యాదులు వచ్చుట, మరల పోవుట కనిపించుచున్నది. దీనినిబట్టి చూచినచో నీ సృష్టి మొత్తములో నశింపని, శాశ్వతమైన ఆకాశమువంటి యంశ మొకటియు, నశించుచున్నవి మరికొన్నియును ఉన్నట్లు గోచరించుచున్నది. ఈ రెండింటిని చక్కగా తెలిసికొని పరస్పర సంబంధమును గమనించుటయే నిత్యానిత్యవస్తు పరిజ్ఞానము అనబడును. మానవుడు వివేకము వలన నీ భేదమును గ్రహించుచున్నాడు.

వచ్చి పోవుచున్న వస్తువులను, జీవులను, లోకములను జాగరూకతతో పరిశీలించినచో, అందు రెండు భాగములు కనిపించును. అందు మొదటిది ఆ వస్తువుల ఆకారములు, పేర్లు, రంగులు, పరిమాణములు ఉండునట్టి కాలము మున్నగునవి. రెండవది వాని లోపల నుండు వస్తువు. అనగా అవియన్నియు దేనితో చేయబడినవో అట్టి వస్తువు. ఒండ్రుమట్టితో కుండలు చేయబడుట, వాని వినియోగము, మరల నవి పగిలిపోవుట గమనింపుడు. ఒక యాకారమున ఒండ్రుమట్టి కుండ యనబడుచున్నది. అందు మట్టి తప్ప కుండ యను పదార్థము వేరుగా లేదు. కుండకు బ్రద్దలగుట యుండును గాని, మట్టికి లేదు. ఉన్నది వాస్తవముగా మట్టి యొక్కటే! ఆకారమునకును,

కుండయను పేరునకును మాత్రము బ్రద్దలగుట యున్నది. ఇందు కుండ యగుట, బ్రద్దలగుట అను లక్షణములంటని మట్టిపై మనసు నిలిపినపుడు అగుటయు, బ్రద్దలగుటయు లేదు. ఆకారము, పేరు- అను వానిపై మనసు నిలిపినపుడు అగుట, బ్రద్దలగుట యున్నవి. కనుక నామ రూపాదులకు అంటు కొన్న మనస్సునకు పోగొట్టుకొనుట, దుఃఖము తప్పవు. మట్టివంటి సృష్టి మూలతత్త్వము నందు మనస్సు నిలిచి యున్నప్పుడు, పోగొట్టుకొనుటయు దుఃఖించుటయు లేవు. ఈ సత్యమును దర్శించుటకు ఈ మొత్తము సృష్టిలో నశించునదేది, నశింపనిదేది? యని వివేచనము చేసి గ్రహించు టావశ్యకము. సృష్టిలోని మూలతత్త్వ మెన్నడును నశింపదు. అది ఒకప్పుడు పుట్టలేదు. క్రొత్తగా వచ్చినది కాదు. నడుమ పోవునది కాదు. ఆ తత్త్వముయొక్క ఆకాశమువంటి తెరపై నామరూపాదికమైన యీ సృష్టియంతయు వచ్చి, వర్తించి పోవు చుండును. నశించునవి నామరూపాదికములు; నశింపనిది మూలతత్త్వము. మనస్సు నామ రూపాదికముల కంటుకొనినచో సంసార మనబడు స్థితిని అనుభవించును. దానికి ఫలితము సుఖదుఃఖములు. కనుక వానిని గమనించు చునే, వినియోగించుకొనుచునే మనస్సు వానిని విడచిపెట్టి దూరముగా నుండవలెను. మూలతత్త్వమును అవలంబింపవలెను.

**అంటుకొనుట :**

నామ రూపాదికమైన సృష్టిపై మనస్సు నిలచుట 'అంటుకొనుట' యనబడును. ఇది జిడ్డు వంటిది. అంటిన కొలదియు నభిలాష యెక్కువగును. తీర్చినకొలది కోర్కెలు చెలరేగును గాని యుపశమింపవు. కోరికలను తీర్చుచు నుపశమింపజేయ యత్నించుట నిప్పులో నేయిపోసి యార్ప యత్నించుట వంటిది. దీనినుండి మనస్సు వెనుకకు మరలుట త్యాగము లేక వైరాగ్యము అనబడును. ఈ త్యాగము వలన సందు లేని శాంతి చేజిక్కును. ఇక మూల తత్త్వముపై మనస్సు మరలుట వలన దానికంటుకొనుట జరుగదు. దాని నాశ్రయించుట జరుగును. దీనివలన మంటలో వైచిన ప్రత్తివలె మనస్సు అంతరించును. అనగా అది రూపాంతరమందునుగాని నశించదు. నీటి యావిరివలె చంచలముగానున్న మనస్సు స్థితి మారి, నీరువలె మరియొక స్వభావము నాశ్రయించును. ఆవిరిని పాత్రలో పట్టినచో నిలువదు. అట్లే

మనస్సును ప్రాపంచిక విషయములందు అనగా నామరూపాదుల యందు స్థిరముగా పట్టదలచినచో నిలువదు. అదే నీటియావిరి నీరుగా ద్రవీభవించి నపుడు పాత్రలో పట్టి నిశ్చలముగా నిలుపుటకు వీలగును. అట్లే మూలతత్త్వము నాశ్రయించిన మనస్సు స్థితి భేదము చెంది, 'తాను'గా మారును. అప్పుడు మూలతత్త్వము అనబడు పాత్రయందు స్థిరత్వము నందును.

ఇచ్చట మరియొక విశేషమున్నది. పాత్రలో పోసిన నీటికి పాత్ర ఆకారము లభించును. అట్లే మూలతత్త్వము నాశ్రయించినచో 'తాను' అను వానికి మూలతత్త్వము యొక్క స్వభావము వచ్చును. 'తాను' కూడ మూలతత్త్వము నుండి వెలువడి మనస్సు అయ్యెను గనుక, మరల 'తాను'గా మారినపుడు మూలతత్త్వము యొక్క మహత్వము నార్జించుకొనగల్గుట సహజము. పుట్టుక చేత ఈ స్థితి సహజము; వేరగుటచేత మనస్సు యొక్క స్థితి అసహజము అని తెలియుచున్నది. కనుక, తన సహజ స్థితిని తాను పొందుటయే నిశ్చలత్వము. అప్పుడే సంసారమనబడు స్థితిని దాటుటయు, ఆనందమనబడు స్థితి ననుభవించుటయు జరుగును.

**సుఖము - దుఃఖము :**

అటుపైన కర్తవ్య నిర్ణయమునకు మొదటి సూత్రమును కృష్ణుడు తెలుపు చున్నాడు. ఒకపని చేసినచో మనకు సుఖము కలుగునని దానిని మంచిపనిగా నిర్ణయింపరాదు. ఆహార నియమముచే నోరు చచ్చిన వానికి, ఇష్టము వచ్చిన దానిని తినుట జిహ్వకు సుఖకరమే కాని, దాని వలన హాని కలుగును. కనుక అది మంచిపని కాదు. అట్లే తాత్కాలిక దుఃఖము కలిగించు మంచి పనులను కర్తవ్యములు కావని మానుటయు తప్పే. అన్నము వండుకొనుట శ్రమ కనుక మానినచో ఆకలి తీరునా? కొడుకును విద్యాభ్యాసమునకై దూరదేశములు పంపుట దుఃఖము కలిగించును కనుక అది అకర్తవ్య మగునా? ఇట్లు కర్తవ్య నిర్ణయము చక్కగా చేసికొనవలసినవాడు మొదట సుఖ దుఃఖములను సమానముగా నెంచి ప్రక్కకు నెట్టి చూడవలెను.

ఇక లాభాలాభములును అట్లే. లాభము కలుగునని లంచము పుచ్చుకొనుట, కల్తీ సరకు లమ్ముట, జూద మాడుటవలన సుఖము లభించునా?

లాభమును మాత్రమే పరిగణించి యే పనినీ చేయరాదు. దానివలన దుఃఖమే కలుగును. దొంగ లెక్కలు చూపినచో వాణిజ్యమున నెక్కువ లాభము లాగవచ్చును. కాని పన్నుల శాఖవారు పట్టుకొనినప్పుడు గూబలలోనికి లాగును. అట్లే నష్టము వచ్చునని యొక పని మానుటకు కూడ నిర్ణయింపరాదు. దానము చేసినచో సంపద ఖర్చగును. మన దాసదాసీ జనులకు అన్నవస్త్రాదు లెక్కువగా నిచ్చినచో మనకు దండుగ యని మానిన వాని గతి యేమగును? చచ్చినప్పు డీడ్చుటకు కూడ నెవ్వడును రాడు. ఆశ్రితులు పైకి నమస్కరించినను మనస్సున తిట్టుకొని కుట్రలు చేయుదురు. కనుక నష్టపోయినను ఔదార్యమే కర్తవ్యము.

అట్లే జయాపజయములను బట్టి కూడ నిర్ణయింపరాదు. ఒక పని నాచరించిన వెనుక గదా, జయమో- అపజయమో తేలుట? దానికి ముందుగా మీనమేషములు లెక్కించి, అపజయము కలుగునని మానినచో అట్టివా డేపని చేయగలడు? దొంగను పట్టుకొనినచో చావగొట్టునేమో యని భయపడువాడు దండము పెట్టి యూరకొనుట తప్ప యేమియు చేయలేడు. అది కర్తవ్యము కూడా కాదు. జయింతుము గదా యని అధర్మ మార్గమున నొకరిని క్రుంగ దీయుటయు కర్తవ్యము కాదు. కనుక కర్తవ్యము నిర్ణయించుకొనదలచినవాడు సుఖ దుఃఖములను, లాభాలాభములను, జయాపజయములను అభేదముతో చూచి ప్రక్కకు నెట్టవలెను. ప్రస్తుత యుద్ధమును గూర్చి యిట్టి మార్గ మవలంబించి అర్జునుడు కర్తవ్యమును నిర్ణయించుకొనవలెను. ఈ నిర్ణయము నకు ప్రస్తుత పరిస్థితిలో, అనగా కురుపాండవుల పరస్పర వ్యవహారములో యుద్ధమే కర్తవ్యమనియు, ధర్మమనియు తేలును. ఇట్లు చేసిన నిర్ణయము వలన చంపుచున్నామను శంకకు తావు లేదు. ఈ నిర్ణయము ననుసరించి చంపినను తాను పాపము చెందడు. (38)

## బుద్ధి యోగము :

మనము చేయు పనులలో మంచి పనులేవి? చెడ్డ పనులేవి? ఈ యంశములు తెలియుటకు మంచి మనస్సు కావలెను. మనస్సు మంచిది కావలెనన్నచో ఆహార విహారములు, వాతావరణము, అభ్యాసము మంచివి కావలెను. అనగా మంచిపనులు చేసినచో మంచి మనస్సు నిలబడును. మంచి

మనస్సునకు మాత్రమే మంచి పనులేవో తెలియును. కాని సాధకు డెచ్చట ప్రారంభింపవలెను? మంచి పనులేవో తెలిసికొని ఆచరించుట నారంభింప వలెనా? లేక మంచి పనులు చేసి మంచి మనస్సును సాధింపవలెనా? ఈ విధమైన చర్చ మనస్సునకు, శరీరమునకు నడుమ జరుగవలసిన వ్యవసాయము విషయమున చాలకాలము నుండి జరుగుచున్నది. మంచి పనులతో నారంభింప వలెనని యొక పక్షము వారును, మంచి మనస్సుతో సాధన మారంభింపవలెనని రెండవ పక్షము వారును, కృష్ణు డవతరించు వరకును వాదించుకొనుచుండిరి. అందు మొదటి పక్షము వారిని యోగులనియు, రెండవ పక్షము వారిని సాంఖ్యు లనియు వ్యవహరించిరి. ఆ వ్యవహారమునే కృష్ణుడు స్వీకరించి, అర్జునున కిట్లు బోధించెను. "బావా! సుఖ దుఃఖములను, లాభాలాభములను, జయాప జయములను సమబుద్ధితో మనస్సు నుండి తొలగించి, కార్యనిర్ణయము చేయవలెనని చెప్పితిని. ఇట్లు తెలియజెప్పుటనే సాంఖ్య మందురు. ఈ యంశముపై నీ బుద్ధిని ప్రసరింపజేసినపుడు నీవు సాంఖ్యమార్గమున నిలబడితి వని యర్థము. ఇక బుద్ధిని యోగమునందు నిలుపవలసిన మార్గమును నీకు చెప్పెదను. సాధకుడు బుద్ధిని యుక్తము చేయవలెను; అనగా యోగమునందు నిలుపవలెను.

యోగమనగా జతపరచుట. బుద్ధిని కర్మాచరణముతో జత పరుప వలెను. అప్పుడు మాత్రమే కర్మయొక్క బంధము విప్పుకొనుట సాధ్యపడును. దీనికి సిద్ధపడుటలో కొంత జంకు కలుగవచ్చును. పలు విషయములను పరిశీలించి తెలిసికొనుటకు జంక నక్కరలేదు. కాని ఆచరణకు దిగుటకు జంకవలెనన్నట్లు అనిపించును. ఈ జంకుతో పురోగతి నిలిచిపోవును. ఇచ్చటనే నిలిచిపోయి పెక్కు జీవులు యభివృద్ధికై వేచియుండి, మరల మరల జనన మరణముల చక్రమునబడి నలుగుచున్నారు. కనుక సాంఖ్యమున బుద్ధిని పదను పెట్టినవానికి యోగమున అమలుపెట్టకుండుట తగదు. అన్నము వండుట యెట్లో తెలిసినవానికి తదాచరణశ్రమ తప్పించుకొనినచో ఆకలి తీరదుగదా! **(39)**

ఏ పనినైనను చేయుటలో కొన్ని పొరపాట్లు రాకమానవు. కొన్ని దోషములు సంభవింపక మానవు. దీనిని గమనించి కొందరు కర్మలను

సన్యసించుటకు యత్నించుచున్నారు. కాని తప్పించుకొనుటలో చక్కజేసి కొనుట సాధ్యము కాదుగదా! దోషము లేకుండ పనిచేయుటకు సాంఖ్య నిపుణమైన బుద్ధిని వినియోగింపవలెను గాని, దోషముండునని సత్కార్యా చరణము మానవచ్చునా? బెడ్డ లున్నవని బియ్యమును పారబోసికొందుమా? బెడ్డలను తొలగించి బియ్యమును వండుకొనవలెను. అభివృద్ధి యోగమార్గమున మాత్రమే లభించును. వికాసము సాంఖ్య మార్గమున లభించును. యోగ మార్గము నవలంబించిన వారికి పరాజయము లేదు. ఆచరించినంత వరకు అభివృద్ధి కలుగుచునే యుండును గాని తిరోగతి లేదు. కనుక విఘ్నములు లేని మార్గ మిదొక్కటియే. ప్రారంభించిన క్రమ మెన్నడును నశింపదు. ఒక్కొక్కప్పుడు కొంతకాల మాగినను, అటనుండి ముందునకు సాగుటకై ఉద్యమించుటయేగాని, యీ మార్గమున అభివృద్ధి నాశము లేదు. అడ్డంకులు ఈ మార్గము వారికి కలుగవు. ఊరక తెలిసికొన జూచువారికి ఒక్కొక్క సందేహ మొక్కొక్క విఘ్నమై అడ్డగించును. అనుభవములేని బుద్ధికి ఆచరణలో అడ్డంకులు వచ్చినట్లు కనిపించినను, వానిని దాటుటకు చేయు యత్నముకూడ తన యాచరణలో నొక భాగమే అని క్రమముగా తెలియును.

ఆచరణ యనునది స్వల్పవిషయమువలె కనిపించినను, మనుష్యుని మహాభయము నుండి తొలగించునదది యొక్కటియే. ఈ పని సాధించుట యెట్లు? ఇందు చిక్కు లనేకము లున్నవి. ఈ జీవితమును గడుపుట ఎట్లు? ఈ సమస్యలను పరిష్కరించుట యెట్లు? అను చిల్లర ప్రశ్నలు మొదలు, 'ఈ సంసారము నీదుట యెట్లు? నాకు తరణోపాయమేది?' అను శుష్క వేదాంత సమస్యల వరకు తెగసాగుచున్న మనస్సులోని యభిప్రాయము లన్నియు సముద్రపుటలలవలె మనశ్చాంచల్యమునకు నిదర్శనములే గాని సహజమైన అస్తిత్వము కలవి కావు. సముద్రమున తరంగముల కెంత యస్తిత్వ మున్నది? తరంగములు లేని వేళ లేదు. కాని తరంగములు సముద్రముకన్న వేరుగా నేమి యున్నవి? కొంతమంది అలలు తీరిన వెనుక సముద్రస్నానము చేయ వచ్చునని తమ జీవిత పర్వకాలమును వ్యర్థము చేసికొనుచున్నారు. సముద్రపు స్వభావము తెలిసినవారు నేర్పరితనముతో అలలు దాటి అవ్వలి భాగమున స్నానము చేయుచున్నారు. మనస్సున లేచు అభిప్రాయములను అలలకు అవ్వలి భాగముననే కర్మాచరణమునకు ఆనుకూల్యము సిద్ధించును. (40)

ఉత్సవములు, ఊరేగింపులు జరుగు సమయములలో మేడపై నుండి జనసమ్మర్దమును చూచినచో వారిని దాటిపోవుట అసాధ్య మనిపించును. దిగివచ్చి జనులలో ప్రవేశించి, మెలపులతో, మలపులతో, చంక్రమణములతో పురోగమించు వానికి దారి యెప్పుడును కనిపించుచునే యుండును. వ్యక్తికి, వ్యక్తికి నడుమ తాను దూరిపోవుట కెపుడును సందుండును. ఇట్టి సదుపాయమునే కర్మయోగమునకు దిగినవారు కనుగొనగలరు. లేనివారు భయపడి చూచుచుందురు. కర్మాచరణమున నైపుణ్యమే కర్మయోగము. సంసార జాలమును దాటుట కదియొక్కటే మార్గము. కర్మతో బుద్ధిని జోడించి సాధన చేసినపుడు మాత్రమే బుద్ధి ఏక మార్గమున నడచును. చిత్తమున కేకాగ్రత లభించు మార్గమేది యని శ్రమపడువారున్నారు. కన్నులు మూసికొని జపించుట, యొకచోట మనస్సును నిలుపవలెనని యత్నించుట, ఇంద్రియములను దమించుకొనవలెనని కత్తికట్టుట, కోరికలను రానీయ కూడదని తలుపులు బిడాయించుట మున్నగు చర్యలలో కొందరు సాధకులు విరామము లేక శ్రమపడుచున్నారు. అట్లెంతకాలము శ్రమపడినను జన్మలు గడచుచుండునే గాని మనస్సు నిలువదు. ఇక బుద్ధి నందుకొనుట యెక్కడ? ఎన్ని నేర్చినను, ఎన్ని చెప్పినను నొక పని నాచరించుట యందు దేహమును, ఇంద్రియములను, మనస్సును నియోగించినపుడు మాత్రమే ఈ భిన్నాంశముల కేకముఖత్వము సిద్ధించు నవకాశమున్నది. ఒక కుటుంబమున తెలివిగలవారు పదిమంది యుండి, ఏ పనికిని దిగనిచో నొకరిలో నొకరికి తప్పులు కనిపించును. ఐకమత్యము సాధించుట యెట్లా యను సమస్య అందెవ్వరికిని తీరదు. అట్టి స్థితిలో వారి యింటిలో నొక పాము దూరె ననుకొనుడు; దానిని వెదకి చంపుటలో నందరికిని ఏకముఖత్వము అప్రయత్నముగా సిద్ధించును. భయముతో కూడిన పని నాచరించుటలోనే యింతమాత్ర మేకత్వము సిద్ధించినచో, ఇక సత్కర్మాచరణము ఫలితము చెప్పనేల? **(41)**

## క్షుద్రవేదవాదరతులు :

"ఒక పని చేసినచో దానివలన మన కేదైన కొంత లాభముండవలెను గదా! తన కుపయోగింపని పనిని చేయనేల?" అను తర్కము గలవారు సంసారజీవు లనబడుదురు. వీరి దృష్టిలో నేదైన వృత్తిచేయుట మన పొట్టకొరకే.

వ్యాపారము చేయుట మన లాభము కొరకే. ఉద్యోగము చేయుట మన బ్రతుకు తెరువు కొరకే. ఇట్టి దృష్టి వలన ఫలితముపై పట్టుదల పెరుగును. కాని అట్టి వారిచే వారిలో నున్న ప్రకృతి ఏమి చేయించుచున్నదో గమనింపుడు; ఉద్యోగము చేయుటలో ఇతరులకు ఉపయోగించు పని జరుగుచున్నది. వ్యాపారము చేయుటలో నితరులకు కావలసిన వస్తువుల నందించుట జరుగుచున్నది. ఇది అసలైన వినియోగము. స్వలాభము అను వ్యామోహమున్న వారిచే ప్రకృతి ఇతరులకు సేవ చేయించుచున్నది. కుక్కకు బెల్లపుముక్క చూపి ఇంటికి కాపలా యుంచినట్లు, సంసార జీవులకు ఫలితము అను భ్రాంతి కూడ సద్వినియోగ మగునట్లు చూపి, ప్రకృతి యితరులకు సేవ చేయించు చున్నది. దీనివలన నేమి తెలియుచున్నది? జీవుని ముఖ్య కర్తవ్యము ఇతరులకు సేవ. అముఖ్యమైన అంశము స్వలాభము. జీవుల కామక్రోధములు కూడ నిట్లే చక్కగా వినియోగపడుచున్నవి. ఈ సద్వినియోగము వలన జీవులు మను చున్నవి గాని స్వలాభాపేక్షచే కాదు. ఇది ప్రకృతి నెరపెడి ఇంద్రజాలములలో నొకటి. స్త్రీ పురుషులు కామము అను వాంఛకు దాసులై ప్రకృతికి కావలసిన గర్భధారణము, శరీరముల నిర్మాణము అనువానిని జీతము లేకయే, సమ్మెలు లేకయే, స్వయముగ సిద్ధపడి చేయుచున్నారు. ఇందలి మర్మమును తెలిసిన వాడు మాయకతీతుడై ఈ సద్వినియోగమునకు సంతోషముతో సహాయ పడును. ధర్మము వాని వెంటనంటి యుండును. ఇది తెలియక స్వలాభమునకు దాసుడై యాచరించువాడు నిరుత్సాహముతో నైనను అదే పనిని ఆచరింపక తప్పదు. దీని కతీతుడైనవాడు ఆచరించు సేవాధర్మమునకే కృష్ణుడు యజ్ఞార్థ మని పేరు పెట్టెను. దాని వలన బంధ విమోచనము కలుగును. ఫలాకాంక్షకు లోబడి చేయుటవలన మనస్సే మానవుని బంధించును. ఈ స్థితియే నరకము లేక కర్మబంధము. (42)

ఈ నరక కూపమున పడినవారు కార్యాచరణము చేయుచున్నప్పుడు దృష్టి ఫలితముపై నుండును. కనుక, ఆచరణముపై దృష్టి తగ్గి నైపుణ్యము నశించును. ఆచరణ కుంటుపడును. దానివలన కాంక్షించిన ఫలము కూడ దెబ్బతినును. ఇట్లు మొదటికే మోసము వచ్చును. తన్ను లోకము గుర్తింప లేదను అరణ్యరోదనము తప్ప ఇంకేమియు మిగులదు. ఇట్టివారు కాల

క్రమమున నొక ఫలితముల జాబితా నేర్పరచుకొనిరి. "ఈ పని చేసినచో ఇంత లాభముండును. ఇన్ని ఎకరముల పొలము దున్ని, ఇంత యెరువు వేసి, ఇన్ని విత్తనములు నాటినచో నింత ధాన్యము పండును. ఇంత డబ్బు లంచమిచ్చినచో ఇన్ని ఓట్లను కొనవచ్చును. ఈ క్రతుకర్మకు స్వర్గఫల ముండును. ఈ యాగము చేసినచో రంభా సంభోగముండును. ఈ వ్రతము చేసినచో స్వర్గమున కెక్క వచ్చును.'' ఈ విధమైన జాబితా నేర్పరచుకొనిన బుద్ధిమంతులే కామాత్ములు, స్వర్గపరులు అనబడుదురు. వీరే వేదవాద రతులు. వేదము పేరు, యజ్ఞము పేరు నుపయోగించి ఫలితములకై మిన్ను చూచువారు. దానబుద్ధి లేకయు ఎన్నికలలో నిలబడి లంచము రూపమున ఇష్టము లేని దానములు చేయువారు. వీరిచేత ప్రకృతి ఎన్ని పనులు చేయించు చున్నదో గదా! భోగములు, ఐశ్వర్యములు అను భ్రాంతితో వీరు అనేక క్రియా విశేషములను కనిపెట్టుచుందురు. బియ్యములో బెడ్డలు కలిపి అమ్ముట, ధరలను పెంచుటకు అర్ధశాస్త్ర ప్రయోగములను చేయుట మున్నగు ప్రణాళికల నెన్నింటినో తయారుచేయుచు క్లేశమార్గమున తమ కాలమును వ్యర్థము చేసికొనుచుందురు. **(43)**

ఇన్ని చేసినను వా రాశించిన సుఖము వారికి కలుగుచున్నదా? లేదు. కలుగకపోగా వారు పడిన శ్రమతో బాటు లోకనిందయు, లోకమును చూచి అనుక్షణము భయపడుచు బ్రతుకుటయు, ఆర్జించిన సంపదల ననుభవించు టకు తీరిక లేకుండుటయు ప్రాప్తించుచున్నవి. వీరు తమ దౌర్భాగ్యమునకు తోడు బుద్ధి యోగమును పరిహసింతురు. అనగా చేసిన కర్మకు రావలసిన లాభము తప్ప, మరియొక సుఖమేదియు లేదని వీరి వాదము. సత్కర్మయందు బుద్ధిని నియోగించుట, దానివలన కలుగు మోక్షమనబడు కర్మబంధ నాశము అనువాని రుచి వీరికి తెలియదు. కనుక మోక్ష మనునది లేదని వీరి మతము. చేసిన పని, దానికి లాభము తప్ప, శాశ్వతానందము, మోక్షము అనునవి వట్టి భ్రాంతియని ఈ వేదవాదుల చార్వాక సిద్ధాంతము. పొలముదున్ని, ఎరువు వేసి, విత్తనములు నాటినచో పంటపండి తీరును గనుక, నిక దైవమని ఏమున్న దని వీరి వాదము. వానలు కురియనిచో వారి గతి యేమగును? పురుగుపడి పంటలు ధ్వంసము చేసినచో వారి వాద మేమగును? తుఫానులు, గాలివానలు

వచ్చినచో నేమగును? కనుక ఈ ఫలవాదులు నిష్ప్రయోజకు లనియు, వారి వాదము పనికిరాదనియు కృష్ణుడు ఉపదేశించెను. ప్రతి మానవుడును లాభమునే కోరినచో మొత్తము మానవులకు జీవితము పోటీలు, యుద్ధములు, క్షామము లుగా పరిణమించును. అట్లుగాక యితరుల కుపయోగపడుటకు ప్రతి వ్యక్తియు నిష్కామముగా యత్నించినచో అందరికిని సుఖజీవనము అప్రయత్న సాధ్య మగును. అంతకన్న స్వర్గము లేదు. ఫలితము దానియంతట అది నడచి వచ్చును. ఫలితము వేశ్యవంటిది. దాని వెంటపడిన వానిని దరిద్రుని చేయును. లెక్కచేయని వాని వెంటపడును. ఒక యింటిలో నెవరికి కావలసిన పని వారు చక్కబెట్టుకొని, యితరుల యుపయోగమును లెక్కింపనిచో అందరును అన్ని పనులు చేసికొనవలసి యుండును. ఎవరి యన్నము వారు వేరుగా వండుకొనుట, ఎవరి అంట్లు వారు తోముకొనుట వరకు వచ్చును. అట్లుకాక, భర్తకు, బిడ్డలకు భార్య వంటచేసి పెట్టినచో, అందు తన తిండి కూడ అప్రయత్న ముగా సిద్ధమగును. ఆ తిండికి గింజలు భర్త సంపాదించ గల్గును. బిడ్డలు విద్యాభ్యాసము చేయుటకు వీలగును. ఇట్లే జగత్కుటుంబమునందు మన కార్యక్రమమును గూర్చికూడ యోచింప వలయును. ఇట్లుచేసిన పనినే కృష్ణుడు యజ్ఞార్థమునకు మొదటి మెట్టుగా బోధించెను.

కృష్ణుడు చెప్పిన వేదవాదరతులు, భౌతికవాదులు, ఓట్ల బిచ్చగాండ్ర వంటివారు. ఇందు కృష్ణుడు నిందించినది వేదవాదులనే గాని వేదములను కాదు. వేదోక్త కర్మలు స్వర్గఫలముకొరకు చెప్పబడినవి అని వాదించు దరిద్రులు వేదవాదులు. అమూల్యమగు వేదమును, దాని వినియోగమును తెలియలేక క్షుద్రముగా వినియోగించువారు - టెంకాయ కొట్టి కొబ్బరిపారవైచి, పెంకును నూరి ఉంగరములు చేసికొని అలంకరించుకొను వారి వంటివారు. ఇందు దోషము వారిదేగాని వేదమునకు సంబంధించినది కాదు. **(43)**

## భోగైశ్వర్యములు :

లోకమందు ఎక్కువమంది ఏ పని చేసినను భోగమును, ఐశ్వర్యమును ఉద్దేశించి చేయుదురు. సుఖపడవలెనను యుద్దేశ్యముతో లోకమున మానవులు దుష్కర్మలనో, సత్కర్మలనో ఆచరించుచున్నారు. ధనము సంపాదించుట,

గృహ నిర్మాణము చేయుట, శయ్యాసనాదులను లభ్యపరచుకొనుట సుఖమును గురించియే. రుచికరమైన ఆహారము జిహ్వకు సుఖము కొరకే. తనవారిని పోషించుట, బిడ్డలకు విద్య నేర్పుట తన మానసిక సుఖము కొరకే. అట్లే ఐశ్వర్యము నార్జించుటకు యత్నించుట గొప్ప కొరకు. గొప్ప యన్నది మానసిక సంతృప్తి కొరకు. ఇట్లు దృష్టి భోగము పైననో, ఐశ్వర్యము పైననో ప్రసక్తమై యుండి, ఎక్కువమంది తమతమ పనులు చేయుచున్నారు. వారి మూలమున ఆయా పనులు జరుగుచున్నవే గాని వారు కోరిన భోగము, ఐశ్వర్యము మాత్రము నీటి బుడగలవలె వారిని భ్రమ పెట్టి, శ్రమ పెట్టుటకే పనికివచ్చుచున్నవి. ఇందొక రహస్య మిమిడియున్నది. ప్రకృతి తనకు కావలసిన పనులు జీవులచే చేయించుకొనును. ఆ జీవులు తమ తమ స్వభావములకు బద్ధులై తాము కలలు గనుచున్న భోగైశ్వర్యముల కొరకు ఆయా పనుల నాచరించుచున్నారు. ఈ మార్గము వలన ప్రకృతికి పని జరిగిపోవుచున్నదిగాని జీవులు కోరినది లభ్యపడుటలేదు. ఉదాహరణకు ఒకడు ధనము కూడబెట్టి, ధనికుడైనప్పుడు వాని కొడుకులో, మిత్రులో, ప్రభుత్వమో దానిని చేజిక్కించుకొని వ్యయము చేయుచున్నారు.

చిత్తశాంతికై దైవము నారాధించు వారిలోను, శాస్త్రోక్త కర్మల నాచరించు వారిలోను కూడ నెక్కువమంది యిట్లే ఆచరించుచున్నారు. కనుక, పదిమందికి పనికివచ్చు సత్కర్మలు జరిగిపోవుచునే యున్నవి. ఆచరించు వారికి లక్ష్యమైన చిత్తశాంతి మాత్రము చేకూరుట లేదు. ఇట్టివారందరి మనస్సు భోగము, ఐశ్వర్యము అను ఎండమావులలో ప్రయాణము చేయుచుండును కనుక, తాము చేసిన కర్మలచే సంస్కరింపబడదు. అట్టివారికి కర్మలు తమ వాసనల నంటించునే గాని మనస్సును పరిశుద్ధిచేయవు. భోగము చేతను, ఐశ్వర్యము చేతను సంగము మిక్కిలిగా చెందువారు భోగైశ్వర్య ప్రసక్తులు. వారి చేతస్సు వానిచే నపహరింపబడును. ఇక కర్మాచరణమునకు గాని, కర్మసంగ పరిత్యాగమునకు గాని బుద్ధి పనిచేయదు. కర్మాచరణమునందు బుద్ధి పని చేయనిదే కౌశలము చేకూరదు. కౌశలము లేనిదే కర్మలంటకుండు విధానము లభ్యము కాదు. ఉదాహరణకు ఒక వృత్తి చేయు వ్యక్తికి మనస్సు ఫలితము పైనున్నచో, వృత్తి కర్మాచరణమును సవ్యముగా చేయలేడు. మనస్సు ఫలితము

నందు కలలు గనుచుండగా వృత్తి దెబ్బతినును. సంగము హెచ్చుట, కర్మసిద్ధి భ్రష్ట మగుట రెండును నొక్కమారే ప్రాప్తించును. అట్లుకాక కర్మాచరణము ఇతరులకు పనికివచ్చుటకు అని జ్ఞప్తి యుంచుకొనినచో, దృష్టి ఫలముపై నుండదు. లోకహితార్థమైన కర్మయెప్పుడును వర్ధిల్లును. ఫలితముపై సక్తము కానట్టి మనస్సు బుద్ధియందు లయించును. దానితో ఇంద్రియ ప్రవృత్తులు కూడ లయించును. అట్లు లయించిన బుద్ధియే చేతస్సును కర్మనుండి విమోచనము చేయగలదు. అట్లు విమోచనము పొందిన బుద్ధియే స్థిరచిత్తము నకు కారణము. ఈ విధమైన సాధన చేయుటయే కృష్ణుని పరిభాషలో 'వ్యవసాయము' (వి + అవసాయము), అనగా విశిష్టముగా పర్యవసానము చెందునట్టిది అని యర్థము. కర్మను దాని యాచరణమును ఇట్టి బుద్ధితో సంధానము చేయుటయే బుద్ధియోగము. దానివలన కలుగునట్టి స్థితియే సమాధి. వ్యవసాయాత్మకమగు బుద్ధి యొక్కటియే సమాధియందు విశిష్టముగా లీనమగును. అట్టి స్థితిలో నింద్రియములు, మనస్సు బుద్ధియందు లయమై, బుద్ధి స్వరూపుడగు 'తన' చే కర్మాచరణము జరుగును. అప్పుడు ప్రకృతి యుద్దేశించిన జగద్ధిత కర్మ మాత్రమే జరుగును గనుక కర్మ సంగము నశించును. **(44)**

## త్రిగుణము - నిత్యసత్త్వము :

వ్యవసాయాత్మకము కాని బుద్ధి అనేక శాఖలుగా పరుగెత్తును. తాత్కాలిక సదుపాయము, ఎప్పటికప్పుడు తప్పించుకొనుట సంకల్పములుగా కర్మ జరుగుచుండెను. అప్పుడు భోగైశ్వర్యములపై మనస్సు ప్రసక్తమగును. దానివలన కామ క్రోధ భయ లోభాదులు మనస్సుయొక్క వికారములుగా నుద్భవించి, బహు శాఖలుగా పరుగెత్తుచుండును. వివిధ కర్మలు నిర్దిష్టఫలముల కొరకే యని విశ్వసించు స్వర్గపరులు ఎప్పుడును దుస్థితిని పొందుచున్నారు. నిత్య జీవితమున బుద్ధిగాక మనస్సు పనిచేయుచుండుట వలన కర్తవ్యబోధ నశించును. లోకమున నాచరింప వలసిన కర్మల నంటియే వాని యనుభవ రూపమున విజ్ఞానముండును. ఆ అనుభవము భోగైశ్వర్య దృష్టి మూలమున మనస్సుచే కలుషితమైనప్పుడు తాను పొందు విజ్ఞానము కూడ కలుషితముగా నుండును. ఈ కాలుష్యము సత్త్వ రజస్తమస్సులు అనబడు త్రిగుణముల

యొక్క సమ్మిశ్రమున నేర్పడిన తన ప్రకృతి ననుసరించి యేర్పడును. అట్లు జ్ఞానమంతయు త్రిగుణములు లక్ష్యములుగా కలుషిత మగుచుండును. జ్ఞానమే వేదము. బుద్ధి, యోగము చెందనివారికి ఈ వేదము తన త్రిగుణములచే కలుషితమగును. అట్లుకాక కర్మాచరణ కౌశలమునందు లోకహితార్థమై మనసును వినియోగింపగా, ఆ మనస్సుతోపాటు త్రిగుణములు కరగిపోయి, వేదము పరిశుద్ధముగా భాసించును. కామాత్ములు స్వర్గపరులునగు భోగైశ్వర్యాసక్తులు సత్కర్మ లాచరించినను తమ త్రిగుణములచే నవి కలుషితములగుచుండును. ఈ విధమైన పూజార్చనారాధనా విశేషములు, పాండిత్యము, యజ్ఞ యాగాది కర్మలును కూడ నిష్ఫలము లగును. పానీయము మంచిదైనను పాత్ర చిలుము పట్టినదైనచో పానీయ మిముడక వాంతి యగుట లోకసిద్ధము. అట్లే సత్కర్మలు కూడ ఫలదృష్టిచే దుష్కర్మలై భ్రమ ప్రమాదాదులకు, భయలోభాదులకు కారణ మగుచున్నవి.

మనస్సు నుండి పనిచేయు కామాత్మునకు ద్వంద్వములు సాక్షాత్కరించును. ద్వంద్వము లనగా సుఖ దుఃఖములు, లాభా లాభములు, జయాపజయములు మున్నగు జంటలు. మనస్సుతో పని చేయుచున్నంత కాలము నివి తప్పవు. వీనినుండి బుద్ధిలోనికి చేరుకొనుటయే నిత్య సత్త్వస్థితి. ఫలితము నుండి మనస్సు లోకహితమునకు చేరుకొన్ననే గాని ఇది సాధ్యము కాదు. ఇట్లు చేరుకొన్నప్పుడు గల సమాధి స్థితిని సత్త్వము అందురు. ఇది రజస్తమస్సులు కరగిన వెనుక నిలబడు సత్త్వము గనుక కృష్ణుడు దీనిని నిత్య సత్త్వము అనెను. ద్వంద్వమున రజస్తమస్సులు పనిచేయును. ద్వంద్వములు కరగినపుడు శుద్ధ సత్త్వము పనిచేయును. అప్పుడున్న జీవి మనస్సు కలవాడు, ఇంద్రియములు కలవాడు కాక, 'తాను' కలవాడు అగును. అతడే ఆత్మవంతుడు. రామాయణమున రాముని సత్త్వ స్థితిని వర్ణించుచు వాల్మీకి '*ఆత్మవాన్ కో జితక్రోధః*' అని కీర్తించెను. సమాధి యను పదమునకు తన యందు తానధిష్ఠించి యుండుట అని యర్థము, అనగా మనస్సు మున్నగునవి యధిష్ఠింపరాదు. (45)

**ఆత్మవంతుడు :**

వేదగ్రంథము వలన వేదము తెలియును. అనగా మానవుడు,

బ్రహ్మాండము అను నంశములు తెలియును. అధ్యయనము చేయవలసినది వేదగ్రంథము. అనుష్ఠానము చేయవలసినది వేదము. త్రిగుణములు, పంచ భూతములు, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, ప్రాణము, శరీరము; స్థూల సూక్ష్మభేదములు మున్నగు సృష్టిలోని పుటలన్నియు కలిసి వేదమగును. వేదాధ్యయనము చేసిన బుద్ధిమంతుడు వేద గ్రంథమును ద్వారముగా గుర్తెరిగి, తన్మార్గమున వేదముల లోనికి ప్రవేశించును. అట్లు చేయునపుడు వానికి తోడ్పడుచు, వానితో కూడి ప్రయాణము చేయునది వేదమును గూర్చిన తన యభిప్రాయము. ఇది త్రిగుణములతో కూడి యుండును. బుద్ధిమంతుడు త్రిగుణములు అను పుటలపై వేదమును గ్రహించినపుడు పుటలను విడచి వేదమును గ్రహింపవలెను. ఏ గ్రంథమైనను పుటలు లేనిది చదువుటకు వీలు పడదు. కాని చదువునది పుటలు కాదు. అట్లే తన యభిప్రాయము అను త్రిగుణాత్మకమైన ప్రకృతి లేనిది వేదమును దర్శించుటకు వీలుపడదు. కాని దర్శింప వలసినవి త్రిగుణములు కావు. మానవుడార్జించు విజ్ఞానము సమస్తము నకు త్రిగుణములు లక్ష్యములై యుండును. "వాడు చదివెను గనుక నేను చదువవలెను" అనుటలో రజోగుణము లక్ష్యము. "వాడెవడు చదువుటకు ? నేను తిన్నగా చదివెదను" అనుటలో తమోగుణము లక్ష్యము. "చదువు వలన జ్ఞానము కలుగును" అనుటలో సత్త్వగుణము లక్ష్యము. ఇట్లు లక్ష్యములుగా బయలుదేరిన వేద జిజ్ఞాస క్రమముగా నిస్త్రైగుణ్యము కావలెను. అప్పుడు వేద ముపాసించినవాడు ద్వంద్వములు లేనివాడగును. అనగా "జీవించుట కష్టసాధ్యము", "జీవించుట సుఖపడుట కొరకు" మున్నగు దృక్పథములు ఆవిరిగా హరించి, జీవించుట యను శాశ్వత సత్యము మిగులును. అప్పటి యనుభూతియే నిత్యసత్త్వము. ఇట్లు పొందినవాడు ఆత్మవంతుడు అనబడును. అనగా వేదమే తానైనవాడు. **(46)**

## కర్మ - కర్మఫలము :

బావులలో, చెరువులలో, కాలువలలో, నదులలో, మబ్బులలో జల మున్నది. నీకు దప్పిక కలిగినప్పుడు నీకు కావలసిన జలమే ముఖ్యముగాని, ఈ చెరువునందెంత జలమున్నది మున్నగు నంశములు ముఖ్యములు కావు. నీకు కావలసిన పాత్రమైన పాత్రతో స్వీకరించి గ్రోలుట క్షేమముగాని,

కుతూహలముతో చెరువులో దుముకుట క్షేమము కాదు. అట్లే త్రిగుణములతో కూడిన ఈ సృష్టి యనబడు వేదమునందు నీకు హితమైన వేదమే శ్రేయము గాని, నీ ప్రకృతిలోని త్రిగుణములతో నీకు ప్రయోజనము లేదు. సర్వ వేదము నందును ఇట్లు ప్రవేశించి యానందించువాడే తెలిసినవాడు లేక బ్రాహ్మణుడు. అనగా నీకు కర్మల నాచరించుటయం దధికారమున్నది గాని, ఆ కర్మఫలముల వైఖరుల పరిశీలనాసక్తుల యందు నీ కధికారము శ్రేయము కాదు. నౌకరీ చేయువాడు చేయవలసిన పనిని చేయుట వరకే ప్రసక్తి కలదు గాని, దాని యితర చింతలతో ప్రసక్తి లేదు. వైద్యుడు చెప్పిన ఔషధమును రోగి కిచ్చుటయే కంపౌండరు పనిగాని, ఈ ఔషధము రోగికి తగునా, తగదా యను నంశము లతో నతనికి సంబంధము కలుగరాదు. అంతే కాదు; సృష్టికర్మ నిర్వహింప బడుటకు స్త్రీ పురుషులు దాంపత్యము నిర్వహింపవలెనని ప్రకృతి ఆశించినది. దాని నిమిత్తమై కామమును జీవులకు కల్పించినది. మానవుడు కామముచే ప్రేరేపింపబడి దాంపత్యము చరించును. ఇది త్రిగుణములతో ప్రకృతిని సేవించుట కుదాహరణము. కాని, ప్రకృతికి కావలసిన ధర్మము నెరిగి కామము లేకయే దాంపత్యము చరించుట- త్రిగుణముల కతీతముగా వేదధర్మమును సేవించుట. ఇందు దాంపత్య ధర్మానుష్ఠానమే ముఖ్యము తప్ప, కామ సంతుష్టియో, సంతతి కలిగెనా లేదా యని విచారించుటయో కాదు. ఇట్టి దాంపత్యమే గార్హస్థ్యము అనబడు పవిత్ర వేదధర్మ మగుచున్నది.

కర్మానుష్ఠానము చేయునపుడు నీవు ఆ కర్మఫలమునకు కూడ కారణము కారాదు. వాణిజ్యము చేయువాడు పదార్థములను విక్రయించుట వలన కొనువారికి పదార్థములు లభ్యమగుచున్నవి. అయినను వారి కవి లభ్యమగుటకు అతడు హేతువు కాదు. త్రెడ్డుచే భోక్తలకు పాయసము వడ్డింపబడు చున్నప్పుడు త్రెడ్డు వారి భోజనమునకు కారణము కాదు. మిక్కుట ముగా భుజించినవానికి కడుపునొప్పి వచ్చినచో దానికి త్రెడ్డు బాధ్యత వహింపదు. ఇచ్చట నుపకరణముగా మాత్రమే త్రెడ్డు పనిచేయుచున్నది. వాణిజ్యము చేయువాడు తనకు గిట్టనివానికి పదార్థము నమ్ముటకు నిరాకరించె ననుకొనుము. అప్పుడతనికి పదార్థము నందింపక పోవుటకు అతడు హేతువగు చున్నాడు. పూర్వము ఒక ముని శాపమునకు విధేయుడై తక్షకు డను సర్పరాజు

పరీక్షిత్తును చంపుటకు పోవుచుండెను. అప్పుడు పరీక్షిత్తును రక్షించుటకు ఒక బ్రాహ్మణుడు కూడ పోవుచుండెను. తక్షకుడా బ్రాహ్మణునికి లంచమిచ్చి మరలించి పంపెను. ఈ కారణమున పరీక్షిత్తును చంపిన కర్తృత్వము తక్షకునిపై పడినది. తక్షకుని వ్యక్తిగత ద్వేషము వానిని కర్మఫల హేతువుగా చేసినది. అది లేక శాపమునకు విధేయుడై సూటిగా కరచియే పోయినచో పరీక్షిత్తు చని పోయినప్పుడు తక్షకునికి కర్తృత్వ మంటియుండెడిది కాదు. క్రోధముతో హత్య చేసినచో తన క్రోధమువలన నతడు హత్యయను ఫలమునకు కారణమగును. కనుకనే హత్యానేరమునకు తగిన శిక్ష కతడు పాత్రుడని చట్టము తెలుపు చున్నది. యుద్ధరంగమున వందమందిని చంపినను తన క్రోధాదులు హేతువులు కాలేదు గనుక శిక్ష లేదని ఆ చట్టమే తెలుపుచున్నది. ఈ విధముగా ఏ పని చేసినను కర్మఫలముపై నపేక్ష యుండుటగాని, యొక ఫలితమునకు తాను హేతువగుట గాని పనికి రాదు. అట్లు హేతువగుట వలన దానికి సంబంధించిన రాగద్వేషములు తన్ను కలుషితము చేయును. దీనినే కర్మ యంటుట అందురు. ఇట్లు అంటక ఆచరింపబడు కర్మ నిష్కామ కర్మ యనబడును.

స్వధర్మానుష్ఠానము నిష్కామకర్మగా నాచరించినవాడే కర్మ యంటుట లేక విముక్తు డగుచున్నాడు. ఇట్లు కర్మలలో నున్న వేదధర్మము నెరిగి, వాని నాశ్రయించియున్న త్రిగుణాత్మక దోషము నెరిగి, కర్మ నాచరించి దోషమును పరిహరింపవలెను. దోషమున్నది గనుక కర్మ నాచరింపను అనుట కూడ పొసగదు. రుచులు అలవాటగును గనుక, రుచికరమైన భోజనము చేయనని బిగించుకొనరాదు. అట్లు చేసినచో భోజనము మానినను, రుచికై మనసు ప్రాకులాడుట జరుగును. అనగా దోషమంటుట తప్పకపోగా, కర్మభ్రష్టతకూడ కలుగును. కర్మలు మానుటవలన కర్మఫలములు అంటక మానవు. కర్మ మాచరింపకూడదు అను కోరికకూడ సంగమే గనుక, కర్మలు మానినను సంగ మంటుచున్నది. ఇదే ఉభయభ్రష్టత్వము. సత్కర్మాచరణము వలన అకర్మ సిద్ధించును గాని కర్మభ్రష్టత వలన సిద్ధింపదు.

**బుద్ధిమంతుడు :**

ఏదైన నొకపని చేయబూనినపుడు దాని ఫలిత మెట్లుండునని యూహించుట లౌకికము. ఫలిత మనుకూలమైనచో దానికై కృషి చేయుట, కానిచో మానుట ఎక్కువమంది చేయుదురు. కాని సులభముగా కార్యసిద్ధి

కలుగునని దుష్ఫలితము లిచ్చు పనులు చేసినచో దుఃఖము సులభముగా సంక్రమించును. ఫలితము కష్టసాధ్యమని సత్ఫలితము లిచ్చు పనులు మానినచో కష్టము నుండి తప్పించుకొనబోయి సత్ఫలితమును జారవిడచుట జరుగును. సులభముగా తేలు కుట్టుచున్నది గదా యని దాని కొండివైపునకు కాలు జాపవచ్చునా? వాణిజ్యమున నెక్కువ లాభము కలుగవలె నన్నచో కష్టపడవలసి యుండునని మానినవాడు సోమరి. వానిని సిరి వరింపదు. అట్లుకాక, ఫలితముపై మనస్సు పెట్టి కష్టపడినచో ఫలితము దక్కినప్పుడు కూడ మరియొక విధమున దుఃఖమే కలుగును. ఎటు చూచినను కార్యసిద్ధిపై దృష్టి పెట్టినచో దుఃఖము తప్పదనుట తథ్యము.

ఫలితమును గూర్చి యాలోచింపక తానొక మంచిపని చేయ నారంభించిన వానికి దుఃఖ మెన్నడును కలుగదు. ఫలితము కలిగినపుడెల్ల కోరని సుఖ మప్రయత్నముగ లభించును. కనుక కార్యసిద్ధిని, అసిద్ధిని సమానముగా విడచినప్పుడు బుద్ధి తన సహజ వికాసమును కలిగి వెలుగొందును. అట్టి బుద్ధి నాశ్రయించి పనులు చేసినవాడే సమత్వము నవలంబించినవాడు. ఇట్టి సమత్వమే యోగ మనబడును. యోగ మనగా ఫలితముల వెంట పరుగెత్తబోవు మనస్సును ఫలస్పర్శలేని బుద్ధితో జతపరచి, ఆ బుద్ధి చెప్పిన మార్గము ప్రకారము నడచుకొనుట. మనస్సును బుద్ధినుండి ఇంద్రియముల వైపునకు విడచి పెట్టినచో మరల మరల ఫలితములపై నాశ అంటుకొనుచుండును. ఇట్లు అంటుకొనుటనే సంగము అందురు. దీని ప్రభావము వలననే తనవారు - పైవారు, మిత్రులు - శత్రువులు అను భేదము లేర్పడుచున్నవి. ఉన్నవారందరు తన వలె వ్యక్తులే యైనను, ఈ భేదము రంగుల కంటిజోడువలె సంగ దోషమున తన మనస్సు నాశ్రయించి, ఇతరులపై మనకు కలిగిన యభిప్రాయముల నావరించి వర్తించుచున్నది. (48)

కర్మాచరణమున కెప్పుడును బుద్ధితో యోగము చేయుట ఆవశ్యకము. బుద్ధి నుండి కర్మ యెప్పుడును వేరు చేయబడరాదు. మనస్సు, నింద్రియములు కలసి యొక గోడవలె బుద్ధి నుండి కర్మను వేరుచేయు చుండును. అప్పుడు ఎడనెడ కలుగుచుండు ఫలాసక్తి దీనత్వము కలిగించు చుండును. బుద్ధి మంతుడు నిరంతరము బుద్ధినే శరణు పొందవలెను. బుద్ధి నుండియే దైవము

కర్తవ్యమును నిరంతరము బోధించుచుండును. బుద్ధియోగము గలవానికి కర్తవ్యాకర్తవ్య వివేచనమునకై శాస్త్ర పరిశీలనా క్లేశము అనావశ్యకము. బుద్ధి యోగము చేసినవాడు అప్రయత్నముగనే కర్మఫలితములను విడచిపెట్టు చున్నాడు. ఈ మార్గమున కర్మాచరణమునందు అప్రయత్నమైన నేర్పరితనము కూడ నలవడి నిరంతర విజయమునకు దారితీయును. వైద్యునకు రోగి చని పోవునను దిగులున్నచో సరియైన ఔషధము మనస్సునకు స్ఫురించదు. మందు పనిచేయుటను గూర్చిన తహ తహ లేకుండ బుద్ధి నాశ్రయించినచో తన వైద్య ప్రక్రియ యందు క్రొత్త నేర్పరితనము అప్రయత్నముగ నలవడును. సర్వకర్మల యందు ఏర్పడిన యీ క్రొత్త నేర్పరితనమే యోగ మనవచ్చును. యోగులనగా బుద్ధిమంతులని అర్థము. వారికి కర్మఫల బంధచ్ఛేదము కలుగు టతో జన్మ బంధము నుండి కూడ విమోచనము కలుగును. తానెందుకు జన్మించితినని యాలోచన చేయనారంభించినవాడు పరిష్కారము లభింపని వ్యర్థ జీవితము గడపి చనిపోవును. రైలుబండిలో దూర ప్రయాణము చేయు చున్నవాడు బండిలో కూర్చుండి గంటలు, నిముషములు లెక్కించినచో ప్రయాణమంతయు విసుగుతో నరకమైపోవును. ఈ కాలమును మనమెట్లు గడుపవలెనని యోచించువాని గతికూడ నంతియే, అట్లుగాక సద్గ్రంథ పఠనమో, విలాసార్థమై తోటి ప్రయాణీకులతో చతుర సంభాషణమో, పేకాటయో ప్రారంభించినపుడు ఏమి చేయవలెనను ప్రశ్న పుట్టదు. విసుగు కలుగదు. ప్రయాణము జరుగు చుండుటయు తెలియదు. గమ్యస్థానము చేరగనే ప్రయాణ మైపోయినదని మాత్రము గమనించును. అట్టి వానికి ప్రయాణము ఒక బంధము కాదు. అట్లే యోగికి జన్మము కూడ బంధము కాదు. బుద్ధిమంతు లిట్లు జన్మబంధ విమోచనము పొంది, తమ కేదియు సోకని స్వచ్ఛమైన నిర్లిప్త మైన స్థితిని పొంది జీవితమును చక్కబెట్టుకొను చున్నారు. వారు జన్మలను గడపుట మాని జీవితము నానందముగా ననుభవించు చున్నారు.**(49, 50)**

మనస్సు ఇంద్రియముల మూలమున దృశ్యమానమైన జగత్తు ననుభ వించునపుడు మోహమను మరియొక లక్షణము కూడ సోకును. మోహ మనగా నొక వస్తువు మరియొక వస్తువువలె కనిపించుట. ఇంద్రియములకు, మనస్సు నకు దైవము తన చుట్టునున్న లోకమువలె మోహము గొలుపును. అణు

సముదాయములే కంటికి గోడలు, స్తంభములు, మనుష్యులు, సూర్యచంద్రాదుల వలె కనిపించుచున్నవి. సత్యమునకీ యణువులన్నియు దైవముచే అంతర్బహిర్వ్యాప్తములై యున్నవి. కాని అవియే మోహ దృష్టికి గృహ క్షేత్ర ధనదారాదులుగా కనిపించుచున్నవి. దానితో నహంకార మమకారములు, రాగద్వేషములు, కామక్రోధములు కలుగుచున్నవి. ఇట్లు మిథ్యయగు జగత్తు చూడబడి మనస్సునకు, నింద్రియములకు మోహము కలిగించి, వానితో సంసర్గము చెందిన మానవునకు దుఃఖము కలుగుచున్నది. బుద్ధియే మనస్సునకు నింద్రియములకు దిగివచ్చి శరీరముచే కర్మాచరణము చేయించుచున్నప్పుడు మోహ మనబడు పంకము తొలగిపోవును. అట్టివాని దృష్టిలో సాధించిన పనికిని, సాధింపవలసిన పనికిని భేదముండదు. తిన్న రుచికిని, తినవలసిన రుచికిని భేదము లేదు. తెలిసినదానికి తెలియవలసిన దానికి భేదము లేదు. అంతయు జ్ఞానమయమే యగును. పుట్టినవానికిని పుట్టవలసిన వానికిని భేదము లేదు. చనిపోయిన వానికిని, చనిపోని వానికిని భేదము లేదు. సృష్టి సమస్తము అఖండమగును. జీవితము శాశ్వతమగును. విడిగా కనిపించు వస్తువులకును, వాని నడుమ భాసించు ఆకాశమునకును కాలమునకును భేదము లేదు. సర్వ మఖండ మగును. తనకును మిగిలిన సృష్టికిని భేదము లేదు. సర్వ మంతర్యామి యగును. ఇట్టి స్థితినే సమాధి యందురు. దీని ననుభవించు స్థితియే ఆనంద మనబడును. యోగి జీవితమునకు ఆనందము సహజ గుణము. దాని కితర భావముల స్పర్శ లేదు. **(51, 52)**

**సమాధి స్థితి :**

సుడిగాలికి పండుటాకులు గాని, ధూళిగాని పై కెగిరినప్పుడు గాలి సుడుల యొక్క ఆకారము మన కంటికి కనిపించును. వట్టి గాలియే ఎగురుచున్నప్పుడు కనిపించదు. ధూళిని బట్టి గాలికి కనిపించుట లేక ఇంద్రియ గోచరమగుట అను ధర్మము సోకుచున్నది. ధూళి లేక స్వచ్ఛముగా నున్నప్పుడు గోచరము కాకుండుట అను ఆకాశధర్మము సోకుచున్నది. వర్షపునీరు చెరువులో వర్షింపగా బురద కలిసినప్పుడు బురదనీరు కనిపించును. నీరు స్వచ్ఛమైనపుడు నీరు కనిపించక దాని లోపల, అవ్వలనున్న వస్తువులు కనిపించును. మట్టి సంసర్గముచే నీటికి గోచరమగుట అను ధర్మము సోకుచున్నది. శుద్ధముగా

నున్నప్పుడు కనిపించకుండుట, అవ్వలి వస్తువులు కనిపించుట అను ఆకాశ ధర్మము సోకుచున్నది. అట్లే మన చెవులలో అనేకులు చెప్పిన వాక్యములు పడినప్పుడు వాని యర్థము సోకి మన ప్రజ్ఞ మనస్సుగా వర్తించి గోచరించు చున్నది. ఆ వాక్కుల అర్థము ననుసరించి ఇంద్రియ ద్వారముల నుండి ప్రజ్ఞ బహిర్ముఖ మగుచున్నది. అప్పుడు దానికి గోచరము కాకుండుట అను ఆత్మ ధర్మము సోకుచున్నది. ఇట్టి స్థితిలోని ప్రజ్ఞ బుద్ధి యనబడును. తనకన్న భిన్నమైన శబ్దాదులను ఇంద్రియముల పేర గమనింపగలిగినది మనస్సు. తనయందు తాను ఇమిడి నిద్రింపకుండియు మరియొక దాని సంసర్గ మెరుగ నిది ఆత్మ. ఈ రెండింటి నడుమ అనుసంధానము చేయునది బుద్ధి. ఈ బుద్ధి సహాయముననే జీవుడు మనోధర్మము నుండి ఆత్మ ధర్మమునకు చేరవలెను.

మనము వినుచున్న ప్రతి సంభాషణము నొక్కొక్క యర్థమును టీకా తాత్పర్యములుగా, కర్త, కర్మ, క్రియలుగా మన ప్రజ్ఞకు చేర్చి ప్రజ్ఞను చిత్తవృత్తిగా మార్చుచుండును. అనగా మనస్సు అను స్థితిలోనికి మార్చుచుండును. దానిని బట్టి మరల మననుండి అభిప్రాయములు ప్రత్యుత్తరముల రూపముగా వెలు వడవచ్చును. మనస్సు నుండి బయలుదేరిన యభిప్రాయములు వినువారిలో కూడ మనస్సునే ప్రేరేపణ చేయును. రేడియో ప్రసార కేంద్రమున నే పాట పాడబడుచున్నదో అదియే రేడియోలో నుండి వినబడును గదా! అట్లే మనస్సు నుండి బయలుదేరిన ప్రత్యుత్తరములు వాక్కులుగా ప్రయాణము చేసి విను వారి మనస్సునకే సోకి, మరల చిత్తవృత్తికే కారణము లగును. ఇట్లు ఇరువురి లోని ప్రజ్ఞ రెండు మనస్సులుగా వర్తించి ఇద్దరుగా మాట్లాడుకొనుట జరుగు చున్నది. ఇదియొక శ్రవణేంద్రియమునకు మాత్రమే సంబంధించిన కథ. ఇట్లే పంచేంద్రియములకును సంబంధించిన చిత్తవృత్తు లున్నవి. అవి కొల్లలు కొల్లలుగా మన జాగ్రదవస్థ మొత్తములో నిండి యుండును. వాని వలననే కామక్రోధాదులు, వానిచే కలుషితములైన సంకల్పములు, సుడిగుండములై మనస్సులతో తిరుగుచుండును. ఈ సుడిగుండములతో నిండిన కల్లోలమే సంసార సాగరము. దానిచే సుఖ దుఃఖాదులు పొంది వ్యామోహితులై జీవులు పుట్టుట, చచ్చుట అను బుడగలుగా లేచి బ్రద్దలగుచున్నారు. వాని మార్గము

నుండి బుద్ధిమంతుడు వెనుకకు మరలవలెను. పంచేంద్రియముల ప్రవృత్తులకు తన ప్రజ్ఞ గురికాకుండా చూచుకొనవలెను. తనకు తాను గుర్తున్నప్పుడు ప్రజ్ఞ తానై యుండును. తనకన్న ప్రజ్ఞ వేరుగా నుండదు. అప్పుడు అది పంచేంద్రియ గోచరము కాకుండును. ఇంద్రియములు వేరుగా నుండక వాని ప్రవృత్తులు తనయందు లీనమగును. మనస్సుగా నీవలకు ప్రవహించి వచ్చిన మనస్సుయొక్క తోకలే ఇంద్రియ ప్రవృత్తులు. నదీ ప్రవాహము కాలువగా మరలించు చోట దాని నరికట్టినచో మరి కాలువ యనునది యుండదు గదా! అట్లే ప్రజ్ఞ. తానుగా నున్నప్పుడు మనస్సు ప్రజ్ఞగా లీనమగును. అప్పుడున్న మొత్తమే బుద్ధి.

ఇతరుల వాక్యములు, ముఖములు, ఆకారములు, కవళికలు, ఆహార పదార్థముల రుచులు, పంచేంద్రియముల నాకర్షించి మనస్సు నీవలకు లాగు చుండగా వానినుండి చిత్తవృత్తి నిరోధము చేయుట యెట్లు? అను నంశము ముందుముందు చక్కగా వివరింపబడును. చిత్తవృత్తి నరికట్టుట సాధ్యమే. తనయందు తా నుండుటయు సాధ్యమే. రైలులోనో, బస్సులోనో పదిమంది నడుమ ఇద్దరు కూర్చుండి పేకాట మొదలుపెట్టగా నితరుల సంభాషణ వారికి వినిపించునా? అవి భౌతికముగా కర్ణ రంధ్రములలో పడుచుండునే గాని శ్రవణేంద్రియము పనిచేయదు. ఒక బలమైన ఇతర సంకల్పము పరిసరముల ప్రభావము నుండి మనస్సును మనలోనికి మరల్చగలదని పై జెప్పిన సన్నివేశము వలన తెలియుచున్నది. కాని పేకాట వంటిది గాక, మరియొక సుప్రశస్తమైన సంకల్పము వలన నిది జరుగవలెను. అప్పుడు బుద్ధి నిశ్చలమై నిలచును. చలస్థితిలో మనస్సనబడు ప్రజ్ఞయే నిశ్చలస్థితిలో బుద్ధి యనబడును. ఇట్టి స్థితిని నిరంతర మభ్యసించుట సాధ్యము. దానికి ప్రశస్తమైన కారణము 'నేను' అను శబ్దమున కర్థమైన వెలుగు. ఈ వెలుగును స్మరించుకొొలదియు నిశ్చలత్వ మబ్బును. మొత్తము వెలుగుగా మారుటకూడ సంభవము. అట్టి స్థితినే సమాధి యందురు. 'యోగమనగా చిత్తవృత్తి నిరోధము' అని పతంజలి నిర్వచనము చేసెను. ఈ నిర్వచనము భగవద్గీత ననుసరించియే చేయబడినది. ఈ యోగమునకు సాధనక్రమము ఎనిమిది యంగములుగా నుండును. దీనినే అష్టాంగ యోగమనియు, రాజయోగ మనియు కూడ చెప్పుదురు. ఈ ఎనిమిది

స్థితులలో చిట్టచివరి దానిని 'సమాధి' యందురు. సమాధియందు బుద్ధి అచలమై యుండును. దీనికొరకై చేయవలసిన సాధన 'నేను' అను వెలుగునందు మనస్సును జతపరచుట. యోగమను మాటకు 'జతపరచుట' అనియు అర్థము. 'నాది' అనబడు బాహ్య వస్తుసంపద నుండి 'నేను' అనబడు వెలుగునకు దారి- దీపపు వత్తినుండి దీప జ్యోతిలోనికి దారివలె నుండును. 'నేను' అను వెలుగునకు మనస్సును జతపరచుటకు సంకల్పశక్తి కావలెను. అది దీపము లోని చమురువలె వర్తించు ప్రాణశక్తి. మనస్సు సహాయముతో ప్రాణశక్తిని వినియోగపరచుటయే సంకల్పించుట. ఇది 'నేను' అను వెలుగునకు ఉన్ముఖ ముగా జరిగినచో యోగము అనబడును. అప్పుడు వత్తియు, చమురును వెలుగులోనికి సమర్పణమైనట్లు దేహము, ప్రాణము, సర్వశక్తులును 'నేను' అను వెలుగులోనికి సమర్పణ మగును. అట్టి స్థితిలో 'నేను' కన్న అన్య ముండదు. దీనినే అనన్యస్థితి అని కూడ కృష్ణుడు చెప్పెను. ఇదియే యోగము నకు పరమావధి. **(53)**

## స్థితప్రజ్ఞుడు :

ప్రజ్ఞ ఇంద్రియముల యందు, మనస్సునందు పనిచేయుచున్నప్పుడు బహిర్ముఖముగా వర్తించును. బుద్ధియందు పనిచేయు చున్నప్పుడు, మనస్సును, ఇంద్రియములను వెలిగించును గాని వర్తింపదు. అట్టి ప్రజ్ఞ అంతర్ముఖముగా నుండును. దర్పణగోళములోని దీపమునుండి వచ్చు కాంతి కిరణములవలె మనస్సు, ఇంద్రియములు కూడ అట్టి ప్రజ్ఞకు అంతర్ముఖములుగా నుండును. అట్టి స్థితిని 'స్థితప్రజ్ఞ' లేక 'సమాధి' యందురు.

స్థితప్రజ్ఞను చెందినవాడు ఎట్లు సంభాషించునో, ఏ మాచరించునో, దేనిని పరిహరించునో తెలియుట జిజ్ఞాస యగును. కామ సంకల్పములు మనస్సున పుట్టి, ఇంద్రియముల ద్వారమున బయటికి వర్తించును. అట్టి మనస్సునకు గోచరించు దృశ్యమే జగత్తు లేక సంసారము అనబడును. మనస్సున సంకల్ప ములు బుద్ధికి ఉన్ముఖ మగుటవలన పరిహరింపబడును. అపు డింద్రియములు కూడ సంకల్ప శూన్యములై తనలో భాగములగును. అప్పుడు దృశ్యమాన మగున దంతయు సంసారముగా వర్తించుట మాని, 'తాను'గా వర్తించును.

ఈ యనుభవము చెందుచున్నవాడు తనయందు తాను సంతుష్టు డగును. తక్కినవారి సంతుష్టికి ఒక బాహ్యాకారణము కావలెను. అనగా సంతుష్టికన్న కారణము బలీయమగును. సంతుష్టి అప్రధానమై నీరసించును. బాహ్యా కారణము కుదురనప్పుడు అసంతుష్టి అనుభవమగును. స్థితప్రజ్ఞునకు సంతుష్టి ప్రధాన కారణమై, జీవిత సన్నివేశములు సంతుష్టికి కార్యరూపము లగును. **(54)**

అట్టివాని మనస్సు దుఃఖము నందు ఉద్వేగము చెందదు. అది దుఃఖ కారణముచే ఆకర్షింపబడదు. కనుక బహిర్ముఖము కాదు. బాహ్య విషయములు దుఃఖ కారణము లగుట వానిని గూర్చిన దుఃఖ భయ భావనల వలననే గదా! ఆ భావన మనస్సునకు లేనపుడు అవి దుఃఖ కారణములు కావు. వానిని గూర్చి ఏ భావనయు లేనప్పుడు అవి ఏ కారణములును కావు. కేవలము సన్నివేశములుగా తెరపై బడిన చలనచిత్రములోని రంగులవలె అంటకయే మాయమగు చుండును. లోపలి నుండి ఒక విద్యుద్దీపము ఇంటి వెలుపలకు నెక్కువ కాంతిని ప్రసరింప చేయుచున్నప్పుడు, వెలుపల తక్కువ కాంతి దీప మున్నను అది లోపలకు దూరదు. స్థితప్రజ్ఞునకు అకారణ సంతుష్టి లోపల నుండి వెలుగుచుండును గనుక, బాహ్యావస్తువులు, సుఖదుఃఖములకు కారణములు కాకుండును. పెండ్లి సందడిలో నెవరైన పిలుచుచున్న కేకలు చెవులలో దూరకుండుట ఎట్లు సంభవమో, అట్లే అకారణ సంతుష్టి నభ్యసించిన వాని పంచేంద్రియములను దుఃఖాది కారణములు స్పృశింప కుండుటయు సహజమే. దీనికి మనస్సు, ఇంద్రియములు, శరీరము, బుద్ధి ననుసరించిన కార్యక్రమములలో నిమగ్నమై యుండుట మాత్రము ఆవశ్యకము. అందులకే బుద్ధి యోగమునకు కర్మ యోగము దేహము వంటి అంగ మగుచున్నది. ఏ పనియు చేయకుండ ధ్యాన ప్రయత్నము చేయువారు చిరకాలము విఫల మనోరథు లగుచుండుట యీ కారణముననే.

దుఃఖముల యందు ఉద్వేగము కలుగకుండవలె నన్నచో సుఖముల యందు కోరిక కలుగరాదు. సుఖపడరాదని యర్థము కాదు. సుఖపడు మార్గము లన్నియు యోగికి దోహదములే కావలె నన్నచో వానిపై నతని మనస్సు ప్రసరింపరాదు. పగలంతయు స్థిరముగా నొకే కుర్చీయందు కూర్చుండి

వ్రాసికొనవలసిన ఉద్యోగికి మెత్తని పరుపుల కుర్చీ సదుపాయము చేకూర్చును గాని, వ్రాతపనికి అడ్డము రాదు. కుర్చీ మెత్తదనము కోసమై కొని కూర్చుండుట నభ్యసించిన వానికి కార్యసాధన సదుపాయ మను ప్రసక్తి లేకపోగా, కుర్చీ లేనప్పుడు బాధ కలుగును. కార్యము ప్రధానముగా నున్నవానికి రాగము, భయము, క్రోధము తొలగిపోవును. వాడు తొలగించుకొనడు; తొలగించు కొనుటకు తీరిక లేదు. కనుక అతని యందవి వర్తించుట కవకాశము లేదు. *"వీతరాగభయ క్రోధః"* అను సమాసమునకు తొలగిన రాగభయ క్రోధములు కలవాడు అని యర్థము గాని, వానిని తొలగించుకొనిన వాడు అని అర్థము కాదు. ఒక విధముగా అతడు వానియందు మానసిక మౌనము ననుభవించును. మనస్సు బుద్ధివైపు ఉన్ముఖమై అనుభూతి నిమగ్నమై యుండుటవలన ఈ రాగాదుల యందు మౌనము సిద్ధించును. కాలాతీత మగుచుండగా జీతము తెచ్చుకొనుటకు ఆఫీసుకు పరుగెత్తుచున్న వానిని స్నేహితుడు పలుకరించినను అతడెట్లు మౌనము వహించునో, స్థితప్రజ్ఞుడు రాగాదులయందు అట్లు మౌనము వహించును. అట్టివానిని మాత్రమే 'ముని' అని యందురు. మాటాడ కుండుట పెదవులకు మౌనమైనను మానవునకు మౌనము కాదు. బుద్ధిలో లీనమైన మనస్సు యొక్క మౌనమే సహజమైన మౌనము. **(55)**

లోకమున ప్రతి జీవి ప్రజ్ఞకు అనేక సన్నివేశములు కలుగుచుండును. అవి శుభములుగను, అశుభములుగను గుర్తింపబడుచుండును. వానియందు మనస్సు వర్తించిన కొలదియు వాని శుభా శుభత్వము యొక్క ప్రభావము ఎక్కువగు చుండును. స్థితప్రజ్ఞునకు శుభా శుభము లుండవు. సామాన్యముగ ఇష్టజనుల రోగము, మృత్యువు మున్నగువానిని అశుభములుగా సంసార జీవులు గుర్తింతురు. రోగము అనాచారాదుల వలన కలుగు కర్మఫలము. దానియందు కలుగు అకారణమైన దిగులే అశుభముగాని రోగము కాదు. మృత్యువు వయస్సునుబట్టి జీవికి వచ్చు సహజమైన మార్పు. శరీరమునందు మనస్సు నిమగ్నమైన వానికి మృత్యువనగా తాను చనిపోవుట. బుద్ధియందు మనస్సు ప్రవేశించిన వానికి మృత్యువనగా 'తనకు'గాక, తన శరీరమునకు జరుగు రసాయనికమైన యొక మార్పు. కనుక 'తనకు' మృత్యువు ఉండదు. కనుకనే యోగికి జనన మరణములు లేవని చెప్పబడినది. ఈ స్థితినే కొందరు

శాశ్వతమగు స్థితి లేక మోక్షము అనుచున్నారు. మోక్షము పొందినవారికి కూడ శరీరములు వచ్చుచు పోవుచుండును. కాని వారు పుట్టరు, చావరు. అనగా జనన మరణముల కతీతులు. ఈ యశుభములు వాని నెట్లంటవో శుభములు కూడ అట్లే అంటవు. శుభ మనునదికూడా మనస్సులోని అభిప్రాయమే కాని, పెండ్లిండ్లు మొదలగు సహజమగు బాహ్య సన్నివేశములు కావు. కాలెండరులోని తేదీల, మాసముల పేజీలు సంవత్సరము నెట్లంటవో, అట్లే స్థితప్రజ్ఞునకు శుభా శుభములంటవు. కనుక నతడు ఒకరిని ప్రత్యేకముగా అభినందించుట, మరియొకరిని ద్వేషించుట యుండదు. అతనికి మరియొక రన్నను తానేగదా! ఒక మంచుగడ్డకు మరియొక మంచుగడ్డ ఆకారముచే వేరగుచున్నట్లు, మనస్సున నున్నవానికి మరియొకడు వేరుగా నుండును. రెండు మంచుగడ్డలు ద్రవ్యము చేత నొక్కటైనట్లు స్థితప్రజ్ఞునకు మరియొక వానిలో నున్నది కూడ తానే. ఇట్టి యోగస్థితిలో యోగి బాహ్య ప్రపంచమునకు సచేతనుడుగనే నటించును గాని, కన్నులు మూసికొనుట మున్నగునవి యక్కరలేదు. **(56, 57)**

## తనలోనికి తాను :

తాబేలు ఒక చిత్రమైన జంతువు. దానికి అవయవములు మిక్కిలి సున్నితముగా నుండును. అవయవము లెంత సున్నితమో వీపుపై డిప్ప అంత పటిష్ఠము. అది స్వేచ్ఛగా చరించుచు, ప్రతికూల పరిస్థితులు సంభవించునపుడు అవయవములను డిప్పలోనికి లాగికొనును. సడి చప్పుడు లేక ఇట్లు లాగికొను టను ఉపసంహరించుట యందురు. స్థితప్రజ్ఞుడు తన యింద్రియముల ప్రవృత్తులను తాబేలువలె యుపసంహరించుకొనును. ఈ ఉపసంహరించు కొనుట యెచ్చటికి? మనస్సులోని కైనచో సాధ్యము కాదు. మనస్సే నీటివలె చంచలమై, ఐదు చిల్లుల కుండవలె ఇంద్రియములలో నుండి వెలుపలి ఇంద్రియార్థముల మీదకు ఒలుకబోసికొను చుండును. కనుక మనస్సు కన్న వేరు సాధనముండవలెను. మనస్సునకు పైన బుద్ధి యున్నది. ఇది మంచి చెడ్డలను వివేకము చేసికొనగల శక్తి. దీనికిని సామాన్యముగా నుపసంహరణ శక్తి లేదు. బుద్ధికి వెనుక 'నేను' అను నొకడున్నాడు. అతనికి సర్వశక్తులు గలవు. తనకు తాను కేంద్రముగా ప్రత్యక్షము కాగలిగినది అతడొక్కడే. కనుక బుద్ధికిని, మనస్సునకును, ఇంద్రియములకును కూడ నతడే కేంద్రముగా

నేర్పడగలడు. అతనికి మరియొక శక్తి కూడ నున్నది. తన్ను తాను స్మరింప గలడు. ఇంద్రియములలోనికి విస్మరించను గలడు. మంచు కరగినచో నీళ్ళగును. అట్లే ఈ 'నేను' అను నతడు విస్మృతి చెందినచో మనస్సు, నింద్రియములు నగును. బుద్ధియు యగును. తన్ను తాను స్మరించు చున్నప్పుడు తన చుట్టును బుద్ధి కట్టుకొనును. ఆ బుద్ధి తన యందుండును. మనస్సు బుద్ధి యందుండును. అప్పుడు ఇంద్రియములు మనస్సులోని కుపసంహరించు కొనును. ఈ యొక్క మార్గముననే మనస్సును, ఇంద్రియములను దమించుట సాధ్యమగును. **(58)**

ఇతర మార్గములలో మనస్సు దమింప గలుగుట జరుగదు. కొందరు స్వతంత్రముగా మనస్సుచే నింద్రియ ప్రవృత్తులను దమింప జూతురు. అప్పుడు ఇంద్రియములను క్రూరముగా శిక్షింపజూచుట, శిక్షణ జేయ యత్నించుట, ప్రవృత్తుల నణచిపెట్టుట మున్నగు యత్నములు జరుగును. కొందరు మనస్సున ఏదేని యొక రూపమును గాని, మంత్రమును గాని, నామమును గాని నిలపి, దాని ఆధారమున మనస్సును కేంద్రీకరింప యత్నింతురు. మనస్సు నీటివంటిది, ఆవిరివంటిది. కనుక దానికి కేంద్రము లేదు. ఈ యత్నమెల్ల విఫలము. ఎన్ని సంవత్సరములు సాధన చేసినను మనస్సు లొంగి నట్లు అనుమానము కలుగును కాని లొంగదు. కొందరు మనస్సును గూర్చిన తత్త్వశాఖలపై శాఖా మృగములవలె నిర్వచనముల నవగతము చేసికొని మనస్సును పట్టుటకు యత్నింతురు. కొందరు విలువగల విషయములను మనస్సు కెక్కింప జూతురు. ఐనను లాభము లేదు. మనస్సున కెన్ని మంచి విషయములు తెలిసినను అక్కరకు రావు. అక్కరకు వచ్చినచో మంచి విషయ ములు తెలిసినవారు చెడ్డపనులు చేయుచుండుట ఎట్లు సంభవించును? కనుక మనస్సును పట్టుటగాని, అణచిపెట్టుటగాని ఎన్ని జన్మలైనను సాధ్యపడని విషయము. కొందరు గోడపై నొక చుక్కను పెట్టి, చూపును దానిపై కేంద్రీకరింప జూతురు. దాని వలన కన్నులు బాధపడి రుగ్మత చెందును. చాంచల్యమను దోషము మనస్సున నుండగా నింద్రియములను మర్దించుకొనిన నేమి వచ్చును? సారథి నిర్లక్ష్యమునకు గుఱ్ఱములను చావగొట్టిన నేమి వచ్చును? కనుక ఈ మార్గముల వలన ప్రయోజనము లేకపోగా, నింద్రియములకు లేనిపోని

వ్యాధులు కలుగును. కనుక మార్గ మొక్కటియే. 'నేను' అను ప్రజ్ఞను స్మరించుట వలన మార్గము సుగమ మగును. శ్రీకృష్ణుడు దీనినే 'నన్ను' స్మరింపుము, 'నన్నాశ్రయింపుము' అనును.

ఇంద్రియముల నుపసంహరించుట యనగా ఇంద్రియార్థముల నుండి వేరుచేసి శుష్కింపజేయుట కాదు. ఇంద్రియములకు కావలసిన ఇంద్రియార్థ ముల ప్రవృత్తి యుక్తముగా నుండవలెను. అట్లుగాక వానిని నిరాహారములుగా జేసినచో శుష్కోపవాసము చేసినవాని గతియే పట్టును. రుచికరములైన ఆహార ముల యాకర్షణము నుండి విరమింపజేసి నిరాహారదీక్ష బూనినచో, రుచులు దూరమగును. వానిపై జిహ్వకుగల రుచికూడ తప్పును. కాని రుచులు మనస్సున నుండును. అవి యాహార పదార్థములలో నుండవు. ఆయా పదార్థములకు విత్తనముల వలె మనస్సున నభ్యాసవశమున నేర్పడును. నిరాహారదీక్ష వహించినపుడు ఈ పదార్థములు తమ విత్తనములను మనస్సున నుంచియే జిహ్వకు రుచులను తప్పించును. మరల బలము చేకూరినంతనే ఆనుకూల్యము సంభవించినపుడెల్ల రెట్టించిన తీవ్రతతో ఆ విత్తనములు మనస్సున మొలకెత్తి పదార్థముల నాకర్షించును. మిగిలిన ఇంద్రియముల విషయమునను, వాని లక్ష్యములను దూరము చేయుటవలన నింతే ప్రయోజనము కలుగును. 'నేను' అను ప్రజ్ఞతో బుద్ధిని కూడగట్టుకొనినపుడు మనస్సునకు ఆత్మపై అభిరుచి యేర్పడును. ఇది తరుగని రుచి గనుక, నిక ఇంద్రియార్థముల రుచుల విత్తనములు అల్పములు గనుక సహజముగా జారిపోవును. అపు డింద్రియ ములు కూడ మనస్సు వెంట నంతర్ముఖములు అగును. ఇంద్రియార్థములు వానియందు ప్రవర్తించినను అవి చెదరిపోకుండును. **(59)**

కొందరు సద్గ్రంథ పఠనము, శాస్త్రచింతన, జిజ్ఞాస మున్నగువాని వలన మనస్సును, ఇంద్రియములను నిగ్రహింపజూతురు. పాండిత్యము బాహ్య విషయములను గూర్చిన యంశముల సమాహారము. కేవల పాండిత్యము వలన, మంచి విషయములను చెప్పుకొనుట వలన విషయ బాహుళ్యముతో గూడిన భారము మనస్సున కెక్కువ యగును. దానివలన నిగ్రహము కలుగక పోగా బరువు బాధ్యత లెక్కువగును. పడవలసిన జాగరూకతలు ఎక్కువై మనస్సునకు మోయలేని బరువు వలన చికాకు, కోపము మున్నగునవి కలుగును.

అట్టి వ్యక్తికి తానెరిగిన విజ్ఞాన సంచలనము మనస్సున నెక్కువై, వాని స్మరణకు సంబంధించిన యింద్రియముల సంచలనము కూడ నెక్కువగును. అపు డింద్రియ ప్రవృత్తులు కవ్వములవలె మనస్సును మథించును. వాని వెంట మనస్సు మరల బహిర్ముఖమై హరింపబడును. మనస్సు చెడ్డ విషయములతో హరింపబడినను, మంచి విషయములతో హరింపబడినను ఫలిత మొక్కటే. తనను పొడుచుకొను కత్తి యినుపదైనను, స్వర్ణమయమైనను నొక్కటియే. ఈ మార్గమున సంయమము సాధ్యము కాదు. కనుకనే శాస్త్ర పారంగతులైన పండితులలో నహంకార పూరితులను, ఈర్ష్యాసూయాది ప్రవృత్తి నానాటికి బలపడుచున్న వారిని చూచుచున్నాము. ఇది నిశ్చలత్వమునకు మార్గము కాదు. **(60)**

## ప్రజ్ఞాప్రతిష్ఠితుడు :

'యుక్తుడు' అను పదమునకు యోగము చెందినవాడని యర్థము. మానవునిలోని ప్రజ్ఞ లన్నిటికిని సరియైన కూర్పు జరుగు నేర్పునే యోగ మందురు. మానవునిలో శరీరమను తత్త్వమున నిమిడియున్నవి అనేకాంశ ములు గలవు. వానినే మొత్తము స్థూలముగా రెండు భాగములుగా గమనింప వచ్చును. అందు మొదటి విభాగమున భౌతిక శరీరము, ప్రాణము, ఇంద్రియ వృత్తులు, మనస్సు అనునవి అమరియుండును. రెండవ భాగమున బుద్ధి, 'నేను' అను ప్రజ్ఞయు నుండును. అందు మొదటి భాగమున భౌతిక శరీరము మిగిలిన మొత్తమున కాధారము. ఇది పంచభూతములతో చేయబడిన సప్తధాతువులు కలది. దీనిని అన్నమయ శరీరము అందురు. దీనిని నెలకొల్పి నిర్వహించుటకు ప్రాణశక్తి యిందు ప్రవహించు చుండును. దీనివలన ఆహారము స్వీకరించుట, కదలిక మున్నగునవి కలుగును. దీనివలన చూచుట, వినుట, వాసన చూచుట, రుచి చూచుట, స్పర్శ తెలియుట యను జ్ఞానేంద్రియము లైదును పనిచేయు చుండును. వీనిలో మనస్సు ప్రసరించి పనిచేయుచు బాహ్య ప్రపంచముతో సంబంధము నిలుపుచుండును. ఈ విధముగా అన్న మయము, ప్రాణమయము, మనోమయము అను మూడు కోశములు మొదటి భాగమగును. **(61)**

ఇక రెండవ భాగము బుద్ధి, మంచి చెడ్డలను తెలియగల వివేక జ్ఞానములను, సంకల్పశక్తిని కలిగియుండును. ఇది పనిచేయు చున్నప్పుడు ఇంద్రియములు, మనస్సు, ప్రాణము, శరీరము దీని యధీనమున నుండును. అట్టి స్థితిలో యోగస్థితి నడచు చుండును. అట్లుకాక బాహ్య విషయముల యాకర్షణము ననుసరించి మనస్సును, ఇంద్రియములును పనిచేయు చున్నప్పుడు ప్రజ్ఞకు నానాత్వము సంభవించును. దీనినే అయోగస్థితి యందురు. ఈ స్థితిలో బుద్ధి మాయమై, మనస్సు, ఇంద్రియములు మాత్రమే మానవుడగును. బుద్ధి పనిచేయు చున్నప్పుడు అది మానవుడై, మనస్సు, ఇంద్రియములును దానియందు లగ్నమై విధేయము లగును. ఈ విధముగా బాహ్య కారణములచే మానసాదులు పనిచేసినచో ప్రజ్ఞ మనస్సుగా ఇంద్రియములను ద్వారముల ద్వారా బాహ్యలోకములోనికి పారిపోయి నానాత్వము నందును. ప్రజ్ఞ బుద్ధిగా పనిచేసినచో దేహేంద్రియ మనస్సులు, ప్రాణము దానియందు ఏకత్వమందును. ఇందు నానాత్వము దుఃఖమును, ఆత్మ వినాశమును కలిగించును. ఏకత్వము సుఖమును, సంయమ స్థితిని కలిగించును.

'నేను' అను ప్రజ్ఞను ధ్యానించి అట్టి స్థితిలో మానవుడు వసించుటవలన, దేహేంద్రియ మానసాదులు బుద్ధితో యోగము చెంది, దానికి విధేయములై వర్తించును. అట్టివాని ప్రజ్ఞ సుప్రతిష్ఠితమై యుండును. అట్టి స్థితిలోని ఈ మొత్తమును 'ఆత్మ' లేక 'తాను' అందురు. ఈ స్థితిలో జీవించు మానవుడు ఆత్మవంతు డనబడును. బాహ్యాకర్షణము ననుసరించి మనస్సు పనిచేయుట ఆరంభించినపుడు బాహ్య విషయముల యందు రుచి పెరుగును. దీనినే సంగ మందురు. సంగము వలన బాహ్యవస్తువులపై కామము పెరుగును. ఆహారాదులు, వాని రుచులు మనస్సు నాకర్షింపరాదు. బుద్ధి సహాయమున మనస్సు, ఇంద్రియములు ఆహారాదులను, రుచులను అనుభవింపవలెను. అప్పుడు వాని ప్రయోజనము మానవునకు కలిగి, మానవుని ప్రయోజనము విశ్వశ్రేయస్సునకు వినియోగపడును గనుక, అతనిచే స్వీకరింపబడిన యాహారాదులు కూడ విశ్వశ్రేయస్సునకే వినియోగపడును.

బాహ్య వస్తువులకు లభించుట, లభింపకపోవుట మున్నగు భిన్నావస్థలు కలుగుచుండును. వాని వెంట పరుగెత్తినచో అవి లభించినపుడు సుఖము,

లభింపనపుడు దుఃఖము కలుగుచుండును. వానిపై నభ్యసింపబడిన ఆసక్తియే కామము గనుక అవి లభింపనపుడు క్రోధము కలుగుచుండును. ఈ కామ క్రోధముల వలన మనస్సు కలతపడుచు బురద నీటివలె స్వభావము మార్పు చెందుచుండును. అట్టి స్థితిలో తాత్కాలికములైన విలువలపై నాసక్తి చెందు చుండును. దీనిని సమ్మోహ మందురు. రుచులకై వ్యామోహపడుట, వాని యందు సంతోషమునకై వెదకికొనుట జరుగును. యజమాని యగు తాను సేవకులగు ఇంద్రియాదులతో రమించుచుండుట వలన తా నెవరో, తన స్వభావమెట్టిదో, తనకు గల సౌఖ్య పదవి ఎట్టిదో అను జ్ఞానము మరపునకు వచ్చును. వస్త్రమును చూచుచున్నప్పుడు అందలి నూలుపోగులును దూదియు మరపునకు వచ్చినట్లు, రుచులలో రమించుచున్నపుడు రుచి చూచుచున్న తా నెవడో యను విషయము మరపునకు వచ్చును. దీని వలన బుద్ధి నానాత్వమున నశించును. ఈ బుద్ధి నాశము వలన నాచరించగూడని పనుల నాచరించుచు మానవుడు దుఃఖానుభూతిలో నశించును. మూర్ఖులగు చుట్టముల తృప్తికై వారు కోరినట్లెల్ల ద్రవ్యమును వ్యయము చేయువాడు నిర్ధనుడై తుదకు వారికే వినియోగపడకపోయి, వారి దారిద్ర్యమునకు కూడ కారకుడగును. అట్లే దేహేంద్రియ మనస్సుల తృప్తి ననుసరించి పనిచేయు మానవుడు వాని ప్రవృత్తులలోనికి వ్యయమైపోయి, వాని వినాశమునకు కూడ కారకుడగును. యోగస్థితి యందుండు మానవుడు ఇంద్రియాదులను తనయందు దమించుకొనుచునే వాని రక్షణ పోషణములకు తానే కారకు డగును. బంధువులను, దాస దాసీజనులను అదుపులో నుంచువాడు, వారికి క్రమశిక్షణ నిచ్చి యుద్ధరించి వారి సుఖమునకే కారకుడు అగుచున్నాడు గదా! అట్లే స్థితప్రజ్ఞు డగువాడు తన దేహేంద్రియ మానసాదులను దమించుచునే వాని శ్రేయస్సునకు కారకు డగుచున్నాడు. కనుక ప్రజ్ఞను ఊర్ధ్వముఖము పట్టించి, మానవుడు తనలోని నానాత్వమును పరిహరింప జేసికొని, సర్వ శక్తులను ఏకముఖము చేయు చున్నాడు. ఈ సాధనమే యోగసాధనము.

దీనిని బట్టి తేలిన దేమనగా మానవుని జీవిత ప్రవర్తనమునకు బాహ్య వస్తువులును వాతావరణమును కారణము కారాదు. బాహ్యప్రపంచ ప్రేరేపణ ముచే జరుగుచున్న ప్రవృత్తి యంతయు తన్ను బంధించు కర్మ యగుచున్నది.

అంతర్ముఖమైన ప్రజ్ఞచే ప్రేరేపింపబడు సమస్త కర్మాచరణము కర్మబంధ విమోచకమై మానవుని ముక్త స్థితిలో నుంచుచున్నది. ఇంద్రియ ప్రవృత్తులతోడి మానవతత్త్వము గుఱ్ఱములతోడి బండి వంటిది. గుఱ్ఱములు గడ్డిని చూచి పురోగమించినను బండి నడచును. సారథి చక్కగా తోలినపుడును బండి నడచును. అందు మొదటి నడక గోతిలో పడుటకు దారితీయును. సారథి వలన సాగిన నడక చేరవలసిన తావునకు దారితీయును. ఇట్లే బాహ్యలోకము వలన ఇంద్రియములు, మనస్సుల ద్వారా ప్రేరేపింపబడిన కర్మము తన నాశమునకు దారితీయును. తన లోనుండి ప్రేరేపింపబడిన కర్మము సత్కర్మమై ముక్తస్థితి నిచ్చును. **(62, 63)**

## ప్రసన్నచేతసుడు :

ప్రాచీన శాస్త్రజ్ఞుల విభాగము ప్రకారము మానవుడు మూడు విభాగము లుగా తెలిసికొనబడుచున్నాడు. 1. శరీరము; 2. మనస్సు; 3. తాను. వీనిలో శరీరమున సప్తధాతువు లుండును. దీనిని భౌతిక శరీరము లేక అన్నమయము అందురు. దీనిని సవ్యముగా నడుపుకొనుటకై అన్నపానీయాదులు స్వీకరించుచు చేతనవంతము చేయుచున్నది ప్రాణము. ఇది శక్తి స్వరూపము. దీనిని ప్రాణమయ శరీర మందురు. ఈ రెండును కలసి మొదటి విభాగ మగుచున్నవి. రెండవది యగు మనస్సున పంచేంద్రియ వ్యాపారము లుండును. అవి బాహ్య ప్రపంచముతో సంబంధములు గలవి. వాని సహాయమున మనస్సు శబ్ద స్పర్శ రూప రస గంధముల యందు వర్తించుచు, రక్షణాది వ్యాపారములు కలిగి యుండును. ఇట్లు కలిగియుండుటలో కొన్ని దోషము లెప్పటికప్పుడు గూడు కట్టుచుండును. దీపము వెలిగినప్పుడు మసిబారినట్లు, యంత్రము పనిచేయు చున్నప్పుడు మడ్డి మొదలగునవి యేర్పడినట్లు ఈ దోషములు కట్టుకొను చుండును. ఇంద్రియములు లక్ష్యముల యందు యంత్రములవలె పనిచేయు చుండగా నేర్పడిన ఈ దోషములే రాగ ద్వేషాదులు. వానియందు ప్రవర్తించు చున్న మనస్సుపై నీ దోషములు ఎప్పటి కప్పుడు పనిచేయుచుండును. మసిపట్టిన దీపము నుండి వెలుగు మసకగా కనిపించునట్లు, మనస్సు ఈ దోషములను అంటించుకొని పనిచేయు చుండును. దాని వలన దుఃఖము, బాధ మున్నగునవి అనుభవింపబడు చుండును. మూడవ విభాగమగు తాను

లేక ఆత్మ ఈ మనస్సును తనవైపునకు ఆకర్షించుకొనునప్పుడు బుద్ధి అనబడు శక్తి ఆత్మయందు వ్యక్తమై పనిచేయుచుండును. మనస్సు బుద్ధికి ఉన్ముఖముగా పనిచేయుచుండును. దీని వలన సజ్జనుడగు ధనవంతుని కడ కొలువులో నున్న యొక బీదవానికి నిర్దిష్ట స్థితి యెట్లు కలుగునో అట్టి నిర్దిష్ట స్థితియే బుద్ధి యొక్క కొలువులో నున్న మనస్సునకు కలుగును. అప్పుడు మనస్సు ఇంద్రియముల వైపునకు, శరీరము వైపునకు ప్రసరించుట కాక, ఇంద్రియములే మనస్సు వైపునకు ప్రసరించును. ఇట్టివాడు వివేకవంతు డనబడును. ఈ వివేకము వలన సుఖము కలుగును. **(63)**

ఒక నదికి సమీపమున కొన్ని వందల యెకరముల సారవంతమైన పల్లపు భూమి యున్నది. దానిని వినియోగించుకొనగల వానికి ఉచితముగా నిచ్చెదరు. కృషి శాస్త్రజ్ఞుడు దానిని ఒక వంద సంవత్సరములకు వ్రాయించు కొనెను. మరియొక శాస్త్రజ్ఞుని కార్యనిర్వాహకునిగా నియమించుకొనెను. వాని దగ్గర ఐదుగురు మేస్త్రీలు నియమింపబడిరి. వారందరు కూలీలను పెట్టి దున్నించి ధాన్యము పండించిరి. పండిన ధాన్యమును వాణిజ్యము చేసి, మరల కృషికర్మను సాగించుటకు పూనుకొనిరి. అందు శాస్త్రజ్ఞుడు చెప్పిన పథకమును కార్యనిర్వాహకుడు అమలుపరచెను. అతడు చెప్పిన పథకములను ఐదుగురు మేస్త్రీలు అవలంబించి, దాని ప్రకారము కూలీలను ఆజ్ఞాపించి పనిచేయింతురు. కూలీలు వారికి విధేయులు. ఇందు పథకము శాస్త్రజ్ఞునిది, తీర్పు కార్యనిర్వాహకు నిది. అమలుపరచుట మేస్త్రీలది. శ్రమ కూలీలది. అనగా శాస్త్రజ్ఞునిపై నందరు నాధారపడి అధీనులై యున్నారు. ఆ క్షేత్రము నానాటికి వృద్ధిచెంది వారందరును శ్రీమంతు లగుచున్నారు. మరియొక క్షేత్రమున కూలీలు స్వతంత్రించి ఎవరి కందిన ధాన్యము వారు కాజేయుచున్నారు. మేస్త్రీలు వారితో లాలూచీపడి తామును తమ వంతు కాజేయుచున్నారు. కార్యనిర్వాహకుడు వారితో చేతులు కలుపుచున్నాడు. శాస్త్రజ్ఞుడు క్రమముగా దివాళా తీసెను. క్షేత్రము చిన్నాభిన్న మైనది. కృషి సాగలేదు. కొంతకాలమునకు అందరు దరిద్రులై తలకొక దిక్కున యాచకులుగా సాగిపోయిరి. ఇందు మొదటి శాస్త్రజ్ఞుని పొలమువంటి ఫలితము బుద్ధి కధీనమైన మనస్సు వలన కలుగును. రెండవ శాస్త్రజ్ఞుని జట్టునకు పట్టిన గతియే ఇంద్రియముల కధీనమైన మనస్సునకు పట్టును. ఇందు ఆ శాస్త్రజ్ఞుడు

బుద్ధి, కార్యనిర్వాహకుడు మనస్సు, మేస్త్రీలు ఇంద్రియములు, కూలీలు శరీర భాగములు, ఒకచోట కలిసి పనిచేయుచున్న జట్టు వంటిదే మానవతత్త్వము. జట్టులో జరుగుచున్న పనుల వలన నొక్కొక్కరికి మరియొకరిపై కలుగుచున్న మలినమైన అభిప్రాయముల వంటివే రాగద్వేషాదులు. వానివలన దుఃఖానుభూతి కలుగుచుండును. ఎప్పటికప్పుడు జరుగుచున్న పనులను గూర్చి కలుగుచున్న భావములను సన్యసింపగలవాడు యోగియై, సర్వమున కతీతముగా నుండి సుఖ మనుభవించును. కనుక ఇంద్రియములు రాగద్వేషముల వైపు ప్రసరించ కుండ బుద్ధికి ఉన్ముఖములై తనకు వశములు కావలెను. అట్టివాడే తనయందు విధేయత కలిగిన తనలోని భాగములు కలవాడగును. వాని మనస్సు ప్రసన్నత చెందును. **(64)**

కదలుచున్న కోనేటి నీటిలో బురద కనిపించును. కదలకున్నప్పుడు బురద దిగిపోయి తేటనీరు సిద్ధించుట వలన ఆకాశము, సూర్యచంద్రులు దానియందు ప్రతిబింబించును. కదలినపుడు నీటియందు బురదరంగు కనిపించుచు, కదలనపుడు ఆకాశాది తత్త్వములు ప్రతిబింబించును. అట్లే ఇతరులపై నభిప్రాయములు కలిగినపుడు, ఆహారాదుల రుచులను గూర్చి సంగము కలిగినపుడు మనస్సునకు దుఃఖము అను బురద సోకును. ఈ కదలిక లేకున్నప్పుడు ప్రసన్నత అను సుఖము సంక్రమించును. దూరమున నున్న ఆకాశము, సూర్యుడు, చంద్రుడు మున్నగు శాశ్వత తత్త్వములు నీటి యందు ప్రతిబింబించినట్లు, కదలకున్న మనస్సునందు ఇతరులలో దైవతత్త్వము కనిపించును. దానివలన నిరంతర సుఖము సిద్ధించును. దీనినే ప్రసన్నమైన స్థితి యందురు. ఈ స్థితిలో సర్వదుఃఖములును మాయమగును. కదలకున్న నీటియందు ప్రతిబింబించు వస్తువుల సహజ స్వరూపము నిలబడును. అట్లే ప్రసన్నమైన మనస్సునకు ఇతర వ్యక్తుల వస్తువుల సహజ స్వరూపమే భాసించును. ఇట్లు భాసించు స్థితిని మనస్సు అనరు, బుద్ధి యందురు. కోనేటిలో నీటి యలవంటిది మనస్సు. ఇది చాంచల్యముతో వ్యక్తమగును. అల లేనప్పుడు ప్రతిబింబించు ప్రజ్ఞ వంటిది బుద్ధి. ఇది నిశ్చలత్వము వలన సిద్ధించును. మనకు ఇతరులపై కలుగు నభిప్రాయములు అలలవలె మనస్సును కదలించును. అందు రాగద్వేషములు సంక్రమించును. వానిపై ప్రతిబింబించు

సూర్యబింబము ముక్కలైనట్లు వికృతముగా నెట్లు కనిపించునో అట్లే అభిప్రాయములు నిండిన మనస్సునకు నితరుల చేష్టలు మున్నగునవి వికృతములుగా కనిపించి, రాగద్వేషములకు, దుఃఖములకు కారణమగును. కనుక మనస్సునకు ప్రసాదము సిద్ధించినపుడు, సర్వ దుఃఖములకు అభావము కలిగి బుద్ధి చక్కగా ప్రకాశించును. ఈ బుద్ధి బలమున ఇతరుల యొక్కయు, సృష్టిలో నితర వస్తువుల యొక్కయు యథార్థస్థితులు చక్కగా భాసించుచుండును. దాని ననుసరించిన ప్రవర్తన కూడ యథార్థ స్థితి ననుసరించి యుండును. అప్పుడు కలుగు ననుభూతియే సుఖము లేక ఆనందము. కర్తవ్యము నందు మనస్సును స్వతంత్రింపనీయక, బుద్ధిని ప్రయోగము చేయవలెను. ఇదియే బుద్ధియోగము. అప్పుడా కర్తవ్యమును నిర్వహించుటలో మనస్సు, ఇంద్రియములు బుద్ధి ననుసరించును గాని స్వతంత్రింపవు. ఇట్లు యోగికి కర్తవ్యము, దానియందు వర్తించు బుద్ధి, వాని ననుసరించు మనసు, నింద్రియములు, దేహము నుండును. పరిసరములపై మనస్సు ప్రవర్తింపదు. యుక్తాయుక్తములు అప్రయత్నముగా అవగతమగును గాని, వాని మనస్సు వేరుగా ఆలోచించి తన ఇష్టము వచ్చిన భావములను నిర్ణయించుకొనదు. **(65)**

## యుక్తుడు :

'యుక్తుడు' అనగా యుక్తి కలిగినవాడు. యుక్తి యనగా లౌక్యమో, చమత్కారమో యని పామరులచే నెంచబడుచున్నది. కాని వాస్తవమునకు యుక్తి అనగా కొన్ని వస్తువుల చక్కని కూర్పు. బుద్ధియందు మనస్సు, మనస్సు నందు ఇంద్రియములు, ఇంద్రియముల కధీనమైన ఇంద్రియార్థములు, ఇట్టి వ్యాపారములకు సదుపాయమైన యంత్రశాలగా దేహము కూర్పు చెందుటనే పెద్దవారు యుక్తి యందురు. యుక్తి అను పదమునకు, యోగమను పదమునకు నర్థ మొక్కటియే! ఎవనియం దిట్టి కూర్పు సిద్ధించునో అతడే యుక్తుడు లేక యోగి. వానికే మనస్సు ప్రసన్నమై దుఃఖములు మాయమై సుఖ మనుభవింప బడును. ఈ యోగము లేనివారికి బుద్ధి యుండదు. భావనయు నుండదు. భావన యనగా తన్ను గూర్చి తనకు జ్ఞప్తి యుండుట. ఇది జ్ఞప్తి గలవానికి ఇంద్రియములు, మనస్సు, బాహ్య వస్తువులు, వ్యక్తులు వేరుగా గుర్తుండవు. వారు తనయందే ఆరోపింపబడిన వారుగా గుర్తుందురు. నాలుపోగులచే

నేత జెందిన బట్ట నూలుపోగుల సమూహముగా కాక వస్త్రమను వేరొక వస్తువుగా మాత్రమే గుర్తుండుటను భావన లేకుండుట యందురు. ఈ స్థితియే మోహము లేక అజ్ఞానము. అట్లే బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, దేహము అను శక్తులతో కూడిన మానవుడు ఈ శక్తుల కన్న వేరుగా బంధువో, మిత్రుడో, శత్రువో యని గుర్తుండుట, భావన లేకుండుట లేక మోహము. యోగియైన వారికి తా నెవరో, ఎదుటివాడెవడో గుర్తుండును. అనగా తానును నెదుటి వాడును మూలతత్త్వమైన భగవంతుని నుండి పుట్టిన శక్తుల యోగము చెందిన నరుడనబడు పురుషుడని భావన యుండును. ఈ భావన గలవానికే శాంతి యుండును. శాంతి యనగా సుఖదుఃఖముల అనుభూతిచే చలింపకుండునట్టి స్థితి. భావన లేనివారికి శాంతి యుండదు. శాంతి లేనివానికి సుఖముండదు. సుఖము రెండు విధములు. సుఖదుఃఖములు రెండింటిలో నొక భాగమైన సుఖ మొకటి- ఈ సుఖదుఃఖముల కతీతమైన యనుభూతి యొకటి. ఇందు మొదటిది నిరంతరము దుఃఖ స్పర్శ కలిగియుండుటచే నిజమైన సుఖము కాదు. ఇది తాత్కాలికము, అశాశ్వతము. రెండవ దానికి సుఖదుఃఖముల పరిణామ స్పర్శ లేకుండుటచే అది సత్యమైన సుఖము లేక శాశ్వత స్థితి. బుద్ధిమంతుడైన యోగి అశాశ్వతములైన సుఖదుఃఖములను విడచి శాశ్వత స్థితి ననుభవించును. **(66)**

సాధన లేనివానికి ఇంద్రియములు ఇంద్రియార్థముల వెంట పరుగెత్తు చుండును. ఇంద్రియార్థములనే విషయము లందురు. అవియే శబ్ద స్పర్శ రూప రస గంధములు. అనుదినము అనుక్షణము సాధన లేని మానవుడు పొందుచున్నది వానినే. ఒక వ్యక్తిని చూచుచున్నప్పుడు వాని యాకారము, నామము, రూపము మూలమున అనగా కన్ను సహాయమున మనస్సు పొందు రూపమున నతడు తనకు బంధువో, మిత్రుడో, శత్రువో వలె కనిపించును. అతని మాటలు చెవిన బడుట వలన, మనస్సు ఆ చెవి ద్వారమున పనిచేయుచు మాటలలో తనకు నచ్చుటయో, నచ్చకుండుటయో మాత్రమే వినబడును గాని తన కర్తవ్యము వినబడదు. అట్లే ఆహారము తన నాలుకకు సోకుట వలన తన కది రుచిగా నుండుటయో, ఉండకుండుటయో మాత్రమే గోచరించును గాని, స్వీకరింపదగినదో తగనిదో గోచరింపదు. అట్లే ముక్కునకు

సుగంధ ద్రవ్యాదులును, శరీరమునకు మృదువులగు శయ్యాసనాదులును, స్త్రీ పురుష స్పర్శ మున్నగునవియును. ఈ విధముగా నింద్రియములలో చరించుచున్న మనస్సునకు నచ్చుటయో నచ్చకపోవుటయో తెలియును గాని, కర్తవ్యా కర్తవ్యముల ప్రజ్ఞ యుండదు. ఒక నావలో సముద్రముపై ప్రయాణము చేయుచున్న నావికునకు తెరచాపయో, చుక్కాని, లంగరు మున్నగు నావలోని యంత్రములో, ప్రయాణము సాగించుటకు సాధనములు. వానిని బంధించి నిర్వహించుట చేతకాని వాని నావకు గాలియే కదలించు సాధనము. అట్లే ఆ గాలిచే నుద్రిక్తత చెందిన యలలును. గాలి కధీనమైన ప్రయాణము గాలి వాలునుబట్టి నావను నడిపించును గాని పోవలసిన మార్గమునుబట్టి కాదు. అట్లే ఇంద్రియముల యాకర్షణచే పనిచేయుచున్న మనస్సు ప్రజ్ఞనుబట్టి నడువదు. పరిసర వ్యక్తులనుబట్టి, వారి సంభాషణల వలన ప్రేరేపింపబడిన రాగద్వేషములను బట్టి, వాతావరణమును బట్టి నడచును. ఇట్టి నడకచే జీవితము గమ్యస్థానము అగు ఆనంద మార్గమునకు దారితీయక, ఇచ్ఛాద్వేష ముల వైపునకు దారితీయును. **(67)**

కనుక నింద్రియములు ఇంద్రియార్థములనుండి నిగ్రహింపబడుట జరుగవలెను. నిగ్రహింపబడుట యనగా వానిని నిగ్రహించుట కాదు. మనస్సు ఉత్తమమైన వస్తువుచే నాకర్షింపబడినప్పుడు సహజముగా నిగ్రహింపబడుట జరుగును. ఇట్లు కాక నిగ్రహించుటకు ప్రయత్నము చేసినపుడు నిగ్రహించు యత్నమే మిగులునుగాని, నిగ్రహింపబడుట జరుగదు. మనస్సు ఇంద్రియముల విషయమున నిగ్రహింపబడుట యొక్కటే సాధ్యము గాని, వానిని నిగ్రహించుట ఎప్పుడును సాధ్యము కాదు. ఒక పాటకచేరీ జరగబోవు శాలలో పలువురు జేరి కూర్చుండిరి. కార్యక్రమము ఆరంభింపబడుటకు ముందు ఒకరితో నొకరు మాట్లాడుకొనుచుండిరి. శాల యంతయు సంకులముగా నుండెను. వారిని నిశ్శబ్దము చేయుట యెట్లు? నిశ్శబ్దము నిశ్శబ్దమని అరచినచో అది సాధ్యము కాదు. ఈ కేకలు కూడ సంకులమునకు తోడ్పడును. దానిని చూచి మరికొందరు బుద్ధిమంతులు సత్సంకల్పముతో నిశ్శబ్దము నిశ్శబ్దమని యరచి నచో మరింత గగ్గోలు పుట్టును గాని, నిశ్శబ్దము సాధ్యము కాదు. నిగ్రహించు ప్రయత్నమునకు ఇట్టి దుష్పరిణామ ముండును. అట్లుకాక యొకరు శ్రావ్యమైన

కంఠధ్వనితో ప్రార్థన మారంభించినచో నొకటి రెండు నిముషములలో నెల్లరు తమ సంభాషణలు చాలించి శ్రావ్యధ్వనిచే నాకర్షింపబడి మాటాడ కుందురు. ఒకరిద్దరు పామరులు మాటాడ యత్నించినను మిగిలినవారు నిశ్శబ్ద సంజ్ఞల తోనో, చేతితో నొక్కుటతోనో దమించి కూర్చుండ బెట్టుదురు. వినని వానిని నిశ్శబ్దముగా బయటకు గొనిపోయి విడచి వత్తురు. అప్పుడు శాల యంతయు నిశ్శబ్ద మగును. నిశ్శబ్దమును సాధించుట యనగా సంగీతముచే నిశ్శబ్దము సాధింపబడుట జరిగినది. అట్లే సాధకుడు మనస్సుతో నింద్రియములను నిగ్రహించుట కాక, ఆత్మ ధ్యానముచే నింద్రియములు నిగ్రహింపబడుట సాధించును. అట్టి వాని ప్రజ్ఞ మాత్రమే సుప్రతిష్ఠిత మగును. ఈ ప్రజ్ఞ ఎచ్చట ప్రతిష్ఠింపబడుచున్నది? ఇంద్రియముల యందును, మనస్సు నందును. నిశ్శబ్దము సాధింపబడిన సంగీత శాలలో నిశ్శబ్ద మెచ్చట ప్రతిష్ఠింప బడినది? అంతకుముందు రొద చేయుచున్న జనులయందే కదా! అట్లే ప్రజ్ఞలను హరించుచున్న మనస్సు, నింద్రియములు ఆత్మచే నిగ్రహింపబడుట వలన ఆత్మప్రజ్ఞ ఆ మనస్సు, ఇంద్రియముల యందే ప్రతిష్ఠింపబడును. అనగా మొత్తము మానవుడు ప్రజ్ఞామయుడై ఆ ప్రజ్ఞయందు దేహము, ఇంద్రియ ములు, మనస్సు ప్రతిష్ఠింపబడును. అట్టివాడే స్థితప్రజ్ఞుడు. అట్టి స్థితియే యోగము. అప్పటి యనుభూతియే ప్రసన్నస్థితి లేక శాశ్వత సుఖము. (68)

## నిజమైన వెలుగు :

లోకము అనగా దృష్టియని అర్థము. చూచువాని సామర్థ్యమును బట్టి ఈ సృష్టిలో లోకము లనంతములు. వాని నన్నింటిని క్రోడీకరింపగా ప్రధాన ముగా రెండు లోకములుగా స్పష్టమగును. ఒక ఇల్లాలికి తన భర్త శరీరముపై సన్న చీమ ప్రాకుచు కనిపించెను. ఆ భార్య దృష్టికి అతడు భర్త. చీమ దృష్టికి అతడు భర్త కాకపోగా మనుష్యుడు కూడా కాదు. కారణము? చీమ దృష్టిలో మనుష్యులనువారు లేకుండుటయే! ఒక నాటకశాలలో వేలాది ప్రజలు ఒక నటీమణి ధరించిన పాత్రను చూచుచు పరవశు లగుచున్నారు. ఆమె కేశ పాశమున నొక కేశముపై పేను ప్రాకుచున్నది. ప్రేక్షకుల కన్న పేను ఎంత దగ్గరగా నున్నను దాని కామెపై నాటకపాత్ర బుద్ధిగాని, ప్రేక్షకులకున్న వ్యామోహముగాని లేదు. కారణమేమి? పేను లోకము నటీమణి కేశమేగాని

ఇంకేమియు లేదు. పేను లోకమున అంతకుముందు 'నటీమణి' పుట్టి యుండలేదు. ఇట్లు ఎవరి సంస్కారమును బట్టి వారు తమ లోకమున మేల్కొని యుందురు. మిగిలిన లోకములయందు మేల్కాంచని వాని కవిలేవు. చీమకు 'ఆ యిల్లాలి భర్త' యెడల అజ్ఞానము లేక చీకటి. పేనునకు 'నటీమణి' చేయుచున్న కళోపాసన యెడల చీకటి లేక నిద్ర.

అట్లే మన భూమిపై నొకప్రక్క సూర్యరశ్మి పడి పగలు అగుచుండగా రెండవ ప్రక్క చీకటిపడి రాత్రి యగుచున్నది. కొందరకు మెలకువగల సృష్టి; కొందరికి నిద్ర గల ప్రళయము. ఇంద్రియముల యందు తిరుగుచున్న మనస్సునకు తాను అనబడు మానవుని యెడల నిద్ర, ఇంద్రియముల యెడల మెలకువ. అనగా తనకంటె నితరమైన వానియం దాతడు మేల్కాంచి యున్నాడు. తనయందు నిద్రించుచున్నాడు. మనస్సు మేల్కాంచి యుండి, ఇంద్రియములు పనిచేయుచుండి, బంధుమిత్రాదులు కనిపించుచుండి, వాని సంభాషణలు వినిపించుచుండి, వారి చేష్టలు గోచరించుచుండి, వారి యాస్తి పాస్తులు తనకు తెలిసియుండి, భూమ్యాకాశ ఖగోళాది శాస్త్ర రహస్యములు తెలియుచుండి, 'తా నెవరు?' అను నంశము గమనికకు రాదు. అదియొక లోకము, ఇదియొక లోకము. తాను గమనించిన లోకము నందలి విశేషము లన్నిటియందును తాను మేల్కాంచి యున్నాడు. ఆ యిల్లాలి భర్త శరీరముపై ప్రాకుచున్న చీమకు ఆ శరీరముపై ముడుతలు, రోమములు, సుగంధ దుర్గంధాదులు ఎంత సూక్ష్మముగా పరిచయమో అంత సూక్ష్మముగా సకల శాస్త్రముల యందును మానవునకు పరిచయము కలుగుచున్నది. ఇట్లు పరిచయము కలిగించుచున్న వాడెవడు? అను నంశము మాత్రము వానికి చీకటి. ఈ యంశమునందు వాడు నిద్రించుచున్నాడు. వానికి మనస్సు, ఇంద్రియములు, బాహ్య ప్రపంచముల యందు పగలు వర్తించుచున్నది.

ఆత్మచే బుద్ధి ద్వారమున మనస్సును, ఇంద్రియములను, దేహమును నిగ్రహింపజేసికొనిన వానికి తనయందు మెలకువ లేక పగలు వర్తించుచున్నది. అట్టి వానికి ఇంద్రియార్థముల యందు రాత్రి వర్తించుచున్నది. అనగా తన ఇంద్రియముల మూలమున మనస్సునకు గోచరించు నామరూపాదులు, వ్యక్తుల బంధుత్వములు, శత్రుత్వ మిత్రత్వాదులు, గృహ క్షేత్ర ధన దారాది

సంపదల విలువలు మున్నగునవి వానికి వర్తింపవు. వానియందతనికి అప్రవృత్తి లేక చీకటి వర్తించును. ఇంద్రియములలో చరించువానికి ధనమొక విలువైన వస్తువు. ఆత్మవంతునకు ధనము సాధనమే గాని, దానికి అని వేరు విలువ యుండదు. అట్లే పొలము పంట పండు సాధనమే గాని దానియందు విలువ ప్రత్యేకముగ లేదు. ధాన్యము జీవుల యాకలి తీరుటకేగాని నిలువజేసికొనుటకు కాదు. గృహము ఎవరికైనను వసతి యని యతనికి తెలియునే గాని అది తనది యను భావముండదు. భార్య తనవలె నొక జీవుడే గాని తనది కాదు. అట్లే సంతానాదులును. వారితో తనకు గల సంబంధము తన కర్తవ్యమగు నియత కర్మాచరణమునకు సాధనమే గాని బంధనము కాదు. సుఖదుఃఖా దులు వచ్చుచు పోవుచుండు చిత్ర సన్నివేశములే గాని తనపై ప్రభావము చూపునవి కావు.

ఈ విధముగా ఆత్మయందు మేల్కొనిన వానికి ఇంద్రియాదులకు గోచరములగు విలువలయందు రాత్రివంటి స్థితి వర్తించును. అనగా సుముఖత గాని, విముఖతగాని యప్రవృత్తి వర్తించును. ఇంద్రియాదుల యందు మేల్కొని యున్నవాడు అయుక్తుడు లేక పామరుడు. ఆత్మయందు మేల్కొనినవాడు చూచుచున్న మౌని. ఈ రెండింటి నెరిగినవాడు యోగి. **(69)**

మరి ఆత్మజ్ఞానము కలవానికి ఆకలిదప్పు లుండవా? దారాపుత్రాదు లుండరా? తత్కారణముగా ధనధాన్యాదులు, స్థిర చరాస్తుల ఆర్జన ముండదా? అన్నవస్త్రములు, గృహక్షేత్రాదులు నక్కరలేదా? అక్కరలేదని గాని కావలెనని గాని వానికి లేదు. వానిచే నియత కర్మలు కర్తవ్య రూపమున నాచరింపబడు చుండును. వాని ఫలితములను గూర్చిన సంకల్పము వానికి లేదు. కాని ప్రతి కర్మకును నొక ఫలితముండును. అత డాచరించు కర్మలకును ఫలితము లుండును. అవి యతడు కోరినవి కావు. వానియంతటవె నవియే సిద్ధించు చుండును. ఫలాపేక్ష లేకుండుటచే అతని మనస్సు దుష్కర్మల వైపునకు ప్రేరేపణ చెందు కారణములు నశించును. నియతకర్మ లేక యజ్ఞార్థ కర్మ యను పేర సత్కార్మాచరణమే జరుగుచుండును. కనుక ఫలితములలో కూడ సత్ఫలితములే అయాచితములుగా సిద్ధించు చుండును. సంగీత నాట్యాది కళలను ధనము కోరి యభ్యసించు వారికి ఆ కళల వలన కోరబడినదై ధనము

సిద్ధించును. ఆకర్షణ కోరినవానికి ఆ లలితకళలే స్త్రీ దోష మద్యపానాది వ్యసనములకు దోహదము లగును. అట్టి వానికి తన గాన మాధుర్యముపై తన దృష్టి ప్రసరించు చుండును. అట్లుగాక త్యాగరాజువలె ఆత్మానందమునకు అనగా భగవంతున కంకితముగా గానకళ సాధించిన వానికి అప్రయత్నముగా ఆనందానుభూతి కలుగుటయే గాక తన సత్ప్రవర్తన వలన అసమాన కళా విలాసమున లోకాకర్షణయు, గౌరవము సంభవించియూ తన్ను స్పృశింప కుండును. తత్ఫలితముగా అప్రయత్నమైన జీవనోపాధియు కోరిన వారికన్న మిన్నగనే సిద్ధించును. ఏదో ముఖ్య విషయము సంభాషించుచున్న వారికి కనులు తెరచియున్నను కంటి యెదుట నున్న గోడలు, చిత్రపటములు మున్నగునవి కనిపించుట యెట్లు సంభవింపదో, అట్లే ఆత్మ విషయమున అనుభూతిలో నున్నవారికి మిగిలినవి గోచరింపవు. పుత్రికకు పెండ్లి సంబంధము కుదరిన సంతోష సంభాషణలలో నిమగ్నుడై యొకడు పంచభక్ష్య పరమాన్న ములు భుజించుచున్నాడు. వాని రుచుల యందు అతనికి దృష్టి లేకున్నను జిహ్వకు కావలసిన సౌఖ్యము, గర్భకోశమునకు కావలసిన ఆకలి తీరుటయు అప్రయత్నముగ సంభవించుచున్నవి. అట్లే లోక విషయములయందు అప్రవృత్తి ఏర్పడిన వానికి కృషికర్మాది వృత్తులును, ధన ధాన్యార్జనము, గృహ దార క్షేత్రాదుల ఆగమనము సంభవించుచునే యుండును.

దేహేంద్రియాదులు సౌఖ్యము, పరితృప్తిని పొందుచునే యుండును. అతడు మాత్రము సముద్రునివలె నిశ్చలముగ వర్తించును. నదులన్నియు ప్రవహించి వచ్చి సముద్రుని లోనికి తమ జలములను సంగమింప జేయు చున్నవి. అందు ఏ నదిని అతడు కోరలేదు. ఏ నదియు మానలేదు. వర్ష కాలమున నదులు హెచ్చుగా వరదలను గ్రుమ్మరించినను సముద్రు డుప్పొంగుట లేదు. వేసవి కాలమున నదుల రాబడి తగ్గినను ఆతడు శుష్కించుట లేదు. మరియు నదులలో కొట్టుకొని వచ్చిన బురద మున్నగునవి సముద్రుని స్థితిని మార్చుట లేదు. నదుల జలముల రుచుల భేదములు సముద్ర జలముల రుచిని మార్చుటలేదు. తామే తమ ప్రత్యేకతలను కోల్పోయి సముద్రుని స్పర్శతో సముద్రత్వము నందుచున్నవి. అట్లే ఆత్మజ్ఞానము కలిగినవాని దేహేంద్రియ మనస్సులకు గోచరములైన విషయము లేవియు

రాగద్వేషాదులు కలిగింపక వానియందు సామ్యము చెందుచున్నవి. ఇట్టి స్థితిని పొందినవాడే సంయమము చెందును. వాని యనుభూతియే శాంతి యనబడును. ఏ సుఖమును కోరినవాడును ఆ సుఖము నందు శాంతిని బొందడు. కోరుటలో సంయోగ వియోగ దుఃఖముండును. సంయమము గలవాని కిది యుండదు. (70)

## బ్రాహ్మీస్థితి :

కుండ బ్రద్దలైనప్పుడు పెంకులగును. ఒక్కొక్క పెంకునందు కుండ యొక్క కొంత భాగముండును గాని పెంకులు కుండగా పనిచేయవు. అవి కుండకన్న ఇతరత్వము నొందును. ఆ స్థితిలో కుండ లేకుండుట సంభవించు చున్నది. కుండ భాగము లుండికూడా కుండ యుండదు. అట్లే మనుష్యుడు మనస్సుగా దిగివచ్చి, యింద్రియములలో నుండి బాహ్యప్రపంచ విషయము లగు శబ్ద స్పర్శ రూప రస గంధము లనుభవించు చున్నప్పుడు ఆత డింద్రియ గోచరములైన విషయములుగా మారిపోవును. అట్టి స్థితిలో అవి అతని భాగములేగాని అతనిలోని భాగములు కావు. అనగా అతనికన్న ఇతరములుగా వర్తించును. అట్లు వర్తించుచున్నపుడు అతడుండడు. మానవుడనగా అఖండ స్వరూపుడు - లేక - ఆత్మ. ఇంద్రియార్థములు ఖండ స్వరూపములు లేక అనాత్మ. బాహ్య ప్రపంచమందున్న సమస్తము ఆత్మయే యైనను వానియందు గల యింద్రియముల ప్రవృత్తి అనాత్మ లేక యితరము అగుచున్నది. ఇట్లు బాహ్య వస్తువులందు జీవు డాకర్షింపబడుట కామము అనబడును. ఒక్కొక్క విషయమునందు ఒక్కొక్క కామము భాసించి అనేకము లగును. అందు కొన్నిటి ప్రవృత్తి సుఖస్పర్శను, మరికొన్నిటి ప్రవృత్తి దుఃఖ స్పర్శను మనస్సునకు కలిగించును. అందు సుఖస్పర్శ కామ మనియు, దాని విపరీతస్పర్శ క్రోధ మనియు వ్యవహరింపబడును. వాస్తవమున కివి యన్నియు కామములే. అట్లే క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులును. బాహ్య వస్తువులయందు స్పృహ కలుగనపుడు నరుడుండును. కామ ముండదు. ఇది యెట్లు సాధ్యమగును? ఇంద్రియములను బాహ్య స్పర్శనుండి ఖండించుట వలన సాధ్యమగునా? కాదు. కన్నులు మూసికొన్నంత మాత్రమున నెదుటనున్న వస్తువును స్మరింప కుండుట యెట్లు? మనస్సు బాహ్య వస్తువునందు లగ్నమైనపుడు ఇంద్రియముల నాపియు లాభము లేదు. మనస్సును మరియొక వస్తువునందు లగ్నము

చేయగలిగినపుడు ఇంద్రియములు ఎదుటి వస్తువును విడచి, మనస్సుతో వెనుకకు మరల్చబడును.

మనస్సు నిట్లు మరల్చుట ఎట్లు? మరల్చవలెనను పట్టుదల వలన లాభము లేదు. మరల్చవలెనని మనస్సునకు మనము బోధించినచో అది మరల మనకు బోధించును. దానివలన చాంచల్య మెక్కువగును గాని మనస్సు మరలదు. కనుక మనస్సును పట్టజూచుటవలన వ్యర్థప్రయత్నమే మిగులును. బాలకుడు ఒక కూడని పదార్థమును తినుటకు అభిలాష పడుచున్నప్పుడు వలదని వారించుట వలన లాభము లేదు. అత డేడ్చుట నారంభించును గాని అభిలాష మానడు. వానికి ఇంకొక పదార్థమును జ్ఞప్తి చేసి, అభిలాష కలిగింప గలిగినచో అప్రయత్నముగా మొదటి పదార్థమును గూర్చి యతడు మరచిపోవును. ఇది యొక్కటే మరలించుటకు మార్గము. కూడని పదార్థము నుండి ఆరోగ్యకరమగు పదార్థము వైపునకు మరల్చవచ్చును. అట్లే మనస్సు యొక్క స్మరణను మానిపించుటకు యత్నము చేయుటకన్న మరియొక మంచి విషయమును స్మరించు యత్నము చేయుట మంచిది. యోగసాధన చేయువాడు మనస్సును కట్టుటకు యత్నించుటకన్న మంచి విషయముపై నభిలాష కలిగించు యత్నము చేయవలెను. అట్టి మంచి విషయము దైవము. దైవమును ధ్యానము చేయమన్నచో దానిని తనకన్న వేరు విషయముగా మనస్సు ధ్యానము చేయును. అనతికాలముననే దానినుండి మరియొక విషయమునకు మనస్సు మరలును. ఇట్లు మనస్సు మోసము చేయుచునే యుండును. అట్లుగాక 'నేను' అను మాట కర్థమగు వెలుగును ధ్యానము చేసినచో మనస్సు 'నేను' లోనికి మాయమగును.

వస్త్రమున నే పదార్థమును మూటగట్టినను దాని వాసన వస్త్రమున కంటును. నిప్పును మూట గట్టినచో నిప్పు వాసన వస్త్రమున కంటక, వస్త్రము నిప్పై దగ్ధమగును. అట్లే మనస్సుతో దేనిని ధ్యానించినను దాని వాసన మనస్సున కంటును. 'నేను' నిప్పు వంటిది. 'నేను' ను ధ్యానించినచో మనస్సు లీనమై 'నేను' మిగులును. మనస్సు లీనమైనప్పుడు స్పృహ యుండదు. అనగా కామ ముండదు. 'నాది' అను స్పర్శ యుండదు. అనగా మమకారము నశించును. ధ్యానించుచున్న వస్తువు కన్న మనస్సు వేరుగా నున్నపుడు కలుగు 'నే' నను

భావమే అహంకారము. మనస్సు లయమగునపుడు అహంకారము కూడ నశించి 'నేను' మిగులును. అప్పుడు గల అనుభూతినే శాంతి యందురు.

**(71)**

సృష్టిలోని ప్రతి యణువు నందును అహంకారము లేని 'నేను' ఉండును. ఒక్కొక్క యణువు నందున్న ఈ 'నేనే' ఆత్మ. అన్నిటి యందున్న ఈ 'నేనే' బ్రహ్మము. ధ్యానించువాడు వేరుగా నిలబడునప్పుడు స్థితియే మనస్సు. అట్లు కాక అన్నిటియందున్న 'నేను' అనుభవింపబడునప్పుడు గల స్థితియే బ్రహ్మము ననుభవించుట. ఇదియే బ్రాహ్మీస్థితి. దీనిని పొందినవాడు విమోహము నొందడు.

వస్త్రమును చూచుచున్నప్పుడు అందలి నూలుపోగులు, ప్రత్తియు జ్ఞప్తి యుండక, వస్త్రము, దాని రంగు మున్నగు ధర్మములే జ్ఞప్తి యుండుట సంభవించును. ఇదియే మోహము. సృష్టి యందలి బ్రహ్మము జ్ఞప్తియందుండక, సృష్టిలోని వస్తువులు, వాని నామరూపాదులు, వానితో మనకు గల సంబంధము మాత్రమే జ్ఞప్తి యుండుట మోహము వలననే కలుగుచున్నది. 'నేను' నందు ధ్యానము నిలిచినపుడు మోహము తొలగి స్వస్వరూపము భాసించును. దీనిని సాధించినవాడు బ్రాహ్మీస్థితియం దుండును. అతడు అంతము చెందు కాలమున కూడ బ్రహ్మమునందే యుండును.

అంతము చెందుట యనగా శరీరము విడచుటయని లోకమునందు అర్థము. కాని వాస్తవమునకు మనస్సు అంతము చెందుటనే అంతకాల మనవలెను. ఉదాహరణకు - నిద్రించుచున్న వానికి గూడ నిద్రించు చున్నంత సేపును వాని శరీరము వాని కుండదు. సంగీత నాటకాదులలో తాదాత్మ్య మనుభవించుచున్న వానికికూడ శరీరము, పరిసర వస్తువుల స్ఫురణయు నుండదు. అప్పుడును మనస్సు లీనమై నాదము మున్నగు సాధనముల వలన బ్రహ్మము ననుభవించుటచే మనస్సునకు అదియును అంతకాలమే. అట్లే 'నేను' నందు లీనమైన మనస్సు కలిగినపుడు కూడ మనస్సుండదు. కనుక శరీరాదులు, పరిసర వస్తువులును అస్తిత్వము చెందవు. యోగి పరిభాషలో ఇదియే సరియైన అంతకాలము. ఇందే సమస్త సృష్టియు తనయందు లయ మందును. దీని నభ్యసించువాడు బ్రాహ్మీస్థితి యందుండి మోహము చెందక, అంతకాలమున శాశ్వతమగు బ్రహ్మత్వము నొందును. **(72)**

మూడవ అధ్యాయము

# కర్మ యోగము

## గురువు - శిష్యుడు :

తత్త్వము తెలియగోరు విద్యార్థికి (వయస్సుతో నిమిత్తము లేదు) తన తత్త్వమున నొకే వస్తువుతో చేయబడిన పదార్థములు గోచరించును. (వస్తు వనగా వసించునది. పదార్థ మనగా స్థితులకు గురియై తెలియబడుటకు ఒక వేరు పదము నర్థించునది.) ఆ వస్తువే తాను. అందలి మూడు పదార్థములే వెలుగు, తెలివి, శక్తి. అందు శక్తి ప్రాణ మనబడును. దాని భౌతికమైన యుప కరణమే శరీరము. తెలివికి గమ్యము వెలుగును తెలిసికొనుట, అనగా అనుభ వించుట. దీనినే జ్ఞాన మందురు. శక్తికి గమ్యము దేహముయొక్క ఆవశ్య కతలను చక్కబెట్టుట, ఇతరుల ఆవశ్యకతలను కూడ చక్కబెట్టుట. దేహ ధారణము వలన కలుగుచుండు మలిన స్థితులు జ్ఞానమునకు విఘ్న కారణము లగును. వానిని తొలగించి సంస్కరించుట కూడ ప్రాణ మనబడు శక్తికి కర్తవ్యము. దీనినే కర్మాచరణము అందురు. మలాదులచే జ్ఞానమునకు పొర లేర్పడి కర్మకు బంధ మేర్పడును. పొర లేర్పడుటను అహంకార మందురు. దీనివలననే కర్మబంధ మేర్పడి సుఖ దుఃఖములు కలుగుచుండును. ఈ మొత్తమును సంతరించుకొని బాట ఏర్పరచుకొనుటకై తోడ్పడు గురువు మొట్టమొదటగా నుపదేశించునది జ్ఞానము - కర్మ అను వానియొక్క ప్రాధాన్య వివక్ష. గమ్యము జ్ఞానము గనుక సకల కర్మాచరణములకు జ్ఞానమే పరమావధి. అనగా కర్మ కన్న జ్ఞానము ముఖ్యము.

ఈ చివరి వాక్యమును తత్త్వజిజ్ఞాసువు కొంచెము వక్రముగా అర్థము చేసికొనుట కవకాశ మున్నది. అది యెట్లనగా కర్మకన్న జ్ఞానము ముఖ్యము

గనుక, కర్మను విడచి జ్ఞానమునే యేల ఆశ్రయింపరాదు? ఆచరించు పనులలో కొన్ని సాధువులు, కొన్ని ఘోరములు నుండుట తప్పదు. ప్రతి కర్మకును రాగద్వేషాదు లంటుకొను నవకాశ మున్నది. కనుక ఈ కర్మలను పరిత్యాగము చేసినచో బాగుండు ననిపించును. కాని సత్య మేమనగా దేహయాత్రకు కర్మాచరణము తప్పదు. కర్మకును జ్ఞానమునకును ప్రాధాన్యమున భేద మున్నది గాని, కార్య కారణ సంబంధము కూడ నున్నది. ఆకలి తీరుట ముఖ్యము గాని వంటచేయు బెడద యెందుల కనవచ్చునా? ఒక ప్రయాణము చేయవలసినపుడు సౌకర్యములు కలిగించుకొనుట ఒక్కొక్కప్పుడు శ్రమ కలిగించును. సౌకర్య మప్రధానము గదా! దాని ప్రయత్నము నాకేల? ప్రయాణ మొక్కటే ముఖ్యము అన్న ధోరణిలో సమంజసత్వము లేనట్లే, కర్మను విడచి జ్ఞానము సంపాదించుటలో హేతువు లేదు. అనగా సాధ్యము కాదు. సాధ్యము కానిది మార్గమువలె కనిపించినను అది భ్రాంతియే గాని మార్గము కాదు.

అర్జునుడు తన గురువు నిట్లు ప్రశ్నించెను. "కర్మకన్న బుద్ధియే గొప్పదని నీ నమ్మకమైనచో నన్ను మరల ఘోర కర్మయగు ఈ యుద్ధము చేయుమని బోధింతువేల? రెండును వ్యామిశ్రము (కల్తీ) చేసి నా బుద్ధిని మోహ పెట్టు చున్నావు. దానిని మాని నాకేది శ్రేయస్సో దాని నొక్కదానినే నీవే నిశ్చయించి తెలుపుము."

ఇచ్చట అర్జునునకు కర్మయందున్న ఘోరత్వము, అసౌకర్యము తెలియును. ఈ ఘోరత్వము తనవారిపై మమకారము వలన కలిగినది. ఇంకొకరిపై యుద్ధమైనచో అది ఘోరకర్మగా తోచియుండెడిది కాదు. ఈ దోషమునే విషాద స్థితి యందురు. గురువుల దృష్టిలో అది 'క్షుద్రము, హృదయ దౌర్బల్యము, క్లైబ్యము'. కనుక అర్జునుడు ఆ నింద తనపై నుండి తొలగించు కొని భారము గురువుపైకి నెట్టుటకు యత్నించుటయే యీ ప్రశ్న. "క్షుద్రమని తిట్టితివి గదా! దాని త్రిప్పలు నీవే పడి, దాని పైనున్న జ్ఞానమును సూటిగా ముద్దచేసి నా నోటి కందించుము" అని యీ ప్రశ్న కర్థము. అట్లందించుటకు గురువున కభ్యంతరము లేదుగాని, జ్ఞానానుభవము పదార్థము కాదు గనుక, నెవనికి వాడు అంగీకరించి, అందు వసించవలసినదే గాని యొక డందించునది కాదు. దాని నందుకొనుటకు వలసిన దారి చూపుచు గురువు అగ్రగామియై

నడిపించును. శిష్యుడు దాని ప్రకార మాచరించుకొని అనుభవమును చేరుసరికి గురువునందు వసించును. జ్ఞాన మనగా ఆత్మ (తాను) తప్ప గురువను మరియొక వ్యక్తి కాదు.

తన కొరకు నిశ్చయించి శ్రేయోదాయకమగు మార్గమును చెప్పుమని శ్రీకృష్ణుని అర్జును డడుగు చున్నాడేగాని ఆచరించుటకు ఇంకను సిద్ధముగా లేడు. పొరలు అడ్డున్నవి. లేనిచో యుద్ధము చేయుమని నిశ్చయముగా చెప్పినపుడు మరల తన శ్రేయస్సును గూర్చి నిశ్చయించి చెప్పుమని యడుగుట జరుగదు. చెప్పినది తనకు సదుపాయము కాదు గనుక, తన విషాదయోగము నకు అసౌకర్యముగా భాసించునది గనుక, దానిని మార్చి, మరల సౌకర్య వంతముగా నిర్ణయింపుమని కూడ ఈ ప్రశ్న కర్థము. అప్పుడు సద్గురు వేమి చేయవలెను? యుద్ధము చేయుమని తాను పూర్వము నిర్ణయించిన దానినే మరల నొక్కి చెప్పవలెనా? లేక పద్ధతి మార్చుకుని శిష్యుని భావమున కనుకూలముగా చెప్పవలెనా? అతడు రెండును చేయడు. మొదటిది శిష్యుని మనోవికాసమును సంకోచింప జేయును. విచ్చుకొనుచున్న పూవురెక్కలను తన కనుకూలమైన ఆకారములోనికి తోటమాలి దారము కట్టినట్లగును. ఇక రెండవ మార్గమనగా, తెలిసి శిష్యుని తప్పుత్రోవ పట్టించుట. ఇప్పుడు గురువేమి చేయవలెను?

ప్రస్తుతాంశమును విడచి యిట్టి పరిస్థితిలో పూర్వులగు పెద్ద లెట్లు నిర్ణయించిరో, ఎవరెట్లు పొరబాటు పడిరో, ఎవరెట్లు పరిష్కరించుకొనిరో అను నంశములను గంభీరముగా నుపన్యసింప నారంభించెను. దానితో శిష్యుని మనఃప్రవృత్తిలో లోప మెచ్చట నున్నదో దానిని తెలియకుండ సవరించు విధాన మున్నది. వానినే సక్రమముగా దర్శనము చేయించు ఉపాయము నవలం బింపవలెను గాని, తాను చేసిపెట్టుటలో పరిష్కారము లేదు. అసలు కృష్ణావతారమే చేయించుటకు వచ్చినది గాని, తాను ధర్మము చేసి రక్షించుటకు కాదు. కనుకనే రాముని వలె కృష్ణుడు రాజు కాడు. తన సంసర్గము చెందిన వానిని తననుగా చేయవలెను గాని, తాను వేరుగా వానికై చేసిపెట్టరాదు. యుగ ధర్మముల మనఃప్రవృత్తి భేదమును బట్టి యీ భేద మేర్పడును. (1,2)

## జ్ఞానము - కర్మ :

భౌతిక శరీరము, ప్రాణశక్తి, తెలివి, వెలుగు అను నాలుగంశముల సమన్వయ జీవితమే యోగమని తెలిసికొంటిమి. అందు సాధనకు ప్రారంభ మెక్కడ? భౌతిక శరీరము కదలునది ప్రాణశక్తి వలన. ఈ రెండును ప్రవర్తింప జేయబడునది తెలివి వలన. ఏ కర్మ లాచరింప వలెను? వేని నాచరింపరాదు? అను నంశములను నిర్ణయించుటకు తెలివి కావలెను. కనుక జ్ఞానము నుండి యారంభ మగునని కొందరి మతము. వీరిని సాంఖ్యులందురు. వీరి మార్గమున తెలివిని పరిశుభ్రపరచుకొని, చక్కజేసికొని, దాని వెలుగులో సత్కర్మ నాచరింప వలెను. దుష్కర్మ లాచరించినచో తెలివి కలుషితమగును. కనుక కర్మల మంచి చెడ్డలు తొలుత తెలిసికొని, పిదప ఆచరణమునకు దిగవలెను.

సత్కర్మాచరణము లేనిదే తెలివి పరిశుభ్రపడదు. కనుక సాధన మారంభించుట కర్మయోగముతో నారంభ మగునని కొందరి మతము. తొలుత దుష్కర్మ లాచరించుట మాని, సత్కర్మ నారంభింపవలెను. అయినను ఈ కర్మల వివేకమునకు తెలివి యావశ్యకము గదా! ఆరంభించుట ఎక్కడ? ఘోర కర్మయగు యుద్ధమును తొలుత మానవలెనని అర్జునుడు భావించు చున్నాడు. ఇందు దుష్కర్మను ఫలితమును బట్టి తెలిసికొనుట, పరిహరించుట అను ప్రయత్నమున్నది. అనగా సాంఖ్యము, యోగము కలిసియే వర్తించు చున్నవి. తప్పులేదు. కాగా అర్జునుని తెలివి కలుషితమైనది. అట్టి స్థితిలో నిర్ణయమునకు పూనుకొనుచున్నాడు గనుక సన్మార్గావలంబనకు విలంబనము జరుగుచున్నది. ఇక సందేహము తీరుట కవకాశము లేదు. ఇట్టి తావుననే గురువు మార్గోపదేశము ఆవశ్యకమగును. కృష్ణు డిట్లు వివరించుచున్నాడు. కర్మాచరణము మానుట వలన జీవుడు కర్మ మానిన వాడగునా? సంకల్పముగా బయలుదేరిన కర్మలను దేహ మాచరింపకుండ నిలిపినచో అది సన్న్యాస మగునా? దానివలన యోగసిద్ధి లభించునా? కలిగిన పరిస్థితిని పరిష్కరించు కొనుటతోనే యోగము గాని, సాంఖ్యము గాని ఆరంభమగును. ఈ సంకల్ప మున్నంతవరకు కర్మ సంకల్పములు గాని, కర్మలు గాని బంధింపవు. (3)

శరీరము పాంచభౌతికము. భౌతిక ద్రవ్యము అణుమయము. ఈ

మొత్తము శక్తిమయము. ఈ శక్తి త్రిగుణాత్మకమగు ప్రకృతి నుండి వ్యక్తమగు చున్నది. ఎవని లోపలి త్రిగుణముల సమ్మిశ్ర లక్షణము, వాని ప్రకృతి లేక స్వభావమగును. దీనిచే దేహము, ప్రాణము, తెలివిలోని భావమగు మనస్సు బద్ధమై యుండును. దీని నుండి కర్మ సంకల్పములు పుట్టి, కర్మాచరణముగా వ్యక్తమగును. దీనిపై మనస్సున కధికారము లేదు. అట్టిచో కర్మలను నిగ్రహించుట, సత్కర్మలను స్వీకరించుట, దుష్కర్మలను పరిహరించుట జరుగదు. ఇక కర్మ మాచరింపకుండ మనస్సు దేహమును నొక్కిపట్టవచ్చును. దీనివలన లాభము లేదు. పుట్టునట్టి సంకల్పములు ప్రకృతినుండి పుట్టు చుండగా, మనస్సు శరీరము నాపుట కర్మయొక్క అభావమును కలిగించదు. స్వభావమున సంకల్పములు బయలుదేరుచుండగా మనస్సు ఆచరణమును ఆపుటవలన నేమి ఫలితము? అర్జునునిలో యుద్ధ స్వభావ మున్నది. అతడు జన్మచేత క్షత్రియుడు. కనుక స్వభావ కర్మయు క్షాత్రమే. ధర్మమును రక్షించుట క్షత్రియ స్వభావము. అతడు దేహముచే యుద్ధాచరణము మానినను, యుద్ధము మానినట్లు కాదు. సత్కర్మ, దుష్కర్మల వివేకము మనస్సున కతీత మైనది. అది తెలివిలో బుద్ధియను పొరలో నున్నది. దానికి మమకారాది వ్యామోహము లంటవు. నిర్ణయ మచ్చుట జరుగవలెను. చనిపోవువారు బంధువులా, కారా యన్న దానిపై బుద్ధి నిర్ణయ మాధారపడదు. **(4)**

మనస్సు, ప్రాణము కలిసి ఇంద్రియ ప్రవృత్తులుగా భౌతిక కర్మాచరణము జరుగుచుండును. వ్యక్తి స్వభావము దానిపై పనిచేయును. బాహ్య ప్రపంచ మందలి ఇంద్రియార్థములు మనస్సును, ఇంద్రియములను ఆకర్షించు చుండగా, వ్యక్తి స్వభావము ప్రేరేపణ చెందుచుండును. అందు నిమగ్నమైన మనస్సు నిర్ణయమునకు పనికిరాదు. అట్టి మనస్సుతో కర్మేంద్రియములను బంధింపరాదు. అది దమ మనిపించుకొనదు. ఒక క్షణమైనను కర్మ లేకుండ నెవ్వడు నుండజాలడు. కర్మ యనునది వ్యక్తి స్వభావముగా ప్రకృతి చేయించు చున్నది గాని, చేయబడుచున్నది కాదు. మనము చేయునది మానునది కర్మ యనుకొనుట పొరబాటు. చేయుట, మానుట అను సంకల్పములను పుట్టించు చున్నది స్వభావము. అట్టిచో ఇంద్రియార్థముల నుండి ఇంద్రియములను

బంధించువాడు మనస్సులో స్మరణ రూపమున అవే కర్మలను చేయు చుండును గనుక కర్మ చేయనివాడు కాడు.

ఇంద్రియ నిగ్రహము, మనస్సును జయించుట అను ప్రయత్నములు యోగాభ్యాస మనుపేర శ్రమపడువారిచే చిరకాలము చేయబడుచు నుండును. సరియైన మార్గమున ప్రయత్నము జరిగినపుడు మాత్రమే ఈ జయము సిద్ధించును. లేనిచో శ్రమయే మిగులును. మనస్సులోని అభిప్రాయములను మనస్సుతోనే ఎదుర్కొనుట సాధ్యపడదు. ఇది ఒకడే తన రెండు చేతులతో పోటీపడుట వంటిది. మనస్సులోని యభిప్రాయము లన్నియు ఇంద్రియముల మూలమున వెలుపలి జగత్తులో నేర్పడిన పరిచయముల వలన కలుగుచున్నవి. ఇట్లు కలిగిన అభిప్రాయములు కారణముగా సంకల్పములును, కోరికలును, వాని కనుగుణముగా కాలుసేతులు మొదలగు కర్మేంద్రియముల కదలిక యును, సంభాషణాది వైఖరులును ఏర్పడుచున్నవి. ఈ వైఖరులను మనస్సుతో నిగ్రహింప యత్నించువాడు డంబాచారము వాడు. కర్మేంద్రియ చేష్టలకు కారణమైన కోరికలు ఆగకుండ, కర్మేంద్రియములను ఆపి అదిమిపట్ట యత్నించుట వాంతి నాపుకొనుట వంటిది. దాని వలన యోగము సిద్ధింపక పోగా విపత్తు కలుగవచ్చును. యోగమనగా సామ్యస్థితిగాని, నోరునొక్కుట కాదు. యోగమునకు ఫలము ఆనందము గాని, ప్రాణసంకటము కాదు. యోగసాధనమున కావలసినది కర్మకౌశలముగాని, కార్మిక క్లేశము కాదు. (5)

## నియత కర్మ :

జ్ఞానేంద్రియములు మనస్సుచే నియమింపబడి, తమ కర్మలయందు కర్మేంద్రియములను నియోగించి ఆచరించినచో కర్మయోగ మారంభమగును. మనస్సు ఇంద్రియములను నియమింపవలెను. జ్ఞానేంద్రియము లవలంబింప వలెను. కర్మేంద్రియము లాచరింపవలెను. అనగా మనస్సు ఇంద్రియములతో కలియరాదు. ఇంద్రియములను తన లోనికి స్వీకరింపవలెను. దానితో యోగ మారంభ మగును. కంటి యెదుట అందమైన వస్తువున్నప్పుడు ఆ వస్తువును కన్ను చూచుచుండును. అనగా కంటి ద్వారమున మనస్సు చూచుచుండును. ఇది వ్యక్తి స్వభావ ప్రేరేపణమగు కర్మసంకల్పము. దీనివలన చూచుట యను కర్మ జరుగుచున్నది. అప్పుడా వస్తువునందు అతనికి రాగద్వేషము లేర్పడు

చున్నవి. వానిని పరిహరించుటకు కన్ను మూసినను మనస్సు చూచుచునే యుండును. అది కర్మ మానుట కాదు. రాగద్వేషము లంటుట మానలేదు. అట్లుకాక మనస్సు మరియొక ఉత్తమ సంకల్పముచే నాకర్షింపబడినప్పుడు చూచుట యను కర్మయందు ప్రవర్తించుట మానును. కన్ను తెరచియున్నను కంటి యెదుటి వస్తువే కనిపించనపుడు రాగద్వేషముల ప్రసక్తియే లేదు. ఈ విధముగా మరియొక తావున నియమింపబడిన మనస్సు ఇంద్రియములను నియమించి, కర్మలనుకూడ నియమించును. అపుడు తెలియకయే వ్యక్తి స్వభావము కూడ నియమింపబడును. త్రిగుణాత్మక ప్రకృతిలో సామ్య మేర్పడును. ఈ సామ్యమే యోగము. ఇట్లు నియతకర్మ వలన సర్వము చక్క బడును. సరియైన సాధకుడు సాంఖ్యముతో కర్మయోగమునుగాని, కర్మతో సాంఖ్యమునుగాని సరిచేసికొన నక్కరలేదు. నియతకర్మతో నారంభమై రెండును చక్కబడును. నామ జపమునందు మనస్సు నిలువక ఇంద్రియములను త్రొక్కు కొనువాడు సంగీతమును జతపరచినచో, మనస్సు నియతకర్మగా నామ జపము నందు లయమగుట, ఇంద్రియ ప్రవృత్తులు మనస్సునందు లయమగుట జరుగుచున్నవి గదా! ఇది ఆచరించుట, మానుట అనువానికి సంబంధించినది కాక, నియమింపబడుట అను పద్ధతికి సంబంధించినదై యున్నది. ఇందు మనస్సును దమించుట గాక, మనస్సాకర్షింపబడుట జరుగవలెను. దీనికి బుద్ధినుండి బయలుదేరిన నియమము కారణ మగుచున్నది. (6)

కనుక బుద్ధిమంతుడు తొలుత మనస్సును జ్ఞానేంద్రియములపై ప్రయోగింపవలెను. కర్మేంద్రియములను నొక్కిపట్టక ఫలితము కోరని కర్మ ప్రవృత్తుల యందు నియమింపవలెను. భృత్యులను తగిన పనిపాటలయందు నియమింపవలెను గాని, నోరు నొక్కి కూర్చుండబెట్టుట వలన ప్రయోజనము లేదు. సాధనకు కావలసినది నియమములుగాని నిబంధనలు కావు. కనుక మొట్టమొదటగా మనస్సుచేత జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను నియమించుట జరుపవలెను. జ్ఞానేంద్రియములను నియమము చేయవలె నన్నచో మనస్సు బుద్ధిచే నియమింపబడవలెను. మనస్సును బుద్ధి ఆకర్షించు టకు పవిత్రము, మనోహరము నగు జ్ఞానేంద్రియ మార్గ సాధన మొకటి యుండవలెను. దాని కొరకే లలిత కళలు, షోడశోపచార పూజ, ధూప దీప

నైవేద్యములు, సుగంధ ద్రవ్యములు, చవియగు ప్రసాదము, నేత్ర పర్వములగు మూర్తులు, చిత్రపటములు మున్నగువాని యావశ్యకతయు, దేవాలయ గోపుర ప్రాకార శిల్పాది విశేషములును శాస్త్రాచార్యులచే నాదరింపబడినవి. సత్కర్మల కన్నిటికి ఇదియే పరమార్థము.

ఇక మనస్సు మొట్ట మొదటగా కర్మేంద్రియములపై నధికారము పొందునట్లు సాధన చేయవలెను. ఈ యధికారము కర్మేంద్రియములను త్రొక్కినచో లభింపదు. ఏదైన పనిమీద నియమించినచో లభించును. ఆ పనికి గల ఫలితమును కోరినచో మనస్సు కర్మేంద్రియములపై నధికారము కోల్పోవును. లంచము గోరు నధికారులపై లంచముగొను గుమస్తాలకెంత గౌరవముండును? అట్లే సకామ కర్మలయందు కర్మేంద్రియములను నియమింప బోయినప్పుడు మనస్సు తన అధికారములు కోల్పోయి, ఇంద్రియములపై ఆజ్ఞాశక్తి లేకుండును. కనుక తాను ఫలితములు కోరని సత్కర్మల యాచరణమునకై కర్మేంద్రియములను నియమింపవలెను. అభ్యాసమందలి ప్రాథమిక దశ నుండియును అసక్తత (ఫలితముల నంటకుండుట)ను క్రమముగా నలవరచుకొనుట ముఖ్యము. దీనిని సాధించుటకే దేవతార్చనము, తదను బంధములైన గంధమాల్యాది సేకరణము, పూవులు కోయుట, దేవుని తోట పెంచుట, దేవాలయము కడిగి తుడుచుట మున్నగు సేవా విధానము లేర్పడి నవి. ఇందు కర్మేంద్రియములకు క్రమబద్ధమైన శిక్షణము, దేవుని పనులు జరుపుట, తన కని ఎట్టి ఫలితము కనిపించకుండుట సంభవించును. ఒకే కాలమునకు ఒకే క్రమమున సేవ చేయుట వలన కర్మేంద్రియములు క్రమమున కలవాటుపడి ఇచ్ఛా ప్రవృత్తిని మానుకొనును. వానిని నియమించు చున్న మనస్సు కూడ క్రమబద్ధమై ఇంద్రియములలో విహరించుట మాని, ఇంద్రియములచే పనిచేయించును. ఇట్టి సాధన వలన స్వామిత్వము నుండి జారని మైత్రి జ్ఞానేంద్రియ కర్మేంద్రియములతో నేర్పడును. అప్పుడవి అనుకూలములై తమ ప్రవృత్తులను మనస్సునకు సమర్పణ చేయగా, మనస్సు బుద్ధికి సమర్పణ చెందును. (7)

పని రెండు విధములు : శారీరకము, మానసికము. శరీరములోని భౌతిక పదార్థమునకు పనిని కోరుట యుండదు. ఆహారాదులను స్వీకరించుట, ప్రాణ

ప్రవృత్తులు అను పనులున్నవి. అవికాక మన పనులన్నియు మానసికములు. మనస్సుకు పనిచేయవలసిన ఆవశ్యకత లేదు. కాని, తెలిసికొనవలెనన్న కోరిక మనస్సునకు సహజము. ఈ కోరికచే ఇంద్రియములతో జోక్యము కలిగించు కొనును. జ్ఞానేంద్రియములతో జోక్యమున కోరికలను పొంది, వానిని పూరించు కొనుటకై కర్మేంద్రియములను శ్రమ పెట్టును. అప్పుడు కర్మేంద్రియములచే నాచరింపజేయు పని ఇష్టములేని పని. అదియే అనియత కర్మ. దానితో కర్మేంద్రియములకు మనస్సునకు పొత్తు కుదురదు. అట్లుకాక, ఫలితము కోరని సత్కర్మయందు కర్మేంద్రియములను మనస్సు నియమించినచో పొత్తు కుదురును. అక్కరలేని పనులవలన కర్మేంద్రియముల కలసట కలుగును. అలసట యనగా పొత్తు కుదురకుండుట, వైముఖ్యము. తమ యింట పెండ్లి పనులు చేయుచున్నవారికి అలసట తెలియదు. అనగా పొత్తు కుదిరినదని యర్థము. కనుకనే పెండ్లి పనులు చేయవలసినవి లేక నియత కర్మలు. వానిని నియమబద్ధముగా నాచరించుట వలన కౌశల మేర్పడి సంతుష్టి కలుగును.

ఏ పనిని చేసినను దోష మంటవచ్చును. అట్లని చేయకుండుట వలన మనస్సు పనిచేయుట మానదు. కనుక దోషమంటక మానదు. మానకపోగా జీవనోపాధి కుంటుపడును. శరీర పోషణ సమస్య యగును. కనుక కష్టముగనో, నిష్ఠురముగనో, మంచివో చెడ్డవో పనులు చేయుట ప్రారంభించి, మనస్సుచే నియమించుకొనుచు, నియత కర్మలోనికి కర్మేంద్రియములను మలచుకొను చుండవలెను. దీనివలన కర్మేంద్రియములకు క్రమశిక్షణ మార్గమగు విధేయత, మనస్సునకు మంచి పనియందు నిమగ్నమై యుండుట, తత్ఫలితముగా దోషము లంటించుకొను తీరిక లేకుండుట లభించును.

మంచిపను లనగా నెట్టివి? వీని నెట్లు తెలియవలెను? వ్రాసిన గ్రంథ ములే ప్రమాణములా? లేక మనకే తెలియు ప్రమాణమున్నదా? గ్రంథములు రచించినవారు తప్పులు వ్రాసిరేమో యను శంక తీరుట యెట్లు? ఒకవేళ తప్పు లాచరించినచో మన గతి ఏమగును? అని శంకింప నక్కరలేదు. ఒప్పు లాచరించుట వలన తప్పులు సర్దుకొనును. తప్పొప్పులకు ప్రమాణమేది? నియతకర్మ యనగా నెట్టిది? భగవంతుని సృష్టిలో జరుగు కర్మ తప్పనుటకు కారణము లేదు. కనుక, సృష్టిని పరిశీలించి, ప్రకృతి ఆచరించు కర్మలోని

నిష్కామత్వమును గ్రహించి, చిత్తశుద్ధితో అనుకరించినచో అది సత్కర్మ యగును. దీనినిబట్టియే నియతకర్మ యేర్పడుచున్నది. మబ్బులు వర్షించుట, భూమి పండుట, సూర్యు డుదయించుట మున్నగు నుదాహరణముల వలన మన మాచరింప వలసిన నియత కర్మలనబడు సత్కర్మలను సులభముగా గ్రహింపవచ్చును. (8)

**యజ్ఞము :**

తనకు దప్పిక యైనపుడు ఇంటిలో బిందెలోని మంచినీటిని గ్లాసుతో ముంచుకొని త్రాగుట సామాన్యము. ఇట్లు చేయుట వలన బిందెలోని నీరు తగ్గిపోవును. కొన్ని గంటలలో అయిపోవును. దప్పిక మాత్రము మరల మరల కలుగుచునే యుండును. ఆకలి కలిగినపుడు గిన్నెలో వండిన యన్న మున్నచో వడ్డించుకొని తినుట సామాన్యము. దీనివలన అన్నము తరగిపోవును. ఆకలి మరల కలుగుచుండును. ఏ వస్తువు కొనవలసినను పర్సులోని డబ్బును తీసి వాడుట సామాన్యము. డబ్బులైపోవును. అవసరములు మిగిలిపోవును. ఇది యొక పద్ధతి.

బిందెతో చెరువునుండి నీరు తెచ్చి ఇంటిలో నుంచవలెనని ప్రయత్నించుట కొంచెము విశేషము. ఈ నీరు తాను త్రాగుటకు మాత్రమే కాదు, ఇంటిలో నందరి కొరకు. కాని ఆవశ్యక మగునపుడు తానుకూడ త్రాగవచ్చును. నెల కొకమారు బియ్యము కొని ఇంట జేర్చవలెనని, దానికొరకు డబ్బు సంపాదింప వలెనని జ్ఞప్తి యుండుట మరి కొంచెము విశేషము. అన్నము వండుట తన కొక్కతెకు కాదు. కాని దానినుండి తానును భుజించి ఆకలి తీర్చుకొనవచ్చును. బియ్యము కొనుట, దాని కొరకు డబ్బు సంపాదించుట యజమాని కొక్కని కొరకు కాదు. కాని దాని నుండి తానును భుజింప వచ్చును. ఇది రెండవ పద్ధతి.

ఇందు మొదటి పద్ధతి సామాన్యము. రెండవ పద్ధతి విశేషము. మొదటి పద్ధతిలోని అవసరములు కోరిక లనబడును. రెండవ పద్ధతిలోని ఆ యాకలి దప్పులే కోరికలు గాక వినియోగములు అనబడును. మొదటి పద్ధతి తట్టుట అజ్ఞానము. దానివలన తరగిపోవుట, బాధ, దుఃఖము, సమస్య కలుగును. రెండవ పద్ధతి తట్టుట జ్ఞానము. దాని వలన తరుగకుండుట, పరిష్కారము

సిద్ధించును. మొదటి పద్ధతిలో పనిజేయుట కామ్యకర్మ లేక స్వార్థము అనబడును. రెండవ పద్ధతిలో పనిచేయుట నిష్కామ కర్మ లేక యజ్ఞార్థము అనబడును. కామ్యకర్మ యొక్క ఫలితములు జీవుని బంధించును. యజ్ఞార్థ కర్మయొక్క ఫలితములు బంధమోచనము కలిగించును. కామ్యకర్మ వలన పోషింపబడునది తన శరీరములోని 'నేను' అనగా అహంకారము. యజ్ఞార్థ కర్మవలన పోషింప బడునది అందరిలో నున్న 'నేను'. ఇతడే యజ్ఞ పురుషుడు. ఈ పోషించుటనే ఆరాధన లేక యజ్ఞము అందురు. **(9)**

సృష్టిలో మానవు లందరును ఆహారము కొనుటకు డబ్బు సంపాదించె దరు. ఈ డబ్బుతో ఆహార పదార్థములను కొనుచుండినపుడెల్ల అంగడులలో అవి తరగిపోవును. కనుక ఇది సామాన్య కామ్యకర్మ. ఇట్లే సంసారము కొరకు సంపాదన చేయుటకు చేసినది మంచి పనియైనను కామ్యకర్మ యగును. పొలము నుండి ధాన్యమును అంగడులలోనికి చేర్చుట వాణిజ్యము. అది చేర్చువారి కొకరికే కాక కొనువారి కెల్లరకును వినియోగపడును. కనుక నిది వాణిజ్యమైనను నిష్కామ కర్మ లేక యజ్ఞార్థము. ఇట్లు మానవు లందరు చేయునట్టి మంచి పను లన్నియు సకామముగా చేసి సంపదలను తరగిపోవు నట్లు చేయుట కవకాశమున్నది. లేదా నిష్కామముగా చేసి బాధలు అను బంధముల నుండి విమోచనము చెందుటకును వీలున్నది.

పొలములో చల్లిన విత్తనములు మొలిచి పండుటవలన ఒక్కొక్క విత్తనమునకు వేనవేలు గింజలు పుట్టును. అవి తినువారికి ఆహారముగా వినియోగపడుచున్నవి. దీనివలన విత్తనమునకు ఏ విధమైన స్వార్థము సిద్ధించుట లేదు. అందు అంకుర శక్తి ఇమిడియుండుటచే విత్తనమునకు సంకల్పము లేకుండగనే యజ్ఞార్థకర్మ నూటికి నూరుపాళ్ళు సిద్ధించుచున్నది. ఇట్లే వేసవిలో సూర్యుని కిరణములు భూమిపై జలములను స్వప్రయోజనము లేకయే ఆవిరిగా మార్చుట, అది మేఘములై వర్షించుట, దాని వలన భూమి సారవంతమగుట, విత్తనములలోని అంకుర శక్తికి తోడ్పడుట, కార్యకారణ సంబంధముగా జరుగుచున్నవి. ఇట్లు జరుగుటనే సృష్టి యజ్ఞము అందురు. దానియందుండి ఇట్లు జరుపుచున్న అంతర్యామి శక్తినే యజ్ఞపురుషుడు, ప్రజాపతి యని వ్యవహరింతురు. అతడీ పనిని పూర్వము నుండియు చేయు

చునే యున్నాడు. అతడు తన భాషలో మనకై యుచ్చరించుచున్న రహస్యమేమో తెలిసికొనవలెను. "మీరును నేను చేసినట్లే యాచరించి, గింజనుండి పంటగా అనేక విత్తనములు పుట్టుచున్న యీ మార్గమును సేవించి విస్తరింపుడు. మీ కిష్టములైన కోరిక లన్నియు నిట్లాచరించుట వలన మాత్రమే తీరుచుండును." అనునదియే ఆ రహస్యము. సూర్యకిరణములు, మబ్బులు, భూమి, విత్తనములు కార్యకారణ సంబంధమున యజ్ఞకర్మను నిర్వర్తించు చున్నవి. వానిలోని ప్రజ్ఞలే దేవతలు అనబడుదురు. మానవుడు ఈ భూమిని, విత్తనములను సేవించుట వలన ఈ కార్యకారణ సంబంధమును అంది పుచ్చుకొనుచున్నాడు. అతడును యజ్ఞము నాచరించుచున్నాడు. దీని వలన కార్యకారణ సంబంధము చక్రము వలె పూర్తియై శాశ్వతముగా గిరగిర తిరుగుచుండును. మానవుడు ఈ మార్గము ననుసరింపనిచో కూడ నీ చక్రము ఆగదు, తిరుగుచునే యుండును. తాను మాత్రము చక్రములో నుండి విడిపోయి చిక్కులలో పడును.

ఆవు దగ్గర పాలు తీసికొనుట సామాన్యము. ఆవుకు గడ్డి మున్నగునవి సిద్ధము చేయుట కొంచెము విశేషము. ఇందు కొంత త్యాగబుద్ధి యున్నను, పాలకొరకు చేయుచున్నంత వరకు స్వార్థ కర్మయే అగును. ఆవుపై భూతదయ కలిగి ప్రేమతో చేయుచున్నప్పుడు మంచి యాహార మిచ్చును గనుక పాలు కూడ నెక్కువ వచ్చును. సృష్టిలో వాస్తవమైన ప్రేమ యున్నచోట, నిస్వార్థమున్న చోట తరుగక వర్ధిల్లుట యుండును. పాల విషయముననే ఇది సత్యమైనచో మిగిలిన కోరికల విషయమున నీ యజ్ఞార్థ కర్మ కొన్ని రెట్లు ఎక్కువ సత్య మగును. కనుకనే దీనిని కామధేను వనిరి. (10)

**దేవయజ్ఞము :**

సూర్యరశ్మి, వాయువు, జలము, బీజములలోని అంకుర శక్తి, మనలోని ప్రాణశక్తి, ఆహార స్వీకరణాది శక్తులును దేవతలు. వారి శక్తి వలన మన మున్నాముగాని, మనముండుట వలన తమకు ప్రయోజనము కలిగి దానికై దేవత లుండుట లేదు. కనుక దేవతల సృష్టి యజ్ఞము వలన మనము పొందు ఫలితము లన్నియు దేవయజ్ఞమువలన కలుగుచున్నవి. వారియెడల మనము చేయవలసిన దేమి? వారి కుపయోగించు పనులేవియు మన వశమున లేవు గనుక, మన కుపయోగించు పనులనే వారి మార్గము ననుసరించి పొందు

చున్నాము. అట్టి యెడల వారియందు మనకుండవలసిన గౌరవము, విశ్వాసము, ఆరాధన బుద్ధి మాత్రమే మనము చేయగల యజ్ఞము. ఎంత శ్రద్ధగా దేవతల యందు ఎంత గౌరవముతో మనమీ పనుల నాచరింతుమో అంత హెచ్చుగా ఫలితము మనకే కలుగుచుండును. విద్యుచ్ఛక్తి ధర్మములను మానవు డనుస రించుట వలన వాడుకొన గలుగుచున్నాడు గదా! దేవతలను గౌరవించుట, వారు మనలను సంభావించుట యనగా నిట్టిదే. తత్ఫలితముల కొరకుగాక, యజ్ఞార్థముగా గౌరవింప గలిగినచో నుత్తమమగు విశేషము కలుగును. సృష్టి లోని దేవతలను మనము పూజ్యభావముతో నారాధించినచో వారు మన యెడల పూజ్యభావముతో ప్రవర్తింతురు. వారికి శక్తులు, అనుభావములు తప్ప, భావము లుండవు. కనుక మనము చూపిన గౌరవ భావమే తిరిగి మన కున్ముఖముగా దేవతల భావమై సంక్రమించును. ఇదియే దేవయజ్ఞము. (11)

**యజ్ఞ శేషము :**

దేవతలు యజ్ఞమునందు పూజింపబడినవారై మానవులకు ఇష్టములైన భోగము లొసగుచుందురు. సృష్టి నడచుటకు బ్రహ్మాండమునందు గాని, పిండాండమునందు గాని, పనిచేయుచుండు ప్రకృతిలోని ప్రజ్ఞామూర్తులే దేవతలని వివరించితిమి. గాలి, నీరు, సూర్యరశ్మి, భూమి పరిశుభ్రముగా సారవంతముగా నుండునట్లు మానవుడు చేయు ప్రయత్నమే దేవతలను పూజించు యజ్ఞకర్మ యగుచున్నది. దానిని యజ్ఞార్థముగా, నిష్కామముగా నాచరించుటనే దేవయజ్ఞ మందురు. ఏ పనినైనను తాను ఫలితమును పొందుట కొరకు కాక, సాటి జీవులలోని అంతర్యామిపై గౌరవమున నాచరించినచో అది యజ్ఞము అగును. తనకు పాలిచ్చుటకు గోవుకు గడ్డి వేయుటలోను, జీవకారుణ్య మున గోవుకు గడ్డి సమర్పించుటలోను గల భేదము నిష్కామ కర్మ లేక యజ్ఞార్థ కర్మ మనబడును. ఇట్లే దేవతల యెడలను మన మూహింపవలెను.

మన జీర్ణకోశమున ఆహార పరిణామమునకు అనేక దేవతలు రసాయనిక ప్రక్రియల రూపమున, జీర్ణరసముల రూపమున పనిచేయుచున్నారు. వారు చేయుచున్న పనులు మనకు చేతకావు. కనుక దేవతలు మనకన్న గొప్పవారు. భౌతికమైన రుచులపై మనకున్న వ్యామోహము వారికి లేదు గనుక మనకన్న వారు సంయమ స్వరూపులు. నిష్కామకర్మ నెరిగినవారు అనగా యజ్ఞార్థము

మాత్రమే పనిచేయుచున్నవారు. వారిని గుర్తుంచుకొని, ఆహార నియమము కలిగి అన్నపానీయములను స్వీకరించినచో మనము తిను భోజనము కూడ యజ్ఞార్థమే యగును. దాని వలన ఆరోగ్యము, దీర్ఘాయువు, శరీరదార్ఢ్యము మనకు కలుగుచున్నవి. ఇవి మనకు కలుగునని గుర్తుండుట సకామము. దేవతలు ప్రసాదించు చున్నారని గుర్తుండుట నిష్కామము. ఈ సంస్కారము లేనివాడు తన జిహ్వా రుచికి దాసుడై వ్యామోహమున చేయు భోజనమువలన జీర్ణకోశములోని దేవతలయెడ పూజ్యభావము లేక అవమానించుట యగును. అవమానపడుటకు దేవతల కహంకారము లేదు గనుక, మన మవమానించిన ఫలితమైన అజీర్ణాది వ్యాధి బాధలు కర్మఫల రూపములై మన యహంకారమునే బాధించును. దేవతలకు కర్మఫలానుభవము లేదు. వారిది కేవలము భోగ లోకము. వారికి జనన మరణ జరావ్యాధులు, వయస్సు యొక్క పరిణామ ములు లేవు. ఎచ్చట సృష్టి సంకల్పము వ్యక్తమగునో అచ్చట వారా సంకల్పము నుండి సంసార వృక్ష రూపమున ప్రత్యక్షమై (వ్యక్తమై) పనిచేయుచుందురు. పనియైన వెనుక సంకల్పముతో అంతర్ధాన మగుదురు. (చనిపోయిన వాని యందు ప్రాణము, మనస్సు, ఇంద్రియ ప్రవృత్తులు మొదలగు శక్తులవలె నడచిపోనక్కర లేకయే మాయ మగుదురు.) కనుక మానవుడెప్పుడును ఈ దేవతలతో బ్రహ్మాండ పిండాండముల యందు సామరస్యము నిలుపుకొన వలెను. నిర్లక్ష్యము చేయరాదు. "ఈ దేవత లందరు సగుణ స్వరూపులు" అని నిర్గుణ పరబ్రహ్మమును గూర్చి పగటి కలలుకన్న వేదాంతికికూడ, తిండి కుదురనిచో అజీర్ణ వ్యాధి కలుగును. కనుక మానవునకు ఇహపర సౌఖ్యములకు దేవతల నారాధించక తప్పదు. వారిని ఒకే పరమాత్మ బుద్ధితో నారాధించుచు నిష్కామముగా యజ్ఞార్థ కర్మ నిర్వర్తింపవలెను గాని, ఈ దేవతల వలన పొందు సుఖాదులపై భ్రాంతితో అదే యజ్ఞము చేసినను లాభము లేదు. అది సకామమే యగును.

**యజ్ఞ స్వరూపము :**

యజ్ఞమను పదమునకు నిష్కామముగా చేయు నారాధనమని, అది కర్మస్వరూపమని గీతాచార్యుని సమన్వయము. సనానత ధర్మమైన వేదమును దర్శించిన ఋషుల సమన్వయము కూడ నదియే. కనుకనే పూర్వులు కూడ

తమకన్న పూర్వుల కడనుండి దీనిని తెలిసికొని యాచరించినారని కృష్ణుడు గీతలో హెచ్చరించెను. భగవద్గీతలో తాను నూతన సిద్ధాంతమును ప్రతిపాదించు చుంటినని అతడు చెప్పలేదు. సనాతన ధర్మమును తా నిచ్చు చున్నాననియు, 'తాను' ఈ ధర్మము యొక్క స్వరూపమే యనియు, జీవులు దానిని మరచినపుడెల్ల తానొక వ్యక్తిగా నవతరించి దానిని స్థాపించెద ననియు చెప్పెనే గాని, నాది సరిక్రొత్త సిద్ధాంతమని చెప్పలేదు. యజ్ఞము అను పదమునకు నిష్కామ కర్మాచరణ మనియు, దేవతలు అను పదమునకు సృష్టిని నిర్వహించుచున్న ప్రజ్ఞలనియు వేదమునందు ప్రాచీనముగా నున్న నిర్వచనమునే కృష్ణుడు పునరుద్ధరించెను. అట్లు ఉద్ధరించుట కావశ్యకత ఏల కలిగినదనగా, నడిమి కాలములలో పండితులు ఇంద్రాది శబ్దములను వ్యక్తుల పేర్లుగా పొరబడి, వారిని తమ కోరికల ప్రకారము దేవతలుగా వ్యవహరించి, ఆహార పదార్థములను, జంతువులను బలి యిచ్చుట కలవడి, మద్య మాంస మైథునాది లోలురై కామాత్ములు, స్వర్గపరులునై వ్యవహరించుట వలన యజ్ఞమను పదమున కర్థము భ్రష్టు పట్టించిరి. కోరిన రూపము నర్చించుట, తమ జిహ్వా పీకిన ఆహారములను దేవతల పేర బలియిచ్చి, నైవేద్యము పెట్టి ప్రసాదముగా స్వీకరించుట మొదలగు ప్రక్రియలతో యజ్ఞమను పవిత్ర పదమును కలుషితము చేసిరి. కనుకనే కృష్ణుడు యజ్ఞమును పునరుద్ధరించి యథాస్థానమున నిలుపుటకు యత్నింపవలసి వచ్చెను. **(11)**

యజ్ఞముచే గౌరవింపబడిన దేవతలు మనకు సర్వ విషయముల యందును అప్రయత్న సుఖ భోగములకు కారకు లగుచున్నారు. నిరంతరము వారు కలిగించుట, మన మనుభవించుట జరుగుచున్నది. అపుడు మన కర్తవ్యమేమి? వారికి సమర్పణ బుద్ధితో ననుభవించుట మాత్రమే మనము వారి యెడల చూపవలసిన విశ్వాసము. ఎవరీ బుద్ధి కలిగియుండక స్వప్రయోజన బుద్ధితో ననుభవింతురో వారు దొంగబుద్ధి కలవారనుటలో సందేహము లేదు. ఈ దొంగబుద్ధి వలన నితరులకు పెట్టక తా ననుభవించుట మున్నగు అధర్మాంకురములు నాటుకొనును. దేవతల కహంకారము లేదు గనుక ఈ యంకురములను కూడ వారే మొలిపింతురు. మనము నాటిన బీజములు అంకురములై కామ విషవృక్షములుగా పెరిగి మన సుఖాదులనే హరించు

చున్నవి. భూతదయతో నితర జీవులలోని యజ్ఞ పురుషు నర్చించి, అటుపైన తాను అనుభవించినచో యజ్ఞ శేషమును భుజించిన వాడగును. దీనివలన మానసిక, శారీరక కల్మషములు తొలగిపోవును. అట్లు గాక స్వలాభమునకు తన కర్మలను వంట చేసికొని ఫలమును భుజించువాడు పాపములనే భుజించును గనుక పాపాత్ముడగును. పురాణాదులలో క్రూర రాక్షసుల చరిత్రలను మనము చదువుచున్నాము. వారి జీవితములకు కలిగిన దుష్పరిణామమే పాపాత్మునకు కలుగును. దైవభక్తి కలిగియున్నను, తాను కల్పించుకొనిన దైవమును మాత్రమే తన కోరికలు నెరవేరుటకు, లాభము పొందుటకు తన వస్తువులతో నర్చించినను, అది యజ్ఞము గాక పాపమే యగును.

ఒక దేవాలయమున నిలబడి, వచ్చిపోవుచున్న భక్తజనమును పరిశీలింపుడు. ఒకొక్కడు పుష్ప ఫలాదులను, టెంకాయలను గొనివచ్చి, నైవేద్యము పెట్టి, అందున్నవారికి పంచి, తానును స్వీకరించును. మరియొకడు నైవేద్యమైన వెనుక మరల ఆ ఫలములను, టెంకాయలను సంచిలో నుంచుకొని భద్రముగా నింటికి గొనిపోయి, తనవారితో తినుచున్నాడు. ఇందు మొదటివాడు భుజించునది యజ్ఞశేషము లేక ప్రసాదము. రెండవవాడును, వాని యాప్తులును భుజించునది వట్టి టెంకాయ. యజ్ఞ శేషమును భుజించువానికి అందున్న పదార్థముగాక, తనయందున్న సమర్పణ బుద్ధియే ప్రసాదమై తనను రక్షించును. అనగా మనస్సును పవిత్రము చేయును. పాపము, పుణ్యము, బంధము, మోక్షము, కర్మఫలానుభూతి మనస్సునకు మాత్రమే సంబంధించినవి గాని, ద్రవ్యమునకు దేహమునకు సంబంధించినవి కావు. దేవతల కోపము వలన దేహమున కలిగిన వ్యాధుల బాధలు కూడ మనస్సుచేతనే అనుభవింపబడును. కురుపున్నచో దాని నొప్పి మనస్సునకే కాని కురుపులోని మాంసమునకు, చర్మమునకు కాదు. దేవతల ఆనుకూల్యము వలన కలిగిన ఆరోగ్యము, పుణ్యము, మోక్షము కూడ మనస్సునకు మాత్రమే. (12)

**సృష్టిచక్రము :**

ఒక గడియారమును విప్పి అంకెల డిప్పకు వెనుకనున్న యంత్రాంగమును పరిశీలింపుడు. కొన్ని చక్రములు తిరుగుచుండును. ఒకొక్క చక్రము

తాను తిరుగుచు మరియొక చక్రము తిరుగుటకు కారణమగునట్లు పండ్లు పండ్లుగా నమర్చబడి యుండును. అందు మొదటి చక్రమును త్రిప్పుటకు కేశ యంత్రము స్పందించు చుండును. దాని స్పందనకుగాను బిగించిన చుట్ట యొకటి యుండును. ఇందు కార్య కారణ సంబంధము చక్కగా నమర్చ బడుట వలన యంత్రము నడచుచు కాలమును సూచించుచున్నది. గంటల, నిమిషముల, క్షణముల ముళ్ళు తిరుగుచు కాలమును సూచించుచున్నవి. అట్లే సూర్యుని వలన భూమియు, ఇతర గ్రహములును తిరుగుచున్నవి. సంవత్సర చక్రమున సృష్టి విభాగములు సూచింపబడుచున్నవి. కాని గడియారము మానవునిచే ఆరంభింపబడినప్పుడే తిరుగును. సృష్టిచక్రము మానవునినే గాక ఇతర జీవులను, అణువులను గూడ త్రిప్పుట కారంభమై యున్నది. కనుక ఇది స్వయంవాహకము. దీనిని త్రిప్పుట ఆరంభించుటకు వలసిన విజ్ఞానము కూడ ఇందే యిమిడి యున్నది. ఈ విజ్ఞానము అనాద్యంతము. ఈ సృష్టి యంత్రము దానియందు ఆది, అంతము గలిగి వర్తించుచుండును. ఇట్లు వర్తించుట అనాద్యంతము.

మన భూమిపై ఖనిజములు రసాయనికములైన మార్పులను సంయోగ వియోగాత్మకముగా పొందుచు జీవుల శరీర నిర్మాణమునకు కారణము లగు చున్నవి. ఇట్లు కారణమగుటను 'అన్నము' అందురు. అన్నము వలన జీవులు పుట్టుచున్నవి. వర్షము వలన అన్నము పుట్టుచున్నది. భూమిపై నున్న జలమే పైకిపోయి మరల భూమిపై వర్షించినపుడు సారవంతమై బీజము లంకు రించును. వర్షము వలన పరిసరముల అంకురములు జన్మించును. కనుకనే వర్ష దేవతను 'పర్జన్యు' డందురు. జలములు మేఘములై వర్షించుటకు కారణము యజ్ఞము. అనగా వాయువు, అగ్ని మున్నగు దేవతలు కలిసి చేయు నిష్కామ కర్మ. మన వలన వారికి యే ఉపయోగమును లేకపోయినను దేవతలు తమ ధర్మములను వర్తింపజేసి, వర్షము ఉత్పాదించుచున్నారు. కనుక యజ్ఞమునుండి వర్షము పుట్టుచున్నది. ఈ యజ్ఞము కర్మవలన కలుగుచున్నది. కర్మ యనగా సృష్టిలో దేవతలకు ప్రకృతిచే నియమింపబడిన ప్రణాళిక లేక కార్యక్రమము. మానవుడు ఫలితము కోరి చేయునది లౌకిక కర్మ; సృష్టిలో జరుగునది విశ్వకర్మ. ఇది సృష్టికర్తయగు బ్రహ్మ నుండి పుట్టుచున్నది. బ్రహ్మ యనగా అణువును

బ్రహ్మాండముగ, విత్తనమును వృక్షముగ విస్తరించుకొనునట్లు చేయు సృష్టి దేవత. ఇతనినే 'కమలాసనుడు' (విచ్చుకొనుట తన నివాసముగ కలవాడు) అందురు. ఇతనియందు సకల సృష్టి విజ్ఞానము సహజముగ నిమిడియుండును గనుక వేదస్వరూపు డందురు. కనుకనే బ్రహ్మ అను మాటకు వేదమని కూడ అర్థము. ఈ బ్రహ్మ నుండి సకల జీవరాశుల వరకు అణువుల వరకు గల సృష్టి వచ్చుచు, పోవుచు నుండును గనుక, క్షరము లేక మార్పునకు గురి యగునది అనబడును. ఇది అక్షరము నుండి పుట్టుచున్నది. అక్షర మనగా మార్పులకు గురికాని సర్వాంతర్యామి. దీనినే దేవుడనియు, పరబ్రహ్మ మనియు చెప్పుదురు. దీని నుండి అక్షరములుగ బ్రహ్మాది దేవతలు, సృష్టియు కలిగి క్షర మగు చున్నారు. **(13)**

మననుండి అభిప్రాయములు పుట్టి వాక్యములుగా, పదములుగా, అక్షరములుగా దిగివచ్చుచున్న సంకల్పము లెట్లో ఇవియు నట్లే. అక్షరములు భావ ప్రకటనమునకు వాడబడి తప్పుకొను చుండును. అట్లే పరబ్రహ్మము నుండి బ్రహ్మాది సృష్టి ప్రకటనమై తప్పుకొను చుండును. ఇట్లు అక్షరము నుండి బ్రహ్మయు, బ్రహ్మ నుండి కర్మయు, దానినుండి యజ్ఞము, దానినుండి పర్జన్యుడు, వానినుండి అన్నము, దానినుండి జీవుడు పుట్టుచున్నారు. మరల జీవునిలో ఉన్నవాడు అక్షరు డనబడు పురుషుడే! ఈ విధముగ చక్రము పూర్తియై అనాద్యంతమై సృష్టి యంత్రముగా తిరుగుచున్నది. యంత్ర నిర్మాణము చేసినవాడు కూడ యంత్రమునందు అంతర్యామిగా నిమిడి యున్నాడు గనుక జీవుడును పురుషుడే! ఇట్లు సమస్తము నందును పరబ్రహ్మము సృష్టికర్తయగు బ్రహ్మగా నిలుపబడుచున్నది. యజ్ఞమునందు నిత్యము నిలుపబడుచుండుటచే సృష్టిచక్రము కార్యకారణ సంబంధము కలిగి అనుక్షణము వర్తించుచునే యున్నది. **(14, 15)**

ఈ చక్రమును భావన చేసి పరిశీలించుట వలన లాభమేమి? జీవితమున మన మేమి చేయవలెనో బోధ పడుటయే లాభము. ఇది తెలియకుండుటయే అజ్ఞానము. అజ్ఞానము వలన దుఃఖము, శోకము, భయము మున్నగు బంధ ములు కలుగును. వానిచే జీవుడు బద్ధుడగును. సృష్టిచక్రము దేనియందును బద్ధము గాక అనాద్యంతముగా తిరుగుచున్నది గనుక, దాని ననుసరించి

ప్రవర్తించుట నేర్చినచో జీవునకు బంధ విమోచనము కలిగి స్వరూప ప్రాప్తి నిలబడును. కనుక నిత్య జీవన విధానమందు ఈ చక్రము యొక్క ప్రవర్తనము ననుసరించుట నేర్చుకొనవలెను. కారణము లేకయే ఈ చక్రము తిరుగు చున్నది గనుక, కారణము లేకయే మనము జీవులకు అనుకూలములై దోహదము చేయు పనులయందు ప్రవర్తింపవలెను. సత్కర్మ లాచరించుట ఈ చక్రము ననుసరించుటయే అగును. పుణ్యము మోక్షము మొదలగు లాభములను దృష్టిలో పెట్టుకొని ఆచరించినచో అవి సత్కర్మలు గాక దుష్కర్మ లగును. అనగా ఫలితము మీద మనస్సును బంధించును. ఫలితము కోరక అనుస రించుట యజ్ఞార్థకర్మ మగును. ఫలితము గోరి యజ్ఞము చేసినను ఈ చక్రము ననుసరించుట జరుగక మనస్సునకు బంధమను పాప మంటును. కనుక ఎవడీ చక్రము ననుసరించి ప్రవర్తింపడో అతని జీవితమే పాపమై ఇంద్రియ లోలత గలిగి మనస్సుగా వ్యర్థజీవనము చేయును. **(16)**

## ఆత్మ తృప్తి :

కుతూహలము అను లక్షణము విచిత్రమైనది. అది వెలుగు వంటిది. ఏ రంగు దీపము నుండి దూరినప్పు డా రంగుతో కనిపించునది వెలుగు. ట్యూబులైటు వెలుగు దాని రంగులోను, రంగు బల్బు వెలుగు ఆ రంగులోను ప్రకాశించును. మైనపువత్తిని వెలిగించినపుడు వత్తికి, మైనమునకు సంబం ధించిన ద్రవ్యము రంగులో వెలుగును. నూనెదీపము, నేతిదీపము వేర్వేరు రంగులలో వెలుగును. పరిశీలించినచో రంగులేని వెలుగు కంటికి కనుపింపనిది. అట్లే డబ్బు కొరకు, విలాసము కొరకు, కామము కొరకు, క్రోధము కొరకు, విజ్ఞానము కొరకు, తపస్సు కొరకు, దేవుని కొరకు, యోగము కొరకు, మోక్షము కొరకు వెలుగొందు కుతూహలము మనస్సుచే తెలిసికొనబడును గాని స్వచ్ఛ మైన కుతూహలము మనస్సు తెలియగలిగినది కాదు. తనకన్న నితర విషయములందు గలుగు కుతూహలమునకు రజస్తమస్సుల రంగు ఉండును. కుతూహలము స్వచ్ఛమైనచో దానికి శుద్ధసత్త్వము గలుగును. దాని నాత్మ కుతూహలము, ఆత్మరతి యందురు. దానికి ఆవేగోద్వేగములు, ఆవేశము, ఆనంద బాష్పములు, రోమాంచము ఉండవు. దైవ విషయమున గూడ పూనక ములు, ఆవేశము, ఆర్తి యుండవు. ప్రశాంతి మాత్రము తరుగనిదై యుండి,

తరంగములు లేని సముద్రమువలె, మబ్బులు లేని యాకాశమువలె నుండును. ఈ యాత్మరతి యను లక్షణము యజ్ఞార్థ కర్మము నభ్యసించు జీవున కలవడును. సృష్టిచక్రము నుపాసించి, యనుకరించువాని కిది యబ్బును. దానినే శ్రీకృష్ణు డాత్మరతి యని వ్యవహరించెను.

తృప్తి యనునది మరియొక విచిత్రమైన వస్తువు. ఇంద్రియములకు తృప్తి, మనస్సునకు తృప్తి, ఆత్మతృప్తి యని వేర్వేరు పదములతో తృప్తిని వ్యవహరించు వారి మాటలను వినుచుందుము. వారికి కలిగిన తృప్తిని బట్టియే వారు ఉపయోగించు పదజాల ముండును. ఒక అవివాహితుడు ఒంటరిగా బస్తీలో నుద్యోగము చేసి ధనార్జనము చేయుచుండెను. జీతము వచ్చిన దినమున ప్రతి మాసము హోటలుకు పోయి హల్వా తినుచు సంతోషించు చుండెను. ఇది ఇంద్రియ తృప్తి. దీని వలన నిజమైన తృప్తి కలుగదు. మనస్సు తినవలె ననుకొన్నది. జిహ్వ రుచి చూచి కూలిపని చేసినది. పొట్ట తిన్నది. ఈ విధముగా కార్యాలయమున ముగ్గురికి నైకమత్యము లేనిచోట తృప్తి యెవరికి కలుగును? కనుకనే ఇంద్రియతృప్తికి యత్నించినవానికి అసంతృప్తి, కోరిక, విషయములయం దాసక్తి హెచ్చగు చుండును. కొంతకాలమునకా అవివాహితుడు వివాహము చేసికొనెను. భార్య కాపురమునకు వచ్చెను. అతనికి హల్వాపై వ్యామోహము తగ్గి క్రమముగా భార్యపై వ్యామోహము హెచ్చెను. జీతము వచ్చినపుడెల్ల భార్యకు చీరె, చెప్పులు, పూలు, సుగంధ వస్తువులు మున్నగు వానిని తెచ్చుట మరిగెను. దీనిని మానసిక తృప్తి యందురు. హల్వావలె జిహ్వకు రుచి యను నింద్రియతృప్తి దీనియందు లేదు. భార్యార్థము అను మానసిక తృప్తి యున్నది. కొంత కాలమున కతనికి సంతతి కలిగిరి. ప్రతిమాసము పిల్లలకు హల్వా కొనిపెట్టి వారు తినుచుండగా చూచి తృప్తిపడుట నేర్చెను. దీనిని నాపేక్ష యందురు. ఇది మానసిక తృప్తి కాక హృదయతృప్తి. ఈ విధముగా తృప్తికూడ రతివలెనే యొక యుపాధి నాశ్రయించుకొని లోకమున కనిపించును గాని, స్వచ్ఛమైన తృప్తి సామాన్యముగా కనిపించదు. కనుకనే యుపాధి దెబ్బతినినపుడు తృప్తికి బదులు దుఃఖము కలుగును. **(17)**

చేసిన పనికి ఫలితము నాశించినప్పు డది మనస్సున నుండును గాని అనుభవము కాదు. అట్లుగాక తృప్తిగా నుండుట జీవు డభ్యసించినచో దానికి

కారణ ముండదు గనుక యుపాధి దెబ్బతినుట యను ప్రసక్తి కలుగదు. అతడు తృప్తి వలన సర్వకార్యములును చేయునుగాని, తృప్తి కొరకు చేయడు. కనుక నతనికి తృప్తి ఫలము కాదు, అనుభవము. ఆశించిన ఫలితము వలన నుద్వేగ ముండదు గనుక నది సత్యానుభూతియే గాని, తనకన్న భిన్నముగా మనస్సు కల్పించుకొనిన, భవిష్యత్తున కనిపించు ఫలము మాత్రము కాదు. ఇట్లు ఆత్మతృప్తి జీవులకు కలుగుట కూడ యజ్ఞార్థకర్మ మాచరించుట వలననే కలుగును. తృప్తితో పసిబిడ్డ ఆడుకొనును గాని, తృప్తి కొరకు ఆడుకొనుట లేదు. పెద్దవారు లాభము కలుగుట వలన తృప్తి పడుదురు. కనుక పిల్లలవలె నాడుకొన నోచుకొనరు. ఆ తృప్తి కలిగిననాడు సంతోషించుట, కలుగనినాడు దుఃఖించుట యుండును. కనుకనే మొగమున పూర్ణిమ, అమావాస్య తాండ వించు చుండును. భయాదులతో జీవించు చుండవలసిన గతి పట్టును.

యజ్ఞార్థ కర్మ నాచరించు వానికి నిజమైన యాత్మతృప్తి నిలబడును. ఆత్మరతి, ఆత్మ తృప్తి యుండుట వలన తనకు తాను సంతోషముగా నుండును. అతని సంతోషము కారణముతో వెలగట్టుకొనుట కింకొకనికి లొంగదు. అతని యాత్మ సంతోషముకన్న కారణములు విలువైనవి కావు. అతనికి సంతోషమే యన్నిటి కన్న విలువైనది. అట్టివాని కిది చేయవలయునను నిర్బంధముండదు కనుకనే యే యకార్యము చేయక లోకశ్రేయమునే యాచరించును. నిర్బంధ మున్న వాని కాచరించుట కొంత కార్యభారముతో కూడియుండును. కనుక చేయుద మనియో, వద్దనియో అనిపించుట, సమయమునకు చేయలేకపోవుట, చేయవలసిన తీరున చేయలేకపోవుట యుండును. ఈ పని చేయనిచో గడవదనిగాని, యితరుల దృష్టిలో చేయనివాడ నగుదునని గాని, చేయనిచో చెడ్డ పేరు వచ్చుననిగాని, కష్టదారిద్ర్యాది బాధలు కలుగుననిగాని, నిర్బంధము వలనగాని గతిలేక మంచిపని చేసినచో నది యసమగ్రముగా, బాధ్యతగా, కార్యభారముగా నుండును. అట్లుకాక ఆత్మరతి, ఆత్మతృప్తి కారణముగా చేయబడు పనులు చెడ్డవి యుండవు. అసమగ్రముగా చేయుట యుండదు. చేయక మానుట యుండదు. అతనికి ఆ పనులు చేయుట వలన ప్రయోజనబుద్ధి లేదు. చేయనిచో గూడ సోమరితనము మున్నగు దుష్ప్రయోజనములు లేవు. చేయుట, చేయకపోవుట వలన నెవ్వరి వలనను లాభ మాశించుట లేదు. నిర్బంధ మనుభవించుటలేదు. కనుక జరుగవలసిన యజ్ఞార్థకర్మయం దొక

యభిలాష, యభిప్రాయము లేక చేయుట జరుగును. దాని వలన నుత్తమ స్థితి చేకూరును. (18, 19)

## ఆచరణము - సిద్ధి :

ఫలముతో సంబంధము లేక సత్కర్మ లాచరింపవలెనని చెప్పినప్పుడొక సందేహము కలుగవచ్చును. ఫలము లంటకుండుటయే గదా సాధనకు ముఖ్యము! అది మనస్సునకు లభించినపుడు ఇక సత్కర్మాచరణముతో పనియేమి? ఫల మంటనపుడు సత్కర్మ, దుష్కర్మ యను భేదము నశించును గదా! అది లభించినవాడు సత్కర్మాచరణము చేయుటలో మరల ఫలమును బట్టి సత్కర్మ నిర్ణయము జరుగుచున్నది. కనుక కర్మ లాచరించక నిష్కామ మైన మనస్సుతో నుండిపోవచ్చును గదా! గమ్యము చేరిన వెనుక నిక పరిశ్రమ యెందులకు?

ఈ యభిప్రాయము కుతర్కమగును గాని సత్యము కాదు. మరియు సత్కర్మ లాచరింపక ఎగవేయుటకు మార్గాన్వేషణము కూడ ఇందు గోచ రించును. సత్కర్మకు సత్ఫల మెప్పుడు నున్నది. దాని నెవ్వడును తొలగింప లేడు. ఆ ఫలముపై తనకున్న యభిలాష పోవలెను. దాని ఫలము పోవలెననుట సాధ్యపడదు. ఎండనుండి రక్షించుకొనుటకు గొడుగు పట్టుకొనవచ్చును గాని, ఎండను శాసింప సాధ్యమా? కర్మఫల మంటకుండుట తన మనస్సునకు సంబంధించినది గాని ఇతరులకు సంబంధించినది కాదు. తాను చేసిన సత్కర్మ ఫలము నితరులకు పంచిపెట్టగల సద్బుద్ధికోసమే ఫలాపేక్ష పోగొట్టుకొనుట గాని, ఇతరులకు కూడ ఫలము దక్కకుండ చూచుకొనుటకు కాదు. ఏ మూలనో దాగియున్న ఈర్ష్య వలన నిట్టి కుతర్కము సంభవించును. మనము చేసిన మంచిపనికి ఫలితము లోకమున కెందుకు దక్కవలెను అను వక్రబుద్ధి వలన సత్కర్మాచరణము కూడ మానవలె ననిపించును. పెద్దల మార్గ మట్టిది కాదు. అది యెప్పుడును విశ్వశ్రేయము ధ్యేయముగా కలది. పరమాత్మను కర్మఫల మంటనంత మాత్రమున నత డవతారమెత్తి ధర్మ సంస్థాపన మను సత్కర్మ మాచరించుట మానెనా? దాని ఫలితము మాత్రము తన కక్కర లేకుండుటయే వాని విశిష్టత.

ఒకడు సత్కర్మ లాచరించి నిష్కామత్వమును సాధించి, అటుపైన సత్కర్మాచరణము మానినచో ఫలితమేమి? ఏ సత్కర్మచే తనకు నిష్కామ సిద్ధి కలిగెనో దానిని పరిత్యజించుట వలన నీ సిద్ధి కూడ నశించును. వాణిజ్యమున త్రిప్పుచున్న డబ్బు లాభమును తెచ్చును. లాభము కూడ డబ్బే. దానితో వస్తువులను, సుఖములను అనుభవింప వచ్చును. ఈ రుచి మరగి త్రిప్పుచున్న డబ్బునే వాడుకొన్నచో వెంటనే సుఖ సంపదలు నశించును గదా! దానిని త్రిప్పినంతసేపే లాభము మిగులుచుండును. అట్లే సత్కర్మాచరణ మున్నంత సేపే నిష్కామసిద్ధి నిలబడి యుండును. నిలిపిన వెంటనే స్వార్థ బుద్ధి ప్రవేశించును. **(20)**

చాలాకాలము నుండి యొకడు సత్కర్మ లాచరించు చున్నప్పుడు వానియందు ప్రజలకు గౌరవము పెరుగును. దానితో పలువురు వాని యడుగు జాడల వెంట నడువ వలెనని యత్నింతురు. అట్టివాడు జ్ఞానము కలిగిన దనుకొని సత్కర్మలను మానినచో మిగిలిన వారును మానుదురు. వారి కర్మ భ్రష్టతకును గురువు తానే కారణ మగుచున్నాడు. కనుక సత్కర్మలను మాన కుండుట కూడ నిష్కామ కర్మయోగమే. దానివలన తన కేమి లాభమను ప్రశ్న పుట్టరాదు కదా? లోకము క్రమబద్ధముగా నడువవలె నన్నచో ఆర్జనము, జీవనోపాధి, సాంఘిక వ్యవస్థ, పౌర ధర్మములు క్రమబద్ధముగ నిర్వర్తింప బడవలెను. దాని కొరకే నిరంతర సత్కర్మాచరణము ఆవశ్యకము. తాను తరింపవలెనను బుద్ధి స్వార్థ కలుషితమైనది. తన మనో వాక్కర్మలు నిమిత్తము లుగ నితరు లుద్ధరింపబడవలె నను సంకల్పమే వాస్తవమైన నిష్కామ కర్మ యోగము. కనుక కర్మాచరణము వలన మాత్రమే యీ సిద్ధి సాధ్యము. దాని నెరిగియే జనకాదులు నైష్కర్మ్య సిద్ధిని తమ ప్రజలకు సాధించి పెట్టిరి. తామే సాధించుకొనదలచినచో ముక్కు మూసికొని స్వార్థమున క్రుళ్ళిపోవచ్చును. కుటుంబమున యజమాని కెంత బాధ్యత యున్నదో, ప్రజలపై ప్రభువున కంత బాధ్యత యున్నది. దానిని సాధించిన జనకాదుల మార్గమే రాజయోగము. ఇచ్చట రాజయోగ మనగా రాజు లనుష్ఠింపదగిన యోగము. ఇచ్చట చెప్ప బడినది అష్టాంగయోగము కాదు. అది యోగసాధన మాత్రమే. జనకాదుల రాజయోగము యోగసాధనకు తర్వాత అవలంబింపవలసినదగు యోగ జీవనము. శ్రీకృష్ణుడు రాజయోగమని పేర్కొనినది జనకాదులు చూపిన

సంసిద్ధియే గాని, వ్యక్తిగత యోగ సాధనతో నాగిపోవుట కాదు. వ్యక్తికి మోక్షము రాకున్నను సృష్టికి నష్టము లేదు. విశ్వశ్రేయము లేనిచో సృష్టియోగమునకే నష్టము. దానివలన వ్యక్తి యెట్లును పతనము చెందును. కనుక వ్యక్తిశ్రేయస్సు కన్న లోకశ్రేయస్సునకే ప్రథమ స్థానము. దానిని మనస్సున ఉంచుకొని తప్పనిసరిగ సత్కర్మాచరణము చేయుచునే తరింపవలెను. 'చేసి తరించుట' యుండదు. 'చేయుచు తరించుట' యుండును. (21)

ఓ అర్జునా! నా కాచరింపవలసిన కర్తవ్య మేదియు లేదు. ఆచరింపనిచో కలుగు నష్టము లేదు. ఆచరించినచో లాభము లేదు. మానినచో నన్నెవ్వ డడుగును? కాని నే నాచరించుట మానలేదు. మానను. నా ధర్మాచరణమున కొక నిబంధన యున్నచో ఆ నిబంధన తొలగు వరకు మాత్రమే ఆచరించి అటుపైన మానియుండెడి వాడను. అట్టి నిబంధన లేదు గనుక, ఫలితము నన్ను బంధింపదు. కనుక నే నెప్పుడును ఆచరించుట మానను. ~~ఈ~~ మూడు లోకములలో నేను పొందరానిది లేదు గదా! పొందగోరు చున్నదియు లేదుగదా! అయినను నే నాచరించుచుంటి ననుట జీవుల శ్రేయస్సుకొరకేగాని నా కొరకు కాదని తేలుచున్నది. సామాన్యులు సత్కర్మ మాచరింపనిచో బ్రతుకుటకు వీలుపడదు గనుక యాచరించెదరు. వృత్తి యుద్యోగాదుల పేర నితరులకు పనికివచ్చు పనులు చేయుచుండుట యిట్టిదే. దానిని సకామ కర్మ యందురు. అట్టి నిబంధన లేక యాచరించు నా మార్గము నిష్కామకర్మ. నిరంతరము జాగరూకుడనై నేనీ సృష్టికర్మ, ధర్మసంస్థాపనము నిర్వహింపనిచో, నా మార్గము ననుసరించు జనులు కూడ నన్ను జూచి సత్కర్మలు మానుదురు. దానివలన నాకేమియు నష్టము లేకున్నను వారు కర్మభ్రష్టులై నశింతురు. కనుక వా రాచరించుచుండుట కొరకు నేనును వారితో నుండి ఆచరించు చున్నాను. నీవును అట్లే ఆచరింపుము. (22, 23, 24)

**జ్ఞాని - అజ్ఞాని :**

విద్యుత్ప్రవాహము వలన దీపములు వెలుగుట, పంకాలు తిరుగుట, రేడియో పాడుట మున్నగు లోక కార్యాచరణ రీతులు నిర్వహింపబడవలె నన్నచో ఆ విద్యుత్తు ప్రవహించుటకు జంట తీగెలు జమిలిగా నేర్పాటు చేయవలెను. ఋణ ధన సంజ్ఞలతో పనిచేయు నీ తంత్రికలలో నుండి విద్యుత్తు

వచ్చి పనిచేసి తిరిగి యథాస్థానమునకు చేరుకొను చుండును. అట్లే జీవు లందరును భగవానుని ప్రకృతి శక్తి ప్రవాహమునకు జంట తీగల వంటి జమిలి జీవితములను జీవించుచుందురు. ప్రతి వ్యక్తికిని తాను చేయదలచిన కార్య క్రమముల వరుస యొకటి యుండును. తన వలన చేయబడుచున్న కార్య క్రమముల వరుస మరియొకటి యుండును. బుద్ధిమంతుడు జ్ఞానము వికసించిన కొలదిని ఈ రెండింటిని గూర్చి స్పష్టముగ తెలిసికొను చుండును.

తాను చేయదలచిన కార్యక్రమమున తన కోరికలు, ఇష్టా యిష్టములు, ఇచ్ఛాద్వేషములు, అహంకార మమకారములు పనిచేయుచుండును. వాని నంటించుకొనిన జీవి తన కోరికలను తీర్చుకొనుట కొరకై తన యిచ్ఛ ప్రకారము కార్యాచరణము నవలంబించు చుండును. కాని, వాని ప్రకారము కార్యసాధన జరిగినట్లును, జరుగనట్లును కనిపించుచుండును. తన కోరికలు కొన్ని తీరి నట్లును, కొన్ని తీరనట్లును ఉండును. జీవితము విజయవంత మగునో కాదో యతడు చెప్పలేడు. వాని మూలమున సృష్టిలో జరుగవలసిన పనులు మాత్రము జరుగుచుండును. వాని రాగద్వేషాదులతో జరుగవలసిన పనులకు సంబంధము లేదు. తన పట్టుదల వలన తనకు కలిగిన కోప తాపాదులు, బాధలు మాత్రమే తన సొత్తై లెక్కతేలును. ప్రతి భర్తయు తన కామము కొరకు తన సంసారము చేసికొనుచుంటి ననుకొనును. వాని తెలివి తక్కువను వినియోగించుకొని ప్రకృతియే పుట్టవలసిన జీవులకు శరీరములు కల్పించును. తలచినది తన కామము. సిద్ధించినది ప్రకృతిలోని శరీర కల్పనము. ఇట్లే సమస్త కార్యములను భావన చేయవలెను. కనుక బుద్ధిమంతుడు దీనిలోని మర్మము గ్రహించి, ప్రకృతిలో జరుగవలసిన పని తాను నిమిత్తముగ జరుగుచున్నదని గ్రహించి, ఫలాపేక్షను విడచి, కోపతాపాదికముల నుండి శమము పొంది, సంసారమున చిక్కనివాడై వర్తించును. (25)

అట్టివాడు మిగిలిన వారిని అజ్ఞానులని భావించినచో మరల పతనము చెందును. ఫలాపేక్ష, అహంకార మమకారములు కలిగి పనిచేయుచున్నవారు కూడ నిమిత్తమాత్రులే యనియు, వారి ద్వారమున జరుగవలసిన వ్యూహమే జరుగుచున్న దనియును గ్రహింపవలెను. అట్లు గ్రహించినపుడు అజ్ఞానులకు తన జ్ఞానము రుద్దవలెనను కోరిక కలుగదు. పని ఎట్లును జరుగుచున్నప్పుడు

తాను కలుగజేసికొనుట యెందుకు? వా రజ్ఞానులైనచో తనకు పోవునదేమి? భగవంతునికి లేని యభ్యంతరము తనకేల? ఈ సందర్భమున ఫలాపేక్షతో, పట్టుదలతో పనిచేయుచున్నవారిని కదలించి, వారి పట్టుదలను చెదరగొట్టినచో తన కేమి వచ్చును? ఒకే గడియారమున చక్రములు, ముళ్ళు మొదలగు భాగము లున్నవని గ్రహించినపుడు, ఆ భాగములు తప్ప గడియారమని వేరుగా నొక వస్తువు లేదని తెలిసికొనవలెను. ఆ చక్రములను చెదరకొట్టినచో కాలము తెలిసికొనుటకు పనిముట్టుండదు. సత్యదర్శనము పేర పెడబుద్ధులు పుట్టరాదు. కనుక కామక్రోధములతో, పట్టుదలతో, ఫలాపేక్షతో గట్టిగా పని చేయుచున్న అజ్ఞానులను జ్ఞానవంతు డెన్నడును చెదరగొట్టరాదు. తనకు గలిగినది మాత్రము నిజమైన జ్ఞానమని సిద్ధాంతమేమి? తన మార్గము, వారి మార్గము కలిసిన మొత్తమే కదా సృష్టిలోని సత్యము! **(26)**

ఇట్టి సందర్భమున జ్ఞానవంతు డేమి చేయవలెను? లోకశ్రేయస్సును గ్రహించి దృష్టిలో నుంచుకొనవలెను. దాని ననుసరించి నిష్కామముగ తన కర్మాచరణమును మలచుకొనవలెను. దానిని శ్రద్ధతో నాచరింపవలెను. అజ్ఞాని మమకారముతో నెంత పట్టుదల వహించునో తాను కూడ మమకారము లేకుండ అట్లే వహించవలెను. బాహ్యప్రపంచమునకు వారు చేయుచున్నంత పట్టుదల తోను తానును లోకశ్రేయస్సునకు సంబంధించిన పనుల నాచరింపవలెను. దాని కడ్డువచ్చిన వారిని రాగద్వేషములు కలవాడు తొలగించునట్లే తానును రాగద్వేషములు లేక తొలగించవలెను. యుద్ధాదులు కూడ మూర్ఖు లాచరించు నట్లే తానును మూర్ఖత లేక యాచరించవలెను. లోభి తన కొరకు ద్రవ్య మార్జించి మూట కట్టినట్లే తానును ఆర్జించి, లోక శ్రేయస్సుకు వినియోగించు టకై మూట కట్టవలెను. కర్మలయందు సంగము కలిగిన అజ్ఞానులను పిలిచి జ్ఞానము పేర భేదబుద్ధి పుట్టించరాదు. వారి నమ్మకములను చెదరకొట్టరాదు. దేవునకు దండము పెట్టుట, మ్రొక్కుకొనుట తమ కష్టములు తీరుటకు అని పలువురు నమ్ముచున్నారు. అది తప్పని వాదించినచో కుంటివాని చంకలోని కర్రను లాగివైచినట్లగును. వారి నమ్మకమునే వినియోగించి భక్తి భావమును వృద్ధి చేసినవాడే బుద్ధిమంతుడు. తాను నిష్కామముగా నిర్లిప్తముగా వర్తించు చున్నను, పూజలు, మ్రొక్కుబడులు, విగ్రహారాధనము మున్నగు పామర

మార్గములను తప్పని వాదించరాదు. వానిమీద తన కాసక్తి లేకున్నను తానును ఆచరించుట మానరాదు. తా నాచరించినచో వారును ఆచరించి తన్ననుస రించి భక్తి భావమును పెంపొందించుకొను చున్నారు గదా! కనుక యుక్తితో లోక శ్రేయస్సునకు సంబంధించిన సత్కర్మాచరణములు వారి మనస్సున ప్రేరేపణ చేసినను తప్పులేదు. సత్కర్మాచరణము వలన మనస్సు పవిత్రమై కాలక్రమమున వారిలో నున్న ఫలాపేక్ష సహజముగా తొలగిపోవును. తన కెట్లు తొలగినదో, అంతకుముందు తా నెట్లున్నాడో అను విషయము మరచిపో రాదు. తాను కారణజన్ముడు కనుక, మొనగాడు కనుక తొలగినదని భావింప రాదు. పూర్వము తాను నిరంతర మాచరించిన కర్మాచరణము వలననే తనకు తొలగినది గనుక, వారికిని అట్లే తొలగును. ఆచరింపబడుచున్న కర్మ లన్నియు తనకు గాని, వారికి గాని, జ్ఞానము వలన ఆచరింపబడుట లేదు. వ్యక్తి స్వభావముగ పనిచేయుచున్న త్రిగుణముల వలన పను లాచరింపబడు చున్నవి. ఈ త్రిగుణములు ప్రకృతికి సంబంధించినవి. ప్రకృతి వ్యక్తికన్న తెలివైనది. అట్టిచో సత్కర్మలకు తాను కర్తనని అహంకార పడరాదు. (27)

## తత్త్వవేత్త :

తత్త్వవేత్త యనగా వేదాంతపు లోతులు తెలిసినవాడనియు, పరమాత్మ తత్త్వమును గూర్చి విశిష్టమైన శాస్త్ర పరిశోధన చేసి పారము ముట్టినవాడనియు నర్థము చెప్పుకొందురు. పరమాత్మ యొక్క పారము చూచుట ఎవరికిని సాధ్యము కాదు. సాధ్యమైనచో దేవుడు మన భావనకన్న చిన్నవాడు కావలసి యుండును. మన మనస్సుకన్న చిన్నవాడు, మన భావనకు ఇమిడినవాడు మనకన్న యల్పుడగునుగాని, పరమాత్మ ఎట్లగును? మన భావనలు, చేష్టలు, స్వభావములు నెవ్వనియందు సమర్పితములగునో అతడే భగవంతుడు. అతడు మనయందుండుట కొంతవరకు మాత్రమే సత్యము. మన మతని యందు ఉన్నాము గనుక, దయతలచి యతడు మనయందున్నాడని తెలిసికొనవలెను.

కనుక తత్త్వవేత్త యనగా దేవుని అంతుచూచిన వాడని యర్థము కాదు. లోకతత్త్వము నెరిగినవాడని యర్థము. లోకమునం దెల్లరు తమతమ పనుల

యందు పట్టుదలతో పనిచేయుచున్నారు. పట్టుదల, పట్టు విడచుట, రజస్త మస్సుల లీల గనుక, లోక జీవుల స్వభావము, ప్రవర్తనము త్రిగుణాత్మక మని తెలియవలెను. తెలిసి దాని కతీతులమై అందే ప్రవర్తింపవలెను. దాని కతీతులమైనపుడు దాని కతీతులమని గర్వపడరాదు. గర్వపడుట యనగా రజోగుణమునకు లొంగుట. దాని కతీతులు కాని సామాన్యులను అజ్ఞానులుగా భావింపరాదు. అట్లు భావించుట యనగా తమోగుణమునకు లొంగుట.(28)

లోకములోని స్వభావములను, జీవుల ప్రవర్తనలోని పట్టుదలను, రాగ ద్వేషములను నిపుణతతో పరిశీలింపవలెను. అట్లు పరిశీలించిన పిదప, వానిని నిందించుట, దూషించుట, దూరముగా నుండ యత్నించుట వలన గర్వమే కలుగును గాని ప్రయోజనమేమియు సిద్ధింపదు. దానివలన సాధకునకు సాధన చెడిపోవుటయు, లోకహితము తన వలన జరుగక, తన జన్మ నిష్ఫల మగుటయు సంభవించును. తన వలన లోకహితము జరుగనపుడు మరియొకరి వలన జరుగును గాని నిలచిపోదు. కనుక రెండు విధముల నష్టము సాధకునకే సంభవించుచున్నది. ఇట్టిది యోగ సాధనకు, ఆధ్యాత్మిక సాధనకు, వాని గమ్యమైన మోక్షమునకు మార్గమే కాదు. సరియైన సాధకుడు లోక తత్త్వమును తెలిసిన వెనుక, దానిని సద్వినియోగము చేయు మార్గము నన్వేషింపవలెను. అట్టివాడే తత్త్వవేత్త. అతడు లోకులలో వ్యాపింపజేయు భావములు లోక హితార్థము పనికిరావలెను. అనగా లోకులు చేయు పనులను కాదనుట, విమర్శించుట, పాపమును దూషించుట కాదు. లోకుల మనస్సులలోని త్రిగుణాత్మకమైన ప్రవర్తనమును, దానివలన నొక్కొక్కని స్వభావమును తెలియవలెను. వారి యీ స్వభావము వేదాంతాది శాస్త్రముల నధ్యయనము చేయుట వలన మారునది కాదు. ఒక్క సత్కర్మాచరణ వలన మాత్రమే మారి, త్రిగుణములు సామ్యము నొందును. లోకుల గుణముల నెరిగినవాడు వారి మనస్సు ఎట్టి కర్మలయందు ప్రవర్తించునో పరిశీలింపవలెను. మరియు నెట్టి సత్కర్మలయందు ప్రవర్తింప జేయగలమో కూడ తెలిసికొనవలెను. దాని ననుసరించి మలచుటకు యత్నము చేయవలెను. ఈ మలచుట వారి రాగ ద్వేషములను నిందించుట వలన సాధ్యము కాదు. వారి యాశలను, ఆశయము లను, అహంకార మమకారములను బాగుగా గుర్తెరిగి, వాని కనుగుణముగనే

సత్కర్మను ప్రేరేపణ చేయవలెను. ఉదాహరణకు రజోగుణము ప్రకోపించిన వానికి కీర్తికాంక్ష, పదవీ వ్యామోహము ఉండును. అట్టి వానికి సత్కీర్తి కలిగించు దాన ధర్మములను, దేవాలయ, విద్యాలయాది సంస్థలను నెలకొల్పుటను నేర్పవలెను. అనేక సంస్థలకు వారి పేర్లు పెట్టుట, వారి చిత్రపటాదులను ప్రకటించుట మొదలగునవి జరుగనీయవలెను. కీర్తి, పేరు ప్రతిష్ఠలపై వ్యామోహము మంచిది కాదని చెప్పరాదు. కాలక్రమమున అతడు చేయు పనులతో మనసు పరిపాకము చెంది, కీర్తి ప్రతిష్ఠల మీదనుండి నిష్కామ కర్మయోగమునకు వాని మనస్సే మరలును. కనుక బుద్ధిమంతుడగు రాజయోగ సాధకుడు లోకమున గుణములు గుణములయందు వర్తించు చుండుటను తెలిసికొని, తాను అంటక ప్రవర్తింపవలెను. (29)

సంకల్పములు త్రిగుణముల వలన కలుగును. సంకల్పముల వలన కర్మాచరణము దానివలన కర్మఫలము కలుగును. ఈ ఫలము మనస్సు నంటుకొని మరల కర్మాచరణమునకు పురికొల్పును. ఈ మొత్తమును విశద పరచి చక్కగా దర్శనము చేయలేనివాడు తన స్వభావమందలి గుణములచే సమ్మోహము చెందును. సమ్మోహితమైన మనస్సు వలన కలిగిన ఆశలు కొన్ని పనులకు మనస్సును ప్రేరేపణ చేయును. అట్టి కర్మల నాచరించినపుడెల్ల వాని ఫలములయందు మునిగిపోవును. ఉదాహరణకు తమోగుణ దోష మెక్కువ గల స్వభావము నిండియున్నవాడు తన సాటివారిని పరిశీలించు చున్నప్పుడు, వారిలో నొకడు ఉద్యోగమున గాని, వ్యాపారమున గాని యత్నించి హెచ్చుస్థాయిని పొందెననుకొనుడు. అతనిని జూచి తమోగుణ దూషితుని మనస్సు ఈర్ష్యపడును. తాను వానికన్న హెచ్చుస్థాయికి పోనిచో దాని నవమాన ముగా భావించుకొనును. ఆ వ్యక్తి తాను చేసిన యత్నమునకు ఫలితముగా హెచ్చు స్థాయిని పొందెనని జ్ఞప్తి చేసికొను ఔదార్యము నశించును. తాను పొందలేదను నవమానమే గుర్తుండును గాని, తాను దేనికి పనికివచ్చును? తాను చేయవలసిన ప్రయత్న మెట్టిది? యను నంశములు గుర్తుండవు. అట్టి సందర్భమున తనకు తగిన ప్రయత్నము చేయక, మరియొకడు చేసిన ప్రయత్నమును తానును చేయుటకు పాటుపడును. లేదా మరియొకని ప్రయత్నమునకు అడ్డుపడుటకై పాటుపడును. దానితో తన కర్తవ్యము

భ్రష్టమగును. దానివలన తన యభివృద్ధి నష్టమగును. ఇతరులను గూర్చి కాలము వ్యర్థమగును. దాని వలన తన తామస ప్రవృత్తి యింకను ప్రకోపించి, దానికి సంబంధించిన పరధర్మమున మునిగిపోవును. ఇట్టి ప్రయత్నములతో అజ్ఞానికి జీవిత మంతయు వ్యర్థమగుటయే గాక, కష్ట పరంపరలు సంభవించు చుండును. పొరుగువాడు వాణిజ్యము చేసి లక్ష లార్జించెను గదా యని ఈర్ష్యతో తన సేవాధర్మము తాను విడచి వాణిజ్య మారంభించినచో, తన స్వభావము దాని కనుగుణము కాదు గనుక వాణిజ్యమున నష్టము కలుగును; తన సేవా ధర్మము భ్రష్టమగును. కనుక నిపుణుడగువాడు సంపూర్ణ దర్శనము కలిగి లోకవృత్తములతో సర్వకర్మల నాచరింపవలెను. ఒకనిని చూచి యొకడు వాత పెట్టుకొనుట కన్న, నొకనిలో 'నన్ను' చూచి, తా నాచరింపవలసిన సత్కర్మ నాచరించుట యోగము. అందరిలో నున్న 'నన్ను' చూచుచు, నా యందు సర్వజీవులకు తాను చేయు కర్మలను సమర్పణము చేయవలెను. ఇట్లు చేయుటయే ఆధ్యాత్మబుద్ధి యనబడును. దీని నాచరించువాడు తన సత్కర్మల ఫలితము ననుభవింపక సన్యాసి యగును. ఇదియే జీవుని గమ్యము. కనుక ఓ అర్జునా! ఫలముల ననుభవించు బుద్ధిమాని, ఎదుటివారిని చూచుట వలన కలిగిన తాపమును విడచి యుద్ధము చేయుము. (30)

## అనుష్ఠానము :

"ఈ నా మతమును నిత్యము అనుష్ఠానము చేయు మానవులు శ్రద్ధ కలిగి, అసూయ లేనివారైనచో కర్మలనుండి విమోచనము చెందుచున్నారు" అని శ్రీకృష్ణుడు ఉపదేశించెను. ఈ నా మతము అనగా తన మతము వేరుగా నున్నదని యర్థము కాదు. జీవులలో 'నేను'గా భగవంతుడున్నాడు. అట్టి 'నన్నే' సర్వమునందును భావించు మతమని యర్థము. ఇందు అనుష్ఠించుటయే గాని, అనగా ఆచరించుటయేగాని నేర్చుట యనున దేదియు లేదు. సర్వ జీవులలో నున్న యంతర్యామిని భజించుట యనగా, సర్వజీవుల శ్రేయమును భావించుచు, జీవులను అంతర్యామి మూర్తులుగా గుర్తుంచుకొనుట. దీనికి కావలసినది పాండిత్యము కాదు. బహు గ్రంథ పఠనము కాదు. వాదన, శాస్త్ర సందేహములు తీర్చుట కాదు. కేవలము గుర్తుంచుకొనుటయే. ఎంతవానికైనను జీవులలోని దేవుని అంతర్యామిత్వము క్షణక్షణము మరపునకు వచ్చుచుండును.

వెంటనే అంతర్యామి మాయమై జీవులు కనిపించు చుందురు. వారి చేష్టల యందు మనస్సు నిలచుట, ఇచ్ఛాద్వేషములు అంటుకొనుట జరుగు చుండును. దాని వలన నభిప్రాయ భేదములు, కలహాదులు మున్నగు బంధములు కలుగుచుండును. వీని నుండి విమోచనము చెంది, జీవి అతీతుడు కావలెనన్నచో జీవునియందు దేవు డంతర్యామియని గుర్తుండవలెను. తన యందు గుర్తున్నచో చాలదు, సాధ్యమును కాదు. తానే దేవుడ నను అహంకారము, అసుర లక్షణములు కలుగుట కవకాశమున్నది. కనుక ఈ సాధన తనయందు మాత్రమే గాక, నిఖిల భూతముల యందును కూడ ప్రహ్లాదాదుల వలె నాచరింపవలెను.

ప్రహ్లాదునిపై తండ్రి కోపించినపుడు ప్రహ్లాదుడు తండ్రిలో నంతర్యామి నుపాసించెను. ఏనుగులచే త్రొక్కించినపుడు ఏనుగులలో దైవమును ధ్యానించెను. పాములచే కరపించినపుడు పాముల యందును, విషము త్రాగించినపుడు విషమునందును, పర్వతాగ్రమునుండి పడద్రోసినప్పుడు పర్వతాగ్రము నందును, నడుమ లోయలందును, సముద్రములో ముంచి నపుడు సముద్ర గర్భమునను శ్రీహరి అస్తిత్వము చూడగలిగెను. కనుకనే స్తంభమునందు చూడగలుగుట, అప్పటికాతని సాధన ఫలించుట జరిగినది. ఉద్భవించిన నృసింహుని యందును, చంపబడుచున్న తండ్రి యందును, చంపుట యను దృశ్యము నందును శ్రీహరి సాన్నిధ్యమే!

కాబట్టి సాధకు డీవిధమైన 'నా' మతము ననుష్ఠింపవలసినదే గాని, నేర్చుకొనవలసిన దేమియు లేదు. అనుక్షణము మనస్సును ధ్యానమునందు మలచుటకు కావలసినది శ్రద్ధ. ఉండకూడనిది అసూయ. అసూయ యున్నచో జీవులు, చేష్టలు గోచరించుచు, అందు అంతర్యామి మాటుపడి యుండును. శ్రద్ధావంతుడును, అసూయ లేనివాడునై అనుక్షణ కర్తవ్యమును నిర్వర్తించు కొనుచున్నవాడే కర్మయోగ సాధకుడు. అట్టివానికి కర్మాచరణము చేతనే కర్మబంధ విమోచనము కలుగును. ఎట్టివానికైనను కర్మాచరణమున మాత్రమే అతీతస్థితి సాధ్యమగును. **(31)**

లోకమున నే జీవియందును దేవుని యస్తిత్వమును మరువరాదన్నచో నిక సిద్ధులు, గురువులు, మహానుభావులు నగువారి యెడల మరువరాదని

వేరుగా చెప్ప బనిలేదు. కాని యిట్టి సందర్భముననే ఏమరుపాటు త్వరగా కలుగుచుండును. "ఇది మన మార్గము. ఇతడు మన గురువు. ఇది మన సంప్రదాయము. ఇది మన మత చిహ్నము" అని సాధన చేయునంతలో, తక్కిన మహానుభావు లందరును వేరుగా కనిపించుట జరుగుచుండును. వారి మార్గమునకును మన మార్గమునకును గల భేదములను గమనించుట, గుణదోషముల నెన్నుట, మన మార్గములలోని గుణములతోబాటు, మిగిలిన మార్గములలోని దోషములను కూడ సంకీర్తనము చేయుట జరుగును. అప్పుడు మనస్సున జరుగునది సాధనవలె కనిపించినను, అసూయ యగుచున్నది. ఇట్లు ప్రవర్తించువారు అసూయ పడుచున్నారు గనుక, 'నా' మతము నధిష్ఠించుట లేదని కృష్ణు డుపదేశించు చున్నాడు. అట్టివారు సృష్టిలోని అంతర్యామిని తమకు నచ్చినంత స్వీకరించి, నచ్చనంత అసూయ పడుచున్నారు గనుక, సర్వమునకు సంబంధించిన జ్ఞానము వారికి కలుగదు. వీరు సర్వజ్ఞాన విమూఢులు. అనగా సర్వజ్ఞత యందు విచిత్రమైన మోహబుద్ధి యను పొర కప్పుకొనినవారు. మబ్బులలో నుండి సూర్యుని వెలుగు తిన్నగా గోచరింపనట్లు వీరిలోనున్న 'నా' దగ్గర నుండి వెలువడు వెలుగగు చేతస్సు వీరి మనస్సుల కందదు. అట్టి స్థితి యున్నంతవరకు వీరు అచేతనులై నష్టము పొందుచున్నారు. తనకు చెందిన భోజనము విస్తరిలో నెదురుగా నుండగా కన్ను పొర గ్రమ్మిన వాడు "నాకు ఆకలిగా నున్నది. అన్నము కావలెను" అని యరచుచుండుట వంటిది వీరి స్థితి. సర్వమునందున్న దేవుని స్మరింపక, సర్వజీవులను స్మరించి అసూయతో బాధపడు వారికి కలుగునది ఏమి? ఆనందము కలిగించు వస్తువు అన్నిటియందుండగా, ఆ వస్తువునం దీర్ష్య కలిగించుకొని బాధలకు లోనగుట నష్టము కాదా మరి? అంతకన్న నష్ట మేముండును ? (32)

## సత్కర్మ - అభ్యాసము :

లోకములో కొందరు యోగాభ్యాసము చేయుటలో ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము కావలెనందురు. అనగా ఇంద్రియములను, మనస్సును దుష్టమార్గముల నుండి నిగ్రహించుట యని యోగాభ్యాసమును గూర్చి, జీవిత సాధనను గూర్చి వారి యభిప్రాయము. ఎవని స్వభావమును బట్టి వాని మనస్సు, ఇంద్రియములు ప్రవర్తించుచుండుట ప్రకృతి సత్యము. అట్టి

మనస్సును నిగ్రహము చేయుట యను నభిప్రాయము పుట్టినంత మాత్రమున అది స్వభావమును నిగ్రహింపగలదా? స్వభావమునుబట్టి మనస్సుయొక్క ప్రవర్తనము మొత్తము జరుగుచున్నప్పుడు మనస్సు నిగ్రహించ గలుగు ననుకొనుట, మనస్సును నిగ్రహింపగల ననుకొనుట హాస్యాస్పదము. ఇందు అతి సూక్ష్మమైన కొలికిపూస యున్నది. ఒక ధనవంతుని వద్ద అన్నవస్త్రములు, జీవనోపాధి పొందుచు పనులు చేయుచున్న గుమాస్తా గాని, పరిచారకుడు గాని తనకు వచ్చిన క్రొత్త యభిప్రాయములను తన యజమాని యెడల నెంతవరకు ప్రవేశపెట్టగలడు? ఒక కోటీశ్వరుడైన వ్యాపారస్తుని యంగడిలో నొక గుమాస్తా యుండెను. అతడు అమ్మకము, లెక్కలు చూచుకొనుచు, అచ్చటనే భోజనము, అన్నపానీయములు, నివాసము కలిగియుండెను. అతని కొకనాడు తన యజమాని వాణిజ్య విధానమును గూర్చి, అమ్మకములను గూర్చి క్రొత్త మార్గమొకటి స్ఫురించెను. అంతమాత్రమున తన మార్గము నాత డమలులో పెట్టగలడా? తనకు నచ్చిన మార్గములు సత్యమని తోచినను, తన యజమానికి తోచనిచో ఆచరణమునకు వీలగునా? కాదుగదా! అట్లే స్వభావమునకు నచ్చని నిగ్రహమును మనస్సు పట్టుబట్టినను అమలులో పెట్టుట సాధ్యము కాదు.

ఏ జీవికైనను తన స్వభావము ననుసరించిన చేష్టలు కలుగును. కోతికి గంతులు వేయుట ప్రకృతి; గోవునకు సత్త్వగుణము ప్రకృతి; సింహ వ్యాఘ్రాదు లకు రజోగుణము ప్రకృతి. అవి తమ ప్రకృతి ననుసరించియే ఆహార విహారము లకు చిన్నతనము నుండి యాకర్షింపబడి యలవరచుకొనును గాని, క్రమశిక్షణ చేత అని భావింపరాదు. క్రమశిక్షణ గలిగినను తేలు ఒత్తిడి కలిగినపుడు కొండె విసరుట మానునా? క్రమశిక్షణ లేకపోయినను గోవునకు ఒత్తిడి కలిగించి నపుడు చంపదు.

కోడిగ్రుడ్లలో బాతుగ్రుడ్లను కలిపియుంచినచో కోడిపెట్ట రెండింటిని పొదిగి పిల్లలు చేయును. ఆ పిల్లలు కోడివెంట పోవుచుండును. నీటిని చూచి నంతనే కోడిపిల్లలు నిలబడిపోవుట, బాతుపిల్లలు దిగి యీదుట చూచు చున్నాము గదా! ఇందు పనిచేయునది జన్మసంస్కారమే గాని క్రమశిక్షణ కేమాత్రము తావులేదు. అట్లే ఎంత జ్ఞానవంతునకైనను తన స్వభావము

ననుసరించి మనస్సు, పంచేంద్రియములు, అభిరుచులు నేర్పడును. క్రమశిక్షణ వీనికి మెరుగు తేగలదు గాని రుచులను మార్చలేదు. ఇచట జ్ఞానవంతుడను పదమునకు జ్ఞాని యని అర్థము కాదు. జ్ఞాని యనగా ఆత్మజ్ఞానము కలవాడు. ప్రజ్ఞ యంతయు సర్వము తానెయై మెలగువాడు. *('జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్')* అతడు ముక్తుడు. కాని జ్ఞానవంతు డనగా జ్ఞానము కలవాడే తప్ప, తాను జ్ఞానమైన వాడు కాదు. తట్టలో భోజనము నుంచి మోయుచున్న వాని వంటి వాడు జ్ఞానవంతుడు. భోజనము చేసి జీర్ణించుకొన్న వాని వంటివాడు జ్ఞాని. జ్ఞానికి సృష్టిలోని దివ్యప్రకృతి తప్ప తన ప్రకృతి యని వేరుగా నుండదు. జ్ఞానవంతునికి మాత్రము ఎన్ని శాస్త్రములు నేర్చినను, ఎన్ని రహస్యములు తెలిసినను, తన ప్రకృతి పని చేయుచుండునేగాని, తెలిసిన విషయములు పనిచేయవు. ఒక త్రాగుబోతు మద్యమునకు గల ఆరోగ్య నష్ట కారణములను శాస్త్రాధ్యయనము వలన గ్రహించి జ్ఞానవంతుడు కావచ్చును. మద్యము కనిపించినపుడు అతని జ్ఞానము పనిచేయక వాని ప్రకృతియే పనిచేయును. ఇంక మనస్సున సంకల్పించిన నిగ్రహము అను పట్టుదల ఎంత యున్నను ఏమి లాభము? ఒక్కనాడు ధనము లభింపక మద్యము త్రాగక పోయినందు వలన నతడు మద్యము మానినట్లు కాదు గదా! (33)

స్పష్టముగా నిగ్రహ మన్నది స్వభావముపై పనిచేయదు. స్వభావము త్రిగుణాత్మకము. త్రిగుణములు దేవతల సృష్టియే కాని, అవి పనిచేయు నపుడు రాగద్వేషము లను మలములు పుట్టి తనలోని త్రిగుణములను మలినము చేయుచుండును. దీపము వెలిగినప్పుడు పొగ వచ్చుట, వత్తికి కొడిగట్టుట తప్పదు. ఈ కొడి యనునది వత్తియొక్క పదార్థమున లేనట్లు, ప్రకృతిలోని త్రిగుణములలో రాగద్వేషములు లేవు. ఇంద్రియమునకును, ఇంద్రియార్థము నకును నడుమ మనస్సు వ్యాపారిత మగుచున్నప్పుడు రాగద్వేషములు పుట్టు చుండును. వానిని నిరంతరము పరిశుభ్రము చేసికొనుచుండుట మన కర్తవ్యము. లేనిచో ఈ రాగద్వేషములే త్రిగుణములతో కలసి వ్యక్తిగత ప్రకృతిగా పనిచేయును. నీరు నిర్మలమే యైనను చెరువునుబట్టి కలతలగు చున్నది గదా! కనుక పర్యవసాన మేమనగా, తన ప్రకృతిని దివ్య ప్రకృతిగా మార్చుకొను సత్కర్మ లాచరించి, నిశ్చలత్వము, నిర్మలత్వము, శాంతి, సద్బుద్ధి

కలిగి మెలగవలెను. అంతేగాని, సత్కర్మ హీనుడై నన్ను నేను నిగ్రహించుకొన గలనని విర్రవీగినచో దెబ్బతినును. స్వభావమన్నది తెలివితోను, పట్టుదలతోను, శిక్షణతోను మారునది కాదు. సత్మర్మల క్రమాభ్యాసమున మాత్రమే స్వభావము మారును. (34)

## స్వధర్మము :

తన పని యేది, తన పని కాని దేది తెలియుటలోనే యిహపరముల పరిష్కారమంతయు నిమిడియున్నది. దీనిని నిర్ణయించుట యెట్లో తెలియుట సరియైన యోగసాధన మార్గము. ఇది తెలియని ఆసన ప్రాణాయామాదులు, కఠోర నియమములు రక్షింపలేవు. జీవికి తన వ్యక్తిగత ప్రకృతి యను బంధము నుండి విమోచనము కలుగుట దీనివలన మాత్రమే జరుగుచున్నది. తన పని యేదియో తెలిసికొను నిపుణత, ఆచరించు శ్రద్ధ, ఈ రెండును కలవా డాచ రించునదే లోకమునకు సత్కర్మ యగును. తనకు స్వధర్మమగును. ధర్మ మనగా ప్రకృతిలోని స్వభావము. త్రిగుణములు ప్రకృతియొక్క పవిత్ర ధర్మములు. వానిని చిక్కుపరచుకొనుట వలన స్వధర్మము అవగతము కాదు. సరళమైన ప్రకృతి సూత్రముల ననుసరించి కర్తవ్యము నాచరించుచు, నిరంత రము ఈ కర్తవ్యమునందు దైవమును స్మరించుచున్న వానికి, తాను గడపు కాలమంతయు దైవ స్వరూపమగును. ఇట్టివానికి కష్టసుఖములు, లాభా లాభములు, జయాపజయములు నుండవు. గదిలో పాము దూరిన వానికి ఆ గదిలోని మిగిలిన వస్తువులెట్లు గమనికలో నుండవో, వానిపై ప్రభావము చూపవో, అంతకన్న మిన్నగా ప్రభావము చూపకుండు లక్షణము నిశ్చలత్వము లభించిన వానికి కలుగును. ఈ సాధన వలన తన స్వభావము తనకు లొంగును. తన స్వభావమునకును, మానవ స్వభావమునకును గల భేదము తెలిసి చక్కదిద్దు కొనుట సంభవించును. అట్లే సకల జీవరాశులకు, సమస్త వస్తుజాలమునకు గల ప్రత్యేక స్వభావముల నంటుకొనియున్న తన దృష్టి క్రమముగా వాని వెనుకనున్న ప్రకృతిలోని త్రిగుణములలోనికి సర్దుకొనును. వెంటనే కదలని నూతి నీటిలో ఆకాశము, సూర్యచంద్రులు, తారకలు యథాతథముగా ప్రతిబింబించును. అప్పుడు చూచువానికి నూతి నీరు ప్రత్యేకముగా గోచరింపదు.

అట్లే త్రిగుణముల సామ్యము కలిగిన జీవికి ప్రజ్ఞ త్రిగుణాతీత మగును. ఈ మార్గమునకు స్వధర్మాచరణమే సాధనము.

స్వధర్మ మెట్లు తెలియును? కొందరు కులమును బట్టి వృత్తి యేర్పడుట స్వధర్మాచరణమని చెప్పుచున్నారు. అయినచో కొందరు బ్రాహ్మణుల పిల్లలకు మద్యము త్రాగవలెనని మొదలగు నభిలాషలు కలుగుచున్నవి గదా! వృత్తి యనగా ప్రవృత్తియైనచో నిట్టి కోరికలు కలుగుట యేల? దీనిని బట్టి జన్మ కులమును అనుసరించి స్వధర్మ మేర్పడదని తెలియుచున్నది. జీవికి గుణము పూర్వాభ్యాసము వలన నేర్పడును. ఈ అభ్యాసము పూర్వజన్మలది గాని, ఈ జన్మదిగాని కావచ్చును. ఇట్లేర్పడిన గుణము కర్మఫలము. కనుక నెప్పుడును సత్కర్మాచరణము వలన సద్గుణ మేర్పడుట ప్రారంభించును. పూర్వకర్మ ఫలముగా కొన్ని సత్కర్మల పైకి, కొన్ని దుష్కర్మల పైకి జీవి యభిలాష ప్రసరించుచుండును. సత్కర్మలలో తన యభిలాష నాకర్షించిన వేవియో వాని నవలంబించి యాచరించుట మొదలు పెట్టవలెను. ఇదియే స్వధర్మా చరణము. దీనికి గురువులు (తల్లిదండ్రులు మొదలగువారు) బోధించిన శాస్త్రములు సహాయపడి దారి తెలుపును. దాని ననుసరించి యాచరించిన పని స్వధర్మమగును. దానికి శ్రుతి కలియనిది పరధర్మ మగును.

అంతకుముందు ఆచరణలో అభ్యాసము లేని జీవికి స్వధర్మము కొంత నచ్చకపోవచ్చును. పరధర్మము నచ్చవచ్చును. స్వధర్మము నచ్చకపోవుటకు చాంచల్యము కారణము. లభించిన దానికన్న లభించని దెక్కువ లాభించు నేమో యను భ్రాంతి వలన స్వధర్మము నచ్చకపోవుట కలుగును. దాని నాచ రించుట యందు గల అసౌకర్యములే కనిపించును. పని యలవాటు తప్పిన వానికి, వృత్తి ధర్మమున పైయధికారి ఆజ్ఞాపించిన పనులు చేయుట కష్ట మని పించును గదా! అప్పుడు అధికారు లన్యాయము చేయుచున్నారనియు, ఒకరి క్రింద వృత్తి చేయరాదనియు నహంకరించి, ఈ యభిప్రాయమునే ధర్మ సూత్రముగా భ్రాంతి చెందుట జరుగుచున్నది గదా! అట్లే అసౌకర్యము కారణముగా ఆచరణ సాధన లేనివానికి స్వధర్మమునందు లోపములు కను పించును. మనకన్న సుఖవంతముగా, సంపన్నముగా బ్రతుకుచున్న వారిని చూచినపుడు మనము చేయుచున్న ఉద్యోగము మాని వారు చేయుచున్న

వాణిజ్యాదుల నవలంబింప వలెనని కోరిక పుట్టవచ్చును. కాని ఆ సంపన్నులు స్వధర్మము నాచరించు చున్నారని తెలిసికొనుటకు మనస్సు తావీయదు. మన స్వభావమునకు తగిన పనిని యెన్నుకొనుట చేయలేక, మనకన్న లాభము పొందుచున్నవారు చేయుచున్న పను లాచరింపవలె ననిపించును. వారికిని ఒక స్వభావమున్నదనియు, దానికి తగినట్లాచరించి వా రంతవారైనారనియు గ్రహించుట కావలెను. తన వృత్తికి నడచి వెళ్ళుచున్న వాడు కారులో పోవుచున్న పోలీసు అధికారులను చూచి ఈర్ష్య పడినప్పుడు, తన వృత్తిని మానగలడు గాని, వారు చేయుచున్న పనిని చేయలేడు గదా! చెప్పుల దుకాణమునకు పోయి తన కాలికి జతపడిన వానిని తా నెన్నుకొన్నచో నుపయోగము. అంతకన్న పెద్ద చెప్పులు కొన్నవానిని చూచి ఈర్ష్యపడి తానును వానినే కొన్నచో నష్టమేగాని లాభము లేదుగదా! పైగా ఆ సరిపడని చెప్పులతో పడిపోవుట (పతనము) కూడ సంభవించును. అట్లే పామర దృష్టికి దోషము ఉన్నట్లు కనిపించినను స్వధర్మము నవలంబించుటయే శ్రేయము. ఇతరులు ఎక్కువ లాభము పొందుచున్న పనులు తనకు చేతకానివైనచో అవి పరధర్మము లనబడును. గుణవంతములైనను అవి పతనహేతువు లగును. నిరంతర అభ్యాసము వలన తాను పరధర్మమును చక్కగా అవలంబింప గలిగినను, అది తన జీవ లక్షణమునకు విరుద్ధమైనప్పుడు శ్రేయస్సు కాదు. వ్యాయామ కుశలుడు ఇనుపగుండు నెత్తుట చూచి మోజుపడి, గుండె నీరసము వాడు అనుదినాభ్యాసము వలన కొన్ని సంవత్సరములకు తానును ఇనుపగుండు నెత్తగలిగినను అది వాని మృత్యువునకు కాలము సమీపింప జేయును.

తన పనిలో మరణము సంభవించినను శ్రేయస్సే కలుగును. పర ధర్మమునం దెప్పుడును భయమే కలుగును. అనగా మరణ భీతికన్న నెక్కువ భయము పరధర్మమున కలుగును. అట్టి భయముతో జీవించినవాడు సంపదల నడుమనున్న నేమి లాభము? సంపద లనబడు అన్నపానీయములు, మంచి యిల్లు, వాహనము మున్నగునవి సుఖపడు వానికి సంపదలగును గాని, తమకు తామే సంపదలు కావు గదా! ఋణబాధతో దిగులుచెందిన వానికి, బంధువుల అనారోగ్య వార్త విన్నవానికి ఎదుట నున్న మంచి భోజనము, శయ్య,

సౌఖ్యములని చెప్పలేము గదా! అట్లే తన ధర్మము కాని దానిని ఆశపడి ఆచరించువాని జీవిత మంతయును భయావహ మగును. (35)

**కామక్రోధములు :**

సృష్టి సమస్తము పంచభూతాత్మకమైన ప్రకృతి. దానియందెల్లెడల నంతర్యామి రూపమై భగవంతుడు యిమిడి యున్నాడు. దేహము లిట్టి పంచభూతములతో చేయబడినవి. మనో బుద్ధ్యహంకారాదులు, ఇంద్రియములు, పంచభూతములును కలసి త్రిగుణాత్మకములు. త్రిగుణములు ప్రకృతినుండి పుట్టినవి. ప్రకృతి పరమాత్మయందు వ్యక్తమైనది. జీవునిలో దేవు డంతర్యామి. జీవుడు దేవుని రవ్వయే! అయినచో జీవుడుగా దిగివచ్చిన పురుషుడు పాపములు చేయుచున్నాడేమి? ఎవరిచే ప్రేరేపింపబడి అత డిట్లు చేయు చున్నాడు? ప్రేరేపించువా డొకడున్నచో వానియందు దేవుడు లేడా? మరియు జీవుడు దేవుని రవ్వయైనచో ప్రేరేపింపబడవలసిన దీనత యేల? దానికి లొంగునట్టి నీచత్వమేల? లోకమున పాపకార్యము లాచరించు వారిని పలువురను చూచుచుంటిమిగదా! అందు కొందరిష్టము లేకున్నను బలవంత ముగా వాని నాచరించు చుండుట చూచుచున్నాము. అందువలననే వానిని పాపకార్యములని తెలిసికొనుచున్నాము. తాను ఆర్జించిన ధనముతో భార్యకు, పిల్లలకు, కావలసిన యింటి సరకులు కొనవలెనని అభిలాషపడు వారిలోగూడ కొందరు చీట్ల పేకాడి, కొందరు గొప్పకొరకు స్నేహితులకు ఖర్చుపెట్టి, కొందరు మద్యము సేవించి, మరికొందరు అనావశ్యకమైన ప్రయాణాదులు చేసివచ్చి, తరువాత బాధ పడుచున్నారు గదా! “నా కిట్టి దౌర్బల్య మున్నది. ఏమి చేయుదును?” అని చింతపడుచునే యున్నారు. వారీ తప్పులను మోజుపడి చేయుటలేదు. తాత్కాలిక భ్రమచే దుఃఖించుచునే చేయుచున్నారు. కొందరు మంచి పనులనుకొని భ్రమపడి చేయుచున్నారు. ఉదాహరణకు స్వధర్మాను ష్ఠానము చేసినవాడు ఉత్తముడని భగవానుని వాక్యములు చదువుకొన్నవారు కూడ, తమ ఆర్జనను పుణ్యక్షేత్ర తీర్థ దర్శనములకు ఖర్చుపెట్టి, తమ బిడ్డలకు కావలసినంత తిండి, బట్ట, చదువు సమకూర్చలేక ధర్మభ్రష్టు లగుచున్నారు. స్వధర్మమైన వెనుక, భగవంతు డవకాశమిచ్చినచో పుణ్యక్షేత్ర తీర్థ దర్శనాదులు చేయుట వివేకము. ఈ లోపున మన దగ్గర భగవంతు డున్నాడని తోచ

కుండుట, లేడనుకొని పుణ్య క్షేత్రములలో వెదుకబోవుట దుర్బల లక్షణము. "వీరిన్ని కష్టములు పడికూడ యాత్ర చేసిరి" అని పదిమంది చెప్పుకొనుటకే పనికివచ్చునుగాని, తమ కనువిప్పునకు కాదు. మంచి, చెడు మార్గములలో నిట్లు చేయుట దుర్వ్యసనమే. చేయుచున్నప్పుడు మనస్సునకు తెలియుచునే యుండును. మనస్సు బాధ పడుచునే యుండును. అయినను చేయుచునే యుందురు. ఈ విధమైన ఇష్టములేని చెడ్డపనులకు జీవుడు ప్రేరేపింపబడుట యెట్లు జరుగుచున్నది? ప్రేరేపించున దెవ్వరు? - ఈ ప్రశ్న సహజముగనే అర్జునునకు కలిగినది. **(36)**

ఒంద్రుమట్టితో రెండు కుండలు చేసి, ఒకదాని కొకటి కొట్టినచో నవి పగులును. ఒంద్రుమట్టికి ఇట్టి పగులునట్టి లక్షణము లేదు. ఒక పెద్ద మంచు గడ్డ నెత్తి యొకని తలపై విసరినచో తల పగులును. మంచు గడ్డ కట్టుకొనక ముందు నీరుగా నున్నపుడు, ఆ నీటికి తల పగులగొట్టు లక్షణము లేదు. ఈ విధముగా స్థితి భేదముచే తాత్కాలికములైన లక్షణము లనేకము ప్రకృతిలో సంక్రమించు చుండును. ఇట్టి తాత్కాలిక లక్షణములే కామము, క్రోధము అనబడు జీవిలోని లక్షణములు. ఉదజని, ప్రాణవాయువు వదలిపెట్టినచో పైకి ప్రసరించి గాలిలో కలియును. ఈ రెండు వాయువులే సంయోగమంది నీరుగా మారినపుడు పైకి పోక, పల్లమునకు ప్రవహించును. ఒకే ద్రవ్యము వాయుస్థితిలో భూమిపై నుండి పైకెగిరిపోవు చుండగా, ద్రవస్థితిలో పల్లమున కాకర్షింపబడు చున్నది. అదియే గడ్డ కట్టినపుడు స్థిరముగా నున్నది. అట్లే ప్రకృతికి మనస్సు అను స్థితి కలిగి, ఇంద్రియముల ద్వారమున పరిసర వస్తువులపై, వ్యక్తులపై ప్రసరించుచున్నప్పుడు కొన్నిటి కాకర్షింపబడుట, కొన్నిటికి విముఖత చెందుట యను తాత్కాలిక లక్షణము లేర్పడును. ఇది అయస్కాంతమునకు ధ్రువము లేర్పడుట వంటిది. మనస్సునకు గల ఈ రెండు ధ్రువములే కామక్రోధములు. ఈ శక్తులు లేనిచో తాను వేరుగా జీవించుట, తా నితరములు తెలిసికొనుట యుండదు. ఆహారాదులను స్వీకరించుట, మలమూత్రాదులను విసర్జించుట యుండదు. కనుక ఈ ఆకర్షణ - వికర్షణ శక్తులావశ్యకములై వలసినచోట నెల్ల తాత్కాలికముగా వ్యక్తమగుచుండును. వాని ప్రభావముననే మనస్సునకు ఇచ్ఛాద్వేషములు కలుగును. వాని వలన పాపము అను దుష్టశక్తి

తాత్కాలికముగా నుద్భవించి వర్తించుచుండును. నూనె పోసి వత్తిని వెలిగించి నచో కాంతి పుట్టును. కాని వత్తి కొడిగట్టుట, పెట్టినచోట పొగచూరుట తప్పని సరిగా కలుగును. వత్తి దీపము కావలసినచో పొగ నుండి తప్పించుకొనుటకు వీలు లేదు. అట్లే సృష్టికర్మ జరిగినచోట నెల్ల పాపము పుట్టుచుండుట తప్పదు. అనుదినము వత్తి మార్చి, గూటిని పరిశుభ్రము చేసికొనునట్లు, సత్కర్మా చరణమున జీవి పాపమంటక ముక్తుడై నిలచుట సాధ్యము. అంతే గాని పాపము పుట్టకుండుట సాధ్యము కాదు. ఒక పనికి కావలసిన వస్తువింకొక పనికి పాపహేతువు కావచ్చును. వైద్య ప్రయోగమున ఇనుము రక్తమును శుద్ధి చేయును. అట్టి యినుముతో చేసిన కత్తితో పొడిచినచో జీవి చనిపోవును. అట్లే త్రిగుణాత్మకమైన ప్రకృతిలోని వివిధ స్థితులు పవిత్రమైన సృష్టి కర్మ కావశ్యకములు. ఆ స్థితులు మరల త్రిగుణ దోషములైన కామక్రోధములుగా మారుచున్నవి. ~~ఈ~~ దోషముల నెప్పటికప్పుడు సంస్కరించుకొననిచో మనలను తినివేయు మహా పాపము లగును. త్రిగుణములలో రజోగుణము వలన సృష్టి ప్రారంభమగుట, వర్ధిల్లుట జరుగుచున్నది. జీవులకు కోరిక పుట్టుట, తనకు మంచిదనిపించిన వివిధ కర్మలాచరించుట జరుగుచున్నది. కాని పాపదృష్టి వలన పాపకార్యములు తాత్కాలికముగా రుచించి, ఇష్టము లేకున్నను వ్యసనములై బలాత్కారముగా నాచరింపజేయును.

**పాపస్వరూపము :**

నిప్పు పుట్టినచోట దగ్ధమగు భౌతిక పదార్థమేదో యుండును. ఏదియు దగ్ధము కానిచో నిప్పు మనకు కనిపించునట్లు పుట్టదు. కనుక నిప్పు కావలె నన్నచో దగ్ధమగుట, పొగ, మసి తప్పదు. అగ్ని యెప్పుడును ధూమము చేతనే ఆవరింపబడి యుండును. అగ్నిస్వరూపుడగు జీవుడు కూడ భౌతిక పదార్థ శరీరముతోనే వ్యక్తమగును. అట్లు కానపుడు అతడు దేవుడే!

అద్దముపై ప్రతిదినము ధూళిపొర కప్పుచుండును. దానిని తుడిచి శుభ్రము చేయనిదే ప్రతిబింబము ఉన్నది యున్నట్లు కనిపించదు. మసకగా కనిపించును. గర్భస్థమగు పిండము మావిచే నావరింపబడి యుండును. అట్లే మనలో జ్ఞానము కామక్రోధములచే నావరింపబడి యుండును. అవి లేకుండ జ్ఞానము వ్యక్తము కాదు. జీవి సహజముగా జ్ఞాన స్వరూపుడు. అత డగ్నివలె

తన స్వభావమును పరిసరములకు ప్రసరింప జేయుచుండును. దీనినే ప్రవర్తనము అందుము. ఈ ప్రవర్తనము ఇంద్రియములు, మనస్సు ద్వారా జరుగును. అట్లు జరుగుచున్నప్పుడు స్థూల సూక్ష్మ శరీరముల ప్రభావము, వానిని పోషించు ఆహారాదుల ప్రభావము వానిపై ప్రసరించు చుండును. ఈ ప్రభావము పొగ క్రమ్మినట్లు జీవుని తేజస్సును తగ్గించి ప్రతిబింబింప జేయును. ఇది యంతయు నొక పొరవలె నేర్పడి, లోపలనున్న తత్త్వము మసకగా కనిపించును. మొగమెంత యందముగా నున్నను ధూళిక్రమ్మిన యద్దములో చూచుకొన్నచో ధూళితో నున్నట్లు కనిపించును. అట్లే మనస్సు, ఇంద్రియ ములు, అన్నమయ, ప్రాణమయ కోశములు పొరగా నేర్పడి, దానిలో నుండి జ్ఞాన మనబడు లోపలి తత్త్వము ప్రసరించునపుడు పరిమితత్త్వము చెంది, వ్యక్తిగత స్వభావ మేర్పడును. వ్యక్తికిని వ్యక్తికిని నడుమ భేద మేర్పడును. దానివలన పాపాచరణము కలుగును. ఈ విధముగా జ్ఞానమున కజ్ఞానమను పొర యెప్పుడును చుట్టుకొనియే యుండును. చుట్టుకొని యుండుటే గాక రక్షించుచు కూడ నుండును. తల్లి గర్భము నందలి పిండమునకు మావి పొర యుండుట వలననే పిండము సురక్షితముగా నుండును. సమయము వచ్చు వరకును ఈ పొరయే రక్షణగా నేర్పడి యుండును. ప్రసవ సమయము తరువాత పొర యున్నచో శిశువు జీవింపదు గనుక, మావి పొర చీల్చుకొని బయటపడును. ఇట్లే కామ క్రోధ రూపమగు రజోగుణమను పొర వివిధ పరిణామ దశలలో జనన మరణ స్థితులు కల్పించి రక్షించుచుండును. దాని అవసరము తీరిపోయిన వెనుక జీవుడు దానిని చీల్చుకొని బయటపడవలెను. (38)

జ్ఞానము చుట్టును నేర్పడు కామరూపమైన యీ పొర జ్ఞానమునకు శత్రువుగా పనిచేయుచుండును. దీపము వెలుగుట వలన పుట్టిన మసి ఆ దీపపు వెలుగునకు అడ్డుపడును గదా! అట్లే కామము దోషమును పుట్టించును. ఇది యొక అగ్నిహోత్రమువలె పనిచేయుచు, జ్ఞానమును తినుచుండును. దీనివలన కోరికలు పుట్టుచుండును. ఈ కోరికలు వివిధ వస్తువులపట్ల ఆకర్ష ణను, మరికొన్నిటిపట్ల ద్వేషమును కలిగించుచుండును. వాని ననుసరించి కర్మాచరణము చేసినచో మసి పూసికొన్నట్లే! ఈ కోరికలు దుష్పూరములు. అనగా వీనిని పూరించుట సాధ్యము కాదు. మండుచున్న అగ్ని నార్పుటకు

నేయి చల్లినచో నేమగును? మంట మరింత యెక్కువగును. అట్లే కోరికలు తీర్చుటకు యత్నించినచో నెక్కువై మొత్తమును దగ్ధము చేయును. ఇంద్రియ పరితృప్తికి కర్మాచరణము చేయువారు ఇట్లే కృశించి జీవితము దగ్ధము చేసి కొందురు. రుచికొరకు భుజించుట, చెవికొరకు సంగీతము వినుట, కంటికొరకు సినిమా మున్నగునవి చూచుట వంటివి జీవికి దుస్థితిని, వినాశమును కలిగించును. **(39)**

అట్లుగాక, కర్తవ్యమైన సత్కర్మాచరణము చేయుచున్నప్పుడు సహజమైన ఇంద్రియ పరితృప్తి యుక్తమైనంతవరకు జరుగుచుండును. దానము, విశ్వప్రేమ, దీనజన సేవ, సర్వమునందు దైవమును తలచుట, వేదపురాణాధ్యయనము, గురుజనులను సేవించుట, సత్సాంగత్యము అను సత్కర్మాచరణము వలన, మనస్సునకు ఇంద్రియములకు అనుదినము నంటుచున్న కామరూపమగు రజోగుణ పాపము హరించి, జ్ఞానము స్వచ్ఛమై నిలచును. నిత్యము తయారగు చున్న యీ పాపమునకు మనస్సును ఇంద్రియములును అధిష్ఠానములు. అనగా పాపము వానియందు ఏర్పడుచుండును. వాని నావరించిన పాపము వాని రూపముననే పనిచేయుచు మోహము పుట్టించును. మోహ మనగా ఒక వస్తువు ఇంకొక వస్తువు వలె తోచుట. ఆ పాపము వలన సృష్టిలోని పదార్థముల రూపమున నున్న భగవంతుడు స్మరణకు రాక పదార్థములే గోచరించును. అప్పుడు వానితో మనము మన ప్రత్యేక సంబంధ మేర్పరచుకొందుము. ఈ 'మన సంబంధము' భ్రాంతిని కలిగించి, శత్రుత్వ మిత్రత్వములను, సుఖ దుఃఖములను, కలిమి లేములను సృష్టించుకొనును. దాని వలన చాంచల్యము, దుఃఖము కలుగుచుండును. కనుక సాధకుడు మొట్టమొదటగా ఇంద్రియము లను నియమించుకొనుట చేయవలెను. **(40)**

ఇంద్రియములను నియమించుట యనగా నిగ్రహించుట కాదు. నీటియందు ఉప్పు కలిసినట్లు పాప ప్రకృతి పనిచేయుచుండగా నిగ్రహ మేమి చేయగలదు? ఉప్పు కలిపిన నీటిని ఎంత నియమముతో త్రాగినను దప్పిక తీరదు గదా! అట్లే పాపము కలిసిన ప్రకృతి మనస్సు నావేశించి ఇంద్రియ ద్వారములలో పనిచేయుచుండగా వానిని నిగ్రహించుటవలన ప్రయోజనమేమి? త్రాగుడుపై రుచి మరిగిన వానిని గదిలో బంధించినచో త్రాగుడు మాని

నట్లగునా? ఒకరి నొకరు తిట్టుకొనుచున్న వారిని నోళ్ళు మూసి, వీరు పరస్పర మిత్రులనియు, తిట్టుకొను స్వభావము లేదనియు, మౌనవ్రతము వహించి రనియు చెప్పినచో సత్యమగునా? అట్లే ఇంద్రియములను నిగ్రహించినచో నియమించుట అనబడదు. నచ్చిన సత్కర్మకు ఇంద్రియములను నియమించు టయే నియమము. దాని వలన మనస్సునందు సత్కర్మ నిండును. పాపము నకు అభావము గలుగును. ఈ విధముగా జ్ఞాన విజ్ఞాన నాశ కారణమగు పాపమును జయింపవలెను. **(41)**

## పంచకోశములు :

మానవ తత్త్వ నిర్మాణమున పాప మెట్లు ఉద్భవించుచున్నదో తెలిపిన వెనుక, పాపమునకు పరిహరణ మార్గము, తత్త్వమును నిర్మలముగా నిలుపుకొను మార్గము ఉపదేశింపబడినది. అదియే సంప్రదాయ సిద్ధమైన సమగ్ర యోగసాధన సిద్ధాంతము. అందు తొలుత ఇంద్రియములను నియ మించుకొను మార్గ ముపదేశింప బడుచున్నది. ఇచ్చట నియమించుట యనగా దమించుట కాదు. ఈ యంశమును వివరించుటకై మానవ తత్త్వ యంత్రము వివరింపబడుచున్నది.

భౌతిక దేహ మంతయు ద్రవ్యమయము (Matter). ఈ ద్రవ్యము భూమియందలి ఖనిజములతో రసాయనిక పదార్థములతో ముఖ్యముగా నిండియున్నది. వివిధ ద్రవ్యముల పరస్పర సంబంధమును పరిశీలించినచో, అది గుణాత్మకము (Properties), ప్రవృత్తిమయము (Behaviour) అని తేలును. ఈ గుణములు, ప్రవృత్తులు ద్రవ్యలోకమునకు చెందినవి కాక, శక్తిమయలోకము (Plane of Force)నకు చెందినవి. మానవ తత్త్వమునందు ద్రవ్యము, శక్తి, మనస్సు (Matter, Force & Mind) అను మూడును వేరు వేరు లోకములకు సంబంధించినవి. మనలోని ఇంద్రియ ప్రవృత్తులు శక్తిమయ లోకమునకు సంబంధించినవి. కనుక ద్రవ్యముకన్న ఇవి పరములు (Higher). అనగా శక్తికి ద్రవ్య నిర్వహణ సామర్థ్యమున్నది. మనలో ఇంద్రియ ప్రవృత్తులకు దేహ రక్షణ శిక్షణ సామర్థ్యమున్నది. ఇంద్రియములకన్న మనస్సు పరమైనది. అనగా మనస్సునకు శక్తిని నిగ్రహించి నిర్వహింపగల సామర్థ్యమున్నది. కనుకనే భావనాబలముచే మానవుడు ప్రకృతిలోని శక్తులను నిగ్రహింప గలుగుచున్నాడు.

అట్లే మనస్సు ఇంద్రియ ప్రవృత్తులను నిగ్రహింపగలిగి యున్నది. యోగశాస్త్ర ద్రష్టలు ఈ మూడు లోకములకు సంబంధించిన శరీర విభాగములను అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములని నిర్వచించిరి. (Physical, Vital & Mental sheaths.) ద్రవ్యమయ దేహము భౌతికము గనుక అన్నమయ కోశమని చెప్పబడినది. భౌతిక పదార్థమును స్వీకరించుట, విసర్జించుట (Metabolic Activity) వలన అన్నమయము నిలబడుచున్నది. ఈ స్వీకరణ విసర్జనలు చేయునది ప్రాణమయ కోశము (Vital Body). కనుకనే ఇంద్రియ ప్రవృత్తుల వలన ఆహార విహారాదులు అభ్యాసములుగా నిలబడుచున్నవి. మనస్సు శక్తికన్న పరమైనది. ఈ మూడు కోశములును సామాన్యముగా సకలప్రాణి వ్యాపారమును నడుపుచుండును.

మనస్సుకన్న పరమైనది బుద్ధి. ఇది కేవలము ప్రజ్ఞామయము (Pure Consciousness). దీనిచే మిగిలిన మూడు లోకములును నిర్వహింపబడ వలెను. మంచి చెడ్డలు నిర్ణయించు సామర్థ్యము బుద్ధికి సంబంధించినది. అట్లే నియమించు సామర్థ్యముకూడ మనస్సునకు లేదు. మనస్సు కేవలము ఇంద్రియముల సహాయమున బాహ్య ప్రపంచమును గుర్తించుట మాత్రము చేయును. గుర్తింపబడిన పరిసరములు, వ్యక్తులు మున్నగువాని యెడల ప్రవర్తింప వలసిన విధానము నిర్ణయించునది బుద్ధియే గాని మనస్సు కాదు. మనస్సునకు ప్రాణశక్తి సాంగత్యము వలన ప్రయత్నము పుట్టును. ఈ ప్రయత్నము వలన బుద్ధితో సాంగత్యము కలుగవలెను. దీనిని కలిగించు క్రమశిక్షణయే యోగా భ్యాసము. ఇది జరిగినపుడు బుద్ధి మనస్సునందు వెలుగుగా ప్రసరించి, క్రమ నిర్వహణము చేయుట ఆరంభించును. ఈ ఆరంభము వలన దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధితో కూర్పు చెందును. ఈ కూర్పు దారమునకు పూసలు గ్రుచ్చినట్లు ఏర్పడవలెను. ఈ దారము బుద్ధికి కూడ లేదు. బుద్ధి ప్రజ్ఞామయమే గాని మిగిలినవాని కాధారము కాదు. కనుక బుద్ధికన్న పైన దారమైన ప్రజ్ఞ 'ఉన్నాడు'. దానినే 'నేను' అని మనము వ్యవహరింతుము. ఈ 'నేను' బుద్ధికన్న పరమైనది. ఈ 'నాకు' పరమైన దేదియు లేదు. ఇది వెలుగుతో చేయబడిన దారము. కన్ను వేరుగా చూచునపుడు కనిపించు వెలుగు సూర్యరశ్మి మొదలైన వెలుగు. దానినే మనస్సుతో చూచినపుడు భావనగా

వెలుగును. బుద్ధితో చూచినపుడు జ్ఞానముగా వెలుగును. దాని పైనున్న దారమును గుర్తించినపుడు చూడబడునది యొకే వెలుగని తెలియును. మంచుగడ్డ నీటిపై తేలునట్లు, స్థూలలోకము నందు రెండు వెలుగులు వేర్వేరుగా భాసించును. కరగిన మంచుగడ్డలు నీరై కలసిపోయినట్లు, సూక్ష్మలోకమున వెలుగు ఒక్కటే యుండును. ఇట్టి వెలుగుయొక్క దారమే 'నేను' అనబడు ప్రజ్ఞ. దానియందు పూసలు గ్రుచ్చినట్లు బుద్ధి, మనస్సు, ఇంద్రియ ప్రవృత్తులు కూర్పు చేయబడి దేహము నధిష్ఠించుటయే యోగము. **(42)**

బుద్ధి కన్న పరుడైన 'నేను' అనుభవింపబడుటయే పైవిధముగా కూర్పు చేయబడుట. ఇట్లు అనుభూతి నిరంతరత్వము సామ్యమున సిద్ధించును. ఈ సామ్యము వలన దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధియు 'నేను' అని పిలువబడుటకు సామర్థ్యము కలిగియుండును. ఈ మొత్తమునే ఆత్మ యందురు. ఈ సామ్యము సిద్ధింపని వారికి బుద్ధి కన్న పరమైన వెలుగు దార మొక్కటియే 'ఆత్మ' యనబడును. ఈ ఆత్మచే మిగిలిన ఆత్మ భాగము లను స్తంభింప జేయవలెనని (నిలబెట్టవలెనని) యుపదేశింపబడినది. ఈ స్థితి సిద్ధించినపుడు కామక్రోధాదు లుండవు. అనగా పాప ముండదు. ఈ విధముగా పాపమును పరిహరణము చేయవచ్చునే గాని, మనస్సుతో ఇంద్రియములతో పోరాడిగాని, వానిని దమించి గాని, పాపమును పోగొట్టు కొనుట సాధ్యము కాదు. **(43)**

నాలుగవ అధ్యాయము

# జ్ఞాన యోగము

**ముం**దటి అధ్యాయమున చెప్పబడిన విధముగా కూర్పు చేయబడిన స్థితిని సామాన్యుడు పొందుటకు అవలంబింపవలసిన క్రమశిక్షణయే యోగము. దీనిని గూర్చి శ్రీకృష్ణు డిట్లు చెప్పుచున్నాడు : "ఈ యోగమును అవ్యయమైన మార్గమున నేను వివస్వంతునకు తెలిపితిని. అతడు మనువునకు తెలిపెను. అతడు ఇక్ష్వాకునకు తెలిపెను. ఇట్లు పరంపరగా రాజర్షులు దానిని పొందిరి. కాలక్రమమున నీ యోగము చెదరిపోయినది. దానినే మరల నేను నీకు తెలిపితిని. కనుక ఈ యోగవిద్య పురాతనము. నీవు నా భక్తుడవు, సఖుడవు గనుక, నీ రహస్యమును వివరింప గలిగితిని." ఈ వాక్కులలో చక్కని సూక్ష్మమైన అర్థమున్నది. 'నే' ననబడు వెలుగు తరగనిది. ఎప్పుడునూ ఉండునది. ఇది మొదట వివస్వంతునిలో మేల్కొనును. ఆకాశమని మనము గమనించు చోటులో 'నేను' అను ప్రజ్ఞ మొదటగా మేల్కొనుటయే యొక సూర్యుడుద్భవించుట. దీనినే 'నేను' సూర్యునకు యోగము వివరించితిని, అని కృష్ణుడు చమత్కరించెను. మనము నిద్రనుండి అనుదినము మేల్కాంచుట ఎట్టిదో సూర్యు డుద్భవించుట గూడ అట్టిదే. మనము నిద్రనుంచి మేల్కాంచినపుడు మనలో 'నే' నను వెలుగు మనస్సునకు గోచరమగును. ఆ వెలుగు "నేనుపదేశించితిని" అని చెప్పుచున్నట్లు భావించుటయే ఇందలి మార్గము. వివస్వంతు డనగా వివిధ కిరణములతో వసించువాడని, తన వెలుగులతో నివాసము నేర్పరచుకొన్నవాడని, తన చుట్టును వెలుగుల వస్త్రము నల్లుకొన్న వాడని అర్థము. ఆకాశమున 'నే' నను ప్రజ్ఞ మేల్కొనుటయే కిరణము లేర్పడుట. ఇందు చూచువాడు వేరుగా నింకను నేర్పడకుండుటచే, చూడబడు వాడు కూడ నేర్పడక వెలుగు మాత్ర ముండును. అదియే యోగస్థితి. దాని నుండి సూర్యుడు, కిరణము వేరగుట అను స్థితి ఏర్పడును. ఈ వేరైన

కిరణములే మనువులు. వానితో గోళాకార మేర్పడగా వాని నడుమ నున్న ఆకాశమే ఇక్ష్వాకువని పేర్కొనబడినది. మనము పుట్టక మునుపున్న చోటు మనము పుట్టిన తరువాత మనలో నున్న చోటగు చున్నది కదా! ఇల్లు కట్టక మునుపున్న చోటు కట్టినవెనుక నింటిలోని చోటగు చున్నది కదా! ఇట్లే ఒకే ప్రజ్ఞామయ పురుషుడైన సర్వాంతర్యామి మూడు విధములుగా భాసించి వివస్వంతుడు, మనువు, ఇక్ష్వాకువు అని వ్యవహరింప బడుచున్నారు. యోగస్థితి ఈ విధముగా మూడు స్థితు లగుచున్నది. (1)

## ఆత్మవిద్య :

సూర్యునిలో 'నేను' అను ప్రజ్ఞ యున్నది. అది మేల్కొనుటయే సూర్యు డుద్భవించుట. దానినుండి గోళాకారమైన వెలుగేర్పడినది. ఇదియే వివస్వంతుడు. అందుండి వెలువడు కిరణములు జగత్తును పుట్టించి శాసించును. అదియే మనువు. శాసించు శక్తి వలన ఈ కిరణములలోని ప్రజ్ఞ ప్రభువుగా చెప్పబడినది. అందు సకల సృష్టి ధర్మమగు పరిపోషకత్వము భాసిల్లుచున్నది. ఈ ప్రజ్ఞయే మొదటి రాజర్షి. వానినుండి ఇక్ష్వాకు వను రాజర్షి ధర్మము ఒక ప్రజ్ఞగా నుద్భవించెను. వానినుండి సౌరకుటుంబములోని గోళములు, అందు మన భూగోళము ఉద్భవించినవి. అటుపైన భూగోళముపై జీవరాశుల నుద్భవింపజేసి పోషించు ప్రజ్ఞ లుద్భవించినవి. వారే భూమిపై మొట్టమొదటి రాజర్షులు. వారి తేజస్సుతో నిండిన మానవ దేహములతో మన భూమిపై మనువు, ఇక్ష్వాకువు, జనకుడు మున్నగు రాజర్షు లుద్భవించిరి. వీరు రాజులుగా పరిపాలించి, ఋషులుగా యోగమార్గమును తమ ప్రజల కుపదేశించిరి. వీరి పాలన, పోషణల క్రింద ప్రజలు యోగమార్గము నుపాసించి, ధర్మబద్ధమైన జీవనము చేయుచుండెడివారు.

కాలక్రమమున ధర్మమార్గమున నడచువారిలో ధర్మమును గూర్చి యాలోచించువారు, చర్చించువారు, లాభనష్టములను పరిగణించువారు నేర్పడిరి. వారి ప్రభావమున ధర్మమునందు ఏమరుపాటు చెందువారు, ధర్మము తప్పి చరించువారు నేర్పడిరి. ఈ విధముగా సూర్యునిలో మేల్కాంచిన 'నే' నను ప్రజ్ఞతో నుద్భవించిన ఆత్మవిద్య యనబడు యోగవిద్య బహుత్వము

నొంది నష్టమగుట కూడ సంభవించినది. అట్లు నష్టమైనపుడెల్ల 'నేను' మరల వ్యక్తమై ఈ ప్రాచీనమైన యోగవిద్యను మరల జీవుల కుపదేశించి, దాని కనుగుణముగా వారి ప్రవర్తనమును స్థాపించుచుందును. (2)

ఇట్టి ఏకత్వము నుపదేశించు యోగవిద్యను దర్శించుటకు భక్తి, సఖ్య భావములు ముఖ్యములు. భక్తి అనగా సృష్టియందున్న సర్వము నందును 'నేను' అనబడు వెలుగుగా వ్యక్తమగుచున్న పరమాత్మ స్వరూపుని యందు నిలబడు నిష్ఠ. దానినే పరమ ప్రేమ యందురు. దీని నభ్యసించుటకు సర్వజీవుల యెడల సఖ్యభావ మావశ్యకము. సఖ్యభావ సాధనచే భక్తి ఏర్పడును. ఏ శాస్త్రము నభ్యసించినను దానియందు భగవంతుని అస్తిత్వము మరువకుండ దర్శించి అనుభవించుట, ఏ జీవిని చూచినను దైవము యొక్క వ్యక్తరూపమని నమ్ముట, మనస్సునందు పొడముచున్న ప్రతి భావమును భగవంతుని మయముగా ధ్యానించుట భక్తికి లక్షణములు. ఈ లక్షణములు కలవాడు భక్తుడు. దీని నలవరచుకొనుటకు సఖ్యభావము నభ్యసించువాడు సఖుడు. అర్జును డిట్టి భక్తుడనియు, సఖుడనియు గమనించి శ్రీకృష్ణుడీ యోగవిద్యను సరహస్యముగా వాని కుపదేశింప సంకల్పించెను. (3)

దానిని విని యర్జును డొక సందేహమును వెలిబుచ్చెను. కృష్ణుడు వివస్వంతుడైన సూర్యుని కన్న చాల తరువాత పుట్టినవాడు; అర్జునునకు సమకాలికుడు. అట్టివాడు వివస్వంతునకు యోగవిద్యను 'నే నుపదేశించితిని' అని చెప్పుచున్నాడు. దీని నర్థము చేసికొనుట ఎట్లు? తరువాత పుట్టినవాడు తనకన్న ముందు పుట్టినవానికి యోగవిద్య నుపదేశించుట ఎట్లు సంభవము? (4)

ఈ వెలిబుచ్చిన సందేహమునకు కృష్ణు డిట్లు సమాధానము చెప్పుచున్నాడు : "నాకును, నీకును అనేక జన్మలు గడచిపోయినవి. వాని నన్నింటిని నే నెరుగుదును, నీ వెరుగవు." దీని యర్థ మేమనగా సూర్యుని యందు మొదట వ్యక్తమైన 'నే' ననబడు ప్రజ్ఞయే తరువాత రూపము లన్నిటిని దాల్చినది. ఈ రూపము లన్నిటియందు 'నేను' మేల్కొనియే యున్నది కనుక "ఈ రూపము లన్నిటిని 'నే' నెరుగుదును." 'నే' ననబడు ప్రజ్ఞ యొక్కటియే

ఇన్ని రూపములు చెందినది. అందొకరి నొకరు తెలిసికొనుటలో 'నీవు' అనబడు ప్రజ్ఞ పుట్టును. ఈ ప్రజ్ఞ పరిమితము. అంతర్యామియైన 'నే' ననబడు ప్రజ్ఞ అపరిమితము. దీనికి సర్వము జ్ఞప్తి యుండును. కనుక ఎన్ని జీవులుగా ఎన్ని జన్మలెత్తినను అందు 'నే' ననబడు నంతర్యామి ప్రజ్ఞ మేల్కొనియే యుండును. నీ వని వ్యవహరింపబడునది ఖండ ప్రజ్ఞ. కనుక దానియందు ఆత్మజ్ఞానము నిలువదు. కనుక నిట్టి బాహ్య లోకములందు భాసించు జ్ఞానమునకు ఒక్కొక్క రూపమునకే ప్రజ్ఞ వేరు వేరుగా వర్తించును. ఒక జన్మలోని జ్ఞానము ఇంకొక జన్మకు జ్ఞప్తి యుండదు. (5)

ఉన్నదంతయును 'నే' నను అంతర్యామి ప్రజ్ఞతో నిండియున్నది. ఇదియే దైవము. దీనికి ఖండత్వ ముండదు కనుక జన్మ లుండవు. అయినను 'నీ' వనబడు ప్రజ్ఞలుగా జన్మించుచునే యుండును. ఇట్లు జన్మించుట దాని ప్రకృతి. అనగా సహజ గుణము. ఇది ప్రకృతి నధిష్ఠించి, ఖండ ఖండములుగా జీవులై జన్మించుచుండును. అఖండ ప్రజ్ఞకు జన్మలుండవు. ఖండ ప్రజ్ఞగా నుద్భవించినపుడు వర్తించు ప్రజ్ఞను మాయ అందురు. ఇదికూడ నఖండ ప్రజ్ఞ నాశ్రయించుకొనియే యుండును. ఇందు నేనను ప్రజ్ఞ విడిపోని స్థితిలో దైవమని పిలువబడును. విడిపోయిన స్థితిలో వర్తించు నీవను ప్రజ్ఞ 'మాయ' యనబడును. కనుక మాయ, దేవు నాశ్రయించుకొని యుండును. దేవుడు మాయాతీతుడుగా నుండును. మాయ నాశ్రయించుకొనియున్న ప్రజ్ఞ జీవు డనబడును. దేవుని ప్రజ్ఞకు సర్వము జ్ఞప్తి యుండును. జీవుని ప్రజ్ఞకు తాత్కాలిక స్థితి మాత్రమే జ్ఞప్తి యుండును. ఈ స్థితినుండి మరల నఖండ ప్రజ్ఞను పొందుటయే జీవుని పరమావధి. ఇట్లు పొందుటలో పరిమితత్వము తొలగి దైవత్వ మనుభవింపబడును. ఈ అనుభవ మొక క్రీడ వంటిది. ఈ క్రీడ కొరకే సృష్టి అంతయు జరుగుచున్నది.

దైవము జీవులుగా దిగివచ్చుట, జీవులు మాయను దాటి దైవత్వము ననుభవించుట అనునవి సృష్టిలో జరుగు క్రమములు. ఒక్కొక్క జీవియే కేవలము ఖండమగు జీవప్రజ్ఞ నాశ్రయించి యుండుటవలన అంతర్యామి యొక్క యోగస్థితి నష్టమగుచున్నది. దీనివలననే సృష్టిలోని భిన్నత్వము భాసించుట, యొక్కొక్క జీవికి ప్రత్యేక లక్షణము లేర్పడుట జరుగుచున్నవి.

జీవుల ప్రవర్తనల యందుకూడ భిన్నత ఏర్పడి సృష్టి ధర్మము తాత్కాలికముగా నష్టమగుచున్నది. సనాతన ధర్మమగు జీవుని అంతర్యామి ప్రజ్ఞ కూడ మరుగున పడుచున్నది. జీవులలో పరస్పర భిన్నత్వము చూచుట, దాని కనుగుణముగా ప్రవర్తించుట, ధర్మము తప్పుట, భ్రమప్రమాదాదులకు లోనగుట, కష్టనష్టములు, కామక్రోధాదులు కలుగును. ఈ కారణముననే వ్యక్తుల పరస్పరత్వమునందు ధర్మమార్గము తప్పుట జరుగును. అఖండముగా నున్న యొక పాత్రలోని జలము వేరు వేరు మంచుగడ్డలుగా ఘనీభవించినపుడు జల లక్షణములు మరుగుపడి, మంచుగడ్డ లక్షణములు తాత్కాలికముగ వర్తించుచున్నవి. అట్లే యొకే దైవము నుండి వ్యక్తమైన వేర్వేరు జీవులయందు దైవత్వము మరుగుపడి జీవత్వము భాసించుచున్నది. ఇందు మరుగుపడిన ధర్మమును మరల స్థాపించుట దైవము వలన జరుగుచుండును. దానికొరకై దైవము అవతారములుగా దిగివచ్చుచుండును. (6)

**అవతరణము :**

అగ్గిపుల్ల చివరనున్న మందు పదార్థము నిలబడి యుండుటకు అగ్గిపుల్లయే ఆధారము. కాని ఈ మందు అగ్గిపుల్ల కాలిపోవుటకు కారణ మగుచున్నది. చెకుముకి రాయితో నిప్పురవ్వను పుట్టించినపుడు ఆ నిప్పురవ్వ వృద్ధిపొంది మంటగా నిలబడుటకు తైలమున తడిపిన వత్తియే ఆధారము. కాని వృద్ధి పొందిన నిప్పుమంట తైలమును, వత్తినికూడ కాల్చుచున్నది. ప్రకృతి సహజములైన కొన్ని ధర్మముల సమాగమము వలన నిట్టి వైపరీత్యములు పుట్టుచుండును. అదే విధముగా మానవుల తెలివితేటల వలన నొక్కొక్కప్పుడు మానవ వినాశమునకు మార్గ మేర్పడుచుండును. దీనిని వేరుగా గుర్తించి ద్రష్టలైన ఋషులు ఇట్టి వింతలు పుట్టునట్టి కార్యాచరణమును, దానికి మూలమైన అభిప్రాయములను, విశ్వాసములను, అభ్యాసములను, ఆచరణములను కలిపి సామూహిముగా నొక పేరున పిలిచిరి. అదియే ధర్మగ్లాని లేక అధర్మము. ప్రకృతి ధర్మముల యొక్క ఏ సమ్మేళన వలన మరియు నే వినియోగము వలన ఆ ప్రకృతిలోని సృష్టిసంపద కే భంగము వాటిల్లునో దాని నధర్మ మందురు. ఈ సూత్రము ననుసరించి బుద్ధిమంతులు వ్యక్తిగతముగా జీవితమును మలచుకొనవలెను.

మానవులలో మనస్సునకు, నింద్రియ వ్యాపారములకు, దేహమునకు కావలసినవి బుద్ధికి తెలియును. కనుక బుద్ధితో వానిని యోగము చేసికొనుచు కర్తవ్య నిర్ణయము చేసికొనవలెను. అట్లు కాక మనస్సుతోనే పలువురు నిర్ణయించుకొనుచున్నారు గనుక దేహమునకు, నింద్రియములకు, మనస్సునకు సహజముగా కావలసినవి సూటిగా భాసింపక మనస్సుయొక్క చీకాకును బట్టి అధర్మ విషయములు భాసించుచుండును. ఈ చీకాకు చిత్తవృత్తి యనబడును. ఇది వాతావరణ మనబడు నింద్రియార్థముల యందు మనస్సు చిక్కుకొని, తాత్కాలికముగా వానితో సారూప్యము చెందుట వలన కలుగును. మనస్సునకు పైన బుద్ధి యుండును. అది వృత్తి సారూప్యము పొందక స్వస్వరూపమున భాసించును. ఇంద్రియములను, మనస్సును బుద్ధియందు భాగములుగా నిలుపుకొని బాహ్య విషయములయందు నిర్వికారుడై జీవుడు వర్తించుటయే యోగస్థితి. ఈ స్థితియందున్న వారు ధర్మమార్గముననే చరించియు, సామాన్యునివలె సంచరించుచుందురు. వారికి వ్యక్తిగతముగ చిత్తశాంతియు, సామూహికముగా నభ్యుదయము సత్యమై వర్తించును. వారు కాక మనస్సునందు జీవించుచు, నింద్రియముల యభిరుచులను బట్టి నిర్ణయించుకొనుచున్నవారు వ్యక్తిగతముగా నశాంతి మార్గమున ప్రవర్తించుటయు, సామూహికముగా ధర్మగ్లాని కలిగించుటయు జరుగుచుండును. మానవ సృష్టిలో నిట్టి వారి సంఖ్య యెక్కువగా నుండుట జీవపరిణామ లక్షణము. జంతువుల నుండి జీవులు మానవులుగా పరిణామము చెందుట నిరంతరము జరుగుచున్నది గనుక, నూతనముగా మానవశరీరము ధరించిన జీవులు చిత్తవృత్తి విపరిణామము పొందుచుందురు. కనుక ధర్మగ్లాని కొంత యెప్పుడును వర్తించుచునే యుండును. సామూహికముగా నిది పెచ్చు పెరిగినపుడు సాంఘిక రాజకీయ తాత్కాలిక కారణములచే మార్గములు ప్రళయోన్ముఖము లగుచుండును. అట్టి సందర్భమున నంతర్లీనమగు దైవతత్త్వము భూమిపై నవతరించి ధర్మ మార్గమును మరల స్థాపించు చుండును. (7)

ఇది యెట్లు జరుగునో పరిశీలింతము. మానవులు క్రమముగా నింద్రియార్థముల యందు ప్రవర్తించు స్థితి నుండి, ఇంద్రియ జయమును సాధించుకొనుచు తొలుత వైజ్ఞానికముగా నభివృద్ధి చెందుదురు. ఈ విజ్ఞానము మొదట

నామరూపాత్మకమగు భౌతిక ద్రవ్య విజ్ఞానముగను, వ్యక్తులయందు భౌతికా కృతుల విజ్ఞానముగను వ్యాపించి, జీవులు వానితో పెట్టుకొను సంబంధముగా పరిణమించును. ఈ సంబంధము వలన త్రిగుణాత్మకముగా వర్తించి, రాగ ద్వేషాదులు తాండవించుటయు, తదనుగుణముగా వర్తించుటయు, తత్ఫలిత ముగా తీవ్ర సుఖ దుఃఖానుభూతులలో డోళాందోళితు లగుటయు జరుగును. అందు కలిగిన ఇబ్బందుల వలన కష్టములు తొలగించుకొను నాలోచనలు పుట్టును. దానితో వివేక ముదయించి పరస్పరత్వము అను స్వభావ మంకు రించును. దానితో తమలోనున్న బుద్ధితో మనస్సునకు సంస్పర్శ మేర్పడి ధర్మ మలవడును. దానితో మార్గము వెలుగై సుగమమై ఆనందమయమగు సర్వాత్మగా తమ జీవితము పర్యవసాన మందును. ఇది జీవ పరిణామ క్రమమున మానవుడు దైవపదము నారోహించుట! ఇందు ధర్మోన్ముఖులైన వారు సాధు ప్రవర్తన కలిగి సత్త్వమయులై యుండుట వలన, వారికి మిగిలిన వారినుండి కష్టనష్టములు కలుగుచుండును. అవకాశములు లభింపకుండుట, మోసములు మున్నగు ఘట్టములు వీరి నెదుర్కొను చుండును. అయినను వారియం దవి వర్తింపవు.

కొన్ని కాలములలో నిట్టి కష్టనష్టములు దుర్భర మగునట్టి పరిస్థితు లేర్పడును. జంతు స్థితిలో నున్న మానవులకు గలిగిన కష్టనష్టములు తమ దుష్ప్రవర్తన వలన కలుగుచుండును. సాత్త్వికులకు కలిగెడు కష్టనష్టములకు స్వకర్మబంధ ముండదు గనుక తాము బాధ్యులు కారు. వారి పరిరక్షణకై దైవము మానవ దేహమున నవతరించును. కారణములు చిన్నవి యైనపుడు ఈ యవతరణము తాత్కాలికముగా జరుగును. ఉదాహరణకు, రైలులోనో బస్సులోనో కొందరు పరుండి లేక సీట్లపై సామానులు పెట్టి ఇతరులను కూర్చుండనీయ రనుకొనుడు. అప్పుడు నలుగురును జేరి వారిని మందలించి సర్దుబాటు చేయుట చూచుచున్నాము. రైలులో మీ జేబులోని డబ్బు నెవరైన దొంగిలించుచుండగా మిమ్మెరుగని వారు చూచినను దొంగను పట్టుకొను చున్నారు. మిగిలిన పదిమందియు మీ స్నేహితులు కాకపోయినను దొంగను కొట్టుచున్నారు. అట్లు ప్రవర్తింపుమని చెప్పినదెవరు? వారిలో ధర్మస్వరూపుడైన భగవంతుడు తాత్కాలికముగా నవతరించు చున్నాడు. ఇట్లే నిత్యము సాంఘిక జీవితమున అనేకములైన యుదాహరణములను చూడవచ్చును.

అధర్మము బాగుగా పెచ్చు పెరిగి మానవజాతికే భంగము వాటిల్ల బోవునపుడు దైవము స్వయముగా దేహము ధరించి దిగివచ్చును. అట్టివే రాముడు, కృష్ణుడు మున్నగు నవతారములు. ఈ యవతారముల మూలమున సామాన్య మానవులకు సాధ్యము కాని మంచి పనులు సాధ్యము లగును. పంచభూతములు, మనస్సు, దేశము, కాలము వారిచే నిర్మాణాత్మకమైన ధర్మమార్గమున మలచబడును. సాధుజనులు రక్షింపబడుటకు కావలసిన ప్రవర్తనము, నాయకత్వము వీరు వహింతురు. ఆయా సందర్భములను బట్టి ఇట్లు సాధుజనులను రక్షించుటగాని, లోక కంటకులైన దుష్టులను శిక్షించుట గాని, ఈ రెండునుగాని జరుగుచుండును. ఈ యవతార రూపమున నేను దిగివచ్చు చుందునని కృష్ణుడు వాగ్దానము చేయుచున్నాడు. 'నేను' అనబడు సర్వజీవులలో నంతర్యామియైన యీ తత్త్వము యొక్క ప్రత్యేక అవతరణము చేయు వాగ్దానము అన్ని కాలముల యందును అభయముద్ర వహించి యుండును. ఈ వాగ్దానమును ప్రతిధ్వనింపజేయు గ్రంథములనే పవిత్ర గ్రంథములు (World Scriptures) అందురు. ఈ గ్రంథములకును, తత్త్వ మత గ్రంథములకును సంబంధము లేదు. ఏ కథలయందు పుణ్యశ్లోకుడు, సర్వాంతర్యామి యగు 'నేను' అను వెలుగు కీర్తింపబడునో ఆ కథలన్నియు పవిత్ర గ్రంథములే. వానిలో భగవద్గీత ముఖ్యమైనది. (8)

## దివ్యజన్మ - దివ్యకర్మ :

ధర్మమునకు దెబ్బతగిలినపుడు, అధర్మము తలయెత్తినపుడు దేవుడు భగవానుడై దిగివచ్చుటకు తన్ను తాను సృష్టించుకొనును. సాధువులను రక్షించుటకు, కీడు చేయువారి వినాశనమునకు, ధర్మము మరల మరల స్థాపించుటకు ప్రతి యుగమునందు 'నేను' పుట్టుచున్నానని కృష్ణుడు వివరించెను. దీనినే దిగివచ్చుట లేక అవతరణము అందురు. సృష్టి కతీతముగ నున్న దేవుడు పరబ్రహ్మ మనబడును. తన మాయను సృష్టించుకొని దానివలన దిగివచ్చు దేవుడు అవతారమనియు, భగవానుడనియు చెప్పబడును. తాను సృష్టించుకొను మాయను 'యోగమాయ' అందురు. పసిబాలుడు పలువిధము లుగా తన్ను గూర్చి యూహించుకొని ఆ యూహలలో క్రీడించుట వంటిది ఈ యోగమాయ. పిల్లలు దొంగ-పోలీసు ఆటలు, యుద్ధవీరులు కొట్టుకొనుట

మొదలగు ఆటల నాడుచున్నప్పుడు తాము పోలీసులుగను, దొంగలుగను ఊహించి నటన చేయుదురు. పట్టుకొనుట, ఖైదుచేయుట కూడ నుండును. ఇందు నిజమైన పట్టుకొనుట, బంధన యుండవు. కనుక లోకములో పోలీసులకు దొంగలకు నడుమ జరుగు కోప దుఃఖాదు లుండవు. దిగులు, చింత యుండవు. క్రీడలో నన్ని ఘట్టములును లీలావిలాసముగా నెడతెగని సంతోషమునే కలిగించును. అట్లే వ్యాపారపు ఆటలు ఆడుకొనుచున్న పిల్లలకు లాభ నష్టములు, వానివలన కలుగు చిత్త వికారములు ఉండవు. ఈ విధమైన కల్పనను పిల్లల విషయమున క్రీడ యందుము. దేవుని విషయమున వేదాంతులు మాయ అందురు. భక్తులు లీల యందురు. దీని ప్రభావమున పరబ్రహ్మము జన్మము లేనివాడైనను మనస్సులు, దేహేంద్రియములు కల్పించుకొనును. పరబ్రహ్మమునే శైవులు పరమ శివుడనియు, వైష్ణవులు నారాయణు డనియు, శాక్తేయులు పరాదేవి అనియు పేర్లు పెట్టిరి. అవతారమూర్తి యగు భగవంతుని శైవులు సాంబశివు డనియు, వైష్ణవులు వాసుదేవు డనియు, శాక్తేయులు స్త్రీ అనియు చెప్పుచున్నారు.

భగవంతుడను పదమునకు భ + గ + వంతుడు. అనగా తన వెలుగు లోనికి తాను గమనము చేయువాడు లేక జన్మించువాడు అని అర్థము. ఇతడు నిర్గుణుడు కాదు. ధర్మ సంస్థాపనకు కావలసిన జ్ఞాన బలైశ్వర్యములు, తేజస్సు, జీవులను దమించు వైభవము కలిగి యుండును. అతని దేహము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అన్నియు తన నుండి దిగివచ్చి, తనయందే యోగస్థితిలో నుండును. వీని కనేకత్వము సిద్ధింపదు. చూచువారికి మాత్రము తమయందు వలెనే వారికి కూడ దేహములు వేరువేరుగా నున్నట్లు, ఊహలు, సంకల్పములు, చిత్తవృత్తులు నున్నట్లు కనిపించును. నిద్ర పోవుచున్నవాని మనస్సునకు దేహము లేకున్నను చూచు వాని దృష్టికి వాని దేహముండును. అట్లే భగవానుడగు అవతారమూర్తి దేహాదులు గూడ చూచువారికి కనిపించి, వారును నలుగురితోపాటే యని తోచు చుండును.

సమస్త జీవరాశులలో దేవుడున్నను, అవతారమూర్తిలో నుండిన తీరునకును, జీవులలో నుండు తీరునకును భేదమున్నది. అవతారమూర్తిలో దేవుడు

మనస్సుగా, దేహేంద్రియములుగా దిగివచ్చి వర్తించుచుండును. జీవులలో దేహేంద్రియాదుల వలన బంధింపబడిన మనస్సు బుద్ధి మొదలగు సోపానముల మార్గమున సాధన చేసి ఆరోహణ చేయవలెను. కనుక జీవులలో ప్రజ్ఞ దేవుని కొరకై పైకెక్కి పోవుట, అవతారమూర్తిలో దేవుడు క్రిందికి దిగివచ్చుట జరుగును. జీవుడు సాధనవలన తానెవరో తెలిసికొనును. అవతారమూర్తి, సిద్ధివలన తా నెవడో తెలిసి వర్తించును. జీవుడు పూర్వకర్మ వశమున జన్మ మెత్తగా, దేవుడు తాను కల్పించిన కర్మలోనికి సశరీరముగా దిగివచ్చును. జీవునకు జన్మ తప్పనిసరి లేక బంధము. దేవునకు జన్మయొక క్రీడ. జీవుని జనన మరణముల నడుమ స్వంతముగా చిక్కుపరచుకొన్న కర్మబంధము లుండును. అవతార మూర్తికి తనచే కల్పింపబడిన క్రీడామయమైన కర్మ యుండునుగాని, దాని బంధ ముండదు. అపరాధిగా బంధింపబడిన దొంగ ఖైదునుండి తప్పించు కొనలేడు. అపరాధివలె ఆడుకొనుచున్న పిల్లవాడు తన ఇష్టము చొప్పున ఏ క్షణముననైన అపరాధిగా నుండుట మాని ఇవతలకు రావచ్చును. దీనిని బట్టి తెలియున దేమనగా జీవుల జన్మ కర్మలు వేరు. భగవానుని జన్మ కర్మలు వేరు. ఈ భేదము తెలియుటకే "నా జన్మ, నా కర్మ దివ్యములు" అని కృష్ణుడు వివరించెను. "దీని తత్త్వము నెవడెరుంగునో వాడు దేహమును విడచి పునర్జన్మ పొందడు, నన్నే పొందును" అని చెప్పుచున్నాడు. పుట్టుట మానివేయునని దీని అర్థము కాదు. అది అతని చేతిలోనిది కాదు. అవతార తత్త్వము నుపాసించి సిద్ధుడైనవాడు భగవంతుని 'నేను'లో జీవించును. కనుక అటుపైన వాని జన్మ కర్మలుగూడ దివ్యములే. అతడు కర్మబంధము వలన పుట్టుట, చచ్చుట చేయడు. కాని ధర్మ సంస్థాపనలో భగవానుని కార్యక్రమమునందు భాగముగా పనిచేయుటకు దేహము దాల్చుచు, పనియైన వెనుక దేహము విడచుచుండును. నిద్ర పోవువాని మనస్సునకు దేహమెట్లు లేదో, వానికిని జనన మరణములు కర్మబంధములు అట్లే యుండవు. కనుక జీవుడు నిరంతర సాధనచే దేవునిలో 'నేను'గా మారవలెను.

మనస్సునకు రాగము, భయము, క్రోధము పోవలెను. జీవుడు 'నా' మయము కావలెను. ఇవి యెట్లు సాధ్యము? 'నన్ను' ఉపాశ్రయించుట వలన సాధ్యమని కృష్ణుడు తెలిపెను. ఉప + ఆశ్రయించుట అనగా మిక్కిలి

సమీపముగా నాశ్రయించుట. రెండు మంచుగడ్డలు పాత్రలో దగ్గరగా నున్నను వేరువేరుగా నుండును. ఆ మంచుగడ్డలు కరగి నీరైనపుడు రెండు జలములుగా నుండక, యొకే జలముగా నుండును. అట్లే మనస్సుతో, నింద్రియములతో, కర్మలతో సమర్పణబుద్ధి కలిగి భగవాను నాశ్రయించిన జీవి దేవుడుగనే జీవించును. జ్ఞానముచేత, తపస్సుచేత ఈ విధముగా పవిత్రులై అనేకులు 'నా' భావ మందిరని కృష్ణుడు చెప్పెను. ఇట్లు ఒక్కొక్క జీవి భగవద్భావ మొందుటయే ధర్మసంస్థాపనము.

జన్మము, కర్మము జీవులకు సంబంధించినవని భ్రమపడువారికి జీవులే కనిపింతురు. కాని నేను కనిపించను. జన్మ కర్మాదులన్నియు నా యందు వర్తించుచున్నవని భావన చేయుచు నెవరు తెలిసికొందురో వారికి జీవుల యందు నే నుందును. వారియందు కూడ నే నుందును. కనుక అహంకార ముండదు. అట్టివారు దేహములు విడచినను చనిపోరు. 'నేను' చనిపోవుట యుండదు గదా! దేహము పొందినవారు పుట్టరు. 'నేను' పుట్టుట యుండదు గదా! కనుక నిట్లు తత్త్వము తెలిసికొనినవారు నన్ను పొందుచున్నారు గాని జనన మరణములను పొందరు. (9)

**ఉపాశ్రయము :**

ఈ సాధనకు రాగము, భయము, క్రోధము పోగొట్టుకొనవలెను. తపస్సుచే జ్ఞానము పొందవలెను. రాగము అనగా వ్యక్తులయొక్క లేక పదార్థముల యొక్క ప్రత్యేక స్వభావముల యందు, పేర్లయందు, ఆకారముల యందు కోరికను స్థాపించుకొనుట, వానియందు సుఖము పొందజూచుట. భయమనగా అవి తమకు దూరమగునని తలచి, దూరము కాకుండుటకు యత్నించుట. క్రోధమనగా వానిని మననుండి దూరము చేయు కారణములను ఇష్టములేకయే స్మరించుచుండుట. పేర్లు, ఆకారములు, ప్రత్యేక వ్యక్తుల స్వభావములు, పదార్థముల ధర్మములు, మనచుట్టును నిండియున్నవి. వానిలోపల ఉన్నది కూడ నీలో నున్నదే. దానినే 'నే' నని పిలచుచున్నావు. కనుక నన్ను జ్ఞప్తి యుంచుకొనుము. అపుడు వానికి ప్రత్యేక అస్తిత్వ ముండదు. నాయందు అవి కలుగుచు, వర్తించుచు, నాలోనికి కరగిపోవుచుండును. ఇట్లు స్మరించు చుండుటయే నన్ను ఉపాసించుట.

రాగము, భయము, క్రోధము పోగొట్టుకొనుటకు మార్గమొక్కటే. అందరి యందుగల నన్ను ఆశ్రయించుట. ఇతరులతో నీవు పెట్టుకొన్న ప్రయోజనముల నాశ్రయించినచో, నీ ప్రయోజనములలో నీవే చిక్కుకొని నన్ను కనుగొనలేవు. క్రోధము మున్నగు వానిని పోగొట్టుకొనుటకు యత్నించుట అనగా వానిని స్మరించుటయే. కోపము కలిగినను, ప్రేమ కలిగినను, జరుగు నది స్మరించుటయే. క్రోధమును, రాగమును, భయమును పోగొట్టుకొనవలెనని స్మరించుట వలన వాని స్థితినే పొందుట జరుగును. కనుక వాని నుండి తప్పించుకొనుటకు కూడ మార్గము నేనే. పేర్లకు, ఆకారములకు, సంబంధ ములకు, లోపల బయట నిండియున్న నన్ను స్మరించుచున్నచో క్రోధాదులు జ్ఞప్తికి రావు. అనగా నీ అస్తిత్వమునుండి జారిపోవును. క్రోధాదులనుండి విమోచన పొందుట కిది యొక్కటే మార్గము. అందరిలో నంతర్యామిగనున్న ఈ 'నన్ను' స్మరించుటవలన, 'నా' యందుండి 'నా' స్థితిలో నుండుట జరుగును. దీని ప్రయత్నమునే ఉపాశ్రయము లేక సమర్పణము అని వ్యవహరింతురు.

మన కున్నది సమర్పణము చేయుటకాదు. మన అభిప్రాయములను, ఇతరులను గూర్చి అల్లుకొనుచున్న ఊహల అల్లికలను సమర్పణ చేయవలెను. దీనికి కావలసిన సామర్థ్యము తపస్సు వలన కలుగును. తపస్సనగా శరీరము, సంభాషణము, మనస్సులకు చక్కని క్రమశిక్షణ మొసగుట. సత్యమునే పలుకుట, దానిని ప్రియముగా మాత్రమే పలుకుట, ఇతరులకు బాధ కలిగించు సంభాషణను తొలగించుట వాఙ్మయమైన తపస్సు. స్నానాదులు, వలసిన వ్యాయామము, ఆహార శుద్ధి, రుచికరమైనది ఆవశ్యకతను బట్టి మాత్రమే భుజించుట, శారీరిక తపస్సు అనబడును. నిష్కారణముగా నితరులకు సేవ చేయదలచుట, దానము, తుష్టి, శాంతి మానసిక తపస్సు అనబడును. ఈ మూడు విధములైన తపస్సువలన జ్ఞానము కలుగును. జ్ఞానమనగా వ్యక్తుల, పదార్థముల ఆకారములు, స్వభావములందు మనస్సు నిలువక, లోపల నున్న అస్తిత్వమునందు మనస్సు లీనమై 'తాను' జీవించి యుండుట, అట్టి 'తనమయముగా' తన కర్తవ్యము సర్వము వ్యవహరింపబడుట. తపస్సుచే జ్ఞానము కలిగినపుడు సర్వకర్మలును జ్ఞానముతో నిండి ఆచరింపబడును. అట్టి జీవితము కర్మబంధము లేక పవిత్రమై నడచును. (10)

'నేను' చూచువారిని బట్టి కనిపించువాడను. ఎవరెట్లు భావించిన వారి కట్లు ప్రసన్నమగుట జరుగును. ఒకడు ఒక యువతిని మోహించి వ్యామోహము చెందినపుడు వానికి యువతిగా కనిపింతును. వివాహ మాడినపుడు భార్యగా కనిపింతును. ప్రేమ స్థిరపడినపుడు ప్రేమ స్వరూపుడనై కనిపింతును. మమకారాదులు క్షాళనమైన వెనుక నా సాన్నిధ్యమునే అతడు దర్శించును. ఇట్లు ఎవరెన్ని మార్గములు పట్టినను 'నా' మార్గముననే క్రమముగా సమీపించు చున్నారు. **(11)**

## మానుష లోకము :

తాము సంకల్పించిన పనులు, ప్రయత్నములు నెరవేరి ఫలితము సవ్యముగా కలిగినపుడు జనులు సంతోషము చెందుదురు. నెరవేరనపుడు బాధ కలుగును. నెరవేరుటకై కొందరు వ్యక్తుల నాశ్రయించుట, కొందరి నర్థించుట, కొందరి నాజ్ఞాపించుట, కొందరికి ధనముగాని, ప్రయోజనములు గాని సమకూర్చుట చేయుచుందురు. దానితో వారు సుముఖులై తమకు కావలసిన పనులను సాధ్యమైనచో నెరవేర్చి పెట్టుచుందురు. ఇట్టి ప్రయత్నము లన్నియు మనుష్యలోకమునకు చెందినవి. అనగా ఒకరి మీద నొకరికి గల యభిప్రాయముల పైనను, సంకల్పముల పైనను ఆధారపడి యున్నవి. మనుష్యులకు గల అభిప్రాయములన్నియు కలిసి మనుష్య లోకముగా నడచు చుండును. ఇదికాక మనుష్యునిలో అనేక లోకములున్నవి. మనస్సు, ఇంద్రియ ములు, ప్రాణము, దేహ ధర్మములు, వానిని నడిపించుశక్తులు కలిసి మరియొక లోకము. ఈ శక్తులు దేవతలు గనుక దానిని దేవలోక మందురు. కామము, సంతానము, గర్భధారణము అనునవి మరియొక లోకమునకు సంబంధించి నవి. దీనిని పితృలోక మందురు. మనలోని పంచభూతములు, రసాయనిక పదార్థములు, వాని ధర్మములు మరియొక లోకము. దానిని భూత లోక మందురు. జీవులు విడచిన శరీరములోని పదార్థమును పంచభూతముల లోనికి త్రిప్పి పంపించుటకై కావలసిన మార్పులు కలిగించు శక్తులు కొన్ని యున్నవి. ఇవి పనిచేయు కక్ష్యను ప్రేతలోకము అందురు. ఇది చేయవచ్చును, ఇది చేయరాదు; ఇట్లు ప్రవర్తించినచో బాధ కలుగును; ఇట్లు భుజించినచో రోగము కలుగును అను ప్రకృతి నియమములు పనిచేయుచున్న లోకము

ఒకటి గలదు. దానిని యమలోక మందురు. ఇన్ని లోకములును మానవుని యందు ఒకే కాలమున పనిచేయు చుండును.

తాను పనిచేయునది మాత్రము తన మనస్సున కలిగిన ఊహలతో అల్లుకొనిన చాపవంటి లోకము. ఇందు ఇతరులపై తనకు గల యభిప్రాయ ములు, లాభనష్టములు, ప్రయోజనములు మున్నగునవి పనిచేయుచుండును. దీని ననుసరించి ఏర్పరచుకొనిన విలువలలో నెక్కువమంది మానవులు పని చేయుచుందురు. ఇట్టి పనులను మనుష్యలోక కర్మలు అందురు. మంచికిగాని, చెడునకుగాని ఈ లోకమున వెంటనే ఫలితము కనిపించును.

ఒకడు మరియొకని శరీరమునందున్న పంచభూతములను, ఇంద్రియ ములను, మనస్సును, ప్రాణమును జ్ఞప్తియందుంచుకొనుట చేతకాక అతడు తన బంధువని, మిత్రుడని, శత్రువని, అధికారియని, యజమానియని, సేవకుడని మాత్రమే గుర్తుంచుకొనును. ఇదియే మనుష్యలోకము. ఇందలి సంబంధములకు తగినట్లు ప్రయత్నము చేసి పనులు నెరవేర్చుకొనుచుండును. ఇట్టి పనులకు ఫలితము వెంటనే కలుగుచుండును. వీరందరును ఆయా భావములతో నన్నే కొలుచుచున్నారని భగవానుడు చెప్పుచున్నాడు. అనగా మానవునిలో పనిచేయుచున్న లోకము లన్నియు తనయందే వర్తించుచున్నవి గదా! తా నిన్నిటియందును సర్వాంతర్యామియై యున్నాడు గదా! కనుక ఎవ్వరి నేది యడిగినను తననే యడుగుట జరుగును. ఎవ్వరేది చెప్పినను, విన్నను, భగవంతుడే చెప్పుట, వినుట జరుగుచుండును. ఇవి యన్నియు భగవంతుడు చేయడుగాని, భగవంతుని యందే జరుగుచుండును. నీటిలో నున్న భగవంతుడు నీరుగా నుండవలెనని అతడు కోరడు గాని, నీటియొక్క పరిస్థితి లేక అవతారము లోకరక్షణకై భగవంతుని యందు వర్తించును. అట్లే మానవులు చేయు ప్రవర్తనలు భగవంతుని కుండవుగాని, భగవంతుని యందే వర్తించును. **(12)**

## నాలుగు వర్ణములు :

భూమి మీద జన్మించిన మానవులు తమ సదుపాయమునకై బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర ధర్మముల ననుసరించి నాలుగు వర్ణములుగ నేర్పడిరి.

ఏ మానవ జాతియైనను ఈ నాలుగు ధర్మములనే ఏర్పరచుకొని, తమ తమ పనులను పంచుకొనుచుండును. ప్రతి మానవుడును తన స్వభావము ననుసరించి తనకు నచ్చిన పనులయందు నైపుణ్యము సంపాదించి, ఇతరుల కుపయోగపడు చుండును. ఇష్టమున్నను, లేకపోయినను ఉపయోగపడు చుండును. ఇష్టమున్నవాడు సంతోషముతో, ఇతరుల పని చేసిపెట్టి అన్న వస్త్రములను పొందును. ఇష్టము లేనివాడు ఆ పనిని బానిస వృత్తిగా ఉద్యోగము, నౌకరీ యను పేర ఇంకొకరిచేత నిబంధించుకొని చేయును. ఏ భూఖండ మునసైన మానవులు చేయు పనులు నాలుగు విధములుగా నుండును. 1. తెలిసికొనుట, తెలియజెప్పుట; 2. కాపాడుకొనుట, కాపాడుట; 3. ఉపయోగ పడుట, ఉపయోగించుకొనుట; 4. శరీరము నుపయోగించి పనులను సాధించుట. ప్రతి మానవుడు ఈ నాలుగింటిలో నేదో యొక దానికి పనికి వచ్చు స్వభావము కలిగి యుండును. ఈ స్వభావమును బట్టి వానికి నచ్చిన మార్గము, దానియందు నిపుణత ఏర్పడును. దీనినిబట్టి వృత్తికర్మ లేర్పడును.

ఈ నాలుగు విధముల విభాగమునే పెద్దలు నాలుగు వర్ణములని పేర్కొనిరి. అవియే వరుసగా 1. బ్రాహ్మణ ధర్మము : తెలిసికొనుట, తెలియ జెప్పుట; 2. క్షత్రియ ధర్మము : కాపాడుకొనుట, కాపాడుట; 3. వైశ్య ధర్మము : ఉపయోగపడుట, ఉపయోగమును పొందుట; 4. శూద్ర ధర్మము: శరీర బలముతో పనులు చేసికొనుట, చేసిపెట్టుట. ఏ వృత్తియైనను ఈ నాలుగింటిలో నొకటియే అగును. దీనినిబట్టి ఏర్పడు విభాగమునకు వ్యక్తులే తమ స్వభావముల చేత కారణములై యున్నను ఆ వ్యక్తులలో, స్వభావములలో అంతర్యామిగా నున్న భగవంతుడే దానికి కర్త అయినను భగవంతుని కిట్టి ప్రయోజనములతో నిమిత్తము లేదు గనుక వీనికి కర్త కాకుండ గూడ నుండగలుగుచున్నాడు. ఇందు మానవులలో నంతర్యామిగా నుండి ఈ విభాగము చేయుచున్న రూపమైన దైవముగాను, వీని కతీతముగా నుండి వీనిని చేయకుండిన స్వరూపమైన దైవముగాను ఉన్నాడు. ఈ రెండును కలసి దైవము యొక్క సమగ్ర స్వరూపము. ఉంగరములో బంగార మున్నది. అది ఉంగరము ఆకార ములో నున్నది. బంగారమునకు ఇది యొక స్థితి. ఉంగరములోని బంగారము నకు ఉంగరము ఆకారముతో సంబంధము లేదు. ఉంగరము కరగించిన

వెనుక కూడ బంగార ముండును. బంగారమున కిది మరియొక స్థితి. ఈ రెండు స్థితులును బంగారమున కున్నవి. అట్లే దైవమునకును. (13)

సత్కర్మల నాచరించువారు వానిని గూర్చి ఎట్లు భావింపవలెను? ఆచరించిన పద్ధతిలోని మంచి చెడ్డలు తమను అంటుకొనునని సందేహించు వారు కొందరున్నారు. ఆచరించిన కర్మయొక్క ఫలిత మెట్లుండునా యని ఆలోచనలో పడువారు కొందరు, ఫలితములను మనస్సున నుంచుకొని ఆశతో నాచరించువారు కొందరు. ఏమి చేసిన నేమగునో, బాధ్యత మన కెందుకని తప్పుకొని నిస్సంగులమని తలచువారు కొందరు. వీరందరును తమ అభిప్రాయములలో చిక్కుకొని, కర్మబంధము లనుభవించువారే! వీరిలో నొకరికిని తమలో నున్న 'నా' మీద విశ్వాసము లేనిమాట స్పష్టము. నన్ను నిరంతరము స్మరించుచున్నవాడు 'నేను'గా నుండును గనుక నన్ను కర్మ లంటవు. నా యందుండి యాచరించు వానికిని యంటవు. ఇట్లాచరింపవలె నన్నచో పై జెప్పిన సందేహములు, సంకోచములు, అభిప్రాయములు నుండ రాదు. నన్ను స్మరించుచున్న మనస్సునకు తాను చేయునది సత్కర్మయని నచ్చిన చాలును. అట్టి కర్మను ఆచరించుటయే గాని, మానుట నా మార్గమున లేదు. అపుడు ఆచరింపబడిన కర్మలయొక్క ఫలితములను గూర్చిన స్పృహ కూడ నుండదు. మేఘములు వర్షించుట మున్నగునవి ఎట్లు జరుగుచున్నచో గమనింపుడు. మేఘములకు ప్రత్యేకమైన అస్తిత్వ మున్నను అవి వర్షించు ధర్మము మాత్రము తమచే నిర్ణయింపబడినది కాదు. అట్లే నా యందుండు కర్మయోగికి కరచరణాదుల విషయమునను, మనస్సు, ఇంద్రియములు మున్నగువాని విషయమునను ప్రత్యేకమైన ఆస్తిత్వము ఉన్నను, అవి పనిచేయ గల శక్తి మాత్రము తనచే నిర్ణయింపబడినది కాదు. కనుక అవి చేయవలసిన పనులను గూర్చి తన యభిప్రాయము లుండరాదు. సర్వమును నాయందు విడచి సత్కర్మాచరణము చేయుచుండవలెను. నన్ని ట్లెవ్వడు తనలో నభి జ్ఞానము చేయునో (గుర్తు పట్టునో) అతడు తా నాచరించు కర్మలచే బద్ధుడుకాడు. (14)

పూర్వులలో పెద్దలందరు నిదే మార్గమున పోయిరి. మోక్షము గోరిన వారందరు ఈ 'నా' మార్గమును అనుసరించి సత్కర్మ లాచరించిరి. అందుచేత,

అర్జునా! నీవు కూడ పూర్వులచే నవలంబింపబడిన విధానము ననుసరింపుము. వారును తమ పూర్వుల విధానము ననుసరించిరి. మనకు పూర్వులు అనగా మన వంశములలో పెద్దలు మరియు జనకుడు మొదలగు రాజర్షులు. వారికి పూర్వులనగా వారు సృష్టి యగుటకు కారణమైన దేవతలును, ఋషులును. వారే సనక సనందనాదులు, సప్తర్షులు మున్నగువారు. పంచభూతముల కధిపతులును, మేఘముల కధిపతులును, మేఘముల కధిపతియగు పర్జన్యుడు మొదలగువారు కూడ మనకు పూర్వులే. వారెట్లు సత్కర్మలను తమ సహజ గుణములుగా నాచరించు చున్నారో నీవు నట్లే యాచరింపుము. (15)

## కర్మ - అకర్మ :

ఇక సత్కర్మ మాచరించుటకు సంసిద్ధుడవైన వెనుక నొక ప్రశ్న ఎదురు వచ్చును. ఏది యాచరింపవలసిన కర్మ, ఏది కూడని కర్మ? ఎట్లు చేయుటను ఆచరించుట యనవచ్చును? ఎట్లు చేయుటను ఆచరింపకుండుట యన వచ్చును? ఈ ప్రశ్న విషయమున కవులు కూడ మోహము చెందుచున్నారు. కవులనగా సృష్టిలోని కార్యకారణ సంబంధమును, దానికిని తమకును గల సంబంధమును సమగ్రముగా దర్శించినవారు. అట్టివారికి కూడ నొక్కొక్కప్పుడు ఏది యాచరించుట యగును, ఏది మానుట యగును అను తావున మోహము కలుగుచుండును. (16)

ఆచరింపదగిన కర్మలు, ఆచరింపదగని కర్మలు తెలియునట్టి వివేకము కావలెను. ఆచరణ యున్నచోట గూడ తనకు కర్మాచరణ లేకుండుట ఎట్లు సిద్ధించునో అను విషయము గూడ బోధపడవలెను. ఈ విధముగా కర్మను గురించిన తత్త్వమంతయు మిక్కిలి గహనము. కర్మయందు అకర్మను చూచు వాడు, అకర్మయందు కర్మను చూచువాడు వివేకవంతుడు. అతడే మనుష్యులలో బుద్ధిమంతు డనదగును. కర్మయోగ మతనికే యబ్బును. సర్వ సత్కర్మల నాచరించు సామర్థ్య మతనికే కలుగును. తన కోసము కాకుండ, పదిమందికి శ్రేయస్సు కూర్చు పనిని ఆచరించినచో, సంకల్పము, ఫలితము తనవి కాకుండ పోవును. కనుక ఆచరించినను అట్టివానికి అకర్మ సిద్ధించును. భయముతోనో, అశక్తతతోనో, కోపముతోనో ఆచరించుట మానినపుడు సంకల్పము, పరిణామము పోలేదు గనుక, అట్టివాడు ఆచరింపకున్నను కర్మ తన కంటును.

అనుదినము మద్యము త్రాగివచ్చి, భార్యను చావమోదుచున్న వానిని బంధించి, ఆ రెండు దుష్కర్మలను ఆచరింపకుండ చూచినచో, నత డశక్తత వలన నాచరింపకపోయెనే గాని, అతని అభ్యాసము, స్వభావము, స్మరణయు మిగిలియే యున్నవి గనుక నత డాచరించినవాడే యగును. అనగా నకర్మ సిద్ధింపదు. ఇట్లు విడమరచి తెలిసికొని సంకల్పము, ఫలితము తనది కాబట్టి సత్కర్మ నాచరించువాడే బుద్ధిమంతుడైన కర్మయోగి. జీవితమున నెప్పు డే పని చేసినను ఈ విధముగనే కోరిక, సంకల్పము లేకుండుట అభ్యాసమైన వాడెవడో, అతని జ్ఞానము చక్కగా వెలుగొందును. అత డాచరించిన కర్మలన్నియు జ్ఞానాగ్ని యందు దగ్ధము లగును. అట్టి వానినే పండితుడని తెలిసినవారు చెప్పుదురు. (17, 18, 19)

ఆచరించు కర్మలయొక్క ఫలితముపై సంగము విడిచి సత్కర్మ లాచరించు వాడు నిత్యతృప్తు డగును. నిరాశ్రయుడు కూడ నగును. అనగా నత డాశ్రయింప వలసిన వ్యక్తిగాని, ఫలితముగాని యుండదు. ఒక భావమును గూడ అత డాశ్రయించుకొని యుండుట జరుగదు. అతనిని ఆశ్రయించుకొని సత్కర్మలుండును. అతని కాశ్రయముగా నే నుందును. అట్టివా డెల్లప్పుడును కర్మాచరణమునందు ప్రవృత్తి చెందినను అతడేదియు నాచరించినట్లు కాదు. సూర్య చంద్రాదులు తమ సహజధర్మము చేత వెలుగొందుచున్నప్పుడు, ఆ వెలుగు భూమిపై జీవుల కాశ్రయ మగుచున్నది. అప్పుడుకూడ ఈ జీవుల కాశ్రయమిచ్చుట, జీవింపచేయుట యను జరుగుచున్న కర్మలు సూర్య చంద్రులకు సంబంధించినవి కావు; అట్లే కర్మయోగికిని. (20)

## నిరశన వ్రతము :

సత్కర్మల నాచరించువారు ఏ విధముగ జీవింపవలెను? తా మాచరింప దలచిన కర్మలు ప్రధానముగను, తమ జీవిత విధానములు అప్రధానముగను జీవించవలెను. భోజనము చేయుటలో రెండు విధము లున్నవి. ఒక విధానమున ఆకలి తీరుట, రుచి యనునవి భోజనమునకు ప్రధాన ఫలములు. ఆకలికొరకు, రుచికొరకు భుజించువానికి ఉద్యోగాదులు తన కొరకు, తనవారి కొరకు. రెండవ విధానమున ఆకలి తీరుటయు, రుచియు శరీరము జీవించుట కొరకని భావింపబడును. అనగా శరీరము నిలచుట ప్రధానము; దానికొరకు మాత్రమే

భుజించుట; భుజింపగల్గుటకు మాత్రమే రుచి. అట్లే జీవించుట కూడ వీరి మతమున ప్రాధాన్యము వహింపదు. అవయవములు, మనస్సు పనిచేయుట ప్రధానము. దానికొరకు మాత్రమే జీవించుట. చేయబడు పని గూడ ఉద్యోగ మైనను, కృషియైనను, వాణిజ్యమైనను ఇతరులకు వినియోగపడుటకే గాని తనకొరకు కాదు. ఇందు మొదటి తరగతివాడు తా నాచరించిన పనుల నుండి భుజించును. అనగా కర్మఫల మనుభవించును. రెండవ తరగతి వాడు భుజింపడు. భోజనము శరీరమునకు, ఇంద్రియములు పనులకు, పను లితరులకు, ఇట్లు జీవించు వానిని నిరశనవ్రతము చేయువాడు లేక ఉపవాసి యందురు. అట్టివాని చిత్తము తనచే నియమింపబడును. చిత్తమనగా మనస్సు ఇంద్రియములు పరిసరముల యెడల ప్రవర్తించుట. నిరశన వ్రతముచే మనస్సు, ఇంద్రియములు చేయబడుచున్న పనియందు లీనమగును గనుక తనకు వశమై యుండును.

ఇతరులకు పనిచేయకుండ ఎట్టి స్వార్థపరునకును జీవితము గడువదు. దానినే ఇతరులయందలి భగవంతునకు సమర్పణ బుద్ధితో చేసినచో లాభ నష్టములు తన కుండవు. అట్లే వాని నాశ్రయించి యుండు యిల్లు, వాకిలి, ధనము, భార్యాపుత్రుల విషయమున కూడ.

నిరంతరము నితరుల పనిలో నిమగ్నుడై యున్నవానికి భార్య వండి పెట్టుట కూడ అతడు నమ్మిన పనికే గాని అతడికి కాదు. పని నిర్వహింప బడుటకు దేహము వినియోగపడు చున్నది గనుక భార్య వండిపెట్టు భోజనము కూడ దానికే ఉపయోగపడుచున్నది గాని తనకు కాదు. కనుక అతనికి భార్యయని కూడ నుండదు. ఆమె కతడు చేయవలసిన పనులు కూడ అట్లే నిర్వర్తించబడును. అతని విషయమున భార్య రూపమున అతనిచే కర్తవ్యము చేయించు భగవంతుని విగ్రహముండును గాని భార్య యని వేరుగా నుండదు. కనుక అతడు భార్యను, పిల్లలను, ఇంటిని, ధనమును విడచిపెట్టినవాడే యగును. అందరి యెడల క్రమము తప్పక చేయవలసిన పనులన్నియు చేయుచుండును. ఇది యతనికి శారీరక కర్మయేగాని, మానసిక కర్మ కాదు. ఇట్లు ఆచరించుచున్నప్పుడు అందలి గుణదోషముల నంటడని గీతాచార్యుడు చెప్పుచున్నాడు. (21)

ఏ పని చేసినను తన జీవనోపాధికని జ్ఞప్తి యుంచుకొని చేసినచో నితరులకు వినియోగపడుటతో దానికి సంబంధ ముండదు. లేనపు డది దుష్కర్మయగును గాని సత్కర్మ కాదు. ఇతరుల కుపయోగపడుట దృష్టియందున్నచో అదే పని సత్కర్మ యగును. ఇతరులలో దైవము యొక్క అస్తిత్వమును స్మరించుచున్నప్పుడే అది సాధ్యమగును. అపుడు జేసినది యెల్ల సత్కర్మయే అగును. ఏది మంచిది? ఏది చెడ్డదను విమర్శకు తావులేదు. ఉద్యోగ, వాణిజ్యాదులను కూడ నిట్లే యాచరించుచున్నచో సత్కర్మయగును. తాను ఉద్దేశించనపుడు గూడ మంచిపనికి కొంత లాభము కలుగుచుండును. సామాన్యముగా నితరుల ప్రయోజనము నారాధించువారు చేయు పనుల కన్న, ఇట్లాచరించు వాడు మరింత శ్రద్ధతో నాచరించును గనుక ఇతరుల కెక్కువ ఉపయోగించును. కనుక వానివలన కలుగు లాభము కూడ నితరులకు కలిగిన దానికన్న నెక్కువగనే కలుగును. ఇట్లు కలిగిన లాభమునే యదృచ్ఛా లాభము అందురు. యదృచ్ఛ మనగా దాని యంతట అది కలుగుట. అట్లు కలిగినదానికి సంతుష్టుడై జీవించవలెను. ఒక రోజున నెక్కువ లాభము కలిగిన సంతోషించుట, తక్కువ లాభము కలిగిన దుఃఖించుట, కలుగకుండిన దిగులుపడుట, నష్టము కలిగిన కృశించుట మొదలగునవి లోకమున కనిపించుచుండును. యదృచ్ఛా లాభ సంతుష్టి నభ్యసించిన వానికి ఇట్టి ద్వంద్వములైన ప్రవృత్తులుండవు. అతని మనస్సెప్పుడును యితరుల ఉపయోగము రూపమున దైవము నారాధించును గనుక ద్వంద్వము లనుభవించుట యుండదు. ఇట్లే తనకన్న నెక్కువ లాభము పొందినవానిని చూచి బాధపడుట యుండదు. ఈ బాధనే మాత్సర్య మందురు. తలపెట్టిన పని సిద్ధించిన సంతోషించుట, సిద్ధింపకున్న దుఃఖించుట లోకమున చూచుచుందుము. అది కూడ పై చెప్ప బడిన సాధనచేయు వానిని బంధింపదు. కనుక నే పని చేసినను దైవారాధనయే యగును. వాని మనస్సు ఒకే రీతిన నిలబడును. అప్పుడు కలుగు ననుభూతినే జ్ఞానమందురు. (22)

## బ్రహ్మార్పణము :

చేయుచున్న పని మనస్సునకుగాని, ఇంద్రియములకుగాని అంటని వాడు ముక్తుడు. అనగా ఎవడు చేయుచున్న పని వానిని ప్రభావితము చేయదో

అట్టివానికి వాని మనస్సునకు బదులుగా జ్ఞానముండును. పరిసరములు తనపై ప్రతిబింబించు దానిని మనస్సు అందుము. పరిసరములపై తాను ప్రతిబింబించు దానిని జ్ఞానమందుము. మనస్సుగలవాడు ఆచరించునది తన కొరకో, తన కిష్టమైన వారికొరకో అయియుండును. జ్ఞానము కలవాడు ఆచరించు పని ఒకనికొరకని యుండదు. ఒకనికొరకను ప్రయత్నము లేకయే పదిమందికి పనికివచ్చును. ఉదాహరణకు మేఘములు ఒకని కొరకని వర్షింపవు. కనుకనే నీరు ఎవరికి కావలసినంత వారికి లభించును. ఇట్లు పనిచేయుట యజ్ఞార్థ మనబడును. జ్ఞాని చేయు పని యజ్ఞార్థముగా నుండును. అట్టి పని సమగ్రముగా లీనమగును. అనగా జరుగవలసినంత జరుగును. ఎవరికి అందవలసినంత వారి కందును. ఇట్లు నెరవేరుట పూర్తి అయిన వెనుక అది తనయందు నిలువ యుండక మొత్తములో లీనమగును. ఈ మొత్తమునే బ్రహ్మము అందురు. ఈ మొత్తమున కర్పణముగా జ్ఞాని ఆచరించు కర్మ జరుగును. (23)

యజ్ఞము చేయుచున్నప్పుడు నేయి, హవిస్సు, సమిధలు మున్నగు హోమ ద్రవ్యములు కొనిరాబడును. అగ్నియందు వ్రేల్చబడును. వ్రేల్చు చున్నప్పుడు దానిలోని పదార్థములు చుట్టుప్రక్కల గాలి, వెలుతురు, చోటులలో వ్యాపించి వానిని పవిత్రము చేయును. అట్టివాని ననుభవించువారు పవిత్రు లగుదురు. ఇది ఎవరికి అను ప్రశ్నలేక, ఎవరు అనుభవింతురో వారే పవిత్రు లగుదురు. ఈ విధముగా జ్ఞాని ఆచరించు కార్యము, సమస్తమునకు అర్పణముగా జరుగును. అదియే బ్రహ్మార్పణము. బిందెలోని నీటికిని, చెరువులోని నీటికిని గల భేదమే, కొందరిని ఉద్దేశించి ఫలము కొరకు చేయు పనికిని, బ్రహ్మార్పణ ముగా చేయు పనికిని ఉన్నది. బిందెలోని నీరు ఒక ఇంటిలోని వారిని కొందరిని ఉద్దేశించి లేక ఒక పనిని ఉద్దేశించి నిలుపబడును. చెరువులోని నీరు చెరువు దగ్గరకు వచ్చినవారికి ఉపయోగించును గాని ఎవరిని ఉద్దేశించి యుండదు. అట్లే బ్రహ్మార్పణముగా చేసిన పనియు. తామన్నము తినినను, ఒకరికి పెట్టినను శరీర పోషణకు పనికివచ్చునుగాని ఒకరి రుచి నుద్దేశించి యుండదు. కనుక అది బ్రహ్మ హవిస్సు. వారికి ఆకలి అనునది ఆహారమును శరీర పోషణకై జీర్ణము చేయు అగ్నియేగాని, తమ ఆకలి కాదు. మనము ఒకరికి అన్నము పెట్టుచున్నచో మనలో నుండి పెట్టుచున్నవాడు కూడ బ్రహ్మమేగాని మనము

కాదు. ధాన్యము మొలచుట, పంటలు పండుట, జంతువులు పుట్టి పెరుగుట ఎవరివలనను జరుగుట లేదు. బ్రహ్మమునందున్న ప్రకృతి వలన జరుగు చున్నది. కనుక మనము పెట్టుచున్న అన్నమును కూడ మనద్వారా బ్రహ్మమే పెట్టుచున్నాడు గాని, మనము కాదు. అది చెందునది కూడ తినువానిలో నున్న బ్రహ్మమునకే గాని, తిన్నవాని రుచితో నాగదు. ఈ దృష్టితో నాచరించు కర్మ ఏదియైనను బ్రహ్మకర్మయే. (24)

కొందరు యోగులు దైవమునే యజ్ఞస్వరూపముగా నుపాసించుచున్నారు. అనగా ఉన్న జీవులను దైవముయొక్క స్వరూపములుగ నెరిగి, వారికి తాము ఆచరించు సత్కర్మలు దైవమున కాచరించు కర్మలుగా నెరిగి, వాని నాచరించు టయే ఆరాధనగా సాధన చేయుచున్నారు. అనగా సృష్టి యజ్ఞమున పుట్టిన పంచభూతములను, ఆహారమును యజ్ఞముయొక్క స్వరూపములుగా స్వీకరించి, ఆ సాధనల నుపయోగించియే తా మాచరించు పనులను యజ్ఞములుగా ఆచరించుచున్నారు. ఉదాహరణకు ఒక భక్తుడు పూవులతోను, పండ్లతోను దేవుని పూజించు చున్నప్పుడు ఆ పూజను యజ్ఞ మనుచున్నాడు. కాని ఆ పూవులు పండ్లును తాను సాధించినవి కాక సృష్టి యజ్ఞమున సాధింపబడి, కొనిరాబడినవని యెరిగి యజ్ఞ స్వరూపములుగా వానిని స్వీకరించి, తాను చేయు పూజయను యజ్ఞమును చేయుచున్నాడు. (25)

మరికొందరు సాధకులు శబ్ద, స్పర్శ, రూప, రస గంధములను యజ్ఞ సాధనములుగా గొని మనస్సును సంయమనము చేయుట అను యజ్ఞము కొరకు వినియోగించుచున్నారు. అనగా ఇంద్రియములను మనస్సునందు సంయమము చేసికొనుట కొరకు మాత్రమే ఇంద్రియార్థములను సాధన ములుగా వాడుచున్నారు. ఉదాహరణకు ఒకడు తన ఇంద్రియములు రుచు లకు లొంగకుండ చేయు నభ్యాసమునకు, రుచులనే సాధనములుగా వాడు చున్నాడు. కంటికి మంచి రంగులు ఇష్టము. అట్టి యిష్టమైన రంగులతో నొక దేవుని చిత్రపటమును చిత్రించుకొని, దానియందు లీనమగుట వలన ఇంద్రియములను జయించుచున్నాడు. (26)

ఇంద్రియ కర్మలనియు, ప్రాణ కర్మలనియు కర్మలు రెండు విధములు. ఇంద్రియ కర్మలనగా చూచుట, వినుట మున్నగు పనులు. ప్రాణ కర్మలనగా

రక్తము ప్రసరించుట, గుండె కొట్టుకొనుట, ఊపిరి పీల్చుట మొదలగునవి. ఇంద్రియ కర్మలను తాము తమ కోరికల ప్రకారము కొంద రాచరింతురు. వలసినపుడు ఆచరింతురు. కోరనపుడు మానుదురు. ప్రాణకర్మలు తా మాచ రించుటతో పనిలేక, అవియే జరుగుచుండును. వాని కాహార మొసగుట మొదలగునవి మన మాచరించు ప్రాణకర్మలు. ఇన్నిటిని యోగి ఆత్మ సంయమ యోగాగ్నిలో హోమము చేయును. ఈ అగ్ని జ్ఞానముతో రగుల్కొనును. దీని కర్థ మేమనగా శరీరముతో నాచరించు పనులును, ఆహారాదులను స్వీకరించుటయు, బ్రహ్మయందు జీవించుట కొరకు సాధన నిమిత్తమే యని యెంచును. ఈ సాధన వలన దీనినే ఆచరింపవలెను, దీనినే తినవలెను అను కోరిక యుండదు. అప్పుడు సాధనకు తగినవానినే తగిన విధముగా నియమముతో భుజించుట, అందువలన కలిగిన ప్రాణశక్తిని మరల పరోప కారాది సాధనకే వినియోగించుట జరుగును. (27)

చేసిన పనిని యజ్ఞార్థముగా చేయుటలో సాధనకు యజ్ఞము లనేక విధములుగా నుండును. పదార్థములను సాధించిపెట్టు యజ్ఞములు ద్రవ్య యజ్ఞములు. ఉదాహరణకు పూజకు పూవులు పూయించుట, పండ్లు పండించుట లేక సత్కర్మచే ధన సంపాదన చేసి, పండ్లు పూలు కొనితెచ్చి సిద్ధపరచుట మొదలగునవి. ఇతరులకును, తనకును, జ్ఞాన మిచ్చు విధమున సంభాషించుట, కార్యాలోచన చేయుట, గ్రంథాదులు చదివి అర్థము చేసు కొనుట మున్నగునవి జ్ఞాన యజ్ఞములు. చదివించుట, మంచిని ప్రచారము చేయుట స్వాధ్యాయ యజ్ఞములు. ఇతరుల సమక్షము వలన తన మనస్సునకు, ఇంద్రియములకు సామ్యము సాధించి రాగద్వేషాదులు కలుగకుండ కృషి చేయుట, దానికొరకై ప్రాణాయామాదులు ఆచరించుట, ఆహార నియమములు పాటించుట యోగ యజ్ఞములు. ఇందులో నొక్కొక్క దానినే యజ్ఞార్థము ఆచరించువారు యతీశ్వరులు. వారు ఆజన్మాంత వ్రతమున ఈ సాధనలో పనిచేయుచుందురు. (28)

**ప్రాణాపానములు :**

రాళ్ళు, రప్పలకును మనకును భేదమేమి? అది ప్రాణప్రసారము. మనలో ప్రాణము మేల్కొని ప్రసరించుచున్నది. రాళ్ళు, రప్పలలో నిద్రించు

చున్నది. మనలో నే విధముగా మేల్కొనుచున్నది? అనుక్షణము జరుగు నుచ్ఛ్వాస నిశ్వాసల రూపమున మేల్కొనుచున్నది. శ్వాసవలన శరీరము జీవించు చున్నదని కొందరు పొరపాటు బడుచున్నారు. మనము జీవించు చుండుట వలన శ్వాస జరుగుచున్నది అనుట సత్యముగాని, శ్వాసవలన జీవించుచున్నా మనుట సత్యము కాదు. మనము శ్వాస పీల్చుచు వదలు చున్నామని కొంద రనుకొందురు. ఇదియు సత్యము కాదు. ప్రాణశక్తి మనచే శ్వాస పీల్పించు చున్నది గాని, మనము కావలెనని పీల్చుట, వదలుట మనకు చేతకాదు. అప్పుడప్పుడు సరదా పుట్టినపుడు కావలెనని పీల్చి విడచుచుందుము. ఈ క్షణములలో మాత్రము ప్రాణాయామము జరుగుచుండును. ఎక్కువ కాలము మనకు తెలియకుండగనే శ్వాస ప్రక్రియ జరుగుచున్నది.

చాలామందికి తాను అనగా మనస్సు మాత్రమే. అది వేరుగా పని చేయుచుండగా ప్రాణశక్తి శ్వాస ప్రక్రియను నడపుచున్నది. దానికి అట్లు నడపుటకు వేరుగా మరియొక మనస్సు ఉండవలెను. ప్రాణము కదలించు చున్నప్పుడు ఊపిరితిత్తుల నరములు కదలుటకు, విధేయత చూపుటకు, శ్వాస కండరములను కదలించుటకు మరియొక మనస్సు ఉండవలెను. అది మానవ లోకమునకు సంబంధించినదిగాక, ప్రకృతిలో పనిచేయుచున్న ఇతర శరీరములకు సంబంధించిన మనస్సు. దీనికి విజ్ఞానమంతయు సహజముగా తెలిసియుండును. అనగాఎంత శ్వాస ఎన్నెన్నిమార్లు పీల్పించి విడిపించవలెను? ప్రాణవాయువు నెట్లు పీల్పించి, బొగ్గుపులుసు వాయువు మున్నగు విష వాయువులను ఎట్లు విడిపించవలెను? మున్నగు విజ్ఞాన శాస్త్రమంతయు దీనిలో నిమిడి యుండును. మనకు ఆకలి మున్నగునవి కలుగుటకును, స్వీకరించిన ఆహారము అనుక్షణము శరీరముగా నిర్మాణ మగుటకును, ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలను నిర్వహించుచున్న ప్రకృతి శక్తియే కారణము. దాని కేమియు ప్రతిఫలాపేక్ష లేకున్నను మనయందీ పని కల్పించి నిర్వహించుచున్నది. కనుక నిదికూడ యజ్ఞార్థకర్మయే! ఉచ్ఛ్వాస నిశ్వాస లొక చక్కని యజ్ఞము. మనచే శ్వాస పీల్పించు శక్తిని ప్రాణమనియు, వదలించు శక్తిని అపానమనియు శాస్త్రజ్ఞులు వ్యవహరింతురు. యోగ మార్గమున అనుష్ఠానము చేయువాడు శ్వాస నొక హోమ ద్రవ్యముగా ధ్యానము చేయును. ప్రాణశక్తి హోమము

చేయువాడుగా ధ్యానింపబడును. ఉచ్ఛ్వాసమును నిశ్వాసమను అగ్నిహోత్రము నందును, నిశ్వాసమును ఉచ్ఛ్వాస మను అగ్నిహోత్రము నందును అతడు నిరంతరము హోమము చేయుచుండును. దీనివలన ప్రాణాపానములకు సామ్యమేర్పడి ప్రవృత్తులన్నియు సమానముగా నిలబడును. పరుగెత్తినపుడు, రాగద్వేషాదులు కలిగినపుడు మున్నగు సమయములలో సామ్యము చెడుట వలన ప్రాణాపానములు సమానముగా నుండవు. దానినే ఆయాసపడుట యందుము. మనస్సును ఉచ్ఛ్వాస నిశ్వాసలతో జతపరచి సామ్యమును సాధించుట ప్రాణాయామము అనబడును. మనస్సుతో శ్వాసను సామ్యము చేయుచున్న కొలదిని ప్రాణప్రసారము సామ్యము చెందుచు మనస్సునకు, ప్రాణమునకు దగ్గర సంబంధ మేర్పడును. చక్కబడిన ప్రాణము మనస్సును చాంచల్యమునుండి రక్షించి ప్రసన్నము చేయును. ఈ విధముగా సంప్రదాయ బద్ధమైన యోగాభ్యాసము చేయువాడు మనస్సు వలన ప్రాణమును, ప్రాణము వలన మనస్సును సామ్యము చేయుచు, మనస్సు, ప్రాణము కలిసి యొకటిగా ప్రవర్తించు నొక క్రొత్త జీవితమును అనుభవించును. స్నానము చేయదలచి నపుడు వేడినీళ్ళతో చన్నీళ్ళను కలిపి పాళము చేయబడిన నీళ్ళతో స్నానము చేయుచున్నారు కదా! ఆహార పదార్థములను ఒకదానితో నొకటి కలుపుచు సామ్యము సాధించి ఒక పిండివంట నెట్లు తయారుచేసికొని క్రొత్తరుచి ననుభవించుచున్నారో ఇదియు నట్లే! **(29)**

యోగాభ్యాసము చేయుచున్నవా డీ విధముగా ప్రాణాపానములలో సమానమను యజ్ఞము సాధించును. దీనిని సాధించుట వలన దినచర్య యంతయు నుచ్ఛ్వాస నిశ్వాసల వలె నడచును. పరస్పర ఘర్షణమును సామ రస్యముచేత అంతర్ధానము చేయగలుగుట, వాతావరణమును సమన్వ యాత్మకముగా నేర్పరచి తదంతర్యామియైన భగవంతుని అనుభూతి చెందుట సిద్ధించును. అప్రయత్నముగా నే పని ఎప్పుడు చేయవలెనో అది యప్పుడు జరుగుచు పోవుచుండును. దానిని సాధించుట ప్రాణాయామ పరాయణత్వము. దానిని కూడ సాధకుడు యజ్ఞార్థముగా వినియోగించును.

కొందరు ఆహార నియమము చేసికొందురు. దాని వలన స్థూల సూక్ష్మ శరీరముల పరిశుద్ధి, ప్రాణమయాది కోశముల యొక్క దీప్తి కలుగును. ఇట్టి

సాధన లన్నియు విఘ్నములు లేక జరుగవలెనన్నచో మొదట తన దినచర్య యంతయు యజ్ఞార్థముగా పనిచేయుట నలవాటు చేసికొనవలెను. ఈ ప్రయత్నములు లేని నాడు పై ప్రయత్నములకు విఘ్నములు కలుగును. ఈ దృష్టితో అనగా యజ్ఞార్థ దృష్టితో బంధు మిత్రాదులయందు ప్రవర్తించు వారందరు యజ్ఞవిదులు అనబడుదురు. యజ్ఞమనగా నేమో ఆ తత్త్వము తెలిసినవారు. ఈ యజ్ఞార్థ ప్రవర్తనము వలననే సమస్త కల్మషములు క్షాళనము నొందును. బిందెలో బురద కలిసిన నీళ్ళుండగా అంట్లు తోముటకు వానిని వినియోగించువాడు అంట్లను పరిశుభ్రము చేయుట సాధ్యము కాదు. మురికి నీళ్ళతో పాత్రలను కడుగ యత్నించుట ఎట్లో, స్వార్థమయమగు సకల పూజా పుణ్యకర్మలచే కల్మషములను పోగొట్టుకొను యత్నము కూడ నట్టిదే! మురికి నీళ్ళతో పాత్రలు శుభ్రముచేయ శ్రమపడువానికి ఏనాటికైనను మరియొక తావునుండి మంచినీటిని తెచ్చుకొనక తప్పదు. అట్లే యజ్ఞార్థ బుద్ధి దినచర్యలో నలవరచుకొనినపుడు గాని ఏ సత్కార్యము చేసినను కల్మషములు క్షాళన ములు కావు. కనుక కృష్ణుడు యజ్ఞార్థ బుద్ధిని అంతర్యామిగా చెప్పి, దానితో వివిధములైన యజ్ఞముల నాచరింపుమని హెచ్చరించుచున్నాడు. యజ్ఞము నకును లౌకికమైన పనికిని భేదము కలిగించునది యజ్ఞార్థ దృష్టియే గాని, ప్రశస్తములైన పదార్థములు కాదు. ఆహారాది నియమములు స్వీకరించి కొందరు ప్రాణశక్తిని ఉద్దీపింప జేసికొనుట కూడ నితర ప్రాణులకు సేవ చేయుట కొరకే యైనప్పుడు, వారు ప్రాణములను ప్రాణములయందు హోమము చేయుచున్నారు. (30)

## యజ్ఞ శేషము :

యజ్ఞశేషమును అమృతమందురు. దానిని భుజించినవారు శాశ్వతమైన పరబ్రహ్మము నందు నివసింతురు. దీని యర్థమేమి? యజ్ఞార్థము పనిచేయు చున్నప్పుడు లభించిన దేదియైనను తరుగక లభించుచునే యుండును. కనుక అమృతమందురు. యజ్ఞార్థము కాక స్వార్థమున లభించున దేదియైనను, ఎంత గొప్పదియైనను తరిగిపోవును. దీనికి మరికొంత వివరణము ఆవశ్యకము. ఇల్లు, పొలము అమ్ముకొనినచో పెద్ద మొత్తముగా సొమ్ము వచ్చును. ఈ సొమ్ము నాదియను నభిప్రాయ ముండుట సహజము. ఈ అభిప్రాయము వలన

తాను, తనవారు సొమ్ము ననుభవింతురు. దానితో సొమ్ము తరిగిపోవును. లేమి మిగిలిపోవును. మరల కొంత పొలమమ్మిన గాని జీవితము గడవదు. మరియొకడు వాణిజ్యము ప్రారంభించుటకై కొంత పొలము అమ్మును. దానివలన పదివేలు వచ్చె ననుకొనుడు. అందు తొమ్మిదివేలు వాణిజ్యమునకు వేరు చేయును. ఇక అది నాది యనుకొనడు. దానితో పెట్టిన వాణిజ్యముతో ఇతరులకు పనికివచ్చు వస్తు సంపదను సరఫరా చేయును. ఇతరులకు సేవ చేయు బుద్ధియున్నచో మంచి వస్తువులను నమ్మకముగా సకాలమునకు అందజేయును. దానితో వాణిజ్యము అభివృద్ధి చెందును. లాభము మాటి మాటికి మిగులుచుండును. ఈ లాభమున మొదట పొల మమ్మినంత సొమ్ము రాదు. అయినను తరుగక వచ్చుచునే యుండును. దానికిని, దీనికిని భేదమేమి? తన సొమ్మని మమకారపడిన వానికి సొమ్మంతయు నశించి పోయినది. వాణిజ్యమను పేర నితరుల సేవకొరకు త్యాగము చేయగా, మిగులు చున్న సొమ్ము లాభమని పిలువబడినది. అది తరిగిపోదు. ఇతరులకు పని చేసిపెట్టిన వెనుక స్వీకరించినది గనుక యజ్ఞార్థ బుద్ధితో వాణిజ్యము చేసిన వానికి లాభమనగా యజ్ఞ శేషము. ఇది నాది అనుకొనిన వానికి ఇతరుల సేవ లేదు గనుక యజ్ఞ శేషము కాదు.

మరియొక ఉదాహరణము: ఇంటి యజమాని సంపాదించిన సొమ్ము భార్యాపిల్లలు తినుచున్నారు. భార్య ఇల్లు తీర్చి, వంట మొదలగునవి సిద్ధము చేయుచున్నది గనుక తాను ఆర్జించుచునే యుండగలడు. వారేల తినవలెను? తన కష్టార్జితము తానే దాచుకొనవలెను అనుకొన్న వానికి తన వంట తాను చేసికొనవలసి వచ్చును; కనుక ఆర్జనము నందు అంతరాయము లేర్పడు చుండును. అనగా తరుగనితనము ఉండదు. అట్లే ఇంటి యజమానురాలు వంటచేసిన, దానిని భర్తయు, పిల్లలు తినుచున్నారు. దీనివలన భర్త ఆర్జించ గలుగుచున్నాడు. తాను వంట చేసినది ముందు భర్త యేల తినవలెను, తానే తినవచ్చును గదా అనుకొన్నచో భర్తకు ఉద్యోగము చేయుట కష్టము గనుక వండుటకు తిండిగింజ లుండవు. ఎంత స్వార్థమున్న తావున గూడ ఈ మూల సూత్రము వర్తించి తీరును. ఇంకొకరికి మనమేదో చేసిపెట్టిన వెనుక మనకు కావలసినదాని ననుభవించుట వలన తరుగనితనము ఏర్పడును. దీనినే

గీతాచార్యుని భాషలో చెప్పవలెనన్నచో యజ్ఞ శేషమును అమృతమందురు. దానిని భుజించినవారు శాశ్వత బ్రహ్మత్వము ననుభవింతురు. వివిధ మతము లలో దేవాలయమున నైవేద్యము దేవునికి సమర్పించుట, మిగిలినది తినుట అను నాచారము పైయంతరార్థమునకు చిహ్నముగనే వర్తించుచున్నది.

యజ్ఞార్థ బుద్ధి లేనివానికి దినచర్య గడచుటయే కష్టమగును. ఇక ఆనందము మాట ఎత్తనేల? దినచర్య గడచుట ఇహలోక మనబడును. ఆనంద స్థితి ననుభవించుట పరలోకమున జీవించుట యనబడును. యజ్ఞార్థ బుద్ధి లేనివానికి ఇహలోకమే లేదు. ఇక పరలోక మెక్కడ? యని గీతాచార్యుడు హెచ్చరిక చేయుచున్నాడు. ఈ యజ్ఞార్థ ధర్మమును మనసున కెక్కించవలె నన్నచో వేదాంతములు, మతములు, శుశ్రూషలు, పాదము లొత్తుట గురువు లకు పాడుముకాయలలో పాడుము వేయించి తెచ్చిపెట్టుట మొదలైనవి చాలవు. ఏ గ్రంథము లధ్యయనము చేసినను నిది యుండుట కల్ల. ఇది అంటవలె నన్నచో మరియొకనికో, పదిమందికో పనులు చేసిపెట్టియే తీరవలెను. ఇతరు లకు పనులు చేయుచున్నప్పుడు మనస్సున జరుగు కదలికలోనే కామక్రోధ ములు నశించుట, రాగద్వేషములు పలుచబడుట, క్రమముగా నిష్కామ కర్మయోగ మలవడుట, చిత్తముయొక్క వృత్తుల నిరోధము అనునవి జరుగవలెను. (31)

బ్రహ్మ సృష్టిలో మానవుని స్థితిగతు లిట్లు బిగింపబడి యున్నవి. కనుక బహు విధములైన సత్కార్యకలాప విధానములను బహుముఖములుగా బ్రహ్మ సృష్టించి విడచిపెట్టెను. ఇవి యన్నియు సహజముగా యజ్ఞములే. మానవ మనస్సు స్పర్శ వలన వారి స్వంత వృత్తి వ్యాపారాదులై బంధించుచున్నవి. కనుక బ్రహ్మ ఇచ్చిన యజ్ఞములను గ్రహించి, వేదము సహాయమున వాని నిజ స్వరూపమును గ్రహించి, ఆచరింపవలెను. అన్ని యజ్ఞములును కర్మజ ములే! ఇట్లు విడమరచి తెలిసికొని మానవుడు చిక్కులను తొలగించుకొను చున్నాడు. అనగా విమోచనము చెందుచున్నాడు. (32)

## ద్రవ్య - జ్ఞాన యజ్ఞములు :

'యజ్ఞము' అను పదమునకు విశ్వశ్రేయస్సునకై సమర్పణ బుద్ధితో

చేయబడునది అని అర్థము. వేద మనబడు ఈ సృష్టిలోని వ్యూహము వలన బహు విధములైన కర్మలు యజ్ఞములుగా నేర్పాటగుచున్నవి. ఆచరణలో నున్న సత్కర్మ లన్నిటిని యజ్ఞములుగా నాచరించి జీవి కర్మబంధము నుండి విమోచనము చెందుచున్నాడు. ఏ పని చేసినను వాని నెల్ల మోక్షము కోరువాడు యజ్ఞముగా వినియోగించును. తన కొరకని చేయబడినది, ఊహింపబడినది, పలుకబడినది కర్మబంధము కలుగజేయును. కనుక వీని నన్నిటిని యజ్ఞములు గనే ఆచరింపవలెను. యజ్ఞములు రెండు విధములు : 1) ద్రవ్యమయములు, 2) జ్ఞానమయములు. ప్రతి పనియందును ఈ రెండును పెనవేసికొని యుండును. సాధకుడు తన వివేకము ననుసరించి ఈ రెండింటిలో నొక దానినో లేక రెండింటినో ఆచరించును. అందు ఫలితములో తరతమ భేదము లున్నవి.

నీది, నాది యను మానవుల యభిప్రాయములు అనేక భౌతిక వస్తువుల నాశ్రయించి యుండును. అందు ద్రవ్యము నెక్కువగా నాశ్రయించి యుండును. వాని సద్వినియోగము నేర్చుకొనుట వలన అహంకార మమకారములు చల్లగా ద్రవ్యమును విడచిపెట్టి అభిప్రాయము నాశ్రయించును. అనగా నమ్మకములు, ఆశలు, ఆశయములను ఆశ్రయించి చుట్టుకొనును. అభిప్రాయములను విడమరచుకొని శాంతి, దాంతి, పరోపకారాది గుణముల నాశ్రయించినపుడే జ్ఞానము గూడ పరిశుద్ధమై, ఉన్న యభిప్రాయములు మాయమగును. ద్రవ్యముల నుండియు, విజ్ఞానము నుండియు అహంకార మమకారాదులు మాయమై నపుడు పరిశుద్ధమైన జ్ఞానము నిలబడును. కనుక సాధకుడు మొదట ద్రవ్యము లతో యజ్ఞము చేయుట నేర్చుకొనవలెను.

ధనమునుగాని, వస్తువులనుగాని, సద్వినియోగ బుద్ధితో సమర్పణ చేయుట 'ద్రవ్యయజ్ఞము' లేక వస్తువుల యజ్ఞము అనబడును. అన్నదానము చేయుట, వస్త్రదానము చేయుట, ఆరోగ్యదానము చేయుట ద్రవ్యయజ్ఞములు. వీనివలన పదిమందికి మేలు కలుగుటయే కాక తనకు కీర్తి, ఇతరులపై పలుకు బడి మొదలైనవి కలుగును. వానిని వినియోగించుకొను బుద్ధి కలిగినపుడు మరల అవి తరగిపోవు చుండును. వీనిని 'స్వర్గ లోకములు' లేక 'పుణ్య లోకములు' అందురు. పుణ్యముకూడ ధనమువలె, వస్తువులవలె ఆర్జించుట,

తరగిపోవుట అనువానికి లోనగును. ఇతరులకు తాను మేలు కలిగించితినను భావము తనను బంధించును. కనుక కేవలము ద్రవ్యయజ్ఞము చేయుటవలన కలిగిన ఫలము తాత్కాలికము. ఒక్కొక్కప్పుడు బంధకారణము కూడ నగును. ఈ వినియోగమును ఇతరులకు చేయుచుంటినని భావించుట మాని ఇతరుల రూపమున నున్న భగవంతునకు సమర్పణ చేయుచుంటినని భావించినచో దానిని జ్ఞాన యజ్ఞ మందురు. దానికొరకు చేయు సద్గ్రంథ పఠనము, సజ్జన సాంగత్యము కూడ జ్ఞాన యజ్ఞములే. దీనివలన మనము చేసిన యజ్ఞము యొక్క ఫలితమును గూర్చి ఆలోచింపకుండుట, దాని వలన కర్మబంధ మోక్షము కలుగును.

ఈ విధముగా కర్మయజ్ఞముకన్న జ్ఞాన యజ్ఞము శ్రేయస్సును కలిగించును. కాన ద్రవ్యయజ్ఞము లేనిదే జ్ఞాన యజ్ఞముండదు. అయినను ద్రవ్యయజ్ఞముతో నాగక జ్ఞాన యజ్ఞముకూడ నాచరించు వానికే శ్రేయస్సు కలుగునని భగవద్గీత చెప్పుచున్నది. చేసిన ప్రతి పనియు మంచిదైనను, చెడ్డ దైనను జ్ఞానము కలిగించుటయే దానికి పర్యవసానము. చెడ్డపని చేసినచో దాని దుష్ఫలితములు జీవికి జ్ఞానమును కలిగించును. అనగా తా నాచరించు చున్న చెడ్డ పనులవలన తనకు కలిగిన బాధలు అనుభవముగా నేర్పడి క్రమముగా జ్ఞానోదయము కలిగించును. సత్కర్మలు అట్టి బాధానుభవమును కలిగించక, సూటిగనే జ్ఞానము కలిగించును. ఉదాహరణకు రుచిగా నున్నదిగదా యని తినకూడనంత ఆహారము తిన్నచో కడుపునొప్పి కలుగును. దానివలన ఔషధ సేవ, పథ్య పానాదులు మొదలగువాని నాచరించి, శరీరమును శోధనము చేసికొని, జీవుడు పవిత్రు డగుచున్నాడు. అంతకు ముందున్న దుష్ఫలితములు బాధలు కూడ ఇదే అనుభవముతో తొలగించుకొను యత్న మారంభించు చున్నాడు. అట్లుకాక పెద్దలను సేవించుట, శమదమాది గుణము లభ్యసించుట, దానధర్మాదికములు ఆచరించుటవలన వానికి ఫలితమైన చక్కని మానసిక పరిణామ మభ్యాస మగును. ఏ పని చేసినను, దాని ఫలితముగా జ్ఞానమే కలుగుచుండును. పర్యవసానము కర్మఫల త్యాగమను జ్ఞానము. జీవులకు కర్మ అనునది ఉద్భవించి స్థిరపడుటకే కర్మాచరణ మేర్పడినది. వానిని విడచిన వానికి జ్ఞానోదయము కాని, మోక్షము గాని లేదు. అందువలన సత్కర్మాచరణమును ద్రవ్య యజ్ఞముగా ఆచరించుటకన్న, యజ్ఞముగా ఆచరించుట శ్రేయస్సు. (33)

మరి జ్ఞానమును సరియైన స్వరూపమున తెలిసికొనుట ఎట్లు? ఎవరికి మంచివి అనిపించిన ఊహలను వారు జ్ఞానమని పొరబడుచున్నారు. అవి నిజముగా మంచివి యైనచో జ్ఞానమార్గమునకు దారితీయును. అట్లు కాక కేవలము మంచివి అనిపించుట మాత్రము జరిగినచో అజ్ఞాన మార్గమునకు దారితీసి, కామక్రోధాది బంధనములను కలిగించును. సత్కర్మ లాచరించినను జ్ఞానము తెలియనిచో బంధమే కలిగించును. ఇతరులకు నుపకరించు సత్కర్మ లను చిరకాల మాచరించినవాడు ఇతరుల లోపము కనిపించినపుడు, లోకము తన్నాదరించుట లేదనియు, తాను సత్కర్మ లాచరించినను తనయెడ విశ్వాస రహితముగా నితరులు మెలగుచున్నారనియు, విసుగు, కోపము చెందును. కనుక సత్కర్మ లాచరించినంత మాత్రమున జ్ఞానము కలుగవలెనని లేదు. ఆచరింపనపుడు జ్ఞానము కలుగుట కవకాశమే లేదు. సత్కర్మ లాచరించుట మాత్రమే చాలదని యర్థము గాని, సత్కర్మలు జ్ఞాన మొసగవని కాదు. నిజమైన జ్ఞానమనగా తా నాచరించుచున్న కర్మయందును, దానివలన కలుగు ఫలితము నందును, దానిని పొందు నితరుల యందును భగవంతుడు కనిపించుటయే. ఇది తప్ప వేరు జ్ఞానము లేదు. దీనిని తెలియవలె నన్నచో మూడు పనులు చేయవలెను. 1. 'ప్రణిపాతము' లేక సమర్పణబుద్ధి. 2. 'పరిప్రశ్నము' అనగా అన్ని సన్నివేశముల యందును భగవంతుని అస్తిత్వము కనుపించువరకు వాని పూర్వాపర సందర్భములను గూర్చి ప్రశ్నించుకొనుట, 3. 'సేవ'- ఇది ఇతరుల రూపమున నున్న భగవంతుని కాచరించుట. ప్రణిపాత మనగా గురువునకో, దేవునకో సాష్టాంగపడుట యనియు, పరిప్రశ్న మనగా గురువును వేదాంతమును గూర్చి ప్రశ్నించుట యనియు, సేవ యనగా గురువు పాదములు నొక్కుట యనియు కొందరు భావింతురు. దీనివలన కొంత కాలమునకు గురువుపై ననాదరము కలుగును తప్ప జ్ఞానము కలుగదు. తన మార్గము శిష్యు డవలంబించుటయే సద్గురువునకు ముఖ్యము గాని, తనకు సేవ చేయుట కాదు. తనకు సేవను కోరు గురువు తానే బంధమున ఉండుట వలన గురువు కాలేడు. గురువునకు తప్ప మరియొకనికి సేవ చేయననువాడు జ్ఞానమును పొందలేడు.

'ప్రణిధానము' అను పదమునకు ఈశ్వరునకు తనకున్నది మొత్తము

సమర్పణ చేయుట అని అర్థము. ఇది పతంజలి తన యోగ దర్శనమున నిచ్చిన నిర్వచనము. ఈశ్వరుడు అను పదము యోగశాస్త్ర సంప్రదాయము ప్రకారము అర్థము చేసికొనవలెను. ప్రతి మానవుని యందును రెండు భాగములున్నవి. తనది, తాను. 'తనది' అనగా శరీరము, ప్రాణము, ఇంద్రియ ములు, మనస్సు, అందలి అభిప్రాయములు, నమ్మకములు, ఆశలు, ఆశయ ములు, వివిధ శాస్త్రముల వివరములు, స్మరణలు మొదలగువాని మొత్తము. ఇవి కాక మిగిలినది 'తాను'. ఇది ప్రజ్ఞామయము. ఇది కేవలము వెలుగు. ఈ వెలుగునే 'ఈశ్వరు' డందురు. ఇతని నుండియే మిగిలిన భాగమంతయు నుద్భవించి జనన మరణముల నడుమ జీవిత సర్వస్వముగా నడచుచుండును. జ్ఞానము అను పదమునకు రెండవ భాగమైన ఈశ్వరుడని సరియైన అర్థము. మొదటి భాగమున జ్ఞానమని పిలువదగిన దేదియు లేదు. అయినను, ఇందలి భావములు, అభిప్రాయములు, ఆశలు, ఆశయములు, శాస్త్రసంచయము అనువాని యందే సామాన్యులు జ్ఞానమను పదము వాడుదురు. అట్లు వాడినచో తెలిసికొనదగిన విషయము, తెలిసికొనువాడు వేర్వేరుగా గుర్తింపబడును. మనస్సును తెలిసికొనువాడుగా భ్రాంతి పడుటయు, బాహ్యప్రపంచము వలన నేర్పడు ఇంద్రియార్థములను తెలిసికొనదగిన విషయములుగా భ్రాంతి పడుటయు జరుగును. యోగసాధన పొందినవానికి తెలిసికొనబడునది, తెలిసికొనువాడు కూడ 'నే'నను వెలుగే. ఈ వెలుగునందు మనస్సు మేల్కొని నపుడు మనస్సు కూడ ఈ వెలుగుగనే మారును. అట్లే ఇంద్రియములు, వాని వృత్తులు గూడ ఈ వెలుగుగనే మారును. ఇంద్రియములు ఈ వెలుగు నందు తెలిసికొనుట యను వృత్తి కలిగియుండి, తెలిసికొనువాడుగా మారి పోవును. ఇట్టి వెలుగు బాహ్యప్రపంచము నందు ప్రసరించినపుడు అదికూడ తానైన వెలుగుగా గుర్తింపబడును.

మనస్సు మేల్కొనుటకు ముందు బాహ్య ప్రపంచమున ప్రతి వస్తువు నందును రెండు భాగము లుండును. ఆ వస్తువు యొక్క పేరు, ఆకారము, బరువు, ఘనపరిమాణము, వినియోగము, దాని లక్షణములు మున్నగు సము దాయమంతయు కలిసి యొక భాగము. ఇవన్నియు దేనియందు వర్తించు చున్నవో అది మరియొక భాగము. ఇందు మొదటి భాగము ఆ వస్తువు యొక్క

సొత్తు. రెండవ భాగము ఆ వస్తువుయొక్క 'తాను'. సామాన్య మనస్సు చేత ప్రతి వస్తువు యొక్క సొత్తు మాత్రమే గుర్తింపబడును. యోగసాధన వలన వెలుగొందిన వానిచేత ఆ వస్తువునందలి 'తాను' గుర్తింపబడును. అట్టి స్థితిలో తెలిసికొనుచున్న తాను, తెలియబడుచున్న వస్తువులోని తాను ఒకే వెలుగగును. అదియే ఈశ్వరుడు. దానియందు మనస్సు మేల్కొనుటనే 'జ్ఞాన' మందురు. దానిని దర్శించినవారు 'తత్త్వదర్శనులు' అనబడుదురు. వారే జ్ఞానులు. వారే జ్ఞానము నుపదేశింతురు. అది కాని భాగమును, అనగా తనది అను భాగమును అజ్ఞానముగా గుర్తింతురు. **(34)**

అజ్ఞానమంతయు జ్ఞానమను వెలుగుచే నిండియున్నది. జ్ఞానమంతయు అజ్ఞానముచే ఆవరింపబడి యున్నది. ఈ వివరమును సాధనచే తెలిసికొని జ్ఞానమునందు మేల్కొనిన వారికి మోహము కలుగదు. మోహమనగా అజ్ఞానమునందు తెలిసికొనవలసిన స్థితిని ఆరోపించుకొనుట. అజ్ఞానమును జ్ఞానముగా నమ్ముటయే మోహము. తమ నమ్మకములను, అభిప్రాయము లను, నిర్వచనములను జ్ఞానముగా నమ్మువారు ఇతరుల అభిప్రాయముల నుండి భిన్నమైన అభిప్రాయములను కలిగియుందురు. ఎవరి యభిప్రాయ ములు వారివి. వానినే జ్ఞానమని వారు నమ్ముచుందురు. అందువలననే ఏ ఇద్దరకును జ్ఞానము విషయమున నేకత్వము కుదరదు. ఈశ్వరు డనబడు వెలుగునందు మేల్కొనిన వారికి ఇతరుల యందలి అదే వెలుగుతోనే సంబంధ ముండును. వారి వారి అభిప్రాయములతో సంబంధముండదు. కనుక నట్టివారు ఎంతమంది యున్నను, ఒకరి జ్ఞానమునకు మరియొకరి జ్ఞానము నకు భేదము కలుగదు.

సత్యమైన జ్ఞానము పై చెప్పిన ఈశ్వరుడే. అది పొందినవారు సర్వ జీవులను తానుగనే గుర్తింతురు. తనయందే సమస్తమును దర్శనము చేయుదురు. ఈ అభ్యాసము దృఢమగుట వలన సమస్త జీవులను 'నా' యందు దర్శింతురు. అందరిలో నున్న ఈశ్వరుడు 'నే'నను వెలుగే కనుక అత డంతర్యామిగా గుర్తింపబడినపుడు అతడే పరమేశ్వరుడు లేక దేవుడు. ఈ సమస్త సృష్టియు వానియందే దర్శింపబడును. **(35)**

అట్లైనచో నిక పాపములు చేయువారి సంగతి యేమి? వారి యందలి పాపబుద్ధి గూడ దైవముగనే గుర్తింపబడవలెనా? యను సందేహము కలుగును. నిస్సందేహముగా పాపు లనబడువారును, వారి ప్రవర్తనలును దేవుని నాటక రంగమేగాని వేరు కాదు. ఒక రచయిత తన నాటకములో సజ్జనుల పాత్రలను, దుష్టుల పాత్రలను గూడ కల్పించును. ఈ మొత్తముతోనే నాటక రచన నిర్మాణమగును. ఇది అంతయు చూచువాని యందుగల అజ్ఞానమును తొలగించుట కేర్పడిన నాటకము. ఈ సృష్టిలో నొక్కొక్కడు తనకు తానే ప్రేక్షకుడు. మిగిలినదంతయు తాను చూడవలసిన నాటకము. అందలి మంచి చెడ్డలు తనకు కనిపించినపుడు వాని యెడల తానెట్లు ప్రవర్తించునో తెలిసికొని, క్రమశిక్షణ పొంది, తానను వెలుగును గుర్తించుకొనుటతో నాటకము శుభాంత మగును. కనుక ఈ సృష్టిలో నున్న పాపులు ఇతరులచే పాపులుగా గుర్తింపబడి నపుడు కర్మబంధమునందు చిక్కుకొనుట చూచువారికి కలుగును. పాపు లనబడు వారందరు కూడ సాధనకు ముందున్న స్థితిలోనివారే కాని, శాశ్వత ముగా పాపు లెవ్వరును ఉండరు. అందొక్కొక్కడు పాపాచరణ మెంత చేసినను, సమస్తము నందును ఈశ్వరుని స్మరించుట సాధన చేసినచో పాపాచరణ లక్షణము కరగిపోవును. క్రమముగా తానను వెలుగైన ఈశ్వరుని యందే తన పాపము లన్నిటిని సమర్పణ చేసి, ఈశ్వరుని అస్తిత్వము దర్శింపవలెను. అపుడు ఈశ్వర జ్ఞానమునందు మనస్సు మేల్కొనుట జరిగి, పాపాచరణము నశించును. ఇతరులలోని పాపములను గుర్తించు చున్నంత సేపు అజ్ఞానము నశింపదు. దానియందు ఈశ్వరుని లీలను స్మరింపగలిగినపుడు అజ్ఞానము నశించును. (36)

ఐనచో లోకమున అజ్ఞానము, పాపము ఎక్కువగా నుండి జ్ఞానము లోపల దాగియున్నట్లు కనిపించును. దాగియున్న కొంచెము జ్ఞానము చుట్టునూ ఆవరించియున్న అజ్ఞానమును, పాపమును దాటుట ఎట్లను సందేహము కలుగును? కాని, ఈశ్వరుని సర్వాంతర్యామి భావన వలన దాటుట ఎప్పుడునూ సాధ్యమే. పెద్దది అగు సముద్రము గాని, నదిగాని చిన్నదియగు నావచే దాటుట సాధ్యమగుచున్నది గదా! అట్లే 'తాను' అనబడు ఈశ్వరుని వెలుగును సర్వాంతర్యామిగా స్మరించుటచే జ్ఞానము నావ వలె నేర్పడి అజ్ఞాన మను

సముద్రమును దాటుట సాధ్యమగును. నిప్పుమంటకన్న కట్టెలు పెద్దవి. అయినను అంటుకొనిన తరువాత కట్టెలు నిప్పులో భస్మమగు చున్నవి. అట్లే 'నాది' అను అజ్ఞానముచే ఆవరింపబడియున్న 'నేను' అను జ్ఞానమునందు మేల్కొని, సర్వము తానుగా స్మరించుచున్నప్పుడు ఈశ్వర జ్ఞానమను అగ్నిచే అజ్ఞానమను ఆవరణ మాయమగును. **(37)**

**జ్ఞానము :**

జ్ఞానముతో సమానమైన పవిత్ర వస్తువు మరియొకటి ఈ లోకమున లభింపదు. జీవుడు కాలక్రమమున యోగ సంసిద్ధి పొంది జ్ఞానమును స్వయముగా తనయందు దర్శింపగలుగును. జ్ఞానమను పదమునకు లోక సామాన్యమైన అర్థము వేరు, యోగవిద్యలో నర్థము వేరు. ఒక విషయమును గూర్చి సక్రమముగా తెలిసికొనుట, దాని వినియోగము మున్నగువాని నర్థము చేసికొనుట జ్ఞానమని లోక సామాన్యార్థము. వివిధ శాస్త్రముల జ్ఞానము, పదార్థ విజ్ఞానము, వస్తు ధర్మములను తెలిసికొనుట, వ్యక్తుల నర్థము చేసికొనుట జ్ఞానమని ఎక్కువమంది అభిప్రాయము. ఇట్టి అభిప్రాయము తప్పు కాదుగాని, ఇది సక్రమమైన అభిప్రాయము మాత్రము కాదు.

ఒక వస్తువును గూర్చి తెలిసికొనదలచినపుడు దాని పేరు, ఆకారము, రంగు, రుచి, వాసన మున్నగునవి మనస్సునకు పొడ కట్టును. వీనిని స్మరించుట జ్ఞానము కాదు. ఇవి యన్నియు దేని నాశ్రయించి యున్నవో దేనిపై నాధారపడి యున్నవో కనుగొన యత్నింపుము. ఒక వస్తువు పేరునకు, వస్తువునకు గల సంబంధమెట్టిదో గమనింప యత్నింపుము. అరటిపండును గూర్చి ఆకలి గొన్నవాడు ఆలోచించినపుడు మూడు వస్తువులు సిద్ధించుచున్నవి. 1. అరటి పండను పేరు; 2. ఆ పేరుచే ఆవరింపబడియున్న భావరూపమగు వస్తువు; 3. ఆ పేరు స్మరించిన మనస్సు. ఇందు ఒకే వస్తువు మూడు వేరు వేరు వస్తువులుగా పంచబడి యున్నది. ఈ మూడింటి యందును భౌతికమైన అరటిపండు లేనేలేదు. అతడు అరటిపండును చూచినపుడు మరల మూడు వస్తువులుగ పంచబడును. 1. రంగు, పొడవు, వెడల్పు, ఘనపరిమాణము, వాసన అనువాని మొత్తము; 2. ఇవి దేని నాశ్రయించుకొని యున్నవో ఆ

వస్తువు; 3. గమనించు మనస్సు. ఇందు మూడవది మొదటిదానిని గమనించు చున్నది గాని రెండవ దానిని కాదు. అనగా సత్యమైన వస్తువును కాదు. దాని నాశ్రయించుకొనియున్న గుణములు దొరకుట, అసలు వస్తువు దొరకకుండుట జరుగుచున్నది. ఇది మీసాలపై తేనెవలె భ్రాంతి కొలుపునే గాని కావలసిన తృప్తి నీయదు. ఆ వ్యక్తి అరటిపండు తిన్నపుడు కూడ మరల మూడంశములుగా విభజింపబడుచున్నది. 1. అరటిపండు రుచి; 2. అరటి పండు; 3. రుచి చూచు మనస్సు. ఇచ్చట గూడ మూడవది మొదటి దానిని పొందుచున్నది. రెండవ దానిని విడచుచున్నది. అనగా ప్రధానమైన వస్తువు తప్పించుకొనుచున్నది. కనుకనే ఒకమారు అరటిపండు తిన్నపుడు తృప్తి శాశ్వతముగా నిలువక, మరల తినవలె ననిపించును. మనస్సు దేనికై వెదకు చున్నదో అది లభించుట లేదు.

సత్యమైన అరటిపండుయొక్క జ్ఞానము లభింపవలెనన్నచో మొదట దాని పేరు, గుణముల సముదాయము అనువానిని తొలగించి, వానికి ఆశ్రయమైన దానియందు మనస్సు నిలుపగలుగుట నభ్యసింపవలెను. దీనిని 'ధారణ' అందురు. దీనివలన కొంత కాలమునకు సత్యమైన అరటిపండుపై మనస్సు నిలచును. అది దేనితో చేయబడియున్నది? కొన్ని కణముల సముదాయముతో నిండియున్నది. ఈ కణములు అణువులతో, పరమాణువు లతో నిండి ఉన్నవి. ఈ పరమాణువులు మహాశక్తితో నిండి ఉన్నవి. ఈ మహాశక్తి చోటుతో నిండి ఉన్నది. ఈ చోటు చైతన్యముతో నిండి ఉన్నది. ఈ చైతన్యమే అరటిపండు తినువానిలో 'నేను' రూపమున నిండి యున్నది. అనగా తినువానిలో 'నేను', తినబడు పండులో 'నేను' ఒక్కటియే. ఇక పేరు మొదలగు గుణసముదాయము 'నేను' నుండి పుట్టుచు, నన్నాశ్రయించుకొని నిలచుచు, నాలో లీనమగుచున్నవి. కనుక 'నాది' అనబడు విభాగమునకు చెందినవి. 'నేను' సత్యము. 'నాది' అసత్యము. 'నాది' మాయ. ఈ 'నేను' 'భగవంతు' డనియు, 'అంతర్యామి' యనియు, 'ఆత్మ' యనియు ఆధ్యాత్మికు లచే వ్యవహరింపబడు చున్నది. 'ఈశ్వరు'డని యోగులచే సూచింపబడు చున్నది. ఇట్టి 'నన్ను' ఆశ్రయింపుమని చెప్పిన యుపదేశము వలన భగవద్గీత యోగశాస్త్ర మయినది. ఇట్టి నన్ను తెలిసికొని మనస్సు 'నా' యందు స్థిరమై

నిలిచిపోయి, 'నేను' గా జీవించినపుడు, అట్టి జీవిని 'జ్ఞాని' అందురు. అతని స్థితిని 'జ్ఞాన' మందురు. ఈ జ్ఞానము భగవంతుడు గనుక 'జ్ఞాని అనగా నేనే అని నా మతము' అని కృష్ణు డుపదేశించెను. ఈ జ్ఞానము కన్న పవిత్రమైన వస్తువు మరియొకటి లేదు. మిగిలిన దంతయు పేరు, గుణములు, మనస్సు మాత్రమే కదా! అవి దేనిపై నాధారపడి యున్నవో దానితో సమానము కావు కదా! అయినను జీవి మొదట మనస్సుతో తెలిసికొన యత్నించుచు, గుణములపై నాధారపడి జీవించును. అనగా మాయలో జీవించును. ఇట్లు ప్రారంభించిన మానవ జీవితము కష్టసుఖముల పాలగుచుండును. తత్ఫలిత ముగా ఆర్తి, జిజ్ఞాస, అర్థార్థిత్వము అను స్థితులను దాటుచు, తనకు తెలియ కయే సాధన చేయును. ఈ సాధనలో కాలక్రమమున జ్ఞానమును పొందును. అనగా తనను తాను పొందును. దీనినే యోగులు 'స్వరూప దర్శన' మనియు, ఆధ్యాత్మికులు 'ఆత్మదర్శన' మనియు చెప్పుదురు. (38)

జ్ఞానస్థితిని పొందుటకు కేవలము కష్టసుఖము లనుభవించుచు జీవించిన చాలదు. పశువు ఎంత గడ్డి మేసినను, జీర్ణకోశము యొక్క విజ్ఞాన మును పొందలేదు గదా! అట్లే మానవుడును. ఇది పొందుటకు వివేకము నుపయోగింపవలెను. మానవునకు వివేకము స్వయంసిద్ధముగా నున్నది. జిజ్ఞాస కూడ సహజముగా కలుగును. అటుపైన శ్రద్ధ యనునది అభ్యసింపబడవలెను. ప్రతి వస్తువునందును 'అది' అనబడు దానియందు ఏమున్నదో తెలియుటకు యోగాభ్యాసము చేయవలెను. చేసినప్పుడు 'అది' అనగా 'నేను' అని తెలియును. ఈ అభ్యాసమునకు కావలసినది శ్రద్ధ. శ్రద్ధ అనగా ఒకే మార్గమున మరల మరల మనస్సును ప్రవర్తింపజేయుట. తన పరిసర ప్రపంచమున నిండియున్న తనయందు మనస్సును నిరంతరము ప్రవర్తింపజేసి శ్రద్ధతో తనను తాను గుర్తింపవలెను. అప్పుడు జ్ఞానము కలుగును. దానివలన అచిర కాలములో శాంతి లభించును. శాంతి అనగా పేరు, గుణములు మున్నగు వానియందు మనస్సు ప్రవర్తించుట మాని, తనయందు వసించుట. లోకమున దుఃఖములు, కష్టములు వ్యక్తుల నామరూపముల మూలముననను, వారిపై మనకు గల అభిప్రాయముల మూలముననను కలుగుచున్నవి. వారి యందున్న 'తాను' శాంతికి నిలయము. కనుక మనస్సు జ్ఞానమునందు సమాధిస్థితి

చెందినవాడు కష్టములు, దుఃఖములు పొందక శాశ్వతమైన శాంతి యందు వసించును. ఈ శ్రద్ధ కలిగించుకొన నంతవరకు అజ్ఞానమున నుండును. సంశయముతో జీవించి నశించు చుండును. అట్టి వానికి గుణములతో, పేర్లతో కూడిన ఈ లోకము గాని, తనతో నిండిన పరలోకము గాని లభింపదు. ఎందును సుఖము లభింపదు. (39, 40)

## ఆత్మవంతుడు :

పరిసరమందలి వాతావరణము, వ్యక్తులు మనపై ప్రభావము చూప కుండుట మనము తీవ్రమైన పనిలో మునిగి యున్నప్పుడు కొంత కొంత జరుగును. పూర్తిగా జరుగుట రెండు విధములైన పరిస్థితులలో సంభవించును. ఒకటి నిద్రావస్థ యందు, రెండు యోగస్థితి యందు. యోగసాధనలో సుళువు చిక్కినవానికి పరిసర వ్యక్తులుగాని, వాతావరణము, పరిస్థితులు గాని మనస్సుపై ఎట్టి ప్రభావము కలిగి ఉండవు. సంబంధము బాహ్యప్రపంచముతో తాను పెట్టుకొన్నంత వరకు ఉండును గాని, తనను ప్రభావము చేయుట యుండదు. దీనినే బంధములు తెగుట అందురు. అది లభించిన మనస్సునకు దిగులు, దుఃఖము కలుగవు. సంతోషము కలుగును గాని అది ఇతరులకు కలుగు సంతోషము వంటిది కాదు. అనగా లాభాలాభములు, కార్యము సానుకూలమగుట మున్నగువాని వలన కలుగు సంతోషము కాదు. సంతోష మున్నచోట తత్ వ్యతిరేక ఫలితములు కలుగునపుడు దుఃఖము కలుగు చుండును. కోపతాపాదులు, ఈర్ష్యాసూయలు కూడ కలిగి ఇతరులను సాధింపవలెనను ప్రయత్నమున తానే దుఃఖము అనుభవించు చుండును. యోగికి కలుగు సంతోషము వీనితో సంబంధించినది కాదు. అది అకారణ సంతోషము. సంతోషముగా ఉండుట వాని స్వభావ మగును.

ఇట్టి స్థితిలో అతడు చేయు పనులుండునుగాని, చేయదలచిన పను లుండవు. దీనినే 'కర్మ సన్యాసము' అందురు. యోగస్థితిలో కర్మలను సన్యసించి అవే కర్మలను అకారణముగా శ్రేయస్సునకై ఆచరించును. శ్రేయస్సు అనగా తన శ్రేయస్సును, ఇతరుల శ్రేయస్సును. ఈ రెండింటికీ భేదము నశించును గనుక శ్రేయస్సు అను సంకల్పము ఒక్కటే మిగులును.

ఈ స్థితి కలుగుటకు చేయవలసిన సాధన వాతావరణముతోనే జరుగవలెను గాని, వాతావరణము విడచి జరుగుట సాధ్యము కాదు. ఈర్ష్య పోవలెనన్నచో నెవరిపై ఈర్ష్య కలుగునో వారి సాన్నిధ్యముననే సాధ్యము గాని, వారిని తప్పించుకొన యత్నించినచో సాధ్యము కాదు. ఈ ప్రయత్నమున మన మాచరించు కర్మలన్నియును మనస్సును క్రమముగ పరిశుద్ధి చేయును. అనగా జ్ఞానమును ప్రకాశింపచేయును. అప్పుడు సందేహములకు తావుండక తొలగిపోవును. అంతేకాని సందేహములను తొలగించుకొను యత్నము వలన లాభము లేదు. తొలగించుకొను యత్నముతో తర్కము పెరుగును. దానితో సమస్యలు హెచ్చగును. సత్కర్మాచరణముతో మెరుగు పెట్టబడుచున్న మనస్సున మాత్రమే జ్ఞానము ప్రకాశించి సందేహములు మాయ మగును.

ఈ ప్రయత్నము వలన కలిగిన జ్ఞానము తన జ్ఞానముగా నుండక తానుగా నుండును. తనకన్న వేరుగా తెలియబడు జ్ఞానమంతయు 'అజ్ఞాన' మని ఆధ్యాత్మిక విద్య తెలుపుచున్నది. వేరుగా నుండుట కరగిపోయి, తానుగా మిగిలినప్పుడు అట్టి తానే జ్ఞానము. దీనినే ఆత్మ యని కూడ అందురు. అది కలవాడు ఆత్మవంతుడు. అట్టివానిని కర్మలు బంధింపవు. తన కొకరితో పని ఉండదు. తనతో పని యున్నవారికి కావలసినది చేసిపెట్టుట, వెంటనే వారిని, పనులను కూడ మరచి, అందు భగవంతుని దర్శించుచుండుట ఆత్మ వంతుని లక్షణము. తన సమీపమునకు వచ్చినవారు ఎట్టివారు అను ప్రశ్న యుండదు. అంతకుముందు తనయం దెట్లు ప్రవర్తించిరి? తనను గూర్చి ఏమనుకొనుచుండిరి? అను ప్రశ్నలను మనస్సున చాకిమూటలుగా మోయుట యుండదు. ఎవరి మూటలు వారే మోసికొనుచుండగా, తాను మాత్రము సర్వాంతర్యామియైన ఆత్మయందు విహరించుచుండును. తాను చేసిన పని ఎవ్వరియం దెట్లు ఫలించినది? దానిని గూర్చి ఎవ్వ రేమనుకొను చున్నారు? అనునవి తనకు సంబంధించినవి కావు. తనకు మంచిది అనిపించిన లోక శ్రేయస్సును తా నాచరించు చుండును. వేళకు అప్రయత్నముగ లభించి నది విచక్షణతో భుజించుట, ఉన్నచోట స్వగృహమని తెలిసికొనుట, ఈ వృత్తితో నొకచోట ఇల్లు కట్టినను, కట్టకున్నను లోకమే స్వగృహ మగుట సిద్ధించును. భోజనమందు రుచి అనుభవించునుగాని కోరడు. కనుక సంతుష్టి

మాత్రమే మిగులును. ఇది యిట్లుండవలెనని అభిప్రాయము కలిగినను, ఇతరులను గూర్చి అభిప్రాయము లున్నను వాని ననుసరించి పని చేయువాడు ఆ పనుల ఫలితములచే బంధింపబడిన మనస్సు కలవాడగును. ఇదియే కర్మబంధము. ఇది లేనివాడు పను లాచరించినను కర్మయుండును గాని బంధముండదు. స్వకర్మచేత లోకరూపమైన దేవుని అర్చించి సిద్ధిని పొందు చున్నాడు. ఇట్టివానికి ఉద్యోగము, వాణిజ్యము మున్నగు వృత్తులలో పను లెట్టివో భార్యాబిడ్డల యెడల కూడ పనులట్టివే! అయినను భార్యాబిడ్డల యందు ఎట్టి ఆదరము చూపునో వృత్తి కర్మయందు కూడ అట్టి ఆదరమే చూపును. ఈ ఆదరము లేనినాడు అతడు సంఘద్రోహి, కుటుంబద్రోహి యగును. ఇది అకారణమైన ఆదరము గనుక యిది కలిగినప్పటి నుండి 'భక్తి' యన బడును. అదియే విశ్వప్రేమగా ననుభవింపబడును. **(41)**

లోకమున సర్వవ్యాపియై ఉన్నదంతయు పై చెప్పిన జ్ఞానమే కాని దాని యందు నామము, రూపము, సంబంధము అనునవి ఆవరించి యుండును. అవి యన్నియు కలిసి అజ్ఞానము. లోకమున జ్ఞాన మెప్పుడును అజ్ఞానముచే ఆవరింపబడి యుండును. కనుకనే జీవులు జ్ఞానము విషయమున పొరపాటు పడుచుందురు. మనము దేహము, ఆకారము, బంధుత్వములు అనువానితో ఆవరింపబడి యున్నాము. మనము జ్ఞానము. మిగిలిన దంతయు అజ్ఞానము. అనగా మనచే కల్పించుకొనబడినది. హృదయమున 'నేను' అను ప్రజ్ఞ వెలుగుచున్నది. దానిని ధ్యానించుచు జీవితము గడపినపుడు జ్ఞానము నానాటికి వాడియై ఖడ్గమువలె భాసించి అజ్ఞానమును ఖండించును. ఈ ధ్యానముతో సంశయములు ఛేదించబడును. ఇదియే ఉత్తమ యోగము. దీనితో యోగా భ్యాసము చేయవలెను. అనగా యోగముతోనే యోగాభ్యాసము చేయవలెను గాని జపమాల, లేడిచర్మము, మడిబట్ట, దేవుని ఆలయము మున్నగువానితో కాదు. ఇవి యన్నియు సాధనములు. ఇవి కార్యమును సుగమము చేయును కాని యోగమును కలిగించవు. పొరుగూరిలో పనిచేయ దలచినపుడు ప్రయాణము, రైలెక్కుట మున్నగునవి వంటివి. ప్రయాణముతో పనులు కావు. పనులు చేసికొనువారికి మాత్రము ఉపకరించును. ఈ విచక్షణతో యోగమున యోగమును సాధింపవలెను. **(42)**

ఐదవ అధ్యాయము

# కర్మ సన్న్యాస యోగము

కృష్ణుడిట్లు వివరింపగా మరల నర్జును డీ విధముగా ప్రశ్నించెను. "నేను నా కర్తవ్య మడిగితిని గాని, నిన్ను విషయము వివరింపుమని అడుగలేదు. నీవు కర్మలను సన్యసించుటను గూర్చి చెప్పుచున్నావు. మరల కర్మల నాచరించుటతో యోగమును సాధించు మార్గమును కూడ చెప్పుచున్నావు. రెండును గొప్పవి కావచ్చును. అయినను అందొక దానిని నిశ్చయించి నాకు నిర్ణయింపుము." (1)

మరల శ్రీకృష్ణు డిట్లు వివరించెను. 'నీవు చెప్పినట్లు కర్మ సన్న్యాసము, కర్మయోగము అను రెండును గొప్ప మార్గములే. రెండును నిశ్శ్రేయసము ప్రసాదించును. (నిశ్శ్రేయస మనగా మన కింతకన్న కావలసిన మేలు మరియొకటి లేదు అనదగిన స్థితి.) ఆ రెండింటిలో నొక దానిని నిశ్చయించి చెప్పవలసినచో కర్మ సన్న్యాసముకన్న కర్మయోగమే గొప్పది. ఏ పని చేయ వలెను? దేనిని విడచిపెట్టవలెను? అను చర్చ వలన తీరున దేమియును లేదు. మంచి పని యని తోచిన దానిని చేయుట ప్రారంభించినచో దాని వలన చిత్తశుద్ధి యారంభమగును. అది మంచి పని కాకున్నను మంచిదని త్రికరణ శుద్ధిగా నమ్మి చేయుట వలన చిత్తశుద్ధి కలుగును. కారణ మేమనగా ఇది మంచి పని, ఇది చెడ్డ పని యను నిర్ణయము ఫలితమును బట్టి గదా! కర్మయోగ మార్గమున ఫలితమునకు ప్రాధాన్యమే లేదు. కొందరికి మంచి పనులని నచ్చినవి, కొందరికి చెడ్డపను లనిపించును. కనుక యీ నిర్ణయము నందు సత్యము లేదు. కర్మాచరణము చిత్తశుద్ధి కలిగించు నన్నదొక్కటే సత్యము. కష్టములను, బాధలను కలిగించునవి చెడ్డ పనులని ఒక నిర్ణయము. వాని నాచరించుట వలన ఫలితములుగా కష్టనష్టములు కలిగినను జరుగునది చిత్తశుద్ధియే. ఇట్లేవిధముగ గమనించినను కర్మ లాచరించుటయే నా నిశ్చితమైన

యభిప్రాయము గాని మానుట కాదు. మానినచో అనంతర కర్తవ్యమేమి? మాని కూర్చున్నవాడు అనుభవించునది సోమరితనము కాని జ్ఞానము కాదు. పూర్వ సంస్కారములు లోపల మనస్సును ప్రేరేపించు చుండుట మానవు. అప్పుడు భౌతికముగా పనులు చేయకున్నను చేయనివా డెట్లగును?

ఒక వృత్తి చేయువాడు యజమాని నియమించిన పని చేయవలెనే గాని అందలి మంచి చెడ్డలు నిర్ణయించుట వాని కర్తవ్యము కాదు. సర్వాంతర్యామి అయిన పరబ్రహ్మమే జీవుల ప్రవృత్తులకు యజమాని. అట్టి సందర్భమున చేయవలసినది చేయుట కర్మయోగము. దానము చేయవలసిన వానికి దాన మిచ్చుట, యుద్ధము చేయవలసిన వానితో యుద్ధము చేయుట, రెండును కర్తవ్య నిర్వహణమే గాని, మంచి చెడ్డలు కావు. మంచి చెడ్డలు నిర్ణయించు మార్గము కొంత దూరము నడిపించి అర్థము గాని తావున విడచిపెట్టును. కర్తవ్య నిర్వహణము చిత్తశుద్ధి కలిగించి జ్ఞానమునందు నిలబెట్టును. కనుక కర్మయోగము నిశ్చయముగ విశేషమైనది. (2)

**సన్న్యాసము :**

సన్న్యాసి యనగా నెవరు? సామాన్యముగా కాషాయ దండ కమండలువులు మున్నగునవి మనకు జ్ఞప్తికి వచ్చును. కాని భగవద్గీతలో సన్న్యాసి అను పదమునకు మరియొక విధమైన అర్థబోధ కనిపించును. కర్మలను సన్యసించుట, కర్మల నాచరించుట అను రెండింటిలో కర్మలను సన్యసించిన వానిని సన్న్యాసి అందురు. కర్మలనగా మనము చేయునవి అయినచో నిది సత్యమే. కాని కర్మలు మనచే చేయబడునవి కాని, మనము చేయునవి కావు. చేయుట, చేయకపోవుట అనునది ఇష్టానిష్టములను బట్టి ఏర్పడదు. కొన్ని చేయవలెనని అనుకొని కూడ చేయము. చేయరాదని అనుకొని కూడ కొన్నిటిని చేయుచుందుము. ~~ఈ~~ పనులన్నియు మన స్వభావము ననుసరించి ప్రకృతి మనచే చేయించుకొనును గాని, మనము చేయుట, మానుట అనునది సత్యము కాదు. అట్టిచో కర్మలు ఆచరింపక మానినచో స్వభావము సన్న్యసింపదుకదా!

ఆహారము నందలి అభ్యాసములు, వేషభాషలు మనలను సన్న్యసింపవు. కాషాయమునం దభిలాష కూడ కామమే గాని సన్న్యాసము కాదు. ఆస్తిపాస్తులు,

ఉద్యోగ వ్యవహారాదులు మున్నగువానియం దభిలాష కూడ అట్లే. ఇల్లు వాకిలిని గూర్చి తాపత్రయమెట్టిదో ఆశ్రమము, మఠము మున్నగువానిని గూర్చి కూడ నట్లే. మనము చెప్పినట్లు బంధుమిత్రాదులు వినవలె ననునది ఎట్టి అహంకారమో, అట్టిదే మన బోధలు, ఉపదేశములు శిష్యులు పొందవలెనను బాధ కూడ! భార్యాబిడ్డలపై అధికారము కోరుట యెట్టిదో శిష్యులపై కోరుట కూడ నట్టిదే. కనుక కర్మల నాచరింపక మానుటవలన ఫలములపై సన్న్యాసము రాదు. ఫలాపేక్ష విడచుట నభ్యసించుచు, సత్కర్మ లాచరించుట వలన అహంకార మమకారములు తొలగును.

పరిస్థితులను ద్వేషించువాడు, ఇట్టి పరిస్థితులు ఉండవలెనని కోరువాడు, సన్న్యాసులు కాజాలరు. ఇంటియందు వాతావరణము బాగులేదనియు, ఆదర్శవంతమైన వాతావరణము లభించినచో ఆధ్యాత్మిక సాధన బాగుగా జరుగుననియు కొందరి నమ్మకము. ఈ నమ్మకముతో అసంతృప్తి ఎక్కువగును గాని వైరాగ్యము కలుగదు. దుష్టుల పేర, అజ్ఞానుల పేర, తన చుట్టు నున్న వారిని ద్వేషించువానికి కామక్రోధములు ఎక్కువగును గాని, శమించుట జరుగదు. ద్వేషించుట, కోరుట ఎవడు చేయడో వాడే నిత్య సన్న్యాసి. ఉన్న పరిస్థితులను, వాతావరణమును, బంధుమిత్రులను, వారి యాచారములను, నమ్మకములను కాదనడు. తన మార్గము ననుష్ఠించుకొనుచు, వాతావరణ ముపై తన ప్రభావము చూపును. ఎవని మనస్సునకు నచ్చుట, నచ్చకపోవుట యుండవో వాడే నిత్యసన్న్యాసి. వానిచే చేయబడు పనులు సహజముగా మార్పు చెందునుగాని, వాడు మార్చుకొనుటకు యత్నింపడు. యత్నించినను లాభము లేదు. ఆచరణలో సదుపాయములు ఇబ్బందులు మున్నగునవి పనిచేయవు. కనుక తన మనస్సున ఇట్టి ముడులు సుళువుగా విప్పుకొనిపోయి బంధ విమోచనము జరుగును. (3)

కొందరు సాంఖ్యము శ్రేష్ఠమని, కొందరు యోగము శ్రేష్ఠమని నమ్మి జీవిత సాధన చేయుచున్నారు. సాంఖ్య మనగా జ్ఞాన మార్గము. అందు తెలిసికొనుట, వివేకము కలుగుట, సందేహము తీరుట ముఖ్యము గాని, ఆచరించు పనులు ముఖ్యము కాదు. పను లాచరించుట కూడ జ్ఞానము కొరకే కావున, జ్ఞానము కొరకు సూటిగ యత్నించువాడు ఆచరింప నక్కర

లేదు. ఇక యోగమార్గ మవలంబించు వారికి కర్మాచరణమే ప్రధాన సాధనము. కర్మలు వ్యక్తిగత ప్రకృతిలోని ఎగుడు దిగుడులను సవరించి త్రిగుణములను చక్కబరచి చిత్తశుద్ధి కలిగించును. కనుక సత్కర్మాచరణము లేనిదే జ్ఞానము లభ్యము కాదు. ఈ రెండును సాంఖ్యము, యోగము అనబడు రెండు విభిన్న మార్గములు. కాని, నిజ మాలోచించినచో కర్మ, జ్ఞానము అను విభాగము మనము చేసికొన్నదే కాని, ఉన్నది కాదు. ఇందెచ్చట ప్రారంభించినను, రెండవది సహజముగా సిద్ధించును. సత్కర్మ లాచరించినకొలది చిత్తశుద్ధి కలిగి జ్ఞానము ఉదయించును. జ్ఞానమనగా జ్ఞానియే అని తెలియును. అట్లే జ్ఞానికి కర్మ యనగా ఆచరించువాడు ఆరోపించుకొనునదే కాని వేరేమియు లేదని తెలియును. కనుక సాంఖ్యము, యోగము అని విడదీసుకొనువారు తెలియని పిల్లకాయల వంటివారు. తెలిసినవారట్లు వాదింపరు. సాంఖ్యులచే పొందబడు స్థాయి యోగులచేత పొందబడును. సాంఖ్య, యోగములను రెండింటిని ఒక్కటిగా గ్రహించి దర్శించినవాడే దర్శనము పొందినవాడు. **(4)**

ఇక, నీ రెండిటిలో దేనితో ప్రారంభింపవలెనని కొందరికి సందేహము కలుగవచ్చును. జ్ఞానము సహాయమున సత్కర్మ లేవో తెలిసికొనుట ముఖ్యమా? సత్కర్మ లాచరించుట వలన పవిత్రుడై జ్ఞానము పొందుట ముఖ్యమా? ప్రారంభ మెచ్చటి నుండి చేయవలెను? ఈ ప్రశ్న యుదయించ నపుడు కర్మయోగమే ప్రారంభము. దాని నభ్యాసము చేయనివాడు సన్యసించుట నభ్యాసము చేసినచో దుఃఖమే ఫలము. సకల వేదవేదాంత పారగుడై, మంచి చెడ్డలు తెలిసి, నిత్యము, అనిత్యము అను భేదము గ్రహించినవాడు, కొంతకాలము ఏ పనియు చేయ కుండ గమనించుచుండినచో సోమరియు, అసమర్థుడును అగును. దానివలన మనస్సునకు విచారము కలుగును. వారిని వీరిని కూర్చిన లోపములు కనిపించుట ఆరంభించును. లోకమున నింత అజ్ఞాన మున్నది, ఏమి చేయ వలెను అను ప్రశ్న ఉదయించి, మరమేకువలె మనస్సులోనికి దిగి కదలు చుండును. సోమరితన మభ్యాస మగుట వలన చేయవలసిన పని కనిపించదు. కనుక సత్కర్మాచరణ రూపమైన కర్మయోగముతోనే సాధన ప్రారంభించి సక్రమముగా జ్ఞానస్థితి పొంది, శమించుట మంచి మార్గము. అట్టివాడు జ్ఞానియైనను, వాని దేహేంద్రియములు అభ్యాస నైపుణ్యముచే సత్కర్మ

లాచరించుచునే యుండును. అతడు మాత్రము చేయక మానును. అనగా చేయుటకు కారణములు, ఫలితములపై దృష్టి తొలగిపోవును. (5)

మనస్సునకు యోగస్థితి లభించునది సత్కర్మాచరణము వలననేగాని కర్మ పరిత్యాగము వలన కాదు. ఇంద్రియములు, మనస్సు ఊరకుండుట సాధ్యము కాదు. ఎంత మంచి ఆలోచనలు చేసినను సత్కర్మాచరణము వలన నెక్కువ కాలము వినియోగము కానపుడు మంచి ఆలోచనలు మంచివిగా నిలబడవు. మంచి పని చేయుచున్నవారు మంచివారుగా నుండుట సాధ్యము కాని, ఎవ్వరును మంచివారైపోయి మంచిగా ఉండిపోవుట సాధ్యము కాదు. మానవులు చేయునట్టి పనులలో నేదియును వాని ఫలితము కొరకు గాదు. జీవునకు రావలసిన ఫలితములు వచ్చుచునే యుండును. లోకమున జరుగ వలసిన మంచి పనులు జరుగుచునే యుండును. మనము చేయుట అనునది పనులు జరుగుటకు కాదు. మన మనస్సు, ఇంద్రియములు బాగుపడుటకు, బాగుపడినవి బాగుగా నిలబడుటకు మాత్రమే. చిత్తశుద్ధియే ముఖ్యముగాని, కర్మఫలము కాదు. (6)

## జితేంద్రియుడు :

పనులు జరుగుచుండును. వానిని జరిపించుట కొరకు ప్రకృతి వ్యక్తులలో నుండి పనిచేయుచుండును. వ్యక్తుల స్వభావము వారిని కర్మాచరణమునకు ప్రేరేపణ చేయుచుండును. దానికి వివేకము జతపడినచో సత్కర్మాచరణము మనము చేయుట కాక మనద్వారా జరుగుట, వాని సంసర్గము వలన మనము బాగుపడుట యుండును. ఈ మార్గమున జితేంద్రియత్వమును సాధించుకొనుట సాధ్యమగును. దానిని సాధించినవాడు జితాత్ము డగును. అనగా ఇంద్రియములు, మనస్సు, ఆత్మగా మారిపోయినవాడు. అట్టివానిలో ఆపాదమస్తకము ఆత్మయే యుండును గాని తదితర పరిస్థితు లుండవు. ఆత్మ అన్ని జీవులలోను సమానము. అనగా ఒకే ఆత్మయందు జీవులు వేరు వేరు ప్రజ్ఞలుగా నాశ్రయించి యుందురు. ఆత్మజ్ఞానము పొందినవానికి సర్వజీవులలో నున్న ఆత్మయు తానే అని తెలియును. ఆత్మయందు శరీరాదు లున్నవిగాని శరీరములో నాత్మ లేదు. కనుక ఆత్మజ్ఞానమున నివసించు

వాడు అందరిలో నున్న ఆత్మయు తానే యగును. అట్టివాడు ఆచరించు పను లన్నియు ఆత్మకర్మ లగుచున్నవి గనుక, యజ్ఞార్థముగా లోకశ్రేయస్సునకు తోడ్పడునవై యుండును. ఇతరులు చెడ్డ పనులని అనుకొనునవి కూడ మంచి పనులైనపుడు అతడు చేయుచునే యుండును. మంచి చెడ్డలు అతని నంటవు. మంచి చెడ్డలన్నవి యితరుల దృష్టికి సంబంధించినవిగాని అతనికి లేవు.(7)

ఈ విధముగా కర్మను ఆత్మతో యోగము చేసినవాడు తా నేమియు చేయుట లేదని గ్రహించును. శరీర ధర్మములు, మనస్సు, ఇంద్రియములు తమ తమ ప్రవర్తనలు చూపుచున్నవని గమనించుట తప్ప అతడేమియును చేయుట యుండదు. గునపముతో మనము రాతిని బ్రద్దలుకొట్టునపుడు గునపమునకు కర్తృత్వముండదు గదా! అట్లే వ్యక్తులు కూడ ప్రజ్ఞయున్న గునపముల వంటివారు. కంటికి చూచుట, చెవికి వినుట సహజమైన శక్తులు. అవి వర్తించుచుండుట గమనించి జ్ఞాని, శరీరమున కూర్చుండి చూచుచుండును. కంటిద్వారా మనస్సు చూచు చున్నదని జ్ఞాని గమనించును. తాను చూచు చుంటినని అజ్ఞాని అనుకొనును. కనుక దృశ్యము యొక్క మంచి చెడ్డలు వానిని బంధించును. జ్ఞాని ఆకలికి ఆహారము తినుచున్నను, నాలుకకు రుచి బాగున్నను అది దేహ పోషణకు సదుపాయమని యెరిగి వర్తించును. దేహము ఆహారమును స్వీకరించుచున్న దనియు, జిహ్వకు రుచి వచ్చుచున్న దనియు గమనించుచుండునుగాని తనయం దారోపించుకొనడు. తన కొరకు అన్నము తినుచున్నట్లు నమ్మినచో, ఆకలి కలిగినపుడు బాధ కలుగునని భయము, రుచి కొరకు భుజించుట, దాని వలన వ్యాధియు కలుగును. ఆహారము శరీర పోషణ కనియు, శరీరము, మనస్సు, ఇంద్రియములు లోకమునకు పనికి వచ్చుట కనియు నెరిగిన వానికి, తనకు కావలసినది యుండదు. తనకు కావలసినది యన్న భావమే అసత్యము, భ్రాంతి. దాని వలననే దుఃఖము కలుగును. **(8, 9)**

ఇట్టివాని మనస్సు, ఇంద్రియములు, శరీరము తనయందు ధరింప బడును. దీనినే 'ధారణ' యందురు. ఏ ప్రజ్ఞయందు తన మనస్సు ధరింప బడినదో అదియే సర్వాంతర్యామియైన ఆత్మ. అది ఒక్కొక్క శరీరమున జీవిగా ప్రారంభించి వ్యాపించును గనుక బ్రహ్మము అనబడును. ఈ పని

ఆచరించవలెనని గాని, దీని ఫలిత మిట్లుండవలెననిగాని అతని కుండదు. ఫలితము నుద్దేశించుటలోనే పాపపుణ్యము లంటును గనుక, జ్ఞానికి కర్మాచరణ మున్నను పాపమంటదు. చెరువులో నీటిపై తామరాకు తేలుచుండును. తామరాకుపై నీటిబొట్లు తిరుగుచుండును. అయినను తామరాకునకు నీరు అంటదు. అట్లే యోగయుక్తుడైన జ్ఞాని కర్మలయందు వర్తించుచుండును. అయినను అతనిని కర్మ లంటవు. (10)

శరీరముతో కొన్ని పనులు చేయబడును. మనస్సుతో కొన్ని పనులు ఊహింపబడును. బుద్ధితో కొన్ని విచక్షణ చేయబడును. కొన్ని కేవలము ఇంద్రియములచే ఆచరింపబడును. ఉదాహరణకు బరువు మోయుట, పొలము పనులు మున్నగునవి చేయుట, మనము శరీరముతో నాచరించెదము. ఇతరుల కును మనకును గల సంబంధములను మనస్సుతో వ్యవహరింతుము. ఇష్ట పడుట, ఇష్టపడకుండుటలతో, కామక్రోధములతో వ్యవహరింతుము. ఇది మంచిది, ఇది చెడ్డది అని బుద్ధితో నిర్ణయింతుము. ఆకలిదప్పులు తీర్చు కొనుట, దురద పెట్టినచో గోకికొనుట మున్నగువానిని కేవలము ఇంద్రియములే చేయును. ఇంద్రియకర్మలు, ప్రాణకర్మలు, మనఃకర్మలు; దేహకర్మలును, ఎక్కడి వక్కడ జరుగుచుండవలెనేగాని లోపలనున్న మన మాచరింపరాదు. అప్పుడు జరిగిన ప్రతి పనియు ఆత్మశుద్ధికి తోడ్పడును. ఈ మార్గమున యోగియైన వాడు కర్మఫలము నుండి విముక్తుడై శాంతి పొందును. ఈ శాంతి మన మితర కారణముల వలన పొందించుకొను శాంతివలె కొంతకాలము వర్తించి పోవునది గాక, మన స్వభావమే శాంతమై నిలబడును. ఇట్టి నిరంతరత్వ మును 'నిష్ఠ' అందురు. (11)

మంచి పనులు చేయువారిలో కొందరు లోకమునకు తాము చేసిన పని ఎంతవరకు ఉపకరించెనో తెలిసికొనుటకు తహతహ పడుచుందురు. పరోపకారము చేయుటయందు నిమగ్నులైన కొందరు లోకము తనను అర్థము చేసికొనుట లేదని బాధపడుదురు. "అష్టకష్టాలు పడి కొడుకును చదివించి, పెంచి ఒక యింటివానిని చేసితిని. ఇప్పుడు నా మాట వానికి లెక్కలేదు" అని సత్కర్మచేసిన తండ్రులు దుఃఖించుచున్నారు. "నా దగ్గర మందు పుచ్చు కొన్నచో రోగము తగ్గును కదా! అట్లుచేయక అజ్ఞానముచే కుట్ట వైద్యుల

దగ్గరకు వీరందరూ పోయి బాధపడనేల?'' అని భూతదయ గల వైద్యుడొకడు నిత్యము బాధపడుచుండును. "నా దగ్గర మంత్రోపదేశము చేయించుకొన్నచో అజ్ఞానము పటాపంచలగును. సూక్ష్మములో మోక్షము లభించును. ఈ విషయమును ఎవ్వరు గ్రహింపరేల?'' అని కొందరు గురువులు తాపత్రయ పడుచుందురు. "ప్రతిఫల మాశింపక ఎన్ని వందలమందికి సహాయము చేసితిని! ఎవ్వరికిని నా మంచితనము గుర్తించు బుద్ధి లేదు. ఈ లోకమున కేమి చేసి ఏమి లాభము? ఇన్ని సంవత్సరములు లోకసేవ చేసితిని. చివరికి ఏమి మిగిలినది?'' అని కొందరు వేదన పడుచున్నారు. "మంచికి రోజులు లేవు. గొంతులు కోసినవారినే అందరు నమ్ముదురు'' అని మరికొందరు వెష్టపడుచున్నారు. "ఈమె చిన్నతనము నుండియు నా దగ్గర పెరిగినది. ఉపనిషత్తులు నేర్పితిని. మంత్రోపదేశము చేసితిని. నన్నామె దైవముగా భావించెడిది. కాని వివాహమైన తరువాత ఆమె మారిపోయినది. నా కన్న భర్తయే యెక్కువట! ఏమి లోకము! విశ్వాసమే లేదు'' అని యొక స్వాములవారు వాపోవును. "నా కేమి కావలెను? ఈ ఆశ్రమము పెట్టుట, దీని బరువు బాధ్యతలు వహించుట, యిబ్బందులు పడుచుండుట, దీని ఆదాయమునకు పదిమంది దగ్గర దక్షిణలు వసూలు చేయుట యిన్ని తిప్పలు మీ కోసమే గదా!'' అని శిష్యులపై నొక గురువు కోపించును. సత్కర్మాచరణము చేయు చుండియు నిత్యమిట్లు దుఃఖపడువా రున్నారు.

వీరి బాధలకు కారణమేమి? సత్కర్మలు చేయువారిట్లు బాధపడవలసిన అగత్యమేమి? దానికొక కారణమున్నది. ఫలములయం దాసక్తి గలిగి సత్కర్మ లాచరించుటయే. ఎంత మంచి పని చేసినను ఫలితములపై దృష్టియున్నచో ఈ బాధ తప్పదు. ఈ పనియైనది, యిది కాలేదు అని దిగులు తప్పదు. కర్మయోగ మభ్యసించిన వానికి ఈ దిగు లుండదు. అతడిట్టి సత్కర్మము లాచరించినను, అవి ఎంతవరకు ఫలించినవని చూడడు. ఆచరించుటతోనే అతనికి సంబంధము. అట్టి వానినే సన్న్యాసి అనవలెను. సుఖపడువా డతడొక్కడే. నేను చేయుచుంటినను దృష్టి సత్కర్మలపై నున్నచో సూటిగా దుఃఖములోనికి ప్రయాణము చేయును. నేను నిమిత్తముగా సత్కర్మలు జరుగుచున్నవని గ్రహించినవాడు, ఆ కర్మాచరణము వలన తా నుద్ధరింపబడు

చుంటినని గ్రహించిన సంతోషపడును. అతడే నిత్య సంతోషి. కర్మయోగము లేనివాడు శాంతి పొందక ఫలములయందు చిక్కుకొని బంధము చెందును. దీనినే సంసారబంధ మందురు. స్వార్థ త్యాగులు, ధనాదులు విరాళము లిచ్చిన వారు, మోక్షమునకై పెండ్లి మానినవారు మొదలుకొని, అన్ని రంగములలోను సంసార బంధమున చిక్కుకొనువా రుందురు. కర్మయోగి మాత్రము వివాహితు డైనను వృత్తులలో నున్న వాడైనను చిక్కుకొనక నిపుణతతో తన కర్తవ్యము నిర్వహించుచుండును. అతడు నిరంతర సుఖానందము లనుభవించు చుండును. నిష్ఠ యను పదమునకు సరియైన యర్థ మతని జీవితమే.

మంచి పనినైన చేయుటకు మనసుపడువాడు, వేడుకపడువాడు దాని ఫలితమునందు చిక్కుకొనును. వేడుకపడక చేయువాడు దైవమును జూచుచు చేయును. వేడుక తగ్గుటయు, ఆసక్తి నశించుటయు అతని కుండవు. అతడు మనస్సునే సన్యసించును. అనగా ఈ పనిని చేసి తీరవలెనను పట్టుదల ఎంత మంచిపని యందైన నుండదు. ప్రయత్నమెంత తీవ్రముగానైన చేయును. కాని మనస్సున అట్టివాడు బాలునివలె సత్కర్మలతో నాడుకొనును. తన సత్కర్మ నుపయోగించుకొనువారి కుపయోగపడును. ఉపయోగించుకొనలేని అహంకారులను జూచి నవ్వుకొనును. లోకమును ఆడించుచు ఆశ్చర్య మంద జేయుచు లోకసేవ చేయును. శరీరము, మనస్సు పనిచేయుచుండగా తాను లోపలనుండి చూచుచుండును. అతనికి శరీరమే తొమ్మిది ద్వారములు గల పట్టణము. అందు కూర్చుండి తానేమియు చేయడు, చేయించడు. కడుపు ఆకలి పొందినపుడు నోరు అన్నము తినును. చేయి తినిపించును. మనస్సు సిద్ధపరచును. జిహ్వ రుచు లానందించును. తాను చూచుచుండును. అట్లే యితరుల కుపయోగించు సత్కర్మలును. అట్టివానికి శరీరము, మనస్సు, ఇంద్రియములు తాను కాదని తెలియును. తాను అన్నిటియందు నిండి యున్నాడు; కాని అందేదియు తాను కాదు. ఆభరణములలో బంగారము నిండియున్నది. బంగారము మాత్రము ఏ ఆభరణమును కాదు. అట్లే సన్యాసి యైన కర్మయోగియును. **(13)**

**14.** సర్వాంతర్యామియైన భగవంతుడు ఎవ్వరికిని తాము చేయు పనులయందు కర్తృత్వ ముంచలేదు. కర్మఫలములు సృష్టించలేదు. కర్మల

ఫలములు పొందించలేదు. ఈ రహస్యము తెలిసికొనిన యోగి భగవంతుడే యగుచున్నాడు. సమస్తము స్వభావము చేత ప్రవర్తించుచున్నదని గ్రహించు చున్నాడు. దేహమునకు దేహ ధర్మములు, మనస్సునకు ఇంద్రియములకు తమ తమ ధర్మములు సహజముగా వర్తించును. అట్టి దేహము జీవునికొరకు, జీవుడు జీవుల పరస్పరత్వము కొరకు, జీవులు సర్వాంతర్యామి కొరకు నేర్పడినవి. ఇందు దేనికిని ప్రత్యేకమైన విలువ లేదు. అట్లే తా నాచరించు సర్వ కర్మలకును. ఏ పని జరిగినప్పుడును దానినుండి ఏ పాపమును తా నంటించుకొనడు. కారణమేమనగా తన చేతులమీద జరుగుచున్న పనులు కూడ తనద్వారా జరుగుటయే గాని తనవలన జరుగుట లేదుకదా! అవి జరుగుటకు తన చేతులు, కాళ్ళు, మనస్సు, ఇంద్రియములు వినియోగపడుటయే గాని తా నాచరించుట లేదు కదా! **(14)**

పాప మెప్పుడంటదో అప్పుడే సత్కర్మల పుణ్యఫలముకూడ నంటదు. పుణ్యము కొరకు సత్కర్మల నాచరించు వానికి పాప మంటితీరును. కొన్ని సంవత్సరములు పరోపకారము చేసినవారు తమకు కష్టములు కలిగినపుడు "నా యంతటి పుణ్యాత్మునకు కష్టము లేల కలుగవలెను? నే నేమి పాపము చేసితిని?" అని బాధ పడుదురు. తాము చేసిన పుణ్యములకు ప్రతిఫలముగా దైవము మెచ్చి, కష్టములు రాకుండునట్లు కాపాడవలెనని లోపల చిన్న కోరిక యుండును. దానివలన దుఃఖము కలుగును. కొందరు దేశభక్తులు, ఆధ్యాత్మిక గురువులు, నాయకులు, వారి లోకసేవలో తమ భార్యా బిడ్డలను లెక్కచేయక, గాలికి విడచి పెట్టుదురు. వారి దారా పుత్రాదులు దిక్కులేనివారుగనో, క్రమ శిక్షణలేని దుండగీడులుగనో తయారగుట మనము చూచుచున్నాము. "నా వారని మమకారముండరాదు. కనుక వారిపై ప్రత్యేకముగా మేము శ్రద్ధ చూపలేదు" అని వారి వాదము! వారి లోకసేవ సత్యమైనచో తమ దారాపుత్రులు గూడ లోకులే గదా! తన్నాశ్రయించుకొని తనకు సేవ చేసినవారి యెడల వైరాగ్యమను పేర నిరాదరణ చూపుట క్రూరత్వము, అవిశ్వాసము కాదా! ఇంతకును కారణమేమనగా కొందరికి ధనలోభ మున్నట్లు, కొందరికి స్త్రీ లోభ మున్నట్లు, కొందరికి తీరని కీర్తి లోభ ముండును. దాని వలన యిట్టి దురంతములు జరుగుచున్నవి. కర్మయోగ మభ్యసించిన వానికి సత్కర్మల

పుణ్యము కూడ నంటదు. వారు సత్కర్మలు చేయునది చిత్త సంస్కారమునకు గాని పుణ్యము మూట గట్టుకొనుటకు కాదు. లోకము నుద్ధరించుటకు అంత కన్న కాదు. తమ ద్వారా లోకము నుద్ధరించునది సర్వాంతర్యామి గాని తాము కాదు. వివేకానందు లొకమారు ఒక శిథిలమైన అమ్మవారి దేవాలయము చూచెను. చాలా దుఃఖావేశము చెంది, "తల్లీ! నీవు ఎండకు, వానకు గురియై అనాదరింపబడు చున్నావు. నేను వెంటనే నీ ఆలయము నుద్ధరించెదను. ఇట్టి ఆలయము లన్నిటిని ఉద్ధరించెదను'' అని తలచెను. ఇంతలో దేవి యనుగ్రహమున సత్యము గోచరించినది. వెంటనే ఇట్లనుకొనెను. "ఈ మాత్రము దేవికి తెలియదా? ఇది నాకు పరీక్షకు గాని దేవతకు దిక్కులేక కాదు. ఎవరిచేత ఈ సత్కర్మము నాచరింపజేసి వారి జన్మ ధన్యము చేయ దలచినదో ? మనకేల ! మన కాజ్ఞయైనది మనకు సాధ్యమగును. దాని నాచరించుటలో క్షణమైనను వ్యర్థము చేయను.'' ఇట్లు భావించి అడ్డుదారులు పట్టక తన కర్తవ్యము వైపునకు సాగిపోయెను. కనుక మన ద్వారా సత్కర్మలు ఆచరింపబడుట మన యుద్ధరణకే కాని లోకోద్ధరణకు కాదు. కర్మయోగ సిద్ధునకు పాప పుణ్యము లంటవు. (15)

**సమదర్శనము :**

సామాన్య మానవునకు ఒక వస్తువును చూచుట యనగా దాని యాకార మును, రంగును, రుచిని, పరిమాణమును, బరువును చూచుట, దాని పేరు, వినియోగము తెలిసికొనుట యని యర్థము. కాని ఇందే యంశము నందును ఆ వస్తువును తెలిసికొనుట జరుగదు. పేరు మనము పెట్టుకొనినది కనుక వస్తువునకు సంబంధించినది కాదు. 'ఇది గోడ' యని చెప్పినపుడు గోడ యను పదము వేరు, దాని నుచ్చరించుచు మన ముద్దేశించు వస్తువు వేరు. 'దీనికి సున్నము కొట్టిరి' అని చెప్పినపుడు సున్నమను పదము వేరు, కొట్టిన వస్తువు వేరు. 'ఇది తెల్లగా నున్నది' అన్నప్పుడు తెలుపను పదము వేరు, కంటికి కనిపించునది వేరు. అట్లే 'ఈమె నా భార్య' అని చెప్పినపుడు భార్యయను పదము వేరు, అందలి అభిప్రాయము వేరు, వ్యక్తి వేరు. ఆ వ్యక్తి యందు భార్యయను పదార్థము గాని, పదముగాని లేవు. భర్త యనువాడు దాని నారోపించుకొనుచున్నాడు. ఈ విధముగా దేనినిగూర్చి తెలిసికొనినను దానిని

తెలిసికొనుట జరుగదు. ఇందు తెలిసికొనునది జ్ఞానమును గూర్చి; కాని తెలుసుకొనవలసినది జ్ఞేయము, తెలిసికొను వానియందు కలుగవలసినది జ్ఞానము. ఈ మూడును మూడు పెట్టెలలో వేరువేరుగా పెట్టి తాళము వేసినట్లున్నవి. ఇందు మూడింటి యందున్నదియు జ్ఞానమే. పరస్పర సంబంధ మున నున్నది జ్ఞానమును గూర్చిన ఆందోళన. అది జ్ఞానము కన్న భిన్నము. కనుక అజ్ఞాన మనబడును. అజ్ఞానము కూడ జ్ఞానముచే చేయబడి యున్నను, జ్ఞానము కన్న వేరుగా నున్నది. మంచుగడ్డ నీటితో తయారయినను నీటికన్న భిన్నముగ నీటిపైననే తేలుచున్నది. పత్తికన్న భిన్నముగ, పత్తితో చేయబడిన వస్త్రము వాడబడుచున్నది. లోక వ్యవహారమునకు, వినియోగమునకు అజ్ఞానము తప్పనిసరియై సేవింపబడుచున్నది.

అజ్ఞానముతో కప్పబడి మాత్రమే జ్ఞానము లభించును. కనుక జీవు లందరును అజ్ఞానముచే మోహ పడుచుందురు. ఒక వస్తువు యొక్క పేరుతో మోహపడనిచో ఆ వస్తువును గూర్చి వ్యవహరించుట యెట్లు? భర్త అను సంబంధముతో మోహపడనిచో నొకరిని భర్తగా భావించుట, సంసారము చేయుట యెట్లు? చేయకుండ నుండలేరు. చేయించుట ప్రకృతి యిష్టముగాని, చేయుట, చేయకుండుట జీవి యిష్టము కాదు. నాటకమునకో, సినిమాకో వెళ్ళినపుడు అచట తెరపైననో, రంగస్థలము పైననో పాత్రధారులు మాత్రమే మెలగుచున్నను, పాత్రలు మెలగుచున్నట్లు మోహపడి, సామాజికుడు రసానంద మనుభవించుచున్నాడు. మొదట తెలిసియే, మోహపడుట కిష్టపడియే వెళ్ళు చున్నాడు. మోహపడనిచో రసానందము లేదు. అట్లే జీవులు పరిసరము లందున్న నామ రూపాత్మకమైన అజ్ఞానము లోపల నిమిడియున్న జ్ఞానము నెడల మోహపడుట వలననే సృష్టి జరుగుచున్నది. వడ్లగింజల రూపమున మాత్రమే బియ్యము లభించును. బుద్ధిమంతుడు దంచి పొట్టును తొలగించి బియ్యమును వాడుకొనును. అంతేకాని పొట్టు లేకుండా బియ్యము లభించుట యెట్లు అని చింతపడడు. అట్లే జ్ఞానికూడ అజ్ఞానమును తొలగించుకొని సృష్టిలో నంతర్లీనమైయున్న జ్ఞానము ననుభవించుట నేర్చుకొనును గాని అజ్ఞానమును చూచి చింతపడడు. సామాన్య జీవులు మోహపడి సంసారము ననుభవించుచు, సుఖదుఃఖములతో జీవితము నడుపుకొనుచున్నారు. జ్ఞాని

అట్లుకాక అజ్ఞానమును పరిహరించి, జ్ఞానము ననుభవించుచున్నాడు. నామము, రూపము, పరిమాణము, పరిణామము, వినియోగము, మనకు వానితో గల సంబంధము అను నంశములు అజ్ఞాన భాగములు. వీనియం దిమిడి యున్నది తానే. తా ననగా ఆత్మ. నిరంతరము ఆత్మయందు మనస్సు నిలుపుట నభ్యసించుట వలన అజ్ఞానము కరగిపోవును. తెరపైన సినిమా చూచుచున్నప్పుడు మన దృష్టినుండి తెర తొలగిపోవును. సినిమా మిగిలి పోవును. అట్లే ఆత్మయందు ధ్యానము నిలిచినపుడు అజ్ఞానము కరగిపోవును. ఆత్మ అన్నిటి యందున్నదని మరువరాదు. మన శరీరము లోపల, హృదయమునందు మాత్రమే యున్నదని భ్రమ పడరాదు. (16)

ఈ విధముగా నెవరి దృష్టిలో ఆత్మధ్యానము నిలుచునో వారు జ్ఞాన స్వరూపులు. వారివలన అజ్ఞానము తొలగును. సూర్యుడు తూర్పున నుదయించి చీకటిని పోగొట్టినట్లు వారియం దాత్మజ్ఞాన ముదయించి అజ్ఞానమును మాయము చేయును. నిజమైన జ్ఞానము తత్ + పరము. అనగా 'అది' అను శబ్దమునకు అవ్వల యుండును. అది యని నిర్దేశించి చెప్పునట్టి పదముల యందు గాని, అభిప్రాయములయందు గాని యుండక, దాని కతీతమై లోపల, వెలుపల యుండును. కుండలో మట్టి యుండదు. కుండయను పదమున కవ్వల, కుండ ఆకారమునకు ఆవల, యీవల యున్నది మట్టి. ఉంగరమున పదమునకు చిక్కుపడక అందున్నది బంగారము. అట్లే జ్ఞానమన్నది సృష్టి యందు తత్పరము. దీనిని తెలియుటయే తాత్పర్యమను పదమునకు నిజమైన యర్థము. కేవల స్థితిలో జీవితమును నడపుట కైవల్య మనబడును. ఇట్టివానికి ఆత్మజ్ఞానము నందు నామరూపాదికములైన వస్తువులు వచ్చుచు పోవు చుండును. మిగిలినవారికి నామ రూపాదికములే ముఖ్యములై, వానియందు ఆత్మజ్ఞానము బిగించబడి దాగియుండును.

ఆత్మజ్ఞానము కలవారి బుద్ధి అభ్యాసవశమున దానియందే వర్తించును, కుదురును. ప్రతి పనియందును (భోజనాదికములందు కూడ) పొందదగినది పొందబడునది అదియే యని తెలిసి, ఆ మార్పులలో చరించకుండ నిలిచి వర్తించును. జీవితమే 'అది' యగును. దీనినుండి వెనుదిరిగిరాని స్థితి

యేర్పడును. దీనినే అపునరావర్త పదమందురు. ఇది కలవారు తమ జ్ఞానముచే సకల కల్మషములను ఎగురగొట్టుచున్నారు. (17)

అట్టివారు ఎవరిని చూచినను ఆత్మనే చూడగలరు. వారికి మంచియే యుండును గాని, మంచి చెడ్డలు, వానిని గూర్చిన నిర్వచనములు, విచక్షణ జ్ఞానము అనబడు నజ్ఞానము, కర్మబంధము, దానిలో రకములు, వానిని తొలగించుకొను నిబంధనల రూపమైన అజ్ఞానము నుండవు. వారికి కలిగినదే సరియైన సమదర్శనము. వారినే పండితు లనవలెను. విద్యావంతులను, వినయ సంపన్నులను చూచినపుడు వారికి ఆత్మయే కనిపించును గాని విద్య, వినయము అను నజ్ఞానము కనిపించదు. బ్రాహ్మణుని చూచినపుడు బ్రాహ్మణత్వము కనుపించదు. గోవును, ఏనుగును చూచినపుడు అందలి జ్ఞానము గోచరించి దానియందు గోవు, ఏనుగు అను సృష్టి లీలలు సినిమావలె గోచరించును. కుక్కను చూచినపుడు నీచజంతువు అనిపించదు. (అందలి నీచత్వము చూచువానికి సంబంధించినది). కుక్కను చంపి తినువాడు కనిపించినపుడు కూడ ఆత్మయే గోచరించును. లేనిచో ప్రశస్త వస్తువుల భోగము కలిగినపుడు అందు దేవుని యస్తిత్వము గోచరించి, మనకు యిష్టము లేని వస్తువులు కనిపించినపుడు అందు దేవుడు లేడనిపించినచో దేవునకు బదులుగా రాగద్వేషములే ఆరాధించుచుండు గతి పట్టును గదా! ఈ దుర్గతినుండి అతీతస్థితి పొందిన ఆత్మజ్ఞానులే పండితులనుటకు తగినవారు. (18)

**బ్రహ్మవేత్త :**

మనస్సు సామాన్యస్థితికి వచ్చుట యోగమునకు నిదర్శనము. చెరువులో నీరు కదలకున్నప్పుడు నీరు కనిపించదు. ఆకాశము, నక్షత్రాదులు ప్రతిబింబించును. పగలు వెలుతురు ప్రతిబింబించును. అట్లే మనస్సు సామ్య స్థితియం దున్నప్పుడు మనస్సుండదు. మన ముందుము. భావములు కదలు చున్నప్పుడు చెరువులోని అలలవలె నొకదాని వెంట నొకటి వచ్చుచుండును. అప్పుడు చెరువుయొక్క స్వతంత్రమైన అస్తిత్వము వేరుగా గోచరించును. అట్లే అభిప్రాయము లున్నప్పుడు మనస్సు యొక్క అస్తిత్వము వేరుగా గోచ రించును. అలలు చెరువు కాదు. అట్లే అభిప్రాయములు మనస్సు కాదు. అయినను మనస్సు యొక్క ప్రత్యేకత అభిప్రాయ మున్నపుడు గాని యుండదు.

అభిప్రాయము వలన సుఖ దుఃఖములు, రాగద్వేషములు కలుగు చుండును. యోగమార్గమున మనస్సు యొక్క సామ్యము సిద్ధించినపుడు సర్వము ఒకే వస్తువుగ తెలియును. దీనినే బ్రహ్మమందురు. అది యున్నపుడు మనయందు మనముండము గనుక మన దోషములు కూడ నుండవు. అది నిర్దోష స్థితి. దానిని సాధించినవారు నిరంతరము బ్రహ్మమునందే యుందురు. కనుక వారికి సుఖ దుఃఖము లుండవు. బాహ్య వస్తువులను గమనింపకుండుట వలన ఇది సిద్ధింపదు. బాహ్యవస్తువులను బ్రహ్మముగ గమనించుట వలన సిద్ధించును. కన్నులు మూసికొన్నచో యోగము సిద్ధింపదు. సర్వమునందును బ్రహ్మము ననుభవించునపుడు మనసు సామ్యమున నిలచును. అట్టి మనసు కలవారే స్వర్గమును కూడ జయించినవారు. స్వర్గమనగా మంచి జీవితమునందు కుతూహలము. **(19)**

"నాకు మోక్షము కావలెను, నాకు దేవుడు ప్రత్యక్షము కావలెను, నా కన్నిటియందు పరబ్రహ్మము సిద్ధింపవలెను'' అని కోరుట వలన కోరిక సిద్ధించును గాని దేవుడు సిద్ధింపడు. కోరిక దుఃఖమునకు కారణము. ఉత్తమ జీవితమైన స్వర్గము కావలెనను కోరికకు కూడ తావులేకుండ సర్వాంతర్యామి భావన సిద్ధింపవలెను. ఆనందము పొందగలవానికి ఆనందము మీద కోరిక స్మరణకు రాదు. ఈ కోరికయే స్వర్గము గనుక సామ్యస్థితిని పొందినవారు స్వర్గమును కూడ జయించినవారు.

ప్రియమైనది లభించినపుడు సంతోషపడుట, అప్రియము సంభవించి నపుడు ఉద్వేగపడుట సామ్యస్థితి కాదు. సాధనలో స్వప్నాదికములైన సాక్షాత్కార ములు లభించుట, యజ్ఞయాగాది క్రతువులు చేయగలుగుట, పుణ్యక్షేత్రము లను, మహానుభావులను, గురువులను దర్శింప గలుగుట వలన కొందరు సంతోషపడుచు, తాము సుఖదుఃఖములను జయించితి మనుకొనుచున్నారు. వారే అట్టివి దర్శింప లేనప్పుడు ఆశాభంగము కలిగి దుఃఖపడుచున్నారు. ఈ దుఃఖమును ఆర్తియని పిలుచుచున్నారు. ఇక వారికి సుఖదుఃఖములను జయింపగలుగుట యెక్కడ? ప్రియములు, అప్రియములు అను భేదము పోలేదు. ఇక సమదర్శన మెక్కడ? బుద్ధిమంతుడు ఈ మర్మమును సూక్ష్మముగ గ్రహింపవలెను. సంతోషము, ఉద్వేగము పొందనివాడే స్థిరత్వము చెందినవాడు.

వాని మనస్సు మాయమై బుద్ధిగా నుద్ధరింపబడును. అతడే స్థిరబుద్ధుడు. అతడు పరిసర సన్నివేశములకు సమ్మోహపడడు. ఈ స్థిరత్వమే 'తాను' లేక బ్రహ్మము. తాను అను తెరపై మిగిలిన అస్థిరములు మంచివిగ, చెడ్డవిగ, వచ్చుచు పోవుచుండును. వానియందు అనుభవము చిక్కనివాడు బ్రహ్మము నందున్నవాడు. (20)

## అక్షయ సుఖము :

ఆనంద మెప్పుడును బాహ్య స్పర్శలయందు చిక్కదు. ఆ స్పర్శలు పవిత్ర దేవాలయాదులైనను చిక్కదు. స్థిరత్వము చిక్కుటకు ముందు చెడ్డ పనులలోనికి మనస్సును పోనీయకుండుటయే దేవాలయాదుల, యజ్ఞ యాగాదుల ప్రయోజనము. ఆనందము నిచ్చు కారణములు మాత్రము అవి కావు. ఆనంద మనగా 'తానే' కనుక మిగిలిన వానియందు లభింపదు. ఆనందముకన్న మిగిలిన వేవియు విలువైనవి కావు కనుక అవి యానందమును కొనిపెట్టజాలవు. దేనివలన సుఖము లభించును? అను ప్రశ్న ఉన్నంతవరకు సుఖము లభింపదు. సుఖపడుట యన్నది తనయందు పుట్టి వికాస మంద వలెను. దీపమువలె అది మిగిలినవానిపైకి తన కాంతిని ప్రసరింపచేయును. కనుక మిగిలినవి దానిని కలిగింపలేవు. గదిలో ఎన్ని వస్తువు లున్నను దీప మెక్కడ నున్నదో తెలియజేయగలవా? దీపము పెట్టిన వెనుక అవియన్నియు వెలుగును. అట్లే తనయందు ఆనందము అనుభవించుట తెలిసినవానికి సమస్త ప్రపంచము ఆనందమయ మగును. ఎవ్వడీ యాత్మానందము వెలిగించు కొనునో అతడు బ్రహ్మ యోగమందు ఉన్నవాడు. సుఖమునకు వేరు కారణ మక్కరలేదు. కనుక, అతనికే తరుగని సుఖము అనుభవ మగును. (21)

పరిసరములలో నున్న దేనివలన కలిగిన సుఖమైనను సుఖమునకు ప్రతిబింబము మాత్రమే. అది సుఖమును జ్ఞప్తి చేసికొనుట యగును గాని, అనుభవించుట కాదు. చక్కెర తినుటను జ్ఞప్తి చేసుకొన్నచో నొక యభిప్రాయ మగును గాని, అనుభవము కాదు. దీపమునుండి గదిలోని వస్తువులపై ప్రసరించు కాంతి ఆ వస్తువులను కనుపింపజేయును. ఆ వస్తువులపై నున్నది ప్రతిబింబ కాంతిగాని, దీపకాంతి కాదు. ఈ కాంతి వస్తువులపై నాధారపడి

యుండును గాని, వెలిగించు వెలుగుపై నాధారపడి యుండదు. వస్తువును తొలగించినను, స్థలము మారినను కనిపించు దృశ్యము మారును. వెలుగట్లు మారదు. ఎచ్చటికి కొనిపోయిన నచ్చటనే వెలుగును. అట్లే యిల్లు, వాకిలి, డబ్బు, చుట్టరికములు మున్నగునవి పరిస్థితులనుబట్టి సుఖమో, దుఃఖమో కలిగించును. వానిని గమనించుచున్న 'తాను' సుఖమునుగాని, దుఃఖమును గాని కలిగించదు. తా నెచ్చట నున్న నచ్చట నుండియే చుట్టుప్రక్కలకు వెలుగుచుండును. ఇది తెలిసి తనయందు తానుండ గలిగిన వానికి ఏ వస్తువుల నడుమ నున్నను తరుగని సుఖము అనుభవ మగుచుండును. పరిసరముల నుండి మనపై ప్రభావము చూపు వస్తువులు మన వెలుగుతోనే చూడబడు చుండును. వానిని చూచుట జరుగుచున్నట్లు కనిపించునుగాని, పరిసర వస్తువులు, వ్యక్తులు, యింద్రియముల ద్వారమున గమనింపబడును. ఈ గమనికకు తానను వెలుగే కారణము. అది లోపల నుండి వెలుగుచుండగా వస్తువులు, వ్యక్తులు వెలుపల నుండి కనుపించునట్లు తోచును.

ఇక వ్యక్తులతో గల సంబంధములు మనస్సున పుట్టును. అవికూడ అంతకు ముందు ఇంద్రియముల ద్వారమున పొందిన ఆకారాదుల ఛాయా చిత్రములే, మనస్సున కంటింపబడును. దీనినే స్మరణ యందురు. ఇతరులతో గల చుట్టరికములు, పెరిగిన ఆకారాదుల స్మరణపై నాధారపడి గోడమీద బూజువలె వ్రేలాడుచున్నవి గాని గోడలోని భాగములు కావు. కనుక నివియన్నియు సంస్పర్శ (Contact) వలన కలిగినవి. మన కుడి చేతితో ఎడమ చేతిని గిచ్చినచో నొప్పి కలుగుచున్నది. ఆ నొప్పి స్మరణ యెట్టిదో ఇతరులతో గల సంబంధములును అట్టివే. నొప్పి మనలో పుట్టినది కాదు గదా! అట్లే సంబంధములును మనసుపై పడినవేగాని మనసులో పుట్టినవి కావు. ఇట్టి బాహ్యస్పర్శల యందు కలిగిన భోగము లేవియైనను దుఃఖమునకే కారణము లగును. అభ్యాసముచేత సుఖమనుకొన్నను పరిణామముచేత దుఃఖమునే కలిగించును. 'ఇతడు నా మిత్రుడు' అనుకొన్నప్పుడు సుఖము కలుగవచ్చును. అతడు మన కిష్టము లేని పని చేసినపుడు "నా మిత్రు డిట్లు ద్రోహము చేయునా?" అను నభిప్రాయము మూలమున దుఃఖమునే కలిగించును. మరియు వీనికి ప్రారంభము, అంతము ఉండును. ఆది, అంతము లేని 'తాను' వానియందు విహరింపకుండుట తెలివిగలవాని లక్షణము. (22)

## బ్రహ్మ నిర్వాణము :

మోక్షము పేర మరణముకై ఎదురు చూచువాడును, ఈ లోపున చేయ వలసిన పనులను వైరాగ్యముపేర మానువాడును, బాధ్యతలను దులుపుకొని తిరుగువాడును యోగులు కాలేరు. కామక్రోధములు శరీరము నందున్న కాలముననే ఆవేగోద్వేగములను పుట్టించును. ఈ యుద్వేగములు వాసనా బలమున శరీరము విడచిన వెనుకగూడ జీవుని బాధించును. తరువాత జన్మలో గూడ సంస్కారముల రూపమున వెంటాడును. వీనిని శమింపజేయుట, యివి యంటని స్థితిలో నుండగలుగుట మాత్రమే సుఖానుభూతి కలిగించును గాని, వీనిని తప్పించుకొన జూచుట వలన మరల దుఃఖమే కలుగును. కామక్రోధము లను ఉపశమనము చెందించుకొను సాధన శరీరము నందుండగనే జరుగవలెను గాని శరీరము విడచిన వెనుక సాధ్యపడదు. ఈ సాధనకు కావలసిన యుప కరణములే శరీరము, మనస్సు, ఇంద్రియములును. వీని సముదాయము ఒక చక్కని యంత్రము. ఈ యంత్రమును నిర్వహణ చేయుటకు తగిన నేర్పరితనము లేకపోవుటచే బంధన మేర్పడును గాని ఈ యంత్రమే బంధనము కాదు.

ఏ యంత్రమునైనను సద్వినియోగము చేయుటకు సాంకేతికమైన విద్యలో క్రమశిక్షణము పొందవలెను. అట్లే మన దేహయంత్రము విషయము నందును. దీనికి కావలసిన నేర్పరితనమే యోగాభ్యాసము. యోగాభ్యాస మనగా కొన్ని సాధనల మొత్తము మాత్రమే కాదు. ఆ సాధనల పరమార్థము గుర్తుండుటయు, దాని కనుగుణముగా సాధనలు చేయుటయు నిజమైన యోగాభ్యాసము. నిరంతర సుఖానుభూతియైన యోగజీవితము పరమావధి గాని, యోగాభ్యాసము పరమావధి కాదు. ఈ దేహ మను యంత్రమే మోక్ష ధర్మసాధనము. *'శరీర మాద్యంఖలు ధర్మసాధనమ్'* అని పెద్దల యుపదేశము. జననము మొదలు మరణము వరకు గల ఈ శరీర మందలి జీవితము క్రమశిక్షణకై యొక విద్యాలయము నందు ప్రవేశించి చదువుట వంటిది. జీవితమున సంభవించు సన్నివేశములు, విద్యార్థి హాజరు కావలసిన పరీక్షలు, వాని ఫలితముల వంటివి. జీవితమున సమస్యలు తాను తెచ్చుకొన్నవి. కామము చేతను, క్రోధముచేతను ప్రేరితమైన మనస్సు, వాక్కాయ కర్మల రూపము

ధరించినపుడు సమస్యలు పుట్టుచుండును. కామక్రోధము లంటక నిలబడి నపుడు పరిష్కారమునకు కావలసిన సాధన సంపత్తి సమకూర్చుకొనుట జరుగు చుండును. విద్యార్థి పరీక్షలలో నుత్తీర్ణుడగుట గాని, తప్పుటగాని విద్యాలయము నందలి క్రమశిక్షణ యెడల అతడు అవలంబించు విధానము ననుసరించి యుండును. అట్లే మోక్షము సిద్ధించుట, బంధము కలుగుట అనునవి శరీరము నందు జీవించుచున్నప్పుడు మన మవలంబించు విధానము ననుసరించి యుండును గాని శరీరము విడచిన తరువాత కాదు. కనుక, నెవనిచే కామ క్రోధములు, వాని వేగములు, దేహము నందుండగనే జయింపబడునో అతడే సుఖపడువాడు. ఈ జయించుట ఎట్లు సాధ్యపడును? ఇతరుల కామ క్రోధములు, వాని యుద్వేగములు తనమీద పనిచేయనపుడు సాధ్యపడును. ఇతరు లేమనుకొనుచున్నారు? ఏమి చేయుచున్నారు? తన విషయమున వా రేవిధములైన అన్యాయములతో ప్రవర్తించుచున్నారు? ఇతరులలో ఎవరు జ్ఞానులు? ఎవరు అజ్ఞానులు? మున్నగు ప్రసంగములు ఎవని మనస్సున అంటవో వానికి కామక్రోధము లంటవు. ఈ సాధన యితరులతో కలిసి మెలసి యున్నప్పుడే జరుగును గాని దూరముగా నున్నప్పుడు జరుగదు. భార్య, బిడ్డలు, బంధువులు, మిత్రులు, శత్రువులు మన యెడల నెట్టి భావములు కలిగియున్నారో గమనించుకొనుచు ప్రతిక్రియ చేయుటకు యత్నించుచున్నచో, జీవి కామక్రోధములలో బద్ధుడై చనిపోవును. తన కర్తవ్యము మాత్రమే దృష్టి పథమున నుండి, దాని ననుసరించి ప్రవర్తించుటకు మాత్రమే యత్నించినచో మనస్సు కామక్రోధముల నుండి విమోచనము చెందును. జీవించి యుండగా దీనిని సాధించి అనుభవించువాడే మోక్షము పొందినవాడు. అతడే యోగి. అతడే సుఖపడును. (23)

సుఖము మన మనుభవించునది గాని పరిసరములు సమకూర్చి పెట్టునది గాదు. ఒక భవనమున పందిరి పట్టె మంచములు, సోఫాలు, సుగంధ ద్రవ్యములు, పంకాలు, రంగు రంగుల దీపములు, రేడియో, రుచికరములైన అన్నపానీయములు యథావిధిగా నమర్చి భవనము తాళము పెట్టి యీవలకు వచ్చి చూడుము. ఇప్పుడా భవనమున సుఖ మనుభవింపబడుచున్నదా? భవనమునకు గాని అందలి పరికరములకు గాని సుఖ మున్నదా? భవనమున నెవడైన నున్నచో వాడు సుఖపడునుగాని, భవనము సుఖపడదు. అట్లే సుఖ

పడవలసిన వారము మనము గాని, మన పరిసర పరిస్థితులు కావు. పరిస్థితులు చక్కగా నున్నచో సుఖ ముండునని యనిపించును. చక్కబరచుకొనవలసిన వారము మనము గాని పరిస్థితులు బాగుండుట యుండదు. 'నాకు పరిస్థితులు బాగుండలేదు' అని కొంద రనుచుందురు. దీని కర్థము 'నేను పరిస్థితులను బాగుండునట్లు చేసికొనలేదు' అనియేగాని వేరుకాదు. 'నా కవకాశము లభించుట లేదు' అని కొందరందురు. దీని కర్థము 'నే నవకాశము లభింప జేసికొనుట లేదు' అనియే గాని వేరు కాదు. సుఖము అనునది అనుభవించు వాని యనుభవమే గాని తదితరము గాదు. సుఖపడుటకు మార్గము సుఖముగా నుండుటయేగాని వేరు కాదు. సంతోషపడుటకు మార్గము సంతోషించుటయే గాని సంతోషము పొందుట గాదు. ఈ విధముగా గమనింప గలిగినవాడు తనయందు తాను సుఖ స్వరూపుడై నిశ్చలత్వమునంది తన మనస్సును, ఇంద్రియములను, శరీరమును వెలిగించును. తన యునికిచే పరిసర వ్యక్తులను సుఖవంతులను, శాంతిమంతులను చేయును. అతడు తనలో తాను వేడుక పడుచు, సుఖపడుచు, ఆనందపడుచుండును, తానొక జ్యోతిగా వెలు గొందును. **(24)**

యోగి ఈ విధమైన సాధనచేసి యీ తన వెలుగునందు కలిసి నిలచును. అటుపైన తానుండక వెలుగుండును. అనగా మనస్సు, ఇంద్రియములు, దేహ ప్రవృత్తుల ప్రజ్ఞ తనయందు నిర్వాణము చెందును. తానను భావము ఈ వెలుగునందు నిర్వాణము చెందును, తాను బ్రహ్మమగును. ఋషులందరు ఈ మార్గమున కల్మషమును అంతరింపజేసికొని బ్రహ్మ నిర్వాణమును పొందు చున్నారు. అట్టి వారికి తమ లోపలి లోకము, వెలుపలి లోకము అని రెండుండవు. ఒకే లోకముండును. అదియే పరబ్రహ్మము అను వెలుగు లోకము. వారి జీవిత మునకు నియమ ప్రవర్తనము సహజము. దానికి ప్రయత్న మక్కర లేదు. సర్వ జీవుల మేలుకొరకై ప్రవర్తించుట వారికి సహజగుణ మగును. అంతేకాని బాహ్య ప్రపంచమున వర్తించుట మాని కన్నులు మూసికొనరు. **(25)**

**విదితాత్ముడు :**

విదితాత్ముడు అనగా ఆత్మయన నేమో తెలిసినవాడు. ఆత్మయనగా తాను. ప్రతి వ్యక్తి యందును తన అస్తిత్వములోని పొరలన్నియు తనతోనే

చేయబడి యుండును. ఈ పొరలలో దేనిని తానను కొన్నను అట్టివాడు తెలిసినవాడు కాదు. అతడు ఆ పొర యందు మాత్రమే జీవితము గడుపును. మిగిలిన వానియందు నిద్రించుచుండును. అనగా వానికి మిగిలినవి లేవు. ఇద్దరు వ్యక్తులు ఒకే విషయమును గూర్చి ఏకాగ్రతతో చర్చించుకొను చున్నప్పుడు ఆ విషయము నందు మాత్రమే మేల్కొని యుందురు. అంత సేపును మిగిలిన విషయములు వారి యస్తిత్వమున నుండవు. తాము కూర్చున్న ఇల్లు, అందలి వివిధ వస్తువులు, ధరించిన వస్త్రముల రంగులు మొదలగు వివరములు మున్నగునవి ఏవియు వారి దృష్టియందుండవు. అట్లే వారునేర్చిన ఇతర విద్యలు, వివిధాంశములు, విజ్ఞాన విషయములు, వినోద విషయములును అస్తిత్వము నందుండవు. చర్చించుచున్న అంశము విడచి మరియొక అంశమును గూర్చి చర్చింప నారంభించినపుడు అంతకు ముందు చర్చించిన విషయము వారి యస్తిత్వము నుండి జారిపోవును. కాని ఎప్పుడు దేనియందు మెలకువ వర్తించుచుండునో అప్పుడు గల భావమును ఆ వ్యక్తి తానని నమ్మును, నేనని వ్యవహరించును.

కనుక నిట్టి నేనులు కొన్ని లక్షలు ప్రతి వ్యక్తి యందును దాగియుండును. దేనిని స్మరించినపుడు ఆ నేను సముద్ర కెరటమువలె పైకి లేచుచుండును. సాధన లేనివాడు నేనను పదము వాడినప్పుడెల్ల అతడు వర్తించుచున్న కెరట మని యర్థమేగాని నిజమైన తాను కాదు. తాను సముద్రము వంటివాడు. లక్షల నేనులు కెరటముల వంటివి. వానిలో దేనియం దేకాగ్రత వహించునో దానియందు చిక్కుకొని, దాని కదలికలచే సతమత మగుచుండును. క్రమ బద్ధమైన జీవిత సాధన నెరిగినవాడు వానియందు చిక్కుకొనక అన్నిటికిని మూలమైన తానుగా మేల్కాంచగలిగి యుండును. తనయందు లేచుచు పడుచున్న అలలను గమనించ గలుగును. వానియందు చిక్కుకొనడు. సముద్రము అలల యందు చిక్కుకొనుట లేదు గదా! ఈ స్థితి పొందిన వానిని విదితాత్ముడు అని శ్రీకృష్ణుడు చెప్పెను. కొండశిఖరమున నిలబడి చూచువానికి దిగువ గ్రామమంతయు నొకేమారు కనిపించునట్లు విదితాత్ము నకు తనలోని సర్వభావములే కాక పరిసరములు సమస్తము అఖండముగా కనిపించును. కనుక అతనిపై వాతావరణము పనిచేయదు. పరిసర వ్యక్తులును,

సన్నివేశములును అద్దమునందువలె ప్రతిబింబించునే గాని అతడిపై ప్రభావము చూపవు. అతని ప్రభావమే పరిసరముల యందు పనిచేయు చుండును. అతడు కామక్రోధముల ప్రభావము కూడ లేనివాడు. ఒకటి కావలెనని యొకటి వలదని యుండదు. సంభవించుచున్న వానిని కోరుట గాని, తప్పించుకొన యత్నించుట గాని చేయక ఆనందించు చుండును. ఆడుకొనుచున్న పిల్లవానికి పరిసర ప్రాంతములెట్లో అట్లే విదితాత్మునకును.

ప్రయాణీకులను గమ్యమునకు గొనిపోవుచున్న రైలుబండిని నడుపు డ్రైవరునకు బండిలోని ప్రయాణీకుల పేర్లు మున్నగు వివరములు తెలియుటతో నిమిత్తము లేదు. వారిని గమ్యస్థానమును చేర్చుటకు పేర్లు తెలియకపోవుట అడ్డురాదు. అట్లే విదితాత్మునకు ఇంద్రియార్థములు ప్రత్యేకముగ ప్రభావము చూపవు. చూడదలచినది కనిపించునే కాని కంటికి ఎదుట నున్నది కనిపించదు. వినవలసినది వినునే కాని, చుట్టును జరుగుచున్న శబ్దము వినబడదు. తిన వలసిన దానిని తినునే గాని రుచితోడి పరిచయము వాని నాకర్షింపదు. ఈ స్థితినే ఇంద్రియ నిగ్రహమందురు. పరిసరములను చూడకుండుటకు యత్నించుట ఇంద్రియ నిగ్రహము కాదు. యత్నించునపుడు వానినే స్మరించును గదా! విదితాత్మునకు మాత్రము ఇంద్రియ నిగ్రహము అప్రయత్న ముగా సిద్ధించును. కనుక నతడు యతి యనబడును. మనోనిగ్రహము గూడ నప్రయత్నముగనే సిద్ధించును. ఒక యభిప్రాయము మనస్సునకు రాకుండ యత్నించుట కాక, అప్రయత్నముగా మనస్సునకు రాకుండుటయే జరుగును. భూకంపమో, పెనుతుఫానో వచ్చినపు డిద్దరు పరస్పర విరోధముకల వ్యక్తులు పారిపోవుచున్న దృశ్యమును భావింపుడు. ఆ స్థితిలో వారికి పరస్పర విరోధము గుర్తుండునా? అప్రధాన మగుటవలన గమనిక నుండి యది జారి పోవును. అట్లే విదితాత్మునకు రెండు భావముల సంఘర్షణ యుండదు, కనుక నతడు యతచేతస్సు కలవాడు. ఈ స్థితి సిద్ధించినవాని ప్రజ్ఞయే నిజమైన తాను. దానినే ఆత్మ యనియు, బ్రహ్మజ్ఞాన మనియు నందురు. దానియందు మిగిలిన భావము లన్నియు నిర్వాణము చెందును. అనగా కరగియుండును. ప్రత్యేకమైన అస్తిత్వము లేక యుండును. ఈ బ్రహ్మ నిర్వాణస్థితి అతని

కభిముఖముగానే యుండును. అనగా సాధింపబడునొక వస్తువువలె గాక, అభిముఖమైన సహజస్థితిగనే యుండును. (27)

## ఈశ్వర ప్రణిధానము :

ఈ స్థితి కలుగుటకు చేయవలసిన సాధన ఎట్టిది? మొదట భ్రూమధ్యము నందు దృష్టిని నిలుపవలెను. దానితో మనస్సు ఊర్ధ్వముఖము పట్టును. లోనున్న తనను జ్ఞప్తి చేసికొనుట వలన పరిసర వస్తువుల అస్తిత్వము మనస్సు నుండి తొలగిపోవును. లోనున్న తనను స్మరించుట ఎట్లు? తన ఉచ్ఛ్వాస నిశ్వాసము లను గమనించుటతో నారంభింపవలెను. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఎట్లు జరుగు చున్నవి? నేను చేయుచుంటినా, అవి జరుగుచున్నవా, నాచే చేయించుచున్నవా? అని ప్రశ్నించుకొనుచుండవలెను. అప్పుడు రెండు శక్తులు మనస్సునకు గోచర మగును. అందొక శక్తి వలన శ్వాస పీల్చుట, రెండవ శక్తివలన శ్వాస విడచుట జరుగుచున్నది. ఆ రెండు శక్తులే వరుసగా ప్రాణాపానములు. వీని అస్తిత్వ మును గమనించుకొని మెల్లగా వానిని సమానములుగా చేయవలెను. అనగా నెగుడు దిగుడు లేక సమవేగమున ప్రశాంతముగ, సుదీర్ఘముగ శ్వాసను పీల్చుట, విడచుట చేయుచు స్మరించు చుండవలెను. ఇట్లు చేయుచుండగా కాలక్రమమున ఈ రెండు శక్తులకును సామ్యము సిద్ధించును. అఖండమైన యొకే శక్తి ఈ రెండు పనులు చేయుట జరుగును.

అటుపైన మనస్సునకు శ్వాసతో సామ్యము సిద్ధించును. అనగా ప్రాణశక్తియు, మనస్సును ఒక దానిలో నొకటి లీనమై నిలబడును. ఇట్లు నిలబడినంతసేపును శ్వాస జరుగదు. అయినను తాను జీవించియే యుండును. మనస్సు లేక తానుండుట సిద్ధించును. ఇంద్రియములు, మనస్సు, బుద్ధి అను ప్రవర్తనలు తనయందు నియతము లగును. అనగా లయమందుటచే నియమింపబడి యుండును. ఆ స్థితిలో సాధకుడు ముని యనబడును. అతని ప్రజ్ఞ మౌనమున నుండును. ప్రవర్తన లన్నియు కరగి పోయినవి గనుక అప్పుడున్న స్థితి మోక్షమునకు దారితీయును. మోక్షమనగా ప్రవర్తనలో చిక్కక మేల్కొనియుండు స్థితి. దీని నభ్యసించినవానికి ఒకదానియం దిచ్ఛ, దేనికైన భయపడుట, నెవరిపైనగాని క్రోధము కలుగుట

యుండదు. దీని ననుదినము అభ్యసించినచో నిరంతరత్వ మేర్పడును. అనగా అభ్యసించు చున్నపుడే గాక తదితర కాలములలో కూడ నిలబడును. వానికి తానే గాని తదితర ముండదు. ఈ స్థితిలోనే ఉండిపోవుట, లోక కర్తవ్యము లన్నియు జరుగుచునే యుండుట కూడ సిద్ధించును. అప్పు డతడు ముక్తు డనబడును. ఎవరితో వ్యవహరించినను, దేనిని గమనించినను అతడు దర్శించునది తననే! ఆ తా నెట్టివాడు? తాను చేయు సమస్త పుణ్య కర్మలకును భోక్త (అనుభవించువాడు). సత్కర్మ లితరుల మేలుకొరకై చేయబడును. ఆ ఇతరులలో కనిపించువాడు తాను గనుక తన యజ్ఞార్థ కర్మలకు భోక్త తానే. తాను చేయు తపస్సునకు కూడ భోక్త తానే. దేనియందైన వహింపబడిన శ్రద్ధను తపస్సు అందురు. శ్రద్ధ తనయొక్క ప్రజ్ఞయే గావున దేనియందు శ్రద్ధ వహించునో అది కూడ తానే. కనుక తన యజ్ఞమునకు, తపస్సునకు భోక్త అందరిలో నున్న తానే. **(28)**

మనస్సునకు, సంభాషణకు, పనులకు సంబంధించి తపస్సు మూడు విధములుగా వ్యక్తమగును. మంచి సంకల్పము చేయుటలో తానే సంకల్పముగా తనకు విస్ఫారి దర్శన మిచ్చును. సంభాషణ యందు పవిత్రతను గూర్చిన శ్రద్ధ వహించుచున్న కొలదియు తానే తన సంభాషణగా విస్ఫారును. దేహముతో భౌతిక లోకమున నాచరించుచున్న సత్కర్మయందు శ్రద్ధ నభ్యసించుచు తానే తన సత్కర్మగా గోచరించును. కనుక విదితాత్మునకు యజ్ఞ తపస్సుల భోక్తగా తానే దర్శనమిచ్చును. కొన్ని లక్షల 'నేను' లుగా గోచరించు తాను తనకు గోచరించుటయే ఆత్మజ్ఞానము. ప్రతి జీవిలోను కొన్ని లక్షల నేనులు గోచరించు చుండును. వానియందు అంతర్యామిగా నున్న తాను యోగశాస్త్రమున 'ఈశ్వరు' డనబడును. సర్వజీవుల హృదయములలో నీశ్వరుడుండి నడుపుచున్నాడని భగవానుడు చెప్పెను. మిగిలిన నేను లన్నియు నీశ్వరునకు ప్రణిధానము (శరణాగతి) చేయగలుగుట వలన యోగము సిద్ధించునని పతంజలి యుప దేశించెను. ఒక్కొక్క జీవిలో జీవుడుగా నీశ్వరు డుండును. ఇన్ని జీవులలో నున్న ఈశ్వరమూర్తు లొకనియందు తెలిసినపుడు అతడు భూతమహేశ్వరు డని గీతాచార్యుడు సంకేతించెను. విదితాత్మునకు గలుగు స్థితి సర్వలోక మహేశ్వరత్వమే. **(29)**

ఆరవ అధ్యాయము

# ధ్యాన యోగము

## కార్యం కర్మ :

చేయ దగనివి, చేయ దగినవి అని పనులు రెండు విధములు. మనము నిత్యము చేయుచున్న పను లన్నియు నిందేదో యొక తరగతికి చెంది యుండును. ప్రకృతి మనచేత నిత్యము పనులను చేయించు చుండును. మనము జన్మించుటకు మన తల్లితండ్రులకు కామమును ప్రసాదించినది ప్రకృతి. ప్రకృతి చేత ప్రేరేపింపబడి జీవు లాయా కర్మల నాచరించు చుందురు. ఆచరించుటకు గాని, మానుటకు గాని యెవ్వరికిని తరము కాదు. ఇచ్చట నిగ్రహము పనిచేయదు. ఇంద్రియ నిగ్రహము, యోగాభ్యాసము పనిచేయ వలసినది ప్రకృతికి వ్యతిరేకముగా కాదు. అహంకారము యొక్క ప్రేరేపణను శమింపజేయుటకు అవి పనిచేయవలెను.

ప్రకృతి చేయించు పనులలో కార్యములు, అకార్యములు అని యుండవు. అచట నిర్ణయము మన చేతిలోనిది కాదు గనుక, మనము నిర్మించుకొను నీతి, అవినీతి, మతము, ఆచారము, సంప్రదాయము దానిపై పనిచేయవు. కనుకనే ఒక్కొక్కప్పుడు మహా జితేంద్రియులకు కూడ కాలు జారుటయు, రాజకీయ నాయకులు, ప్రభువులు కూడ పొరబాటు చేసి బోల్తా కొట్టుటయు చూచుచున్నాము. జగద్వ్యూహము మొత్తమునందు జరుగవలసిన విధానము ననుసరించి, ప్రాంతీయములైన కార్యసిద్ధి, కార్యభంగములు జరుగుచు, వ్యక్తుల ద్వారా వ్యక్తమగుచుండును. వ్యక్తులు కేవలము ఉపకరణములు గనుక, వారు చేయు పనులకును, సిద్ధించు ఫలితములకును సంబంధము లేదు. వారు చేయు పనులు వారిచే చేయింపబడునవి. ఫలితములు జగద్వ్యూహమునకు సంబంధించినవి.

కాని యీా నడుమ ఈ పనులన్నియు మనచే చేయబడునవి యని గాక, మనము చేయుచున్నామనియు, ఫలితములు మనకు చెందుచున్న వనియు నొక మెర మెర మానవుని మనస్సునకు కలుగును. ఇది యితర జీవులకు గలుగదు. ఈ మెర మెర వలన మానవుల ప్రాథమిక పరిణామ స్థితిలో కొంత మానసిక బాధ కలుగును. అది సుఖ దుఃఖాత్మకము, కామ క్రోధాత్మకము, రాగ ద్వేషాత్మకము అయి యుండును. దీనివలన ఒకరిని గురించి యొకరు తలలు పగులగొట్టుకొను చుందురు. మరింత ప్రాథమిక పరిణామమున ఈ తలలు పగులగొట్టుకొనుట భౌతికముగను, కొన్ని జన్మల యనుభవము తర్వాత వైజ్ఞానికముగను నుండును. అట్టివారు వేయిమందిలో నొక్కడు, "మనము చేయుచున్న విధానములో దోష మున్నది'' యని గ్రహించి, అర్థము చేసికొనుటకు యత్నించును. ఇట్టివారు వేయిమందిలో 999 మంది తమ మనస్సును, ఇంద్రియములను ఈ పరిశోధనకై వినియోగింతురు. కాని ఇంద్రియములు, మనస్సు కామక్రోధములతో కూడి యుండును. కనుక చేసిన పరిశోధనలు తనకు నచ్చిన ప్రణాళికలే యగును గాని పరిష్కార మార్గములు కాజాలవు. మిగిలిన బుద్ధిమంతు డొక్కడును తన మనస్సు, ఇంద్రియములు 'తనవి'యే గాని, 'తాను' కావని గుర్తించును. అతనికి కర్మాచరణము నందు ఒక చక్కని కౌశల మలవడును. అతడే మోక్షమార్గము నందున్నవాడు. అతని దృష్టిలో జగత్కర్మ లన్నియు సత్కర్మలే!

కాని ఏ కర్మము నెవ డెందులకు చేయుచున్నాడో యను దృక్పథము ననుసరించి సకల కర్మలును, సత్కర్మలు, దుష్కర్మలుగా రెండు తరగతులుగా నేర్పడును. కుమారునకు పెండ్లిచేయుట శుభకార్యమే గాని, ఆస్తికోసము మతిలేని పిల్లను చేసినచో అది యకార్య మగుచున్నది. ఏ కర్మ- కష్టములకు, సుఖదుఃఖములకు, రాగద్వేషములకు మనస్సును దారితీయించునో యది యకార్యము. దేని నాచరించుట వలన మనస్సునకు పరిష్కార మార్గము లభించి, మనస్సునకు బదులు మనము పనిచేయుట జరుగునో అది కార్యమైన కర్మ. అనగా చేయదగిన కర్మ. ఈ నిర్ణయము సరియైన దృక్పథము వలన కలుగును గాని కేవల శాస్త్రాధ్యయనము వలన కలుగదు. మనము చేయు అన్ని పనులను గూర్చియు శాస్త్రాదులలో వివరముగా చెప్పబడి యుండుట సాధ్యము కాదు

గదా! ధర్మశాస్త్రము, అర్ధశాస్త్రము మున్నగునవి మార్గదర్శకముగా కొన్నిటిని తెలియజేయునవేగాని, నిత్యము నాచరించుచున్న చిన్న చిన్న పనులను గూర్చి చర్చింపవు. కనుక బుద్ధిమంతుడు తన సంకల్పమును ఫలితములపైకి పోనీయ కుండ చక్కని దృక్పథము నేర్చుకొని, శాస్త్ర మర్మములను గ్రహింపవలెను.

ఇక కర్మఫలముల నాశ్రయింపనిచో కర్మాచరణ మెందులకని కొందరి సందేహము. ఇచట సత్యము గమనించినచో, కర్మఫలములు తన మనస్సునకు సంబంధించినవిగాని, తనకు సంబంధించినవి కావు. చేసిన పనికి ఫలితము లెప్పుడును అనుకొన్నట్లు ఉండవు. ఇక ఫలితములపై దృష్టి పెట్టి లాభమేమి? ఈ పద్ధతిని విరమించి, కార్యమైన కర్మను, అనగా లోక శ్రేయస్సునకు పనికి వచ్చు సత్కర్మను చేయుటారంభింపవలెను. సూర్య చంద్రాదుల వలన, పంచ భూతముల వలన నెట్లు మనకు కావలసినవి సిద్ధించుచున్నవో, అట్లే మన మారంభించు లోక శ్రేయస్కరములైన కర్మల వలన కూడ మనకు కావలసినవి అప్రయత్నముగ సిద్ధించును. ప్రయత్నము తనను గూర్చి యైనచో ఫలితములు వేరుగా నుండును గనుక దుఃఖములు, బాధలు కలుగును.

ఈ విధమైన సత్కర్మాచరణము వలన మొదట మన పరిసరముల కును, తరువాత మనకును శ్రేయస్సు కలుగుచుండును. పంచభూతములు, సూర్యచంద్రాదులు, విద్యుత్తు, మనస్సు, బుద్ధి, ఇంద్రియములు, దేహధాతువు లతో పనిచేయుచున్న ఆహార విహారాదుల పచనాది క్రియలు, రసాయనికము లైన పరస్పర పరిణామములు మున్నగునవి కేవలము శక్తులు కాక, ప్రజ్ఞా మయములై యున్నవి. ఈ ప్రజ్ఞలనే పెద్దలు దేవత లందురు. మనము దేవతల వ్యూహముల నర్థము చేసికొని సత్కర్మాచరణము ప్రారంభించినచో, దేవత లిచ్చు సత్ఫలితములు మనకు కూడ సంక్రమించును. దేవతలు ప్రత్యేకము మనకోసము చేయరు గాని, వారు చేయునది అప్రయత్నముగా మనకు కూడ సంక్రమించును. ఈ విధమైన కర్మాచరణము నలవరచుకొనినవాడు సరియైన యర్థమున సన్న్యాసియు, యోగియు నగుచున్నాడు. అంతేగాని వర్ణాశ్రమ ధర్మములు మానినవాడు, పనులు మానినవాడు మాత్రము కాడు.

ఇట్టి యవగాహనతో చేసిన కర్మాచరణము వలన లోకోపకారము జరుగునని నమ్మరాదు. మనము చేయకపోయినను ప్రకృతి తన సృష్టి కార్యము

లను నిర్వహించుకొనుచునే యుండును. కనుక మన మాచరించిన పనులకు ఫలిత మితరులను ఉద్ధరించుట కాదు. ఒక సత్కర్మ మెవని ద్వారమున జరిగినదో వానికే ధన్యత. అనగా వాని సంస్కారములు బాగుపడి, మనస్సు, ఇంద్రియములు పరిశుద్ధ మగుచుండును. ఇదొక్కటే సత్కర్మకు ఫలితము గాని లోకోపకారము కాదు. (1)

లోకమున కొందరు సన్న్యాసులనియు, కొందరు యోగులనియు వ్యవహరింప బడుచుందురు. పైజెప్పిన మార్గము నవలంబించినవారు ఫలితములను సన్యసించిరి గనుక సన్న్యాసులు; యోగస్థితి చెందినవారు గనుక యోగులు. ఈ రెండు స్థితులును సత్కర్మాచరణము వలననే సిద్ధించును. సంకల్పము లెంత మంచివి యైనను, వానిని సాధింపవలెనను పట్టుదల కలవాడు యోగి కాలేడు. సంకల్పములు తన ద్వారా వ్యక్తము కావలసినవి గాని, తాను ఏర్పరచు కొనవలసినవి కావు. మనస్సునకు, ఇంద్రియములకు సత్కర్మాచరణ సాధన మాత్రము తాను అలవరచుకొనవలసినది. లోకమునకు జ్ఞానోదయము చేయవలెనని కొందరు తాపత్రయ పడుచుందురు. ఈ ప్రయత్నమున వాదించుట, ఎదిరించుట, యుద్ధము చేయుట, జయించుట, ఓడిపోవుట మున్నగువాని ననుభవించుచుందురు. ఒక వర్గము వారికి ద్వేషము కలిగించి, మరొక వర్గము వారిపైకి పురికొల్పు చుందురు. తాము చేయు నీ యకార్యము లన్నియు లోకములోని యజ్ఞానమును పోగొట్టుటకే యని వారి నమ్మకము. సత్కర్మ, మన నమ్మకమును బట్టి కాక, మనకు కావలసిన సాధన ననుసరించి యుండును. ఈ భేదము తెలిసికొన్నవాడు లోకమునందు అజ్ఞానమును చూడడు. మన కెట్లు కలుగుచున్నదో, మిగిలిన వారికి కూడ కావలసినపుడు కావలసినంత జ్ఞానము కలుగుచున్నదని తెలిసికొని, తనకు కార్యమగు కర్మను నిర్మముడు, నిరహంకారుడై యాచరించును. (2)

**శమము :**

యోగస్థితి కారోహణము చేయదలచిన సాధకుడు అనేక సద్గ్రంథములను పఠించి సారాంశమును స్వీకరించును. పరమార్థమును గ్రహించును. పెద్దలను దర్శించి వారి ప్రవచనములను శ్రద్ధతో నాలకించును. వానిని మనస్సు

నకు విశదపరచుకొనును. అయినను మనస్సు పరిపరి విధముల పనిచేయు చుండును. దిగులు, కోపము, ఆశ, నిరాశ, యితరులను గూర్చిన యభిప్రాయ ములు, ఇతరులలో కనిపించు లోపములు, ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు, బంధుమిత్రాదులు, సాంఘిక, ఆర్థిక సమస్యలు మున్నగునవి మనస్సును ఒక్కొక్క దినమున ఒక్కొక్క విధముగా ఒక్కొక్క ధోరణిలో నిలుపును. ఇక యోగస్థితి యెక్కడిది? కనుక సాధకుడు మరల పరిశీలించి యొక రహస్యమును తెలిసికొనును. మనస్సు యోగస్థితిలో నిలబడుటకు సత్కర్మయే కారణముగాని, మిలిగినవి ముఖ్య కారణములు కావు. శరీర శ్రమతో, వాక్కుతో, మనస్సుతో కూడిన త్రికరణశుద్ధి యగు సత్కర్మాచరణమే మనస్సు పరిశుభ్ర మగుటకు, యోగస్థితిలో నిలబడుటకు కారణమగును. ఈ రహస్యము నెరిగిన సాధకుడు నిరంతరము సత్కర్మాచరణము నందు నిమగ్ను డగును. సాధకుడు యోగస్థితిలోని కారోహణ చేయుటకు కారణము సత్కర్మాచరణ మొక్కటే!

ఇట్లు ఒకమారు యోగస్థితి లభించిన వెనుక ఇక చెదరిపోదను సిద్ధాంతము లేదు. ఏ సత్కర్మల నాచరించుట వలన మనస్సు చెదరని స్థితిలో నిలబడినదో, ఆ కర్మల నాచరించుచుండిననే అతని యోగస్థితి మరల చెదరక నిలబడియుండును. ఇట్లు దిగజారక నిలబడి యుండుటను 'శమము' అందురు. శమము అనగా తన యభిప్రాయములు, సంకల్పములు, మనోవికారములు తనయందు శమించుట. ఎంతకాలము సత్కర్మ లాచరించినను మానిన రోజునుండి శమము నుండి దిగజారును. ఒక లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టినవాడు వాణిజ్యము చేయుచున్నచో, ఆర్జనము కలిగి, తన జీవనోపాధి కోసము పై లక్ష రూపాయలలో కన్నము పెట్టకుండ జీవించుటకు వీలగును. పది సంవత్సరములు నిరంతరముగ వాణిజ్యము చేసి పది లక్ష లార్జింపవచ్చును. కాని ఏనాడు వాణిజ్యము మానునో ఆనాటి నుండి జీవనోపాధి కొరకు ఉన్న డబ్బులో కన్నము పెట్టవలసి వచ్చును. పది లక్షల ఆస్తి తండ్రి నుండి సంక్ర మించినవాడు, వాణిజ్యము చేయక మొదటి నుండియు నూరకున్నచో, కన్నము పెద్దదై పది లక్షలును సున్న యగును. లక్ష రూపాయలే సంక్రమించినవాడు మొదటి నుండియు వాణిజ్యము చేయుచునే యున్నచో వాని ధనము పెరుగును

గాని, ఎన్నడును సున్న కాదు. ఇచట వానిని కాపాడుచున్నది వాణిజ్యమే కాని ధనము కాదు. అట్లే యోగస్థితి నిచ్చి శమమున నిలుపునది సత్కర్మయే గాని తాను నేర్చిన యితర మేదియు కాదు. అభ్యాస కాలమున సాధకుడు సత్కర్మ సాధనచేసి యోగస్థితి నారోహింపవలెను. ఒకమారు ఆరోహించినవాడు శమమున నిలబడుటకు సత్కర్మల నాచరించుచునే యుండవలెను. (3)

ఒకడు యోగస్థితి నారోహించెనా లేదా యని ఎట్లు తెలియును? తన గురువు చెప్పుట వలననా? ఇతరులు మెచ్చుకొనుట వలననా? సత్కీర్తి వలననా? ఇందు దేనివలనను కాదు. తాను పనులు చేయుట కారంభించుటకు కారణ మేమో గమనించుటవలన తెలియును. చేయవలెనని మనస్సున కనిపించుట, కొన్ని సత్కర్మలు తనకు నచ్చుట, వాని నాచరించు చున్నప్పుడు తన కాహ్లాదముగా నుండుట, వీలుపడనప్పుడు వేదన కలుగుట అనునవి సూచనలు కారాదు. ఇవి సూచనలైనంత కాలము తాను సాధకుడే గాని యోగస్థితి చెందిన వాడు కాడని తెలిసికొనవలెను. ఏనాడు ఈ కారణము లన్నియు సత్కర్మా చరణము కొరకు సన్యసింపబడునో, ఆనాడే తాను యోగస్థితి చెందెనని తెలియవలెను. దీని సారాంశమేమనగా, సత్కర్మాచరణకు కూడ కారణము ఆకర్షణయో, పుణ్యాదులయందు భ్రాంతియో అయినచో తాను యోగస్థితి పొందినవాడు కాక, విఘ్నములలో చిక్కుకొనుచుండును. సత్కర్మ కేవలము దినచర్యవలె నభ్యాసమైనవాడు యోగస్థుడగును. అతనికి విఘ్నము లుండవు. అనగా మారుచున్న పరిస్థితులను చూచి విఘ్నములని తలచుట, చికాకు పడుట యుండవు. ఎవనికి విఘ్నదృష్టి యుండునో, అట్టివాని మనస్సు తనకు శత్రువుగా పనిచేయును. ఎవని కట్టి విఘ్నదృష్టి లేదో, వానికి తానే దగ్గరి చుట్టము. తన మనస్సు తనకు శత్రువుగా పనిచేయువాడు ఆత్మవంతుడు కాడు. అనగా మనస్సను తాను, ఆత్మయను తనయందు ఇంకను చేరు కొన్నవాడు కాడు. ఎవనికి మనస్సు దగ్గరి చుట్టముగా పనిచేయునో వాడు ఆత్మవంతుడు. మనస్సు అను తనను ఈ విధముగా జయించినవాడే ఆత్మవంతుడు, ప్రశాంతుడును. అట్టి వానిని పరమాత్మ ఆవరించి సమీపస్థుడై యుండును. (4, 5, 6, 7)

తాను మనస్సుగా దిగజారి యున్నప్పుడు తన యభిప్రాయములు

తనవి, తన స్వభావము తనది. ఇట్లే ఎవరి స్వభావము వారిది. ఒకరికి నింకొకరికి నడుమ ప్రత్యేకత యనబడు భేద మేర్పడును. మనస్సు తనయందు శమించిన వానికి తన యభిప్రాయము లుండవు; తన స్వభావ ముండదు. అట్టి యిరువురి నడుమ నొకే స్వభావ ముండును. అట్టివారి స్వభావము మిగిలిన జీవరాశుల స్వభావముతో నొకటిగా నుండును. మిగిలిన వారికి అభిప్రాయములు వేర్వేరుగా నుండవచ్చును. ప్రశాంతునకు మాత్రము మిగిలిన వారియం దొకే స్వభావ ముండును. ఇట్లందరిలో నంతర్యామిత్వము చెందిన స్వభావమే పరమాత్మ యొక్క స్వభావము లేక పరాప్రకృతి. ఈ స్థితిలో నున్నవారికి పరమాత్మ ఎప్పుడును సన్నిహితుడే! అట్టివాడు జ్ఞానమునందు, విజ్ఞానము నందు తృప్తి ననుభవించుచు, తానందే జీవించును. వానికి శరీర మొక గృహమే గాని పరిమితి కాదు. వాడు అందరియందును అంతర్యామిగా నుండగలడు. ఇదియే అన్ని జీవులను ఒకే సృష్టిగా నిలిపియుంచిన యోగము. దాని ననుభ వించువాడు యోగి. వానికి మాత్రమే బంగారము నందును, మట్టిబెడ్డ యందును సమదృష్టి నిలచును.

ఒక బంగారు కణికను రసాయన శాస్త్ర దృష్ట్యా చూచినచో నదియొక ద్రవ్యమునకు సంబంధించిన యణువుల సముదాయము మాత్రమే. అట్లే యోగి దృష్టిలో బంగారు కణికయైనను, రాయియైనను, మట్టిబెడ్డయైనను, అందు అంతర్యామిగానున్న భగవంతుని యొక్క వివిధ రూపములే. అతని దృష్టిలో అందున్న అంతర్యామికే ప్రాముఖ్యము గాని, బంగారమను అభిప్రాయ ముతో గాని, పేరుతో గాని, వస్తు స్వభావ భేదములతో గాని సంబంధము లేదు. (8)

**కూటస్థుడు :**

ఇతడు మంచి హృదయము గలవాడు, ఇతడు చెడ్డ హృదయము గలవాడు అను భేద దృష్టి సమబుద్ధి గల యోగికి ఉండదు. అనగా ఇద్దరిని గౌరవించునని గాని, నిర్లక్ష్యము చేయునని గాని అర్థము కాదు. ఎవనికి తగిన ప్రవర్తనము వారి యెడల చూపును గాని, ఒకరిని ఆదరించుట, మరియొకరిని ద్వేషించుట యుండవు. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని ద్వేషింపలేదు. కాని

దుర్యోధనాదులను సహింపను లేదు. భీష్మాదులు మహానుభావులని వారి యెడల వ్యామోహము చూపలేదు. ద్రోణాచార్యుడు విద్యలలో పెద్దవాడని, బ్రాహ్మణుడని వినయముతో మొగమాట పడుటయు చేయలేదు. ఎవరికి తగిన ప్రవర్తనము వారి యెడల చూపెనేగాని వ్యక్తిగత భావములను పనిచేయ నీయలేదు. సమదృష్టి యనగా, ఎదుటివాని ప్రవర్తనకు సరిపోయిన దృష్టి యని అర్థము కాని, గుఱ్ఱమును గాడిదయు ఒక్కటే యని కాదు.

యోగికి ఇతడు శత్రువని, ఇతడు మధ్యస్థుడని, ఇతడు ఉదాసీనుడని యుండదు. ఇతడు మిత్రుడని, ఇతడు మంచివాడని యుండదు. ఇతడు ద్వేషింపదగిన వాడని, ఇతడు చుట్టమని లేదు. పాండవులకన్న యాదవులు కృష్ణునకు దగ్గరి చుట్టములు. అయినను శరణాగతులైన పాండవుల రక్షణ భారము వహించెను. స్వేచ్ఛా బుద్ధిగల యాదవులు కల్లు త్రాగి కలహించుకొని చచ్చినను విచారపడలేదు. ఇతడు మంచివాడని, ఇతడు పాపి యని యోగికి భేదబుద్ధి యుండదు. మంచివానితో మంచిగా ప్రవర్తించును. పాపితో వాని కనుగుణముగా ప్రవర్తించును. యుక్తితో వ్యవహరించుచు బాల్యక్రీడగా ప్రవర్తించును. దుర్యోధనుడును, అర్జునుడును యుద్ధమున సహాయము కోరి వచ్చినపుడు కృష్ణుడు యుక్తిగా తప్పుకొని పాపియగు దుర్యోధనునికి చిక్కక అర్జునుని పక్షము వహించెను. **(9)**

ఎదుటివా రెట్టివారైనను తాను వారి కనుగుణముగా ప్రవర్తించుచున్నను, తాను తానుగా మాత్ర ముండును. తన యందు తా నుండును గాని, తన మనస్సున నెదుటివా రుండరు. ఇది యొక విధమైన రహస్య జీవిత పద్ధతి. అతడు పదిమందితో జీవించుచునే యొంటరిగా నుండును. తన చిత్తము, తాను తన వశమున నుండును. పరిసరములలో దేనిని అనుభవింపడు. తన నోరు రుచికరమైన ఆహారము తినుచున్నప్పుడు కూడ తాను తినడు. ఆజాన్మాంతము అపరిగ్రహమను వ్రతమున నుండును. అనగా ఎవ్వరి వద్దను దేనిని స్వీకరింపడు. తన వృత్తి ధర్మమున తాను కర్తవ్యము నెరవేర్చుచు తన సొత్తునే, తన ఆర్జితమునే కొంత భాగము శరీర పోషణాదులకై వినియోగించి, మిగిలిన దానిని ఇతరులకు విడచిపెట్టుటయే అపరిగ్రహము. ఆ యితరులలో

తన భార్యాబిడ్డలు కూడ నుండవచ్చును. అయినను వారు తన మనస్సులో "తనవారు కాకుండుటయే" యోగి ప్రవర్తనలో విశేషము.

"యోగాభ్యాసము చేయువాడు సర్వకాలముల యందును రహస్యమైన ప్రదేశమున నొంటరిగా నుండవలెను. ఏమియు తినరాదు. భార్యాబిడ్డ లుండ రాదు.' ఇది యొక పొడుపు కథ వంటి శ్లోకము. రహస్యముగా నుండవలె ననగా, తన చేష్టలలో ప్రవర్తనలో యోగాభ్యాసము చేయుచున్నానని చాటుకొన రాదు. తాను సాధన చేయుచున్నట్లు ఎవ్వరికిని తెలియవలసిన యవసరము లేదు. ఎవరితో నున్నపుడు వారికి సహజమైన స్థితిలో కలసిపోవలెను. తన పద్ధతి మార్చుకొనరాదు. ఒంటరిగా నుండవలె ననగా, ఎందరిలో నున్నను, ఒక్కడిగనే తనను తాను తెలిసికొనవలెను. 'నేను' అను ప్రజ్ఞగా మెలగవలెను. ఏమియు తినరాదనగా, తాను చేయు పనుల ఫలితములను మనస్సుతో భుజింపరాదు. రుచికరమైన ఆహారము తినునప్పుడు కూడ, వంటకముల రుచిని జిహ్వాకు విడచిపెట్టి, తాను తినకుండ నుండవలెను. భార్యాబిడ్డ లుండరాదనగా వారియందు తనకు ప్రత్యేకమైన ఆసక్తి యుండరాదు. వారి రక్షణ పోషణములను జరుపుటలోను లోపము ఉండరాదు. కొందరు లోకసేవకై భార్యాబిడ్డలను అనాదరింతురు. ఇక సమదృష్టి యెక్కడిది? అట్టివారి లోకసేవ ఆరని కీర్తి దాహమునకు ఫలము. తన సేవను జూచి ఆశ్చర్యపడి పూజించు వారికి దాసులై సేవ చేయుచు, అట్టి పూజనము భార్యాబిడ్డల నుండి లభింపదని తెలిసి, వారికి సేవచేయుట మానుదురు. ఇది సేవలో వాణిజ్యసరళి యగును గాని, ఆధ్యాత్మికమైన సమబుద్ధి కాదు. ఈ విధమైన యెట్టి సంగమును లేక సమబుద్ధిని కలిగియుండు వాడే భార్యాబిడ్డల బంధమున కతీతుడుగా నుండగలడు. (10)

ఈ విధమైన సాధన చేయదలచినవాడు శుచియగు నొక ప్రదేశమును నిర్ణయించుకొనవలెను. అనుదినము నొకే సమయమునకు సాధన ప్రారంభింప వలెను. తాను కూర్చుండుటకు స్థిరమైన ఆసనము నొక దానిని (సదుపాయ మైన పీటను) ఏర్పరచుకొనవలెను. దానిపై దర్భాసనముగాని, జింకచర్మము గాని, మడతలు పెట్టిన వస్త్రముగాని పరచుకొని కూర్చుండవలెను. ఆ పీట

ఎక్కువ ఎత్తుగా గాని, మిక్కిలి మట్టముగా గాని యుండరాదు. మధ్యస్థమైన ఎత్తులో నుండవలెను. ఇదియే ఆత్మకు స్థిరమైన ఆసనము. ఆసనము మిక్కిలి ఎత్తుగా నున్నచో కన్నులు మూసినప్పుడు మనస్సు ధ్యానమున లీనము కాబోవునపుడు తూలి క్రింద పడుదునేమో యను భయము కలుగును. కనుక ధ్యానము కుదరదు. మిక్కిలి లోతుగా నున్నచో కన్నులు మూసికొనునపుడు గోతిలో కూర్చున్నట్లుండును. ఇచ్చట ఆత్మ యనగా శరీరము.

ఆత్మ యనగా 'తాను' అని కదా ముఖ్యార్థము? తనతో నున్నది గనుక శరీరమునకు కూడ ఆత్మయను పదముయొక్క అర్థము సంక్రమించుచున్నది. ఇట్లు కూర్చున్నవాడు లోపలి యాత్మకు కూడ స్థిరమైన ఆసనము మొదట సాధింపవలెను. అనగా తన మనస్సు ఈ శరీరమునందే స్థిరమై యుండవలెను. దానికి కూడ ఈ శ్లోకముననే మార్గము కొంచెము చమత్కారముగా చూప బడినది. సాధకుడు మనస్సులో శుచియైన ప్రదేశము నిర్ణయించుకొనవలెను. అనగా చుట్టుప్రక్కల శుచిగా నుంచుట యొకటే కాదు. మనస్సున అశుచియైన దేదియు స్మరణకు రారాదు. శుచియైన వస్తువు నొకదానిని తలచుచుండుట వలన మాత్రమే యిది సాధ్యపడును. సూర్యోదయమో, సూర్యాస్తమయమో, మబ్బులు లేని నీలాకాశమున చంద్రుడో- ఈ మొదలగు పరిశుద్ధమైన దృశ్యములలో నొకదానిని మనస్సున తలచుకొనుచుండవలెను. దీనివలన మానసికముగా శుచియైన ప్రదేశము స్థిరపడును. అట్లే మనస్సునందు మిక్కిలి ఎత్తుగాక, మిక్కిలి లోతుగాక యున్న యాసనము సిద్ధపరుపవలెను. అనగా తా నితరుల కన్న గొప్పవాడని గాని, తక్కువ వాడనిగాని భావింపక, ఇతరులతో సమానుడుగా, ఇతరులలో వ్యాపించు చున్నవాడుగా భావింపవలెను. దీని వలన సర్వసమత్వము, భగవంతుని అంతర్యామిత్వము, అందు మన ముండుట స్థిరపడును. అట్లే యీ శరీరము మనకొక పీటగా భావించుకొనవలెను. ఈ మన చర్మమును జింకచర్మముగా భావించుకొనవలెను. (మన సాధనకై జింక చావును కోరుట యోగసాధన కనుగుణమైనది కాదు.) మనము కట్టుకొన్న వస్త్రమును ఈ దేహమను పీటపై పరచిన వస్త్రముగా భావింప వలెను. ఆత్మకు స్థిరమైన ఆసనము సాధించు మార్గమిది. **(11)**

## ఏకాగ్రత :

యోగవిద్యను సాధన చేయువాడు శుచియైన ప్రదేశమున, స్థిరమైన ఆసనమున నాసీనుడై సాధన చేయవలెను. అక్కడ మనస్సు నేకాగ్రము చేయ వలెను. 'అక్కడ' అనగా నెక్కడ? సామాన్యముగా నొక రూపమునందు గాని, మంత్రాక్షరములయందు గాని మనస్సును నిలుపుటకు కొందరు యత్నింతురు. వారు కష్టపడుచున్నారు. దీనికి కారణమేమి? తాము భావించిన కేంద్రమును తమకన్న వేరుగా భావించుటయే వారు కష్టపడుటకు కారణము. కొందరు తమ శరీరమున కీవలగా బాహ్యముగా నొక రూపముపై కేంద్రీకరింతురు. వీరికి కష్టము మాత్రమే గాక నష్టము కూడ కలుగుచున్నది. ప్రాథమిక స్థితిలో తనకన్న బాహ్యముగా నొక వస్తువుపై మనస్సును కేంద్రీకరించుటకు యత్నించు వానికి, తనలోని జీవశక్తి శరీరము నుండి వెలుపలికి దారి చేసికొనును. ఇట్లు వ్యర్థమగుచున్న జీవశక్తి వలన నీరసము, వ్యాధి, మనస్సునకు బహిర్ముఖత్వము, నానాత్వము, చీకాకు మున్నగునవి కలుగును. ఇతరులను సహింపలేకుండుట సంభవించును. ఇది యంతయు తన పవిత్రత వలన, ఇతరుల యందలి అపవిత్రత వలన కలుగుచున్న చీకాకని భ్రమపడును.

సరియైన సాధకుడు కన్నులు మూసికొని 'అక్కడ' అను పదమును మనస్సున నుచ్చరించుచు, ఈ పదము తనలో నెక్కడ పుట్టుచున్నదో గుర్తించు టకు మనస్సుతో తనలోనికి ప్రయాణము చేయవలెను. దానితో తన భావములు, సంకల్పములు నెచ్చట నుండి ప్రేరేపింపబడుచున్నవో అట్టి యుత్తమమైన వెలుగు వైపునకు మనస్సు ఉన్ముఖ మగును. దానితో నింద్రియముల ప్రవృత్తులు కూడ దాని వైపునకే ఉన్ముఖము లగును. మనస్సుతో గూడిన యింద్రియ ప్రవృత్తులే చిత్తము అనబడును. గనుక, అతడు 'యతచిత్తుడు' అగును. అప్పుడు 'ఆసనము' అను స్థితి నిలబడును.

ఆసన మనగా పద్మాసనమో, సిద్ధాసనమో, భద్రాసనమో లేక సర్వాంగాస నాదులలో నొకటియో అని అభిప్రాయ పడుచున్నారు కొందరు. ఈ భౌతికము లైన శరీర విన్యాసములకు కూడ ఆసనములని తరువాతివారు పేరు పెట్టుట వలన నీ గందరగోళము సంభవించినది. మొదట యోగవిద్యలో ఆసన

మనునది చిత్తము ఆసీన మగుటకు తగిన స్థితి. 'స్థిర సుఖ మాసనమ్' అను పతంజలి సూత్రమునకు స్థిరత్వముగొన్న సుఖమే ఆసనమని యర్థము. అంతే కాని, కూర్చుండగా స్థిరముగా నుండునది, కూర్చుండుటకు సుఖముగా నుండు నది ఆసనమని యర్థము కాదు. స్థిరత్వము, సుఖము అనునవి మనకు సంబంధించినవి గాని, శరీరమునకు సంబంధించినవి కావు. శవము కదలక యున్నచో స్థిరముగా నున్నదని, సుఖముగా నున్నదని యనగలమా? జీవునితో గూడిన శరీరము స్థిరముగా నుండవలె నన్నచో, జీవుని స్థితి స్థిరమైనప్పుడే అది సాధ్యము. అన్ని సుఖములను సమకూర్చి కదలకుండుమని శాసించినను స్థిరత్వము కుదురనివానికి, ఏవో పనులున్నవని యనిపించుట, అతడు తిరుగుడు మానకుండుట, త్రిప్పలు విడవకుండుట లోక సహజమే గదా! 'సుఖ మాసన మాత్మనః', 'స్థిర మాసన మాత్మనః' అను శాస్త్ర వాక్యములకు కూడ అర్థము - ఆసనము తనకు సంబంధించినదే గాని భౌతిక దేహమునకు మాత్రమే సంబంధించినది కాదనియే! అష్టాంగ యోగ మార్గమున మూడవదియగు 'ఆసనము' మనో నియమమునకు సంబంధించినదే గాని, దేహ విన్యాస వైఖరికి సంబంధించినది యేమాత్రమును కాదు. 'స్థిర సుఖ మాసనమ్' అను సూత్రము నకు వివరణములు రచించిన వారిలో నూటికి తొంబది తొమ్మిదిమంది దేహ విన్యాస వైఖరులను గూర్చియే యని భ్రమపడిరి. శాస్త్ర గ్రంథమున సరియైన సమన్వయమును అచ్చటి సందర్భమును బట్టి గ్రహింపవలెను గాని, వివరణ కారుల సంఖ్యాబలమును బట్టి కాదు. దేహ విన్యాస వైఖరుల సాధనమంతయు 'యమము' అనబడు మొదటి యంగముననే యిమిడిపోవును. హృదయము నందు మనస్సు నిలబడుట కారంభించుటయే ఆసనము. ఇచ్చట హృదయ పద్మమునం దాసీను డగుట యని యర్థము.

ఇట్లు ఆసనమున నాసీనుడై తన్నుతాను యోగవిద్యతో యోగింపవలెను. "అచ్చట అను పద మెచ్చట పుట్టుచున్నది?" అని మనస్సు వెదకుచు లోనికి బోయినచో హృదయ సమీపస్థమగు నొక పట్టు చిక్కును. అది ప్రజ్ఞకు పట్టు చిక్కుటయే గాని, యొక ప్రదేశము చిక్కుట కాదు. ఇది గుండెకాయలో నే భాగమున నున్నది యను నన్వేషణ కాదు. అన్వేషించు నభిప్రాయము రూపమున కదలుచున్న 'తాను' ఎచ్చట పుట్టుచున్నాడు? అన్నదే యిచ్చటి యన్వేషణ.

ఇచ్చుట పట్టుచిక్కుట ప్రజ్ఞామయ లోకముననేగాని, భౌతిక లోకమున కాదు. అయినను ఇందలి క్రమమార్గము ననుసరించినపుడు మాత్రమే యీ పట్టు చిక్కును. దీని వలన చిత్తము యమింపబడును. దీనివలన ప్రవృత్తిమయుడగు మనస్సు ఆసనమున నాసీను డగును. ప్రవృత్తి మయమగు మనస్సు దాని యుత్పత్తి స్థానమగు పై ప్రజ్ఞతో యోగింపబడును. ఇదియే యోగమునకు ప్రారంభము. దీనితో ఆత్మ విశుద్ధి కలుగును. అనగా తన భావములతో అపరిశుద్ధుడగు తాను, తన భావముల నుండి పరిశుద్ధు డగును. ఇది, భావములు తనయందు కరగిపోవుట వలన జరుగును గాని, తొలగింపబడుట వలన జరుగదు. భావములను తొలగించుటకు యత్నము చేయరాదు. యత్నము కూడ నొక భావమే గనుక నిట్టి యత్నముతో భావములు పుట్టలు పుట్టలుగా పెరుగును. కనుక భావము లెచ్చట పుట్టుచున్నవి అను ప్రశ్నతో అన్వేషణ చేయుచు నిలబడుటయే మార్గము. **(12)**

శరీరమును భూమిపై సమముగా వంకర లేనట్లు నిలుపవలెను. వీపు, మెడ, తల ఒకే సరళరేఖలో నిలుపవలెను. అట్లని ఏ భాగమును బిగింపరాదు. చిత్తము స్థిరమై యున్నచో దేహము అచలమై యుండును. ఇట్లు దేహము చిత్తస్థైర్యమున నిలబడుట జరుగవలెను. అపుడు తన నాసికాగ్రమును చూచు కొని, దిక్కులు చూడకుండ కన్నులు మూయవలెను. అటుపైన నాసికాగ్రమును మనస్సున చూడవలెను. ఇచ్చట నాసికాగ్రమనగా భ్రూమధ్యమా లేక ముక్కు చివరి భాగమా యని కొందరి సందేహము. "భ్రూమధ్యమున చక్కగా ప్రాణ వృత్తులు నిలుపు'' మని శాస్త్రముననే మరియొక తావున చెప్పబడి యున్నది గనుక సందేహమునకు తావులేదు. భ్రూమధ్య మనియే నిశ్చితార్థము. భ్రూమధ్యమును చూచుట కన్నులతో గాక, మనస్సుతో చేయవలెను. (కన్ను లతో చూచినచో తలనొప్పి వచ్చును.) ఇట్టి స్థితిలో మనస్సును సుళువుగా సంయమనము చేయవచ్చును. అట్లు చేయుటకు "నాయందు చిత్తము నిలుపుము'' అని శాస్త్రకారుడు చెప్పుచున్నాడు. 'నాయందు' అనగా శాస్త్ర కారులయందు అని యర్థము కాదు. (శిష్యునకు సంధ్యావందనము నేర్పుచు గురువుగారు "ముక్కు పట్టుకొనుము'' అనగా, అతడు గట్టిగా గురువు ముక్కు పట్టుకొన్నాడట! ఆ సామెతగా సమన్వయములు చెప్పుకోరాదు.) "నాయందు

చిత్తము నిలుపుట'' యనగా, సాధకుడు తనలో నున్న భావములకు మూల స్వరూపుడైన 'నేను' అను ప్రజ్ఞయందు చిత్తము నిలుపుట. దీని నభ్యసించినచో 'నాయందు' నిష్ఠగలవా డగుచున్నాడు అని కృష్ణుడు చెప్పుచున్నాడు. దానితో సాధకుడు ప్రశాంతుడై భయములు తొలగి, బ్రహ్మయందు చరించుచు, బ్రహ్మచారి యనబడును. **(13, 14)**

## నాది - నేను :

"నా యందు చిత్తము నిలిపినవాడు నాతో యోగము చెందినవాడు. అతడు మత్పరుడు. అనగా నన్ను ఉత్తమునిగా స్వీకరించిన వాడు.'' ఈ కృష్ణుని మాటలు మంత్రార్థములు గలవి. నా దేహము, మనస్సు, ఇంద్రియ ములు, బుద్ధి, ఊహలు, సంకల్పములు, అహంకారము - ఈ మొత్తము నాది. దీనినే మాయ యనియు, నా మాయ యనియు కృష్ణుడు పేర్కొనెను. నేనను వాడు వీనికన్న భిన్నుడు. నేనను వెలుగులోని కిరణములై 'నాది' యనబడు మాయా విశేషములు పుట్టి, అరలుగా, పొరలుగా, వన్నెలుగా, చిన్నెలుగా వెలుగుచు, నేనను పదముచే వ్యవహరింపబడు చుండును. అట్టి స్థితిలోనున్న 'నేను' జీవుడు. అతడు క్రమముగా నన్ను ఉపాసించుటతో నాకై తనలోనికి 'నా' దగ్గరకు ప్రయాణము చేయుట, నా దరిజేరుట, నా యందుండుట నేర్చును. అటుపైన నే నగుట, నేనుగా నుండుట నేర్చును. మాయ తొలగి, 'నాది' యంతయు 'నేను'గా వెలుగును. అట్టివాడు ప్రశాంతాత్ముడు. వీనికి భయము లేదు. ఈ విధముగా నభ్యాసము చేయుటయే యోగము లేక నాలో యోగించుట.

ఈ వాక్కులలోనే యోగవిద్య సర్వస్వ మిమిడి యున్నది. తన నీ విధముగ యోగమునందు యోగించుకొనినప్పుడు మనస్సు నియమింపబడును. కేవలము మనస్సును నియమించుటకు యత్నము చేసినచో, చేయువానికన్న మనస్సు వేరుగా నుండును గనుక నియమింపబడదు. కనుకనే మనస్సును నిలబెట్టుటకు యత్నము చేయువారందరును పరాజయము పొందుచున్నారు. నే నను వెలుగు తెలిసి, దానియందు కరగిపోయిన మనస్సు గలవారు యోగు లగుచున్నారు. వారి యనుభవము పేరే శాంతి. అది నిర్వాణ మనబడు

లక్షణము గలది. అనగా గాలికి దీపము కదులుటవంటి మార్పు లుండవు. దీపమునకు గాలి యెట్లో, మనస్సునకు పరిసరములును, వ్యక్తులును అట్లే! ఇతరుల సంభాషణలు, చేష్టలును అట్లే! యోగికి వీని ప్రభావము మనస్సుపై నుండదు. కారణ మేమనగా మనస్సనగా తానే. తానే మనస్సుగా నటించుట, క్రీడించుట చేయుచుండును. తన కిష్టము కలిగినచో క్రీడించును. లేనిచో మానును. పరిసర వ్యక్తులనుబట్టి తప్పనిసరిగా మనస్సు పనిచేయుట యుండదు. క్రీడకు తన సంకల్పమేగాని తప్పనిసరి యని లేదు. అట్టివాడు నాయందుండుట నేర్చునని కృష్ణుడు చెప్పుచున్నాడు. అత డెవ్వరిని సంతోష పెట్టుటకు గాని ఏ పనిని చేయడు. తన సంకల్పమునుబట్టి చేష్టలు చూపునుగాని, ఇతరులను బట్టి కాదు. ఇతరులు బాధపడుదురని మొగమాట పడడు. కాని యితరులు బాధ పడకుండునట్లు మెలగు నేర్పరితన మలవడును. "యోగిగారు కోపించు చున్నారు" అను నంశము వాని కడ నుండదు. (15)

దీని నభ్యసించుటకు మొదట సర్వ విషయములందును సమత్వ మభ్యసింపవలెను. అతిగా భోజనము చేయువాడు గాని, భోజనము మానువాడు గాని, అతిగా నిద్రించువాడు గాని, నిద్ర మాని ధ్యానాదులు చేయువాడు గాని యీ సాధనకు పనికిరాడు. అతిగా భుజించుట యనగా రుచికి కక్కుర్తి పడుట. అట్లే మిగిలిన ఇంద్రియముల విషయమునను, భోజనము మానుట యనగా రుచులను చూచి భయపడి తక్కువ భుజించుట; లేక దేవుని బెదరించుటకై యుపవాసాదులను చేయుట. (ఉపవాసమను పేరుతో లంకణము కట్టుట.) అట్లే తప్పు చేయుదునన్న భయముతో మిగిలిన యింద్రియ సుఖములనుకూడ మానుట. అతిగా నిద్రించుట యనగా, ఒళ్ళు బరువు మున్నగు కారణములచే రేయింబవళ్ళు నిద్రపోవుట మరియు జాగరూకత వహించవలసిన విషయము లను ఏమరుపాటు చెందుట, చేయవలసిన పనులను మరచుట. వస్తువులను ఉంచవలసిన స్థానమున నుంచుటకు బద్ధకించి మరల నొక్కొక్క దానికై వెదకికొనుట. అతిగా నిద్ర మేల్కొనుట యనగా రాత్రులందు చీట్లపేక వంటి వానితో మెలకువగా నుండి శక్తిని దుర్వ్యయము చేయుటయేగాక, రాత్రులందు యోగాభ్యాసము, జప హోమ తపాదులు మున్నగువాని నాచరించుట కూడను. ఇట్టి చేష్టలన్నియు దుఃఖమును కలిగించును.

యోగమనగా దుఃఖమును పోగొట్టునది. (దుఃఖము కలిగించు శరీర క్లేశము, ఆహారాది క్లేశము, కావలెనని శరీరమును కష్టపెట్టుట మున్నగునవి యోగాభ్యాసమునకు వ్యతిరేకములు.) ఈ విధముగా వివేకముతో సమత్వము కలిగి యోగసాధన చేసినచో చిత్తము విచిత్రముగా నియమిత మగును. తనయందు కరగును. అట్టి వానికి చిత్తము లేదు గనుక కోరికలు లేవు. కోరికలకు స్థానము మనస్సు కనుక నతనికి మనస్సు స్థానమున తానుండును. కనుక కోరిక లుండవు. అట్టి వానినే యోగియని శ్రీకృష్ణుడు నిర్వచించెను. **(16, 17, 18)**

గాలి వీచుట యనునది లేనిచోట దీప మెట్లుండును? మొగ్గవలె నిలబడి యుండును. అనగా దీపపు మంట దీపమునం దమరి యుండును. అట్లే యోగి యొక్క చిత్తము ఆత్మయం దమరి యుండును. చిత్త మెచ్చట మాయమగునో వానికి తెలియును. యోగవిద్యను సేవించుటచేత చిత్తము తనయందు మాయ మగును. అట్టి వానికి తనచే చూడబడునది తానే. జగత్తు అనబడు తదితర ముండదు. ఆ సమస్తము తన వెలుగై, తానే అదిగా కనిపించును. అందువలన సంతోషమే కాని, తన చుట్టుప్రక్కల మరియొకటి మిగిలి యుండదు. అంత కన్న సుఖానుభూతి లేదు. కనుక సుఖమను పదమున కదియే అర్థము. దానిని గ్రహించుచున్న స్థితినే బుద్ధి యందురు. ఇది ఇంద్రియాదులను వెలిగించును గాని ఇంద్రియములచే తెలియబడదు. దీని నభ్యసించినవాడు తనకు తానే యెరుగడు గనుక, తనను తానే యెరుగును. (తెలిసికొనుట మరియొక దాని నైనచో నిది సాధ్యము కాదు.) **(19, 20, 21)**

**నిజమైన సుఖము :**

సుఖమను పదమును చాలమంది యుపయోగించు చున్నారు. ఆనందము, మోక్షము అను పదములను గూడ నుపయోగించు చున్నారు. వాని ననుభవింపనివారు వాని నుపయోగించి లాభమేమి? మోహపడుట యగును. మోహపడినవాడు మూఢు డనబడును. "మూఢుడు శబ్దమయమైన ప్రపంచమున తిరుగాడుచు, సుఖమునకై వెదకి అలసిపోయి చనిపోవు చున్నాడు.'' - అని భాగవతము చెప్పుచున్నది. సుఖ మను పదమునకు

లక్షణము గీతలో నిట్లు చెప్పబడినది : "దేనిని పొందుట వలన మిగిలిన యే సంపదయైనను దానికన్న తక్కువదే యనిపించునో, ఏ యితర లాభమును మనస్సు నాకర్షింపని స్థితిలో, నీ మనస్సు నాకర్షింపగల యనుభూతి యేదో అది యొక్కటే సుఖము.'' "ఏ స్థితిని పొందినవాడు పెద్ద దుఃఖముల వలన కూడ చలింపడో అదే నిజమైన సుఖము.''

లోకమున సుఖమని, లాభమని చెప్పుకొనబడు విషయము లన్నియు మారుచుండును. అనగా వానియందు మనస్సు నిలబడక మరియొకదాని వైపునకు ప్రసరించుచుండును. కొద్దిపాటి జీతముతో జీవించువాడు భార్యతో సినిమాకు పోయినచో సుఖముగా నుండు ననుకొనును. అది సాధ్యమైన వెనుక మనస్సు తృప్తి చెంది యూరకున్నచో సినిమాను సుఖ మనవచ్చును. అట్లు ఊరకుండదు గదా! ఆదాయము పెరిగి భార్యతో సినిమాకు పోగలిగి నప్పుడు, రేడియో కొనగలిగినచో సుఖ మనిపించును. అది కొనగలిగిన వానికి దోమతెర మంచ మున్నచో సుఖ మనిపించును. కొంతకాలమునకు సొంత యిల్లు ఉన్నచో సుఖ మనిపించును. ఇట్లు చచ్చువరకు అనిపించుచునే యుండును. సుఖపడదలచిన వాడు ఇట్లు అనుకొనుచునే చచ్చును. ఇందు దేనియందును సుఖము కలుగక పోవుటయే యీ మారుచుండుటకు కారణము. నిజమునకు సుఖ మనునది సుఖపడువానికి సంబంధించినది గాని వస్తు సంపదకు సంబంధించినది కాదు. దేనిని పొందిన వెనుక మన మింకొక దానిని కోరమో అదియే సుఖము. దేనిని పొందిన వెనుక మనము కష్టములని భావించు సన్నివేశములు మనపై పనిచేయవో అదియే సుఖము. ఇది యోగస్థితి పొందిన వానికి కలుగును. అట్టివాని జీవితమున దుఃఖ కారణములైన సన్నివేశము లుండవని యర్థము కాదు. సన్నివేశములు మిగిలినవారి జీవితములందు వలెనే వానికిని కలుగుచుండును. పూర్వకర్మ ఫలముగా దుఃఖ కారణములు తటస్థించుచు పోవుచుండును. యోగాభ్యాసము నందలి నేర్పరితనముచే సత్కర్మలను మాత్రమే సృష్టించుచు పోవుట వలన కొంత కాలమునకు పూర్వ దుష్కర్మ ఫలితములు పూర్తిగా రహితమై పోగా, అటుపైన సత్కర్మ ఫలితములే తటస్థించు చుండును. అప్పుడుకూడ వ్యాధి, ముసలితనము, బంధుశోకము మున్నగునవి తటస్థించుచునే యుండును. ఇవి యోగస్థితిలో లేనివారికి

దుఃఖ సంయోగము కలిగించును. అనగా నతడు సన్నివేశము తటస్థించినపుడు దుఃఖ మనుభవించును. యోగస్థితి నభ్యసించినవారికి సన్నివేశములు తటస్థించును గాని, దుఃఖ సంయోగ ముండదు. కొన్ని సన్నివేశములను చూచిన వెనుక, శాశ్వతమైన దుఃఖ వియోగము సంభవించును. ఉదాహరణకు కొందరు తన నెవ్వరును లెక్కచేయుట లేదని దుఃఖింతురు. యోగస్థితిలో నున్నవాడు తనతో నెవ్వరు మాట్లాడనప్పుడు ఆత్మధ్యాన స్థితిలో ఆనంద మనుభవించును. తనతో నెవ్వరైనను మాట్లాడు చున్నప్పుడు దానినే వారియం దనుభవించును. అట్టి యోగస్థితి యందు నిరంతరము ప్రవేశించి యుండవలెను. నూతన సాధకుడు నిరంతరము ప్రవేశించు యత్నమున నుండవలెను. (22)

యోగి కానివానికి సంకల్పములు, కామములు నుద్భవించుచుండును. యోగికి కూడ సంకల్పము లుండును గాని, యా సంకల్పములు తాను సంకల్పించునవి కావు. తనద్వారా సంకల్పింపబడునవి మాత్రమే. భేద మేమనగా, తన పూర్వాభ్యాసముల నుండి బయలుదేరినవి స్వంత సంకల్ప ములు. పూర్వాభ్యాసము నందు శారీరకము, మానసికము కూడ నుండును. కొన్ని సంవత్సరములు మన మభ్యసించిన యంశములు స్మరింపబడుచు సంకల్పములై తలయెత్తు చుండును. అంతకన్న లోతుగా మరియొక మనస్సున్నది. అందు కొన్ని జన్మల యభ్యాసములు తలయెత్తు చుండును. వానినే పూర్వకర్మ సంస్కారము లందురు. అంతకన్న లోతుగా మరియొక మనస్సున్నది. దానియందు ఈ అభ్యాసముల కన్న ముందున్న మనస్సే యుండును. ఏ యభ్యాసము కానట్టి దినములు ఏ జన్మలో గలవో అప్పటి మనస్సు ఈ లోతైన పొరలో నుండును. దానిలోనికి మన మాకర్షింపబడినపుడు అది బుద్ధి యనబడును. బుద్ధి యను గదిలో దీపము వెలిగింపబడినట్లు మనము మేల్కాంచుట యోగాభ్యాసము వలన జరుగును. దాని రుచి తెలిసి నప్పటినుండి పై రెండు పొరలును పనిచేయవు. అనగా ఆ పొరలలో కూడ బుద్ధియే ప్రసరించును. అట్టి స్థితిలో నీటియందు మంచుగడ్డలు కరగి పోయినట్లు సంకల్పములును, కామములును కరగిపోవును. (23)

సంకల్పము లనగా మన వశమున లేక మనసున తలయెత్తు స్మరణలు. అటుపైన మనము వేడుకపడి చేయు స్మరణలు కామములు. కొంతకాలము

నకు అభ్యాసవశమున కామములు కూడ మన వశమున లేక ఘనీభవించి మనలను నడుపుచుండును. యోగాభ్యాసము వలన నివియన్నియు బుద్ధిలోనికి కరగిపోవును. సంకల్పములను కామములను త్యాగము చేయవలెనన్నచో వానిని స్మరింపకుండుటకు యత్నింపరాదు. స్మరింపకుండుటకు యత్నించుట యనగా స్మరించుటయే. పైగా పేరు పెట్టి పిలచుట వంటిది. మరియొక దానిని స్మరించుట వలన మాత్రమే వానిని స్మరింపకుండుట సాధ్యము. ఆ మరి యొకటియే 'నేను' పదమున కర్థము. సాధనలో విఘ్నములు, భంగములు కలుగుచుండును. వానిని గూర్చి యాలోచింపరాదు. మరల స్మరింపదగిన దానిని స్మరింపవలెను. ఇది యొక్కటే సాధన మార్గము. **(24)**

## మనో నిగ్రహము :

ఇంతకును మనస్సును పట్టుట యెట్లు? ఉపరమము అను స్థితిని పొందుట యెట్లు? మనస్సును గమనించుచుండగా అందు భావములు పుట్టు చున్నవి. వానిని పట్టినచో వాని వెంటబడి పోవుటయే గాని, మనస్సును పట్టుట జరుగదు. భావముల వెంట బోయినచో నేకాగ్రత కలుగదు. భావాగ్రత కలుగును. ఒక భావము నుండి పది భావములు పుట్టుచు బహ్వాగ్రమగును. ఇది ఏకాగ్రతకు వ్యతిరేకము. చీకటిలో టార్చిలైటును వెలిగించి ఆ వెలుగు పొడ వైపునకు చూచుచున్నచో, ఆ పొడ పోను పోను విశాలమై, కిరణము లధికసంఖ్యాకములై వికాసము నీరసించును. అట్లుకాక రెండవవైపునకు చూచుచుండవలెను. కిరణముల ఉత్పత్తి స్థానమునకు మనసును ప్రసరింప జేయవలెను. దానినే బుద్ధి యందురు. బుద్ధితో మనసును పట్టవలెనే గాని మనసును గూర్చిన భావములతో కాదు. మనస్తత్వ శాస్త్రముతో కాదు. శాస్త్ర మనగా భావము లనెడి కిరణముల చెల్లాచెదరేగాని ఐక్యము కాదు. అయినచో బుద్ధితో మనస్సును పట్టుట యెట్లు? **(25)**

కలుగుచున్న భావములను గూర్చి యాలోచించుట మానవలెను. మానుట యెట్లు? మరియొక దానిని గూర్చి ఆలోచించినపుడే ఇంకొకదానిని గూర్చి ఆలోచింపక మానుట సాధ్యము. భావములను గూర్చి ఆలోచించువా రందరును చీకటిలో టార్చిలైటు వెలిగించి దాని కిరణములవైపు చూచువారే.

వెనుకకు చూచుట అంతర్ముఖత్వ మనబడును. దేనిని గూర్చి యాలోచించి నచో భావముల వెంట ఆలోచనలు పరుగులెత్తుట మానును? దీని కొక్కటే సమాధానము. మనస్సున భావము లెట్లు ఉద్భవించుచున్నవో గమనింపవలెను. లోకములు భగవంతునియం దట్లే యుద్భవించు చున్నవని తెలియవలెను. భావము లుద్భవించు తావును గమనించుచు భావములను గమనింపకుండ వలెను. దీనితో భావము లుద్భవించుట మానును. ఒక ఊహ ఉద్భవించి, నటించి, అణగిపోయి మరియొక ఊహ ఉద్భవించుటను గమనింపవలెను. రెండింటికి నడుమ నున్నది ఊహ లేని మనస్సు. అనగా అప్పుడున్నది మనమే గాని, మనస్సు కాదు. దీని నభ్యసించుటకు ఓపిక కావలెను. మెల్లమెల్లగా నదే ప్రయత్నము మరల మరల చేయవలెను. అపుడు పట్టు చిక్కును. తన్ను తాను పట్టుకొనుట యారంభమగును. దీనినే ధృతి యందురు. అభ్యాసవశ మున ఊహలు లేని తాను తనకు చిక్కును. మనస్సు ఆత్మయందు మాయ మగును. దానిని గూర్చి యూహింపరాదు. దానిని గమనింపవలెను. చూచుటయే గాని యూహించుట లేని స్థితి లభించును.

ఈ లోపున మనస్సు ఊహల వెంట పరుగెత్తుచుండును. దానిని గమనించి ఆ యూహ పుట్టుచున్న స్థానమును మరల మరల స్మరింపవలెను. ఊహలు వేగముగా మారుచుండును. ఊహలు పుట్టు స్థానము మారదు. అదియే తాను లేక గాయత్రి. దీని నభ్యసించువాడు యోగి యనబడును. ఈ అభ్యాసము వలన రజోగుణము శాంతమగును. అనగా రజోగుణ రూప మైన కుతూహలము తొలగింపబడుట కాక, అది శాంతముగ మారును. (27)

దీపమునకు మసి యెట్టిదో మనస్సునకు ఊహ లట్టివి. ఊహల యుత్పత్తి స్థానమును గమనించుటయందు శాంత స్థితి చెందినవానికి మసి పట్టదు. మనస్సు ప్రత్తి వలె కాలుటయే ఊహలు పుట్టుట. ఊహలు మానినచో ప్రత్తి కాలదు. తాను వెలుగుగా నిలబడును. ఈ వెలుగు ప్రత్తిపై నాధారపడి యుండక తనపై నాధారపడి యుండును. అప్పుడున్న స్థితి నిజమైన సుఖము. దానికి మార్పు లేదు గనుక, ఆది యంతము లేవు. సుఖములు అను నభిప్రాయము తొలగి, సుఖమను స్థితి మిగులును. దాని నభ్యసించినవాడు మనస్సును, ఇంద్రియములను లోకముపై ప్రసరింపజేయునపుడు కూడ

సుఖముండునేగాని, సుఖము లుండవు. సుఖములు పరిసరములపై నాధార పడినవి. సుఖము పరిసరముల యందు అంతర్యామిగా నున్నది. అది తానే. అట్టివాడు లోకమున వర్తించుచున్నట్లు అనిపించినను, తనయందు తాను స్థిరమైన మూర్తిగా నుండును. (28)

ఇట్టి యోగము సర్వకాలముల యందును అభ్యాసము చేయగలము. యోగికి కల్మషము లన్నియు తొలగును. అన్నిటియందును ఒకే అనుభూతి యుండును. అదియే అంతర్యామి యనబడు పరబ్రహ్మము. అదియే తాను కనుక, తనకు దానియందు సుఖము తప్ప వేరొక స్థితి యుండదు. పోల్చుటకు ఇతర సుఖము లుండవు గనుక అదియే ఉత్తమ సుఖము. ఈ స్థితిలో సర్వ జీవుల యందును, పంచభూతము లందును తానే అంతర్యామిగా నున్నాడని తెలియును. తాను అనబడు అనుభూతి యందు సర్వజీవులును 'తాము'గా నుండక, 'తాను'గా నుండును. అట్టివాని ప్రవర్తనము అన్నిటి యందును సమదర్శనముగ నుండును. ఎవ్వడీ విధముగ సర్వము నందును నన్ను చూచునో వానికి నే నెన్నడును నశింపను. వాడు నాయం దెన్నడును నశింపక నిలచియుండును. ఈ మార్గమున అందరియందు నున్న నాయందేకత్వము సాధించినవాడు అన్ని విధముల వర్తించుచుండి కూడ యోగియై నాయందు వర్తించును. దీనిని వెలుగుగా దర్శించుచు దీనియందు జీవించువారే ఆత్మ జ్యోతిని వెలిగించి వ్యాపింపజేయువారు. (29, 30, 31)

**సమదృష్టి :**

సమదృష్టి యను మాట కర్థము చూచువారిని బట్టి మారుచుండును. అందరిని సమానముగా చూచుట యుండవలెనని చాలమంది యంగీక రింతురు. కొంద రంగీకరింపరు. తమ తమ పూర్వకర్మల ననుసరించి యొక్కొక్కడు గొప్పవాడుగను, మరియొకడు తక్కువవాడుగను పుట్టును. ఒకడు బలవంతుడుగను, మరియొకడు దుర్బలుడుగను పుట్టును. ఒకడు విద్యావంతుడుగను, మరియొకడు విద్యావిహీనుడుగను తయారగును. ఒకడు ధనవంతుడు కాగా మరియొకడు నిర్ధనుడగును. కనుక సమదృష్టి కవకాశము లేదని వీరి మతము. సమదృష్టి, చూచువారికి సంబంధించినది గాని చూడబడు వానికి సంబంధించినది కాదని వీరు మరచిపోవుచున్నారు.

సమదృష్టి యుండవలెనని అంగీకరించువారిలో కూడ ఒక్కొక్కడు ఒక్కొక్క యర్థము చెప్పుకొనుచున్నాడు. అందరికిని సమానముగా సంపదలు పంచిపెట్టవలెనని కొందరు వాదించు చున్నారు. అందరిని ఒకే విధముగా చూడవలెనని కొందరనుచున్నారు. అట్టివారిలో కొందరు గొప్పవారిని కూడ తక్కువగా చూచుట నేర్చుచున్నారు. ధనికులను ద్వేషించుట సమదృష్టి యని కొంద రనుచున్నారు. అసాధారణ ప్రజ్ఞావంతుని చూచినపుడు 'వీని ఘనత యేమి?' అని ఈసడించుట సమదృష్టిగా కొందరు భావింతురు. వీరందరును చూడబడువారి విషయమున సమదృష్టిని సాధించుకొనుటకు పాటుబడు చున్నారు. తన్ను మాత్రము వేరుగా, అనగా చూచువాడుగా స్థాపించుకొను చున్నారు. అట్టివారిద్దరు కలిసినపుడు ఒకరిని గూర్చి యింకొకరికి గిట్టదు. సమదృష్టితో లోకమును చూడవలెనని యొకరితో నొకరు నొక్కి వక్కాణించి వాదులాడుకొను చున్నారు. వీరందరును సమదృష్టి యను పదమునకు గల యర్థమును గూర్చి అసమదృష్టి కలిగియున్నారు. తన దృష్టి మిగిలిన వారికన్న అసామాన్యమని భావించినపుడు సమదృష్టి యెట్లు లభించును? "మనము మిగిలినవారివలె గాక, సమదృష్టితో లోకమును చూచుచున్నాము" అని వాదించు వాడు, తాను మిగిలినవారివలె కానప్పుడు తనకు సమదృష్టి యుండుట యెట్లు?

కృష్ణుడు చెప్పిన యోగ మభ్యసించువానికి కృష్ణుడు చెప్పిన సమదృష్టి యబ్బును. అది యెట్లనగా, సమస్త జీవుల శరీరముల యందును గల పంచభూతము లొక్కటే. మనస్సు, ఇంద్రియములు, బుద్ధి కలిగియుండుట గూడ నొక్కటే. ఈ విధముగా భావించినపుడు శరీరములలో జీవులుండుట గాక, జీవస్వరూపుడగు భగవంతునియందు శరీరము లుండుట యనుభవము నకు వచ్చును. దేహములందున్న ప్రతి యణువునకు సర్వాంతర్యామియే యుండుట తెలియును. ఇక ఎవరి మనసు వారికి వేర్వేరుగా నుండుట, ఎవరి అభిప్రాయములు వారికి వేరుగా గోచరించుట యెట్లను ప్రశ్న కలుగును. ఇన్ని మనస్సులును దైవమునందే భాసింపబడుచున్న వనియు వానికి తెలియును. వ్యక్తులను తానెట్లు సమదృష్టితో చూడగలడో, అట్లే మనస్సులను, అభిప్రాయ ములను కూడ చూడగలడు. సృష్టిలోని వివిధత్వ మంతయు భగవంతుని మొత్తము స్వరూపముగనే వానికి దర్శనమిచ్చును.

ఇట్టి స్థితి సాధనలో చేజిక్కుట యెట్లు? ఇతరులను భగవంతుని యందు వర్తించుచున్న రూపములుగా ధ్యానించినపుడు మాత్రమే అది సాధ్యము. కనుక యోగాభ్యాసము కేవలము కన్నులు మూసికొని ప్రాణాయామము మొదలగువాని నభ్యసించి కొంతసేపు మాత్రము చేయునదిగా నుండరాదు. కన్నులు మూసినప్పుడు లోపల నేమి దర్శనమిచ్చునో అదియే కన్నులు తెరచి నపుడుకూడ కనిపించునట్లు ధ్యాన మేర్పడవలెను. కన్నులు మూసినపుడు కనిపించునది తానే. సరియైన యోగికి తన యుచ్ఛ్వాస నిశ్వాసములు, వానిని చేయుచున్నవాడు తానుగా దర్శనమిచ్చును. ఉచ్ఛ్వాస నిశ్వాసములు చేయు చున్నవాడు జీవుడు, అది తా ననుకొనుట ధ్యానమునం దొక భాగము. అట్టి తాను ఆకాశమునందుంటి ననుకొనుట, దానియందే తన శరీరాదు లేర్పడి చరించుచున్నవని యనుకొనుట మరికొంత భాగము. అట్టి యాకాశముననే మిగిలిన జీవులును, వారి యుచ్ఛ్వాస నిశ్వాసలును, దేహాదులును ఏర్పడుచు చరించుచున్న వనుకొనుట మరియొక భాగము. ఈ మూడు విధములైన ధ్యానము కలిసినపుడే, ఆకాశము శరీరముగా గల తానే యిందరుగా వ్యవహ రించుచుంటి ననియు, తానే సర్వాంతర్యామి యగు బ్రహ్మ యనియు తెలియును. *'ఆకాశ శరీరం బ్రహ్మ'* అనునది వేదమంత్రము. దీని తెలివియే బ్రహ్మజ్ఞానము.

ఇది తెలిసినవాడు బ్రహ్మము నెరిగినవాడు. ఈ తెలివియందు తాను నిలబడి చరించువాడే యోగి. అతడు చూచునదే దర్శనము. ఈ దర్శనమున తాను అనగా బ్రహ్మమే. అందు సర్వజీవుల యందును సమదృష్టి నిలచును. సుఖమును చూచినను, దుఃఖమును చూచినను దీనియందే చూచును. కనుక తాను చేయు పనులవలన నితరులకు దుఃఖమును పోగొట్టి సుఖమును కలిగించుటకు యత్నము చేయును. ఈ విధమైన జీవితము నడపుట తనకు సుఖమా, దుఃఖమా యను ప్రశ్న కూడ తొలగిపోవును. తన దృష్టితో వేరుగా చూచునపుడు సుఖదుఃఖము లుండును గాని, యోగదృష్టియే తన దృష్టి యైనపుడు సుఖదుఃఖము లుండవు. ఇట్టి స్థితి యందలి యనుభూతి ఉత్తమ మని కృష్ణుడు అర్జునునకు చెప్పగా అర్జును డిట్లు విమర్శించెను. (32)

"సమదృష్టి యను పేర నీవు చెప్పిన ఈ యోగము నేను చూడ లేకున్నాను. నీవు చెప్పినది స్థిరమైన దృష్టి. దానిని నేను చూడలేకపోవుట చంచలత్వము వలన కలుగుచున్నది. (ఒకమారు గోచరించుట, మరియొకమారు వేర్వేరు మనస్సులతో జీవులు కనిపించుట చంచలత్వము.) మనస్సు చంచలత్వమున వర్తించును. ఒకమారు కనిపించినది మరియొకమారు కనిపించదు. మనస్సు యొక్క లక్షణ మదియే. ఇది మథించు చున్నట్లుండును. సమదృష్టితో చూడవలెనను సంకల్పము కన్న నిది బలవత్తరము. మనస్సెక్కువ బలమై బ్రహ్మజ్ఞాన సంకల్పమును మాయము చేయును. (మనస్సునకు ఇంద్రియముల ద్వారా యితరుల ప్రవర్తనలు కనిపించునేగాని, వారి యందున్న పరబ్రహ్మము గోచరింపదు.) అట్టి మనస్సును నిగ్రహించుట యనగా గాలిని నిగ్రహించుటవలె చాల కష్టమని తలచెదను." (33, 34)

శ్రీకృష్ణు డిట్లు చెప్పెను : మనస్సు చంచలమనియు, దానిని నిగ్రహించుట చాల కష్టమనియు నీవు చెప్పిన విషయము నిస్సంశయము. కాని మరల మరల మనస్సును బ్రహ్మజ్ఞానము నందు సంకల్పించుట యొక మార్గము. ఎప్పుడెప్పుడు మనస్సునకు వ్యక్తులు గోచరించెదరో, అప్పుడప్పుడు వారిని సర్వాంతర్యామిలోని రూపములుగా భావన చేయుట మరల మరల చేయవలెను. ఇట్లు చేయుటను అభ్యాస మందురు. దీనివలన అట్టి దర్శనము అలవాటై పోవును. వ్యక్తులు మాత్రము గోచరించునట్టి అలవాటు క్రమముగా తగ్గిపోవును. దీనితోపాటు మరియొక పనిని కూడ చేయవలెను. ఇతరులను గూర్చిన మన యభిప్రాయములు, వారితో గల సంబంధములు, సంభాషణలలో వర్తించునట్టి లోక విషయములం దభిలాషలు, ఆశలు, ఆశయములు మొదలగునవి గోచరించునపుడెల్ల వానియందు భగవంతుని అంతర్యామిత్వమును భావన చేయవలెను. దానితో వానిపై మనస్సునకు గల పట్టు సడలును. మనస్సునకు గోచరించు సంబంధములు సడలినపుడు మనస్సుండుట సడలును. దాని తావున మన ముందుము. ఈ మార్పును వైరాగ్యమందురు. (అభ్యాసము చేతను, వైరాగ్యము చేతను చిత్తము నిరోధింపబడునని పతంజలి తన యోగ సూత్రములయందు చెప్పియున్నాడు.) మనస్సు పట్టు సడలునట్లుగా చేసి తన్ను తాను గ్రహింపవలెను. (35)

## ఆత్మ సంయమము :

మనస్సును పట్టుకొనుట వలన మనస్సు లొంగదు. కనుక యోగము కుదరదు. ధ్యానమను పేర కన్నులు మూసికొని మనస్సును పట్టుకొనుటకు యత్నము చేయునపుడు, ఆ యత్నము చేయునది కూడ మనస్సే కదా! మనస్సును పట్టుకొనుమని మనస్సుతో చెప్పినచో లాభమేమి? మనము మరియొక పనిమీద నున్నపుడు మనస్సు తదితరముమీద పనిచేయదు. అట్టి పనిని కల్పించుకొని చేయుచుండుట వలన మనస్సు మనయందు నిలచి పోవలెనేగాని, మనస్సును బిగించుటకు యత్నము చేయరాదు. తనకు పనికి వచ్చు పనిమీద నున్నప్పుడు మనస్సుగాని, యింద్రియములుగాని వేరుగా పనిచేయవు. మన మిష్టపడిన నాటకముగాని, సినిమాగాని చూచు చున్నప్పుడు నడుము నొప్పి తెలియదు. అనగా నడుమునందు మనస్సు వేరుగా పని చేయదు. మనతోబాటు మనస్సు కూడ సినిమా చూచుచు, మనము చూచుటకు తోడ్పడుచుండును. ఈ విధముగా మనస్సును, ఇంద్రియములను మనకన్న వేరుగా పనిచేయనీయకుండుట సాధ్యమగునంత వరకు, మనయందు మనలను గూర్చిన సినిమా కథను మన లోపల మనమే చూచుచుండవలెను.

ఈ స్థితిని పొందినవాడు సంయమము పొందిన ఆత్మ కలవాడు. ఆత్మ యనగా దేనియందు మన శరీరము, ఇంద్రియములు, మనస్సు, ఆలోచనలు వివిధ భాగములుగా పనిచేయునో ఆ మొత్తమే గనుక, సంయమము పొందిన వానికి శరీరము కూడ తనయందే, తనతోపాటు పనిచేయుచు తన పనికి తోడ్పడుచుండును. ఈ విధముగా ఆత్మ సంయమము పొందనివానికి యోగము సిద్ధింపదు. పొందినవానికి సిద్ధించును. ప్రతి జీవికిని తాను దారము వంటివాడు. తనలోని భాగములు పూసల వంటివి. యోగ మనగా పూసలలో దారము నెక్కించుట వంటిది. ఎక్కించిన వెనుక దారమునందు దారము నాధారముగా చేసికొని పూసలుండును గాని పూసలనుబట్టి దార ముండదు. అట్లే యోగికి తనయందు మనస్సు, ఇంద్రియములు, ఇష్టాయిష్టములు, ఆకలి దప్పులు లీనమై వర్తించును గాని వేరుగా పనిచేయవు. తన కోసము అని అతడు పనిచేయును గాని, వాని కోసమని అత డే పనియు చేయడు. యోగస్థితి యనగా నిట్టిది. (36)

కృష్ణు డిట్లు వివరింపగా అర్జునుడు మరల నీ విధముగా ప్రశ్నించెను: “శ్రద్ధ గలిగినవాడు నీవు చెప్పిన యోగస్థితిని చూచుటకు యత్నించును. అందు కొందరికి మార్గము తెలియక, కొందరికి పరిస్థితులు బాగుండక, నీవు చెప్పిన సంయమము లభింపక పోవచ్చును. అయినను అతడు యత్నించుచునే యుండును. అట్టివాడు యోగస్థితిని గూర్చిన ప్రయత్నమునుండి మనస్సు చెదరిపోయిన స్థితిలో నుండును. సిద్ధి కలుగకయే మరణించును. వాని గతి యేమగును? చేసిన ప్రయత్నము, ఖర్చు పెట్టిన కాలము పూర్తిగా వ్యర్థమేనా? అట్లయినచో నత డిహము, పరము చెడినవాడై నశించునుగదా! సంయమము నకై యత్నింపని మూర్ఖుడైన సంసారి సామాన్య సుఖములయం దైనను ఆసక్తి కలిగి జీవించును. నియమము లేకుండ తినదలచినది తిని, త్రాగ దలచినది త్రాగి, చరింపదలచిన విధమున చరించుచు తన ధోరణిలో నైనను సుఖపడుచు చచ్చును. యోగాభ్యాస మను పేరుతో ఇహ సుఖములను, వ్యామోహములను, మమకారములను విడచిపెట్టుకొని వానికి దూరమై, యోగస్థితి లభింపక, దానికి భ్రష్టుడై చనిపోయినవాని గతి యేమి? సముద్రములోని నీరు స్వచ్ఛతకై లవణములను మాలిన్యములను వదలుకొని మింటి కెక్కి మేఘములై యూరేగుచున్నది. అట్టి మేఘములు వర్షించుటకై కూడుకొనుచున్నప్పుడు, పెద్దగాలి వచ్చినచో ఛిన్నాభిన్నములై నలుదిక్కులకు చెదరిపోవును. ఆ మేఘములవలె యోగసిద్ధి లేక చనిపోయిన సాధకుని జీవితము కూడ వ్యర్థమై పోవునా? అట్లు జరిగినచో వానికి ప్రతిష్ఠ యెక్కడ? అనగా నిలచునట్టి తావెక్కడ? ఉభయ భ్రష్టుడగును గదా! పరబ్రహ్మమును నమ్మినవాని కిట్టి గతి పట్ట వచ్చునా? ఈ సందేహమును నాకు మిగులకుండ తీర్చుటకు తగినవాడవు నీవే. నీవుగాక మరియొకడు నా యీ సందేహము నెట్లు తీర్పగలడు?”

**(37, 38, 39)**

అనగా విని కృష్ణు డిట్లు వివరించెను : “అర్జునా! శుభమైన కార్యా చరణము నవలంబించినవా డెన్నడును దుర్గతిని పొందడు. సముద్రము నుండి ఆవిరియై లేచిన నీరు మేఘములుగా కట్టుకొని, వర్షింపబోవు వేళకు గాలి విసరుకు చెల్లాచెదరై పోవుచున్నది. నిజమే! కాని ఆ మేఘము లెక్కడికి పోయినవి? మరియొక చోట మరల మేఘములుగా కట్టుకొనుచున్నవి. వర్షము యొక్క

ఆవశ్యకతను నిర్ణయించు ప్రకృతి ధర్మముల ననుసరించి, ఆవశ్యకమైన చోట వర్షముగా భూమికి దిగివచ్చుచున్నవి. ఈ దిగివచ్చిన జలములు తల్లిపాలవలె భూమిని పోషించి సారవంతము చేసి, సార్థకము చేయుచున్నవి. అట్లే యోగసాధన మార్గ మవలంబించి భ్రష్టుడైనవాడు సిద్ధిని పొందకుండ చనిపోయినను, చేసిన ప్రయత్నము పవిత్రమైనది గనుక వైఫల్యము కూడ వాని యభివృద్ధికే తోడ్పడునుగాని వ్యర్థము కాదు. అట్టివానికి ఇహ లోకమున గాని, పర లోకమునగాని వినాశము కలుగదు. పుణ్యకర్మ చేసినవారు పుణ్యలోకమును పొందుదురు. వాడును అట్లే పుణ్యమైన స్థితిని పొంది, శాశ్వతములైన సంవత్సరముల తరబడి తన పుణ్యసంస్కారము నందు వసించును. అదియే పుణ్యలోకము.

దిన మంతయు మధురమైన సంగీత సాధన చేయువాడు నిద్రించినను స్వప్నము మధురముగనే అనుభవమునకు వచ్చును. స్వప్నమున కూడ సంగీత వ్యాసంగమే యుండును. నిరంతరము చక్కని చిత్రలేఖనము చేయువాడు స్వప్నమున కూడ దివ్య సౌందర్యము గల చిత్రముల రూపరేఖలనే ఆనందించును. అట్లే అట్టివారు శరీరము విడచిన వెనుక కూడ ఆ సంస్కారము నందే ఆనందించుచుందురు. అట్టి ఆనందమునందు కాలము వర్తింపదు. స్వప్నమున కొన్ని గంటల యనుభవము కూడ ఒక్క క్షణాంతర్భాగమున జరిగిపోవును. కొన్ని గంటల ప్రయాణము చేసినట్లు కలిగిన స్వప్నమునకు క్షణకాలము కూడ పట్టదు. అట్లే సత్కర్మచేసి దేహము విడచినవానికి కలుగు ఆనందము కొన్ని వేల సంవత్సరముల యనుభవముగా నుండును. దానికి మన మెరిగిన కాలము కొన్ని దినములో క్షణములో మాత్రమే యుండవచ్చును. అదే విధముగా ఆత్మ సంయమము నభ్యసించుచు, సిద్ధి కలుగక ముందు చనిపోయినవాడు తన యనుభవమున కొన్ని వేల సంవత్సరములు దాని సుఖము ననుభవించును. మరల శరీరధారణము కలుగునపుడు కూడ పరిశుభ్రమైన మార్గ మేర్పడును. శుచి గలవారు, శ్రీమంతులు అయిన కుటుంబమున జన్మించును. తన పూర్వకర్మానుభవము వలన అట్టివారి గర్భములకే ఆకర్షింపబడును. సాధన యింకను మంచిదైనచో యోగసిద్ధి

చెందినవారి యింటనే పుట్టును. ఈ విధముగా జన్మించుట మిగిలినవారికి చాల దుర్లభము సుమా! అట్లు జన్మించుట వలన సత్సాంగత్యము తోడుకాగా, తన బుద్ధి వెనుకటి సంస్కారమునకే మ్రొగ్గి, అతడు మరల సాధన అవలంబించి సిద్ధు డగును. (40-43)

## యుక్తతముడు :

జీవుల ప్రవర్తనము లన్నియును చాలవరకు అభ్యాసముపై నాధారపడి యుండును. కొంతవరకు మాత్రమే వికాసముపై నాధారపడి యుండును. సృష్టిలో ఈ రెండును ముఖ్యమైనవే. అభ్యాసమనగా చేసినదే మరల చేయునట్టి లక్షణము. వికాస మనగా అంతకు ముందుకన్న విప్పారునట్టి పరిస్థితిని కలిగించు మార్పు. గుండె కొట్టుకొనుట, శ్వాస ఆడుట, జన్మ లెత్తుట అభ్యాసమునకు సంబంధించిన యుదాహరణములు. మేల్కాంచుట, తెలిసికొనుట మొదలగునవి వికాసమున కుదాహరణములు. అందభ్యాసము తమోగుణము వలనను, వికాసము రజోగుణము వలనను కలుగును. ఈ రెండింటికిని పొందిక కలిగినచో సత్త్వగుణ మనబడును. దానివలన దేహమునకును, అవ్యక్తమైన వెలుగునకును పొందిక ఏర్పడి జీవుడగును. కనుక ఈ లక్షణము లన్నియు ప్రకృతికి సంబంధించినవై మనలో స్వభావములుగా ముడివడి యుండును.

అభ్యాసముపై నాధారపడి పనులు చేయువారు సాధకులు. వికాసముపై నాధారపడి పనులు చేయువారు సిద్ధులు. సత్కర్మలు గాని, దుష్కర్మలు గాని సాధకు లెట్లు చేయుదురో లేక సంసారు లెట్లు జారిపడుదురో ఊహింప గల్గుట సాధ్యపడును. సాధుజనులగు సాధకులు అభ్యాసముపై నాధార పడుదురు గనుక, వారు సత్కర్మ లెట్లాచరింపగలరో ఊహించి చెప్పగలము. అట్లూహించుటకు కొలబద్దలే జ్యోతిషము, సాముద్రికము, శకునము మున్నగు శాస్త్రములు. సిద్ధులు అభ్యాసముపై గాక, వికాసముపై నాధారపడుదురు గనుక; వారేమి చేయుదురో, ఎట్లు చేయుదురో, ఎప్పుడు చేయుదురో ఊహించుటకు సాధ్యపడదు. లోకమున నెక్కువమంది సాధకులకు, వారి స్వభావము వారి యభ్యాసముపై నాధారపడి యుండును. పది సంవత్సరములపాటు తెల్లవారు జామున నిద్రలేచుట నభ్యాసము చేసినవాడు అప్రయత్నముగా అట్లే

చేయుచుండును. క్రిందటి జన్మలో యోగసాధన చేసి సిద్ధిపొందక చనిపోయిన వాడు ఈ జన్మలో అప్రయత్నముగ మరల యోగసాధన వైపుకు మ్రొగ్గును. దానికి సంబంధించిన గ్రంథములు నచ్చును. అట్టి వ్యక్తులు, వారి సమావేశ ములు వానికి రుచించును. తన కిష్టమున్నను, లేకున్నను ఆ వాతావరణము వాని నాకర్షించును. అట్టివానికి వయస్సు, వాతావరణము వలన మనస్సునకు దుస్సాంగత్యము కలిగినను, నష్టము కలుగదు. బుద్ధికి పూర్వాభ్యాస మున్నది గనుక, వాని కిష్టము లేకున్నను ఏదో యొక సంఘటన వలన తనకు తెలియకయే మారిపోయి సాధన సాగించును. లోకమున కొంతకాలము పతనము చెంది, తరువాత బాగుపడినవారందరు నిట్టివారే. యోగాభ్యాసముపై నభిలాష యుండుటయే పూర్వజన్మ సంస్కారము. కేవలము యోగశాస్త్రము చదివినవాని కన్న, పూర్వ సంస్కారము కలవానికే బల మెక్కువ. ఈ సంస్కారము లేనివాడు యోగశాస్త్రము నభ్యసించినను, అది పాండిత్యమునకు, చిలుక పలుకులకు, ధనార్జనకు, సన్మానములకు వేడుక పడుటకు, పదిమందిచే పూజింపబడవలెనని యత్నించుటకు మాత్రమే వినియోగపడును. బాగుగా చదివినవారిలో నీర్ష్యాసూయలు గలవారు శాస్త్రము యొక్క బలాబలములు తేల్చుకొనుటకై ఆసుర పద్ధతు లవలంబించువారు కలరు కదా! వారందరును ఈ తరగతికి చెందినవారే!

గ్రంథముల యందలి శబ్దబ్రహ్మము కూడ వేదమే గనుక శబ్దార్థములు సాధకునకు గోచరించు వైఖరి వేరు, పండితునకు గోచరించు వైఖరి వేరు. పూర్వాభ్యాసము కలవానికి శాస్త్ర గ్రంథములు, సంభాషణలు, సద్గోష్ఠులు సరియైన మార్గము చూపును. ఈ మార్గమున సాధకుడు కేవలము పండితుని వలెగాక, గర్వాహంకారాదుల నుండి పరిశుద్ధి చెందును. ఈ లోపున ఎన్ని జన్మలెత్తినను కాలక్రమమున ఆత్మజ్ఞానము పొంది సిద్ధుడగును. ప్రయత్న మనునది పూర్వజన్మ వాసనచే సులభముగా బలీయమగును గనుక, ఇట్టి ప్రయత్నమున సాధకుడు అనేక జన్మలలోనైనను సిద్ధుడై యుత్తమగతిని పొందును. **(44, 45)**

ఇన్నిటికి మూలము అభ్యాసము. అనగా సాధన యందలి మంచి చెడ్డలను తెలిసికొనుటకు వ్యర్థముగా యత్నింపక, ఆచరణలో పెట్టుటయే

సాధన. అది తెలిసిన జ్ఞానమును కర్మాచరణముతో యోగము చేయు విధానము గనుక యోగవిద్య యనబడును. ఆచరణము నవలంబించువాడు తపస్సు చేయువానికన్న అధికుడు. తపస్సు అనగా తీవ్రమైన నిష్ఠ, దానికన్న నిరంతర మైన యాచరణము గొప్పది. జ్ఞానముకన్న కూడ ఆచరణయే గొప్పది. ఆచరణ లేనిచో తెలిసిన జ్ఞానము మన కంటదు. సత్కర్మ నాచరించుటకన్న కూడ దాని నభ్యాసము చేయుట గొప్పది. ఎప్పుడో ఒకమారు సత్కర్మ నాచరించినచో ఆనందము కలుగవచ్చును గాని, స్వభావమున మార్పు కలుగదు. మరల మరల నాచరించుచున్నపుడు మాత్రమే స్వభావమున మార్పు కలుగు నవకాశ మున్నది. స్వభావ మనగా త్రిగుణములు పాళ్ళుగా కలుపబడి యుండుట. ఈ పాళ్ళు మారిననే గాని స్వభావము మారదు. పాళ్ళు మారవలె నన్నచో నిష్ఠ యున్నను లేకున్నను సత్కర్మను మరల మరల నాచరించు చుండవలెను. ఇదియే యోగాభ్యాసము. కనుకనే తపస్సు చేయువానికన్న, జ్ఞాన మార్జించు వానికన్న, సత్కర్మ లాచరించువాని కన్న అభ్యాసముచేసి యోగి యగువాడు ఉత్తముడు. అనగా నేనను పదమున కర్థము తనయందు వికాసము చేసికొనిన వాడు ఉత్తముడు. వాడే శ్రద్ధ గలవాడు. శ్రద్ధ యనగా తాను ఆచరించు సత్కర్మా చరణ మంతయును, ఆచరించు వానియందు మేల్కొనుట. మనలో నుండి ఈ మనలను ప్రేరేపించుచున్న వాడెవడో, వానియందు సత్కర్మాచరణకు మన యాచరణము వికాసము చెందుటయే శ్రద్ధ. ఆచరింపవలసిన పని ఆచరణలో లీనము కావలెను. ఈ యఖండమైన వికాసమే శ్రద్ధ. "నన్ను శ్రద్ధతో నెవ డారాధించునో, వాడు నా దృష్టిలో నుత్తముడైన యోగి'' అని కృష్ణుడు చెప్పుచున్నాడు. **(46, 47)**

ఏడవ అధ్యాయము

# విజ్ఞాన యోగము

**సమగ్ర జ్ఞానము :**

మానవుల యందు పరిచయమున్న వారిలో ఒకరి యందు ఒకరికి ఆసక్తి యుండును. కొందరు తమకు ఉపయోగించువా రనియు, కొందరు తమకు పనులు చేసిపెట్టుచున్నా రనియు, మరికొందరు తమ ఆర్జనకు కారణ మగుచున్నా రనియు వారియం దాసక్తి కలుగును. అట్లే కొందరు తమ కుపయోగించుట లేదనియు, కొందరు తమతో ఎక్కువకాలము మాట్లాడుట లేదనియు, కొందరు తమతోనే గాక ఇతరులతో గూడ సినిమాలు మున్నగు వానికి పోవుచున్నారనియు, కొందరు తమ ఇంటికే గాక ఇతరుల ఇండ్లకు కూడ భోజనములకు పోవుచున్నారనియు, కోపము, చిరాకు, ఈర్ష్య, ద్వేషము మున్నగునవి కలుగుచుండును. అట్లే తమవారు కొందరు అనారోగ్యముగా నున్నారనియు, మరికొందరు పేదరికముతో బాధపడుచున్నా రనియు, తమ వారికి కొందరికి ఉద్యోగ మింకను లభింప లేదనియు, తమ వారికి ఇంకను పెండ్లి సంబంధములు కుదురుట లేదనియు, బాధపడుచు దుఃఖపడు చుందురు. ఈ విధముగా పరిచయమున్న వారిలో కొందరి యెడల కోపతాప ములు, కొందరి యెడల దుఃఖము కలుగుచుండును. ఇన్నియు నొక్కొక్కడు తా నెరిగిన వారితో పెట్టుకొన్న సంబంధములే. ఈ సంబంధముల వలన మనస్సు ఒక తీరున నడవక ఇన్ని విధముల మారుచుండును. కనుక ఇవి అసౌఖ్యమునకు కారణములై దుఃఖమును గలిగించుచున్నవి. నిజమునకు ఇవి బంధములే గాని, సంబంధములు గావు. మనస్సులోనే ఇవి యన్నియు నేర్పడు చున్నవి. ఇటుకల నడుమ సిమెంటు, సున్నము వలె వ్యక్తుల నడుమ మనస్సు పనిచేయును. ఇట్లు మనస్సుతో అంటించుకొనుటనే సంగము, సక్తి, ఆసక్తి యందురు. దీని బాధ నివారణమై మనస్సు నిశ్చలమగుట యెట్లు?

పై చెప్పిన సంబంధము లన్నియు నితరుల యెడల ప్రయోజనమును బట్టి ఏర్పరచుకొన్నవి. అనగా మనస్సున తాను అల్లుకొనిన ప్రయోజనముల చుట్టను మరియొక వ్యక్తిగా నమ్మి సంబంధము పెట్టుకొనుచున్నాడు. కనుక ఈ సంబంధము - వ్యక్తులపై తనకు గల అభిప్రాయములతో పెట్టుకొన్నదే గాని, వ్యక్తులతో పెట్టుకొన్నది కాదు. వ్యక్తులకు అనేక గుణములు వర్తించు చుండును. అవి వారి స్వభావమును బట్టి ఏర్పడి, మనకు మంచిగనో, చెడుగనో తోచుచుండును. ఈ విధముగా నొక్కొక్కరిని గూర్చి మంచిచెడ్డలు కలసిన గుణములు బెడ్డలతో కలసిన బియ్యమువలె మనస్సునకు లభించుచుండును. వీనితో బాధపడువా రందరు ఇతరుల గుణములతో తమ మనస్సునకు సంబంధ మేర్పరచి, ఇతరులతో సంబంధము లేర్పడినట్లు భ్రాంతిపడుచున్నారు. చారు కాచుచుండగా ఉప్పు, చింతపండు, జీలకర్ర, ఇంగువ, ఒక దానిపై నొకటి పనిచేయుచు చివరికి అవి నీటిపై ప్రభావము చూపినట్లు భ్రాంతి గొల్పును. ఆ భ్రాంతితో చారు రుచిగా నున్నదని మనము నీటిని త్రాగు చుందుము. అట్లే ఒకని గుణములు మరియొకని గుణములపైన మనస్సులలో ప్రభావము చూపుచుండగా, నొకరు మరియొకరిపై ప్రభావము చూపుచున్నారని భ్రమ కలుగుచుండును. వీనిని వదలి ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తియందు ఆసక్తి నేర్పరచు కొను విధానము కావలయును. గుణములు, మనస్సు అనువానిని వదలి యెదుటి వ్యక్తిని గూర్చి ఆలోచించినచో అతనిలోని ప్రతి భాగము భగవంతుని యంతర్యామిత్వమే. భగవంతుడే అతని రూపముగా ఇన్ని గుణములలో వర్తించుచు మాట్లాడుచుండును. ఆ భగవంతుని తెలిసికొనుటకు ప్రతి వ్యక్తి యందును 'నేను' అను పదమున్నది. ఈ పదమును గుణములతో, మనస్సుతో కలిపి అర్థము చేసికొన్నచో అహంకార మనబడును. వానిని విడచి స్వచ్ఛమైన 'నేను' ను గూర్చి ఆలోచింప గలిగినచో ఇతరులలో చూడగలిగినచో యోగము సిద్ధించును. కనుకనే "నాయందు ఆసక్తి కలిగిన మనస్సు గలవారై, నన్నాశ్ర యించి యోగము జోడించుచు జీవులు నన్ను తెలిసికొనుచున్నారు", అని భగవానుడు చెప్పుచున్నాడు. ఆ తెలిసికొను తెలివియే జ్ఞానము. దాని విధానమే విజ్ఞానము. అట్టి జ్ఞానమును తెలిసికొన్నచో ఇక మిగిలినది యుండదు. తెలియవలసినది ఇంకను మిగులదు. మరల మరల తెలిసికొనునపుడు గూడ

అది యొక్కటే తెలియుచుండును. అదికాక గుణములు మున్నగు వానిని గూర్చి తెలిసికొనుటకు యత్నించినచో ఒక్కొక్కమారు ఒక్కొక్క విషయము తెలియును. బ్రతికియున్నంత కాలము తడవకొక విషయము తెలియుటయే గాని, మొత్తము తెలియదు. అట్లుగాక ఈ గుణము లన్నియు నెందిమిడి యున్నవో అట్టి నన్ను తెలిసికొనగోరి నన్నాశ్రయించినచో అన్నిటి యందున్న ఒకే అస్తిత్వము దర్శనమిచ్చును. కనుక దానియందలి గుణము లన్నియు గూడ మిగులకుండ దర్శనమిచ్చును. ఇక తెలియవలసినది వేరుగా నుండక తెలిసినదానిలో నిమిడియే యుండును. (1)

అందరును ఈ విధముగా గుణములను చూచి భ్రాంతి పడక, గుణములయందు అంతర్యామిగా నున్న నన్నాశ్రయించు చున్నారా? లేదు. ఎక్కువగా మనస్సు గుణముల నర్థము చేసికొన యత్నించుటయే జరుగును. అట్లు గుణముల వెంట తమ జీవిత మంతయు పరుగెత్తుచు, తుదకు గుణముల కవ్వలనున్న వానిని చూడకయే చనిపోవుచున్నారు. చూచుట యందలి ఆసక్తి, మరియొకదాని వెంట పరుగెత్తుటయే దీనికి కారణము. మరియొకటి లేదనియు, అన్ని మరియొకట్లును అంతర్యామియందే ఉన్న వనియు నిరంతరము జ్ఞప్తి చేసికొనుచుండుటయే యోగము జోడించుట. యోగము జోడింపక యోగాభ్యాస మెంతచేసినను ఫలము లేదు. ఇతరులతో తమతమ సంబంధముల వెంట మనస్సు పరుగెత్తుచుండగా జీవితము ఖర్చు అయిపోయి చనిపోవువారు వేయిమంది యున్నచో, వారిలో నొక్కరు నన్నాశ్రయించుటకు యత్నించును. యత్నించి చూడగోరు వారికి నిరంతర సాధనము కావలయును. కనుక యత్నించువారు వేయిమందిలో నొక్కడు నన్ను తత్త్వముగా తెలిసి కొనును. అనగా అదే తానుగా తెలిసికొనును. 'అది' 'తాను' అను పదములచే పిలువబడుచున్నది, 'నేను' అనే పదముచే తెలియబడవలెనని తెలిసికొనును. వాడే తత్త్వవేత్త. వాడు శరీరము ధరించి యున్నను నన్నాశ్రయించెను గనుక అన్నిటియందు నేనుగా నుండును. ఇట్లు ప్రయత్నించి తత్త్వమును తెలిసి కొనుటకు తన చుట్టుప్రక్కల కనిపించుచున్న వస్తువులను, లోకములను, తనతో సంబంధముపెట్టుకున్న వ్యక్తులను చూచుట కభ్యాసము చేయవలసిన

పద్ధతి యొకటి యున్నది. దాని కొక క్రమ మున్నది. ఆ క్రమమే జ్ఞానముతో కూడిన విజ్ఞానము. అది ఏడవ అధ్యాయమున నుపదేశింపబడును. (2, 3)

## ప్రకృతి - పరాప్రకృతి :

"నేను బజారుకు వెళ్ళి వచ్చితిని", "నేను ఊరికి వెళ్ళి వచ్చితిని" మొదలగు వాక్యములను మనము సంభాషణావశమున పలుకుచుందుము. ఈ సందర్భమున నేను అనగా శరీరముతో కలుపుకొని అర్థము చెప్పుకొన వలెను. ఊరికి వెళ్ళునది, బజారుకు వెళ్లునది శరీరమే కదా! దానినే మనము కొనిపోయి, కొనివచ్చుచున్నట్లు నమ్ముదుము. శరీరముకాక నేనను చెప్పబడు వాడు వేరుగా నుండునా? శరీరమంతయూ నేనుతో నిండి యుండునా? శరీరమే నేనను పదమున కర్థమా? ఈ మూడు ప్రశ్నలను విడదీయగల తెలివియే జ్ఞానము. అందలి నేనును గుర్తించు తెలివియే జ్ఞానము. ఇందు నేను శరీరము కాదని తెలియుచునే యుండును. కనుకనే నా శరీరమని వ్యవహరింతుము. ఇందలి సత్యమేమనగా నేనను వెలుగే అనేక స్థితి భేదములుగా దిగివచ్చి, దేహాదులుగా వసించుచున్నది. ఈ స్థితి భేదములనే భూతములు అందురు. నీరు మంచుగడ్డగా ప్రవర్తించునట్లు నేనను అంతర్యామి భూతముల యందు ప్రవర్తించును.

శరీరమున గల చర్మము, గోళ్ళు, దంతములు, ఎముకలు, జుట్టు మున్నగు ఘనపదార్థము లన్నియు భూమిలోని ఖనిజములచే చేయబడినవి. ఈ ఘనపదార్థమునే పృథివి లేక భూమి యందురు. అదికాక మన దేహము నను, భూమిపైనను జలమున్నది. మన దేహమందును, సూర్యరశ్మి యందును, నిప్పునందును వేడిమి యున్నది. దానినే అగ్ని యందురు. మన శ్వాస యందును, మన చుట్టును గాలి వున్నది. దానినే వాయు వందురు. మన దేహమందును, చుట్టును చోటున్నది. దానినే ఆకాశ మందురు. ఈ ఐదింటిని పంచభూతము లందురు. ఇందలి ప్రతి పరమాణువు గూడ నేనను వెలుగు నుండియే స్థితి భేదములుగా పేరుకొని పొరలు వర్తించు చున్నది. వీనితోనే మన భూగోళము చేయబడినది. వీనితోనే మన దేహము గూడ నేర్పడినది.

ఇవి కాక మనలో మనస్సున్నది. దాని నుపయోగించు బుద్ధి వున్నది.

అట్లే చోటులో గూడ మనస్సు, బుద్ధి యుండి యుండవలెను. మన దేహమందలి ఈ తత్త్వములను మిగిలిన వానికన్న వేరుగా గుర్తించుటకు మరియొక తెలివి యున్నది. దానినే అహంకార మందురు. దాని వలన నేను, నాకన్న మిగిలిన ప్రపంచము అను భేదము ఏర్పడు చున్నది.

ఈ విధముగా మనలో ఎనిమిది తత్త్వము లున్నట్లు గుర్తింప వచ్చును. **1.** పృథివి, **2.** జలము, **3.** అగ్ని, **4.** వాయువు, **5.** ఆకాశము, **6.** మనస్సు, **7.** బుద్ధి, **8.** అహంకారము. ఇందు అహంకారము కేంద్రముగను, పరిధిగను ఏర్పడి దానియందు మిగిలినవి వర్తించును. ఇట్లు పొర లేర్పడుట, యేర్పడి దేహములుగా వర్తించుట ఈ మొత్తము నేనను వెలుగునందే జరుగుచున్నది. ఈ నేనను వెలుగే భగవంతుడు. ఎనిమిది విధములుగా వర్తించుటయే వాని స్వభావము లేక ప్రకృతి. అనగా ప్రకృతి అను శక్తి ఎనిమిది విధములుగా వర్తించుచున్నది. ఇట్లు ప్రతి దేహము నందును ఈ ప్రకృతి వర్తించును. అట్లే ప్రతి గ్రహగోళము నందును, సూర్యుని యందును గూడ ప్రకృతి వర్తించును. ఈ మొత్తమును వర్తింపజేయు మహా ప్రకృతి యని మరియొకటి యున్నది. దానియందే ఈ జగత్తులన్నియును ఉద్భవించి లయ మగుచుండును. ఇది తొమ్మిదవది. ఈ తొమ్మిదియు నేనను వెలుగునందు వర్తించును. నేనను వెలుగు వీనియం దంతర్యామిగా నుండును. ఈ తొమ్మిదవ ప్రకృతినే జీవు డందురు. జీవునియందే ఈ జగత్తు ధరింప బడుచున్నది. జీవుడు మిగిలిన ఎనిమిది ప్రకృతులకును, అంతర్యామికిని నడుమనున్న ద్వారము. ఈ జీవుడు మిగిలిన ఎనిమిదింటి యందును వర్తించు చున్నపుడు పరిమితుడగును. దేవుని యందు వర్తించుచున్నపుడు నేనను పదమునకు అహంకారమని యర్థము. దేవుని యందు వర్తించు చున్నపుడు దేవుడగును. మిగిలిన ప్రకృతుల యందు వర్తించు చున్నపుడు నే నను పదమునకు అహంకారమని యర్థము. దేవుని యందు వర్తించుచున్నపుడు నే నను పదమునకు దేవుడని యర్థము. ఈ దేవుడే ఇన్నిటియం దంతర్యామిగా నున్నాడు. ఐనచో ఈ ఎనిమిది ప్రకృతులు చేయునట్టి పనియేమి? ఇవి దేవున కుత్పత్తి స్థానములు. వీని వలననే జీవరాశులు పుట్టుట, పెరుగుట జరుగును. ఇన్నిటికిని నేనను వెలుగే ఉత్పత్తియు, లయకారణము కూడ నగుచున్నది. అనగా నివి యన్నియు నాయందు పుట్టి

నాయందు లయమగుచున్నవి. నాకు పైన మరేమియు లేదు. దారమునందు మణులు గ్రుచ్చబడియున్నట్లు నాయందిన్నియు అల్లుకొని యున్నవి. ఈ ప్రజ్ఞను ధరించి, ఏమరుపాటు లేకుండ జీవించుటయే జ్ఞాన మనబడును. (4-7)

ఇన్నిటియందును నేనను వెలుగు ఏ విధముగా మనకు గోచరించును? మనకు వెలుపల నీరున్నది. మనకు నాలుక ఉన్నది. నీటికిగాని, నాలుకకు గాని రుచి లేదు. నాలుకను నీరు స్పృశించినచో రుచి తెలియును. ఇట్లు తెలియుటయే నేనను వెలుగు వ్యక్తమగుట. సూర్యుని యందును, చంద్రుని యందును వెలుగున్నది. మనకు కన్నున్నది. ఆ వెలుగునకుగాని, ఈ కంటికి గాని చూచునట్టి లక్షణము లేదు. కంటిని వెలుగు స్పృశించినచో చూచుట యను లక్షణము వ్యక్తమగుచున్నది. ఇట్లు వ్యక్తమగుటయే నేనను దేవుని వెలుగు వ్యక్తమగుట.

సృష్టిలోని ఈ ఎనిమిది ప్రకృతుల యందును యిమిడియున్న ప్రకృతి ధర్మముల సముదాయమే వేదము. దాని యుచ్చారణమే మనలోనున్న ప్రాణ కారణము. అది శ్వాసగా పనిచేయును. అట్లు పనిచేయించుటకు దాని యందు వ్యక్తమగు ప్రాణమే ప్రణవము లేక ఓంకారము. కనుక సర్వ వేదముల యందును ప్రణవము నేనను వెలుగు. అదియే ఆకాశమునందు ఇన్నియు వ్యక్తమగు శక్తిగా నిమిడియున్నది. అది యొక యుచ్చారణమువలె వెలువడును గనుక దానిని శబ్దమందురు. ఆకాశము నందు శబ్దము రూపమున నేనను వెలుగు ఇమిడి యున్నది. అదియే నరులయందు నరత్వముగా నిమిడి యున్నది. అనగా నేను నరుడను అను భావము. ఈ నరుడే పురుషు డనబడును. శరీర మును పురముగా నిర్మాణము చేసికొనును గనుక పురుషుడను పేరు వచ్చినది. ఈ యభిప్రాయమునే పురుషత్వము లేక పౌరుషము అందురు. (8)

ఈ నేనను వెలుగే పృథివీ తత్త్వమున గంధముగా నిమిడియుండి, శుభములైన అనేక ద్రవ్యములలో సుగంధముగా వెలువడుచున్నది. చందనము, కర్పూరము, అగరువత్తులు మొదలగు వానిని వాసన తెలియునపుడు మనస్సు విప్పారును. ఇట్లు విప్పారుటయే నేనను వెలుగు వ్యక్తమగుట. ఈ వెలుగే

నిప్పునందు మంటగా వెలువడుచున్నది. కట్టె రూపమునగల మిగిలిన భూతములను విడదీసి వాని వాని స్వస్థానములకు పంపుచున్నది. మరల విత్తనము నందును, శుక్రధాతువు నందును ఈ వెలుగే పనిచేసి, ఆ పృథివి మొదలగు భూతములనే ఆహ్వానించి, దేహములుగా కలుపుచున్నది. అదే వెలుగు జీవులలో జీవితముగా అంతర్లీనమై తెలిసికొనబడుచున్నది. వ్యక్తులు నా జీవితము గడచుచున్నదని చెప్పుదురు గాని, జీవిత మెక్కడ నున్నదో గుర్తింప లేరు. అదియే దేవుని అంతర్యామిత్వము. (9)

ఒకడొక కార్య సాధనకై తీవ్రముగా ప్రయత్నించు చుండును. ఆ ప్రయత్న మెక్కడ నున్నదో చెప్పలేడు. దానిని గమనించి, దాని వెంటబడగలిగినచో ఆ ప్రయత్నమునే తపస్సు అందురు. అట్టి వారికి మాత్రమే ప్రయత్నించిన పనులు సిద్ధి పొందును. కనుక తపస్సు చేయువారిలో తపస్సు నేను. జీవులు చూచుట కొక సూక్ష్మమైన ప్రారంభము కావలెను. దానినే విత్తన మందురు. అందు మొలకలెత్తు వింత వెలుగు నేనే. ఈ నేను సనాతనుడనుగా శాశ్వతుడనుగా నుండియు, నెప్పటికప్పుడు మొలకెత్తుచుందును. నదిలో నీరెప్పుడును ప్రవహించి పోవుచున్నను నది నిలిచియే యుండును. అది ధారా స్వరూపము. అట్లే నేను మొలకెత్తుచున్నను, శాశ్వతముగా నుందును. బుద్ధిబలము గల వానిని చూచి, బుద్ధిమంతు డందురు. ఆ బుద్ధి ఎక్కడ నున్నదో చెప్పలేము. అది నేనే. అతడు శౌర్యము కలవాడనియు, తేజస్సు కలవాడనియు అందుము. ఆ శౌర్యము, తేజస్సు నేను. (10)

**దైవీమాయ :**

బలవంతునకు బలము కండల యందుండునా? కండలు పెంచిన వానిని ఒక్కొక్కనిని చూచి యితడు బలవంతుడని మెచ్చుకొందురు. ఇంకొక్కనిని చూచి యితడు రౌడీ యనియు, మరి యొకడు గూండా యనియు, మరియొకడు హంతకుడనియు చెప్పుకొందురు. అట్టివాడు దారిని పోవునపుడు ఎవరికి వారు తప్పుకొని గుసగుస లాడుకొందురు. ఆ గుస గుసలలో అతడు బలవంతుడని చెప్పుకొనరు. మరియొకడు అదే విధముగా కండలు పెరిగిన వాడు బాటపై దుండగీడుల బారి నుండి యొక మంచి వానిని రక్షించును. అవసరమైనచో చేయి చేసికొనుటకు జంకడు, ప్రాణములకు తెగించియైన

రక్షించును. ఇందరును కండలు పెరిగినవారే యైనను, ఇందరినీ బలవంతులని మెచ్చుకొనము. మంచి పని చేయువానిని మెచ్చుకొందుము. చెడ్డపని చేయు వానిని కండలున్నను నిందగా చెప్పుకొందుము.

దీనిని బట్టి బలవంతుడను పేరు కేవలము కండలకు మాత్రమే సంబంధించినది కాదని స్పష్టపడుచున్నది. బలవంతుని దేహము నందు ఏ భాగమున బలమున్నదో చూపించలేము. సత్కర్మకు వినియోగపడిన బలమునే బలమని మెచ్చుకొందుము. కామక్రోధములు, రాగద్వేషములు స్పృశింపని బలవంతునిలోని బలము భగవంతుని అస్తిత్వము. అంతే కాదు, ధర్మమునకు విరుద్ధము కాని కామము నందును, క్రోధము నందును కూడ భగవంతుని అస్తిత్వమే యుండును. ఒకడు తన భార్యయందు అనురాగము కలవాడన్నచో తప్పులేదు. తన కుర్రవానికి పరీక్షలలో ప్రథమ శ్రేణియం దుత్తీర్ణత కలుగ వలెనని కాంక్షించి, శ్రద్ధతో రాత్రింబవళ్ళు వానికి పాఠము చెప్పును. అది కామమే. అనగా కోరికయే యైనను, ధర్మమునకు విరుద్ధము కాదు కనుక తప్పులేదు. తప్పు లేకపోవుటయే కాక, ఆ కామరూపమైన శ్రద్ధ భగవంతుని యంశమే అని తెలిసికొనవలెను. అట్లే క్రోధము విషయమునను, రాముడు క్రోధమునందు కాలాగ్ని సదృశుడని వాల్మీకి వర్ణించెను. ఇది కేవలము రాక్షస సంహారమునకు సంబంధించినది కనుక నిది దైవాంశయే.

లోకమున సాత్త్విక భావములు మాత్రమే దైవాంశకు సంబంధించినవని మిగిలినవానిని త్రోసిపుచ్చరాదు. రాజసములు, తామసములు నగు భావములు కూడ ధర్మమునకు విరుద్ధములు కానిచో, ధర్మము నిలుపుటకు పనికి వచ్చున వైనచో తప్పనిసరిగా దైవసంకల్పమునకు సంబంధించినవని గుర్తింపవలెను. దైవము నేనను ప్రజ్ఞగా నందరిలో నుండును. దానికి త్రిగుణము లంటవుగాని, దాని కనుగుణముగా త్రిగుణములు పనిచేయుచు సృష్టిని చక్కపెట్టుకొనుట సిద్ధుల జీవితము లందును, అవతార పురుషుల జీవితము లందును కాన నగును. ~~ఈ~~ భావములలో దేవుడు పట్టుబడడు. కాని దేవునియందీ భావములు అస్తిత్వము పొంది పనిచేయుచుండును. సృష్టి మొత్తము సత్త్వ రజస్తమస్సులతో కూడియుండి, వాని నంటకుండ నంతర్యామియై దేవుడుండును. త్రిగుణ ములు లేనిచో దేవుడుండును గాని సృష్టి యుండదు. త్రిగుణములు మూడు

రంగుల దారమువలె సృష్టిలో నుండును. ఈ దారములతో అల్లిక చేయబడిన రుమాలువలె సృష్టియుండును. ఆ రుమాలుపై వివిధ రూపము లల్లిక చేయబడి నట్లు, సృష్టిలోని జీవుల రూపములును, వస్తువుల రూపములును, మనస్సు, ఇంద్రియములు, స్వభావములు భాసించును. ఒక రుమాలుపై మనిషి బొమ్మలు, జంతువుల బొమ్మలు, తేళ్లు, పాముల బొమ్మలు నుండవచ్చును. అందలి దారములకు గాని, దారములలోని ప్రత్తికిగాని ఈ బొమ్మలు లేవు. అట్లే అంతర్యామికి త్రిగుణ ప్రవృత్తులు లేవు. **(11, 12)**

ఇట్లు విడదీసి చూచుటకు సూక్ష్మదృష్టి కావలెను. అదిలేనిచో జీవులు త్రిగుణములతోనే ప్రవర్తింతురు. మనస్సు త్రిగుణములలో చిక్కుకొనును. సూక్ష్మదృష్టి అంతర్యామి దృష్టిగా నున్నచో, ఆ మానవుని ప్రకృతి త్రిగుణము లలో చిక్కుకొనక, భగవంతుని అనుసరించు ప్రకృతియై యుండును. అట్టి యుత్తమ ప్రకృతిలోకూడా చిక్కుకొనక స్వచ్ఛమైన నేనను ప్రజ్ఞగా దేవుడు ఉండును. చిక్కుకొనినప్పుడు వ్యక్తిగత ప్రకృతి పనిచేయును. అప్పుడందలి ప్రజ్ఞ మోహము చెంది, ఇతరులలో గుణములను చూడగల్గును గాని, అంతర్యామిని చూడలేదు. **(13)**

అయినచో గుణము లనబడు దారములచే అల్లబడిన త్రిగుణాత్మక ప్రకృతి దేవునిలోని భాగమగునా, కాదా? దేవుని నుండి దిగివచ్చిన ప్రకృతిలోని భాగమగును. సూర్యరశ్మి సూర్యునిలోని భాగమగునా, కాదా? అట్లే త్రిగుణాత్మక ప్రకృతియును. 'నేను' అనబడు దేవుని నుండి 'నాది' అనబడు వెలుగు ప్రసరించు చుండును. ఈ వెలుగే త్రిగుణాత్మక ప్రకృతి కనుక అది దేవుని ప్రకృతియే. ఇట్లు ప్రసరించుచున్న వెలుగు దేవునికన్న వేరుగా భాసింపనిచో సృష్టి యుండదు. ఇట్లు భాసించుటనే మాయ యందురు. దానిని దాటవలెనని కోరినవారికి దాటుట సాధ్యము కాదు. దానియందున్న దేవుని 'నేనుగా' ధ్యానించిన వారికి దాటుట సాధ్యమగును. త్రిగుణాత్మక ప్రకృతిలో నున్న సమస్త భేదము లందును భగవంతుని అస్తిత్వము ధ్యానింపగలవాడు మాత్రమే మాయను దాటును. అనగా తనయందు, అఖిల భూతముల యందు భగవంతుని అంతర్యామిత్వము నిరంతరముగా స్మరించి చూచువాడు మాయను దాటును. ఇట్లు చూచుటయే 'నన్ను' శరణు పొందుట. **(14)**

దేవునకును, ప్రకృతికిని గల భేదమును కనిపెట్టుటకు యత్నించువాడు ప్రకృతిని చూచును గనుక దానిలో చిక్కుకొనును. అట్లుగాక ప్రకృతిలో కూడ దేవుని చూచుట నభ్యసించినవాడు చిక్కుకొనడు. దుష్కర్మ లాచరించువాడు తప్పక త్రిగుణములలో చిక్కుకొని మోహము చెందును. మోసగించుట మున్నగు పనులు చేయువాడు మోసగింప దలచువారిని వేరుగా చూచి, వారి యస్తిత్వ మొప్పుకొనుచున్నాడు కనుక వారితో సంబంధమను బంధమున చిక్కు కొనును. మోసము స్వలాభము కొరకు చేయును గనుక తన యభిప్రాయ ములు తనకన్న వేరుగ నేర్పడి, వానియందు చిక్కుకొనును. దానిని బట్టి యితరులతో సంబంధ మేర్పరచుకొనును గనుక ఆ సంబంధములలో చిక్కుకొని మొహమాట పడును. జయాపజయములు, మానావమానములు అను మోహ వికారములతో వాని మనస్సు క్లేశపడు చుండును. అట్టివానికి ప్రయోజనములలో చిక్కుకొనిన మనస్సు భయాదులను పొంది, వానిని పోగొట్టుకొన యత్నించుచు నీచముగా పనిచేయును. అట్టి ప్రవర్తన కలవాడు నరులలో అధమ ప్రకృతికి చెందినవాడు. వాని జ్ఞానము మాయచే ఆవరింప బడును. అట్టివాడు ఆసుర భావమును ఆశ్రయించును. అప్పుచేసి, అప్పుల వానికి భయపడి తప్పుకొని తిరుగును. అతని యెడల భయముచే బాధపడుచు, బాధకు కారణములను అతనిలో వెదకుట కారంభించును. తప్పు లెన్నుట, దుష్ప్రచారము, అవమానించుటకు యత్నించుట, కొట్టించుట, చంపించుట మున్నగు యత్నములను చేయును. అట్టివాడే అసురుడు. ఒకమారు అట్టి భావముల లోనికి ప్రవేశించిన తరువాత కార్యకారణ సంబంధము సుడి గుండమువలె నేర్పడును గనుక దాని నుండి తప్పించుకొనుట కష్టము.(15)

## చతుర్విధ భక్తులు :

ఆసుర ప్రవృత్తి కలవాడు సద్గుణము లున్నవారిని చూచి ఈర్ష్యాదులు చెంది పాప ప్రవృత్తి ప్రదర్శించును. తన దుష్ప్రవృత్తికి కారణమును ఇతరులలో వెదకుచుండును. అతడీ విధముగా సజ్జనులలోని సద్గుణములు గమనించి ఈర్ష్యాది బాధలు చెందును. సద్గుణ స్వరూపుడైన భగవంతుని గుర్తించి వైరభక్తితో నారాధించుట ప్రారంభించును. దైవమును ఆసుర వృత్తిలోనున్న మానవుడు ధ్యానించుట యిట్లే ఆరంభించును. తన దుష్ప్రవర్తనముచే బాధలు

కొనితెచ్చుకొని, వానిని తొలగించుకొనుట యెట్లా యని మార్గము వెదకును. స్వప్రయత్నమున తప్పించుకొనుటకు యత్నము చేసి చాలవరకు విఫలు డగుచుండును. వ్యాధి, దారిద్ర్యము, వార్ధకము, తనవారు తిరస్కరించుట మున్నగునవి తన్నెదిరించినపుడు ఇతరుల సహాయ మర్థింపక తప్పదు. ఇట్లితరులలోని యంతర్యామి నుపాసించుట ఆర్తితో ప్రారంభమగును. ఇంతలో నెవడో "సుందరకాండ పారాయణము చేయుము. శివాలయములో అభిషేకము చేయించుము. ఆ మహాసిద్ధుని దర్శింపుము'' మొదలగు సలహాలు చెప్పును. అట్లాచరించుట వలన తనకు చెడ్డరోజులు తొలగిపోయిన సంగతి వివరించును. దానితో దైవమును భజించుట ప్రారంభమగును. తన్మూలమున కొన్ని బాధలు శమించును. కొన్నియట్లే యుండును.

శమించినవాని మూలమున ఆశ పుట్టును. నమ్మకము కుదురును. మిగిలినవి శమింపకుండుట వలన అసలు బాధలకు కారణమేమి? భగవంతుని ఏ రూపమున కొలుతును? ఈ సృష్టి రహస్యమేమి? జనన మరణము లెందుకు కలుగవలెను? మున్నగు జిజ్ఞాస పుట్టును. భగవంతు డేయే రూపములలో కొలువబడుచున్నాడు? వాని అవతారముల మాహాత్మ్యమెట్టిది? ఏ యూరిలో దేవునికెట్టి మహత్తు గలదు? ఇట్లు పరిశీలన చేసి తన కష్టములకు ఆయా దేవుళ్ళను గురిపెట్టుట ప్రారంభించును. ఇట్లు జిజ్ఞాసాపరుడై ఒకే యంతర్యామిని పలు రూపములలో భావన చేసికొనును. "మిగిలిన దేవుళ్ళకన్న ఈ దేవుడు గొప్ప'' అని కూడ వాదించును. అనగా మిగిలిన దేవుళ్ళను కూడ కాదనుటతో వైరభక్తిగా స్మరించును. దైవస్మరణ కర్మబంధమునకు నిప్పువంటిది కనుక అతని భావములు నలుమూలల నంటుకొనును. దానితో కర్మపరిహారము కొరకు సత్కర్మ లాచరించుట యందు నేర్పరియై, వివిధ ప్రయోజనములు సాధించుకొనును. కోర్టు వ్యవహారము జయము కొరకు ఆంజనేయ దండకము, వ్యాధులు కలిగినపుడు మృత్యుంజయ స్తోత్రము, బంధుమిత్ర తిరస్కారము కలిగిన విష్ణు సహస్రనామము, పనులు మొండిపడినపుడు సుందరకాండ- ఈ విధముగా 'సిలబస్' నేర్పాటు చేసికొని, అర్థార్థియై, యొకే దేవుని పెక్కురూపములలో వినియోగపరచుకొని లాభము చెందును. వానిచే నొకే దేవుడు శనిగా తైలాభిషేకము పొందును. బృహస్పతిగా కందులు దానము

పుచ్చుకొనును. అష్టమమున నున్న బుధుని అంతర్దశలో విష్ణువుగా సహస్రనామము చేయించుకొనును. చంద్రుడుగా శ్రీవిద్య నేర్పును. కుజుడుగా సుబ్రహ్మణ్య మంత్రము చేయించుకొనును. గీతాచార్యుడుగా యే పీడ వదలించుటకు భగవద్గీతలో నే శ్లోకము మంత్రింపవలెనో తెలియజేసి నెమలి పింఛము చూపించును. వైద్యుడుగా ప్రాక్టీసు పెట్టినవానిచే రాముడుగా సీతా కల్యాణము చేయించుకొని, పంచెలు, చీరలు, బియ్యము, డబ్బు, వస్తు సంపత్తి పుష్కలముగా చేకూర్చిపెట్టును. ఇంకను ఆశ తీరనిచో ప్రసన్న సత్యనారాయణ మూర్తి వ్రతము చేయించుకొని సంవత్సరమునకు సరిపడు గ్రాసము, రుచికర మైన గోధుమరవ్వ ప్రసాదముతో మిళితముగా నిప్పించును. ఇట్లు అర్థార్థులై భగవంతుని అర్చించు వైభవములతోనే పుణ్యక్షేత్రములు, ఉత్సవములు, పందిళ్ళు, కల్యాణమంటపములు వెల్లివిరియుచున్నవి కదా! భక్తులను కొండ కెక్కించుకొనుట, జుట్టు తీయించి పరిశుభ్రపరచి పంపుట మున్నగు నిత్య విషయములలో కూడ దేవుడే జోక్యము కలిగించుకొని పెద్ద దిక్కై నిర్వహించు చుండును. ఇట్లు అర్థార్థుల పూజలు వైభవోపేతములుగా నుండును. కొన్ని జన్మ లిట్లు గడచిన వెనుక "సర్వము నతని దివ్యకళామయ మనుచు సర్వవ్యాపి యందు యుల్లము చేర్చుట'' నేర్చును. దానితో జ్ఞానము కలుగును. అర్థార్థిత్వము, జిజ్ఞాస, ఆర్తి, అప్రధానమై భగవంతుడు ప్రధానమై పొడకట్టును. ఇట్లు చిన్న వెలుగు పెద్ద వెలుగును సమీపించునట్లు, ఆవరణ భేదములు తొలగుచు దేవుని సమీపించును. దీనితో చిన్న వెలుగు కూడ పెద్ద వెలుగులో భాగమగును. వాడే వీడుగా జీవితము లీలార్థము నడచును. ఇదియే సరియైన జ్ఞానము. "జ్ఞాని యనగా నేనే అని నా మతము'' అను పరమార్థము వ్యక్త మగును. (16)

ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థి, జ్ఞాని అని నాలుగు స్థితులలో నాలుగు విధములుగా జీవులు దేవుని భజించుచున్నారు. వారిలో జ్ఞాని, దేవునియందు నిరంతరముగా యోగము చెందియుండును. అన్ని రూపముల యందు నొకనినే భజించు భక్తి యేర్పడును. అది ఏక భక్తి అనబడును. ఈ నాలుగు విధములైన వారిలో భగవంతుడు, జ్ఞాని కెక్కువ ప్రియుడు. అది ప్రయోజన మాశింపని ప్రియత్వము. అర్థార్థి గూడ దేవుని ప్రేమించునుగాని అర్థరూపముగా ప్రేమించును.

ఒక యువకుని అందము చూచి ప్రేమించిన స్త్రీకి గల ప్రేమ వాని యందము పైననే గాని, వాని పైన గాదు. కనుకనే అందమునకు వ్యామోహ పడి, ప్రేమ వివాహములు చేసికొనువారు ఈర్ష్యాసూయా మద మాత్సర్యములను తమ స్వభావముల నుండి వెలిగ్రక్కుచు, కలహాదులపాలై, క్షాళనమైన వెనుక వ్యక్తి యెడల ప్రేమ నేర్చుకొందురు. భర్త సంపాదనపై, హోదాపై, అతడు కొనిపెట్టు చీరలు, నగలపై వ్యామోహముగల భార్య భర్తను ప్రేమించుచున్నా ననుకొనును. హోదాకు లోపము వచ్చినప్పుడు భర్త కుద్యోగ మూడిపోయినపుడు, పండుగకు చీర కొననపుడు, ఇంకొకరికి కొనిపెట్టినపుడు, భర్తపై పులివలె విరుచుకొనిపడి, తనకున్న ప్రేమ వేనిపైననో ఋజువు చేయుచుండును. ఇట్లే భగవంతునిపై అర్థార్థియగు వాని ప్రేమయు. తన భార్యకు కడుపునొప్పి తగ్గినందువలన బాబా పటము (పెద్దపటము) నింటిలోనికి గొని వచ్చి, ఫెళ ఫెళమను నుత్సవము లతో నొకడు ప్రతిష్ఠించుకొనును. మరల భార్యకు కడుపునొప్పి వచ్చి, అది కేన్సరు వ్యాధి యనియు, తగ్గదనియు వైద్యుడు చెప్పినపుడు, గోడవంటి తన మనస్సుపై అర్థార్థిత్వముగా కొట్టిన మేకునకు తగిలించిన బాబా పటము గాలి కూగిపోవును. ఇంతకు పటము నుంచుటయా? తీసివేయుటయా? తెలియని పనులు చేయుట ఎందులకు? ఆ పటము నట్టే యుంచి, మరియొక పెద్ద దేవుని పటము కొని తెచ్చి, బాబా యెదుటనే మెటికలు విరుచుచు బాబా నెది రించునట్లు ఎదురు బదురుగా గోడకు తగిలించును.

ఇట్టి స్థితులు అర్థార్థిత్వముతో నర్చించువారికి తప్పవు. తన పూజగదిలో నొక గోడకు బాబా పటము, ఒక గోడకు వేంకటేశ్వరస్వామి వ్రేలాడుచుండగా, తన కెవరో చేతబడి చేసి గుండెనొప్పి రప్పించిరని ఇతరులపై ననుమానపడి, అదే గదిలో ఆ దేవుళ్ళకన్న సమర్థుడని యొక భూత మాంత్రికు డాజ్ఞాపించిన వెల యిచ్చి నిమ్మకాయను, కోడిని కోయించును. అర్థార్థిత్వముతో గూడిన భక్తి వలన దేవున కిట్టి కుటుంబ బాధలు తప్పవు. ఈ స్థితులన్నిటిని దాటినవాడే జ్ఞాని. ఇట్లు దాటించుటలో దేవుడు హాస్యము పుట్టించక మానడు. దాటిన తరువాత దేవుడు యనగా ఈ యావరణలు కావు గనుక తనలోని వెలుగుగనే గోచరించును. అట్టివానికి దేవుడు మిక్కిలి ప్రియుడు. దేవుని ప్రియత్వము నిత్యము. జీవుని ప్రీతి పెట్టుబడిగా మాత్రమే దేవుని ప్రీతి యబ్బును.

వాణిజ్యమున తన భాగము పెట్టుబడి చెల్లించినవానికి గదా, లాభములు పంచబడుట! అట్లే జీవులలో దేవుని ప్రేమించినవానికి ఆ ప్రేమ దేవుడని తెలియును. (17, 18)

## వాసుదేవోపాసనము :

భగవంతునిపై భక్తి ప్రారంభమైన వెనుక అనేకములైన యవతారములు దాల్చును. తన భక్తికి, నితరుల భక్తికి పోల్చి చూచుకొనుట యుండును. తనకన్న నితరు డెక్కువ భక్తి కలవాడన్నచో నమ్మ బుద్ధి పుట్టదు. కొందరికి ఈర్ష్యాద్వేష ములు పుట్టును. ఎవరి మీద ఈర్ష్యాద్వేషములు పుట్టునో, ఎవరి భక్తిని గూర్చి తనకు నమ్మ బుద్ధి పుట్టదో, వారిలో గూడ భగవంతుడున్నాడని స్మరించుట కంగీకరింపవలెను. ఇట్లంగీకరించుటకు చాల కాలము పట్టును. అనేక జన్మల సాధనమైన వెనుక నిజమైన జ్ఞానము కలుగును. కనిపించు వారందరు దేవుని రూపములే యనియును, వారి ప్రవర్తన లన్నియు దేవుని జగన్నాటకములోని నవరస భావములనియును తెలియవలెను. తెలిసి యట్లు ప్రవర్తించవలెను. అప్పుడు జీవుడుగా వసించు దేవుడు ప్రసన్నమగును. జీవుడుగా ప్రవర్తించుట మాని, దేవుడుగా దర్శన మిచ్చును. సమస్తము వాసుదేవ మయమని తెలియును. అట్టి వాసుదేవుని ఈ విధముగా దర్శించుట దుర్లభము. దర్శించువాడును, వాసుదేవుడని తెలియును గనుక ఆ స్థితి పొంది వారు గూడ దుర్లభులుగా నుందురు. వారిని తెలిసికొనుట కష్టము. వారికిని కన్ను, ముక్కు, చెవులు మిగిలినవారివలెనే యుండును. అట్లే యూహ లుండును. ఆకలిదప్పు లుండును. ఇంద్రియ ప్రవృత్తులుండును. మహాత్ముడు వీనిని జయించిన వాడుగా నుండవలెనని పామర దృష్టితో చూతురు గనుక వారికా మహాత్ముడు కనిపింపడు. ఈ పామర దృష్టి వలననే "మా గురువుగారు అన్నపానీయములు ముట్టరు. వారికి మల మూత్రాదులు లేవు." మొదలగు లీలలు కల్పించి చెప్పుకొనుట దైవత్వమునకు నిదర్శన మనుకొందురు. మహాత్మునికైనను, సామాన్యునికైనను దేహమునకు దేహ ధర్మములు, ప్రాణమునకు ప్రాణ ధర్మములు, ఇంద్రియములకు ఇంద్రియ ధర్మములు, మనస్సునకు మనో ధర్మములు ఉండును. ఈ ధర్మములు సామాన్యుని బంధించును. వాసుదేవుని దర్శించిన మహాత్ములను బంధింపవు, బాధింపవు. వారు వాని కతీతులుగా

నుందురు. సృష్టి నీ విధముగా దర్శించుటయే జ్ఞానము. సృష్టిగా దర్శించుటకు బదులు, దేవుని యంతర్యామిత్వముగా దర్శించుట జరుగవలెను. (19)

భక్తి కలిగిన తరువాత కూడ జీవులు భగవంతుని తమ కోరికల కొరకు ప్రేమింతురు. ఉత్తమురాలు కాని భార్య, భర్త చేయు సంపాదన కొరకు భర్తను ప్రేమించును. ఈ ప్రేమ సంపాదనపై కామమేగాని, భర్తపై ప్రేమకాదు. అట్లే కోరికల కొరకు భక్తి నభ్యాసము చేయుట ఆయా వస్తువులపై వ్యామోహమే గాని భగవంతునిపై ప్రేమకాదు. తమ కోరికల కనుగుణముగా వారు వేరు వేరుగా దేవుళ్ళను సృష్టించుకొందురు. విఘ్నములు తొలగుటకు విఘ్నేశ్వ రుడు, సంపదలకు లక్ష్మి, బంగారమునకు స్వర్ణాకర్షణ భైరవుడు, ఇతరుల యూహలు తెలిసికొనుటకు కర్ణ పిశాచి మున్నగు దేవతల ఆరాధన మిట్టిది. అట్లే తాము కోరిన వస్తువులను సమకూర్చిపెట్టువారి చుట్టును తిరిగి యారాధిం తురు. ఇదియే అన్యదేవతారాధనము.

అందులకై ఆయా నియమములను కల్పించుకొని యవలంబింతురు. వారి వారి ప్రకృతినిబట్టి యొక్కొక్క విధమైన నియమములు వచ్చుచుండును. ఉదాహరణకు కొందరు మంత్ర దేవతలను వశము చేసికొనుటకై శ్మశానమున జపింతురు. కొందరు చితాభస్మమును ధరింతురు. కొందరు తమ దేవతలకు నిమ్మకాయలు, కోడిపెట్టలు, సారాయి బుడ్లు మున్నగునవి సమర్పింతురు. కొందరు తమపని చేసిపెట్టువారికి కోడిపెట్టలతో, వేటపోతులతో, సారాయి బుడ్లతో విందులు చేసి పూజింతురు. చేసిన తరువాత తమ పని జరుగనిచో తిట్టుకొందురు. తీవ్ర ద్వేష విరోధాదులకు లోనగుదురు. అన్యదేవతారాధనకు ఫలిత మట్టిదే. వారివారి స్వభావమును బట్టి ఆయా నియమ మార్గములు నచ్చును. తమోగుణము హెచ్చుగా నున్నచో మద్యమాంసాదులు నచ్చును. రజోగుణము హెచ్చుగా నున్నచో వీలైనంత ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టి ఖరీదైన సుగంధ ద్రవ్యములను వినియోగించి దేవు నర్చింతురు. సత్త్వగుణ ప్రకృతి యైనచో స్నాన సంధ్యాదులు, శుచిత్వము మున్నగు నియమములతో సర్వాంతర్యామి నారాధింతురు. ఇతరులలో దైవమును చూచి, భూతదయ గలిగి, తమకున్న దానిలో కొరత చేయక శుచియైన అన్నపానీయాదులను దానము చేయుదురు. చేసిన దానముగూడ పవిత్ర బుద్ధితో ఫల మాశింపక

చేయుదురు. ఈ విధముగా వారి వారి ప్రకృతి ననుసరించి, ఆయా నియమములు నచ్చుట యుండును. (20)

"ఎవడెవ డేయే రూపమును శ్రద్ధతో భక్తి కలిగి అర్చింపగోరునో, వాడి వాడికి ఆయా విధమైన శ్రద్ధయందు నేను నిశ్చలత్వమును ప్రసాదించు చున్నాను" అని కృష్ణుడు చెప్పెను. భగవంతుని దృష్టిలో శ్రద్ధ ముఖ్యముగాని దేనియందన్నది ముఖ్యముగాదు. శ్రద్ధవలన నిశ్చలత్వము కలుగును. మానవు డింద్రియాదులకు నతీతుడుగా పెరుగును. ఎవడు దేనిని నమ్మెనో దాని యందు దైవము అతని భావముల కనుగుణముగా తన సాన్నిధ్యము నిచ్చును. ఉదాహరణమునకు కొందరు విష్ణువు నర్చింతురు. వారికి తమ తమ కార్యసాధన యెడల కావలసిన ధైర్యమును, నిపుణతను భగవంతుడు విష్ణువు రూపమున నిచ్చును. శివుని నమ్మువారికి శివుని రూపమున నిచ్చును. పోలేరమ్మ, గంగానమ్మ మొదలగు గ్రామ దేవతలను నమ్మి బలు లిచ్చువారికి ఆ రూపముననే రోగములను, బాధలను తొలగించును. కొందరు గ్రహస్థితుల ననుసరించి తమతమ జయాపజయములను లెక్కలు కట్టుకొందురు. వారికి గ్రహముల రూపముననే తన నిదర్శనములను చూపును. తమ జీవితమున కొన్ని దశలు మంచివని తమ జాతకమునుబట్టి నమ్మువారు కలరు. వారికా దశల ననుసరించియే మంచిని ప్రసాదించుచుండును. కొందరు చెడ్డ గ్రహ దశలలో శాంతులు చేయించినచో రోగాదులు శమించునని నమ్ముదురు. వారి కట్లే ప్రసాదించి వానియందే స్థిరత్వము కూర్చును. ఇతరులు తమ్ము మోసగించుచున్నారని కొందరు అనుమానింతురు. వారిని ఇతరుల రూపమున మోసగించుచు భగవంతుడు నమ్మకము చేకూర్చును. కొందరు కేవలము తమ ప్రయత్నమువలన జరుగుచున్నవని నమ్మెదరు. వారికి వారి ప్రయత్న ముల రూపముననే ఫలితములను ప్రసాదించును. కొందరు ఐహిక జీవితము దుఃఖమని నమ్ముదురు. వారికి దుఃఖమునే ప్రసాదించి, దాని వలననే స్థిరత్వము కూర్చును. ఇట్టి తమ వివిధాభిప్రాయములను భగవంతుని యందు సమ ర్పించు వారును కలరు. వారికి స్వయముగా భగవంతుడు తానే కావలసినవి సమకూర్చుచు, సుఖశాంతులను ప్రసాదించును. ఈ విధముగా వారివారి

శ్రద్ధలను బలపరచుచు, వారికి స్థిరబుద్ధి కలిగించి కాలక్రమమున వారి ప్రకృతిని మార్చి, తన ప్రకృతిలోనికి వారిని స్వీకరించును. (21, 22)

ఎవడు దేనియందు శ్రద్ధ గలవాడో వాడా శ్రద్ధతోకూడి ఆ విధమైన ఆరాధన చేయును. దానికి తగిన ఫలితములను కోరిన విధముగా పొందును. అట్టివాని శ్రద్ధ ఫలితముల మీద నుండును గనుక ఫలితము చేకూరగనే శ్రద్ధ మారును. అది మరియొక దానిపై నేర్పడును. ఉద్యోగమునకు ప్రయత్నించుచు బాధలలో నున్నవాడు ఉద్యోగమునకై శ్రద్ధ వహించును. ఉద్యోగము లభించి నంతనే ఆ శ్రద్ధ తాను చేయవలసిన యుద్యోగము పైనుండి జీతము పైకి మారును. దానితో ఉద్యోగమున నిర్లక్ష్య మేర్పడును. అట్లే దారిద్ర్య స్థితిలో నున్నవాడు, సాటివారిని ఆదరించి కూడగట్టుకొనుటలో, దరిద్రుల సంఘము లేర్పరచుటలో శ్రద్ధ వహించును. తన దారిద్ర్యము తీరినంతనే ధనవంతులతో మైత్రి చేయుటకై శ్రద్ధ వహించును. ధనవంతుడైన వెనుక ధనముతో మాత్రమే మైత్రి చేయుటలో శ్రద్ధ వహించి, మిగిలినవారిని చీట్లాటలో పేకముక్కలవలె వినియోగించును. ఇట్లు తమతమ ఫలితములపై శ్రద్ధ వహించినవారికి దేవుడా శ్రద్ధ రూపమున ప్రసన్నుడగుచునే యుండును. కాని వారి శ్రద్ధ మారుచుండుట వలన దేవుని దర్శింపలేరు. వారి బుద్ధికి వైశాల్యము తక్కువ. కనుక వారు చూచు దేవుడు, కనిపించునట్టి వైశాల్యము కూడ తక్కువ. అతడు తమ ప్రయోజనములను తీర్చువారి రూపముననే కనుపించును. దానితో వ్యక్తులే కనిపింతురు గాని, దైవము కనుపింపడు. రంగుగోడపై కన్నములు కత్తిరించిన తెల్ల కాగితము నంటించినచో కన్నముల నుండి ఆ గోడ రంగుల బొమ్మలుగా మాత్రమే కనుపించును గాని గోడ కనుపింపదు. కనుకనే అల్పమేధస్కులకు శ్రద్ధయున్నను దైవము కనుపింపడు. ఈ విధముగా దేవతల భక్తులు - ఆఫీసర్లు, రాజకీయ నాయకులు, మతాచార్యులు అగు రూపములనే భజింతురు. నాయందు భక్తిగలవారు నన్ను దర్శింతురు. అనగా అందరిలో నేనున్నట్లు భజించువారు అంతర్యామిని దర్శింతురు. (23)

'నేను' అను పదమును అందరును వాడుచుందురు. అందరు నొకే అర్థమున వాడరు. ఎవరి యర్థము వారిది. ఈ దేహమున ఎవడెక్కడ ఏ కక్ష్యలో నిలబడి మాట్లాడుచున్నాడో, వాడా కక్ష్యను నేను అను పదముతో

వ్యవహరించును. 'నేను లేవలేను' అని రోగి పలికినపుడు, నేనను పదమునకు దేహమని అర్థము. 'నేను బజారుకు వెళ్ళుచున్నాను' అన్నపుడు నేనను పదమునకు మనస్సు, దానితో కూడిన బజారు అభిప్రాయములు, దేహము ధరించిన దుస్తులు, కళ్ళజోడు, జేబులోని వస్తువులు, చెప్పులు వగైరాల మొత్తమని అర్థము. భోజనము చేసిన వెనుక "నేను పోయి వచ్చెదను" అన్నచో దేహము, తిన్న భోజనము మొత్తమని అర్థము. ఇన్నిటిని వదలి, నేనను పదమునకు అర్థమేమి అని ఆలోచించినచో, నేనను అభిప్రాయమని తప్ప వేరేమియు నర్థము కాదు. ఈ యభిప్రాయము మనస్సున కలుగుచున్నది గనుక కొందరు నేనను పదమును మనస్సునకు పర్యాయముగా వాడుచుందురు. కాని నేనను నభిప్రాయము మనస్సున తేలుచున్నదే గాని, అదే మనస్సు కాదు. నీటియందు పై భాగమున మంచుగడ్డ తేలుచుండగా దానిని నీటికన్న వేరుగా గుర్తించినట్లు, కొందరు నేనను పదార్థమును గుర్తింతురు. అప్పుడది యొక కేంద్రముగా ప్రత్యక్షమై దాని చుట్టును మిగిలిన యభిప్రాయములు సర్దుకొనును. ఈ సర్దుకొను వానిలో చుట్టములు, పక్కములు, భార్య, ఆస్తిపాస్తులు మొదలగు కార్యకలాపముల వ్యవహారము లన్నియు నుండును. అందరిని గూర్చిన ప్రతిబింబము లాశ్రయించుకొని యుండును. కాని యందరును వారి వారి స్వభావములతో నుండక, తన స్వభావములోని ఆకులతో చాప లల్లినట్లు అల్లుకొని యుందురు. కలలోని వ్యక్తులవలె వీరందరును తనచేత చేయబడిన పొగబొమ్మలై యుందురు. ఇన్నిటికిని కేంద్రముగా నేనను బిందు వుండును. ఇట్టి స్థితిలో నేనను పదమునకు అహంకారమని యర్థము.

ఇంతవరకు చెప్పబడిన నేను లన్నియు వ్యక్తములు. ఒకే వ్యక్తిలో నున్న వ్యక్తులు. ఇట్లు ప్రతి వ్యక్తిలోను కనీసము కొన్ని వేల నేను లుండును. తడవకొక నేను చొప్పున సమయానుకూలముగా పనిచేయుచుండును. సన్నివేశములు జరుగును. కథ మాత్రము తెగక తెగ సాగుచుండును. సుఖమును గూర్చిన అభిప్రాయములు లక్ష లుండును. సుఖ ముండదు. జీవితము శరవేగముగా సాగుచుండును. నిలబడుటకు తీరుబడి యుండదు. అన్నియు నవసరమైన పనులే. స్థాయి చిక్కక శరీరమును పిచ్చివానివలె త్రిప్పుచుండును. పవిత్రమైన ఆదర్శములు, ఆశయములు నుండును. అందేదియు తాను గాదు. తాను

కేంద్రముగ యన్నియు తన చుట్టు తిరుగుచు వెక్కిరించు చుండును. ఇందు ఆశలు, చుట్టరికములు, ఆస్తిపాస్తుల యభిప్రాయములే కాక వేదములు, శాస్త్రములు, పుణ్యకర్మలు, దేవుడు, మోక్షము కూడ నుండును. కాని యన్నియు వడ్డించిన విస్తరికి తీసిన ఫొటోల వంటివి. దేనితోను సంతర్పణము జరుగదు. ఆకలిదప్పులు యెక్కువగునే గాని తీరవు. ఇన్నిటికి కేంద్రమైనదే వ్యక్తమైన 'నేను' లేక అహంకారము. ఆ కేంద్రముతో నడచు జీవితమే సంసార బంధ మన బడును. ఇందు అన్నిటితో బాటు భక్తి, వైరాగ్యముల యొక్క ఫొటోలు కూడ నుండును. ఇంతవరకు వర్ణించిన దంతయు వ్యక్తమైన నేను అనబడు వ్యక్తి యొక్క వైభవము. (24)

ఇన్నిటియందు అంతర్యామిగా మరియొక 'నేను' ఉండును. వానితో చేయబడినవే మిగిలిన నేనులు. అవి వానియందు పుట్టి పెరిగి లీనమగు చుండును. ఈ నేను అన్నిటియం దుండును గనుక వ్యక్తము కాదు, వ్యక్తి గాదు. ఈ నేను అందిన వెనుక అన్ని వ్యక్తులు తనవే. ఈ 'నేను' పలికినపుడు గూడ మిగిలిన నేనుల నుండియే పలుకు వినబడును. బుద్ధి యోగముచే ఈ 'నా' యందు జీవితము స్థిరపరచుకొనవలెను. భగవద్గీతలో కృష్ణుడు 'నే' నని చెప్పునది ఈ యంతర్యామియే. అయినను విన్నవారు బుద్ధియోగము లేనివారైనచో చెప్పువానిని వ్యక్తిగానే నర్థము చేసికొనుచున్నారు. ఆది, అంతము లేని యంతర్యామిని వినలేకున్నారు. యైనను, ఈ యంతర్యామి కన్న మరియొకటి యెన్నడును లేదు. ఈ యంతర్యామి సూటిగా వెలుపలి కెన్నడును ప్రకాశింపదు. ఆకారములతో, పేర్లతో, గుణములతో ప్రకాశించును. ఒకరి కొకరుగా కనుపించును. తనకు వారేమగుదురో తెలియును గాని, అందరిలోను చుట్టమగు 'తాను' తెలియడు. ఇట్లు పేర్లు, చుట్టరికములు మొదలగు వానితో ప్రకాశించుటనే యోగమాయ యందురు. దానితో చూచువాడుగా అహంకార మేర్పడును. మనస్సను తెరపై చూడదలచుకొనిన సత్యము ప్రతిబింబించునే గాని, చూడవలసినది ప్రతిబింబింపదు. ఇట్టి స్థితి మోహ మనబడును. అది కలవాడు మూఢుడు లేక జీవి యనబడును. ఇన్నిటియందు నిండియున్నవాడు అవ్యక్తమైన నేను. జనన మరణాదులు లేని అట్టి నన్ను లోకము తెలిసికొనుట లేదని కృష్ణుడు చెప్పుచున్నాడు. ఈ 'నా' యందు జరిగినవి, జరుగుచున్నవి,

జరుగబోవునవి యనబడు తెలియుటలు వర్తించుచుండును. వానిని ఈ 'నేను' తెలిసికొనుచుండును. అందు పుట్టిన యెవడును ఈ 'నన్ను' తెలిసికొన జాలకున్నాడు. **(25, 26)**

నీటియందు మంచు గడ్డకట్టుకొనినపుడు నీటికన్న వేరుగా తేలుచున్నది. దానికిని, నీటికిని పరస్పర సంబంధ మేర్పడుచున్నది. ఒకే వస్తువునకు నీరు, మంచుగడ్డ యనబడు రెండు స్థితులును, పరస్పర సంబంధములును జంటలు జంటలుగా నేర్పడుచున్నవి. అట్లే యంతర్యామి యందు తేలుచున్న వ్యక్తుల కును పరస్పర సంబంధము లేర్పడుచున్నవి. మంచుగడ్డ తేలుచున్నపుడు నీటికి ఒత్తిడి కలుగుచున్నది. అట్లే వ్యక్తుల నడుమ యిచ్ఛ, ద్వేషము మొదలగు జంటలు పుట్టుచున్నవి. వానితో సంబంధించిన వ్యక్తులైన నేనులకు మోహ మేర్పడుచున్నది. సృష్టిలో సర్వజీవులును సమ్మోహితులై మోహబల మనెడి జీవిత ప్రవాహమునందు కొట్టుకొనిపోవుచు, తెలివి యున్నంతవరకు, సంసార సాగరమున నీదుచున్నారు. ఇట్లు ఈదులాడుటను గూడ సద్వినియోగము చేసికొనవచ్చును. ఎట్లనగా మోహము బంధమని తెలిసికొనవచ్చును. దానిని కలిగించు పనులను, వేర్వేరుగా విభాగము సృష్టించు కొనవచ్చును. తాను సృష్టించుకొన్న మోహ సృష్టితోనే మొదటి తరగతి కర్మలను పాప కర్మలనియు, రెండవ తరగతి కర్మలను పుణ్య కర్మలనియు కల్పించుకొన వచ్చును. తన నిర్ణయమును బట్టియే పాపకర్మములను మాని, పుణ్యకర్మ లాచరింప వచ్చును. దానితో ద్వంద్వములు తొలగును. మోహము మాయ మగును. అంతర్యామి యైన నేను తెలియబడుదును. నాయందు దృఢమైన జీవితమే వ్రతమగును. ఈ విధముగా నెవ్వరు నన్నాశ్రయించి దారి చేసికొనుటకు యత్నించు చున్నారో, వారు జరామరణముల నుండి అతీతు లగుచున్నారు. వారే బ్రహ్మ మైన 'నన్ను' తెలిసినవారు. వారి కర్మ సర్వము నాదిగా నుండును.**(27-29)**

## ఎనిమిదవ అధ్యాయము

# అక్షర పరబ్రహ్మ యోగము

**ఇం**తవరకు కృష్ణుడు వివరింపగా మరల నర్జునుడు ప్రశ్నించెను : "ఇపుడు నీవు చెప్పిన బ్రహ్మము, అధ్యాత్మము, కర్మము, అధిభూతము, అధి దైవము అను నంశములను స్పష్టముగా వివరింపుము. యజ్ఞము నధిష్ఠించిన విషయము ఈ దేహమున నెచ్చట నుండునో వివరింపుము. దేహమును విడచు నట్టి కాలమున గూడ నియమము గలవారిచే నీ వే విధముగ ధ్యానింపబడుదువో వివరింపుము." అర్జును డిట్లు ప్రశ్నింపగా కృష్ణుడిట్లు వివరించెను. (1,2)

జీవు లందరు పుట్టుట, పెరుగుట, చచ్చుట చూచుచున్నాము. ఇట్లెంత కాలము జరుగును? కొంత కాలమునకు అయిపోవును గదా! అందరు అయి పోయిన వెనుక యిక పుట్టుట, పోవుట మున్నగునవి ఎట్లు జరుగునని ప్రశ్న కలుగును. మన సూర్యునిలోని వివిధ వాయువు లన్నియు ఖర్చు అయిపోయిన వెనుక వెలుగు, వేడిమి యంతరించిపోవునని కొందరు శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుదురు. ఈ యంశ మంతుపట్టవలెనన్నచో, నీ వెరిగిన గృహ విషయముల నుదాహరణముగ గొని యూహింప వచ్చును. మీ యింటిలో బస్తాలో బియ్య మున్నవి. వంటయింటిలో కూరలు, ఉప్పు, చింతపండు, కందిపప్పు మున్నగు పదార్థములున్నవి. వానిని తీసి వినియోగించి వంట చేసినచో మీ యింటిలోని వారికి అన్నము లభించుచున్నది. ఇట్లెంత కాలము లభించును? బియ్యము మున్నగునవి అయిపోవా అను ప్రశ్న వచ్చును. అయిపోయినప్పుడేమి చేయు చున్నావో గమనించినచో నీ ప్రశ్న తొలగును. మరల అంగడికి పోయి అన్ని వస్తువులను కొని తెచ్చుకొనుచున్నావు గదా! కొని తెచ్చుటకు డబ్బు కావలెను. అదికూడా అయిపోదా? అయిపోయినచో నేమి చేయుచున్నావు? సంపా దించుచున్నావు. సంపాదించుటకేమి చేయుచున్నావు? పని చేయుచున్నావు. పనిచేయుటకు దేహమున కాహారము కావలెను. పని చేసినచో దేహమున

కాహారము లభించును. భూమిలోని మట్టియందలి రసాయనిక పదార్థములు, నీరు, సూర్యరశ్మి, గాలి కలిసి పొలములో విత్తనముల నాధారముగ చేసికొని, నీ కాహారముగ రూపము ధరించి నీ దగ్గరకు వచ్చుచున్నవి. అట్లు వచ్చుటకు నీవు పని చేయుచున్నావు. వచ్చిన పదార్థములు తినుచున్నప్పు డైపోవుచున్నవి. పని చేయుచున్నప్పుడు పుట్టుచున్నవి. వాటి నన్నింటిని నీద్వారా చక్రముగ త్రిప్పుచున్నది డబ్బు.

ఇట్లు సక్రమముగ జరుగుచున్నంత వరకు అయిపోవుట యుండదు. అయిపోని లక్షణము ఇన్నిటియందు రహస్యముగ ఇమిడి యున్నది. దానియందే నీవును, నీ యన్నమును, నీవు చేయు పనులును ఉన్నవి. కనుక దానిని మించినది లేదు. దానినే బ్రహ్మమందురు. అది ఎప్పుడును అయిపోదు. నీవు పని చేయుచున్నంతవరకు నీకును అయిపోదు. పని చేయుట మానినచో నీ వుండవు. కాని అది యుండును. దీనినే పెద్దలు బ్రహ్మమందురు. దీనికన్న పై నింకేమియు లేదు.

అయిపోనట్టి స్వభావము దానియందు ఉన్నదని అంగీకరింపక తప్పదు. బ్రహ్మయందలి యీ స్వభావమునే అధ్యాత్మము అందురు. అధ్యాత్మము అనగా ఆత్మ నధిష్ఠించుకొనియున్న స్వభావము. ఇక భూమియందలి రసాయనిక పదార్థములు, గాలి, నీరు, సూర్యరశ్మి మొదలగునవి కలసి ధాన్యము మున్నగు మొక్కలుగ నెట్లు పుట్టుచున్నవి యని ప్రశ్నింపుము. అట్లు పుట్టుట వానియొక్క స్వభావము. ~~ఈ~~ స్వభావమున కాధారముగ విత్తన మున్నది. విత్తనమును భూమిపై చల్లినపుడు అది రసాయనిక పదార్థములను, నీటిని, సూర్యరశ్మిలోని శక్తిని తనలోని కాకర్షించుకొనును. ఆకర్షింపబడిన యీ పంచభూతాదులే మొక్కలుగ, మరల విత్తనములుగ పుంజుకొనును. ఇది యంతయు పంచభూతములు జీవులుగా పుట్టునట్లు చేయు సృష్టియొక్క విత్తనము నందలి ప్రవర్తనము. దీనినే సృష్టి యందలి పనితనము అందురు. సంస్కృతమున దీనినే కర్మ యందురు. వ్యక్తులు చేసికొనునవి మాత్రమే కర్మ లనుకొనరాదు. కర్మలు సృష్టిలో జరుగును. అందు కొన్నింటిని తాము చేయు చుంటి మనుకొనుట వలన, వ్యక్తులు తమకు కర్మలున్నవని భావించుచున్నారు. ఇట్లు భావించుటలో వారికున్నది కర్మబంధమే గాని కర్మ కాదు. ఒక వ్యాపార

సంస్థలో దుకాణమున కూర్చుండి బేరము లమ్ముచున్న జీతగాడు తానే వ్యాపారము చేయుచుంటి ననుకొన్నచో దాని బరువు బాధ్యతలు తన మనస్సును చికాకు పరచును. అట్లే జీవులను పట్టుకొనుచున్నది కర్మబంధమే గాని కర్మలు కాదు. (3)

**'నా' భావము :**

పండిన ధాన్య మంతయు మానవులు తినుచుండగా నయిపోవు చుండును. ఇట్లు అయిపోవుటనే క్షరము లేక క్షరపురుషుడు అందురు. దానిని తినుచున్నవాడు పని చేయుచుండును. అతడు చేసిన పనివలన అయిపోవు చున్న ధాన్యము మరల పండుచుండును. అనగా అయిపోకుండును. ఈ అయిపోవుట, అయిపోకుండుట తినువానిపైనను, పని చేయువానిపైనను ఆధారపడి యుండును. అతడే పురుషు డనబడును. అతడు సర్వత్ర వ్యక్త మగుచున్నాడు గనుక అతడే దైవము. (అతడు తానే యనుకొన్నచో పుట్టుచు పోవుచున్నాడనిపించును. తా నతడేయని తెలిసినచో శాశ్వతుడుగ నున్నాడని తెలియును. ఇట్లు తెలియుటయే అధిదైవ మనబడును.) ఇట్లు అధిదైవము ఉన్నట్లు తెలియుట మనము దేహము ధరించియుండుట వలన తెలియు చున్నది. మనము దేహము కావలెననుకొనుట వలన పుట్టలేదు. దేహమందలి శ్వాస, రక్తప్రసారము, ఇంద్రియ వృత్తులు, ఆహారాదుల స్వీకారము మొదలగున వన్నియు మనయందు జరుగుచున్నవి గాని, మనము చేయుటవలన జరుగుట లేదు. అవి జరుగుటవలన కొన్ని మనము చేయుచున్నాము. ఇట్లు జరుగుటనే యజ్ఞ మందురు. దాని కధిపతిగా నేను నీ దేహమున నున్నాను గనుక అధియజ్ఞమనగా 'నేనే'. దేహము ధరించినవాడు తన పేరుతోను, రూపము తోను గల సంబంధము తనకు గుర్తున్నచో తాను చనిపోవుదునని మాత్రమే తెలియును. అట్లుగాక, ఆహారాదులు దేహపోషణమున కనియు, దేహము పనికోసమనియు, పనివలన ఆహారాదులు పుట్టుచున్నవనియు తెలిసినవానికి చక్రము తిరుగుచుండును. అతడు నిరంతరముగ ఈ చక్రమును దర్శనము చేయుచుండుటచే నేనే యిన్ని రూపములతో వానికి జ్ఞప్తియందు ఉందును. అనగా నేనే వాడుగా నుందును. అపుడు దేహమును వదలుచున్న సమయమున

కూడ నన్నే స్మరించును. ఇట్లెవడు జీవిత ప్రయాణము చేయునో వాడు నా భావమును పొందుచున్నాడు. అనగా 'నేను' గా నున్నాడు. (4)

ఇందలి చిత్ర మేమనగా, ఎవడు దేనిని భావించునో వాని కప్పుడది సత్యము. భయపడుచున్న వానికి అప్పుడు భయము సత్యము. పీడకలలో నున్నవానికి అప్పుడా కల సత్యము. పనిచేయుచున్న వానికి అప్పుడా పని సత్యము. సంతోషించుచున్న వానికి అప్పుడా సంతోషము సత్యము. నిరంతరము సంతోషముగా నున్నవానికి ఆ నిరంతరత్వమే సత్యము. అదే నా శాశ్వతత్త్వము. ఇందేది కావలసినవాడు దానిని సత్యమనుకొని పొందుచున్నాడు. కష్టపడిననే గాని సుఖము లభింపదనువాడు కష్టపడుట సత్యముగా ననుభవించుచున్నాడు. మంత్ర తంత్రాదులు, పూజలు, అర్చనలు చేసి దేవుని దర్శింపదలచినవాడు ఆ మంత్ర తంత్రాదులనే సత్యముగా దర్శించు చున్నాడుగాని, దేవుని దర్శించుటలేదు. ఇన్నిటియందును నంతర్యామిగా దేవుని దర్శించువాడు నిత్యము దర్శించుచునే యున్నాడు. లోకమున వివిధ మార్గముల నవలం బించువారు దాని ఫలితములను తమ కర్మ ఫలములుగ ననుభవించు చున్నారే గాని, అంతర్యామిని మరచు చున్నారు. కనుక దేహము విడచునపుడు బంధువులు, మిత్రులు, డబ్బు, రోగము, నొప్పి, తనవారిని విడచిపోవుట మొదలైన వానిని మాత్రమే కొందరు చూచుచున్నారు.

ఇన్నిటియందును అంతర్యామిని చూచువారు దేహమును విడచుట యందు కూడ చూచుచున్నారు. వారు చనిపోవుటను భావించుట లేదు. గనుక చనిపోవుట లేదు. ఇన్ని సూత్రములలో, ఇన్ని సాధన మార్గములలో నేది సత్యము అని ప్రశ్నించుకొనువారు ప్రశ్న రూపము ననుభవించుచు మరణించు చున్నారు. ఇన్నిటియందును నన్ను చూచువారు దేహమును విడచినను, నేనుగా నున్నారు. ఎవడు ఏ భావమును భావించునో వాడు దానిని సత్యముగా దర్శించుచు, దానియందు జీవించును. భయపెట్టువానిని భావించువాడు భయపడువాడుగా జీవించి చచ్చును. అయిపోవువానిని భావించువాడు, అయిపోవుటలో జీవించి చచ్చును. సందేహపడువాడు సందేహముగ జీవించి చచ్చును. ఈర్ష్య, అసూయ మొదలగు బాధపెట్టు భావములను భావించువాడు బాధలుగ జీవించి చచ్చును. అంతర్యామితో తన కిష్టమైన పిండిబొమ్మలుగా

భావములను తయారుచేసికొనువాడు, ఆ భావములపై నాధారపడి మాత్రమే బ్రతికి చచ్చును. తాను తయారుచేసికొనిన భావముల బొమ్మయొక్క రూప మందలి మంచి చెడ్డలను మాత్రమే తా ననుభవించుచున్నాడు. అట్లుగాక అంతర్యామిని ధ్యానించువాడు అంతర్యామిగనే నిలబడుచున్నాడు. కనుక సర్వ కాలముల యందును నన్ను అంతర్యామిగా మాత్రమే స్మరింపుము. నీవు చేయు పనులయందు గూడ నన్నట్లే భావింపుము. అట్లే యిప్పుడు యుద్ధము చేయుము. (5, 6)

మనస్సున కభిప్రాయములు వచ్చుచుండును గదా! మరి అంతర్యామిని భావించుట కివి విఘ్నము లగుచున్నవి గదా! అని సందేహపడువారు మనస్సును, భావములను, విఘ్నములను మాత్రము స్మరించి త్రిప్పలు పడుచున్నారు. మనస్సు తోచినప్పుడు మనస్సునుగూర్చి భావింపక, ఆ మనస్సు నా అంతర్యామి స్వరూపమని భావింపుము. వచ్చిన అభిప్రాయము నెల్ల నా అంతర్యామి స్వరూప మని స్మరింపుము. విఘ్నము నా అంతర్యామియే యని భావింపుము; విఘ్న ముండక నేనుందును. అట్లే ధర్మాధర్మ నిర్ణయములను చేయుచున్నప్పుడు గూడ జాగరూకత వహింపుము. నీకు తెలిసినదానితో నీవు నిర్ణయించు చున్నావు. నిర్ణయము నీదిగా భావించినచో నీ నిర్ణయమున చిక్కుకొందువు. ధర్మము చర్చించినచో చర్చలో చిక్కుకొందువు. నిర్ణయించు బుద్ధిని నేనుగా స్మరించినచో నాయందు నీవును అంతర్యామిగా నుందువు. (7, 8)

**పురాణపురుషుడు :**

అన్ని వస్తువుల వలెనే నీ బుద్ధి కూడ నీ కన్న వేరుగా నొక శక్తివలె, నొక ప్రజ్ఞవలె నీకు భాసించుచుండును. ఒక్కొక్కప్పుడు అదియే నీవుగా నిర్ణయ ములు చేయుచుందువు. ఈ నిర్ణయములు బాహ్య ప్రయోజనములపై నాధార పడిన నాడు, అవి నిర్ణయములు కాక మార్పులు మాత్రమే యగుచుండును. అట్లుకాక నీవు వ్యాపించి ప్రవహించుటకు వాహికగా విద్యుచ్ఛక్తి తీగెలవలె నీ బుద్ధి పనిచేయుట సంభవించినచో, నీకన్న బాహ్యములైన యంశములలో నీవు ప్రవేశించి, వానిని నీలోని భాగములుగా సమకూర్ప గలుగుదువు. బాహ్య వస్తువుల సేకరణము, ఆర్జన, వినియోగము, ఈ మొత్తమన్నియు కలసి నీ

యందలి భాగములుగా వర్తించును. దీని నభ్యసించుటయే యోగాభ్యాసము. అప్పుడు నీ యందును, పరిసరముల యందును ప్రసరించుచున్న నీవు 'నేను' అను సత్యమేకాని, నీవుకావు. ఈ 'నేను' నీలోని జీవుడుగా ప్రసరించుచున్నంత మాత్రమున జీవుడను కాను. పరమ పురుషుడను. అట్టి 'నా' యథార్థతత్త్వము దివ్యము. అట్టి నన్నే యోగాభ్యాసము చేయువాడు ధ్యానింపవలెను. నా నుండి బయలుదేరిన సంకల్పములు మార్పులు గాక నిర్ణయము లగుచుండును. సన్నివేశాదులు 'నా' నుండి వెలుపలకు రూపు కట్టుచుండును. కనుకనే ఈ పరమ పురుషుడైన నన్ను కవిగా పెద్దలు దర్శించుచున్నారు.

బుద్ధి, మనస్సు మొదలగునవి నా నుండి వెలుపలకు రూపుకట్టుకొని, మరల నాయందు పర్యవసాన మగుచుండును. కనుకనే బుద్ధ్యాదులకు కాల నిర్ణయము, కాల పరిమితి యేర్పడుచున్నవి. వానికన్న ముందువాడుగా నేను ఎప్పుడునూ ఉన్నాను. కనుక నన్ను పురాణ పురుషుడని కూడ కీర్తింతురు. పురాణు డనగా పూర్వమున నున్నవాడని యర్థము. బుద్ధి, మనస్సు మున్నగు వాని యందు చర్చ, సదుపాయము, సౌకర్యము మున్నగు కదలిక లుండును. వికల్పము లుండును. నా యందవి పుట్టి వర్తించుట యను సత్యమునకు వికల్పము లుండవు. కనుక నేను శాసించువాడనుగా గూడ భావింపబడు చున్నాను. వాయు విమానమున ప్రయాణము చేయుచున్నవారు అనేక విషయములను చర్చించుకొని, నిర్ణయములు తీసికొంటి మనుకొన వచ్చును. ఈ మొత్తము నిర్ణయములు విమానయానము యొక్క భవితవ్యముపై నాధారపడి యున్నవి గనుక స్వతంత్ర సత్యములు కావు. విమాన భవితవ్యము సత్యముగా వానిని శాసించును. అట్లే నేను శాసించువాడను.

విమాన మందలి ప్రయాణీకుల దేహము లందలి పరమాణువు లన్నియు విమాన వేగమునందు భాగములుగా నుండును. దేహములలోను, వారి వస్తువుల యందునుగల పరమాణువు లన్నిటిలో విమాన వేగమున్నది. అది యణువులలో అణువుగా మరియు సూక్ష్మముగా వర్తించుచున్నది. అట్లే యీ పరమ పురుషుడు సృష్టియం దణువులో అణువుగా పెద్దలచే ధ్యానింపబడు చున్నాడు. సృష్టియను మార్గమున అన్నిటికి నిర్ణేత యగుచున్నాడు. కనుక నతడు ధాత. విమాన ప్రయాణీకులకు ప్రయాణము జరుగుచున్నట్లు తెలియును గాని, ఆ ప్రయాణ

మెట్లు ఉన్నదో గోచరింపదు. అట్లే యీ పురాణ పురుషు డచింత్య రూపుడు. అతని రూపములు, రీతులు తలచుట కందునుగాని అతడందడు. సృష్టి యంతయు అతనియందు ఆవరించుకొని యున్నది గనుక, 'అది' గోచ రించును. 'అతడు' గోచరింపడు. అది యావరణలుగా నున్నది గనుక, నతని చుట్టును క్రమ్ముకొనిన చీకటిగను, అతడు దాని కతీతుడైన వెలుగుగను గోచరించును. (9)

ఇన్నిటికిని వానియందు అంగాంగీ భావమున్నది గనుక వానియందు యోగమున్నది. ఇన్నిటిని తనయందు పట్టియుంచు యోగబలముగా నతడు పనిచేయుచున్నాడు. ఈ యోగబలము జీవులకు భక్తి వలన సంక్రమించును. దానితో మనస్సు నిశ్చల మగును. నిశ్చలత్వమనగా నతనియం దుండుట. ఇది కలిగినపుడు జీవునిపై పాంచభౌతిక దేహముయొక్క ప్రభావ ముండదు. జనన మరణములు భూత ధర్మములపై నాధారపడి యుండవు. భూతములపై స్వామిత్వముండును. దీని నభ్యసించుటకు దేహ విమోచన సన్నివేశ మొక యవకాశముగా, సాధనాంశముగా స్వీకరింపవలెను. అంతకుముందు చేసిన సాధనతో దేహములను విడువవలెను. మనస్సు భక్తియోగముతో నిశ్చలము కాగా, భ్రూమధ్యమున ప్రాణగతిని చక్కగా ప్రవేశింపజేసి, జీవుడు దేవుడై పరమ పురుషుని పొందును. (10)

భ్రూమధ్యమున ప్రాణగతులను ప్రవేశింపజేయుట యెట్లు? మనస్సుతో శ్వాసను ధ్యానించుట నభ్యసింపగా, ప్రాణగతులును, మనస్సు నొక్కటియగును. తాను సంకల్పముచే నూర్ధ్వముగా, అనగా స్థూలమును విడచి సూక్ష్మముగా ప్రసరించును. శ్వాస నిలచి, జీవ ప్రజ్ఞ భ్రూమధ్యమున స్థానము గొనును. శ్వాసతో మనస్సొక్కటియైనది గనుక, ఇట్టి సాధకునకు శ్వాస నిలచుట యన్నను, నిలుపుట యన్నను నొక్కటే. అనగా బుద్ధిపూర్వకము. మిగిలినవారికి శ్వాస బలవంతముగా నిలచును; తన యధీనమున లేక నిలచిపోవును. ఇదియే మృత్యువు. ఇది జరిగినప్పుడు మనోమయ పురుషుడు గిలగిల తన్నుకొనును. శ్వాసపై, దేహముపై నాసక్తితో చచ్చును. కనుక మరల దేహమునకు దిగి వచ్చుటకు, దేహముచే నాకర్షింపబడుటకు లొంగును. అనగా కర్మబద్ధుడగును. అట్లు గాక మనస్సు, ప్రాణము కలసి యొకటైనవాడు, దేహ బంధమును

విడదీసి భ్రూమధ్యము మార్గము పట్టును. అతడు దేహము విడచునపుడు శ్వాస నిలచును లేక నిలుపును. దేహముపై నాసక్తిలేని స్థితిలో దేహమును విడచును. అట్టి స్థితిని పొందిన తన్ను 'అక్షర' మని తెలిసినవారు చెప్పుదురు. దీనిని తెలిసినవాడే వేదము తెలిసినవాడు. క్షరమను భావము భూత పరిణామము నకు సంబంధించినది గనుక నీ యక్షరున కుండదు. అతడు "వేదమును పలుకుట" యుండును గాని, వేదమును గురించి పలుకుట వేరుగా నుండదు. వాక్కు నుచ్చరించును గాని, వాక్కుతో నితర విషయముల నుచ్చరింపడు. వినువారి స్థితిని బట్టి అందు ఇతర యర్థములు తెలియబడును. దీని నభ్య సించువారు తాము దీనియందు ప్రవేశించుచున్నారు. ఇతరులు దీనిని నేర్చు కొనుట, పఠించుట చేయుచున్నారు. సిద్ధుడు నేర్చిన దానియందు అంతర్యా మిత్వము నందును. ఇట్లు ప్రవేశించుట లభ్యమైనకొలది రాగములు తొలగి పోవును. ఈ స్థితి యొక్కటే సంకల్పముగా గలవారికి కోరదగినది యుండదు. అనగా కోరికలుండవు. దీనిని కోరువాడు దీనియందు చరించును. అదియే బ్రహ్మచర్యము. దాని నభ్యసించుటకే పెద్దలు ఇంద్రియార్థములపై నాసక్తిని బుద్ధిపూర్వకముగా విడచుచున్నారు. దీని నెట్లు అభ్యసింపవలెనో సంగ్రహముగా వివరించుచున్నాను. (11)

## యోగధారణము :

కిటికీలోనుండి దీపము కనుపించుచు కన్నులపై కిరణములు పడు చున్నచో రాత్రి కొందరికి నిద్రపట్టదు. అట్టవారిలో నొకడు కన్నులకు చేయి అడ్డుపెట్టుకొని నిద్రించును. మరియొకడు కిటికీకి అడ్డుగా తెరమూసి నిద్రించును. మరియొకడు కిటికీ తలుపులు మూసి నిద్రించును. ఇంకొకడు దీపము తొలగించి మూలపెట్టియో, ఆర్పివేసియో నిద్రించును. వీరిలోగల భేదమెట్టిది? దీపము తొలగించి పండుకొనినవాని కొక్కనికే సరియైన నిద్ర పట్టును. చేయి అడ్డుపెట్టుకొనినవానికి, నిద్రలో చేయి దింపినపుడెల్ల మెలకువ వచ్చును. తెరమూసి నిద్రించువానికి, గాలికి తెర తొలగినచో నిద్రాభంగ మగును. తలుపులు మూసినవానికి నిద్ర చక్కగనే పట్టునుగాని, దీపము వ్యర్థముగా కాలిపోవుచుండును. ఇందరిలో దీపమును తొలగించినవా డొక్కడే పద్ధతి తెలిసి నిద్రించినవాడు.

అట్లే మనస్సు ఇంద్రియముల ద్వారమున బాహ్య ప్రజ్ఞల రూపమున పరుగెత్తుచున్నపుడు మనస్సు నరికట్టుటకై యోగాభ్యాసము చేయువారిలో కూడ ఇన్నివిధములైన వారున్నారు. ఇంద్రియ ద్వారములను సంయమనము చేయదలచినపుడు ఇంద్రియములను మూసినను, దమించినను లాభము లేదు. మనస్సును బిగబట్టి, కన్నులు మూసినను లాభము లేదు. మనస్సున సంకల్పములుండి, ఇంద్రియముల వెంట వెలుపలకు పరుగులెత్తించును. గనుక మనస్సును బిగించినను లాభము లేదు. తాను ప్రేమించిన స్త్రీ బాట వెంబడి వచ్చుచున్నదని తెలిసినపుడు, చూడరాదని కన్నులు మూసికొన్నను మనస్సు ఆమెను గూర్చియే ఆలోచించును గదా! సంకల్పము నరికట్టక కన్నులు మూసినను లాభమేమి? నిజమైన సంయమము చిక్కుటకు ఒక్కటే మార్గము.

దినచర్యలోని పనులలో వలసినవానిని అనుష్ఠించుచు, తాను కోరిన వానిని తగ్గించుచు నిలిపివేయవలెను. దానితో ఇంద్రియ ద్వారముల వాడుక అనావశ్యకముల యందు వ్యర్థమగుట తగ్గిపోవును. క్రమముగా సంయమము అలవడును. మనస్సును శ్వాసతో మైత్రి చేయించుచు హృదయమున నిలుపుట నేర్చుకొనవలెను. అనగా మనస్సును హృదయమున నిరోధించుట నేర్చుకొన వలెను. ఇంద్రియ ప్రవృత్తులు కూడ హృదయమున కున్ముఖములై ప్రయాణము చేయును. తన శ్వాసరూపమైన వేదమును, అక్షరమును గమనించుచునే సాధకు డందు ప్రవేశింపగలుగును. ఈ మార్గమున సాధనము చేయువాడు తన ప్రాణమును, నే నను ప్రజ్ఞను ఒక్కటిగా నిలుపును. ప్రాణ స్పందనములు నిలిచి పోయి, భ్రూమధ్య మార్గమున శిరస్సునందు వర్తించును. అపుడు హృదయము నుండి శిరస్సు వరకు తాను వెలుగుచుండుట క్రమముగా తెలియును. ఈ జ్యోతిని 'తాను'గా ధ్యానించుచు సాధకుడు ధారణ చేయును. (12)

**ఓం-అక్షరము :**

ఈ జ్యోతిని 'నేను' అని స్మరించుచు తనను తాను ఉచ్చరించుటను గమనింపవలెను. అంతకుముందు శ్వాసగా పనిచేయుచున్న ప్రవృత్తి యిపుడు ఓంకారముగా నిలబడును. అందు కరగిన మనస్సు ఓంకారమున కర్థముగా

దర్శన మిచ్చును. తానను జ్యోతి నేను అని తనను తాను ఉచ్చరించుటయే అక్షర స్వరూపమని గమనింపవలెను. ఈ అక్షరమునే 'ఓం' అని కంఠముతో నిదానముగా సుదీర్ఘముగా నుచ్చరింపవలెను. ఇది తాను మాటను ఉచ్చరించుట కాక, తనను ఉచ్చరించుట యగును. ఇట్లు ఉచ్చరించుచు తన దేహముకన్న తాను వేరైన అక్షరముగా తెలిసికొనును. ఉచ్చరించుట యనగా ఉత్ + చరించుట; అనగా ఊర్ధ్వ మార్గమున చరించుట. దానితో క్రమముగా దేహము నకును తనకును గల సంబంధము విడిపోవును. దేహమును విడచుట యనగా చచ్చుటయే కానక్కరలేదు. దేహముతో ముడిపెట్టుకొని ముక్కలు ముక్కలుగా జీవించుచున్న తాను, దేహ స్థితికన్న నతీతుడుగా నీవలకు వచ్చుట. అట్టివానికి వచ్చుటయే గాని చచ్చుట యుండదు. చచ్చుట, పుట్టుట వాస్తవమునకు భూత సృష్టికి కూడ లేవు. భూతసృష్టికి చయమగుట, లయమగుట యున్నవి. చయమే కాయ మనబడును. దాని యాకారము భూతముల లోనికి విడువబడుట లయ మనబడును. ఈ లయము, చయము తుది - మొదళ్లు కావు. భూత సంసర్గము చెందిన మనస్సునకు మాత్రము లయము, చయము నున్నవి. భూతములకుగాని తనకు గాని లేవు. కనుక ఇచట ప్రయాణ కాలమనగా మనస్సు ప్రాణముతో కలసి దేహమును విడచి, తనయందు పర్యవసాన మగుట. ఇది ఉత్తమగతిని కలిగించును. ఉత్తమగతి యనగా ప్రజ్ఞ స్థూల దేహము నుండి సూక్ష్మమైన తన దగ్గరకు ప్రయాణము చేయుట. ఈ గమనములో మనపై పనిచేయుచున్న దేహము, ఇంద్రియములు, మనస్సు అనువాని బంధ ములు తొలగును.

ఇదియే వేదవిదులు అక్షరమున ప్రవేశించుట యనుచున్నారు. దీని వలననే యతులు రాగములు తొలగిన వారగుచున్నారు. దీని రుచి తెలియుట వలననే బ్రహ్మచర్యము చరించుచున్నారు. ఇది తెలిసినవారికే సుఖము అను పదమున కర్థము మారుచున్నది. "ఈ పని చేయవలెను, దీనిని సాధింపవలెను" అను సంచలనములు మాయమై, జరుగుచున్నదానికి తాము నిమిత్తమగు చున్నారు. ప్రయత్నమంతయూ సాధనరూపమై పరిణమించుచున్నారు. తన దేహము ప్రదేశమునకు, మనస్సు పరిసరములకు, కాలమునకు, ఆకలి దప్పులకు కట్టుబడి యుండును. ఈ కట్లు తెగిపోయి తాను దేశమునకు కాలమునకు అతీతుడై, సుఖ దుఃఖములకు నతీతుడైన స్థితికి చేరుకొనును.

ఈ చెప్పబడిన సాధనము అనుదినము ఒకే ప్రదేశమున కూర్చుండి యొకే సమయమున చేయవలెను. కాలక్రమమున మనస్సునకు ప్రయాణ కాలము సిద్ధించును. తాను అక్షరమై దేహబంధమును త్యజించును. (13)

ఈ ప్రయాణమున జీవుడు మనస్సుకన్న పైస్థితికి దాటిపోవునపుడొక చిత్రము జరుగును. మనస్సునకు నేను, నాకన్న వేరైన ప్రపంచము అను విభాగ మున్నది. మనస్సుకన్న పైకి ప్రయాణము చేసినవానికి తనకన్న వేరైనది మరొకటి యుండదు. అంతయు తానేయని తెలియును. అన్యము లేని ప్రజ్ఞను అనన్య స్థితి యందురు. అట్టి యనన్యమైన చేతస్సుతో స్మరించుట నభ్యసింపవలెను. క్రమముగా నీ యభ్యాసము పూర్తియగుసరికి అంతయు తానే అయియుండి, అందు తన జీవితము ప్రవేశించును. అనగా దినచర్య యంతయు సాగిపోవు చునే యుండును. అందరితో సంభాషణ సల్లాపాదు లుండును గాని తనకు మాత్రము అందరుండరు. అందరి రూపమున తానే యుండును. అట్టి తానే అంతర్యామిగా నుండును. కనుక తన కంతర్యామి స్మరణీయుడై నిరంతరము అనన్య భక్తితో స్మరింపబడుచు, సులభుడై యుండును. ఇట్లు జీవించువాడు తన నిత్య జీవితమును పరబ్రహ్మముతో యోగము చేసినవాడు. కనుక నతడే నిత్యముక్తుడు. నతడే నిజమైన యోగి. ఈ స్థితిలో నింద్రియములకు, మనస్సు నకు సహజములైన దుఃఖములు, కష్టములు, భయములు నుండవు. ఇట్టి నన్ను పొంది మరల దుఃఖములతో కూడిన పుట్టుకను సాధకుడు పొందడు. అనగా వాని దుఃఖముల పుట్టుక మరల కలుగదు. అతనికి దేహమందలి అంతర్యామియైన తనతోనే గాని దేహముతో సంబంధము లేదు గనుక దేహ మున్నను లేకున్నను అతడుండును. దేహము పోయినచో నతడు పోడు. దేహము కలిగినపుడు తా నందు చిక్కడు. దేహము గర్భమున పడినపుడు తా నందు పడడు. కనుక ఇట్టి యోగికి నన్ను పొందుటవలన దుఃఖమునకు కారణములైన పునర్జన్మలు కలుగవు. ఈ స్థితి కలిగిన వానిలోనున్న 'నేను' అందరిలో నుందును గనుక నతని యాత్మ 'మహాత్మ' అనబడును. అతడు మహాత్ము డనబడును. ఇదియే జీవునకు కలుగవలసిన సిద్ధి. (14, 15)

ఈ 'నేను' అను మహాత్మ ప్రజ్ఞకు దిగువ ఏడు ప్రజ్ఞలున్నవి. అందు దిగువ భాగమున భౌతికము, ప్రాణమయము, మనస్సు, తెలివితేటలు

మున్నగు ఆరు ప్రజ్ఞ లుండును. వీనికి పైనున్న ప్రజ్ఞ ఏడవది. ఈ ప్రజ్ఞలోనే దిగువ భాగమున బుద్ధి మొదలగు ప్రజ్ఞ లుండును. ఈ ఏడవ ప్రజ్ఞలోని పై భాగమున స్వచ్ఛమైన భాగమున్నది. అది బ్రహ్మప్రజ్ఞ యనబడును. దాని యనుభవమే బ్రహ్మలోకము. దానికి క్రింది ఆరు ప్రజ్ఞలలోను జీవుడు క్రిందికి మీదికి కొట్టుకొనుచుండును. అనగా తెలిసి వర్తించుట, తెలియక మరల యజ్ఞానమున బడుట, జ్ఞప్తి కలుగుట, మరపు కలుగుట మొదలగు స్థితులు మారుచుండును. ఒకమారు ధ్యానమున బ్రహ్మలోకము ప్రజ్ఞను అనుభవించిన వాడు మాత్రము మరల దిగువ ప్రజ్ఞలలోనికి జారిపోడు. మరపు కలుగదు గనుక అజ్ఞానమున పడడు. అట్టివానికే ఎనిమిదవదియగు అంతర్యామి ప్రజ్ఞ యందు స్థాయి చిక్కును. ఈ ఎనిమిదవ ప్రజ్ఞ జన్మించువరకును జీవితము దుఃఖములతో కారాగారమువలె నుండును. ఎనిమిదవ సంతతిగా కారాగార మున కృష్ణుడు జన్మించెనను కథలోని అంతరార్థ మిదియే!

ఈ చెప్పబడిన యేడు ప్రజ్ఞలును మానవునియం దుండును. అందు మొదటి, రెండవ, మూడవ ప్రజ్ఞలయందు మాత్రమే ఎక్కువమంది మానవులు జీవించి చనిపోవుచుందురు. ఒకటి, రెండు ప్రజ్ఞలగు భౌతికము, ప్రాణమయ స్పందనలు అను లోకములలో క్రిమికీటకాదులు, వృక్షాదులు, కొద్దిమంది నరులు పుట్టి చనిపోవుచుందురు. మూడవది ఇంద్రియములు మనస్సు పని చేయునట్టి కక్ష్య. ఈ కక్ష్యలో లోకమునందు అనేక వృత్తులలో చెప్పిన పని చేయగల మానవులు జీవించుచుందురు. నాలుగవ కక్ష్యలో మనస్సుతోబాటు తెలివితేటలు పనిచేయును. అందు అరవైశాతము మానవులు పనిచేయు చుందురు. వీరికి చెప్పిన పని చేయుట కాక, తోచిన పని చేయుట, ఇతరులు చేయవలసిన పనులను ఆజ్ఞాపించుట యను సామర్థ్యము లుండును. తనకు తోచినట్లు చేయుట యుండును. గనుక ఇవి ఏ యిద్దరకు నొకే విధముగ నుండవు. ఐదవ కక్ష్యలో ప్రవేశింపగలిగిన నరునకు ఇతరులకేమి కావలయునో తెలియగలుగుట యుండును. కనుక నితరులతో సమానముగా నూహించుట ప్రారంభమగును. ఆరవ కక్ష్యలో అందరియందును పనిచేయు సత్యము గోచ రించును. కనుక నిజమైన శాస్త్రసారము, దాని ప్రకారము తన కర్తవ్యము, ఇతరుల కర్తవ్యము తెలియుట, వర్తించుట యుండును. దిగువ కక్ష్యలు కూడా

పనిచేసినపుడు ఆరవ కక్ష్య పనిచేయదు. అవి పనిచేయనపుడు ఇది పనిచేయు చుండును. ఏడవ కక్ష్యలో ప్రవేశించినవారికి దానియందు మిగిలిన యారు కక్ష్యలు నెట్లిమిడియున్నవో తెలియును. కనుక దిగువ కక్ష్యలోనికి దిగుట యుండదు. అన్ని కక్ష్యలలో ఆచరణ యుండును. (16)

## బ్రహ్మ పగలు - రాత్రి :

ఈ ఏడు కక్ష్యలును జగత్తుయొక్క నిర్మాణమున కూడ నుండును కనుకనే మనయం దుండును. ఈ సృష్టి యేడవ కక్ష్యలో నుండి మిగిలిన కక్ష్య లోనికి దిగుచుండును. నాలుగవ కక్ష్యలోనికి, అనగా నడిమి కక్ష్యలోనికి దిగినపుడు ఆకాశము పుట్టును. దానినుండి దృశ్యమాన ప్రపంచము మూడు కక్ష్యలుగా పుట్టును. ప్రళయ మగునపుడు ఒక్కొక్క కక్ష్య దాని పై కక్ష్యలోనికి కరగిపోవును. ఏడవ కక్ష్యలోనికి మిగిలినవన్నియు కరగిపోయినపుడు, బ్రహ్మ యనబడు ప్రజ్ఞ దానియందు మేల్కొని యుండి, మిగిలినవన్నియు దాని యందు నిద్రించును. ఇట్లు మేల్కొనుట, నిద్రించుట యను లక్షణములు అనేక పర్యాయములు జరిగినపుడు బ్రహ్మప్రజ్ఞకూడ కరగిపోవు కాలము వచ్చును. దానిని బ్రహ్మ రాత్రి యందురు. అది కొంతకాలము జరిగిన వెనుక, మరల నొక్కొక్క కక్ష్య పనిచేయు కాల మారంభమగును. దానిని బ్రహ్మ పగలు అందురు. వేయి మహా యుగముల కాలము బ్రహ్మకు పగలు. మరియొక వేయి మహా యుగముల కాలము బ్రహ్మకు రాత్రి. దీని నెరిగినవారు అహోరాత్రముల నెరిగినవారు. మన యహోరాత్రముల పద్ధతిని బట్టి ధ్యానమునందు బ్రహ్మ యహోరాత్రములను దర్శింపవచ్చును. (17)

బ్రహ్మపగలు ప్రారంభించినపుడు అవ్యక్తము నుండి మొదట బ్రహ్మ ప్రజ్ఞ వ్యక్తమగును. మిగిలిన ప్రజ్ఞలు తర్వాత వ్యక్తమగును. బ్రహ్మరాత్రము ప్రారంభమైనపుడు అన్ని ప్రజ్ఞలతో బాటు బ్రహ్మప్రజ్ఞకూడ నిద్రించును. సమస్త జీవరాసులును తమ తమ దేహములతో, ప్రాణములతో, ఇంద్రియములతో, మనస్సులతో, స్వభావములతో, బుద్ధులతో తమ పగటియందు వ్యక్తమగుచు, తమ రాత్రియందు లీనమగు చుందురు. వ్యక్తమగుటనే పుట్టుట యందుము. లీన మగుటనే తెలియనపుడు చచ్చుట యనియు, తెలిసినపుడు నిద్రించుట యనియు చెప్పుదురు. (18, 19)

ఇన్నిటికిని మొదటిదియగు బ్రహ్మప్రజ్ఞకూడ అవ్యక్తము లోనికి పోవు చున్నది గనుక, అవ్యక్తమే అన్నిటికన్న పైనున్న యస్తిత్వము. దానియందు ప్రభవము, ప్రళయమును ఇమిడియున్నవి. కనుక దానినే పరము లేక పరభావము అందురు. దాని నెవడు గుర్తుంచుకొని జీవించునో అత డదిగా జీవించును. మిగిలినవి నశించుచుండగా నతడు నశింపడు. ఈ అవ్యక్తమును, మనస్సునకు తెలియకపోవుట వలన, అవ్యక్త మనుచున్నారు. తెలిసినవారు పర మనుచున్నారు. అక్షరమని కూడ తెలియుచున్నారు. అక్షర మనగా నశింప నిది. దానిని పొంది జీవించినవాడు దిగువ ప్రజ్ఞల లోనికి దిగడు. దానియం దతడుండును. అదియే ఉత్తమ గతి. దానినే జీవుడు తనయందలి పురుషుడుగా తెలియవలెను. అనగా తానుగా తెలియవలెను. ఇది భక్తి సాధనకు మాత్రమే లొంగును. అనన్యస్థితి దీనియం దుండును. కనుక జీవుడు దీనిని పొందవలె నన్నచో అనన్యస్థితిని పొందవలెను. గౌరవించుట, ఇతరుల చేష్టాదికములను గమనించి సంతోషించుట అభ్యసించినపుడు మాత్రమే యీ స్థితిని పొందుట జరుగును. దీనియందే సర్వ సృష్టియు వచ్చిపోవుచున్నది. గనుక, దీనిని పొందిన వానియందు సమస్తమును ఉండును. **(20, 21, 22)**

దీనిలోనికి పోవుట, దీనినుండి వచ్చుట యనునవి జీవులలో ఏడవ కక్ష్యను పొందనివారికి జరుగుచునే యుండును. కొన్ని కాలములలో సృష్టి స్థూల కక్ష్యల నుండి, సూక్ష్మ కక్ష్యలలోనికి ప్రయాణము చేయుచుండును. కొన్ని కాలములలో పైకక్ష్యలలో నుండి స్థూల కక్ష్యలలోనికి దిగుచుండును. ఈ దిగుటను వచ్చుట యనియు, ఈ యెక్కుటను పోవుట యనియు నందురు. ఈ రాకపోకల కాలములు బ్రహ్మయొక్క అహోరాత్రములలో మాత్రమే గాక, అహస్సునందలి కాలములోని విభాగములలో గూడ జరుగు చుండును. అనగా సంవత్సరమున, మాసమున, దినమున కూడ రాకపోకలు జరుగుచునే యుండును. వాస్తవమునకు నిద్రయు మెలకువయు నిట్టి రాకపోకలే. ఉచ్ఛ్వాస నిశ్వాసలు కూడ నిట్టి రాకపోకలే. పంచభూతములు మున్నగు సృష్టికి కూడ నిట్టి రాకపోకలు గలవు. మన మెరిగిన యుదాహరణము లలో అగ్ని స్థూలము నుండి సూక్ష్మమునకు ఊర్ధ్వగతి కలిగించును. అట్లే అన్ని విధములైన వెలుగులును. కనుక పగటికాలము కూడ నిట్టిదే. మాసమున

శుక్లపక్షము, సంవత్సరమున నుత్తరాయణము ఈ లక్షణమును కలిగియున్నవి. వాని వెంట పోవుచు జీవులు బ్రహ్మలోకము వైపునకు, అనగా ఏడవ కక్ష్యలోనికి ప్రయాణము చేయుచున్నారు. పొగ సూక్ష్మమునుండి స్థూలమునకు మార్గము. అట్లే రాత్రివేళ; అట్లే మాసమున కృష్ణపక్షము, సంవత్సరమున దక్షిణాయనము. ఇవి యన్నియు క్రిందికి దిగునట్టి మార్గము నేర్పరచుచున్నవి. వీని ననుస రించువాడు భూలోకమునకు దిగివచ్చి, దేహమున బద్ధుడగుచున్నాడు.

ఇందు మొదటిది శుక్ల గతి. రెండవది కృష్ణ గతి. మొదటిది సూర్యుని మార్గమనియు, రెండవది చంద్రుని మార్గమనియు చెప్పబడుచున్నది. ఇచ్చట సూర్య చంద్రులనగా గ్రహములు కావు. ఆ రెండు గ్రహములను, ఆ ప్రభావము లను కలిగించు ప్రకృతి విశేషములు. యోగాభ్యాసము చేయువాడు ఈ రెండు గతులలో గల వినియోగము తెలియవలెను. కృష్ణగతి యందు బద్ధుడు కారాదు. దాని నుండి భయపడి తప్పించుకొనుటకు యత్నము చేయరాదు. రెండు గతులును సృష్టిలోని కాల విభాగములు గనుక రెండును వచ్చిపోవుచుండునని తెలియవలెను. ఏదియు శాశ్వతము కాదు. అవి వర్తించి తాను దేహధారియై దిగివచ్చుట, వాని నుండి విడివడి, తాను ఊర్ధ్వగతి చెందుట జరుగుచుండును. ఈ రెండును అవ్యక్త బ్రహ్మమునం దున్నవని స్మరించుచు, వీని కతీతుడుగా చూచుచుండవలెను. (23-25)

## స్థూలము - సూక్ష్మము :

మన భూమిని కేంద్రముగా గొని విశాల ప్రపంచము నలువైపులకు అనగా మన తలల మీద నుండి పైకి పైకి గల లోకముల పొరల నూహించినచో మన భూగోళము అన్నిటికన్న స్థూలము. అంతకన్న జలము సూక్ష్మము. అంత కన్న గాలి, తేజస్సు, ఆకాశము వరుసగా సూక్ష్మతరములు. ఆకాశము కన్న మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము క్రమముగా సూక్ష్మతరములు. అన్నిటి కన్న విశాలమైన అహంకారమే పరబ్రహ్మము. మనకు సంబంధించినంత వరకు ఈ లోకపు పొరల నిచ్చెన భూగర్భము నుండి సూర్య గోళముయొక్క కేంద్రము వరకు వ్యాపించి యున్నవి. ఈ నడుమనే గ్రహ లోకములు, గ్రహ గోళములు కూడ నున్నవి. భూమిని తాకియున్న మానవుని పాదములనుండి శిరస్సు దాక మరల నిదే లోకముల నిచ్చెన వ్యాపించుచున్నది. వెన్నెముకలో

నుండి నిచ్చెన మెట్లున్నవి. వాని నెక్కుచు, మనస్సు ఊర్ధ్వగతి చెందుచు క్రమముగా బ్రహ్మవిద్య నేర్చుచున్నది.

ఈ నిచ్చెన మెట్లలోగల వివరములలో నిప్పుకన్న పొగ స్థూలమని చెప్ప బడినది. వెలుగుకన్న చీకటి, శుక్ల పక్షము కన్న కృష్ణ పక్షము, ఉత్తరాయణము కన్న దక్షిణాయనము, బ్రహ్మపగలు కన్న బ్రహ్మరాత్రి స్థూలములు. మన మెలకువ కన్న నిద్ర మనకు స్థూలము. మన సహజ ప్రజ్ఞ కన్న ఇంద్రియము లలో, మనస్సులో, దేహ ధాతువులలో పనిచేయు ప్రజ్ఞ స్థూలము. ఈ విధమైన విజ్ఞానము శుక్ల కృష్ణ గతులుగా సృష్టియందు ఇమిడియున్నది. అది సృష్టితో బాటు ఉండును గనుక, శుక్ల కృష్ణ గతులు జగత్తునకు శాశ్వతములు. ఇందు సూక్ష్మమునందు ప్రజ్ఞ ప్రసరించుట వెలుగుబాట. స్థూలము వైపునకు ప్రసరించుట చీకటిబాట. జీవులు కృష్ణగతి వలన దేహములు ధరించి దిగి వచ్చుచున్నారు. శుక్లగతి వలన అంతర్యామిత్వమైన తమ తత్త్వము నెరిగి, అందు వ్యవహరించు చున్నారు. ఈ రెండు మార్గములును దేహధారులకు తప్పనిసరి యగుచున్నవి. అందు ఒకదాని నుండి తప్పించుకొనుట, రెండవదాని యందు మాత్రమే వ్యవహరించుట ఎవ్వరికిని సాధ్యము కాదు. (26)

ఈ మార్గములలో చిక్కుకొనకుండ వ్యవహరించుట మాత్రము సాధ్యమగును. దానికి కృష్ణుడు మరియొక తావున మరియొక తాళము చెవి నిచ్చియున్నాడు. "సర్వ జీవులకు నేది రాత్రియో దానియందు మేల్కొని యుండువాడు సంయమము గలవాడు. ఇతరులు దేనియందు మేల్కొని యుందురో ఆ ప్రజ్ఞ అతనికి నిద్ర వంటిది. అనగా దాని కతనియం దస్తిత్వ ముండదు." ఇందలి భావ మేమనగా, సంయమము లేనివారు ఇంద్రియముల యందును, వాని ప్రవృత్తుల యందును మేలుకొని పనిచేయుచు కర్మను సృష్టించుకొందురు. సంయమము కలవారు దేహేంద్రియ మనస్సుల కతీతమైన 'తన' యందుండగా, కర్తవ్యముకొరకై దేహేంద్రియాదులు వినియోగపడు చుండును. ఈ రెండు అంశములను సమన్వయము చేయవలెను. సంయములు కాని వారిని కృష్ణగతి బంధించును. సంయమము కలవారి కది శుక్లగతి యగును. సామాన్యుల దృష్టిలో శుక్లగతి యని పిలువబడు దానిని సంయమము గలవారు లెక్కచేయరు. అనగా వెలుగును సుఖముగా గుర్తింపక, వెలుగు

చీకటులను ప్రకృతిలోని భాగములుగా, శాశ్వత యంత్రములోని ప్రవర్తనలుగా గమనింతురు. అపుడు వారియందు వెలుగు చీకటు లుండునుగాని వారి కుండవు. అప్పుడే "చీకటి కవ్వలనున్న వెలుగ"ని వేదములయందు చెప్పబడిన సనాతనమైన పురుష తత్త్వము వారియందు భాసించును. ఇంద్రియాదుల సుఖము లాశించినవారు యెట్లు కర్మబద్ధులగు చున్నారో, అట్లే సత్కర్మల సుఖము నాశించినవారు కూడ బద్ధులగుచున్నారు. వారు సత్ప్రవర్తనము కలిగియుండి కూడ దుఃఖించుచున్నారు. "నే నెవరికిని అన్యాయము చేయలేదు. నా కిన్ని బాధలు కలుగుట యేల?" అని కొందరు దుఃఖపడుచున్నారు. "నేను వేదములు చదివి యజ్ఞయాగాదుల నాచరించు చున్నాను. నా దేహముకూడ రోగాదులతో బాధపడుట యేల?" అని వాపోవు వారున్నారు. "నేను లోకోప కారము చేయవలెనని పాటుపడినను, నలుగురు కలసివచ్చుట లేదు. ఈ సమాజము నన్ను అర్థము చేసికొనుట లేదు." అని వెష్టపడువా రున్నారు. "నేను నిరంతరము దానబుద్ధి కలిగి అన్నదానములు చేసితిని. బాధలలో ఉన్నవారిని ఆదుకొంటిని. ఉద్యోగము లిప్పించితిని. ఎవ్వరినుండి ఏమియు పుచ్చుకొనలేదు. అట్టి నాకు చివరికి దారిద్ర్యబాధ యేల?" అని విలాపము చేయువారున్నారు. ఇట్టివారందరి దృష్టిలో సత్కర్మాచరణము కృష్ణగతిని తప్పించుకొని, శుక్లగతిలోనికి గుభేలున దుముకుట అనిపించును. దానితో దుమికిన వెనుక, లోతు తక్కువగుట వలన రాళ్ళదెబ్బలు తగులును. కృష్ణుడు చెప్పిన సంయమము నభ్యసించినవాడు సత్కర్మాచరణము చేయుట కృష్ణగతిని తప్పించుకొనుటకు కాదు. శుక్లగతిలో తిష్ఠవైచుటకును కాదు. అతని దృష్టిలో శుక్లగతికి ప్రత్యేకమైన అస్తిత్వము లేదు. కృష్ణగతిలో మాత్రము పొరబాటులు రాకుండ చూచుకొనవలెను. కనుక దానియందు అతడు మేలుకొని యుండును. సంగ్రహముగా చెప్పవలెనన్నచో, ఆచరణలో తప్పులు లేకుండు టకు మేల్కాంచియుండి, ఫలితములైన దుఃఖాదుల యందు పట్టింపు లేనివాడే నిజమైన సంయమి.

"ఇందు ఒక మార్గము నవలంబించుటలో తిరిగి రాని మార్గము చిక్కును. అన్యమార్గము నవలంబించుటలో తిరిగి వచ్చి చిక్కుకొనును" అను వాక్యములో కొంత చమత్కారమున్నది. అన్యమార్గ మనగా ఈ రెండింటిలో నొకటి యని అర్థము. ఒకదానికి రెండవది యన్యము. దానికిది అన్యము. ఏక మార్గమనగా

రెండులేనట్టి యొకే మార్గము. రెండు మార్గములును సృష్టియను పక్షికి రెండు రెక్కలవంటివి. ఒక రెక్కపై మొలిచిన యీక రాలిపోవును. పక్షి ముఖమున నున్న చార ఎన్ని యీకలు రాలినను చెరిగిపోదు. పక్షి రంగుల వంటిది యొకే మార్గము. రెక్కలలోని యీక వంటిది రెండింటిలో నొక మార్గము. ఇందలి సూక్ష్మమును జారిపోకుండ గ్రహింపవలెనని హెచ్చరించుటకే ఈ సందర్భమున గీతాచార్యుడు ఇట్లనుచున్నాడు: "ఈ రెండు గతుల గమనమును సక్రమముగా తెలిసినవాడే యోగి. అతడెన్నడును ఈ గతుల విషయమున మోహ పడడు." మోహ పడకుండుట కృష్ణగతిని గూర్చియేకాదు; శుక్లగతిని గూర్చి కూడ నని ఇందలి హెచ్చరిక. కేవలము యజ్ఞ యాగాది క్రతువు లాచరించి, స్వర్గాది సుఖముల నపేక్షించినవారు కూడ ఇంద్రియలోలుర మార్గముననే అధోగతికి పోవుట పురాణ కథలలో వివరింపబడినది. భాగవతములో ప్రాచీనబర్హి కథలో నిరూపింపబడినది- శుక్లగతిని గూర్చి మోహపడినవాని మార్గము. దక్షుని కథలో నిరూపింపబడినది ఇంద్రియలోలుని మార్గము. ఈ రెండును దాటినవారు భాగవతులుగా, ముక్తులుగా నెల్లయెడల కీర్తింపబడిరి. దీనిని సమముగా నిరూపణము చేసికొని సర్వకాలముల యందును యోగము నవలంబింప వలెను. సమత్వమే యోగమని భగవానుని హెచ్చరిక! (27)

వేదములయందు, యజ్ఞములయందు, తపస్సునందు, దానమునందు పుణ్యఫలము పెద్దలచే చెప్పబడినది. దాని నాశించి అవలంబించిన వానిని శుక్లగతి బంధించును. అట్లుగాక, యీ గతుల సమన్వయమగు యోగమార్గ మవలంబించిన వారికి కలుగు సుస్థితి యజ్ఞ దాన తపః క్రియాదుల పుణ్యమున కన్న వేరుగా సర్వమున కతీతమై వర్తించును. అదియే పరమైన స్థితి. అదియే అన్నిటికన్న మొదట మనకు గల స్థితి. అట్టి స్థితిని యోగమార్గమున సమన్వ యించుకొనువాడు పొందును. సృష్టి యంతయు చక్రభ్రమణము వలె పరివర్తన శీలము. అందు శుక్లగతి ఊర్ధ్వ ముఖమైన యొక సగము కాగా, కృష్ణగతి అధోముఖమైన రెండవ సగము. ఇందు దేనిని కాదని రెండవ దానిని స్వీకరించి నను చక్రభ్రమణమున మరియొకదాని లోనికి ప్రవేశించును. ఇది కాక చక్రము నకు కేంద్రమున తానున్నచో, ఈ రెండింటికిని అతీతుడుగా నుండుట సాధ్య మగును. తాను కేంద్రమని తెలియుట యిందలి విద్య. (28)

## తొమ్మిదవ అధ్యాయము

# రాజవిద్యా రాజగుహ్య యోగము

అన్ని విద్యలు, అన్ని సాధనలు, మంత్ర తంత్రాది రహస్యములు, అన్ని మతములు ఒకే విషయమును గూర్చి చెప్పుచున్నవి. అది భగవంతుని అంతర్యామి సాధనము. ఒకే విషయమును గూర్చి ఇన్ని గ్రంథములు, ఇన్ని శాస్త్రములు చెప్పుట యెందులకు? అంతర్యామిని గూర్చి ఏ గ్రంథమును చెప్ప నక్కరలేదు. అది మన కనుల యెదుటను, మన లోపలను కూడ నిండి యున్నది. దానిని గూర్చి చెప్పకపోయినను, అది మనయందు నిండియే యున్నది. దానినే పరబ్రహ్మ మందురు. చెప్పవలసినది అంతర్యామి సాధనను గూర్చి మాత్రమే. జీవుడు అంతర్యామి యందే యుండి ఇతర వస్తువులను చూచుచున్నాడు. కనుక దానిని మాని, అంతర్యామిని చూచి అనుభవించుటకే యీ సాధన లన్నియును. ఇతర వస్తువులను, ఇతర వ్యక్తులను, సంబంధ బాంధవ్యములను చూచి చిక్కులు పడుచున్నాడు గనుక, వానియందు మరల అంతర్యామిని చూచి, చిక్కుల నుండి విమోచనము చెందుటయే ఇన్ని విద్యలకు ప్రయోజనమైన రహస్యము. దాని కొరకే యోగాభ్యాసము, దైవ ధ్యానము, హృదయమున నిష్టదైవతము నారాధించుట, ఉచ్ఛ్వాస నిశ్వాసములను దైవ కర్మలుగా జ్ఞప్తి యుంచుకొని చేయునట్టి ప్రాణాయామము, భ్రూమధ్యమున ప్రాణములను నిలిపి, దేహబంధమును తొలగించుకొను ప్రత్యాహారము, మొదలగు రహస్యము లన్నియు భగవద్గీతలో నింతవరకును చెప్పబడినవి. సుఖదుఃఖములు, శుభాశుభములు, బంధమోక్షములు అను ద్వంద్వముల నుండి విమోచము చెందుటకై శుక్ల కృష్ణగతులు, వాని యెడల యోగి ప్రవర్తించు విధానము చెప్పబడినవి. సంసారము కష్టమనియు, మోక్షము సుఖమనియు భ్రమపడి మరల అట్టి ద్వంద్వములలో పడకుండుటకే శుక్ల కృష్ణ గతులు,

వాని యెడల యోగియొక్క దృష్టియు వివరింపబడినవి. ఇంతవరకు భగవద్గీతా శాస్త్ర రహస్యము సగము ఉపదేశింపబడినది.

ఈ చెప్పబడిన వానియందు సాధకుడు శ్రద్ధ కలిగియున్నచో శాస్త్ర మంతయు వాని యెడల సత్యమగును. శ్రద్ధ లేక, కేవలము తెలిసికొనుట కైనచో చెప్పినను చెప్పకున్నను నొక్కటే. కనుక శ్రద్ధ యనునది ఇన్ని రహస్యము లను మించిన రహస్యము గనుకనే ఈ తొమ్మిదవ అధ్యాయమున గుహ్యతమ మని చెప్పబడినది. శ్రద్ధ యనగా ఆచరించుట యందలి నిత్య నూతన శక్తి. అది లేనిచో కేవలము పాండిత్యము మాత్రము మిగులును. ఆచరించుటకు పూనుకొనిన పనియందు ఆదరణ, ఆసక్తి ప్రారంభమున నెంత ఉన్నదో, పది సంవత్సరముల తరువాత, ఇరువది సంవత్సరముల తరువాత కూడ నంతే యున్నచో దానిని శ్రద్ధ యందురు. క్రమముగా తగ్గునట్టి లక్షణము శ్రద్ధ యనబడదు. బ్రహ్మజ్ఞానము, సుఖము, శ్రద్ధ గలవారికే గాని మిగిలినవారికి అబ్బవు. మిగిలినవానికన్న అభ్యాసమునకు తన మనస్సున ప్రాముఖ్యము లేనిచో, సాధనకు మిగిలిన పనులు అడ్డము వచ్చును. అపుడు సాధనయు జరుగదు, మిగిలిన పనులు చేయు సామర్థ్యమును కలుగదు; ఉభయ భ్రష్టత్వము సంభవించును.

శ్రద్ధ నభ్యసించవలె నన్నచో అసూయ మనస్సున కంటరాదు. ఎదుటి వాని సంపదలను గూర్చిగాని, సద్గుణములను గూర్చిగాని, భక్తిని గూర్చిగాని అసూయ పడినచో, తన శ్రద్ధ కన్న నితర విషయములు తన దృష్టిలో ప్రాముఖ్యము వహించుచున్నవని యర్థము. కనుక శ్రద్ధ కుదురుచున్నట్లు తెలియుట ఎట్లనగా నెవరియందును అసూయ లేకుండుటయే! అసూయ లేని మనస్సు సంతోషమునందు నిరంతరత్వము కలిగి యుండును. ఎదుటి వాడు దోషములు చేసినను సాధకుని దృష్టి వానివైపునకు ప్రసరింపరాదు. ప్రసరించినచో నంతర్యామి యందు శ్రద్ధ లేదని యర్థము. కనుక అనసూయత, శ్రద్ధ అను లక్షణములు సాధకునియందు నిరంతరము భాసించుచుండవలెను.

లోకమున మనము చూచునది ఇంద్రియముల మూలమున. చూచినది మనస్సు మూలమున గ్రహింపునకు వచ్చును. అది జ్ఞాన మనియు, విజ్ఞాన మనియు రెండు విధములుగా బోధపడును. యోగస్థితియందు అనుభవము

నకు వచ్చునది జ్ఞానము. బాహ్య ప్రపంచ విషయముల వలన తెలియుచున్న దానిని వివేకముతో గ్రహించినచో అది విజ్ఞాన మనబడును. అందు మొదటి దగు జ్ఞానమునకు కావలసినది యోగస్థితి గనుక, దానికి బాహ్య ప్రపంచము, లోపలి ప్రపంచము అను భేదము కలుగదు. మన లోపల నున్నది, వెలుపల నున్నది అను వానిని వేరుచేసి చూచునది మనస్సు. యోగస్థితిలో మనస్సు లయమగును గనుక ఈ భేదముండదు. చూచువాడు, చూడబడునది, చూచుట అను నంశములు కరగిపోయి యొక్కటిగా అనుభవ మగుటనే జ్ఞాన మందురు. ఈ జ్ఞానము మోక్షమునకు కారణము. ఇది కలవాడు సర్వాంత ర్యామిగా నుండును. కనుక 'జ్ఞాని యనగా నేనే యని నా మతము' అని కృష్ణుడు నిర్వచించెను. ఇట్టిది జ్ఞాన స్థితి. ఇట్టి స్థితి నుండి చెదరి, బాహ్యాభ్యంతర భేద మేర్పడినపుడు కలుగునది యజ్ఞానము. "ఎప్పుడును జ్ఞానము అజ్ఞానముచే నావరింపబడి యున్నది. కనుకనే జీవులు దానిచేత మోహపడుచున్నారు." అని కూడ కృష్ణుడు చెప్పెను. ఇట్టి బాహ్యజ్ఞానమును ఇంద్రియార్థములవలన మనస్సుతో స్వీకరించునపుడు సంగము మొదలగు దోషములు పుట్టును. రాగద్వేషాదులు పుట్టును. వానియందు చిక్కుకొనకుండ బాహ్య ప్రపంచము నందు చరించుటకు పనికి వచ్చునది బుద్ధి. అది వివేకము మొదలగు సద్గుణ ములతో కూడియుండును. రజస్తమస్సుల దోషములను రాగద్వేషాదుల నుండి తొలగించి సత్త్వమునందు వర్తించునట్లు చేయును. కనుకనే బుద్ధితో కర్మల నాచరించుచు, బుద్ధి యోగము నాశ్రయింపవలెనని పూర్వాధ్యాయములలో కృష్ణుడు చెప్పెను. దీనివలన తెలియబడునది విజ్ఞానము.

జ్ఞానము, విజ్ఞానముతో కూడియుండవలెను. ఈ రెండిటిని తెలిసికొని నపుడే అనుభవమునుండి జీవి విమోచనము చెందును. ఈ సాధనకు కావలసిన ఉపకరణములే శ్రద్ధ, అనసూయత అనబడు గుణములు. వాని నభ్యాసము చేయుచు అష్టాంగయోగమును సాధించుటయే రాజవిద్య లేక రాజగుహ్యము. ఇది యింతవరకు చెప్పిన సాధనలకు సార్థకత చేకూర్చునది గనుక నుత్తమ విద్య. పూర్వవాసనల నుండి విముక్తుని చేయునది గనుక పవిత్రము. ఈ విద్య యింద్రియములకు ప్రత్యక్షమగు బాహ్య ప్రపంచముతో సాధన చేయ వలసిన మార్గమున నుండును. అనగా బాహ్య ప్రపంచమందు భగవంతుని

అస్తిత్వము సాధకుని మనస్సున స్థాపించునట్టి విద్య ఇది యొకటే. ఇది స్వధర్మానుష్ఠానము రూపమున మాత్రమే సాధింపబడును. ఇందు చేయదగినదే గాని, చర్చించి నిర్వచించి తెలియదగినది యుండదు. నిత్య జీవితమున వర్ణాశ్రమ ధర్మముల రూపమున నిది యుండును గనుక, ధర్మ మార్గమున సుఖము లనుభవింపవచ్చును. ఆ యనుభవము అవ్యయమగు పరమాత్మ యందుండును గాని, జీవియొక్క యిష్టాయిష్టముల యందు ఉండదు. దీనికి కావలసిన శ్రద్ధ నభ్యసించువారు మాత్రమే ధర్మానుష్ఠానము చేసి తరింపగలరు. ఎన్ని తెలిసినను ఈ శ్రద్ధ లోపించినచో 'నన్ను' అంతర్యామిగా పొందలేక మరల మృత్యు ముఖమున పడుచు సంసారబద్ధు లగుచున్నారు.

## 'నా' యోగము :

'నేను' అను పదమునకు ఎవని యర్థము వాడు చెప్పుకొనుచుండును. 'నేను ఊరికి వెళ్ళుచున్నాను' అన్నపుడు, నే నను మాటకు శరీరమని యర్థము. 'నేను చూచుచున్నాను, నేను వినుచున్నాను, తినుచున్నాను' అను మాటలకు నే ననగా ఇంద్రియములని యర్థము. 'నే నిట్లనుకొను చున్నాను; ఇది నా భావము; ఇది నా యాదర్శము' అన్నపుడు నే నను మాటకు మనస్సని యర్థము. 'నన్ను నేను అదుపులో పెట్టుకొనుచున్నాను, మంచిని స్వీకరించి చెడును పరిహరించుచున్నాను' అని సంభాషణ చేసినపుడు నే నను పదమునకు ఆత్మ యని అర్థము. ఆత్మయను పదమునకు తా నని యర్థము. తాను అందరి యందు నున్నాడు గనుక బ్రహ్మము అనబడును. బ్రహ్మము అనగా పెద్దవాడుగా వ్యాపించి యున్నాడని యర్థము. తాను అందరిలో వ్యాపించి యున్నవాడనని ప్రతి వ్యక్తియు తెలిసికొనునట్టి సాధనమునే బ్రహ్మవిద్య యందురు. దానికి కావలసిన ధ్యానము మొదలగు అంగములనే బ్రహ్మోపాసనము అందురు.

కుండయందు మట్టి యున్నట్లు ఒక్కొక్కని యందు జీవుడున్నాడు. అన్ని కుండలయందు ఒకే మట్టి యున్నట్లు, అందరియందు బ్రహ్మము ఉన్నాడు. అందరును ఆత్మగా నున్నారు. తమయందు దేహములు కలిగి యున్నారు. ఇట్లు తెలియనివారిని అజ్ఞాను లందురు. వారు తాము దేహముగా నున్నార మనియు, తమకొక ఆత్మ యున్నదనియు భ్రమపడుదురు. తెలిసినవారు

తాము ఆత్మగా నున్నారమనియు, అందరియందు నున్న తాముగా బ్రహ్మ ముగా నున్నారమనియు, తమ కొక దేహము ఉన్నదనియు తెలియుదురు.

కుండయందు మట్టి యుండుట, అన్ని కుండలయందు నొకే మట్టి యుండుట సత్యములే కాని పరమ సత్యము కాదు. మట్టి యందు కుండ యుండుట పరమ సత్యము. కుండ యన్నది మనము చేసిన యాకారము. మనము పెట్టిన పేరు. అంతేగాని కుండయను పదార్థమేమియు నచ్చట లేదు. ఉన్నది మట్టి యొక్కటే. దానినే మనము కుండగా నారోపించుకొని వినియో గించుకొనుచున్నాము. కనుక కుండయందు మట్టి యున్నదనుట సత్యము కాదు. మట్టియందు కుండ యున్నదనుట సత్యము. అట్లే మనయందు అంతర్యామిగా బ్రహ్మము ఉన్నదనుట కన్న, మనము బ్రహ్మయందు ఉన్నా మనుట పరమ సత్యము. "ఈ జగత్తు సమస్తము ఈ విధముగా నాచే నిరంతరత్వము వహించుచున్నది. కనుక ఈ జగత్తునందు నేను వ్యక్తము కాకుండ అంతర్యామిగా నున్నాను. నాయందు జగత్తు వ్యక్తమగుచున్నది." అని పరమ సత్యమును కృష్ణ డుపదేశించెను. ఈ ఉపదేశ మెందుకు? "వానియందు ఈ సమస్తము సృష్టిగా వ్యక్తమగుచున్నది" అని ధ్యానము చేయుటకు కాదు. అట్లు చేసినచో నేమియు లాభము లేదు. "నాయందు ఈ సమస్తము సృష్టిగా వ్యాపించియున్నది" అని కృష్ణుడు చెప్పిన వ్యాకముతోనే మనముకూడ ధ్యానము చేయవలెను. ఇట్లు ధ్యానము చేయుటవలన, నిరంతరత్వము సిద్ధించును. దానికి కావలసినదే శ్రద్ధ. శ్రద్ధ యనగా స్మరణ, నిరంతరత్వము వహించి యుండుట. దీని నుండి యేమరుపాటు చెందుటయే మృత్యువని సనత్సుజాతుడు ధృతరాష్ట్రున కుపదేశించెను. ఇట్లు ఏమరు కుండుటయే రాజవిద్య యని కృష్ణుడు ఉపదేశించెను. (1, 2, 3)

మన దేహమందున్న గుండెకాయ, ఊపిరితిత్తులు, ఆహార కోశము, సప్తధాతువులు, జీవకణములు మొదలగున వన్నియు జడ పదార్థములని పొరబాటు పడుచుందురు. అవి జడములైనచో వాని కర్తవ్యము నిరంతరము నాచరించుచు మన దేహముగా నెట్లు నిలిచియున్నవి? మనము నిద్రించు చున్నను గుండెకాయ, ఊపిరితిత్తులు వాని పని యవి చేయుచున్నవి కనుకనే మనము జీవించుచున్నాము. వానియందు మనము పొరబాటు అభిప్రాయము

కలిగి జడములని అనుకొనుచున్నను జీవించు చున్నాము. అవి యున్నవని జ్ఞప్తి యుంచుకొనక ఏమరుపాటు చెందినను జీవించుచున్నాము. కారణమేమి? అవి ఏమరుపాటు చెందలేదు గనుకనే! ఈ వేదము వలననే వానియందు పనిచేయు ప్రజ్ఞలు దేవత లగుచున్నారు; మనము కేవలము నరులుగా మాత్ర మున్నాము. కామక్రోధాదులు చెందుటవలన రాక్షసులుగా కూడ నగు చున్నాము. ఒకరి చేతిలో నొకరు అవమానపడుట, అపకారము చెందుట, చనిపోవుట కూడ జరుగుచున్నది. "ఏమరుపాటు లేకుండుట వలన దేవతలు అమరత్వము చెందుచున్నారు. ఏమరుపాటు వలన రాక్షసులు చనిపోవుచున్నారు. ఈ ఏమరుపాటు మృత్యువు.'' అని సనత్సుజాతుడు ఉపదేశించెను. కాని ధృతరాష్ట్రునకు బోధపడలేదు. కనుకనే అతడు గ్రుడ్డివాడు.

కృష్ణుడు మరికొన్ని వాక్యములను కూడ రాజవిద్యా సాధనయందు ధ్యానమునకై ప్రసాదించెను. "నాయందే సర్వజీవులు నున్నవి. నేను వానియందు అవస్థితి చెందిలేను'', అని యొక వాక్యము. మట్టియందు కుండల యాకారము లున్నవిగాని ఆకారముల యందు మట్టి అవస్థితి చెందియుండుట లేదు. అవస్థితి యనగా నేమి? సహజస్థితి కాక ప్రత్యేకమైన తాత్కాలిక స్థితి. కుండకున్న ఆకారములోని విశేషము లన్నియు మట్టికున్నవని చెప్పగలమా? కుండ లావుగా నున్నచో మట్టి లావుగా నున్నట్లు కాదు. చిన్న కుండ, పెద్ద కుండ యున్నచో అందు చిన్న మట్టి, పెద్ద మట్టి యున్నట్లు కాదు. చిన్న, పెద్ద, లావు, సన్నము, పొడుగు, పొట్టి మొదలగునవి యన్నియు అవస్థితులు. అనగా అవగుణములు. మట్టియం దివి యుండవు. కుండయం దుండును. కుండ మట్టి యందున్నదని గుర్తున్నపుడు, ఇవి కూడ మట్టిని ఆశ్రయించుకొని యున్న అనంత గుణము లుగా తెలియును. కుండయందు మట్టి యున్నదని అజ్ఞానమున బడినప్పుడు ఇవి అవగుణములు లేక ప్రత్యేక గుణములుగా భ్రమ కొలుపును.

అట్లే జీవులకు గల కామక్రోధాదులైన గుణములు ఆత్మ కుండవు. ఆత్మ పరమాత్మ యందు అభేదభావము వహించి యున్నది. పరమాత్మ యందు జీవులున్నారని స్మరణ యున్నపుడు కామక్రోధాది గుణము లుండవు. ప్రేమ, శౌర్యము, ప్రతాపము మున్నగు అనంత కళ్యాణ గుణము లుండును. అవి పరమాత్మ అయిన భగవంతు నాశ్రయించుకొని యున్నవి గాని, జీవులకు

సంబంధించినవి కావు, కామక్రోధాదులు జీవుల నాశ్రయించుకొని యున్న గుణములు. 'అతడు ప్రేమ గలవాడు, దానబుద్ధి గలవాడు' అన్నపు డవి యతనివి కావు. అతడు భగవంతునియం దున్నాడు గనుక అవి భగవంతుని గుణములు. ఈ విధముగా తెలియదగిన భగవంతుని ధ్యానమునందు నిలుచుటకే 'నాయందు సర్వ జీవరాశులు నున్నవి. నేను వాని యందు అవస్థితి చెందిలేను' అని ధ్యానింపవలెనని కృష్ణుడుపదేశించెను. (4)

ఇంకొక వాక్యమును కూడ కృష్ణు డుపదేశించెను : "ఈ జీవరాశులు నాయందు ఉండుట కూడ లేదు. నేను ఈశ్వరుడుగా వీనియందు వెలుగొందు నట్టి శోభను దర్శింపుము. నే నీ జీవులను భరించుచున్నాను గాని జీవులయందు ఉన్నవాడను కాను; 'నేను నేనే!' అనగా వారి యందున్న 'తాను' మాత్రమే యున్నాను. వారుగా నన్ను తమయందు భావించుకొను చున్నారు. అనగా వారి నట్లు నాయందే భావన కలిగియున్నాను." ఈ వాక్యములలో చిత్రమైన దర్శనము పొడుపు కథ వలె నిమిడియున్నది. 'ఈ జీవులు నాయందు లేరు' అను మాట కర్థమేమనగా, జీవులు భగవంతుని యందు వేరుగా జీవులుగా లేరు. అట్లున్నచో నరుని కడుపులోని మలమందలి నులిపురుగులవలె, వ్రణ మందలి సూక్ష్మజీవులవలె నుండవలసి వచ్చును. అట్లుండుట వ్యాధియే గాని లోకముల సృష్టికాదు. మరి యింకే సంబంధముతో భగవంతుడు జీవులను ధరించి యున్నాడు? ఒక కవి కొన్ని పాత్రలను భావించి సృష్టించును. వాని యందా పాత్రలు ఏ సంబంధముతో నున్నారో, భగవంతుని యందు సృష్టి జీవులును ఆ సంబంధముతోనే యున్నారు. కనుకనే భగవంతుని సృష్టిలో కవులు పుట్టి, కథలను, భగవంతుని కథలైన రామాయణ భారతాదులను, వేదములను, ఉపనిషత్తులను దర్శించి యిచ్చుట సాధ్యమైనది. ఇదే సంబంధ ముతో భగవంతుని యందు జీవులున్నారు గాని వేరుగా లేరు. ప్రతి జీవియు నిట్టి ఈశ్వరత్వమునే ధ్యానము చేయవలెను. (5)

ఆకాశమునందు వాయు వెట్లున్నదో గమనింపుము. అట్లే సర్వజీవులు నాయం దున్నవని కృష్ణుని యుపదేశము. ఇంతవరకే ఈ యుపదేశమును గ్రహించి యూరకొనువారికి ఇందలి విద్యలేదు. ఆకాశమునందు వాయువు వలె జీవులు దేవునియం దున్నవని భావించినంత మాత్రమున జీవునకు కడుపు

నిండిన దేమి? ఈ విషయమును తెలిసినవారు కూడ తెలియనివారివలె ప్రవర్తించు చున్నారు గదా! తెలియనివారు కూడ కొంతమంది దేవుని వలెనే ప్రేమ స్వరూపులై జీవించుచున్నారు గదా! కనుక తెలిసికొనుట మాత్రమే యైనచో ప్రయోజనము లేదు. ప్రయోజనము లేనపుడు తెలిసినది చదువు కావచ్చును కాని విద్య కాదు.

ఈ మంత్రమున గ్రహింపవలసిన బ్రహ్మవిద్య లేదు. ఆచరింప దగినది యున్నది. "ఆకాశమునందు వాయువు సర్వత్ర ఇమిడి యుండును. అట్లే జీవులు తనయందిమిడి యున్నారు. అనగా నాయం దిమిడియున్నారు." అని ధారణ చేయవలెను.

*'ఉపధారయ'* అను మాటకు నాకు అభిముఖముగ ధారణ చేయుమని యర్థము. ఇదియే సరియైన యుపదేశము లేక ఉపనయనము. ఉపధారణ శబ్దము దీనినే సూచించును. సాధకుడు, "నాయందు సర్వజీవులు ఆకాశము నందు వాయువువలె నున్నారు" అని భావించుట మొదలు పెట్టవలెను. అప్పుడది ధారణగా మారును. అట్లు మారుటకు భావన మావశ్యకము. ఆకాశమున వాయు వెట్లు స్థితి చెందియున్నది? ఆకాశముకన్న వేరుగా ఆకాశములో నున్నదా? ఉన్నదని చాలామంది యనుకొందురు. ఆధునిక శాస్త్రజ్ఞులు కూడ అట్లే యను కొందురు. వాయువు కానిది, వాయువుకన్న వేరైన ఆకాశ మున్నదనియు, అదియే నిరామయము (Vacuum) అనియు నేటివరకు చాలామంది శాస్త్రజ్ఞుల భావన. ఇది కరడుగట్టిన యజ్ఞానము. ఆకాశమునుండి వాయువు పుట్టుచున్న దని ఋషులైన శాస్త్రజ్ఞులు దర్శింతురు. ఇప్పుడును కొందరు దర్శించు చున్నారు. ఆకాశము నిరామయము కాదనియు, అట్లు భావించుట శాస్త్రజ్ఞుని మనసునకు గల ఆమయము (రోగము) అనియు తెలిసిన ద్రష్ట లున్నారు. ఆకాశమే కదలినచో వాయువగును. ఆగినచో ఆకాశ మగును. ఆగుట యనగా వేగ మెక్కువ యగుట. కదలుట యనగా వేగము తగ్గుట. మన మెరిగిన కదలికలు, ఆకాశ మనబడు వేగమును మార్చిన చిల్లర డబ్బుల వంటివి. వాయు వింకను వేగము తగ్గినచో అగ్నిగా మారును. ఇంకను తగ్గినచో జలముగా మారును. ఇంకను తగ్గినచో ఘనపదార్థముగా మారును. అందు ఆకాశాదులు నాలుగు పరస్పర వేగములలో నిండి యిమిడి దాగియుండును. కనుక

ఆకాశమున సంకల్పము తరంగముగ బయలుదేరి వాయువు, ద్రవ్యాదులు నగును. ఈ తరంగముల చాపవంటి యల్లికలే మన మెరిగిన పరమాణువులు. అవి పేర్చిన భవన నిర్మాణములే మన మెరిగిన సమస్త వస్తుజాలము. అందు ఆకాశమందలి బ్రహ్మాండ ప్రజ్ఞ పనిచేయుచున్నప్పుడు ఆ పేర్పులు జీవు లనబడును. ఆ ప్రజ్ఞ అహంకార మనబడును. అది మేల్కొననప్పుడు వానిని పదార్థములు, ద్రవ్యములు అందురు. ఈ విధముగా అణువు మొదలు బ్రహ్మాండము వరకును సృష్టి- చాపల అల్లికలుగా ఆకాశమున నిమిడియున్నది. ఆ యాకాశము వానియందు యోగనిద్రలో నున్నప్పుడు అవి వేరువేరుగా అస్తిత్వమున నుండును. అంతకన్న తక్కువ మేల్కొని యున్నప్పుడు జీవులు కాకుండ వస్తువులుగా నుండును. జీవుడైన నరుడు తనయందు వర్తించు 'నేను'గా మేల్కొనవలెను. దానికొరకై "నా యం దీ జీవులు యిమిడి యున్నవి. నే నాకాశము, ఇవి వాయువు వంటివి'' అని భావన చేయవలెను. చేసినపుడు తాను దేనియందు మేల్కొనుచున్నాడో దానితో సంబంధ మేర్పడును. ఈ సంబంధమే ప్రేమ లేక భక్తి. ఇది చెదురుమదురుగ నున్నపుడు బంధు మిత్రాదులయందు ప్రేమ (అనగా పేర్ల యందును, భావనయందును ప్రేమ), పెద్దలయెడ భక్తి (పేర్ల యందు, విగ్రహములయందు భక్తి)గా పనిచేయును. ఈ భక్తిలో కూడ దేవుని పేర్లుండును గాని దేవుడుండడు. తనయందు దాగియుండి నవ్వుచుండును. అతడు తనయందే రహస్యముగా రాజై దాగి యుండును. ఈ రాజ దర్శనమునకు మార్గము రాజవిద్య లేక రాజగుహ్యము. కనుకనే అవి యీ అధ్యాయమునకు నామమై యున్నవి.

"నాయందు సర్వజీవరాశులు నిండియున్నారు.'' అని భావన చేయుట వలన తాను సర్వాంతర్యామి యందు భక్తి సాధన చేయుట ప్రారంభమగును. బంధుప్రేమలు, బంధువులలో నున్న వానిపై ప్రేమగా వికసించును. పెద్దల యందు భక్తి, పెద్దలలో నున్న వానిపై భక్తిగా వికసించును. బంధుప్రేమ, పెద్దలయందు భక్తి పరమార్థ సాధనము లగును. ఆ గుణములు లేనివారికి ఏ సాధన చేసినను లాభము లేదు. ఈ రాజవిద్యా సాధనము 'ఉపధారణముగా' చేసినవానికి మాత్రమే ధారణ నిలచును. అది నిలిచినపుడే ధ్యానముగాని, సమాధిగాని తెలియును. కనుక ఈ వాక్యములను కృష్ణుడు తనయందు

లోకము లున్నవని నీకు చెప్పుటగాకాక, నీవు భావన చేయవలసిన యుపదేశ ముగా స్వీకరింపవలెను. తనయందు లోకము లున్నవని దేవుడు నీతో గొప్ప చెప్పుకొనుట యెందుకు? ఉపదేశముతో నిన్నుద్ధరించుటకేగాని దేవుడు తన వైభవమును చెప్పి నిన్ను భయపెట్టుటకు కాదు గదా! కనుక నీ వట్లు భావన చేయుము. దానితో నీవు సర్వాంతర్యామి వగుదువు. నీవు ఆకాశమని తెలియును. నీయందు వాయువు శ్వాసరూపమున నున్నదని తెలియును. అగ్ని నీ దేహ మందలి వేడిగా నున్నదని తెలియును. జలము నీయందు రక్తాది ధాతువులుగా నున్నదని తెలియును. పృథివి నీ దేహముగా నున్నదని తెలియును. అప్పుడు నీవు దేహమున బద్ధుడవు గాక, నీ యందు దేహాదు లుండును. అట్లే సర్వ సృష్టి, జీవుల దేహాదులుండును. అప్పటి నీవే యతడు. (6)

## 'నా' వైభవము :

ఉత్తర ధ్రువము చుట్టును ఆర్కిటిక్ సముద్ర మున్నది. ఆ సముద్ర ప్రాంతమందలి వాతావరణమున వేడిమి తక్కువ యగుటచే అందు మంచు కొండలు కట్టుకొనుచు, ఈదులాడుచు కరగిపోవుచుండును. అట్లే మహేశ్వరుడు అను నవతారమున నున్న భగవంతుడు ఒక మహా సముద్రము. అందలి జలములే 'నేను' అను ప్రజ్ఞ. అందు జీవులు రూపములు కట్టుకొనుచు తేలుచు ఈదులాడుచు కరగిపోవుచుండును. కరగిపోవులోపున చిన్నవి పెద్దవి పర్వత ములు గుంపులుగ కలిసికొనుచుండును. అట్టివే కుటుంబములు, వర్గములు, జాతులు. కొన్ని పర్వతములు సముద్ర వేగమునకు కొట్టుకొని బ్రద్దలగు చుండును. అవే చంపుకొనుటలు, యుద్ధములు. కొన్ని మంచు ముక్కలు రెండేసి కలిసి ఒక్కొక్క ముక్క యగుచుండును. అట్లే జీవులకు పిల్లలు పుట్టు చుందురు. ఈ మంచుకొండలు నేనను జలముపై తేలుచుండును. కనుకనే తమ కన్న క్రిందనున్న చేపలవంటి జీవులు తమ యాజ్ఞకు లోబడక ఎవరి జీవితములు వారు జీవించుచుందురు. ఉష్ణోగ్రతల మార్పుతో కూడిన గాలు లకు ఈ కొండలలో కన్నములు పడుచుండును. అట్లే జీవుల దేహ నిర్మాణ ములు, పొట్ట, ఊపిరితిత్తులు, ముక్కులు, చెవులు, నోరు, కన్నులు మొదలగు నవి. వానిలోనికి గాలి ప్రవేశించి యీవలకు వచ్చుచుండును. అట్లే జీవుల శ్వాస నడచుచుండును. అందలి జలములు నే నను ప్రజ్ఞలు గనుక, యీ

జీవులు "నేను శ్వాస పీల్చుచున్నాను, అన్నము తినుచున్నాను, ఈ మహా కార్యములు సాధించుచున్నాను'' అని సంబరపడుచుందురు. ఒక్కొక్క కొండ కన్నములో పనిచేయున్న ప్రజ్ఞ, ఆ జీవియొక్క అహంకారముగా పనిచేయును. ఈ 'నే' నను ప్రజ్ఞయొక్క వైభవమే 'మామిక' (నాకు సంబంధించినది). కనుక సర్వసృష్టిలోని జీవులు నా యందుండి, నాకు సంబంధించిన స్వభావ మును పొందుచున్నవి. ఈ స్వభావము లేక ప్రకృతియే నాది యనబడు భావముగా వీనిలో నుండును. ఈ విధముగా నా ప్రకృతి యందీ జీవులు నివసించుచున్నవి. ఇవి కరగిపోవుటయే కల్పక్షయము. అప్పుడవి నా ప్రకృతినే పొందుచున్నవి. మరల కల్పాదియందు నేను వానిని సృష్టించుచున్నాను. అందు నా ప్రకృతియే వాని ప్రకృతిగా మెలగుచున్నది. చూచితివా నా వైభవము?(7)

నేను వీనినెట్లు పుట్టించుచున్నాను? నా ప్రకృతి నవలంబించి పుట్టించు చున్నాను. (నే నను మహా సముద్రమే నా ప్రకృతి) మరల మరల పుట్టించుట కూడ నా ప్రకృతియే. ఈ ప్రకృతికి వశమై మాత్రమే ఈ సమస్త జీవుల సమూహము వర్తించుచున్నది. కనుకనే జీవికి పరిస్థితులు తన వశముగాక నడచుచున్నవి. (తినుచున్న ఆహారమే జబ్బు చేసినపుడు తినుటకు తన వశము కాకుండును. తన శ్వాసయే అవసాన కాలమున తనకు లొంగక నిలచిపోవును. తన మనస్సు దానికి అనుకూలముగ నడచినప్పుడు పరిస్థితులు తనకు వశమై నడచుచున్న ట్లనిపించును.) (8)

ఆర్కిటిక్ మహాసముద్రము నందలి యీ మంచుకొండల బరువు వానిలోని మంచునకు అంటునా? అందలి జలములకు వర్తించునా? వాని కన్నములలోని ఆకాశమునకు వర్తించునా? ఈ మంచుకొండల ఆకారము లందలి చోటునకు వర్తించునా? యాదృచ్ఛికముగా కొన్ని కన్నములు కలసి ఒక్కొక్కప్పుడు కోతి యాకార మేర్పడును. దాని చుట్టునున్న ఆకాశమున కూడ కోతి యాకార ముండును. అది ఆకాశమున కంటునా? అంటదు. అట్లే జీవులలో నున్న నేనను అంతర్యామి ప్రజ్ఞకు జీవుల కర్మ లంటవు. (జీవుల కంటవని యర్థము కాదు. జీవులలోని అంతర్యామి కంటవు.) తాను స్మరణచేత జీవుడుగా నున్నప్పుడు అంటును. దేవుడుగా నున్నప్పుడు అంటవు. అందుకే దైవస్మరణ యనబడు చిన్న ధర్మ ముపదేశింపబడినది. ఈ ధర్మము

చిన్నదైనను మహాభయము నుండి రక్షించును. ఈ కర్మలు 'నన్ను' బాధింపవు. నేను అంటనివాడనై యీ జీవులయందే ఉదాసీనునివలె నుందును. (ఉదాసీనుని వలె నుండునుగాని, ఉదాసీనుడు కాడు. కనుకనే అంటని దైవము, అంటిన జీవులు తన అంతర్యామిత్వమునం దున్నవి.) ఇట్టిదియే దేవుని భూత మహేశ్వరత్వము. ప్రకృతి, జీవులు వానితో నెట్లు ఏకత్వమును పొందియున్నారో అదియే యీశ్వర యోగము. అదియే ఐశ్వర్యము లేక ఈశ్వరత్వము. అదియే యోగమాయ. పరిశీలించుట కివి వేరు వేరుగా కనిపించును. కాని అస్తిత్వమున ఏకత్వమునం దున్నవి. ఈ ఏకత్వమే కృష్ణుడు చెప్పిన యోగము. (9)

ఈ జీవులను పుట్టించుమని నేను ప్రకృతిని ఆజ్ఞ పెట్టుచున్నానా? లేదు. నా పర్యవేక్షణ క్రింద ప్రకృతి యీ జీవులను కని పెంచుచున్నది. అనగా నేను అంగీకరించుచున్నాను, లేక యీ జీవులుగా నానందించుచున్నాను. ఇట్లు అంగీకరించుటయే అధ్యక్షించుట. ప్రకృతికి నే నధ్యక్షుడుగ నుండగా, ప్రకృతి ఈ పనులు నిర్వర్తించుకొనుచు పోవుచున్నది. కనుక యీ ప్రకృతియే యీ లోకముల చక్ర క్రమపరిణామమునకు హేతువగుచున్నది. నేను హేతు వగుట లేదు. నేను కార్యక్రమ మేర్పరుప లేదు. గనుక హేతువగుట లేదు. నాయందు ప్రకృతి హేతువై యీ జీవులను పుట్టించుచున్నది. పుట్టిన జీవికి మనస్సు పుట్టును. ఆ మనస్సునకు హేతువు గోచరించును. మనస్సు ఏర్పడిన తరువాత మనస్సునకు పొడకట్టునదే హేతువు. అంతకు ముందరి హేతువు తన నిట్లు పుట్టించిన ప్రకృతియే. దానిచే యీ జగత్తు విపరివర్తనము చెందుచున్నది. మిగిలిన హేతువులన్నియు జీవులు కలిగించుకొన్నవి. జరుగుచున్న సృష్టిలో పూర్వాపరముల క్రమ మేర్పడును గనుక, అందు పూర్వమున్నది తరువాతి దానికి హేతువని పిలువబడును. కనుక జీవుల కార్యక్రమము నందలి హేతువు లన్నియు భ్రాంతి మూలకములు. ప్రకృతి ధర్మమునందలి వరుసక్రమములను హేతువులుగా భ్రమపడుట వలన కలిగినవి.

సృష్టిలోని క్రమమంతయు పరివర్తన శీలము (Revolution). ఇది చక్రము తిరుగుచున్న క్రమమున జరుగును. కాని ఒక పరివర్తనకు మరియొక పరివర్త నకు నడుమ భేద ముండును. ఇదియే నూతనత్వము. ఈ నూతనత్వము నందు మనస్సు చిక్కుకొనుట వలన జీవులు నిత్య నూతనులుగా వ్యవహరించు

చున్నారు. ఇది విశిష్టమైన విచిత్ర పరివర్తనము. మన జీవితమున సూర్యోదయము నుండి సూర్యోదయము వరకు జరుగునది యొక పరివర్తనము. దీని వలన రాబోవు సూర్యోదయము తెలియును. కాని అది నిన్నటి సూర్యోదయము కన్న భిన్నముగా నుండును. కనుకనే మన జీవితము అంతు పట్టినట్లుండును; అంతు పట్టనట్లుండును. అర్థమైనట్లుండును; అర్థము కానట్లుండును. అర్థమైనది పరివర్తనము; అర్థము కానిది విపరివర్తనము. (10)

ఇట్టి నాలో నుద్భవించిన ఒక్కొక్క జీవిలో నే నున్నాను. కాని ఎవడికివాడు తా నున్నా ననుకొనుచున్నాడు. ఇట్లనుకొనుట మోహము. మోహపడువాడు మూఢుడు. మూఢుడు నా పరిపూర్ణ భావమును తెలియలేక మానవ శరీరమే నేను అనుకొనును. 'నేను' మానవ శరీరము నాశ్రయించి యున్నానని భ్రమ పడును. అట్లుండి యిట్లు చెప్పుచున్నానని మూర్ఖపడును. (11)

ఇల్లు కట్టుకొనినవాడు ఆ యింటిలోని చోటు తనది యనుకొనును గదా? చోటులో ఇల్లు కట్టుకొంటి ననుకొనును. కట్టుకొన్నది 'నే' నని మరచి, తానని భ్రమపడి, "నేను కట్టుకొంటిని" అని మూఢుడై పలుకును. అట్టివాడు "నేను భూత మహేశ్వరుడను" అని పరిపూర్ణ మహాభావము నెరుగకున్నాడు. దాని నెరుగకయే జీవులు మూఢులై యొకరితో నొకరు వ్యవహరించుకొను చున్నారు. నాతో కూడ నట్లే వ్యవహరించుచున్నారు. దానివలన వ్యర్థముగా ఆశలు అల్లుకొని వ్యర్థములైన పనులు చేయుచు, ఏదో జ్ఞాన మార్జించుచు, రాక్షసము, ఆసురము, మోహకము అగు ప్రకృతిని పొందుచు నన్ను స్మరించుట మరచిపోవుచున్నారు. (12)

## దైవీ ప్రకృతి :

ఇంటిని అద్దె కిచ్చువాడు తన యింటిలోగల చోటు వైశాల్యమునుబట్టి అద్దె నిర్ణయించును. అది తన యింటిలోని తన చోటు గదా అని వాని నమ్మకము. తా నిల్లు కట్టకముందు కూడ ఆ చోటు అచ్చటనే యున్నదని మరువనిచో, అది తన చోటు కాదనియు, తాను పుట్టక ముందుకూడ ఆ చోటు ఉన్నదనియు, ఆ చోటునే తాను వాడుకొనుచున్నాననియు, దానినే తన పెద్దలు కొనియున్నారనియు తెలియును. తండ్రి పొలమును కొడుకులు

పంచుకొనునపుడు కొలుచుకొని సరిహద్దు రాళ్ళను పాతుకొందురు. అది వారి పొలముగా భావింప బడుచున్నది. కొలతలు, హద్దులు పెట్టకముందు కూడ ఆ భూమి మిగిలిన భూగోళమందలి భాగమని గుర్తుండదు. కనుకనే హద్దులకై పోరాటములు, కోర్టులకు పోవుట, ఆస్తి హరించిపోవుట జరుగు చుండును. గుర్తుంచుకొన్నచో నట్లు జరుగదు. పండించుకొనుట, సుఖించుట మాత్రమే జరుగును. ఇట్లు గుర్తుంచుకొన్నవారికి చోటు అనగా ఇంటిలోని చోటు కాదు. ఇల్లే చోటులోనిది. చోటు అనగా మహాకాశము. అట్లే భూమి యనగా తన సరిహద్దులలో రిజిష్టరు చేసిన భూమికాదు. సరిహద్దులే భూమి లోని భాగములు. చోటు అనగా భూగోళమందలి మహాభూమి.

ఈ విధముగా గదులలోని చోటును, హద్దులలోని భూమిని నమ్మిన వారు అల్పాత్ములు. వారికి నే ననగా దేహముగానున్న భాగము. మహాభూమిని మహాకాశమును జ్ఞప్తి యుంచుకొన్నవారు మహాత్ములు. వారికి నేను అనగా అంతర్యామి. ఇట్లు మానవులు అల్పాత్ములు, మహాత్ములు అని రెండు విధములు. అందు అల్పాత్ములు ఆసుర స్వభావమును, రాక్షస స్వభావమును, మోహినీ ప్రకృతిని (మోహపడుట లేక మోసపోవుట) పొందుచున్నారు. కలహించి దుఃఖాదుల పాలగుచున్నారు. మహాత్ములు నా స్వభావమును పొందుచున్నారు. నా స్వభావ మనగా అంతర్యామి స్వభావము. నే నంతర్యామిని గనుక నాకు నా స్వభావ మున్నది. అది అందరి స్వభావములను మించినది. అదియే నా ప్రకృతి లేక దివ్య ప్రకృతి యనబడును. దానినుండియే యీ సృష్టి యంతయు మొలచుచున్నది: కనుక నా ప్రకృతి ఈ సృష్టి మొత్తమునకు విత్తనము వంటిది. మహాత్ములు ఎల్లప్పుడును ఈ నా ప్రకృతి నాశ్రయించి యుందురు. (13)

ఒక వ్యక్తికి ఇతర వ్యక్తులు కనుపింతురు. ఆకాశమున కొంతభాగముగా మరియొక ఆకాశమని యుండదు. అట్లే నా ప్రకృతిలో నున్నవారికి రెండు మనస్సులు, రెండు అభిప్రాయములు నుండవు. అందరిని గూర్చియు వారికొకటే అభిప్రాయ ముండును. అదియే నేను. అందరి యందును నేనే కనిపింతును; కనుక వారి మనస్సులకు అన్యము పుట్టదు. ఇట్టి అనన్య మనస్సుతో వారు నన్ను భజించుచుందురు. ఇట్టి అనన్య స్థితియే ఈ జీవులకన్న మొదటనున్న స్థితియని వారికి తెలియును. ఈ జీవులకు ఆది, అంతము నుండును. ఆ

ముందున్న స్థితికి ఆది అంతము లేవు. అది అవ్యయ మని వారెరుగుదురు. ఎవరి జీవితములను గమనించినను మహాత్ములు అవ్యయమూర్తినైన నన్నే వారియందు చూచుచు, సంకీర్తనము చేయుచుందురు. ఎవరితో ఏ ప్రయత్న ములు చేసినను నాతోనే ప్రయత్నింతురు. అన్ని పనుల యందును వారికిది యొక చలింపని వ్రత మగును. నాకు నమస్కరించుటలో కూడ ఈ భావము తోనే నమస్కరింతురు. వారికి గల భావము భక్తి యనబడును. నా యందు వారెప్పుడును నాతో కలసియుండుటచే నిత్యయుక్తులు. వారి యీ సాధన మార్గమే నిత్యయోగము. (అష్టాంగ యోగము మొదలగునవి దానిని మాత్రమే సాధించుటకు చక్కని మార్గములు.) ఏ పూజ చేసినను ఇదియే వారి యుపాసనము. **(14)**

అందు కొందరు తాము సాధించిన జ్ఞానమును లోకశ్రేయస్సునకై సమర్పించి జ్ఞానయజ్ఞము చేయుచుందురు. కొందరు నన్నీ సృష్టిలోని అఖండ మైన ఏకమూర్తిగా నుపాసింతురు. కొందరు ఈ జీవులను నా వేరు వేరు మూర్తులుగా గమనించి, వారితో నిర్వర్తించు కార్యక్రమములను వేరు వేరు పూజా విధానములుగ స్వీకరింతురు. ఇట్లు మహాత్ములు నన్ను సర్వతో ముఖమైన మూర్తిగా దర్శింతురు. **(15)**

అట్టివారు చేయు పనులన్నియు క్రతువులు. వాని ప్రయోజనము యజ్ఞార్థము. వారికి ఆ క్రతువులు, యజ్ఞములు కూడ నేనే. తమలోని జీవుడు ఆహారపానీయాదులను, శ్వాసను స్వీకరించి తన్ను తాను ధరించుకొను చున్నాడు. ఆ శక్తియే 'స్వధ' యనబడును. (అన్నము తినుట, పానీయము గ్రోలుట, రుచులు, వివాహమాడి సంతానము పొందుట, దాంపత్య సౌఖ్యము భగవంతుని సృష్టికర్మలోని భాగములే గాని, తమ యిష్టాయిష్టములకు సంబం ధించినవి కావని వారికి జ్ఞప్తి యుండును. కనుకనే ఆవేశము, వ్యామోహము, కామక్రోధములు వారికి ఉండవు. ఆహారము, రుచి, దేహము స్వీకరించుచున్నవే గాని తాము కోరినవి కావని వారికి జ్ఞప్తి యుండును.)

ప్రతి సంవత్సరము పంటనిచ్చి చనిపోవు మొక్కలుగల ధాన్యజాతులు ఓషధు లనబడును. వానితో సిద్ధము చేయబడిన అన్నము ఔషధ మనబడును.

ఆకలికి నివారకమైన ఔషధము అన్నము. (వ్యాధి నివారణమునకు కావలసిన మూలికలు మొదలగునవి కూడ ఓషధు లనబడుచున్నవి. వానితో తయారు చేయబడిన మందులు కూడ ఔషధము లనబడుచున్నవి. ఇది ఆ పదమునకు సరియైన అర్థము కాదు. అయినను కాలక్రమమున తప్పుగా ఈ యర్థమే స్థిరపడినది. ఓషధి యను పదమునకు జీవింపజేయునది అని యర్థము. కనుక ప్రాచీనమైన, శాస్త్ర సమ్మతమైన యర్థము ఆహారమని మాత్రమే.) ఈ ఆహారము వర్షరూపమైన నా యంత్రశక్తి వలన, విత్తనములోని బీజాంకుర శక్తి వలన కలుగుచున్నది. మరియు వంట చేయుట మున్నగు విధానములు నా రూపములైన నిప్పు, నీరు అనబడు భూతములలో పనిచేయు నా ప్రకృతి శక్తుల వలన కలుగుచున్నవి. కనుక నేనే ఔషధము.

ఆకలికిని, అన్నమునకును, రుచికిని, ఆహారేచ్ఛకును, బలమిచ్చుటకును సంబంధించిన ప్రజ్ఞ మనలో నొక పొడుపుకథ వంటిది. అది మననము చేయ దగిన రహస్యము. మనస్సు సహాయమున అది నిర్వర్తింపబడుచున్నది. కనుక మహాత్ముల కది హోమము చేయు వేదమంత్రము. అది నేనే. కట్టెలు మండుటకు నేయి ఎట్టిదో, దేహమునందు ప్రాణము వెలుగుటకు ఆహార జీర్ణశక్తి యట్టిది. కనుక మన జీవితమను యజ్ఞమున కది ఆజ్యము; అది నేనే. కట్టెలకు నిప్పు వంటిది, ఆహారమునకు జఠరాగ్ని; అదియే యజ్ఞమందలి అగ్నిహోత్రము; అది నేనే. ఇట్లు సమస్త దేహములందు సమస్త వ్యూహములుగా పనిచేయుచున్న యజ్ఞస్వరూపుడను నేనే. అట్టి నన్ను తెలియుటకు యత్నించుచున్న జ్ఞాన స్వరూపమగు యజ్ఞము కూడ నేనే. **(16)**

## ధ్యాన సోపానములు :

"నీ పుట్టుకకు కారణమేమి?" అని ప్రశ్నించినచో తల్లిదండ్రులని సమాధానము వచ్చును. మంచిదే! వారి పుట్టుకకు కారణము- వారి తల్లి దండ్రులు. ఇట్లు ప్రశ్నించుచు సృష్టి మూలము నన్వేషించినచో సమస్త సృష్టి జీవులు తమ తమ తల్లిదండ్రుల నుండి పుట్టినవారే. ఇట్లు లెక్కింపగా తల్లి దండ్రుల సంఖ్య కోటానుకోట్లుగా పెరిగిపోవును. వారందరికిని తల్లిదండ్రులు ఎంతమంది కావలెను? కనుక ఈ సమస్య యీ మార్గమున తేలదు. అందరిలో

గల సృష్టి కర్మమే కారణముగా గ్రహింపవలెను. ఈ సృష్టికర్మలో బీజము, క్షేత్రము అను రెండు భాగము లుండును. బీజమనగా విత్తనము, క్షేత్రమనగా భూమి. ప్రతి జీవికిని జన్మమెత్తుటకు తండ్రి విత్తనముగా, తల్లి భూమిగా పనిచేయుచున్నారు. ఈ మొత్తము సృష్టికి విత్తనముగా భగవంతుడే తన హిరణ్యగర్భ రూపమగు తేజస్సును సంకల్పించెను. అట్లే తన శక్తిని మొట్ట మొదటగా తననుండి వెలువరచి అండముగా నేర్పరచెను. అదియే ఈ సృష్టి మొత్తమునకు క్షేత్రరూపము లేక తల్లి. ఈ రెండింటి యందుగల అంతర్యామియే తానుగా మాటాడుచున్నాడు. కనుక "ఈ జగత్తునకు నేను తండ్రిని, తల్లిని" అని చెప్పుచున్నాడు. ఈ వాక్యములలోని పరమార్థమగు విశాలమైన తేజస్సును సాధకుడు ధ్యానము చేయవలెను. చేసినచో రాజవిద్యా రాజగుహ్య యోగము నకు మార్గ మేర్పడును.

పై జెప్పిన హిరణ్యగర్భుడే ధాత లేక సృష్టికర్త. అతడు కూడ తన రూపములలో నొకడే గనుక, "నేనే ధాతను" అను ధ్యానమును కృష్ణు డుపదేశించు చున్నాడు. తండ్రు లందరికిని ఈ ధాతయే తండ్రి గనుకను, వానికి తండ్రి అంతర్యామి గనుకను అతడు ఆ తండ్రికి తండ్రి. కనుకనే "నేనే పితామహుడను" అని కూడ ధ్యానింపు మనుచున్నాడు. ఇందు ఒక్కొక్క ధ్యానమునే సాధకుడు సోపానక్రమమున చేయవలెను. ఒక సోపాన మందలి ధ్యానము నందు నిశ్చలత్వము చిక్కిన వెనుక తర్వాతి సోపానమును ధ్యానము చేయవలెను. ఇట్లే ఈ దిగువ నింకొక సోపానక్రమము నిచ్చుచున్నాడు.

అనుక్షణము జీవులకేదో తెలిసికొనవలసిన విషయము ఉండును. అది అనుక్షణము మారుచుండును. ఇన్నిటియందును 'తెలిసికొనదగినది' మారని యంశము. అది నేనని ధ్యానింపవలెను. దేనిని ధ్యానించినను ధ్యానించువాని కాంతి ప్రసారమే ధ్యానింపబడు విషయము. తాను దానికన్న విశిష్టమైన లక్ష్యము కలవాడు. నిజస్వరూపము దొరికినచో ధ్యానమే తానుగా తనయందు లీన మగును. ధ్యానింపబడు విషయము కూడ తానుగా మారిపోవును. అంతేకాని తానెన్నడును ధ్యానింపబడు విషయముకన్న విశిష్టుడే. అనగా వేరైనవాడే. కనుక తాను ఏదియు నంటని పవిత్రమైన వస్తువు. అదియే ఓంకారమను గుర్తు గలది. అది యెట్లో వివరింపబడును.

ప్రశాంతముగా ఉచ్ఛ్వాస నిశ్వాసములను చేయుచు, వాని ప్రయత్న మెచ్చటినుండి జరుగుచున్నదో స్మరింపుము. అందు 'సోఽహం' అను మంత్రము వినబడును. ఈ మంత్రములోని సకార హకారములు ఈ మంత్రమునకు దేహము వంటి హల్లులు. అవి జారిపోవును. ఇక మిగిలినది 'ఓం'. అదియే నేనని స్మరింపుము. అప్పుడున్న 'నేను' పవిత్రమైన వస్తువు.

నీ శ్వాస నడచుచున్నది ప్రాణస్పందనము వలన. అది నిన్ను అడుగ కుండనే స్వయముగా నడచుచున్నది. అదియొక తాళలయాత్మకమైన, ఛందో బద్ధమైన పాట. దానికి సామమని పేరు. అది నేనని ధ్యానించినపుడు సామవేద మగును. దానితో కంఠనాదము పుట్టించినపుడు ఋక్కు అనబడును. అది నేనని ధ్యానించినప్పుడు ఋగ్వేదము అగును. (వాక్కు ఋగ్వేదము, ప్రాణము సామవేదము అని వేద మంత్రములు చెప్పుచున్నవి.) దానివలన నుత్పన్నమైన సకల ప్రాణి ప్రవర్తనము కర్మ స్వరూపము. అదియే యజస్సు. అది నే నని ధ్యానించినపుడు యజుర్వేద మగును. (17)

"నా కిప్పుడు మార్గమేమి? గతియేమి?" అను ప్రశ్నలు సంసారబద్ధులైన జీవులకు పుట్టుచునే యుండును. అట్టి సందర్భములలో కర్తవ్యము నెన్ను కొనుట లేక మరియొకరు బోధించుట, తనకు ఇంకొకరు జీవనాధారముగా నేర్పడుట గమనికకు వచ్చుచుండును. ఇన్నిటిలో నున్నది అంతర్యామిగా తా నొక్కడేయని కృష్ణు డుపదేశించుచున్నాడు. కనుక సాధకుడు "ఈ కనుపించు గతి నేనే. ఈ భరించి పోషించువారి రూపములలో నున్నది నేనే. పరిపాలించు ప్రభువును నేనే! కన్నులతో చూచువాడను నేనే. నాకు నివాసముగా నేర్పడిన ప్రదేశమో, యిల్లో, దేశమో, భూగోళమో, సౌరకుటుంబమో, ఆకాశమో నేనే. ఇవి నాయందున్నవి గనుక ఇవి నేనే. జీవుల ఉద్భవము, లయము నేనే. అవి చెందు స్థానము నేనే. అవి దాగియున్న నిధి నేనే. వానికి బీజముగా నిలబడి ఈ సృష్టి యెన్నడు తరగిపోకుండ నున్నది నేనే" అని ధ్యానము చేయవలెను. (18)

"సూర్యుడుగా, అగ్నిగా నేనే వేడిమి, వెలుగు కలిగించుచున్నాను. వర్షము కురిపించుచున్నాను. వేసవిలో నీటిని లాగికొనుచున్నాను. వర్షకాలమున నన్ను నేను వర్షముగా విడచుచున్నాను. అట్లే తరుగని అంతర్యామిగా నేను

అమృత స్వరూపుడనై యున్నాను. వచ్చుచు పోవుచున్న జీవుల రూపములుగా నేనే మృత్యువుగా నటించుచున్నాను. ఉన్న దంతయు నేనే. లేనిదానిగా యూహించు చున్న ఊహ నేనే. ఇది యున్నది, అది లేనిది అను రూపములు నేనే. సత్య స్వరూపము, అసత్య స్వరూపము నేనే'' అని ధ్యానింపవలెను.(19)

## స్వర్గ కామము :

ఈ ధ్యానమందలి సోపానక్రమము నభ్యసించుట రాజవిద్యా రాజగుహ్యా యోగము. ఇది లేనివారు దేనిని గూర్చి తెలిసికొన యత్నించినను తెలిసికొను వాడు, తెలిసికొనబడు వస్తువు, తెలిసికొనుట మూడును వేరువేరుగా కను పించును. దేని నాచరించినను ఆచరించువాడు, ఆచరింపబడు పని, ఆచ రించుట యనునవి మూడు వేరుగా ప్రత్యక్షమగును. ఇట్లు మూడు విధము లుగా ప్రత్యక్ష మగునని తెలియుటయే త్రైవిద్య. దాని కతీతముగా, దానియం దంతర్యామిగా నున్నవాడను నేను. ఈ రెండు విద్యల యందును ప్రకాశించు ప్రజ్ఞయే వేదములందు 'సోమము' అనబడును. (స + ఉమ అనగా మాయతో కూడిన దేవుడు.) రాజవిద్యను వదలి త్రైవిద్య నుపాసించువారు కూడ సోమము ననుభవించు చున్నారు. కాని వారి యనుభవము మూడు ముక్కలుగ విడిపోవు చున్నది. నన్ను వదలి త్రైవిద్య నుపాసించువారు తమ తమ మార్గములలో సోమపానము చేయుచున్నారు. అనేక సత్కర్మ లాచరించి పాపములనుండి విముక్తు లగుచున్నారు. లోకశ్రేయస్సు ననుసరించిన కర్మ లాచరించి వాని పుణ్యఫలముల కొరకు ఆశపడుచున్నారు. తత్ఫలితముగా వారనుభవించు సుఖము, సంపద కీర్తి రూపమున స్వర్గము ననుభవించు చున్నారు. వారెప్పుడును ఈ స్వర్గ సుఖము కొరకే ప్రార్థించి దైవారాధనాదులు చేయుచున్నారు. ఆ ఫలితములు వారి పుణ్యకర్మల ననుసరించి వచ్చుచు పోవుచు, కోరికలు తీర్చుచు, మరలమరల సుఖములతో కష్టముల ననుభవింప జేయుచుండును. కనుక రాజవిద్య నభ్యసింపని వానిని త్రై ధర్మము కూడ రక్షింపలేదు. (20)

తమ తమ కోరికలతో, ఆదర్శములతో, ఆశయములతో పలువురు పరోపకారములగు పుణ్య కర్మల నాచరించుచు, వానివలన కలుగునట్టి మంచి పరిణామములకొరకు ఆశపడుచున్నారు. వారి కా పుణ్యలోకములు తమ

తమ పుణ్య కర్మాచరణము ననుసరించి సిద్ధించుచున్నవి. వారు కోరిన సుఖ జీవనము, జ్ఞానమయ జీవనము, మోక్షము తమ కోరికల ననుసరించి సిద్ధించుచున్నవి. ఆచరించిన పుణ్యకర్మల ఫలితముగా మాత్రమే వారి కవి సిద్ధించుచున్నవి. వాని యాధిపత్యము వహించిన తమ మనస్సు, దేవేంద్రుడుగ తమ యింద్రియ లోకములను పరిపాలించుచున్నది. దీనితో దివ్యమైన యను భూతులను వారు పొందుచున్నారు. కాని ఇవి యన్నియు వారి పుణ్యకర్మల పోషణచే నిలబడియున్న లోకములు. చేసిన పుణ్యకర్మల ఫలితము ఎంత కాలము వర్తించునో, అంతకాలమే యీ అనుభవములు వర్తించును. వారు దానిని చిరకాలము విస్తారముగ అనుభవించిన వెనుక పుణ్యఫలములు తరిగి పోవుచున్నవి. వారి ప్రజ్ఞలు మరల మర్త్యలోకమునకు దిగుచున్నవి. ఎంత శాశ్వతత్త్వము ననుభవించినను అది జనన మరణముల హద్దులలో మాత్రమే యనుభవింపబడుచున్నది. ఇట్లు త్రయీ ధర్మమునకు తమ్ము తాము అర్పించుకొని, కోరికలు గలవారు రాకపోకలు చేయుచు మోక్షాదులనుకూడ కోరికల రూపముననే యనుభవించుచున్నారు.

కోరికలు గలవారికి మోక్షము లభింపదని సజ్జను లందరును అంగీక రింతురు. అయినను తెలియక మోక్షమును కోరుచునే యుందురు. కోరిన మోక్షము అనుభవమునకు వచ్చును. దాని కొరకు ఆచరించిన లోకోపకారకము లైన సత్కర్మలు, ఫలరూపమున దానిని అనుభవింప జేయుచుండును. ఇంతలో కర్మఫలము అయిపోవును. మృత్యువు ఆసన్న మగును. మృత్యువనగా మార్పు. దేహము విడచినను, విడువకున్నను మృత్యువు నిరంతరముగా కర్మ ఫలరూపమున ఆసన్న మగుచునే యుండును. కనుకనే వారు అనుభవించు లోకము లన్నియు మర్త్య లోకమున కధీనములుగా నుండును. ఈ మార్పు కలుగకుండ దాటుట యెట్లు?

తండ్రివద్ద నుండి వేయి రూపాయలు అపహరించుకొని పారిపోయిన కుమారుడు ఆ ధనముతో అనేక సౌఖ్యము లనుభవింపవచ్చును. "శాశ్వతా నందము" అను పేరుగల సినిమాకూడ చూడవచ్చును. కొంతసేపటికి సినిమా చూచుట అయిపోవును. కొన్ని రోజులకు అపహరించిన ధన మైపోవును. అప్పు డతని గతి యెట్టిదో, కామ్యకర్మలు చేసినవాని పుణ్య లోకములుకూడ నట్టివే.

అట్లుగాక మరియొకడు లక్షరూపాయలు తండ్రి దగ్గర సమ్మతితో తీసికొనిపోయి పుణ్యక్షేత్రములను దర్శింపబోవును. అనేక క్షేత్ర తీర్థముల దర్శనము చేసి, అనేకులగు మహనీయుల సాన్నిధ్యము ననుభవించి, బ్రహ్మానందము ననుభవింప వచ్చును. చిరకాలము పవిత్రమైన మనస్సుతో దాన ధర్మము లాచరించు చుండవచ్చును. కొంతకాలమునకు తెచ్చుకొన్న ధనమైపోవును. అప్పుడు వానికి మరల నివి యన్నియు లేనివే యగును. మరల యింటికి తిరిగి రావలెను. అట్లే మోక్షమును కోరి వివిధ యజ్ఞ కర్మల నాచరించువారును గతానుగతము లైన లోకము లనుభవింతురు. ఇది యంతయు తాను కొంత ధనమును వేరుగా గైకొనుట వలన కలిగిన యనర్థము. తమ తపస్సు, యోగసాధన, శమదమాదు లభ్యసించుట మొదలగు లక్షణములను తాము వేరుగా కలిగి యున్నప్పుడు ఇట్టి పుణ్యలోకముల క్షీణత తప్పదు. వానివలన సాధించుకొనిన ఆనందము దైవధ్యానమైనను ఇట్లు తరగిపోవుట తప్పదు. (21)

అట్లుగాక, మరియొకడు తండ్రి దగ్గర లక్షరూపాయలు స్వీకరించి, వానిని తండ్రివిగనే గుర్తించి, శ్రద్ధాభక్తులతో పెట్టుబడి పెట్టి యొక వ్యాపారము చేయును. ఆ వ్యాపార సంస్థకూడ తండ్రిదిగనే గుర్తుంచుకొనును. తత్ఫలితముగా మరియొక లక్షరూపాయలు కలసివచ్చునట్లు పనిచేయును. అందు ఏబదివేల రూపాయలను తండ్రి యనుమతింపగా స్వీకరించి, తన గృహ నిర్వహణము నిర్వర్తించుకొనును. ఇల్లు, భార్య, బిడ్డలు, తాను కూడ తండ్రికి సంబంధించిన వస్తువులుగనే గుర్తుంచుకొనును. అట్టి వానికి దృష్టి యీ సుఖములపై నెన్నడు నుండదు. అయినను యీ సుఖము లన్నిటిని తరుగకుండ పొందుచునే యుండును. తన సుఖము తన కుండును; అదియే తన తండ్రితోగల సంబంధము. తాను, తన తండ్రి వేరు కానట్టి భావము. అట్టివానికి అన్యదృష్టి యుండదు. భగవంతునితో నిట్లుండుటయే అనన్య చింత. ఎవ్వరీ విధముగ భగవంతునియందు అనన్యచింత కలిగియున్నారో వారే నిజమైన దైవోపాసకులు. వారి యారాధనము పర్యుపాసనము. వారి జనన మరణములు కూడ అంతర్యామికన్న వేరు కావు. కనుక దేహమునకే జనన మరణము లుండును గాని, వారి ప్రజ్ఞ కుండవు. అట్టివారి ప్రజ్ఞయే సర్వాంతర్యామి ప్రజ్ఞ. దాని నభ్యసించుట యీ రాజవిద్యా రాజగుహ్య యోగమున నుపదేశింపబడినది.

వారి ధ్యానమే యోగవిద్యకు గమ్యము. అది అంతర్యామి కభిముఖమగు యోగము. ఇది నిరంతర మభ్యసింప బడునదియే గాని, ఒక గంట కాలమో, రెండు గంటల కాలమో చేయు పూజగాని, యోగాభ్యాసము గాని కాదు. కనుకనే ఇది నిత్యాభియోగము. ఇది కలవారు నిత్యాభియుక్తులని గీత చెప్పు చున్నది. నిత్యయోగము నభ్యసించిన వారు మాత్రమే భగవంతునికి అర్పణమై యుందురు గాని, యోగాభ్యాసాదులను వేరుగా వేరు దృష్టితో నభ్యసించినవా రుండజాలరు. పతంజలి చెప్పిన అష్టాంగ యోగమైనను, భగవద్గీతలో చెప్పిన ధ్యానాదిక సాధనలైనను ప్రత్యేక దృష్టితో తామేదో సాధింపవలెనని అభ్యసించు వారు నిత్యముగ యోగమును పొందజాలరు. అట్లే తమ పవిత్రతను నిలబెట్టు కొనువారు, శక్తి నార్జించుకొనుటకు యోగాభ్యాసము చేయువారు, తమ మోక్షమునకై సాధన చేయువారు కూడా నిత్యాభియుక్తులు కాలేరు. తమను తాము సమర్పించుకొని, కర్తవ్యమును సాధనరూపమున నాచరించుచు, యోగాభ్యాసాదుల ననుష్ఠించుచు, ఇతరులలో గల దైవమును చూచి యజ్ఞార్థ కర్మ మాచరించువారు మాత్రమే నిత్యయోగమును పొందగలరు. అట్టివారి యోగస్థితిని, క్షేమమును అంతర్యామియే కాపాడుచుండును. అనగా బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు, గురువులు, సంపదలు మొదలగు వివిధ రూపము లతో నతడే కాపాడుచుండును. ఈ రూపములకన్న వేరుగా దైవమును భావించువారు నిత్యాభియుక్తులు కారు గనుక వారిని కాపాడుకొను భారము వారిదే గాని భగవంతునిది కాదు. అనగా ఎవరి మెలకువలో వారుండి ఎవరి క్షేమమును వారు కాపాడుకొనుచుండు దుస్థితి పట్టును.

పై జెప్పిన రాజయోగము నభ్యసించినవాడు, తన్ను తాను తన సమస్త ముతో సమర్పణము చేయునేగాని కర్తవ్యమునం దేమరుపాటు చెందడు. తాను చేయవలసిన పని యొక్కటే తన సాధనకు మార్గము. తన కర్తవ్యమును కూడ భగవంతునికి సమర్పింప యత్నించువారు దొంగలు. "నేను మంచి పని చేయవలసి యున్నచో భగవంతుడే నాకా బుద్ధి పుట్టించి నాచేత చేయించు కొనును" అని వారు భావింతురు. వారు దైవమును తమ కన్న వేరుగా భావించు చున్నారు గనుక దురాత్ములు. వారిచేత మంచి పనులు చేయించుకొనవలసిన కర్మ దైవమునకు పట్టదు. మనస్సు సంకల్పించిన దానిని చేతు లాచరించును

గాని, "ఈ మనస్సే మనచేత పనిచేయించుకొనును" అని ఆరోగ్యవంతుని చేతు లూరకుండవు. అట్లు ఊరకొనుటయే చేతులకు పక్షవాత మను రోగము. మనస్సునకు చేతులకు ఆరోగ్యవంతుని దేహమున నెట్టి సంబంధము గలదో, అట్టి సంబంధమే దైవమునకును రాజయోగ సాధనకును కలదు. కర్తవ్యము నందు రాగద్వేషములు నశించుటకే సమర్పణ బుద్ధికాని, కర్తవ్యమును దైవము నకు అప్పజెప్పుటకు కాదు. గురువే పాఠమును చదువుకొనవలసినచో శిష్యుడు పరీక్షలయందు ఉత్తీర్ణు డగుట యుండదు. కనుక రాజయోగ సాధనలో "సమస్త జీవులు, సమస్త లోకములు నా యందు ఉన్నవి." అను భావనకు అనుబంధమే యీ నిత్యాభియోగము. ఇదియే కృష్ణుని యోగ మార్గము. ఇందు ధ్యానింపబడు భగవంతుని యందు, ధ్యానించుట యను కర్మయందు, ధ్యానించువాని మనస్సు నందు, అతడెరిగిన వివిధ విషయములందు, అతని ప్రవర్తనమునందు దైవ మొక్కడే అంతర్యామిగా ప్రత్యక్షమై యుండును. వానియందే తానుండును. (22)

ఇట్లుకాక, దైవమును తమ మనస్సుతో వేరుగా ధ్యానించు వారున్నారు. వారిలో నొక్కొక్కని మనస్సు ఒక్కొక్క విధముగా దేవుని ధ్యానించును. ఒక్కొక్కనికి ఒక్కొక్క దేవు డుండును. ఎవని దేవుడు వానికి వేరుగా నుండును. (అది వాని మొగమే గాని దేవుడు కాదు.) వీరే అన్యదేవతా భక్తులు. ఇందు ఒకనికి విష్ణువు, ఒకనికి శివుడు, ఒకనికి శక్తి, ఒకనికి క్రీస్తు, ఒకనికి మహమ్మదు, ఒకనికి బుద్ధుడు దేవుడుగా నమ్మకము కుదురును. వీరు చాలక, ఒక్కొక్కనికి తన గురువు ఉపదేశించిన మంత్రము పేరుగల దేవు డుండును. పాపము వాడు మిగిలిన దేవుళ్ళ కన్న గొప్పవాడు. ఇంకను గ్రామదేవతలు, చిల్లర దేవతలు, చెట్టుకొకడు పుట్టకొకడు నుండును. కొందరు ఈ దేవతలను నిందించుటతో కొలుచుచుందురు. కొందరు 'దేవుడాతడు' అని ధ్యానించు చుందురు. కొందరికి తమ ధనమే దేవుడు. కొందరికి ఇల్లు-వాకిలి, పాడి-పంట తమ దేవుడు. అదియే లక్ష్మీదేవి. కొందరికి తమ పైయధికారి దేవుడు. అతడే వారిని భయభక్తులతో శిక్షించును. కొందరికి లంచమిచ్చువాడు దేవుడు. వానిని శ్రద్ధాభక్తులతో నారాధింతురు. ఇట్లు ఎవని దేవుడు వారికున్నాడు. తెలిసినను

తెలియకున్నను ఇన్ని రూపములతో దేవుడే వర్తించుచున్నాడు. తెలియనివారిని కామక్రోధములు బంధించుచున్నవి. తెలిసినవారిని దేవుడను అభిప్రాయము బంధించుచున్నది.

నిత్యాభియుక్తులు అనబడు నిజమైన యోగులకు కూడ ఇందరు దేవుళ్ళును ఉన్నారు. కాని వారందరును ఒకే అంతర్యామిలో నున్నారు. వారి స్వరూపములోని అంతర్యామి తనలోను, తన చుట్టును కూడ ఉన్నాడు. కనుక ఈ రూపము లన్నియు తనలోనే యున్నవని ధ్యానము చేయవలెను. ఇది తెలియక వేరు వేరు వ్యక్తులను, తమ తమ యిష్ట దేవతలను ఆరాధించువారు వేరు వేరు విధమైన శ్రద్ధాభక్తులను చూపించుచున్నారు. వారందరు కూడ అంతర్యామి యందే శ్రద్ధాభక్తులను అభ్యసించుచున్నారు. వారిది కూడ ఆరాధనమే. అనగా వారికి కావలసిన సాధన వారికి జరుగుచున్నది. కాని యింకను జరుగవలసిన పద్ధతిగా జరుగుట ప్రారంభింపలేదు. (23)

**యజ్ఞభోక్త :**

యజ్ఞార్థముగా చేసినను, స్వార్థముగా చేసినను మంచి పని యెప్పుడును యజ్ఞార్థముగనే ఫలించును. స్వార్థముతో మంచి పని చేసినచో, తన కిష్టము లేకున్నను దాని ఫలితము పదిమందికి దక్కును. తానొక్కడే మహా ధనవంతుడు కావలెనని వాణిజ్యమున శ్రమించువాడుకూడ నితరులకు లంచమో, జీతమో పంచిపెట్టనిదే పని జరుగదు గదా! అట్లే అన్ని యజ్ఞములకును, అధిపతి, అనుభవించువాడు అంతర్యామియేగాని అహంకారము కాదు. ఈ సద్భావము లేనివారు అందరిలోను ఉన్నారు. నన్ను దర్శింపలేకున్నారు. కనుకనే మాటి మాటికి లౌకిక ప్రయోజనముల దృష్టిలోనికి జారిపోవుచున్నారు. దానితో ఆశ నిరాశలలో నుయ్యాల లూగుచు సుఖదుఃఖములలో మునిగి తేలుచున్నారు. (ఎట్టి స్వార్థపరుడైనను అంతర్యామియొక్క పని చేయగల్గునేగాని తన పనియని వేరుగా ప్రత్యేకముగా చేసికొనుట సాధ్యము కాదు.) (24)

తనకు చక్కని గాలి కావలె ననుకొనువాడు ఇంటి చుట్టును తోటను పెంచుకొనును. దుర్వాసనలు లేకుండ పరిశుభ్రము చేసికొనును. వాడు తనకు

సదుపాయము చేసుకొనుచున్నానని భావించుచున్నాడుగాని, వాయుదేవుని రూపముననున్న నన్నే పూజించి సేవించుచున్నాడు. అట్లే కొందరు సూర్యుని, కొందరు చంద్రుని ఆరాధించుచున్నారు. ఒక్కొక్కడు తన భార్యకు, తనకు, చక్కని విహార స్థానములు కల్పించుకొనుచున్నాడు. శృంగార క్రీడలలో సుఖము లనుభవించుటకు సదుపాయములు చేసికొనుచున్నాడు. మరియొకడు సంతతిని పొందుటకు కావలసిన ఔషధములను గాని, దేవతలనుగాని సేవించుచున్నాడు. అట్టివాడు పితృదేవతల రూపమునగల నన్ను ఆరాధించు చున్నాడు. ఒక్కొక్కడు మట్టి పిసికి కుండలు చేయుట, కొండలు పిండికొట్టి భవనములు నిర్మించుట, జలపాతములను సేవించి విద్యుచ్ఛక్తి నాహ్వానించుట చేయుచున్నాడు. అట్టివారు పంచభూతముల రూపముననున్న నన్నే ఆరాధించు చున్నారు. వీరందరు కార్యసిద్ధిని బట్టి సుఖదుఃఖముల పాలగుచున్నారు. ఇట్లుకాక వీనియందు నా అంతర్యామిత్వమును దర్శించి, సమర్పణబుద్ధితో ఈ పనులనే చేయువారు నాయందు జీవించుచున్నారు. **(25)**

దినచర్యలో నొకరి కొకరు ఇచ్చి పుచ్చుకొనుట యుండును. వానితో సుఖదుఃఖములు చుట్టుకొనుచుండును. ఎవనికైన డబ్బిచ్చినపుడు లేక పండ్లు ఫలములు మున్నగునవి లంచముగా నిచ్చినపుడు, అతడు తన పని చేసి పెట్టనిచో దానము వలన దుఃఖము కలుగుచున్నది. నిత్యాభియుక్తుడు దీనికి గురికాడు. అతడు దేని నిచ్చినను పుచ్చుకొను వానియందున్న నాకే సమర్పణ చేయును. అనగా భక్తితో సమర్పించుకొను పత్రమో, పుష్పమో, ఫలమో, జలమో ఇట్లు భక్తితో నెవడు సమర్పించినను దానిని నేను కూడ భక్తి భావముననే స్వీకరించుచున్నాను. అదే నియమముతో ఆనందరూపమున అనుభవించు చున్నాను. (స్వార్థముకొర కిచ్చినవాని నుండి కూడ స్వీకరించు చున్నానుగాని మరియొక స్వార్థపరుని రూపముతో స్వీకరించు చున్నాను. అనగా మోసము, దుఃఖము అనబడు బంధములు బిగియును.)

అర్జునా! నీవు నా మార్గమున నిత్యాభియుక్తుడవై కర్మాచరణము చేయుము. ఏది చేయుచున్నావో, తినుచున్నావో, ఇచ్చుచున్నావో, దేని కొరకు నిష్ఠ పూనుచున్నావో దానిని సమస్తము నాకు సమర్పణముగా చేయుము. **(26, 27)**

## సన్న్యాసయోగము :

మానవులు సామాన్యముగా తమకు దుఃఖము కలుగకుండ వలెననియు, సుఖము కలుగవలెననియు నభిప్రాయపడుదురు. దాని ననుసరించి ప్రయత్న ములు, పనులు చేయుచుందురు. ప్రణాళికలు, పన్నుగడలు, తీర్పులు దాని ననుసరించియే చేయుదురు. అన్ని పనులకును, అన్ని ప్రయత్నములకును, ఆదర్శములకును, ఆశయములకును పునాదిలో నుండు నభిప్రాయ మొక్కటే. దుఃఖములు, బాధలు తమకు కలుగకూడ దనియు, సుఖములు కలుగవలె ననియు. ఈ అభిప్రాయమే విష కీటకము వలె పనిచేసి దుఃఖములలో పడ ద్రోయుచుండును. ఈ అభిప్రాయమునందు లోభము, స్వార్థము ఇమిడి యుండుటయే దీనికి కారణము. తుదకు పాపకార్యములు మాని పుణ్య కార్యములు చేయువారిలో కూడ చాలమంది కిదియే అభిప్రాయ ముండును. పాపకార్యములు మానుట వలన దుష్కర్మ నశించుననియు, పుణ్య కార్యములు చేయుట వలన పుణ్యఫలము పెరుగుననియు పేరాశ వేధించుచుండును. వీరిని కూడ తమ కర్మఫలములు బంధించును. శుభాశుభ ఫల సమ్మిశ్రముగా జీవితము జరుగుచుండును. ఒకనాడేడ్చుట, ఒకనాడు నవ్వుటగా సంసార సాగరపు తరంగడోలికలపై జీవితము మునిగి తేలుచుండును. మోక్షమును కోరినవారిలో కూడ చాలమంది ఈ పేరాశతోనే ప్రవర్తింతురు. మిగిలిన అజ్ఞాన జీవులకు కలుగుచున్న దుఃఖములు తమకు కలుగరాదనియు, ప్రపంచము నందలి కర్మఫలములు తమను అంటకుండ అతీతులై ఈ దుఃఖమయ ప్రపంచమును చూచుచుండ వలెననియు వారు భావింతురు. జనన మరణముల కతీతులై శాశ్వత లోకమున నుండి సుఖించు చుండవలెనని పేరాశతో మోక్ష ధర్మము నవలంబించువారు కలరు. ఇది అన్నిటిని మించిన స్వార్థము గనుక వారు నిత్యనరకమున పడుచుందురు. ఇంతకాలము నిస్వార్థముగా జీవించుట వలన లోకము మనల నేమి గుర్తించినది? అను దుర్బుద్ధి పుట్టును. దానితో మరల అసుర ప్రవృత్తి ప్రారంభమగును. వీరెవ్వరును మోక్షస్థితిని పొందలేరు.

తమ కర్తవ్యమును గుర్తించి, తమ ఆశ్రితులపై తమకు గల బాధ్యతను భగవంతుని కార్యముగా సమర్పణబుద్ధితో సంతోషముగా నాచరించువా

రొక్కరే మోక్షమున కర్హులు. వారిదే భగవంతుని సామ్రాజ్యము. ఎవ్వరికేది చేసినను అంతర్యామికి చేయుట సత్యముగా తెలిసికొనవలెను. అందరిలో అన్ని బాధ్యతలలో, సన్నివేశములలో అంతర్యామిని చూడవలెను. అతనియందు యివి యున్నట్లు గమనింపవలెను. అందరి హృదయములలో జీవుడుగా నుండి, వివిధ ప్రవర్తనల తెరలమాటున అంతర్యామి దర్శనమిచ్చుట మరువరాదు. అందరును వానియందే పుట్టి, వర్తించి, మాయాబద్ధులై జగన్నాటకము నిర్వ ర్తించుచు, వానియందే లయ మగుచుండుటను భావింపవలెను. తాము చేయు కార్యములు, అందలి యిచ్చిపుచ్చుకొనుటలు వానివే యని మరువరాదు. అప్పుడు తా నాచరించుచున్న కర్మలు సమర్పణబుద్ధితో నాచరింపబడును. ఆ కర్మల శుభఫలములుగాని, అశుభ ఫలములుగాని తన్ను బంధింపవు. ఇదియే మోక్షము. కర్మఫలములు తన్ను బంధింపకుండుటయే మోక్షముగాని, కర్మఫలములనుండి తప్పించుకొన యత్నించుట మోక్షము కాదు. ఇట్టి సమర్పణ బుద్ధియందు ఉండి బంధింపబడకుండువాడే సన్న్యాసి. కర్మయోగ ముతో ఫల సన్న్యాసము కలిసినపుడే నిజమైన యోగసిద్ధిగాని, సన్న్యాససిద్ధిగాని కలుగును. అతడు దేనియందును ఉండక తనయం దుండు ననియు, తనను పొందుననియు కృష్ణుడు ఉపదేశించు చున్నాడు. **(28)**

అట్టి నేను అంతర్యామిని. అందరిలో నున్నాను. అందరికిని సమాను డను. అందరియందును సమబుద్ధితో ప్రవర్తింతును. అట్టి నాకు ద్వేషింపదగు వాడుగాని, ప్రేమింపదగు వాడుగాని యుండడు. నా ప్రేమయందు జీవు లుందురుగాని ఎవరియందును ప్రేమ యుండదు. (ఒకరియందు ప్రేమ యనగా అది బంధింపబడిన ప్రేమ లేక మమకారము. ప్రేమయందు జీవు లుండుట నిజమైన ప్రేమ. ఇట్టి ప్రేమ కలవారే నిజమైన భగవంతుని స్వరూపులు లేక భాగవతులు.) ఎవరు నన్నీ విధముగా భక్తితో భజించుచున్నారో వారు నాయందు ఉందురు. కనుక నేను వారియందు ఉందును. అట్టివారిలో చెడ్డ పనులు చేయు స్వభావమున్నను తప్పులేదు. (బిడ్డ బాగుపడవలెనని కోరిన తల్లి బిడ్డపై కోపింపవచ్చును. కొట్టవచ్చును. అయినను సంకల్పము మంచిది గనుక తప్పు లేదు.) **(29)**

అట్టివారి దురాచారము క్రమముగా తొలగిపోవును. నన్ను అనన్య

బుద్ధితో భజించుచుండుట వలన అట్టివారు మంచివారే. వారి భవిష్యత్తు చక్కగా బాగుపడి వారు నా భావనలోనే పరిశుద్ధు లగుదురు. పరిపూర్ణు లగుదురు. చక్కని పర్యవసానము కలుగును. కనుక అట్టివారిలో తప్పులు పట్టి, విమర్శించి లాభము లేదు. తప్పులు పట్టినవాడు చెడిపోవును గాని, చేసినవాడు అంతర్యామి భావనయున్నచో నుద్ధరింపబడును. (30)

అట్టివాడు చాల త్వరగా ధర్మస్వరూపము నెరిగి, ఆచరించి తానే ధర్మ స్వరూపు డగును. శాశ్వతమైన శాంతిని పొందును. ఓ నరుడా! ఈ నా ప్రతిజ్ఞను మరువకుము. నాయందు భక్తి నిలిపినవా డెన్నడును నశింపడు. పాపపు జన్మ నెత్తినవారుకూడ నన్ను ఆశ్రయించి పుణ్యాత్ము లగుదురు. (భక్తితో ఆశ్రయించి నను, వ్యతిరేకించి ఆశ్రయించినను కూడ తరింతురు. హిరణ్యాకశిపుడు, రావణుడు మున్నగువారు కోపముతో నిరంతరము నన్నే స్మరించి ఎన్ని దుష్కార్యము లాచరించినను చివరకు తరించిరి.) (31)

ఎట్టి ప్రవర్తనము గల జీవులైనను పర్యవసానము నేనే గనుక వారు నన్ను చేరక తప్పదు. స్త్రీలు, వైశ్యులు, శూద్రులు కూడ నన్నాశ్రయించి మోక్ష స్థితిని పొందుచున్నారు. ఇక భక్తులైన బ్రాహ్మణుల సంగతి, రాజర్షుల సంగతి చెప్పనేల? (అనగా స్త్రీలు, వైశ్యులు, శూద్రులు పాపులని యర్థము కాదు. స్త్రీలు భర్త యందును, బిడ్డలయందును రక్షణ పోషణాది భావముల ఆసక్తితో జీవితము గడుపవలెను గనుక, వేరుగా సృష్టి జీవుల శ్రేయస్సు కోరుట కవకాశ ముండదు. వైశ్యులు భూమిని పండించుట యందును, గోగణములను పోషించుట యందును, వాణిజ్యము చేసి వస్తు ప్రసారము చేయుట యందును శ్రద్ధ వహింపవలెను గనుక, వేరుగా సృష్టి హితమును సాధించుటకు అవకాశ ముండదు. శూద్రులు కర్మాచరణము చేయుచు వివిధ వృత్తులలో నిమగ్నులై యుండవలెను గనుక, వారికిని ప్రత్యేకముగా భగవత్సాధన కవకాశముండదు. శూద్రు లనగా జీవితము మొదలగు ప్రతిఫలము లాశించి ఉద్యోగాదులు, ఇతర వృత్తులు చేయువారు.

ఇక బ్రాహ్మణు డట్టి పనులు చేయరాదు. లోకహితమునే కోరి, మిగిలిన వారి హితమునకై వేదకర్మలు, సలహాల నిచ్చుట, ధర్మము నడిపించుట చేయ

వలెను. రాజర్షి తన రాజ్యమందలి ప్రజలలో అంతర్యామిని చూచి శత్రువుల నుండి వారిని రక్షించుట, పరిపాలనము సమర్థతతో నిర్వహించుట, వర్ణాశ్రమ ధర్మములను బలిష్ఠముగా నిలబెట్టుట చేయవలెను. ఇట్లు బ్రాహ్మణ క్షత్రియ స్వభావము గలవారికి వేదములందు చెప్పబడిన అంతర్యామి ఉపాసనము సూటిగా లభించును. స్త్రీలకు, వైశ్యులకు, శూద్రులకు తమకు పరిమితమైన వ్యక్తులకు చేయవలసిన పనులుండును. అయినను వారియందు అంతర్యామిని దర్శించి భక్తి కలిగి సమర్పణబుద్ధితో తమ తమ పను లాచరించినచో సన్న్యాసము, సుఖము, యోగస్థితి యబ్బును. (బ్రాహ్మణ క్షత్రియులకు అబ్బుటలో నాశ్చర్యమేమి యని అందలి అభిప్రాయము.)

అందరిలో నున్న నన్ను చూచుట మానినచో జీవిత మనబడును. ఈ లోకము అనిత్యము. నిత్యము మారుచుండును. ఒకనాడున్న అభిప్రాయములు మరొకనా డుండవు. ఒకనాడున్న సంపదలు మరొకనా డుండవు. ఒకనాడున్న సుఖము మరియొకనా డుండదు. కనుక ఈ లోకమునందు ఉండుట ఎట్లును తప్పదు గనుక నన్ను భజించుచు నాయందు జీవింపుము. మనస్సు నాయందు పెట్టి నేనే మనస్సుగా నుండుము. యజ్ఞార్థ కర్మ నా కర్పణముగా చేయుము. అన్నిటియందును నాకు భక్తుడవై నాకు నమస్కరింపుము. ఈ యోగమున నాయందు సమర్పితుడవై నేనే గతిగా జీవించి నన్ను పొందగలవు.

**(32-34)**

పదవ అధ్యాయము

# విభూతి యోగము

అర్జునా! ఈ యుపదేశింపబడిన రాజవిద్యా సాధన మవలంబించిన వానికి తనలోను, తన చుట్టునున్న నా అంతర్యామి వైభవము తెలియును. తెలిసి మెలగినవాని ప్రవర్తనకు నే నంతర్యామిగా జీవుల రూపమున వాని యెడల సంప్రీతుడ నగుదును. వాని హితము కోరుదును. వానికి నా వైభవ విశేషములను సృష్టి రూపముననే దర్శన మిచ్చెదను. అంతర్యామి భావన నుండి చెదరి వేరు వేరు వ్యక్తులుగా నన్ను చూచినచో దేవతలు గాని, మహర్షులుగాని నన్ను తెలిసికొనలేరు. (1)

వీరందరును పుట్టి పెరిగి తమ ప్రవర్తనలు చూపి లీనమగుచున్న అంతర్యామి పేరే నేను. వారందరు నాయందే పుట్టుచున్నారు గనుక నా పుట్టుకను గూర్చి తెలిసికొనలేరు. కొందరు తమ పుట్టుకను మాత్రము ఊహించి తెలిసికొనలేరు. మరికొందరు నాకు పుట్టుక లేదని భావించుచున్నారు. కాని వారందరి పుట్టుకయు నా పుట్టుక యని తెలియవలెను. పుట్టుక లేని నేను ఇట్లు బహు విధములుగ పుట్టుచున్నను, దానిని రాజవిద్యామార్గమున అంతర్యామి సాధన చేసినవారు మాత్రమే గ్రహింపగలరు. ఈ దేవతలకును, మహర్షులకును మొదలు నేనే. (నేనను కల్పనమే!) అట్లు నన్ను మొదలు లేనివానిగను, లోకములకు మహేశ్వరుడుగను ధ్యానము చేయవలెను. (హృదయమున నేనని భావన చేసినపుడు అహంకార మార్గమగును. దానిని అంతర్యామిగా, దేహము, ప్రాణము మున్నగువానికి ఆది మధ్యము అంతము అని ధ్యానము చేసినచో అహంకారము తొలగి నేనను భావము మిగులును. అదియే ఈశ్వరుడు. అహంకార స్థితిలో తాను దేహాదుల యందుండును. ఈశ్వర స్థితిలో తన యందు దేహాదులున్నట్లు తెలియును. ఇదే భావన సమస్త సృష్టియందు వ్యాపించి నిండినచో అప్పటి జ్ఞానమే రాజగుహ్యము. అప్పుడు 'నే' నను మాట కర్థము

జీవులయందు గల నా మహేశ్వరత్వము.) ఈ జ్ఞానము పుట్టినవాడు మూఢత్వము చెందడు (మోహపడడు). మృత్యువు గల దేహములందు బద్ధుడైనను సర్వ పాపముల నుండియు విముక్తుడై శాశ్వతు డగును.(2, 3)

జీవులలో పుట్టుచున్న భావములన్నియు నా నుండియే పుట్టుచున్నవి. (నేనను భావము నుండియే పుట్టుచున్నవి.) కొందరు బుద్ధిబలము నుపాసించి జ్ఞానము నార్జింతురు. కొందరు మోహమును తొలగించుకొందురు. కొందరు మిగిలిన జీవుల చేష్టల యెడ ఓర్పు కలిగి సమబుద్ధితో పరిశీలించి నన్ను దర్శింతురు. కొందరు సత్యమును వ్రతముగా సాధించి నన్ను చేరుదురు. కొందరు ఇంద్రియములను మనస్సును నిగ్రహించుకొను సాధన చేయుదురు. కొందరు కలవరపాటులేని శాంతిని సాధింతురు. కొందరు సుఖమును, కొందరు దుఃఖమును అనుభవింతురు. కొందరు ఉన్నవానిని గూర్చి ధ్యానింతురు. కొందరు లేనివానిని గూర్చి ధ్యానింతురు. కొందరు భయపడుచు జీవింతురు. కొందరు భయములేని జీవితము గడుపుదురు. కొందరు అహింసను, కొందరు సమదృష్టిని, కొందరు నిత్య సంతోషమును సాధింతురు. కొందరు తపస్సు చేయుదురు. కొందరు దానాదులు చేయుదురు. కొందరు కీర్తి నార్జింతురు. కొందరు అపకీర్తి పాలగుదురు. ఇందరిలో ఇన్ని భావములును నా నుండియే వేరు వేరుగా కలుగుచున్నవి. (వేరు వేరు అను భావము నానాత్వమునకై సృష్టి కొరకు సంకల్పింపబడినది గనుక, దాని నుండి వేరు వేరు భావములు కలుగుచుండును. ఎవనికి కలిగిన భావము దగ్గర నుండి వాడు బయలుదేరి అంతర్యామి దగ్గరకు ప్రయాణము సాగించును.)(4, 5)

ఇట్లు కలుగుచున్న భావములు మంచివైనను, చెడ్డవైనను జీవులకు సంబంధించిన నా భావములు. అనగా సృష్టిలోని త్రిగుణాత్మక ప్రకృతియందు ఉద్భవించిన భావములు. ఇవి కాక, నిర్మలమైన అంతర్యామి ప్రకృతి నుండి కొన్ని స్థిరములైన భావములు ప్రతి సృష్టికిని మొదట నుద్భవించును. అవి సృష్టిలోనివి కావు. అలౌకికములు. పవిత్రమైన అంతర్యామి ప్రకృతి నుండి అవి పుట్టి సకల సృష్టిని శాసించును. అట్టి మొదటి భావములలో నాలుగు కుమార భావము లనబడును. అవియే మూర్తులై మోక్ష సంకల్పములుగా వచ్చును. అవి జీవుల మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము అనువానికి

మార్గదర్శకములై వెలుగొందును. ఆ మూర్తులే సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు అనబడు సనాతన మూర్తులు. అటుపైన మరియేడు భావము లుద్భవించును. వారే సప్త ఋషులు, అనగా సప్త ఋషుల మూల ప్రజ్ఞలు. వారు మానవుని ప్రజ్ఞలోని ఏడు లోకములకు మూలములుగా వర్తింతురు. అటుపైన ఇంకొక పదునాలుగు భావము లుద్భవించును. వారే మనువులు. (వారు మన్వంతరముల కధిపతులై జీవుల ధర్మములను శాసింతురు.) వీరందరును నా భావములు. వీరు నా భావములు కలవారు. వీరు నా మనస్సున పుట్టినవారు. వీరే నా మనస్సుగా పనిచేయుదురు. వారినుండి యీ లోకము లును, లోకపాలకులును, వారి నుండి యీ జీవులును దిగివచ్చు చున్నారు. ఈ మొత్తము నా వైభవముగా చూచి బ్రతుకవలెనుగాని వేరుగా చూచినచో చిక్కుపడును. నిజ స్వరూపము నేను గనుక వారందరిని నిజ స్వరూపములుగా చూడవలెను. ఎవరెట్లు చూతురో వారియందు యోగదృష్టి చెదరదు. ఇందు సందేహము లేదు. వారికి సందేహము కలుగదు. **(6, 7)**

## సతత యుక్తులు :

అంతర్యామి యగు దైవమున కేదైన పేరుపెట్టదలచినవారు వారి ధ్యాన సౌకర్యమునకై పెట్టవచ్చును. అట్లు పెద్దలు పెట్టిన పేర్లే విష్ణువు, శివుడు మొదలగునవి. ఆ పేర్లు కూడ అంతర్యామి యొక్క విష్ణుత్వమును, శివత్వమును స్పృశించునుగాని అంతర్యామిని స్పృశింపవు. అయినను అవి అసత్యములు గాక, సత్యాంశములై సాధకుల జప తప నామ సంకీర్తనముల కుపకరించు చున్నవి. వేదములయందు కీర్తింపబడిన ఇంద్రాగ్ని, వరుణ, రుద్ర, అర్యమాదులు కూడ దేవుని దేవత్వమును లేక దేవతను సూచించును. దేవతలు దేవుని అనేక వ్యక్త రూపములు. వాయువు, అగ్ని, సూర్యుడు మున్నగు రూపములతో వ్యక్తమగుచున్న దిగివచ్చిన దేవుని రూపములు. అవి సృష్టి కర్మలను కొందరికి తెలియజేయును. మరికొందరికి ఈ యంశలలో నున్న అంతర్యామి ధ్యానము నకు పనికివచ్చును. కనుకనే వేదమున బహుదేవతలు వర్ణింపబడినను ఆరాధింపబడినది అంతర్యామి యొక్కటే.

అంతర్యామి నుండి దిగివచ్చిన యంశల పేర్లుగాక, అంతర్యామికే పేరు పెట్టుటకు యత్నించినవారు వేదఋషులు. ఆ పేరే 'అహం' అనబడినది.

దీని కర్థమే అతడి పేరుగాని యీ పదము కాదు. దీని కర్థము 'నేను'. ఉపనిషత్తు లలో, పురాణములలో అదే పదము వాడబడినది. భగవద్గీతలో దానినే యుప దేశించుచు కృష్ణుడు చేసిన ప్రవచన మిట్లున్నది.

"నేను సమస్తమునకును పుట్టుక. నా నుండియే సమస్తము ప్రవర్తించు చున్నది." నేనను అర్థము దైవము. నా నుండి అనుటలో 'నా' యను పదము నకు 'నాది' అని యర్థము. అదియే మనస్సు. అది దైవము నుండి దిగివచ్చినదే గాని, అదే దైవము కాదు. అయినను దీనియందు అంతర్యామి దైవమే. అట్టి నానుండి సమస్త సృష్టియు ప్రవర్తించు చున్నది. అనగా 'నా' యను పదమున కర్థమైన మనస్సు ప్రవర్తించుట వలన జీవుల మనస్సుగా తోచుచున్నది. ప్రవర్తించుట, వర్తించుట చిత్తవృత్తి యనబడును. ఇది ఇంద్రియముల రూపమున బాహ్యవస్తువుల రూపములను, నామములను గుర్తుపట్టుచున్నది. గుర్తుపట్టి, వారివారికి తగినట్లు నడచుకొనుచున్నది. ఇది యంతయు అంతర్యామియైన నాయందే వర్తించుచున్నది. ఇదియే నా విభూతి లేక వైభవము. ఇట్లు ధ్యానించి ఎవ్వరు నన్ను ఆరాధించుచున్నారో వారే బుధులు. అనగా బుద్ధియోగము కలవారు. వారు నన్ను భావమునందు నిలుపుకొనినవా రగుచున్నారు. చిత్తము నాదిగా వారున్నారు. (వారి చిత్తమని వేరుగా నుండదు.) వారు నాయందు నిలిపిన ప్రాణములు గలవారై జీవించుచున్నారు. అనగా చిత్తము స్వచ్ఛమైన నాయందు ధ్యానమున నిలిచియుండగా వారు జీవించు చున్నారు. ఒకరి కొకరు బోధించుకొనుచున్న సమస్త విద్యలను, శాస్త్రములను నాయందే నిలిపి చెప్పుకొనుచు వినుచున్నారు. ఏ మహానుభావుల పుణ్యకథలను ప్రసంగించినను మరువక నన్నుగానే వారినిగూర్చి ప్రసంగించుచున్నారు. నిత్య కృత్యముల యందు కూడ నన్నే పలుకరించి చెప్పుచున్నారు. తమకు తృప్తి కలిగిన తావులయందు కూడ నాయందే తృప్తి గనుచున్నారు. సంసార మయమైన జీవితమున విహరించుచు కూడ నాయందే విహరించుచున్నారు. వారి జీవితము నా జీవితముగనే రమించుచున్నారు. ఇదియే నిజమైన భజనము. వారే నిరంతరము నా యందు యోగము చెందినవారు. ఈ యోగమునకు లక్షణము ప్రీతి. అనగా అకారణముగా ప్రియమైన ప్రవర్తనము, వాక్కు, భావము కలిగియుండుట. అది జీవులయందు విశ్వప్రేమగా వారి నుండి వెలువడు

చున్నది. వారి కావిధమైన సంకల్పములను నేనే ప్రసాదించుచున్నాను. బుద్ధి బలముగా నేనే పనిచేయుచున్నాను. ఆ బుద్ధిని నాయందే యుండునట్లు స్వీకరించుచున్నాను. ఈ సాధన వలన వారు నా దగ్గరకే వచ్చుచున్నారు. వారియందు దయకలిగి నేను వారి యజ్ఞానము నుండి పుట్టిన చీకటిని తొలగించుచున్నాను. (అజ్ఞాన మనగా మనస్సు, ఇంద్రియములు, దేహము, నామ రూపాదికములు, దేశకాలాదులు మొదలగునవి. అందలి అంతర్యామియే జ్ఞానము. అజ్ఞానముచే నావరింపబడి తప్ప వేరుగా జ్ఞానము దొరకదు. అందు వలన జీవులు నానుండి వేరైన ఈ సమస్తమును చూచి మోహము చెందు చున్నారు. అట్లు చెందకుండునట్టి సంకల్పముగా నేనే వారియందు పుట్టి ఈ చీకటిని తొలగించుచున్నాను.) వారియందు జ్ఞానముగా నేనున్నాను. ఈ జ్ఞానమే దీపము. నేనను రూపమున వెలుగుచు వారి యజ్ఞానమును తొలగించు చున్నాను. **(8-11)**

కృష్ణుడిట్లు ఉపదేశింపగా గ్రహించి అర్జునుడు ఇట్లనెను: పరబ్రహ్మము అను మాట కర్థమిదియే. దీనిన మించిన వెలుగు లేదు. దీనిని మించిన మార్గము లేదు. ఇది సమస్తమును వెలిగించును. కనుక పరమ పవిత్రము. దానిని నన్నుగా చూడుమని యుపదేశించితివి. ఈ ఉపదేశమునకు కారణము నేనైనను నీవుగా సాక్షాత్కరించితివి. కనుక నిన్నుగానే దర్శింతురు. (ఇదియే గురుశిష్య సంబంధము. దీని నుపదేశించి వెలిగించుట కొరకే గురువు. ఉపదేశమున నేనని యున్నను, ఆరాధనమున నిన్నుగ దర్శించుట క్షేమము. ఎదుటివారిలో దైవమును చూచు సాధన చేయుట కిష్టపడనివాడు తనలో నెట్లు చూచును? కనుక గురుశిష్య సంబంధముతో అర్జునుడు కృష్ణుని నీవని సంబోధించుట సంప్రదాయమైనది.) ఇట్లు నిన్నొక పురుషునిగా దర్శించుచున్నాను. ఆ రూపముతో నున్న అంతర్యామిగా నీ దయ వలన దర్శించు చున్నాను. కనుక నీవు శాశ్వతుడవు. దివ్యపురుషుడవు. (అశాశ్వతమైన దేహమున దర్శింపబడు వాడు శాశ్వతుడు. పాంచ భౌతికమైన దేహములో దర్శన మిచ్చువాడు దివ్య పురుషుడు.) ఆది అంతము కల దేహముగ నిన్ను చూచుట అజ్ఞానము. ఇట్లు కనుపించుచున్న నీవు ఆదిదేవుడవు. పుట్టుక కల దేహముతో లీలార్థము

కనుపించుచున్న నీవు పుట్టుక లేనివాడవు. పుట్టుక, జీవితము, మరణము మున్నగువాని కధిపతివి. (12)

ఈ ఋషులందరును నిన్ను గూర్చియే చెప్పిరని గ్రహించితిని. దేవర్షియైన నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు నిన్ను గూర్చియే కీర్తించిరని దర్శించితిని. (అనగా నీలో నున్న అంతర్యామిని గూర్చియే వారు కీర్తించిరి. ఇచట నీవు అను పదమునకు ఎదుటివాడని యర్థము. ఎదుటి వానిని చూచుచున్నప్పుడు వాని భౌతిక శరీరమును ఋషులు ఉద్దేశింపరు. కులము, అధికారము, వయస్సు, ఆస్తి, అంతస్తులు, చుట్టరికములు, వారితో తమకు గల ప్రయోజనములు మున్నగువానిని వారు చూడరు. ఇన్నిటిని వదలి ఎదుటివానినే చూతురు. అనగా అందరిలో నుండి మాటలాడుచున్న ఒక్కనినే చూతురు. వారు చూచి కీర్తించిన మార్గము ఇప్పు డర్థమైనదని అర్జునుని భావము. ఇప్పుడు నీవు కూడ నిన్ను గూర్చి స్వయముగా చెప్పితివి. (నేనని చెప్పినప్పుడు అంతర్యామినే యుద్దేశించుచు సంభాషించితివి. అట్టి స్థితిలోనే వ్యవహరించుచు దేహధారివై చరించుచున్నావు గనుక, అంతర్యామి యొక్క అవతార మూర్తివని యర్థము. తనలోని అవతారమూర్తిని చూపించి నేనను పదముతో నిర్భయముగా చెప్పగలవాడే అవతారము. అతడని, నీవని చెప్పు వారు ఋషులు. వారు అతడని, నీవని చెప్పినపుడు అర్థమైనది; కాని అనుభవమునకు రాలేదు. ఇపుడు తానే స్వయముగా 'నేను' అని చెప్పినాడు గనుక అనుభవమైనది. ఇప్పటి జ్ఞానము తాను లేక తానే జ్ఞానము.) నాకీ సత్యము అనుభవమునకు వచ్చినది గనుక, నీవు చెప్పిన దంతయు సత్యమని నమ్మగలుగుచున్నాను. (లేనిచో నీవు దంభములు పలుకుచున్నావని సందే హించెడి వాడనే.) అట్టి నీవే వ్యక్త ప్రపంచమున నిందరు వ్యక్తులుగా తిరుగు చున్నావు. నీ వ్యక్తిత్వము నీ రూపములందు సున్నితముగా మరుగుపడి యుండుటచే దేవతలు గాని, దానవులు గాని నిన్ను పూర్తిగా దర్శింపజాలరు. (గాలి, నీరు, నిప్పు మొదలగువాని ధర్మములను నిర్వర్తించు ప్రకృతిలోని ప్రజ్ఞలే దేవతలు. దేహమందు నీరుండును. దానిని గుర్తించుటకు నదులలోని నీటికి బుద్ధి యుండదు గదా! దేహమునందు నీరు, వేడిమి మున్నగు దేవత లున్నారు. దేహము గలవాడు నీటిని, నిప్పును గుర్తించుచున్నాడు. ఈ

విధముగా నీకు దేవతల సంగతి తెలియును గాని, దేవతలకు నీ యంతు తెలియదు. ఇక దానవులనగా అహంకరించువారు గనుక, వారు మానసిక గుణముల రూపమున ఒకరినొకరు చూతురుగాని, అంతర్యామిని చూడరు. మానసిక గుణములతో చూచునపుడు సంబంధములు, మంచి చెడ్డలు నెదుటి వారిలో కనిపించును గాని అందరిలో నున్నవాడు కనిపించడు. ఇట్లు దానవు లసలే చూడలేకున్నారు.) **(13, 14)**

తన్ను తానే స్వయముగా నెరిగియుండుటయే నీలోని పురుషోత్త మత్వము. (తాను ఉన్నట్లు ప్రతి వ్యక్తికి సహజముగా తెలియును. మరియొకరు చెప్పి అభ్యాసము చేయింప నక్కరలేదు. ఇది యెట్లు తెలియుచున్నది? ఇది అంతర్యామికి సహజమైన లక్షణము. ఇదియే నిజమైన వెలుగు. దీని వలననే ప్రతి జీవియు నొకరు చెప్పకుండగనే తా నున్నట్లు గమనించి తనకు తగిన రీతిని ప్రవర్తించుచున్నది. ఇదే ఆత్మయను వెలుగు. ఇందు మూడు భాగము లుండును. ఒకటి తానున్నట్లు తెలిసిన వెలుగు. రెండు - తనమీద తనకున్న అభిప్రాయము. మూడు - తన చుట్టునున్న దేహము. మొదటి దానినుండి మిగిలిన రెండును వెలువడి జీవించి మరల తనలో లీనమగుచున్నవి. ఇందు మొదటి భాగమే పురుషోత్తముడు. రెండవ భాగము అక్షర పురుషుడు. మూడవ భాగము క్షర పురుషుడు.) తాను మిగిలిన రెండు తత్త్వములను తనయందు భావన చేసికొనుచున్నాడు. ~~ఈ~~ భావనయే సృష్టి. ఒక రచయిత తన మనస్సున నాటకమందలి పాత్రలను సృష్టించి వదలుచున్నాడు. వారు సంభాషణలు, సన్నివేశములు నిర్వహించుచున్నారు. ఇది కేవలము రసానందము కొరకు. అట్లే భగవంతుడు సృష్టిని భావన చేయుటకూడ ఆనందము కొరకు. ఇన్ని జీవరాశు లను భావన చేయుటకూడ ఇన్ని రూపములుగా ఆనందము వర్తింపజేయుటకు. కవి రచించిన నాటకమును ఒకసారి ప్రదర్శించినచో అది క్షరము. అనగా అది యైపోవును. నాటకమను గ్రంథము అక్షరము. అనగా దాని నెన్నిసార్లయినను ప్రదర్శింపదగి యుండును. దానిని సృష్టించిన కవి పురుషోత్తముడు.

ఒక కవి సృష్టించిన పాత్రలన్నియు కవి వలెనే యుండవు. అనేక విధములుగా నుండును. నాటకమున సన్మార్గులు, దుర్మార్గులు కూడ నుందురు. అయినను అందరిని నడుపునది రచయిత సంకల్పమే. నీవు కూడ

నట్లే. ఈ జీవరాశుల కందరికిని ఈశ్వరుడవు. నీ పైననే ఆధారపడి వీరందరును వర్తించుచున్నారు. (దేహము ధరించినవానికి హృదయమున అహంకార ముండును. అచటనే ఈశ్వరుడు కూడ నుండును. దేహముపై నాధారపడి బంధింపబడిన స్థితిలోని జ్ఞానము అహంకారము. ఇన్నిటికిని కేంద్రమైన జ్ఞానము లేక జ్ఞాని ఈశ్వరుడు. అతనిపై నివియన్నియు నాధారపడి యున్నవి. గనుక అతడు బంధింపబడడు.) ఈ విధముగా నీవు జీవులను భావన చేయువాడవు. జీవుల కీశ్వరుడవు కూడ!

నీవు దేవతలకు దేవుడవు. (నీరు, నిప్పు మొదలగునవి తమ ధర్మముల యందు వర్తించునే గాని వర్తింపవలెనని తెలియదు. వర్తింపవలెనని తెలియు టకు అవి యొక దేహమునందు భాగములు కావలెను. సౌర కుటుంబమను దేహమునందు సూర్యుడు మొదలగువారు భాగములు. మనలో హృదయము, మనస్సు వర్తించుచున్నట్లే సూర్యుడు, చంద్రుడు వర్తించుచున్నారు. హృదయ మునకు గుండెకాయ యున్నట్లు సూర్యునకు సూర్యగోళ మున్నది. మనస్సునకు మస్తిష్క మున్నట్లు చంద్రునికి చంద్ర గోళమున్నది. ఈ గోళములు నశించి నపుడు కూడ సూర్యచంద్రులు నశింపరు. మరల గోళములు పుట్టినపుడు వారు దేహములు ధరింతురు. దేహమున నున్నవాడు దేహ భాగములను తెలిసికొన గలుగుచున్నాడు. పనులయందు నియమింప గలుగుచున్నాడు. సూర్య చంద్రాదులలోని అంతర్యామి వారిని నియమింప గలుగుచున్నాడు. అతడు దేవతలకు దేవుడు.) ఈ విధముగా నీవు గమనాత్మకమైన జగత్తు యొక్క గమనమున కధిపతివి. (15)

ఈ నీ సృష్టివైభవములను గూర్చి ఆత్మ వైభవములుగా చెప్పగలవాడవు నీవే! ఆ వైభవములతోనే నీవీ లోకములయందు వ్యాపించి నివసించుచున్నావు. (దేహమునందు దేహము గలవాడుగా నుండును. నీటియందు నీటి ధర్మములు లోకమున ప్రవహించును. అగ్నియందు వేడిమి, వెలుగు అను ధర్మములు లోకమున భాసించును. ఇవి భౌతికములు కావు. అయినను అందు తానున్నాడు. కనుకనే నీరు పల్లముగా ప్రవహించుట, అగ్ని ఊర్ధ్వముగా మండుట మున్నగు ధర్మములు క్రమము తప్పక వర్తించుచున్నవి. మరచిపోయి

నీరు మెరకకు ప్రవహింపదు. అందు మరవకుండుట నీటి లక్షణము కాదు. ఆ నీటి లోకమున నున్న అంతర్యామి లక్షణము. (16)

## గుణ కీర్తనము :

సకల సృష్టిధర్మములతో కూడిన సృష్టిలో కూడ భగవంతుని అస్తిత్వమును స్మరించు సాధన కావలెను. ఇంద్రియములకు, మనస్సునకు సృష్టి ధర్మములే గోచరించును గాని, భగవంతుడు గోచరింపడు. సృష్టియందు, అందలి ధర్మము లందు భగవంతుని పరిపరి విధములుగా చింతనము చేయుచున్నచో గోచ రించును. మన దేహమునందు గల అనేక వస్తువుల ఏకత్వమే మనము. ఈ ఏకత్వమును యోగ మందురు. అందు అనేక మున్నట్లు గోచరించును గనుక సృష్టిలోని యోగమును 'భగవంతుని యోగమాయ' అందురు. ఆ మొత్తము నందు తానొక్కడే యుండును. కనుక భగవంతుడు మొదటి యోగి. అట్టివానిని సృష్టి ధర్మములలో స్మరించుట సులభము కావలెనన్నచో నే యే భావములతో స్మరింపవలెను? అతని వైభవములను గూర్చి చెప్పుకొని తృప్తి పొందునట్టి యనుభూతి ఎట్లుండునో వివరింపుమని అర్జునుడు ప్రశ్నించెను. దానికి కృష్ణు డిట్లు సమాధానము చెప్పుచున్నాడు. (17, 18)

నా విస్తృతికి పరిమాణము లేదు. మొదలు, చివర అని లేదు గనుక ప్రాధాన్యమును బట్టి గుణకీర్తనము చేసికొనుటయే మార్గము. సర్వజీవులలో నేనను భావమును సృష్టిలోని యోగమూర్తిగా ధ్యానము చేయుము. అది ధ్యానము చేయువానిలో తానను భావముగా అనుభవమునకు వచ్చును. అదియే ఆత్మ. అన్నిటియందును తా నున్నట్లు దర్శించిన ధ్యానమే ఆత్మ ధ్యానము. దాని నుండి అందరును పుట్టి, వర్తించి, దానిలోనికి లీనమగు చున్నారు. కనుక తానే యీ సృష్టి మొత్తమునకు మొదలు, చివర, నడిమి అని ధ్యానము చేయవలెను. (19, 20)

ఆదిలో సృష్టిగా దిగివచ్చిన వెలుగులే ఆదిత్యులు. సృష్టియే లేనపుడు తా నుండును గాని తానున్నట్లు తెలియదు. మనకు నిద్రాస్థితి యెట్టిదో సృష్టి మొత్తమునకు ప్రళయ స్థితి యట్టిది. అదియే రాబోవు వెలుగులకు మూలము లేక తల్లి. అట్టి చీకటినే అదితి యందురు. అదితి నుండి పుట్టిన

వెలుగులే ఆదిత్యులు. వారిలో విష్ణువు నేనని ధ్యానింపుము. విష్ణు వనగా వ్యాపించి యుండువాడు. సృష్టిలో సృష్టిగా వ్యాపించి నిలచియున్న మొదటి రూపమును ధ్యానించుటయే విష్ణువును ధ్యానించుట.

ఇక రెండవ ధ్యానము దేనిని చేయవలెను? సృష్టిని చూచుటకు కావలసినది వెలుగు గనుక దేవుడుగా, అనగా తానుగా ధ్యానము చేయవలెను. వెలుగు నిచ్చు సాధనములలో సూర్యచంద్రులు మొదటివారు గనుక వారి యందలి వెలుగును నన్నుగా ధ్యానము చేయవలెను. చూచుట యనగా చూచువాడు బ్రతికి యుండుట. దానికి వాయువు ముఖ్యము. వాయువునకు మూల కారణము చోటులోని కదలిక. ఈ కదలిక ఏడు విధములు. వానినే సప్త మరుత్తులు అందురు. అందు మరీచి యనువాడు నా వైభవముగా ధ్యానము చేయవలెను.

గగనమున గ్రహముల గమనము భగవంతుని విభూతులలో నొకటి. ఈ గమనము భూమి చుట్టును దేశకాలముల కొలతలను పుట్టించును. ఈ కొలతలచే చేయబడిన సమభాగములు నక్షత్రము లనబడును. గగన భాగమును 28 సమభాగములుగా చంద్రుడు విభజించుచున్నాడు గనుక నక్షత్రములందు చంద్రుడు దేవుని వైభవములలో నొకటి. వానిని నన్నుగా ధ్యానము చేయవలెను. (అనగా చంద్రుని గమనము ననుసరించి 28 రోజుల విభాగముగా చాంద్రమాన మేర్పడును. దీని ననుసరించియే స్త్రీకి ఋతు కాలమును, గర్భధారణ కాలమును ఏర్పడి, దేహధారియై భగవంతుడు తన వైభవమును చూపును.) **(21)**

దేహధారియైన జీవునియందు శ్వాసరూపమున భగవంతుని విభూతి పనిచేయుచుండును. ఈ శ్వాసయే ప్రాణము చేయునట్టి గానము. దానినే ఋషులు సామవేద మందురు. సృష్టి పుట్టునట్టి ప్రకృతి యందలి జ్ఞానమే వేదము. అందు శ్వాస లేనిచో జ్ఞానము నుపాసించువా డుండడు గనుక వేదములలో నన్ను సామవేదముగా ధ్యానము చేయుమని కృష్ణుడు చెప్పు చున్నాడు.

దేవతలు సృష్టి ధర్మములను యజ్ఞార్థముగా ప్రవర్తింప జేయువారు.

అట్టివారిలో వాసవుని రూపముగా దేవుని ధ్యానింపవలెను. వాసవు డనగా వసువులకు పుట్టినవాడు, ఇంద్రుడు. వసువులను దేవతలు ఎనిమిది మంది. వారు పొడవు, వెడల్పు, బరువు, మందము, ఆకారము, వ్యక్తిత్వము, తన చేష్టలు, ఇతరులకు గోచరించుట అను ఎనిమిది సృష్టి ధర్మములుగా పని చేయుదురు. ఈ ధర్మముల నడుమ నున్న అస్తిత్వమే వాసవుడు గనుక, అణుమయ స్వరూపమైన ఈ జగత్తునందలి అంతర్యామిగా దేవుని భావన చేయవలెను. అట్లు భావన చేయుట కేర్పడినవి యింద్రియములు. వాని యందు పనిచేయుచున్న ఒకే ఇంద్రియము పేరు మనస్సు. మనస్సులో సర్వేంద్రియముల మూలమున సృష్టి వైభవములను మనము గుర్తించు చున్నాము. కనుక భగవంతుని వైభవమును మనస్సుగా ధ్యానము చేయవలెను. ధ్యానము చేయునపుడు మనస్సు చాంచల్యము కలిగించి అడ్డు వచ్చునని పలువురు భ్రమ పడుదురు. ధ్యానమునకు మనస్సే అడ్డమనియు, దానిని తొలగింపవలె ననియు యత్నించి విఫలు లగుచుందురు. మనస్సును దేవుని అస్తిత్వముగా, అనగా 'నేను'గా ధ్యానము చేయువారికి అది అడ్డురాదు.

ఈ మనస్సుగాని, ఇంద్రియములు గాని పనిచేయుటకు అందలి చైతన్యము లేక అవి మేల్కొనుట అను శక్తి ముఖ్యము. చైతన్యము వలననే జీవులు ద్రవ్యముగా గాక జీవులుగా నున్నారు. కనుక చైతన్యమును భగవంతుని వైభవముగా ధ్యానము చేయవలెను. (22)

ఈ బ్రహ్మాండ మంతయు సృష్టి యంత్రము. అందు ప్రజ్ఞ, శక్తి, ద్రవ్యము అను మూడు స్థితులు సృష్టియై, ఒక దానిలో నుండి యింకొక దానిలోనికి పరివర్తనము చెందుచుండును. ఈ మూడును ప్రధానముగా మూడు లోకములు. అందు ప్రజ్ఞయే వెలుగు. (అనగా కంటికి తోచునట్టి వెలుగు కాదు. మనకు తెలియనట్టి వెలుగు. మనమున్నట్లు తెలియుచున్న వెలుగు.) ఈ వెలుగులో స్పందించునది శక్తి. అది స్పందనాత్మకముగా (Vibration) నుండును. ఇందు ఉద్భవించు స్పందనమూర్తులనే రుద్రులందురు. వారు ఐదు జ్ఞానేంద్రియములలో, ఐదు కర్మేంద్రియములలో, మనస్సులో ప్రవృత్తులుగా స్పందించుచుందురు. ఈ మొత్తము 11 మంది రుద్రులుందురు. వారు కంటికి కిరణమయమైన వెలుగుగను, చెవికి శబ్దమయమైన వెలుగుగను

స్పందించుచుందురు. వీరు స్పందించు ఈ తావునే అంతరిక్షము అందురు. ఈ స్పందనము నుండియే అకారాది క్షకారాంతములైన ధ్వనులు పుట్టును. వాని నుండి పదములు, వాక్యములు పుట్టును. వానియందు మనము మాట్లాడు కొను అర్థములలోని అంతర్యామిగా పరమార్థము పుట్టును. దానియందు మన భావము లన్నియు శమించును గనుక ఈ పరమార్థమును శంకరు డందురు. రుద్రులలో సర్వాంతర్యామి యొక్క అనగా నాయొక్క మూర్తియే శంకరుడు.

యక్షులనగా స్థూల శరీరమును నిర్మాణము చేయువారు. యక్షస్సు లనగా స్థూల శరీరమును రక్షించుటకు కావలసిన పొరలను నిర్మించి మోయు చుండువారు. అట్టివారిలో ద్రవ్యమును భౌతిక స్థితిలో కూడబెట్టువాడు విత్తేశుడు లేక కుబేరుడు. వసువు లనగా భౌతికత్వమున కధిపతులు. వారిలో పావకుడు భౌతిక లోకమున పనిచేయునట్టి అగ్నిహోత్రుడు. ఇతడు వేడిమి వెలుగు మున్నగు స్థితులలో పనిచేయుచు భౌతిక ద్రవ్యమును స్థితి గతులలో మార్పు చెందించును. రసాయనికములైన మార్పులన్నియు వానివలననే జరుగును. ఆకలి, జీర్ణమగుట, ఘనపదార్థము ద్రవీకరింపబడుట, ద్రవములు వాయు రూపము చెందుట మొదలగు స్థూల, సూక్ష్మ భౌతిక విభేదము లన్నిటికిని పావకుడే అధిపతి. నిప్పు రూపమున దగ్ధము చేసి పరిశుద్ధి కలిగించును గనుక పావకుడని పిలువబడుచున్నాడు. ఆ పావకుడు 'నా' విభూతియే.

మేరువనగా గమనమునందు సుడిగుండములవంటి మూర్తులను సృష్టించు శక్తి. ఇది మన భూమిపైన ఉత్తర దక్షిణ ధ్రువములందు వ్యక్తమై పనిచేయుచుండును. భూమి తన చుట్టును తాను తిరుగుచుండుట వలన ఉత్తర దక్షిణములందు ధ్రువములకు పైన పర్వతములవంటి యాకారములు పుట్టి తిరుగుచుండును. అంతేకాదు, ఇవి పుట్టి తిరుగుచుండుట సంభవించిన తరువాతనే వీని నడుమ భూమియొక్క గోళాకారము పుట్టి ఘనీభవించెను. ఇట్లే గ్రహగోళముల కన్నింటికిని ఉత్తర ధ్రువమునందు మేరువుండును. (దక్షిణమున నున్న పర్వతమును మంధర మందురు.) గ్రహగోళములపై నున్న పర్వతములు మొదలగు వానిలో దేని మేరువు దానికున్నది. ఆ మేరువుపై నాధారపడియే ఆ పర్వతాదుల ఆకారములు స్థిరముగా నిలచును. ఈ

విధముగా రుద్రులలో శంకరుడు, యక్ష రక్షస్సులలో కుబేరుడు, వసువులలో పావకుడు, శిఖరములు గలవారిలో మేరువు అంతర్యామియైన తానే. (23)

పురోధసు డనగా పురోహితుడు, వేదము నుచ్చరించువాడు. క్రతువులు చేయించువాడు. మనలో నతడు వాక్కును పలుకునట్టి తెలివిగా నున్నాడు. వానివలననే కావలసిన సంభాషణలు చేయుట, పఠన పాఠనములు విద్య నార్జించుట, విద్యాబోధనము చేయుట, జీవితమును యజ్ఞముగ నిర్వర్తించుట జరుగుచున్నది. ఆ ప్రజ్ఞయే బృహస్పతి. రక్షణ చేయువారు సేనా నాయకులు. వారిలో విక్రమించి విజయము సాధించు ప్రజ్ఞ పేరు స్కందుడు లేక కుమార స్వామి. దుష్టశక్తులపై విజృంభించి, జయించి, మనలను రక్షణము చేయువా డతడు. అతడు నేను. మానవునిలో అనేక స్థాయిల శరీరములు ఉన్నవి. ఆయా శరీరములలోని ద్రవ్యము సైన్యముగాను, ఆ శరీరముల కధిపతి సేనానిగాను పెద్దలు వర్ణింతురు. ప్రాణమయ, మనోమయాది పురుషులు సేనానులే. ఈ అన్ని శరీరములలోనుగల శరీరమను మొత్తమునకు అధిపతి స్కందుడు. అన్ని కోశములతోగూడిన శరీరము మొత్తము 'నా'లోని భాగమే గనుక, స్కందుడు 'నా' విభూతియే!

జలముల యందలి వాయువులకు ద్రవత్వమును కలిగించు ప్రజ్ఞ జలముల కధిదేవత యనబడును. అతని వలననే వాయురూపులైన మిత్రా వరుణులు జలత్వము పొంది, మెరకనుండి పల్లమునకు ప్రవహించు ధర్మము నార్జించుకొనిరి. ఈ జలాధి దేవత కారణముగా జలాశయము లేర్పడినవి. ఈ జలాశయముల కన్నిటికి ఆధారభూతమైన ప్రజ్ఞను సగరు డందురు. అతనివలన పుట్టినది సాగరము. ఎన్ని జలములు ప్రవేశించినను సాగరము పొంగదు. ఆవిరిగా నెన్ని జలములు పోయినను అది చిక్కిపోదు. ఈ సాగరము నా విభూతియే.

ఇట్లు అంతర్యామి శక్తియే బృహస్పతిగను, స్కందుడుగను, సగరుడు గను దిగివచ్చి పనిచేయుచున్నది. వీరు గ్రహలోకములలో బృహస్పతి, అంగారకుడు, చంద్రుడు అను దేహములలో పనిచేయుచున్నారని జ్యోతిశ్శాస్త్ర విదులు వర్ణింతురు. వాక్కున కధిపతి బృహస్పతిగను, రక్షణమున కధిపతి

అంగారకుడుగను, సాగరముల కధిపతి చంద్రుడుగను పనిచేయుచుండు ననుట జ్యోతిశ్శాస్త్ర నిర్వచనము. అవే ధర్మములను ఒక్కొక్క శాస్త్రము ఒక్కొక్క పరిభాషలో చెప్పును. ఇన్నిటిలో నంతర్యామిగా తానే యున్నాడని తాత్పర్యము. **(24)**

భృగువు అను తారక మన బ్రహ్మాండ మందలి మొట్టమొదటి సూర్యులలో నొకడు. వానితోనే సౌర కుటుంబముల సృష్టి యారంభ మగును. మన భూలోకవాసుల కతడు తెల్లని కిరణమున కధిపతిగా వర్తించుచున్నాడు. ఈ తెల్లని కిరణము ఏడు కిరణముల కన్న ముందు పుట్టినది. ఏడు కిరణములను పువ్వుమొగ్గ రేకలవలె తనలో నిమిడ్చుకొనినది. ఇతని నుండియే భార్గవు లనబడు కిరణముల వంశము వేద విజ్ఞాన స్వరూపమై వెలువడుచున్నది. అదియే యీ భూమిజీవుల ప్రవర్తనను మలచుకొనుటకు మొదటి ధర్మశాస్త్రమై విప్పారుచున్నది. ఇతని వెలుగుల వంశమునందే మన సౌర కుటుంబము నందలి శుక్రుడను గ్రహము పుట్టినది. కనుకనే శుక్రుడు భార్గవుడుగా వర్ణింప బడినాడు. ఇతని మహిమ వలననే మన దేహమునందు శుక్రధాతువు పుట్టు చున్నది. మరల శరీరములను కల్పించుటలో అది శుక్ర సంజీవనీ విద్యగా పనిచేయు చున్నది.

వాక్కులలో అనేక ధ్వను లున్నవి. అవి ప్రధానముగా అకారాది క్షకారాంతముగా గుర్తింపబడినవి. వాని నుచ్చరించుటకు శ్వాసయే కారణము గనుక, అందలి *'సోఽహం'* అను రెండు అక్షరములే మూలము. వాని యందున్న *'ఓం'* అనునది ఒకే యక్షరము. అదియే మనము ఉచ్చరించు వాక్కులన్నిటిలో గల ఒకే యక్షరము. అది శ్వాస రూపముగా మనలో పనిచేయుచున్నది గనుక, మనలో అంతర్యామిగా నున్న భగవంతుని అక్షర రూపము తానే. మనలో ఉచ్చరించుచున్నవాడే యీ వాక్కుగా వెలువడును. కనుక ఈ ఏకత్వము చెందిన అక్షర రూపమున సర్వాంతర్యామిగా నున్నది తన విభూతియే.

యజ్ఞమనగా ఆరాధన విశేషము. సమర్పణబుద్ధితో తనకు ఫలితము రావలెనని కోరకుండ చేయు మంచి పని యేదైనను యజ్ఞమే! యజ్ఞార్థ కర్మ

లన్నిటిలో లోకశ్రేయస్సే ప్రయోజనము. దానిని తెలియకయే ఆచరించువారు సామాన్య ప్రజలు. ఉద్యోగమో, వాణిజ్యమో శ్రద్ధతో చేసికొను వారందరును దాని ఫల మపేక్షించి శ్రద్ధ చూపుచున్నారు. ఈ ఫలము జీతము, లాభము మున్నగువాని రూపమున నుండును. దాని కొరకే తాను పనిచేయుచుండుట. కాని తాను చేయుచున్న పనికి ఫలితము మాత్రము ఇతరులకు చెందును గాని తనకు చెందదు. తన ఆఫీసులో తాను చేయుచున్న పని వలన ప్రజలకు జరుగవలసిన పనులు జరుగుచున్నవి గాని తన పనులు కాదు. ఇతరులకు తాను పనులు చేసిపెట్టినచో తనకును జరుగునను నమ్మకము ప్రకృతి సత్యముపై నాధారపడి యున్నది. సత్యము తెలిసినవాడు ఇతరులకు సేవ చేయవలెనను దృష్టితోనే ఉద్యోగమో, వ్యాపారమో చేయును గాని, జీతము కొరకో లాభము కొరకో చేయడు. అవి అప్రయత్నముగా లభించును. తెలియని వాడు జీతమును, లాభమును దృష్టిలో బెట్టుకొని చేయును గనుక ఫలిత మితరులకు సవ్యముగా అందదు. ప్రతిఫలము పొందు నర్హత తాను క్రమముగా పోగొట్టుకొనును. సమర్పణ బుద్ధితో యజ్ఞార్థ కర్మ చేయువాని కిట్టి బంధము లుండవు గనుక, సమర్పణము జపించుచు చేయునట్టి యజ్ఞార్థ కర్మయే అంతర్యామిత్వము వహించును. కనుక యజ్ఞములలో జపయజ్ఞము తానని చెప్పుచున్నాడు. ఇదికాక మంత్రమును జపించుచుండుటయే ఈ గీతా వాక్యమున కర్థమని కూడ చెప్పవచ్చును. కాని అది గీతలోని సిద్ధాంతము లతో సమన్వయింపదు.

స్థావరము లనగా స్థిరమైనవి. చెట్లకన్న పర్వతములు స్థిరమైనవి. పర్వతము లన్నిటిలో హిమాలయము తన విభూతి కలిగినదని చెప్పుచున్నాడు. హిమాలయము దేవతాత్ముడని కాళిదాసు కూడ కీర్తించెను. దేని వలన వాతావరణములో కలిగిన మార్పులు సంవత్సర యజ్ఞమందలి ఋతువుల ఫలితములను పుట్టించుచున్నవో అవి యన్నియు దేవతా స్వరూపములే. హిమాలయముతో మన దేశమందలి ఋతువుల ధర్మములు ముడిపెట్టుకొని యున్నవి. అనేక జీవరాశుల సృష్టి కనుకూలించునట్టి శీతోష్ణస్థితులు ఈ పర్వతములపై నాధారపడి యున్నవి. కనుక దైవ విభూతి వానియం దున్నది. మరియొక విశేషము. హిమ + ఆలయము అనగా మంచుకు నిలయమని

యర్థము. పంచభూతముల లీలలో నీరు మంచుగడ్డగా పేరుకొను మార్పు జలతత్త్వము పృథివీ తత్త్వము నడుమ గల సృష్టి సంబంధములను వ్యక్తీకరించు చున్నది. అది వడగళ్ళ వానతో జరిగినను, ఉత్తర దక్షిణ ధ్రువముల దగ్గర జరిగినను, వాతావరణమును, భూగోళ నిర్మాణమును చక్కజేయుచున్నది గనుక తన విభూతియని చెప్పుచున్నాడు. (25)

వృక్షము లన్నింటిలో అశ్వత్థ వృక్షము దైవ విభూతికి చిహ్నము. అనేక పవిత్ర కార్యములలో రావిచెట్టు సమిధల హోమము జరుగును. అది చాల శుభప్రదము. వాతావరణము నది పవిత్రము చేయును. దుష్టశక్తులను తొలగించును. బ్రహ్మతేజస్సును వృద్ధి చేయును. అనేక మహా రోగములను హరించు నౌషధము అశ్వత్థము. యోగాభ్యాసమునకు, మోక్షవిద్యోపాసనము నకు రావిచెట్టు, మఱ్ఱిచెట్టు ప్రాముఖ్యము వహించును. వేదములలోని కవి సమయము ననుసరించి అశ్వమనగా మానవులలోని ప్రాణమయ కోశమను అగ్ని. దానిని పరిపూర్ణస్థితిలో నుంచి, మనోమయాది కోశములకు వాహనముగా నుండునట్లు చేయు వృక్షము గనుక, రావిచెట్టునకు అశ్వత్థమని పేరు వచ్చినది. ఈ మాటకు గుఱ్ఱము గల చెట్టు అని అర్థము. మంత్రోపాసకులలో విష్ణు మూర్తిని హయగ్రీవుడుగా నుపాసించువారు రావి చిగుళ్ళు, ఆకులు తిని, నీరు త్రాగి, రావిచెట్టు క్రింద హయగ్రీవ మంత్ర దీక్ష చేసి, రావిపుల్లల హోమముతో పూర్తి చేయుదురు. ఇన్ని విధముల వైభవము గల ఈ మహావృక్షము తన విభూతికి చిహ్నమని కృష్ణుడు చెప్పుచున్నాడు.

దేవర్షులలో నారదుడు అంతర్యామియై తన భాగవతమయ శరీరముతో ముముక్షువులకు దర్శన మిచ్చుచుండును. లోకమునకు భక్తిమార్గ ముపదేశించి ధ్రువుడు, ప్రహ్లాదుడు మున్నగువారిని తరింపజేసెను. వ్యాసుని మూలమున భాగవతమును, వాల్మీకి మూలమున రామాయణమును భక్తి మార్గమునకు సోపానములుగా సృష్టించెను. ప్రణవోపాసనకు సామ మార్గము నేర్పరచి, సంకీర్తన, నర్తనాది పవిత్ర విధానములను లలితకళలుగా స్థాపించి వ్యాపింపజేసెను. ఇన్ని మార్గములును భగవంతుని అంతర్యామిత్వమును జీవులలో స్థాపించునవే గనుక, నారద మహర్షి దైవవిభూతులలో నొకడు.

గంధర్వులు దేశకాలాది విభాగములకు, జీవుల శ్వాస, హృదయ స్పందనము మున్నగు విభాగములకు అధిపతులు. అట్లే శ్వాసనుండి పుట్టిన నాదమును విభజించునట్టి తాళ లయాత్మకమైన సంగీత విద్యకు కూడ అధిపతులు. వారిలో చిత్రరథుడు మన భూగోళ పరిభ్రమణము జరుగు చున్నపుడు, అనేక జీవుల ఆయుర్విభాగమునకు, గ్రహముల గమన వేగమునకు గల సంబంధమును నిర్ణయించు దేవతగా నియమింపబడెను. ఇది భూగోళము నకు భౌతిక ద్రవ్య స్థితి ఏర్పడుచున్న పరిణామ దశలలో జరిగినది. దానినే పృథువైన చక్రస్థితి యేర్పడుట లేక పృథు చక్రవర్తి భూమిని గోవుగా చేయుట యని పురాణములో వర్ణింపబడినది. ఈ గోవు నుండి అతడు సమస్త జీవ రాశుల సంపదలను పిండుచున్నప్పుడు చిత్రరథుడు గోవత్సముగ నుండెనని వర్ణనము. మొట్టమొదట ఈ భూమి మీద సృష్టి యేర్పడినది హిమవత్పర్వత రూపమున గనుక, చిత్రరథునకు హిమాలయములు అందలి జలాశయములు విహార స్థానములు. ఇట్లు భౌతిక సృష్టి కారంభ వైభవమునకు కారణమైనవాడు గనుక చిత్రరథుడు దైవ విభూతిగా చెప్పబడినాడు. సంగీత విద్యలో శ్రుతి, తాళ, లయ, స్వర ప్రస్తారాదులలో ప్రాణప్రదమైనది లయ. చిత్రమైన పరుగు లతో సాగు రథముగా నిది వర్ణింపబడినది. కనుక సంగీత విద్యలో చిత్రరథుడు లయ స్వరూపుడైన దైవ విభూతి.

సిద్ధులలో కపిలుడు భగవంతుని యవతారము. ఇతడు కర్దమ ప్రజాపతికి దేవహూతికి జన్మించెను. సంసార తరణోపాయమగు మోక్షవిద్యా సర్వస్వమును సాంఖ్య శాస్త్రమను తత్త్వము, యోగవిద్యయను విభాగములుగా నుపదేశించి, భక్తియోగముతో సర్వమును సమన్వయించెను. అంతేగాక, తల్లి గర్భమున పిండోత్పత్తియందు ఇరువది నాలుగు తత్త్వముల దేహరూప ముపదేశించి, అందు పురుషుడను పేర తాను ఇరువది యైదవ వాడుగా నవతరించెను. జీవులలో తత్త్వ దర్శన సామర్థ్యమున కధిపతియై, అంకము లనబడు ప్రజ్ఞలను మేలుకొలుపువాడై వర్తించుచున్నాడు. దేహ నిర్మాణమునందు దేహ భాగములను లెక్కల ప్రకార మేర్పరచి, జీవుల మనస్సులకు అంకెల విలువ లను, గణిత శాస్త్రమును నేర్చు సామర్థ్యము నిచ్చుచున్నాడు. (ఈ విధముగా కపిలుడు సర్వ మానవ జన్మల యందును వికాసము కలిగించు సిద్ధుడే గాని,

ఒక వ్యక్తి కాడు. దీనిని గ్రహింపనివారు ఇతడొక వ్యక్తి యనియు, సాంఖ్యమను శాస్త్రమును స్థాపించెననియు భావింతురు. ఇట్లు భావించువారు ఈశ్వర కృష్ణుని సాంఖ్య కారికలను ఆధారముగా చూపుదురు. అవి భావించిన సాంఖ్యము వేరు. భాగవతము ప్రకారము సిద్ధుడగు కపిలుడు ఆధ్యాత్మిక విద్యా సమస్తమును విస్తరించెనే గాని, సాంఖ్య దర్శనమును మాత్రమే బోధింప లేదు.) **(26)**

అశ్వములలో నుచ్చైశ్రవము భగవంతుని వైభవము. ఇంద్రుని అశ్వమును నుచ్చైశ్రవము అందురు. ఇది అమృత మథన కాలమున పాల సముద్రము నుండి యుద్భవించెను. నిక్కబొడుచుకొనిన చెవులు గలదని యీ పేరున కర్థము. ఉత్తమజాతి అశ్వమునకు చెవులు నిక్కబొడుచుకొని యుండును. అట్లుగాక కొంచెము వ్రేలాడినచో ఆ గుఱ్ఱము గాడిద జాతికి చెందినదని యర్థము. మరియు ఉత్తమాశ్వమునకు శబ్ద గ్రహణశక్తి హెచ్చు. దానికి నిద్రాస్థితి యుండదు. శ్రుతి స్వరూపమగు వేదశ్రుతులలోని సూక్ష్మతర భేదములను గమనించి ఉచ్చారణ రూపముగ నేర్చుకొనుటకు ఈ ప్రజ్ఞ యుపకరించును. ఈ అశ్వమును ఉషస్సు తన ముఖముగా గల అహస్సు అను అశ్వముగా ఉపనిషత్తులలో వర్ణింపబడినది. సముద్రతీరమున ఈ యశ్వమును చూచి, తోక నల్లగా నున్నదని కద్రువయు, తెల్లగా నున్నదని వినతయు వాదించు కొనిరి. దీనికి ఫలితముగా వినతకు దాస్యము, కద్రువకు సర్పముల జననము, గరుత్మంతుని యావిర్భావము, వినతకు దాస్య విమోచనము మున్నగు అహో రాత్రముల కథలు పుట్టినవి.

గజేంద్రులలో ఐరావతము ఇంద్రుని యేనుగు. ఐరావతమను పదమునకు జలములందు ఉద్భవించిన మహాశక్తి అని యర్థము. మేఘము శక్తిమంతమైన ఏనుగుగా, మెఱపులు దాని దంతములుగా వేద కవులచే వర్ణింపబడినది. 'ఐరా' అను పదమునకు జలములయందు పుట్టు శక్తి, ప్రాణము అని అర్థములు. ఐరావతి అనగా ఆ శక్తి కలిగినది యని అర్థము. అనగా మెఱపుల రూపమైన విద్యుత్తును కలిగినది. ఆ విద్యుత్తు ఇంద్రుని ఆయుధ మగు వజ్రము. అది పిడుగు రూపమున నుండును. ఇది భగవంతుని వైభవము. అతడే కార్యవశమున ఒకమారు ఇంద్రుడుగను, ఒకమారు ఉపేంద్రుడగు

విష్ణువుగను, అగ్నావిష్ణువుగను, ఇంద్రావిష్ణువుగను, ఇంద్రా వరుణులుగను వివిధ దేవతలుగా వర్ణింపబడెను. "మిత్రుడు, వరుణుడు, ఇంద్రుడు అను వివిధ నామములతో అధోక్షజుడు (దిగువకు సుఖములను వర్షముగా వర్షించు సామర్థ్యము గలవాడు.) కార్యవశమున వర్ణింపబడెను. అతడే మాతరిశ్వము మొదలగు దేవతలుగా కూడ వర్ణింపబడెను. దర్శించిన వారు ఒకే అస్తిత్వము యొక్క బహు రూపములను వర్ణించుచున్నారు'' అని ఋగ్వేదమున ఒకటవ మండలమున **164**-వ సూక్తమున **46**-వ మంత్రము చెప్పుచున్నది. ఈ యిందరి అస్తిత్వమును సుపర్ణుడుగా పెద్దలు చెప్పుచున్నారు. కనుక ఇంద్రుడు, ఐరావతము, వజ్రము మొదలగున వన్నియు అంతరిక్ష లోకమున విద్యుచ్ఛక్తి యొక్క బహు రూపములు. ఇచట గజ శబ్దమునకు గమజమైన శక్తియని యర్థము. గజేంద్రుడైన ఐరావతము లేక దాని నధిష్ఠించిన ఇంద్రుడు భగవంతుని విభూతి.

నరులలో పరిపాలకుడైన దేశ నాయకుడు దైవాంశ. అతని నుండి నరుల కర్మఫలము ప్రభుత్వ ధర్మముగా నిర్ణయింపబడును. *"నాऽ విష్ణుః పృథివీ పతిః।"* విష్ణువు కానివాడు పరిపాలకుడు కాలేడు. అనగా ప్రజల సత్కర్మకును, దుష్కర్మకును తగినట్లు పరిపాలకుడు పుణ్యమూర్తియో, పాపాత్ముడో అయి పనిచేయుచుండును. ఇందు మరియొక మంత్రార్థ మున్నది. నరాధిపుడనగా నరులలో జీవునియం దావేశించియున్న ఈశ్వరుడు. "ఈశ్వరుడు సర్వజీవుల హృదయములయందు వసించుచు, తన మాయచే యంత్రారూఢములుగా జీవులను త్రిప్పుచున్నాడు'' అని కూడ చెప్పబడినది. హృదయము లందున్న ఈశ్వరావతరణము జీవులలోని దైవ విభూతి. (27)

ఆయుధములలో వజ్రము దైవాంశ. ఇది యింద్రుని ఆయుధము. పర్వతములను బ్రద్దలుకొట్టును. అనగా పిడుగు అని కావ్యార్థము. విద్యుత్తు యొక్క వ్యక్త వైభవమే వజ్రము. దీని వలన మేఘము లందలి జలములు ప్రాణములను సృష్టించును. ఈ ప్రాణశక్తి యగు వజ్రము వర్షధారల వలన భూమిపైనున్న సకల బీజములను అంకురింపజేసి, ప్రాణులుగా మేల్కొలుపును. జీవులలో నిది సంకల్ప రూపమై శత్రు సంహారార్థము వినియోగపడును. అట్లే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ మార్గములలో కూడ వినియోగపడును. మానవులలో

నిది వెన్నెముకగా నిమిడియుండి, జీవుని కావశ్యకమైన ప్రాణశక్తి యనబడు విద్యుత్తును చక్కగా ప్రసారము చేయును. అందు నిబిడీకృతమైయున్న మహా శక్తులను యోగసాధనతో మేల్కొల్పగలిగిన సిద్ధులకు అది వజ్రాయుధముగా వినియోగపడి దుష్ట శిక్షణము, శిష్ట రక్షణము నిర్వర్తించును.

ధేనువులలో కామధేనువు తాను. కామధేనువు దేవలోక మందలి ధేనువు. తనను సేవించినవారి కోరికల నది తీర్చును. సూర్యకిరణము ఆత్మగా భూమికి దిగివచ్చి, జీవాత్మ దేహముచే కప్పబడి యున్నపుడు ఈ కామధేనువు మాయమై పాతాళము నందుండును. దాని ద్వారము కుండలిని యను సర్పముచే మూయబడి యుండును. అట్టి స్థితిలో కామధేనువు బిడ్డయగు కంఠనాదమును నందినీ ధేనువుగా నరుడు సేవించి పరస్పర సంభాషణల రూపమున కోరికలు తీర్చుకొనుచున్నాడు. వాక్కునే కామధేనువుగా వేదములు వర్ణించెను. “విశ్వరూపులగు దేవతలు దేవియైన వాక్కును తమ సంభాషణలచే స్తుతించు చున్నారు. ఆమె మంద్రమైన కుతూహలము రూపమున పాడియావుగా నుపాసింపబడుచున్నది. పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ రూపములలో నాలుగు క్షీరధారలతో జీవులను పోషించుచున్నది.” అని సరస్వతీ ఋక్కు వర్ణించు చున్నది. “చక్కగా ప్రయోగింపబడిన వాక్కు కామధేనువై మూడు లోకముల యందును కావలసిన వాటిని పరిపుష్టి చెందించును” అని ఉపనిషత్తులు కీర్తించుచున్నవి. అట్టి కామధేనువు తన విభూతియని కృష్ణుడు చెప్పుచున్నాడు.

ప్రజననము అనగా జీవులకు దేహములు కల్పించుట. దీనినే ప్రజా సర్గము అని కూడ పురాణములు వ్యవహరించును. ఊర్ధ్వలోకములలో జరిగిన సృష్టికి ప్రతిబింబముగా మానసిక, భౌతిక లోకములలో జరుగునట్టి జీవుల దేహాది కల్పనము ప్రజాసర్గము లేక ప్రజననము. దానిని సృష్టి జీవులచేతనే చేయించుట సృష్టి వైచిత్రి. దానికొరకై స్త్రీ పురుషుల దేహ నిర్మాణములు, అనురాగము, కామము కల్పించి, జీవులకు సుఖమును కూలి బత్తెముగా ప్రకృతి యిచ్చుచున్నది. అట్టి జీతమే కామము. దాని కధిపతి కాముడు. ఇతడు మన్మథుడను పేర మనస్సుననే జన్మించి, జీవులను ప్రజననమునకు ఉన్ముఖు లను చేయుచున్నాడు. అతడే కందర్పుడు. అతడు కూడ “నేను కామించు చున్నాను. అనేకులుగా జీవులను పుట్టింతును” అని సంకల్పించునని వేదములు

చెప్పుచున్నవి. ఇట్టి కందర్ప స్వరూపుడైన ప్రజాపతి రూపమున అంతర్యామి వైభవమును గమనించి అర్చించినవారు కామమునకు అతీతులు కాగలరు.

సర్పములు, నాగములు అను పేరుగల రెండు విధములైన జీవులు భౌతిక లోకమున తిరుగుచు పాములని వ్యవహరింపబడుచున్నవి. అందు సర్పములు కేవలము ప్రాకునట్టి పాముల జాతులై, వాసుకి యనబడు అధిదేవత కధీనములై యున్నవి. ఇక పడగలు గల పాములు నాగములు. ఇందు కలిగిన జాతులన్నియు అనంతుడనబడు శేషుని అంశమునుండి పుట్టి విస్తృతములైనవి. ఇందు సర్పములు సృష్టిలోనున్న కాల స్వరూపమును, నాగములు సృష్టి కతీత మైన అనంతము అనబడు శాశ్వత కాలమును సూచించును. అందు మొదటి కాలము జీవుల ఆయుర్దాయముగా కదలుచు వసించుచుండును. జీవులు వచ్చుచు పోవుచుండగా, ప్రాకిపోవుచున్న కాలమునకు అధిపతి యగు వాసుకి జనన మరణములకు సాక్షిగా నుండును. కనుకనే అతడు పరమేశ్వరుని కంఠ భూషణముగా వర్ణింపబడెను. తాను అంతర్యామినని గుర్తున్న యోగ సిద్ధుని కంఠమున కూడ తన భూషణముగా వాసుకి యుండును. (28)

ఇక రెండవదియైన అనంతమైన కాలము సృష్టి స్థితి లయములకు నివాసము. కనుక సృష్టిలోని అంతర్యామికి శయ్యగా శేషుడు వర్ణింపబడెను. అతడు తన పడగపై భూమిని ధరించును. అనగా జీవులకు అస్తిత్వము కల్పించి స్థితికారకుడై నిలచును. అదికూడ తానే యని కృష్ణుని యుపదేశము.

అట్లే జలరాశులలో వరుణుడు దైవాంశ. ఇతడు జలముల కధిదేవత. వరుణు డనగా ఆవరించి యుండువాడని యర్థము. ఇతడు సముద్ర రూపమున భూమిపై నావరించి యుండును. అట్లే సప్తమారుత మండలము అను ఏడు పొరలుగా కూడ నావరించి యుండును. సూర్యు డస్తమించు పశ్చిమ దిక్కున కత డధిపతి. దిక్కులు భూమిపై జీవుల స్థితినుండి ఏర్పడును గనుక సూర్యాస్త మయ వేళకు ఇత డధిపతి. ఇతడు నిద్రారూపమున జీవుల నావరించును. స్థూలశరీరము పొరల రూపమున జీవుల నిత డావరించి యుండును. దేహము నందు క్రింది భాగము పశ్చిమ దిక్కు అని సంకేతము. కనుక గర్భకోశమునుండి దిగువ నేర్పడు ధాతువుల కిత డధిపతి. ఆ ధాతువులలో శుక్రము ఉత్తమము గనుక శుక్రుడు భృగువు రూపమున వరుణుని పుత్రుడుగా పుట్టుచున్నాడు.

అపుడు వారి కిద్దరికిని తండ్రి బిడ్డల సంబంధ మేర్పడుచున్నది. "ఈ జీవు లెచటి నుండి పుట్టుచున్నారు?" అను ప్రశ్న పుత్రుడుగను, సమాధానము తండ్రిగను ప్రశ్నోత్తర రూపమైన 'భృగువల్లి' అను విద్య పుట్టును. ఈ బ్రహ్మ విద్యకు వరుణు డధిపతి గనుక భగవంతుని వైభవము.

పితృదేవతలలో అర్యముడు దైవాంశ. ఇతడు అదితి పుత్రులగు ద్వాదశాదిత్యులలో రెండవవాడై వృషభ మాసము అనబడు వైశాఖ మాసమును పరిపాలించును. వృషభము గర్భధారణమునకు కారణమైన వీర్య స్వరూపము. వృషభరాశిలో సూర్యుడు ఆబోతుగా నిలబడి తన వేసవి కిరణముల వీర్యముచే భూమియగు గోవును చూలు కట్టించుచున్నాడని వేదములు వర్ణించును. పితృదేవతలు పిండాండమున గర్భధారణమునకు అధిపతులు. వారు చంద్ర కిరణముల నుండి భూమికి దిగివత్తురు. కనుక వృషభము చంద్రునకు ఉచ్చ స్థానమని జ్యోతిర్విద్య చెప్పుచున్నది. కందర్పుడు, వరుణుడు, అర్యముడు అను దేవతలు వరుసగా సంతానోత్పత్తి రూపమున సృష్టిని విస్తరింపజేయువారు. వీరి విభూతులు సక్రమముగా పనిచేయుటకు శమదమాది గుణములు నిగ్రహ రూపమున పనిచేయవలెను. ఇందుకుగాను యమ నియమాదులతో కూడిన అష్టాంగ యోగము ఆవశ్యకము. అందు మొదటి అంగమైన యమము జీవులపై యముడను దేవత రూపమున పనిచేయుచున్నది. దమించుట యనగా మనస్సును, ఇంద్రియములను నిగ్రహించుట. అట్టి శక్తిని ప్రయోగించువాడు యముడు. అతడు యమదండము రూపమున జీవులయందు పనిచేయును. అనగా క్రమమార్గము తప్పకుండునట్టి సాధకుల నియమముల రూపమున పనిచేయును. దానిని తప్పినవారిని కర్మఫలముల రూపమున దండించును. కనుక దండము రూపమున పనిచేయును. యముడు సత్కర్మపరులకు సుందర నీలదేహుడుగను, దుష్కర్మపరులకు భీకరుడుగను కనుపించునని స్కాంద పురాణమున కాశీఖండమున శివశర్మ కథలో చెప్పబడినది. అట్టి సమత్వము నిర్వహించు యముడు దేవుని విభూతి. (29)

భగవంతుని విభూతులలో దేవతలేగాక, దైత్యులు, దానవులు కూడ కలరు. దైత్యులనగా దితి సంతతి. దానవు లనగా దనువు సంతతి. వారువేరు, అసురులు వేరు. అసురులు, దైత్యులు మున్నగు పదములను తెలియక ఒకే

అర్థమున వాడుచుందురు. జీవులలో మంచి స్వభావము గలవారు, చెడ్డ స్వభావము గలవారు ఉందురు. వారి పరిణామమునుబట్టి జన్మ సంస్కార మేర్పడును. చెడ్డ సంస్కారములు గలవారు అసురు లనియు, మంచి సంస్కార ములో పుట్టినవారు దేవ లక్షణములు కలవారనియు భగవద్గీతలోనే కృష్ణుడు నిర్వచించెను. ఇందలి అసురులకును, దైత్యులకును సంబంధము లేదు. దితి సంతతిలో అందరును అసురులు కానక్కరలేదు. ఎక్కువమంది దైత్యులు అసుర లక్షణములు కలవారగుట చేత దితి సంతతికి చెడ్డ పేరు వచ్చినది. కాని వారిలోను దివ్య లక్షణములు కలవారున్నారు. అవి యున్నచోట వారిలో నున్నది దైవ విభూతియేగాని మరియొకటి కాదు. దాని కుదాహరణముగా కృష్ణుడు ప్రహ్లాదుని చెప్పుచున్నాడు. హిరణ్యకశిపుడు లోకకంటకుడు కాగా ప్రహ్లాదుడు దైవానుగ్రహమును పొందెను. ఎవడు లోక కంటకుడో వాని బాధలు లోకమునకు తప్పించుటకై దేవుడు తన వైభవమును మంచివారి రూపమున నుంచును. హిరణ్యకశిపుడు కోరిన వరములనుబట్టి వానికి పరాజయముగాని, మరణముగాని లేదు. అతడు అసుర లక్షణములను పొందక సత్ప్రవర్తనము కలిగియున్నచో సనక సనందనాదుల వలె శాశ్వతుడై లోక గురువులలో నొకడై యుండెడివాడు. కాని యతడు లోక కంటకు డగుట వలన దైవ విభూతి ప్రహ్లాదుని యందు ప్రకాశించినది. అదియే హిరణ్యకశిపుని మృత్యువునకు కారణమైనది. కనుక దైత్యులలో ప్రహ్లాదుడు తన విభూతి యని కృష్ణుడు చెప్పుచున్నాడు.

ప్రహ్లాదుని వలన హిరణ్యకశిపు డంతరించినట్లే, ఎంతటి తీరని సమస్యయైనను కాలమును బట్టి పరిష్కారమగును. ఎంత కష్టములు పడు చున్న వాడైనను సత్ప్రవర్తనము కలవాడైనచో వేచియుండుట వలన అన్నియు ననుకూలము లగును. దుష్ప్రవర్తనము అలవరచుకొన్నచో కాలమే వానికి చిక్కులు తెచ్చి క్రుంగదీయును. ఈ విధముగా మంచిని అనుభవములోనికి తెచ్చుట గాని, చెడును లోకమునందు వ్యాపింపనీయకుండ చెడ్డవానితోనే అంత మొందించుచుండుటగాని, కాలము యొక్క లక్షణము. ఇది లెక్కలలో కూడిక వంటిది. ఎట్టి విభిన్నములైన సంఖ్యలైనను కూడికలో నొకే సంఖ్య యగును. కాలము యొక్క స్వరూప మట్టిదే. పరస్పర భిన్నములైన శక్తులను

ఒకే పర్యవసానమునకు తెచ్చుచుండునది కాలము. ఒక వ్యక్తికి తన మనస్సులో పుట్టు భావములు లెక్కవేయబడు చుండునని తెలియదు. అట్లే తన చేష్టలను లెక్క వేయువా రుందురని తెలియదు. తన భావములను, వికారములను, వాని కనుగుణమైన తన చేష్టలను కాలము కూడిక చేయుచుండును. ప్రతి వ్యక్తికిని మొత్తముగా ఒక మితి (Optimum) ఉండును. కాలమున జరుగుచున్న కూడికలు మితి దాటగానే అది పరిణతి చెంది, ఫలితముల నిచ్చును. అట్లే ఒక రాష్ట్రమునను, దేశమునను, ఖండమునను కూడ ఇట్టి కూడికలు జరుగు చుండును. ఆయా మితులను దాటగానే ఫలితములు పరిణామముగా సంభ వించును. అట్టివే కరవులు, వరదలు, అంటువ్యాధులు, యుద్ధములు మొదలగు నవి. ఇవి యన్నియు కాలము నందలి కూడిక యను ప్రజ్ఞవలన జరుగు చుండును. కనుక కూడికలు చేయు శక్తులలో కాలము తన వైభవమని కృష్ణుడు చెప్పుచున్నాడు.

సృష్టిలో ప్రతి జంతువుకును ప్రమాదకరమైన మరియొక జంతు వున్నది. ఎలుకకు పిల్లి, పిల్లికి కుక్క మొదలగు రూపములలో హద్దు లుండును. దీనివలననే సర్వ జీవరాశులును తమ హద్దులలో నుండును. పెద్ద జంతువుల వలన చిన్న జంతువుల కెప్పుడును ఆపద యుండును. అయినను సర్వ జంతువులకును ప్రాణరక్షణ మార్గము లున్నవి. ఒక దాని నొకటి చంపుచు, జంతువులు బ్రతుకుచున్నను అన్ని జంతువులును బ్రతికియే యుండును. ఇది సృష్టిలోని అద్భుతములలో నొకటి. సింహమన్నచో మిగిలిన జంతువు లన్నిటికిని భయము. ఈ భయము వలన అడవిలోని యన్ని జంతువులును తమ హద్దులలో నుండును. జవము, సత్త్వము, వేగము, పరాక్రమము, శౌర్యము మున్నగు గుణములలో సింహము సాటిలేనిది. మిగిలిన మాంస భక్షక జంతువుల వలె సింహమునకు క్రూరత్వము లేదు. అనగా ఆకలిగా నున్నపుడు ఆహారము నకై తప్ప, జంతువులను చంపదు. తనకు అపకారము జరుగు సన్నివేశమున తప్ప వేరొక జీవిని హింసింపదు. కనుకనే సింహమును మృగరాజు అందురు. అది దేవుని విభూతులలో నొకటి.

గరుత్మంతుడు దేవుని వాహనము గనుక అతడు దేవుని విభూతి. ఇది కల్పిత కథయని సందేహపడువారున్నారు. పక్షి అనగా గాలిలో ఎగురునది.

జీవుల శ్వాస కూడ గాలిలో నెగురుచుండును. శ్వాస యనగా గాలి కాదు. గాలి పీల్చి వదలునట్టి చైతన్యము. దానినే చక్కని రెక్కలుగల సుపర్ణుడు లేక గరుత్మంతు డందురు. జీవుని రూపమున దేవుడు దేహమునందు వసించి యుండును. అత డుండుటకు, ఆ జీవయాత్ర సాగించుటకు ఆధారము లేక వాహనము శ్వాస యనబడు గరుత్మంతుడు కనుకనే జీవులలో ఉండుట అను స్థితికి కారకుడైన విష్ణువు గరుడ వాహనారూఢుడని చెప్పబడినాడు. ఉచ్ఛ్వాస, నిశ్వాసములే గరుడుని రెక్కల కదలికలుగా వర్ణింపబడినవి. అవి ముక్కు నుండి జరుగును. దానికి సంకేతముగానే గరుడునికి పెద్ద ముక్కు వర్ణింపబడినది. ఈ విధముగా జీవులలో శ్వాసరూపమున నెగురుచున్న గరుత్మంతుడు భగవంతుని విభూతులలో నొకటి. (30)

శ్వాస యెట్లు కదలుచున్నది? మనము పీల్చుటవలన నది కదలుట లేదు. జీవుని రూపమున దేవు డుండుట వలన కదలుచున్నది. జీవుడు దేహమును విడచిన వెనుక మనము కదలింత మనుకొన్నను అది కదలదు. కదలిక చైతన్యము యొక్క స్వరూపము. లోకమున వస్తువు లన్నియు మనము కదలించినచో మాత్రమే కదలును. జీవులు సొంతముగానే కదలును. వానికి జీవముగా పనిచేయుచున్న గాలికూడ తనంత తానే కదలును. కనుక కదలు వానిలో గాలి దేవుని వైభవము. అంతేగాక, పవనము అనగా పరిశుద్ధి చేయుట యను నర్థము కూడ కలదు. మనము శ్వాసగా పీల్చుచున్న గాలివలన అను క్షణము రక్తము పరిశుభ్ర పడుచు, మనము జీవించుట కవకాశ మిచ్చు చున్నది. కనుక పరిశుభ్రపరచు వానిలో గాలి ఉత్తమమైనది. ప్రాణాయామ మందలి కౌశలము నెరిగి, చక్కగా క్రమబద్ధముగా గాలి పీల్చుట నభ్యసించినచో మనోమయ, ఆవేశాత్మక లోకములలోని కల్మషము లన్నియు క్షాళనమగును. కనుక పరిశుభ్రపరచు వానిలో గాలి దేవుని వైభవము.

మానవుడు ఆయుధములను తయారుచేసికొని ధరించుట నేర్చెను. దీనికి రెండు కారణము లున్నవి. ఒకటి తనను తాను రక్షించుకొనుటకు; రెండవది తన రక్షణతో సంబంధము లేక దుర్బుద్ధితో నితరులను చంపుటకు. ఈ రెండును మానవునిలోని మానుష గుణము, ఆసుర గుణము అనబడును. ఇవి రెండునుకాక మూడవ గుణమున్నది. అది యితరులను రక్షించుటకై

ఆయుధములను వినియోగించుట. అది దివ్యగుణము, దానినే క్షాత్రము అందురు. అది కలవారిలో రాముడు ఉత్తముడు. అత డసురులను సంహరించి ఋషులను కాపాడెను. కనుక క్షాత్రధర్మ స్వరూపుడగు రాముడు దేవుని విభూతులలో నొకటి.

మనము చేతితో వస్తువులను గట్టిగా పట్టుకొందుము. కొన్ని జంతువులు నోటితోను, కొన్ని తోకతోను, కొన్ని డెక్కలతోను గట్టిగా పట్టుకొనును. ఇట్లు పట్టుకొనుటకు ఆధార మెక్కడ యున్నది? ఆ జంతువు మనస్సులోనే ఒక మూల నున్నది. నీటిలో ఈదుకొని పోవుచున్నవాడు, నేలపై నున్నవాడు పట్టు కొన్నంత గట్టిగా పట్టుకొనలేడు. కాని మొసలి, నీటిలో నున్నను ఏ జంతువునైనను గట్టిగా పట్టి యీడ్చుకొని పోగలదు. నిలుచుట కాధారము లేకుండ నీటిలో ఇంతపట్టు దాని కెట్లు వచ్చినది? నీట జీవించు జంతువులలో దేనికిని అంతటి పట్టులేదు. దాని మనస్సున కట్టి శక్తి ప్రసాదింపబడి యున్నది. ఇదికూడ దైవ విభూతులలో నొకటి.

జలములకు గల ప్రవాహశక్తి వలన నదులలోని నీరు మలినములను క్షాళనము చేయును. అట్టి నదీ ప్రవాహములలో గంగానది పాపములను కూడ క్షాళనము చేయును. అది విష్ణు పాదములయందు పుట్టినదని చెప్పబడుట కిదియే కారణము. ఈ శ్లోకమున గంగానది జాహ్నవి యను నామాంతరముతో చెప్పబడినది. మొదట ఆకాశము నుండి భూమికి దిగిన గంగాఝరి శివునికూడ అణచివేయుద మన్నంత పొగరుతో దుమికి వచ్చినది. శివుని జటాజూటములో బంధింపబడిన తర్వాత కొంత పొగరు తగ్గినది. శివుని అనుగ్రహముచే ఒక పాయగా విడువబడిన గంగానదికి ఇంకను పొగరు పూర్తిగా తగ్గక పోవుటచే, అది జహ్ను మహర్షి ఆశ్రమమును ముంచివేసినది. ఆయన ఆగ్రహించి ప్రవాహమును మ్రింగివేసెను. ఆ తరువాత అనుగ్రహించి గంగను తిరిగి భూమిపై వదలెను. అప్పటికి పూర్తిగా వినయము వహించి నెమ్మదిగా ప్రవహించిన నదిని జాహ్నవి యందురు. ఈ వినయముతో పవిత్రీకరింపబడిన గంగాదేవి దేవుని విభూతులలో నొకటి. **(31)**

సృష్టిలో అనేక విధముల సృష్టులున్నవి. ప్రకృతి పుట్టుట, త్రిగుణములు, పంచభూతములు పుట్టుట యొకవిధమైన సృష్టి, హిరణ్య గర్భాండము పుట్టుట

ఒక విధమైన సృష్టి, తారకలు, సౌరకుటుంబములు పుట్టుట మరియొక విధమైన సృష్టి. గ్రహములపై జీవరాశుల శరీరములు పుట్టుట మరియొక రకమైన సృష్టి, ఇట్లు లక్షలకొలది సృష్టి విధానము లున్నవి. ఇన్నిటికిని ఒక్కొక్క ప్రారంభము, అంతము నున్నవి. ఈ మొదలు చివర యను రెండింటికిని మిగిలిన సృష్టు లన్నియు లోకువ. కనుక ఆద్యంతములు అనబడు వాని సృష్టి దైవ వైభవము లలో నొకటి. ఈ రెండింటి నడుమనే సమస్తము నుండును. కనుక ఆద్యంత ముల మధ్యము కూడ దేవుని అంతర్యామి వైభవము.

విద్యలనగా తెలిసికొనవలసినవి. 'విద్' అనగా తెలియుట. మనస్సునకు తెలిసికొను లక్షణమున్నది గనుక, మానవ మనస్సు విద్యలను కల్పించుకొన్నది. ఇట్లు కల్పించుకొనుటలో అనేక విద్యలు పుట్టినవి. ప్రతి విద్యయు నొక్కొక్క చోట పరిమిత మగును. కాని యిన్ని విద్యలకును మూలము, తెలిసికొనుటకు యత్నించుచున్న తానే గదా! ఈ తానే సర్వాంతర్యామి యని తెలియుట మహా విద్య. దానియందు మిగిలిన విద్యలన్నియు సముద్రమున నదులవలె కలియుచుండును. అన్ని విద్యలకును పరమావధి యదియే. దానిని పొందిన వానికి ఏ విద్య యయినను లొంగును. దానినే అధ్యాత్మ విద్య యందురు. ఆత్మ యనగా తాను. దాని నధిష్ఠించి యున్నది గనుక అది అధ్యాత్మ విద్య. విద్య లన్నిటిలోను అది యొక్కటే దైవ వైభవ స్వరూపమైన విద్య.

ఒక్కొక్కడు ఒక్కొక్క విషయమును గూర్చి వాదించును. ఒకడు తన నమ్మకములను గూర్చి వాదించును. ఒకడు తన కోరికలను గూర్చి వాదించును. ఒకడు తనకు వ్యామోహమున్న వస్తువులను గురించి వాదించును. మరియొకడు తాను సత్య మనుకొన్నదానిని గురించి సత్యమని వాదించును. ఎవడు దేనిని గూర్చి వాదించునో, వాడక్కడ నుండి బయలుదేరి అంతర్యామి ననుభవించు టకు ప్రయాణము కట్టుచున్నాడు. వాదించుచున్నది తానే గనుక, వాదన నుండి బయలుదేరి, వాదించుచున్న తన వద్దకు చేరుకొని, అందలి తనను తెలిసికొని, ఈ మొత్తము తానే యని దర్శించును కనుక వాదించు వారిలో వాదించు శక్తి దేవుని వైభవము. (32)

అక్షరములలో అకారము దైవ స్వరూపము. ఇది శబ్దబ్రహ్మము యొక్క మొదటి ఆవిర్భావమును తెలుపును. జీవుల యుచ్ఛ్వాస నిశ్వాసలు ప్రాణ

మనబడు ప్రణవము నుండి యుద్భవించిన రెండు ప్రయత్నములు. వానిని 'సోఽహం' అను రెండక్షరములుగా శాస్త్రకారులు దర్శించిరి. వాని నుచ్చరించు చున్నప్పుడు కంఠమునుండి చెవికి వినబడు శబ్దము పుట్టదు. పుట్టవలెనన్నచో స్వరపేటిక నుండి యొక స్పందనాత్మకమైన ధ్వని పుట్టును. దానినే ఋగ్వేద మున ఋషభము అందురు. దానితో నిశ్వాస స్వరూపమగు హకారము కలిసి వాక్కు వచ్చుటయే హరియొక్క ఆవిర్భావమని చెప్పబడినది. ఇదియే నారాయణుడు హరియై దిగివచ్చుటగా భాగవతమున వర్ణింపబడినది. పెదవులు మూసి దీని నుచ్చరించినచో ఏ జీవియైనను తనకు సహజమైన కూత పెట్టుట జరుగును. దాని నుండి నోరు తెరువగనే రూపు కట్టుకొనునది 'అ'కారము. కనుక శబ్ద శాస్త్రమున మహేశ్వరుడు అకారాదిగా ధ్వనులను పరిగణనము చేయుచు తన మహేశ్వర సూత్రములను డమరుకము నుండి వ్యక్తము చేసెను. ఇదే సంప్రదాయముగా సంస్కృత భాష యందును, దాని ననుసరించిన సకల భారతీయ భాష లందును అకారము మొదటి వర్ణమైనది. పాశ్చాత్య భాషలలో గూడ మొదటిది అకారమే. (దీనిని ఆంగ్లేయులు 'ఏ' అని ఉచ్చరించుట తప్పనియు 'అ' అని ఉచ్చరింప వలెనని మిగిలిన పాశ్చాత్య భాషలు తెలుపుచున్నవి.) ఆల్ఫా 'α' అనబడు దీని మూలాక్షరము అలేఫ్ (ఎద్దు) అని వ్యవహరింపబడుచున్నది. ఇది వేద భాషలలో ఋషభము అను దానిని వృషభమని అర్థము చేసికొని చేయబడిన రూపకల్పనము. ఋషభమను పదమునకు గూడ 'ఎద్దు' అను అర్థము సంస్కృతమున సంక్రమించినది. దీనిని సంగీత శాస్త్రజ్ఞులు నేర్పినట్లు తెలియుచున్నది. ఈ విధముగా అకారము సర్వ ప్రపంచ భాషల యందలి వర్ణసమామ్నాయములకును ఋషభము యొక్క గొంతెత్తిన మొదటి వర్ణముగా చెప్పబడుచున్నది. ఇది అక్షరముల స్థితికి ప్రారంభము గనుక స్థితికారకుడగు విష్ణుని పరముగా మంత్రశాస్త్రము వర్ణించినది. "అకారార్థ విష్ణుః" అని సూత్రము. కనుక అక్షరములలో తాను అకారమని కృష్ణుడు వర్ణించెను.

వ్యాకరణము వేద సంప్రదాయమున సృష్టియొక్క రూపకల్పనకు వాక్య కల్పనము. సృష్టిలో జీవుడు పుట్టి వ్యాపార స్వరూపుడై తానే కర్త, కర్మ, క్రియ అను మూడు ఖండములుగా విడిపోయి తనను తాను ఖండ దృష్టితో

చూచుకొనుటయే సృష్టి, దానికి ప్రతిబింబమే వాక్యముగా నుద్భవించి అందు కర్త, కర్మ, క్రియ వేరైనవి. అట్లే సృష్టిలోని ప్రకృతి ధర్మములయొక్క ద్రవ్యముల యొక్క సమ్మేళనమే వ్యాకరణ మందలి సమాసములకు మాతృక యయ్యెను. అన్నిటికిని మూల కారణముగా మొట్టమొదట 'నేను'గా మాత్రమే యున్న ప్రజ్ఞ 'నేను-నాది' యను జంట ప్రజ్ఞలుగా విడిపోవుటయే సృష్టి ఆరంభము. ఇది అంతర్యామి ప్రకృతి పురుషులుగా దిగివచ్చుట. వారి నుండియే భూమ్యాకాశ ములు, భార్యాభర్తలు, తల్లిదండ్రులు మున్నగు వర్గీకరణము దిగి వచ్చినది. ఈ మొదటి జంటల వర్గీకరణమే లేనిచో సృష్టి దిగివచ్చుట సాధ్యము కాదు. దీనిని బట్టి సమాసములలో ద్వంద్వ సమాసము మొదటిదై ప్రాధాన్యము వహించెను. కనుక తాను సమాసములలో ద్వంద్వమని కృష్ణుడు పలికెను.

జననమరణాత్మకమైన జీవుల సృష్టియంతయు శాశ్వతమైన అంతర్యామి యను తెర ఆధారముగా జరుగుచున్నది. అట్టి అంతర్యామి యీ జీవులలో నే రూపమున నున్నాడు? కాలమని తెలియబడు రూపమున నున్నాడు. దాని యందే పుట్టి పెరిగి జీవులు లయ మగుచున్నవి. కనుక క్షయ మగుచున్న జీవులచే అక్షయముగా జూడబడుచున్న కాలమే తన స్వరూపము. అనంతమైన కాల ప్రవాహముగా జగద్వ్యూహము నడచుచుండగా దానికి కర్తయగు 'ధాత' యనబడు సృష్టికర్త తానే. తనయందు ఉద్భవించు చున్నవే ఇందరి నోళ్ళును, వారు స్వీకరించు ఆహార స్వరూపములును. కనుక అతడు విశ్వతోముఖుడు. (33)

ఇక సర్వజీవులను తనలోనికి హరించుచున్న కాలమే మృత్యువని వ్యవహ రింపబడును. ఉద్భవింప జేయుచున్న అదే కాలము సృష్టియని వ్యవహ రింపబడును. ఈ రెండును కాల స్వరూపుడైన తానే.

కీర్తి యనగా నేమి? ఒక జీవి వలన వ్యక్తమైన సత్కర్మాచరణము మిగిలిన జీవులచే ప్రశంసించుకొనబడుట. అది సత్కర్మాచరణము నభ్యసింప గోరువారికి వ్రాగూపమైన ముద్ర లేక నమూనా (mould) అని యుధిష్ఠిరుడు యమధర్మరాజుతో నిర్వచించెను. కనుక చనిపోయిన జీవి యీ ప్రసంగముల రూపమున జీవించియున్న వాఙ్మయ దేహమే కీర్తి. అది కూడ దేవుని వైభవ మూర్తులలో నొకటి. శ్రీ అనగా నేమి? ఆశ్రయించుకొని యుండునది. ధనము,

వస్తు సంపద, ఇల్లు-వాకిలి, సద్గుణములు పురుషుని ఆశ్రయించుకొని యుండును. పురుషుడు దేవుని యంశ కనుక అతని విభూతులలో నొక్కటియే శ్రీ. అట్టిదే వాక్కు గూడ. సంభాషణ చేయు సంకల్పము, దానికి కావలసిన పదములు, అర్థములు, అక్షరములు, వాని యుచ్చారణము పురుషుని ఆశ్రయించుకొని యుండును. గనుక అదియు దైవ విభూతియే. ముఖ్యముగా స్త్రీ యొక్క వాక్కు తన విభూతి యని చెప్పుచున్నాడు. అది యెట్లు? ప్రసంగించిన వాక్కులు చెప్పదలచిన అర్థమును తనయందు ధరించి యుండును. అట్లే సృష్టిని దేహలుగా నుచ్చరించుటకు గర్భము ధరించువారు స్త్రీలు గనుక సంతతిని గాంచుట స్త్రీల వాక్కుగా చమత్కరింపబడినది.

స్మృతి యనగా స్మరించుకొనుట. దీనికి ద్రవ్య రూపమైన అస్తిత్వ ముండక, మనోరూపమైన అస్తిత్వము మాత్రమే యుండును. ఇది యొక విధమైన వైభవము. మేధ యనగా విషయమును చక్కగా గ్రహించుకొను శక్తి. దీని మహిమచే మనస్సు వేరుగా నున్న యొక శాస్త్ర రహస్యముగా తానే రూపొంది మారును. కనుక నిదియొక వైభవము. ధృతి యనగా ధైర్యమని స్థూలముగా నర్థము చెప్పుదురు. పామరుల ధైర్యము బాహ్య వస్తువులపై నాధారపడి యుండును. అనగా ధనము, పరిచయస్తులు, పదవులలో నున్నవారు మున్నగు రూపములుగా భ్రమ గొలుపుచుండును. కాని సాధకునకు ధృతి లేక ధైర్యము అను మాట కర్థము వేరు. తనను తాను ధరించుకొనుట యని అర్థము. ఆపదల యందు తనకు దిక్కెవ్వరని అన్వేషించుటకు బదులు తానే దిక్కని తెలిసినవాడు నిశ్చలత్వము చెంది ఇతరులచే నన్వేషింపబడును. అట్టి ధైర్యముకూడ ఆత్మనుండి పుట్టిన వైభవముల లోనిది గనుక తన స్వరూప మనుచున్నాడు. (అడుగడుగున ప్రాణ సందేహావస్థలో దేహయాత్ర గడచినపుడు ఏ సన్నివేశముననను తనకు దిక్కెవ్వడు? అను ప్రశ్న పుట్టకుండ గడచినది కృష్ణావతార మొక్కటే యని యంగీకరింపక తప్పదు.) క్షమ అనగా ఓర్పని స్థూలార్థము. ఇతరుల దుష్ప్రవర్తనము చూచినపుడు నిశ్చలత్వము చెంది యుండుటగూడ ఆత్మవైభవములలో నొక్కటి. అంతేగాక క్షమయనగా సామర్థ్య మని యర్థము. రక్షణ క్షముడు అనగా రక్షించు సమర్థత గలవాడు. కావున క్షమయనగా సామర్థ్యము. ఇది కూడ ఆత్మవిభూతులలో నొక్కటి. **(34)**

సామ లన్నిటిలో బృహత్సామ తానని చెప్పుచున్నాడు. దీని భావమేమి? *"ప్రాణః సామవేదః"* అని నిర్వచనము. శ్వాసయే ప్రాణమునకు పాటగా గల్పింప బడిన వేదము. అందు ఉచ్ఛ్వాస నిశ్వాసములు అహోరాత్ర స్వరూపములైన సామలని చెప్పబడెను. ఉచ్ఛ్వాసము దీర్ఘముగా పీల్చుట పూర్తియై మరల నిశ్వాసమున కున్ముఖముగా తిరుగబోవుచున్న స్థితిలో మనస్సు ప్రాణమును స్పృశించును. అట్టి చరమ స్థితియే బృహత్సామ యనబడును. దానినుండి శ్వాస దిగివచ్చు నిశ్వాసము రథంతరీ సామ యనబడును. దేహమను రథమును జీవు డారోహించి సామ మనబడు ప్రయాణమున ఆరోహణము చేసి మరల అవరోహణము చేయునని జైమినీయ బ్రాహ్మణము వర్ణించు చున్నది. ఇందలి నడిమి భాగమగు ఉచ్ఛ్వాసము యొక్క చరమస్థితి బృహత్సామ యనబడును. "ప్రాణమే జీవితమను యజ్ఞమున వాడబడు సామవేదము" అని యుధిష్ఠిరుడు యమధర్మరాజుతో పలికెను. దీనికి బాహ్యస్వరూపముగా సూర్యు డుదయించి మిట్టమధ్యాహ్నము నారోహించుట (Meridian) బృహత్సామ అనబడుచున్నది. సూర్యోదయము, మధ్యాహ్నము, సూర్యాస్తమయము, అహస్సు అను యజ్ఞము నకు మూడు సవనములు (ప్రాణమును వెదకునట్టి కేకలు లేక స్తోత్రములు) అని వేదములలో వర్ణింపబడినది. మానవుని ప్రజ్ఞలో తురీయస్థితి యనబడు నది, సమాధి స్థితి యనబడునది దీని ప్రతిరూపముగా వర్ణింపబడినవి. కనుక సామలలో బృహత్సామ తన విభూతులలో నొకటి యని కృష్ణుడు చెప్పెను.

జీవికి ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఎట్లు సామగా పనిచేయుచున్నవో, అట్లే సంవత్సరమునకు పూర్ణిమలును, అమావాస్యలును. ఒక సంవత్సరమున పంన్రెండు పూర్ణిమలు, పంన్రెండు అమావాస్య లుండును. కనుక అది 24 అక్షరముల గాయత్రీ ఛందస్సు. దీనిలో జరిగిన గానమున జీవులు త్రాణనము లేక రక్షణము పొందుచున్నవి. కనుక ఈ ఛందస్సునకు గాయత్రి యని పేరు.

మనకు సంవత్సరము దేవతల కొక దినము. మన మకరమాసము దేవతలకు సూర్యోదయము. దానికి ముందున్న ధనుర్మాసము బ్రాహ్మీ ముహూర్తము. అదియే మార్గశీర్షము. కనుక అది తన విభూతులలో నొక్కటి యని చెప్పెను. గోపికలు కృష్ణుని తమ హృదయనాథునిగా గోరి కాత్యాయనీదేవి

నుద్దేశించి ధనుర్మాస వ్రతము చేసినట్లు భాగవతము - దశమస్కంధము చెప్పుచున్నది. అట్లే ఋతువులలో వసంత ఋతువు జీవరాశులలోని జీవరసము మరల మేల్కొంచునట్టి సూర్యోదయము. అది కుసుమాకరము, అనగా పుష్పములకు నివాసము. కాలపురుషుడు ఈ ఋతువున పుష్పములచే పూజింపబడును. కనుక తన విభూతులలో నొక్కటిగా చెప్పబడినది. (35)

## మరికొన్ని విభూతులు :

ఉప్పు ఉప్పగా నుండుట దాని గుణము. చక్కెర తీయగా నుండుట దాని గుణము. పదార్థములును, వాని గుణములును వేరువేరుగా తెలియబడు చున్నవి. ఇది తెలిసికొనువాడు ఉన్నంతవరకు జరుగుచుండును. ఉప్పగానుండు గుణము ఉప్పునకు గాని, నాలుకకు గాని లేదు. రెండిటి సహవాసము వలన వ్యక్తమగును. ఉప్పు- రుచి చూచువాడు, ఉప్పగా నుండుట అని మూడు విధములుగా వ్యక్తమగుచున్నది అంతయు ఆ మూడింటిలో అంతర్యామిగా నున్న దైవము యొక్క వైభవము. ఆ వైభవము ప్రతి వస్తువునందును పదార్థ ధర్మములుగను, ప్రతి వ్యక్తి యందును ఆ వ్యక్తియొక్క ప్రత్యేక గుణములుగను వ్యక్తమగును. ఒక్కొక్కడు ఒక్కొక్క దానియందు ప్రత్యేకతను సాధించును. దానికి కావలసిన పట్టుదల అతనియందు ఉండును. ఆ పట్టుదల ఆ వ్యక్తి యందు వ్యక్తమగునదే కాని, వ్యక్తికి సంబంధించిన సొంతవస్తువు కాదు. వెలిగించబడిన దీపము యొక్క వెలుగు ఆ దీపములోని వత్తికి సంబంధించినది కానట్లు, ఒక్కొక్కని యందు వ్యక్తమగు ప్రత్యేక గుణములు ఆ వ్యక్తికి సంబంధించినవి కావు. అవి మంచి చెడ్డలతో సంబంధము లేక దైవవిభూతులై జగద్వ్యూహము నడచుటకు నిమిత్తములై వర్తించుచుండును. కనుక ప్రతి వ్యక్తి యందును గల ప్రత్యేక గుణములు దైవ వైభవములు. జూదమాడు వారిలో ఆ జూదమాడునట్టి ప్రత్యేక నైపుణ్యము దైవవిభూతి. దైవమును సూటిగా ఆరాధించుట యింకను తెలియనివాడు జూదము మున్నగు వానిని ఆసక్తిగా నారాధించును.

ఒక్కొక్కని యందు ఒక్కొక్క విధమైన తేజస్సు ఉండును. ఒకడు మంచి పనిని దేనినైనా ప్రారంభించినచో పరిసర వ్యక్తులందరును చేరి దానిని

నిర్వహింతురు. అది అతని యందలి తేజస్సు. ఒకనిని చూచి మిగిలినవా రందరును భయపడుదురు. అది వాని తేజస్సు. ఇట్లొక్కొక్కని యందు ఒక్కొక్క విధముగా వ్యక్తమగు తేజస్సు దేవుని వైభవము. జయము సాధించు వారి యందు నిలుపబడు జయము దేవుని వైభవము. పెద్దపెద్ద పనులు లోక శ్రేయస్సునకై సాధించుటకు కొందరు సామర్థ్యము చూపుదురు. అది కూడ దేవుని వైభవమే. సత్యము వ్రతముగా గలవారియందు సత్యము భగవంతుడు. ఇట్లు గ్రహింప గలిగినచో వ్యక్తుల యందలి ప్రత్యేకత దేవుని వైభవ మనియు, వ్యక్తులు వేరు వేరుగా పనిచేయుచున్న గుణాధారము లనియు తెలియును. **(36)**

అంతేగాక సంఘమున ఒక్కొక్క ప్రత్యేకమైన కార్యసాధనకై దిగివచ్చిన వ్యక్తులు వేరుగా నుందురు. వారును దేవుని విభూతులే. వృష్ణివంశము వారందరిలో వాసుదేవు డట్టివాడు. వాసుదేవు డనగా వసుదేవుని కుమారుడు. అంతమాత్రమే అయినచో మిగిలినవారిలో నొకడుగానే జీవించెడివాడు. అట్లు గాక సర్వజీవులలో నివాసమున్న దేవుడుగా తాను జీవించెను గనుక వాసుదేవు డనగా దేవుని వైభవము. (కార్తవీర్యార్జునుని నాలుగవ కుమారుడు మధువు. వాని కుమారుడు వృష్ణి. వాని నుండి వృష్ణివంశము పుట్టెను. ఆ వంశమున పుట్టిన దేవకుని పుత్రిక దేవకి. ~~ఈ~~ విధముగా శ్రీకృష్ణుడు తన తల్లి వైపున వృష్ణివంశమువారి మనుమడు.) అట్లే పాండవులు ఐదుగురిలో అర్జునుడు దైవ విభూతికి చిహ్నము. అతడు అనేక యుద్ధములు చేసి ధనరాశులను జయించి యుధిష్ఠిరుని రాజ్యమును స్థిరము చేసిన వెనుక 'ధనంజయుడు' అనబడెను. అతని నిమిత్తముగనే లోకమునకు గీతోపదేశము జరిగినది. కృష్ణుడు, అర్జునుడు నరనారాయణాంశలలో దిగివచ్చినవారు. అందు నరుడను ఋషి అంశ అర్జునుడు. కనుక నాతడు దైవ విభూతి. అట్లే మునులలో వేద వ్యాసుడును. అతడు కారణముగా వేదముల విభాగము, వేదాంత విద్య, భారత హరి వంశములు, పదునెనిమిది పురాణములు నరజాతికి అందినవి. ఇంకను కుంతికిని, పాండవులకును నైమిశారణ్యమున మునీంద్రులకును ఆయా కాలములలో కర్తవ్యమును నిర్దేశించుచు దేవుడిగా పూజించబడెను.

కవులలో ఉశనసుడు అనబడు కవి భగవంతుని దివ్య వైభవము.

ఉశనసుడు అనగా శుక్రాచార్యుడు. ఇతడు ధర్మశాస్త్ర ప్రవర్తకులైన మహా కవులలో ముఖ్యుడు. అంతేగాక ఇందొక రహస్యార్థము చమత్కరించబడినది. కవి యనగా చూచువాడు, రూపములను కల్పించి వర్ణించువాడు అని కూడ అర్థము. దేవదానవ యుద్ధములో చనిపోయిన రాక్షసులకు మరల రూప కల్పనము చేసి పునర్జీవితులను చేయునట్టి విద్య యీ శుక్రాచార్యులకు తెలియును. ఆ విద్య పేరు 'మృతసంజీవని'. ఇట్టి అపూర్వ వైభవము కలవాడు కనుక శుక్రాచార్యుడు దేవుని విభూతి అని నిర్దేశింపబడినది. ఈ శుక్రాచార్యుని అంశగా పుట్టినదే మన సౌరకుటుంబములోని శుక్ర గ్రహము. దాని కధిపతి యగు గ్రహమూర్తి శుక్రుని ప్రభావము వలన రూపకల్పనము, పాత్రసృష్టి మొదలగు కార్యశక్తులు ఆయా వ్యక్తులయందు ప్రసన్నమగును. శుక్ర గ్రహ వీక్షణమున కవిత్వము, చిత్రలేఖనము, సంగీతము అను లలితకళలు మానవు లకు అబ్బుచున్నవి. మరియొక విశేషము. ఈ శుక్రుని ప్రభావము వలన కల్పింపబడిన శుక్రధాతువు గర్భమునందు జీవులకు రూపములు కల్పించును. అదియే విశ్వసృష్టిలోని కావ్యసృష్టి, దాని వలన చనిపోయిన జీవులకు దేహ కల్పనము చేయుట మృతసంజీవని మంత్రముగా సిద్ధించు చున్నది. ఇన్ని లోకముల యందును కావ్యత్వము ప్రదర్శించునట్టి ఉశనసుడు దేవుని వైభవము. (37)

దమించు శక్తిగల వారిలో దమించునట్టి అధికారము కూడ దైవ వైభవమే. దమించుట క్రమశిక్షణ కొరకై వ్యక్తమగునట్టి దైవగుణము. అది ప్రభుత్వ దండనము మున్నగు రూపములలో సమాజమున వ్యక్తమగు చుండును. దండనాధికారులు తమ తమ స్థానములలో ప్రభుత్వముచే నియమింపబడుట దైవానుగ్రహము వలన జరుగును. సమాజము సత్కర్మాచరణము నందు యిష్టపడినచో దాని పుణ్యఫల మనుభవించును. అది నిర్విఘ్నముగ సిద్ధించుటకై దండనాధికారు లేర్పడుదురు. సమాజము దుష్కర్మశీలురైన వ్యక్తులతో నిండి యున్నచో ప్రభుత్వాధికారులుగా వేషధారణ చేసిన దోపిడిగాండ్రు ప్రజలను దోచుకొని తిందురు. ఆ రూపముగా కూడ దండనము ఫలమగు చున్నది. కనుక ఈ రెండు విధములైన దండనములును దైవ విభూతులే.

మానవులలో జయించునట్టి శక్తి అనేక కక్ష్యలలో పనిచేయును. ఒకరి నొకరు వాదములలో జయించుకొనుట, కోర్టు వ్యవహారములలో గెలుపొందుట, కలహించి జయించుట, యుద్ధములలో గెలుపొందుట, లాటరీలు మున్నగు వానిలో విజయము సాధించుట మున్నగునవన్నియు జయమను పేరుతోనే చెల్లుచున్నవి. కాని ఇవి తాత్కాలికములు. ఇందొకరినొకరు జయించినను, జయించిన వారిని మరియొకరు మరియొక విధముగా జయించుట చూచు చున్నాము. దీనిని బట్టి ఇవి జయములు కావని తెలియుచున్నది. జయమను పేరు ఇట్టి సందర్భములలో వాడబడుట అజ్ఞానము చేతనే యని ఋజువగు చున్నది. నిజమైన జయము కలిగినచోట మరల పరాభవ ముండదు. ధర్మా ధర్మములకు నడుమ కల్లోలము పుట్టినపుడెల్ల ధర్మమునకు అంతిమ విజయము సిద్ధించును. ఈ అర్థముననే పాండవులు కౌరవులను జయించిన కథకు వ్యాసుడు జయమను పేరుపెట్టెను. జయము కోరువాడు కొన్ని జాగరూకతలను వహింపవలెను. కొంత క్రమశిక్షణమును సాగింపవలెను. కొన్ని విషయములను పాటింపవలెను. ఇట్లు పాటించుటనే నీతి లేక నియమము అందురు. ఇది భగవంతుని వైభవమని తెలియవలెను.

ఒక్కొక్కప్పుడు సత్కార్యసాధనకు రహస్యములు దాచుట ఆవశ్యకము. అనగా ఏ మంచి విషయమునైనను అపాత్రుల దగ్గర బట్టబయలు చేయరాదు. యోగాభ్యాసము చేయువాడు తన సాధనను గూర్చి అందరి దగ్గర వాగుచుండ రాదు. అడిగినవానికి చెప్పవలెను. అడుగనివానికి చెప్పరాదు. అట్టి సాధనా విశేషములలో మౌనము వహించుట కొన్ని సందర్భముల యందు కావలెను. దానిని సాధించువారిలో మౌనము పాటించుట ఆత్మ సాధన మార్గమగును. అట్లే రాజ్యాంగమున ప్రజాక్షేమము కోరి చేయునట్టి పనులను గూడ ప్రజా సామాన్యమునకు తెలియనీయరాదు. ఈ విధముగా చేయు మౌన సాధనము గూడ దైవ విభూతియే.

ఒకడు జ్ఞానము కలవాడని వానిని గౌరవింతుము. వాని దగ్గర మన మెరుగని విషయములను నేర్చుకొనుటకు యత్నింతుము. అట్టి వారిలో జ్ఞానము దైవస్వరూపమైన విభూతి. జ్ఞానము కలవానికి నామరూపాదు

లుండును. అతని జ్ఞానమునకు నామరూపాదు లుండవు. నామరూపములకు అతీతుడు దైవము గనుక జ్ఞానము దైవ స్వరూపము. (38)

సర్వ జీవరాశులు పుట్టి పెరుగుటకు, నశింపకుండుటకు గల సాధన మేమి? అది వారి బీజ స్వరూపమైన సూక్ష్మ జీవ లక్షణము. దీనినే వృక్షము లందు విత్తన మందుము. జంతువులు, మనుష్యుల యందు శుక్ర మందుము. ప్రతి జీవియు బీజ స్వరూపముగా రక్షింపబడి అస్తిత్వము చెందుచున్నది. కనుక ఈ బీజము దైవ విభూతియే. ఇదికాక సూక్ష్మమగు మరియొక బీజము అందరి యందును సనాతనమై శాశ్వతమై ఇమిడియున్నది. అందరును, అన్ని జీవులును పుట్టుచు చచ్చుచున్నవి. అందు వర్తించుచున్న 'నేను' అను అంతర్యామి ప్రజ్ఞ పుట్టుట గాని, చచ్చుట గాని లేక శాశ్వతమై నిలబడి యున్నది. దానినే ఆత్మ యందురు. అదియే నిజమైన బీజము. కనుకనే ఈ చరాచర జీవరాశులలో నేను కానిదేదియు లేదని కృష్ణుడు చమత్కారముగా నుప దేశించుచున్నాడు. (39)

ఇట్లు వరుసగా దైవ విభూతులను పరిగణనము చేయుచు పోయినచో అంతముండదు. ప్రస్తుతము చెప్పబడిన ఉదాహరణములు కేవలము ఉద్దేశము కొరకు మాత్రమే చెప్పబడినవి. ఉద్దేశమనగా నిదర్శనముగా ఎత్తి చూపించుట లేక ఉదాహరించుట. అర్జునుని ప్రశ్నను బట్టి కృష్ణుడు చేసిన ఈ విభూతుల పరిగణనము కేవలము ఉదాహరణ ప్రాయమే గాని విభూతుల మొత్తము మాత్రము కాదు. ఈ సృష్టిలో నేది యేది వైభవోపేతముగా నుండునో, ఏది సుపుష్టముగా నుండునో అదియెల్ల నంతర్యామి యొక్క ఆత్మవైభవమే యని గ్రహింపవలెను.

వ్యక్తమగుచున్న విభూతులను వేర్వేరుగా పరిగణించి తెలుసుకొనుట సాధ్యము కాదు. తెలిసికొన దలచినను దానివలన ప్రయోజనము లేదు. ఒక విషయము జ్ఞప్తియందు ఉంచుకొనిన చాలును. ఈ సమస్తసృష్టిని నియమించి, నిబంధించి, ఆత్మయందు స్తంభనము చేసియుంచుట, దానియందు తానే ప్రవేశించి అంతర్యామిగా నుండుట జరుగుచున్నది. (40-42)

పదునొకండవ అధ్యాయము

# విశ్వరూప సందర్శన యోగము

**భ**గవద్గీత యందు ఏకాదశాధ్యాయమున విశ్వరూప సందర్శన యోగము చెప్పబడినది. విశ్వరూపమును చక్కగా దర్శించునట్టి యోగవిద్య యని దీని యర్థము. విశ్వరూప మనగా నేమి? విశ్వముయొక్క రూపము. విశ్వమును మనము ప్రతిదినము మన చుట్టును చూచుచున్నాము గదా, అందలి విశేషము వేరుగా నేమున్నది? మనము విశ్వమును (అందులోని కొంత భాగమును) నిత్యము గమనించుచునే యున్నాముగాని అది విశ్వముయొక్క రూపముగాదు, రూపములు. విశ్వము నందలి రూపములను చూచుటయు, విశ్వముయొక్క ఏకరూపమును చూచుటయు నొక్కటే యనరాదు. విశ్వము నందలి మనము చూచుచున్న రూపములు ఒక కాలమునకు, ఒక ప్రదేశము నకు మాత్రమే సంబంధించినవి. మనకు కనిపించిన దానిని మనము చూచు చున్నపుడు మనము చూడని విశ్వము వేరుగా నున్నదిగదా! అవి అనంతముగా పుట్టుచు, వర్తించుచు పోవుచున్నవి. ఆ మొత్తమును మనము కంటితో చూడగలమా? చూడలేము. దానిని చూచుటకు మరియొక దృష్టి కావలెను. దానికి కన్నులు చాలవు. కనుకనే అర్జునుడు విశ్వరూప సందర్శనమును కోరినపుడు భగవానుడు ఇట్లు చెప్పెను. “ఈ నీ కన్నులతో నా మొత్తము రూపమును చూడలేవు. నీకు దివ్యమైన చక్షువు లిచ్చెదను, వానితో చూడుము.” ఈ దివ్యచక్షువు అనగా నెట్టిది?

ఇంతకు ముందు భగవానుడు అర్జునునకు అధ్యాత్మ రహస్యములను వివరించెను. అధ్యాత్మము అనగా అధి + ఆత్మము; ఆత్మ నధిష్ఠించిన జ్ఞానమని అర్థము. ఆత్మ యనగా నెట్టిది? దానిని చూచుటకు కొన్ని కక్ష్య లున్నవి.

1. బంగారముతో కొన్ని నగలు చేయబడి యున్నప్పుడు మనము చూచి ఆనందించునది నగల సౌందర్యమునే గాని బంగారమును కాదు.

ఆభరణములను చూచుచునే అందలి బంగారమును చూడకున్నాము. అట్లే మన చుట్టునున్న జీవులను చూచుచునే వారియందలి అంతర్యామిని చూడ కున్నాము. అంతర్యామిని ప్రత్యేకముగా, నిరంతరముగా గుర్తుంచుకొననిచో చూడలేము. ఈ గుర్తుంచుకొనుటయే సమాధి స్థితి. దానిని సాధించుటకే యోగాభ్యాసము.

2. అంతర్యామిని చూచుటకు ప్రయత్నించినను మనము దానికన్న వేరుగా నిలబడి చూచుచున్నాము. అపుడు చూడబడుచున్న అంతర్యామిలో మనము లేము. గనుక అది అంతర్యామి కాదు. అట్లు చూచుచున్న దెల్లను లోపముగల దృష్టియే. పూర్వము పదిమంది పరమానందయ్యగారి శిష్యులు నదిలో స్నానము చేసి వచ్చి ఒక్కొక్కరే శిష్యులను లెక్కింపగా తొమ్మిదిమంది మాత్రమే కనిపించిరి. ఒకడు నదిలో చనిపోయెనని వారు దుఃఖించిరి. ప్రతి శిష్యుడును తన్ను విడచి మిగిలినవారిని మాత్రమే లెక్కించెను. ఈ పద్ధతి నవలంబింపకుండ మన మంతర్యామిని చూచుటకు యత్నించినపుడు చూచు వానినిగూడ కలుపుకొనవలెను. అపుడు తానే ఇన్నిటియందును అంతర్యామిగా నున్నాడనియు, అజ్ఞానము చేత తనకన్న వేరుగా చూచుచున్నాడనియు తెలియును. ఆత్మ యనగా తాను. ఇట్లు చూచుటనే ఆత్మదర్శన మందురు. దానిని గూర్చిన విద్యయే అధ్యాత్మ విద్య. "దానిని ప్రదర్శించితివి గనుక నాచేత దానిని దర్శింపజేయుట కూడ ననుగ్రహింపుము." అని అర్జునుడు కృష్ణుని వేడుకొనెను.

విశ్వము నందలి రూపములను మాత్రమే చూచుచున్నపుడు జీవుల ఉత్పత్తి, లయము మాత్రమే కనిపించును. అది కాల గర్భమునందు కలసి పోవుచుండును. సముద్రపు టొడ్డున కూర్చుండి అలలను పరీక్షించుచున్న వానికి సర్వము కనుపించుచుండును గాని అంతుండదు. అనగా చూడబడు చున్న విశేషములు కాలగర్భమున కలసిపోవుచుండును. తాను చూడక ముందెట్లున్నాడో చూసిన తరువాత గూడ నట్లే యుండును. ఎన్ని శాస్త్రములు చదివినను ఎన్ని సాధించినను ఏమియు మిగులదు. కారణ మేమనగా చూచు చున్న తాను గూడ మిగలక చనిపోవును గనుక! అట్లుగాక తానే ఈ సర్వము నందు వ్యాపించి యుండుట తెలిసినచో విశ్వమందలి రూపములు కనిపించుట

మాని విశ్వముయొక్క రూపము కనిపించును. అదియే అంతర్యామి యగు దేవుని రూపము. అందు కాలము, దేశము, మార్పు అనునవి గూడ భాగములై యిమిడియుండి దర్శనమిచ్చును. కాబట్టి ఈ దర్శనమున యిక మారుట యుండదు. అన్నియు మారుచుండును గాని, అన్నిటితో నిండియున్న ఆ మొత్తము మాత్రము మారదు. అది శాశ్వతమైన రూపము. అందు మంచి చెడ్డ అందలి భాగములై కనిపించును. ఇక చెడ్డ యన్నది యుండదు. శాంతము, సుందరము, ఉగ్రము, భయంకరము అను రూపము లన్నియు నొకే రూపమున నిమిడిపోవును. పుష్పములోని రేకలన్నియును పుష్పమందిమిడి ఏకత్వము చెందినట్లు సర్వము విశ్వరూపమున దర్శనమిచ్చును. అట్టి రూపమును దర్శింప గోరిన అర్జునుడు కృష్ణుని ఈ విధముగా ప్రార్థించెను. "నేను దానిని చూచుట సాధ్యమా? నీకు దానిని చూపగల సామర్థ్య మున్నది. సమస్తమును యోగము చేసి చూపగలవాడవు నీవు. కనుక నేను చూడగలనని నీవు సంకల్పించినచో నాకా దర్శనము కలుగజేయుము." **(1-4)**

## నా దివ్య రూపములు :

ఎవనికి వాడు అద్దము చూచుకొని "ఇది నా రూపము" అని తెలిసికొని తల దువ్వుకొనుట, బొట్టు పెట్టుకొనుట మున్నగునవి చేయును. తన చేతిని చూచుకొని "ఇది నా చేయి" అని తెలిసికొనుటకు కష్టమేమియును లేదు. అట్లే ఇది నా దేహము, ఇది నా మనస్సు, ఇవి నా అభిప్రాయములు, నా ఆదర్శములు అని తెలిసికొనుటలో నెట్టి అభ్యంతరము గాని, క్లేశము గాని లేదు. ఇట్లు తెలిసికొను వారందరిలో నెవడును "ఇది నా నిద్ర" అని తెలిసి కొనలేడు. అట్లే "అది నా మరణము" అని తెలిసికొనలేడు. నిద్రింపక ముందు వరకును మేల్కొని యుండును గనుక మిగిలినవన్నియు తెలియును. నిద్రలో తాను మేల్కొని యుండడు గనుక అది యేమో ఎవ్వనికిని తెలియదు. అట్లే మృత్యువును గూర్చియును.

ఇది నా దేహము, ఇది నా రూపము అని తెలిసికొనుచున్నవాడు ఆ దేహము నందును, ఆ రూపము నందును ఉన్నాడు. దేహము, రూపము అతనినుండి వచ్చినవి. అతడు వానిని పేర్లు పెట్టి పిలువగలడు గాని తనకు

పేరు పెట్టగల వాడెవడును లేడు. అట్టి అంతర్యామినే ఆత్మ యందురు. తన దేహమును వేరువేరుగా గుర్తించువానిని జీవాత్మ యందురు. అతడు వేరుగా గుర్తించుచున్న తెలివిని అహంకారమందురు. అతని గుర్తింపును అజ్ఞాన మందురు. ఆ గుర్తింపులో నేర్చిన విద్యలన్నియు అజ్ఞానములోని భాగమే. అజ్ఞానమనగా జ్ఞానమును నావరించుకొనియున్న ప్రత్యేకత. ఇది తాత్కాలికము. ఆ జీవులలో నున్నది శాశ్వతము. ఆత్మ నిత్యము, దేహాదులు తాత్కాలిక ములు. నీటియందు మంచుగడ్డలు కరగిపోవుచున్నట్లు ఆత్మయందు దేహాదులు సృష్టిగా దిగివచ్చుచు కరగిపోవుచుండును. ఆ దేహాదులలో నున్న ఆత్మయే జీవుడు.

'నేను' అన్న పదము దేహమునందున్న ప్రత్యేకతకు పేరుగా వాడబడి నపుడు అజ్ఞాన మగును. అన్ని దేహములలో అంతర్యామిగా నున్న ఆత్మకు పేరుగా వాడబడినపుడు జ్ఞాన మగును. ఈ అర్థమునే కృష్ణుడు "నా రూపమును చూడుము. వందలకొలది వేలకొలది యుత్పన్నము లగుచున్న నానా విధము లైన నా రూపములను చూడుము. నీకు వానిని దర్శించు దృష్టి నిచ్చుచున్నాను." అని చెప్పెను. వేర్వేరు రంగులతో, రూపములతో వెలుగొందుచున్న ఆకారములను తన విశ్వరూపములోని మూర్తులుగా ప్రదర్శించెను. ఈ సృష్టియందలి మూర్తు లన్నియు అంతర్యామియైన విశ్వాత్మయొక్క మూర్తులే. ఎవనికి వాడు తన యాకారమును, ఇతరుల యాకారములను చూడగలుగును గాని, అన్నియు అంతర్యామియైన విశ్వరూపుని దేహము లనియు, అందు తన రూపమున దేవుడున్నాడనియును చూడలేడు. అట్లు చూడగలుగుటయే దివ్యదృష్టి. ఈ దివ్యదృష్టి కలవానికి మాత్రమే విశ్వరూపము దర్శన మిచ్చునని చెప్పబడినది.

రంగులు, రూపములు, ధ్వనులు, వాసనలు, రుచులు మొదలగు విశ్వ రూపము లన్నియు చూచువానియందు ఏర్పడును. అంతేగాని అవి సత్యముగా నుండవు. ఒక వస్తువు పచ్చగా నున్నదన్నచో ఆ పచ్చదనము మన కంటితో గల సంబంధమే గాని, ఆ వస్తువునందున్న లక్షణము గాదు. మంచుగడ్డ చల్లగా నుండుట మన చేతికే గాని మంచుగడ్డకు కాదు. అట్లే శబ్ద స్పర్శ రూప రస గంధములతో కూడిన సృష్టి యంతయు చూచువానియందు ఏర్పడు చున్నది. చూచువాని యందును పరిసర సృష్టియందును నిండియున్న వాడు

విశ్వరూపుడు. మిగిలిన చూడబడుచున్న దంతయు విశ్వముయొక్క రూపమే గాని విశ్వరూపుని రూపము కాదు, విశ్వమును చూచుటకు మనకున్న దృష్టి చాలును. విశ్వరూపమును దర్శించుటకు వేరైన దృష్టి కావలెను. దానినే కృష్ణుడు దివ్య చక్షుస్సు అని చెప్పెను. (5)

ఈ విశ్వరూపమునందు ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినులు, మరుత్తులు మున్నగు వారందరును విశ్వరూపుని వైభవములుగనే కనిపింతురు. ఈ సృష్టియందు ముఖ్యముగా మూడు విధములైన పొరలున్నవి. అవియే భూలోకము, భువర్లోకము, సువర్లోకము అనబడు మూడు లోకములు. అందు భూలోకమనగా కాలము, చోటు, అందుగల సమస్త వస్తువులు. ద్రవ్యాత్మక ముగా కనుపించునది. పొడవు, వెడల్పు, దళసరి మున్నగు లక్షణములు, అంకెలతో లెక్కింప దగినవి, బరువు, తేలిక మున్నగునవి ఇందుండును. దేహములును, వస్తువులును, కనిపించునది, వినిపించునది భూలోకము. ఇక భువర్లోక మనగా పదార్థములతో కూడినదిగాక వానిని కదలించు శక్తులతో కూడినది. అందు ప్రాణము, యంత్రశక్తి, అయస్కాంత శక్తి, విద్యుత్తు మున్నగున వన్నియు పనిచేయుచుండును. కోపము, సంతోషము, ఆవేశము మున్నగునవి గూడ ఈ లోకముననే పనిచేయుచుండును. మన దేహములు భూలోకమున నుండగా, వాని కదలిక, జీవించుట, చేష్టలు భువర్లోకమున జరుగుచుండును. ఇవి యున్నట్లు మనకు తెలియునట్టిదే సువర్లోకము. అందున్నది తెలివి యనబడు వెలుగే గాని, వస్తువులును గాదు, ప్రాణాది శక్తులును గాదు. ఆ రెండింటిని నడిపించు వెలుగు తెలివిగా నుండును. ఈ మూడు లోకముల యందును మూడు విధములైన దేవతలు పనిచేయుచు నిర్వహించుచుందురు. భూలోకమున పనిచేయువారు వసువులు అనబడుదురు. వారు ఎనిమిది మంది. భువర్లోకమున పనిచేయువారు రుద్రులు. వారు పదునొకండుగురు. స్వర్లోకమున పనిచేయువారు ఆదిత్యులు. వారు పండ్రెండుగురు. వీరు మొత్తము ముప్పది యొక్కరు. ఈ లోకముల ప్రారంభమునకు, మరల లీనమునకు అధిపతులుగా ఇద్దరు పనిచేయు చుందురు. వారే అశ్వినులు. వారినే నాసత్యులు అని కూడ అందురు. వీరితో కలసి మొత్తము ముప్పది ముగ్గురు దేవతలు సృష్టి వ్యూహమున పనిచేయుచు, బ్రహ్మాండ గోళములను

నిర్మాణము చేయుచుందురు. దివ్యదృష్టికి వీరందరును కనిపింతురు. సామాన్య దృష్టికి వీరందరితో నిర్మింపబడిన దేహములును, వస్తువులును మాత్రము కనిపించుచుండును. కనుక మొట్టమొదటగా దివ్యదృష్టి ప్రసాదింపబడిన వారికి, వీరందరు క్రొత్తగా నుందురు. ఆశ్చర్యమును కలిగించు చుందురు. (6)

చరా చరములతో కూడిన జగత్తు అనుక్షణము మనకు కనిపించుచు, వినిపించుచునే యున్నది. దానిని గూర్చిన అన్ని విషయములును అనిపించుచునే ఉన్నవి. దేనికది వేరుగా గోచరించుచున్నది గాని, వానిలోని ఏకత్వము అందుట లేదు. దానిని భావింపక పోవుటయే కారణము. భావింపక పోవుట ఎట్లు జరుగు చున్నది? భావింపవలెనని అనిపించుట లేదు గనుక! ఈ అనిపించుట ఎవనికిని లొంగుబాటులో నుండదు. ఎప్పుడో ఒకప్పుడు అనిపించుట ప్రారంభమగును. దానిని అనుగ్రహము అందురు. దానివలన చరాచరము లన్నియు ఏకస్థములుగా తెలియును. చిత్రకారుడు చిత్రించిన ఒకే బొమ్మలోని వివిధ భాగములుగా తెలియును. అట్టి ఏకత్వమే 'నా' దేహము. అందున్న 'నేను' విశ్వరూపుడు. అట్టి నా దేహమున చూడదగిన వాని నన్నిటిని చూడుమని శ్రీకృష్ణు డనుగ్రహించుచున్నాడు. 'ఇతరములను' ఏమేమి చూడదలచితివో వాని నన్నిటిని నాయందు చూడుమని యుపదేశము. అనితరము లేక అనన్యము అయిన దృష్టియే దివ్యదృష్టి. అదియే 'స్వచక్షుస్సు'. అట్టి నా దృష్టితో చూచినపుడు మాత్రమే విశ్వరూపమును చూడగలవు. నీ స్వచక్షుస్సులతో చూచినప్పుడు చూడలేవు. జీవుల దృష్టి మరియొక వస్తువును చూచుటకు సదుపాయముగా నేర్పడినదే గాని తన్ను తాను చూచుకొనలేదు. కన్నులు ఇంకొక వస్తువునే చూడగలవు. చెవులు ఇంకొక దానినే వినగలవు. మనస్సు తనకన్న వేరుగా నున్న భావములను మాత్రమే ఊహింపగలదు. దివ్యదృష్టిలో ఇవి యన్నియు అప్రయత్నముగా అంతర్ముఖము లగును. అనగా లోపలికి వెళ్ళిపోవుటకాదు. అన్నిటియందున్న తనను భావించి చూడగలుగుట. ఈ దృష్టియే ఈశ్వరదృష్టి లేక ఐశ్వర్యము. దీనినే ఐశ్వర్యమని గూడ అందురు. (7,8)

అట్టి దృష్టితో దర్శింపుమని యుపదేశించుచునే కృష్ణుడు ఆ దృష్టిని అర్జునునకు ప్రసాదించెను. అతడు యోగవిద్య కీశ్వరుడు. కనుక ప్రసాదింప గలిగెను. యోగేశ్వరు డనగా యోగమున కీశ్వరుడు. యోగీశ్వరు లనగా

యోగులలో గొప్పవారు. వారు తమ యోగశక్తిచే విశ్వరూపమును దర్శింప గలుగుదురు గాని ఇతరులకు ప్రదర్శింపలేరు. వారి దృష్టిలో ఇతరులు ఇతరులుగా ఉండిపోవుటయే దీనికి కారణము. తాను యోగసిద్ధి పొందవలెనని కోరువాడు ఆత్మోద్ధరణకై పాటుపడును. ఇతరులను గూర్చిన దృష్టిని తగ్గించు కొనును. యోగమున కిది పరమావధి కాదు. ఇతరులలో ఇతరులను చూడక అంతర్యామిని చూచువాడు యోగీశ్వరుడు. అంతర్యామిని తనకన్న నితరముగా చూడక, తాను వెలుగునందు లయమై తానుగా ఉన్నవాడు మాత్రమే యోగేశ్వరుడు. అట్టివారు పుట్టుకచేత దిగివత్తురు లేక సాధన చేత ఏర్పడుదురు. వారు మాత్రమే ప్రదర్శించుటకు సమర్థులు. మిగిలినవారు తమ దృష్టిలో పరిపూర్ణులై దర్శించుటకు మాత్రమే. (9)

యోగేశ్వరుడైన కృష్ణుడు పార్థునకు తన విశ్వరూపమును దర్శన మొసగెను. అందు అనేక ముఖములు, కన్నులు, అనేక దివ్యాభరణములు, యుద్ధమునకై ఎత్తిన అనేక దివ్యాయుధములు కనిపించుచుండును. అనగా లోకమునగల సమస్త జీవుల ముఖములు నొక్కనివిగనే కనిపించుచుండును. అట్లే కన్నులు మొదలగునవి. యుద్ధమునకై ఇరుపక్షముల వారును సంసిద్ధులై సేనలు ఆయుధములతో నిలబడి ఉండగా ఒక్కడే ఇన్ని రూపములతో ఆయుధములనెత్తి నిలబడెనని తెలిసెను. అట్లే ఆ విశ్వరూపుడు దివ్య మాల్యములను, విలువైన దివ్య వస్త్రములను ధరించిన రూపములతోను, దివ్య గంధముల నలంకరించుకొనిన రూపముతోను కనబడెను. యుద్ధ భూమిలో వీరోచితములైన గంధ మాల్యాభరణములను ధరించిన రూపము లన్నియును వానివే అని తెలిసెను. ఇట్లు ఒక్కడే ఇన్ని రూపములలో బహు ముఖములతోడి అనంతరూపమై దర్శనమిచ్చుట మహాశ్చర్యకరముగా నుండును. (10, 11)

ఆకాశమున మిట్ట మధ్యాహ్నపు సూర్యుని కిరణముల వంక కన్నెత్తి చూడగలమా? అట్టి సూర్యులు వేయిమంది యొకేమారు మధ్యాహ్నమున ప్రకాశించినచో ఎట్లుండునో ఆ విశ్వరూపము అట్లుండెను. ఇచట చెప్పు చున్నవాడు సంజయుడు. వినుచున్నవాడు ధృతరాష్ట్రుడు. పుట్టు గ్రుడ్డివానికి వేయిమంది సూర్యుల ప్రకాశముతో పోల్చి చెప్పుట ఒక చిన్న ఎగతాళి.

విశ్వరూపము యొక్క అనుభవమును గూర్చి నీకు చెప్పినను తెలియదని హెచ్చరిక. దానిని కన్నులతో చూడదలచినచో ధృతరాష్ట్రున కెంత సాధ్యమో, మిగిలినవారికి కూడ అంతే సాధ్యమని ధ్వని. కనుకనే దివ్యదృష్టితో దర్శించుట చెప్పబడినది. (12)

విశ్వమంతయు అనేక విధములుగా విభజింపబడి ఉన్నది గదా! భూమి, ఆకాశము, పర్వతములు, నదులు, వృక్షములు, రథములు, గుఱ్ఱములు, మనుష్యులు, అందు సారథులు, రథికులు, అతిరథులు, మహామహులు ఎవరికి వారే వేరు వేరు. ఈ భేదము లేనిచో జగత్తు కనబడదు. దివ్యదృష్టి లేనిచో అందలి విశ్వరూపుడు కనిపించడు. కనుక అర్జునునకు అన్నియు ఒక్కని శరీరము నందలి భాగములుగనే కనిపించెను. అతనికి విశ్వముయొక్క భిన్నత్వము, దేవునియం దేకత్వము ఒకే కాలమున కనిపించుచున్నది. ఆ దృశ్యము అనుభవించి అతడు మిక్కిలి ఆశ్చర్యపడెను. దేహము నందలి రోమములు గగుర్పాటుతో నిలబడెను. అట్టి అనుభూతి నతడు పొందుట కదే మొదలు. కనుక తాను పొందిన విశ్వరూపానుభూతిని తన మనస్సున నిముడ్చుకొనలేకపోయెను. ఆశ్చర్యముతో శిరస్సు వంచి నమస్కరించెను. ఈ నమస్కరించుట తన చుట్టునున్న సకల చరాచర జగత్తులోని అంతర్యామి యైన యొక్కనికే. అట్లు నమస్కరించి, అంజలి ఘటించి ఆ విశ్వరూపమును ఈ విధముగా స్తుతించెను. (13, 14)

**విశ్వరూపుడు :**

ఒకరింకొకరివంక చూచుచు వ్యవహరించుచున్నప్పుడు తల, మొగము, జుట్టు, చేతులు, కాళ్ళు, ధరించిన దుస్తులు సమాహారముగా నేర్పడి ఒక ఆకారము కనుపించును. ఇది భౌతిక దృష్టికి కనుపించునట్టి భౌతికాకారము. కొందరికి ఎదుటివారి వేషభాషలలోని వికారములు గోచరించి పరిశీలనకు లక్ష్యము లగును. సంభాషణలలో కొందరికి ఎదుటివారి కన్నులే ప్రత్తికాయల వలె కనుపింపగా; మరికొందరికి ఆ కన్నులలో నుండి చూపులు పొడచూపును. ఇంకను కొందరికి ఆ చూపుల ప్రవాహమునకు మూలమైన భావోత్పత్తి స్థానము గోచరించును. ఈ విభేదము లన్నియు గమనించువాని మెలకువను బట్టి

యేర్పడును. తా నే లోకము నుండి గమనింపగల అర్హత గలవాడో ఆ లోకము లెదుటివారిలో కనుపించును. యోగ దృష్టియందు సిద్ధుడైనవాడు చూచు చున్నపుడు ఎదుటివారిలోని యుచ్ఛ్వాస నిశ్వాసములు, ప్రాణగతులు, అందలి శ్రుతులలో, అపశ్రుతులలో మడతలుగా నిమిడియున్న భూత భవిష్య ద్వర్తమానముల మొగ్గల రేకలు దృష్టి కందును. ఋషి దృష్టి అలవడిన వారికి ఎదుటి వారిలో శీర్షమందుగల సృజనాత్మక లోకములు, హృదయ మందలి స్వయంభువుగా వర్తించు జీవుడు, వెన్నెముక ద్వారమున ప్రవహించు జీవ స్రవంతులు గోచరింపక మానవు. సమాధి, ధ్యానము, ధారణము అను వాని సంయమము సిద్ధించినవానికి నెదుటివానిలోని దేహమందలి పంచ భూతములు, సప్త ధాతువులు, ఇంద్రియములు, మనస్సు మున్నగు పిండాండ మందలి ఏకత్వములోని నానాత్వము గోచరించును. అంతటితో నాగక, ఈ సృష్టి యంతయు సర్వాంతర్యామిత్వమునందు జీవుల వ్యూహములుగా వర్తించుచున్నదని దర్శన మిచ్చును. అట్టి దృష్టియే దివ్యదృష్టి. దివ్యదృష్టి యనుగ్రహింపబడిన వానికి జీవ వ్యూహ మంతయు అంతర్యామి వ్యూహమే గాని వేరు కాదు. అతనికి జీవుడనగా విశ్వరూపము ధరించిన దేవుడు.

ఈ దృష్టితో చూచుచున్న అర్జునుడు కృష్ణుని చూచి "దేవా! నీ దేహమున సర్వదేవతలను చూచుచున్నాను. సమస్త జీవరాశులును తమతమ వైశిష్ట్యముతో సంఘములుగా నేర్పడిన వైభవమును చూచుచున్నాను." అనుటలో నాశ్చర్య మేమున్నది? ఈ సృష్టి యందలి ప్రతి పరమాణువు నందును పదార్థ ధర్మములు, ప్రాణ ప్రవృత్తులు, ఇంద్రియగుణములు మున్నగున వన్నియు క్రమము తప్పక వర్తించుచున్నవి. ఈ క్రమమున నడిపించు ప్రజ్ఞలు సృష్టిలో నిమిడి యున్నవని అంగీకరించుట భౌతికవాదికి కూడ తప్పనిసరి యగును. ఉప్పు ఉప్పగా నుండును. చక్కెర తీయగా నుండును. అట్లుండుట అందలి అంతర్యామికి తెలియకయే వర్తించుచున్న దనుట వెఱ్ఱితనము. ఈ ధర్మము లన్నియు తప్పకుండ సృష్టిలో వర్తించుచుండుట సత్యము. అదియే సత్య లోకము. దాని కధిపతియగు చైతన్యము యొక్క మెలకువయే సృష్టికర్త. వానినే బ్రహ్మ యందురు. వానియందే ఈ దేవతలనబడు ప్రజ్ఞ లందరు కొలువుతీర్చి యున్నారు. వారితో కూడిన ఈ బ్రహ్మ యొకమారు గోచరించుచు, నొక

మారు విస్మృతిలోనికి మాయమగు చుండును. గోచరించుటయే సృష్టి. విస్మృతి చెందుటయే లయము. సృష్టికర్త యొక్క అస్తిత్వము, నాస్తిత్వము సృష్టి జీవులకే గాని, సృష్టికర్తకు కాదు. కనుక ఈ జీవులలోని సృష్టికర్తయే బ్రహ్మ. వారి కతీతుడే నారాయణుడు. మెలకువ, విస్మృతి యనబడునవి విచ్చుకొనుట, ముడుచుకొనుట - ఈ రెండు లక్షణములే సృష్టికి అహోరాత్రములు. వాని శోభయే సృష్టి కమలము. అందు ఆసీనుడైన సృష్టికర్తయే కమలాసనుడు. అందు నిర్నిమేష దృష్టులై వర్తించుచున్న దేహేంద్రియాది ధర్మప్రవర్తకులైన మూర్తులే ఋషీంద్రులు. ఈ ఋషులలో ప్రజ్ఞల ప్రకాశమును కలిగించునట్టి సూర్యచంద్రాత్మకులైన వెలుగులే సూర్య చంద్ర వంశముల రాజర్షులు. సత్యలోకమున ధర్మ ప్రవర్తనము చేయువారే దేవర్షులు. ఈ విజ్ఞానమును జీవుల మనస్సులకు తగుమాత్రముగా బోధపరచువారే బ్రహ్మర్షులు. వీరందరును ప్రవర్తించుట కొక వైశాల్యము కావలెను. అదియే తెరవంటి అవ్యక్తమగు కాలము. అందేర్పడు మార్పులే వ్యక్తమగు కాలము. ఈ మార్పుల కార్యకారణ నిశ్రేణికల కదలికయే దివ్య సర్పముల అస్తిత్వము. ఈ సర్పములు చక్కగా పడగలు విప్పి, ఈ దేవతల వెనుక నిలబడి యున్నవి. వీని దర్శనమే అర్జునునకు కలిగింపబడిన దివ్యదృష్టి. (15)

దివ్యదృష్టి లేనివానికి ఈ సృష్టి యంతయు జనాభా లెక్కల సంకలనము. అందొక్కొక్కనికి రెండు చేతులు, రెండు కాళ్ళు, ఒక నోరు, ఒక పొట్ట, ఆకలి మున్నగునవి గుణకారములై కనుపించును. దివ్యదృష్టికి కనుపించు విధానము ఈ లెక్కలలో వర్తించుచున్న అతీతమైన ఏక వస్తువు. దానిని చూచుచున్నపుడు ఈ సృష్టిలో ఉన్నవానికి గల అనేక బాహువులు, ఉదరములు, వక్త్రములు, నేత్రములు దర్శనమిచ్చును. అది అంతవంతములైన రూపములు ధరించిన అనంతరూపము. దానికి మొదలు, తుద, నడిమి అనునవి లేవు. కాని ఈ మూడిటియందే అనంత రూపము వర్తించుచుండును. ప్రతి జీవియు పుట్టుచు, పెరుగుచు, చచ్చుచుండుట అనంతముగా జరుగుచున్నది. కనుక అనాదిగా కూడ జరుగుచున్నది. ఇట్టి రూపము ఈ విశ్వరూపమందు గల విశ్వేశ్వర రూపము. మన తోలు శరీరమున మన మున్నట్లు, విశ్వరూపములలో విశ్వేశ్వరు డున్నాడు. (16)

కిరీటములు, గదలు, చక్రములు ధరించిన రూపము లన్నియు కిరీటము, గద, చక్రము ధరించినవాని రూపములు. జీవుడు కిరీటముగా ధరించుటకే తలకు పుఱ్ఱె ఏర్పడినది. గద ధరించుటకే తలతో కూడిన వెన్నెముక యేర్పడినది. చక్రము ధరించుటకే జనన మరణాత్మకమైన తరతరముల జీవచరిత్రల చక్రమేర్పడినది. ఇన్నిటిని ధరించిన అంతర్యామి తేజోరాశి. అనగా ప్రజ్ఞాన ఘన స్వరూపుడు. ఈ తేజస్సు కంటికి సంబంధించినది కాదు. ప్రజ్ఞకు సంబంధించినది, ప్రజ్ఞకే తెలియునది. అనగా తనను తానే ఎరిగినది. దీనిని తేరిపార చూచుట సాధ్యము కాదు. చూచుట యనగా నొకనిని ఇంకొకడు చూచుట. అంతర్యామి ప్రజ్ఞ తన్ను తానే ఎరిగినది గనుక, స్వ పర భేద మెరిగిన దృష్టి కందదు. స్వ పర భేదమున కందునది తాను గాక మరికొంత మాత్రమే. దివ్యదృష్టి యందలి అనన్యదృష్టి సమంతము. అనగా చూచువాడు, చూడబడు వాడు, చూచుట అనువాని మొత్తము. ఇదియే దీప్తమైన అగ్నికాంతి. దీనికి కొలతలు లేవు. అగ్ని యనగా నిప్పు కాదు. అగ్ని అనునది కారణము, నిప్పు కార్యము. **(17)**

## శాశ్వత ధర్మగోప్త :

“నీవు అక్షర స్వరూపుడవు.” అని ఈ తేజస్సును అర్జునుడు కీర్తించు చున్నాడు. రూపములు అక్షరముల వంటివి. అనగా క్షరము లేక మరల మరల వచ్చుచు పోవుచుండును. ఈ యక్షరములతో నేర్పడిన పదముల వంటివి లోకములు. వానితో నేర్పడిన వాక్యముల వంటివి సృష్టి కథలు. వానితో నేర్పడిన గ్రంథముల వంటివి వేదములు. వానియందు చదువబడు పరమార్థమే విశ్వ రూపము. ఒక మహాగ్రంథము గ్రంథాక్షరములలో అంతర్యామిగా వర్తించును. గ్రంథమున తెలియదగిన పరమావధి యెప్పుడును పాఠకుని పరమావధియైన అనుభవముగా నుండును. ఈ విశ్వగ్రంథమునకు అట్టి పరమావధియే విశ్వ రూపము. గ్రంథమును చదువుచున్నప్పుడు అక్షరములు అయిపోవు చుండును. గ్రంథార్థము మాత్రము వ్యయము కాదు. అట్లే వ్యయమగుచున్న సృష్టి గ్రంథమున గల విశ్వరూపమే అవ్యయము; అందు ఈ సృష్టి ధర్మములు శాశ్వతముగా గోపనము చేయబడి యుండును. మరల మరల గ్రంథాక్షరములలో

వ్యక్తమగుచుండును. అనగా జీవుల సృష్టిస్థితి లయములలో వ్యక్తమగు చుండును. అందు జీవుడుగా వర్తించువాడు సనాతనుడగు పురుషుడు.(18)

ఈ సృష్టి ఎప్పటినుండి వర్తించుచున్నది? ఈ ప్రశ్న పుట్టక ముందు నుండి వర్తించుచున్నది. ఎప్పటివరకు వర్తించుచుండును? ఈ ప్రశ్న లేకుండు వరకును వర్తించుచుండును. కనుక జనన మరణముల నడుమ వర్తించు వీర్యము ఈ అనంతము నుండి దిగివచ్చి పొడగట్టుచున్నది. కనుకనే ఒక్కొక్కనికి రెండేసి బాహువు లున్నను, ఎంతమందికైన చాలినన్ని బాహువులు సృష్టింపబడు చున్నవి. నేత్ర మనగా కన్ను. ఇది చూచుటకు సాధనము మాత్రమే గాని, చూడగల దృష్టి కాదు. చూచునట్టి పురుషుడును కాదు. ఆ పురుషుడు సూర్యుని మార్గమున భూమికి దిగివచ్చు వెలుగు. కనుకనే వెలుగు లేనిచో కంటికి చూపు లేదు. నేత్రమనగా చూపు మాత్రమే కాక, దారి చూపించి నడిపించునది యని కూడ అర్థము. కనుక నేత్రమనగా నడిపించి రక్షించునది లేక మనస్సు. కంటికి దేవత సూర్యుడు. మనస్సునకు దేవత చంద్రుడు. విశ్వరూపుడు శశి సూర్య నేత్రుడు. అంతర్యామియైన అగ్నిహోత్రునకు వెలుగొక్కటే కాక వేడిమికూడ నున్నది. అందు రూపములు పరిణామము చెంది హుతమగుచుండును. దాని ప్రతిరూపముగనే ప్రాణమునకు ఆకలి, దేహమునకు మృత్యువు ఏర్పడుచున్నవి. ప్రాణశక్తివలన దేహము లేర్పడుట, మృత్యువు వలన దేహము అంతమొందుట జరుగుచున్నవి. ఒక దేహమున నింకొక దేహము అంతమొందుటయే ఆకలి తీరుట లేక అన్నము. వృక్షాదులను, జంతువులను తిని దేహములు పెరుగు చున్నవి. దీనినిబట్టి దేహాంతములు, దేహాదులు ఒక దానియం దొకటి అంతర్యా మిత్వము చెందియున్నవని తెలియుచున్నది. ఇదియే సృష్టి యజ్ఞమున ఆహుతి. ఇది విశ్వరూపుని ముఖములలో నొక ముఖము. ఈ మండుచున్న అగ్నిరూప మైన ముఖము తన తేజస్సుతో విశ్వమును తపింపజేయుచున్నది. ఏ సూర్య కిరణములు మేఘములను కల్పించి వర్షింపజేయుచున్నవో ఆ సూర్యకిరణములే జీవులను తపింప జేయుటకూడ జరుగుచున్నది. ఇందలి క్రమ ప్రవర్తనము ననుసరించియే గ్రీష్మ వర్షాది ఋతువు లేర్పడుచున్నవి. (19)

చిత్రకారుడు సృష్టించిన చిత్రముల కాధారముగా చిత్రపటమున్నది. అట్లే జీవుల కాధారముగా భూమ్యాకాశముల నడిమిభాగ మున్నది. ఈ

మొత్తము ఒకే రూపము. ఇందున్న రూపము లన్నియు నిందలి భాగములే. చిత్రపటములోని ప్రతి చిత్రము నందును పటమే యున్నది కాని, చిత్రములు వేరుగా లేవు. అట్లే ఈ దిక్కుల చిత్రము లన్నియు విశ్వరూపమున నిమిడి యున్నవి. ఈ దృష్టితో జీవులను చూచుచున్నచో జీవుల కథయే లేదనిపించును. ఇది అన్నిటిని మించిన ఆశ్చర్యము. ఉన్నది లేదనిపించుట కన్న ఆశ్చర్యమేమి? ఉన్నది, లేదు అనువాని అస్తిత్వము ఒకదాని యందొకటి యుండుట కన్న ఆశ్చర్యమేమి? అందు మన యస్తిత్వ మెట్టిది? యని ప్రశ్నించుకొన్నచో భయంకరముగా నుండును. చీకటి సముద్రమున ఒంటరిగా ప్రయాణము చేయుచున్న స్వప్నమువలె నుండును. అట్టి స్వప్నము దుర్భరమై వెంటనే మెలకువ వచ్చును. ఈ మెలకువ వంటిదే జన్మము. దీనిని చూడగలిగిన అర్జునుడు గడగడ వణకిపోయెను. ముల్లోకముల మృత్యుభీతి యెట్టిదో గ్రహించెను. అంతర్యామిలోనే ఇంతటి భయంకరత్వము ఇమిడియున్నదనగా నెంత చిత్రము? దప్పిక తీర్చునట్టి నీరే నదియై ప్రవహించు చుండగా, అందు కాలు జారినచో కలుగునట్టి భీతి వంటిది. (20)

ఈ సృష్టిని నిర్వహించు దేవప్రజ్ఞ లందరును సంఘములు సంఘములుగా నేర్పడుచున్నారు. వారు సృష్టిలోనికి ప్రవేశించి, కార్య కారణ ప్రవాహమున కొట్టుకొని పోవుచున్నారు. ప్రవాహపు లోతులలో కాళ్ళు అందుట లేదు. ఈ దేవ సంఘముల కార్యక్రమములలో జీవులేర్పడి ఈ ప్రవాహమున కొట్టుకొనిపోవుచు భయపడుచున్నారు. కొందరు ఈ విశ్వరూపమును దర్శించి అంజలి ఘటించుచున్నారు. కొందరు మహర్షులై, సిద్ధులై పుష్కలములైన స్తోత్రములు చేయుచున్నారు. (21)

దేవత లందరును తమ తమ కార్యక్రమములను బట్టి సృష్టి ధర్మముల రూపమున గుంపులు గుంపులుగా నేర్పడుచున్నారు. వారు నిర్వర్తించు కార్యక్రమముల ఫలితమే ఈ విశ్వము యొక్క రూపముగా నిలబడియున్నది. మన శరీరమున రక్తము, మాంసము మొదలగు ధాతువులును, కన్నులు, ముక్కు, చెవులు మొదలగు నింద్రియములును వేరు వేరుగా పనిచేయుచున్నట్లే ఈ సృష్టి కార్యక్రమమున దేవతలు వేరు వేరుగా పనిచేయుచున్నారు. వారికి ధర్మములే కాని మనస్సు లేదు. వారిచే నిర్మింపబడిన జీవులకు మనస్సు

కూడ వారిచేతనే నిర్మింపబడి యేర్పడుచున్నది. ఈ దేవతలందరు సృష్టికి ముందు అవ్యక్తమున దాగియుందురు. (మనకు నిద్రలో ఇంద్రియములు, మనస్సు మన నుండి దాగియున్నట్లే) అట్టి స్థితిలో దేవతలను సాధ్యులందురు. మనకు నిద్రనుండి మెలకువ వచ్చినట్లే, ఒక సృష్టికి మెలకువ వచ్చును. అప్పటి నుండి ఆ సృష్టి కారంభమై దేవతలు వ్యక్తమై తమయందు తాము మేల్కొని పనిచేయుచుందురు. అపుడు విశ్వరూపము ఏర్పడును. ఆ స్థితిలో దేవతలు సిద్ధు లనబడుదురు.

మొత్తము విశ్వము యొక్క రూపము మొదట మూడు స్థితులుగా వ్యక్తమగును. వానినే లోకము లందురు. అవి వరుసగా ప్రజ్ఞామయము, శక్తిమయము, ద్రవ్యమయముగా వ్యక్తమగును. అందు ప్రజ్ఞామయ లోకమునే వెలుగుల లోకము లేక 'ఆదిత్య లోకము' అందురు. శక్తిమయ లోకమును 'రోదసి కుహరము' లేక 'రుద్రలోకము' అందురు. ద్రవ్యమయ లోకమునందు దేశము, కాలము, నామ రూపాత్మకములగు సృష్టి భాగము లేర్పడును. ఈ లోకమునే 'వసులోకము' అందురు. ఆదిత్యలోకము నందు 12 మంది ఆదిత్యులు, రుద్రలోకము నందు 11 మంది రుద్రులు, వసులోకము నందు 8 మంది వసువులు పనిచేయుచుందురు. మన దేహమునందు కూడ ఈ మూడు లోకములున్నవి. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము మొదలగునవి వెలుగుల లోకమునకును; ఇంద్రియ ప్రవృత్తులు, రక్తప్రసారము, గుండె కొట్టుకొనుట, శ్వాస నిర్వహింపబడుట, దేహము కదలుట మున్నగు చేష్ట లన్నియు రుద్ర లోకమునకును సంబంధించినవి. భౌతిక దేహ నిర్మాణ మంతయు వసులోకమునకు సంబంధించినది. ఇట్లు ప్రజ్ఞామయము, ప్రాణమయము, ద్రవ్యమయము అనబడు మూడు విభాగముల ఏకత్వమే ఆత్మయనబడు శరీర వ్యూహము. తా నను ప్రజ్ఞయందివి నిర్మాణము చెంది యుండుటచే తనతో గూడిన ఈ మొత్తమునే ఆత్మ యందురు.

దీనిని బట్టి ఆ దేవ గణములే దేహముల యందును, వెలుపల విశ్వము నందును గూడ పనిచేయుచున్నారు. విశ్వమునందు పనిచేయువారిని 'విశ్వ దేవతలు' అందురు. దేహమునందు పనిచేయువారిని 'ఆత్మదేవతలు' అందురు. ఇంకను మరియొక తెగవారు సృష్టిలోని జంటలను పుట్టించు చుందురు. వీరి

వలన స్త్రీ పురుషులు, భూమ్యాకాశములు, అహోరాత్రములు, కృష్ణ శుక్ల పక్షములు, వెలుగు చీకటులు మున్నగు జంటలు పుట్టును. వీరి ప్రభావముననే దేహములయందు కుడి ఎడమలు, వెనుక ముందులు నేర్పడును. ఇంకను రెండు కన్నులు, రెండు చెవులు, చేతులు, కాళ్ళు, ఊపిరితిత్తులు మున్నగు జంటలుకూడ వీరి వలననే పుట్టును. వీరినే 'అశ్వినీ దేవత' లందురు. మరియొక గుంపువారు ఆకాశమును ఎక్కడి కక్కడ విభజించి ఏడేసి భాగములుగ చేయుదురు. వీరి వలన సూర్యరశ్మియందు ఏడు కిరణములు, భూమి చుట్టును ఏడు మారుత మండలములు, దేహములందు సప్త ధాతువులు, జగద్వ్యూహము నందు సప్తలోకములు వెలువడును. వీరినే 'మరుత్తులు' అందురు. వీరి వలన ఆకాశము వాయు వగుట, దాని స్పందనము, దాని నుండి శబ్ద ధ్వనులు పుట్టును. వానియందు ఘర్షణము పుట్టించి వేడిమి, వెలుగు ఉత్పత్తి చేయు దేవగణము మరియొకటి ఉన్నది. దేహముల యందలి ఉష్ణత, ప్రాణ ప్రసారము వీరి వలననే జరుగును గనుక వీరిని 'ఊష్మపులు' అందురు.

వీరు గాక కాలమును విభజించునట్టి మరియొక దేవగణమున్నది. వీరి ప్రభావముననే శ్వాస యందును, హృదయ స్పందనము నందును కాల విభాగ క్రమమేర్పడుచున్నది. మరియు అహోరాత్రములు, పక్షములు మున్నగు కాల విభాగములు, గ్రహ గమనముల యందలి వేగములు నిర్ణీత క్రమమున జరుగుచున్నవి. వీరి వలననే తాళము, లయ, ఛందస్సు అనువాని జ్ఞాన మేర్పడి సంగీత విద్య సాధింపబడుచున్నది. వీరిని 'గంధర్వు' లందురు.

దేహ విభాగము లేర్పడక ముందు పెద్ద పెద్ద విభాగములుగా ప్రజ్ఞలు మేల్కొని ఈ భూమి చుట్టును మహా శరీరములు ధరించిన జీవులుగా ఈ విభాగములు మెలగుచుండును. వీనినే 'యక్షము' అందురు. నర సంచారము లేని అరణ్యములలో, పర్వతముల లోయలలో నొక్కొక్క ప్రదేశ మొక్కొక్క యక్షునితో నిండియుండును. అందున్న చెట్లు, క్రిమికీటకాదులును ఆ యక్షుని వివిధ దేహములుగా పనిచేయుచు తిరుగుచుండును.

ఇట్లు నానా విధములైన దేవగణములు, యక్ష, గంధర్వాదులు ఈ విశ్వరూప దేహమున భాగములై మెదలుచుండుట అర్జునునకు దర్శన మిచ్చెను.

అందు కొందరు ఈ విశ్వరూపమును గమనించి యాశ్చర్య పడుచున్నారు. ఇందెవ్వరికిని ఈ మొత్తము రూపము అంతుపట్టక పోవుటయే ఆశ్చర్య కారణ మగుచున్నది. (22)

ఆ రూపమును చూచి అర్జును డిట్లు ప్రార్థించెను : ఈ నీ రూపము పెద్దది యని మాత్రము చెప్పగలను. ఎంత పెద్దదో, దేనికన్న పెద్దదో ఎవ్వరును చెప్పలేరు. (ఎవడు చూచినను తాను చూచిన వానికన్న పెద్దది యుండును.) ఇన్ని తలలు, ఇన్ని కన్నులు, ఇన్ని ముఖములు, ఇన్ని బాహువులు, పాదములు, ఉదరములు కలవని ఎవరు చెప్పగలరు? (విశ్వము నందున్న తలలు మున్నగున వన్నియు దానికి సంబంధించినవే యని తెలిసినప్పు డెవ్వడును చెప్పలేడు. ఉన్నవాని మొత్తము సంఖ్యయే గాక, జరిగిపోయిన, జరుగబోవు సృష్టి యందలి విశ్వముల సంఖ్య కూడ నున్నది కదా! వానిని లెక్కించుట ఎట్లు సాధ్యము?) అందు కొన్ని ముఖములు కోరలతో భయంకరముగా నున్నవి. (అడవి పందులు, పులులు, సింహములు, మొసళ్ళు, పాములు మున్నగు రూపము లన్నియు కోరలతో భయంకరముగా నుండును.) ఈ రూపములను చూచుకొని ఈ జీవులు పరస్పరము భయపడి కేకలు పెట్టుచున్నవి. (ఒక జంతువు మరియొక జంతువును తినుటకు నోరు తెరచినపుడు భయపడి కేకలు పెట్టుచున్న జంతువుల రూపములతో కూడిన మొత్తమే విశ్వరూపము.) నేనును ఈ దృశ్యమును చూచి భయము చెందుచున్నాను. (23)

భూమ్యాకాశములు స్పృశించునట్లుగా, నోరు తెరచియున్న రూపము భయమును కొల్పుచున్నది. (భూమి, ఆకాశము ఈ విశ్వరూపముయొక్క పెదవులు. వాని నడుమనే సమస్త విశ్వమును పుట్టి మరల జీర్ణించుకొనిపోవు చుండును.) అతి దీప్తములై విశాలములైన నేత్రములతో నిండి రంగు రంగులుగా కనుపించుచున్నదీ విశ్వరూపము. (అనేక సూర్య మండలములు, గ్రహ తారాదులు వెలుగులను పుట్టించును. కనుక నవి ఈ రూపము యొక్క కన్నులు. వాని నుండి ఏర్పడినవే జీవుల కన్నులు. కనుకనే కన్నులు వెలుగులను చూడగలవు. దానితో వెలిగింపబడిన వస్తువుల రూపములను చూడగలవు.) సూర్యోదయ సూర్యాస్తమయాదులతో రంగులు రంగులుగా నేర్పడుచున్నదీ విశ్వరూపము. ఇట్టి రూపమును చూచి మిక్కిలి వ్యధ చెందినవాడనై ధైర్యమును,

శాంతినిగూడ కోల్పోవుచున్నాను. (సృష్టిలోని పరస్పర వ్యతిరేక లక్షణము లన్నియు నొక్కమారుగా కనుపించుట జరిగినచో మనస్సు తల్లడిల్లిపోవును.) (24)

ఈ లోకమున మన కిష్టమున్న వస్తువులును, ఇష్టము లేని వస్తువులును కూడ నున్నవి. పులులు, సింహములు మొదలగు కోరలతో గోళ్ళతో కూడిన జంతువులున్నవి. కోరలయందు విషము కలిగిన త్రాచులు, తోకయందు విషము కలిగిన తేళ్ళు మొదలగునవి కూడ కలవు. ఫల వృక్షములతోపాటు విష వృక్షములు, ముండ్ల చెట్లును గలవు. భగవంతుడు వాని నేల సృష్టింపవలెను? మనకు బాధాకరముగా నున్న జంతువులను సృష్టి చేయుటలో భగవంతునికి గల సంతోషమేమి అనిపించును. అంతేకాని ఆ జీవులు కూడ భగవంతుని సృష్టిలోనివే, వానియందును భగవంతుడున్నాడని తెలియుటకు కొన్ని జన్మలు పట్టవచ్చును. పెద్దలు చెప్పిరి గదా యని గ్రుడ్డిగా నమ్మవచ్చును గాని తెలియుట మాత్రము సులభము కాదు. తెలియక ముందు నమ్మినను ఆ నమ్మకము నిలబడదు. మన దృష్టికి పులులు మున్నగునవి క్రూర జంతువులవలె కన్పించును. ఆ జంతువులకు మనముకూడ అట్లే కనిపించు చున్నామని తెలియవలెను. మనము వానిని వేటాడుచున్నాము గదా? బోనులలో పెట్టి సర్కసులందును, జంతు ప్రదర్శనశాలలోను మనము ఇష్టము వచ్చినట్లు ప్రదర్శన చేసి బంధించి వాని స్వేచ్ఛను హరించుచున్నాము. కనుక ఆ జంతువులకు మనము క్రూర జంతువులమని అనిపించును. మనకున్నట్లుగనే ఆ జంతువులకు గూడ భార్య బిడ్డలు, ప్రేమ ఉండును గదా? వానిని హరించుచున్నపుడు మనముగూడ క్రూర జంతువులమే. మనము పెట్టుకొన్న సంబంధమును బట్టి ఒకరికొకరము అట్లు కనిపించుచున్నాము. ఈ సంబంధములను దాటి చూచినచో అందరము జీవులమే. అందరు జీవులలో ఒకే దేవుడున్నాడు. ఆ జంతువులను మనము కాని, మనలను ఆ జంతువులు కాని, వేటాడి చంపుట భయమువలన కలుగు చున్నది. అది దాటి చూచినచో యీ కోరలు గల జంతువుల ముఖము లన్నియును విశ్వము నందలి ఒకే దేవుని ముఖముల రూపములు. అనగా విశ్వరూపుని ముఖములు. అట్టి దృష్టి ప్రసాదింపబడిన అర్జునుడు, "నీ భయంకర ముఖములను చూచుచున్నాను. కాలాగ్నివలె కనుపించుచున్న యీ కోరలతో కూడిన ముఖములు గల జంతువులను చూచుచు దిక్కు తెలియకున్నాను.

శాంతి లభించుటలేదు. ఈ జగత్తుగా నివసించుచున్న నీ రూపములను గమనించుటలో నాకు శాంతిని కలుగజేసి నా యందు ప్రసన్నుడవగుము.'' అని విశ్వరూపమును స్తుతించు చున్నాడు. ఈ రూపములు కాలాగ్నితో సమాన మైనవి. అనగా తగు విధమున ప్రవర్తింపక పోయినచో జీవులకు మృత్యువును కలుగజేయుచున్నవని అర్థము. ఆ జంతువు లున్న చోటికి మనము పోనేల? భయపడి వానిని వేటాడి చంపనేల? ఎవరుండ వలసిన తావున వారుండ వచ్చును గదా? కర్తవ్యమును దాటిన పను లేల చేయవలెను? చేసినచో దేహము లకు మృత్యువు తప్పదు. కాలానలము అనగా కాలాగ్ని. కాలమే అగ్నివలె పని చేయుచున్నది. అనగా జననము, మరణము మున్నగువానికి ఉపకరణ మగు చున్నది. దిక్కులు తెలియలేకున్నాను అనగా మానవుడు ఎటు పోవలెనో, ఎటు పోరాదో, ఏది చేయవలెనో, ఏది చేయరాదో ? తెలియలేకున్నాడు. భగవంతుని అనుగ్రహము కలిగినపుడు మాత్రమే ఈ జ్ఞానము మనకు తట్టునని అర్థము. (25)

మనము పుట్టినప్పటి నుండి కాలమే మన జీవితముగా అర్థము చేసికొన బడుచున్నది. అంతకు ముందు కూడ కాల మున్నది. కుండ చేసిన వెనుక, అంతకు ముందున్న చోటే కుండలో కూడ నున్నట్లు, కాలమే మన ఆయువుగా నున్నది. అందు మనము చేయుచున్న పనులను బట్టి జరుగబోవు సన్నివేశము లేర్పడుచున్నవి. తన సంపాదనము ఖర్చుపెట్టి బిడ్డలను పోషించి రక్షించి సద్బుద్ధి కలిగించు విద్య నేర్పించినచో, ఆ బిడ్డలే మనకు వార్థక్యమున రక్షణ నిచ్చు వారగుచున్నారు. బాధ్యత లేకుండ తప్పించుకొని తిరిగినచో ఆ బిడ్డలే మనలను విడచి ఇంగ్లాండు, అమెరికా మున్నగు దేశములకు పోయి స్థిరపడుచున్నారు. వార్థక్యమున దిక్కులేని చావు పొందువారు కలరు. ఇట్లే మనము చేయు పనులను బట్టి రాబోవు సన్నివేశములు నిర్ణయమగుచున్నవి. ఇతరులు మనలను చంపునట్టి పద్ధతిలో ప్రవర్తించినచో కొంత కాలమునకు ఇతరులు చంపు చున్నారు. ఆ పనులు చేయుటలోనే మనము చనిపోవుట, దాని విధానము నిర్ణయమగుచున్నది. ధృతరాష్ట్రుని పుత్రులు మాయజూదము, విషాన్నము పెట్టుట, యుద్ధమునకు సిద్ధపడుట మున్నగు పనులు చేసినపుడే, తమ మృత్యువు యొక్క విధానమును నిర్ణయించుకొనినారు. ఫలితము కలుగు లోపున,

భౌతికముగా బ్రతికియున్నను, నిర్ణయమున చనిపోయినవారి క్రిందనే లెక్క. వారికి సహాయముగా వచ్చిన మిగిలిన రాజులందరు గూడ ఇంతకు ముందే చనిపోయినవారు. అనగా నిర్ణయ మనబడు ద్వారములోనికి ప్రవేశించినవారు. ఆ ద్వారము కూడ విశ్వరూపుని ముఖములలో నొకటి. ఆ ముఖ మందలి భయంకరమైన కోరలలో చిక్కుకొని పోవుచున్నారు. కొందరి తలలు చితికి యుద్ధమున పిండి యగుచున్నవి. అట్టి దృశ్యమును చూచు చున్నానని అర్జునుడు స్తుతించుచున్నాడు. కాలమున కతీతమైన విశ్వరూపమును చూడగలిగినచో మనము చేయుచున్న పనులేకాక, నిర్ణయింపబడిన ఫలితములు గూడ కన్నులకు కట్టినట్లు కన్పించును. **(26, 27)**

ప్రతి వ్యక్తికిని తన స్వభావ ముండును. అదియే పనిచేయుచుండును గాని, వాని తెలివితేటలు, నేర్చిన మంచి విషయములు పనిచేయవు. మంచి స్వభావ మేర్పడినవానికి అతడు నేర్చిన చెడ్డ విషయములు వానిపై పనిచేయవు. రామాయణము చదువుకొనినపుడు మంచి స్వభావము కలవానికి, "రాముని వలె ప్రవర్తింపవలెను. రావణుని వలె ప్రవర్తింపరాదు." అని తెలియును. చెడ్డవానికి, "రావణుడు సీతను అపహరించెను గదా! ఏ కాలములోనైనను ఇట్టి ప్రవర్తనమున్నది. మనమును చేసిన తప్పేమి?" అనిపించును. ~~ఈ~~ విధముగా స్వభావమును బట్టి మంచి చెడ్డలు వర్తించునేగాని, మనము నేర్చిన మంచి విషయముల ననుసరించి ప్రవర్తనము మారదు. ఇష్టమున్నను లేకున్నను ధర్మ మార్గమున ప్రవర్తించుట సాధన చేసినచో, స్వభావము మారి, మంచి స్వభావ మేర్పడి, దాని ప్రకారము ప్రవర్తించుట జరుగును. అట్టి ధర్మసాధనము చేయనివారి స్వభావమే ఒక మహా ప్రవాహమువలె ఇష్టాయిష్టముల నేర్పరచి పనులను చేయించును. ప్రవాహమున కొట్టుకొని పోవుచున్నవాడు నిలదొక్కు కొని ఆత్మరక్షణ చేసికొనుట సాధ్యము కాదు. మంచి చెడ్డల స్వభావములు మహా ప్రవాహములై నదులవలె ప్రవహించుచుండును. అందు జీవులు తమకు తోచిన పనులు చేయుచు కొట్టుకొని పోవుచుందురు. అనేక నదుల వేగము సముద్రము వైపునకు ఆ నదులను ప్రవహింప చేయుచున్నది. అట్లే కురు పాండవుల స్వభావముల వేగము లన్నియు కలసి మహా నదులవలె మృత్యువు వైపునకు ప్రవహించుచున్నవి. మృత్యువు సముద్రము వంటిది. నది ప్రవహించి

సముద్రమున కలసినంతనే, సముద్ర ముండును గాని అది యుండదు. అట్టిదే మృత్యువు. కనుక విశ్వరూపమున అర్జుననకు ఈ దృశ్యము కన్పించినది. నదులు ప్రవహించుచు వచ్చి సముద్రమునందు మాయ మగుచున్నట్లు, యీ నరలోక వీరులందరు విశ్వరూపుని ముఖములలో ప్రవేశించుచున్నారు. **(28)**

పై జెప్పిన స్వభావము ననుసరించి నచ్చిన విషయములు, నచ్చని విషయములు నేర్పడును. నచ్చినవాని వైపునకు జీవు డాకర్షింపబడును. వినాశము కలిగించుకొను స్వభావ మేర్పడినవాడు వినాశకరములైన విషయము లచే నాకర్షింపబడును. కౌరవులు రాజ్యలోభముచే నాకర్షింపబడిరి. దానితో యుద్ధము వైపునకు ఆకర్షింపబడిరి. రాత్రులందు దీపపు పురుగులు, కొన్ని మిడుతలు దీపము వైపున కాకర్షింపబడును. కోరి మంటలలో ప్రవేశించి భస్మమగును. అట్లే కౌరవులు మహా వేగముతో విశ్వరూపుని నోళ్ళలోనికి ఆకర్షింపబడినవారై చనిపోవుచున్నారు. **(29)**

## కాలాగ్ని స్వరూపుడు :

పెద్ద అగ్ని ప్రమాదము జరుగుచున్న దృశ్యము, చూచుటకు చాల భయంకరముగా నుండును. ఒక్కొక్క పెద్ద మంట గాలి విసురుకు అటునుండి ఇటు దూసుకొని పోవుసరికి ఆ ప్రదేశములో అంతకు ముందున్న వస్తువులు కొన్ని మంటలలో కలసి మాయమైపోవును. మంటకు ముందున్న వస్తువులు మంట తరువాత ఉండవు. మంటలు నాలుకతో వానిని నాకి చప్పరించు చున్నట్లుగా కనిపించును. అట్లే తిన్నగా గమనించినచో కాలము కూడ పని చేయుచుండును. చిన్నప్పుడు కనిపించిన కొందరు వ్యక్తులు, కొన్ని చెట్లు, ఊళ్ళు, ఆకారములు మున్నగునవి మనము పెద్దవారమై తిరిగి చూచుసరికి మాయమగుట జరుగుచున్నది. కొన్ని కొండలు త్రవ్వబడి యుండును. నదుల ఆకారములు మారును. స్థలమున్నచోట చెరువు లుండును. చెరువు లుండిన చోట ఇండ్లు కట్టబడును. దేవాలయ మున్నచోట దుకాణములు కట్టబడి యుండును. ఇదియే కాల మహిమ. వస్తువులను, వ్యక్తులను చూచి, పేర్లను ఆకారములను గుర్తుపెట్టుకొని వానితో సంబంధ మేర్పరచుకొని వ్యామోహమున

చిక్కుకొన్నవారికి ఈ కాలము కనిపించదు. గభాలున దుఃఖ దృశ్యములు ముంచెత్తుచు కాలక్రమమున తన ఉనికిని గూడ ముంచెత్తును. భూత భవిష్యద్వర్తమానములు ఒకే దృశ్యముగా చూడగలిగినచో ఈ కాలము యొక్క స్వరూపము దర్శనమిచ్చును. అదియే భగవంతుని విశ్వరూపము. దానిని చూడగల దృష్టియే దివ్యదృష్టి. అది ప్రసాదింపబడిన అర్జుననకు లోకము లెట్లు కనిపించుచున్నవో ఇట్లు వర్ణించుచున్నాడు.

"ఈ లోకము లన్నిటికి అంతముగా నీవుండి, నాకి మ్రింగివేయు చున్నావు. ఈ లోకములే నీ తెరచిన నోళ్ళుగా మండుచు కనుపించు చున్నవి. వెలుగులతో సమస్తమును నింపినపుడు నీ వెలుగే మిగులుచున్నది గాని, ఆ సమస్తమునందు ఏదియు మిగులుట లేదు. నీ వెవ్వరివో, నీ రూపము చూచుట కింత దుస్సహముగా ఎందుకున్నదో తెలుపుము. నీ ఆది తత్త్వమును వీలైనచో వివరింపుము. నీ ప్రస్తుత వర్తమాన తత్త్వమునే గ్రహింప లేకున్నాను. అందలి ప్రవర్తనమే బోధపడుట లేదు. ఇక నీ వేమి బోధ పడుదువు? కనుక నీవే వివరింపుము."

ఇట్లనుటలో నిత్యము కాలమును ప్రత్యక్షముగ అనుభవించుటయు, దానిని చూడలేక పోవుటయు చెప్పబడినది. పని ప్రారంభించినవాడు కాలమునే ఆది అనును. పనిని పూర్తి చేయుచున్నవాడు అదే కాలమును అంతము అనును. ఒకడు పుట్టినపుడు అది అతడు పుట్టిన కాలమందురు. పోయినపుడు పోయిన కాలమందురు. అంతర్యామి యొక్క కాల స్వరూపము పడవల క్రింద నీరువలె ఒక్కొక్కనికి ఒక్కొక్క విధముగా కనుపించుచున్నది. అది వాని దృష్టిని బట్టి. దానినే కంటికి జబ్బు అందుము. తనకు వానితోగల సంబంధములను గుర్తు పెట్టుకొను వానికి విశ్వరూప దర్శనము లేదు. లేనపుడు విశ్వమే కనిపించును. అందలి రూపములే కనిపించును. తప్పేమి అనవచ్చును. తప్పేమియు లేదుగాని దాని వలన దుఃఖము, దిగులు, భయము అనుభవ మగును. కనుక మనస్సు దానినుండి తప్పించుకొని మరియొక దానిని చూడ గోరును. మరియొక దానికి కూడ ఈ లోపము లన్నియును ఉన్నవి. కనుక మరియొక దానిని వెదకి వెదకి విసిగి, చివరికిది మార్గము కాదని అనుభవమున గ్రహించి, మొత్తము నర్థము చేసికొనుటకు యత్నించును. ఇదియే అంతర్యామి

కోసము జీవుడు పడునట్టి వేదన. తత్ఫలితముగ కావలసిన దర్శనము లభించును. ప్రస్తుతము అర్జునునకు తన బుద్ధి తెలిసినప్పటి నుండి ఇప్పటి వరకు దుర్యోధనాదులు, తాను, పాండవులు, తన పరివారము జీవించిన జీవితములు కన్నులకు కట్టినవి. తత్ఫలితముగ యుద్ధ సన్నాహము కనిపించినది. కురుక్షేత్ర మైదానము యుద్ధభూమిగ అవతరించినది. రాబోవు దినములలో వీరందరును మాయమగుదురు. ఇట్లు అంతర్యామి నుండి పుట్టుక అను ముఖమున దిగి వచ్చినవారు 'నాశము' అను ముఖమున ప్రవేశించు చున్నారు. ఇది తప్పనిసరియైనచో అంతర్యామియొక్క ఈ రూపము పేరేమి? అని అర్జునుడు అడుగుచున్నాడు. దానికి సమాధానముగా ఆ మొత్తము రూపమే తన చేష్టల భాషలలో ఇట్లు సమాధాన మిచ్చుచున్నది. **(30, 31)**

"నేను నా కాల స్వరూపమూర్తిని. ఇప్పటి లోకమును నశింపజేయుటకై పెచ్చు పెరిగితిని. కారణ మేమనగా ప్రస్తుత కర్తవ్యము ఈ రూపములను హరించుటయే! నీ కెదుటి సైన్యమున నిలబడియున్న యోధు లందరిని నీవు చంపబోవుచుంటినని అనుకొనుచున్నావు. నీవు మానినచో వీరెవ్వరును రక్షింపబడరు. ఎవ్వరును శాశ్వతముగా ఉండిపోరు. దుఃఖించుట మాని నీవు చేయవలసిన పనిని నోరు మూసికొని చేయుట అనుకూలమైన పద్ధతి. లేనిచో అదే ఫలితము ఇష్టము లేని పద్ధతిలో జరుగును."

"ఎవ్వడైనను పుట్టుట, చచ్చుట ఇంకొకని వలన కాదు. పుట్టుట తల్లి దండ్రుల మూలమున కావచ్చును గాని, పుట్టించు శక్తి తల్లిదండ్రులది కాదు. వారి నావేశించియున్న ప్రకృతి శక్తులకు సంబంధించినది. అట్లే ఒకరిచేత ఇంకొకరు చంపబడవచ్చునుగాని చచ్చుట వారివలన కాదు. వారికి కోపము తెప్పించు కారణము చంపబడువాని నుండియే ప్రవర్తనముగా వెలువడు చున్నది. యుద్ధము కౌరవాదుల ప్రవర్తనము కారణముగా సిద్ధించినది. ఈ ప్రవర్తనము వారి నావేశించిన కామక్రోధాది స్వభావముల వలన ఏర్పడినదే గాని, వారి చేతిలోనిది కాదు. రైలుక్రింద పడి చచ్చినవానిని రైలు చంపినదని అనలేము గదా! ఇట్లే అన్ని కారణములును ప్రకృతి నుండి అలలుగా లేచు చున్నవి. ప్రకృతి భగవంతునియందు వర్తించుచున్నది. అతని స్వరూపము లన్నిటిలో కాలము పెద్దది."

"కనుక శత్రువులను చంపి రాజ్యము ననుభవించుట నీ కర్తవ్యము. వీరిని చంపితివని, యుద్ధమున జయించితివని కీర్తి గడించుకొనుట నీ కర్తవ్యము. వీ రిదివరకే తమ ప్రవర్తనము రూపమున నాచేత చంపబడినారు. ఇట్టి ప్రవర్తనము కలిగినచోట నెవడైనను చంపును. ఎవడనునది నిమిత్త మాత్రమే! ప్రస్తుతము ఇది నీకు సంబంధించినది గనుక నీవే నిమిత్తము." (32, 33)

ఈ నీ యెదుట కనిపించుచున్న ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు మొదలగు మహావీరులు గాని, మరి ఎవ్వడు గాని తాను చేసిన పనికి ఫలితమే తన జీవితముగ జీవించువారు. సంకల్పము ననుసరించి పనిచేయుట, చేసిన పని ననుసరించి దానివెంట తన జీవిత సన్నివేశము లేర్పడుట అనునవి సంసార మనబడును. కొందరి జీవితము దీనికన్న వేరుగా నడచును. వారు తమకు తోచిన పనులు చేయుట మానుదురు. అప్పటినుండి వారు చేయవలసిన పనులు మాత్రమే వారి కేర్పడుచుండును. దాని ననుసరించి ఏర్పడు జీవితము తాము సృష్టించుకొన్నది గాక సృష్టికి సంబంధించినది అగును. వారిని ముక్త జీవు లందురు. ధర్మరాజు అట్టివాడు. వారికి కష్టమని గాని, సుఖమని గాని ఉండదు. ఇష్టము గాని, ఇష్టము లేకుండుట గాని ఉండదు. పాండవులను చిన్నతనమున శతశృంగ పర్వతము నుండి పెద్దలైన పరమగురువులు వెంట పెట్టుకొని వచ్చి ధృతరాష్ట్రునకు అప్పచెప్పిరి. అంతేకాని పాండవులు రాజ్యకాంక్షతో రాలేదు. అప్పటినుండి ధృతరాష్ట్రాదులు నిమిత్తముగా పరిస్థితులు నెట్టుకొనివచ్చి యుధిష్ఠిరుని జీవితమున ప్రతి సన్నివేశమును ఇట్లే జరిగిపోయెను.

ఇక దుర్యోధనుడు అట్టివాడు కాడు. చిన్నప్పటినుండి రాజ్యము తనకే రావలెనని రోషపడి తన జీవిత సన్నివేశములను తానే సృష్టించుకొనెను. ఆ మార్గము ధృతరాష్ట్రునకు సమ్మతమగుటచే తన జీవితమును తానే సృష్టించు కొనెను. వానిని కాదనలేక దోహదము చేయుటచేత భీష్మాదులు ఎంత మహానుభావులైనను తమ జీవిత సన్నివేశములను తామే సృష్టించుకొనిరి. ఇందరికిని గల అభిప్రాయములే విత్తనములుగా ఆచరణ స్వరూపమైన సన్నివేశముల మహావృక్షము పెరిగి ఊడలు దిగినది. దాని చివర పండిన పండు మహాభారత యుద్ధము. యుధిష్ఠిరునకు యుద్ధము తన గుమ్మము లోనికి వచ్చిన కర్తవ్యమే గాని కర్మఫలము గాదు. కాలము భగవత్ స్వరూపము.

అందు తమ కర్మఫలముల రూపమున తమ మృత్యువును భీష్మాదులు తామే కల్పించుకొనిరి. కనుక వారిదివరకే చనిపోయినవారు. వారు చేసిన పనికి భౌతికముగా నెవడు చంపినను నొకటియే. అనగా చచ్చినవానిని భౌతికముగా చంపుట. చనిపోయిన వాని దేహమును కొన్ని గంటల తర్వాత దహనము చేయుట చంపుట ఎట్లుకాదో, అట్లే ధర్మస్వరూపమైన కర్తవ్యమున భీష్మాదులను భౌతికముగా చంపుట, చంపుట కాదు. కనుకనే, "నేను కాల స్వరూపుడనై ఈ కర్మ జీవుల లోకమును హరించుటకు నోరు తెరచితిని. నేను చంపినవారిని భౌతికముగా జయించుట కేడ్చుచున్నావేమి? మాటాడక యుద్ధము చేసి, శత్రువులను యుద్ధమున జయించితినని పేరు పొందుము" అని హెచ్చరించెను. **(34)**

ఈ పలుకులు విని అర్జునుడు గడ గడ వణకిపోయెను. ఒక ప్రక్క తన బంధువులందరు తప్పుదారిలో పడి చనిపోవుచున్నారని బాధ. (తాను వారిని శాసింపలేడు గనుక ఈ బాధ మమకారమేగాని సత్యము కాదు.) సత్యమును తటాలున గ్రహించినపుడు పరిస్థితుల నెదుర్కొనవలసిన బాధ యొకటి. కాలము యొక్క స్వరూపమున మంచి చెడ్డలన్నియు వేర్వేరు శిరస్సులుగా కనుపించు నట్టి విశ్వరూపము యొక్క ఘోరాకారము వలన కలిగిన బాధ మరియొకటి. ఈ మూడింటితో అర్జునుడు వణకిపోయెను. గద్గద కంఠముతో అతడు మరల నిట్లనెను. **(35)**

"ఈ లోకము నీ యంతర్యామిత్వముచేత సంతోషము పొందుచున్నది. నీ అస్తిత్వము చేతనే ఒకరియం దొకరు అనురాగముతో మెలగు చున్నారు. రాక్షస ధర్మములు కలవారు మాత్రము భయ కారణములను కల్పించుకొని, నీ భీకరమైన కాల స్వరూపమును జూచి నలు దెసలకు పారిపోవుచున్నారు. (అప్పులు చేసినవాడు అప్పులవారి నుండి పారిపోవును. అంతకు ముందు వారు అప్పులవారు కారు. వారినుండి పారిపోవలసిన భయమును తానే కల్పించు కొనుచున్నాడు. ఇట్లే సంసారబద్ధు లందరును.) ఇన్ని విధములవారును ఇన్ని విధములుగా ప్రవర్తించుట గమనించినవారు మహాసిద్ధులు. వారు నీకు భక్తితో నమస్కరించి నిశ్చలులుగా నున్నారు. అందరును కాలము నుండి పుట్టి, అందు జీవించి, అందే లయమగు చున్నారు. కనుక కాల స్వరూపుడవగు నిన్ను

దర్శింపలేరు. నీవందరికిని ఆద్యంతములై యున్నావు. బ్రహ్మ కూడ మేలుకొని చూచినపుడు వాని కిది కాలముగా నీ వంతకుముందే యున్నావు. నీవు క్షరము లేనివాడవై అన్నిటిలోను అక్షరమగు ప్రణవముగా, ప్రాణస్వరూపమైన అంతర్యామిగా, శ్వాసగా నున్నావు. అందుండి అక్షరములు పుట్టినట్లు జీవులు పుట్టుచున్నారు. అక్షరములతో పదము లేర్పడినట్లు గుంపులు గుంపులుగా చేరుచున్నారు. పదములతో వాక్యము లేర్పడినట్లు కర్త, కర్మ, క్రియలుగా సంసారమున చిక్కుకొనుచున్నారు. వాక్యములకు తాత్పర్యములు చెప్పుకొని నట్లు తమ తమ జీవితము లేర్పరచుకొనుచున్నారు. ఇట్లు నీవు అక్షర స్వరూపుడవు. మేముండుట, లేకుండుట అను రెండింటికిని పైనున్న శాశ్వత స్వరూపుడవు. అట్లయి యుండి కూడ ఈ జగత్తునందే జీవులుగా నివసించు చున్నావు. జగత్తునకు నివాసమై యున్నావు. **(36, 37)**

నీ నుండి జీవులు దేహములను ధరించి పుట్టుచు, చచ్చుచున్నను నీవు వారియందు పుట్టక, పోవక అట్లే యున్నావు. కనుకనే పురుషులలో పురాణ పురుషుడవు. ఈ జీవులలో నెవ్వ రే యాశలు, ఆశయములు కల్పించుకొన్నను, వాని రూపమై నీవే యుండి వారు కోరిన ఆశయముల రూపమున నెవరికి కావలసినట్లు వారికి ప్రత్యక్షమగుచున్నావు. ఈ జగత్తునకు దాచబడిన ధనముగా నుండి కొలవబడుచున్నావు. ఎవడు దీనిని తెలిసికొన్నను నీవే. తెలిసికొను వాడవు గూడ నీవే. చెట్టునుండి రెండు కొమ్మలు పుట్టినట్లు, తెలిసికొనువాడు, తెలిసికొనబడునది అని రెండుగా వ్యక్తమగుచున్నావు. ఈ సమస్తము నీ చేతనే నిండియున్నది. ఈ వాయువు ఆకాశమున పుట్టుచున్నది. ఆకాశము నీ దేహమే కనుక వాయువు నీ స్వరూపములలో నొకటి. అట్లే జీవులను యమించునట్టి దేవతయగు యముడును, అగ్నియును, జల స్వరూపుడైన వరుణుడును నీ నుండి పుట్టిన రూపములే గాని వేరు కాదు. అట్లే చంద్రుడు మున్నగు మిగిలిన రూపములును. ఈ వేనవేలు రూపములలో నెవనికి నమస్కరించినను నీకే చెందును. కనుక నీకే వేనవేలు నమస్కారములు చేసెదను. మరల మరల చేయుచుండు నమస్కారములు కూడ నీకే యని గుర్తుంచుకొందును. నా ఎదుట గల సమస్తమును నీ రూపములే. నా వెనుక నున్న సమస్తము నీ రూపములే. ఎదుట, వెనుక అనునవి గూడ నీ భావముల రూపములే! నా

ఎదుట, నా వెనుక నిలబడిన నీకు నమస్కారము. అన్ని దిక్కుల యందు నిలబడిన నీకు నమస్కారములు. నీ తేజస్సు అనంతము. నీ పరాక్రమము అమితము. సర్వమును పొందునట్టి వాడవుగను. సర్వముచేత పొందబడునట్టి దైవముగను గూడ నీవే యున్నావు.'' (38-40)

**కనువిప్పు :**

దేవుని దర్శింపవలెనని కుతూహలము చాలామంది కుండును. దేవుడున్నాడో లేడో తెలిసికొను కుతూహలము కొందరికుండును. దేవుడు లేడని ఋజువు చేయు కుతూహలము కొందరికుండును. ఇందరి అభిప్రాయములును గోపికలవలె దేవుని చుట్టును తిరుగక తప్పదు. ఉన్నాడని నమ్మువారికి కూడ లేడేమో యను సందేహము కలుగుచుండును. ఈ సందేహము కూడ స్మరణమే. ఆలయమున విగ్రహము దర్శించి పూజించువాడు కూడ యిదివట్టి విగ్రహమే నేమో యని సందేహపడు చుండును. జీవుని అంతర్యామిగా దేవు డున్నాడని తెలిసినవాడు గూడ నితరులతో వ్యవహరించునపుడు, "ఇతడు మిత్రుడు, ఇతడు శత్రువు, ఇతడు పుత్రుడు'' అను నభిప్రాయములతో వ్యవహరించు చుండును. అట్లు వ్యవహరించు చున్నంత కాలము మిత్రుడు, శత్రువు, పుత్రుడు మున్నగువారే యుందురు గాని దేవు డుండడు. అట్లే అర్జునుడు గూడ కృష్ణుని గూర్చి సఖుడుగా భావించుచునే వయస్సు మళ్ళించుకొనెను. "ఓ కృష్ణా! ఓ యాదవా!'' అని బావమరిదిగా పరిహాసములు చేయుచునే అతడు జీవితమును గడిపెను. కృష్ణుడు గూడ అర్జునుని అట్లే గడుపనిచ్చెను. కాదు, కూడదు, నేను దేవుడను అని నిర్బంధింపలేదు. అర్జునుడు శరణాగతి చెందిన వెనుక కృష్ణుడు తన విశ్వరూపమును చూపుట యనగా మంత్రించి ఏవేవో చూపించుట గాదు. విశ్వమే తన రూపమను నభిప్రాయమునకు స్థిరత్వమును ప్రసాదించి, ఆ దృష్టితోనే చూచునట్లు కనువిప్పు చేయుట. ఈ కనువిప్పుతో చూచుచున్న అర్జునునకు కృష్ణుని దేహాదులు కనిపించు చున్నను ఆ దేహాదులే అతడు అను పొరబాటు లేదు. అంతర్యామియే యిన్ని రూపములతో కనిపించుచున్నా డనియు తన ననుగ్రహించుటకు యీ రూపముతో వచ్చెననియు గ్రహించెను.

ఈ కనువిప్పు కలిగిన అర్జునుడు యిట్లనుచున్నాడు : "అజ్ఞానముతో నీ వెవరో ఎరుగక ప్రవర్తించితిని. పొరపాటు లనేకములను చేసియుంటిని. పొరపాటుగా సంభాషణలు చేసియుంటిని. నీ యందున్న చనవుతో నేవేవో ప్రేలియుంటిని. చాల తడవలు నిన్నాటలు పట్టించితిని. అగౌరవముగా ప్రవర్తించితిని. మన మిద్దరము స్వేచ్ఛా విహారములు చేయుచున్నప్పుడు విశృంఖలముగా ప్రవర్తించితిని. శయనించినపుడు నీతో సమానముగా శయనించితిని. అట్లే ఉన్నతాసనముల యందును కూర్చుండి, మనవాడేలే అని లెక్కజేయక వ్యవహరించితిని. భోజన సమయములో చాల యపచారములు చేసితిని. (హేళనగా తా నరటిపండ్లు తిని తొక్కలు కృష్ణున కందించెనని కథలున్నవి.) ఇవన్నియు తెలియక చేసినవి కనుక అన్ని భావములను నేడు నీ దగ్గర పెట్టుచున్నాను. మంచి, చెడు సమస్తము స్వీకరించిన నిన్నేమని ప్రార్థింపగలను? క్షమింపుమని అడుగుట యొక్కటే చేయగలను. నీ వన్నిటికిని సమర్థుడవు గనుక క్షమించుటకు గూడ సమర్థుడవు. **(41, 42)**

ఎవ్వరికైన తండ్రియను భావము తన భౌతికమైన తండ్రిని మాత్రమే సూచించును. కాని తండ్రియు, తానును పుట్టుటకు కారణము నీ యంతర్యామి వైభవమే. నీ యందే అందరును పుట్టుచున్నారు. కనుక చరాచర జీవరాశులకు నీవే తండ్రివి.

ప్రతి సజ్జనునకు నొక గురువుండును. అట్లే ఆ గురువునకు గూడ నొక గురువుండును. ఇందరు గురువులుగా దిగివచ్చువాడే జగద్గురువు. అట్టి నీకు నమస్కరించుచున్నాను.

అంతర్యామిలో భాగములుగా అందర మున్నాము. ఈ భాగములలో నెవ్వడును అంతర్యామితో సమానుడు కాలేడుగదా! ఇంక నీకన్న నధికుడుండుట ఎట్లు సాధ్యము? మూడు లోకములు నీయందే యున్నవి గనుక నీవే మూడు లోకములకన్న నధికుడవు. దీనిని తెలిసి శిరస్సు వంచి దేహముతో నన్ను నీకు సమర్పణ చేయుచున్నాను. నీవు నాయెడల ప్రసన్నుడవు కావలెనని తప్ప మరియొక టేదియు కోరుటలేదు. మా హృదయములలో మేమున్నామని అనుకొంటిని. నీవున్నావని తెలిసిన వెనుక నిస్నీశ్వరుడుగా ధ్యానించెదను. ఇదివరకు చేసిన తప్పు లేమగునను భయము నాకు లేదు. కొడుకు తప్పులు

చేసి అటుపైన మంచివాడైన వెనుక, తండ్రి ఆ తప్పులను పట్టించుకొనునా? అట్లే నీవు నాకున్నావు. మిత్రుడు నన్ను తనవాడుగా నంగీకరించినప్పుడు తప్పులు పట్టునా? పట్టినచో మిత్రు డెట్లగును? అట్లే నీవు నాకు మిత్రుడుగా నున్నావు. ప్రేమించినవాడు ప్రియురాలి ప్రవర్తనమును దిద్దుకొనునుగాని తప్పులకు దెప్పునా? దెప్పినచో అతనిది ప్రేమ యెట్లగును? అట్లే నీవు నాకు ప్రియుడుగా నున్నావు. నేను చేసిన అపచారములను సమస్తమును సహించితివి. **(43, 44)**

సహించితివి గనుకనే ఎన్నడెరుగని ఈ విశ్వరూపమును దర్శించు దృష్టి నిచ్చితివి. ఇది నా యదృష్టము. అనగా నిదివరకు దృష్టము కాదు. ఎరుగని దానిని తెలియుటకు స్వప్రయత్నము చాలదు. ఎరిగినవాని యనుగ్రహము కావలెను. అది నీవు నా కిచ్చితివి. సంతోషమైనది. హృదయము నిండినది. కాని యింత విస్తారమైన, దేశ కాలముల హద్దులు లేని నీ రూపమునందు అనేక రూపము లున్నవి. ఒక్కమారుగా చూచి తట్టుకొనలేక పోవుచున్నాను. తట్టుకొను శక్తిగూడ నా ప్రజ్ఞకు లేదని బోధపడినది. భయముతో గజగజ వణకిపోవుచున్నాను. ఏమి చేసిన నేమగునో? ఏమి మాటాడిన ఏ మపచారమో? నేనీ రూపము నింక చూచుచుండలేను. వెనుకటి నీ రూపమును మాత్రమే చూచునట్టి దృష్టి నిమ్ము. మిగిలినదానిని దృక్పథము నుండి తొలగింపుము. నే నెరిగిన బావమరిదిగనే కనుపింపుము. నే నెరిగిన చేష్టలతో, చిరునవ్వుతో, కంఠధ్వనితో నా ముందు నిలబడుము. వెనుకటి కిరీటము, గద, చక్రము ధరించి కనిపించినచో చూడవలెనని యున్నది. ఈ వేనవేలు చేతులతో, శిరస్సులతో కనిపించు విశ్వరూప మిక చాలును.''

ఇంతకు ముందెరుగని అనుభవ మేదైన కలిగినచో ఎట్లుండును? ఎట్లుండునో చెప్పుటకు వీలు లేనట్లుండును. అనుభవ మేదైన పొందిన తరువాతనే ఎట్లున్నదో చెప్పగల్గుట. అంతకు ముందు కథలుగా ఎవరైన చెప్పినచో వినుటకు మాత్రము పనికివచ్చును. అర్జునునకు అంతకు ముందెరుగని అనుభూతియే విశ్వరూప సందర్శనము. మన మెరిగిన వారందరును ఒక్క మారుగా కనిపించినచో నెట్లుండును? కొన్ని మొగములు దుఃఖముతో, కోపముతో, ఈర్ష్యతో, భక్తితో, పరోపకారముతో, పరాపకారముతో కలగలుపుగా

కనిపించును. తనకు చిన్నప్పటి నుండి జరిగిన సన్నివేశముల దృశ్యములు అన్నియు నొకే క్షణమున కనిపించినచో నెట్లుండును? తన పెండ్లినాటి మొగము, జబ్బుపడిన నాటి మొగము, కొడుకు పుట్టిననాటి మొగము, అవమానము పొందిననాటి మొగము, మోసము చేయబడిననాటి మొగము మొదలుకొని కొన్ని లక్షల మొగములు ఏక కాలమున దర్శన మిచ్చును. ఇట్టి సన్నివేశములతో గూడిన తా నెరిగినవా రందరి మొగములు తనతోబాటుగా గలసి ఒకేమారు కనిపించినచో ఉక్కిరిబిక్కిరిగా నుండును. మానవు లందరు ఒకేమారు కనిపించినచో ఇంకను ఉక్కిరిబిక్కిరిగా నుండును. పశు పక్ష్యాదులు మున్నగు మిగిలిన జీవరాశు లన్నియు మనకు బోధపడి ఒకేమారు కనిపించినచో ఇక చెప్పనక్కరలేదు. అట్టి భూలోకమే గాక పదునాల్గు లోకములును ఒకే వ్యక్తి యొక్క దేహమందు ఏక కాలమున అర్జుననకు కనిపించెను. అదే విశ్వరూపము. అది అదృష్టపూర్వము. అనగా పూర్వము దృష్టము కాదు. అట్టి అనుభూతికి అర్జునుడు సంతోషపడెను కాని, చూడలేక భయముతో గడగడ వణకిపోయెను. సంతోషము, భయము మున్నగు భావము లన్నియు నొకే క్షణమున కలిగెను. ఇన్నిటిని మనస్సుతోనే చూడవలెను. ఇన్నిటికిని మనస్సు పట్టదు. తట్టుకొనలేక అర్జునుడు అన్ని వేల చేతులతో, తలలతో నున్న రూపము చాలుననెను. తా నెరిగిన వెనుకటి వ్యక్తిగత కృష్ణ రూపమునే మరల దర్శింపగోరెను.**(45, 46)**

అప్పుడు కృష్ణు డిట్లనెను : "నేను, తాను అనబడు వెలుగు తన దేహముననే యున్నట్లు ప్రతి వ్యక్తియు నెరుగును. ఇట్లందరిలో గల నేను, తాను అనబడు వాడు ఎంత పెద్దవాడో, హద్దులు దాటి ఎంతయుండునో అను వెలుగును నీకు చూపితిని. నా యందు ప్రేమ కలిగి నీవు కోరినావు. కోరిన వెంటనే చూపింపవలె ననిపించి చూపితిని. దీనినే పెద్దలు ఆత్మ యోగ మందురు. అందరిలో నేను, తాను ఎంత యుండునో, ఎట్లుండునో, అది ఎంత పెద్ద వెలుగో తెలియుటయే ఆత్మ యోగము. దానికి మొదలు, చివర ఉండదు. ఒకప్పుడు ప్రారంభమైనదని, ఒకప్పు డాగిపోవునని యుండదు. ఇది యెప్పుడును ఇట్లే జరుగుచుండును. నీ దృష్టికి మొదలదియే గాని, దానికి మొదలుండదు. నీకన్న ముందు దీనిని చూడవలెనని నన్నడిగినవాడు లేడు గనుక, నా వలన నిట్లు చూచినవాడు గూడ లేడు. **(47)**

వేదములు చదువువారు అందలి నన్ను చూడక వేదములను చూతురు. అట్లే యజ్ఞములు చేయువారు, దానములు, సత్కర్మలు చేయువారు, ఉగ్రతపస్సు చేయువారు కూడను. కనుక వారందరును వారు కోరిన రూపమునే, వారెరిగిన రూపముననే చూచుచున్నారు. నీ విప్పుడు చూచిన రూపమును వారు చూడలేరు. **(48)**

చూచి బాధపడకుము. చూచిన బాధకు మోహపడకుము. ఈ రూపము సంతోషకరమే గాక భయంకరము గూడ! నా రూపములలో అన్ని భావములు, అన్ని అనుభవములు తప్పవు. ఇదిగో మరల నీవు కోరిన రూపమునే చూడుము. భయము వదలి ఇదివరకున్న సంప్రీతితో మొగము పెట్టి చూడుము. **(49)**

అర్జునునితో ఇట్లు సల్లాపములు చేయుచు వాసుదేవుడు మరల తన పూర్వరూపము చూచునట్టి దృష్టికి వానిని గొనివచ్చెను. అప్పటి వాసుదేవుడు అన్ని రూపములతో వసించు ఘోరరూపముగల దేవుడు. ఇప్పటి వాసుదేవుడు వసుదేవుని కుమారుడు. తన సౌమ్యమైన చిరునవ్వుతో అర్జునుని హాస్య రూపమున ఊరడించెను. అప్పుడు అర్జును డిట్లనెను : ఈ సౌమ్యమైన నీ మనుష్య రూపము చూచి మరల నేను నా సహజస్థితి పొందితిని. నా తెలివి మరల నాకు కలిగినది. **(50, 51)**

ఈ పలుకులు విని మరల కృష్ణు డిట్లనెను : ఈ రూపమును చూడ వలెననియే అందరికుండును గాని, చూచి తట్టుకొనలేరు. చూడవలెనని కోరికయు, అమ్మో చూడలేమను భయము కలసి అనుభవమునకు వచ్చును. దేవతలందరు కూడ దీనిని చూడవలెనని అనుక్షణము తలచుచుందురు. తపస్సుచేత గాని, వేదాధ్యయనముచేత గాని, దానములచేత గాని ఇప్పుడు నీవు చూచినట్లు చూచుట సాధ్యము గాదు. భక్తి యొక్కటే దీనికి మార్గము. తాను వేరుగా, చూడబడు దృశ్యము వేరుగా జ్ఞప్తి యున్నచో అది భక్తి గాదు. చూడబడుదానిలో గూడ రెండవ వస్తువు కనబడినచో అది సాధ్యము గాదు. (ఒక చెట్టును చూడవలె నన్నచో అందలి ఆకులు, పువ్వులు, పండ్లు వేరు వేరుగా పరిశీలించువానికి సాధ్యము కాదు. చెట్టును గూర్చి పాఠము చదువుకొని అది చెట్టుకన్న వేరని గుర్తించినను లాభములేదు. చెట్టుగాని, పువ్వుగాని,

పండుగాని దానము చేయుచు దానము గుర్తున్నచో చెట్టు కనబడదు కదా! భార్యకు పువ్వులు కోసి తెచ్చియిచ్చువానికి పూలచెట్టు సౌందర్య మెట్లు తెలియును? అట్లే విశ్వములోని ఏ రూపమును వేరుగా చూచినను విశ్వరూపము కనపడదు.) వేరుగా కాకుండ మొత్త మొకటిగా చూడగలిగిన వానికి అన్నియు కనిపించును. (52)

పెద్ద చదువులు చదువుట, విజ్ఞాన మార్జించుట, దీక్షతో తపస్సు చేసి మంచి పనులు సాగించుట, ఇతరులకు దాన ధర్మాదులు చేయుట మొదలగునవి మంచి పనులే. ఆచరించదగినవే అయినను అంతమాత్రమున విశ్వరూప దర్శనము కలుగదు. దానముగాని, పరోపకారముగాని చేయు చున్నప్పుడు ఎవరి కుపకారము చేయుచున్నామో వారు మన దృష్టిలో నున్నంతవరకు వారి రూప దర్శనమే యగును గాని, విశ్వరూప దర్శనము గాదు. జ్ఞానమునకై శాస్త్రము లభ్యాసము చేయుచున్నప్పుడు శాస్త్రరూప దర్శనమే కలుగును. ఆదర్శములను అనుసరించి పనిచేయుచున్నప్పుడు ఆదర్శరూప దర్శనమే కలుగును. అట్లు కలుగుట మంచిదేకాని విశ్వరూప దర్శనము కలుగదు. కలుగక పోయినచో నష్టమేమి యని అడుగవచ్చును. ఉపకారము పొందినవాడు మన దృష్టిలో నున్నంతవరకు వానితో గల సంబంధ మేర్పడును. వాడు మనకు కృతజ్ఞుడై, విధేయుడై ఉండవలెనని కోరిక పుట్టును. ఉండనిచో దుఃఖము పుట్టును. అప్పుడు ఉపకార మితరునికి, తనకు దుఃఖము, ఈర్ష్య కలుగును. అట్లే ఆదర్శములు ఫలవంతములు కానిచో బాధ కలుగును. ఇట్లు మంచి పనులు చేయుట తప్పనిసరియై గూడ బాధనే ఫలితముగా పొంది జీవిత మనుభవించువా రున్నారు. వారే సంసారబద్ధులు. దీనినుండి విమోచనము కలుగవలెనన్నచో విశ్వరూప దర్శనము మొదటి సాధనము. ఎవరికి తా నుపకారము చేయుచున్నాడో వాడు భగవంతుని సృష్టిలోని ఒక రూపముగా గుర్తుండవలెను. ఏ శాస్త్రమును చదువుచున్నాడో అది భగవంతుని రూపమని తెలియవలెను. ఆదర్శములు భగవదాజ్ఞచే మనయందు బయలుదేరిన వనియు, వాని ఆచరణతోనే గాని, ఫలితములతో మనకు సంబంధము లేదనియు తెలియవలెను. ఫలితమును భగవదర్పణముగా చేయవలెను. అనగా నెగ్గుట, నెగ్గకపోవుట వానికి సంబంధించినవని తెలియవలెను. (53)

ఇట్టి సాధన వలన తన దృష్టిలో అంతర్యామి తప్ప అన్య వస్తువు లేకుండ పోవును. అదియే అనన్య స్థితి. దానికి భక్తి భావము కావలెను. అనన్య భక్తితో మాత్రమే విశ్వరూపుని దర్శనము సాధ్యమగును. అది ఈ విశ్వము నందే, విశ్వము రూపముననే యున్నది గనుక దానిని చూచు నేర్పరితనము కావలెను. చుట్టునున్న వ్యక్తులను, పరిసరములను, సన్నివేశములను చూచుటకే ఇంద్రియ ములు, మనస్సు ఏర్పడినది. అంతవరకే చూచినచో కనిపించునది విశ్వము యొక్క రూపము. అందొకరి కన్న నొకరు వేర్వేరు లక్షణములతో, స్వభావము లతో కనిపింతురు. ఎంతమందినని ఒక్కొక్కడు చూడగలడు? ఎంతమందితో వేర్వేరు సంబంధములు పెట్టుకొనగలడు? ఎంతమందితో సంబంధ మేర్పడునో అన్ని కథలు, అందు తన సుఖ దుఃఖములు ఏర్పడును. తానెన్ని సుఖ దుఃఖము లనుభవింప గలడు? ఇట్టి సంబంధములతోనే జనులు సతమతమై పోవుచుందురు. భార్యాబిడ్డలు, మిత్రులు, శత్రువులు అను సంబంధము లెన్నో ఏర్పడును. వీనితోగూడినదే విశ్వము. విశ్వములోని రూపములు చూచుచు, మంచి చెడ్డలను నిర్ణయించుకొనుచుండుటతోనే జీవితము తెల్లవారిపోవు చుండును. ఇక సుఖ శాంతు లెక్కడ? అవి పేర్లుగా మాత్రము మనస్సునం దెక్కడనో మిగిలిపోవును. సుఖశాంతుల కొర కనుకొని ఇందలి పనులు చక్క బెట్టుచు తీరుబడిలేక తానుండగా, తెల్లవారుచు, ప్రొద్దు గ్రుంకుచు వయస్సు చెల్లిపోవును. జీవితమంతయు సుఖశాంతుల కోసమని భ్రాంతియే గాని, సుఖ శాంతులు లభ్యము గాకయే పోవును. బహుమతి కోసము గుఱ్ఱపు పందెము లాడుచు నిర్ధనుడైపోయిన వానికి ధనమెంత సత్యమో, సంసారబద్ధునకు సుఖశాంతులంతే సత్యము. అనన్య భక్తిని దృష్టిలో పెట్టుకొని జీవితము సాధన చేసినచో ఈ విశ్వ మెవ్వని రూపమో అతని దర్శనమగును. దానితో సుఖ శాంతులు నిత్యసత్యము లగును. వానియందు దేహములు వచ్చుచు పోవు చుండును గాని, తనకు జన్మల మార్పులుండవు. **(54)**

ఇట్లు చేయవలెనని తెలిసికొన యత్నించుట జ్ఞానము. ఇట్లాచరించి కొంతకాలము చూడవలెను. అప్పుడును విశ్వరూప దర్శనము లభింపక సంసారమే అనుభవ మగుచున్నది. కారణమేమి? కొంతకాలము యత్నించి చూడవలెనను బుద్ధియే. ఫలితమున్నచో నమ్మవచ్చునను బుద్ధివలన నిది

కలుగును. ఫలితముపై బుద్ధి యున్నంతవరకు విశ్వరూప దర్శనము జరుగదు. కొంతకాలముచేసి చూచు దుర్బుద్ధి యున్నవాడు ఫలితము కనబడనిచో మానును. మానినను సుఖశాంతులు లేవు గనుక మరల ప్రారంభించును. ఇట్లు కొన్ని జన్మలు జరుగును. అయినను తరువాత ఇక సమర్పణబుద్ధి ప్రారంభమగును. దానితో అనన్యతత్త్వము దర్శింపబడును. స్వల్ప కాలమునకే తానందు ప్రవేశించుట జరుగును. అనగా విశ్వరూపములో తన జీవితముగూడ ఒక భాగమేయని తెలియును. తాను వేరుగా నుండి ఒక పెద్ద చిత్రపటమును చూచుచున్నట్లు విశ్వరూపము చూడగలడను భ్రాంతి పోవును. తనయందు అఖిల జీవులయందున్న రూపమును తా ననుభవించుటయే సంపూర్ణ దశ. దానికి తెలియుట, చూచుట, అందు ప్రవేశించుట అను మూడు స్థితులు చెప్పబడినవి. వాని నుపదేశించుటకై భగవంతు డంతర్యామిగా నిత్యము కనిపించుచు అందరిలో నుండి నిశ్శబ్ద భాషలో నిట్లుపదేశించు చుండును. "నీ పనులుగా చేసికొనుట మాని, నా పనులుగా ఆచరింపుము. నీ ప్రాధాన్యము మాని, నా ప్రాధాన్య మంగీకరింపుము. నాయందు భక్తి భావము నభ్యసించి ఇతరులతో సంబంధములను పూర్తిగా విడిచిపెట్టవలెను. ఎవరితోను వైరబుద్ధి యుండరాదు. ఇట్లెవ్వరు సాధన చేయుదురో వారు నన్ను పొందుచున్నారు. అనగా వారు నేనుగా, నేను వారుగా నాయందే యున్నారు." (55)

## పంద్రెండవ అధ్యాయము

# భక్తి యోగము

అనన్య భక్తి సాధనమందు చక్కని క్రమమార్గమున్నది. కనిపించుచున్న వారి రూపములనే విశ్వరూపుని మూర్తులుగా ధ్యానము చేయుచు, వారి యెడల మన బాధ్యతలను నిర్వర్తించుచు, ఆ ప్రయత్నమే దైవారాధనగా సాధింపవలెను. ఈ సాధన చేయుటకు దేవాలయమునకు పోలేకపోయినను విఘ్నము లేదు. (దేవాలయమునకు పోవుటకు తీరుబాటు లేక తమ పనుల తొందరలో ఎగగొట్టు వారికి ఈ సాధన జరుగుచున్న దనుకొనరాదు. స్వలాభమునకు చేసికొను పనులున్నవను భ్రాంతి తీరినవారికే ఈ సాధన. మరియు స్వలాభమునకై ఆలయమునకు పోయినను ఈ సాధన జరుగదు. ఉపదేశింప బడిన విషయమును సూక్ష్మబుద్ధితో గ్రహింపవలెను.) పుణ్య క్షేత్రమునకు పోలేక పోయినను విఘ్నము లేదు. పుణ్య నదులలో స్నానము చేయలేక పోయినను తప్పులేదు. అందరిలో దైవమును జూచి, సత్కర్మము ఆచరించు చున్నవారే అనన్యభక్తి సాధకులు. (పూర్వమొక భక్తురాలు ఏసుక్రీస్తును తన యింటి కాహ్వానించెను. భక్తులు, జిజ్ఞాసువులు మొదలగు వారితో గూడి క్రీస్తు బోధల నామె శ్రద్ధాభక్తులతో గ్రోలెను. వారందరికిని కావలసిన ఏర్పాట్లు చేయుచు ఆమె చెల్లెలు వంట యింటిలో నుండిపోయినది. బోధలు వినలేదు. క్రీస్తు స్వయముగా లోనికి పోయి ఆమెను చూచెను. "నేను చేసిన యుపదేశములను వీరు వినుచున్నారు. నీ వాచరించు చున్నావు. కనుక నిన్ను చూచుటకు నేను వచ్చితిని'' అనెను. ఆమె అందరిలోను క్రీస్తునే చూచెనని యర్థము. ఆమె చేసిన సేవలు అతనికే చెందును.) అంతేకాని తన దేహమునకు సేవ చేయించుకొనువాడు గురువు కాదు. ఇట్టి సాధన కాక మరియొక సాధన యున్నది. వ్యక్తులలో చూడబడు దైవము పరిమిత దేహములతో నుండును. వ్యక్తులకు అనేక గుణములుండును. గనుక ఈ దైవము సగుణ పరబ్రహ్మము

అనబడును. ఇట్టి వానికన్న అతీతముగా ఉన్న దైవము అవ్యక్తుడు. అనగా లోకము లోనికి వ్యక్తము గానివాడు. కొందరు ఈ అవ్యక్తమగు నిర్గుణ పరబ్రహ్మమును జప ధ్యాన యోగాదులతో సాధన చేయుచున్నారు. అతని యందు సమాధి నిష్ఠ కుదురవలెనని ఎన్నో సాధనలు చేయుచున్నారు. ఈ రెండు విధములైన సాధనలు చేయువారిలో నిజముగా యోగము తెలిసినవా రెవరు? అని అర్జునుడు ప్రశ్నించెను. (1)

దానికి కృష్ణుడిట్లు సమాధానము చెప్పెను : రెండింటిలో నే మార్గము నైన అవలంబింపవచ్చును. నాయందు మనస్సు సమర్పణచేసి ఉత్తమమైన శ్రద్ధతో సాధన చేసినచో ఈ రెండు మార్గములలో ఏదియైన ఒకటే. ఇక రెండు మార్గములకును నడుమ గల తరతమ భేదమును నీవు కోరితివి గనుక చెప్పుచున్నాను. ఒకచోట నున్నాడని నిర్దేశించుటకు వీలులేనివాడు అవ్యక్త పరబ్రహ్మ మగును. అతనికి ఈ సృష్టి రూపములయందువలె మార్పు లుండవు. ఊహ చేయుటకు లొంగడు. నిశ్చలుడై అన్నిటియందు ఉన్నాడు. (ఇల్లు కట్టక ముందున్న చోటే ఇండ్లలో గూడ నున్నది.) వానిని సాధించినను నన్నే పొందుచున్నారు. అట్లుగాక అందరియందును సమబుద్ధిని సాధించిన వారు ఇంద్రియములను నియమించుకొని కూడ నన్నే పొందుచున్నారు. చుట్టు నున్న అన్ని జీవులకును మేలుగోరుట నేర్చుకొనినచో నన్ను సులభముగా పొందవచ్చును. ఇక ఇందరిలో నున్న నన్ను కాదని కన్నులు మూసికొని అవ్యక్త పరబ్రహ్మము నుపాసింప గోరువారు ఎక్కువ కష్టపడుచున్నారు. (రైలులో హైదరాబాదు పోవచ్చునని చెప్పినచో, అట్లుకాదు, నాకు ఆ ఊరిపై శ్రద్ధ యెక్కువ కనుక నడచి పోయెదను అన్నవాడు కూడ చేరుచున్నాడు గాని కోరి శ్రమ తెచ్చుకొనుచున్నాడు.) జీవులు దేహధారులు కనుక అంతర్యామిని దేహధారుల రూపముననే చూచుట శ్రేయము. అది మాని అవ్యక్తోపాసన చేసినచో దుఃఖమే గతి. నీ శ్రేయస్సు కోరి నే నిచ్చు మార్గమును స్వీకరింపుము. జీవులు తామాచరించు దినచర్య, సత్కర్మలు మాన నక్కరలేదు. వాని మంచి చెడ్డలను నాయందు సన్న్యసించినచో చాలును. ఆ పనుల మీదకన్న నామీద దృష్టి యున్నచో చాలును. ఇదియే అనన్య భక్తిని సాధించు యోగము. ఇట్లు ధ్యానించుచు నన్నెవరు పూజించుచుందురో వారిని నేనే స్వయముగా మృత్యు

ముఖము నుండి తప్పింతును. సంసారబంధము నుండి విడిపింతును. శ్రీకృష్ణు డొకనాడు "నీ చుట్టునున్న వారి రూపమున నేనే కర్తవ్య ముపదేశింతును. నేటి నుండి నీవీ సాధన చేయుము." అని ధర్మరాజున కుపదేశించెను. ఇంటికి తిరిగి రాగానే ధృతరాష్ట్రుడు తన్ను ఆహ్వానించెను. కృష్ణుడే ఆహ్వానించెనని అతడు హస్తినకు బోయెను. శకుని జూద మాడుమన్నను, మాయ జేసి గెలిచి నను, దుశ్శాసనుడు ద్రౌపదికి మానభంగము చేయ యత్నించినను, కృష్ణుని యుపదేశముగా యుధిష్ఠిరుడు మౌనము వహించెను. తమ్ములు నిందించిరి. భీముడు "నీ చేతులు దహింపవలెను" అనెను. యుధిష్ఠిరుడు మాట్లాడలేదు. సభలో ద్రౌపది తన మానమును కాపాడుకొనవలెనని సభ వారితో బ్రతిమాలి ఎన్నో ప్రయత్నములు చేసెను. లాభము లేకపోయెను. చివరకు ఆ సభను చూడక కృష్ణుని జూచి స్మరించెను. నమ్మరాని ఆశ్చర్యము జరిగి ఆమెకు మాన సంరక్షణము జరిగెను. కృష్ణుని ఉపదేశము ననుసరించిన యుధిష్ఠిరుని మౌనమునకు ఫలితముగా మహాభారత యుద్ధము జరిగెను. అందు కౌరవులు సంహరింపబడిరి. యుధిష్ఠిరుడు ఇందేదియు కోరలేదు. కాదనలేదు. చివరకు రాజ్యము సంక్రమింపగా "నా కెందులకు?" అని యుధిష్ఠిరు డడిగెను. "నీ కోసము కాదు, ప్రజల కోసము. చిన్నవాడైన పరీక్షిత్తు కోసము. కాదనుటకు, అవుననుటకు నీకు హక్కు లేదు" అని కృష్ణుడు మరల యుధిష్ఠిరుని సాధన మార్గమున బెట్టెను. ఇట్లు ఫలితములను భగవంతున కర్పించి జీవితముల నడుపుటయే కృష్ణు డుపదేశించిన సగుణ దైవోపాసనము. (2-7)

ఏ రూపమునైనను నాయందు ఆవేశము చేయబడిన చిత్తముతో జీవించువారికి నేను అచిరకాలముననే వశమగుదును. నేనే అంతర్యామి యను భావమును నాయందు ధారణచేసి యుండవలెను. ఏదైన నిర్ణయింప వలసినపుడు బుద్ధిని ప్రయోగింపవలెను గదా! ఆ సన్నివేశమును నేనే యని గ్రహించి బుద్ధిని సమర్పణము చేయవలెను. నిర్ణయములను నేనే చేసి మీ మూలమున నడిపింతును. అప్పటినుండి నాయందే జీవించుచుందురు. ఏ మాత్రము సందేహము కలిగినను ఈ మార్గము లభింపదు. (అనగా సందేహింప దగనిచోట ఫలితములపై, జయాపజయములపై బుద్ధి పని చేయును. దానితో నిర్ణయ మతనిదే యగును. చిక్కులలో పడును.) (8)

ప్రారంభముననే సమస్త భారములను సమర్పణ చేయగలుగుట సాధ్యమా? సాధ్యము కాదు. అప్పుడేమి చేయవలెను? మరల మరల యత్నింప వలెను. నా దగ్గరకు వచ్చుటకు మరల మరల కోరుచుండవలెను. ప్రారంభమున అది కూడ మరపునకు వచ్చుచుండును గదా! మరచినవాడు ఎట్లు జ్ఞప్తికి తెచ్చుకొనగలడు? తెచ్చుకొనలేడు. మరపు కలుగుటకు సాధ్యపడని పరిస్థితులు ఏర్పరచుకొనవలెను. అది యెట్లు? నాకు సంబంధించిన పనులను కల్పించు కొని చేయుచుండవలెను. (విష్ణుచిత్తుడు ఏమియు చదువనివాడు. అయినను తనకున్న తోటలు, దొడ్లు, పొలములు, ఇల్లు మొదలగు వానిని కేంద్రముగా కృష్ణుని ఆలయమును స్వీకరించెను. ఆలయ సేవకే పూలు కోయుట, పూల మొక్కలను సాకుట, పాదులు చేసి నీరు పట్టుట తన అనుష్ఠానముగా స్వీకరించెను. పొలములను, పండ్ల తోటలను స్వామి కొరకే సాగుబడిచేసి, అందరిలో స్వామిని జూచి, దాన ధర్మాదులు, ఉత్సవములు చేసెను. ప్రతిదినము ఆలయము కడుగుట, చెరువు నుండి నీరు తెచ్చుట, దీపము పెట్టుట, అర్చన చేయుట అను పనులతో జీవితము గడిపి మహా భక్తులలో అగ్రస్థానము వహించెను. ఇట్లు కల్పించుకొనిన పనుల వలననే మనస్సు అంతర్యామి మీదకు మ్రొగ్గను.) (9)

ఈ విధముగాకూడ దైవ యోగము నవలంబించుటకు పరిస్థితులు అనుకూలము కానివారున్నారు కదా! వారేమి చేయవలెను? వారికిని మార్గ మున్నది. తా మాచరించుచున్న పనులను మాననక్కరలేదు. వాని ఫలితము లను మాత్రము సమర్పణ చేయుట అభ్యాసము చేయవలెను. సంకల్పించిన పని నెగ్గినదా, లేదా అను ప్రసక్తి యున్నచోట మనస్సులో అంతర్యామిని ధ్యానించుకొనుచుండవలెను. నెగ్గినను నెగ్గకున్నను భగవంతుని యిష్టమే యని నమ్ముట నభ్యసింపవలెను. బాధ్యతలను మానక ఫలితములను విడచిపెట్ట వలెను. (అది అసమర్థత కాదా యని కొందరు సమర్థులు సందేహ పడవచ్చును. ఈ సమర్థులు చూపునట్టి మరియొక మార్గమేమి? తమ పనులు కానప్పుడు తాము చేయగలుగుచున్న దేమి? భగవంతుని ఇచ్ఛ అని నమ్మినవారు పనులు కాలేదని దుఃఖపడుటకు తమ సామర్థ్యము పనికివచ్చును. లేదా పట్టుదలతో నితరులపై పగ సాధింపనెంచి ఇంకను నష్టపోవుటకు తమ సామర్థ్యము పనికి

వచ్చును. శత్రువును సాధించుటకై కోర్టు కెక్కించినవాడు తన ఆస్తిని, సుఖమును, విశ్రాంతిని కోల్పోవుచున్నాడు గదా! ప్లీడర్లు, గుమాస్తాల చుట్టును తిరిగి కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడి యత్నించుచున్నాడు. ఇందులో సగము యత్నము అంతర్యామికై చేసినచో పగ సాధించుట లేకున్నను కష్ట నష్టము లుండవు.) (10)

కర్తవ్య కర్మ లాచరించి ఫలితమును సమర్పణ చేయుట నభ్యసింప వలెను. అభ్యసించుట యనగా మరల మరల నాచరించుట. (సత్యము మన పరిసరముల వ్యక్తులుగా నుండును. పరిస్థితులు మన అభిప్రాయములపై నాధారపడి యుండును. గనుక సత్యములు కావు. కనుక అభిప్రాయముల ననుసరించి పోక నిలద్రొక్కుకొనవలెను. అభిప్రాయములతో పోరాడి నిల ద్రొక్కుకొనుట సాధ్యము కాదు. కర్తవ్యమును ఆచరించుట ప్రతి క్షణము చేయుచున్నచో అభిప్రాయములు అసత్యములు గనుక మాయమగును.) ఇట్లు కర్తవ్య కర్మ నభ్యసించుటవలన జ్ఞానము కలుగును. (జ్ఞానము అనగా అభిప్రాయములు కాదు. నడచుకొనవలసిన మార్గము. పను లాచరించుట ప్రారంభించిన తరువాత మార్గము దొరుకును గాని ఎట్లాచరింపవలెనో విమర్శించు వానికి దొరకదు. "ఈ అడవి రెండు మైళ్ళున్నది. ఈ టార్చిలైటు వెలుగు రెండు మూడడుగులే పడును. దీనితో అడవి దాటుట యెట్లు అని తర్కించినచో సాధ్యము కాదు. కనిపించిన రెండు మూడడుగులు నడచినచో తరువాత రెండు మూడడుగులు కనుపించును. నడచుటారంభించియే దాటవలెను గాని మరియొక మార్గము లేదు.'' అని రామకృష్ణ పరమహంస ఒక రాత్రి ఒక శిష్యునికి నిదర్శన పూర్వకముగ నుపదేశించెను.) (11)

ఇట్టి జ్ఞానము కలిగినవానికే ధ్యానము నిలుచును. ధ్యానమను మాటలోని విశేషమేమో బోధపడును. ధ్యానము నిలిచినవానికే కర్మఫలమును విడచిపెట్టుట సాధ్యమగును. అదియే నిజమైన త్యాగము. (చందా లిచ్చుట, శ్రమదానము చేయుచు, చేయుచున్నట్లు ఫొటోలు తీయించుకొనుట మున్నగు నవి త్యాగమను మాటకు లక్ష్యములు కాజాలవు.) ఈ త్యాగ మలవాటైన వారికి నిరంతరమైన శాంతి చేకూరును. (నిరంతర మనగా సందు లేనిది. శాశ్వతమైన శాంతి యని యర్థము. ) విందు భోజనము చేయుచున్నప్పుడు

గాని, భార్యతో సరసమాడుచున్నప్పుడు గాని కలిగినది శాంతి యనరాదు. అది రోగికి మేహశాంతివలె తాత్కాలిక శాంతి మాత్రమే. విందు భోజనమునకు ముందు అప్పులవాడు వాకిట వేచియున్నాడని తెలిసినచో శాంతి మాట దేవు డెరుగును, పదార్థముల రుచి తెలియదు. సర్వాంతర్యామి సాధకుని శాంతికి విఘ్నము లుండవు. అది జన్మాంతర సంస్కారముగా వర్తించును.

ఇచ్చట నొక క్రమబద్ధమైన ప్రణాళిక చెప్పబడినది. ఈ క్రమమున మొదటిది కర్తవ్యాచరణము. కనుక ఈ మార్గము ఊహాగానముగాక ఆచరణ పూర్వకమైన సత్యమని గ్రహింపవలెను. (12)

**సాధనక్రమము :**

దీని నభ్యసించుటకు పరిశుద్ధమైన యోగవిద్యాలయము కావలెను. అది ఈ భక్తియోగమున తాను జీవించుచున్న ప్రపంచమే. వేరుగా యోగ విద్యాలయముగాని, ఒక పరిశుభ్రమైన గదిగాని ఉండుట ప్రారంభ స్థితిలో ఆవశ్యకమేగాని, దానివలన సాధన ఫలవంతమగునని చెప్పలేము. పరిసర ప్రపంచమే సాధనాలయముగా స్వీకరించి ఈ దిగువ సాధనాంశములను శ్రద్ధగా ననుష్ఠింపవలెను. పై జెప్పిన క్రమబద్ధమైన ప్రణాళికలో మొట్టమొదటిది అభ్యాసము. అదియే క్రమశిక్షణాభ్యాసము లేక కర్తవ్యము నాచరించుట. అది లేనిదే జ్ఞానాదులైన తరువాతి అంశములు సిద్ధింపవు. కర్తవ్యమనగా నెట్టిదో వివరింపబడుచున్నది. వృత్తి వ్యాపారములు కర్తవ్యములే గాని, వానితో బాటు కావలసిన అవశ్య కర్తవ్యములు ఇచ్చట నిర్దేశింపబడుచున్నవి.

ఏ జీవ రూపమును అనగా ఎవ్వరిని ద్వేషింపరాదు. ద్వేషింపనని అంటీ ముట్టనట్లు తన పనులను చూచుకొనినను లాభము లేదు. మిత్ర ధర్మము నభ్యాసము చేయవలెను. అందరికిని మేలుకోరు మిత్రుడుగా జీవింపవలెను. ఇతరులు తన దృష్టిలో మిత్రులుగా నుండవలెను. ఇతరులు తనను మిత్రుడుగా పరిగణించుచున్నారా అను విషయము తన సాధనకు సంబంధించినది కాదు. యుధిష్ఠిరుడు అజాతశత్రువని చెప్పిన దీ అర్థముననే. తనను మిత్రుడుగా చూడనివారి యెడల గూడ దయాస్వభావ మభ్యసింపవలెను. తనను లెక్క

జేయనివాడు ఆపదలో నుండి సహాయ మర్థించినచో అతని సంకుచిత దృష్టిని లెక్కచేయరాదు.

ఏ వస్తువు నందును ఇది నాది యను బుద్ధి తగదు. డబ్బు, ఇల్లు, వాకిలి, మిత్రాదులు తన సొత్తని భావించినచో దుఃఖము తప్పదు. నేనీ సాధన చేయుచున్నాను గనుక గొప్పవాడనను భావము పుట్టరాదు. ఈ సత్కర్మలను, పరోపకారములను నేను చేయుచున్నానని ఘనత పనికిరాదు. (పరోపకారము తన సాధనకు మార్గమే గాని, ఇతరుల కోసము కాదని తెలియవలెను. తాను లేకున్నను ఇతరులు తాము పొందవలసిన ఉపకారమును మరొకరి వలన పొందుదురు.)

ఓర్పు ఉండవలెను. ఒకనాడు సుఖము కలిగినను, ఒకనాడు దుఃఖము కలిగినను సాధనపై గౌరవము మారరాదు. (దైవ ప్రార్థన మొదలు పెట్టినపుడు వ్యాపారమున కలిసివచ్చినదను ఉత్సాహము గలవాడు నష్టము కలిగినపుడు నమ్మకము తగ్గి ప్రార్థన మానుకొనవచ్చును.) తాను తప్పులు చేయడు గనుక ఇతరులు చేయరా దనుకొనరాదు. తప్పులు పట్టరాదు. దుర్బలుడైన వాడు తప్పు చేసినను గ్రహించి, తన దగ్గరకు వచ్చినపుడు సంతోషముతో క్షమింప వలెను. (13)

తనకున్న పరిస్థితులతో సంతృప్తి చెందవలెను. (అంతకన్న మంచి పరిస్థితులకై యత్నింపరా దనుకొనరాదు. కలిగినదానికి సంతోషించి మిగిలిన వానికి యత్నింపవలెను. లేనిచో కలిగిన లోటుపాట్లకు దుఃఖపడుట ఏర్పడును.) అనుక్షణము యోగిగా జీవింపవలెను. అనగా తనకున్న జ్ఞానమును కర్మాచరణ ముతో యోగము చేయవలెను. దేహమును, ఇంద్రియములను, మనస్సును తన వశమున వర్తింపజేయవలెను. ఈ ప్రయత్నము ఈశ్వరుడనైన నా వశమున నుంచుట యని తెలియవలెను. అట్టివాడు ఎప్పుడును అంతర్యామికి ప్రియుడుగా నుండును. (అందరి రూపమున అంతర్యామి వానియందు ప్రియుడై యుండును.) (14)

ఈ విధముగా జీవించుచున్నాడని తెలిసికొనుట కేమైన మార్గమున్నదా? ఉన్నది. తాను కారణముగా ఎవ్వడును ఉద్వేగము పొందరాదు; ఎవరి ప్రవర్తన

కారణముగను తాను పొందరాదు. ఈ రెండు లక్షణములును సరిపోయినచో అత డంతర్యామికి ప్రియుడని తెలియవలెను. (తన వలన నెవరికిని కష్ట నష్టములు, కలవరపాటు కలుగరాదు. తన సాధనకోసమై ఇతరుల ఇండ్లలో తన లేడిచర్మము, దేవుడిపెట్టె మున్నగు దుకాణములు విప్పి వారి దినచర్యకు అసౌకర్యము కలిగించరాదు. ఇతరుల ఇండ్లకు పోయి తెల్లవారుజామున పెద్దగా మంత్రములు, స్తోత్రములు, భజనలు పెట్టి బాధ పెట్టరాదు. ఎదుటివాని సాధనను గూర్చి గాని, గురువును గూర్చిగాని, నీచముగా మాటాడరాదు. సామాన్య గృహస్థుల యిండ్లలో శిష్యబృందములతో విడిదిచేసి ఆర్థిక బాధలు మున్నగునవి కలిగించరాదు. పదిమంది జేరినచోట ఆచారమని చిన్న గుడ్డ కట్టుకొని లేక లంగోటి కట్టుకొని యోగసాధన చేయుట, వేషభాషలతో భయపెట్టుట చేయరాదు. ఇట్లే ఇతరుల ప్రవర్తనకు తాను ఆవేశపడుట చేయరాదు.) లోకమున అన్యాయము, అధర్మము హెచ్చిపోవుచున్న వనియును, అందరును మూర్ఖులనియును వాపోవువారు ఈ సాధనకు పనికిరారు.(15)

ఎదుటివారి దగ్గర ఎంత విలువైన వస్తువులున్నను, ఆకర్షణీయములైన వస్తువులున్నను అవి తనకున్నచో బాగుండు ననుకొనరాదు. శరీరమునను, మనస్సునను శుచిత్వము కలిగియుండ వలెను. (నా మనస్సు ఎప్పుడును దేవుడి మీదనే యుండును. గనుక, నేను స్నానము చేయకపోయినను తప్పు లేదని భావింపరాదు.) ఇన్ని యున్నను సమర్థుడుగా జీవింపవలెను. (తాను పది మందికి ఆశ్రయింప దగినవాడు కావలెను గాని, తన జీవనోపాధి నితరులకు అప్పచెప్పరాదు.) ఏ పరిస్థితుల యందైనను ఉదాసీనుడై జీవింపవలెను. అనగా పరిస్థితులతో పులుముకొని బాధపడరాదు. లోక వ్యవహారములలో గూడ తప్పులకు ఒప్పులకు ఉదాసీనుడుగా నుండి ఎవరి స్వాతంత్ర్యమునకు అడ్డు పడరాదు. అడిగినవారికి తాను నమ్మినదానిని చెప్పవలెను. ఏ పరిస్థితికిని దిగులుపడి మతి పోగొట్టుకొనరాదు. తానై ఏ పనిని స్వలాభమునకై సంకల్పించి, ప్రారంభింపరాదు. ఇట్లెవడు ప్రవర్తించునో అతడు అంతర్యామికి ప్రియుడు. (16)

భక్తియోగము నభ్యసించి భక్తుడుగా జీవింపగోరిన వానికి ఇతరులతో గల సంబంధము లన్నియు భగవంతునితో సమ్మతములే! అతడు ప్రత్యేకముగా

సంతోషించునట్టి సన్నివేశము లేవియు నుండవు. ఒక సన్నివేశమునకు ఒకరితో గల సంబంధమునకు సంతోషించువాడు మరియొక సందర్భమున దుఃఖించును. ఆయా సందర్భములను బట్టి ఈర్ష్య, అసూయ, దిగులు మున్నగునవి గూడ పొందుచుండును. భక్తియోగము నవలంబించినవాడు నిత్యము భగవంతుని సన్నిధిలోనే యుండును. కనుక సంతోషముగా తప్ప మరియొక విధముగా నుండుట కవకాశము లేదు. దానికి సన్నివేశము లక్కరలేదు. అతని మనస్సు నిత్యము సంతోషమే గనుక శోకించుట, అసూయపడుట మున్నగునవి ఉండవు.

అతనికి కోరదగినది అంతర్యామి సాన్నిధ్యమే. అది లభించినది గనుక ఇక కోరదగినది లేదు. అతని మనస్సు దేనిని కోరదు. సామాన్యముగా మానవుల మనస్సు కోరకుండ నుండదు. దేనినైన కావలెనని కోరినను, అక్కరలేదని కోరినను కోరికయే యగును. భక్తుడు కోరిక లుండరాదని కూడ కోరడు. కనుక వానికి కోరిక లుండవు. సంసారజీవులు ఎంత మంచివారైనను "నాకిట్లు జరుగవలెను" అనుకొనుట మానగలరు గాని, "నాకిట్లు జరుగరాదు, నాకీ దుఃఖము కలుగరాదు, ఒకరిని యాచించు దైన్యము కలుగరాదు, ఒకరిచే చేయించుకొనుట ఈ జన్మకు ఉండరాదు" అని భగవంతుని ప్రార్థించుట మానరు. వారి భక్తియోగ సాధన సంసారపక్షమైనదే గాని నిజమైనది కాదని అర్థము. భక్తియోగ మబ్బినవానికి భగవత్ సాన్నిధ్య ముండునుగాని తన జీవితమని వేరుగా నుండదు. కనుక శుభము, అశుభము అను సందర్భము లుండవు. "ఈనాడు పండుగ, ఈనాడు అప్పులవాడు వచ్చును, ఈనాడు నాకు జబ్బుగా నున్నది" అను భేదము లుండవు. సర్వము అంతర్యామి యధీనమని తెలియును. గనుక ఆయా సందర్భములను బట్టి తాను చేయ వలసిన కర్తవ్యము మాత్రము తనకు మిగులును. దానిని ఎప్పటికప్పుడు ఆచరించుటలో ఆలస్యముగాని, అసౌకర్యముగాని అనిపించదు. (18)

సౌకర్యము, అసౌకర్యము అనునవి సంగదోషములేగాని సత్యములు కావు. పరిసరములు, వ్యక్తులు మన మనస్సు కోరినట్లున్నచో సౌకర్యముగా నున్నవి అందుము. వేరుగా నున్నచో అసౌకర్యము. కనుకనే క్రొత్తచోటికి పోవలసి నప్పుడు అసౌకర్యమును గూర్చి సందేహింతుము. సౌకర్యము అసౌకర్యము అనునవి మానసిక వ్యాధులే గాని భౌతిక సత్యములు కావు. అవి దురభిమానము,

దంభము, గర్వము, సోమరితనము అనువానికి దెబ్బతగులునేమో అను భయములు మాత్రమే! కనుక వానికి సత్యత్వము లేదు. చలికాలములో చలిగా నుండుట, ఎండకాలములో ఎండగా నుండుట అసౌకర్యము లనబడును. చలి, ఎండ, ఆకలి, దప్పిక మున్నగునవి దేహమున కేమి కావలెనో తెలియజేయుటకై ప్రకృతి ఏర్పరచిన విద్యలు కాని అసౌకర్యములు కావు. చలిగా నున్నదన్నచో దేహమును కప్పి కాపాడుకోమని హెచ్చరిక తప్ప చలికి భయపడు మని అర్థము కాదు. ఇల్లు కట్టుకొనుట, మంచము, పరుపు, దుప్పటి, శాలువ కొనుట మన కర్తవ్యములని తెలియజేయుటకే చలి పుట్టును గాని, అవి లేనపుడు ఏడ్చుటకు కాదు. అట్లే మిగిలిన దేహబాధ లన్నియు ఆవశ్యకతలను తెలియజేయు పాఠములు. పాఠములు చదువుట మాని, చదువవలసి వచ్చి నందులకు ఏడ్చునట్టి విద్యార్థి యెట్టివాడో, అట్టి మూర్ఖుడే సౌకర్యములకు సంతోషించి అసౌకర్యములకు బాధపడును. నేర్చుకొనవలసినవి కర్తవ్యములు, బాధ్యతలు గాని, సౌకర్యములు, అసౌకర్యములు కావు. ఒక శాస్త్ర గ్రంథమును అధ్యయనము చేయుచున్నప్పుడు చదువవలసినది శాస్త్రము గాని గ్రంథము లోని అక్షరములు కాదు గదా! అయినను అక్షరములు చదువనిదే గ్రంథము చదువుటకు వీలుపడదు. అట్లే సుఖదుఃఖముల అనుభవము లేనిదే వాని కతీతమైన దివ్యజీవనము బోధపడదు. కర్తవ్య మంతకన్న బోధపడదు. గ్రహింపవలసినది దివ్య జీవనము, ఆచరింపవలసినది కర్తవ్యము, విడచిపెట్ట వలసినది సుఖదుఃఖముల అనుభవము. ఈ సాధనయే భక్తియోగమున జరుగును. (19)

విడచిపెట్టవలసినవి మనస్సునకు అంటుకొనుట సంగదోషము. మలము గాని, మూత్రము గాని మీదపడినచో అసహ్యించుకొనుట యెందులకు? విడువ వలసినదే అంటుట వలన. అట్లే సుఖదుఃఖములు, సౌకర్యములు, అసౌకర్య ములు అనునవి మనస్సునకు మలమూత్రముల వంటివి. అవి అంటుట వలననే మానసిక బాధ కలుగును. నా కిట్లు జరుగవలెను, ఇట్లు జరుగరాదు, ఇది అవమానము, ఇది నాకు గౌరవము మొదలగు అభిప్రాయములే మనస్సున కంటు మలములు. వానిని గూర్చి బాధపడి వాని ప్రకారము కర్తవ్యమును మెలికలు త్రిప్పుకొనువాడే సంసారజీవి. భక్తియోగమున చలి, ఎండ మొదలగున

వన్నియును భగవంతునిలోని భాగములే గనుక, అందున్న భక్తుడు భగవంతునే అనుభవించునుగాని వాని ననుభవింపడు. అట్లే ఒకడు నిందించినను, ఒకడు పొగడినను, మౌనము వహించును. మౌన మనగా మూతి బిగించుట గాక మానసికమైన మౌనము. ఎవడేది మాట్లాడినను మాట్లాడినవానిలోను, మాటల లోను, అర్థములోగల అంతర్యామిని మాత్రమే చూచును. నిజమైన భక్తునకు "ఈ ఊరు నాది, ఈ ఇల్లు నాది, ఈ గది నాది, ఈ కుర్చీ నాది" అను నభిప్రాయము లుండవు. మనస్సు స్థిరమై అభిప్రాయములు లేనిదై యుండును. అప్పుడు పరిసరములనుబట్టి కర్తవ్యము ఒక్కటే సూటిగా గోచరించును. ఇట్టి ప్రవర్తన గలవాడే భక్తుడు. వాడు అంతర్యామికి ప్రియుడు. ఇట్టి నడవడియే ధర్మామృతము. అనగా తరుగనట్టి కర్తవ్యము. శ్రద్ధతో చెప్పినట్లు చేయువాడు తరించును. అనగా అంతర్యామియందు జీవించును. (20)

## పదమూడవ అధ్యాయము

# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

ప్రకృతి, పురుషుడు అను పదములను తరచుగా వాడుచుందురు. అట్లే కొందరు శాస్త్రజ్ఞులు క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అను పదములను వాడుదురు. మరికొందరు శాస్త్రజ్ఞులు జ్ఞానము, జ్ఞేయము అను పదములను వాడుదురు. మన పెద్దలు వాడినట్టి జంట పదములు ఈ విధమైనవి అనేకము లున్నవి. వినుచున్నప్పుడు వీని యర్థమేదో కొంత తెలిసినట్లుండును. తెలియని భాగమే ఎక్కువ యుండును. హృదయమునందు అంతస్సాక్షియైన ఈశ్వరు డున్నాడు. కనుక మనకీ జంటపదముల అర్థములు తెలియలేదన్న విషయము వాని మహిమ వలన స్పష్టముగా తెలియుచుండును. అట్లు తెలియనిచో మనకిక దారి లేదు. అనుగ్రహ మనగా అనేక విషయములు తెలియుట గాదు. తెలియనిది తెలియలేదని భాసించుట. దాని వలన ముందు దారి లభించును. కనుక మన లోపల నున్న ఈ అనుగ్రహమను వెలుగును ప్రశ్నించుకొనుచు మన మర్జునుడుగా నిలబడినచో ఈ 'మూడు' జంట పదములకును అర్థమెట్లు తెలియునో చూచెదము గాక. (1)

మొదట 'క్షేత్రము-క్షేత్రజ్ఞుడు' అను పదములను గూర్చిన పరిప్రశ్నమును ఈ వెలుగున కెదురుగా నిలిపెదము గాక! క్షేత్రమను పదమునకు భూమిపై నొక ప్రదేశమని సామాన్యార్థము. క్షితి యనగా సామాన్య భూమి. అందేమైన విశేషమైన భాగమున్నచో క్షేత్ర మనబడును. దివ్యక్షేత్రము, పుణ్యక్షేత్రము మున్నగు పదములు నెరిగినవే. అనగా పెద్దలెవరో చిరకాలము సన్నిధిచేసిన చోటు, యజ్ఞ దాన తపస్సులు మున్నగు సత్కర్మ లాచరించిన చోటు, పుణ్యక్షేత్రము లేక దివ్యక్షేత్ర మనబడుచున్నది. అంతకన్న ముందటి కాలము నుండి సహజముగా దైవానుగ్రహ రూపమైన వర్షముపడు చోటు, విత్తనములు చల్లబడి మొలచుచోటు కూడ క్షేత్ర మనబడుచున్నది. సారవంతమైన పొలమని

యర్థము. నరజన్మ రూపముగా ప్రసాదింపబడిన ఈ దేహము కూడ అట్టిదే యని హెచ్చరించుటకై పెద్దలు క్షేత్రమనగా శరీరమని కూడ జ్ఞప్తి చేయు చున్నారు. ఈ జ్ఞప్తిలో గుప్తమగు విజ్ఞప్తి కడు విస్తృతముగా నిమిడి యున్నది. సామాన్య భూమిని క్రమముగా బాగుచేసి, శుచి శుభ్రతల నేర్పరచి, అచ్చట యజ్ఞ దాన తపఃక్రియాదులు, పూజా జప హోమాదులు నేర్పరచుటతో అది క్షేత్రముగా గుర్తింపబడును. అట్లు సంస్కరింపబడినప్పుడు మాత్రమే "ఇది రామనామ క్షేత్రము; ఇది సత్యధర్మాశ్రమము" మున్నగు విధముగా పామరులు గుర్తించి తరింపగలరు. అంతకన్న సులువుగా చెప్పవలె నన్నచో సారవంతమైన భూమియందు ఉమ్మెత్తలు, జిల్లేళ్ళు, పిచ్చిమొక్కలు ముమ్మరముగా పెరుగును. అట్టి స్థితిలో దాని నెవ్వరును క్షేత్రముగా (పొలముగా) గుర్తింపరు. అందరును ఇది "బంజరు భూమి" అని పరిహసింతురు. ఎవడైన దాని విలువ తెలిసి, పిచ్చిమొక్కలను ఛేదించి, నేలను చదను చేసి, పదను చేసి వేచియుండినచో అనుగ్రహ రూపమైన మేఘము వర్షింపగా, అప్పుడు సకాలమున విత్తనములు చల్లవలెను. అవి మొలచి ఫలోన్ముఖమైన వేళ నలుగురును దానిని, "ఇది పొలము" అందురుగాని, బంజరు భూమి యనరు. అట్లే మన శరీరము కూడను. వ్యవసాయము చేయనివాని బుద్ధి ఈ దేహమను బంజరుభూమిలో బహుశాఖలుగా, అనంతముఖములుగా విజృంభించి నశించును. వ్యవసా యాత్మకమైన బుద్ధి ఏకముఖమున పనిచేయును.

దేహమున గల ఉపయోగకరములైన శక్తులను ఉత్తమ ప్రజ్ఞలను పరిశ్రమచేత పాదులుచేసి బోదెలు కట్టినచో, అనుగ్రహ మను జలము ప్రవహించి, క్షేత్రము వంటి యీ దేహము పుష్పఫల భరితమై కళకళలాడును. అప్పుడు ఆ పుష్పఫలాదులను తాను వినియోగించుకొనుటకై తహతహ పడువాడు యజమాని ననుకొని భ్రమపడవచ్చునుగాని, తోటమాలి కాజాలడు. అనగా తోటపై తన కధికారము ఉన్నదనుకొనవచ్చునుగాని, తోటనుగూర్చి తెలిసినవాడు కాలేడు. అట్లే అమ్ముకొనుట, ఎగుమతి చేయుట, ఆ డబ్బు లెక్కపెట్టుకొనుట మాత్రమే తెలిసినవాడు కూడ ఎన్నడును తోటమాలి కాజాలడు. దానితో తోటను అమ్ముకొనుటయో, కౌలు కిచ్చుకొనుటయో చేసి, తానింకొకని తోటలో రోజుకూలీకి పనిచేసి బ్రతుకును. ఈ దేహమను క్షేత్రము

గూర్చి యిట్లు జీవించినవారి గతికూడ నంతియే. వారికి తమ దేహముపై స్వామిత్వ మెన్నడును కుదురదు. ఇతరులచే చేయించుకొనుట, ఆ కర్మ ఫలముగా ఇతరుల కమ్ముడుపోయి జీవించవలసివచ్చుట జరుగును.

అట్లుగాక, సర్వ సమర్పణ బుద్ధితో తన తోటలో పనిచేసిన విష్ణుచిత్తుడు మొదలగువారు ఎట్లు జీవించిరో గమనింపవచ్చును. వారే నిజమైన తోట మాలులు. వారే తమ దేహమును క్షేత్రముగా నెరిగినవారు. వారినే కృష్ణుడు క్షేత్రజ్ఞు లనెను. (2)

క్షేత్రమును తెలిసినవా డెట్లుండును? వాని నెట్లు గుర్తింపవలెను? అని ప్రశ్నింపగా "నేనే క్షేత్రజ్ఞుడనని తెలిసికొనుము" అని కృష్ణుడు పొడుపు కథగా సమాధాన మిచ్చెను. నేనను మాటకు సరియైన యర్థము తెలిసి గుర్తింపవలె నన్నచో, పొలమునకు మంచి రైతు చేసిన సేవవలె యోగియై ఈ దేహమునకు, మనస్సునకు, నింద్రియములకు యోగాభ్యాసమను సేవ చేయవలెను. అప్పుడు మాత్రమే 'నేను' అను పదమునకు మనలోని ఈశ్వరుడని అర్థము తెలియును. ఆ కృషి లేనివాడు నే ననగా మనస్సని కొందరు, తెలివితేటలని కొందరు, ఆదర్శములని కొందరు, దేహమని కొందరు కూడా భావించు స్థితిలో నుందురు. అంతేకాదు. దేహమున నొక భాగమునకు జబ్బుచేసి బాధగా నున్నపుడు ఆ భాగమే తానుగా నేడ్చువారు కలరు. "నాకు బాధ కలిగినది" అను నేడుపు నిజమైన బాధకన్న నెక్కువగా బాధపెట్టును. అట్టి స్థితిలో నేనను మాటకు మోకాళ్ళనియో, పాదములనియో, మలమూత్ర ద్వారము లనియో కూడ నమ్మి, ఆ భాగము నద్దెకు తీసికొని అచ్చట కూర్చుండి యేడ్చు చుందురు. ఇట్లు 'నేను' అను మాటకు వారివారి పన్నాను బట్టి ఎవరి యర్థము వారికున్నది. ఇదికాక అంతర్యామియైన ఈశ్వరుడే తానుగా తెలిసినవాడు క్షేత్రజ్ఞుడని కృష్ణుని పొడుపు కథ కర్థము. దానిని తెలియుటకే అష్టాంగ యోగ సాధనము చెప్పబడినది.

క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అను రెండును పొలము, పొలము కలవాడు వంటివి. పొలము కలవాడు దున్ని పండించగల వాడైనచో పొలము సత్ క్షేత్ర మగును. ఇంకొకనికి పొలము కౌలు కిచ్చి పండింపుమని, ఫలము తాను అనుభవింప

దలచినవాని వంటివాడు - ఇంద్రియ సుఖములలో కాలక్షేపము చేయువాడు. కాలక్రమమున పొలము వాని యధీనము నుండి దాటిపోవును. ఏనాడైన పండించువానిదే పంటభూమి. బుద్ధి కలిగి పండించుకొననిచో విదేశీయులచే ఆక్రమింపబడి, దాస్యమున జీవింపవలసి వచ్చును.

ప్రతి సంవత్సరమును సక్రమముగా తన పొలమును తాను సేవించి సకుటుంబముగా ఆరాధించుకొనువానికి పంట పండుటయే గాక, తన పొలమును గూర్చిన సమస్తమును తెలిసియుండును. అట్లే సరియైన ఆధ్యాత్మిక సాధన చేయువానికి ఈ శరీరమే క్షేత్రము. నేను, తాను అనువాడు అంతర్యామి గనుక "నేను క్షేత్రజ్ఞుడను" అని గీతాచార్యుడు చెప్పెను. అన్ని దేహముల యందును నేను, తాను అను అంతర్యామియే క్షేత్రజ్ఞుడు. క్షేత్రము క్షేత్రజ్ఞుడు అను రెండింటి నడుమ గల జ్ఞానమే ఆత్మజ్ఞానము. దాని కొరకు జీవిత సాధనము చేయువాడు జాగరూకతతో తన క్షేత్రమైన దేహమును, అందలి యింద్రియములను, వాని వాని ప్రవృత్తులను గమనించుకొనుచుండవలెను. ఎట్లున్నచో అది సారవంతమగునో తెలిసినవాడు కావలెను. క్షేత్రము నందలి పద్ధతులు దారి తప్పుచున్నప్పుడు తప్పుచుండుట తెలిసికొనవలెను. ఈ దారులు తప్పుట ఎటు ప్రక్కనుండి ప్రారంభమగునో, ఏయే కారణముల చేత జరుగునో గ్రహింపగలిగి యుండుటకై నిరంతరము కృషి చేయుచుండ వలెను. ఈ క్షేత్రజ్ఞుని ప్రభావమనగా నేమో అప్పుడు తెలియును. **(3, 4)**

ఈ దేహమను క్షేత్రమును గూర్చి పూర్వ ఋషీంద్రు లనేకులు బహు విధములుగా సంకీర్తనము చేసియున్నారు. వేదము నందలి ఛందస్సులు అనబడు ప్రకృతి శాస్త్ర రహస్యములు అనేక విధములుగా గానము చేయుచున్నవి. సంవత్సరము యొక్క గమనము, అందు ఆయా ఋతువులలో ఆయా జీవరాశుల దేహములు నిర్మాణమగుట, మార్పులు చెందుచుండుట గమనించినచో వింతగా నుండును. చైత్రము వచ్చుచున్నదనగానే చెట్లు చిగురించుట, కోకిలలు కూయుట, మామిడిచెట్లు పూతపట్టుట మున్నగు వింతలు ఈ ఋతువు లనబడు ఛందస్సుల గానములే. మాసములు, పక్షములు, తిథులు, నక్షత్రములు, వారములు అనువాని గతులు తప్పకుండ తాళ లయాత్మకముగా ప్రవర్తించుచున్న కాలవిభాగ వైభవము లన్నియు

ఛందస్సులే. అందు ఋతువుల ననుసరించి జీవరాశుల జనన మరణముల గణవిభజన జరుగు చుండును.

సంవత్సర చక్రమున మాస విభాగ మున్నది. అందు పూర్ణిమ అమావాస్య మొదలగు విభాగములున్నవి. ఇవి పితృదేవతలకు మార్గములై, గర్భధారణము జననము మొదలగు విభాగములకు ఛందస్సులుగా పనిచేయుచున్నవి. ప్రకృతిలోని యీ దేశకాలముల ఛందస్సుల విభాగములతో నిర్మాణమైన సృష్టి విజ్ఞాన గ్రంథమే వేదసంహిత యనబడును. అందీ విచిత్రములను గమనించి నడుపుచున్న దేవతలలో నొక జాతివారే ఋషులు. వారు చెదరుగా నరదేహములు ధరించి దిగివచ్చి, ఆయా భాషలలో ఈ ఛందస్సులను గానము చేయుచుందురు. అట్టివా రందరును ఈ దేహ నిర్మాణ విజ్ఞాన మనబడు క్షేత్రవిద్యను గూర్చి చక్కగా గానము చేసినవారే!

ఈ దేహమును, ఇంద్రియములను, మనస్సును ఎట్లు వినియోగించు కొనవలెను? ఇంద్రియార్థముల నెట్లు గమనింపవలెను? అధీనము తప్పకుండ క్షేత్రము నెట్లు పండించుకొనవలెను? అశ్రద్ధ జరిగినచోట్ల ఉమ్మెత్తలు, జిల్లేళ్ళు మొలచినట్లు ఇష్టాయిష్టములు, అభిప్రాయ భేదములు ఎట్లు చోటుచేసి కొనును? వానికి తావీయకుండ కృషికర్మ సాగుట ఎట్లు అన్నదే క్షేత్రవిద్య. బ్రహ్మ సూత్రముల పదములలో కూడ ఈ విద్య సహేతుకముగా నుపదేశింప బడి యున్నది. బ్రహ్మ సూత్రములనగా సృష్టిలో బ్రహ్మ నుండి మనవరకు ప్రసరించుచున్న వెలుగుల దారములు. ఈ సృష్టికర్త మనకు పరబ్రహ్మము దర్శనము కలుగుటకై వివేకము, పెద్దల సాంగత్యము, శాస్త్రజ్ఞానము, వినయ విధేయతలు, యోగము, తపస్సు అను మార్గములను వెలుగుల దారములుగా అల్లిపెట్టెను. వాని చివళ్ళు మనయందున్నవి. అవియే బ్రహ్మసూత్రములు. వాని ననుసరించి క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగమును పొందవలెను. (5)

## క్షేత్ర జ్ఞానము :

పొలములో కృషికర్మ చేయదలచినవాడు పొలమును గూర్చి కొంత తెలిసికొని యుండవలెను. లేనిచో ఆ చేయుచున్నది తప్పో ఒప్పో తనకే తెలియదు. ఈ దేహమునే పంట పొలముగా, జీవితమునే వ్యవసాయముగా

స్వీకరించినవాడు మరికొంత ఎక్కువ జ్ఞానము కలిగియుండవలెను. మన పొలములో ఏ యే రసాయనిక పదార్థము లున్నవో, ఏ యే ఖనిజములు ఎక్కువ తక్కువలుగా నున్నవో తెలిసినపుడు, ఎట్టి పదార్థములను మనము పూరించి పొలమును సారవంతము చేయవలెనో తెలియును. అట్లే ఈ దేహమునం దేమియున్నదో, దేహమెట్లు పనిచేయుచున్నదో, దానిని పని చేయించుచున్న శక్తులు, ప్రజ్ఞలు నెట్టివో తెలియవలెను.

ఈ దేహము పంచభూతములతో చేయబడినది. అనగా ఘన పదార్థము, జలము, వాయుపదార్థము, అగ్ని, ఆకాశము అనబడువానితో చేయబడి యున్నది. వానిని నడుపుటకు వానియందు మేల్కొనిన ప్రజ్ఞ యున్నది. అది 'నేను - తాను' అను రూపము వహించి, పంచభూతములను దేహముగా స్వీకరించి నడుపుచున్నది. ఈ దేహమున వేరుగా నేనను భావమునే అహంకార మందురు. ఇదిగాక, మంచిచెడ్డలను నిర్ణయించుకొనగల ప్రజ్ఞ మరియొకటి యున్నది. దానినే బుద్ధి యందురు. ఇన్ని యంశములును దేనినుండి పుట్టు చున్నవో, మరల దేనిలోనికి మాయమగుచున్నవో అనునది మరియొకటి కలదు. అది వేరుగ తెలియబడనిది. దానినుండి వేరయిన తరువాత పరమాణువులు, అణువులు, జీవులు గుర్తింపబడుచున్నారు. ఈ దేహము, జీవుడు వ్యక్తము కాకముందు ఈ చోటులోనే యున్నారు. వేరుకాకుండ మొత్తములో భాగముగా నున్నారు. సముద్ర జలములలో ఉప్పు ఉన్నదిగదా! దానిని జలములనుండి వేరుచేసినప్పుడు ఉప్పు అని పిలచుచున్నాము. మరల నీటిలో కరగించినపుడు, తయారుచేసిన పదార్థములనుబట్టి చారు, పులుసు అను పేర్లతో పిలచు చున్నామేగాని, ఉప్పును వేరుగా గుర్తించుటలేదు. ఈ నీటిలో కరగిన ఉప్పు వంటిది అవ్యక్తము. ఈ దేహము లోపలకూడ అవ్యక్తమున్నది. దాని నుండి అనుక్షణము దేహము వ్యక్తమగుచున్నది. మరల చివరకు అవ్యక్తమున కలసి పోవుచున్నది. కనుక పంచభూతములు, అహంకారము, బుద్ధికాక అవ్యక్తము కూడ నొకటిగా గుర్తింపవలసి యున్నది.

ఇంకను ఈ దేహమున నేమున్నది? ఇంద్రియము లున్నవి. చేతులు, కాళ్ళు, వాక్కు, మలమూత్ర విసర్జనేంద్రియములు అనునవి ఐదును కర్మేంద్రియములు. చూచుట, వినుట, వాసన చూచుట, రుచి చూచుట,

స్పర్శ తెలియుట అను నైదును జ్ఞానేంద్రియములు. వీనిలో పనిచేయుచున్నది, వీనికి నాయకుడుగా నున్నది మనస్సు కాబట్టి మనస్సుతో గలసి 11 ఇంద్రియ ములు ఈ దేహమున పనిచేయుచున్నవి. ఇవికాక జ్ఞానేంద్రియములకు గోచరించునవి ఐదున్నవి. ఇవి కంటికి వెలుగు, చెవికి శబ్దము, ముక్కునకు వాసన, నాలుకకు రుచి, దేహమునకు తాకునట్టి స్పర్శ. ఈ ఐదింటిని కూడా కలుపుకొనియే ఈ దేహ నిర్మాణమును గూర్చి ఆలోచింపవలెను.

ఇంక వీని కలయిక వలన పుట్టునట్టి అంశములు మరికొన్ని కలవు. అవి యిష్టపడుట, ద్వేషించుట, సుఖపడుట మొదలగునవి. వానితో కూడా కలుపుకొనియే మనము సాగుబడి చేయవలసిన క్షేత్ర మున్నది. దేహధాతువుల యేర్పాటు, అవయవముల కూర్పు అనునది మరియొకటి. ఇన్నిటియందును పనిచేయు మెలకువ అను ప్రాణశక్తి ఇంకొకటి. ఇన్నిటికిని కేంద్రముగా నొక ప్రజ్ఞ ఏర్పడినచో దానిని ధైర్యము లేక ధరించు శక్తి యందురు. సంగ్రహముగా చెప్పినచో మనలోని క్షేత్రమునందు పై జెప్పిన యంశము లన్నియు కలవు. దీనితోనే జీవితమను కృషికర్మను సాధించుకొనవలెను. ఇన్నియును దైవాను గ్రహమను వర్షము సకాలముగా కురిసిననే ఎవడి పొలము వాడు సాధన చేసి కొన్నచో పంట పండును. దున్నుకొనక దున్నవలె నిద్రించినచో పంట పండక పోగా, జీవితమునకు బాధాకరమగు ముండ్ల చెట్లు, ఉమ్మెత్తలు, జిల్లేళ్ళు వంటి సంఘటనలు పెరిగిపోవును. పై జెప్పిన సామగ్రిలో కొన్ని సహజములు, కొన్ని వికారములు. అనగా కొన్ని ప్రకృతి సిద్ధములు, కొన్ని మనము పుట్టించుకొన్నవి.

పంచభూతములు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము, ఇంద్రియములు, ఇంద్రియముల లక్ష్యములు అనునవి ప్రకృతి నుండి వచ్చిన సహజ సంపద. ఇష్టము, ద్వేషము, సుఖము, దుఃఖము, ధైర్యము మున్నగునవి మనము సాధించి తెచ్చుకొనునవి. వీనినే వికారము లందురు. ఈ విధమైన సామగ్రితోకూడిన పొలము పని నిర్వర్తించుకొనుటగా జీవితమును నిర్వహించుకొనవలెను. సక్రమ మైన మార్గమున నిర్వహించినచో చేసిన ప్రయత్నము పంటకు వచ్చును. క్రమము లేనిచో జిల్లేళ్ళు, ఉమ్మెత్తలే గతి. అయినచో క్రమమనగా నెట్టిది? ఏ క్రమమును పాటించినచో జీవిత కృషి ఫలవంత మగును? అది ఫలవంత మైనపుడు మాత్రమే యజమాని రైతు అనబడుచున్నాడు. కానప్పుడు సోమరి

పోతు కాగలడు. కనుక ఏ క్రమమును పాటింపవలెనో యను ముఖ్యాంశమే యిచ్చట చెప్పబడుచున్నది. ఈ దిగువ యంశములను పాటించినచో పంట పండునట్టి క్రమమేర్పడును. (6, 7)

1) నేనింతవాడను - ఈ పని చేయుదునా యను నభిప్రాయమును రానీయరాదు. నన్ను ఇతరులు గౌరవింపవలెనను నభిప్రాయము రారాదు. (ఇతరులు సహజముగా మన ప్రవర్తనను బట్టి గౌరవింతురు. ఇతరులు గౌరవించుట లేదన్నచో మన ప్రవర్తనములో లోపమున్నదని యర్థము.) (2) నేను దీనిని సాధించితినని, నాకింత ఆస్తిపాస్తులున్నవని, ఇంత చదువు కొంటినని అభిప్రాయము లుండరాదు. ఇట్టి గొప్ప విషయములను ఇతరులకు తెలియపరచవలెనని తహ తహ యుండరాదు. (3) సాటి మానవులనైన, జంతువులనైన, చెట్లనైన, హింసించు బుద్ధి యుండరాదు. (ఆహారము హింస కాదు. అదికాక, వినోదమునకై వేటాడుట, మొక్కలు పీకుట, పువ్వులు, పిందెలు త్రుంపుట మొదలగు పనులే హింస. అట్లే సాటి మానవుల విషయమునను.) (4) ఇతరులు తప్పు చేసినపుడు క్షమించుట అభ్యాసము చేయవలెను. (5) అనుకొన్నది సూటిగా పలుకుట, అనుకొన్న పని సూటిగా చేయుట అలవాటు చేసికొనవలెను. (6) పై జెప్పిన సాధన మొదట కొంచెము కష్టము గనుకను, మనకన్న ముందుగా సాధించినవారితో సహవాసము ఆవశ్యకము గనుకను పెద్దలను సేవించుట, గురువును సేవించుట నభ్యాసము చేయవలెను. (7) శరీరము, మనస్సు శుచిగా నుంచుకొనవలెను. అనగా నిత్యము దంత ధావనము, స్నానము, ఉదికిన వస్త్రములు ధరించుట, జుట్టు, గడ్డము, మీసములు తొలగించుకొనుచుండుట మున్నగు శరీర శుచిత్వము నభ్యసింప వలెను. ఆహార శుచిత్వము నభ్యసించి జీర్ణశక్తిని, ఆరోగ్యమును కాపాడుకొన వలెను. ఇతరులలో గల లోపములను గమనించు దుర్బుద్ధి మనస్సున పుట్ట కుండ మానసిక శుచిత్వము నభ్యాసము చేయవలెను. (8) పరిస్థితులకు, వాతావరణమునకు లొంగిపోరాదు. తాను తానుగానే వర్ధిల్లుచు పరిస్థితులను తన కనుకూలముగా మలచుకొనవలెను. (9) ఇంద్రియములను ఆకర్షించునట్టి విషయము లనేకము లుండును. వానిని గురించి పట్టించుకొనక తన కర్తవ్యమును మాత్రమే పట్టించుకొనవలెను. (10) మిగిలిన వారికన్న తా నేవిధముగా

గొప్పవాడు అను భావమును కలుగనీయరాదు. (పై జెప్పిన పది యంశములను వరుసగా 1. అమానము, 2. అదంభము, 3. అహింస, 4. క్షమ, 5. ఋజు ప్రవర్తనము, 6. గురుసేవ, 7. శుచిత్వము, 8. స్థిరత్వము, 9. వైరాగ్యము, 10. అహంకారము లేకుండుట యనబడును.) 11. వీనితోబాటు తన దేహమును, మనస్సును, సంభాషణమును తన వశమున నుంచుకొనవలెను. (8)

దేహమునకు జన్మతోబాటు జబ్బు చేయుట, ముసలితనము, అనేక బాధలు, చచ్చుట యనునవి తప్పనిసరిగా కలుగుచుండునని గుర్తుంచుకొని, వానిని పట్టించుకొనుట మాని, తన కర్తవ్యమునే గుర్తుంచుకొనవలెను. (జబ్బు చేసినపుడు సరియైన మందు పుచ్చుకొనుట కర్తవ్యము. తన ఆరోగ్య మెట్లుండునో అను భయము కర్తవ్యము కాదు. ఇందు మొదటిదాని నాచరించి, రెండవ దానిని పట్టించుకొనరాదు.) ఇంకను భార్య, బిడ్డలు, డబ్బు, ఇల్లు, ఆస్తి అనువాని యందు ఆసక్తి యుండరాదు. (ఈ యంశముల యందు తన కర్తవ్య ముండవలెను; దిగులు, బెంగ, వ్యామోహము, వెనుక పీకుడు ఉండరాదు. ఇంకను వీరు నావారు, ఇది నా యాస్తి యను భావము రాకుండ చూచుకొన వలెను. లేనిచో వారిని తాను ఆజ్ఞ పెట్టుట, వారు విననపుడు తాను దుఃఖ పడుట జరుగుచుండును.) నిత్య జీవితమున ఒకనాడు జరిగినది మన కిష్టముగా నుండును. ఒకనాడు జరిగినది కష్టముగా నుండును. ఒకనాడు లాభముగా నుండును; ఒకనాడు నష్టముగా నుండును. వాని కందని మనస్సుతో బ్రతకవలెను. దీనినే సమబుద్ధి యందురు. (9, 10)

## అనన్యయోగము :

జ్ఞాన మనగా నేమో వివరించుచు శ్రీకృష్ణుడు "నాయందు అనన్య యోగముతో భక్తి నభ్యసింపవలెను. అందు వ్యభిచారభావ ముండరాదు." అని పలికెను. నా యందు అనగా సర్వజీవుల లోపలనున్న 'నేను' అను ఈశ్వరుని యందు. అతనినే అంతర్యామి యందురు. ఎవనికి వాడు తానుగా తెలిసికొని నేనను భావముతో జీవించుచుండును. తెలియనివారు కూడ నేనను భావము ననుభవించుచున్నారు గాని, దానిని తమకు గల యభిప్రాయముగా మాత్రమే గమనించుకొన గలుగుచున్నారు. అభిప్రాయమును 'నాది' అని

తనకన్న వేరుగా విడచిపెట్టవలెనే గాని, 'నేను' అను పదముతో పులిమికొన రాదు. నేను అను పదమునకు అర్థమైనవాడు అంతర్యామి; స్వచ్ఛమైనవాడు. అట్టి 'నా' యందు యోగము నభ్యసింపుమని కృష్ణుడు చెప్పుచున్నాడు. దీనివలన చిత్తవృత్తి నిరోధము కలిగి జీవుడు స్వరూపమైన ఆత్మగా వెలుగును. అట్టి తాను తప్ప మరియొకటి లేని స్థితి కలిగినపుడు అనన్యయోగము అనబడును. అన్యము కనిపించుటయే మనస్సు వ్యభిచరించుట, అది లేని నిశ్చల స్థితి భక్తి యోగముచే లభ్యమగును. యోగాభ్యాసమును భక్తితో చేయవలెను. అనగా భక్తితో కలిపి చేయవలెను. స్వచ్ఛమైన ప్రేమ రూపముగా భక్తి అభ్యసింపబడును. దారా పుత్రాదులయందు గల ప్రేమ, ప్రయోజనముతో ముడిపెట్టుకొని యున్నది గనుక, స్వచ్ఛముగా నుండకపోవుట గమనించుచున్నాము. దారాపుత్రాదులు రోగగ్రస్తులైనచో ప్రేమకు బదులు దుఃఖ ముండును. విధేయులు కానిచో క్రోధాదులుండును. బాంధవ్యములు మొదలగు ప్రయోజనములతో సంబంధములేక హృదయమునందు స్వచ్ఛమైన ప్రేమ అంతర్లీనమై యున్నది. దానిని ప్రవహింపజేసి యోగాభ్యాసమును చేసినచో స్వచ్ఛమైన జ్ఞానస్థితికి చేరుకొందుము.

పై జెప్పిన స్థితి నభ్యసించుచున్నవాడు ప్రశాంతమైన వాతావరణమును కోరుకొనవలెను. "వీరిని, వారిని చూడవలెను. వీరితో కలిసి యుండవలెను. పదిమందికి మన సామర్థ్యము తెలియవలెను. పది తావులకు బోయి పనులు సాధించుకొని రావలెను." అను కుతూహల మున్నవారు ఈ సాధనకు నిలబడ లేరు. ఎంతకాలమైన ఒంటరిగా నుండగలుగవలెను. అది భౌతికమైన ఒంటరి తనమే గాక, మానసికముగా పరమాత్మ ధ్యానమున నుండవలెను. కర్తవ్యము కలిగినచోట వేయిమంది నడుమనున్నను మానసికముగా నంతమందిలో తానొక్కడే యుండగలుగవలెను. సభలు, సమావేశములు, పండిత గోష్ఠులు మున్నగు వానియందు కుతూహలము, తహ తహ యుండరాదు. పదిమంది చేరినచోట "ఇందేమున్నదో తొంగి చూచెదము" అను కుతూహలము కలుగ రాదు. ఈ విధమైన సాధనతో అనన్య భక్తి యోగమును అభ్యసింపవలెను. భక్తిలేని కేవల యోగాభ్యాసముగాని, యోగాభ్యాసము లేని భక్తిగాని నిలువవు. జీవికి నిశ్చలత్వము కలుగవలెనన్నచో అనన్య భక్తియోగ సాధన తప్పదు. (11)

ఈ సాధనతో వ్యక్తులలోను, వస్తువులలోను గల అంతర్యామి యందే మనస్సు నిలచును గాని వ్యక్తుల యందును, వస్తువుల యందును నిలువదు. ఆత్మను అధిష్ఠించియే సాధకుని జ్ఞానముండును గాని, నామరూపాదులు, విలువలు అనువాని నాశ్రయించి యుండదు. ఇట్లు ఆత్మను అధిష్ఠించియున్న జ్ఞానమే అధ్యాత్మ జ్ఞానము అని నిత్యత్వము పొందవలెను. పొందినట్లు నిదర్శనమేమి? దానియందున్న సర్వసృష్టియు అనిత్యమని తెలియుటయే! అప్పుడు సృష్టికి లోపల వెలుపల నున్న యథార్థ వస్తువునందు జ్ఞానము కలుగును. ఆ వస్తువు యొక్క ప్రయోజనము కూడ తెలియును. ఇంతకును ఆత్మవస్తువు యొక్క ప్రయోజనమేమి? దర్శనమే ప్రయోజనము. ఇదియే సరియైన జ్ఞానము. దీని నాశ్రయించుకొనియున్న ఇతర వస్తువులయందు జ్ఞానమున్నచో అది అజ్ఞానమే గాని మరియొకటి కాదు. మన చేతిని చూచుకొని మనకన్న వేరు వస్తువుగా గుర్తించినచో సత్య మెట్లగును? సత్యము కానిది జ్ఞానము కాదు. (12)

క్షేత్రజ్ఞుడు అనువాని యధీనమునగల క్షేత్రమునందు పై జెప్పిన జ్ఞాన మున్నది. దానిని క్షేత్రమైన తన దేహమునందు సాధించుకొనవలెను. అటుపైన ఈ సృష్టి సమస్తమునందును సాధించుకొనవలెను. క్షేత్రమునందు సాధన చేయుచున్నప్పుడు ఆత్మజ్ఞాన మనబడును. సమస్తమునందును సాధించుట ప్రారంభించినది మొదలు బ్రహ్మజ్ఞాన మనబడును. దానినే జ్ఞేయమని కూడ చెప్పుదురు. జ్ఞేయ మనగా తెలియదగినది. ఏమని తెలియ దగినది? ఆది మధ్యము అంతము లేనిదని తెలియదగినది. చూచుచున్న వానిని మించినదని, చూచుచున్నవాడు దానిలో భాగమని తెలియవలెను. దానిని నిత్యము స్మరించు చుండుటయే ఆ పరబ్రహ్మోపాసనము. అది యీ సమస్తమును తనయం దిముడ్చుకొని యున్నది. ఈ సమస్తము దానినుండి వచ్చుచు పోవుచుండును. గనుక, ఈ సమస్తమునకు ఉండుటగాని లేకుండుట గాని యుండును. దానిని తనయం దిముడ్చుకొనిన బ్రహ్మమునకు కూడ ఉండుట లేకుండుట యుండును. ఆ రెండింటిని తనయం దిముడ్చుకొని యుండును. ఉండును, ఉండదు అను స్థితులు తనయందు వర్తించు చుండగా, “ఉండకుండుట యుండదు” అను లక్షణము బ్రహ్మమునం దెల్లెడల తోచుచుండును.

ఆద్యంతములు లేవుగనుక అది అమృతము. దానియందు సాధనలో నున్నవాడు అమృతత్త్వము ననుభవించును. (13)

## వెలుగులలో వెలుగు :

దేహము అనబడు క్షేత్రమును ధరించిన జీవుడు క్షేత్రజ్ఞుడు అనబడును. అతనిచేత తెలియబడదగినది బ్రహ్మము. అది అన్నిటి యందును అంతర్యామిగా నుండును గనుక దానికి ఉండుట - లేకుండుట యనునవి లేవు. (సినిమా ప్రారంభించుట, అయిపోవుట యుండునుగాని, దాని కాధారమైన తెర ప్రతిదినము ప్రారంభించుట, అయిపోవుట నుండవు.) అట్లే పరబ్రహ్మమునకు ఉండుట లేకుండుట అనునవి లేవు. కనుక అది శాశ్వతము, సనాతనము అనబడును. జీవుడు గర్భమున పడినపుడు తల, కాళ్ళు, చేతులు, కన్నులు, ముక్కు, నోరు అని వేరుగ నేర్పడియుండవు. దేహము పెరిగిన కొలదియు అవి వేరగును. అట్లే పరబ్రహ్మమునందు సృష్టి యంతయు పుట్టుచున్నను సృష్టి భేదములు పరబ్రహ్మమునకు లేవు. అందరి దేహములు, కన్నులు, ముక్కులు, చెవులు దానియందు పుట్టుచుండును. ఈ పరబ్రహ్మము మాత్రము అందరియందును చెవులుగాను, ముక్కులుగాను, నోరుగాను, కాళ్ళు-చేతులుగాను తానొక్కడే పనిచేయుచుండును. ఆ పరబ్రహ్మమునందు పై జెప్పిన విభాగము లేకపోవుట వలననే ఇట్లు పనిచేయుట సాధ్యపడుచున్నది. (కాఫీలో వాడిన చక్కెర కాఫీలో భాగమైపోవును. ఇంకొకదానికి వాడుకొనుటకు పనికిరాదు. అట్లే మైసూరుపాకమున వాడబడిన చక్కెర మైసూరుపాకమై, ఇంకొకదానికి వాడుకొనుటకు పనికిరాదు. అట్లుగాక, డబ్బాలోనున్న చక్కెర దేనికొరకు వాడుటకైనను పనికివచ్చును.) అట్టిదే తెలియదగినదైన బ్రహ్మము. ఈ సమస్తమునకు నాధారమై యున్నదిగాని, దేనియందును చిక్కుకొని యుండదు. ఈ సృష్టిలోని గుణములను అనుభవించు చుండునుగాని, తనకు ఆ గుణము లుండవు. ఈ బ్రహ్మమే జీవులకు లోపల వెలుపల నున్నది. లోపల వెలుపల యను భేదమే సృష్టిగాని, మిగిలినదంతయు బ్రహ్మమే. దానియందు అన్నియు కదలుచుండును గనుక అది కదలక స్థిరముగా నుండును. (14)

ఈ విధముగా కదలునది - కదలనిది కూడ తానుగానే యున్నది బ్రహ్మము. అది అన్నిటియందును అంతర్యామిగా సూక్ష్మముగా నున్నది గనుక ప్రత్యేకముగా నొక వస్తువుగా తెలియబడుట జరుగదు. చోటులోనున్న వస్తువులను గమనింపగలముగాని, చోటు నొక వస్తువుగా గమనింపలేము గదా! కంటితో నితర వస్తువులను చూడగలము గాని కంటిని చూడలేము గదా! అట్లే ఇదియును. దూరము, దగ్గర అను భేదములచే నిది తెలియబడును. జీవులచే విభజింపబడకుండియు వేర్వేరు జీవులుగా నున్నట్లు కనిపించును. (వేర్వేరు గోడ కన్నములలో నుండి ఆకాశము వేర్వేరుగా కనిపించినను కన్నములచే విభజింపబడుట లేదు.) ఈ జీవులను అస్తిత్వమున భరించు చున్నది బ్రహ్మమే. జీవులను పుట్టించుచున్న స్థితిలో తానే వాని రూపములుగా వెలువడుచున్నది. మాయము చేయుచున్నట్లు కనిపించుచు ఈ జీవుల రూపమున తనలో తానే మాయమగు చున్నది. (15-17)

## ప్రకృతి - వికృతి :

వెలుగుచున్న దీపము లనేకము లున్నను అందున్న అగ్ని ఒక్కటే గదా! అట్లే ఒకే బ్రహ్మము ఇందరు జీవులుగా కనిపించుచున్నది. చీకటిలో అనేక దీపములు కనిపించినట్లు, అజ్ఞానమను చీకటి వలన అనేక జీవులుగా నేర్పడును. దానితో తెలిసికొనువాడు, తెలియబడునది, తెలియుట యను భేదము లేర్పడి, ఆ భేదములలో అంతమగుచుండును. అందరి హృదయము లందును అది యొక్కటియు ఉన్నను చూచువాడు, చూడబడువాడు, చూచుట అను భేదములుగా నేర్పడుచున్నది. క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయము అనబడు మూడును ఈ విధముగా వివరింపబడినవి. నా భక్తుడై ఎవడు దీనిని తెలిసి కొనునో వాడు 'నేను'గా నుండుటకు కావలసిన అర్హత పొందును. తెలియ బడునది, తెలిసికొనువాడు వేరువేరుగా గమనింపబడుట అజ్ఞానము. దాని వలన మనము పరబ్రహ్మముగా అనుభవము పొందుట జరుగదు. జీవులుగా మాత్రమే అనుభవము పొందుదుము. తెలిసికొనుట మొదలగున వన్నియు ప్రకృతి యొక్క గుణములు. అవి ప్రకృతి నుండి వెలువడుచున్నవి. (మట్టితో కుండ చేసినపుడు నీటిని భరింపగల గుణము వెలువడుచున్నది గదా!) అట్లే

సృష్టియందు ప్రకృతి నుండి గుణములు వెలువడుచున్నవి. ప్రకృతి యనగా స్వభావము. ప్రకృతి, పురుషుడు శాశ్వతమూర్తులై సృష్టిలో నున్నారు. వారు ఆది అంతము లేక అస్తిత్వము కలిగియుండగా వారినుండి సృష్టి పుట్టుచున్నది. ప్రకృతి యొక్క వికారములే సృష్టి. వికారము లనగా మార్పులు. మట్టితో కుండ చేసినపుడు అది మట్టియొక్క వికార మనబడును. వస్త్రము లన్నియు ప్రత్తి యొక్క వికారములు. ఈ వికారములతో బాటు గుణములు కూడ పుట్టుచున్నవి. మిరపచెట్టున మిరపకాయ పుట్టి పెరుగుటతో కారము పెట్టునట్టి గుణము కూడ ప్రకాశించును. మొగ్గ పుట్టి పుష్ప మగుటలో రేకులు, రంగులు, పరిమళములు ప్రకాశించును. అట్లే సృష్టి పెరుగుటయందు ప్రకృతి గుణములు ప్రకాశించుచుండును. (18-20)

సృష్టి చేయువాడు, చేయబడు సృష్టి, సృష్టి జరుగుట అను మూడును ఒక దాని నుండియే ఏర్పడుచున్నవి. అట్లేర్పడు కారణమే ప్రకృతి. ఒక కాగిత మును త్రికోణాకారముగా మడచినచో, ఆ కాగితమునందే మూడు కోణములు, వాని నడిమి వైశాల్యము వేరుగా నేర్పడుచున్నవి గదా! అట్లే ప్రకృతి కారణముగా ఈ సృష్టికి కారణమైన సృష్టికర్త, సృష్టిలోని జీవులు, వారికిని సృష్టికర్తకును నడుమగల కార్యకారణ సంబంధము లేర్పడుచున్నవి. ఈ సృష్టి ఎవనియందు జరుగుచున్నదో అట్టి అంతర్యామియే పురుషుడు. సృష్టి జరుగుటలో పురుషుడు జీవుడుగా నేర్పడును. ప్రకృతి, పురుషుడు అను ఇద్దరియందు ఈ సృష్టి జరుగుచున్నది. సృష్టించువాడు, సృష్టింపబడునది, సృష్టియను పని - అను మూడు సంబంధము లేర్పడుటకు హేతువే ప్రకృతి. సృష్టిలోని అనుభవమునకు హేతువే పురుషుడు. ఈ పురుషుడే ప్రకృతి యందుండి అందు ఉద్భవించు చున్న గుణములను అనుభవించుచున్నాడు. వంట యింటిలోని బియ్యము, ఉప్పు, చింతపండు, నీరు, కూరలు అనువాని యందు లేనట్టి రుచులు వంట చేయుటలో నేర్పడుచున్నవి. అట్లే ప్రకృతి పురుషుల సంయోగమున సృష్టి అనుభవము లేర్పడుచున్నవి. వాని యనుభవమును పొందువాడు జీవుడు. కార్యక్రమము ఏర్పడుటకు హేతువు ప్రకృతి. వంటకములు వంటయింటిలో వండబడుచున్నప్పుడు రుచులు వెలువడుచున్నవి గదా! వానితో జీవులకు అనుభవము కలుగును. దానివలన రుచులయం దభిలాష కలుగును. కలిగిన

యభిలాషకు తగినట్టి వంటకములను వండుకొని తినుచుందురు. అట్లే ప్రకృతి గుణములయందు పురుషునకు కలిగిన పరిచయము వలననే జన్మ లెత్తుట జరుగుచుండును. కలిగిన పరిచయమును, అభిలాషను బట్టి దానికి తగిన జన్మము మంచిదిగాని, చెడ్డదిగాని కలుగుచుండును. అట్టి అనుభవము నందు అభిలాషపడువాడు, జన్మల అనుభవమును పొందువాడు పురుషుడు. అట్లు అభిలాషపడుట, అనుభవమును పొందుట అను వింతలను చూచుచున్న వాడు కూడ అచ్చటనే హృదయమునందు ఉన్నాడు. వానినే ఈశుడు, ఈశ్వరుడు, మహేశ్వరుడు, పరమాత్మ యందుము. ఇన్నిటికిని క్షేత్రముగనే ఈ దేహమున్నది. అనుభవించువాడుగా పురుషు డున్నాడు. అనుభవించు వానిని, అనుభవమును గమనించువాడుగా ఈశ్వరుడున్నాడు. (21-23)

## ప్రకృతి - గుణములు :

ఈ మొత్తమును అవగాహన చేసికొనవలె నన్నచో మొదట ప్రకృతిని, ప్రకృతి గుణములను అర్థము చేసుకొనవలెను. ప్రకృతి యనగా స్వభావము. తన స్వభావము వేరు, తాను వేరు అని క్రమముగా తెలియును. స్వభావము మూలముననే తాను వ్యక్తమగుచున్నాడు గాని, లేనిచో తాను అంతర్యామిగనే యుండెడివాడు. స్వభావమునందు ప్రకాశించుట వలన ఈ సృష్టిగా, జీవ రాశులుగా, నీవుగా, నేనుగా భేదభావము కనిపించుచున్నది. గుణముల కలయిక చేత ఎవని స్వభావము వానిదిగా నేర్పడును. ఇన్నిటికిని మూలమైన ఒకే స్వభావము నందు ఇన్నియు వేరువేరుగా వర్తించును. ఆ ఒకే స్వభావమే గుణాతీతమైన ప్రకృతి. ఈ విధముగా ప్రకృతిని, గుణములను ఎవడు తెలిసికొనుచున్నాడో వాడు ఏమరుపాటు పొందడు. ఇన్ని విధములుగా, ఇందరి స్వభావములుగా సృష్టిలో వర్తించుచున్నను జన్మ బంధమును పొందడు. తనను తానే చూచుకొనుచుండును. కొందరు ధ్యానమార్గమున తమను తాము చూచుకొందురు. కొందరు జ్ఞానము నార్జించి పరమార్థమును గ్రహించి దర్శింతురు. కొందరు యోగాభ్యాసము చేసి తరింతురు. కొందరు సత్కర్మల నాచరించి, ఫలితములను సమర్పణము చేసి కర్మయోగముచే దర్శింతురు. కొందరు సూటిగా 'నేను-తాను' అనుభూతిగా దర్శింతురు. మరి తెలియని వారికి దీనిని తెలియగల విధానమేది యని సందేహము కలుగవచ్చును.

అట్టివారు ఇతరుల నుండి తెలిసికొని అభ్యాసము చేసి దర్శింతురు. (తెలియని వారు, తెలిసినవారు అను భేదము ప్రకృతి గుణముల యందు గల భేదమే గాని, ప్రకృతి యందుగల భేదము కాదు. అంతర్యామికీ భేదముండనే యుండదు. జీవుడు అంతర్యామి యందే భాసించుచున్నాడు గనుక, తెలియని వారు తెలిసినవారి నడిగి ఈ తత్త్వమును దర్శింపగలుగుట సాధ్యపడు చున్నది.) తెలియనివారు ఇట్లు తెలిసికొనుట వలన, తెలిసినవారు పొందిన స్థితినే పొందుచున్నారు. అనగా జనన మరణములు ఉన్నవనుకొను అజ్ఞాన స్థితినుండి, తాను అమృతత్త్వమున నున్నానను శాశ్వతస్థితికి చేరుకొను చున్నారు. ఈ జ్ఞానము మొదట ఎవ్వడైనను విని తెలిసికొనవలసినదే గనుక, ఇది శ్రుతి విద్యగా నున్నది. విని ఊరకొనువారు గాక, విని ఆ తత్త్వమే తాముగా మారినవారు శ్రుతి పరాయణులు అనబడుచున్నారు. స్థావరములు, జంగమములు అనబడు సృష్టి భేదములలో నేదియైనను క్షేత్రము క్షేత్రజ్ఞుడు అనబడు రెండింటి కలయిక చేతనే అస్తిత్వము చెందుచున్నది. అట్టి యీ జీవరాశులలో అందరియం దొకడుగా నున్న పరమేశ్వరుని దర్శింపవలెను. నశించుచున్న రూపములలో, నశింపని వానిని గమనించి దర్శింపవలెను. అట్లు దర్శించినవాడే నిజమైన ద్రష్ట, (కుండలలోని మట్టిని జ్ఞప్తి యుంచుకొని, కుండలు వేరుగా నున్నవని నమ్మక, కుండల నుపయోగించుకొని జీవింప వచ్చును. అట్లే రూపములను నమ్మక, తెలిసినవారు ఆ రూపములలో వర్తించు చున్న వానిని జ్ఞప్తియందుంచుకొని, తామును వర్తించు చున్నారు. దానితో శాశ్వతత్త్వము నందుచున్నారు. (24-28)

అట్టి ద్రష్టలు ఈ సమస్తము నందును సమానముగా అస్తిత్వము చెందిన వానిని చూచుచున్నారు. వాడే ఈశ్వరుడు అనబడును. (మన హృదయముల యందు గమనించుచున్న వాడుగా అతడే యున్నాడు. ఆ స్థితిలో జీవు డనబడును. వానిని గమనించుచున్న వాడుగా అతడే యున్నాడు. వానిని ఈశ్వరు డందురు. ఈ యిరువురి సంబంధ మేర్పడిన హృదయమే ప్రకృతి - పురుషుల సమాగమ స్థానము. ఇట్లు సమాగమము చెందుటయే అస్తిత్వము.) ఇట్లు జీవుని ఈశ్వరుని దర్శించినవాడు హింసాబుద్ధి లేనివాడగును. (తనను

తాను హింసించుకొన నిష్టపడడు. సర్వ జీవరాశులలోను గల సార మీ యిరువురి సమాగమమే గనుక ఎవ్వరిని హింసించుట కిష్టపడడు.) (29)

## సృష్టికర్త కర్తృత్వము :

ఇక సృష్టిలో జరుగుచున్న కార్యక్రమమంతయు నాచరించుచున్న వాడెవరు? జీవుడా? ఈశ్వరుడా? మన మందరము చేయుచున్న పనులకు మనము కర్తలమా? కాదా? లేక ఈశ్వరుడే కర్తయా? అను ప్రశ్నలు మిగులును. ప్రకృతివలన యీ పనులన్నియు నాచరింపబడుచున్నవిగాని, వానికి కారణము ఈశ్వరుడు కాడు, జీవుడును కాడు. ఎవని స్వభావము వలన వాడు పనులను కల్పించుకొనుచు చేయుచున్నాడు? తానే చేయుచున్నానని నమ్ముచున్నాడు. రైలెక్కినవాడు ప్రయాణము చేయుచున్నానని నమ్ముచున్నాడు. కాని ప్రయాణము చేయుచున్నది రైలేగాని, తాను కాదు. అట్లే ఎవని ప్రకృతి వానియందు కర్మ ప్రేరణ కలిగించుచుండగా, దానికి తానే కారకుడ నమకొను చున్నాడు. ఇట్లున్న ప్రకృతి తత్త్వమును, కారకత్వమును గ్రహించి, తనను ప్రకృతి కన్న పరుడుగా ఎవడు చూడగలుగునో, వాడే తనకన్న పరుడుగా ఈశ్వరుని చూడగలుగును. తనకు ఈశ్వరునితోగల సంబంధమే భక్తియని గ్రహించును. ఈశ్వరునికి తనవలన ప్రయోజన మేమియులేదు. కనుక తనతో ఈశ్వరునకుగల సంబంధమునే కృప లేక దయ అని గ్రహించును. తానా గుణమును ఇతరులపై ప్రకాశింప జేయుటకు ప్రయత్నింపగా, ఈశ్వరుని దయ తనపై ప్రసరించునని తెలియును. ఇట్లు దర్శించినవాడు తా నీ కర్మలకు కర్తకాడని దర్శించును. (30)

వేరువేరుగా నున్న జీవులకు, పంచభూతములకు సమాగమ స్థానమే ప్రకృతి. ఈ ప్రకృతికి ఆధారమైన శాశ్వత స్థానము అంతర్యామియైన భగవంతుడు. ఇట్లు వేరు వేరుగా గల జీవులకు గల ఏకస్థానమును దర్శించిన వాడు పరబ్రహ్మమును తెలియును. కాళ్ళు, చేతులు, కన్ను, ముక్కు, చెవి మున్నగు వేరు వేరు భాగములు కలిగినను తా నొక్కడుగా నున్నానని జీవుడు తెలుసుకొనుచున్నాడుగదా! దాని నిదర్శనమును బట్టియే ఇందరు జీవుల యందును ఒకడే యున్నాడని తెలిసికొనగలుగును. ఈ ఏకత్వ జ్ఞానమును

ఈ సమస్త లోకముల యందును, అన్ని తావుల యందును ప్రవర్తింపజేసి, పరబ్రహ్మముయొక్క అనుభూతిని పొందుచుండును. ఈ పరబ్రహ్మము నందు అందరును పుట్టుచున్నారు గనుక పరబ్రహ్మమునకు మొదలు లేదు. చోటులో ఇల్లు కట్టుచున్నారు గనుక, చోటునకు కట్టబడుట యుండదు. అనగా పరబ్రహ్మము అనాది యని తెలియును. అతడు అవ్యయ స్వరూపుడు కూడనని తెలియును. అనగా వ్యయము కానివాడని యర్థము. మట్టితో చేయబడిన కుండలు పగులుచుండును గాని, మట్టి పగులుట యుండదు. అట్లే సృష్టిలో జీవులు అంతమొందెదరుగాని, ఆ జీవుల రూపమున వర్తించు చున్న పరబ్రహ్మమునకు అంతము లేదు. **(31, 32)**

ఈ సృష్టిలోని సర్వ వస్తువులును పరమాణువులచే నిర్మాణమై యున్నవి. పరమాణువుల లోపల వెలుపల నున్నది పరమాణువు కాదు. గిన్నెకు లోపల వెలుపల ఉన్నది గిన్నె కాదు. అట్లే ఈ దేహమునకు లోపల వెలుపల నున్నవి దేహములు కావు. దేహి యనబడువా డున్నాడు. అనగా దేహములు కలవాడు. అతడే గిన్నెకు లోపల, వెలుపలగల ఆకాశమున నిండియున్నాడు. అట్లే పరమాణువునకు లోపల వెలుపలగూడ నిండియున్నాడు. అతడు క్షేత్రజ్ఞుడు, మిగిలినదంతయు క్షేత్రము.

ఆకాశమున పుట్టి పెరిగిన వస్తువులుగాని అందలి పరమాణువులుగాని పుట్టుట, పోవుట ఉండును. ఆకాశమునకు పుట్టుట, పోవుట ఉండదు. చోటుకు వస్తువులలో రాకపోక లుండునుగాని చోటునకు వచ్చుట, పోవుట యుండదు. అది అనాది. ఏ వస్తువుయొక్క మంచి చెడ్డలుగాని చోటున కంటవు. అది నిర్గుణము. చోటులో నిండియున్న అస్తిత్వమునే పరమాత్మ యందురు. అతడీ దేహమున సమస్తము నిండియున్నాడు. అయినను దేహముయొక్క మంచి చెడ్డలుగాని, చెమట దుర్వాసన మున్నగునవిగాని, చేసిన మంచి పనులు, చెడ్డ పనులుగాని చోటున కంటనట్లే పరమాత్మకు అంటవు. ఆత్మకు కూడ నంటవు. దేహమునందలి అంతర్యామిని ఆత్మ యందురు. లోపల వెలుపల చోటులో నిండియున్న వానిని పరమాత్మ యందురు. ఆత్మగాని పరమాత్మగాని దేహముల చేతను, వాని మంచి, చెడుగుల చేతను స్పృశింపబడదు. **(33)**

ఈ సమస్త లోకమును ఒకే సూర్యుడు వెలిగించుచున్నాడు. ఈ వెలిగించుట రెండు విధములు. పగటిపూట సూర్యరశ్మి మనపైబడి మన కన్నులకు వెలుగు నిచ్చుట ఒక విధము. ఇది కేవలము ఐహికము. అనగా దేహమునకు, మనస్సునకు, యింద్రియములకు వేడిమిని, వెలుగును యిచ్చుట. అట్లు కాక ఈ సౌరకుటుంబములోని గ్రహములన్నియు సూర్యుని వెలుగునే ప్రతిబింబించుచున్నవి. అంతేకాదు. సూర్యుని నుండియే పుట్టి యీవలకు వచ్చి సూర్యుని చుట్టును తిరుగుచున్నవి. కనుక వానిలో నున్నది సూర్యుని అస్తిత్వమేగాని వేరొకటి కాదు. మన భూగోళము విషయమున గూడ అదే సత్యము. ఇందలి రేణువు లన్నియును సూర్యుని వెలుగు నుండి వెలువడిన నిప్పురవ్వల వంటివి. కనుక సూర్యుడే ఇన్నిటిని వెలిగించుచున్నాడనుట శాస్త్ర సమ్మతమైన ఉత్తమ సత్యము. అందు మన మున్నామను తెలివి, మెలకువ మనలో పుట్టి పనిచేయుటకు గూడ సూర్యుని అంతర్యామిత్వమే కారణము. సూర్యుడు ఈ సృష్టిని వెలిగించు చున్నాడనుటలో గల ఉత్తమ శాస్త్ర సత్యమిదే. ఇదియే ఆత్మ యనబడు వెలుగును గూర్చిన సత్యము.

ఈ విధముగా గమనించుకొని ధ్యానము చేసి దర్శించుకొనుట నభ్యాసము చేసినచో క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అను వారి సంబంధము తెలియును. ఈ తెలిసిన జ్ఞానముతో జీవితమును నడుపుకొనవలెను. ఎవడీ విధముగా క్షేత్ర క్షేత్రజ్ఞుల సంబంధమును గ్రహించి దర్శించి జీవించునో అతడు ఈ జీవరాశుల పుట్టుకను గూర్చిన సత్యమును గూడ దర్శించును. పరమాత్మ నుండి జీవరాశులు పుట్టుట సృష్టి స్వభావము. ఈ స్వభావమునే ప్రకృతి అందురు. ఈ ప్రకృతి యందలి ధర్మములను గూడ అతడు దర్శించును. దర్శించినపుడు వ్యామోహము కలుగదు. వాని స్వభావములలో చిక్కుకొనడు. ఉదాహరణకు ఎవడైన తనపై కోపించినచో తాను మరల కోపింపడు. కోపించుట ఎదుటివాని స్వభావమని జ్ఞప్తి యున్నవాడు కోపింపడు. జ్ఞప్తి లేనివాడు తాను కూడ కోపించి పిచ్చివాని వలెనే ప్రవర్తించును. ఇట్లు ప్రవర్తించువాడే బద్ధుడు. అట్లుకాక పరమసత్యమును జ్ఞప్తి యుంచుకొనినవాడు ముక్తుడు. క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అనువాని దర్శనము నభ్యాసము చేయుటవలన సకల బంధములు తొలగి మోక్ష స్థితి సిద్ధించును. **(34)**

ఇట్లు గుర్తుంచుకొనక కోపించుట, దుఃఖించుట, దిగులు పడుట మున్నగు మార్పులు చెందుటకు కారణమేమి? ప్రకృతిలోని వేరు వేరు ధర్మములే దీనికి కారణము. వంట చేయునపుడు ఉప్పు, చింతపండు, మిరపకాయ వాడుదుము. వాడినపుడు మనకు కావలసిన మంచి రుచి ఏర్పడునుగాని ఉప్పు రుచి, చింతపండు రుచి, మిరపకాయ రుచి మిగులదు. ఈ మార్పు దేనివలన కలుగుచున్నది? మూడు వస్తువులకును వేర్వేరు లక్షణములుండుట వలన నొకదానిపైనొకటి ప్రభావము చూపి మార్పును కలుగజేయుచున్నవి. అట్లే ప్రకృతిలోని మూడు వేర్వేరు గుణములు ఒక దానిపై నొకటి పనిచేసి మన వ్యక్తిగత స్వభావముగా నేర్పడుచున్నవి. ఈ స్వభావముతో ప్రవర్తించు మనకు ఎదుటివారిలోని గుణముల కలయిక ఒక మొత్తముగా కనిపించునేగాని, ఆ గుణములు కనిపించవు. ఒకని కొకడు కనిపించుట, నచ్చుట, నచ్చకుండుట యేర్పడును. దానితో మనము ప్రకృతిని, త్రిగుణములను మరచి ఒకరినొకరు మాత్రమే చూచుకొని అభిమానములో, కోపతాపములో పొందుచుందుము. కనుక త్రిగుణముల కలయిక వలన జీవులు తామెవరో గుర్తుండక ఒకరి కొకరుగా మాత్రమే గుర్తుందురు. అదే రక్తము మాంసము మొదలగు ధాతువు లలో చేయబడిన రెండు దేహములలో నున్న ప్రజ్ఞ భార్యా భర్తలుగా గుర్తించు చున్నది గదా! భర్త మనస్సునకు భార్య కనిపించుచున్నదే గాని అక్కడ భార్య లేదు. అక్కడ ఉన్నవి రక్త మాంసాదులు, జీవకణములు, అణువులు, మనస్సు, ఇంద్రియములు, అహంకారము మున్నగునవి. వానిని మరచి భార్యను చూచు చున్నాడు. అట్లు చూడనిచో ఈ సృష్టి కథయే జరుగదు. కనుక ఉన్న సత్యమును మరుగుపరచుకొని తన మనస్సునకు అనిపించుచున్న దానిని చూచుటయే మనము చేయుచున్నాము. ఈ విచిత్రమైన ఏమరుపాటునే బంధము (Self-Conditioning) అందురు. దీనిని గుర్తుంచుకొని మరువకుండ మెలగుటనే మోక్షము (Liberation) అందురు. బంధమునకు కారణములు త్రిగుణములు. వానిని గూర్చిన శాస్త్రదృష్టితో తెలిసికొనుట వలన జీవుడు వానిని దాటగలుగు చున్నాడు. అట్టి త్రిగుణములను గూర్చిన విశేషములు ఇటుపైన వివరింప బడును. (35)

పదునాలుగవ అధ్యాయము

# గుణత్రయ విభాగ యోగము

**త్రిగుణముల గమనిక :**

సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణముల యెరుక వలన ఆ గుణములలోని అంతర్యామి యెవడో గుర్తుండును. కనుక ఈ తెలియుట ఉత్తమ జ్ఞానము. ఏది తెలియుట వలన మన మెవ్వరమో అను విషయము మరపులేక గుర్తుండునో అదియే ఉత్తమ జ్ఞానము. ఈ త్రిగుణములను గూర్చి తెలిసికొనదలచిన వానికి ఓపిక యుండవలెను. త్రిగుణములకు వశమగుట యనగా చికాకు పడుట, కోపపడుట, దుఃఖపడుట, వ్యామోహపడుట, అసహ్యించుకొనుట మొదలగునవి. కనుక లోకముపై ఈ చికాకు పడుట మొదలగు విధానములలో పడుచు లేచుచున్నవాడు త్రిగుణముల ప్రభావములో నుండును గనుక, త్రిగుణములను గూర్చిన జ్ఞానము పొందలేడు. రైలుబండిలో ప్రయాణము చేయువాడు ఆ రైలెట్లు పోవుచున్నదో చూడగలడా? కిటికీలో నుండి చూచినచో వస్తువులు పరుగెత్తుచున్నట్లు కనిపించును. దానిని బట్టి తాను కూర్చుండిన రైలు పరుగెత్తుచున్నదని గ్రహింపవలెను. అట్లే త్రిగుణముల ప్రభావమును గమనింపదలచినవాడు కోపతాపములు పడక, ఇతరుల ప్రవర్తన యెడల ఓపికతో మౌనము వహింపవలెను. ఇది వాక్కులకు సంబంధించిన మౌనము కాదు. మనస్సునకు సంబంధించిన మౌనము. ఇతరుల ప్రవర్తన యెడల ఈ విధమైన మౌనము వహించినవారే మౌనులు లేక మునులు అనబడుదురు. పూర్వము మునులందరును ఈ విధముగా జీవించియే ఉత్తమమైన సిద్ధిని పొందిరి. అనగా త్రిగుణముల సత్యము గ్రహించి, వానికి వెనుకనున్న సత్యముగా తాము నిలబడిరి. (1)

ఈ జ్ఞానము నాశ్రయించిన మహానుభావులు నాతో సమానమైన

ధర్మమును పొందుచున్నారని కృష్ణుడు చెప్పెను. నాతో సమాన మనగా అందరియందున్న 'నే' నను వెలుగుతో సమానము. ప్రకృతియందలి త్రిగుణములను ఉపాసించువారు ప్రకృతి మాయలో పడరు. ఉపాసించుట యనగా ప్రకృతినికూడ అంతర్యామిగనే గమనించుట. అట్లే త్రిగుణములను కూడ అంతర్యామిగనే గమనించుటవలన మాయలో చిక్కక ఆత్మజ్ఞానము నందుండుట జరుగును. ఈ సిద్ధిని పొందినవారు సృష్టియందు మరల పుట్టుట గాని, సృష్టి యంతమునందు నశించుటగాని యుండదు. దేహాదులు పుట్టు చున్నప్పుడు మనము పుట్టితి మనుకొనుట యుండదు. కనుక వీరికి పుట్టుట యుండదు. అట్లే దేహము విడచునప్పుడు తాము చనిపోయితి మనుకొనుట యుండదు. గనుక వీరికి చనిపోవుట యుండదు. జననము, మరణము తనకు సంబంధించినవి కావనియు, దేహాదులకు సంబంధించిన వనియు తెలిసిన వారికి పుట్టుట, చనిపోవుట యుండవు. 'నేను' అను మాటకు అన్నిటియందున్న అంతర్యామి యని సరియైన అర్థము. అట్టి అంతర్యామియే త్రిగుణముల రూపమున సృష్టిగా దిగివచ్చుట జరుగుచున్నది. దానినే పుట్టుట యనుచున్నారు. (2)

ఈ మహాకాశమున ఎల్లప్పుడును అంతర్యామి యీ సృష్టిగా వ్యక్త మగుచునే యుండును. అట్టి యీ మొత్తమునే బ్రహ్మయందురు. మహత్తు అనబడు ఈ బ్రహ్మయే మహాకాశమున గర్భము ధరించుచున్నాడు. అనగా గోళముగా నేర్పడుటయు, అందు సూర్యుడు, గ్రహములు మున్నగునవి పుట్టుకొని వచ్చుటయు జరుగుచున్నది. దీనివలన సమస్త జీవరాశుల యుత్పత్తియు జరుగుచున్నది. దానివలననే అనేక జీవుల గర్భము లేర్పడుటయు, అందు వేర్వేరు ఆకారములు చోటులో నేర్పడుటయు జరుగు చున్నది. కుండలు తయారుచేయునపుడు అచ్చటి చోటు కుండవంటి ఆకారమును పొందుచున్నది గదా! అట్లే అంతర్యామియందు దేహములు ఆకారములుగా పుట్టుచున్నవి. వానియందు అంతర్యామి అన్ని ఆకారములు కలవాడుగా కనిపించుచున్నాడు. ఒకే ప్రజ్ఞ యిన్ని రూపములతో వర్తించు చున్నాడు. త్రిగుణముల ప్రభావము వలన ఎవనికి వాడుగా వేరగు చున్నాడు.

ఒక్కొక్క దేహమునందు అంతర్యామియే విత్తనము నేర్పరచి, అందుండి జీవుల రూపములను కల్పించుచున్నాడు. మఱ్ఱిగింజ నుండి మఱ్ఱిమొక్కయే పుట్టును గాని, మరియొక వెఱ్ఱిమొక్క పుట్టదు. ఇట్లు పుట్టవలెనని మఱ్ఱిమొక్క కెట్లు తెలియును? తెలిసి జ్ఞప్తియున్న ప్రజ్ఞ ఆ మఱ్ఱిగింజలో నుండి యుండవలెను గదా! అట్లే ప్రతి జీవికిని బీజముగా చోటు అనబడు గర్భమునందు భగవంతుడే ఏర్పడుచున్నాడు. **(3, 4)**

ఇట్టి మార్పులు జరుగుచుండుటకు దేవుడను ఒకే వస్తువున్నచో చాలదు. వానినుండి దిగివచ్చిన ప్రకృతియను రెండవ వస్తువు ఉండవలెను. మనకు గడ్డము మొలచి మనకన్న వేరుగా గుర్తింపబడుచున్నది కదా! అట్లే మన దేహభాగములు, దేహము, మనస్సు, యింద్రియములును మననుండియే దిగివచ్చి మనలో భాగములుగా వర్తించుచు, మన చేతనే వేరుగా గుర్తింపబడు చున్నవి. అట్లు భగవంతునినుండి దిగివచ్చినదే ప్రకృతి లేక భగవంతుని స్వభావము. దానినుండి త్రిగుణములు పుట్టి ప్రకాశించుచున్నవి. సూర్యుని నుండి సూర్యకిరణము పుట్టినట్లు ప్రకృతి భగవంతుని నుండి దిగివచ్చు చున్నది. సూర్యకిరణము నుండి ఇంద్రధనుస్సు రంగులు వెలువడినట్లు త్రిగుణములు వేరగుచున్నవి. వానినే సత్త్వము, రజస్సు, తమస్సు అందురు. రజస్సు వేగము లక్షణముగా గలది; తమస్సు బరువు లక్షణముగా గలది. రజస్సు గుఱ్ఱము వంటిది; తమస్సు బండి వంటిది; లేదా రజస్సు కారులోని పెట్రోలు వంటిది; తమస్సు కారుయొక్క స్థూలభాగముల వంటిది. ఈ రెండింటిని జతపరచి నడుపునట్టి డ్రైవరు బుద్ధివంటిదే సత్త్వగుణము. ఈ మూడింటి భేదముల వలన నేర్పడిన పరస్పర సంబంధము కారణముగా ఈ సృష్టి నిర్వహింపబడుచున్నది. ఈ మూడు గుణములవలన నేర్పడిన క్రొత్త రూపములు, వైఖరులు సృష్టిలోని వివిధత్వముగా నేర్పడుచున్నవి. ఈ మార్పులతో కూడిన దేహములలో జీవించుచు, మనస్సులందు వర్తించుచు, ఇంద్రియముల సహాయమున ఒకరి నొకరు గమనించుచు, చుట్టరికములు, మిత్రత్వ శత్రుత్వములు, డబ్బు విలువలు మున్నగు విలువలు కల్పించుకొని జీవులు ప్రవర్తించుచున్నారు. ఈ సందడిలో ఈ మొదటి స్థితి గుర్తుండక బద్ధులగు చున్నారు.

## త్రిగుణముల లక్షణములు :

ఈ త్రిగుణములలో రజస్సునకు, తమస్సునకు పరస్పర విరుద్ధములైన ప్రత్యేక లక్షణము లున్నవి. ఈ రెండును సామ్యము చెందిన వెనుక నేర్పడు నట్టి నిర్మల స్థితియే సత్త్వము. అంతేగాని సత్త్వము వేరుగా నొక ప్రత్యేక గుణము కాదు. అయినచో త్రిగుణములలో నొకటిగా చెప్పబడుట యెందులకు? రజస్తమస్సులతో పోల్చినచో సత్త్వము కూడ ఆ రెండింటి కన్న భిన్నమైన యొక స్థితి గనుక చెప్పబడినది. ఎర్రని అద్దము, నల్లని అద్దము, స్వచ్ఛమైన అద్దము వేర్వేరుగా మూడు కిటీకలకు అమర్చబడి యున్నచో వానిని మూడు విధములైన అద్దములని చెప్పుచున్నాము గదా! రంగులేని అద్దమునకు స్వచ్ఛతయేగాని వేరు విధము లేదు. అయినను దానిని స్వచ్ఛమైన అద్దమని, రంగులేని అద్దమని వేరుగా పరిగణించుచున్నాము. అట్లే సత్త్వగుణము కూడ మూడవ గుణముగా చెప్పబడుచున్నది. అది దేనితోను వ్యతిరేక లక్షణమున్న గుణము కాదు; దేని తోను సమాన లక్షణమైన గుణము కూడ కాదు. రజోగుణమునకు మహావేగము ప్రత్యేక లక్షణము. తమోగుణమునకు స్థూలత, మందత ప్రత్యేక లక్షణములు. చూచుచున్నవారి కంటికి చీకటి కనుపించుటకు తమోగుణము కారణము. వెలుతురు కనుపించుటకు రజోగుణము కారణము. ఆ రంగులు చూడబడు చున్న వస్తువు లందుండవు. చూచుచున్న ఇంద్రియములకు గుణములై, తత్ఫలితముగా చీకటి, వెలుతురు అనిపించును. చూచునట్టి యంత్రములైన కన్నులు, మనస్సుకాక, వానిలో నుండి చూచుచున్న దేహికి తమస్సు గాని, రజస్సు గాని లేవు. కనుక రజస్తమస్సులు తొలగింపబడినప్పుడు జీవియొక్క స్వచ్ఛత యనుభవింపబడును. దానినే సత్త్వగుణము అందురు. (5)

సత్త్వము నిర్మలత్వమును కలిగియుండును. అది ద్రష్టయొక్క ప్రకాశమే అయి ద్రష్టచే అనుభవింపబడును గనుక, ఆ యనుభవమున మోసము లేదు. కంటిజబ్బు లేనివాడు కళ్ళజోడు లేకుండ లోకమును చూచినట్లు, సత్త్వగుణ సంపన్నునకు సృష్టిలోని పరబ్రహ్మ తత్త్వము ఉన్నది ఉన్నట్లు అనుభవమునకు వచ్చును. అయినను వేరుగా అనుభవింపబడుచున్నది గనుక, తన యనుభవముచే జీవుని బద్ధుని చేయును. ఇది యే విధముగా జరుగును?

రోగికి ఆరోగ్యము చేకూర్చునట్టి ఆయుర్వేద ఔషధమగు చ్యవనప్రాశము నోటికి రుచిగా నుండును. ఆ రుచిని బట్టి అదే పనిగా తినవచ్చునా? సంగీతము చెవుల కింపుగా నున్నదని ఎచ్చటనో కూలబడి వినుచు ఇంటి పనులు మాన వచ్చునా? అట్లే సత్త్వగుణము మంచిదనుకొని ధ్యానములో ఆనందించుచు కూర్చుండబుద్ధి యగును. అట్లు అనిపించుటయే సుఖ సంగము. అనగా సుఖస్థితి యందు సంగదోషము కలుగుట. క్రొత్తగా యోగాభ్యాసము చేయు వారు, క్రొత్తగా పూజాదులు చేయువారు అహోరాత్రములు దీక్షలో నుండుట మంచిది అనుకొనుచుందురు. తనకు సుఖముగా నున్న స్థితిలోనే యుండ దలచుట సంగదోషమే యగును. అది లేకుండ చూచుకొనిననాడు సత్త్వ గుణము మోక్షద్వార మగును గనుక, మిగిలిన రెండు గుణములకన్న దానికి ప్రత్యేక గౌరవము.

సత్త్వగుణమునకు సుఖసంగమే గాక జ్ఞాన సంగము కూడ నున్నది. జ్ఞానస్థితి యందు నిలిచియుండ వలెనను నభిలాషయే జ్ఞాన సంగము. ఇట్టి అభిలాష కలవాడు అజ్ఞానమున తప్పక పడును. జ్ఞాన సంగములేని జ్ఞానము, సుఖ సంగము లేని సుఖానుభవము, పతనము లేని సుఖస్థితి నిచ్చును. జాగ్రత్తగా పరిశీలించినచో సుఖ సంగము లేకుండుటయే నిజమైన సుఖముగాని, సుఖమునకై యత్నించుట కాదు. జ్ఞాన సంగము లేకుండుటయే జ్ఞానముగాని, జ్ఞానమునకై యత్నించుట కాదు. రజస్తమస్సులకు భయపడి తప్పుకొన యత్నించువాడు వానినే స్మరించుచుండును. కనుక త్రిగుణ స్థితులలో దేనిని కావలె ననుకొనినను, అక్కర లేదనుకొనినను దానినే స్మరించుచుండును గనుక దానియందే బంధింపబడును. త్రిగుణములను గూర్చిన యీ రహస్య మునే కృష్ణుడు మొట్టమొదట వివరించుచున్నాడు. (6)

సత్త్వగుణము సుఖ సంగముతోను, జ్ఞాన సంగముతోను బంధించును. రజోగుణము కర్మ సంగముతో బంధించును. అనగా "ఈ పని చేయవలెను. ఈ మహాకార్యము సాధింపవలెను. సంఘమును మరమ్మత్తు చేయవలెను. వారు నశింపవలెను; వీరు వర్ధిల్లవలెను'' మున్నగు సంకల్పములు మనస్సున నినాదములు చేయుచు రణభేరులు మ్రోగించుచుండును. ఇక విశ్రాంతికి తీరుబడి యుండదు. నిశ్చలత్వమన్నచో సిగ్గుచేటు, నిర్మలత్వ మన్నచో చవట

దనము. సత్త్వగుణ స్వరూపులు, నిర్మల జీవులు వీరి దృష్టిలో చేతకానివారు. ఈ రకమైన మనః ప్రవృత్తి మనస్సునకు రాగమును పెంపొందించును. దానితో తాను నమ్మిన మంచి పనులకై తృష్ణ పెరుగును. తృష్ణ యనగా మనస్సునకు దప్పిక వంటి స్థితి. దానితో సుఖము లేకుండపోవును. సత్త్వగుణము కలవానిని సుఖము బంధింపగా, రజోగుణము కలవానిని తృష్ణ బంధించును. తాను చేయదలచుకొనిన పనులకోసమై అహోరాత్రములు తపించుచు యత్నించు చుండును. (7)

తమోగుణము అజ్ఞానము నుండి పుట్టును. అజ్ఞాన మనగా తెలియ కుండుట. తమోగుణము కలవారికి ఏమి చేయవలెనో తెలియదు. అనగా ఏమియు చేయవలదనియే అనిపించును. ఇదియే అలసత లేక ఆలస్యము. దీనినే సోమరితన మందురు. దానితో స్తబ్దత, నిర్లక్ష్యము తోడుకాగా, అదియే వైరాగ్య మనుకొనును. ఏమియు చేయకుండుట అభ్యాసమైనచో మనస్సునకు బాగున్నట్లుండును. సుఖముగా నున్నదనిపించును. ఇది సత్త్వగుణము కలవారికి అనిపించు సుఖము కాదు, కేవలము శూన్యస్వరూపమైన జడత్వము. ఇందు సుఖముండదు గాని, అలవాటు చొప్పున అది సుఖమను భ్రమ కలుగును. తమోగుణము వలన ప్రమాదము కలుగును. అనగా పొరబాట్లు చేయు చుందురు. చేయకూడని పని చేయుట, చేయవలసిన పని చేయకుండుట, తప్పనిసరియగు పని ఆలస్యముగా చేయుట మున్నగు లక్షణము లేర్పడును. సోమరితనముతో వంట చేయకుండ కాలక్షేపము చేసినచో ఆకలి తొందర పెట్టినపుడు ఏదో చెత్త తినుట తప్పనిసరి యగును. అట్లే చేయవలసిన పని చేయకుండుట అలవాటైనచో చేయకూడని పనులు అలవాటగును. దానితో భయము పీడించుట ప్రారంభమగును. రైలు బండికి టైము మించిపోవువరకు జాప్యము చేసి రైలు అందదను భయము, కార్యభంగ మగునని భయము, పరనిందా భయము మొదలగు నెన్నో భయములతో సతమతమగును. సోమరితనము వలన నిద్రయు, పనులు దాటిపోవుట వలన భయమును పీడించు చుండును. అయినను అభ్యాసమైనచో వదలలేనట్టి దుర్వ్యసన బుద్ధి సోమరితనము వలన నేర్పడును. అట్టివాడు కార్యభంగమునకైన ఓర్చునుగాని, సోమరితనము భంగమగుట కంగీకరింపడు. తమోగుణమున చిక్కినవానిని

అది మోహింపజేయును. కనుకనే సర్వదేహులకును తమోగుణము మోహన మని భగవానుడు చెప్పెను. (8)

## త్రిగుణముల ఆవశ్యకత :

సత్త్వ రజస్తమస్సులు మూడును సంగము పుట్టించునని హెచ్చరిక చేయబడినది. సత్త్వము వలన జ్ఞాన సంగము, సుఖ సంగము కలుగును. రజస్సు వలన తృష్ణా సంగము, కర్మ సంగము కలుగును. ఈ మూడు గుణములలో దేని ప్రత్యేకత దాని కున్నది. అయినచో సృష్టిలో త్రిగుణము లుండుట యెందులకు? సృష్టి రహస్యమిందే యిమిడి యున్నది. సంగదోషము మనస్సు నకు సంబంధించినదిగాని, త్రిగుణములకు సంబంధించినది కాదు. కాలికి బురద అంటుకొను ననగా, అది కాలికి సంబంధించినదే గాని బురదకు సంబంధించినది కాదు. అన్ని వస్తువులతోబాటు బురదకూడ చోటులోనే యున్నది గదా! మరి చోటున కంటుకొనదేమి? అట్లే మనస్సునకు అంటించు కొనుట యున్నచో అంటుకొను గుణము త్రిగుణముల కున్నది. ఒక్కొక్క విధమైన గుణము నంటించుకొనుట వలన ఒక్కొక్క దోష మంటుకొనును. జ్ఞానము, సుఖము కావలెనని కోరుట, అదిలేని చోటు చూచి బాధపడుట సత్త్వమువలన కలుగును. గొప్ప పనులు చేయవలెనను తహతహ, అవి చేయ లేనిచో పట్టుదల, కోపము మున్నగునవి రజోగుణ దోషములు. సోమరితనము, నిద్రమత్తు, తప్పులు చేయుట తమోగుణ దోషములు. మూడు దోషములలో నేదియైనను జీవుని బద్ధుని చేయును. బద్ధుడుగా నుండుటయే మోక్షము పొందకుండుట. రజ స్తమస్సులలో బద్ధుడైనవాడు తప్పించుకొనలేడు. సత్త్వ గుణము లోనికి అడుగుపెట్టినవాడు కాలక్రమమున వివేకము పొంది బంధము నుండి తప్పించుకొన గలుగును. కనుక మూడు గుణములలో రజస్తమస్సుల ప్రకోపము నుండి విడిపించుకొని సత్త్వగుణ మబ్బించుకొనుటకు సత్కర్మా చరణము, సత్సాంగత్యము అలవరచుకొనవలెను. దానికొరకే యజ్ఞ దాన తపస్సులు, భూతదయాచరణము మున్నగునవి యేర్పడినవి. ఈ మంచి పనులను మనము చేయుచుండుట లోకోపకారమున కనుమాట కల్ల. మన స్వభావము మారి సత్త్వగుణము మనకు అలవడుటకు మాత్రమే యనుట

సత్యము. పరోపకార మెప్పుడును మహనీయుల వలననే జరుగుచుండును. సాధకుడు సత్కర్మల నాచరించుట తనను తా నుద్ధరించుకొనుటకే!

మంచుగడ్డ, నీరు, నీటి యావిరి అను మూడు స్థితులు లేనిదే నీటికి అస్తిత్వమే లేదు. ఘన పదార్థము, ద్రవ పదార్థము, వాయు పదార్థము అను భేదము లేనిదే దేహమునందలి ఎముకలు మున్నగు గట్టి పదార్థము, రక్తమను ద్రవపదార్థము, శ్వాసయను వాయుపదార్థము లేవు. అనగా దేహములు, దేహ ధర్మములు నుండవు. పై మూడు భేదముల మూలముననే దేహమునకు అస్తిత్వ మున్నది. తమోగుణము కారణముగా ఘనపదార్థము, రజోగుణము కారణముగా అగ్ని వాయువులు, సత్త్వగుణము కారణముగా తెలివియు వ్యక్తమై వ్యక్తిగా రూపొంది నిలబడుచున్నవి. త్రిగుణములు లేనిదే సృష్టి జరుగుటయు సాధ్యము కాదు. రజోగుణము సృష్టికి కారణము. తమోగుణము లయమునకు కారణము. సత్త్వగుణము స్థితికి లేక అస్తిత్వమునకు కారణము. ఈ మూడు గుణములకు అధిష్ఠాన దైవతములే త్రిమూర్తులు. గుణములు లేని భగవంతుడు రజోగుణమున సృష్టింపగోరును. సత్త్వగుణమున క్రీడింపగోరును. అనగా అనుభూతి చెందును. తమోగుణమున మరల గుణములు లేని స్థితిలోనికి అంతర్హితుడగును.

అజ్ఞానము లేనిదే జ్ఞానము లేదు. రెండింటికి నడుమ కర్మసాధన ముండును. వరిగింజలమీద పొట్టువలె అజ్ఞానము, లోపలి గింజవలె జ్ఞానము ఉండగా, దంచుకొని పొట్టును తొలగించి బియ్యమును వినియోగించుకొనుట యను కర్మ పుట్టుచున్నది. బుద్ధిమంతుడు త్రిగుణములను నిందింపక, వానిని వినియోగించుకొను నేర్పరితనము నభ్యాసము చేయవలెను. త్రిగుణములు తనను బంధింపకుండ తాను త్రిగుణముల వినియోగమును పొందవలెను. ఇది సాధ్యపడవలె నన్నచో త్రిగుణముల స్వభావము తెలియవలెను. దాని శాస్త్రమే ఈ యధ్యాయమున చెప్పబడినది. జీవులు గర్భములయందు పుట్టి దేహము ధరించుట వలన త్రిగుణములచే బంధింపబడుట జరుగుచున్నది. త్రిగుణాత్మకమైన ప్రకృతితో నేర్పడిన దేహమునం దుండియే త్రిగుణముల బంధము లేకుండునట్టి యభ్యాసము చేయవలెను. అట్టి యభ్యాసము

చేసినవాడు జనన మరణముల కతీతుడగునని ఈ యధ్యాయముననే ఈ శాస్త్రమునకు ఫలశ్రుతిగా చెప్పబడినది.

పుట్టుకచేతనే జీవికి త్రిగుణములలో నేదో యొక గుణము ప్రాధాన్యము వహించును. మిగిలిన రెండును దానితో కలియును. ఈ కలయికలో భేదములే వ్యక్తిగతములైన స్వభావ భేదములుగా నేర్పడుచున్నవి. వానిని బట్టియే చేష్టా భేదములు కూడ నేర్పడుచున్నవి. ఈ భేదముల వలననే పరస్పర సంబంధములు పుట్టి రాగద్వేషాదులు పుట్టుచున్నవి. చాలకాలము వానితో కొట్టుకొనుపోవుచున్న జీవి కొంతకాలము తరువాత నిదానించి చూచుట నేర్చుకొనును. కామ క్రోధాదులు కలిగినను దమించుకొనుట, అటుపైన తక్కువగా కలుగు చుండుట, అటుపైన కలుగకుండుట అను స్థితులు కాలక్రమమున నేర్పడును. ఈ మార్పులను గమనింపగా నొక దీర్ఘ రోగికి మెల్ల మెల్లగా ఆరోగ్యము చేకూరుటవలె నుండును. రాగద్వేషాదులు కలుగుచున్న జన్మలలో కర్మ బంధము మరల మరల పెరుగుచుండును. నివృత్తి యబ్బిన కొలదియు కర్మబంధము సడలి తొలగిపోవును. ఇన్నిటికిని కారణము త్రిగుణముల స్వభావము కాదు. జీవియొక్క సామర్థ్యమును కాదు. జీవి పరిణామక్రమము లోని సామర్థ్యము కూడ కాదు. ఇన్నిటియందు అంతర్యామిగా పనిచేయుచున్న దైవలీలయే కారణము. బంధము నుండి విముక్తి యగునట్టి చిట్టచివరి దశలో అదియే అనుగ్రహ మనబడును. అంతకు ముందరి దశలు అదియే జీవియొక్క స్వప్రయత్నముగా గమనింపబడును. అంతకు ముందరి దశలో జీవి యొక్క అజ్ఞానముగా గమనింపబడును. ఈ మూడును ఒకే భగవత్కథలోని అధ్యాయ ములైన జగత్కథలు.

ఏ దశలో నున్న జీవికి ఆ దశయే నిజమనిపించును. అదియే పరమ సత్యమనిపించును. మొదటి దశలో నున్నవానికి ఈ సమాజము స్వార్థ భూయిష్టముగా కనిపించి స్వార్థపరునిగా ప్రవర్తింపజేయును. రెండవ స్థితిలో నున్నవానికి ధర్మాధర్మములు ఇచ్చిపుచ్చుకొనుటలో పురుషప్రయత్నముపై నమ్మకము దృఢముగా నేర్పడును. మూడవ దశలో నున్నవానికి స్వధర్మాచరణ రూపమైన సత్కర్మాచరణము సాధనమార్గముకాగా, దైవానుగ్రహము, అంతర్యామిత్వము, మోక్షధర్మము బోధపడును. ఈ మూడు స్థితుల వారికిని

కావలసిన పద్ధతిలో త్రిగుణములు పనిచేయుచు కావలసిన శిక్షణ నిచ్చుచుండును.

**గుణసంగము :**

సత్త్వరజస్తమస్సులు మూడును దేహ వ్యూహమందున్న మూల యంత్ర మందలి మూడు భాగములు. మనము వాడుకొనుచునే యుందుము గాని, యంత్రమునకు ఎన్ని చక్రములున్నవో, ఏది యెట్లు తిరుగుచున్నదో తెలియదు. దేని నెట్లు త్రిప్పవలెనో అంతకు ముందే తెలియదు. అలవాటు చొప్పున యంత్రముల యొక్క పోకడలను ప్రయోగాత్మకముగా గమనించుకొని కనీస ధర్మములను తెలిసినంతవరకు గ్రహించి నడిపించుకొనుచున్నాము. కనుకనే ఈ బండి నడచినన్నాళ్ళు నడచుట, నడువనినాడు దుఃఖము నిచ్చుట జరుగు చున్నది. జన్మము, మృత్యువు మన చేతిలోనివి కావనుట తెలియక దుఃఖము పుట్టుచున్నది. ముసలితనము మన చేతిలోనిది కాకపోయినను, ఆరోగ్య వంతునకు దుఃఖకరము కాదనియును, దుష్కర్మ లాచరించిన వానికి మాత్రమే దుఃఖకరమనియు తెలియుట లేదు. తెలియవలసిన వయస్సు వచ్చుసరికి పరిహారముగా చేయగలిగిన దేమియు లేకుండ పోవుచున్నది. ఇక వ్యాధి, ఆరోగ్యము అనునవి కొంతవరకు మన చేతిలో నున్నవని కూడ తెలిసికొనుట లేదు. తెలిసినను వాని యెడల శ్రద్ధ లేదు. ఇట్లు తెలియకుండుటయే అజ్ఞానము. అది తమోగుణము నంటించుకొనుటవలన కలుగుచున్నది. అజ్ఞానమునకు సంగదోష మక్కరలేదు. సత్త్వగుణము గలవానికి జ్ఞానమున్నచో మోక్షము కలుగును. జ్ఞానసంగ మున్నచో బంధము కలుగును. అజ్ఞానమునకు అజ్ఞాన సంగము వేరుగా లేకయే బంధము కలుగును.

సత్త్వగుణము సుఖమునందు సంగము కలుగజేయగా, రజోగుణము కర్మయందు సంగము కలుగజేయును. తమోగుణము పొరబాటు అను స్థితియందు సంగము కలుగజేయును. తమోగుణస్థితిలో జ్ఞానము మాటుపడి యుండును. రజోగుణ స్థితిలో జ్ఞానము కర్మయందు చిక్కుకొనిపోయి యుండును. సత్త్వగుణమున మనస్సు జ్ఞానమునందే చిక్కుకొని పోవును. కన్ను తెరచి ఈ మూడవ స్థితిని గమనించినచో జ్ఞాన సంగము తొలగి జ్ఞానము నిలబడును.

తమోగుణము జ్ఞానము నావరించియుండుట యెట్లుండును? దొంగ తనము చేయువాడు తాను చేయుచున్నది తప్పని యెరుగును గదా! అట్టిదే జ్ఞానము. ఎరిగినను దొంగతనము చేయుచున్నాడు కదా! ఇట్టిదే మరుగుపడి యుండుట. దొంగతనము మంచిదని నమ్మి త్రికరణశుద్ధిగా నెవ్వడును చేయడు. దొంగతనముపై నమ్మకము లేదు. కనుకనే ఎవ్వరును చూడకుండ చేయుటకు యత్నించును. త్రికరణశుద్ధిగా మంచిదని నమ్మి ఎవడైన చేయ దలచినచో పదిమంది చూచుచుండగనే జేబులో చేయిపెట్టును. జ్ఞానము మాటుపడి యుండుట యనగా నిది. త్రాగుబోతు త్రాగుడు మంచిదని వాదించినను మనస్సులో నమ్మడు. నిజముగా మంచిదని నమ్మినచో తన పరివారము నడుమ మాత్రమే త్రాగుట యెందుకు? పదిమంది పెద్దల యెదుటనే త్రాగి తందనము లాడును గదా! ఇట్లే జ్ఞానము తమోగుణముచే ఆవరింపబడి యున్న వారందరును తమ మనస్సు చేతిలో ఓటమి నంగీకరించినవారే! ఈ విధముగా తమోగుణమువాడు తెలిసినను తప్పు చేయుచుండును.

రజోగుణమువాడు తన బుద్ధికి మంచిదని తోచిన పని చేయుచుండును. పని చేయుచుండుటలో గల మోజు వానికి కావలెను. దానికొరకై యాతడు దుష్కరకార్యముల నైనను నెత్తి కెత్తుకొనును. ఎంత దుష్కర కార్యమున కష్ట పడినచో, అంత గొప్పదన ముండునని వాని విశ్వాసము. “నే నింతటి వాడను; కనుకనే యింతటి మహాకార్యము నాచరింప గలిగితిని” అను అహంభావ పరితృప్తి వానికి కావలెను. మహా కార్యములు చేయువాడు సమర్థుడే! కాని సమర్థు డనిపించుకొనుటకు మహాకార్యముల నాచరించువాడు రాజసికుడు.

సత్త్వగుణమువాడు కర్మఫలముల కష్టనష్టము లాలోచించి కర్మాచరణమునే మాని జ్ఞాన సుఖముల వెంటపడును. అయినను దాని నుండి బయట పడగలవాడు వా డొక్కడే. కనుకనే రజస్తమస్సులకన్న సత్త్వగుణము సామర్థ్యము కలది. ఎప్పుడును సత్త్వగుణ ప్రాధాన్యము గలవాడే జీవిత రంగమున నెగ్గును. తమోగుణమువాడు రాగద్వేషములలో మునిగియుండగా, రజోగుణమువాడు రాగద్వేషాదులతో పెనుగులాడి జయింపగోరు చుండును. సత్త్వగుణమువాడు రాగద్వేషాదుల జోలికి పోడు. సుఖమును గూర్చి, జ్ఞానమును గూర్చి యతడు మీనమేషములు లెక్కించుచుండును. కొంత కాలమునకు

బయటపడి నిస్సంగముగా కర్తవ్యాచరణము చేయును. చేసి జీవితమున కృతకృత్యుడగును. రజోగుణ ప్రాధాన్యము గలవాడు కర్తవ్య మనుకొని మహాకార్యములతో పెనగులాడును. కర్తవ్యము తనయందుంచుకొనును గనుక, ఎంత మంచిపని చేసినను అది కర్తవ్యము కాక కర్మబంధమే యగును. ఇక తమోగుణ ప్రాధాన్యము కలవాడు ఎదుటివానితో పోటీకై ప్రారంభించును. గనుక కర్తవ్యమునకు నతనికి కొన్ని జన్మల దూరముండును. పూజ చేయు వానిని చూచి మత్సరపడి తాము పూజ చేయువారు, మంచిపనికి తన విరోధి చందా యిచ్చినచో తాము అంతకన్న నెక్కువ చందా యిచ్చువారు, జపము చేయు వారిని చూచి అంతకన్న నెక్కువ సేపు జపము చేయువారు తమోగుణ ప్రధానులు. ఆ పూజ, జపము, చందా, వారికి సంబంధించినవి కావని వారి పట్టుదలయే చెప్పుచుండును. సద్గుణము సహజమైనచో దాని కొరకై పట్టుదల యుండదు. సద్గుణముల కోసమై పట్టుదల యుండుట ఒక్కటే తమోగుణ ప్రధానులకు గల మంచి లక్షణము. వారు సజ్జనుల సదాచారము లను చూచి ఈర్ష్యపడి నిందించుచు దుష్ప్రచారము చేయుచుందురు. ఎందులకు? ఇంకొక విధముగా వారు సజ్జనులను, సద్గుణములను స్మరింపరు. మంచివారిని సదా దూషించుచు స్మరించు చుండుట యొక్కటే వారికి లభించు సత్సాంగత్యము. ఈ తీవ్ర స్మరణలోనే వారి జీవ లక్షణము కొంత కాలమునకు రజోగుణము లోనికి మారును. మరికొంత కాలమునకు సత్త్వగుణములోనికి మారును. ఇట్లు పరిశీలింపగా తమోగుణము దుర్భరమై, దుఃఖకరమై యుండును. రజోగుణము అతి తీవ్ర సుఖదుఃఖ సమ్మిశ్రముగా నుండును. సత్త్వగుణము జ్ఞాన సుఖప్రదాయకముగా నుండును. తమోగుణముకన్న రజోగుణమునకు సామర్థ్య మెక్కువ. అనగా రజోగుణ ప్రధానుల చేతిలో తమోగుణ ప్రధానులు ఓడిపోవుదురు. రజోగుణముకన్న సత్త్వగుణమునకు సామర్థ్య మెక్కువ. సత్త్వగుణమునుండి మోక్షమునకు దారి యున్నది గానీ, రజస్తమస్సుల నుండి లేదు. (9, 10)

## త్రిగుణముల లక్షణములు :

ఏదైన ఒక విషయము మనకు బోధపడినప్పుడు ఒక విధమైన వికాసము మనలో కలుగును. "ఓహో! ఇదీ సంగతి! ఇప్పుడర్థమైనది" అని యనిపించి

నపుడెల్ల మనలో నొక వికాసము కలుగుచున్నదని తెలియవలెను. ఈ వికాసము మనస్సున, ఇంద్రియముల యందు, నరములయందు, రక్త నాళముల యందు కలుగును. ఇది యెప్పుడు కలిగినను సత్త్వగుణము మనపై పనిచేయుచున్నదని గ్రహింపవలెను. ఇది జ్ఞానము రూపమైన ప్రకాశము. అనగా తెలియుటలో మనము వికాసము చెందుట. ఇట్లు వికాసము చెందుట ఎవ్వని విషయమున జరిగినను అంతమేరకు సత్త్వగుణము వానిపై పనిచేయు చున్నదని యర్థము. కొంతమంది విషయమున ఈ బోధపడుట, వికాసము చెందుట యనునది సహజముగా తేలికగా జరుగును. అనగా అట్టివారికి ఇంద్రియములు, మనస్సు ప్రసన్నములై నిర్మలములై యుండును. ఆరోగ్యవంతుడు గాలి పీల్చినంత సులువుగా విషయములు బోధపడుట, తాను వికాసము చెందుట జరుగును. అట్టివారు సత్త్వగుణము ప్రధానముగా గలవారు. **(11)**

ఒక్కొక్కడు మాటిమాటికిని అక్కరలేని పనులు కల్పించుకొనును. దానితో సమస్య లెక్కువైపోయి సుఖ శాంతులు మరుగున పడును. ఏ పెద్ద పనిగాని తనదే యనుకొని బాధపడుచు, ఇంత లాభము వచ్చు పనిని మరియొకడు చేయునేమో, మించిబోవునేమో యను భయమున తానే చేయవలె ననిపించుట లోభము. ఇంకొకనికి కలుగుచున్న లాభమును చూచి తానును కల్పించుకొనుట మాత్సర్యము. దీనికి కారణమైనది రజోగుణము. దానివలన పనులు చేయుచుండుటయే మిగులును గాని ప్రయోజనము, అర్థము, ఊరట గలుగవు. పనులు తెమలవు. చేసిన పని పుట్టకురుపువలె సెలలు వేయు చుండుటయేగాని, "ఈ పని పూర్తి చేసితిని" అనుకొనుటకు వీలులేదు. ఈ లక్షణములు గలవాడు రజోగుణ ప్రధానుడు. **(12)**

ఏమి చేసిన ఏమగునో యని కొందరు భయపడుచుందురు. దేని విషయమున నైనను వారికి గ్రహణశక్తి తక్కువగా నుండును. ఏ పనినైన ఎట్లు చేయవలెనో వానికి తెలియదు. కనుక ఏ పని చేసిన ఏమగునో యను భయము కలుగుచుండును. దానితో వారు చేయవలసిన దానిని కూడ మాను కొనుచున్నారే గాని భయము మాత్రము పోవుటలేదు. బాగుపడుటలేదు. పదిమంది చేయుచుండుట చూచి వీరు బాధపడుచుందురు. తాను చేయలేక పోతినే యను తహతహతో చివరకేదో చేయబోయి మరేదో చేయుదురు. వీరు

చేయు పనులలో పొరబాట్లు చేయుట ఎక్కువ యుండును. పనిచేయ వలసిన వేళలలో బద్ధకించి తీరుబాటు ననుభవించుట, తీరుబాటులో కూడ ఆ పని చేయలేదే యని బాధపడుచు, దేహము మాత్రము సుఖపడు చున్నదను కొనుట, చివరి క్షణములలో అదే పనులను గతిలేక చిందులు త్రొక్కుచు చేయుట జరుగుచుండును. ఇట్టి ప్రవర్తనకు కారణమైన గుణమునే తమో గుణము అందురు. (13)

సత్త్వ రజస్తమస్సులలో ఏ గుణము ప్రభావము హెచ్చుగా నుండునో అది అతని స్వభావముగా వ్యక్తమగుచుండును. నిజమున కిది స్వభావమే కాదు. త్రిగుణ విషయమై భావము. స్వభావ మనగా తన భావము లేక ఆత్మ యొక్క భావము. ఇది ఆత్మ లక్షణమే గాని ఏ వ్యక్తి ప్రత్యేకతయు కాదు. త్రిగుణాతీతులైన మహానుభావులలో ప్రకృతిగా ఇది వ్యక్తమగుచుండును. అలలు లేనప్పటి కొలనివంటి స్థితి యిది. అప్పుడు కొలను కనిపించక, అందు ప్రతిబింబించు అహోరాత్రములు, వాని రంగులు మాత్రమే కనిపించు చుండును. అట్లే త్రిగుణాతీతునియందు వాని తరహా అని యేదియు నుండదు. సృష్టిలోని దివ్యతత్త్వముయొక్క లీలలు వానినుండి వ్యక్తమగు చుండును. అట్లుకాక త్రిగుణములలో నేదో యొక గుణము ప్రాధాన్యము వహించినపుడు అలలతో కూడిన కోనేటి వలె ఒక ప్రత్యేక స్వభావ మేర్పడును. ఎన్ని చిరు తరంగముల కదలికలున్నను వానిని గమనింపక సముద్రమును సముద్ర మనియే వ్యవహరించుచున్నాము. అలలు హెచ్చుగా నున్నను సముద్ర మనియే సరిపెట్టుకొని పిలచుచున్నాము. కాని అందు అహోరాత్రములు, సూర్య చంద్రాదులు ఉన్నవి యున్నట్లు ప్రతిబింబించుట లేదు. సూర్యుడు తునా తునకలుగా కనిపించును. అట్లే త్రిగుణములలో నొకటి ప్రాధాన్యము వహించి నపుడు 'స్వ-భావ'మైన ఆత్మలక్షణము ప్రతిబింబింపక వ్యక్తి వికారములే కనిపించుచుండును.

ఉన్న మూడింటిలో సత్త్వగుణము మంచిది. దానియందు లీనమై జీవించువాడు ఉత్తమములైన విషయములను గమనించును. ఉత్తమ దర్శనములను పొందును. నిర్మలమైన ఆత్మతత్త్వ మున్నదని గ్రహించి,

నిర్మలత్వము కొరకై సాధన చేయును. కర్మసంగము వలన బంధము కలుగుచున్నదని గ్రహించును. అది యెట్లు కలుగుచున్నదో తెలిసికొనగోరును. బంధము లేనపుడు ఉన్న స్థితి యొకటున్నదని గమనించును. దాని నేర్పరచుకొను మార్గమున తెలిసికొన యత్నించును. దీనిని జిజ్ఞాస యందురు. దానికై క్రమశిక్షణమునకు వాని మనస్సు అంగీకరించును. ఈ క్రమశిక్షణము నందు స్థిరపడుటకై సన్నివేశముల మంచి చెడ్డలను ఓర్చుకొనుట నేర్చుకొనును. ఇదియే తితిక్ష. బంధములేని స్థితి యనుభవమునకు వచ్చుచున్నకొలదియు ఆ స్థితిలో జీవించుట స్థిరపడును. ఈ స్థితియే ముముక్షుత. ఇన్నిటికిని దారి తీయునది మొట్టమొదట సత్త్వగుణ ప్రధానమైన జీవలక్షణ మేర్పడుట. సత్త్వగుణమునందు స్థిరత్వము నొందినవాడు శరీరము విడచినచో నిర్మలమైన ఉత్తమ లోకములను పొందును. అనగా అతడు మరల దేహమును ధరించు సరికి ఉత్తమమైన, సత్త్వగుణ ప్రధానమైన స్వభావముతో జన్మించును. **(14)**

రజోగుణము ఉద్రేకించుచుండగా దేహము విడచినవాడు మరల జన్మించుసరికి వాని మనస్సు రజోగుణ లక్షణముచే నావరింపబడి యుండును. అతడు స్వభావముచేత కర్మసంగము కలవాడగును. అనగా తన కక్కరలేని దొక్కటియులేదు. ప్రపంచమున శ్రేష్ఠమైన వస్తువేది కనిపించినను తనదిగా చేసికొనవలెనను తహతహ యుండును. ఎవడే మహాకార్యమును సాధించినను అది తనపేర చెల్లలేదే యను బాధ కలుగుచుండును. అనేక జీవనోపాధులను, వృత్తులను, ప్రవృత్తులను మార్చుచుండును. లేదా ఇతరుల స్వంత విషయములలో కలుగజేసికొని, వారికి ఇబ్బందులు, దుఃఖములు కలుగజేసి అపకీర్తి పాలగుచుండును. "ఇది మనకు సంబంధించిన పనికాదు. ఇది మన సొమ్ము కాదు. ఇది మనము ముక్కు దూర్చవలసిన విషయము కాదు" అనుకొనుట అతని జీవితమున నుండదు. ధైర్యసాహసముల పేరుతో జీవితము, కాలము, అవకాశము, పేరు ప్రతిష్ఠలు, డబ్బు మున్నగువానిని కాల్చుకొనుచుండును. ఏదైన వస్తువు తనకు కావలె ననిపించినపుడు "అది ఆవశ్యకమా, కాదా" అని యుండదు. దానిని కొనదలచినపుడు డబ్బున్నదా, లేదా అన్న ప్రసక్తి యుండదు. అప్పు తెచ్చుటకు జంకడు. వానికి క్రొత్తవాడు తప్ప అప్పునీయడు. అప్పిచ్చినవాడు

అటుపైన "ఇది నేను పూర్వజన్మలో చేసిన ఋణము కనుక తీరిపోయినది'' అని చేతులు దులుపుకొనవలసినదే గాని యిక తిరుగులేదు.

తమోగుణము ప్రవర్తించుచుండగా చనిపోయినవాడు మూఢుడై పుట్టును. మూఢు డనగా మోహపడినవాడు అని యర్థమేగాని, అదియొక తిట్టుకాదు. అట్టివారిలో కొందరు మన కలవాటైనది గనుక బియ్యపు టన్నమే శాస్త్రీయ మనియు, మిగిలిన దేశములవారి ఆహారములు (గోధుమ మున్నగునవి) అశాస్త్రీయము లనియు నమ్ముదురు. మాంసాహారులు బలపరాక్రమవంతులని కొందరి నమ్మకము. నాస్తికుడు కానిచో ఆధునికుడు కాడని కొందరు నమ్ముదురు. మంచినీళ్ల కన్న మద్యము రుచి యని మరికొందరి యభిప్రాయము. ప్రత్యేకముగా ఒక కులమువారు మంచివారు కారని, వారికి ఉద్యోగము లీయరాదని కొందరి భావము. ప్రొద్దుననే లేచి దినపత్రిక చదువనిచో యుద్ధము వచ్చి నరజాతి నశించునని నమ్మువారు ఉన్నారు. కొందరు ఉదయముననే కాఫీ త్రాగనిచో గర్భకోశము పరిశుద్ధి కాదందురు. పిల్లి శకునమైనచో చని పోవుదమని భయపడువారు ఉన్నారు. ప్రయాణము చేయబోవునపుడు తుమ్ము వినబడినచో ఆ దెబ్బకు రైలు తప్పిపోవునని నమ్మువారున్నారు. ఇవి యన్నియు మూఢ విశ్వాసములు. అనగా మోహము మనపై అధికారము చేయుచుండగా పుట్టిన విశ్వాసములు. అవి తమోగుణ ప్రవృత్తిని సూచించును. కాఫీ, టీ, వక్క, నల్లమందు, గంజాయి, కల్లు, సారాయి, పొగాకు మొదలగు వానిపై ఆకర్షణ పుట్టుట కూడ తమోగుణ లక్షణము. పులిసిన పెరుగు మొదలగు వానిపై రుచి కుదురుట కూడ నిట్టిదే. ఈ విధముగా రజస్తమస్సుల ఆధిక్యము తరువాతి జన్మలలోని స్వభావ మేర్పడుటకు కారణమగును.

రజస్తమస్సుల ఆధిక్య ప్రభావమున శరీరము వదలినవారు తరువాతి జన్మలలో ఎట్టి స్వభావము కలిగియుందురో వివరింపబడినది. అట్టివారు తరువాతి జన్మలలో తమ స్వభావమున కనుగుణమైన వాతావరణముననే జన్మింతురు. రజోగుణ ప్రాధాన్యమున దేహము వదలినవాడు తీవ్రమగు కర్మసంగము కలవారి కుటుంబమున జన్మించును. కుటుంబములోని వ్యక్తు లందరును అయిన పని, కాని పని పైనవేసికొని, పట్టుదలతో సమయమును, సొమ్మును, సత్తువను కాల్చుకొనుటయందు నిమగ్నులై వుందురు. వారి

నడుమనే తీవ్రమగు రాగద్వేషాదులు, పట్టుదలలు రేగి జీవితము దుర్భర మగును. అట్లే తమోగుణ ప్రధానులు మూఢులైన వారి యింటనే జన్మింతురు. ఇంటిలో నందరును సోమరిపోతులు, పొరబాటు పడినవారు, ఏ పని ఎట్లు చేయవలెనో తెలియనివారునై కుటుంబ సభ్యులు అన్యోన్యముగా మూఢత్వ మును పెంపుచేసికొనుచుందురు. క్రమముగా ఈ స్థితి దుర్భరముకాగా, రజోగుణమువారి పట్టుదలలు, తమోగుణమువారి సోమరితనము మొదలైనవి నెమ్మదిగా పట్టువదలుట ప్రారంభమగును. (15)

## గుణములు - ఫలములు :

మనము చేయునట్టి పనులను కూడ సాత్త్వికములు, రాజసములు, తామసములు అని వర్గీకరణము చేయవచ్చును. ఈ విభాగము ఆ యా పనుల ఫలితములను బట్టి నిర్ణయింపవలసి యుండును. తప్పనిసరిగా సుఖమునే కలిగించున వన్నియు సాత్త్వికములైన కర్మలు. శ్రద్ధగా వంట చేసికొనినచో రుచియైన భోజనము లభించును. శాంతిగా నున్న మనస్సుతో భుజించినచో ఆయువు, ఆరోగ్యము వర్ధిల్లును. వంట చేయవలసిన సమయమున కాళ్ళు చాచుకొని పండుకొని, ప్రయాణమునకు పోవలసిన తొందరలో వంట చేసి కొన్నచో అది కాకిపిండము వలె రుచించును. ఆఫీసుకు పోవలెనను త్వరలో చేసిన భోజనము జీర్ణకోశమును పాడుచేయును. తీవ్ర విమర్శ, తిట్టుకొనుట, కోపించుట, ఏడుపులు, పెడబొబ్బల నడుమ భుజించుచున్నచో మానసిక వ్యాధులు, దారిద్ర్యము, కుటుంబము చెదరిపోవుట మొదలగు పరిస్థితులను సాధించుకొను మనస్సు ఏర్పడును. సదాచార మనుపేర పెద్దలు చెప్పిన ఆచరణశీలములైన పనులన్నియు సత్త్వగుణ ప్రధానమైన కర్మలు. వానినే సత్కర్మ లందురు. ఈ కర్మ లాచరించుట వలన నిర్మలత్వము, ప్రశాంతి కలుగును. రజోగుణ కర్మల వలన తీరని దుఃఖము కలుగును. తన యింటిలో అద్దెకున్నవాడు ప్రతి పండుగకు భార్యకు, బిడ్డలకు నూతన వస్త్రములు కొనగా అభిమానపడి, తాను డబ్బులేకున్నను అప్పుచేసి ఇంకను విలువైన వస్త్రములు కొనును. అప్పు తీరక, అప్పులవారు నిలదీయగా అన్నపానీయములు గొంతు దిగవు. ఇట్టివే రజోగుణ కర్మలు.

తమోగుణ కర్మలవలన అజ్ఞానము ఫలితముగా నేర్పడును. దానితో కొడిగట్టిన దీపముపెట్టిన గూడు పొగచూరినట్లు మనస్సులు మందకొడియై పోవును. ప్రొద్దుననే నిద్రలేచి పండ్లు తోమక, స్నానము చేయక, ప్రొద్దెక్కించు కొనువారున్నారు. బట్టలు మార్చక దినముల తరబడి గడపువారున్నారు. వస్త్రమును నెలల తరబడి శుభ్రము చేసికొనకుండ నీటిలో ముంచి పిడిచి ఆరవైచుకొని దానిని మడిబట్టయని పిలచువారున్నారు. అది మడ్డితో రంగు మారి ఆరిపోవుసరికి నిక్కి నిలబడి యుండును. దానిని కట్టుకొని సూటిగా పూజామందిరమునకు పోయి దేవుని తాకవచ్చునని వారి నమ్మకము. ఇట్టి యలవాట్ల వలన క్రమముగా మబ్బులు క్రమ్మిన ఆకాశమువంటి మనస్సుతో జీవించుట యలవాటగును. తత్ఫలితముగా అన్ని రంగములలోను వెనుకబడినతన మేర్పడును. లేదా విశేష ధనమో, ఉత్తమ పరీక్షలలో ఉత్తీర్ణు లగుటయో సాధింపబడి, మిగిలిన నిత్యజీవితము మలభూయిష్టమై నడచును. ఇట్టిదే తమోగుణ జీవనము. **(16)**

సత్త్వగుణము నభ్యాసము చేయుటవలన మనస్సు, చిత్తము, బుద్ధి, ఇంద్రియములు చక్కని వికాసము నొందును. తెలియవలసినది సూటిగా తెలియును. ఇట్లు తెలియుటనే జ్ఞాన మందురు. అది యథార్థస్థితి యన బడును. ఒక దీపము రంగులేని దయినచో, దాని కాంతి ప్రసరించిన వస్తువు లన్నియు తమ సహజ లక్షణములతో, అనగా సొంత రంగులతో కనిపించును. అట్లుకాక ఆ దీపము రంగుల కాంతిని వెదజల్లుచున్నచో వస్తువులన్నియు రంగుల స్పర్శతో కనిపించును. రంగుల కళ్ళజోడు ధరించినచో ఆకాశము కూడ రంగుగా కనిపించును. ఆకాశ మనగా అచ్చట మరియొక వస్తువు లేని యొకే తత్త్వము కదా! అది రంగులతో కనిపించుట యనగా చూచువాని దృష్టి దోషమని యర్థము. అట్లే రజోగుణము, తమోగుణముల నభివృద్ధి చేయు కర్మల నాచరించుచున్నవారి మనస్సులకు సృష్టి యంతయు తమ దృక్పథముతో కనిపించును. సత్త్వగుణము నభివృద్ధి చేయు పనుల నాచరించుచున్నవాని దృష్టి క్రమముగా 'తన దృక్పథము' నుండి విమోచనము చెంది, ఉన్నది కనిపించుట యారంభించును. చూడదలచినది కనిపించుట మాని, చూడ వలసినది కనిపించును. దీనివలన లాభమేమి? ఈ సృష్టి సమస్తము పరమాత్మ

యందు స్థిరమై యున్నదికదా! అట్టి పరమాత్మ కనిపించుటకు కావలసిన స్థిరత్వ మేర్పడును. సృష్టి కనిపించుచున్నంత కాలము స్థిరత్వము ఉండదు. సృష్టి ధర్మములు, వివిధ ప్రవృత్తులు కనిపించుచుండును. సృష్టి కాధారమైన ప్రకృతి, దాని కాధారమైన భగవంతుడు గోచరించుట వలన స్థిరత్వ మేర్పడును. ఇట్లు గోచరించుటనే జ్ఞాన మందురు. సత్త్వగుణము కలుగుచున్న కొలదియు అట్టి జ్ఞానము వృద్ధి పొందును.

రజోగుణము కలుగు పనులు చేయుచున్న కొలదియు మనస్సునకు రాగము అంటును. దానివలన పనులయందును, వాని ఫలితములయందును ఆసక్తి కలుగును. ఆదర్శములు, ఆశయములు, ఆసక్తి, అనురక్తి, పట్టుదల కలుగును. ఇవి కలుగుట సత్కర్మాచరణకు ఆవశ్యకమే గదా అనరాదు. పైన చెప్పిన గుణములు ఉత్సాహమును కలిగించినను బురదనీటివలె మలినము చెంది నీటిని కల్లోలపరచును. తన వశమున తాను లేకుండ చేయును. నిజమునకు రజోగుణ మున్నచోట కలుగునది ఉత్సాహము కాదు. అది ఉద్వేగము, ఆవేశము అనువానితో మలినమై యుండును. కార్యసాధనకు ఆవశ్యకమైనది శ్రద్ధగాని, ఉద్వేగాదులు కాదు. శ్రద్ధయున్నచోట తగిన విధముగా ఉత్సాహముండును. అది బురద నుండి పరిశుద్ధి చేయబడిన మేఘజలమువలె నుండును. అట్లుండుట సత్త్వగుణ లక్షణము. ఇక రజోగుణము రాగాత్మకము గనుక రాగద్వేషములను పుట్టించును.

వెలుతురు ఉన్నచోట చీకటి యుండదు. అట్లే సత్త్వమున్నచోట అజ్ఞాన ముండదు. ఒక వస్తువుపై వెలుతురు పడినప్పుడెల్ల మరియొక వైపున క్రీనీడ రూపమున చీకటి యుండును. అట్లే రాగమున్నచోట ద్వేషముండును. దృష్టి ఒక వస్తువుపై ప్రసరించుట వలన ఇది కలుగును. అట్లు ప్రసరించుటయే రజోగుణ లక్షణము. తాను వెలుగుగా ప్రవర్తించుటయే సత్వగుణ లక్షణము. రాగమున్నచోట ద్వేషముండును. కనుక రజోగుణ దోషమున్నచోట తమోగుణ దోషమున కవకాశము పుట్టును. రజోగుణము వలన ఈ కార్యము సాధింప వలెను, ఈ ఫలితములను పొందవలెను అను నాసక్తి పుట్టును. నిజమున కిది సక్తి లేక సంగము. ఇది లోభగుణమును వృద్ధి చేయును. లోభగుణ మనగా ఫలితములతో ముడిపెట్టుకొనుట. అప్పుడు ఫలితములను గూర్చిన భయము,

బాధ, అవి కలుగలేదను దుఃఖము సహజముగా నేర్పడును. రజోగుణము ప్రభావము వలన లోభముతో బాటు తృష్ణ కూడ నేర్పడును. తృష్ణ యనగా దప్పిక వంటి ఒక స్థితి. దప్పికగొన్న వానికి జలముల మీద ఆసక్తివలె, ఫలితముల మీద ఆసక్తి ఎక్కువగును. రజోగుణము వలన తమోగుణము తప్పక వానిని స్పృశించును. దానివలన పొరబడుట, మోహపడుట కలుగును. వ్యక్తుల కోసముగాని, వస్తువుల కోసముగాని, విలువల కోసముగాని, వ్యామోహ పడుట యనగా, అందలి అంతర్యామినుండి దృష్టి చెదరిపోవుట. ఇదియే అజ్ఞాన మనబడును. ఈ విధముగా సత్త్వగుణము వలన జ్ఞానము, రజోగుణము వలన లోభము, తమోగుణము వలన అజ్ఞానము తప్పక కలుగును. సత్కర్మ నాచరించినవారికి సత్త్వగుణము కలుగును. దాని ఫలితముపై దృష్టి యున్నవానికి రజోగుణ దోష మేర్పడి ఏవేవో చేయవలె ననిపించును. చేయుటకు యత్నించుటలో బంధము లేర్పడును. ఉదాహరణకు : సత్రము కట్టించుచున్నవాడు కట్టించగలిగినపుడే కట్టించును గనుక ఋణ బాధ కలుగదు. అది సత్త్వగుణ లక్షణము. ఆ సత్రమునే కీర్తి ప్రతిష్ఠల కోసమై నిర్మించుటకు పూనుకొనువాడు రజోగుణమువాడు. తన స్వంతము కోసమై యిల్లు కట్టుకొనవలెనని ఆసక్తితో అప్పు చేయువాడు కూడ అట్టివాడే. అప్పు చేసి యిల్లు గాని, సత్రముగాని కట్టించినచో ఇల్లంత అప్పుండును. వడ్డీ పెరుగగా ఇల్లు పోవును. శ్రమ మిగులును. దుఃఖము చేతికందును. ఇట్టిదే సత్త్వగుణమునకు, రజోగుణమునకు గల భేదము. (17)

## త్రిగుణముల స్థావరములు :

వెన్నెముకపై నిట్టనిలువుగా నిలబడినవారు మానవులు. వెన్నెముక వెంబడి గమనించినచో పై భాగము సూక్ష్మలోకములకు స్థానము. అనగా స్వచ్ఛతకు, నిర్మలత్వమునకు, ప్రసన్నతకు, జ్ఞానమునకు స్థావరములైనవి వెన్నెముకకు పై భాగమునందలి కేంద్రములు. సత్త్వగుణ ప్రధానులైన వారికి ఈ ఊర్ధ్వలోకముల లోనికి ప్రవేశము, నివాసము సిద్ధించును. ఈ లోకములలో వసించువారిపై శరీరము, మనస్సు, ఇంద్రియములు, ఇంద్రియార్థములు, రాగద్వేషాదులు ప్రభావము చూపవు. సృష్టి వేరుగా కనిపించుట, సృష్టి యందలి ప్రవృత్తులు తమపై ప్రభావము చూపుట యుండదు.

సృష్టికి వెనుకనున్న ప్రకృతియు, దాని కాధారముగా నిలబడిన పరమాత్మయు కనుపింతురు. సత్త్వగుణము నందు ఇంకను స్థాయి చిక్కనివారైనను, సత్త్వ గుణమును వృద్ధి చేయు సత్కర్మలను శ్రద్ధతో, దీక్షతో నాచరించినచో క్రమముగా ఉత్తమ లోకముల లోనికి ప్రవేశింతురు.

వెన్నెముక వెంబడి నడుమనున్న కేంద్రములు రాగద్వేషాదులకు, తీవ్రమైన కర్మసంగమునకు స్థావరములు. రజోగుణ ప్రధానులై జీవించువారు ఈ నడిమి లోకములలో నివసింతురు. కర్మాచరణమునందు తీవ్రమైన అభినివేశము, ఫలితముల యెడల గాఢమైన ఆసక్తి, లోభము, తీవ్రమైన ఇష్టానిష్టములు, రాగద్వేషములు అను ఆటుపోట్లలో అల్లకల్లోలముతో వీరి జీవితము దుఃఖభాజనమై గడచిపోవును. పరిస్థితులతోను, వ్యక్తులతోను సమన్వయము సాధించుకొనుట యనునది వీరి కింకను తెలియని విద్య.

వెన్నెముకకు క్రింది భాగమును జఘనము అందురు. జననేంద్రియములు ఈ భాగమున నుండును. తమోగుణము ప్రధానముగా తమ తత్త్వమున గలవారికి జీవితమంతయు తిండిపోతుతనముతోను, నీచమైన కామప్రవృత్తులతోను గడచిపోవును. తిండి, నిద్ర, సోమరితనము, శారీరకమైన కామము మాత్రమే ప్రధానమై యుండును. ఇవి యన్నియు బరువైనవి. బరువుగా నుండుట తమోగుణ లక్షణములలో నొకటి. ఈ బరువుచే నాకర్షింపబడిన జీవితము అంతకంతకు అధోముఖమై దిగజారిపోవును.

ఇందు పై సూక్ష్మ కేంద్రములలో నివసించు సత్త్వగుణ ప్రధానుల ప్రజ్ఞ ఊర్ధ్వముఖమై మోక్షమున కున్ముఖముగా పయనించును. తమోగుణ ప్రధానుల ప్రజ్ఞ నీచకామాభిరతిలో అంతకంతకు పతనమై అంధతామిస్ర లోకములలో చరించును. రజోగుణ ప్రధానుల ప్రజ్ఞ అటుపైకి ఇటు క్రిందికి కాక మధ్యస్థమై కొట్టుకొనుచుండును. (18)

**సాధన క్రమము :**

ఇన్ని స్థితులును, అవస్థలును సంభవించుటకు కారణము- ఈ ప్రవృత్తు లన్నియు తనవే యని మానవు డనుకొనుటయే. నిజమునకు జీవుడు ఈ

ప్రవృత్తులలో వేటికిని కర్త కాడు. సృష్టికి అత్యావశ్యకములగు మూడు గుణముల ప్రవృత్తులే అన్ని ప్రవర్తనలకును కారణ మగుచున్నవి. తన యందలి గుణములను వేరుగాను, తనను వేరుగాను గమనింప గలిగినవాడు, తన స్వభావమని తాను అనుకొనుచున్నది తనది కాదనియు, తనయందు పనిచేయుచున్న త్రిగుణముల స్వభావము మాత్రమే యనియు గ్రహించును. ఈ గ్రహింపు ఆధ్యాత్మిక సాధనతో ప్రారంభమగును. తాను చేయుచున్న పనులతో తాదాత్మ్యము చెందుట సంసారబద్ధుడగు సామాన్య మానవుని లక్షణము. సాధన మార్గమున ప్రవేశించినవాడు త్రిగుణముల స్వభావమును గూర్చియు, సృష్టియందలి వాని అల్లికను గూర్చియు సరియైన అవగాహన కలిగించుకొనును. ఆ గుణములే మానవ శరీర నిర్మాణ వ్యూహమునం దెట్లు పనిచేయు చున్నవో గమనించును. ఒక్కొక్క గుణము మానవుల యందెట్టి స్వభావములను కలిగించుచున్నదో గమనించును. అట్లే తనయందు త్రిగుణములు వేర్వేరుగా ఎట్టి స్వభావములను ప్రవర్తింప జేయుచున్నవో గమనించును. తన స్వభావము నందలి మంచి లక్షణము, చెడ్డ లక్షణములు కూడ తనవి కావనియు, త్రిగుణముల ప్రవర్తనమే యనియు అతనికి జ్ఞప్తి యుండును. ఫలితముగా వాని ప్రవర్తనము నెడల తాను స్పందించుట యుండదు.

ఈ స్థితిలో సాధకుడు త్రిగుణముల ప్రవర్తనమును అనుమతించునే గాని, అరికట్టుటకు ప్రయత్నము చేయక, కేవలము సాక్షిగా గమనించు చుండును. పనులు కూడ తాను చేయుట లేదనియు తన స్వభావము చేయించుచున్న దనియు, ఆ స్వభావమునకు కారణము త్రిగుణము లనియు గ్రహించును. చేయుచున్నది తాను కానప్పుడు వానిని అరికట్టవలసిన ఆవశ్యకత లేదని కూడ గ్రహించి జరుగుచున్న పనులను జరుగనిచ్చును. 'తాను' త్రిగుణములకును, తన స్వభావమునకును అతీతుడనని జ్ఞప్తి యందుంచుకొనును. ఈ అతీతుడైన 'తాను' అందరియందు నున్న 'తానే' యనియు క్రమముగా అనుభూత మగును. దీనినే భగవానుడు "అట్టివాడు 'నా' భావమును పొందును" అని చెప్పెను. (19)

ఈ గుణములన్నియు శరీరతత్త్వము నుండి వెలువడి పనిచేయు చున్నవి. శరీరము ఉండవలెనన్నచో గుణములు పనిచేయుట తప్పనిసరి. కాని ఈ దేహము తాను కాదనియు, ఈ శరీరమునకు తాను అధిపతి ననియు సాధకుడు గ్రహింపవలెను. అట్లు గ్రహించిన తర్వాత నాతడు గుణముల కతీతుడై జీవించును. ఈ జీవనము తాను 'తానుగా' జీవించుట యగును. గుణములు శరీరముపై పనిచేయును. శరీరము తాను కాదు గనుక తనపై పనిచేయవు. అట్లే గుణములు తన స్వభావముగా నుండును. స్వభావమునకు తాను అధిపతియే గాని, స్వభావమే తాను కాదు; కనుక అవి తనపై పనిచేయవు. గుణములు, వాని మూలమున తన స్వభావము ప్రవర్తించును. శరీర నిర్వహణము సాగుచుండును. ఇవి యేవియు తాను సంకల్పించినవి కావు. కనుక తాను వానితో తాదాత్మ్యము (Identification) చెందక అతీతుడై చూచుచుండును.

ఒకడు ఇల్లు కట్టుకొనును. కాలక్రమమున వాడుకలో ఆ యిల్లు శిథిలమైపోవును. ఏదో యొకనాడు ఆ యిల్లు కూలిపోవును. సంసారబద్ధుడైన సామాన్యుడు, ఆ యిల్లే తా ననుకొనును. ఆ యిల్లు కట్టుకొనుటకు ఎన్నో త్రిప్పలు పడును. కట్టుకొన్న తరువాత పుట్టినరోజువలె పండుగ చేసికొనును. శిథిలమైనపుడు దానిని నిలబెట్టవలెనని తాపత్రయ పడిపోవును. కూలిపోయి నపుడు తాను కూలిపోయినట్లే విలపించును. కాని, యిల్లు కట్టక ముందు, శిథిలమగుచున్నపుడు, కూలిపోయినపుడు కూడ తాను మిగిలియే యున్నాడు. వివేకవంతు డీ సత్యమును గ్రహించి, క్రొత్త యిల్లు కట్టుకొనును. కూలిన యింటికై దుఃఖింపడు. ఇల్లు కట్టినపుడు ప్రత్యేకముగా సంతోషింపడు. సంసారబద్ధుడైన జీవుడు తల్లి గర్భములో నుండగా ఆ పరిసరములను, శరీర నిర్మాణక్రమమున జరుగు మార్పులను తట్టుకొనలేక దుఃఖించును. పుట్టిన తరువాత దేహమే తాను అనుకొనును గనుక, ముసలితనమున శరీరమునకు కలుగు బాధలు తనవేయని భావించి దుఃఖించును. శరీరము చనిపోవునపుడు తానే చచ్చుచున్నాడని ఎంచి తల్లడిల్లి పోవును. యోగియైనవాడిట్లు భావింపడు. గుణములు ఒకచోట కేంద్రీకృతమై ప్రవర్తించుట ప్రారంభించినచో దానిని

ఒక జన్మ మందురు. గుణములు తమ ప్రవర్తనమును మందగింప జేసినపుడు ముసలితనము అందురు. అవి తమ ప్రవర్తనము నుపసంహరించినచో దానిని మృత్యువందురు. ఇందేదియు తాను చేయుటలేదు గనుక నాతనికి దుఃఖ మనునది యుండదు. అతడు 'తానుగా' చనిపోవుట, మరల జన్మించుట యుండదు గనుక అతడు అమృతత్త్వమును అనుభవించును. (20)

## గుణాతీతుడు - సాధన మార్గము :

త్రిగుణముల కతీతుడైనవా డెట్లు భావించునో భగవానుడు చెప్పెను. మనము కూడ ఆ స్థితిని సాధింపవలెనన్నచో అట్టివానిని చూచి, వానితో శుశ్రూష, సత్సంగతి మున్నగునవి యొనరించుట యొక మార్గము. అట్టి గుణాతీతుని మన మెట్లు గుర్తింపవలెను? వాని లక్షణము లేవి? అత డెట్లు ప్రవర్తించును? అట్టి స్థితిని సాధించుకొనదలచిన వానికి సాధన మార్గమేది? ఈ ప్రశ్నలు సహజముగనే అర్జునునిలో పుట్టినవి. అతని ప్రశ్నలలో రెండు విభిన్నమైన అంశము లున్నవి. స్థాయి చిక్కినవాని ప్రవర్తన మెట్లుండును? స్థాయి చిక్కించుకొనుటకు వలసిన సాధన మార్గమేది? (21)

కృష్ణు డిచ్చిన వివరణములో ఈ రెండు ప్రశ్నలకును సమాధానము లిమిడి యున్నవి. స్థాయి చిక్కించుకొనుటకు వలసిన సాధన మార్గమున ఎట్టి ప్రవర్తనమును అలవరచుకొనవలెనో, స్థాయి చిక్కిన తరువాత దానిని నిలబెట్టుకొనుటకు అట్టి ప్రవర్తనమునే కొనసాగించుచుండవలెను. వెలుగు, జ్ఞానము, ప్రసన్నత యను లక్షణములు సత్త్వగుణమునకు లక్షణములు. కార్యాచరణము, పట్టుదల యనునవి రజోగుణమునకు ప్రధాన లక్షణములు. విమూఢత, అలసత్వము అనునవి తమోగుణమునకు ప్రధాన లక్షణములు. సాధనలో ఇష్టపడి అడుగు పెట్టినవారికి సత్త్వగుణ లక్షణములు ఉండవలసిన వనియు, రజస్తమస్సుల లక్షణములు ఉండరానివనియు తెలియును. కాని, తనలో నున్న గుణములను ప్రవర్తింప నిచ్చుటయే గాని తానై అరికట్టుట యుండరాదు. మరి సాధనలో అడుగు పెట్టినవానికి సాధనలో పట్టుదల యుండును. అనగా రజోగుణ లక్షణము కొంత యుండును. ఇతర సాధకులను చూచి మత్సరపడుట కూడ కొంత యుండవచ్చును. అనగా

తమోగుణ లక్షణములు కూడ స్వల్పముగా నుండవచ్చును. కేవల సత్త్వగుణ లక్షణముల పాలు కొంత తక్కువగా నుండవచ్చును. అట్టిచో సాధకుడు తనలోనున్న రజోగుణ, తమోగుణ లక్షణములను ద్వేషించుటయు, తక్కువగా నున్న సత్త్వగుణ లక్షణములను కావలెనని కోరుటయు చేయరాదు. ద్వేషించుట యనగా స్మరించుటయే. ద్వేషించుట తమోగుణ లక్షణము గనుక తమస్సు బల మెక్కువగును. లేని సత్త్వగుణ లక్షణము కావలెనని కోరుట రజోగుణ లక్షణమే గనుక, కోరిన సత్త్వగుణము అబ్బక పోవుటయే గాక, రజోగుణపు పట్టు ఎక్కువగును. కనుక అతడు, లేని గుణములు కోరుట, ఉన్నవానిని ద్వేషించుట చేయరాదు. ఈ జారుడు మెట్టు విషయమై కృష్ణుడు నిపుణముగా హెచ్చరించు చున్నాడు.

సాధనలో తన యందున్న గుణముల విషయమై తీసుకొనవలసిన జాగరూకత పైన చెప్పబడినది. సాధన ఫలించిన తరువాత ఆ సిద్ధిని నిలబెట్టు కొనుటకు ఆచరించవలసిన యంశములు కూడ ఇందే యున్నవి. సాధనలో సిద్ధి నందినవాడు ఇతరులలోని గుణాగుణములను గమనించునపుడు, వారిలో సత్త్వగుణము గలవారిని అభిమానించుటయు, రజస్తమస్సుల బల మెక్కువగా నున్నవారిని చిన్నచూపు చూచుటయు చేయు ప్రమాదము కూడ నున్నది. ఇది మరియొక జారుడు మెట్టు. తనకు నచ్చినట్లు ఇతరులేల యుండవలెను? వారిలోను గుణములే ప్రవర్తించుచున్నవి గాని వారిలో చెడ్డ వారు, మంచివారు అని వేరుగా నుండరు. ఈ వివేకముతో సాధకుడు ఇతరుల లోని గుణములు గమనించుచుండునే గాని తాను ప్రతిస్పందింపడు. సిద్ధునకు ఇట్టి వివేకము వల్లనే చిక్కిన స్థితిని నిలబెట్టుకొనుట సాధ్యపడును. (22)

యోగసాధనము భౌతిక లోకములోనే తన చుట్టునున్న ప్రపంచము నడుమనే సాగవలసి యుండును. తాను సాధన మార్గమున అడుగుపెట్టి గుణముల లక్షణములను గూర్చిన విజ్ఞానము నార్జించి, ఆ విజ్ఞానమును సాధన రూపమున తన జీవితమునకు సమన్వయించుకొను ప్రయత్నము క్రమముగా చేయుచుండును. ఈ ప్రయత్నము సాగుచున్న కొలదియు ఇతరులలోని మంచి లక్షణములు, చెడు లక్షణములు వారి ప్రవర్తనల రూపమున చెలరేగును. తన ప్రవర్తనము వారికి నిర్లక్ష్యముగాను, చేతకానితనముగాను కనిపించును.

దానితో తన యెడల వారి ప్రవర్తనముల తీవ్రత యెక్కువగును. కాని తాను మాత్రము వారి ప్రవర్తనముల ఆటుపోటులకు ప్రతిస్పందించుట మాని, ఉదాసీనత వహించును. తన యెడల మంచిగాను, చెడుగాను ప్రవర్తించుచున్న యితరులలో కూడ ప్రవర్తించు చున్నవి వారిలోని త్రిగుణములే! వారి ప్రవర్తనమునకు కారణము వారిలోని జీవులు కాదు. ఈ వివేకము సాధకునిలో క్రమముగా పాదుకొనిపోవును. సాధనలో ఒక స్థాయి చిక్కిన యోగికి కూడ తన యోగమును నిలబెట్టుకొనవలె నన్నచో ఇదియే విధానము.

సుఖముగాని, దుఃఖముగాని తన స్వభావము ననుసరించి మనస్సున పుట్టెడి అనుభూతులు. అవి సన్నివేశములపై నాధారపడి యుండును. ఇది సంసారబద్ధులైన జీవులకు సహజము. నిజమునకు సన్నివేశములలో సుఖము గాని, దుఃఖముగాని యుండవు. సన్నివేశములకు తాను స్పందించు విధానములో మనస్సున సుఖము గాని దుఃఖము గాని పుట్టును. ఈ స్పందించుట తన స్వభావముపై నాధారపడి యుండును. ఆ స్వభావము తనలో ప్రత్యేకమైన త్రిగుణముల మేళనము (Blend) పై నాధారపడి యుండును. ఆ గుణములు తనయం దున్నవి గాని అవియే తాను కానని తెలిసినవానిని సన్నివేశములు కదిలింపలేవు. ఒక పెద్ద వ్యాపారము చేయుచున్న వానికి లక్ష రూపాయలు నష్టము వచ్చినది. అతడు తమోగుణ ప్రధానుడైనచో "ఈ నష్టము తనకే వచ్చినది, ప్రక్కవాని కేమియు నష్టము రాలేదు" అని దుఃఖించును. ఈ నష్టముతో తాను మునిగిపోయితినని, ఇంక తేరుకొనలేనని, తీరని భయ ముండును. రజోగుణ ప్రధానుడైనచో ఇంతటి నష్టము కలిగినదని దుఃఖించు చునే, ఆ నష్టమును పూడ్చుకొనుటకు తీవ్రముగా ప్రయత్నించును. సత్త్వగుణ ప్రధానుడైనవాడు ఎక్కువగా దుఃఖింపకయే మరియొక విధమున లాభము సంపాదింప యత్నించును. ఆ యత్నము నందు తీవ్రత, పట్టుదల యుండవు. గుణాతీతుడైనవాని ప్రవర్తనము వేరుగా నుండును. వ్యాపారమున నష్టము వచ్చుట కూడ సంభవమే! కనుక దానిపై అతడు దుఃఖింపడు. తరువాతి కర్తవ్యమును గూర్చి ప్రశాంతముగా నాలోచించును. ఈ నష్టము వచ్చుటకు తన విధానమున గల మూల కారణములను గమనించును. వానిని సరిజేసి కొనుట సాధ్యమైనచో సరిజేసికొని వ్యాపారమును కొనసాగించును. సాధ్యము

కానిచో చిరునవ్వుతో ఆ వ్యాపారమును వదలివేయును. ఇట్లే ఎట్టి సన్నివేశము లలో నైనను అతడు తన యందు తా నుండునే గాని, సన్నివేశముల యందు సుఖ దుఃఖములను పొందడు. అట్టివానికి మట్టి యందును, చలువ రాతి యందును, బంగారము ముద్ద యందును, అణువులును వాని వెనుక పని చేయుచున్న ప్రకృతియు కనిపించునే గాని, వానికి తాను విలువలు ఆపాదించు కొనుట యుండదు. **(23)**

జీవితములో అన్ని పరిస్థితులును, వ్యక్తులును, పదార్థములును, తాను కావలె ననుకొన్నట్లే లభింపవు. తన యిష్టాయిష్టములు తన అభ్యాసముల పైనను, వానికి కారణమైన తన స్వభావముపైనను ఆధారపడి యుండును. తన స్వభావము తాను కానని తెలిసినవానికి కూడ ఇష్టాయిష్టము లుండును గాని, ఇష్టమైన వానికై వెంపరలాడుట, అయిష్టమైన వాని యెడల చికాకుపడుట యుండదు. ఇష్టమైనది లభించినచో అనుభవించును. అయిష్టమైనది లభించి నను అట్లే అనుభవించును. అట్లు ప్రత్యేకముగా సంతోషించుటగాని, ప్రత్యేకముగా చికాకుపడుటగాని యుండదు. తాను తానుగా ప్రవర్తించువాడు, ఇతరులు కూడ అట్లే తన యెడల ప్రవర్తింపవలెనని ఆశింపరాదు. ఎన్నో జన్మల సాధన తరువాత తాను ఈ స్థితిని సాధించుకొనగలిగెనని తెలియుట వివేకము. ఇది యున్నవానికి ఇతరులు తాను పూర్వమున్న స్థితిలో నున్నారనియు, ఒకనాటికి తానిపుడున్న స్థితికి చేరుకొందురనియు తెలియును. కనుక వారు తన యెడల అభిమానముగా ప్రవర్తించినను అవమానకరముగా ప్రవర్తించినను తన కొక్కటే. వారు నిందించినను, స్తుతించినను తన కొక్కటే. తనకు ఇష్టాయిష్టములు, మానావమానములు లేనప్పుడు తనకు శత్రువులు, మిత్రులు అని వేరుగా నుండరు. గుణములతో కూడిన జీవులు మాత్రమే తన దృష్టిలో నుందురు. ఎవరైన తనను మిత్రుడని గాని, శత్రువని గాని యెంచినను అతడు కాదనడు. తనకు మాత్రము మిత్రులు, శత్రువులు అని యుండరు.

ఇట్టి స్థితిలో నున్నవాడు 'సర్వారంభ పరిత్యాగి' యగును. అనగా ఏ పనికైనను ప్రారంభమును వదలిపెట్టినవాడు. మనము చేయు పనులలో అన్నింటికిని మన యిష్టాయిష్టములు గాని, ఈర్ష్యాద్వేషములు గాని, అభ్యాసములు గాని, మన మాపాదించిన విలువలు గాని, భక్తి విశ్వాసములు

గాని, ఇంకను ఎన్నో రకముల మానసిక, స్వాభావిక ప్రవృత్తులే కారణమగు చుండును. ఎవడైన మనను చెంపదెబ్బ కొట్టినప్పుడు తిరిగి కొట్టుట సహజ మనియు, ఎదుటివాడు చెంపదెబ్బ కొట్టుటయే ఈ సంఘటనకు ప్రారంభ మనియు భావించువారు సంసారజీవులు. తిరిగి కొట్టుట, కొట్టకపోవుట అనునది స్వభావముపై ఆధారపడి యుండు ననుట సత్యము. కుటుంబ పోషణకు ధనమార్జించుట, బంధుమిత్రులకు సహాయము చేయుట, సమాజము లోని అన్యాయములను రూపుమాపుటకై పోరాడుట, ఒక ధర్మ సంస్థ నిర్వహణమునకై తాపత్రయముతో పనిచేయుట, మోక్షము కొరకై యోగసాధన చేయుట మొదలగు అన్ని పనులలోను, తన కుటుంబము, ఆశయ సాధనము, మోక్షముపై కోరిక మొదలగు అంశములతో ప్రారంభము (Motive) తన వద్ద నుండి స్పష్టముగా కనిపించుచుండును. గుణములకు అతీతుడగువాడు ఏ కార్యమును తనవద్ద నుండి ప్రారంభము కానీయడు. అనగా పనులు చేయడని అర్థము కాదు. సంసార జీవివలె ఆ కార్యమునకు కారణము మాత్రము తన యొద్దనుండి ప్రారంభము కానీయడు. తనలో ప్రత్యేకించి ఏ భావములు, అభిప్రాయములు నుండవు కనుక ప్రారంభము తన యొద్ద నుండదు. తన యొద్దకు నడచి వచ్చిన పనిని తన శరీరము, ఇంద్రియములు, మనస్సు, తన స్వభావము ననుసరించి నిర్వర్తించుచుండగా తాను సాక్షిగా చూచుచు నుండి పోవును. తనకు కావలసిన దేదియు ఆ కార్యములలో నుండదు కనుక దాని ఫలితములు అతడిపై పనిచేయవు. ఇట్టి వానిని గుణాతీతు డందురు.

ఇంకను సాధనలో నున్నవాడు సుఖదుఃఖములకు చలింపకుండుటను అభ్యసింపవలెను. అన్నిటికన్న 'తాను' విలువైన వాడనని నిరంతరము గుర్తుంచు కొనుట నభ్యసించినచో, మట్టి, చలువరాయి, బంగారము మొదలగు వాని విలువలలోని తారతమ్యములు మనస్సునుండి క్రమముగా తొలగిపోవును. తనకుగల యిష్టాయిష్టములకు, తనకు కలుగు మానావమానముల భావనకు కారణము తన స్వభావమే యనియు, తాను వీనికి అధిపతి ననియు జ్ఞప్తి యందుంచుకొనుట నభ్యసించిన కొలదియు ధీరత్వ మేర్పడును. సాధనలో నున్నవానికి ధీరత్వమనగా ఓర్పు, ప్రశాంతి, అందరిని సంతోష పరచుట అని అర్థము. సాధనలో స్థాయి చిక్కినవానికీ ధీరత్వ మనగా ఇంద్రియములతో

కూడిన మనస్సు బుద్ధియందు లగ్నము కాగా, ఆ బుద్ధియే తానుగా నుండుట యని అర్థము.

అట్లే సాధనలో నున్నవాడు సాధ్యమైనంత వరకు ఏ పనులను తానై ప్రారంభింపకుండ అభ్యాసము చేయవలెను. జపతపాదులు ఆచరింపవలెనని, ఇతరులకు సహాయపడవలెనని, ఇంకను ఎన్నో సత్కార్యములు చేయవలెనని, సాధనలో నున్నవానికి ఉబలాటము కలుగుచుండును. తానై ఏ పనికిని పూనుకొనకుండుట, ఎంతటి సత్కార్యమునైనను నేను చేయుదనని దూక కుండుట సాధకుడు అభ్యాసము చేయవలెను.

ఈ స్థితిలో సాధకు డొక పొరబాటు చేయు నవకాశమున్నది. పెద్ద పెద్ద సత్కర్మలు చేయవలెనని ఉబలాటము పట్టుకొనియే యుండును. తానై చేయుదనని దూకరాదనియు తెలియును. కనుక నాతడు తెలివిగా ఇతరులే ఆ సత్కార్యము తననే చేయుమని అడుగునట్లుగా ప్రవర్తించును. వారిచే అడిగించుకొని వారి నుద్ధరించుట కన్నట్లు నిర్వహణకు పూనుకొనును. దీని వలన కర్మల ప్రారంభము తనను వదలక పోవుటయే గాక, వంచనా బుద్ధివలన అథమ స్థితికికూడ పతన మగుచున్నాడు. **(24, 25)**

## అవ్యభిచారి భక్తి :

ఇంతవరకు సాధకుడుగాని, యోగిగాని, తన శరీరాదులు, తన స్వభావము తాను కాననియు, తాను తానే యనియు జ్ఞప్తి యుంచుకొనుట చెప్పబడినది. దీనివలన సాధకుడుగాని, సిద్ధుడుగాని ఒక స్థాయివరకే చేరుట కవకాశ మున్నది. కనుక "వ్యభిచారము లేని భక్తితో 'నన్ను' సేవించినవాడు త్రిగుణ ముల కతీతుడై, బ్రహ్మప్రజ్ఞలో నిలబడును" అని కృష్ణు డుపదేశించెను. ఈ యంశమునకు సంబంధించి ఇది అత్యుత్తమమైన యుపదేశము. తన స్వభావమునగల లోటుపాటుల వలన కొన్ని అవాంఛనీయమైన కార్యములు జరుగుచుండును. అవి యన్నియు తానే అని తాదాత్మ్యము చెందుటవలన సామాన్య మానవుడు సంసారబద్ధు డగుచున్నాడు. తన స్వభావమునకు కారణము త్రిగుణము లనియు, అవి ప్రవర్తించుట వలననే తన ప్రవర్తన రూపొందుచున్నదనియు, అవి యన్నియు తాను కావనియు తెలియుటవలన

సాధకుడు క్రమముగా తన స్వభావముయొక్క బంధమునుండి విముక్తు డగును. కాని తన శరీరాదులు, స్వభావము తాను కాదు గాని తనవే కదా! తన స్వభావములోని లోటుపాట్లకు, వాని వలన జరుగు అవాంఛనీయమైన సన్నివేశములకు బాధ్యత తనది కాదా? ఈ స్థితిలోని ఆ సాధకునకు ఉత్తమమైన ఉపదేశముగా "వ్యభిచారము లేని భక్తితో 'నన్ను' సేవించినవాడు త్రిగుణముల కతీతుడై బ్రహ్మప్రజ్ఞలో నిలబడును" అని కృష్ణు డుపదేశించెను. వ్యభిచారము అనగా ఒకప్పుడు ఒకదానియందును మరొకప్పుడు మరొక దానియందును కప్పదాట్లవలె మనస్సు చలించుచుండుట. వ్యభిచారము లేని భక్తి అనగా, మనస్సునకు వేరొక అంశము స్ఫురింపని భక్తి యని అర్థము.

భక్తి సాధనకు ఒక ఆలంబన ముండవలెను. అట్టివానిలో ఉత్తమమైన ఆలంబనగా తననే కృష్ణుడు నిర్దేశించెను. తాను అనగా అవతారమూర్తియైన శ్రీకృష్ణుడు అనునది సాధకుని మొదటిస్థాయిలో మాత్రమే సత్యము. ఆ స్థితిలో తనలో పనిచేయుచున్న త్రిగుణములను, వాని ప్రభావమువలన పనిచేయు చున్న తన మనస్సును, కృష్ణుడుగా ధ్యానించుటవలన త్రిగుణముల ప్రవర్తన లోని తీవ్రత తగ్గి క్రమముగా ప్రశాంతి చిక్కును. అట్లే ఇతరుల ప్రవర్తనముల వలన తనకు కలుగు బాధలు, దుఃఖములు మున్నగునవి క్రమముగా ఉపశ మించును. ఎదుటి వ్యక్తి ప్రవర్తనకు వెనుక, వానిలోని త్రిగుణముల ప్రవర్తన ముండుననియు, వానిలోని జీవికి ఆ ప్రవర్తన మంట దనియు, అవి యన్నియు కృష్ణుని మాయ అనియు జ్ఞప్తి యుంచుకొనుట వలన తనలోని సంచలనముల తీవ్రత అణగిపోవును.

సాధనలో నొక స్థాయి చిక్కినవానికి 'నేను' అనగా తనయందును, తనలోని త్రిగుణముల యందును మనస్సు, శరీరము మున్నగువాని యందును అంతర్యామిగా నున్న 'నే' నను ప్రజ్ఞ యని అర్థము. తాను వేరుగాను, తన త్రిగుణములు వేరుగాను, తనకన్న నితరులు వేరుగాను, వారియందు త్రిగుణములు వేరు వేరుగాను కనిపించుట వ్యభిచారము అనబడును. అట్టి వ్యభిచారము లేని భక్తితో, ఈ అన్నిటి యందును అంతర్యామిగా నున్న నేనను ప్రజ్ఞను సేవింపుమని కృష్ణుని యుపదేశము.

ఇదియే అనన్య భక్తి సాధనమని వేరొకచోట కృష్ణు డుపదేశించి, దాని సాధనకొక క్రమమును కూడ నిర్దేశించెను. ఆ అంతర్యామి ప్రజ్ఞనే బ్రహ్మప్రజ్ఞ అందురు. అట్టి బ్రహ్మప్రజ్ఞలో జీవించుటకు తగిన స్థాయి అతడు సాధించుకొనును. (26)

## బ్రహ్మప్రజ్ఞ :

అట్టి బ్రహ్మప్రజ్ఞకు అంతమన్నది యుండదు. అనగా అది అమృతము. ఆ ప్రజ్ఞకు క్షీణించుట యుండదు. అది పూర్ణము. అనగా సర్వము తనలో నింపుకొన్నది. ఒకటి నుండి ప్రారంభమగు సంఖ్య లన్నియు 'ం' (పూర్ణము)లో నుండి పుట్టి దానిలోనికే లీనమగు చుండును. దానికి లీనమగుట యుండదు. 'ం'లో నుండి ఎన్ని సంఖ్యలు తీసినను 'ం' (పూర్ణమే) యే మిగులును కనుక దానికి ఖర్చగుట యుండదు. అట్లే పూర్ణమైన బ్రహ్మప్రజ్ఞయును అమృతము, అవ్యయము. దేశము, కాలము దాని నుండి పుట్టినవి కనుక, దేశకాల పరిస్థితుల కతీతమైన శాశ్వతమైన ధర్మము బ్రహ్మప్రజ్ఞా స్వరూపము. ధర్మములు దాని నుండి పుట్టి దానిలో లీనమగు చుండును. ఈ విశ్వములో గల సర్వలోకము లకు సంబంధించిన ధర్మములన్నియు దానినుండి పుట్టి వర్తించి మరల దానిలో లీనమగు చుండును. శాశ్వత ధర్మము దాని స్వరూపము కాగా, సుఖము దాని తత్త్వము. ఆ సుఖము ఏకాంత సుఖము. అనగా సుఖము తప్ప వేరొకటి లేనిది. అందు 'సుఖములు' ఉండవు. సుఖములు ఉన్న చోట దుఃఖములు తప్పని సరిగా నుండును. కారణములతో పనిలేక తనలోతాను సుఖించుట నేర్చిన వాడు ఏకాంత సుఖము నెరిగినవాడు. అతడే బ్రహ్మప్రజ్ఞ యందున్నవాడు. అనగా బ్రహ్మప్రజ్ఞ నిలబడుటకు ఆధారము 'నేనే'. 27

పదునైదవ అధ్యాయము

# పురుషోత్తమ ప్రాప్తి యోగము

**కా**ర్యకారణ ధర్మము సృష్టికి బీజము. ప్రతి పనికిని వెనుక నొక కారణ ముండును. మన సౌరకుటుంబమునకు కేంద్రమగు సూర్యుని వలన భూమి సూర్యుని చుట్టును పరిభ్రమించుచు, తన చుట్టు తాను కూడ పరిభ్రమించు చున్నది. దీనికి కారణము సూర్యునిలోని ఆకర్షణ శక్తి. సూర్యుని కిరణముల వలన భూమిపైన జీవ మేర్పడుట, వృక్షములకు ప్రాణమగు హరిత ప్రక్రియ జరుగుట, ఇతర జీవులకు వలయు ప్రాణవాయువు లభించుట, భూమిపైని జలములు ఆవిరియై, మేఘ రూపము ధరించి, తిరిగి వర్షముగా ప్రసాదింప బడుట జరిగి, భూమిజీవుల కందరికిని జీవన మేర్పడుచున్నది. వీనికి మూల కారణము సూర్యునిలోని 'నే' నను చైతన్యము. సృష్టిలో కారణము లేని కార్యము లేదు. వర్షజలములకు కారణము మేఘము. దానికి కారణము సూర్యకిరణములలోని తాపనశక్తి. దానికి కారణము సూర్యునిలోని వేడిమి (Heat-Light) అను చైతన్యము. దానికి కారణము సూర్యునిలో 'నే' నున్నాను అను ప్రజ్ఞ.

ఇట్లు గమనించినచో కార్యము స్థూలముగను, కారణము సూక్ష్మముగను ఉండును. మన భూమిపై నున్న జీవులకు స్థూలమైన కార్యము క్రిందుగను, సూక్ష్మమైన కారణము పైనను ఉన్నట్లు గమనింపవచ్చును. ఒక వృక్షమునకు కారణమైన ఆధారము వ్రేళ్ళు, కార్యమైన పెరుగుదల కొమ్మలు. కారణ లోకములు సూక్ష్మమైన ఊర్ధ్వలోకములలోను, ఫలితమైన భౌతిక వ్యక్త సృష్టి క్రింది లోకములలోను నుండు ఈ సృష్టి మొత్తము నొక వృక్షముగా కృష్ణుడు వర్ణించెను. మూలము క్రిందుగాను, కొమ్మలుపైనను తలక్రిందులుగా నుండు ఈ వృక్షము నెరిగినవాడు వేదము నెరిగినవాడగు ననియు కృష్ణుని హెచ్చరిక! కార్యకారణ సంబంధములోని సూక్ష్మగతు లన్నియు నెరిగినవానికి సృష్టిలోని

రహస్యము లన్నియు అరచేతి యుసిరికపండు వంటివి. ఈ వృక్షము నామూలాగ్రము నెరిగినవానికి ఖండ సృష్టి కాక, సమస్త సృష్టియు నొక్క చూపున దర్శన మిచ్చును. ఈ సృష్టి వృక్షమునకు అయిపోవుట యుండదు. భౌతిక సృష్టికి అంత ముండును గాని కారణ లోకములతో కూడిన మొత్తము సృష్టి అయిపోవుట యుండదు.

సృష్టిని వృక్షముతో నుపమానము చేయుట వైదిక కవి సమయము. "మానములతో (కొలతలతో) కూడిన ఒక వృక్షముపై చక్కని రెక్కలు గల రెండు పక్షులు ఆశ్రయించి యున్నవి. అవి రెండును చక్కగా యోగము చెందిన స్నేహితులు. వానిలో నొకటి ఆ వృక్షపు తీయని పండ్లను తినుచుండగా, రెండవది ఊరక చూచుచుండును" అని సుపర్ణ సూక్తము వర్ణించును. అది పిప్పల వృక్షము. ఇందు కృష్ణుడు వర్ణించినది అశ్వత్థ వృక్షము. అనగా రావిచెట్టు. రావిచెట్టు సూర్యదేవతాత్మకము, పరమ పవిత్రము. కనుకనే యజ్ఞ హోమాదులలో అశ్వత్థ సమిధలకు అత్యంత ప్రాధాన్య మున్నది. ఈ సృష్టి మహావృక్షమును సూర్యదేవతాత్మకమైన అశ్వత్థ వృక్షముగా నుపమానము చేయుట చక్కని భావన.

## లోకార్థము - వేదార్థము :

అశ్వత్థమను పేరులో మరియొక విశిష్టత యున్నది. అశ్వమనగా కిరణమని యర్థము. కిరణముల నుండి పుట్టి, వానియందే స్థానము గొని యున్నదని అశ్వత్థమను పదమునకు సూక్ష్మమైన యర్థము. దీనిని వేదార్థ మందురు. ప్రతి పదమునకు లోకార్థము, వేదార్థము అని రెండు విధముల యర్థము లుండును. సామాన్య మానవుల నుండి మహా పండితుల వరకు లోకార్థమునే గ్రహించి వినియోగించుకొందురు. ఆధ్యాత్మిక జీవన సాధనలో నడుగు పెట్టినవారికి వేదార్థమన నేమో తెలియును. ఒక పదముయొక్క అర్థము సృష్టి రహస్యమును సమన్వయించునదై, అది తనకు సమన్వయించినపుడు అది వేదార్థ మగును. అదియును ఒక్కమారుగా తెలియుట కాక, జీవిత సమన్వయముగా క్రమముగా విప్పారును. ఉదాహరణకు 'శుశ్రూష' యను పదమునకు సేవ చేయుట యని సామాన్యుల యర్థము. పెద్దలకు, గురువులకు

ఉపచారములు చేయుట, వారు చెప్పిన కాయకష్టము చేయుట అని సామాన్యులు ఆ పదమున కర్థము చెప్పుకొందురు. శుశ్రూష యనగా వినవలె నను కోరిక- ఇది సరియైన అర్థము. దీనిని పండితు లెరుగుదురు. గురువులయొద్ద జేరి, వారు ప్రవచించు వేదాంత రహస్యములను, వారు ప్రసాదించు మంత్రోపదేశము లను వినవలె నను ఆసక్తియని పండితుల యర్థము. ఈ రెండింటి యందును సత్య మున్నది. ఇవి రెండును కలిసి లోకార్థ మనబడును.

ఇవి కాక, మరియొక మెట్టు పైగా వేదార్థ మున్నది. గురు శుశ్రూష యనగా, గురువు సన్నిధిలో నున్నంతసేపును, అతడు చెప్పిన వేదాంత, మంత్రాదుల పునశ్చరణము అను నర్థము ఆధ్యాత్మిక సాధనకు చాలదు. ప్రతి యంశమునను, ప్రతి నిమిషమునను అతడు గురువు ఆదేశములనే విని యాచరింపవలెను. అట్లని ప్రతి విషయమునను గురువుగారు చెప్పిననేగాని ఏదియు నాచరింపని అలసత పనికిరాదు. దేనికైనను గురువుగారి ఆదేశమే కావలెననువాడు సోమరియై, బుద్ధిహీనుడై అప్రయోజకుడగును.

నిజముగా గురు శుశ్రూష యనగా, తన జీవితమును గురువునకు సమర్పణము చేసికొని, ప్రతి నిమిషము, ప్రతి సన్నివేశము, ప్రతి వ్యక్తి అన్నిటి నుండియు అతని గురువు వాక్కు నతడు వినుచుండవలెను. తన వ్యక్తిగత జీవితము (Personal life) వేరుగా నుంచుకొను పరిమిత భావము ఉండరాదు. తన జీవితము మొత్తముగానే ఆధ్యాత్మిక సాధన సాగవలెనని గుర్తున్నచో, వ్యక్తిగత జీవితమును గురువునుండి దూరముగా నుంచుట జరుగదు. అట్లని తన కుటుంబ బాధ్యతలు గురువుపై పడద్రోయు బాధ్యతారాహిత్యము పనికి రాదు. తన వృత్తికి, దేశకాలములకు, కుటుంబములోను, సమాజములోను తన స్థానమున కనుగుణముగా ప్రవర్తించుచునే, ఇన్నిటిలోను గురువు ఆదేశములను వినుచుండవలెను. అట్టి ఆసక్తినే గురుశుశ్రూష యని ఆధ్యాత్మ విదులు అందురు. ఇట్టి శుశ్రూషతో గురువువలన నేర్చినవానికే వేదార్థము దర్శనమిచ్చును.

**అశ్వత్థ వృక్షము :**

ఇట్లు విని తెలిసికొనదగినది యీ విద్యయని కృష్ణుని భావము. కనుకనే,

“పైన మూలము, క్రింద శాఖలు కలిగియున్న ఒక అశ్వత్థ వృక్షమును గూర్చి పెద్దలు చెప్పుదురు. అయిపోవుట యనునది ఆ వృక్షమున కుండదు. ఛందస్సులే దాని ఆకులు. దాని నెరిగినవాడు వేదము నెరిగినవాడు” అని కృష్ణుడు దీని నొక పొడపుకథగా చెప్పెను. పెద్దలు చెప్పుదురనగా వినువారుండ వలెను గదా! చెప్పుట - వినుట అను ప్రక్రియద్వారా విజ్ఞానము గురుశిష్య పరంపరగా ప్రసారణ మగును. సృష్టి రహస్యముల నన్వేషించు అధునాతన విజ్ఞాన శాస్త్ర శాఖ లన్నియు ఆచార్య - అంతేవాసి పరంపరగానే వర్ధిల్లుచున్నవి. గురుశుశ్రూష లోకార్థములో చేసినచో శాస్త్రవిజ్ఞాన శాఖలలో ప్రావీణ్యము లభించును. వేదార్థములో ఆధ్యాత్మిక సాధనగా గురుశుశ్రూష చేసినచో వేదార్థము అఖండముగా దర్శనమిచ్చును. లోకార్థమున సాధించిన వివిధ శాఖల శాస్త్ర విజ్ఞానము తనకొక అదనపు బరువుగా నుండును. ఆధ్యాత్మిక విద్య తనయందు భాగమై తన జీవితము దానియందు సమన్వయించును. ఈ విద్యను మరచుట యుండదు. కనుక అయిపోవుట యుండదు. తన జీవితమున భాగమైన భోజనాదికముల నెవ్వడైన మరచునా? అరటిపండ్ల గెలను తలపై మోయుట వంటిది శాస్త్ర శాఖల విజ్ఞాన విశేషము. అరటిపండు తాను తినుట వంటిది ఆధ్యాత్మిక విద్య.

ఛందస్సులే దీని యాకులు అని కృష్ణుని వర్ణనము. ఛందస్సు లనగా వేదము లని యర్థము. ఇది పండితులలో ప్రచురముగా నున్న యర్థము. ఛందస్సు అనగా ఒక కొలత. ఒక లయబద్ధమైన గమనము. ఈ యర్థముననే పద్యములు, శ్లోకములకు గల గణ, యతి ప్రాసాదులను తెలుపు శాస్త్రమునకు ఛందస్సు అను పేరు వచ్చినది. ఉచ్చరించు వాక్కునకు సంబంధించిన లయ, శ్రుతి, గమనము అను వానిని వివరించునది ఛందశ్శాస్త్రము. అట్లే బ్రహ్మదేవుని యుచ్చారణ మగు ఈ సృష్టియను వాక్కునందు గల లయ, శ్రుతి, గమనములను ఛందస్సు లందురు. ఉదాహరణమునకు గాయత్రీ ఛందస్సు ఎనిమిదేసి అక్షరములు గల మూడు పాదములు కలిగియుండును. ఎనిమిది మంది వసువులు భౌతిక సృష్టికి అధిదేవతలు. భూలోకమనగా భౌతిక పదార్థము. అందలి కదలిక లేక ప్రాణశక్తి భువర్లోకము. అందలి ప్రజ్ఞయగు ‘నేను’ అనబడు కేంద్రక ప్రజ్ఞ (Nuclear Consciousness) సువర్లోకము. ప్రతి అణువు నందును,

జీవి యందును, బ్రహ్మాండము నందును ఈ మూడు లోకములును ఉన్నవి. ఈ మూడు లోకములతో కూడిన అష్టవసువుల ప్రవృత్తిని సూచించునది గాయత్రీ ఛందస్సు. ఇట్టి సృష్టిని బట్టి ఈ ఛందస్సు ఏర్పడినదని యర్థముకాదు. గాయత్రీ ఛందస్సు అనబడు గమనము సృష్టిలోను, సృష్టికి పూర్వము కూడ నున్నది. దాని ప్రభావముననే ఈ గమనము సృష్టిలో వ్యక్తమై నడచుచున్నది.

అట్లే సృష్టికి ముందు నుండి యున్న త్రిష్టుప్ అను ఛందస్సు యొక్క ప్రభావమున సృష్టిలో రుద్రలోకములు (Planes of Vibrations and Forces) పుట్టి వర్తించుచుండును. శక్తి, శబ్దము, కాంతి మొదలైన యంశములలో నున్న ధర్మము లన్నియు రుద్రలోకమునకు చెందినవి. అవి ముఖ్యముగా పదునొకండు గణములుగా నుండును. దేవతలలో రుద్రులు పదునొకండు గణములుగా నున్నారు. ఈ యంశములను వివరించుటకుగాను 11 అక్షరముల త్రిష్టుప్ ఛందస్సులో కొన్ని వేదమంత్రముల రచన జరిగినది. అట్లే 12 అక్షరముల జగతీ ఛందస్సు నుండి ఆదిత్య లోకములు సృష్టియై ప్రవర్తించుచున్నవి. దేవతలలో ఆదిత్యులు 12 గణములుగా నున్నారు. దేశము - కాలము (Space & Time) అను వానితో కూడిన సృష్టిలో ఇట్టి ఛందస్సులు లేక గమనములు కొన్ని వేలు కలవు. ఇవి యన్నియు ఈ అశ్వత్థ వృక్షమునకు ఆకులుగా రూపొంది యున్నవని కృష్ణుని వర్ణనము. (1)

## నీలోని అశ్వత్థము :

ఈ మహావృక్షము మనకు చక్కగా దర్శనము కావలెనన్నచో మనలో కూడ నున్న యీ వృక్షమును చూచుట నేర్వవలెను. మన మే పని చేసినను దానికి కారణము మనస్సు. బుద్ధి మొదలగువాని సహకారముతో మనస్సు ఈ పని యిట్లు చేయవలెనని నిర్ణయించి కర్మేంద్రియముల నాదేశించును. కాలుసేతులు మున్నగు కర్మేంద్రియములు దాని నాచరించును. అనగా మూలమైన ఆలోచనా శక్తి గల శిరస్సును, దానికి కార్యరూప మిచ్చు కాలుసేతులు మున్నగునవి క్రిందుగను గల మన శరీర వ్యూహమను వృక్షమును దర్శించుట మొదట అభ్యాసము చేయవలెను.

ఒక మిత్రుడు పది కొబ్బరిచిప్పలు తెచ్చి ప్రసాదముగా మన కిచ్చి

పోవును. చిన్న ముక్క త్రుంపి బెల్లముతో కలిపి కన్నుల కద్దుకొని భక్తితో స్వీకరింతుము. నెమ్మదిగా భక్తి వెనకకు పోయి దాని రుచి మనస్సులో నిలబడును. ఆకలి తీరుట లేక శరీర పోషణము అనునది ఏదైన తినుటకు ఫలితము కావలెను. కాని అది అక్కడితో నాగదు. తిన్న వస్తువు రుచి మనస్సులో నొక ముద్రగా పడి యుండును. ఆ ముద్రయొక్క స్మరణ ప్రేరేపించగా, మరింత పెద్ద కొబ్బరిముక్క తినుట యను కర్మ జరుగును. ఆ కర్మ వలన మనస్సులోని ముద్ర మరింత గాఢమగును. అతడు తిండిపోతు కూడ నైనచో చూచుచుండగనే పది కొబ్బరిచిప్పలును కైంకర్యమైపోవును. వ్యక్తి స్వభావము ననుసరించి ఈ ముద్ర యొక్క గాఢత యుండును. ఒకనికి తీపి రుచింపగా మరొకనికి కారము రుచించును. తన స్వభావము ననుసరించి రుచియొక్క ముద్ర వానిపై గాఢముగా నుండును. ఆ కర్మకు ఫలితముగా కడుపులో శూల పుట్టును. ఆ బాధ మనస్సులో మరియొక భావమును కలిగించును. తాను మితిమీరి తినుట వలన శూల పుట్టినదని గ్రహించుట సత్త్వగుణము గలవాని లక్షణము. ఈ శూలకు మందు వేసికొనియైనను మరి రెండు చిప్పలు తినవలెనని రజోగుణము గలవా డనుకొనును. "ఈ చిప్పల నా మిత్రుడు ఇచ్చుట వలన గదా, తాను తినుట జరిగినది!" అనియో, ఫలానా దేవుని ప్రసాదము తిన్నచో ఇట్లే యగుననియో భావించుట తమో గుణము వాని లక్షణము.

ఒకడు మన కపకారము చేసెను. అది మనస్సులో నిలబడి, మన స్వభావముచే ప్రభావితమై, ఒక ఆలోచనగా రూపొందును. ఆ ఆలోచన ననుసరించి మన మా వ్యక్తిని పదిమందిలో నవమానింతుము. అది ఆ వ్యక్తి యందు కారణముగా పనిచేసి, మరియొక సన్నివేశమునకు మూలమగును. ఆ సన్నివేశము మనకు మరియొక అపకారముగా రూపొందును. అప్పుడు మనకు కలిగిన దుఃఖము మనలో ప్రతీకార వాంఛగా రూపొందును. ఇది కారణముగా మనము మరల నొక కర్మ నాచరింతుము. అనగా చేసిన పనులు మనసులో మరియొక భావమును కలిగించును. ఆ భావము మరల నొక పనికి కారణమగును. ఇట్లు మూలములగు కారణములు క్రిందకు దిగి శాఖలతో పెనవేసుకొనుచుండగా, శాఖలు పైకి పెరిగి మూలముతో అల్లుకొను

చుండును. ఈ అల్లిబిల్లి యల్లికలు చేపల వలగా రూపొంది, దాని నడుమ జీవితము వలలోని చేపవలె గిలగిల కొట్టుకొనుచుండును.

ఇట్లు మనము ఒక పని చేయగా, అందుండి మనల నాకర్షించు అంశ మొకటి పుట్టును. నాలుకకు రుచియో, చెవులకు ఇంపైన గానమో ఏదోయొకటి చిగురువలె పుట్టును. పదార్థమునకును నాలుకకును నడుమగల ఆకర్షణను విషయము అని పెద్దలందురు. ఇట్లు తొడిగిన చిగుళ్ళు కొన్ని వేలు మనస్సులో నిలబడి ముద్రలుగా నుండిపోవును. సమయము, సందర్భము కలిసివచ్చి నప్పుడు అవి మరల కర్మలుగా తీగలు సాగి బయటపడును.

ఇట్లు కర్మలు, ఫలితములు పెనవేసికొని, ఒకదాని కొకటి కారణములై పనిచేయుట తన స్వభావము కారణముగనే జరుగుచున్నది. తన స్వభావము నకు కారణము తనలోని త్రిగుణముల మేళనము (Blend). (2)

## వృక్ష స్వరూపము :

ఇంతవరకును తెలిసికొనిన తరువాత, ఈ వృక్ష మెట్లుండునో చూడ వలెనని కుతూహలము కలుగును. ఈ నీ కుతూహలము కూడ వృక్షపు వేలవేల లేజివుళ్ళలో నొకటియై మెఱయునే గాని వృక్ష స్వరూపము నీ కందదు. దానికొక స్పష్టమైన రూపమున్నపుడు గదా చూడగలుగుట! ప్రజ్ఞలకు, శక్తులకు రూప ముండదు. సృష్టి శక్తుల సమన్వయ సమాహారమే ఈ వృక్షము. దీనికి మొదలు, చివర యని యుండవు. భావములకు, ఆవేశాదులకు, సంకల్ప వికల్పములకు మొదలు చివర యన్నవి యుండవు. అవి ఒక దానియందు మరియొకటి అల్లుకొని యుండును. సముద్ర కెరటములకు మొదలు చివర అని యుండునా? స్వభావము నుండి భావము, భావము నుండి సంకల్పము, సంకల్పము నుండి ఆదేశము, ఆదేశము నుండి తా నాచరించు కర్మ పుట్టుకొని వచ్చును. ఈ కర్మవలన తన స్వభావము ప్రచోదితమై, మరల నొక భావము పుట్టుకొని వచ్చును. మరల నిట్టి చక్రభ్రమణమే ఆవృత్తమగును. ఈ వృక్షము నంతు చూడవలెనని నీవు ప్రయాణ మారంభించినచో నీది అంతులేని పయన మగును. మూలము నుండి కొమ్మకు, కొమ్మ నుండి రెమ్మకు, రెమ్మ నుండి పండుకు, పండు నుండి గింజకు, గింజ నుండి మరల మూలమునకు చక్రభ్రమణమై

నీ జీవితము వ్యర్థమైపోవును. ఇంతటి కర్మబంధమునకును ఈ వృక్షమే కారణము గనుక దీనిని పెకలింపవలెనని ప్రయత్నించినను అది వ్యర్థమే. నీ స్వభావముగా నీ లోలోతులలో పాతుకొనిపోయిన ఈ వృక్ష మూలమును పెకలించుట నీకు సాధ్యము కాని పని. పెకలించు ప్రయత్నము చేయు నీ మనస్సు కూడ నీ స్వభావములోని భాగమే కదా! నీ ప్రయత్నమే స్మరణమై ఈ వృక్షము మరింత బలముగా పాతుకొని పోవును. కనుక ఈ శాఖా చంక్రమణము నుండి బయటపడుట కిది మార్గము కాదు. (3)

**కోరిక - అవసరము :**

దీనిని నీవు సాధించుకొనవలె నన్నచో నేను నీకొక ఆయుధము నిచ్చుచున్నాను. అది అసంగము అను ఖడ్గము. "అవసరము వేరు, నీవు కోరినది వేరు" అని తెలిసికొనుట ఈ ఖడ్గమునకు పిడి వంటిది. నీవు కోరుట యనునది నీ స్వభావమును అందలి రాగద్వేషములను అనుసరించి యుండును. ఇష్టము, అయిష్టము, క్రోధము, పొగరు, ఇది నాకే కావలెనను లోభము, ఇతరుల కున్నదను ఈర్ష్య, అన్నిటికిని తానే కర్తనను పొరబాటు, ఇవి నీ స్వభావమునందు బీజములవలె దాగియుండును. సమయము, సందర్భము ననుసరించి పొటమరించుచు, నీ ఆలోచనా సరళిని నియంత్రించును. జంతుస్థితిలో నున్న ప్రాథమిక మానవునకు ఇవి పగ్గములవలె వినియోగపడి పరిణామము సాధించుకొనుటకు తోడ్పడును. తనను తాను నిర్మాణము (Construction of Personality) చేసుకొన్న వ్యక్తికి ఇవి యడ్డంకులే యగును.

డాబా యిల్లు కట్టుకొనుచున్నవాడు పై కప్పు వేసికొనుటకు రాటలను బోటు (Support) పెట్టును. పై కప్పు (Slab) గట్టిపడునంత వరకే వాని యావశ్యకత. అటుపైన కూడ ఇవి యట్లే యున్నచో తా నందు నివసించుటకు చోటుండదు. కనుకనే ఆ రాటలను తొలగించి, వానిపైన పేరుకొన్న చెత్త, మట్టి మొదలైన వానిని శుభ్రము చేసికొని నివాసయోగ్యము చేసికొనును. అట్లే మానవుడు తన వ్యక్తిత్వము నివాసయోగ్యము కావలెనన్నచో కామ క్రోధాదులను, వాని ఫలితాంశములగు వాసనా విశేషములను తొలగించు

కొనవలెను. ఇప్పు డతడు ఒక పరిమితమైన ఇంటిలో నివసించును. సొంత యిల్లు కట్టుకొన్నవాడు దానిని వదలలేకపోవుట యెట్లో, అట్లే ఈ స్థాయిలోని వ్యక్తి తన వ్యక్తిత్వపు పరిధిని దాటిపోలేడు. ఈ స్థితిలో కావలసినది తన వ్యక్తిత్వపు వినియోగము తెలియుట. ఇది తెలియుట ప్రారంభమైనది మొదలు ఆలోచనా విధానమే మారిపోవును.

ప్రతి వ్యక్తియందును దైవీ గుణములు, ఆసుర గుణములును ఉండును. ఆసుర గుణములు ప్రవర్తించునపుడు తాను కోరికలు కోరుట యుండును. దైవీ గుణములు ప్రవర్తించునపుడు వాని వినియోగము తెలియుచుండును. ఈ వినియోగ మనునది మొదట తనకు, తరువాతనే ఇతరులకు అని గ్రహించుట మొదటి మెట్టు. తన మంచి గుణములు మొదట వినియోగపడ వలసినది ఇతరులకని, తరువాతనే తనకని తెలియుట రెండవ మెట్టు. ఈ రెండవ మెట్టు నెక్కుటకు ఊతకర్రగా ఆదర్శము, కీర్తి యనునది యుపయోగ పడును. ఆ మెట్టు నెక్కిన తరువాత ఊతకర్ర వినియోగముండదు. ఇది సాధన జరుగు విధానము. గురువు వీనిలో ఏ స్థాయిని నిర్లక్ష్యము చేయక, అన్ని స్థాయిలలోను శిష్యుని నడిపించును.

ఇంతవరకు ఎదిగిన మానవుడు లోకములో నొక సత్పురుషునిగా నిలబడును. మంచి-చెడు అనునవి వినియోగమునుబట్టి యుండుననియు, తాను నిర్ణయించుట అనావశ్యకమనియు గ్రహించుటకు గురువు ఈ స్థితిలో సహాయపడును. అవసరమును బట్టి, వినియోగమునుబట్టి పనులు జరుగు చుండును గనుక, తాను వేరుగా సంకల్పము చేయవలసిన యావశ్యకత యుండదు. తన భావము అనునది ప్రత్యేకముగా నిలబడి యుండుటకును సాధకుడు నిరంతరము అభ్యాసము చేయవలెను. దీనిని అసంగము అను ఖడ్గముగా కృష్ణుడు నిర్దేశించెను. స్వభావము చాల బలమైనది గనుక ఈ సాధనలో దృఢత్వము కావలెను. ప్రతి సన్నివేశములోను స్వభావము చొచ్చుకొని వచ్చుటకు ప్రయత్నించును. తన యభిప్రాయములు మరల మరల పొట మరించుచు తనను కర్మలోనికి నెట్టుటకు తీవ్రముగా యత్నించును. ఈ స్థితిలో అభిప్రాయములను అణగద్రొక్కుటకు యత్నించుట వ్యర్థము. తాను తానుగా - అనగా బుద్ధిగా నుండి అభిప్రాయములను గమనించుచు, జరుగు

చున్న పనిలో అవి జోక్యము కల్పించుకొనకుండ చూడవలెను. ఈ ప్రయత్నము గట్టిగా సాగవలెను. పట్టు ఏ కొద్దిగా సడలినను తన స్వభావము బలవత్తరమై, అభిప్రాయములు తన పనిలో జోక్యము కలిగించుకొనును. కనుక ఈ ప్రయత్నము నిరంతరముగా దృఢముగా సాగవలెను. ఈ స్థిరత్వము అభిప్రాయములను అణగద్రొక్కుటలో గాక, పనులను జరుగనిచ్చుటలో నుండవలెను. (3)

## జీవుని పరిణామము :

ఇట్లు తన యభిప్రాయములకును, కర్మలకును నడుమ గల అల్లిబిల్లి చిక్కులను కత్తిరించిన తరువాత తన స్వభావపు పట్టునుండి 'తాను' బయట పడుటకు అవకాశ మేర్పడును. అక్కడి నుండి జీవుని ప్రయాణము నిజముగా ప్రారంభమగును. సృష్టిలోని భౌతిక పదార్థములో అణువుగా అట్టడుగుస్థాయికి దిగిపోయి జీవిగా బద్ధుడైన దేవుడు, మరల దేవుడుగా వికాసము చెందుట జీవపరిణామ ప్రక్రియ. ఈ పరిణామ ప్రయాణములో దాదాపు అన్ని దశల లోను ప్రకృతియే మాతృమూర్తియై నడిపించును. మానవదశ నందుకొన్న తరువాత జీవుడు బుద్ధిపూర్వకముగా పరిణతి సాధించుకొనవలెను. కాని మానవజన్మల దశలో కూడ చాలా కాలము- అనగా కొన్ని వేల జన్మలు- ప్రకృతియే వాని స్వభావముగా మాతృమూర్తియై నడిపించును. అనగా మానవుని బుద్ధిపూర్వక ప్రయత్నము కొంత, ప్రకృతి నిర్వహణము కొంతగా పయనము సాగును. పై జెప్పిన స్థాయిని అందుకొనక ముందు కొన్ని జన్మలుగా ప్రకృతి తనను నడిపించుట ఆగిపోవును. ఈ స్థాయి నందుకొనుట యనగా తనకు తానై ప్రయాణమునకు సంసిద్ధుడగుట యగును. ఈ స్థితిలోని సాధకుడు 'యయాతి' యనబడును. కనుకనే "అక్కడి నుండి తానందు కొనవలసిన స్థితిని అన్వేషింపవలసి యున్నది'' అని కృష్ణుడు హెచ్చరించెను. అనగా అదే పరమార్థము కాదు. పరమార్థమునకు ముఖద్వారము వంటిది యగును.

ఆ ముఖద్వారము దాటి లోనికి అడుగుపెట్టినవాడు ఇక మరల బయటకి రాడు. చిన్న యింటిలో నివసించుచున్న వానికి ఒక రాజభవనములో

నివసించుమని అనుమతి నిచ్చినచో ముందు బెంబేలు పడిపోవును. అభ్యాస బలము వలన తన చిన్నయిల్లే సుఖముగా నున్నదనిపించును. కాని కొద్ది కాలము తరువాత ఆ భవంతి నుండి చిన్న యింటికి తిరిగిరాడు. అట్లే తన పరిమితమైన స్వంత జీవితము నుండి వెలువడి 'తాను' అను దివ్య జీవితమున నడుగు పెట్టనేర్చి, దానియందు రుచి మరగినవాడు తిరిగి తన పరిమిత జీవితము వైపునకు పోడు.

ఇట్లు లభించిన 'నేను' అను స్థితి ఇంతకు మునుపు ఉన్న పరిమిత ప్రజ్ఞ (Localised Consciousness) కాక, అంతకన్న ఉత్తమమైన దివ్యస్థితి. తాను శరీరము నందు దిగకముందున్న పరమేశ్వరుని యంశయే తాను. అనగా విశ్వవ్యాప్తమైన పరమేశ్వరుని అస్తిత్వము నందు తా నొక భాగము. ఈ 'తాను' జీవుడుగా దిగివచ్చిన తరువాతనే, మొట్ట మొదటి ప్రవృత్తి లేక కదలిక, తల్లి గర్భములో పడిన క్షణము నుండి యారంభమగును. ఇట్లే సృష్టి క్రియలో కూడ మొట్టమొదటి కదలిక బ్రహ్మ పుట్టుకతో నారంభమగును. ఈ బ్రహ్మయను కదలిక లేక ప్రవృత్తి నారాయణుని నుండి ప్రారంభమై ప్రసరించి వచ్చినది. తన యందలి నారాయణ ప్రజ్ఞయందు మేల్కాంచుట తెలిసిన తరువాత గాని, సృష్టిలోని నారాయణ ప్రజ్ఞయందు మేల్కొనుట సాధ్యము కాదు. (4)

## దివ్య జీవనము :

ఇట్లు తనయందు తాను మేల్కొను యత్నము చేయువానికి వేరుగా అభిమాన ముండదు; అనగా తనయందు తనకు ప్రత్యేకమైన ఆసక్తి యుండదు. ఇది సాధించుటకే అసంగము అను శస్త్రమును కృష్ణు డనుగ్రహించెను. దానిని వినియోగించుట తెలిసినవానికి తన ద్వారా జగత్కర్మను జరుగనిచ్చుటయే గాని, తన ఆసక్తి యుండదు. ఈ జరుగుచున్నది తనది కాదని తెలియును గనుక తాను పొరబాటుపడుట కవకాశముండదు. ఫలితముగా జరుగుచున్న కర్మల సత్ఫలితములు దుష్ఫలితముల వాసన తనయందు నిలువ యుండదు. సెలయేటి నీటివలె తాను జగత్కర్మ ననుసరించి పోవుచుండుట, తాత్కాలికముగా తనయందు ప్రవేశించిన కర్మల వాసనలు క్రిందికి దిగిపోవుచుండుట, తాను

స్వచ్ఛజలములుగా ప్రవహించి పోవుచుండుట జరుగును. తాను నిత్యముగా స్వచ్ఛమైన జలములుగా నుండుటయే తనయందు తా నుండుట. తనయందు తాను ఉన్నవానికి కోరికలు వేరుగా నుండవు. సెలయేటి నీరు మానవులకును, పశు పక్ష్యాదులకును స్నానపానాదులకు వినియోగపడును. వినియోగించుట చేతనైనవానికి తన పొలము పండించుకొను జీవజలములుగా కూడ వినియోగపడును. అంతేగాని సెలయేటి నీటికి తనకు ప్రత్యేకముగా కావలసినది యుండదు. తనకు ఆవశ్యకమైన ఖనిజ లవణాదులు తాను ప్రవహించు భూమి నుండియే తనకు లభ్యమగును. ఆ ఖనిజ లవణాదులు కూడ ఆ నీటిని వాడుకొనువారి వినియోగము కొరకేగాని తనకు కాదు. అట్లే జగత్కర్మలో నున్నవానికి ఆవశ్యకమైనవి వాని నుండియే లభ్యమగును. వాని వలన తనకు కలిగిన పుష్టికూడ ఇతరులకే వినియోగపడును గాని ప్రత్యేకముగా తనకేమియు వినియోగముండదు.

సుఖము - దుఃఖము మున్నగు జంట అనుభూతులు రెండు గట్లు కాగా, సెలయేటి నీరు ఆ రెండు గట్ల నడుమ ప్రవహించి పోవుచునే యుండును. జగత్కర్మలోనే భాగమైన తన పయనము సాగుచుండగా, సుఖ-దుఃఖాదులు తనకు రెండువైపుల నిలబడి చూచుచుండును. ఈ జరుగుచున్నది జగత్కర్మ లేక దివ్యకర్మ గనుక, తనది దివ్యజీవన మగును. శరీరమునకు ఖర్చయిపోవుట యుండును గాని, తనకు కాదు. తాత్కాలిక సన్నివేశములు పుట్టి అంతరించి పోవుచుండును గాని జగత్కర్మకు అయిపోవుట యుండదు. ఈ రహస్యమును తెలిసినవాడు పొరబాటు పడనివాడై ఆ పదవిని చేరుకొనును. ఇప్పుడు మనము దూరము నుండి చూచుచుండగా 'అది' అని వేరుగా గమనింపబడు జగత్కర్మలో తాను ఒక భాగమై యుండును. (5)

## వెలుగుల కవ్వల :

ఈ సృష్టి యను జగత్కర్మ ప్రారంభమైన తరువాత, దాని నుండి దానిలోని భాగముగా పుట్టినవాడు అగ్ని. ఇది వేదముల యందు చెప్పబడిన అగ్నియే గాని మన మెరిగిన పంచభూతములలోని అగ్ని కాదు. సృష్టిలోని మొట్టమొదటి సంచలనమును అగ్ని (Ignition) అని వేదములు వర్ణించును.

ఆ యగ్ని వ్యాపనశీలము కలదై సృష్టికి ఆధారభూతమైన స్థితిలో ఆ ప్రజ్ఞను అగ్నా - విష్ణువు అను జంట దేవతలుగా వేదములు వర్ణించును. సృష్టిలోని భాగములుగా పంచభూతములు, అందు అగ్ని ఉద్భవించును. ఒక్కొక్క సౌరకుటుంబమునకు కేంద్రమైన సూర్యుడు ఆ అగ్నికి మొదటి వ్యక్తరూపము మన భూమికి సంబంధించినంత వరకు భూ పరిభ్రమణాదులు, చంద్రుని పరిభ్రమణాదుల వలన సూర్యకాంతి చంద్రుని యందు ప్రతిఫలించి భూమి జీవులకు వెలుగు నిచ్చును. జగత్కర్మకు కేంద్రమైన నే నను పరమ పదమును సూర్య చంద్రాదులు, అగ్ని వెలిగించుట సాధ్యము కాదు. "లోకములు, లోకస్థులు, లోకేశులు తెగిన పిమ్మట వెనుక నున్న పెంజీకటి కవ్వల" యీ పరమ పద ముండునని భాగవతము వర్ణించును. మనయందు సూర్యుడు 'నేను' అను జీవప్రజ్ఞా స్వరూపముగాను, చంద్రుడు మనస్సుగాను, పావకు డనబడు అగ్ని ప్రాణశక్తిగాను పనిచేయును. ఈ జీవ ప్రజ్ఞాదులు ఈ జన్మకు సంబంధించినవి. పరిమిత జీవప్రజ్ఞ సుఖదుఃఖాదుల ననుభవించు చుండును.

ఇదికాక 'నేను' అను దివ్యప్రజ్ఞ యొకటి కూడ మన యందుండి, ఈ సుఖ దుఃఖాదులను చూచుచు సాక్షిగా నుండిపోవును. "ఒక పిప్పల వృక్షముపై రెండు పిట్టలున్నవి. అందొకటి ఆ చెట్టు పండ్లను తినుచుండగా, రెండవది తినకుండ చూచుచుండును." అని ఋగ్వేదము వర్ణించినది యీ రెండింటినే. ఈ రెండవదియగు దివ్యప్రజ్ఞ యొక్క స్థానమును వెలిగించుటకు మిగిలిన పరిమిత ప్రజ్ఞలకు సాధ్యము కాదు. ఈ రెండు ప్రజ్ఞలనే నర ప్రజ్ఞ, నారాయణ ప్రజ్ఞయని పురాణములు వర్ణించును. సనాతన కాలమునుండి వీరిరువురును ఆప్తమిత్రులని, విడదీయరాని జంటయని నారదుడు భారతమున వర్ణించెను. ప్రతి మానవునిలోను ఈ పురాణ ప్రజ్ఞలు జంట ప్రజ్ఞలుగా నున్నారు. ఇందలి నరప్రజ్ఞ మేల్కొని, నారాయణ ప్రజ్ఞయందు భక్తిభావము వహించి, శరణు వేడి తనను నడిపించమని కోరినపుడు - ఆ యిరువురును ఏక రథస్థులై, ధర్మములతో నిండిన యీ కర్మ క్షేత్రమునందు నిలబడి యుందురు. ఇప్పుడిక నరప్రజ్ఞ నారాయణుని నుండి విడివడి యీవలకు రాదు. కృష్ణుని విడచి అర్జును డీవలకు ఎట్లు రాలేడో, అట్లే తనయందలి నారాయణ ప్రజ్ఞయందు మేల్కాంచి, సర్వసమర్పణ బుద్ధితో భక్తిభావము వహించిన నరప్రజ్ఞ మరి యీవలకు రాలేదు. (6)

అసలిది యంతయు ఎట్లు జరుగుచున్నది? సృష్టికి పూర్వము నారాయణుడు తనయందు తానుండును. సృష్టి యారంభమైన తరువాత తననుండి తన అంశయొకటి వెలువడును. దీనిని జీవుడు (Monad) అని కృష్ణుడు సంకేతించెను. జీవలోకమున - అనగా సృష్టిలో - అట్టడుగు స్థాయి యగు అణువుగా దిగిపోయిన ఈ జీవప్రజ్ఞ క్రమముగా మేల్కాంచుచు, మానవుడుగా పరిణామము చెందినపుడు నరుడు అనబడును. ఈ నరప్రజ్ఞ లేక జీవుడు అను ప్రజ్ఞ సృష్టి యారంభమునుండి యున్నది గనుక, ఈ జీవుడు సనాతనుడు. అతడు శరీరము ధరించి యుండగా ఆ శరీరమును నిర్వహించు ప్రకృతి వాని సదుపాయము కొరకు మనస్సు, చూచుట, వినుట, రుచి చూచుట, వాసన చూచుట, స్పర్శ తెలియుట అను ఆరు ఇంద్రియముల నేర్పరచును. ఈ ఇంద్రియములు బాహ్యలోకముతో నతని వ్యాపారము కొరకేర్పడినవి గనుక, వాని ప్రజ్ఞను బలముగా బాహ్యలోకము వైపునకు లాగుచుండును. తాను నిలబడి యుండుటకు ప్రకృతి యాధారము. ఇంద్రియములు ప్రకృతియొక్క ఉపకరణములు. కనుక వానిని నిందించి లాభము లేదు. (7)

జీవుడు తాను ధరించిన శరీరమునకు ఈశ్వరుడు (Lord). అతడు ఒక శరీరము ధరించి జీవించిన తరువాత ఆ శరీరము వదలి, మరియొక శరీరమును ధరించును. గాలి వీచుచు ఒక పూవువద్దకు వచ్చినపుడు దాని సువాసనను తాను స్వీకరించును. అనగా ఆ పూవు గాలితోబాటు రాదు. దాని సువాసన మాత్రమే గాలితోబాటు పయనించును. అట్లే జీవుడు ఒక శరీరమును ధరించినపుడు ఇంద్రియములు, మనస్సు నధిష్ఠించి రంగు, రుచి, వాసన స్పర్శ, శబ్దము అను వానిని అనుభవించును. ఈ అనుభవములకు చెందిన వాసనలు మాత్రము గాలికి వాసన యంటినట్లు జీవున కంటియుండును. వాని నాతడు శరీరమును విడచునపుడు తనతో గొనిపోవును. (8,9)

శరీరము, ఇంద్రియములు, మనస్సు - వానియందు అంటుకొనియున్న అనుభవముల వాసనలు, వానితో కలిసి రంగులు పులుముకొనుచున్న తన స్వభావము, తాను చేయు పనులు, ఇవి యన్నియు తానే యని భ్రమపడుట సామాన్యముగా మానవుల లక్షణము. కాని, యిందు తన స్వభావము

త్రిగుణముల మేళనము వలన నేర్పడినది; గుణమయమైన స్వభావమే తనను అనుభవములకు, వానికి ప్రతిక్రియలుగా కర్మలకు ప్రేరేపించును. అనుభవించుచున్నది కూడ ఆ గుణమయమైన తన స్వభావమే. ఈ స్వభావముతో కలిసిన తాను వేరుగా నున్నాడని గమనించుటకు ప్రత్యేకముగా నొక చూపు కావలెను. ఈ శరీరము వదలి పోవునపుడు ఇంద్రియములు మనస్సులోనికి ముడుచుకొనిపోవును. మనస్సు సూక్ష్మమై తనయందు ఇమిడిపోవును. ఇది తన స్వభావముతో కూడిన తాను. ఈ తాను శరీరమును విడచిపోవును. భౌతిక సృష్టికి చెందిన పంచభూత పదార్థములు పంచభూతముల లోనికి చేరుకొనును. ఇట్లు నే నొకడను వేరుగా నున్నానని గ్రహించుట కవసరమైన చూపును జ్ఞాన మందురు. ఈ చూపు తెరచుకొన్నవారు ఈ నన్ను చూడగలరు. (10)

ఇట్లు చూడగలుగుటకు వలసిన సాధన మార్గమున మొదటి మెట్టు ఇట్లు చూడవలెనను ప్రయత్నము. వేదాంతాది గ్రంథజాలమున గల విజ్ఞానము నంతటిని పఠించి, కాచి వడబోసితి మనుకొనువారు ఈ ప్రయత్నమున నెగ్గలేరు. ఈ చదివిన విషయజాల మంతయు పవిత్రమైనదే గాని, ఈ చదువుటలో తాను వేరుగాను, చదివినది బాహ్యమైన విజ్ఞానముగా వేరుగాను, చదువుట యను ప్రయత్నమున తాను చేయు పరిశ్రమ వేరుగాను నుండుటచే ఏకత్వము నుండి చెదరిపోవుచున్నది. కనుక చదివిన విషయము గ్రంథములలో నుండి తన మనస్సు లోనికి బదిలీ చేయుటకు శ్రమపడువాడు శ్రమయే పడుచున్నాడు గాని, తనయందున్న తనను చూచుట సాధ్యపడుట లేదు. అట్లుగాక, ఈ చదివిన విజ్ఞాన మంతయు తన యందున్నదే యని గ్రహించి ప్రయత్నము చేయుట సరియైన పద్ధతి. సర్వ విజ్ఞానసారము తనయందే యున్నదని గ్రహించుట దీనికి మొదటి మెట్టు. సర్వ వేద వేదాంగ విజ్ఞానము తనయందే తానుగా బీజరూపమున నిహితమై యున్నది. దీనిని తెలిసి, ఈ మార్గమున ప్రయత్నము ప్రారంభించినవాడు చేయునది యోగాభ్యాసము. ఈ మార్గమున తెలిసిన కొద్ది విషయమైనను తనయందే ఉన్నదని గమనించును గనుక అది 'తాను' అగును. 'తాను' అనునది పుష్పక విమానము వంటిది. ఎన్ని విషయములు తనలోనికి ఎక్కించినను ఇంకను దానియందు చోటుండును. ఎన్ని

ఎక్కించినను అది తానుగానే యుండును. దీనిని వినియోగించుట తెలిసిన వారిలో కూడ తన స్వభావముచే ప్రభావితుడైనచో అది రావణుని పుష్పక మగును. తన స్వభావముపై దివ్యప్రజ్ఞ విజయము సాధించిన తరువాత అది శ్రీరామచంద్రుని పుష్పకమగును. రజస్సు, తమస్సు, సత్త్వము అను మూడు గుణములను రావణ, కుంభకర్ణ, విభీషణులుగా వహించుచున్న 'తాను' అను ఈ పుష్పకమే గుణాతీతుడైన పరమ పురుషుని అధీనమున నున్నపుడు హనుమదాది దివ్యపురుషులతో నిండియుండును. సత్త్వగుణముకూడ విధేయమై భక్తి ప్రపత్తులతో (విభీషణుడుగా) నొక ప్రక్కన ఒదిగి యుండును. ఈ 'తిరుగు' ప్రయాణమున కూడ తన ప్రకృతి తనతోనే యుండును కాని ఆమె తనను ప్రభావితము చేయునదికాక, సహధర్మచారిణిగా భక్తి ప్రపత్తులతో సేవించుచుండును. ఇప్పుడిది దివ్య ప్రకృతి. (పుష్పకమును గూర్చిన సమన్వయము మరింత విపులముగా మరియొక సందర్భమున చెప్పబడును.) ఇట్లు తనయందు తానుండుట తెలిసినవానికి సర్వ విజ్ఞానమును తానై, తనయందుండి, ఆవశ్యకతనుబట్టి విప్పారుచుండును. చదివిన విషయముల యందు శాఖా చంక్రమణము చేయుచుండువాని ప్రజ్ఞ భిన్నత్వములోనికి జారిపోయి, తనను గూర్చిన చర్చలు, ఖండన మండనాదులతో జీవితము పిడికిట పట్టిన నూనెవలె జారిపోవునేగాని, తనపై పట్టు చిక్కదు. శరీర పతనము సంభవించునపుడు తాను చచ్చుచున్నానను దుఃఖము కూడ విడవదు. (11)

ఇట్లు తనయందున్న తనను చూడగలుగుట నభ్యాసము చేసినవానికి తన యందలి తేజస్సు లేక చైతన్యము తానేయని తెలియును. తనయందు ఈ శరీరము నిలబడి యుండుటకు కావలసిన కేంద్ర ప్రజ్ఞగా 'నేను' అను జీవుని ప్రజ్ఞ నిలబడి యున్నది. అది నిలబడి యున్నంత కాలమే శరీరము నందలి అన్ని కోశములలోను చైతన్యము ప్రసరించుచు ప్రాణక్రియ నడచు చుండును. తన యందలి ఒక్కొక్క కోశము ఒక్కొక్క లోకము. ఈ అన్ని లోకములను వెలిగించి చైతన్యవంతము చేయునది 'తాను' అనబడు జీవప్రజ్ఞ. దీనినే అహంకార మనుపేర సాంఖ్యశాస్త్రము బోధించును. దీనిని 'ఆదిత్య ప్రజ్ఞ' యని వేదములు సంకేతించును. ఈ అహంకార మనబడు జీవప్రజ్ఞకు వెనుక నేపథ్యమున నున్నది 'నేను' అను దివ్యప్రజ్ఞ. బ్రహ్మాండ సృష్టిలో కూడ

ఒక సౌరకుటుంబమున అన్ని లోకములకు జన్మకారకుడు, చైతన్య కారకుడు సూర్యుడే. కాని ఆ తేజస్సు అతని స్వంతము కాదు. నేపథ్యమున గల అవ్యక్త మగు మహాతేజమునకు సూర్యుడు తూము వంటి వాడని వేదము వర్ణించును. నేపథ్యమున గల తేజమును నారాయణు డందురు. నారాయణుని యందున్నప్పుడు అది నారాయణుడే. అనగా తనకు తానుండును. అది వెలువడి లోకములను వెలిగించుట కారంభించినప్పుడు అది తనదియను తేజము; అనగా మమకారము. సృష్టిలోని జీవులయందలి మమకారమునకు బీజమిచ్చుటనే ప్రారంభమైనది.

నేనను జీవప్రజ్ఞ తనయందు కేంద్రీకృతమై యుండును. ఈ తాను అను కేంద్రప్రజ్ఞ నుండి కొంత తేజమును స్వీకరించిన మనస్సు తనకును, బాహ్యలోకమునకును నడుమ అనుసంధానముగా పనిచేయుచుండును. దీనిని చంద్ర ప్రజ్ఞ యని వేదాంగ జ్యోతిషము నిర్దేశించును. ఈ చంద్ర ప్రజ్ఞయందలి తేజముకూడ దివ్యతేజమునందలి భాగమే! మానవునియందు నేను అను సూర్య ప్రజ్ఞ, మనస్సు అను చంద్ర ప్రజ్ఞ కాక భౌతిక పదార్థము, ప్రాణము అను రెండంశము లున్నవి. భౌతిక శరీరము అణువుల సముదాయమే. అణువులను వేర్వేరు స్థాయిలలో వ్యూహములుగా ఏర్పరచి, భౌతిక శరీరముగా నిలబెట్టుచున్నది ప్రాణము అనబడు అగ్ని. శరీరమున జీవుడు ఉండదలచి నంత కాలము ప్రాణాగ్ని పుట్టి పనిచేయుచుండును. ఇట్లు తనయందలి సూర్య ప్రజ్ఞ, చంద్ర ప్రజ్ఞ, ప్రాణాగ్ని అనబడు మూడు కేంద్రముల యందున్న తేజము తనయందలి దివ్యప్రజ్ఞలోని భాగమేగాని స్వతంత్ర ప్రతిపత్తి కలది కాదు. దివ్యప్రజ్ఞ పూర్ణమై నిండియుండగా, అందలి భాగములైన సంఖ్యలుగా సూర్యాది ప్రజ్ఞలు వర్తించుచు, అందే ఒదిగియుండును. **(12)**

బ్రహ్మాండసృష్టిలో భౌతిక పదార్థము అన్నిటికన్న స్థూలమైన స్థితి. దానిని 'భూమి' యని వేదము సంకేతించును. ఇది మనమున్న భూమి కెంత సత్యమో, సూర్యగోళమునగల భౌతిక పదార్థమునకు కూడ అంతే సత్యము. మన భూమికి సంబంధించినంతవరకు అతి చిన్న విభాగమైన అణువునకు ఒక కేంద్ర ముండును. అట్లే భూగోళము మొత్తమున కొక కేంద్రముండును. అది రేఖా గణిత రూపకమైన (Geometrical) కేంద్రము. దీనితోబాటు ప్రజ్ఞామయమైన

కేంద్రముకూడ ఒకటి యుండును. దానిని ఆ అణువుయొక్క లేక భూగోళము యొక్క 'నేను' అను ప్రజ్ఞగా వేదము సంకేతించును. జ్యామిత్రిక కేంద్రము శక్తిమయముకాగా, నిది ప్రజ్ఞామయము. ఈ ప్రజ్ఞామయ కేంద్రము 'నేను' అని కృష్ణుడు సూచించెను. 'గౌః' అనగా భూమియనియు, కిరణమనియు నర్థము లున్నవి. సూర్యునినుండి వెలువడు కిరణములలో నున్నది సూర్యుడే! తన కిరణములను తానే ఆవేశించి సూర్యుడు భూమిని స్పృశించుచున్నాడు. భూమియందలి ప్రజ్ఞా కేంద్రముగా తానే ఆవేశించి యున్నాడు. ఈ రెండు ప్రజ్ఞల కలయిక వలన ఓజస్సు పుట్టుచున్నది. ఓజస్సు అనగా ఓంకారమును పుట్టించునది, ఓంకారము నుండి పుట్టునది అని యర్థము. సూర్యకిరణముల యందున్న 'తాను' ఓంకారమును పుట్టించువాడు కాగా, భూమియందున్న 'తాను' ఓంకారమునుండి పుట్టినవాడు. ఈ ఇరువురి కలయిక వలన భూమి యందలి ప్రకృతినుండి వేర్వేరు జీవరాశుల రూపరేఖాదులు పుట్టుచున్నవి. కనుకనే భూమి (ప్రకృతి) స్త్రీ స్వరూపమైన తల్లి కాగా సూర్యుడుగానున్న తాను బీజమును ప్రసాదించు తండ్రినని మరియొక తావున కృష్ణుడు చెప్పెను.

## రస స్వరూపము :

ఈ పుట్టిన జీవరాశులకు పోషణము కావలెను గదా! పుష్టిని కలిగించు నది రసము; రసము అనగా సారము, రుచి, అనుభవము అని యర్థము లున్నవి. మనము తిను ఆహారముయొక్క రుచిని మనము అనుభవింపగా, ఆ యన్నము మనయందు జీర్ణమై రసముగా రూపొంది, ప్రాణమయ కోశమున అనుభవింపబడుచు తనకు పుష్టి నిచ్చును. అట్లే సృష్టియందు అనుభూతియే దేనికైనను పుష్టి నిచ్చును. భూమిలో నాటబడిన బీజమునకు రసము లనబడు జలముల స్పర్శ కలుగగా అది పులకించి, ఆ యనుభూతిచే అది వృద్ధి నొందు చున్నది. ఆ మొక్కనుగాని, దాని ఫలములను గాని జీవరాశులు ఆహారముగా స్వీకరించినపుడు దానియందలి సారము ఆయా జీవరాశుల యందు రుచిని ప్రేరేపించి, వానియందు జీర్ణమై రసముగా మారి, వానిచే అనుభవింపబడి పుష్టి నిచ్చును. ఇట్లు జీవరాశులకు పుష్టి నిచ్చు వృక్ష ప్రపంచమును ఓషధులని శాస్త్రము నిర్దేశించును. ఓషధులను పుట్టించి పెద్ద చేయు 'రసము'నకు అధిదైవము సోముడను గంధర్వుడు. ఇతడు బ్రహ్మాండ స్థాయిలోని యొక

దేవత. మన సౌర కుటుంబమున ఇతడు ఇంద్రుడు (Neptune) అను గ్రహాధి దేవతగా నున్నాడు. అనగా సోముని ప్రజ్ఞ మన సౌరకుటుంబమునందు ఇంద్రుడను గ్రహము ద్వారా ప్రవర్తించును. మన భూమికి సంబంధించినంత వరకు చంద్రుని ద్వారా సోముని ప్రజ్ఞ పనిచేయు చుండును. కనుకనే చంద్రుడు ఓషధుల కధిపతి యని జ్యోతిశ్శాస్త్రము నిర్దేశించును. రసము లనగా జలము లని కూడ అర్థమున్నది. జలములకు కూడ అధిపతి చంద్రుడే! కనుక భూమిపై ఓషధులు మొలకలెత్తుటకు అధిపతి చంద్రుడు. జీవరాశుల ఆకలి తీరి, శరీర పోషణము జరుగుట కతడే అధిపతి. అట్లే ప్రజననాత్మక ప్రక్రియ (Process of Reproduction)కు కూడ అతడే అధిపతి. కనుకనే జీవరాశులకు చంద్రుడు తల్లివంటివాడు. ఇట్లు జీవరాశులకు తల్లిదండ్రులైన చంద్ర సూర్యుల యందున్న కార్యనిర్వహణ మంతయు అంతర్యామి ప్రజ్ఞయగు 'తన'చే నిండియున్నదని కృష్ణుడు హెచ్చరించు చున్నాడు. (13)

## వైశ్వానరుడు :

అట్లే మనయందు కేంద్రమున సూర్యుడుగా నున్న జీవప్రజ్ఞ నుండి వెలువడిన చైతన్యమే బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, ప్రాణము మొదలగు కోశములలో నిండియుండి, శరీరమును నిలబెట్టుచున్నది. శరీరము నిలబడి యుండవలె నన్నచో అన్ని కోశముల యందును పుష్టి యుండవలెను. ఈ పుష్టి అనుభూతి వలన కలుగును. జిహ్వకు కలిగిన రుచి యను అనుభూతి వలన గ్రంథుల నుండి జీవరసములు పుట్టుకొని వచ్చును. లోనికిపోయిన ఆహారము మరికొన్ని జీవరసములను పుట్టించి, తాను పచనమై ప్రాణమయ కోశమునకు అనుభూతిని ప్రసాదించి పుష్టి నిచ్చును. అట్లే మనస్సునకు ఇంద్రియముల ద్వారా ఆహ్లాదకరమైన విషయముల సంసర్గము వలన అనుభూతి కలిగి పుష్టి నిచ్చును. ఇట్లు ఈ జీర్ణ ప్రక్రియ నడువవలెనన్నచో ఒక వేడిమి కావలసి యున్నది. అన్నము వండుటకు నిప్పు ఎట్లవసరమో అట్లే జీర్ణ ప్రక్రియకు కావలసినది ప్రాణాగ్ని (Vital Fire). దానినే వైశ్వానరు డనబడు అగ్నిగా వేదము సూచించును. ఈ వైశ్వానరుడు శరీరమున పనిచేయుచు నాలుగు విధములైన అన్నమును వండుచుండును. అన్నము అనగా పరిణామము

చెందునది అని పెద్దలు గ్రహించిన యర్థము. తిన్న ఆహారము జీర్ణమై రసముగా పరిణమించిననేగాని, అది అన్నము అని వ్యవహరింపబడదు.

నాలుగు విధములైన అన్నము లనగా-

1) ఖనిజ సంబంధమైన అన్నము (Mineral Food)
   ఉప్పు మొదలైనవి.
2) వృక్ష సంబంధమైనది (Plant Food)
   కూరలు, పండ్లు మొదలైనవి.
3) జంతు సంబంధమైనది (Animal Food)
   పాలు, గ్రుడ్లు, మాంసము మొదలైనవి.
4) మానవ సంబంధమైనది (Human Food or Biochemical Food)
   శరీరములో నుత్పన్నములగు వివిధ జీవరసాదులు.

ఈ నాలుగు విధములైన ఆహారములను పచనము చేసి, అన్నముగా మార్చి శరీరము నిలబెట్టువాడు వైశ్వానరుడు అనబడు అగ్ని. ఈ పచన ప్రక్రియను నిర్వర్తించుటకు ప్రాణము - అపానము అనబడు స్పందనము లావశ్యకము. ఇవి సంకోచ వ్యాకోచాత్మక స్పందనములు (Centripetal & Centrifugal Pulsations). ఊపిరితిత్తులు శ్వాసక్రియను నిర్వర్తించవలె నన్నను, గుండెకాయ కొట్టుకొనుచు రక్తప్రసరణము నిర్వర్తించవలెనన్నను ఈ స్పందనములు లేనిదే జరుగదు. అనగా ఈ స్పందనాత్మక ప్రక్రియ ద్వారా మాత్రమే ప్రాణాగ్ని పనిచేయును. ఈ ప్రాణాగ్ని ఎంతకాలము పనిచేయును? ఈ శరీరము ప్రాణాగ్నిచే నిలబెట్టబడి యుండుట యెంత కాలమో నిర్ణయించునది తనయందలి దివ్యప్రజ్ఞ. అది 'నేను' అను ప్రజ్ఞగా మనలోని జీవునకు కూడ అతీతమై పనిచేయుచున్నది. కనుక "ఈ వైశ్వానరుడను నేనే" యని కృష్ణుడు చెప్పుచున్నాడు. **(14)**

మనుష్యులకు శరీరమున కేంద్రస్థానము హృదయము. శరీరము నిలబడుటకు వలసిన ప్రాణమయ ప్రవృత్తులకును, భావమయ ప్రవృత్తులకును కూడ కేంద్రము హృదయమే. తన శరీరము నిలబడియుండుట తన కెక్కువ ప్రియమైనది. కనుక ప్రేమయను భావమునకు కారణము, కేంద్రముకూడ హృదయమే. ఆ కేంద్రమందు నివాస మేర్పరచుకొన్నవాడు తానే. ఈ తాను

అనగా జీవుడు. ఒక వ్యక్తియందున్న 'నేను' అను ప్రజ్ఞలో రెండు భాగము లున్నవి. ఒకటి తనయందు తానున్న సాక్షీభూతుడగు దివ్యప్రజ్ఞ (Divine Spirit). రెండవది మనోబుద్ధీంద్రియాదులచే పనిచేయుచున్న జీవుడు (Soul). ఈ జీవుడే ఆ జన్మకు, ఆ దేహ వ్యూహమునకు ఈశ్వరుడు (Lord) అనబడును. ఇట్లే అందరు మనుష్యులలో నున్న జీవు లనబడు 'నేను'ల కనిష్ఠ సామాన్య గుణిజమే (L.C.M) పై జెప్పిన దివ్యప్రజ్ఞ లేక దేవుడని భగవద్గీతా పరిభాష. తనయందున్న జీవుడనబడు 'తాను' పరిణామక్రమమున ఎంత ఉత్తమస్థితి సాధించుకొనగలిగెనో, విస్తృతముగా తన ప్రేమ వ్యాపించును. అనగా ఈ ప్రేమ పరిమితులు గలది. అనగా కొలతల కందునది. తనయందలి దేవుడైన 'తన' ప్రేమ పరిమితులు లేనిది. ఈ జీవుని వేల జన్మల పరిణామ క్రమమును బట్టి ఇప్పుడెట్లు జరుగవలెనో నిర్ణయించును. మిగిలిన జీవరాశుల యందున్నది కూడ తానే గనుక, అందరి యోగ - క్షేమములతో బాటుగానే ఈ జీవుని కార్యక్రమమును నిర్దేశించును. అనగా జగత్కర్మ ననుసరించి ఈ జీవుని వ్యక్తిగత కర్మను, వాని జీవపరిణామమును నిర్ణయించును. ఇది ప్రేమ యొక్క పరిపూర్ణ లక్షణము.

ఈ జీవుని నుండియే గడచిన దానిని తిరిగి గుర్తు తెచ్చుకొన గలుగుట, తెలిసికొనుట, పొరబడుట కూడ కలుగుచుండును. ఈ జన్మకు సంబంధించిన సంఘటనలన్నియు ఈ తనయందు (Subjective Self) ముద్రితమై యుండి అవసరమైనపుడు గుర్తు తెచ్చుకొనుట సాధ్యపడు చుండును. ఈ జీవుడు దేవుడైన తనయందు సమర్పణ చెందినపుడు, అసలు తాను పరమ పురుషుని యంశ యని గుర్తు తెచ్చుకొనుట సాధ్యపడును. అప్పుడు కొన్ని జన్మల నుండి పూసలలోని దారమువలె సాగివచ్చుచున్న తన 'కార్యక్రమము' గుర్తుండును. ఇట్లు తెలియుటయే ఈ జన్మ కావశ్యకమైన జ్ఞానము. అయినను ఈ జన్మకు సంబంధించిన సంబంధ బాంధవ్యములను పరిమిత సత్యముగా భావించుట తప్పని సరి. ఒక యువతిని తన భార్యగా భావింపనిచో తన కర్తవ్యము నాచరింపలేడు. బాహ్యలోకమున తన కర్తవ్యము నిర్వహింపని వాడెంత పూజ్యు డైనను, వానికి ఆధ్యాత్మిక సాధన పూజ్యమే! కనుక పొరబాటు కూడ తన కార్యక్రమములోని భాగమే. తన యందలి దేవునకు శరణాగతి చెందినను, తాను వేరుగా జీవుడుగా నున్నాననుకొనుట ఒక పొరబాటు. ఈ పొరబాటు

లేనిదే యోగసాధనకు మార్గమే లేదు. దీనిని శేష-శేషిత్వ భావ మందురు. ఇది భక్తిసాధన రూపమైన ఆధ్యాత్మిక సాధనకు నిచ్చెన వంటిది.

వేదము లెన్ని విషయములు వివరించినను ఈ తనను గూర్చియే! తాను, తనయందుగల వివిధ కోశములు, వాని అంతర్భాగములు, వాని నిర్వహణ ప్రక్రియలు, అవి తనయందు భాగములు మాత్రమే యను సత్యము తెలుపునవి వేద గ్రంథములు. వేదములను వేదగ్రంథములుగా చదువుకొన్న వానికి పాండిత్య మబ్బునుగాని, తనయందు తనకు పట్టు చిక్కదు. వేదము లన్నియు తనను గూర్చి చెప్పునవే. అవి తనయందే లయమగును. అనగా వేదముల సారమంతయు తనయందు యోగము చెందియుండును. కనుక వేదములకు అంతము (Culmination) తానే. ఈ వేదము తానేయని గ్రహించు నది కూడ తానే గనుక వేదవిదుడు కూడ తానే. ఇట్లు తెలియదగిన వేదము, తెలిసికొనువాడు, తెలిసికొనుట యను ప్రక్రియ - ఈ మూడును తనయందు లీనమైనవాడు నారాయణుని ప్రజ్ఞకు సన్నిహితుడై యుండును. (15)

ఈ సృష్టిలో నిరువురు పురుషులున్నారు. వారిని గూర్చిన శాస్త్రము తెలియనివాడు యోగసాధనలో సుళువు తెలియనివాడు. పుట్టుట, పెరుగుట శిథిల మగుట, నశించిపోవుట యను పరిణామములకు లోనగుచున్న భౌతిక శరీరము, దాని కాధారమైన ప్రాణమయాది కోశములు, తన స్వభావము- అన్నియు కలిసి వ్యక్తిగా రూపొందుచున్నవి. (ఇట్లే అన్ని జీవరాశుల విషయము నను.) మానవునిలో విశేషముగా భౌతిక శరీరము, ప్రాణమయాది కోశములు, బుద్ధి మున్నగు ఉత్తమ కోశములు కలసి శరీరమను క్షేత్రముగా రూపొందును. వీనితోబాటు వీనినంటుకొని యుండి, ఆ జన్మకు సంబంధించిన అనుభవము లకు లోనగుచున్న 'నేను' అను పరిమిత ప్రజ్ఞ కూడ మానవునిలో నుండును. ఈ ప్రజ్ఞ తన స్వభావముచే భావితమై, ప్రభావితమై యుండును. (భావిత మగుట యనగా ఒక పదార్థమునందు వేరొక పదార్థము నానిపోయి, దాని లక్షణముల నన్నింటిని పట్టించుకొనుట. నిమ్మరసమున భావన చేయబడిన అల్లము నిమ్మరసపు లక్షణములను పూర్తిగా స్వీకరించును.) పుట్టుక కలిగిన యీ దేహవ్యూహమునకు క్షయమగుట కూడ నుండి తీరును. ఈ పుట్టుచున్న శరీర వ్యూహముతో బాటు ఈ స్వభావమయుడైన అనుభూతి పురుషుడు

కూడ పుట్టుకొని వచ్చును. వీనినే అహంకారమని సాంఖ్యము నిర్దేశించును. ఈ అహంకార పురుషునితో సహా ఈ శరీర వ్యూహము పుట్టును గనుక, అది నశించునపుడు అహంకార పురుషుడు కూడ నశించును. ఈ అహంకార పురుషునకు ఆధారముగా, అనగా కేంద్రముగా, 'నేను' అను జీవుని ప్రజ్ఞ యుండును. ఈ జీవుడే దేవుని యంశగా దిగివచ్చి, జన్మల పరంపరలలో పరిణతి సాధించుకొని, తన మూల ప్రజ్ఞయగు పరమపురుషునిలో లయ మగును.

ఒక జన్మలో అహంకార పురుషు డార్జించుకొన్న అనుభవములు శరీర మంతమగునపుడు వానితోబాటే యంతరించును. కాని ఆ యనుభూతుల వాసనలు మాత్రము సంస్కారములుగా జీవుని అంటియుండును. అనగా ఈ జీవుడు అనుభవించువాడు కాదు; కాని, అనుభవముల సంస్కారము మాత్రము వానిని అంటియే యుండును. ఈ సంస్కారములతో ఆ జీవుడు మరియొక శరీరమును ధరించును. ఈ యిరువురిలో అనుభవ పురుషుడగు అహంకార పురుషునితో కూడిన శరీర వ్యూహమును క్షర పురుషుడని కృష్ణుని సంకేతము. జీవుడు శరీరములను ధరించుట, విడచుటయేగాని పుట్టుట, గిట్టుట యుండదు గనుక అతడు అక్షర పురుషుడని కృష్ణుడు సంకేతించెను.

ఈ జీవుడు ఒక జన్మలోని యనుభవములను సంస్కారముగా స్వీకరించిన పిదప మరియొక శరీరమును ధరింపవలసి యుండును. ఇంత వరకు ఎన్ని జన్మలు ఎట్టి సంస్కారములతో గడచినవి యను దానిని బట్టి అతడు స్వీకరింపవలసిన క్రొత్త జన్మయు, దాని ప్రణాళికయు నిర్ణయమగును. ఈ మొత్తము ప్రణాళికలో నొక భాగము మాత్రమే యైన జీవునకు ఈ నిర్ణయము చేయుట సాధ్యము కాని పని. కనుక ఆ నిర్ణయము చేయు ప్రజ్ఞ మరియొకటి యుండితీరవలెను.

ఇట్లు జీవులు కోటానుకోట్లు సృష్టిలో నున్నారు. అందరికిని వారి వారి పరిణామక్రమ ముండును. వారి వారి పరిణామ స్థాయిని బట్టి వారి కార్యక్రమ మును, జన్మలును, వాని ప్రణాళికలును నిర్ణయింపబడవలెను గదా! ఇట్లు ఇన్ని కోట్ల జీవరాశుల జన్మలును, వాని పరంపరలును దేని కదిగా నిర్ణయింప బడినచో సృష్టిలో నొక క్రమమే యుండదు. మరి సృష్టి యంతయు నొక

ప్రణాళిక ప్రకారమే నడచుచున్నది గదా! దీనిని జగత్కర్మ లేక దివ్యకర్మ యని కృష్ణుడే నిర్దేశించెను. ఇన్ని కోటానుకోట్ల జీవరాశుల జన్మ పరంపరలును ఆ జగత్కర్మలోని భాగమే. కనుక ఇవి యన్నియు అందలి భాగములుగా ఒక ప్రణాళిక ప్రకారము ఇమిడి యుండవలెను. దీనిని నిర్వహించుచున్న ఉత్తమమైన ప్రజ్ఞ వేరొకటి యున్నది. ఈ మొత్తము జగత్కర్మ యంతయు వాని నుండి పుట్టి ప్రవర్తించుచున్నది. అది పుట్టకముందు ఆ ఉత్తమ పురుషుడు 'తాను'గా తనలో నిమిడియున్నాడు. జగత్కర్మ ప్రారంభమై నడచుచుండగా, తాను ఆ జగత్కర్మగా నుండి, దానికి అతీతుడుగా కూడ నున్నాడు.

ఒక కవి యొక నాటకమును వ్రాయును. ఏ కవియైనను కథా వస్తువును తానై సంకల్పించుట జరుగదు. సంకల్పము తన నుండి మెఱపువలె మెఱయును. దాని ననుసరించి యాతడు నాటకమును రచించును. తరువాత ఆ పాత్రలకు పాత్రధారుల నెంచుకొని, రంగస్థలమున నాటకమును ప్రదర్శింప జేయును. దానికి ప్రయోక్తకూడ తానే! ఆ నాటకమున నొక పాత్రగ తానుకూడ రంగమున ప్రవేశించి నటించును. ఆ నాటకమునగల పాత్రలు అన్నిటియందును వానిని భావన చేసిన తానే అంతర్యామిగా నున్నాడు. ఆ నాటక గమనమును నిర్ణయించునది తానే. పాత్రల స్వభావములను, ప్రవర్తనలను నిర్దేశించునది తానే. ఇందు ఒక్కొక్క పాత్రయొక్క స్వభావము ఒక్కొక్క విధముగా నుండును. ఆ పాత్రను ధరించిన పాత్రధారియగు నటుడు మరల వేరొక నాటకమున వేరొక పాత్ర ధరింపవచ్చును. కనుక ఒక నాటకము నందలి పాత్రను క్షర పురుషునిగా కృష్ణుడు సంకేతించెను. నాటక ప్రదర్శనతో ఆ పాత్ర అంతరించినను పాత్రధారియగు నటుడు అట్లేయుండి, వేరొక పాత్ర ధరించుటకు సిద్ధముగా నుండును. కనుక అతడు అక్షర పురుషుడని కృష్ణుని సంకేతము. నాటక స్రష్ట, రచయిత, ప్రయోక్త, అందలి పాత్రలలో అంతర్యామిగా నున్నవాడు, ఆ నాటక ప్రదర్శనము తరువాతకూడ తాను మిగిలియే యున్న వాడు అయిన ఆ మహాకవి పురుషోత్తముడని కృష్ణుని సంకేతము. అతడు కూడ తన నాటకమున నొక పాత్ర ధరింపవచ్చును గనుక, అట్టి పాత్రయే కృష్ణుడు. కనుక కృష్ణుడు జగన్నాటక సూత్రధారియని పురాణకవులు వర్ణించినది అక్షర సత్యము.

అట్లే తాను తానుగా నున్న పరమ పురుషుడు జీవులుగా కూడ తానే దిగివచ్చుచున్నాడు. తన యంశలైన ఆ జీవులను కూడ అతడే జగత్కర్మలో భాగముగా నడిపించుచున్నాడు. అనగా జీవుల జన్మల పరంపరలు జగత్కర్మము లోని భాగమే. (ఈ జగత్కర్మ ధారావాహినియైన సీరియల్ నాటకము వంటిది!) కనుక ఆ జన్మల పరంపరలలో ఆ జీవులలో తానే యున్నాడు. జగత్కర్మకు అతీతముగాను, జగత్కర్మగాను ఉన్న ఆ ఉత్తమ పురుషుడే, మనలోని అక్షర పురుషునికి (Soul) వెనుక పురుషోత్తముడు (Spirit)గా నుండి నడిపించు చున్నాడు. అతడికై బయట నెక్కడనో దేవులాడిన వానికి శూన్యమే మిగులును. తనలోనే యున్నాడని గ్రహించినవానికి యోగస్థితి యందు అనుభవమునకు వచ్చును. ఇట్టి పురుషోత్తముడు తనయందు 'నేను' అను ప్రజ్ఞగానే యుండును. తనయందు మాత్రమేగాక, సర్వ జీవరాశులయందును 'నేను' అను ప్రజ్ఞగానే యున్నాడు.

"ఆ 'నేను' క్షరపురుషుని కన్నను, అక్షర పురుషుని కన్నను కూడ ఉత్తముడను. వేదములలోను, లోకములలోను కూడ పురుషోత్తము డని ప్రసిద్ధి చెందినవాడను 'నేనే' అని కృష్ణుని వాక్కు. లోకములో అనగా వేద గ్రంథములను, శాస్త్ర పురాణాదులను వేరు వేరుగా చదువుకొను పండితులని యర్థము. వారికి పురుషోత్తము డనగా కృష్ణుడనిగాని, విష్ణువనిగాని యర్థము. అట్టివారికి పురుషోత్తము డనగా ఎక్కడనో వైకుంఠములోనో, క్షీరసాగరముననో మరియెక్కడనో యుండును. వానిని గూర్చిన స్మరణము, మననము కూడ మంచివే గనుక, పరిమితముగా ఉపయోగకరమైనవే! వేదార్థము అనగా అందలి సత్యము తన జీవితమునకు యోగసిద్ధి రూపమున సమన్వయించినపుడు స్ఫురించు నర్థము. ఆధ్యాత్మిక మార్గమున అనగా తనలో తానుండుట యను సాధన చేయుచున్న వానికి పురుషోత్తము డనగా తనయందే అధివసించియున్న దివ్యప్రజ్ఞ లేక నారాయణ ప్రజ్ఞ. ఇట్టి సాధనయందు స్థాయి చిక్కినవాడు, తన శరీరాదులు - అహంకారముతో కూడిన క్షరపురుషుడును, తానైన అక్షర పురుషుడును కలసి పురుషోత్తముని యందే భాగముగా నున్నారని దర్శించును. ఇది వేదార్థ దర్శనము. (17, 18)

"ఇట్లు మోహము లేనివాడై పురుషోత్తముడైన నన్నెరిగినవాడు అన్నియు తెలిసినవాడు. అట్టివాడు అన్ని భావముల చేతను నన్నే సేవించును." అని కృష్ణుడు చెప్పుచున్నాడు. పురుషోత్తముని యందు తాను భాగమై వున్నాడని దర్శించుట సరియైన దర్శనము. తనలో పరమాత్మ యున్నాడని తెలిసికొన్న వాడు తానే పరమాత్మనని పొరబడుట కవకాశమున్నది. అట్లు పొరబడిన వారే హిరణ్యకశిపుడు, రావణుడు మొదలైనవారు. ఈ సృష్టి సమస్తము పురుషోత్తమునియందు ఉన్నదనియు, అందు తానొక భాగముగా నున్నా ననియు తెలిసి దర్శించినవాడు ప్రహ్లాదుడు. అతడు సముద్రము నందును, పర్వత శిఖరము నందును, లోయ యందును, సర్పము లందును పురుషోత్తమునే దర్శించును. తనకు విద్యాబోధ చేయు గురువులయందును, తనను చంపజూచిన రాక్షసుల యందును, తనను ప్రేమించిన తల్లి యందును అతడొక్క పురుషోత్తమునే దర్శించెను. అన్నియు తెలిసినవాడనగా అన్నిటి యందును గల యొకే మూల తత్త్వమును తెలిసినవాడు. సర్వ భావముల చేతను వానినే సేవించుట యనగా ప్రహ్లాదుని వలె భావించి పూజింప గలుగుట. దీనికి భక్తి సాధన యొక్కటే మార్గము. సాధన చేయుచున్న స్థితిలో నున్నవాడు ఇతరులలోను, వారి ప్రవర్తనములలోను దైవమును చూచుచు సేవించుట క్షేమమైన పద్ధతి.

ఇట్లు తాను జీవుడు (Soul)గా నుండి, తనయందును, సృష్టియందును అంతర్యామిగా నుండి, అతీతముగా కూడ నున్న పురుషోత్తముని దర్శించుట జీవునకు పరమ శ్రేయమును కలిగించును. అదియే జీవునకు అత్యుత్తమ జ్ఞానము. ఆ జ్ఞానమును పొందినవాడు అది తానై, తాను పురుషోత్తముడై, పురుషోత్తముని యందుండుట పరమసిద్ధి యని వేదవిదు లందురు. అనగా తాను పురుషోత్తమునిలో నైక్యమైపోవుట మాత్రము కాదు. తాను దేవుని యంశమైన జీవుడుగా నుండి, తాను పురుషోత్తముని యంశగా కూడ నుండి, సృష్టియందును, తనయందును గల ఆ పురుషోత్తమునే దర్శించుచు, ఆ యానందమే తానుగా నుండుట పరమావధి. అనగా పురుషోత్తముడు తన యందుండుటయే గాక, అతీతుడుగా కూడ నుండును. ఆనంద స్వరూపుడైన దేవుడు జీవునిగా దిగివచ్చిన తరువాత, తన మూలస్థానమగు పురుషోత్తముని దర్శించుటయే ఆనందము ననుభవించుట. తన యానందమును తాను

అనుభవింపవలెనను ఆసక్తి దేవునకు లేనిచో ఈ సృష్టియే లేదు. జీవుడు దేవునితో తనను తాను అనుసంధించుకొని ఆనందించుచు నుండుటయే వానికి పరమావధి.

"ఈ విధముగా నన్ను తెలిసికొనుట" యనగా, కృష్ణుని వలన అర్జునుడు తెలిసికొన్న విధముగా తెలిసికొనుట. ఇచ్చట అర్జునుడు శిష్యుడిగా నుండగా, కృష్ణుడు గురువుగా నుపదేశ మిచ్చెను. ఇట్టి యుపదేశములు ఆధ్యాత్మిక విద్యలో గురువు నుండి శిష్యునకు అందవలసినవే గాని గ్రంథముల ద్వారా అందునవి కావు. "ఈ విధమైన అతి రహస్యమైన శాస్త్రము నాచే నీకు ఉపదేశింపబడినది" అని కృష్ణుడు చెప్పుచున్నాడు. ఈ శాస్త్రము అనగా మనలోనే నిరంతరము సన్నిహితముగా నుండి, మన గ్రహింపునకు అందకుండ నున్నది యని అర్థము. "నేను నీకు చెప్పితిని" అని కాక, "నాచే నీకు చెప్ప బడినది" యనుటలో విశేషమైన భావమున్నది. గురువు శిష్యునకు ఉపదేశము చేయుట ప్రయత్న పూర్వకముగా జరుగునది కాదు. ఉపదేశము అనగా గురువు యొక్క అనుగ్రహమే గాని, అది గురువు కావలెనని చేయునది కాదు. శిష్యుని పాత్రత ననుసరించి, సరియైన అదను నందు గురువు అనుగ్రహముగా ఉపదేశము ప్రసరించి వచ్చును. అనగా అది అప్రయత్నముగా గురువు ద్వారా శిష్యున కనుగ్రహింపబడిన యనుగ్రహము.

"దీనిని తెలిసినవాడు బుద్ధిమంతుడై కృతకృత్యు డగును." అని కృష్ణుని యనుగ్రహ వాక్యము. బుద్ధి యనగా పురుషోత్తముని తనయందు దర్శించిన వాని జ్ఞానము. వేదవ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు వంటి మహర్షులు పరమ పురుషుని లీలలను గానము చేసిన జ్ఞాన స్థితిని బుద్ధి యందురు. దీనిని సృష్టి సమర్థమగు బుద్ధి (Creative Will) అని పెద్దలందురు. ఈ స్థితిలో నున్నవానికి జగత్కర్మ యొక్క స్వరూపము దర్శన మిచ్చును. అందలి తన ప్రస్తుత కర్తవ్యమేమో కూడ వానికి దర్శన మిచ్చును. అది తనకు కృత్యము; అనగా చేయదగినది. దాని నాతడు అప్రయత్నముగా నిర్వహించును గనుక 'కృతకృత్యుడు' (చేయదగినది చేసినవాడు) అగును. కనుకనే పురుషోత్తముని దర్శనము, సాన్నిధ్యము ననుభవించిన పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుడు రాక్షసులకు రాజుగా నుండి పరిపాలన సాగించెను. ఇట్టివారు ధన్యులు!

పదునారవ అధ్యాయము

# దైవాసుర సంపద్విభాగ యోగము

కృష్ణుడు అర్జునునకు సృష్టిలో గల రెండు విధముల స్వభావములను వివరింప నారంభించెను. సృష్టిలో మొదటి నుండియు రెండు విభిన్న స్వభావములు గలవు. మొదటిది దైవీ ప్రకృతి లేక దివ్య ప్రకృతి. రెండవది ఆసుర ప్రకృతి. సాధకుడు కాగోరినవాడు రెండింటిని గూర్చి శాస్త్రమును గ్రహించి, మొదటిదానిని ఆచరించుచు, రెండవదానిని పరిహరించు చుండ వలెను. రెండు విధముల స్వభావములలోను గల లక్షణములు వివరింప బడుచున్నవి.

**దివ్యగుణ సంపద :**

1) భయము లేకుండుట (Fearlessness). సృష్టిలో నున్న వ్యక్తులు, జరుగు సన్నివేశములు అన్నియు తన వినియోగమునకే యని గ్రహించిన వానికి భయముండదు. 2) తనలోని అన్వయ వ్యతిరేక శక్తుల (Positive & Negative forces) నడుమ సామ్యము చెడిపోకుండ చూచుకొనుట, అనగా తాను ఎటువైపునకును మ్రొగ్గు చూపకుండుట సత్త్వ సంశుద్ధి. 3) క్రమ పద్ధతిలో జ్ఞాన మార్జించి, అది తనయందు యోగము చెందునట్లు చూచుకొనుట జ్ఞాన యోగము. అట్లు కలిగిన జ్ఞాన యోగము చెదరిపోకుండ చూచుకొనుట జ్ఞానయోగ వ్యవస్థితి (Integration through knowledge into Synthesis). తెలిసిన ప్రతి మంచి విషయమును తా నాచరించు చుండుట. సూటి (Positive)గా ఆలోచించుట, పనిచేయు చుండుట ఆర్జవము. తాను చేసిన ఆలోచన గాని, చేష్టగాని ఎప్పుడైనను బాహాటముగా వెల్లడించ గలుగుట ఆర్జవము అనబడును. (1)

4) తనకు కలిగినదానిలో, వేరొక వ్యక్తికి ప్రేమపూర్వకముగా సమర్పించ

గలుగుట దానము (Charity). 5) తనపై బాహ్య విషయము లేవియు ప్రభావము చూపకుండునట్లు చూచుకొనుట దమము (Self-control). 6) తనకు ఫలితము నాశింపకుండ చేయు మంచి పని యజ్ఞము (Impersonal work). 7) వేద శాస్త్ర గ్రంథములను నిత్యము మననము చేసికొనుచు, వాని వెలుగులో తన దైనందిన జీవనమును మలచుకొనుట స్వాధ్యాయము. 8) తనలోని జ్ఞానాగ్ని, ప్రాణాగ్ని, దక్షిణాగ్ని అను మూడు అగ్నులను ప్రజ్వలింపజేసి వానిని సద్వినియోగము చేయుట తపస్సు. 9) మనస్సుచేత, మాటచేత, కర్మచేత ఏ జీవిని బాధింపకుండుట అహింస. 10) సత్యము అవసరము కొరకుగాక, అది తన స్వభావముగా నుండుట (Truthfulness). 11) కోపము తనలో నిలువయుండకుండుట (ఆవలి వ్యక్తి బాగుకొరకు అవసరమైనపుడు తాను చికాకు పడకుండ కోపమును ఆయుధముగా వాడుకొనవచ్చునుగాని, ఆ భావము తాను అనుభవింపరాదు). 12) తనకున్నది తన కావశ్యకమైనను మంచి పనికి సమర్పణ చేయగలుగుట త్యాగము (Spirit of Offering). 13) ఎట్టి సన్నివేశము నందు చికాకుపడకుండ నుండగలుగుట శాంతి (Living in Peace). 14) తన యెడలగాని, ఇతరుల యెడలగాని దుర్బుద్ధి లేకుండుట, 15) సర్వజీవుల యెడలను దయకలిగి యుండుట (దయ యనగా జాలి చూపుట కాదు. జాలి చూపుటలో ఆవలి వ్యక్తి తన కన్న హీనస్థితిలో నున్నాడని భావించుట (Aristocracy) యుండును. అట్లుగాక దయ చూపుట యనగా ఆవలి వ్యక్తి తనతో సమానుడని గ్రహించి తనవంతు సహాయమును తాను చేయుట.) 16) ఏ విషయము నందును ఆవశ్యకతను మించి ఆసక్తి లేకుండుట అలోలుపత (Non-indulgence). 17) ఎవరితో ఎట్టి పరిస్థితులలో నైనను మృదువుగా ప్రవర్తింప గలుగుట మార్దవము. ఇది ముందు మనస్సులో స్థిరపడ వలెను. 18) తనయందు ఎంత స్వల్పమైన దోషమున్నను గమనించి సిగ్గుపడ గలుగుట, తాను ఎంత మహాకార్యము సాధించినను అది తనయందలి దైవీ ప్రకృతివలన సాధ్యపడినదేగాని తన స్వంతముకాదని గ్రహించి ఒదిగి ప్రవర్తించుట. దీనిని 'ఉచిత లజ్జ' యని పెద్దలు వర్ణించిరి. 19) చాపల్యము లేకుండుట. అనగా అనవసరమైన కుతూహలము లేకుండుట. ఎదుట నున్న కర్తవ్యము నెడల మనస్సు ప్రవర్తించుట మాని, జరిగిన వానినిగూర్చి గాని,

జరుగబోవు వానినిగూర్చి గాని ఆలోచించుట కుతూహల మనబడును. తన కుమార్తెకు పెండ్లి యెప్పుడగునో, తన కుద్యోగ మెప్పుడు లభించునో యనియు, తన భార్యకు పుట్టబోవునది ఆడుబిడ్డయో మగబిడ్డయో యనియు, తనకు ప్రమోషన్ ఎప్పుడు వచ్చునో యనియు, తానిల్లు కట్టుకొనగలుగుట యెప్పుడు సాధ్యపడునో యనియు, తా నెంతకాలము బ్రతికియుండునో యనియు జ్యోతిర్విదుల నడుగబోవువారు చాపల్యము గలవారు. అట్టివారు తమ శక్తి సామర్థ్యములను, కాలమును కాల్చుకొనుచు జీవితమును వ్యర్థము చేసి కొందురు. ఇట్టి చాపల్యము లేక కుతూహలము తనను అంటకుండుట దైవీ గుణములలో నొకటి. (2)

20) తనలోని తానను వెలుగు తన స్వభావముచే మాటుపడి యుండును. తన స్వభావమును పరిశుద్ధము చేసికొన్న కొలదియు తన యందలి తేజస్సు బయల్వెడలును. తన చుట్టునున్న వారిని ఆకర్షించి, వారికి సుఖమును, శాంతిని ప్రసాదించునది తానను తేజస్సు. ఇది కలిగియుండుట దివ్య లక్షణములలో నొకటి. 21) క్షమ యనగా ఓరిమి గలిగియుండుట. ఇతరులలో గాని, సన్నివేశములలోగాని, తనకు నచ్చనివి గమనించినపుడు సహింపగలిగి యుండుట. క్షమ యనగా తన భావములను త్రొక్కిపెట్టుటగాక, ఎదుటివారి యందలి ప్రేమచే ఓరిమి గలిగియుండుట. 22) తనయందు తాను నిలబడి యుండుటను ధృతి లేక ధైర్యము అందురు. తనకు ధైర్యము కలుగుటకు దేనినైనను ఆలంబనముగా స్వీకరించుట సామాన్య మానవుల పద్ధతి. ఆలంబనము తొలగిపోవుటగాని, మన పట్టు సడలుటగాని జరిగినపుడు తాను ధైర్య మనుకొన్నది తొలగిపోవును. తనయందు తా నాధారపడియున్న వానికి ధైర్యము స్థిరముగా నుండును. ఇది దివ్య లక్షణము. 23) శౌచ మనగా శుభ్రత. తన యిల్లు, పరిసరములు, తన శరీరము మొదలగునవి శుభ్రముగా నుంచు కొనుట మంచి లక్షణము. ఈ శుభ్రతపై చాల ఎక్కువ జాగ్రత్త యున్నవాడు పదిసార్లు కాళ్ళు కడుగుకొనుట వంటివి చేయును. తాను అపరిశుభ్రముగా నున్నానను భావము మనస్సునందు గాఢముగా నున్నవారే పదిమారులు కాళ్ళు కడుగుకొనుట వంటివి చేయుదురు. అనగా వారు స్మరించునది మాలిన్యమునే గాని, శుభ్రతను కాదు. శుభ్రత మనస్సు నందున్నవాడు అప్రయత్నముగనే

శుభ్రతను నిర్వహించుకొనును. ఇది యున్ననాడు తప్ప మానసిక శౌచము సాధ్యము కాదు. ఇతరులను గూర్చి చెడ్డ తలపులు చేయకుండుట కూడ మానసిక శౌచము. 24) తనకు మేలు జరిగినచోట కీడు తలపెట్టకుండుట అద్రోహము. 25) అభిమానము మానవ సహజము. అది దురభిమానము కారాదు. తాను ముఖ్యమనుకొనుట అభిమానము. తానే ముఖ్యమనుకొనుట దురభిమానము. దురభిమానము లేకుండుట దివ్య లక్షణము. (3)

ఇవి యన్నియు దివ్యత్వము ప్రధానముగా గల జన్మ కలిగినవారిలో కనిపించు లక్షణములు. అర్జునా! నీవు దివ్య లక్షణముల మూలముగా జన్మించిన వాడవు. దుఃఖమనునది దివ్య లక్షణముల లోనిది కాదు గనుక, ఇంతవరకును నీవు పడుచున్న దుఃఖమునకు కారణము లేదు. (4)

## ఆసుర లక్షణములు :

ఇంతవరకు దివ్య లక్షణ సంపదను గూర్చి వివరించితిని. ఇపుడు ఆసుర లక్షణములను వివరముగా తెలుపుచున్నాను. (5)

1) తనకు లేని దానిని ఉన్నట్లుగా ప్రదర్శింపగోరుట దంభము. 2) తాను అందరికన్న చాలా గొప్పవాడనని భావించుట దర్పము లేక గర్వము. 3) ఇతరులు తనకన్న తక్కువ వారనియు, వారికన్న తాను ఉన్నతుడనని భావించుట దురభిమానము. 4) ఎవరిపై నైనను దీర్ఘకాలము నిలువయుండు క్రోధము ఆసుర లక్షణము. 5) వాక్కునందు, చేష్టయందు గాయపరచు లక్షణము పరుషత్వము. అట్టి లక్షణ మున్నవాడు కర్కశ హృదయుడై యుండును. 6) తనను గూర్చి, ఇతరులను గూర్చి, దేశ కాల వ్యవస్థలను గూర్చిన ఇంగితము లేకుండుట. దానినే తెలివితక్కువతనము, మూర్ఖత్వము అందురు. (6)

ఆసుర తత్త్వమున జన్మించినవారికి ఎట్లు ప్రవర్తింపవచ్చునో, ఎట్లు ప్రవర్తింపరాదో తెలియదు. ఏది చేయదగినదో ఏది చేయరానిదో వారెరుగరు. భావన, వాక్కు ఎట్లుండవలెనో ఎట్లుండరాదో తెలియనివారు వారు. శుభ్రతను గూర్చిగాని, శౌచమును గూర్చిగాని వారికి తెలియదు. వారి ప్రవర్తనము అసహ్యకరముగా నుండును. పెద్దలు నడచిన మార్గమును గుర్తించుట, దాని ననుసరించి ప్రవర్తించుట వారికి నచ్చని పనులు. సత్యము నెడల గౌరవము

లేదు సరిగదా, సత్యవర్తనము వలన సదుపాయ ముండునను వివేకము కూడ వారి కుండదు. (7)

ఈ సృష్టియందు ఒక పద్ధతి లేదని ఆసుర స్వభావము గలవారి నమ్మకము. కనుక సృష్టియందు సత్యముండునని వారు నమ్మరు. అసలీ సృష్టి యంతయు భ్రాంతి యనియు, ఇందు నిత్యమైన స్థిర ధర్మములను గుర్తించుట వ్యర్థమనియు వారి విశ్వాసము. సృష్టియందు ఒక పద్ధతియే లేనప్పుడు దీనిని నిర్వహించు ఈశ్వరు డొకడున్నాడని వారంగీకరింపరు. స్త్రీ పురుషులు మన కంటి కెదుట కనిపించుచున్నారు. వారి పరస్పర కామ ప్రవృత్తి వలన జీవరాశులు పుట్టుచున్నవి. దీనికి వేరుగా ఈశ్వరు నొకనిని తెచ్చిపెట్టుట యేల యని వారి వాదము. ఇట్టి భావముతో వారి దృష్టి మందగించును. సృష్టిలో నొక సత్యము, నొక ధర్మము నున్నవని గ్రహింపకపోవుట వలన సృష్టియందు గల మహాశక్తుల నతడు దర్శింపలేడు. సృష్టియందు గల శక్తులను అంగీకరింపని వారికి తమయందు నిహితమైయున్న అపార శక్తిసంపద తెలియుట సాధ్యము కాదు. అనగా అట్టివారు తమను తాము కోల్పోవు చున్నారు. తమలో నిద్రాణమైవున్న దివ్యశక్తుల రహస్య మెరుగలేరు. గనుక తాము గమనించిన తమ స్వల్పశక్తులనే మహాశక్తులుగా గర్వించి తీవ్రముగా ప్రవర్తింతురు. అట్టివారి చేష్టలు ఉగ్రములై తన చుట్టునున్న జీవరాశులకు అపకారము కలిగించును. నిరంతరము అభివృద్ధి చెందుట సృష్టియందలి ధర్మము. దాని నంగీకరింపని ఆసుర స్వభావుల చేష్టల వలన జీవరాశులకు నాశము కలుగును. (8, 9)

తానెవ్వరో తనకు తెలియదు గనుక, తన కేమి కావలెనో కూడ ఇట్టి వానికి తెలియదు. కనుక తనకు కావలసినది కోరుట వానికి తెలియని విద్య. తాను కోరినది తనకు ఆవశ్యకమైనది కానప్పుడు, ఎన్ని కోరికలు తీరుచున్నను తృప్తి యుండదు. దిట్టమైన తిండిపుష్టి గలవాడు ఆకలితో నుండగా మరమరాలు ఒక్కొక్కటి చొప్పున తినుచున్నచో ఆకలి ఎంత సేపటికిని తీరనట్లు, ఇట్టివాడు ఎన్ని కోరికలను సాధించి పోసినను కోరిక తీరుట యను తృప్తి యుండదు. అది అంతులేని అగాధము వంటిది. తృప్తియన్నది యుండదు గనుక, తమకు లేనిది యున్నట్లు ప్రదర్శించుకొను దంభము, తాను

గొప్పవాడనుకొను గర్వము, ఎవ్వరిని లెక్కజేయని మదము పెచ్చుపెరుగును. తా ననుకొన్నదే తనకు వేదము గనుక చేయతగినది యేదో తెలియని మూఢత్వము ఆవరించును. లోకములో పదిమందిచే మంచివారని పేరందిన వారు ఆచరింపని మార్గమును స్వీకరించి మలినమైన ప్రవర్తనముతో జీవించును. (10)

ఆసురప్రవృత్తి గలవారు అనంతమైన ఆలోచనలతో, ప్రణాళికలతో, వానిని గూర్చిన నిరంతర మానసిక ఘర్షణతో జీవింతురు. ఆ ప్రణాళికలు అంతమొందుట వారంతరించిన తరువాత మాత్రమే సాధ్యము. అయినను తామర గలవాడు గోకికొనుట మానలేనట్లు, వారి ఆలోచనలను వదలలేరు. తన ప్రణాళికల వలన కలుగు ఫలితములు నిశ్చయముగా తనకు నచ్చినవే కానక్కరలేదు గనుక, చింతలు వానిని వదలిపోవు. తాను కోరిన ఉపభోగములు (Luxuries) మాత్రమే జీవితమను నిశ్చయ మార్గమును వారు వదలలేరు. వారు కోరుచున్నవి ఉపభోగములేగాని అవసరములు (Needs) కావు గనుక అవి వందలు వందలుగా వారిలో నుండి పుట్టుకొని వచ్చుచుండును. ఆ ఆశలను వాడు వదలలేడు గనుక నవి వానిని చుట్టుకొని కదలనీయవు. తాను కోరిన దానిపై మక్కువ, అది దక్కనిచో దానికి కారకులని తాను భావించిన వారిపై క్రోధము; ఇవియే వాని జీవితమున నిండిపోవును. కనుక తాము కోరిన భోగములను పొందుటకు గాను ధనము కూడబెట్టుకొనుట యారంభమగును. అవసరమునకు మించి కూడబెట్టవలె నన్నచో అన్యాయముగానైన ప్రవర్తించుటకు వాడు జంకడు. (11, 12)

"ఈ నాడు నా కోరిక యొకటి సిద్ధించినది; రేపు మరికొన్ని కోరికలు తీర్చుకొందును. నేడు నా కింత ధనము ఉన్నది, రేపు మరింత ధనము నార్జింతును. నేడు ఈ నా శత్రువును వధించితిని, రేపు మిగిలిన శత్రువుల నందరిని వధింపగలను. అందరికిని నేనే నాయకుడనని వారందరును గుర్తింపవలెను. నేను చాల బలవంతుడను గనుక సుఖభోగము లనుభవించు హక్కు నా కున్నదని లోకమంతయు గుర్తించునట్లు ప్రవర్తింతును. వారందరి కన్న నాది యుత్తమ జన్మమని, కలిగిన వాడనని వారెల్లరు గుర్తింపవలెను. అసలు నావంటి వాడు మరి యెవ్వడున్నాడు? ఎవ్వరికైన నేదియైన నీయదలచినచో

ఈయగలవాడను నేనే. నేను భోగింపదలచినను నావలె భోగింపగలవాడు లేడు.'' ఇట్లు ఆసుర స్వభావులు తమ్ము గూర్చి తామెరుగని తెలివితక్కువ తనముచే మూఢులై నిరంతరము భావించు చుందురు. **(13, 14, 15)**

ఈ విధముగా ఆసురతత్త్వము గలవారు తమను గూర్చి తమకే తెలియని స్థితిలో అనేక చిత్త విభ్రాంతులకు (Self-illusions) లోనై వాని అల్లికచే తమను తామే మోసగించుకొందురు. ప్రవాహజలము స్వచ్ఛముగా నుండును. చిన్నగుంటలో నిలువయున్న నీరు మురికియెత్తిపోయి అనారోగ్య కరమైన సూక్ష్మక్రిములతో నిండియుండును. అట్లే తమ కావశ్యముకాని వందల కొలది కోరికల సూక్ష్మజీవులతో నిండిన మురికిగుంట యనెడి నరక కూపమున బడి వారు చిరకాలము జీవింతురు. దానినే స్వర్గధామముగా తమ్ము తాము మోసగించుకొను చుందురు. **(16)**

తాను ఎదుగవలసి యున్నదని గ్రహించినవాడు తనను తాను పొగడు కొనడు. తనను తాను పొగడుకొనుటకు ఆసుర స్వభావుడు సిగ్గుపడడు. తానే గొప్పవాడనని భావించుటవలన వాడెట్టి ఎదుగుదల లేక స్తబ్ధుడై యుండి పోవును. తాను ఆర్జించిన, ఆర్జింపదలచిన ధనముచేతను, దానివలన తనకు సిద్ధించు ననుకొను గొప్పదనముచేతను వాడు మదించిపోవును. అట్టివాడు యజ్ఞాదులు కూడ చేయుట చిత్రముగనే యుండునుగాని, వాడు తన గొప్ప తనమును ప్రదర్శించుకొను డాంబికత్వమునకై యజ్ఞములు చేయును. అవి పేరునకే యజ్ఞములు గాని నిజమైన యజ్ఞములు కావు. వాడు ఎట్టి శాస్త్రములను లెక్కజేయడు గనుక, తన యిష్టము వచ్చిన రీతిలో చేయును. పదిమందిలో ప్రదర్శనమునకే గాని భక్తి శ్రద్ధలతో వాడా యజ్ఞములు చేయడు. **(17)**

అట్టివారు శారీరకమైన పశుబలముపై నెక్కువ నమ్మకము కలిగియుండి, దానినే పెంపొందించుకొందురు. పశుబలము ఎక్కువైన కొలదియు ఇతరుల కన్న తాను గొప్పవాడనను దర్పము పెరిగిపోవును. దానితో అహంకార మనబడు పొగరు పెచ్చుమీరును. అట్టివానికి కోరికలుకూడ గాఢముగా నుండును. అవి తీరుచున్నకొలదియు వాని సంఖ్య, తీవ్రత పెరుగుచుండును. కోరికలు తీరనపుడు అవి తనకు దక్కకుండుటకు కారణముల నితరులలో

అన్వేషించును. అట్టివారిపై తీవ్రమైన క్రోధము దీర్ఘకాలము నిలచియుండును. తనయందున్న తానను దివ్యప్రజ్ఞ తన కామ క్రోధాహంకారముల నడుమ పాతుకొనిపోయి యుండును. తనయందలి ప్రజ్ఞనే గమనింపలేని వానికి నితరులలోని దివ్యప్రజ్ఞను గమనింప గలుగుట అసలే సాధ్యము కాదు. తన యందును ఇతరులయందును గల సమానత్వమును (Commonness) గమనింపగలిగిన వానికి ఇతరులపై ప్రేమ యుండును. సమానత్వమునుగాక భేదములను మాత్రము గమనించువారు ఆసుర స్వభావులు. భేదము ద్వేషము నకు మూలము. అహంకారముతో తానెంత కరడుగట్టుకొని పోవునో అన్ని భేదము లితరులలో కనిపించును. ఎన్ని భేదములు కనిపించునో అంతటి ద్వేషము ఇతరులపై నాతడు పెంచుకొనును. పొరబాటున నెవ్వడైన తనకన్న ఏ యంశములో నైనను అధికుడని గమనింపగలిగినచో అట్టివానిపై అసూయతో నాతడు మండిపోవును. (18)

క్రోధము, అసూయ, ద్వేషము కలవారు తమ చుట్టునున్న సమాజము నెడల క్రూరముగా ప్రవర్తింతురు. చక్కగా గమనింపగలిగినచో అట్టివారిని మానవజాతిలోని అధమజాతి వారని తెలియును. అట్టి నరాధములను నే నేమి చేయవలెను? వారి స్వభావమునందలి శక్తి తీవ్రమైనది. ఆ తీవ్రతయే ఆకర్షక శక్తికాగా, అట్టి ఆసురజన్మములనే మరల మరల పొందుచుండుటయు వారి తీవ్ర ఆసురతత్త్వమే కారణముగా త్వరగా జన్మలు ముగియు చుండుటయు, ఆ ఆకర్షక శక్తియే కారణముగా మరల త్వరత్వరగా జన్మలెత్తు చుండుటయు జరుగుచుండును. ఈ జనన మరణముల ఆవృత్తులలో వారిలోని ప్రచండమైన తీవ్రత, వారియందున్న 'నే' నను కేంద్రములోనికి జారిపోయి నిస్తేజమగును. ఇది వారి యోగక్షేమము కొరకై నేను చేసిన ఏర్పాటు. కాని ఇట్టి ఆసుర ప్రవృత్తి తీవ్రముగా నున్నవారు అంత త్వరగా తమ స్వభావపు పట్టును వదలలేరు. కనుక ఎన్నో జన్మలు అట్టి ఆసుర స్వభావము గల తల్లిదండ్రులకే పుట్టి, అట్టి స్వభావముతోనే జీవించుట సంభవించును. అట్టి జన్మలలో నున్నంతకాలమును తమయందున్న నన్ను గమనింపకయే, అధమగతియందే వందలకొలది జన్మలు గడచిపోవును. కాని వారికి తెలియ కుండగనే ప్రతి జన్మలోను కొంత తీవ్రత 'తన' లోనికి జారిపోవుచుండును.

ఇది తనకు తెలియకయే జరుగును గనుక అతడు 'తనను' గమనింపలేడు. ఇట్టి కొన్ని వేల జన్మల ప్రక్రియ తరువాత క్రమముగా నాతని స్వభావపు తీవ్రత నిస్తేజమగును. (19, 20)

ఆసుర ప్రవృత్తి గలవారు జీవించునది నిరంతర వేదనామయ జీవనము. దానినే నరకమని పెద్ద లందురు. ఆ నరకము లోనికి ప్రవేశించు ద్వారములు మూడు! అవి కామము, క్రోధము, లోభము. ఇవి మూడును వేర్వేరుగా కనిపించి నను మూడును కలిపి ఒక్కటే మార్గము. తనకేది కావలెనో తెలియని వానికి కోరికలు అనంతముగా నుండును. అవి తీరినన్ని తీరును. తీరనివి తీరవు. తీరిన కోరికల నుండి మరిన్ని కోరికలు మొలకలెత్తుచుండును. కనుక అవి అనంతములు. తామర గలవాడు గోకికొనుచుండగా సుఖముగా నున్నట్లుండును. కొంతసేపునకు మంట పుట్టును. అట్లే తీరిన కోరికలు కూడ దుఃఖమునందే పర్యవసించును. ధనము కోరినవానికి అది తీరగనే చోర భయము వెన్నంటి యుండును. ఒకే శక్తికి కామము ఒక ధ్రువము కాగా, క్రోధము రెండవ ధ్రువము. తీరని కోరిక క్రోధము పుట్టించును. తన కోరికలు తీరకుండుటకు కారకులని తాను భావించిన వారిపై క్రోధము పుట్టుకొని వచ్చును.

క్రోధమున్నవాడు నిరంతరము ఆ భావన తనలో మండుచుండగా దుఃఖమునే అనుభవించును. కోరిన వస్తువును పొందిన తరువాత దానిని తానే దాచియుంచుకొనవలెనను లోభము పుట్టుకొనివచ్చును. ఒకసారి ఒక వస్తువును సాధించిన తరువాత మరొకమారు దానిని సాధింపలేనను భయమే లోభమునకు మూలము. ఈ మూడు మార్గములును ఒకే ద్వారమునకు గల తలుపుల వంటివి. వీనియందు ఏ తలుపు ద్వారా ప్రవేశించినను ప్రవేశించునది ఒకే మార్గము లోనికి. అది నరకమునకు మార్గము. నరక మనగా చీకటి, దుఃఖము నిండియున్నది. ఇందు ప్రవేశించినవాడు తానను వెలుగునకు నోచుకొనక, దుఃఖమయముగా జీవించును. అనగా అతడు తనను తాను నాశనము చేసికొనును.

బుద్ధిమంతుడైనవాడు ఈ మూడు మార్గములలో ప్రవేశింపరాదు. దీనికి మార్గ మొక్కటే. తన శక్తియుక్తులను, తన లోటుపాట్లను తానెరిగి, తాను

దేనికి పనికివచ్చునో తెలిసికొని దానిని ఇతరుల సదుపాయమునకై వినియోగించు వానికి ఆయువు సద్వినియోగమగును. తా నితరుల సదుపాయమును గమనించును గనుక ఇతరులు తన సదుపాయమును తాను కోరకయే తీర్చుచుందురు. ఇది స్వర్గ మనబడును. ఇట్టి వానికి తనకు కావలసినది తెలియును గనుక విపరీతపు కోరిక లుండవు. అవసరములే గాని, విపరీతపు కోరిక లుండనప్పుడు అవి తీరలేదను క్రోధ ముండదు. ఎవరికైనను అవసరములు పరిమితముగనే యుండును. తనను తా నెరిగిన వానికి అవసరములు తీరుట జరిగిపోవుచుండునని తెలియును గనుక, దాచు కొనవలెనను లోభబుద్ధి యుండదు. (21)

అంధతామిస్ర లోకముల లోనికి గొనిపోవు ఈ మూడు మార్గములను వదలిననేగాని మానవుడు సుఖపడుట యననేమో తెలియలేడు. ఈ సుఖము తామర గోకికొనగా కలుగు సుఖము వంటిది కాదు. అసలు తామరయే లేని సుఖము వంటిది. రెండు దుఃఖముల నడుమ నున్న విరామమునే సామాన్య మానవుడు సుఖముగా భావించును. అట్లుగాక, సుఖము మాత్రమే యున్న స్థితి యొకటి యుండునని గ్రహించ గలుగుట నిజమైన సుఖమునకు ప్రారంభ మగును. చీకటి వెలుగుల పర్యాయమగు కాంతిని (Alternating current) మాత్రమే మానవుని కన్ను చూడగలదు. పర్యాయత్వము లేని (గామా, బీటా మొదలైన) కాంతి కిరణములను మానవుని కన్ను చూడలేదు. అట్లు చూడ గలుగుటకు వేర్వేరు పరికరముల నుపయోగింప వలసినట్లే, అంతరములేని సుఖమును గమనింప గలుగుటకు 'తాను' అను చూపును వినియోగింపవలెను. తన కోరికలుగా, కోపతాపములుగా, మద మాత్సర్యములుగా చెదరిపోయిన తన ప్రజ్ఞను కూడగట్టు ప్రయత్నము ప్రారంభమైన నాటి నుండియు తనకేది నిజముగా శ్రేయమును కలిగించునో తెలియుట ప్రారంభమగును. తన ప్రజ్ఞను కూడగట్టుకొనుట యనగా తనలోనికి తాను చూచుకొనుట. తనలోనికి తాను చూచుకొనునప్పుడు తా ననుకొన్నవి గాక, తనలో నిజముగా నున్నవి తెలియుట మొదలుపెట్టును. ఈ సాధనలో మొదటి స్థాయిలో నున్నవాడు-అనగా తనలోనున్న దానిని గమనించుట నభ్యాసము చేయుచున్నవాడు తనలోని శక్తియుక్తులను కూడగట్టుకొనును. ఈ కూడగట్టుకొను ప్రయత్నము

చేయువాడు మనస్సుగానున్న తానుగాక, బుద్ధిగా నున్న 'తాను'. అట్టివాడు లౌకికముగాను, ఆధ్యాత్మికముగాను తనకేది శ్రేయము కలిగించునో దానినే చేయుచుండును.

ఈ మార్గమున సాధన చేయుచున్నవాడు స్వల్పకాలమునకే, తన శ్రేయస్సును చూచుకొనుట తనకు శ్రేయము కాదనియు, ఇతరుల శ్రేయమును గమనించుచు కృషి చేయుటయే తనకు శ్రేయమనియు గుర్తించును. లౌకిక జీవితమునను, ఆధ్యాత్మిక జీవితమునకుకూడ ఇదియే సత్యము. కొనుగోలు దారుల శ్రేయమును గుర్తించి, నాణ్యమైన సరకునే విక్రయించు వ్యాపారస్తునికి అప్రయత్నముగ చీకుచింతలు లేని లాభము తనంత తాను వచ్చిపడును. ఈ విధమైన లౌకిక జీవిత సాధనమే ఆధ్యాత్మిక సాధనగా పనికివచ్చును. లౌకిక జీవితముతో సంబంధము లేని ఆధ్యాత్మిక సాధన గాలిలో మేడలు కట్టుటవంటిది. సాధన, క్రమముగా ఇతరులలోని దయ, ప్రేమ, సేవ మున్నగు భావములను ప్రేరేపించి వారినికూడ పవిత్రుల నొనర్చును. తన ప్రేమచే నాకర్షింపబడి ఆ వెలుగులో ఎందరు పవిత్రు లగుదురో ఆ మేరకు సాధకునకు పరమార్థము సిద్ధించును. ఇట్టివాడు క్రమముగా జగత్కర్మ రూపమగు బ్రహ్మ ప్రజ్ఞలో జీవించుచుండును. (22)

ఈ సృష్టి మొత్తము పరస్పరత్వముపై నాధారపడి యున్నది. ఒక అంశముతో పరస్పర సహకారము లేక మరియొక అంశమునకు అస్తిత్వము లేదు. సర్వజీవరాశుల యెడలను ఈ సత్యమును మనము గమనింపవచ్చును. ఈ పరస్పరత్వమునే వేదమందురు. దీనిని తెలియజేయునది శాస్త్రము. దీనియందు చూపు కలిగినవారిని ద్రష్టలు లేక ఋషులు అందురు. వేల సంవత్సరముల తరబడి ఋషుల పరంపర ఈ పరస్పరత్వమను మహత్తర సత్యమును దర్శనము చేసి, క్రోడీకరించి యిచ్చిన శాస్త్రము పరంపరాగతముగా మనకు అందింపబడుచున్నది. కార్యసిద్ధిని కాని, ఆధ్యాత్మిక సిద్ధినిగాని కోరిన వాడు శాస్త్రమును అంగీకరించి, పాటించి తీరవలెను. పాటింపనిచో నేమగును? విద్యుత్తునకు సంబంధించిన శాస్త్రమును పాటింపక అవకతవకగా అనుసంధానము చేసికొన్నచో నేమగును? షార్ట్ సర్క్యూట్‌తో అంధకారము మిగులును. విద్యుత్తు అనబడు మహాశక్తియొక్క వినియోగము లేకుండ

పోవును. కనుక కార్యసిద్ధిని కోరినవాడు తప్పనిసరిగా శాస్త్రమును పాటించి తీరవలెను. ఎక్కడో ఎప్పుడో ఒక మేధావి ఇంతవరకు శాస్త్రమునలేని క్రొత్త విధానము నవలంబించి ఉత్తమ కార్యసిద్ధిని పొందగలుగును. అతడు కూడ అంతవరకునున్న శాస్త్రమును క్షుణ్ణముగా నభ్యసించి, దానిపై మరియొక మెట్టెక్కగలుగునేగాని, అతడును శాస్త్రమును వదలినవాడు కాడు.

ఏదో యొక కోరిక మనసులో నుంచుకొని, దానికై వేగిర పడినవాడు శాస్త్రమును గ్రహించుటకు ఓర్పును కోల్పోవును. గ్రహించినను ఫలితము నందు ఆతురతయే తప్ప, కార్యసాధన విధానమునందు శ్రద్ధలేనివా డగును. అట్టి వానికి లౌకికముగా కార్యసిద్ధి కలుగుట సాధ్యము కాదు. అట్లే అమృతపాన, రంభా సంగమాదులైన కోరికలను మనసులో నుంచుకొని యజ్ఞ దాన తపః క్రియాదులు ఆచరించినవారికి కూడ విధానమునందు కన్న రంభాదులయందే ఎక్కువ దృష్టి యుండును. కనుక యజ్ఞము నిష్ఫలమగుటయే గాక, రంభాదులు కూడ కలగా మాత్రమే మిగిలిపోవుదురు. (23)

కనుక ఏ పని చేయవలెను? ఏ పని చేయరాదు? ఎట్లు చేయవలెను? ఎట్లు చేయరాదు? ఎప్పుడు చేయవలెను? ఎప్పుడు చేయరాదు? అను సంశయములో శాస్త్రమే పరమ ప్రమాణము కావలెను. చేయవలసిన విధానమే కాదు, తాను చేయవలసిన, చేయదగిన పని యేదో తెలియవలె నన్నను శాస్త్రమే ఆధారము కావలెను. శాస్త్రము తెలిసినవాడు తప్ప తాను చేయదగిన పనియేదో తెలియలేడు. ఏదో యొక క్రతు ప్రక్రియలో ఉపవాస ముండుట ఆవశ్యకమని శాస్త్రము విధించును. ఆ క్రతువు నందు ఆవశ్యకమైన శారీరక, ప్రాణమయ, మనోమయ కోశముల పరిశుద్ధి కొరకై ఉపవాసము విధింపబడి యుండును. ఆరోగ్యము లేని వ్యక్తి ఉపవాసము చేసినచో అనారోగ్యము ముంచుకొని రావచ్చును. అట్టివాడు ఆ క్రతువును తలపెట్టరాదు. తన కావశ్యకమైనది, తనకు సరిపడునది యగు క్రతువును ఎంచుకొని, శాస్త్ర విధిని తప్పక అనుసరించి, శ్రద్ధతో క్రతువును నిర్వహించినపుడు శాస్త్రము సూచించిన కార్యసిద్ధి కలుగును.

అయినచో శాస్త్రములు అనేక మున్నవి. ధర్మ శాస్త్రములలో వేర్వేరు మత భేదము లున్నవి గదా! ఇందు దేనిని పాటించుట అను సంశయము

కలుగవచ్చును. మానవు లందరు నొక్కటేయైనను, వారి స్వభావమును బట్టి, వృత్తిని బట్టి, వంశాచారమును బట్టి, భిన్నముగా నుందురు. ఒక్కొక్క వంశము నందు ఆహార విహారాదికములైన జీవిత విధానము ఒక్కొక్క విధముగా నుండును. వారి ప్రవృత్తికి, వృత్తికి, కులమునకు, వంశమునకు అనుగుణముగా వా రాచరింపవలసిన విధానము లుండును. వీనిని గమనించి వేర్వేరు శాస్త్ర సంచయములు గృహ్య సూత్రములు మున్నగు పేర్లతో ఏర్పాటు చేయబడి యున్నవి. కాలక్రమమున కొందరు వ్యక్తుల యిష్టాయిష్టములు ఆచారము పేరిట ఇందు దూరిపోవుచుండును. అట్టి అనావశ్యకమైన నిబంధనలను తొలగించి, నిజమైన శాస్త్ర విధానమును ప్రసాదించు కులగురువులు కొంత కాలమున కొకమారు పుట్టి సరిచేసి పోవుచుందురు. ~~ఈ~~ విధముగా మరల మరల సంస్కరింపబడుచున్న శాస్త్ర విధానమునే అనుసరింపవలెను గాని ఎవని యిష్టము వచ్చినట్లు వాడు శాస్త్రమును మార్చి అన్వయించు కొనరాదు. ఇట్లు శాస్త్రము నెడల సరియైన అవగాహన యున్నవాడే సత్కర్మ చేయుట కర్హుడగును. **(24)**

## పదునేడవ అధ్యాయము

# శ్రద్ధాత్రయ విభాగ యోగము

**శా**స్త్ర విరుద్ధముగా యజ్ఞాది క్రతువు లాచరించువారు ఆసుర స్వభావులు. నిజమే! కాని ఒక్కొక్కడు చాల శ్రద్ధతో క్రతువు లాచరించ బూనును. శాస్త్ర విధానము తెలియక గాని, ఆచరించుటకు శక్తి సామర్థ్యములు చాలక గాని, తనకు తోచిన రీతిలో భక్తి శ్రద్ధలతో క్రతువు నాచరించును. అట్టివాని స్థితి యేమి? మూడు గుణముల తరగతులలో అత డేతరగతి వాడు? ఇది చక్కని ప్రశ్న వలెనే కనిపించును. శ్రద్ధ యనగా కేవలము దైవీసంపత్తి యని భ్రమపడుట వలన పుట్టినది యీ సంశయము. కాని యిట్టి ప్రశ్న సాధకునిలో ప్రతి స్థాయి లోను ఒక్కొక్కమారు పుట్టుచునే యుండును. దీనిని కృష్ణుడిట్లు వివరించెను. **(1)**

శ్రద్ధ యనగా కేవలము దైవీ సంపద యనుకొనుట పొరబాటు. శ్రద్ధ యనగా భక్తి. భక్తి తనలో నుండగా, దానిని కార్యాచరణమున వినియోగించి నపుడు అదియే శ్రద్ధ యనబడును. భక్తి, శ్రద్ధ యనునవి ఒక్కొక్కనికి ఒక్కొక్క విషయమునందుండును. వారి వారి స్వభావము ననుసరించి శ్రద్ధ సాత్త్వికము, రాజసికము, తామసికము అని మూడు విధములుగా నుండును. శ్రద్ధ యనగా తాను చేయుచున్న కర్మయందు చూపించెడు సమర్పణబుద్ధి. క్రతు నిర్వహణ యందు తప్ప మరి దేనియందును దృష్టి లేకుండుట నిజమైన శ్రద్ధ. క్రతువు, దానిని చేయుచుండుట యను క్రియ, చేయుచున్న తాను ఒక్కటిగా నుండి క్రతువు నాచరించు వానిది అచ్చమైన శ్రద్ధ. అట్టిది సత్త్వగుణము వలన కలుగును. తనలో ఎంత పాలు సత్త్వగుణ ముండునో, అంత పాలు తనయందు శ్రద్ధ యున్నదని యర్థము. (శుద్ధ సత్త్వము లేక గుణాతీత తత్త్వము కలవాడు శ్రద్ధయే తానై యుండును.) చేయుచున్న కర్మయందు తాను చూపించు

శ్రద్ధ, ఆ కర్మకు వెనుక తనకుగల ఉద్దేశ్యము (Motive) పై నాధారపడి యుండును. తనయందలి త్రిగుణముల మేళనము ఆ ఉద్దేశ్యమునకు కారణమై యుండును. క్లుప్తముగా చెప్పవలె నన్నచో తనకు ఏ యంశముపై శ్రద్ధ యుండునో అది తానై యుండును. కనుక ఇది మూడు విధములుగా నుండును. (2, 3)

## త్రివిధముల ఆరాధనము :

రజస్తమో గుణముల కన్న సత్త్వగుణము పాలు ఎక్కువగా నున్నవారు సృష్టి నిర్మాణ ప్రజ్ఞలగు దేవతల నారాధింతురు. రజోగుణము హెచ్చుగా గలవారు యక్షులను, రాక్షసులను ఆరాధింతురు. యక్షులనగా సమూహ ప్రజ్ఞలు. ఒక అరణ్య భాగము గాని, ఒక పర్వతము గాని, ఒక లోయ గాని, ఒక మహావృక్షము గాని, ఒకే సామూహిక ప్రాణమయ ప్రజ్ఞచే నావరింపబడి యుండును. అందలి జీవజాలమంతయు ఆ ప్రజ్ఞ యందు జీవించుచు రక్షింప బడుచుండును. అట్టి సామూహిక ప్రజ్ఞను యక్షము అందురు. అట్లే సృష్టి యందు ప్రవర్తించుచు దానిని కాపాడుచున్న శక్తులు (Energies & Forces) కొన్ని వేలున్నవి. వానికి మూలమైన కేంద్ర ప్రజ్ఞలను రాక్షసులని వేదము నిర్దేశించును. ఇక తమోగుణము హెచ్చుగా కలవారు ప్రేతములను, భూత గణములను ఆరాధింతురు. దేహములను వదలిన జీవులు మరియొక శరీర మును ధరించు లోపున ప్రేతములుగా నుందురు. వారితోబాటు ఆ లోకములలో పనిచేయు శక్తులను భూతములు అందురు. ఆయా గుణములు ప్రధానముగా గలవారు ఆయా గణముల నుపాసించుట కిష్టపడుచుందురు. సాధకుడు కాగోరినవాడు యక్ష రక్షస్సులను, భూతప్రేతములను ఆరాధించుట తన కిష్టమైనను బుద్ధిపూర్వకముగా మానవలెను.

పూజింపబడు దేవుని పేరునుబట్టి పూజించు వ్యక్తియొక్క గుణ స్థానమును నిర్ణయింపరాదు. తన యారాధనమునకు వెనుక నున్న సంకల్పమును బట్టి వాని యారాధనము సాత్త్వికము, రాజసికము, తామసికము అని నిర్ణయింపబడును. అంబరీషాదులు సత్త్వగుణ సంపన్నులై విష్ణువు

నారాధించిరి. నందనారు మున్నగు భక్తులు సత్త్వగుణోన్నతులై శివు నారాధించిరి. రావణాది రాక్షసులు రజోగుణ ప్రధానులై ఆ శివునే యారాధించిరి. భస్మాసురు డని ప్రసిద్ధికెక్కిన వృకాసురుడను రాక్షసుడు కూడ తమోగుణ ప్రధానుడై ఆ శివునే యారాధించెను. చేతబడి మున్నగు క్షుద్రశక్తుల ఆరాధనములో రుద్రుడైన శివుని గూర్చిన యారాధనము కూడ నుండును. కనుక యక్ష రక్షః పిశాచాదులనే గాక, విష్ణు శివాది దైవముల నారాధించు వారిలో కూడ రజోగుణ తమోగుణ ప్రధానులుండవచ్చును. వారి సంకల్పము, శ్రద్ధ, వీనిని బట్టియే యీ నిర్ణయము జరుగును. (4)

మహా ఘోరమైన తపస్సులు చేయువారిని నీవు చూచి యుందువు. వారములు, నెలల తరబడి ఘోరమైన ఉపవాసాదులు చేయుట, పంచాగ్ని మధ్యమున నుండుట, ఒక కాలి వ్రేలిపై నిలబడి యుండుట, ఆకు అలములను మేయుచుండుట, చివరకు పచ్చి గంగయైనను ముట్టకుండుట మొదలగు ఆసుర చేష్టలతో వారు తమ శరీరమును కృశింపజేసికొనుచు, దానినే మహా తపస్సుగా భావించువా రున్నారు. కాని తమ శరీరము తాము ఆర్జించుకొన్నది కాదని వారు మరచిపోవుచున్నారు. వారి జీవితము జగత్కర్మలో నొక భాగము. తమ వంతు కర్తవ్యమును నిర్వర్తించుటకు వేదికగా వారి శరీరమును నేనే వారికి ప్రసాదించితిని. ఆ శరీరముల యందలి రక్తమాంసాది ధాతువులుగా, ఆకలిదప్పులు మున్నగు ప్రాణప్రవృత్తులుగా నున్నవాడను నేనే! అట్టి నన్నే వారు దారుణముగా ఎండగట్టుచు, శుష్కింపజేయుచు, అదియే ఘనకార్యముగా భావించుచున్నారు. శరీరమున్నపుడు నిర్వహణ పోషణా దికములు చేయుట శాస్త్రసమ్మతము. శరీరమునకు వలసినవానిని సమకూర్చి, చక్కగా నిర్వహించుచు, దాని చేత చక్కగా పనిచేయించుకొనుట నేర్పునది శాస్త్రము. దానికి విరుద్ధమైన దారుణ చేష్టలు ఆసురములు. అట్టి ప్రవృత్తి గలవాడు బుద్ధిలేనివాడు. (5, 6)

ఆరాధనము నందేగాక, ఆహారము స్వీకరించుటయందును, యజ్ఞములు చేయుటయందును, తపస్సు నందును, దానమిచ్చుట యందును కూడ మూడు గుణముల ననుసరించి మూడుతరగతు లున్నవి. వీనిని తెలిసికొనుట సాధకునకు అత్యావశ్యకము. (7)

**రుచులు :**

ఆయువు (Longivity), సత్త్వము (Stamina), బలము (Strength), ఆరోగ్యము (Ease), సుఖము (Happiness), ప్రీతి (Poise) అను వానిని వృద్ధిచేయు పదార్థములు సత్త్వగుణము కలవాడు సహజముగా ఇష్టపడును. రసము గలిగినవి (పండ్లు మొదలగునవి), చమురు కలిగినవి (నేయి, వేరుసెనగ, నువ్వులు, ఆక్రోటు మున్నగునవి), మాంసకృత్తులు కలిగినవి, హృదయమునకు బలము నిచ్చు తేనె మొదలగునవి అగు ఆహారములు పై జెప్పిన అంశములను వృద్ధి చేయును. ఇట్టివానిని యిష్టపడుట సత్త్వగుణ ప్రధానునకు సహజముగనే యుండును. ఆయువు మొదలైనవాని అభివృద్ధి కావలసినవాడు, సాధకుడు కాగోరినవాడు ఇట్టి ఆహారములను స్వీకరించుట ప్రయత్న పూర్వకముగా నభ్యసింపవలెను. గుణములయొక్క హెచ్చు తగ్గులనుబట్టి ఆహారము రుచించుట ఎట్లు జరుగునో, ఆహారమునందలి మార్పులు బుద్ధిపూర్వకముగా చేయుటవలన గుణముల హెచ్చుతగ్గులు అట్లు సర్దుబాటగుచుండును. (8)

రజోగుణము ప్రధానముగా గలవారు తీవ్రమైన కారము, పులుపు, ఉప్పుగల పదార్థముల నిష్టపడుదురు. మరుగుచున్న పదార్థములే తప్ప వారిష్టపడరు. చాల గట్టిగనున్న పదార్థములు, ఎండబెట్టిన వరుగులు మొదలగు నవి, కడుపులోపల మండించు ఆవవంటి పదార్థములు, ఊరగాయలు మున్నగు పదార్థములు రాజసిక స్వభావుల కిష్టమైయుండును. ఈ ఆహార స్వీకరణము వలన తీవ్రమైన ఉద్వేగాదులు కలుగును. ఫలితముగా దుఃఖము (Depression), శోకము (Suffering), రోగము (Physical ill health) కలుగును. సాధకుడు కాగోరినవాడు ఇట్టి పదార్థముల స్వీకరణమును క్రమముగా పరిహరించుచు, సత్త్వగుణము నిచ్చు ఆహారమును స్వీకరించుట నభ్యాసము చేయవలెను. (9)

ఇక తామసిక స్వభావము గలవారి రుచులు ఇంకను చిత్రముగా నుండును. వండిన తరువాత మూడు గంటలు నిలువయున్న పదార్థములు వారి కిష్టము. వేడి వేడి యన్నము కన్న చద్దియన్నమే వారికి రుచించును.

ఈనాటి పులిహోరకు రేపటికిగాని అసలైన రుచి రాదని వారి సిద్ధాంతము. పదార్థములు అసలు రుచి మారిపోయిననేగాని వారికి రుచింపవు. పులిసి నురగతేలిన పదార్థములలోని 'తిక్క' వారి కిష్టము. మద్యపాన ప్రియు లందరును తమోగుణ ప్రధానులే! పాచిపోయిన పదార్థము నైనను వారు చాల యిష్టముగా తినగలరు. ఎంగిలి యను పట్టింపు వారికుండనే యుండదు. ప్రక్కవారు తినుచున్న ఆహారమును, త్రాగుచున్న పానీయములను తాము కొంత స్వీకరించి, కొంత మిగిల్చి మరల వారి కిచ్చుటకు తమోగుణము వారు ఏహ్యపడరు. పోషక విలువలు లేని అప్పడములు, వడియములు మున్నగు పదార్థములపై వారికి మక్కువ హెచ్చు. ఈ రుచులవలన నిద్రపోతుతనము, సోమరితనము, మూర్ఖత్వము, మానసిక జడత్వము ఎక్కువగును. సాధకుడు కాగోరినవాడు ఇట్టి పదార్థములను బుద్ధిపూర్వకముగా వదలి తీరవలెను. ఇట్టి యాహారము తీసికొనువారికి సాధన మార్గము కలలోని ప్రయాణమే. (10)

## యజ్ఞములు :

యజ్ఞములు చేయు వారందరును బ్రహ్మ స్వరూపులని భావింపరాదు. వారిలోకూడ మూడు తరగతుల వారున్నారు. సత్త్వగుణము కలవాడు శాస్త్రములలో చెప్పబడిన విధానము తప్పకుండ యజ్ఞము చేయును. ఇది చేయుటవలన ఈ ఫలము లభించునను ఉద్దేశ్యము (Motive) వాని కుండదు. ఇది యిట్లు చేయవలెనని పెద్దలు చెప్పిరి గనుక చేయుటయే గాని, యీ ఫలితము కొరకే యజ్ఞమని వారి కుండదు. అనగా కర్తవ్య నిష్ఠయే తప్ప ఫలితమును గూర్చిన భావన వారి మనస్సున నుండదు. (11)

కాని రజోగుణము కలవాడు ఒక యజ్ఞము వలన ఒకానొక ఫలితము కలుగునని నమ్మి, దానికై ఆ యజ్ఞము నాచరించును. అనగా ఫలితము పైననే వాని శ్రద్ధ తప్ప, యజ్ఞముపై నుండదు. మరియొకడు ఫలితము కూడ ఆశింపడు. ఈ యజ్ఞము నింత వైభవముగా చేసినానను గొప్పదనము ప్రదర్శించుకొనుటకు మాత్రమే అతడు యజ్ఞము చేయును. ఇట్టి యజ్ఞముల వలన ఫలితము లేకపోగా వ్యయ ప్రయాసలు, దుఃఖము, క్రోధము మిగులును. (12)

రజోగుణము వానికి తన కోరిక పైననో, గొప్పదనము పైననో ఏదో యొక శ్రద్ధ యుండును. తమోగుణ ప్రధానుడైన వానికి శ్రద్ధ యన్నదే యుండదు. శాస్త్రమును పరిశోధించి విధానమును గ్రహింపగల ఓపిక వాని కుండదు. ఏదో పదిమంది పట్టుదలపై చేయునేగాని, ఆ చేయు యజ్ఞము నిరర్థకమనియే వాని విశ్వాసము. కనుక సరియైన ఆలోచన, మంత్ర పఠనాదులు లేకున్నను వానికి పట్టింపు లేదు. తమోగుణమువాడు లోభి గనుక యజ్ఞము చేయించిన ఋత్విక్కులకు దక్షిణ ఎగగొట్టును. పదిమందికి భోజనము పెట్టుట దండుగమారి పనియని, వచ్చిన పెద్దలకైనను భోజనము పెట్టడు. ఇది తమోగుణమువాడు యజ్ఞము చేయు విధానము. (13)

**తపస్సు :**

తపస్సు అనగా ముక్కు మూసికొని కూర్చుండుట, మంత్రమునో బీజాక్షరమునో అక్షర లక్షలుగ సలుపుచుండుట, ఉపవాసాదులు చేయుట మొదలగునవి యని సామాన్య మానవులు పొరబడుచుందురు. నిజమైన తపస్సు అననేమో కృష్ణుడు వివరించుచున్నాడు. శరీరముతో చేయునది, వాక్కుతో చేయునది, మనస్సుతో చేయునది అని తపస్సు మూడు విధములుగా నుండును. 1) దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, వివేకవంతులైన పెద్దలను పూజించుట శారీరక తపస్సులో నొక భాగము. ఇది వినయమును, పాత్రతను ప్రసాదించును. 2) శరీరము చక్కగా యజ్ఞవేదికగా వినియోగపడవలెనన్నచో శుచిగా నుండుట ఆవశ్యకము. (మడి, ఇతరులను తాకకుండుట అను దంభాచారములు శుచిత్వములోనికి రావు. తాకరాని వానిని అవసరమైనచో తాకుటకు జంకరాదు. తరువాత శరీరమును శుభ్రపరచు కొనుటలో అలసత్వము చూపరాదు.) 3) సూటిగా ప్రవర్తించుటయు, శారీరక తపస్సులోని భాగమే. తాను చేసిన పనిని ఎప్పుడైనను ఎక్కడైనను చెప్పగలిగి యుండుట ఋజుత్వము లేక ఆర్జవము (Straight Forwardness) అనబడును. 4) ఏ జీవిని గాని తెలిసి బాధింపకుండుట అహింస యనబడును. 5) బ్రహ్మచర్యమును వ్రతముగా పాటించుట కూడా శారీరక తపస్సులో భాగమే. (వివాహము కానంతవరకు మనస్సు స్త్రీని గూర్చిన ఆలోచన లోనికి స్ఖలితము కాకుండుట, వివాహమైన తరువాత సంతానము కొరకు మాత్రమే

కామము చరించుట, సంతానావశ్యకత లేని సందర్భములలో కేవల స్పర్శా సుఖమునకై కామము చరింపకుండుట బ్రహ్మాచర్య మనబడును. తన శరీరము సృష్టికర్త యగు బ్రహ్మదేవుని అనుగ్రహమని తెలిసి, పవిత్రమైన కార్యక్రమమునకు వేదికగా తన దేహమును వినియోగించుట కూడ శారీరకమైన తపస్సు అనబడును.) (14)

ఇక వాక్కునకు సంబంధించిన తపస్సు వివరింపబడుచున్నది. 1) తా నుచ్చరించు వాక్య మేదియైనను ఎదుటివారికి ఎట్టి యుద్వేగమును కలిగింప కుండ జాగ్రత్త వహింపవలెను. 2) సత్యమును మాత్రమే వ్రతముగా అనుష్ఠించుచు, పలుకవలెను. ఆ సత్యము ఆవలి వ్యక్తికి ప్రియము కలిగించ వలెను. ఆ వాక్కు సత్యము, ప్రియము మాత్రమే కాక, ఎదుటి వ్యక్తికి హితమును చేకూర్చునదియై యుండవలెను. "సత్యమును పలుకవలెను. ప్రియమును పలుకవలెను. అప్రియమగు సత్యమును పలుకరాదు. ఆవలి వ్యక్తికి ప్రియమైన దని అసత్యము పలుకరాదు. ఇది సనాతన ధర్మము'' అని ఋషి వాక్కు. కాని, భగవానుని ఉపదేశము నందు సత్యము, ప్రియము మాత్రమే కాక, ఆవలి వ్యక్తి శ్రేయస్సును కూడ దృష్టిలో నుంచుకొనవలెనని హెచ్చరిక చేయబడినది. సత్యమునే ప్రియముగా పలుకుచు, ఆవలి వ్యక్తి హితము కూడ దృష్టిలో నుంచుకొనుట నిజముగా 'వాఙ్మయ తపస్సు' అను మాటకు సరిపోవును. 3) తాను నేర్చిన విద్యను నిత్యము మరల మరల చదువుకొనుచు, జీవితమునకు సమన్వయింప జూచుకొనుట కూడ వాచిక తపస్సు. (15)

మానసికమైన తపస్సునందు ఈ క్రింది అంశము లుండును. 1) మనస్సును ప్రసన్నముగా నుంచుకొనుట (అనగా ఏ సమయము నందైనను మనస్సున హాయిగా నుండుట). 2) సౌమ్యత్వము. కార్తీక పూర్ణిమనాటి వెన్నెలలో జనులకెంత చల్లగా హాయిగా నుండునో అట్టి అనుభూతిని తన చుట్టునున్న వానిలో తన సాన్నిధ్యము వలన కలిగించగల్గుట సౌమ్యత్వ మనబడును. 3) మానసికమైన మౌనము లేనివానికి తపస్సు సాధ్యము కాదు. మాటలాడకుండ నోటిని కుట్టివేసికొని, మౌనవ్రతమని పేరు పెట్టుకొనువారు మనస్సున మౌనము సాధింపలేక తీవ్రమైన రక్తపు పోటును పెంచుకొందురు. 4) తన మాటలు గాని, చేతలు గాని, భావములు గాని, ఆశయములు గాని తన యదుపులో

నుండుట ఆత్మనిగ్రహ మనబడును. వినిగ్రహ మనగా విశేషముగా నిగ్రహించు కొనుట; అనగా వానిని త్రొక్కిపెట్టుట కాక, 'తన' సన్నిధిచే అవి ప్రభావితములై ఒదిగియుండుట. 5) భావములలోను, ఆలోచనలలోను సంశుద్ధిని నిలబెట్టు కొనుట భావసంశుద్ధి యనబడును. తన మనస్సులో ఏ క్షణముననైన కలిగిన ఆలోచనను గాని, భావమును గాని వందమందిలో నిర్భయముగా చాటగలిగిన వానికి భావసంశుద్ధి యున్నదని అర్థము. ఈ ఐదు అంశములును కలసి మానసికమైన తపస్సుగా కృష్ణుడు నిర్దేశించుచున్నాడు. (16)

ఇట్టిది నిజమైన తపస్సు. ఇట్టి తపస్సును ఏ ఫలమును కోరకుండ చేయువారు సత్త్వగుణ ప్రధానులు. ఇట్టివారి తపస్సు ఉత్తమమైన శ్రద్ధతో నాచరింపబడును. దేనియందో కాక, తనయందే శ్రద్ధ యుండుటను పరమమైన శ్రద్ధ యందురు. ఆచరించు చున్నంత కాలమును తపస్సు అను కర్మ, చేయుట యను క్రియ, చేయుచున్న తనయందు లీనమై యుండుటను యోగము చెందుట యందురు. ఇట్లు ఉత్తమమైన శ్రద్ధతో, ఫలము నాశింపకుండ యోగము చెందినవాడై తపస్సు నాచరించువాడు సత్త్వగుణము కలవాడు.(17)

ఏవో కోరికలను మనస్సులో నుంచుకొని తీవ్రముగా చేయుట రజోగుణ లక్షణము. కోరికలు ఎన్ని రకములుగానైన నుండవచ్చును. ఇంత గొప్ప తపస్సు చేయుచున్నానని పదిమందిలో గొప్పకోసము చేయువారు కొందరు. నాయంతటివాడు ఈ తపస్సు చేయనిచో నెట్లు? అని దురభిమానపడి చేయు వారు కొందరు. ఇంత గొప్ప తపస్సు చేయుచున్న మహానుభావుడని పదిమందిలో గురువుగా చలామణి యగుటకు తపస్సు చేయువారు కొందరు. ఈ తపస్సు వలన గొప్ప గొప్ప మహిమలు, నిధి నిక్షేపములు లభించునని తపస్సు చేయువారు కొందరు. స్వర్గలోకమున రంభాదుల పొందుగోరి తపస్సు చేయు వారు కొందరు, ఇవి యన్నియు రజోగుణ ప్రధానులు చేయు తపస్సులు. వీని వలన దుఃఖమే తప్ప ఆశించిన ఫలితము లభింపదు. (18)

మూర్ఖత్వముతో, తెలివితక్కువగా తపస్సులకు పూనుకొనువారు తమోగుణము వారు, తమ శరీరమును ఉపవాసాది కఠోర నియమములతోను, కత్తులు మున్నగునవి గుచ్చుకొను వీరావేశముతోను క్షోభపెట్టుచు తపస్సు

చేయువారు కొందరు. ఇంద్రియములకు మనస్సునకు కావలసిన ఆహారమును అందనీయక, క్రూరముగా వాని నణచివేసి, అదియే తపస్సుగా వారు భ్రమ పడుదురు. తమను తాము హింసించుకొనుటయే గాక, ఇతరులను హింసించుటకు కూడ తమోగుణము వారు జంకరు. చేతబడి మున్నగు క్షుద్ర దేవతోపాసనములు చేయుచు, ఇతరులకు అపకారమునే నిరంతరము ధ్యానింతురు. సాధకుడు కాగోరినవాడు తమోగుణ పద్ధతిని సంపూర్ణముగా విసర్జింపవలెను. ఫలాకాంక్ష, గొప్పదనము, గురుత్వము మున్నగు భావములు తన కంటకుండ నిరంతరము జాగరూకుడై యుండవలెను. (19)

**దానము :**

దానము చేయుట మంచి లక్షణమే. కాని, ఆ దానము వెనుకనున్న సంకల్పము, చేయు విధానములనుబట్టి దానిలోకూడ మంచి చెడ్డ లుండును. చేసెడి దానము దేనికొరకో గాక, "ఇది దానము చేయవలెను కనుక చేయు చున్నాను'' అని దానము చేయుట సత్త్వగుణము వాని లక్షణము. (తన కేదో ఉపకారము చేసినవానికి దానము చేయుట వ్యాపార పద్ధతియే తప్ప దానము కాదు.) తన కేవిధమైన ఉపకారము చేయనివానికి చేసిన దానమే ఉత్తమమైనది. సమయము, సందర్భము నెరిగి అర్హుడైన వానికి దానము చేయుట సత్త్వగుణ పద్ధతి. ఆకలిగొని యున్నవానికి ఆహారమును పెట్టుట అర్హునికి పెట్టుట యగును. ఒక ధనవంతునకు భోజనము పెట్టుట అపాత్రదానము. తాను పెట్టిన యాహారమును తృప్తిగా తినుట, ఇంకను పెట్టలేదని ఏడవకుండుట పాత్రతకు లక్షణము. అట్టివానికైనను, సరియైన సందర్భమును చూచి, అతడు పదిమందిలో అభిమాన పడకుండునట్లుగా దానము చేయవలెను. అట్లే ధనాదులు దానము చేసినను, తనకు ఏ మొగ మాటమూ లేనివానికి ప్రతిఫలాపేక్ష లేకుండ దానము చేయుటను సత్త్వగుణమునకు చెందిన దానమందురు. (20)

తనకేదైన మహోపకారము చేసినవానికి ప్రతిఫలముగా తానేదైన దానము చేసినచో అట్టిదానము రజోగుణ ప్రధానమైనది. అట్లే ఎవని నుండియైనను ఒక ప్రతిఫల మాశించి దానము చేయుటకూడ రజోగుణము వాని లక్షణమే.

అనగా రజోగుణము వాడు చేయునది వ్యాపారమేగాని, దానము కాదు. అతడు లంచము నిచ్చుచు, దానినే దాన మనుకొనుచున్నాడు. దానివలన లౌకికముగా వానికి ఉపయోగ ముండవచ్చును గాని, అది దానమను సత్కర్మ మాత్రము కాదు. **(21)**

ఇక తమోగుణము వాని దానము మరింత వికృతముగా నుండును. దానమును ఒక వృత్తిగా స్వీకరించువానికి దానము చేయుట తమోగుణము వాని లక్షణము. వృత్తిగా గలవాడు ఎట్లునూ ఆవశ్యకత లేకుండగనే దానము స్వీకరించును కనుక అందు సమయము, సందర్భము ఉండవు. పితరులకు శ్రాద్ధమును పెట్టదలచిన తమోగుణ ప్రధానుడు బ్రాహ్మణార్థములను వృత్తిగా స్వీకరించిన యొక బ్రాహ్మణ బ్రువుని ఏర్పాటు చేసికొనును. ఆ బాపని ముఖము జిడ్డోడుచు, పొగచూరి, ప్రేతకళ యుట్టిపడుచుండును. వాడెట్లును కడుపునిండ అల్పాహారము చేసియే యుండును. కనుక ఆకలి గొన్నవాడు కాడు. అపరాహ్ణము సమయమున ఆబ్దికము పెట్టవలసియుండగా ఆఫీసుకు పోవు హడావిడిలో తొమ్మిది గంటలకే తమోగుణమువాడు మొక్కుబడి తీర్చు కొనును. చివరకు దక్షిణ విషయమున పేచీపడి, ఆ బాపని దూషించును. ఇది తమోగుణము వాని దాన పద్ధతి. అతడు ఎంగిలి అన్నమును, పాచిపోయిన అన్నమునుగూడ దానము చేయుటకు జంకడు. ఇట్టి దానమువలన అతడు ఆశించిన పుణ్యము రాకపోగా అతనితోపాటు వాని పితరులు కూడ అధోగతి పాలగుదురు.

చేయు దానము శ్రద్ధతో చేయుమని, అశ్రద్ధతో చేయవలదని తనకుగల సంపద ననుసరించి లోభింపక చేయుమని, ఇంతే దాన మీయగలిగితినని లజ్జతో చేయుమని, చేయునది చక్కగా బుద్ధిపూర్వకముగా యిష్టపూర్వకముగా చేయుమని ఉపనిషద్వాణి యాదేశించును. ఆ యాదేశమునే మరింత స్పష్టముగా భగవానుడు వివరించుచున్నాడు. ఇచ్చుచున్న తానును, స్వీకరించు చున్న వాడును, ఈయబడుట యను ప్రక్రియయు కలసి ఒకే భగవత్స్వ రూపముగా అనుభవించువాడు నిజమైన దాత. వానికి తానిచ్చు పదార్థపు విలువ గుర్తుండదు. దీని నాతడు సమర్పణ మనియే భావించునుగాని, దానమని భావింపడు. ఇట్లు ఎవ్వనికి సమర్పించినదైనను, పత్రమైనను,

పుష్పమైనను, ఫలమైనను, తోయమైనను తనకు ప్రీతిపాత్రములని కృష్ణుడు వివరించెను. (22)

## ఓం-తత్-సత్ :

అర్జునా! యజ్ఞ దాన తపస్సులను గూర్చియు, మూడు గుణముల స్వభావములు గలవారు వానియందు ప్రవర్తించు విధమును గూర్చియు నీకు వివరించితిని. యజ్ఞాది సత్కర్మలను ఆచరించు విధానమును శాస్త్రీయముగా వివరింతును- వినుము. సత్కర్మలు బ్రహ్మము నుద్దేశించి యాచరింపవలెను. బ్రహ్మము మూడు విధములుగా తెలియబడును. 1) మొదలు, చివర లేనివాడు, సర్వమునందు అంతర్యామిగా నున్నవాడు, పేరు, రూపము, గుణ గణాదులు మొదలైన నిర్దేశముల కతీతుడును అగు పరబ్రహ్మము. వానిని 'ఓం' అను సంకేతముచే పెద్దలు నిర్దేశింతురు. 2) విష్ణువు, శివుడు, రాజరాజేశ్వరి మొదలగు పేర్లతో, ప్రత్యేకమైన లక్షణములతో, మన మనస్సునకు అందుబాటులో నున్న తెలియదగిన దేవుడు. వానిని 'తత్' అను సంకేతముచే పెద్దలు నిర్దేశింతురు. 3) భగవంతుడు సృష్టిలో అనేక ప్రకృతి ధర్మముల రూపమున అనేక దేవతలచే జగద్యజ్ఞమును నిర్వహింప జేయుచుండును. అనగా సూర్యాత్మకమగు సంవత్సర యజ్ఞము, సూర్యచంద్రాత్మకమగు షోడశకళా యజ్ఞము, పర్జన్యాత్మక మగు పునరుజ్జీవన యజ్ఞము మొదలగు అనంతముఖములైన యజ్ఞములు సృష్టిలో నడచుచున్నవి. వానిని 'సత్' అను సంకేతముతో పెద్దలు నిర్దేశింతురు.

ఈ మూడు అంశములకును ప్రతినిధులుగా వ్యక్త సృష్టిలో మూడు అంశములున్నవి. 1) బ్రహ్మము నందు తమను తాము అనుసంధానము చేసికొనియున్న బ్రాహ్మణులు బ్రహ్మమునకు వ్యక్తరూపములు. వారిని కూడ 'ఓం' అను సంకేతముతో నిర్దేశించుట పెద్దల విధానము. 2) మన బుద్ధుల కందుబాటులో నుండు దేవుడు సకల కళ్యాణ గుణ స్వరూపుడు. ఆ కళ్యాణ గుణములను సవిశేషముగా కీర్తించునవి వేదములు. ప్రపంచములోని ఏ జాతి వారి పవిత్ర గ్రంథమైనను వేదము అను పేరుచే నిర్దేశింపబడును. ఆయా జాతులవారు వారికి తోచిన రీతిలో సృష్టిలోని కళ్యాణ గుణములను, వాని కనుగుణముగా భగవంతుని స్వరూపమును నిర్దేశించు కొందురు. ఇన్ని పవిత్ర గ్రంథములును కలిసి వేదము లనబడును. వానిని 'తత్' అను సంకేతముచే

పెద్దలు నిర్దేశింతురు. 3) జగద్యజ్ఞములోని వేర్వేరు భాగములను వేర్వేరు యజ్ఞములుగా వేదము వర్ణించును. ఆయా ధర్మముల కనుగుణముగా మానవు డాచరింపదగిన వేర్వేరు క్రతువులను కూడ ఋషులు నిర్మించి యిచ్చిరి. జ్యోతిష్టోమము, వాజపేయము, అశ్వమేధము మొదలగునవి సృష్టిలోని యజ్ఞభాగములకు సంపుటీకరణము (Epitome) గా ఋషులు ప్రసాదించిరి. దీనిని 'సత్' అను సంకేతముచే పెద్దలు నిర్దేశింతురు.

ఈ మూడు సంకేత శబ్దములును వేర్వేరు స్థాయిలలో వేర్వేరు ప్రయోజనములకై వినియోగింపవలెనని శాస్త్రము సూచించును. యజ్ఞ, దాన, తపస్సుల నాచరించునపుడు సంకల్పము ననుసరించి యీ మూడు శబ్దములలో నొక దానిని ప్రయోగింపవలసి యుండును. **(23)**

నిరంతరము బ్రహ్మయందు చరించు యోగీశ్వరులు శాస్త్రమునందు చెప్పబడిన విధానమున యజ్ఞాది సత్కర్మల నాచరించునపుడు సంకల్పముతో బాటు 'ఓం' అను శబ్దము నుచ్చరింతురు. వారు బ్రహ్మవాదులు, అనగా బ్రహ్మమును గూర్చి పలుకువారు. బ్రహ్మమను మాటనే పలుకుచుందురని గాని, వేదాంతమును మాత్రమే మాటలాడుదురని గాని యర్థము కాదు. దేనిని గూర్చి మాటలాడినను దానియం దంతర్యామిగా నున్న బ్రహ్మమును గూర్చియే వారుద్దేశింతురు. అట్టివారు ఓంకారముతో సంకల్పము చెప్పి సత్కర్మల నాచరించునపుడు ఆ యజ్ఞాదులు జగద్యజ్ఞము నందు భాగమై వర్తించును. నిరంతరము బ్రహ్మమునందు చరించు యోగీశ్వరులు కూడ యజ్ఞ దాన తపఃక్రియాదులు మానక చేయుచునే యుందురని 'సతతః' అను పదముచే కృష్ణుడు సూచించుచున్నాడు. **(24)**

ఇంకను యోగసిద్ధిని పొందక, సాధన మార్గమున నున్న సాధకులు 'ఓం' అను శబ్దముచే తెలియదగిన అవ్యక్త ప్రజ్ఞను అందుకొనలేరు. వారి సాధన కొక ఆలంబనము కావలెను. నిర్దిష్ట లక్షణములతో, నామరూపాదులతో కూడిన శివుడు, విష్ణువు వంటి దేవతలను వా రారాధింతురు. తాము చేయు యజ్ఞాది సత్కర్మలకు ఫలితము లుండునని వారెరుగుదురు. కాని ఆ ఫలమును తా మాశింపక, తా మారాధించు 'ఆ' దేవునికే సమర్పణ చేయుదురు.

అనగా కర్మ- ఫలముల చక్రబంధము నుండి మోక్షమును కోరుచు, ఆయా సత్కర్మల నాచరింతురు. అట్టి వారు 'తత్' అను పదముచే వేదములను, వానియందు నిర్దేశింపబడు సగుణమైన దైవమును నిర్దేశించి యజ్ఞాదుల నాచరింతురు. ఆయా సాధకుల స్థాయిని, వారికిగల సాధన సంపత్తిని, సందర్భమును అనుసరించి, అవి ఎన్నియైననూ యుండవచ్చును. అవి యన్నియు 'తత్' అను శబ్దముచే సంకల్పము చేయబడి, సాధకునకు అంచెలంచెలుగా మోక్షమును ప్రసాదించును. (25)

ఇవికాక లోకముననుు, సంసారముననుు వర్తించువారికి కొన్ని సత్కర్మలు ఆచరణీయము లగుచుండును. మంచిపని చేయునపుడు అది పది కాలముల పాటు ఉండవలెనని భావించుట, దానికి సంబంధించిన వ్యక్తులకు మంచి జరుగవలెనని సంకల్పించుట ఉత్తములగు లౌకికుల పద్ధతి. అట్టివారు 'సత్' అను శబ్దముచే తామాశించిన మంచిని నిర్దేశించి సంకల్పింతురు. నామ కరణము, పుంసవనము, వివాహము మున్నగు శుభకార్యములలో 'సత్' అను శబ్దముతో సంకల్పము చెప్పుట శాస్త్రీయము. జగద్యజ్ఞములో ఒక వ్యక్తి జీవిత మొక భాగము. ఆ జీవితము మొత్తమొక చిన్న యజ్ఞము కాగా, వేర్వేరు వయస్సులలో నాచరింపబడు వివాహాది శుభకార్యములన్నియు అందలి భాగములే యగును. ఈ శుభకార్యములను వేడుకగా జరుపుట సామాన్య మానవుల పద్ధతి. కాని నిజముగా నవియన్నియు క్రతు విధానములే. వివాహమును సంసార సౌఖ్యమునకు ముందరి అనుమతిగాను, ఉపనయనమును దానికి ముందు చేయవలసిన తప్పనిసరి తద్దినముగాను భావించువారు ఆయా క్రతువుల యందు ఉద్భవించు ప్రజ్ఞా శక్తులను గమనింప లేరు. అట్లేగాక ఆయా వేడుకలను క్రతువులుగా నిర్వహింపగల వేదవిదులు- 'సత్' అను శబ్దముతో సంకల్పము చెప్పుచుందురు. (26)

అట్లే పదిమందికి పనికివచ్చు దేవాలయ తటాకాదులు, ధర్మసత్రము, విద్యాలయము మున్నగువాని నిర్మాణములలో అవి పదిమందికి వినియోగ పడవలె ననియు, వానివలన పదిమందియు క్షేమముగా నుండవలె ననియు సంకల్పింతురు. అట్టి నిర్మాణ ప్రతిష్ఠాపనాదులలో 'సత్' శబ్దమును అనుసంధించుట శాస్త్ర సమ్మతము. అట్టి నిర్మాణములు స్థిరముగా నుండవలె

ననుట ప్రధాన సంకల్పము గనుక 'సత్' అను శబ్దము ప్రయోగింపబడును. అట్లే పదిమంది చేరి చండీ యాగము, అతి రుద్రయాగము మున్నగు క్రతువులు సమాజ శ్రేయస్సునకై నిర్వహించుట చూచుచుందుము. అట్టివి లోక కళ్యాణమునే యుద్దేశించును. అట్టి యజ్ఞములు నిరంతరముగా జరుగుచునే యుండ వలెనని కూడ నిర్వాహకులు సంకల్పింతురు. అట్టి సందర్భములలో కూడ 'సత్' శబ్దమును నిర్దేశించుట శాస్త్రీయ సంప్రదాయము. (27)

పై జెప్పిన విధానము లన్నిటిలోను, అనగా సామాన్య జనులు, సాధకులు, యోగీశ్వరులు- ఎవ్వరైనను, శ్రద్ధలేక ఆచరించినచో అది 'అసత్' అనబడును. అనగా అది మంచి బుద్ధినిగాక, దుర్బుద్ధిని పుట్టించును. ఆ చేసిన పనియు పదిమంది కుపయోగపడక దుర్వినియోగ మగును. మరియు యజ్ఞాది క్రతువులు ధన సంపాదనకు గాని, అది చేతగానిచో ధన వ్యయమునకుగాని కారణ మగును. దాన ధర్మాదులు పేరు ప్రతిష్ఠలకు, వ్యాపారమునకు పనికి వచ్చును; చేతకానిచో తాను బికారి యగును. సాధకునిలో శ్రద్ధ, శాస్త్ర విధానము లోపించినచో కొన్ని మెట్లు దిగజారి, మరల నెక్కవలసిన స్థితిని కల్పించుకొనును. యోగీశ్వరునిలో శ్రద్ధ, విధానము లోపించినచో అంతర్యామి యగు బ్రహ్మ ప్రజ్ఞనుండి చ్యుతుడై, మరల సాధన చేయవలసి యుండును. (28)

పదునెనిమిదవ అధ్యాయము

# మోక్ష సన్న్యాస యోగము

అర్జును డిట్లనెను : "కృష్ణా! నీ వింతకు ముందు సన్న్యాసము, త్యాగము అను రెండు విధానము లుపదేశించితివి. ఈ రెండింటి స్వభావమును నాకు స్పష్టముగా గోచరింపలేదు. కనుక రెండింటిని వేర్వేరుగా నిర్వచించి యుపదేశింపుము." (1)

కృష్ణు డిట్లు వివరించెను : "కోరికలను పుట్టించు సర్వకర్మలను వదలివేయుట సన్న్యాసమని జ్ఞానులు చెప్పుదురు. అనగా ధనమును స్పృశించినచో అది తనలో కోరికలను పుట్టించును గనుక, ధనమును తాకరాదు. తన యాశ్రమమున స్త్రీలను చేరనిచ్చినచో తనలో కోరికలు పుట్టవచ్చును గనుక స్త్రీలను చేరనీయరాదు. కామ్య యజ్ఞము చేసినచో స్వర్గము ప్రాప్తించును. అక్కడ సుఖమునందు తాను మునిగిపోవును కనుక కామ్యములగు యజ్ఞములను ఆచరింపరాదు. ఇదియొక పద్ధతి. దీనిని సన్న్యాసమని కవులందురు.

ఏ కర్మకైనను ఫలితముండి తీరును. కొన్ని ఫలితములు ప్రత్యక్షములు కాగా, మరికొన్ని పరోక్ష ఫలితములు. సదాచారము వలన ఆయువు, విద్య, యశస్సు వర్ధిల్లును. ఈ పరోక్ష ఫలితములకు ఫలితాంశముగా ధనముకూడ వర్ధిల్లునుగాని, అదికూడ పరోక్షమే. కృషి, గోరక్ష, వాణిజ్యము మున్నగు కర్మల వలన కలుగునవి ప్రత్యక్ష ఫలములు. ఈ రెండు విధముల కర్మలను కామ్య కర్మలుగా చేసినచో, తాను కోరిన ఫలములే కలుగునని నిశ్చయమేమియును లేదు. తాను కోరిన ఫలములు కలుగనపుడు అవి దుఃఖమునే కలిగించును. కనుక వానిని వదలివేయవలె ననియు, అదియే సన్న్యాస మనియు కొందరు పెద్దలందురు.

చేయుచున్న కర్మలను చేయుచునే దానివలన లభించు ఫలములను

వదలివేయుట త్యాగమని విచక్షణగలవారు చెప్పుదురు. వ్యాపారము చేసినను, దానివలన లభించు ధనమును తాను స్వీకరింపక పనివాండ్రకు కొంత, దేవాలయ, తటాక, విద్యాలయాదుల నిర్మాణమునకు కొంత, దానము చేయుటను త్యాగమందురు. అట్లే చండీయాగము మున్నగు క్రతువులు నాచరించుచునే, దాని వలన కలుగు పుణ్యఫలమును లోక కళ్యాణమునకై ధారపోయుటను త్యాగమందురు. (2)

ఎట్టి సత్కర్మలైనను, యజ్ఞ యాగాదులైనను ఒక ఫలితము నీయక మానవు. ఫలితము నిచ్చునవి గనుక అవి సహజముగనే దోషయుక్తము లని కొందరి మతము. అంతేకాక, ఏ కర్మ యందైనను కొంత దోష ముండియే తీరును. వ్యాపారము చేయుచున్నపుడు చిన్న అసత్యమైనను పలుకక వ్యాపారము సాగదు. యజ్ఞము నాచరించునపుడు తాను పొరబాటు చేయక పోయినను, మరియొకరైన పొరబాటు చేయుట సంభవము. అట్లే దానము చేసినచో, ఆ దానము పట్టినవాడు పాత్రుడు కాకపోయినచో అది దోషయుక్త మగునుగదా! దోషయుక్తము లగుట కవకాశమున్నది గనుక కర్మ లన్నిటిని త్యజింపవలెనని కొందరందురు. ఇది నిజమే అయి యుండవచ్చునుగాని, యజ్ఞము, దానము, తపస్సు అనువానిని మాత్రము త్యాగము చేయరాదని మరికొంద రందురు. అనగా యజ్ఞము నాచరించినపుడు స్వల్ప దోష మున్నను గుణముకూడ నుండును గదా! దాని సత్ఫలము పదిమందికి వినియోగపడును గదా! అట్లే దేవాలయాది నిర్మాణములకు దానము చేసినచో కొద్దిభాగము దుర్వినియోగ మైనను, కొంత భాగమైన సద్వినియోగ మగును గదా! అట్లే తపస్సు చేయు నపుడు తనకు పరిణతి లేకుండుటవలన నియమములను పాటించుటలో స్ఖాలిత్యము లుండవచ్చును. కాని చేసిన తపస్సు తనను కొంతవరకైన పరిశుద్ధము చేయును. మానివేసినచో అసలేమియు సాధన యుండదు గదా! కనుక యజ్ఞము, దానము తపస్సు అను వానిని మాత్రము విడువరాదని మరికొందరి యభిప్రాయము. (3)

## త్యాగ స్వరూపము :

ఇన్ని యభిప్రాయము లుండగా త్యాగము విషయమై నా నిర్ణయమును

చెప్పుచున్నాను వినుము. త్యాగము మూడు విధములుగా నుండునని పెద్దలు చెప్పుదురు. ఏ సంకల్పముతో చేసినను యజ్ఞము, దానము, తపస్సు అనునవి పవిత్రమైనవి. ఆచరించు చున్నవారి నవి వారి వారి స్థాయిల ననుసరించి పరిశుద్ధులను చేయుచునే యుండును. నిజమున కివి సంస్కార కర్మలు. మానవుని పరిశుద్ధుని చేసి జ్ఞాన స్థితిలోనికి కొనిపోవుటకు గాని, జ్ఞాన స్థితిలో నున్నవానిని అందే నిలుపుటకు గాని, ఈ సత్కర్మల యాచరణమే ఆధారము. ఆచరించు చున్నంత కాలమును జ్ఞానము నిలబడి యుండును. ఆచరించుట మానినపుడు దిగజారుట జరుగును. ఈ కారణము వలన అవి శాశ్వత ఫలప్రద ములు కావుగదా, ఇక వాని నాచరించుట యేల యనరాదు. జ్ఞానము వలన ఫలము కలుగుననుకొనుట పొరబాటు. జ్ఞానమునకు జ్ఞాన స్థితియే ఫలము. ఫలితములను, పరిణామములను దృష్టిలో నుంచుకొని సత్కర్మలు చేయుట జ్ఞానుల పద్ధతి కాదు.

సత్కర్మలకైనను ఫలితము లుండితీరును. ముందు వివరించినట్లు యజ్ఞాదులకు పరోక్ష ఫలములే యుండును. తాను అను జ్ఞానస్థితిలో నుండుట యోగికి కోరదగినది. దానిని సాధించుట కివి యావశ్యకములు గనుక యోగీశ్వరులకు కూడ నివి కామ్యకర్మలే యగును. సత్త్వగుణమువాడు ఆచరించు యజ్ఞాది సత్కర్మల వలన నతడు శుద్ధ సత్త్వము లోనికి ప్రవేశించు నర్హత సాధించుకొనును. రజోగుణమువాడు యజ్ఞాది సత్కర్మ లాచరించు చుండగా, అవి సహజముగా సత్కర్మలు గనుక, అతని యందలి దంభము మొదలగు లక్షణములు క్రమముగా మాయమై, సత్కర్మాచరణము మిగులును. అట్లే తమోగుణమువాడు శుచి శుభ్రతలు లేక, అశ్రద్ధతో యజ్ఞాదు లాచరించినను ఆ సత్కర్మాచరణమే ఔషధమువలె పనిచేసి, క్రమముగా శుచిత్వము మున్నగునవి యలవడుట సాధ్యమగును. క్రమముగా నాతని స్వభావము తమస్సు నుండి రజోగుణములోనికి, అటునుండి సత్త్వగుణములోనికి పరిణ మించును. ఈ సంస్కారము శరీరమునకు గాని, వ్యక్తికిగాని కాక, లోనున్న 'తాను' అను కారణ స్వరూపునకు (Causal Self) జరుగును గనుక, ఈ లభించిన ఫలిత మంతరించిపోవుట యుండక, జన్మాంతరములలోనికి

కొనిపోబడుచుండును. ఫలితముగా కొన్నివేల జన్మలలో ఆ జీవుని పరిణామము జరుగుచుండును. **(4, 5)**

కనుక నీ యజ్ఞ, దాన, తపఃకర్మలను చేసితీరవలసిన కర్మలుగా నంగీకరింపవలెను. అంగీకరించిన పిమ్మట వాని వలన కలుగు ఫలితముపై ఆసక్తిని వదలివేయవలెను. ఆసక్తి యనగా అంటుకొని యుండుట. అది రెండు విధములుగా నుండవచ్చును. ఆయా కర్మల ఫలములను కావలెనని కోరుచు మనసులో నంటించుకొనుట యొక పద్ధతి. ఈ ఆసక్తి - రాగము, కామము అనువానిచే ప్రభావితమై రాజసికమైన కామ మనబడును. ఆ ఫలితములను వద్దనుకొనుట, అవి కలుగునేమో యని భయపడుటలో కూడ మనస్సు వానియందే అంటుకొని యుండును. కనుక నిది వ్యతిరేకమైన బంధము (Negative Attachment) అని పెద్ద లందురు. ఇది సాధకుని తమోగుణమున పడద్రోయును. ఇది ఊబి వంటిది. తెలియక ఈ అభిప్రాయములో ప్రవేశించినవాడు ఆయా కర్మలు - ఫలములను గూర్చి ఆలోచించుచు పెనగులాడుచు మరింత లోపలికి దిగిపోవుచుండును. కనుక ఈ విధమైన ఆసక్తి మరింత ప్రమాదకరము. సాత్త్విక భక్తికన్న వైరభక్తి బలీయమైనట్లే - కావలెననుకొను ఆసక్తికన్న, వద్దనుకొను నాసక్తి బలవత్తరమై సాధకుని జ్ఞాన స్థితినుండి లాగివేయును. చేసి తీరవలసిన ఈ సత్కర్మాచరణమును గూర్చి యిట్లు భయపడుట, వానిని వదలివేయు బుద్ధి కలుగుట, తమోగుణము వలన కలుగుచున్నది. సాధకుడు రెండు మెట్లు దిగిపోవుదునని భయపడి, తన భయమే కారణముగా అట్టడుగునకు దిగజారిపోవుచున్నాడు. **(6, 7)**

యజ్ఞము, దానము, తపస్సు అనువాని నాచరించుటలో శరీర కష్టముండును. దానికి జంకి ఈ సత్కర్మలను విసర్జించుట రజోగుణ స్వభావము. త్యాగమను మాట వానికి నచ్చునిది. కాని త్యాగము తప్పనిసరియైనచో నాతడు, "ఈ గోల మనకేల" యని సత్కర్మలనే త్యాగము చేయును. అంతేకాక అట్టివానికి దానమునందు ధనము పోవుచున్నదను దుఃఖ ముండును. యజ్ఞమునందు దక్షిణల నిచ్చుటయందును ధనవ్యయ భయముండును. నియమములను సరిగా పాటింపలేకపోయినచో దుఃఖపడవలసి యుండును. కనుక ఈ దుఃఖము, శరీర క్లేశము ఏల యని సత్కర్మలను త్యాగము చేయుట రజో

గుణము వాని పద్ధతి. అది త్యాగము కాకపోగా వాని కిష్టమైన కోరికలను కూడ దూరము చేసికొని మరింత దుఃఖపడుచుండును. (8)

'ఇది మనము చేసితీరవలసిన పని' యని మనస్సున నిశ్చయించుకొనుట, దానివలన కలుగు ఫలితములపై ఎట్టి దృష్టియు లేకుండుట సత్త్వగుణము వాని పద్ధతి. అట్టి సంకల్పముతో యజ్ఞాదుల నాచరింపవలెను. చేసిన కర్మ గనుక దానికి ఫలిత ముండి తీరును. అది ప్రత్యక్ష ఫలితముగాని, పరోక్ష ఫలితముగాని కావచ్చును. ఆ ఫలితమును తాను స్వీకరింపకుండుట నిజమైన త్యాగము. సత్కర్మయని నిష్కామముగా ఒక యజ్ఞము నాచరించిన వానికి భక్తులు సమర్పించు ధనము లభింపవచ్చును. ఇది ప్రత్యక్ష ఫలితము. దానిని తాను స్వీకరింపక మరల అట్టి యజ్ఞమే మరియొక చోట నిర్వహించుటకై పెద్దలకు అప్పగించుట ఫలత్యాగ మగును. అట్లే ఆ యజ్ఞ నిర్వాహకునకు సమాజములో పూజ్యస్థాన మేర్పడును. తనకీయబడిన పూజ్యత, ఇచ్చినవారి మంచితనమునకు నిదర్శనమేగాని, తాను ఆనందింపవలసినది కాదని తెలిసి నిర్లిప్తుడై యుండుట, అట్లని పదిమంది తనకు నమస్కరించుచున్నచో, తిరస్కరింపకుండ వినయముతో స్వీకరించుట అభ్యాసము చేయవలెను. ఇదియే నిజమైన త్యాగ మనబడును. ఇట్లే దానము, తపస్సు అను వానిని గూర్చి కూడ గ్రహింపవలెను. ఇట్లు నిజమైన త్యాగబుద్ధితో సత్కర్మ లాచరించు వారు సత్త్వగుణమువారు. (9)

ఇట్లు సత్త్వగుణముతో నిండిన స్వభావము కలవారికి సత్కర్మాచరణము నందు తనకు సదుపాయముగా నుండుట, లేకుండుట యను ఆలోచన రాదు. కొన్ని యజ్ఞములలోని విధానము సులువుగా నుండగా, కొన్నిటి విధానము క్లిష్టముగా నుండును. తనకు అలవాటైన వానియందలి తన అనుభవమును, కర్మల యందలి సదుపాయమును గమనించి వానియం దిష్టపడుట సత్త్వ గుణము గలవాని కుండదు. అట్లే తనకు అలవాటు లేకపోవుట, కార్యక్రమము నందలి క్లిష్టత కారణముగా ఆచరణయందు అయిష్టపడుట కూడ అట్టివాని కుండదు. సంశయములతో ప్రారంభించిన వారికి అన్నియు అడ్డంకులుగానే కనిపించును; వాని మేధ కూడ సరిగా పనిచేయదు. సత్త్వగుణము గలవాడు ముందుగా తాను చేయవలసిన పని యిది యని నిశ్చయించుకొనును.

ఫలితములను త్యాగము చేసినవాడు గనుక కార్యక్రమముపైననే వాని బుద్ధి ప్రసరించును. మొత్తము కార్యక్రమము నవగాహన చేసికొని, చక్కగా ప్రణాళిక సిద్ధము చేసికొని, కార్యనిర్వహణమునకు పూనుకొనును. అన్నియు ముందుగా యోచించుకొన్నవే గనుక అతడికి సంశయము లన్నియు సూర్యకిరణములకు మంచు తెరవలె కరగిపోవును. నడుమ ఏవైన అడ్డంకులు వచ్చినను, తెలివి తేటలు చక్కగా పనిచేయుటచే నతడు పరిష్కారము కనుగొని ముందుకు సాగిపోవును. అది తన కర్తవ్యమని మాత్రమే వానికి గుర్తుండును గనుక సత్కర్మ సాగిపోవును. వంట చేసికొనుట కష్టమని ఎవ్వడైన భోజనము మానుచున్నాడా? (10)

ఏదైన కర్మచేయుట, చేయకపోవుట యనునది తాను శరీరము నందున్ననే గదా! శరీరమును ధరించియున్నంత కాలమును ఏవో కొన్ని పనులనైన చేయక శరీరధారణము జరుగదు. ఎంతటి సన్న్యాసియైనను తాను వంట చేయకపోయినను భోజనమైన చేయవలెను గదా! తన శరీరమున కావశ్యకమగు స్నానమునకు జలములు మరియొకరు సమకూర్చిపెట్టవలె నను వాడు సన్న్యాసి కాజాలడు. అట్లే వస్త్రములు, భోజనాదికములు, నివాసము మొదలైన వాని నితరులు సమకూర్చి పెట్టవలెనని సన్న్యాసి యాశింపరాదు. వానిని తానే సమకూర్చుకొనవలసి యుండును. ఇతరు లెవరైనను తన కివి యన్నియు సమకూర్చి పెట్టినచో, వాని సేవకు ప్రతిఫలముగా తాను వారికేదైన సేవ చేయవలసి యుండును. కనుక కర్మలను పూర్తిగా సన్న్యసించుట శరీరధారులకు సాధ్యముకాని పని. కనుక కర్మ చేసియే తీరవలసి యున్నపుడు యజ్ఞాది సత్కర్మలనే ఆచరించుట మేలు కదా! దానివలన తాను సత్కర్మ నాచరించిన వాడగును; తన శరీర పోషణము కూడ అప్రయత్నముగా జరిగి పోవును. అట్టిచో సత్కర్మలనే యాచరించుచు, ఫలితములను గూర్చి తలంప కుండుట, అవి లభించినపుడు వానిని తాను మానసికముగా స్వీకరింపకుండుట శ్రేష్ఠమైన పద్ధతి. ఇదియే నిజమైన త్యాగమని కృష్ణుని నిశ్చయము. (11)

మరి చేసినది కర్మ యైనపుడు ఫలితము తప్పక సంభవించును కదా! దాని నెట్లు స్వీకరింపవలెను? మనము చేసిన కర్మలకు ఫలిత మెటువంటిదైన కావచ్చును. అది మన కిష్టమైనది కావచ్చును, కొన్ని సందర్భములలో మన

కిష్టము లేనిది కావచ్చును. ఒక్కొక్కమారు మనకు నచ్చి- నచ్చని ఫలితము రావచ్చును. ఇష్టము - అయిష్టము అనునవి ఫలితములు కోరిన వారికేగాని కోరని వారికి కావు. ఫలితమును గూర్చి యోచనయే లేనివానికి, వచ్చిన ఫలితము దానంతట నది వచ్చినదే గాని ఇష్టానిష్టములని ప్రత్యేకముగా నుండదు. కనుక కర్మఫలములను సంకల్పమున త్యాగము చేసినవానికి ఇష్టా నిష్టముల భేద ముండదు. ఈ త్యాగము చేసినవానినే కృష్ణుడు 'సన్న్యాసి' యని పేర్కొనెను. (12)

## కర్మ సిద్ధి - కర్తృత్వ బుద్ధి :

కర్మ, దాని సిద్ధి యనునవి సృష్టిలో తప్పవు. అవి లేనిదే సృష్టియే లేదు. నీవే లేవు. కనుక కర్మ - సిద్ధులను గూర్చి చక్కగా తెలిసికొను ప్రయత్నము సాంఖ్యులనబడు ఋషి గణముచే చేయబడినది. ఏదైన నొక యంశమును కూలంకషముగా విచక్షణ (Analysis) చేసి పరిశీలించుటను సాంఖ్య మందురు. ఆ శాస్త్రకారులగు ఋషులు కర్మసిద్ధికి ఐదు కారణములను వివరించిరి. 1) కర్మ జరుగుటకు తగిన వేదిక తన శరీరము. అది అధిష్ఠాన మనబడును. 2) చేయుచున్న తాను రెండవ కారణము. అంతకు ముందు తాను తానుగా వేరుగా నుండగా, తాను చేయుచున్నానను భావముతో కూడిన తాను కర్త యనబడును. 3) మూడవ కారణము కరణము లేక ఉపకరణము. అనగా తన కాళ్ళు, చేతులు మొదలగు కర్మేంద్రియములు; చూచుట, వినుట మొదలగు జ్ఞానేంద్రియములు; గ్రహించెడు మనస్సు వివేచన చేసి కార్యాకార్య నిర్ణయము చేయు తెలివి, బుద్ధి, తనలో గల ఉత్సాహాది సమస్త శక్తులు కలసి కరణము (Instrument) అనబడును. 4) కార్య నిర్వహణమునందు తాను నిర్వహించు పని యంతయు కలసి నాలుగవ కారణ మగును. 5) ఇవి యన్నియు కలసి పనిచేసినను, ఐదవది యగు కారణము కలసిరానిదే కార్యసిద్ధి కలుగదు. సన్నివేశము తరువాత సన్నివేశము జరుగుచుండగా దానిని మనము కాలము అందుము. కాల గమనమున కొక లయ, శ్రుతి యున్నవి. దాని కొక క్రమబద్ధమైన ప్రణాళిక యున్నది. అది నిర్దిష్టము, నిర్దుష్టము (Specific and Perfect). ఆ ప్రణాళికలో మన కర్మ యొక భాగమైనచో అది సిద్ధి

పొందును. లేనిచో విఫల మగును. ఈ కాల ప్రవాహ రూపమగు జగత్ప్రణాళిక మన యధీనమున నుండునది కాదు గనుక అది మనకు అవ్యక్తము. దానిని దైవము అను ఐదవ కారణముగా సాంఖ్యులు వివరించిరి.

ఉదాహరణకు ఒక పొలము పండించవలె నన్నచో నేమి కావలెను? 1) మొదటగా నొక క్షేత్రము కావలెను. అది సారవంతమై యుండవలెను. దీనిని అధిష్ఠానము లేక వేదిక యందురు. 2) కృషికర్మ నిర్వహించు కృషీవలుడు రెండవ కారణము. 3) సాగుబడికి కావలసిన నాగలి, ఎడ్లు లేదా ట్రాక్టరు వంటి యంత్రములు మొదలగు ఉపకరణములు మూడవ కారణము. రైతు యొక్క తెలివితేటలుకూడ ఇందే చేరియుండును. 4) పొలమునకు ఎరువులు వేసి దమ్ము చేయుట, విత్తనములు చల్లుట, నీరు కట్టుట, కలుపు తీసివేయుట, పురుగులు, చీడలనుండి కాపాడుకొనుట మున్నగు కృషియంతయు నాలుగవ కారణము. 5) ఇవియన్నియు సక్రమముగా నడచినను, వర్షము లేనిచో నీ ప్రయత్న మంతయు వ్యర్థమగును. అట్లే వరదలు మొదలగు కారణములు పంటను నాశనము చేయును. ఇవి తన యధీనము లోనివి కావు గనుక దైవ మని పేర్కొనబడినది.

పొలమున సారము తక్కువైనచో సారవంతము చేయు మార్గము లున్నవి. ఒక రైతు పనిచేయకున్నచో మరియొకడు చేయును. ఒక ట్రాక్టరు లేనిచో మరియొకటి సంపాదించవచ్చును. కృషికర్మలో స్వల్పమైన లోపము లున్నను సరిచేసికొనవచ్చును. కాని దైవము అతివృష్టి, అనావృష్టుల రూపమున వ్యతిరేకించినచో చేయగలిగినదేమియు లేదు. ఇన్ని కారణము లుండగా, తానొక్కడే యీ కృషికర్మకు కర్త ననుకొనువాడు మూర్ఖుడు. (13, 14)

మంచిపని గాని, చెడ్డపని గాని ఏ కర్మయైనను మనస్సుచేత గాని, వాక్కుచేత గాని, భౌతికముగా గాని, ఎవ్వడెప్పు డారంభించినను అది సిద్ధిని పొందవలెనన్నచో ఈ ఐదును పనిచేసి తీరవలెను. తానే కర్త ననుకొనువాడు ఒకవంతు మాత్రమే తాను కారణమని మరచిపోవుచున్నాడు. తన శరీరముతో తాను చేయుచున్నాడు గనుక తాను కర్తనని వాని విశ్వాసము. కాని ఈ శరీరమే తా నార్జించినది కాదు. జగత్కర్మలో భాగమైన తన జీవితమను

యజ్ఞమును నిర్వహించుటకు వలసిన యజ్ఞ వేదికగా తనకు ప్రసాదింపబడినది. శరీరమే తన కర్తృత్వమున లేనపుడు దానితో నిర్వహించిన కర్మకు తన కర్తృత్వ మెట్లు పొసగును? ఇక తాను మాత్రము తన యధీనమున నున్నవాడనుట సత్యమా? తాను తన స్వభావము ననుసరించి ప్రవర్తించును. తన స్వభావము త్రిగుణముల ప్రత్యేక మేళనము (Specific Blend) చే రూపొందినది. ఆ త్రిగుణములు, వాని సమ్మేళనము ప్రకృతి యధీనములోనివి. ఆ ప్రకృతి దైవమునకు సంబంధించినది కనుక తన స్వభావమే తన యధీనమున లేనపుడు తాను కర్త యగుట యెట్లు? ఇట్లు వివేచన చేయగలవాడు బుద్ధి మంతుడు. ఇట్టి బుద్ధి లేనివాడు తానే కర్తనని భావించినచో అది చెడ్డ బుద్ధి యగును. అట్టి కలుషితమైన బుద్ధితో పనిచేయజూచువాడు సరియైన చూపు లేనివాడు. అతడు తనలోని లోపములను చూడలేడు. చేయవలసిన కర్మలోని అన్ని యంశములను చక్కగా చూడలేడు. కేవలము అనుగ్రహ రూపమేయైన దైవమును చూడలేడు. కనుక అట్టివాడు తన కర్మ సత్ఫలితముల నిచ్చుట కూడ చూడలేడు. కర్మ ఎట్టిదో ఫలితము కూడ నట్టిదే యుండును. దుష్కర్మకు సంభవించినది దుష్ఫలితమే, కాని అందలి చెడు అనునది తన యిష్టాయిష్టము లకు సంబంధించినదే తప్ప తనకు తాను చెడ్డది కాదు. వ్యాపారమున నొకడు పెద్ద మోసము చేసెను. దానివలన ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని తనకు నష్టములు కలుగును. ఈ నష్టము తన లాభాపేక్షకు సంబంధించియే వుండును. పొరబాటున నొక వివేకవంతుడు అట్టి తప్పు చేసినను నష్టమే కలుగును. కాని ఈ నష్టము తనకు గుణపాఠము మాత్రమే యని వాడు గ్రహించి తనను తాను సరిజేసికొనును. ఈ విధముగా దుష్కర్మకు కలిగిన ఫలితమైనను పరిణామమున తనకు మంచియే చేయునని గ్రహింపగలవాడు సరిగా చూడగలవాడు. (15, 16)

న్యాయాధిపతి యైనవాడు నేరవిచారణ చేసి ఒక దోషికి మరణశిక్ష విధించును. ఆ నిర్ణయము చేసినది తానేయైనను అందు తన రాగద్వేషాదు లుండవు. తన నిర్ణయమున కాధారముగా న్యాయశాస్త్ర గ్రంథములు, సాక్ష్యములు, న్యాయ నిర్ణయ సమర్థమగు తన బుద్ధి యనునవి యుండును. అందు తన ఇష్టాయిష్టములు పనిచేయవు గనుక సంకల్పము (Motive) తనకు

లేదు. కనుక ఒక వ్యక్తిని చంపించిన పాపము తన కంటదు. ఒకవేళ పొరబాటు నిర్ణయము చేసి మరణశిక్ష విధించినను తనకు రాగద్వేషములు లేవు గనుక తనకు పాప మంటదు. ఆ మరణశిక్ష అమలుచేయు అధికారులు గాని, తలారి వాడు కాని, ఆ వ్యక్తిని చంపినవారు కారు. తన దుష్కర్మకు ఫలరూపముగా ఆ నేరస్థుడు చచ్చుచుండగా న్యాయాధిపతి గాని, తలారి గాని నిమిత్త మాత్రులుగా పనిచేయుదురు. అర్జునుడు కౌరవులను చంపుటలో కూడ ఇట్లే గమనింపవలెను. కౌరవులు తమకు చేసిన అపకారమునకు ప్రతీకారముగా వారి నర్జునుడు సంహరించినచో అర్జునుడు కర్మబద్ధు డగును. ఒక న్యాయ నిర్ణేతగా జరిగిన దానిని పరిశీలించినచో కౌరవులు హత్యా ప్రయత్నములు, ఒక స్త్రీని అవమానించుట, ఇతరుల ఆస్తిని దొంగిలించుట యను దుష్కార్యములను చేసిరి. వారు ధర్మమును రక్షింపవలసిన స్థితిలో నుండి కూడ ఈ దోషములను చేయుటచే వారిది మరింత తీవ్రమైన నేరము. జగత్త్రయ న్యాయ పీఠమగు శ్రీకృష్ణుని ద్వారా న్యాయదేవత వారికి మరణశిక్ష విధించినది. ఆ న్యాయ శాసనమును అమలుచేయు తలారి పనిని మాత్రమే అర్జునుడు నిర్వర్తించుచున్నాడు. కనుక అట్టి ధర్మ నిర్వహణలో ఈ మూడు లోకములలోని జీవజాలము నంతటిని చంపినను అర్జునునకు పాప మంటదు. (17)

ఒక కర్మాచరణమునకు ప్రేరేపించు కారణములను తెలిసికొనుట, తెలిసికొనదగిన యంశము, తెలిసికొనువాడు అను మూడంచు లుండును. అట్లే ఒక పని జరుగుటకు చేయబడు పని, పని జరుగుట, ఆ పనిని చేయువాడు అను మూడంచు లుండును. వీని సమన్వయమును సాధకుడైనవాడు తెలిసికొని తీరవలెను. చేయువానికి, చేయబడు పనికి, తెలిసికొనుట యను నంశముతో విడదీయరాని సంబంధ మున్నది. కర్మ, కర్త, జ్ఞానము అనబడు ఈ మూడంశములును, త్రిగుణముల భేదముచే మూడేసి తరగతులుగా నుండును. (18, 19)

**జ్ఞానము :**

సృష్టిలో అనంతమైన వైవిధ్య మున్నది. జీవరాశులలో లెక్కలేనన్ని తరగతు లున్నవి. మానవులలో ఒక్కొక్కడు ఒక్కొక్క స్వభావము కలవాడు.

ఇవి యన్నియు సృష్టిలోని భేదములు. కాని ఇన్ని భేదములు గల మానవు లందరికిని ఒకే విధమైన శరీర మున్నది. ఒకే రకమైన మనుష్యత్వము (Human Nature) ఉన్నది. అందరిలోను నేను అను ప్రజ్ఞయే యున్నది. అట్లే సృష్టిలో ఒక జీవి నింకొక జీవి చంపుట యున్నది. ఈగను కప్ప, కప్పను పాము, పామును నెమలి, నెమలిని వేటగాడు చంపుచుందురు. ఇది హింస కాదు. ఒక జీవికి ఇంకొక జీవి యాహార మగుట ఇందలి సూత్రము. సృష్టిలో నున్నది పరస్పరత్వము. అన్ని జీవరాశులును బ్రతక వలయును. ఏ ఒక్క జాతికి చెందిన జీవియైనను అతిగా పెరిగి మిగిలిన జీవరాశులకు ఇబ్బంది కలిగింపరాదు. ఎలుకలు పెచ్చుపెరగకుండ పాములు, పిల్లులు జాగ్రత్త వహించును. అట్లే పాములు పెచ్చుపెరగకుండ ముంగిస, నెమలి, గ్రద్ద మొదలైనవి జాగ్రత్త వహించును. భూమిలో నున్న ఖనిజ లవణముల నుండి వృక్షజాలమునకు ఆహారము లభించును. ఖనిజ లవణములు, వృక్షముల నుండి కొన్ని జంతువులకు ఆహారము లభించును. మానవునకు ఇట్టి అన్నిచోట్ల నుండియు ఆహారము లభించును. వృక్ష సంపద వలన వాతావరణము శుభ్రపడుట, సకాలమునకు వర్షము కురియుట సంభవించును. ధ్రువ ప్రాంతములలోని సముద్రములో నీరు బ్రహ్మాండమైన మంచుకొండలుగా కట్టుకొన్నప్పుడు అవి నీటిపై తేలియుండి, నీటిలో నున్న జీవజాలము నాశనము కాకుండ రక్షింపబడును. ఇట్లు సృష్టిలో నున్న ఏర్పాటును నిర్వహించునది ప్రకృతిలో నున్న ప్రేమ యను తత్త్వము. ప్రేమకు వ్యక్తరూపము సత్యము. అనగా ఇది యిట్లుండవలెనను ఏర్పాటు. ఈ ఏర్పాటు చేయునది ప్రకృతి కాగా, చేయించు వాడు పురుషుడగు దైవము. ఇట్లు అనంత వైవిధ్యము గల సృష్టిలోని ఏకత్వమును (Unity in Diversity) దర్శింప గల్గుట సత్త్వగుణమునకు సంబంధించిన జ్ఞానము. (20)

ఈ సృష్టిలో నున్న వేర్వేరు విషయములను గూర్చి వేర్వేరుగా పరిశోధనలు చేసి, వేర్వేరుగా విజ్ఞాన శాస్త్రములను రూపొందించుట రజోగుణమునకు చెందిన జ్ఞానము. ఏ యంశమునకు ఆ యంశమునే రజోగుణము కలవాడు కూలంకషముగా పరిశీలించునుగాని, ఒక శాస్త్రముతో నింకొక శాస్త్రమును అనుసంధించి సమన్వయించుకొనుట వానియందు ఉండదు. తన సుఖ

దుఃఖాదులను అనుసరించి, ఇష్టాదులను అనుసరించి, విలువల నాపాదించు కొనుట కూడ రాజసిక జ్ఞానమే. (21)

ఒక సన్నివేశమున గమనింపబడిన విషయమును సర్వత్ర సమ్మతమైన శాశ్వత సత్యముగా భ్రమపడుట తామస జ్ఞానము. తనకు తెలిసిన యొక కుటుంబమున పదునలుగురు సంతానముండి, అందరును ఆరోగ్యముగా నుండుటను చూచి, అంతమంది సంతతిని కనుటయే సరియైన పద్ధతి అని నమ్మువారు తామసులు. అట్లే తన కుటుంబమున గల అలవాటు కారణముగా ఒక విషయమునందు ఆసక్తి గాని, అయిష్టము గాని కలిగియుండి, దానినే సత్యముగా భ్రమపడుట కూడ తామసుల లక్షణము. తన కుటుంబమున వెల్లుల్లి తినుటయో, తినకుండుటయో అలవాటుగా నుండుట వలన, ఆ తినుటగాని, తినకుండుటగాని మాత్రమే శిష్టాచారమని భ్రమ పడుట ఇట్టిదే. ఇట్లు దేనియందో ఇష్టముండుట, లేకుండుట ఏ హేతువు పైనను నాధారపడి యుండక, తన ఇష్టాయిష్టములపైన మాత్రమే ఆధారపడి యుండుట తామసుని దోషము. జీవితమున ఆవశ్యక మేది? అనావశ్యక మేది? యను నంశములను విడమరచుకొనలేక, తనకు తోచిన అల్పవిషయములను ముఖ్యములుగా భావించుట తామస లక్షణము. కుటుంబములోని ఒక వ్యక్తికి ఆవశ్యకమైన వైద్యచికిత్స కొరకు దూరప్రయాణము చేయుటకు సోమరియైన వాడు తనకు గౌరవము జరుగు తావున నొక పెండ్లికై ప్రయాణము చేయుట యిట్టి లక్షణమే. తమోగుణము వానికి తాత్కాలిక సత్యమేదో శాశ్వత సత్యమేదో తెలియదు. తానొకటి ధర్మ మనుకొనుటకు కారణమును సహేతుకముగా వివరింపుమన్నచో వానియొద్ద సమాధాన ముండదు. అసలు విలువలేని యంశములను గొప్పవిగా భావించుట వానియం దుండును. తెలివితేటలు లేకుండుట, మూర్ఖత్వము, సోమరితనము తామస జ్ఞానము నావరించి యుండును. (22)

**కర్మాచరణము :**

తెలియుటయందు వలెనే, ఆచరించుటయందు కూడ మూడు గుణముల ననుసరించి మూడు భేదము లున్నవి. తాను చేయవలసిన కర్మ

యేదో స్పష్టముగా గ్రహించుట, దాని నాచరించుట యందు కర్తవ్య బుద్ధియే తప్ప ప్రత్యేకమైన ఆసక్తి ఏమియు లేకుండుట, ఆ కర్మ యందు తనకు ప్రత్యేకమైన ఆపేక్షగాని, ద్వేషముగాని లేకుండుట సత్త్వగుణము వాని కర్మాచరణమున నుండును. అన్నిటికన్న ముఖ్యముగా ఆ కర్మ వలన లభించు ఫలమునందెట్టి యాసక్తియు లేకుండ కర్మాచరణము చేయుట సత్త్వగుణము వానికి సహజముగా సాధ్యపడును. ప్రయత్నపూర్వకముగా ఈ పద్ధతిలో కర్మాచరణము చేసినవానియందు సత్త్వగుణము చక్కగా వికసించును. (23)

"ఈ మహాకార్యమును సాధించినచో నాకీ లాభము కలుగును. ఈ దానము చేసినచో నా కీర్తి ప్రతిష్ఠలు స్థిరమై, అది మరల నా వ్యాపారమునకు లాభసాటి కాగలదు. ఇంత మహా తపస్సు చేసినచో అణిమాది సిద్ధులు నాకు లభించును. ఈ యజ్ఞము నాచరించినచో స్వర్గలోక నివాసము కలుగును." ఇట్లేవో కోరికలతో కర్మాచరణము చేయుట రాజస స్వభావము. ఇంతటి మహా కార్యమును సాధించుటకు నాకన్న సమర్థు డెవ్వడు? అని అహంకారముతో కర్మ నాచరించుటకూడ రాజస స్వభావమే. ఇట్టి కర్మాచరణమున తన శక్తి యుక్తులను, కర్మయొక్క ఆవశ్యకతను, అది తా నాచరింప వలసినది యగునా కాదా యను నంశమును గమనింపకపోవుట వలన ఆచరణమున చాల కష్టపడ వలసి వచ్చును. అప్పుడే బాణలి నుండి తీసిన మిరపకాయ బజ్జీలను అంత వేడిగాను తినుచు, నోరు మండిపోవుచుండగా, కన్నుల వెంట నీరు కారు చుండగా, "రుచి యనగా నిట్లుండ వలెను"అనువాని వంటి యవస్థ రాజసిక కర్మాచరణమున నుండును. (24)

ఇక తామసుని కర్మాచరణమున ఫలితము లేవిధముగా నుండునో, అవి మరల తన కెట్లు బంధనము కలిగించునో ఆలోచించుట యుండదు. ఒక పని చేయవలె ననిపించుటకు - తనకు అనిపించుటయే కారణముగాని సరియైన హేతువుండదు. ఎవడో ఏదో చేయుచున్నాడు గనుక, దానివలన వాని కింత లాభము కలుగుచున్నది గనుక తానును చేయవలెను. తన శత్రువు వ్యాపారమును దెబ్బతీయుటకై తాను క్రొత్తగా నొక వ్యాపారము చేయవలెను. ఇట్లే తామసగుణము వాడు కర్మాచరణమునకు పూనుకొనును గాని, అంతకు మించి ఒక నిర్దిష్ట లక్ష్యముగాని, వినియోగముగాని యుండవు. అట్టి

కర్మాచరణములో తన శక్తియుక్తులను అంచనా వేసికొనుట యుండదు. చివరకు ఆ కర్మవలన తన సుఖ సంతోషములు, జీవితము నాశనమైనను వాడు లెక్కచేయడు. తాను మూర్ఖత్వముతో ప్రారంభించిన పని పూర్తి యగుటకు అతడు హింసకైన జంకడు. ఆత్మహింసయైనను పరహింసయైనను వాని కొక్కటియే. (25)

## కర్తృత్వము :

కర్మాచరణమున మూడు గుణముల భేదము లున్నట్లే, కర్మల నాచరించు కర్తలలోకూడ మూడు భేదము లుండును. సత్త్వగుణము వానికి తాను చేయు కర్మయెడల ఎట్టి సంగము నుండదు. అనగా ఇది తాను చేయవలెనని గాని, చేయరాదని గాని ప్రత్యేక భావ ముండదు. లోకములో వ్యక్తులు చేయుచుండుట వలన పనులు జరుగుచుండుట లేదు. పనులు జరుగును కనుక, వానిని చేసినవాడు చేసినవా డగుచున్నాడు. మంచి పనిని ఒకడు చేయకుండ మానినచో ఆ పని మరియొకని ద్వారా జరుగును. అనగా మంచి పనికి తాను సిద్ధమై యుండుటవలన అది తన ద్వారా జరుగుచున్నది. తాను లేనిచో తనకన్న సమర్థుడు మరియొకడు చేయును. ఈ సత్యమును సత్త్వగుణము వాడు గ్రహించి, అహంకారమును, కర్మయందలి ఆసక్తిని వదలిపెట్టును. తన యొద్దకు వచ్చిన పనిని కార్యకర్మగా స్వీకరించి యాచరించును. మరియొక డాచరించు చున్న పని ఎంత మంచిదైనను తనది కాదని అతడు గ్రహించును. తాను చేయగలిగిన పనులు పది యుండగా, ఒక్క పని మాత్రమే తన యొద్దకు వచ్చును. వచ్చిన దానిని నిర్వహించుట, రానివానిని గమనింపకుండుట సత్త్వ గుణము వాని పద్ధతి. కర్మ తనది కాదు; ఫలితము నందు తనకు ఆసక్తి లేదు. అట్లని కర్మాచరణమునందు నిర్లక్ష్యము, వైముఖ్యము సత్త్వగుణము వాని కుండవు. ఫలితము నెడల మాత్రమే అతడిట్టి వైరాగ్యము వహించును గాని, కర్మాచరణమునందు ధైర్యము, ఉత్సాహము సడలిపోనీయక జాగ్రత్త వహించును. ధైర్యమునకు, పట్టుదలకు భేదము నతడు గమనించును. ధైర్యము సత్త్వగుణ లక్షణము కాగా, పట్టుదల రజోగుణ లక్షణము. పట్టుదలతో పనులు చేయువాడు అడ్డంకు లెదురైనచో ఉద్రేకపడి, మరింత పట్టుదలతో పనులు చేయుచు, ఇంత కష్టముగా నున్నదని దుఃఖము ననుభవించును. అట్లే

ఉత్సాహమునకు, ఉద్రేకమునకు గల భేదము కూడ సత్త్వగుణము వానికి తెలియును. ఉద్రేకపడుటవలన తనలోని జీవశక్తులు వేగముగా బయటకు ప్రవహించి వ్యర్థమగును. ఉత్సాహమువలన తనలోని జీవశక్తులు వ్యవస్థీకృతములై సద్వినియోగము చెందును. ఇట్లు సంగము, అహంకారము లేనివాడై, ధైర్యోత్సాహములతో ఒక పని చేసినపుడు దాని ఫలిత మెట్లైనను నుండవచ్చును. సత్త్వగుణమువాడు పై జెప్పిన ఉత్తమ గుణములతో కర్మాచరణము చేసినను కార్యసిద్ధి యగునని నిశ్చయమేమియు లేదు. ఎంత అసంగముతో, అహంకార రహితముగా, ధైర్యముతో, ఉత్సాహముతో పనులు చేసినను, ఇంతటి శ్రమయు విఫలమైనచో దుఃఖము కలుగుట కవకాశము కలదు. తాను చేసిన పని సత్ఫలితముల నిచ్చినచో తాను కర్త కాకున్నను తనద్వారా ఇంత పని జరిగినదని సంతసించుట కూడ జరుగవచ్చును. ఇది సహజమే యనిపించును గాని, ఇట్లు భావించుట తనలో కొంత రజోగుణము పాలు ఉన్నదని సూచించును. కార్యసిద్ధికి ఆనందించుట, వైఫల్యమునకు దుఃఖపడుట వలన తరువాతి తన కర్తవ్యమునకు తాను సంసిద్ధుడు కాకుండ నుండిపోవును. సత్త్వగుణము వానికి వికారము లుండవు. ఒక పని యైపోయిన వెంటనే మరియొక పని కతడు సంసిద్ధుడై యుండును. తాను చేపట్టిన పని సత్ఫలితము నిచ్చినచో దాని యందు తా నానందించుచు కూర్చున్నచో, తన కర్తవ్యముగా తన యొద్దకు వచ్చిన మరియొక కర్మ నాతడు సకాలమున గుర్తింపలేడు; అతడు గుర్తింపనిచో ఆ పని మరియొకని నన్వేషించుచు దాటిపోవును. తాను నిర్వహించిన పని విఫలమైనచో, ఆ వైఫల్య స్థితిలో దానిని నిర్వికారముగా వదలివేసి, మరియొక పనిని చేపట్టుట సత్త్వగుణము వాని పద్ధతి. అస్తవ్యస్తమైన పనిని పట్టుకొని ప్రాకులాడుట వలన శక్తి సామర్థ్యములు, సమయము దగ్ధమై పోవును. సూర్యుడు పశ్చిమమున అస్తమయముతో పోరాడుట మాని, మరల తూర్పున నుదయించు చున్నాడని యతడు గమనించును. అట్లే తానును విఫల కర్మలను వదలివేసి మరియొక కార్యమునందు నిమగ్నుడగును.(26)

రాజసికుడైన కర్తకు ఇష్టానిష్టముల తీవ్రత ఎక్కువగా నుండును. కనుక అత డేపని చేసినను గాఢమైన యిష్టముతో చేయును. అనగా వానికి ఆ పని యందు లోలుపత యెక్కువ. ఒక మహాకార్యమును చేయుట యందలి

ఉబలాటము (Thrill) వానికి కావలెను. దానితో బాటు తనకు ఉపయోగము కూడ నాతడు దృష్టిలో నుంచుకొనును. దాని ఫలితమంతయు తనకు మాత్రమే దక్కవలెనను లోభముకూడ వానికుండును. జంతుహింసతో కూడిన యజ్ఞాదులు మొదలు గ్రామ దేవతలకు కోళ్ళు, గొఱ్ఱెలను తెగవ్రేయుట వరకు గల అన్ని రకముల హింసకు అతడు వెనుకాడడు. అమ్మవారి విగ్రహము నిండ రక్త మాంసాదులు అభిషేకము చేయుట, ఆ జంతువుల ప్రధాన అవయవములను వలిచి, తాను ప్రసాదముగా స్వీకరించుట వంటి అశుచిత్వమునకు వాడు జంకడు. ఇంత కష్టపడి యొక పనిని పూర్తిచేసిన తరువాత, అది తా నాశించిన ఫలితముల నిచ్చినచో బ్రహ్మానంద పడును. ఆ ఫలితము దక్కనిచో తన కొంప తగులబడి పోయినట్లు ఏడ్చును. కేవలము ధనాశయే గాక, కీర్తి ప్రతిష్ఠలకు దేవాలయాది నిర్మాణములు చేయుట, ప్రచారము కొరకు దానధర్మాదులు చేయుట మొదలగున వన్నియు రాజసికు డిట్లే చేయును. చేసిన పనులు సత్ఫలితము లిచ్చినచో కేరింతలు కొట్టుట, విఫలమైనచో కుళ్ళిపోవుట వంటి పూర్ణిమ - అమావాస్యలే వానియందు తాండవించు చుండును. (27)

ఇక తమోగుణము వానికి నిత్యము అమావాస్యయే వాని మొగమున వ్రాసిపెట్టి యుండును. వానికెప్పుడును ఏ విషయముననను నిశ్చయముండదు. దేని యందును చక్కగా యోచించుట యనునది వాని కుండదు. అసలు గ్రహణశక్తియే తక్కువ గనుక తనయందు గల శక్తియుక్తులు తెలియవు, తన లోపములు ముందే తెలియవు, చేయవలసిన పనిలోని లోతుపాతులు గ్రహించుటకు వలయు నేర్పు అంతకు ముందే శూన్యము. వీనికి తోడు తనకు తోచినదే వేదము గాని, ఒకరు చెప్పినచో వినుట యనునది మొదలే లేదు. మూర్ఖత్వము వాని నావరించి యుండును. తా ననుకొన్నదేదో చెప్పినచో ఎవరైన తోచిన సలహా చెప్పగలరు. కాని తమోగుణమువాడు అనుకొన్నది యొకటి, చెప్పునది యింకొకటి, చేయునది వేరొకటి. ఇట్టి వంచనలతో లోకమును మోసగింపబూని తనను తానే మోసగించుకొనును. తన కుపకారము చేసిన వానికే అపకారము చేయుటకు వాడు జంకడు. ఇక మంచి చెప్పవచ్చిన వాని యెడల మరింత కృతఘ్నుడై ప్రవర్తించును. “తన పని యేదో తాను

చూచుకొనక, నా విషయమున కలుగజేసికొనుట యేల? ఈ పని జరుగదని శకున పక్షివలె ముందే శాపము పెట్టినచో, నా పని నాశనము కాక యేమగును?'' అనియే తమోగుణము వాడు భావించును. లోకమునందు అందరును మోస గాండ్రు, దొంగలు, తానొక్కడును పవిత్రమూర్తి. అయినను ఇంతమంది దుష్టుల మధ్య తాను ఒక్కడును ఏమి చేయగలడు? ఏ పని చేయబోయినను హిమాలయమంత కష్టములతో నిండి యున్నది. ఎంత మంచి పని చేయుద మన్నను ఒక్కడును కలసిరాడు. తా నొక్కడే ఎంతకని ఏడ్వగలడు? ఇట్టి యాలోచనలతో నాతడు విషాదము (Despondency)తో క్రుంగిపోవు చుండును. ఏదైన నొక పనిచేయుట ప్రారంభించినచో నెమ్మదిగానైన చేయుట సాధ్యపడును. కాని తమోగుణము వాడు సోమరి. ఒడలు వంచి పనిచేయకుండ తాత్సారము చేయుటకు వలసిన ఆలోచనల నతడు ఆహ్వానించును. ఒక వంక కర్తవ్యమును గూర్చిన అజ్ఞానము, ఒక వంక నిరాశ, మరొకవంక తనలోని శక్తి సామర్థ్యములు తెలియకపోవుట, ఇతరులు చెప్పినచో విననొల్లని మూర్ఖత్వము - ఇన్నిటి నడుమ వాని కే విషయమునను నిర్ణయము చేయుట సాధ్యము కాదు. ఎంత చిన్న విషయమున కైనను ముందుకు, వెనుకకు, పైకి, క్రిందికి తెగ సాగదీయుచు నిర్ణయమును వాయిదా వేయుచుండుట వానికి సదుపాయమైన విద్య. ఇట్టి స్వభావముతో తామసికుడు కర్త నను కొనుటయేగాని, కర్మ చేయుట ఎన్నడోగాని యుండదు. (28)

ఇక మూడు గుణములను బట్టి బుద్ధి కూడ మూడు తరగతులుగా నుండును. బుద్ధి యనగా వివేచనా శక్తి (Discrimination). మనస్సు, ఇంద్రియ ముల ద్వారా తన యొద్దకు వచ్చిన ప్రతి యంశమును కావలెనని యతడు కోరును. అలవాటు (Habit)ను బట్టి కూడ ఒకమారు కలిగిన అనుభవము మరల మరల కోరుచుండుట మనస్సు యొక్క లక్షణము. అందు ఏది చేయవలెను? ఏది చేయరాదు? అనుదానిని నిర్ణయించునది బుద్ధి. దాని యందలి తరతమ భేదములను బట్టియే మనుష్యుని ప్రవర్తన యాధారపడి యుండును. మనయందు ధైర్యము అనబడు మరియొక శక్తి యున్నది. ధైర్యము అనగా ధరించునది (Composure). ఒక్కొక్కడు ఒక్కొక్క యంశము నందు గాఢముగా తగులుకొని యుండును. అనగా ఒక్కొక్క విషయమును

తనయందు ధరించి యుండును. మూడు గుణముల భేదము ననుసరించి తాను ధరించు నంశములు మూడు తరగతులుగా నుండును. బుద్ధి, ధైర్యము లేక ధృతి యను రెండంశములను గూర్చియు విస్పష్టముగా, కూలంకషముగా తెలిసికొనుట యావశ్యకము. (29)

**బుద్ధి :**

ఏ కర్మ తనను బంధించునో, ఏ కర్మ తనను బంధము నుండి విముక్తుని చేయునో తెలియుట సాత్త్విక బుద్ధి లక్షణము. ఏ కర్మ యందైనను తాను కోరుట యున్నచో అది ఎంతటి సత్కర్మయైనను తనను బంధించును. అనగా ఆ కర్మ మరియొక కర్మకు బీజమై తనను దానిలోనికి లాగివేయును. తన యిష్టాయిష్టములతో నిమిత్తము లేక, తన యొద్దకు నడచివచ్చిన పని తనను బంధింపదు. అనగా ఆ కర్మకు ఫలితముగా తా నింకొక కర్మలో చిక్కుకొనుట జరుగదు. ఇది తెలిసినవాని బుద్ధి సాత్త్వికము. వానికి తాను చేయదగినది యేదో, చేయదగనిది యేదో తెలియును. పదిమందికి సుఖ శాంతుల నిచ్చు పని చేయదగినది, పదిమందికి భయమును కలిగించునది చేయదగనిది. ఇట్టి వివేచన చేయగలిగి, చేయదగినది మాత్రమే చేయవలెనని నిర్ణయించును. చేయదగని పని నుండి తాను దూరముగా నుండిపోవును. దానిని తూలనాడుట వంటి పనులు మాత్రము సాత్త్వికుడు చేయడు. (30)

ధర్మమేది, అధర్మమేది యను విషయమున రాజసికుడు తన యిచ్ఛము వచ్చినట్లు గ్రహించును. తన కిష్టమైనచో అధర్మము నైనను ధర్మముగా నిర్ణ యించుకొనును. తన కయిష్టమైన ధర్మమును కూడ అధర్మముగా నిర్ణయించి వదలివేయును. అనగా నిర్ణయించు బుద్ధి, తన యిష్టాయిష్టములు, రాగద్వేషములు, పరిస్థితులు, పదిమంది యభిప్రాయములు - వీనిని బట్టి నడచు చుండునే గాని విషయమునందున్న ధర్మాధర్మముల ననుసరించి యుండదు. ఆఫీసులో నందరును యెగగొట్టుచున్నారు గనుక తానునూ అట్లే చేసినచో తప్పులేదని వాడు వాదించును. "పదిమందితో కలసియున్నపుడు వారితోబాటు పేకాట ఆడకపోయినచో నలుగురు నేమనుకొందురు?" అనునది వాని ఆలోచనా విధానము. తన శక్తి సామర్థ్యములు, కర్తవ్యము గుర్తించి ఏ

పనినైనను చేయుటగాక, తన కిష్టమైన పని చేయుట, ఇష్టముకాని పని మానుట రాజసికుని స్వభావములో నుండును. (31)

ఇక తామసికునకు ఇష్టమగుట, కాకపోవుట అని యుండవు. యథార్థమును అట్లే గ్రహించు బుద్ధి వానియందుండదు. అజ్ఞానము వాని నావరించి యుండును. కనుక అధర్మమే వాని బుద్ధియందు నిలబడును. తనకు తోచినదే తప్ప వేరొక యభిప్రాయము నతడు చేరనీయడు. కనుక అధర్మమునే ధర్మముగా భావించి నిర్ణయించును. ధర్మమనునది కాలు చేతులకు సంకెల యని వాని విశ్వాసము. రాజసికుడు తనకు అనుకూలము అయినపుడైనను ధర్మమును ధర్మముగా నంగీకరించును. తామసికుడు ధర్మముగా నిర్ణయించున దేదియైనను అధర్మమే యగును. ఏ విషయమునైనను వాడు వక్రముగనే యాలోచించును. "మానవుడు పుట్టినది తినుటకు, నిద్రించుటకు, శారీరకముగా సుఖపడుటకు. ఇట్టి యాహారమునే తినవలెను, మద్యము ముట్టరాదు - మున్నగు నిబంధన లేల? మనుష్యు డన్నవాడు నిద్రింపడా? సృష్టిలో స్త్రీ పురుషు లున్నది కామానుభవమునకు. దానికి ధర్మము పేర నిబంధనలు, స్వకీయ పరకీయ భేదములు పనికి రావు" - ఇట్లే తామసుని బుద్ధి ఏ విషయమున నైనను విపరీతమైన అర్థములనే స్వీకరించును. (32)

**ధారణము :**

ప్రతి మానవుడును ఏదోయొక విధమైన యంశములకు తనను తాను ముడిపెట్టుకొనును. ఒకనికి సత్యమన్నచో ప్రాణము. ఒకనికి కీర్తి యన్నచో ప్రాణము. ఒకనికి ధనమన్నచో ప్రాణము. ఒకనికి దారాపుత్రులన్నచో ప్రాణము. ఇట్లే ఆయా అంశములయం దాతని జీవశక్తి కేంద్రీకృతమై యుండును. మరియొక విధముగా చెప్పవలెనన్నచో, తన సంకల్పశక్తితో ఆయా అంశములను తనయం దతడు కూడగట్టుకొని యుంచును. ఇట్లు తన జీవశక్తి ఒక చోట నిలబడియుండుట ధృతి యనబడును. తాను అనగా తన శారీరక మైన చేష్టలు, వానికి కారణమైన జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు, వానికి చైతన్యము నిచ్చు ప్రాణశక్తి, ప్రాణమును ఇంద్రియములను నియమించి నియంత్రించు మనస్సు, ఉచితానుచిత నిర్ణయము చేసిన మనస్సున కందించు

వివేచనాశక్తి, దానిని ప్రభావితము చేయగల అహంకార మమకారాదులతో కూడిన భావమయ కేంద్రము, జ్ఞానస్వరూపమైన బుద్ధి - ఇవి యన్నియు కలసి నేను అనబడును. ఇవి యన్నియు 'నేను' అను దివ్య ప్రజ్ఞనుండి పుట్టి, వర్తించి, మరల దానిలోనికే లీనమగుచుండును. ఒక వ్యక్తి స్వభావమునందలి మేళనము ననుసరించి ఒక్కొక్క కేంద్రములో వాని జీవశక్తి కేంద్రీకృతమై యుండును. జ్ఞానస్వరూపమైన బుద్ధియను కేంద్రమున జీవశక్తి నిలచి యున్నవాడు సాత్త్వికుడు; అహంకార మమకారాదులతో కూడిన భావమయ కేంద్రమున నిలబడి యున్నవాడు రాజసికుడు; ఇంద్రియ వృత్తులలో నిలబడి యున్నవాడు తామసికుడు.

సాత్త్వికునియందు భౌతికమైన చేష్టలు, ఇంద్రియ ప్రవృత్తులు కలసి మనస్సుచేత నియంత్రిత మగును. ఇట్టి మనస్సు వివేచనాశక్తిచే నియంత్రిత మగును. ఆ వివేచనాశక్తి జ్ఞాన స్వరూపమగు బుద్ధియందు విధేయత వహించి యుండును. అనగా బుద్ధి యను కేంద్రమునందు వివేచనాశక్తి, మనస్సు, ఇంద్రియములు, చేష్టలు విధేయములై ధరింపబడుచుండును. అహంకార మమకారాదులతో కూడిన భావమయ కేంద్రము కలుగజేసికొనకుండ ఒక ప్రక్కన ఒదిగియుండును. జ్ఞానమయమగు బుద్ధి 'నేను' అను ప్రజ్ఞయందు వసించుచుండును. ఇట్టి స్థితిని యోగము అందురు. అనగా తనయందలి భాగములు (Components) అన్నియు 'తనయందు' చక్కని కూర్పును చెంది యుండుట. ఈ యోగము సాధించుకొన్నచో చాలదు. అది జారిపోనీయ కుండ సాధన చేయవలెను. భావమయ కేంద్రమునుగాని, ఇంద్రియాదులను గాని కలుగజేసికొననీయకుండ జాగరూకత వహింపవలెను. ఏ స్థితి యందైనను 'తన యందే' దృష్టి యుండవలెను గాని, వేరొక భావమునకు ప్రాముఖ్యము నీయరాదు. దీనిని వ్యభిచారము లేని యోగ మందురు. ఇట్టి వ్యభిచారము లేని యోగమునందు నిరంతరము వసించువానికి మనస్సు మొదలగున వన్నియు బుద్ధియందు ధారణ చెందియుండును. ఇట్టి స్థితియందున్న వాడు తన యందున్న తానను ప్రజ్ఞయందే గాక, సర్వజీవరాశులలో నున్న 'తాను' అను ప్రజ్ఞయందు మెలకువ కలిగియుండును. తనయందు తాను మెలకువ

కలిగి యుండుటను ఆత్మజ్ఞాన మందురు. సృష్టి జీవులలో నున్న 'తాను' అను ప్రజ్ఞయందు మెలకువ కలిగియుండుటను బ్రహ్మజ్ఞాన మందురు.(33)

భావమయ కేంద్రమున జీవశక్తి నిలచియున్నవాడు రాజసికుడు. కోరికలు, ఇష్టాయిష్టములు, అభిప్రాయములు, ఆశయములు, అహంకారము మొదలగున వన్నియు భావమయ కేంద్రమున నుండును. ఆ కేంద్రమున వసించు వానికి కోరికలు, కర్మ ఫలముల యెడల కాంక్ష యుండును. అట్టివాడు ధర్మము, అర్థము, కామము అను వానిలో ఒక దానిని గాని, కొన్నింటిని గాని తనయందు ధరించి యుండును. వానికి ధర్మముకన్న తన లాభము ముఖ్యము. ఈ రెండిటి కన్న తన కోరికలు తీరుట ముఖ్యము. అవి శారీరకమైన కోరికలుగా (Luxuries) గాని, పేరు ప్రతిష్ఠలు, గొప్పదనముల రూపమున గాని యుండ వచ్చును. అనగా వాడు ముఖ్యముగా తన కోరికలను (desires) తనయందు ధరించును. వానికి భంగము లేకుండునట్లు మాత్రమే అర్థమును (వినియోగ మును) సాధన చేయును. తన కోరిక, తన వినియోగము - ఈ రెండును సమకూర్చుకొనుచు, వానికి భంగకరము కాకుండునట్లు మాత్రమే అతడు ధర్మమును పాటించును. ఇట్టివానికి ధర్మము అనగా సమాజము నందు తనకు సంబంధించిన కర్తవ్య రూపమైన ధర్మమేగాని, సృష్టిలోని ధర్మముల నతడు పట్టించుకొనడు. ఇట్లు తన సొంత ధర్మము (code of conduct), అర్థము (utility and need for himself), కామము (desires) అనునవి ఒకదానికన్న నొకటి ప్రాముఖ్యము వహించి, రాజసికుని యందు ధరింపబడి యుండును. (34)

ఇంద్రియములు, మనస్సు, భౌతిక శరీరములతో కూడిన క్రింది కేంద్రమునందు జీవశక్తి నిలబడి యున్నవాడు తామసికుడు. కంటికి అందమైన రూపము, చెవి కింపైన సంగీతము, నాలుకకు నచ్చిన రుచి, నాసికకు చక్కని సుగంధము, శరీరమునకు స్పర్శాసుఖము అనునవి తమోగుణము వానికి ప్రాణప్రదములైన యంశములు. వాని ననుభవించుచు పోవుచున్న మనస్సును అభ్యాసబలము వలన అవియే మరల మరల ఆకర్షించును. వీని ఆకర్షణ శక్తి యను సాలెగూటిలో చిక్కిన తెలివి మరి దేనిని ముఖ్యముగా పాటింపదు. ఇంద్రియార్థములైన తుచ్ఛ సుఖములే గాని, వానిని మించిన ఆవశ్యకతలను

గాని, తనపై నాధారపడిన వారిని గూర్చిన కర్తవ్య బుద్ధినిగాని, సాటిమానవుల యెడల తా నాచరింపవలసిన కర్తవ్య రూపమైన ధర్మమును గాని వాడు పట్టించుకొనడు. కనుక వానిది దుష్టమైన బుద్ధి. తనకు ప్రాణప్రదమైన సుఖములు తన కందకుండ పోవునను భయము వానిని పీడించుచుండును. సుఖము లనుభవించుచు సోమరిగా నున్నపుడు లోకనింద మొదలగునవి మనస్సున మెదలుచు దుఃఖమునే కలిగించును. ఇన్ని సుఖము లున్నను వాని దృష్టి తనకు లేనివానిపైననే నిలబడి యుండును గనుక జీవితమున ప్రతి యంశమునను శూన్యమే వానికి గోచరించును. కనుక విషాదము వాని జీవితములో నొక భాగమైపోవును. శారీరకమైన పశుబలము తమోగుణము వానికి హెచ్చుగా నుండుటచే దానికి ఫలితముగా నెవ్వరిని లెక్కజేయని మదము పెచ్చుపెరుగును. ఎవ్వరైనను తన కర్తవ్యమును గుర్తుచేసినచో వారిపై తిరుగబడును. తమోగుణము వానికి ప్రాణప్రదమైనది నిద్ర. దినమున కిన్ని గంటలు, ఆయా సమయములలో నిద్రింపనిచో లోకము దగ్ధమై పోవునని వాని విశ్వాసము. దానికొర కెన్ని పనులనైన చెడగొట్టుకొనుట కతడు జంకడు. కాని తా నాచరింపక విడచిన కర్తవ్యములు వానిని కలలో వెంటాడి దుఃఖమునే కలిగించును. ఇట్లు తమోగుణము వాని ధైర్యము దేనియందును నిలబడక చెదరి ధ్వంసమై పోవుచుండును. (35)

**సుఖము :**

సుఖమను భావన (Concept) చిత్రమైనది. అది అభ్యాసవశమున కలుగుచుండును. అనగా ఒక యంశమునందు మనస్సు అభ్యాసవశమున అంటుకొన్నచో అది సుఖముగా భావింపబడు చుండును. అంతేగాక, ఒక దుఃఖము సంభవించి, అది అంతరించినపుడు దానినే సుఖముగా భావించుట మానవుల కలవాటు. అంతేగాని దుఃఖము లేని కేవల సుఖము సామాన్య మానవుని భావన కందదు. పరమ పురుషుని యంశయైన జీవుడు శరీరమును ధరించినపుడు కొన్ని పరిమితులు తప్పవు. అభ్యాసమను శక్తి ప్రవర్తింపనిదే సృష్టియే లేదు. బ్రహ్మదేవుని పూర్వపు సృష్టుల అభ్యాసబలము వలననే ఈ ప్రస్తుత సృష్టి రూపొందుచున్నది. ఈ అభ్యాసబలమే అన్ని స్థాయిల జీవులలోను

ఉండును. తనకేది అభ్యాసమైనచో దానియందు తాను సుఖమను భావన పొందును. తన అభ్యాసమునకు క్రొత్తదియైనచో దానియందు దుఃఖమను భావన పొందును. తనకు సంభవించు వానిలో అభ్యాసమైనవి కాక, అభ్యాసము కానివే ఎక్కువ యుండుట వలన దుఃఖములే ఎక్కువ యుండును. దుఃఖము లంతరించినపుడు దానినే సుఖముగా భావించుట సామాన్యుల పద్ధతి.

నిజముగా సుఖమైన స్థితిని సాధించుకొనగోరిన వానికి కూడ అభ్యాస శక్తియే శరణ్యము. తన కిష్టము లేనివైనను ఉత్తమ విషయములని శాస్త్రజ్ఞులు చెప్పినవానిని ప్రయత్నపూర్వకముగా నాచరించుట నభ్యాసము చేయవలెను. ధూమపానాదుల కలవాటు పడినవానికి అదియే సుఖముగా నుండును. వానిని పరిహరించుట క్షేమమనియు, ఆరోగ్యమనియు వైద్యులు చెప్పినపుడు, కష్టమైనను వానిని మానివేయుట నభ్యాసము చేయవలెను. మనో బుద్ధీంద్రియాదులకు తమంత తాము ఇష్టమైనది యుండదు. ఏది అభ్యాసమైనచో అదియే ఇష్టమగును. దేని నభ్యాసము చేయుట యనునది మన వివేకముపై నాధారపడి యుండును.

ఈ సుఖమను భావన మన అభ్యాసము పైనను, దానికి మూలమైన మన స్వభావము పైనను నాధారపడి యుండును. గుణ భేదము చేత స్వభావము మూడు విధములుగా నుండును గనుక, సుఖ భావన కూడ మూడు విధములుగా నుండును. (36)

ఒకనికి విందు భోజనములపై, మద్యపానాదులపై నాసక్తి యుండును. కాని జీర్ణకోశమున గల లోపములచే జీర్ణశక్తి తగ్గి యుండును. అది చక్కబడవలె నన్నచో తన యాహారమును నియమించుకొనవలెను. అనగా జిహ్వా చాపల్యమును తగ్గించుకొనవలెను. దీనివలన రోగము పెరుగకుండ అదుపులో నుండును. రోగము తగ్గవలెనన్నచో వైద్యము చేయించుకొనవలెను. అది చేదు మందులు కావచ్చును, సూది మందులు కావచ్చును, శస్త్ర చికిత్సయైన కావచ్చును. ఇది బాధాకరముగనే యుండును. తన కిష్టమైన వానిని మానివేసి, బాధాకరమైన వానిని అంగీకరించినచో ఆరోగ్యము కుదుటపడును. ఆహారము ఆవశ్యకమైనంత వరకు, పుష్టికరమైనవి స్వీకరించుట వలన శరీరము తేలికగా

నుండును. బుద్ధికూడ ప్రసన్నముగా నుండును. ఇది సత్త్వగుణము వాడు ఆచరించు విధానము. ధనార్జనము, దారా పుత్రాదులపై మమకారము మొదలైన యంశములు మనస్సున నంటియుండి, ఆ తాపత్రయమే సుఖమను భ్రాంతిని కలిగించుచుండును. కాని ధనమును ఆవశ్యకమైనంత వరకు నార్జించుట, దానిని దారా పుత్రాదుల క్షేమమునకై సద్వినియోగము చేయుట మాత్రమే ముఖ్యమనియు, మనస్సున వానిని తగిలించుకొని గింజుకొనుట వలన తన శక్తియుక్తులు వ్యర్థమగు ననియు పెద్ద లెవరైన చెప్పినపుడు సత్త్వగుణమువాడు దానియందలి సత్యత్వము నంగీకరించును. మనస్సున బంకవలె నంటుకొనియున్న అభిప్రాయములను వదలించుకొనుట చాల కష్టము. అయినను వాడు దానికి సిద్ధపడును. తన భావములను గురువునకో, దైవమునకో సమర్పణము చేసికొని, కర్తవ్య నిర్వహణమునందు నిమగ్ను డగుటను అభ్యాసము చేయును. ఈ అభ్యాసమున నాతడు మహత్తరమైన సత్యము నొకదానిని గమనించును. ఇంతకు మునుపు తన శక్తియుక్తులలో వినియోగమగుచున్న వానికన్న వ్యర్థమైపోవుచున్నవి చాల రెట్లు ఎక్కువ! జంజాటము, వెనకపీకుడు లేకుండుటచే తన శక్తియుక్తులు పునర్వ్యవస్థీకరణము చెంది (Rearranged and Stabilized) పనిచేయుచున్నవని యతడు గమనించును. ఈ గమనిక స్థిరమై తనలో పాదుకొన్నగొలదియు వాని బుద్ధి, అభిప్రాయములు, జంజాటములు అను బురదనుండి తేరుకొనుచు వచ్చును. ఈ బుద్ధి స్వచ్ఛమైన జలమువలె పారదర్శకమై (Transparent) 'తాను' అనబడును. **(37)**

రజోగుణము వాని సుఖ భావనయందు ఇట్టి వేమియు నుండవు. ఇది అపకారము చేయునని ఎవ్వరైన చెప్పినను, వినుట వాని స్వభావములో నుండదు. ఈ కొబ్బరి యుండలు రుచిగా నుండును. గనుక తినుటయే! కడుపులో శూల పుట్టినపుడు ఇంజెక్షను బాధగా నుండును గనుక మానివేయుటయే! చక్కని సంగీతము చెవి కింపుగా నున్నది గనుక పనులు పాడైపోయినను వినుచు నుండిపోవును. తన కంటి కొక అందమైన యువతి కనిపించినచో ఆమెను స్వంతము చేసికొనుటయేగాని, పరిణామములను గూర్చి యోచించుట యుండదు. శరీరమునకు కామాత్మకమైన స్పర్శాసుఖము కావలె ననిపించి

నపుడు ఎక్కడో యొకచోట దానిని పొందుటయే గాని, దాని దుష్పరిణామములను గూర్చి వివేచన యుండదు. రజోగుణము వాని యీ పద్ధతిలో అప్పటికి సుఖపడినను, పరిణామములో యాతనలే యనుభవింపబడును. (38)

తమోగుణము వాని సుఖము మరింత చిత్రముగా నుండును. వాడు తిండిపోతు గనుక, తన కిష్టమైన కొబ్బరి ఉండలు లెక్కలేకుండ తినుచునే యుండును. కడుపులో శూల పుట్టినచో, "ఇది ఫలానా దేవుని కొబ్బరిచిప్పలతో తయారైనది గనుక కడుపునొప్పి వచ్చినది" అనుకొనునేగాని, తినుట మాత్రము ఆగదు. అనగా సుఖపడుచున్నప్పుడును, దాని ఫలితముల ననుభవించు చున్నపుడును కూడ తనను తాను మోసగించుకొనును. తమోగుణము వానికి సుఖ మనగా నిద్రపోతుతనమో, తిండిపోతుతనమో అయియుండును. ఏ పనినైనను 'ఇప్పుడు కాదు' అని వాయిదా వేయుటలో నతడు అఖండ ప్రతిభావంతుడు. నిద్రాణమైయున్న వాని తెలివితేటలన్నియు ఈ యొక్క విషయమున మాత్రము చాల చురుకుగా పనిచేయును. తాను చేయవలసిన దేమో ఎట్లును తెలియదు గనుక, ప్రతి విషయమును పొరబాటుగా భావించుట యందే వాడు తన సుఖమును వెదకికొనును. (39)

ఇట్లెన్ని యంశములను పరిశీలించినను గుణముల మేళనముచే ఏదో యొక గుణము ప్రాధాన్యము వహించి యుండును. కనుక ఈ గుణముల కతీతమైన శుద్ధ సత్త్వము నందుకొనవలెనని నీ వెంత యన్వేషించినను అది నీకు లభ్యము కాదు. నీ యన్వేషణయే రజోగుణ లక్షణము గదా! కనుక నీ ప్రయత్నము సముద్రమునందలి యలలను లెక్కించుటయే యగును. భూలోకముననే కాదు, దేవ లోకములలో గాని, దేవతలలో గాని, శుద్ధ సత్త్వము లేనే లేదు. ఈ దేవతలు, వారి లోకములు కూడ సృష్టిలోని భాగమే! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుకూడ మూడు గుణముల ప్రవర్తనమున కాధారభూతులై ప్రవర్తించుచున్నారు. ప్రకృతివలన మూడు గుణములు పుట్టి, వాని మేళనమున సృష్టి పుట్టినది. కనుక గుణము లంటని శుద్ధసత్త్వము దేవ మనుష్య లోకము లలో నెచ్చటను లేదు.

మూడు గుణముల మేళనములో ప్రకృతికి గల కౌశలము వలన, అనంతమైన వైవిధ్యముతో జీవరాశులు పుట్టుచున్నవి. మూడు గుణములు

మాతృకలుగా ఒక ప్రత్యేక మేళనము (Blend) సాధింపబడును. అట్లు గుణముల హెచ్చు తగ్గులతో మరికొన్ని మేళనములు సాధింపబడును. ఈ ప్రత్యేక మేళనములు మాతృకలుగా మరికొన్ని మేళనములు సాధింపబడును. ఇట్లు సాధింపబడిన ప్రతి యొక్క మేళనము ఒక మాతృకగా వినియోగ పడును. ఈ మాతృకల పరస్పర సమ్మేళనముల పరంపరలతో (Permutations and Combinations) అనంతమైన వైవిధ్యముగల జీవరాశులు పుట్టుచున్నవి. ఈ వైవిధ్యము లన్నియు ఒకదాని కొకటి పరిపూరకములు, పరిపోషకములునై యుండుట ప్రకృతి యందలి అద్భుతమైన యేర్పాటు. ముందు - వెనుక మొదలైన భావములు, స్త్రీ - పురుషుడు మొదలైన భావములు వైవిధ్యములే యైనను పరిపూరకములే. ఈ వైవిధ్యములే లేనిచో సృష్టియే లేదు. ప్రళయ స్థితియే యుండెడిది. భూమిపై గల జాతిభేదములు, మతభేదములు ఆచార వ్యవహారాదుల భేదములు మున్నగున వన్నియు ఈ వైవిధ్యముననే జరుగు చున్నవి. ఈ అనంతమైన వైవిధ్యముల వలననే సృష్టియు, అందలి జీవులు నిత్య నూతనముగా విలసిల్లుచున్నారు. ఈ అనంత వైవిధ్యము, నిత్య నూతనత్వము గల సృష్టిలోని ఏకత్వమును దర్శించినవారు బుద్ధిమంతులైన ఋషులు. ఈ వైవిధ్యముల పరిశీలనము, వానియందలి సమన్వయమును, సామ్యమును దర్శించుట యనువాని సమాహార విజ్ఞానమే వేదములు, ఉప నిషత్తులు, పురాణములు, ధర్మ శాస్త్రములు మున్నగునవి.

ఈ ఏకత్వమునకు మరియొక పేరే పరస్పరత్వము (Mutuality). సృష్టిలోని అనంతకోటి జీవరాశులలోను ఈ పరస్పరత్వము ప్రకృతియే యేర్పాటు చేసి యుంచినది. మానవులలో కూడ ఆయా ప్రవృత్తులను ప్రకృతియే చేసి యుంచినది గాని, దానిని నిర్వహింపవలసిన బాధ్యత మాత్రము బుద్ధిజీవులైన మానవులపై నున్నది. కనుక బుద్ధిమంతులు మానవుల స్వభావముల యందలి వైవిధ్యమును వర్గీకరించి, వ్యవస్థల నేర్పరచి, జీవితమును సుగమము, బంధ నిర్ముక్తము చేయుచున్నారు. ఈ దర్శనమున ఋషు లీ క్రింది సత్యములను దర్శించిరి. త్రిగుణముల మేళన భేదముచే వైవిధ్యము లున్నవి. అన్నిటి యందును త్రిగుణముల ప్రవర్తనము రూపమున ప్రకృతియే యుండుట వాని యందలి సామ్యము (Common Factor). ఆహార నిద్రా భయాదుల

యందు సర్వజీవరాశులకును సామ్యమున్నది. సుఖేచ్ఛ, జిజ్ఞాస, ముముక్షుత్వము అను వానియందు మానవ బుద్ధి సామ్యమున్నది. ఈశ్వర ధ్యానమునందు సర్వసృష్టి సామ్యము సిద్ధించును. త్రిగుణముల సమ్మిశ్రమము నందలి భిన్నత వలన ఏ వ్యక్తికా వ్యక్తికి ప్రత్యేక లక్షణములు గల స్వభావ మేర్పడును. సృష్టిలో చేయదగిన పనులలో కూడ వేర్వేరు స్వభావములు గల పను లుండును. వానిలో తన స్వభావమున కనుగుణమగు పనులు కనుపించి, "ఇది నా పని" అని యనిపించి, తన స్వభావము నాకర్షించును. (40)

## నాలుగు వర్ణముల స్వభావములు :

ఇట్లు సమాజమునకు వలయు కర్మలలో గుణ సమ్మిశ్ర భేదముచే నాలుగు విధములైన కర్మలు ప్రధానముగా నేర్పడుచున్నవి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల స్వభావముల వర్గీకరణమును, వారి నాకర్షించు కర్మల వర్గీ కరణమును కూడ గుణ సమ్మిశ్ర భేదము వలననే యేర్పడినవి. సృష్టి యందున్న సత్యమును, ధర్మములను, శక్తులను, కాల స్వరూపమును దర్శించుట, వానికి విధేయముగా సర్వజీవరాశుల క్షేమమును సాధించు విధానములను ఏర్పరచి కర్తవ్య బోధ చేయుట, సృష్టి యను మహాగ్రంథమును వేదాది శాస్త్రములుగా తాను అధ్యయనము చేసి, యితరులచే చేయించుట మొదలగు కర్తవ్య మంతయు నొక వర్గమునకు చెందినది. దానికి బ్రాహ్మణత్వము అని పెద్దలు పేరు పెట్టిరి. ఇట్లు బ్రాహ్మణత్వముచే నిర్దేశింపబడిన కర్తవ్యమును ప్రజలచే నాచరింపజేయుచు, వారి క్షేమమును అభివృద్ధిని సాధించి పెట్టుటకు, వారిని కష్టనష్టముల నుండి రక్షించుటకు వలసిన కర్తవ్యమును క్షత్రియత్వ మందురు. జీవుల పోషణమునకై ఆహారాదులను సాధించుట, వానిని పదిమందికి ఆవశ్య కతను బట్టి అందించుట యను కర్తవ్యమును వైశ్యత్వమందురు. మిగిలిన చిన్న చిన్న సేవ లన్నియు చేయుట యను కర్తవ్యమును శూద్రత్వ మందురు. ఆయా కర్తవ్యముల కనుగుణమైన స్వభావము గలవారి నవి యాకర్షించి, వారిచే నిర్వహింపబడుచుండుట ప్రకృతి యందలి యేర్పాటు. (41)

శమము, దమము, తపస్సు, శుచిత్వము, ఓర్పు, సూటియైన ప్రవర్తనము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్య బుద్ధి అనునవి బ్రాహ్మణులకు స్వభావము నుండి

పుట్టిన కర్తవ్యములు. అనగా ఎవని స్వభావమున కివి నచ్చునో అతడు బ్రాహ్మణ ప్రవృత్తి గలవాడు. శమము అనగా మనస్సున కర్తవ్యమే తప్ప కుతూహలములు లేకుండుట. దమము అనగా తన ఇంద్రియముల ప్రవృత్తులు తన బుద్ధి వివేకమునకు లొంగియుండుట. తపస్సు అనగా శరీరము, వాక్కు, మనస్సు అను వానిని సౌమ్యముగా చేయు అభ్యాసము. శౌచమనగా, స్నానాదులతో శారీరక సంశుద్ధి, ప్రశస్తమైన పదార్థములను భుజించుట, పరిసరములను, మనస్సును పరిశుభ్రముగా నుంచుకొనుట మొదలగునవి. క్షాంతి లేక క్షమ యనగా ఇతరులు తనకు చేసిన యపకారమును మానసికమైన చిరునవ్వుతో సహింపగలుగుట. ఆర్జవము అనగా తాను నమ్మినదానిని పలుకుటకు, ఆచరించుటకు జంకకుండుట. జ్ఞాన మనగా సృష్టి యందును, వేదాది శాస్త్రముల యందును గల ఏకత్వమును, సత్యత్వమును దర్శించుట. విజ్ఞాన మనగా వివిధ శాఖల విద్యల అధ్యయనము. ఆస్తిక్యము అనగా ధర్మము, దైవము కలవనియు, ఇతరులలో దైవాంశ కలదనియు, సత్ప్రవర్తనమే దైవ స్వరూప మనియు విశ్వసించుట. **(42)**

శౌర్యము, తేజస్సు, ధైర్యము, దాక్ష్యము, యుద్ధమునందు పారిపో కుండుట, దానము, ఈశ్వర భావము అనునవి క్షత్రియ స్వభావమునకు సహజమైన లక్షణములు. యుద్ధ విద్యలలో నైపుణ్యము, ఇతరులను దమించి అదుపులో పెట్టగల పరాక్రమము శౌర్య మనబడును. ఇవి యున్నను యుద్ధ రంగమున నిలబడగల ధైర్యము లేనిచో ఇవి అన్నియు వ్యర్థమగును. భౌతికముగ యుద్ధరంగముననే కాక, రాజ్య పరిపాలనమున సమస్యల యుద్ధ రంగమున కూడ ధైర్యముగా నిలబడగలిగి యుండుట క్షత్రియున కావశ్యకము. తనలోని ప్రజ్ఞ ఇతరులచే గుర్తింపబడినపుడు దానిని తేజస్సందురు. అదియే కీర్తి యనబడును. దీని వలన తన ప్రత్యక్షమునను, పరోక్షమునను కూడ తన శాసక శక్తి ప్రవర్తించుచుండును. దాక్ష్య మనగా సామర్థ్యము. పరస్పర వ్యతిరేక పరిస్థితులను, శక్తులను, వ్యక్తులను ఒక సమన్వయమున పట్టియుంచి, కార్య నిర్వహణము చేయించుట సామర్థ్య మనబడును. ఆవశ్యకత యున్న వారికి వారి యవసరములను గమనించి ప్రతిఫల మాశింపకుండ ధనాదులను సమర్పింప గలుగుట దాన మనబడును. ప్రభువుల కిది లేనిచో నిష్కామముగా

జీవింపవలసిన బ్రాహ్మణులకు, తమను తాము పోషించుకొనలేని స్థితిలో నున్న ప్రజలకు, భుక్తి కూడ కరువై పోవును. ఈశ్వర భావ మనగా తన గొప్పతనమును ఇతరు లంగీకరించి స్తుతించినప్పుడు గంభీరముగా దాని నంగీకరించ గల్గుట. అట్టి సందర్భములలో వినయపడువాడు ప్రభుత్వమును చక్కగా నిర్వహింపలేడు. **(43)**

భూమిని దున్ని పంటలు పండించుట, పశు సంపదను వృద్ధి చేసి పాలు మొదలైన వానిని సాధించుట వైశ్యుని కనుగుణమైన కర్తవ్యము. వీనితోబాటు ఆహార పదార్థములను ఇతర వినియోగ వస్తువులను సమాజములోని యందరికిని వినిమయము చేయుట కూడ వైశ్యుని కనుగుణమైన కర్తవ్యమే.

పై మూడు వర్గముల వారును ఎవరి పనులు వారు చేయుచుండగా, వారికి సహాయము చేయువారు, చాకలి, మంగలి వంటి సేవలు చేయువారు కూడ నుండవలెను. ఇట్టి సేవాధర్మము శూద్రస్వభావమున కనుగుణమైన కర్తవ్యము. పై కర్తవ్యములు నచ్చి, వాని నాచరించువారు ఆయా వర్ణములకు చెందినవారని కృష్ణుని నిర్దేశము.

చాతుర్వర్ణాత్మకములైన వ్యక్తిగత ప్రకృతులు పితృపితామహక్రమమున లభించి తీరవలెనను నిర్ణయము లేదు. స్వధర్మాచరణము చేయనివాడు రజస్తమస్సుల విపరిణామములను పొంది, వైషమ్యమువలన తన స్వభావమునకు వ్యతిరిక్తులైన తల్లిదండ్రులకు సుతుడుగా జన్మింపవచ్చును. యోగాభ్యాస సంకల్పము గలవాడు మాత్రమే తన ధర్మమున కనుకూలమైన వంశమున జన్మించును. విషమ స్వభావ జన్మముచే వర్ణధర్మ వ్యతిరేకమైన వంశమున జన్మము కలుగవచ్చును. కనుక ధర్మసాంకర్యము కలిగినపుడెల్ల మరల వ్యక్తులు వర్ణధర్మముల లోనికి విభజింపబడుచుండుట ఆవశ్యకము. ప్రకృతి శక్తివలన నట్లు జరుగుచునే యుండును. సాంకర్యము లేని తావులయందు, కాలము లందు కర్మ వాసనల ననుసరించి, ఏ వర్ణమువారు ఆ వర్ణము వారి కుటుంబము ననే సామాన్యముగా జన్మించుచుందురు. స్వభావమునకే ప్రాధాన్య మిచ్చి, స్వధర్మము నిర్ణయించుకొని మానవుడు సంసిద్ధిని పొందవలెను. **(44)**

## స్వభావము - స్వకర్మ :

తన స్వభావమునుబట్టి తా నే వర్గమునకు చెందినవాడో గమనించుకొని తన కనుగుణమైన కర్మాచరణమునందు ఆసక్తితో ప్రవర్తించువాడు సంసిద్ధిని పొందును. ఒకని యభిలాష ఇంద్రియ మనఃప్రవృత్తుల తాత్కాలిక సంసర్గము ననుసరించి మారుచుండును. తన స్వభావము మాత్రము త్రిగుణముల మేళనము ననుసరించి కలుగును. గనుక తాత్కాలిక పరిస్థితుల ననుసరించి మారిపోవుచుండుట యుండదు. పూర్వకర్మ వాసనలు, వాని ననుసరించిన జన్మ పరిస్థితులు అను వానిపై నాధారపడి తన స్వభావముండును. అది పై జెప్పిన నాలుగు వర్ణములలో నొకదానికి చెందియుండును. దాని ననుసరించి అతని కర్తవ్యము నిర్ణయింపబడును. ఆ కర్తవ్య మతనికి స్వకర్మ యగును. స్వకర్మ నాచరించుట ఆ వ్యక్తికి స్వధర్మ మగును. కుతూహలము, అభిలాష యనునవి పరిసరములనుబట్టి, తన ఇంద్రియ మనఃప్రవృత్తులలో కలుగు వికారములనుబట్టి మారుచుండును. వానిని బట్టి తన కర్తవ్యమును ఎన్ను కొన్నచో ఒకనాడు చేసిన పనికి, మరియొకనాడు చేసిన పనికి సంబంధ ముండక, తన జీవశక్తి బహుధా భిన్నమై జీవితము విరిగిన పాలవలె అయి పోవును. విరిగిన పాలు ఆరోగ్యమును పాడుచేయునట్లు, భిన్నమైన జీవశక్తి జీవితమును పాడుచేయును. కనుక మనోవికారమగు అభిలాషను తన స్వభావమున కనుగుణముగా దమించుకొని, స్వధర్మము ననుష్ఠింపవలెను. విద్యాభ్యాసాదులు, స్నేహబృందము, పరిసరములు మున్నగునవి కూడ తన స్వభావమును బట్టియే ఎన్నుకొనవలెను. తన స్వభావము ననుసరించి స్వకర్మా చరణము చేసినవాడు తనకు కావలసిన దానిని పొందునుగాని, సంసిద్ధిని పొందుననుట ఎట్లు పొసగును? ఈ ప్రశ్న నీలో పుట్టినదని నే నెరుగుదును. దాని విధానమును వివరింతును, వినుము. **(45)**

సర్వ జీవరాశుల ప్రవృత్తులును దేనినుండి పుట్టి వెలువడుచున్నవి? ఈ ప్రశ్న వేసికొన్నవానికి తనపై ఒక స్పష్టమైన ఒడుపు సిద్ధించినట్లే. నా ప్రవర్తనము నాలోని త్రిగుణముల మేళనమువలన నేర్పడుచున్నది. ఆ మేళనము నా స్వభావమును బట్టి యేర్పడుచున్నది. నీ విషయమున కూడ నంతే. ఎవని విషయముననైనను వాని ప్రవర్తనకు కారణము త్రిగుణములు, వాటికి

కారణము వాని స్వభావము. అనగా నాలో నున్నదే మరియొకనిలో కూడ నున్నది. ఇట్లందరి స్వభావములును కలిసి, ప్రకృతి యొక్క స్వభావములోని భాగము లగుచున్నవి. ప్రకృతిలోనున్న త్రిగుణములు తనలోకూడ వర్తించు చున్నవి కాని, త్రిగుణములు తన స్వంతము కాదు. తన స్వభావము ననుసరించి తాను స్వకర్మ నెన్నుకొని ప్రవర్తించుచున్నచో, మరియొకనిలోకూడ వాని స్వభావమే పనిచేయుచున్నదని గమనించుట సాధ్యపడును. ఈ గమనింపు వలన ఆవలి వ్యక్తిలోని మంచిచెడులు కనిపించుట మాని, ప్రకృతి యొక్క స్వభావ మనబడు సామ్యము మాత్రమే కనిపించుట ప్రారంభమగును.

తన స్వభావము, అందలి త్రిగుణముల ప్రత్యేక మేళనము గమనించి స్వకర్మను నిర్ణయించుకొనవలెనని పైన చెప్పబడినది. ఇట్లు నిర్ణయించుకొను నపుడు, గమనించుచు నిర్ణయించుకొనువాడగు 'తాను' (The observer I AM) వేరుగా నిలబడియుండుట క్రమముగా అభ్యాసమగును. అనగా తాను త్రిగుణాత్మకమగు తన స్వభావమునకు బద్ధుడైనవాడుగా కాక, వానిని గమనించువాడుగా నిలబడును. ఈ గమనించుచున్న తాను, తన స్వభావ మున కధిపతియైన తానే యని క్రమముగా నమ్మకము చిక్కును. ఇట్లు తన స్వభావమున కీశ్వరుడైన తాను ఇతరులలోని ఈశ్వరుడని గూడ అట్లే గమనింప గలుగును. ఈ మార్గమున సాధన చేయువానికి స్వభావము తన నుండి పుట్టినదనియు, స్వభావమునుండి ప్రవృత్తులు పుట్టినవనియు తెలియును. అనగా ప్రవృత్తులు స్వభావము నుండి పుట్టినవి కాక, తన నుండియే పుట్టినవి అనగా వాని కధిపతి తానే! అట్లే యితరులలో ఈశ్వరుని నుండియే వారి స్వభావములు, వారి ప్రవృత్తులు పుట్టుకొని వచ్చుచున్నవని స్పష్టముగా దర్శన మిచ్చును. ఈ అన్ని 'నేను' లుగా నున్న ఒకే అంతర్యామి ప్రజ్ఞ నుండి ప్రకృతి యంతయు పుట్టుకొని వచ్చుచున్నదని గమనిక కల్గును. దానియందు దృష్టి నిలబడియుండుట తా నా స్థితిని పొందుట. **(46)**

ఇట్టి స్థితిని పొందవలెనన్నచో తన కర్తవ్యమును నిర్ణయించుకొను నప్పుడు దానియందలి గుణదోషములపై మనస్సు నిలుపరాదు. ఈ పని మంచిది, ఈ పని చెడ్డది యను వర్గీకరణము చేయుట యెట్లు? ఇతరులకు మేలు కలిగించునది మంచిపని యనియు, కీడు కలిగించునది చెడ్డపని

యనియు స్థూలమైన విభాగము చేసికొన్నచో కొంతవరకు సత్యము. ఇతరులను చంపకుండుట మంచిపని. కాని ఒక రాజ్యమున తలారి పని చేయువాడు ఎంతమందిని చంపినను అది చెడ్డపని కాదు. సైన్యములో సైనికుడుగా మరింత మందిని చంపినను అది చెడ్డపని కాదు. తనకేదో ఉపకారము జరుగవలెనని అమ్మవారిని కోరుకొని, దానికిగాను వేటపోతును త్రెగవేయుట చెడ్డపని. ఒక మాంస విక్రేత తన యొద్దకు అమ్మవచ్చిన జంతువును కొని, చంపి, దాని మాంసమును పదిమందికి ఆహారముగా అమ్మినచో అది చెడ్డపని కాదు. అందు లాభదృష్టి యున్నను, అది ఆహారముగా వినియోగ పడుచున్నది గనుక, అట్లు వినిమయము చేయుట తన వృత్తి గనుక అది దోషము కాదు. అనగా తన స్వభావమును బట్టి తన కర్తవ్యము నెన్నుకొన్నప్పుడు, అందు తన రాగ ద్వేషాదులు, అహంకార మమకారాదులు పనిచేయనప్పుడు అది ఎంత చెడ్డపని వలె కనిపించినను అది చెడ్డది కాదు.

శమదమాదులతో కూడిన బ్రాహ్మణ ప్రవృత్తికన్న వాణిజ్యము లాభసాటిగా నుండును. దానితో బాటు పదిమందిని పోషించుట యను మంచిపని కూడ జరుగును గనుక, బ్రాహ్మణ స్వభావము గలవాడు వాణిజ్యమున దిగినచో దెబ్బతినక తప్పదు. తన స్వభావమున కనుగుణమైన కసాయి పనినైనను స్థిరముగా నాచరించు వానికి దోషమంటదు. అట్టివాడు ధర్మవ్యాధునివలె మహా జ్ఞానియై, ఉత్తమ గౌరవమునకు పాత్రుడై కర్మబంధ విమోచనము నొంది, పరమాత్మ ననుభవించుచు, బ్రాహ్మణాదులకు కూడ గురువు కాగలడు. (47)

కనుక ఇది మంచిది, ఇది చెడ్డది అను నిర్ణయము మన మనస్సున పుట్టినదే కాని, అక్కడ నున్నది కాదు. ప్రభువై రాజ్యపాలనము చేయుట, నాలుగు పాదములపై ధర్మమును నడిపించుట మంచి లక్షణ మనిపించును. యుద్ధ రంగమున తండ్రులనో, కొడుకులనో వధింపవలసి వచ్చినపుడు ఆ క్షత్రియ ధర్మమే పాపపంకిలము వలె కనిపించును. ఈ కనిపించుట తన మనస్సునకే. బ్రాహ్మణుడై, కుండలధారియై యజ్ఞము చేసి, ఒక పశువును వధించి, సోమయాజి యని పేరు గడించుట ఉత్తమ కార్యమువలె కనిపించును. మేకనో, గొఱ్ఱెనో చంపి, దాని మాంసము నాహారముగా ఇతరులకు ఏర్పాటు చేయుట క్రూర కర్మవలె కనిపించును. ఇట్లేది చూచినను, మంచి చెడు అనునవి

మన చూపునుబట్టి వుండును. ఇది మంచి, ఇది చెడు అను విభేదము మనస్సున నిలబడుటకు తాను చేయు పనియందు చిన్న చూపును (Self - pity), ఇతరుల పనియందు గల ఆకర్షణయు (Glamour), కారణము లగుచుండును. ఈ రంగుటద్దములను తొలగించుకొనినచో మంచి చెడు అనునవి ఆ పనియం దుండవని తెలియును. తనకు మంచిపని, తనకు చెడ్డపని అని యుండును గాని, పనులలో మంచి చెడ్డ లుండవు. తన స్వభావము ననుసరించి, తన వర్ణము ననుసరించి, వయస్సు ననుసరించి తన కనుగుణమైన కర్మ తనకు స్వకర్మ యగును. పనిలో మంచి చెడ్డ లెన్నుట వ్యర్థము. మంచి చెడు అను రెండు లేకుండ ఏ కర్మయు నుండనే యుండదు. పొగ, కొడిగట్టుట లేకుండ దీపము వెలుగుట యుండనే యుండదు. కనుక కర్మలలో మంచి చెడ్డ లెన్నుట మాని, తన స్వకర్మ ఏదో ఎన్నుకొనుట మాత్రమే మానవుడు చేయదగినది. ఇది యొక్కటే వానికి శ్రేయస్సు కలిగించును. (48)

తన స్వభావమున కనుగుణమైన కర్తవ్యము నెన్నుకొని, దాని మంచి చెడులను గూర్చి యాలోచింపక కర్మాచరణము చేయువాడు ఫలాసక్తిని కూడ కలిగి యుండవచ్చును. ఒక్క బ్రాహ్మణ ధర్మమున మాత్రము ఫలితమునం దాసక్తి యుండుట ఎక్కువగా జరుగదు. బ్రాహ్మణ కర్మలలో అన్నియు పరోక్ష ఫలముల నిచ్చునవే గాని, ప్రత్యక్ష ఫలముల నిచ్చునవి లేవు. ప్రత్యక్ష ఫలము లుండవు. కనుక ఫలములయం దాసక్తి యుండుట కూడ ఎక్కువగా నుండదు. మిగిలిన మూడు వర్ణముల వారి కర్మలును ప్రత్యక్ష ఫలముల నిచ్చునని కనుక ఆయా కర్మల నాచరించువారు వాని కనుగుణమైన స్వభావము కలిగిన వారైనను, ఫలితములయం దాసక్తి కలిగియుండుటకు అవకాశమున్నది. ప్రాథమిక స్థాయిలో ఫలితములపై దృష్టి లేనిచో కర్తవ్యముపై నెవ్వరికిని శ్రద్ధ యుండదు. పై జెప్పిన విధానమున వేరు ధర్మము నవలంబించవలె నను చాపల్యము నధిగమించి, తన స్వభావ నియత కర్మమును మాత్రమే ఆచరించుట రెండవ మెట్టు. వారిలో కూడ కర్తవ్యాచరణము నందు నిష్ఠ కుదురుటకు ఫలితములపై ఆసక్తి యుండవలెను. అట్టి ఆసక్తితో స్వకర్మ నాచరించుచు, క్రమముగా ఫలితములపై దృష్టిని సడలించుకొనవలెను. ఇది సమర్పణ బుద్ధివలన మాత్రమే సాధ్యపడును. అనగా జరుగుచున్న పని తన స్వంతము కాదనియు, జగత్కర్మలో

నిదియొక భాగమనియు గ్రహించుట వలన, ఫలితములపై ఆసక్తి క్రమముగా సడలును. తన కర్మను జగత్కర్మకు సమర్పించుకొన్న కొలదియు తన స్వభావమును తనకన్న వేరుగా గమనించ గలుగుట సాధ్యమగు చుండును. తన ఇంద్రియ మనఃప్రవృత్తులు, బుద్ధి అహంకారములతో కూడిన తాను అనబడు మొత్తము (Unit) తాను అనబడు అక్షర పురుషునిలో నొక భాగము మాత్రమే యని గమనించుట జరుగును. అప్పుడు తన స్వభావముపై తనకు స్వామిత్వము లభించును. అట్లు లభించినవాడు ఆచరించునది కూడ తానంతకు ముందాచరించు కర్మయే. స్వంత కర్మగా ఆచరించువాడు చేయు పొరబాట్లు గాని, వానికి గల తాపత్రయము గాని స్వామిత్వము వహించినవానిలో నుండవు. అట్టివాడు దేనినీ ఆశించుట ఉండదు కనుక అంతనియం దున్నది సన్యాసమే.

జగత్కర్మలో భాగమైన తన వంతు పనిని తాను నిర్వహించు చుండును గనుక వాని ప్రజ్ఞకూడ జగత్కర్మలోని భాగమగును. అనగా జగత్కర్మకు అధిపతియగు మహాకాల స్వరూపుడైన పరమ పురుషునిలో భాగమై యుండును. ఇట్లు బ్రహ్మప్రజ్ఞను పొందుటకు వలయు సాధన మార్గమును క్లుప్తముగా వివరింతును. **(49, 50)**

"పరిశుద్ధమైన బుద్ధితో యోగము చెందినవాడవై, ధైర్యముతో నిన్ను నీవు నియమించుకొనవలెను. ఇంద్రియముల నాకర్షించు శబ్ద స్పర్శాదులగు విషయమును వదలివేయవలెను. రాగము, ద్వేషము అను జంట భావనలను తొలగించుకొనవలెను'' అని కృష్ణుని యుపదేశము. బుద్ధి (Will) అను కక్ష్య మనలో విశిష్టమైనది. యుక్తాయుక్త వివేచనము చేసి కర్తవ్యము నిర్ణయించునది బుద్ధి. నిజమున కిది బుద్ధి యను కక్ష్యలోని ఒక భాగము మాత్రమే. దీనిని వివేచనాత్మక బుద్ధి (Discriminative Will) యని పెద్దలందురు. దీనికి పైనున్నది సృజనాత్మక బుద్ధి (Creative Will). వివేచన యనునది మన జీవ పరిణామ సంస్కారము ననుసరించి పనిచేయుచుండును. పూర్వజన్మలలో గాని, ఈ జన్మలో గాని మన కర్మలద్వారా మన మార్జించుకొన్న సంస్కారము లిందు నిలువయుండును. వాని పరిధిలో మాత్రమే యుక్తాయుక్త వివేచన చేయుట సామాన్యముగా జరుగుచుండును. క్లుప్తముగా చెప్పవలెనన్నచో క్రింది స్థాయిలోని బుద్ధి మన స్వభావము ననుసరించియే పనిచేయును. ఈ

స్వభావపు రంగుటద్దములు తొలగించుకొనవలెనన్నచో ఉత్తమ బుద్ధిలోనికి ప్రవేశింపవలెను. ఆ బుద్ధి 'తన'లోని భాగమే! తనయందలి కోశములు, తన స్వభావము లన్నియు తనయందలి భాగములే గాని, అవి తనను నియమింప లేవని గమనించుట ప్రారంభించినవానికి 'తనయందు తా నుండుట' యను ప్రక్రియ ప్రారంభమగును. తాను తానుగా నుండగా, కార్యాచరణమునందు తాను బుద్ధిగా నుండును. ఇట్లు పనిచేయు బుద్ధి విశుద్ధమైన బుద్ధి. తనయందు బుద్ధి యోగము చెందియున్నవానికి తన స్వభావముతో సహా తనయందలి కోశము లన్నియు తనచే నియమింపబడును. ఈ బుద్ధి యను కక్ష్యయందే వ్యాసాదులు మహా భారతాదులను దర్శించి లోకమునకు ప్రసాదించిరి. ఇది సాధించినవాడు నిరంతరము జాగరూకుడై ఇంద్రియముల నాకర్షించు శబ్ద స్పర్శ రూప రస గంధాదులను వదలివేయవలెను. అనగా ఆవశ్యకమైనపుడు సేవించరాదని యర్థము కాదు. వానియందు తనకుగల యాకర్షణను వదలి వేయవలెను. తనకు ప్రత్యేకముగా కావలసినవి, అక్కరలేనివి యను నంశములు తనయం దుండరాదు. ఇంత యుత్తమ స్థితిని సాధించినవారికి కూడ ఇట్టి బలహీనత లుండునాయని సంశయము కలుగవచ్చును. భారత ద్రష్టయగు వ్యాస భగవానుడే కాశిలో తన కాహారము పుట్టనప్పుడు ఆకలితో నలమటించి కాశీపురమునే శపించబోయెను. కుమారుడైన శుకుడు సన్యసించి పోవుచుండగా వ్యామోహముతో వానివెంట పరుగులెత్తెను. ఇట్టి పొరబాటులు సాధన మార్గమున సంభవించుచుండును. గనుకనే నిరంతరము జాగరూకుడై యుండవలెనని హెచ్చరిక చేయబడినది. **(51)**

ఈ సాధన చేయదలచినవాడు ఏకాంతమునే సేవింపవలెను. అనగా అరణ్యములకో, గుహల లోనికో పోయి కూర్చుండుట కాదు. ఇతరు లందరును తన మనస్సులోనే తాండవ మాడుచుండగా, తాను గుహలో నున్నచో ఫలితము లేకపోగా శరీరమును, మనస్సును అనారోగ్యము తినివేయును. తనయందు తాను ధారణ చెందియున్నచో వందలమందిలో నున్నను ఒంటరిగా నుండుట సాధ్యపడును. ఈ సాధనలో నున్నవాడు లఘువుగా భుజింపవలెను. కటిక ఉపవాసాదులతో శరీర ధాతువులను క్షీణింప చేయరాదు. శరీర పోషణకు వలసిన దానికన్న నెక్కువగా భుజించినచో నిద్ర, సోమరితనము మొదలగు

తమోగుణ లక్షణములు ప్రకోపించును. భుజించుట ఆహారమునకే పరిమితము కాదు. ఇంద్రియముల ద్వారా తాను అనుభవింపదగిన సుఖములలో కూడ నీ సూత్రమే వర్తించును. ఇంద్రియముల నెండగట్టుటకాక, వాని కావశ్యక మైనంతవరకు ఆహారము నందింపవలెను. మనము జీవించునది తినుటకే కాదు. ఆహారము శరీర పోషణమునకు, శరీరము కర్తవ్య నిర్వహణమునకు వినియోగపడవలెను. అట్లే ఆనందించుటయే ఇంద్రియముల ఏకైక కర్తవ్యము కాదు. వలసినంతవరకు ఆనందించుచు, కర్తవ్య నిర్వహణమునందు శరీర వ్యూహమునకు వినియోగపడవలెను. తన మాటగాని, కర్మగాని, భావనగాని 'తన' యధీనములో నుండవలెను. అనగా కర్తవ్య రూపమైన స్వకర్మాచరణము నందు అవి వినియోగపడవలెను. తనయందలి కోశములు, తన కర్తవ్యము, తన కెదురగుచున్న సన్నివేశములు, వ్యక్తులు, వారి స్వభావములు - ఇవి యన్నియు ఒకే జగత్కర్మ యందలి భాగము లనియు, తాను కూడ అందలి భాగమే యనియు ధ్యానించుచుండవలెను. ఈ ధ్యానమే చెదరిపోకుండ నిలబడి యుండుటవలన, తనకన్న భిన్నములుగా కనిపించున వన్నియు తనయందు యోగము చెంది యుండును. ఈ ధ్యాన యోగము చెదరి పోకుండుటకు, వైరాగ్యము నాశ్రయింపవలెను. అనగా జగత్కర్మలో తన యిష్టాయిష్టములకు తావులేదని గ్రహించి విశ్వసింపవలెను. (52)

ఈ సాధనలో పాటించి తీరవలసినవి కొన్ని వున్నవి. తనయందు పుట్టుకొనివచ్చుటకు అవకాశమున్న కొన్ని దుర్లక్షణములను సాధకుడు విడువ వలెను. అహంకారము, బలము, గర్వము, కామము, క్రోధము, ఇతరుల సొత్తు తాను పొందవలెనను బుద్ధి- వీనిని తన చెంత చేరనీయరాదు. 'నేను' అను భావమే తప్ప 'ఇది నాది' యను భావమును దేనియందును రానీయరాదు. తనయందు సంచలనములు, కుతూహలములు లేకుండ ప్రశాంతుడై యుండ వలెను. కదలికలేని స్వచ్ఛమైన కొలని నీటిలో సూర్యచంద్ర తారకాదులు, వాని వెనుక యున్న యాకాశము యథాతథముగా ప్రతిఫలించును. అట్లే స్వచ్ఛమై, నిశ్చలమైన తనయందు సృష్టిధర్మములు, వానికి వెనుక నున్న సృష్టికర్తయగు బ్రహ్మయు ప్రతిబింబింతురు. అనగా ఆ బ్రహ్మ తానే! (53)

ఇట్లు బ్రహ్మభూతుడైన వానియందు బుద్ధియు, తానను ప్రజ్ఞయు

ప్రసన్నమై యుండవలెను. అనగా స్వచ్ఛమైన జలమువలె పారదర్శకముగా (Transparent) నుండవలెను. ఈ స్వచ్ఛత లేనిచో బ్రహ్మప్రజ్ఞ తనయందు ప్రతిఫలించుట యుండదు. ఇట్లు లభించిన బ్రహ్మప్రజ్ఞ నిలబడి యుండవలె నన్నచో ఈ స్వచ్ఛత, నిశ్చలత అట్లే నిలబడి యుండవలెను. స్వచ్ఛమై నిశ్చల మైన జలములతో కూడిన సరోవరమున మనము రెండంశములను గమనింప వచ్చును. బాహ్యముగా నున్న నక్షత్ర గ్రహ తారకాదులు, మేఘమాలికలు, వివిధాకృతులలో బారులు తీరి, పయనించు కొంగల జాళ్ళు, వానికి నేపథ్యమై యాకాశము ప్రతిఫలించును. అంతేకాదు; కొలని యడుగు భాగమున నున్న పదార్థ సంచయములు కూడ సవివరముగా కనుపించును. అట్లే ప్రసన్నాత్ముడైన వానియందు సృష్టి ధర్మములు, వాని వెనుకనున్న బ్రహ్మప్రజ్ఞయు ప్రతిఫలించుటయే గాక, తమ శరీర వ్యూహము నందలి వేర్వేరు కోశములలో నున్న వివిధ ధర్మములు, శక్తులు సవివరముగా దర్శన మిచ్చును.

ఇట్టి స్థితిలో నున్నవాడు దేనినీ ప్రత్యేకముగా కోరుట యుండదు. కనుకనే దేని యెడలను శోకించుట కూడ నుండదు. ఈ స్థితి నందుకొన్నవాడు మిగిలిన వారికన్న వేరుగా నుండిపోవు ప్రమాద మున్నది. ఈ ప్రమాదము తప్పవలె నన్నచో భక్తి సాధన యొక్కటే మార్గము. భగవంతుని యెడల మనము చూపెడు భావమును భక్తి యని పామరులు, పండితులు కూడ భావింతురు. 'భక్తి యనగా పరమ ప్రేమ' యని దేవర్షియగు నారదుని నిర్వచనము. భార్య, పుత్రుడు మొదలైన భావముల నాశ్రయించి యుండునది పరిమితమైన ప్రేమ. వారిని తన సాటిజీవులుగా గుర్తించి ప్రేమించుట యుత్తమము. వారందరి యందును భగవంతుడే యున్నాడని గమనించి వారిని సేవించుట పరమప్రేమ. ఇదియే భక్తి. ఇట్లు అందరు వ్యక్తులును, జీవరాశులును కలసి తనతోబాటు ఒకే పరమ పురుషుని యందున్నారని దర్శించి, అట్టి భావనలో వారందరిని సేవించుట పరమ భక్తి యనబడును. సాధన మార్గమున నున్నవాడు తరువాతి మెట్టుగా ఇట్టి పరమ భక్తినే పొందునని కృష్ణుడు వివరించుచున్నాడు. **(54)**

'భక్తి సాధన చేయుచున్నవాడు నే నెంతటి వాడనో, నే నెవడనో, నా తత్త్వమేమో క్రమముగా గ్రహించును. తరువాతి స్థాయిలో నన్ను, నా తత్త్వమును సంపూర్ణముగా దర్శించి అంతరము లేని నా యందు ప్రవేశించును' అని

కృష్ణుని యుపదేశము. దైవమును, వాని శక్తి సామర్థ్యములను, లీలా విభూతులను లెక్కబెట్టుట భక్తి సాధన ప్రారంభదశలో నుండును. ఒక గురువు నాశ్రయించి భక్తి సాధన చేయు శిష్యుడు ప్రారంభదశలో, "మా గురువుగారికి ఇన్ని శాస్త్రములు తెలియును; ఇన్ని విద్యలు తెలియును; ఇంత చక్కగా ప్రవచనములు, ఉపదేశములు చేయగలరు; ఇన్ని శక్తులున్నవి; ఇంత శిష్య వాత్సల్యమున్నది" - ఇట్టి లెక్కలతో గురువునందు తన భక్తికి బలము చేకూర్చు కొనును. అట్లే "వారు పరమగురువులలో నొకరు; పూర్వజన్మలో ఫలానా మహానుభావునిగా జన్మించినవారు మా గురువుగారే!" ఇట్టి లెక్కలతో కొంత కాలము గడచిపోవును. "వారి ప్రణాళిక యిది; ఇంకను ఇంత భాగము మిగిలి యున్నది" అని గురువుయొక్క తత్త్వమును గ్రహించుటకు యత్నించును. ఈ భావనలన్నియు అంతరములు కలిగినవి. అనగా ఒక భావమునకు మరియొక భావమునకు నడుమ అఖాతము లుండును. గురువు వ్యక్తిత్వము నందు తాను గమనించిన లోపములు కొంతకాలము మనస్సున మెదలు చుండును. కొంతకాలము తన స్వంతకర్మలు నిర్వర్తించుకొనుచుండును. గురువును గూర్చి సాధింపదలచిన మహత్కార్యము లనుకొని తాను వేసికొన్న స్వంత ప్రణాళికలు మరికొంత కాలము మనస్సున నిండియుండును. ఇవి యన్నియు భక్తి సాధనలోని అఖాతములు లేక అంతరములు. గురువునుగూర్చి సర్వము తెలియుట అనగా తాను గురువు నందుండుట; నిలబడినను, కూర్చున్నను, భుజించుచున్నను, నిద్రించుచున్నను, ఏ పని చేయుచున్నను తాను గురువు నందుండి, ఆ ప్రజ్ఞతో పనిచేయుటయే జరుగును.

అట్లే భగవంతుని గూర్చి కూడ వాని కళ్యాణ గుణములను, లీలా విభూతులను పరిగణించుకొనుటతో, వానిని గూర్చి వేద శాస్త్రాదులలో తత్త్వము నన్వేషించుటతో భక్తిసాధనలోని ప్రారంభదశ గడచిపోవును. పై జెప్పిన సాధన యంతయు జరిగిన తరువాత భగవంతుని తత్త్వము సంపూర్ణముగా తెలియును. తెలియుట యనగా తాను అందుండుటయే! తనయందు వేరుగా అభిలాషలు పొటమరించనంత కాలము అది అంతరము లేని అఖండ తత్త్వము. ఇదియే జ్ఞాన మనబడును. జ్ఞాన స్థితికి మార్గము భక్తి. ఇట్లు లభించిన

జ్ఞానశక్తి నిలబడవలె నన్నచో కూడ భక్తియే ఆధారము. భక్తి నిలబడి యుండుట జ్ఞానము. భక్తి చెదరిపోవుట అజ్ఞానము. (55)

భక్తి చెదరిపోకుండ నిలబడవలె నన్నచో శరీర వ్యూహమును సోమరిగా నుండనీయరాదు. సోమరియైన శరీరము, దానిని పనిచేయించు ఇంద్రియములు, మనస్సు నిలువనీటి గుంటవలె మురుగెత్తి పోవును. ఇంద్రియ మనశ్శరీరములను నిరంతరము కర్మాచరణమున నియోగించుచునే యుండవలెను. కాని తా నాచరించు కర్మలన్నియు జగత్కర్తయగు భగవంతునికి సమర్పణము గానే ఆచరింపవలెను. భగవంతుడు జగత్కర్మ కధిష్ఠానమైనవాడు. తాను భగవంతుని యందుండుట యనగా, తాను జగత్కర్మలో భాగముగా నుండవలెను. అనగా అందలి భాగముగా తనవంతు పనిని తాను నిర్వహించుచునే యుండవలెను.

సృష్టియం దంతర్యామిగా నున్న నే నను పరమపురుషుని యందు తనను తాను సమర్పణ చేసికొనవలెను. అట్టి సమర్పణబుద్ధితో తాను ఆచరించు కర్మ లన్నిటిని సన్న్యసింపవలెను. సన్న్యాస మనగా వదలివేయుట కాదు. అవి వాని యందున్నవని గమనించి కర్తృత్వమును సన్న్యసించి, ఆచరణమును మాత్రము తాను స్వీకరింపవలెను. ఇట్లు సమర్పణ చెందుటవలన తన బుద్ధి పరమ పురుషునియందు యోగము చెందును. అది తన బుద్ధిగాక, పరమ పురుషునియందలి బుద్ధి యగును. ఈ బుద్ధి యోగము వలన నిరంతరముగా పరమ పురుషుడైన 'నా' యందు చిత్తము గలవాడై యుండును. ఇది యంతయు కర్మాచరణము యజ్ఞార్థ కర్మగా సాగుచుండగనే సాధ్యము కావలెను. తా నెంతకాలము జగత్కర్మలో భాగమై కర్మాచరణమున వర్తించుచుండునో అంతకాలము దాని కధిష్ఠానమగు దైవమునందు పరమ భక్తి నిలబడి యుండును. దైవమునందు పరమభక్తి నిలబడియుండుట యనగా అది తానై యుండుట. ఇది జ్ఞాన స్థితి యనబడును. (56, 57)

ఇట్లు తన చిత్తమును తాను వేరుగా నుంచుకొనక అంతర్యామినైన నాయందు సమర్పించినచో నా యనుగ్రహము లభించి అన్ని విధములైన అడ్డంకులను అధిగమింప గలుగును. సామాన్య మానవులకు అడ్డంకు లనునవి

బాహ్యాలోకమున వ్యక్తుల నుండి, సన్నివేశముల నుండి కలుగుచున్నట్లు కని పించును. తనయందు తానున్న వానికి సన్నివేశములు, వ్యక్తుల ప్రవర్తనలు మాత్రమే బాహ్యాలోకమున నున్నవనియు వానిని సమస్యలుగా చూచుట తన యందున్నదనియు తెలియును. అనగా తన స్వభావము నందలి ముడులలోనే సమస్యలున్నవి గాని, బయట ఎక్కడను లేవు. అంతర్యామి ప్రజ్ఞయందు తన చిత్తమును సమర్పణ చేసినవానికి చిత్తము కలకదేరి ప్రసన్నమగును. ఈ ప్రసన్నత వలన తన యందలి ముడులను తానే విప్పుకొనుటకు సాధ్యపడును. ఏ సమస్యనైనను విడమరచి చూచుకొన్నచో, తన యందలి ఏదోయొక అభిప్రాయమే పరిష్కారమునకు అడ్డముగా నిలబడి యున్నదని తెలియును. ఇట్లు తెలియుట చిత్తము కలకదేరినప్పుడే సాధ్యపడును. తన స్వభావమునకు బద్ధుడై యున్నవానికి చిత్తము కలకదేరి యుండుట సాధ్యము కాదు. తాను తన యందుండి, తన స్వభావమున కతీతుడై యుండవలెను. అట్లుండియును తన స్వభావమునకు అనుకూలమైన పనిని చేయుచునే ఉండవలయును. ఇది సాధ్యము కావలెనన్నచో తనను తాను జగత్కర్మ యందు సమర్పణ చేసికొనవలెను. స్వభావమునకు బద్ధుడైనవాడు తన అభిప్రాయముల చిక్కు ముడులలో చిక్కుకొని, తన స్వభావమునకు అనుకూలమైన పనినే చేయలేక పోవును. తన స్వభావము తనయందు లీనమై, తాను జగత్కర్మ యందు సమర్పణ చెందినవానికి అభిప్రాయములు వేరుగా నుండవు గనుక సమస్య లుండవు. జగత్కర్మ యందలి భాగముగా తనవంతు యజ్ఞార్థ కర్మను తన స్వభావము ననుసరించి చేయుచుండును. కనుక జీవితమంతయు భగవంతుని ప్రసాదముగా గడచును.

ఇందే భాగమునందైనను ఇది తాను చేయవలెనని గాని, చేయవలదని గాని, ప్రత్యేకమైన అభిప్రాయము నిలబడి వున్నచో దానిని అహంకార మందురు. తన స్వభావము యొక్క రంగు పులుముకొన్న పరిమిత ప్రజ్ఞయే అహంకారము. అది పనిచేయుచున్నప్పుడు అభిప్రాయములు, ఆవేశ కావేశములు మొదలగున వన్నియు సుడిగుండములై గిర గిర త్రిప్పుచుండును. అనగా తాను అను ప్రజ్ఞ నాశన మగుటయే. (58)

ఇట్టి అహంకారముతోనే మమకార మను భావమునందు చిక్కు

బడిపోయిన అర్జునుడు తాను యుద్ధము చేయరాదని భావించుచున్నాడు. కాని ఈ ప్రయత్నము వ్యర్థము. క్షత్రియునకు సహజమైన రజోగుణ స్వభావము అర్జునుని యందున్నది. శత్రువులు అవహేళన చేసినచో, ఆ రజోగుణము ప్రచోదితమై క్రోధావేశములతో అతడు యుద్ధము చేయకుండ ఉండలేడు. తాను చేయవలసిన పనిని ఎట్లును చేయక తప్పదు. తాను తానుగా నుండి ధర్మార్థమైన యుద్ధములో ఉత్సాహముతో యుద్ధము చేసి అధర్మమును దమింపగల చక్కని అవకాశము అతనికి లభించినది. దానిని కాదని తిరస్కరించినచో తాను కర్తవ్య భ్రష్టుడగుట మాత్రమే మిగిలివుండును. తన స్వభావము పనిచేసి క్రోధావేశములతో కలుషితమైన యుద్ధము చేయుట మాత్రము ఎట్లును తప్పదు. తనకు భ్రష్టమైన యోగస్థితి మాత్రము మిగులును. (59, 60)

సృష్టి యందలి జీవరాశులలో ప్రతియొక్క జీవియందును నేను అను కేంద్ర ప్రజ్ఞ యున్నది. అది దేవుని ప్రతినిధియగు జీవప్రజ్ఞ. ఆ జీవప్రజ్ఞ వేర్వేరు జీవులలో వేర్వేరుగా నుండును. ఆ జీవప్రజ్ఞకు కేంద్రస్థానమున 'నేను' అను దేవుని ప్రజ్ఞ యున్నది. ఈ జంట ప్రజ్ఞలకు నివాస స్థానము హృదయము. దేవుని ప్రజ్ఞ ప్రేమమయము. ఆ ప్రేమశక్తి వలననే హృదయము కేంద్రముగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు మున్నగు ప్రాణవ్యాపారములు నడచుచున్నవి. దేవుని ప్రేమకు మరియొక రూపము మాయ. అనగా లేనిది యున్నట్లు కనిపించు భ్రాంతి (Illusion). నిజముగా శరీరమున స్థిరముగా నిలబడియున్న పదార్థ మేదియు లేదు. కోట్ల కొలది యణువులు నిరంతరము కూర్పు చెందుచుండగా శరీరము నిలబడియున్నది; ఈ శరీర మెంతకాలము నిలబడి యుండవలెనో నిశ్చయించి, అంతకాలమును జీవవ్యాపారములు నడచు నేర్పాటు చేసినవాడు లోనున్న 'నేను' అనబడు దేవుడు. నాలుకకు రుచి యనుదాని నేర్పాటు చేయుటవలన మానవుడు ఆహార స్వీకరణము తన స్వంత పనిగా భావించి, శరీర పోషణమును నడపుచున్నాడు. అట్లే స్త్రీ-పురుష జీవుల సంయోగమువలన ఆయా జీవులకు శరీరములు తయారగుట ప్రకృతికి కావలసిన పని. ఈ పనిని కర్తవ్యముగా భావించి చేయుచున్నచో అది నిర్లక్ష్యము చేయబడును. కనుకనే ప్రకృతి జీవులకు కామము నేర్పాటు చేసినది. తమ కామ పరితృప్తికై

జీవులు సంగమించుచు, సృష్టి ధర్మమును నిర్వర్తించుచున్నారు. తనది కాని పనిని తనదిగా పొరబడుటయే మాయ యనబడును.

దేవుని సృష్టిలో నున్నది నీ వొక్కడవే కాదు. నీవంటి కోట్ల కొలది మానవులు, ఇంకను లక్షల జీవరాశులు నున్నారు. వారు కూడ బ్రతుకవలెను గదా! వారియందును కేంద్ర ప్రజ్ఞగా దేవుడున్నాడు. వారి కందరికిని ఆహారమును దేవుడు ప్రతిదినము ముద్దలు చేసి యందింపలేడు. కనుక ఈ జీవులే ఒకరికొకరు సహకరించుకొనుచు బ్రతుకవలెను. పరస్పర సహకారము లేనిచో జీవరాశులు నశించిపోవును. "మీరందరు ఒకరితో నొకరు సహకరించు కొనవలెను" అని యాజ్ఞ పెట్టినచో నెవ్వ డాచరించును? కనుక భార్యాభర్తలు, పితాపుత్రులు మొదలగు సంబంధములను, వారి నడుమ మమకారాదులను ప్రకృతి సృష్టించి యిచ్చెను. ఇట్టి భావములతో మానవులు తమ స్వంత పనిగా భావించి పరస్పరము సహకరించుకొనుచు బ్రతుకుచున్నారు. ఒక యువతిని తన భార్యగా భర్త భావించునే గాని, నిజమున కామె యందు భార్యాత్వము లేదు. ఆమె ఒకనికి కుమార్తె, ఒకనికి సోదరి, మరియొకనికి తల్లి, తనకు భార్య. కనుక ఆమె యందు భార్యయను పదార్థమేమియు లేదు. కాని తా నామెను భార్యగాను, ఆమె తనను భర్తగాను భావింపనిచో సృష్టి క్రియ జరుగదు. వారికి పరస్పరము కావలసిన సహకారము లభింపవలె నన్నను ఇది తప్పదు. దేవుడు ప్రేమమయుడు. మమకారములు, ఆపేక్షలు మున్నగునవి ప్రేమకు ఛాయా రూపములు. ఛాయారూపముగా నైనను ప్రేమల నిచ్చిపుచ్చుకొనుట లేనిచో మానవుడు బ్రతుకలేడు. వ్యక్తుల నడుమ సంబంధములే భ్రాంతియైనపుడు, వారి నడుమనున్న మమకారాదులుకూడా భ్రాంతిమూలకములే! కాని యీ భ్రాంతి లేనిచో మానవునికి మనుగడయే లేదు. ఈ భ్రాంతినే వేదాంతులు 'మాయ' యని నిర్దేశించిరి. కృష్ణుడుకూడా ఆ పదమునే వాడెను.

ఈ సృష్టియను మహాయంత్రమున వేర్వేరు సమాజము లనబడు ఉపయంత్రము లున్నవి. మానవు లందరును యంత్రములలోని వివిధ భాగముల వంటివారు. యంత్రములో ఒక చక్రము నింకొక చక్రమును త్రిప్పును. అట్లే ఒక్కొక్క చిన్న భాగము మరియొక చిన్న భాగమును నడిపించును. ఈ యంత్రమునకు ప్రచోదనము 'మోటారు' నుండి లభించును. అది

మానవుని హృదయము వంటిది. అది పనిచేయుటకు విద్యుత్తు కావలెను. అది మానవులలో ఒక స్థాయిలో ప్రాణశక్తి యనియు, మరియొక స్థాయిలో ప్రేమ యనియు పిలువబడును. ఈ ప్రేమ తన మాయా రూపములైన మమకారాది రూపములలో మానవ స్వభావములో నుండి, ఒకరినుండి యొకరికి ప్రసరించుచుండును. ఇట్లు తనయందున్న దేవుని ప్రజ్ఞను ఈశ్వరుడు (Lord) అని కృష్ణుడు సంకేతించెను. తనయందు వలెనే సర్వజీవుల యందును గల 'నేను' అను దేవుని ప్రజ్ఞను కూడ ఈశ్వరుడను పేరనే (Lord of Lords) కృష్ణుడు సంకేతించెను. అతడు సృష్టి యంత్రమును ఏర్పాటుచేసి, సృష్టి జీవులను అందలి భాగములుగా రూపొందించి, తన ప్రేమను మాయగా వారి యందు ప్రసరింపజేయుచు వారిచే పనిచేయించు చున్నాడు. **(61)**

అట్టి పరమేశ్వరునియందు తనను తాను సమర్పణము చేసికొని జీవించుట అఖండమైన శాంతిని ప్రసాదించును. తనను తాను సమర్పణము చేసికొనుట యనగా తనయందు కలుగు సర్వ భావములను వానియందు సమర్పించుట. అనగా దుఃఖమును, ఇబ్బందిని కలిగించు భావములను మాత్రము వానికి సమర్పించి, సుఖ భావములను తానే ఉంచుకొనుట అవకాశ వాద మగును గాని సమర్పణము కాదు. తనకు కలుగుచున్న భావము లన్నియు సృష్టి ధర్మముల యందలి భాగమే యనియు, ఇవి యన్నియు 'మాయ' వలన పుట్టుచున్నవనియు, ఆ మాయకు మూలము దేవుని ప్రేమ యనియు గ్రహించి నమ్మినచో క్రమముగా సృష్టియందు అంతర్యామిగా నిండియున్న మాయయు దాని దివ్యలీలా వైభవమును దర్శన మిచ్చును. ఈ మాయ సృష్టి యున్నంత కాలము శాశ్వతము. సృష్టి లయమైన తరువాత కూడ మాయ- యుండును గాని పరమ పురుషుని యందు నిద్రించుచుండును. దానికి వెనుక నున్న ప్రేమ కూడ సృష్టియందు మాయగా క్రియాత్మకము (Active)గా నుండి, ప్రళయము నందు, పరమ పురుషుని హృదయము నందు ప్రేమగా నిశ్చలము (Passive)గా నుండును. కనుక సర్వజీవరాశుల యందలి ఈశ్వరునకు తన భావములు, భావ వికారములు అన్నింటిని సమర్పించినవాడు దేవుని ప్రేమను, దాని క్రియా రూపమగు మాయను, దాని దివ్యవైభవమును రుచి చూడ

గలుగును. అప్పుడు అత డనుభవించునది అఖండమైన శాంతి. దేవుని ప్రేమ శాశ్వతము గనుక అతడు పొందునది శాశ్వతమైన స్థానము. (62)

అర్జునా! ఇంతవరకు నీకు అఖండమైన జ్ఞానము నుపదేశించితిని. ఇది రహస్యములలో నెల్ల రహస్యమైనది. దీనిని అశేషముగా విమర్శించుకొనుచు, నీ కిష్టమైనట్లు ప్రవర్తింపుము" అని కృష్ణుడు హెచ్చరించెను. జ్ఞాన మనగా తానేయని కృష్ణుని యుపదేశము. ఇది తనయందు దాగియున్నది గనుక, రహస్యము తానేగాక సర్వజీవుల యందును రహస్యముగా దాగియున్న 'నేను' అను జ్ఞానము గనుక, నిది రహస్యములలో కెల్ల పరమరహస్యము. దీనిని చక్కగా అవగాహన చేసికొనవలెను. అవగాహన మనగా మునిగిపోవుట యని యర్థము. ఈ పరమ రహస్యమగు జ్ఞానమును గ్రహించునపుడు అది తన యందున్నదనియు, తాను జ్ఞానము నందున్నాననియు దర్శనము కావలెను. అనగా అది తానుగా, అనుభూతి (Experience)గా నుండవలెను. అంతేగాని గ్రహించుచున్న తాను వేరుగా మిగిలి వుండరాదు. కనుకనే ఆశేషముగా గ్రహింపవలెనని కృష్ణుడు హెచ్చరించెను. అప్పుడు కర్త యను భావమున తాను అహంకారముగా మిగిలియుండడు. తన ఇచ్ఛ ప్రకారము అనగా దేవుని యిచ్ఛ ప్రకారము పనిచేయుట వుండును. కనుకనే రెండవ, మూడవ యధ్యాయములలో "నీవు యుద్ధము చేసితీరవలెను." అని ఆదేశించిన కృష్ణుడు, ఈ చిట్ట చివరి వాక్కుగా, "నీ యిష్టము వచ్చినట్లు చేయుము" అని వదలివేసెను.

శిష్యుల యెడ సద్గురువు ప్రవర్తన మిట్లే యుండును. కర్తవ్యము నిర్దేశించునపుడు "ఈ పని యిట్లు చేయుము" అని ఆదేశించును. శిష్యుడు దాని వివరణము కోరినచో, దానికి సంబంధించిన జ్ఞానము నుపదేశించును. ఆ తరువాత మాత్రము నిర్ణయమును వానికే వదలివేయును. (63)

## గురుశిష్య యోగము :

ఇంతవరకు ఉపదేశింపబడిన జ్ఞానము రహస్యములలో కెల్ల రహస్యమే గాని, అది సర్వజనులకును ఉపదేశింపబడినది. దీనిని మించిన జ్ఞానము లేదు. కాని దీనికిపైగా మరియొక ఉపదేశమున్నది. అది యెల్లరకును

ఉద్దేశించినది కాదు. ఒక గురువునకు విధేయుడై, చెప్పినది చెప్పినట్లుగా నిస్సంశయముగా, నిస్సంకోచముగా ఆచరింపగల సమర్పణబుద్ధి గలవానికే యీ యుపదేశ ముద్దేశింపబడినది. అట్టి శిష్యుడు గురువునందు ఇష్టము గలవాడై యుండవలెను. అనగా గౌరవముతో కూడిన పూజ్యభావమే గాక, ప్రేమతో కూడిన ఇష్టము కూడ గురువు నెడల ఉండవలెను. ఈ యిష్టము గట్టిగా నుండవలెను. అంతేగాక వాని సంకల్పము చెదరిపోవనిదై దృఢముగా నుండవలెను. అట్టివానికి మాత్రమే యీ చెప్పబోవు చరమోపదేశము వర్తించును. దీనిని స్వీకరింపగలిగిన ధైర్య మున్నవానికి ఈ యుపదేశము హితమును (క్షేమమును) చేకూర్చును. **(64)**

ఈ చరమోపదేశమును కృష్ణు డిట్లు నిర్దేశించెను. "నీ మనస్సును నా కర్పణ చేయుము. నాయందు భక్తుడవై నన్ను పూజింపుము. నన్ను యజ్ఞ మూర్తిగా నారాధించి, నీ సమస్తమును నాకు సమర్పణ చేయుము. అప్పుడు నన్ను నీవాడుగా పొందగలవు. నీవు నా యందు ఇష్టుడవని నీకు ఈ వాగ్దానము చేయుచున్నాను.''

ఇంతవరకు 'నేను' అను పదము ఈ క్రింది మూడు స్థాయిలలో నేదోయొక స్థాయిలో ప్రయోగింపబడినది. 1) వసుదేవుని పుత్రుడైన కృష్ణుడుగా చాలా కొద్ది సందర్భములలో ప్రయోగింపబడినది. 2) జీవుడు అను నర్థమున కొన్ని సందర్భములలో ప్రయోగింపబడినది. 3) పురుషోత్తముడు, పరమ పురుషుడు, అంతర్యామి ప్రజ్ఞ యను నర్థమున మరికొన్ని సందర్భములలో ప్రయోగింపబడినది.

ఈ చరమోపదేశమున 'నేను' అను పదము ఒక వ్యక్తి యందు నిష్టమై యున్న గురువు అను ప్రజ్ఞను నిర్దేశించును. దైవమును శివుడుగానో కృష్ణుడు గానో భావించి పూజించుట, వానికి సమర్పణము చేయుట కొంత తేలిక. నామరూపాదుల కతీతుడైన అంతర్యామి ప్రజ్ఞకు సమర్పణము చేయుటకూడ కొంత సుళువుగనే యుండును. తాను మానవుడు గనుకను, తాను సమర్పణము చెందుచున్న మూర్తి లేక ప్రజ్ఞ దివ్యము గనుకను ఇట్టి సమర్పణము నందు అభిమానపడుట యుండదు. దేవుని ముందు నిలబడి ఏకాంతమున

తాను చేసిన పాపములను ఏకరువు పెట్టుటకు మనము జంకము. ఎంత మహానుభావు డైనను ఒక వ్యక్తిముందు చెప్పుటకు అభిమానము అడ్డువచ్చును. అట్లే ఒక వ్యక్తి యెంత గొప్పవాడైనను వానికి శరణాగతి చెందుట, వానిని పూజించుట అవమానముగా భావింతుము. ఈ యభిమానము, అవమానము అను భావవికారములు (Complexes)ను అధిగమించుటకు ఒక వ్యక్తియందు ఈశ్వరు నంగీకరించి శరణాగతి చెందుట తప్పనిసరియైన సాధన మార్గము. ఆధ్యాత్మిక సాధన గురుశిష్య యోగముగా సాగవలసినదే గాని, తనకు తానే సాధించుకొనుట వట్టిమాట.

ఇట్లు గురువునకు శరణాగతి చెందుటయే తప్పనిసరియైనచో ఉత్తముడై పాత్రుడైన గురువునకే నమస్కరించుట శ్రేష్ఠమని కొందరి భావన. ఇది పైన చెప్పుకొన్న దురభిమానము (Complex)కే మరియొక రూపము. గురువు ఉత్తముడు, పాత్రుడు, అగునో కాదో నిర్ణయించునది తానేకదా! ఉత్తమత్వము నకు, పాత్రతకు కొలమానములు నిర్ణయించునది తానే! ఒక త్రాగుబోతు తనకన్న గొప్ప త్రాగుబోతును గురువుగా నంగీకరించును. గ్రుడ్డిలో మెల్లవలె కొంత వివేకవంతుడైనచో, మద్యపానము మానివేయగలిగిన యొక త్రాగు బోతును గురువుగా నంగీకరించును. ఒక కవి కుమారుడు ఒక మహాకవిని గురువుగా స్వీకరించును. వేదము కొంత చదివినవాడు ఘనా జటాపాఠి యగు పండితుని గురువుగా నంగీకరించును. ఇవి అన్నియు ఒక్క కోవకు చెందినవే! గురువును పాత్రత ననుసరించి, ఉత్తమత్వము ననుసరించి తాను ఎంపిక చేసికొనదలచిన వారందరూ ఆ కోవలోని వారే! గురువును తాను కొలమానము చేసి పాత్రత నిర్ణయింపగలిగినచో నతడు గురు వెట్లు కాగలడు? ఆధ్యాత్మిక సాధనలో తనకన్న ఉన్నత స్థాయిలో నున్నవాడే తనను సాధన మార్గమున నడిపించగలుగును. తనకున్న క్రింది సాధన స్థాయిలో నున్నవారిని మాత్రమే తాను గుర్తింపగలుగును. గురువునుగూర్చి శిష్యునకు తెలిసినదానికన్న తెలియని భాగమే చాల ఎక్కువగా నుండును. అప్పుడు మాత్రమే ఆ గురువు తనను నడిపించగలుగును.

మరి మార్గమేమి? కనబడిన అడ్డమైన ప్రతి వ్యక్తిని గురువుగా భావించి మ్రొక్కవలెనా? ఈ మ్రొక్కిన వ్యక్తి క్షుద్రుడైనచో తన గతి యేమి? గురువు

అనగా నొక వ్యక్తి కాదనియు, ఒక వ్యక్తిద్వారా ప్రవర్తించు ఈశ్వర ప్రజ్ఞ యనియు తెలియుట ఈ సమస్యకు పరిష్కారమును ప్రసాదించును. సర్వ జీవరాశుల యోగక్షేమమును వహించు దేవుడు, సాధన మార్గమున నున్నవారి కొరకు గురువు అను ప్రజ్ఞగా ప్రవర్తించును. ఈ గురువు అను ప్రజ్ఞ ఎవరిద్వారా నైనను పనిచేయవచ్చును. సాధన మార్గమున పై స్థాయిలోని సాధకులు క్రింది స్థాయిలోని సాధకుల గురువుగా ప్రవర్తించుట సామాన్యమైన యేర్పాటు. ఈ గురు పరంపరలతో కూడిన వ్యవస్థను పరమగురు వ్యవస్థ యందురు. ఇందు ఒక్కొక్క సాధకునకు తన క్రింది స్థాయిలోని శిష్యులు కొందరు యేర్పాటు చేయబడి యుందురు. సమయము, సందర్భముల నెరిగి గురువే శిష్యుని స్వీకరించును. అంతవరకును వేచియుండుటయే సాధకుడు కాగోరిన వాని కర్తవ్యము. సత్ప్రవర్తనము, బాధ్యతలను సక్రమముగా నిర్వర్తించుట, ఆపదలో నున్నవారికి ప్రతిఫలాపేక్ష లేకుండ సేవ చేయుట, పెద్దల యెడల వినయము, విధేయత కలిగియుండుట మొదలైన లక్షణములతో తన పాత్రత కల్పించు కొనుట అతని కర్తవ్యము.

ఇట్టి యోగ్యుడైన శిష్యుడు గురువుచే స్వీకరింపబడిన తరువాత నతడు సాధకు డనబడును. ధర్మాధర్మములు, పాపపుణ్యములు, యుక్తాయుక్తములు మొదలగు నంశములలో నాతడు గురువు నుండి వివిధ మార్గములలో ఉపదేశము పొందుచునే యుండును. ఎంత జ్ఞాన మార్జించినను తన కర్తవ్య నిర్ణయము చేయునప్పుడు తన స్వభావము స్వల్పముగానైనను పనిచేయక మానదు. తన స్వభావ మను సాలెగూటినుండి తప్పించుకొనవలె నన్నచో ప్రత్యక్షముగా గురువుకు శరణాగతి చెందుట యొక్కటే మార్గము. తన మనస్సును గురువుకు సమర్పించవలెను. అనగా తనయందు పుట్టుచున్న భావములను గురువునకు నివేదించు చుండవలెను. గురువునే దైవముగా భావించి పూజింపవలెను. గురువున కెట్లును స్వార్థమనునది యుండదు గనుక ఆయన జీవితము యజ్ఞార్థము గనుక, ఆయననే యజ్ఞ స్వరూపునిగా అర్చింపవలెను. తన యందలి భావవికారములు తొలగిపోవుటకు గాను గురువుకు సాష్టాంగ నమస్కారములు చేయుచుండవలెను.

ఇట్లు సాధన చేయుచున్నవాడు నిశ్చయముగా గురువునే తనవాడుగా పొందును. అనగా తనయందు గురువుయొక్క ప్రజ్ఞ నివసించును. కొంత కాలమునకు తన ప్రజ్ఞయే గురువు అను ప్రజ్ఞగా వికసించును. తన గురువు నెడల భక్తి ప్రపత్తులు కలిగి వాని ప్రజ్ఞయందు నివసించుచుండగా గురువు యొక్క ప్రజ్ఞ తనయందు నిండియుండును. గులాబ్‌జామ్ పంచదార పాకములో నుండగా, దానియందు పాకముండును. పాకములోనుండి తీసి వేరుగా నుంచినచో దానిలోని పాకము ఎండిపోవును. అట్లే గురువునందు తా నున్నంత కాలము తనయందు గురువు తనవాడుగా నివసించి యుండును. **(65)**

“నీ వెరిగిన ధర్మముల నన్నింటిని పరిత్యజించి నన్ను ఒక్కడినే శరణు పొందుము. అప్పుడు నిన్ను సర్వపాపముల నుండియు నేను తప్పించెదను. నీకు పాపస్పర్శ యుండదు గనుక దుఃఖింపవలసిన యావశ్యకత నీ కుండదు” అనునది చరమోపదేశము నందలి రెండవ భాగము. ధర్మములను పరిత్యజించుట యనగా అధర్మము నాశ్రయించుట కాదు. కర్తవ్య నిర్ణయము నందు ధర్మాధర్మ వివేచనము తాను స్వంతముగా చేయుట మానవలెను. దానిని నిర్ణయించు నధికారము నింకొకని యందు వదలివేయవలెను; అనగా సన్న్యసింపవలెను. అటుపైన ఆచరించుటకు, మానుటకు తన నిర్ణయ ముండదు. “నన్ను శరణు చెందుము” అనగా గురువు నందుగల ‘నేను’ అను ప్రజ్ఞయందు శరణు చెందుట. భౌతికముగా ఒక వ్యక్తిని గురువుగా నంగీకరించి, వానియందు గురువు అను ప్రజ్ఞ యందు శరణు చెందుట. ఎంతటి గురువు నందైనను స్వల్పమైన లోపము లుండవచ్చును. లేకున్నను శిష్యుని చూపును బట్టి కొన్ని లోపములు కనుపించవచ్చును. అప్పుడు “నా కిట్లు చెప్పుచు, తాను వేరు విధముగా ప్రవర్తించుచున్నాడేమి?” యను ప్రశ్న పుట్టుట కవకాశ మున్నది. కనుకనే భౌతికమైన గురువునందు గల గురుత్వమును, అనగా నేనను ప్రజ్ఞను, శరణు చెందవలెను. ఇట్లు శరణాగతి చెందునపుడు చిట్ట చివరి బంధము కూడ వీడిపోయి, అన్ని జీవులలో నున్న నేనను ప్రజ్ఞను దైవముగా దర్శించుట సాధ్యపడును. ఈ దర్శనము వలన తన ప్రవర్తనయందు తనకు కారణము (Motive) లుండుట తొలగిపోవును. తనయందు కారణములు లేవుగనుక

పాపముండదు. తన యభిప్రాయముల బంధములు కర్తవ్యాచరణములో నుండవు గనుక అదియే మోక్షస్థితి. ఆ స్థితిలో దిగులుండదు. (66)

ఈ చరమ రహస్యమును భక్తి లేనివానికి, తపస్సు లేనివానికి, శుశ్రూషను అంగీకరింపనివానికి, నా యందు అసూయ గలిగినవానికి తెలుపరాదు. శుశ్రూష యనగా వినుటయందు ఆసక్తి. తనకు తోచినదే వేదము కాక, ఇతరులు చెప్పగా వినవలెనను ఆసక్తి వినయమును సూచించును. ఇంకొకరి హృదయమున ఈశ్వరు డుండుట యోగ సాధనలో నున్నవారికి తెలియును గనుక, అందరి వాక్కుల నుండియు ఈశ్వర వాక్కును వినుట తెలియవలెను. ఇది యొక గురువు చెప్పుట, తాను వినుట యను ప్రక్రియ ద్వారా మాత్రమే సాధ్యము. గురువునందు భక్తి లేనిచో చెప్పినది మంచి మాట యైనను తన మనస్సు వైముఖ్యము చెందును. శరీరము, వాక్కు, మనస్సు అనువానిచే చేయదగిన మూడు విధములైన తపస్సు ఇంతకుముందు వివరింపబడినది. అట్టి తపస్సు నాచరించి మనస్సు, వాక్కు, శరీరము అను వానిని పరిశుద్ధము చేసికొన్నవానికే ఈ యుపదేశము పొందుటకు పాత్రత వుండును. లేనిచో కిలుముపట్టిన పాత్రలో నీరువలె, ఇట్టి అపాత్రునకు చేసిన యుపదేశము అపకారమునే కలిగించును. “నా కొకడు చెప్పువాడు, నేను వినువాడనా?'' అను అసూయా బుద్ధి లేనివానికే యోగసాధనలో స్థాయి చిక్కును. దానికి మొదటి మెట్టుగా గురువు నెడల ఇట్లు దురభిమానము పడకుండ శిష్యుడు సాధన చేయవలెను. ఇది వదలిపోనిదే, “నాకు సాష్టాంగ నమస్కారము చేయుము'' అను ఉపదేశమును శిష్యుడు పాటింపలేడు.

ఇన్ని యధ్యాయములలోను ఎన్నో మహా రహస్యము లుపదేశింపబడినవి. ఏ సందర్భమునను, “ఇట్టి వానికి ఈ యుపదేశము చేయరాదు'' అను నిషేధము చెప్పబడలేదు. ఎంతటి రహస్యమైనను, ఉపదేశము పొందినవాడు పాటించినచో బాగుపడును. లేనిచో నష్టము లేదు. ఈ చరమోపదేశము మాత్రము అపాత్రుడైన వానికి చేసినచో వాడు బాగుపడకపోగా, గురువును దూషించుట వంటి చెడ్డపనుల వలన మరింత అధోగతి లోనికి పోవును. కనుకనే కృష్ణుడీ యుపదేశమును వాచ్యముగా కాక, కొంత వ్యంగ్యముగా ధ్వని మార్గమున ప్రసాదించెను. (67)

"ఈ చరమ రహస్యమును నా భక్తులయందు అనుసంధానము చేయువాడు, నా యందు భక్తిని పెంపొందించుచు నన్నే పొందుచున్నాడు. ఇందు సందేహ మేమియు లేదు. దీనిని అనుసంధానము చేయువాని కన్న నా కెక్కువ ప్రియుడు మానవులలో నుండడు. ఇక ముందు కూడ అట్టివాని కన్న నా కెక్కువ ప్రియుడుండడు."

ఇది రహస్యములలో కెల్ల పరమ రహస్యము, చరమ రహస్యము. దీనిని అనుసంధానము చేయుట యనగా గురు శిష్య సంయోగము జరుగుట. ఈ విద్య నుపదేశము చేయవలెనన్నచో పాత్రుడైన శిష్యుడు లభింపవలెను. అనగా తనకు శిష్యుడుగా నేర్పాటు చేయబడిన సాధకుని పాత్రుడుగా తాను తీర్చిదిద్దవలెను. ఇది కష్టములలో కెల్ల కష్టమైన పని. ఇట్టి దానిని సాధించి, వానికి చరమోపదేశము చేయుట, అటుపైన వానిని సాధన మార్గమున నడిపించగలుగుట అత్యంత సున్నితము, క్లిష్టము నగు మహాకార్యము. దీనిని సాధించి తరము నుండి తరమున కందించగలుగుట యనగా, యోగ విద్య యను బ్రహ్మసూత్రమును సామాన్య సాధకుని నుండి, పరబ్రహ్మము వరకు అనుసంధానము చేయుట. ఈ పరమ పవిత్రమైన కర్తవ్యమును నిర్వహించు వారికన్న, పరమ పురుషుడగు నారాయణునకు గాని, యోగేశ్వరుడైన కృష్ణునకు గాని ప్రియుడెవడుండును? **(68, 69)**

"ధర్మమయమైన ఈ కృష్ణార్జునుల సంవాదమును జ్ఞాన యజ్ఞము రూపమున ఎవ్వడు అధ్యయనము చేయునో, అట్టి వానికి నేను ఇష్టుడనై యుందును, ఇది నా నిశ్చయము." ఈ యుపదేశము బ్రహ్మవిద్యా సర్వస్వము. దీనియందలి జ్ఞానమును తాను గ్రహించి, ఆచరించి ఇతరులకు మార్గదర్శకము కాగలిగినచో, అది జ్ఞానయజ్ఞ మనబడును. దీనిని జ్ఞాన యజ్ఞముగా అధ్యయనము చేయువానికి సృష్టియందు గల జీవులందరును పరమపురుషుని యంశలుగానే కనిపింతురు. తనయందున్న పురుషుడే వారి యందును నున్నాడు. కనుక అట్టి అంతర్యామి యగు పురుషుడు సాధకునకు ఇష్టుడగును. అనగా జీవులందరును ఇష్టు లగుదురు. **(70)**

దీనిని ఆచరించుట కింకను సిద్ధపడనివాడైనను, ఇతరులపై ఈర్ష్య పడని సత్పురుషుడు శ్రద్ధతో దీని నాలకించినచో, అట్టివాడు కూడ ముక్తుడై,

పుణ్యకర్మలు చేసినవా రనుభవించు శుభంకరములైన లోకములనే యనుభవించును. ఎవ్వరి యందునూ ఈర్ష్యపడని సత్పురుషుడు గనుక, అంతర్యామి యొక్క అనుభూతిని పొందగలుగును. (71)

"అర్జునా! ఇంతవరకు నేను చెప్పిన దంతయు ఏకాగ్రమగు చిత్తముతో వింటివా? అజ్ఞానము నుండి పుట్టిన నీ సమ్మోహము నశించినదా?" అని కృష్ణు డర్జునుని సంభావించెను. ఏకాగ్రమగు చిత్తము అనగా ఇంద్రియములు, మనస్సు, బుద్ధియందు నిలబడుట. ఇట్లు ఏకాగ్రమైన చిత్తము యోగస్థితికి నిదర్శనము. తన యభిప్రాయము అను అజ్ఞానము, మోహము తొలగుటయే దీని సిద్ధికి నిదర్శనము. (72)

కనుక అర్జునుడు, "కృష్ణా! నీ యనుగ్రహము వలన నా మోహము తొలగినది. నే నెవడనో యను స్మృతి లభించినది. ఇప్పుడు నాకు స్థైర్యము చిక్కినది. నీ వెట్లు చెప్పిన నట్లే యాచరింతును." అని ప్రసన్నుడయ్యెను. తన యభిప్రాయమను అజ్ఞానపు తెర తొలగినది; కృష్ణుని ఆజ్ఞా నిర్వహణమే కర్తవ్యమను స్మృతి మిగిలినది. ఈ హింసకు కారకుడ నను మోహము తొలగినది; తన కర్తవ్యమను స్మృతి మిగిలినది. తాను మానవుడనను మోహము తొలగినది; అంతర్యామి పురుషుడు తానే యను స్మృతి మిగిలినది. ఇప్పుడు తనయందు తా నుండుట యను స్థితి చిక్కినది. (73)

ఇట్లు వివరించిన సంజయుడు గ్రుడ్డిరాజుతో నిట్లనెను : "మహారాజా! మహాత్ములైన కృష్ణార్జునుల యీ సంవాదమును వింటిని. ఇది యద్భుతము. ఆనందముతో నా శరీరము పులకరించినది. యోగమునకు ఈశ్వరుడైన కృష్ణుడు స్వయముగా నుపదేశించిన యీ యోగము రహస్యములలో కెల్ల రహస్యమైనది. వ్యాస భగవానుని యనుగ్రహముచే నేను దీనిని వినగలిగితిని. ఇది పుణ్య స్వరూపము, ఇది యద్భుతముగా నున్నదని ఎన్నిమార్లు చెప్పను? ఎన్నిమార్లు చెప్పినను నాకు తనివి తీరుట లేదు. దీనిని మరల మరల తలచుకొనుచున్న కొలదియు శరీరము రోమాంచమై, మనస్సు పులకరించి పోవుచున్నది. దానిని మరల మరల తలచుకొనుచు, మరల మరల మురిసిపోవుచున్నాను. యోగేశ్వరుడైన కృష్ణుని విశ్వరూపమును మరల మరల తలచుకొన్న

కొలదియు నా యానందమునకు పట్టపగ్గములు లేకున్నవి. (గురుశిష్య యోగమగు ఈ విద్యను చెప్పుచున్న సంజయుడు తన గురువగు వ్యాస భగవానుని స్మరించెను. మరల మరల స్మరించుచుంటిని అనగా ఇది మరల మరల మననము, ధ్యానము చేయదగిన యోగవిద్యయని సూచన. ఈ యోగవిద్యా సాధనలో ఆద్యంతము ఆనందమే తప్ప దుఃఖమునకు తావుండదని కూడ ధ్వని మార్గమున సూచింపబడినది.) **(74-77)**

"యోగమునకు ఈశ్వరుడగు కృష్ణుడు, ధనుర్ధారి యగు అర్జునుడు నున్నచోట సంపద, విజయము, వైభవము, నీతి ధ్రువముగా నుండునని నా నిశ్చయము.''

ధనుర్ధరుడైన పార్థుడనగా, విషాదము తొలగి గురువు ఆదేశమును నిర్వహించుటకు సిద్ధముగా నున్న కార్యశూరుడని యర్థము. అట్టి యోగ స్థితిలో వానిని నిలిపియుంచువాడు యోగమునకు ఈశ్వరుడైన కృష్ణుడు. వీరిరువురునూ ఒక్కచోట యున్నచో అక్కడ సంపద యుండును. సంపద యనగా ధనాదులే కాదు; సద్గుణముల సంపద యనియు నర్థము. ఈ సంపద ననుభవింప గలుగుట వైభవము. యుద్ధరంగమున విజయముకూడ అక్కడనే యుండును. తన స్వభావముపై తాను విజయము సాధించుట కూడ అందే యుండును. మానవ ప్రజ్ఞ అహంకారముగా నుండక, నరుడను జీవప్రజ్ఞగా నుండి, తనయందలి నారాయణ దివ్య ప్రజ్ఞకు విధేయమై యుండవలెను. తన వెన్నెముకయే గాండీవమను ధనుస్సు. అది నరుని ఆయుధమగును. వెన్నెముక వెంబడి గల ప్రజ్ఞా కేంద్రములలో గల దివ్యశక్తులు అక్షయములైన బాణములుగా వాని యధీనమున నుండును. ఇట్టి ధనుస్సును ధరించిన నరుడును, వానియందలి యోగమున కీశ్వరుడైన నారాయణ ప్రజ్ఞయును నున్నచోట విజయము, సంపద, వైభవము తనయందును, తన జీవితము నందును పుష్కలముగా విలసిల్లును. **(78)**

# శ్రీమద్భగవద్గీత

## మూలము

శ్రీ కృష్ణాయ నమః ।

# శ్రీమద్భగవద్గీతా

*ప్రథమోఽ ధ్యాయః ।*

## అర్జున విషాద యోగః ।

*ధృతరాష్ట్ర ఉవాచ :*

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥ 1

*సంజయ ఉవాచ :*

దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా ।
ఆచార్య ముపసంగమ్య రాజా వచన మబ్రవీత్ ॥ 2

పశ్యైతాం పాండుపుత్రాణాం ఆచార్య మహతీం చమూమ్ ।
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥ 3

అత్ర శూరా మహేష్వాసా భీమార్జున సమాయుధి ।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥ 4

ధృష్టకేతు శ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్ ।
పురుజి త్కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥ 5

యుధామన్యుశ్చ విక్రాంతః ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥ 6

అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥ 7

భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ ॥ 8

అన్యే చ బహవః శూరాః మదర్థే త్యక్త జీవితాః ।
నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధ విశారదాః ॥ 9

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభి రక్షితమ్ ।
పర్యాప్తం త్విద మేతేషాం బలం భీమాభి రక్షితమ్ ॥ 10

అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।
భీష్మ మేవాభి రక్షంతు భవంత స్సర్వ ఏవ హి ॥ 11

తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చై శ్శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥ 12

తత శ్శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽభవత్ ॥ 13

తత శ్శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥ 14

పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 15

అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।
నకుల స్సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ ॥ 16

కాశ్యశ్చ పరమేష్వాస శ్శిఖండీ చ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥ 17

ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।
సౌభద్రశ్చ మహాబాహు శ్శంఖాన్ దధ్ముః పృథ క్పృథక్ ॥ 18

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।
నభశ్చ పృథివీం చైవ తుములోఽ వ్యనునాదయన్ ॥ 19

అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥ 20

హృషీకేశం తదా వాక్యమిద మాహ మహీపతే ।

*అర్జున ఉవాచ :*

సేనయో రుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥ 21

యావ దేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ ।
కైర్మయా సహయోద్ధవ్యమస్మిన్ రణ సముద్యమే ॥ 22

యోత్స్యమానా నవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధే ప్రియచికీర్షవః ॥ 23

*సంజయ ఉవాచ :*

ఏవ ముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।
సేనయో రుభయో ర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥ 24

భీష్మద్రోణ ప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।
ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥ 25

తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄ నథ పితామహాన్ ।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీం స్తథా ॥ 26

శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయో రుభయో రపి ।
తాన్ సమీక్ష్య స కౌంతేయ స్సర్వాన్ బంధూనవస్థితాన్ ॥ 27

కృపయా పరయా ఽవిష్టో విషీద న్నిద మబ్రవీత్ ।
*అర్జున ఉవాచ :*
దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥ 28

సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ 29

గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ 30

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజన మాహవే ॥ 31

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగై ర్జీవితేన వా ॥ 32

యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనాని చ ॥ 33

ఆచార్యాః పితరః పుత్త్రా స్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః స్యాలా స్సంబంధినస్తథా ॥ 34

ఏతాన్న హంతు మిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥ 35

నిహత్య ధార్తరాష్ట్రా న్నః కా ప్రీతిః స్యా జ్జనార్దన ।
పాపమే వాశ్రయే దస్మాన్ హత్వైతా నాతతాయినః ॥ 36

తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ 37

యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38

కథం న జ్ఞేయ మస్మాభిః పాపా దస్మా న్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భి ర్జనార్దన ॥ 39

కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మో ఽభిభవత్యుత ॥ 40

అధర్మాభిభవాత్ కృష్ణ! ప్రదుష్యంతి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ! జాయతే వర్ణసంకరః ॥ 41

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదక క్రియాః ॥ 42

దోషై రేతైః కులఘ్నానాం వర్ణసంకర కారకైః ।
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥ 43

ఉత్పన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।
నరకే ఽనియతం వాసో భవతీ త్యనుశుశ్రుమ ॥ 44

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజన ముద్యతాః ॥ 45

యది మా మప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్ ॥ 46

*సంజయ ఉవాచ :*
ఏవముక్త్వార్జున స్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్న మానసః ॥ 47

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*అర్జున విషాద యోగో నామ ప్రథమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*ద్వితీయోఽ ధ్యాయః ।*

# సాంఖ్య యోగః ।

*సంజయ ఉవాచ :*

తం తథా కృపయాఽఽవిష్ట మశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదంత మిదం వాక్య మువాచ మధుసూదనః ॥ 1

*శ్రీభగవా నువాచ :*

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥ 2

క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ 3

*అర్జున ఉవాచ :*

కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన ॥ 4

గురూ నహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహ లోకే ।
హత్వార్థకామాంస్తు గురూ నిహైవ భుంజీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్ ॥ 5

నచైత ద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః।
యానేవ హత్వా న జిజీవిషామః తేఽవస్థితాఃప్రముఖే ధార్తరాష్ట్రాః ॥ 6

కార్పణ్య దోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతాః ।
య చ్ఛ్రేయ స్స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ 7

న హి ప్రపశ్యామి మమాపనుద్యా
ద్యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్ ।

అవాప్య భూమా వసపత్న మృద్ధం
రాజ్యం సురాణా మపి చాధిపత్యమ్ ॥ 8

*సంజయ ఉవాచ :*

ఏవ ముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।
న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9

త మువాచ హృషీకేశః ప్రహస న్నివ భారత ।
సేన యో రుభయోర్మధ్యే విషీదంత మిదం వచః ॥ 10

*శ్రీభగవా నువాచ :*

అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాం శ్చ భాషసే ।
గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥ 11

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
నచైవ న భవిష్యామ సర్వే వయ మతః పరమ్ ॥ 12

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిః ధీర స్తత్ర న ముహ్యతి ॥ 13

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ 14

యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖ సుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోఽంత స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥ 16

అవినాశి తు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్ ।
వినాశ మవ్యయ స్యాస్య న కశ్చి త్కర్తు మర్హతి ॥ 17

అంతవంత ఇమే దేహా నిత్య స్యోక్తా శ్శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత ॥ 18

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ 19

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥ 21

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥ 23

అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ ।
నిత్య స్సర్వగత స్థాణు రచలోఽయం సనాతనః ॥ 24

అవ్యక్తోఽయ మచింత్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే ।
తస్మా దేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితు మర్హసి ॥ 26

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥ 27

అవ్యక్తాదీని భూతాని వ్యక్త మధ్యాని భారత ।
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥ 28

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి శ్రుత్వా ప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥ 29

దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥ 30

స్వధర్మ మపి చావేక్ష్య న వికంపితు మర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥ 31

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధ మీదృశమ్ ॥ 32

అథ చేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33

అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ 34

భయాద్రణా దుపరతం మస్యంతే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 35

అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।
నిందంత స్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి ॥ 38

ఏషాతేఽభిహితా సాంఖ్యే బుద్ధి ర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥ 39

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40

వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41

యా మిమాం పుష్పితాం వాచం ప్రవదం త్యవిపశ్చితః ।
వేదవాదరతాః పార్థ నాన్య దస్తీతి వాదినః ॥ 42

కామాత్మానః స్వర్గపరా జన్మకర్మ ఫలప్రదామ్ ।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధి స్సమాధౌ న విధీయతే ॥ 44

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ 45

యావానర్థ ఉదపానే సర్వత స్సంప్లుతోదకే ।
తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46

కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫల హేతుర్భూ ర్మా తే సంగోఽస్త్వకర్మణి ॥ 47

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ ।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే ।
తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛం త్యనామయమ్ ॥ 51

యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53

*అర్జున ఉవాచ :*

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కి మాసీత వ్రజేత కిమ్ ॥ 54

*శ్రీభగవా నువాచ :*

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ 55

దుఃఖేష్వనుద్విగ్న మనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే ॥ 56

య స్సర్వత్రా నభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినందతి న ద్వేష్టి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59

యతతో హ్యాపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ 60

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

ధ్యాయతో విషయాన్ పుంసః సంగ స్తేషూపజాయతే ।
సంగా త్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥ 62

క్రోధా ద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥ 63

రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్ ।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥ 64

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే ।
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ **65**

నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చా భావయతః శాంతి రశాంతస్య కుతః సుఖమ్ ॥ **66**

ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయు ర్నావ మివాంభసి ॥ **67**

తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ **68**

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ **69**

ఆపూర్యమాణ మచలం ప్రతిష్ఠమ్
సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతి మాప్నోతి న కామ కామీ ॥ **70**

విహాయ కామాన్ య స్సర్వాన్ పుమాం శ్చరతి నిస్స్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి ॥ **71**

ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ! నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాఽస్యా మంతకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥ **72**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*సాంఖ్య యోగో నామ ద్వితీయోఽధ్యాయః ।*
*ఓం తత్ సత్ ।*

*తృతీయోऽధ్యాయః ।*

# కర్మ యోగః ।

*అర్జున ఉవాచ :*

జ్యాయసీ చే త్కర్మణస్తే మతా బుద్ధి ర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ **1**

వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోऽహ మాప్నుయామ్ ॥ **2**

*శ్రీభగవా నువాచ :*

లోకేऽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ **3**

న కర్మణా మనారంభా న్నైష్కర్మ్యం పురుషోऽశ్నుతే ।
న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ **4**

న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।
కార్య తే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥ **5**

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇంద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే ॥ **6**

యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేऽర్జున ।
కర్మేంద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే ॥ **7**

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః ॥ **8**

యజ్ఞార్థా త్కర్మణోऽన్యత్ర లోకోऽయం కర్మబంధనః ।
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగ స్సమాచర ॥ **9**

సహ యజ్ఞాః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోऽస్త్విష్టకామధుక్ ॥ **10**

దేవా న్భావయతానేన తే దేవా భావయంతు వః ।
పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ ॥ 11

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।
తైర్దత్తా నప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥ 12

యజ్ఞశిష్టాశిన స్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మ కారణాత్ ॥ 13

అన్నా ద్భవంతి భూతాని పర్జన్యా దన్న సంభవః ।
యజ్ఞా ద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః ॥ 14

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్ ।
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ 15

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయ తీహ యః ।
అఘాయు రింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16

య స్త్వాత్మరతిరేవ స్యా దాత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సంతుష్ట స్తస్య కార్యం న విద్యతే ॥ 17

నైవ తస్య కృతేనార్థో నాకృతే నేహ కశ్చన ।
న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థవ్యపాశ్రయః ॥ 18

తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచరన్ కర్మ పర మాప్నోతి పూరుషః ॥ 19

కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి ॥ 20

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ 21

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22

యది హ్యహం న వర్తేయం జాతు కర్మ ణ్యతంద్రితః ।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ **23**

ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః ॥ **24**

సక్తాః కర్మణ్య విద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథాఽసక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥ **25**

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్ ।
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్తః సమాచరన్ ॥ **26**

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకార విమూఢాత్మా కర్తాహ మితి మన్యతే ॥ **27**

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః ।
గుణాగుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥ **28**

ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు ।
తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవి న్నవిచాలయేత్ ॥ **29**

మయి సర్వాణి కర్మాణి సన్న్య స్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ **30**

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠంతి మానవాః ।
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః ॥ **31**

యే త్వేత దభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।
సర్వజ్ఞాన విమూఢాం స్తాన్ విద్ధి నష్టా న చేతసః ॥ **32**

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్ జ్ఞానవా నపి ।
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ **33**

ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయోర్న వశ మాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ ॥ **34**

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ **35**

*అర్జున ఉవాచ :*

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥ 36

*శ్రీభగవా నువాచ :*

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్ ॥ 37

ధూమే నావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ ।
యథో ల్బేనావృతో గర్భస్తథా తేనేద మావృతమ్ ॥ 38

ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్య వైరిణా ।
కామరూపేణ కౌంతేయ దుష్పూరే ణానలేన చ ॥ 39

ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే ।
ఏతై ర్విమోహయ త్యేష జ్ఞాన మావృత్య దేహినమ్ ॥ 40

తస్మా త్త్వమింద్రియా ణ్యాదౌ నియమ్య భరతర్షభ ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్ ॥ 41

ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః ॥ 42

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మాన మాత్మనా ।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 43

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*కర్మ యోగో నామ తృతీయోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*చతుర్థోఽధ్యాయః ।*

## జ్ఞాన యోగః ।

*శ్రీభగవా నువాచ :*

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాక వేఽబ్రవీత్ ॥ 1

ఏవం పరంపరాప్రాప్త మిమం రాజర్ష యో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥ 2

స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।
భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేత దుత్తమమ్ ॥ 3

*అర్జున ఉవాచ :*

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।
కథ మేత ద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవా నితి ॥ 4

*శ్రీభగవా నువాచ :*

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।
తా న్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥ 5

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మామాయయా ॥ 6

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహమ్ ॥ 7

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8

జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః ।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥ 9

వీతరాగభయక్రోధా మన్మయా మా ముపాశ్రితాః ।
బహవో జ్ఞానతపసా పూతా మద్భావ మాగతాః ॥ 10

యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్ ।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ 11

కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః ।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధి ర్భవతి కర్మజా ॥ 12

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ।
తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥ 13

న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।
ఇతి మాం యోఽభిజానాతి కర్మభి ర్న స బధ్యతే ॥ 14

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వై రపి ముముక్షుభిః ।
కరు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥ 15

కిం కర్మ కి మకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః ।
తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వా మోక్ష్యసే ఽశుభాత్ ॥ 16

కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥ 17

కర్మణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః ।
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్ ॥ 18

యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥ 19

త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।
కర్మ ణ్యభిప్రవృత్తోఽపి నైవ కించి త్కరోతి సః ॥ 20

నిరాశీ ర్యతచిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥ 21

యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥ 22

గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః ।
యజ్ఞా యాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 23

బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ 24

దైవ మేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।
బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం యజ్ఞే నైవోపజుహ్వతి ॥ 25

శ్రోత్రాదీ నింద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।
శబ్దాదీ న్విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి ॥ 26

సర్వా ణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।
ఆత్మసంయమ యోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥ 27

ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథాఽపరే ।
స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥ 28

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాఽపరే ।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః ॥ 29

అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపిత కల్మషాః ॥ 30

యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥ 31

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।
కర్మజాన్ విద్ధితాన్ సర్వా నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥ 32

శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాద్ జ్ఞానయజ్ఞః పరంతప ।
సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే ॥ 33

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥ 34

యజ్జ్ఞాత్వా న పునర్మోహ మేవం యాస్యసి పాండవ ।
యేన భూతా న్యశేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథోమయి ॥ 35

అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥ **36**

యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసాత్ కురుతేఽర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా ॥ **37**

న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే ।
తత్స్వయం యోగ సంసిద్ధః కాలే నాత్మని విందతి ॥ **38**

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరే ణాధిగచ్ఛతి ॥ **39**

అజ్ఞశ్చా శ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥ **40**

యోగసన్యస్త కర్మాణం జ్ఞానసంఛిన్న సంశయమ్ ।
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ ॥ **41**

తస్మా దజ్ఞానసంభూతం హృత్ స్థం జ్ఞానాసి నాత్మనః ।
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత ॥ **42**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*జ్ఞాన యోగో నామ చతుర్థోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*పంచమోఽధ్యాయః ।*

# కర్మ సన్న్యాస యోగః ।

*అర్జున ఉవాచ :*

సన్న్యాసం కర్మణాం కృష్ణ పున ర్యోగం చ శంససి ।
యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ ॥ 1

*శ్రీభగవా నువాచ :*

సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ ।
తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే ॥ 2

జ్ఞేయస్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।
నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధా త్ప్రముచ్యతే ॥ 3

సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।
ఏక మప్యాస్థితః సమ్య గుభయో ర్విందతే ఫలమ్ ॥ 4

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే ।
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ 5

సన్న్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తు మయోగతః ।
యోగయుక్తో ముని ర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి ॥ 6

యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 7

నైవ కించి త్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్ర న్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8

ప్రలపన్ విసృజన్ గృహ్ణ న్నున్మిష న్నిమిష న్నపి ।
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥ 9

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా ॥ 10

కాయేన మనసా బుద్ధ్యా కేవలై రింద్రియై రపి ।
యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాఽఽత్మ శుద్ధయే ॥ 11

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీమ్ ।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥ 12

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ ॥ 13

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 14

నాదత్తే కస్యచి త్పాపం నచైవ సుకృతం విభుః ।
అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥ 15

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః ।
తేషా మాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 16

తద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః ।
గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూత కల్మషాః ॥ 17

విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ 18

ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః ॥ 19

న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజే త్ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధి రసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః ॥ 20

బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మ యోగయుక్తాత్మా సుఖ మక్షయ మశ్నుతే ॥ 21

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥ 22

శక్నో తీహైవ యస్సోఢుం ప్రాక్ శరీర విమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥ 23

యోఽంతఃసుఖో ఽంతరారామ స్తథాంతర్జ్యోతి రేవ యః ।
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥ 24

లభంతే బ్రహ్మనిర్వాణ మృషయః క్షీణకల్మషాః ।
ఛిన్న ద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥ 25

కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥ 26

స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాం శ్చక్షుశ్చై వాంతరే భ్రువోః ।
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥ 27

యతేంద్రియ మనోబుద్ధి ర్ముని ర్మోక్షపరాయణః ।
విగతేచ్ఛాభయక్రోధో యస్సదా ముక్త ఏవ సః ॥ 28

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి ॥ 29

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*కర్మ సన్న్యాస యోగో నామ పంచమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*షష్ఠోఽ ధ్యాయః ।*

# ధ్యాన యోగః ।

*శ్రీభగవా నువాచ :*

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ  కరోతి యః ।
స సన్న్యాసీ చ  యోగీ చ న  నిరగ్ని  ర్న చాక్రియః ॥ 1

యం సన్న్యాస మితి ప్రాహు  ర్యోగం తం విద్ధి పాండవ ।
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన ॥ 2

ఆరురుక్షో ర్మునే ర్యోగం కర్మకారణ ముచ్యతే ।
యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే ॥ 3

యదా హి నేంద్రియార్థేషు  న కర్మ స్వనుషజ్జతే ।
సర్వసంకల్ప సన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే ॥ 4

ఉద్ధ రేదాత్మనాఽఽత్మానం నాత్మాన మవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపు రాత్మనః ॥ 5

బంధు రాత్మాఽఽత్మన స్తస్య యేనాత్మైవాత్మనా జితః ।
అనాత్మనస్తు శత్రుత్వే వర్తే తాత్మైవ శత్రువత్ ॥ 6

జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానావమానయోః ॥ 7

జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః ॥ 8

సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్యబంధుషు ।
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధి ర్విశిష్యతే ॥ 9

యోగీ యుంజీత సతత మాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః ॥ 10

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః ।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్ ॥ 11

తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః ।
ఉపవిశ్యాసనే యుంజ్యా ద్యోగ మాత్మవిశుద్ధయే ॥ 12

సమం కాయ శిరో గ్రీవం ధారయ న్న చలం స్థిరః ।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చా నవలోకయన్ ॥ 13

ప్రశాంతాత్మా విగతభీ ర్బ్రహ్మచారివ్రతే స్థితః ।
మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥ 14

యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ నియతమానసః ।
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థా మధిగచ్ఛతి ॥ 15

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చై కాంత మనశ్నతః ।
న చాతిస్వప్న శీలస్య జాగ్రతో నైవ చార్జున ॥ 16

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు ।
యుక్త స్వప్నా వబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 17

యదా వినియతం చిత్తమాత్మన్యే వావతిష్ఠతే ।
నిస్పృహ స్సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥ 18

యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।
యోగినో యతచిత్తస్య యుంజతో యోగ మాత్మనః ॥ 19

యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।
యత్రచై వాత్మనాఽఽత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥ 20

సుఖ మాత్యంతికం యత్త ద్బుద్ధిగ్రాహ్య మతీంద్రియమ్ ।
వేత్తి యత్ర న చైవాయం స్థిత శ్చలతి తత్త్వతః ॥ 21

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥ 22

తం విద్యా ద్దుఃఖసంయోగ వియోగం యోగసంజ్ఞితమ్ ।
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణ చేతసా ॥ 23

సంకల్ప ప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వా నశేషతః ।
మనసై వేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥ 24

శనైః శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతి గృహీతయా ।
ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥ 25

యతో యతో నిశ్చరతి మన శ్చంచల మస్థిరమ్ ।
తతస్తతో నియమ్యై దాత్మన్యేవ వశం నయేత్ ॥ 26

ప్రశాంత మనసం హ్యేనం యోగినం సుఖ ముత్తమమ్ ।
ఉపైతి శాంత రజసం బ్రహ్మభూత మకల్మషమ్ ॥ 27

యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ విగతకల్మషః ।
సుఖేన బ్రహ్మసంస్పర్శ మత్యంతం సుఖ మశ్నుతే ॥ 28

సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ 29

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 30

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥ 31

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32

*అర్జున ఉవాచ :*

యోఽయం యోగస్త్వయా ప్రోక్త స్సామ్యేన మధుసూదన ।
ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥ 33

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవ ద్దృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే వాయో రివ సుదుష్కరమ్ ॥ 34

*శ్రీభగవా నువాచ :*

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్య తే ॥ 35

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తు ముపాయతః ॥ 36

*అర్జున ఉవాచ :*

అయతి శ్రద్ధయోపేతో యోగాచ్చలిత మానసః ।
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥ 37

కచ్చిన్నో భయవిభ్రష్ట శ్ఛిన్నాభ్రమివ నశ్యతి ।
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥ 38

ఏతం మే సంశయం కృష్ణ ఛేత్తు మర్హస్య శేషతః ।
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥ 39

*శ్రీభగవా నువాచ :*

పార్థ నై వేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే ।
న హి కల్యాణకృ త్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి ॥ 40

ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీః సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥ 41

అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥ 42

తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికమ్ ।
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥ 43

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।
జిజ్ఞాసు రపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥ **44**

ప్రయత్నా ద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేకజన్మ సంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్ ॥ **45**

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్య శ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భవార్జున ॥ **46**

యోగినా మపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥ **47**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*ధ్యాన యోగో నామ షష్ఠోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*సప్తమోఽ ధ్యాయః ।*

# విజ్ఞాన యోగః ।

*శ్రీభగవా నువాచ :*

మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజ న్మదాశ్రయః ।
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥ 1

జ్ఞానం తేఽ హం సవిజ్ఞాన మిదం వక్ష్యా మ్యశేషతః ।
యజ్జ్ఞాత్వా నేహ భూయోఽ న్య జ్జ్ఞాతవ్య మవశిష్యతే ॥ 2

మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః ॥ 3

భూమి రాపోఽ నలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥ 4

అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।
జీవభూతాం మహాబాహో య యేదం ధార్యతే జగత్ ॥ 5

ఏత ద్యోనీని భూతాని సర్వాణీ త్యుపధారయ ।
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయ స్తథా ॥ 6

మత్తః పరతరం నాన్య త్కించి దస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7

రసోఽ హ మప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।
ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥ 8

పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥ 9

బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।
బుద్ధి ర్బుద్ధిమతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ॥ 10

బలం బలవతాం చాహం కామరాగ వివర్జితమ్ ।
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥ 11

యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చ యే ।
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి ॥ 12

త్రిభి ర్గుణమయై ర్భావై రేభి స్సర్వ మిదం జగత్ ।
మోహితం నాభిజానాతి మా మేభ్యః పర మవ్యయమ్ ॥ 13

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే ॥ 14

న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।
మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావ మాశ్రితాః ॥ 15

చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతినోఽర్జున ।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥ 16

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే ।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః ॥ 17

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।
ఆస్థితః స హి యుక్తాత్మా మామే వానుత్తమాం గతిమ్ ॥ 18

బహూనాం జన్మనా మంతే జ్ఞానవా న్మాం ప్రపద్యతే ।
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ 19

కామై స్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతే ఽన్యదేవతాః ।
తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతా స్స్వయా ॥ 20

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితు మిచ్ఛతి ।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధ్యామ్యహమ్ ॥ 21

స తయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధన మీహతే ।
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ ॥ 22

అంతవత్తు ఫలం తేషాం తద్భవ త్యల్ప మేధసామ్ ।
దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మా మపి ॥ 23

అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యంతే మా మబుద్ధయః ।
పరం భావ మజానంతో మమావ్యయ మనుత్తమమ్ ॥ 24

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః ।
మూఢోఽయం నాభిజానాతి లోకో మా మజ మవ్యయమ్ ॥ 25

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥ 26

ఇచ్ఛాద్వేష సముత్థేన ద్వంద్వ మోహేన భారత ।
సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప ॥ 27

యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।
తే ద్వంద్వ మోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥ 28

జరామరణ మోక్షాయ మా మాశ్రిత్య యతంతి యే ।
తే బ్రహ్మ తద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥ 29

సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।
ప్రయాణకాలేఽపి చ మాం తే విదు ర్యుక్త చేతసః ॥ 30

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*విజ్ఞాన యోగో నామ సప్తమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*అష్టమోఽ ధ్యాయః ।*

# అక్షర పరబ్రహ్మ యోగః ।

*అర్జున ఉవాచ :*

కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।
అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కిముచ్యతే ॥ 1

అధియజ్ఞం కథం కోఽత్ర దేహేఽస్మి న్మధుసూదన ।
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥ 2

*శ్రీభగవా నువాచ :*

అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మ ముచ్యతే ।
భూతభావోద్భవకరో విసర్గః కర్మ సంజ్ఞితః ॥ 3

అధిభూతం క్షరోభావః పురుషశ్చాధి దైవతమ్ ।
అధియజ్ఞోఽహమేవాత్ర దేహే దేహభృతాం వర ॥ 4

అంతకాలే చ మా మేవ స్మర న్ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ 5

యం యం వాపి స్మరన్ భావం త్యజ త్యంతే కళేబరమ్ ।
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ 6

తస్మా త్సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్య చ ।
మయ్యర్పిత మనోబుద్ధి ర్మా మేవైష్య స్యసంశయః ॥ 7

అభ్యాస యోగయుక్తేన చేతసా నాన్యగామినా ।
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ ॥ 8

కవిం పురాణ మనుశాసితార మణోరణీయాంసమనుస్మ రేద్యః ।
సర్వస్య ధాతార మచింత్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥ 9

ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।

భ్రువోర్మధ్యే ప్రాణ మావేశ్య సమ్యక్
స తం పరం పురుష ముపైతి దివ్యమ్ ॥ 10

యదక్షరం వేదవిదో వదంతి
విశంతి యద్యతయో వీతరాగాః ।
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి
తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥ 11

సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్న్యాధా యాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్ ॥ 12

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజ న్దేహం స యాతి పరమాం గతిమ్ ॥ 13

అనన్యచేతా స్సతతం యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ 14

మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్ ।
నాప్నువంతి మహాత్మాన స్సంసిద్ధిం పరమాం గతాః ॥ 15

ఆబ్రహ్మభువనా ల్లోకాః పునరావర్తినోఽర్జున ।
మా ముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ 16

సహస్రయుగపర్యంత మహ ర్యద్బ్రహ్మణో విదుః ।
రాత్రిం యుగసహస్రాంతాం తేఽహోరాత్రవిదో జనాః ॥ 17

అవ్యక్తా ద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్త సంజ్ఞకే ॥ 18

భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।
రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవ త్యహరాగమే ॥ 19

పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తా త్సనాతనః ।
యస్ససర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥ 20

అవ్యక్తోఽక్షర ఇత్యుక్త స్తమాహుః పరమాం గతిమ్ ।
యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 21

పురుషః స పరః పార్థ భక్త్యా లభ్య స్త్వనన్యయా ।
యస్యాన్తః స్థాని భూతాని యేన సర్వ మిదం తతమ్ ॥ **22**

యత్ర కాలే త్వనావృత్తి మావృత్తించైవ యోగినః ।
ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥ **23**

అగ్ని ర్జ్యోతి రహ శ్శుక్ల ష్షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్రప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ **24**

ధూమో రాత్రి స్తథా కృష్ణ ష్షణ్మాసా దక్షిణాయనమ్ ।
తత్ర చాంద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్య నివర్తతే ॥ **25**

శుక్ల కృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।
ఏకయా యా త్యనావృత్తి మన్యయాఽఽవర్తతే పునః ॥ **26**

నైతే సృతీ పార్థ జాన న్యోగీ ముహ్యతి కశ్చన ।
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥ **27**

వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా
యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్ ॥ **28**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*అక్షర పరబ్రహ్మ యోగో నామ అష్టమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*నవమోఽధ్యాయః ।*

## రాజవిద్యా రాజగుహ్య యోగః ।

*శ్రీభగవా నువాచ :*

ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే ।
జ్ఞానం విజ్ఞానసహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥ **1**

రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్ ।
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్ ॥ **2**

అశ్రద్ధధానాః పురుషా ధర్మ స్యాస్య పరంతప ।
అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥ **3**

మయాతత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥ **4**

న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగ మైశ్వరమ్ ।
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ **5**

యథాఽఽకాశస్థితో నిత్యం వాయు స్సర్వత్రగో మహాన్ ।
తథా సర్వాణి భూతాని మత్స్థానీ త్యుపధారయ ॥ **6**

సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ ।
కల్పక్షయే పున స్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్ ॥ **7**

ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః ।
భూతగ్రామ మిమం కృత్స్న మవశం ప్రకృతే ర్వశాత్ ॥ **8**

న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ ।
ఉదాసీనవదాసీన మసక్తం తేషు కర్మసు ॥ **9**

మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।
హేతునానేన కౌంతేయ జగ ద్విపరివర్తతే ॥ **10**

అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।
పరం భావ మజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥ **11**

మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।
రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ 12

మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాశ్రితాః ।
భజం త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ ॥ 13

సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః ।
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥ 14

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే ।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతో ముఖమ్ ॥ 15

అహం క్రతు రహం యజ్ఞః స్వధాహ మహ మౌషధమ్ ।
మంత్రోఽహ మహమే వాజ్య మహమగ్ని రహం హుతమ్ ॥ 16

పితాఽహమస్య జగతో మాతా ధాతా పితామహః ।
వేద్యం పవిత్ర మోంకార ఋక్సామ యజురేవ చ ॥ 17

గతి ర్భర్తా ప్రభు స్సాక్షీ నివాస శ్శరణం సుహృత్ ।
ప్రభవః ప్రలయః స్థానం నిదానం బీజ మవ్యయమ్ ॥ 18

తపామ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ ।
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహ మర్జున ॥ 19

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।
తే పుణ్యమాసాద్య సురేంద్రలోక మశ్నంతి దివ్యాన్దివి దేవభోగాన్ ॥ 20

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే ॥ 21

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్ ॥ 22

యోఽప్యన్య దేవతాభక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।
తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ ॥ 23

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మామభిజానంతి తత్త్వేనాత శ్చ్యవంతి తే ॥ 24

యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః ।
భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మామ్ ॥ 25

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥ 26

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 27

శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబంధనైః ।
సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి ॥ 28

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥ 29

అపి చే త్సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః ॥ 30

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ 31

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాంతి పరాం గతిమ్ ॥ 32

కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయ స్తథా ।
అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మామ్ ॥ 33

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మా మేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥ 34

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*రాజవిద్యా రాజగుహ్య యోగో నామ నవమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*దశమోఽ ధ్యాయః ।*

# విభూతి యోగః ।

*శ్రీభగవా నువాచ :*

భూయ ఏవ మహాబాహో శ్రుణు మే పరమం వచః ।
యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥ **1**

న మే విదుః సురగణాః ప్రభవం న మహర్ష యః ।
అహ మాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥ **2**

యో మా మజ మనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।
అసమ్మూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥ **3**

బుద్ధిర్జ్ఞాన మసమ్మోహః క్షమా సత్యం దమ శ్శమః ।
సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయ మేవ చ ॥ **4**

అహింసా సమతా తుష్టి స్తపో దానం యశోఽయశః ।
భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథ గ్విధాః ॥ **5**

మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవ స్తథా ।
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥ **6**

ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।
సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥ **7**

అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥ **8**

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥ **9**

తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాంతి తే ॥ **10**

తేషామే వానుకమ్పార్థ మహ మజ్ఞానజం తమః ।
నాశయా మ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥ 11

*అర్జున ఉవాచ :*

పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవమజం విభుమ్ ॥ 12

ఆహుస్త్వాం ఋషయ స్సర్వే దేవర్షి ర్నారదస్తథా ।
అసితో దేవలో వ్యాస స్స్వయం చైవ బ్రవీషి మే ॥ 13

సర్వమేత దృతం మన్యే యన్మాం వదసి కేశవ ।
న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥ 14

స్వయమే వాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।
భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥ 15

వక్తుమర్హ స్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః ।
యాభి ర్విభూతిభి ర్లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి ॥ 16

కథం విద్యా మహం యోగిం స్త్వాం సదా పరిచింతయన్ ।
కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవ న్మయా ॥ 17

విస్త రేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥ 18

*శ్రీభగవా నువాచ :*

హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మ విభూతయః ।
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే ॥ 19

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః ।
అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవ చ ॥ 20

ఆదిత్యానా మహం విష్ణు ర్జ్యోతిషాం రవి రంశుమాన్ ।
మరీచి ర్మరుతా మస్మి నక్షత్రాణా మహం శశీ ॥ 21

వేదానాం సామవేదోఽస్మి దేవానా మస్మి వాసవః ।
ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానా మస్మి చేతనా ॥ 22

రుద్రాణాం శంకర శ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।
వసూనాం పావకశ్చాస్మి మేరు శ్శిఖరిణా మహమ్ ॥ 23

పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।
సేనానీనా మహం స్కంద స్సరసామస్మి సాగరః ॥ 24

మహర్షీణాం భృగు రహం గిరామ స్మ్యేకమక్షరమ్ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః ॥ 25

అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః ।
గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః ॥ 26

ఉచ్చైశ్శ్రవస మశ్వానాం విద్ధి మామృతోద్భవమ్ ।
ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥ 27

ఆయుధానా మహం వజ్రం ధేనూనా మస్మి కామధుక్ ।
ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణా మస్మి వాసుకిః ॥ 28

అనంత శ్చాస్మి నాగానాం వరుణో యాదసా మహమ్ ।
పితౄణా మర్యమా చాస్మి యమ స్సంయమతా మహమ్ ॥ 29

ప్రహ్లాద శ్చాస్మి దైత్యానాం కాలః కలయతా మహమ్ ।
మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ ॥ 30

పవనః పవతా మస్మి రామ శ్శస్త్రభృతా మహమ్ ।
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసా మస్మి జాహ్నవీ ॥ 31

సర్గాణా మాది రంతశ్చ మధ్యం చైవాహ మర్జున ।
అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతా మహమ్ ॥ 32

అక్షరాణా మకారోఽస్మి ద్వంద్వః సామాసికస్య చ ।
అహ మేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః ॥ 33

మృత్యు స్సర్వహర శ్చాహ ముద్భవశ్చ భవిష్యతామ్ ।
కీర్తిశ్శ్రీర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా ॥ 34

బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసా మహమ్ ।
మాసానాం మార్గశీర్షోఽహం ఋతూనాం కుసుమాకరః ॥ 35

ద్యూతం ఛలయతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ।
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతా మహమ్ ॥ 36

వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః ।
మునీనామ ప్యహం వ్యాసః కవీనా ముశనా కవిః ॥ 37

దండో దమయతా మస్మి నీతి రస్మి జిగీషతామ్ ।
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతా మహమ్ ॥ 38

యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున ।
న తదస్తి వినా యత్స్యా న్మయా భూతం చరాచరమ్ ॥ 39

నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతే ర్విస్తరో మయా ॥ 40

యద్య ద్విభూతిమ త్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥ 41

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్ ॥ 42

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*విభూతి యోగో నామ దశమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*ఏకాదశోఽధ్యాయః ।*

# విశ్వరూప సందర్శన యోగః ।

*అర్జున ఉవాచ :*

మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మ సంజ్ఞితమ్ ।
యత్త్వయోక్తం వచ స్తేన మోహోఽయం విగతో మమ ॥ 1

భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।
త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్య మపి చావ్యయమ్ ॥ 2

ఏవ మేతద్యథాఽఽత్థ త్వమాత్మానం పరమేశ్వర ।
ద్రష్టు మిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ ॥ 3

మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో ।
యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్ ॥ 4

*శ్రీభగవా నువాచ :*

పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః ।
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥ 5

పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుత స్తథా ।
బహూ న్యదృష్టపూర్వాణి పశ్యా శ్చర్యాణి భారత ॥ 6

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।
మమ దేహే గుడాకేశ యచ్చాన్య ద్ద్రష్టు మిచ్ఛసి ॥ 7

న తు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుసా ।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగ మైశ్వరమ్ ॥ 8

*సంజయ ఉవాచ :*

ఏవ ముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః ।
దర్శయామాస పార్థాయ పరమం రూప మైశ్వరమ్ ॥ 9

అనేకవక్త్ర నయన మనేకాద్భుత దర్శనమ్ ।
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥ 10

దివ్యమాల్యాంబరధరం దివ్యగంధాను లేపనమ్ ।
సర్వాశ్చర్యమయం దేవ మనంతం విశ్వతోముఖమ్ ॥ 11

దివి సూర్యసహస్రస్య భవే ద్యుగపదుత్థితా ।
యది భా స్సదృశీ సా స్యా ద్భాస స్తస్య మహాత్మనః ॥ 12

తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్త మనేకధా ।
అపశ్య ద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥ 13

తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలి రభాషత ॥ 14

*అర్జున ఉవాచ :*

పశ్యామి దేవాం స్తవ దేవ దేహే సర్వాం స్తథా భూతవిశేషసంఘాన్ ।
బ్రహ్మాణ మీశం కమలాసనస్థ మృషీంశ్చ సర్వా నురగాంశ్చ దివ్యాన్ ॥ 15

అనేక బాహూదరవక్త్ర నేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్ ।
నాంతం న మధ్యం న పునస్త వాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥ 16

కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్ ।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతా
ద్దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్ ॥ 17

త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
త్వమవ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా సనాతన స్త్వం పురుషో మతో మే ॥ 18

అనాదిమధ్యాంత మనంత వీర్య మనంతబాహుం శశిసూర్యనేత్రమ్ ।
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపంతమ్ ॥ 19

ద్యావాపృథివ్యో రిద మంతరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।

దృష్ట్వాద్భుతం రూప ముగ్రం తవేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥ 20

అమీ హి త్వాం సురసంఘా విశంతి కేచి ద్భీతాః ప్రాంజలయో గృణంతి ।
స్వస్తీత్యుక్త్వా మహర్షి సిద్ధసంఘాః స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ॥ 21

రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వేఽశ్వినౌ మరుత శ్చోష్మపాశ్చ ।
గంధర్వ యక్షాసురసిద్ధసంఘా వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥ 22

రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో బహుబాహూరుపాదమ్ ।
బహూదరం బహుదంష్ట్రాకరాళం
దృష్ట్వా లోకాః ప్రవ్యథితా స్తథాఽహమ్ ॥ 23

నభః స్పృశం దీప్త మనేకవర్ణం
వ్యాత్తాననం దీప్త విశాలనేత్రమ్ ।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా
ధృతిం న విందామి శమం చ విష్ణో ॥ 24

దంష్ట్రాకరాళాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానల సన్నిభాని ।
దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 25

అమీచ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే సహైవావనిపాలసంఘైః ।
భీష్మో ద్రోణ స్సూతపుత్ర స్తథాఽసౌ
సహాస్మదీయై రపి యోధముఖ్యైః ॥ 26

వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రా కరాళాని భయానకాని ।
కేచి ద్విలగ్నా దశనాంతరేషు సందృశ్యంతే చూర్ణితై రుత్తమాంగైః ॥ 27

యథా నదీనాం బహవోఽంబువేగాః సముద్ర మేవాభిముఖా ద్రవంతి ।
తథా తవామీ నరలోకవీరా విశంతి వక్త్రాణ్యభి విజ్వలంతి ॥ 28

యథా ప్రదీప్తం జ్వలనం పతంగా విశంతి నాశాయ సమృద్ధవేగాః ।
తథైవ నాశాయ విశంతి లోకా స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥ 29

లేలిహ్యసే గ్రసమాన స్సమంతా ల్లోకాన్ సమగ్రాన్ వదనై ర్జ్వలద్భిః ।
తేజోభి రాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో ॥ 30

ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో నమోఽస్తుతే దేవవర ప్రసీద ।
విజ్ఞాతు మిచ్ఛామి భవంతమాద్యం న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥ 31

*శ్రీభగవా నువాచ :*

కాలోఽస్మి లోకక్షయకృ త్ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తు మిహ ప్రవృత్తః ।
ఋతేఽపి త్వా న భవిష్యంతి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥ 32

తస్మా త్త్వముత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్।
మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥ 33

ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాఽన్యానపి యోధవీరాన్ ।
మయా హతాం స్త్వం జహి మా వ్యథిష్ఠా
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥ 34

*సంజయ ఉవాచ :*

ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలి ర్వేపమానః కిరీటీ ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥ 35

*అర్జున ఉవాచ :*

స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్య త్యనురజ్యతే చ ।
రక్షాంసి భీతాని దిశో ద్రవంతి సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥ 36

కస్మాచ్చ తే న నమేర న్మహాత్మన్ గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే ।
అనంత దేవేశ జగన్నివాస త్వమక్షరం సదస త్తత్పరం యత్ ॥ 37

త్వమాదిదేవః పురుషః పురాణ స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
వేత్తాఽసి వేద్యం చ పరం చ ధామ త్వయాతతం విశ్వ మనంతరూప ॥ 38

వాయు ర్యమోఽగ్ని ర్వరుణ శ్శశాంకః ప్రజాపతి స్త్వం ప్రపితామహశ్చ ।
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే ॥ 39

నమః పురస్తా దథ పృష్ఠతస్తే నమోఽస్తుతే సర్వత ఏవ సర్వ ।
అనంతవీర్యామిత విక్రమ స్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః ॥ 40

సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ ! హే యాదవ ! హే సఖేతి ।
అజానతా మహిమానం తవేదం మయా ప్రమాదా త్ప్రణయేన వాపి ॥ 41

యచ్చాపహాసార్థ మసత్కృతోఽసి
విహార శయ్యాసన భోజనేషు ।
ఏకోఽథవా ప్యచ్యుత తత్సమక్షం
తత్క్షామయే త్వామహ మప్రమేయమ్ ॥ 42

పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।
న త్వత్సమోఽ స్త్యభ్యధికః కుతోఽన్యో
లోకత్రయేఽ ప్యప్రతిమప్రభావ ॥ 43

తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహ మీశ మీడ్యమ్ ।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥ 44

అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే ।
తదేవ మే దర్శయ దేవ రూపం ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 45

కిరీటినం గదినం చక్రహస్త మిచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ ।
తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో భవ విశ్వమూర్తే ॥ 46

*శ్రీభగవా నువాచ :*

మయా ప్రసన్నే తవార్జునేదం రూపం పరం దర్శిత మాత్మయోగాత్ ।
తేజోమయం విశ్వమనంత మాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్॥47

న వేదయజ్ఞాధ్యయనై ర్న దానై ర్న చ క్రియాభి ర్న తపోభి రుగ్రైః ॥
ఏవం రూప శ్శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥ 48

మాతే వ్యథా మా చ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోరమీదృ ఙ్మమేదమ్।
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం తదేవ మే రూప మిదం ప్రపశ్య ॥ 49

*సంజయ ఉవాచ :*

ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా స్వకంరూపం దర్శయామాస భూయః ।
ఆశ్వాసయామాస చ భీత మేనం భూత్వా పున స్సౌమ్యవపు ర్మహాత్మా ॥ 50

*అర్జున ఉవాచ :*

దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।
ఇదానీ మస్మి సంవృత్త స్సచేతాః ప్రకృతిం గతః ॥ 51

*శ్రీభగవా నువాచ :*

సుదుర్దర్శ మిదం రూపం దృష్టవా నసి యన్మమ ।
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శన కాంక్షిణః ॥ 52

నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్టవా నసి మాం యథా ॥ 53

భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥ 54

మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః ।
నిర్వైర స్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥ 55

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*విశ్వరూప సందర్శన యోగో నామ ఏకాదశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*ద్వాదశోఽధ్యాయః ।*

# భక్తి యోగః ।

*అర్జున ఉవాచ :*

ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।
యే చాప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥ 1

*శ్రీభగవా నువాచ :*

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతా స్తే మే యుక్త తమా మతాః ॥ 2

యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే ।
సర్వత్రగ మచింత్యం చ కూటస్థ మచలం ధ్రువమ్ ॥ 3

సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥ 4

క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్ ।
అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥ 5

యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥ 6

తేషా మహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్ ।
భవామి న చిరాత్పార్థ మయ్యావేశిత చేతసామ్ ॥ 7

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥ 8

అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥ 9

అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।
మదర్థ మపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి ॥ 10

అథైతద ప్యశక్తోఽసి కర్తుం మద్యోగ మాశ్రితః ।
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥ 11

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానా ద్ధ్యానం విశిష్యతే ।
ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాంతి రనంతరమ్ ॥ 12

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥ 13

సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మద్భక్తస్స మే ప్రియః ॥ 14

యస్మా న్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః ।
హర్షామర్ష భయోద్వేగై ర్ముక్తో యస్స చ మే ప్రియః ॥ 15

అనపేక్ష శ్శుచి ర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।
సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥ 16

యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ య స్స మే ప్రియః ॥ 17

సమ శ్శత్రౌచ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు సమ స్సంగవివర్జితః ॥ 18

తుల్యనిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేతః స్థిరమతి ర్భక్తిమా న్మే ప్రియో నరః ॥ 19

యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽ తీవ మే ప్రియాః ॥ 20

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*భక్తి యోగో నామ ద్వాదశోఽ ధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*త్రయోదశోఽధ్యాయః ।*

# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగః ।

*అర్జున ఉవాచ :*

ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ ।
ఏత ద్వేదితు మిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥ **1**

*శ్రీభగవా నువాచ :*

ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమి త్యభిధీయతే ।
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥ **2**

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।
క్షేత్ర క్షేత్రజ్ఞయో ర్జ్ఞానం యత్తజ్జ్ఞానం మతం మమ ॥ **3**

తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చయత్ ।
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥ **4**

ఋషి భిర్బహుధా గీతం ఛందోభి ర్వివిధైః పృథక్ ।
బ్రహ్మ సూత్రపదైశ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః ॥ **5**

మహాభూతా న్యహంకారో బుద్ధి రవ్యక్తమేవ చ ।
ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః ॥ **6**

ఇచ్ఛా ద్వేష స్సుఖం దుఃఖం సంఘాత శ్చేతనా ధృతిః ।
ఏతత్క్షేత్రం సమాసేన సవికార ముదాహృతమ్ ॥ **7**

అమానిత్వ మదంభిత్వ మహింసా క్షాంతి రార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మ వినిగ్రహః ॥ **8**

ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ ।
జన్మ మృత్యు జరా వ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్ ॥ **9**

అసక్తి రనభిష్వంగః పుత్ర దార గృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వ  మిష్టానిష్టోపపత్తిషు ॥ 10

మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।
వివిక్త దేశసేవిత్వ మరతి ర్జనసంసది ॥ 11

అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్త్వజ్ఞానార్థ దర్శనమ్ ।
ఏతజ్జ్ఞాన మితి ప్రోక్త  మజ్ఞానం యదతోఽన్యథా ॥ 12

జ్ఞేయం యత్త త్ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వాఽమృతమశ్నుతే ।
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥ 13

సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరో ముఖమ్ ।
సర్వతః శ్రుతిమ ల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి ॥ 14

సర్వేంద్రియ గుణాభాసం సర్వేంద్రియ వివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥ 15

బహిరంతశ్చ భూతానా మచరం చరమేవ చ ।
సూక్ష్మత్వా త్త దవిజ్ఞేయం దూరస్థం చాంతి కే చ తత్ ॥ 16

అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।
భూతభర్తృ చ తజ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥ 17

జ్యోతిషామపి తజ్జ్యోతి స్తమసః పర ముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥ 18

ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।
మద్భక్త ఏత ద్విజ్ఞాయ మద్భావా యోపపద్యతే ॥ 19

ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్ ॥ 20

కార్యకారణకర్తృ త్వే హేతుః ప్రకృతి రుచ్యతే ।
పురుష స్సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతు రుచ్యతే ॥ 21

పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ ।
కారణం గుణసంగోఽస్య సదసద్యోని జన్మసు ॥ 22

ఉపద్రష్టానుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః ।
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥ 23

య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ ।
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే ॥ 24

ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మాన మాత్మనా ।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥ 25

అన్యే త్వేవమజానంతః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే ।
తేఽపి చాతితరం త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥ 26

యావత్సంజాయతే కించి త్సత్త్వం స్థావరజంగమమ్ ।
క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగా త్తద్విద్ధి భరతర్షభ ॥ 27

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।
వినశ్య త్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥ 28

సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్ ।
న హినస్త్యాత్మనాఽఽత్మానం తతో యాతి పరాంగతిమ్ ॥ 29

ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।
యః పశ్యతి తథాఽఽత్మాన మకర్తారం స పశ్యతి ॥ 30

యదా భూత పృథగ్భావ మేకస్థ మనుపశ్యతి ।
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥ 31

అనాదిత్వా న్నిర్గుణత్వా త్పరమాత్మాఽయ మవ్యయః ।
శరీరస్థోఽపి కౌంతేయ న కరోతి న లిప్యతే ॥ 32

యథా సర్వగతం సౌక్ష్మ్యా దాకాశం నోపలిప్యతే ।
సర్వత్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే ॥ 33

**యథా ప్రకాశయ త్యేకః కృత్స్నం లోక మిమం రవిః ।**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥ 34**

**క్షేత్ర క్షేత్రజ్ఞయో రేవ మంతరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥ 35**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగో నామ త్రయోదశోఽ ధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*చతుర్దశోఽధ్యాయః ।*

# గుణత్రయ విభాగ యోగః ।

*శ్రీభగవా నువాచ :*

పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।
యజ్జ్ఞాత్వా మునయః సర్వే పరాం సిద్ధి మితో గతాః ॥ 1

ఇదం జ్ఞాన ముపాశ్రిత్య మమ సాధర్మ్య మాగతాః ।
సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ ॥ 2

మమ యోని ర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।
సమ్భవః సర్వభూతానాం తతో భవతి భారత ॥ 3

సర్వయోనిషు కౌంతేయ మూర్తయ స్సమ్భవంతి యాః ।
తాసాం బ్రహ్మ మహద్యోని రహం బీజప్రదః పితా ॥ 4

సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।
నిబధ్నంతి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్ ॥ 5

తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక మనామయమ్ ।
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ ॥ 6

రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగ సముద్భవమ్ ।
తన్ని బధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥ 7

తమ స్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।
ప్రమాదాలస్య నిద్రా భీస్తన్నిబధ్నాతి భారత ॥ 8

సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।
జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥ 9

రజస్త మశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।
రజ స్సత్త్వం తమశ్చైవ తమ స్సత్త్వం రజస్తథా ॥ 10

సర్వద్వారేషు దేహేఽస్మి న్ప్రకాశ ఉపజాయతే ।
జ్ఞానం యదా తదా విద్యా ద్వివృద్ధం సత్త్వ మిత్యుత ॥ 11

లోభః ప్రవృత్తి రారంభః కర్మణా మశమః స్పృహా ।
రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ ॥ 12

అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।
తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన ॥ 13

యదా సత్త్వే ప్రవృద్ధేతు ప్రలయం యాతి దేహభృత్ ।
తదోత్తమవిదాం లోకా నమలాన్ ప్రతిపద్యతే ॥ 14

రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే ।
తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥ 15

కర్మణ స్సుకృతస్యాహు స్సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।
రజసస్తు ఫలం దుఃఖ మజ్ఞానం తమసః ఫలమ్ ॥ 16

సత్త్వా త్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ ॥ 17

ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।
జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥ 18

నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి ।
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥ 19

గుణానేతా నతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।
జన్మ మృత్యు జరా దుఃఖై ర్విముక్తోఽమృత మశ్నుతే ॥ 20

*అర్జున ఉవాచ :*

కైర్లింగై స్త్రీన్గుణా నేతా నతీతో భవతి ప్రభో ।
కిమాచారః కథం చైతాం స్త్రీన్గుణానతివర్తతే ॥ 21

*శ్రీభగవా నువాచ :*

ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥ 22

ఉదాసీన వదాసీనో గుణైర్యో న విచాల్యతే ।
గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ॥ 23

సమదుఃఖసుఖః స్వస్థ స్సమలోష్టాశ్మ కాంచనః ।
తుల్యప్రియా ప్రియో ధీర స్తుల్యనిందాత్మ సంస్తుతిః ॥ 24

మానావమానయో స్తుల్య స్తుల్యో మిత్రారిపక్షయోః ।
సర్వారంభపరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే ॥ 25

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥ 26

బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహమమృత స్యావ్యయస్య చ ।
శాశ్వతస్య చ ధర్మస్య సుఖ స్యైకాన్తికస్య చ ॥ 27

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*గుణత్రయ విభాగ యోగో నామ చతుర్దశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*పంచదశోఽధ్యాయః ।*

# పురుషోత్తమ ప్రాప్తి యోగః ।

*శ్రీభగవా నువాచ :*

ఊర్ధ్వమూల మధఃశాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్ ।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ 1

అధశ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాళాః ।
అధశ్చ మూలా న్యనుసంతతాని కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥ 2

న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।
అశ్వత్థమేనం సువిరూఢమూల మసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా ॥ 3

తతః పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్ గతా న నివర్తంతి భూయః ।
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ॥ 4

నిర్మానమోహా జితసంగదోషా
అధ్యాత్మనిత్యా వినివృత్త కామాః ।
ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞై
ర్గచ్ఛంత్య మూఢాః పదమవ్యయం తత్ ॥ 5

న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।
యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 6

మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః ।
మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥ 7

శరీరం యదవాప్నోతి యచ్చా ప్యుత్క్రామతీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ ॥ 8

శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।
అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుపసేవతే ॥ 9

ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।
విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥ 10

యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।
యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్య చేతసః ॥ 11

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥ 12

గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా ।
పుష్ణామి చౌషధీ స్సర్వా స్సోమో భూత్వా రసాత్మకః ॥ 13

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 14

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతి ర్జ్ఞాన మపోహనం చ ।
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో వేదాంతకృ ద్వేదవిదేవ చాహమ్ ॥ 15

ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।
క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥ 16

ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ।
యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ 17

యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపి చోత్తమః ।
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥ 18

యో మా మేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।
స సర్వవి ద్భజతి మాం సర్వభావేన భారత ॥ 19

ఇతి గుహ్యతమం శాస్త్ర మిద ముక్తం మయాఽనఘ ।
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్కృతకృత్యశ్చ భారత ॥ 20

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*పురుషోత్తమ ప్రాప్తి యోగో నామ పంచదశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*షోడశోఽధ్యాయః ।*

# దైవాసుర సంపద్విభాగ యోగః ।

*శ్రీభగవా నువాచ :*

అభయం సత్త్వసంశుద్ధి ర్జ్ఞానయోగ వ్యవస్థితిః ।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥ 1

అహింసా సత్య మక్రోధ స్త్యాగ శ్శాంతి రపైశునమ్ ।
దయా భూతే ష్వలోలుత్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥ 2

తేజః క్షమా ధృతి శ్శౌచ మద్రోహో నాతిమానితా ।
భవంతి సంపదం దైవీ మభిజాతస్య భారత ॥ 3

దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।
అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపద మాసురీమ్ ॥ 4

దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా ।
మా శుచః సంపదం దైవీ మభిజాతోఽసి పాండవ ॥ 5

ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ ।
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥ 6

ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః ।
న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే ॥ 7

అసత్య మప్రతిష్ఠం తే జగదాహు రనీశ్వరమ్ ।
అపరస్పర సమ్భూతం కిమన్య త్కామహైతుకమ్ ॥ 8

ఏతాం దృష్టి మవష్టభ్య నష్టాత్మానో ఽల్పబుద్ధయః ।
ప్రభవంత్యుగ్ర కర్మాణః క్షయాయ జగతోఽహితాః ॥ 9

కామమాశ్రిత్య దుష్పూరం దంభ మాన మదాన్వితాః ।
మోహా ద్గృహీత్వాఽ సద్గ్రాహాన్ ప్రవర్తంతేఽశుచివ్రతాః ॥ 10

చింతా మపరిమేయాం చ ప్రళాయాంతా ముపాశ్రితాః ।
కామోపభోగపరమాః ఏతావదితి నిశ్చితాః ॥ 11

ఆశాపాశ శతై ర్బద్ధాః కామక్రోధ పరాయణాః ।
ఈహంతే కామభోగార్థ మన్యాయే నార్థసంచయాన్ ॥ 12

ఇద మద్య మయా లబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్ ।
ఇదమ స్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥ 13

అసౌ మయా హత శ్శత్రు ర్హనిష్యే చాపరానపి ।
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ ॥ 14

ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా ।
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞాన విమోహితాః ॥ 15

అనేక చిత్తవిభ్రాంతా మోహజాల సమావృతాః ।
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽశుచౌ ॥ 16

ఆత్మసమ్భావితాః స్తబ్ధా ధనమాన మదాన్వితాః ।
యజంతే నామయజ్ఞైస్తే దంభేనావిధిపూర్వకమ్ ॥ 17

అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః ।
మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః ॥ 18

తా నహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్ ।
క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు ॥ 19

ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।
మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాంగతిమ్ ॥ 20

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః ।
కామక్రోధ స్తథా లోభ స్తస్మా దేతత్త్రయం త్యజేత్ ॥ 21

ఏతై ర్విముక్తః కౌంతేయ తమోద్వారై స్త్రిభిర్నరః ।
ఆచర త్యాత్మనః శ్రేయ స్తతో యాతి పరాంగతిమ్ ॥ 22

**యశ్శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః ।**
**న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాంగతిమ్ ॥ 23**

**తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ ।**
**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తు మిహార్హసి ॥ 24**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*దైవాసుర సంపద్విభాగ యోగో నామ షోడశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*సప్తదశోఽధ్యాయః ।*

# శ్రద్ధాత్రయ విభాగ యోగః ।

*అర్జున ఉవాచ :*

యే శాస్త్రవిధి ముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః ।
తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః ॥ **1**

*శ్రీభగవా నువాచ :*

త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥ **2**

సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।
శ్రద్ధామయోఽ యం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః ॥ **3**

యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః ।
ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః ॥ **4**

అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః ।
దంభాహంకార సంయుక్తాః కామరాగ బలాన్వితాః ॥ **5**

కర్శయంత శ్శరీరస్థం భూతగ్రామ మచేతసః ।
మాం చైవాంత శ్శరీరస్థం తాన్విద్ధ్యాసుర నిశ్చయాన్ ॥ **6**

ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః ।
యజ్ఞ స్తప స్తథా దానం తేషాం భేద మిమం శృణు ॥ **7**

ఆయు స్సత్త్వ బలారోగ్య సుఖ ప్రీతివివర్ధనాః ।
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్విక ప్రియాః ॥ **8**

కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః ।
ఆహారా రాజస స్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥ **9**

యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ।
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్ ॥ **10**

అఫలాకాంక్షిభి ర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।
యష్టవ్యమే వేతి మనస్సమాధాయ స సాత్త్వికః ॥ 11

అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్ ।
ఇజ్యతే భరత శ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥ 12

విధిహీన మసృష్టాన్నం మంత్రహీన మదక్షిణమ్ ।
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥ 13

దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవమ్ ।
బ్రహ్మచర్య మహింసా చ శరీరం తప ఉచ్యతే ॥ 14

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ 15

మనఃప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః ।
భావసంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే ॥ 16

శ్రద్ధయా పరయాతప్తం తపస్త త్త్రివిధం నరైః ।
అఫలాకాంక్షిభి ర్యుక్తై స్సాత్వికం పరిచక్షతే ॥ 17

సత్కార మాన పూజార్థం తపో దంభేన చైవ యత్ ।
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చల మధ్రువమ్ ॥ 18

మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః ।
పరస్యోత్సాదనార్థం వా తత్తామస ముదాహృతమ్ ॥ 19

దాతవ్య మితి యద్దానం దీయతేఽనుపకారిణే ।
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥ 20

యత్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః ।
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥ 21

అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే ।
అసత్కృత మవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్ ॥ 22

ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః ।
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥ 23

తస్మా దోమిత్యుదాహృత్య యజ్ఞ దాన తపః క్రియాః ।
ప్రవర్తంతే విధానోక్తా స్సతతం బ్రహ్మవాదినామ్ ॥ 24

తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః ।
దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః ॥ 25

సద్భావే సాధుభావే చ సదిత్యేత త్ప్రయుజ్యతే ।
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే ॥ 26

యజ్ఞే తపసిదానే చ స్థితిః సదితి చోచ్యతే ।
కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే ॥ 27

అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।
అస దిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్యనో ఇహ ॥ 28

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*శ్రద్ధాత్రయ విభాగ యోగో నామ సప్తదశోఽ ధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

*అష్టాదశోఽధ్యాయః ।*

# మోక్ష సన్న్యాస యోగః ।

*అర్జున ఉవాచ :*

సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ పృథ క్కేశినిషూదన ॥ 1

*శ్రీభగవా నువాచ :*

కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।
సర్వకర్మ ఫలత్యాగం ప్రాహు స్త్యాగం విచక్షణాః ॥ 2

త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహు ర్మనీషిణః ।
యజ్ఞదాన తపఃకర్మ న త్యాజ్య మితి చాపరే ॥ 3

నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తి తః ॥ 4

యజ్ఞ దాన తపఃకర్మ న త్యాజ్యం కార్య మేవ తత్ ।
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥ 5

ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ ।
కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మత ముత్తమమ్ ॥ 6

నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।
మోహాత్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః ॥ 7

దుఃఖ మిత్యేవ యత్కర్మ కాయ క్లేశభయాత్త్యజేత్ ।
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥ 8

కార్య మిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।
సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగ స్సాత్త్వికో మతః ॥ 9

న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥ 10

న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్య శేషతః ।
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీ త్యభిధీయతే ॥ 11

అనిష్ట మిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।
భవత్య త్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥ 12

పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।
సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥ 13

అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।
వివిధాశ్చ పృథ క్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥ 14

శరీర వాఙ్మనోభి ర్యత్కర్మ ప్రారభతే నరః ।
న్యాయ్యం వా విపరీతం వా పంచై తే తస్య హేతవః ॥ 15

తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః ।
పశ్య త్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతిః ॥ 16

యస్య నాహంకృతో భావో బుద్ధి ర్యస్య న లిప్యతే ।
హత్వాఽపి స ఇమాన్ లోకాన్న హంతి న నిబధ్యతే ॥ 17

జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥ 18

జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥ 19

సర్వభూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే ।
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥ 20

పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానా భావాన్ పృథగ్విధాన్ ।
వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥ 21

యత్తు కృత్స్నవ దేకస్మిన్కార్యే సక్త మహైతుకమ్ ।
అతత్త్వార్థవదల్పం చ తత్తామస ముదాహృతమ్ ॥ 22

నియతం సంగరహిత మరాగద్వేషతః కృతమ్ ।
అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్విక ముచ్యతే ॥ 23

యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।
క్రియతే బహులాయాసం తద్రాజస ముదాహృతమ్ ॥ 24

అనుబంధం క్షయం హింసా మనపేక్ష్య చ పౌరుషమ్ ।
మోహాదారభ్యతే కర్మ యత్త త్తామస ముచ్యతే ॥ 25

ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః ।
సిద్ధ్య సిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥ 26

రాగీ కర్మఫలప్రేప్సు ర్లుబ్ధో హింసాత్మకోఽశుచిః ।
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥ 27

అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః ।
విషాదీ దీర్ఘ సూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥ 28

బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణత స్త్రివిధం శృణు ।
ప్రోచ్యమాన మశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥ 29

ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।
బన్ధం మోక్షం చ యావేత్తి బుద్ధిస్సా పార్థ సాత్త్వికీ ॥ 30

యయా ధర్మ మధర్మం చ కార్యం చాకార్యమేవ చ ।
అయథావ త్ప్రజానాతి బుద్ధిస్సా పార్థ రాజసీ ॥ 31

అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽఽవృతా ।
సర్వార్థా న్విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ తామసీ ॥ 32

ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియ క్రియాః ।
యోగే నావ్యభిచారిణ్యా ధృతిస్సా పార్థ సాత్త్వికీ ॥ 33

యయా తు ధర్మ కామార్థాన్ ధృత్యా ధారయ తేఽర్జున ।
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతి స్సా పార్థ రాజసీ ॥ 34

యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।
న విముంచతి దుర్మేధా ధృతిస్సా పార్థ తామసీ ॥ 35

సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।
అభ్యాసా ద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి ॥ 36

యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధి ప్రసాదజమ్ ॥ 37

విషయేంద్రియ సంయోగా ద్యత్తదగ్రేఽమృతోపమమ్ ।
పరిణామే విష మివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥ 38

యదగ్రే చానుబంధే చ సుఖం మోహన మాత్మనః ।
నిద్రాలస్య ప్రమాదోత్థం తత్తామస ముదాహృతమ్ ॥ 39

న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।
సత్త్వం ప్రకృతిజై ర్ముక్తం యదేభిస్స్యాత్త్రిభిర్గుణైః ॥ 40

బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరన్తప ।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥ 41

శమో దమస్తపః శ్శౌచం క్షాన్తి రార్జవ మేవ చ ।
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్ ॥ 42

శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధేచాప్య పలాయనమ్ ।
దాన మీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥ 43

కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్ ।
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥ 44

స్వే స్వే కర్మణ్యభిరత స్సంసిద్ధిం లభతే నరః ।
స్వకర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥ 45

యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥ 46

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వభావనియతం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥ 47

సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్ ।
సర్వారమ్భాహి దోషేణ ధూమే నాగ్ని రివావృతాః ॥ 48

అసక్తబుద్ధి స్సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసే నాధిగచ్ఛతి ॥ 49

సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాఽఽప్నోతి నిబోధ మే ।
సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥ 50

బుద్ధ్యా విశుద్ధయా యుక్తోధృత్యాఽఽత్మానం నియమ్య చ ।
శబ్దాదీన్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥ 51

వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయ మానసః ।
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥ 52

అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమ శ్శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥ 53

బ్రహ్మభూతః ప్రసన్నా త్మా న శోచతి న కాంక్షతి ।
సమస్స ర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥ 54

భక్త్యా మామభిజానాతి యావా న్యశ్చాస్మి తత్త్వతః ।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥ 55

సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।
మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పద మవ్యయమ్ ॥ 56

చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।
బుద్ధియోగ ముపాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ ॥ 57

మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదా త్తరిష్యసి ।
అథ చేత్త్వమహంకారా న్న శ్రోష్యసి వినంక్ష్యసి ॥ 58

యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే ।
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి ॥ **59**

స్వభావజేన కౌంతేయ నిబద్ధ స్స్వేన కర్మణా ।
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్య స్యవశోఽపితత్ ॥ **60**

ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥ **61**

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥ **62**

ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యా ద్గుహ్యతరం మయా ।
విమృశ్యైత దశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥ **63**

సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః ।
ఇష్టోఽసి మే దృఢ మితి తతో వక్ష్యామి తే హితమ్ ॥ **64**

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మా మేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥ **65**

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ **66**

ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥ **67**

య ఇమం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిధాస్యతి ।
భక్తిం మయిపరాం కృత్వా మామేవైష్య త్యసంశయః ॥ **68**

న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి ॥ **69**

అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాద మావయోః ।
జ్ఞానయజ్ఞేన తే నాహ మిష్టస్స్యా మితి మే మతిః ॥ **70**

శ్రద్ధావా ననసూయశ్చ శృణుయాదపి యో నరః ।
సో౽పి ముక్తిశ్శుభాన్ లోకాన్ ప్రాప్ను యాత్పుణ్య కర్మణామ్ ॥  71

కచ్చిదేత చ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చి దజ్ఞానసమ్మోహః ప్రనష్టస్తే ధనంజయ ॥  72

*అర్జున ఉవాచ :*

నష్టోమోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయా౽చ్యుత ।
స్థితో౽స్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥  73

*సంజయ ఉవాచ :*

ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।
సంవాద మిమ మశ్రౌష మద్భుతం రోమహర్షణమ్ ॥  74

వ్యాసప్రసాదా చ్ఛ్రుతవా నేత ద్గుహ్యతమం పరమ్ ।
యోగం యోగేశ్వరా త్కృష్ణాత్సాక్షాత్క థయత స్వయమ్ ॥  75

రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాద మిమ మద్భుతమ్ ।
కేశవార్జున యోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥  76

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూప మత్యద్భుతం హరేః ।
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునః పునః ॥  77

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ ॥  78

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*మోక్ష సన్న్యాస యోగో నామ అష్టాదశో౽ధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ॥*

# శ్రీమద్భగవద్గీత

## శ్లోకానుక్రమణిక

# శ్రీమద్భగవద్గీత - శ్లోకానుక్రమణిక

ప్రతి శ్లోకములోని మొదటిపాదము ఇందు మూలముగా పొందుపరచబడి యున్నది.


## అ

అకీర్తిం చాపి భూతాని 02-34
అక్షరం బ్రహ్మ పరమమ్ 08-03
అక్షరాణా మకారోఽస్మి 10-33
అగ్నిర్జ్యోతి రహః శుక్లః 08-24
అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయం 02-24
అజోఽపి సన్నవ్యయాత్మా 04-06
అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ 04-40
అత్ర శూరా మహేష్వాసా 01-04
అథ కేన ప్రయుక్తోఽయమ్ 03-36
అథ చిత్తం సమాధాతుమ్ 12-09
అథ చే త్త్వ మిమం ధర్మ్యమ్ 02-33
అథ చైనం నిత్యజాతమ్ 02-26
అథవా బహునైతేన 10-42
అథవా యోగినా మేవ 06-42
అథ వ్యవస్థితాన్ దృష్ట్వా 01-20
అథైతద ప్యశక్తోఽసి 12-11
అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా 11-45
అదేశకాలే యద్దానమ్ 17-22
అద్వేష్టా సర్వభూతానామ్ 12-13
అధర్మం ధర్మ మితి యా 18-32
అధర్మాభిభవా త్కృష్ణ 01-41
అధశ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖాః 15-02
అధిభూతం క్షరో భావః 08-04
అధియజ్ఞః కథం కోఽత్ర 08-02
అధిష్ఠానం తథా కర్తా 18-14
అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్ 13-12
అధ్యేష్యతే చ య ఇమమ్ 18-70
అనన్తవిజయం రాజా 01-16
అనన్తశ్చాస్మి నాగానామ్ 10-29
అనన్యచేతా స్సతతమ్ 08-14
అనన్యా శ్చిన్తయన్తో మామ్ 09-22
అనపేక్ష శ్శుచి ర్దక్షః 12-16
అనాదిత్వా న్నిర్గుణత్వాత్ 13-32
అనాదిమధ్యాన్త మనన్తవీర్యమ్ 11-19
అనాశ్రితః కర్మఫలమ్ 06-01
అనిష్ట మిష్టం మిశ్రం చ 18-12
అనుద్వేగకరం వాక్యమ్ 17-15
అనుబన్ధం క్షయం హింసామ్ 18-25
అనేక చిత్తవిభ్రాన్తాః 16-16
అనేకబాహూదరవక్త్రనేత్రమ్ 11-16
అనేకవక్త్రనయనమ్ 11-10
అన్తకాలే చ మామేవ 08-05
అన్తవత్తు ఫలం తేషామ్ 07-23
అన్తవన్త ఇమే దేహా 02-18
అన్నా ద్భవన్తి భూతాని 03-14
అన్యే చ బహవ శూరా 01-09
అన్యే త్వేవ మజానన్తః 13-26
అపరం భవతో జన్మ 04-04
అపరే నియతాహారాః 04-30
అపరేయమిత స్త్వన్యామ్ 07-05
అపర్యాప్తం తదస్మాకమ్ 01-10

అపానే జుహ్వతి ప్రాణమ్ 04-29
అపి చేత్సుదురాచారః 09-30
అపి చేదసి పాపేభ్యః 04-36
అప్రకాశో' ప్రవృత్తిశ్చ 14-13
అఫలాకాంక్షిభిర్యజ్ఞః 17-11
అభయం సత్త్వసంశుద్ధిః 16-01
అభినన్ధాయ తు ఫలమ్ 17-12
అభ్యాసయోగయుక్తేన 08-08
అభ్యాసే' వ్యసమర్థో'సి 12-10
అమానిత్వమదమ్భిత్వమ్ 13-08
అమీచత్వాంధృతరాష్ట్రస్యపుత్రాః 11-26
అమీ హి త్వాం సురసంఘా విశన్తి 11-21
అయతిః శ్రద్ధయోపేతః 06-37
అయనేషు చ సర్వేషు 01-11
అయుక్తః ప్రాకృతః స్తబ్ధః 18-28
అవజానన్తి మాం మూఢాః 09-11
అవాచ్య వాదాంశ్చ బహూన్ 02-36
అవినాశి తు తద్విద్ధి 02-17
అవిభక్తం చ భూతేషు 13-17
అవ్యక్తం వ్యక్తిమాపన్నమ్ 07-24
అవ్యక్తాదీని భూతాని 02-28
అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః 08-18
అవ్యక్తో'క్షర ఇత్యుక్తః 08-21
అవ్యక్తో'య మచిన్త్యో'యమ్ 02-25
అశాస్త్రవిహితం ఘోరమ్ 17-05
అశోచ్యానన్వశోచస్త్వమ్ 02-11
అశ్రద్ధధానాః పురుషాః 09-03
అశ్రద్ధయా హుతం దత్తమ్ 17-28
అశ్వత్థః సర్వవృక్షాణామ్ 10-26
అసంయతాత్మనా యోగః 06-36
అసంశయం మహాబాహో 06-35
అసక్తబుద్ధిః సర్వత్ర 18-49
అసక్తి రనభిష్వఙ్గః 13-10
అసత్య మప్రతిష్ఠం తే 16-08
అసౌ మయా హతః శత్రుః 16-14
అస్మాకం తు విశిష్టా యే 01-07
అహంకారం బలం దర్పమ్ 16-18
అహంకారం బలం దర్పమ్ 18-53
అహం క్రతు రహం యజ్ఞః 09-16
అహం వైశ్వానరో భూత్వా 15-14
అహం సర్వస్య ప్రభవః 10-08
అహం హి సర్వయజ్ఞానామ్ 09-24
అహ మాత్మా గుడాకేశ 10-20
అహింసా సత్య మక్రోధః 16-02
అహింసా సమతా తుష్టిః 10-05
అహోబత మహత్పాపమ్ 01-45


## ఆ


ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపః 11-31
ఆచార్యాః పితరః పుత్రాః 01-34
ఆఢ్యో'భిజనవా నస్మి 16-15
ఆత్మసమ్భావితాః స్తబ్ధాః 16-17
ఆత్మౌపమ్యేన సర్వత్ర 06-32
ఆదిత్యానా మహం విష్ణుః 10-21
ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం 02-70
ఆబ్రహ్మ భువనాల్లోకాః 08-16
ఆయుః సత్త్వబలారోగ్య 17-08
ఆయుధానా మహం వజ్రమ్ 10-28
ఆరురుక్షో ర్మునే ర్యోగమ్ 06-03
ఆవృతం జ్ఞాన మేతేన 03-39

| | |
|---|---|
| ఆశాపాశశతై ర్బద్ధాః | 16-12 |
| ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చి దేనమ్ | 02-29 |
| ఆసురీం యోని మాపన్నాః | 16-20 |
| ఆహారస్త్వపి సర్వస్య | 17-07 |
| ఆహు స్త్వా మృషయః సర్వే | 10-13 |

**ఇ**

| | |
|---|---|
| ఇచ్ఛాద్వేషః సుఖం దుఃఖమ్ | 13-07 |
| ఇచ్ఛాద్వేషసముత్థేన | 07-27 |
| ఇతి క్షేత్రం తథా జ్ఞానమ్ | 13-19 |
| ఇతి గుహ్యతమం శాస్త్రమ్ | 15-20 |
| ఇతి తే జ్ఞాన మాఖ్యాతమ్ | 18-63 |
| ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా | 11-50 |
| ఇత్యహం వాసుదేవస్య | 18-74 |
| ఇదం జ్ఞాన ముపాశ్రిత్య | 14-02 |
| ఇదం తు తే గుహ్యతమమ్ | 09-01 |
| ఇదం తే నాతపస్కాయ | 18-67 |
| ఇదం శరీరం కౌన్తేయ | 13-02 |
| ఇద మద్య మయా లబ్ధమ్ | 16-13 |
| ఇన్ద్రియ స్యేన్ద్రియ స్యార్థే | 03-34 |
| ఇన్ద్రియాణాం హి చరతామ్ | 02-67 |
| ఇన్ద్రియాణి పరా ణ్యాహుః | 03-42 |
| ఇన్ద్రియాణి మనోబుద్ధిః | 03-40 |
| ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్ | 13-09 |
| ఇమం వివస్వతే యోగమ్ | 04-01 |
| ఇష్టాన్ భోగాన్ హి వో దేవాః | 03-12 |
| ఇహైకస్థం జగత్కృత్స్నమ్ | 11-07 |
| ఇహైవ తైర్జితః సర్గః | 05-19 |

**ఈ**

| | |
|---|---|
| ఈశ్వరః సర్వభూతానామ్ | 18-61 |

**ఉ**

| | |
|---|---|
| ఉచ్చైః శ్రవస మశ్వానామ్ | 10-27 |
| ఉత్క్రామన్తం స్థితం వాపి | 15-10 |
| ఉత్తమః పురుషస్త్వన్యః | 15-17 |
| ఉత్సన్నకుల ధర్మాణామ్ | 01-44 |
| ఉత్సీదేయు రిమే లోకాః | 03-24 |
| ఉదారాః సర్వ ఏవైతే | 07-18 |
| ఉదాసీన వదాసీనః | 14-23 |
| ఉద్ధరే దాత్మనాత్మానమ్ | 06-05 |
| ఉపద్రష్టానుమన్తాచ | 13-23 |

**ఊ**

| | |
|---|---|
| ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః | 14-18 |
| ఊర్ధ్వమూల మధఃశాఖమ్ | 15-01 |

**ఋ**

| | |
|---|---|
| ఋషిభి ర్బహుధా గీతమ్ | 13-05 |

**ఏ**

| | |
|---|---|
| ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య | 11-35 |
| ఏతద్యోనీని భూతాని | 07-06 |
| ఏత న్మే సంశయం కృష్ణ | 06-39 |
| ఏతాం దృష్టి మవష్టభ్య | 16-09 |
| ఏతా న్న హన్తు మిచ్ఛామి | 01-35 |
| ఏతాం విభూతిం యోగం చ | 10-07 |
| ఏతాన్యపి తు కర్మాణి | 18-06 |
| ఏతై ర్విముక్తః కౌన్తేయ | 16-22 |
| ఏవం జ్ఞాత్వా కృతం కర్మ | 04-15 |
| ఏవం పరమ్పరా ప్రాప్తమ్ | 04-02 |
| ఏవం ప్రవర్తితం చక్రమ్ | 03-16 |

ఏవం బహువిధా యజ్ఞా 04-32
ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా 03-43
ఏవం సతతయుక్తా యే 12-01
ఏవ ముక్తో హృషీకేశః 01-24
ఏవ ముక్త్వా తతో రాజన్ 11-09
ఏవ ముక్త్వార్జునః సంఖ్యే 01-47
ఏవ ముక్త్వా హృషీకేశమ్ 02-09
ఏవ మైత ద్యథాత్థ త్వమ్ 11-03
ఏషా తే'భిహితా సాంఖ్యే 02-39
ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ 02-72

## ఓ

ఓం తత్సదితి నిర్దేశః 17-23
ఓమిత్యేకాక్షరం బ్రహ్మ 08-13

## క

కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ 18-72
కచ్చిన్నోభయవిభ్రష్టః 06-38
కట్వామ్లలవణాత్యుష్ణ 17-09
కథం న జ్ఞేయ మస్మాభిః 01-39
కథం భీష్మ మహం సంఖ్యే 02-04
కథం విద్యా మహం యోగిన్ 10-17
కర్మజం బుద్ధియుక్తా హి 02-51
కర్మణః సుకృత స్యాహుః 14-16
కర్మణైవ హి సంసిద్ధిమ్ 03-20
కర్మణో హ్యపి బోద్ధవ్యమ్ 04-17
కర్మణ్యకర్మ యః పశ్యేత్ 04-18
కర్మణ్యేవాధికారస్తే 02-47
కర్మబ్రహ్మోద్భవం విద్ధి 03-15
కర్మేన్ద్రియాణి సంయమ్య 03-06
కర్శయన్తః శరీరస్థమ్ 17-06
కవిం పురాణ మనుశాసితారమ్ 08-09
కస్మాచ్చ తే న నమేర న్మహాత్మన్ 11-37
కాంక్షన్తః కర్మణాం సిద్ధిమ్ 04-12
కామ ఏష క్రోధ ఏష 03-37
కామ క్రోధ వియుక్తానామ్ 05-26
కామ మాశ్రిత్య దుష్పూరం 16-10
కామాత్మానః స్వర్గపరాః 02-43
కామైస్తై స్తైర్హృతజ్ఞానాః 07-20
కామ్యానాం కర్మణాం న్యాసమ్ 18-02
కాయేన మనసా బుద్ధ్యా 05-11
కార్పణ్యదోషోపహతస్వభావః 02-07
కార్యకారణకర్తృత్వే 13-21
కార్యమిత్యేవ యత్కర్మ 18-09
కాలో'స్మి లోకక్షయకృత్ప్రవృద్ధః 11-32
కాశ్యశ్చ పరమేష్వాసః 01-17
కిం కర్మ కిమకర్మేతి 04-16
కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మమ్ 08-01
కిం పునర్బ్రాహ్మణాః పుణ్యాః 09-33
కిరీటినం గదినం చక్రహస్తం 11-46
కిరీటినం గదినం చక్రిణం చ 11-17
కుత స్త్వా కశ్మల మిదమ్ 02-02
కులక్షయే ప్రణశ్యన్తి 01-40
కృపయా పరయావిష్టః 01-28
కృషి గోరక్షవాణిజ్యమ్ 18-44
కైర్లింగై స్త్రీన్ గుణా నేతాన్ 14-21
క్రోధా ద్భవతి సమ్మోహః 02-63
క్లేశో'ధికతరస్తేషామ్ 12-05
క్లైబ్యం మా స్మ గమః పార్థ 02-03

క్షిప్రం భవతి ధర్మాత్మా 09-31
క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ 13-35
క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి 13-03

## గ

గత సఙ్గస్య ముక్తస్య 04-23
గతిర్భర్తా ప్రభుః సాక్షీ 09-18
గాణ్డీవం స్రంసతే హస్తాత్ 01-30
గా మావిశ్య చ భూతాని 15-13
గుణా నేతా నతీత్య త్రీన్ 14-20
గురూ నహత్వా హి మహానుభావాన్ 02-05

## చ

చంచలం హి మనః కృష్ణ 06-34
చతుర్విధా భజన్తే మామ్ 07-16
చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్ 04-13
చిన్తామపరిమేయాం చ 16-11
చేతసా సర్వకర్మాణి 18-57

## జ

జన్మ కర్మ చ మే దివ్యమ్ 04-09
జరామరణమోక్షాయ 07-29
జాతస్య హి ధ్రువో మృత్యుః 02-27
జితాత్మనః ప్రశాన్తస్య 06-07
జ్ఞానం కర్మ చ కర్తా చ 18-19
జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా 18-18
జ్ఞానం తే’హం సవిజ్ఞానమ్ 07-02
జ్ఞానయజ్ఞేన చాప్యన్యే 09-15
జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా 06-08
జ్ఞానేన తు తదజ్ఞానమ్ 05-16
జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి 13-13
జ్ఞేయం స నిత్య సంన్యాసీ 05-03
జ్యాయసీ చేత్కర్మణస్తే 03-01
జ్యోతిషామపి తజ్జ్యోతిః 13-18

## త

తం తథా కృపయావిష్టమ్ 02-01
త్వం విద్యా ద్దుఃఖసంయోగ 06-23
తచ్చ సంస్మృత్య సంస్మృత్య 18-77
తతః పదం తత్పరిమార్గితవ్యమ్ 15-04
తతః శంఖాశ్చ భేర్యశ్చ 01-13
తతః శ్వేతై ర్హయై ర్యుక్తే 01-14
తతః స విస్మయావిష్టః 11-14
తత్త్వవిత్తు మహాబాహో 03-28
తత్ర తం బుద్ధిసంయోగమ్ 06-43
తత్ర సత్త్వం నిర్మలత్వాత్ 14-06
తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః 01-26
తత్క్షేత్రం యచ్చ యాదృక్ చ 13-04
తత్రైకస్థం జగత్కృత్స్నమ్ 11-13
తత్రైకాగ్రం మనః కృత్వా 06-12
తత్రైవం సతి కర్తారమ్ 18-16
తదిత్యనభిసన్ధాయ 17-25
తద్బుద్ధయస్తదాత్మానః 05-17
తద్విద్ధి ప్రణిపాతేన 04-34
తపస్విభ్యో’ధికో యోగీ 06-46
తపామ్యహ మహం వర్షమ్ 09-19
తమస్త్వజ్ఞానజం విద్ధి 14-08
తమువాచ హృషీకేశః 02-10
తమేవ శరణం గచ్ఛ 18-62
తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే 16-24

తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ 03-41
తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ 11-33
తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం 11-44
తస్మాత్సర్వేషు కాలేషు 08-07
తస్మాదజ్ఞానసమ్భూతమ్ 04-42
తస్మాదసక్తః సతతమ్ 03-19
తస్మా దోమిత్యుదాహృత్య 17-24
తస్మాద్యస్య మహాబాహో 02-68
తస్మా న్నార్హా వయం హన్తుమ్ 01-37
తస్య సంజనయన్ హర్షమ్ 01-12
తా నహం ద్విషతః క్రూరాన్ 16-19
తాని సర్వాణి సంయమ్య 02-61
తుల్యనిన్దాస్తుతిర్మౌనీ 12-19
తేజః క్షమా ధృతిః శౌచమ్ 16-03
తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలమ్ 09-21
తేషాం జ్ఞానీ నిత్యయుక్తః 07-17
తేషాం సతతయుక్తానామ్ 10-10
తేషామహం సముద్ధర్తా 12-07
తేషామేవానుకమ్పార్థమ్ 10-11
త్యక్త్వా కర్మఫలం సంగమ్ 04-20
త్యాజ్యం దోషవదిత్యేకే 18-03
త్రిభిర్గుణమయైర్భావైః 07-13
త్రివిధం నరకస్యేదమ్ 16-21
త్రివిధా భవతి శ్రద్ధా 17-02
త్రైగుణ్య విషయా వేదాః 02-45
త్రైవిద్యా మాం సోమపాః
పూతపాపాః 09-20
త్వమక్షరం పరమం వేదితవ్యమ్ 11-18
త్వమాదిదేవః పురుషః పురాణః 11-38

ద

దంష్ట్రాకరాలాని చ తే ముఖాని 11-25
దణ్డో దమయతా మస్మి 10-38
దమ్భో దర్పో'భిమానశ్చ 16-04
దాతవ్యమితి యద్దానమ్ 17-20
దివి సూర్యసహస్రస్య 11-12
దివ్యమాల్యామ్బరధరమ్ 11-11
దుఃఖమిత్యేవ యత్కర్మ 18-08
దుఃఖేష్వనుద్విగ్నమనాః 02-56
దూరేణ హ్యవరం కర్మ 02-49
దృష్ట్వా తు పాణ్డవానీకమ్ 01-02
దృష్ట్వేదం మానుషం రూపమ్ 11-51
దేవద్విజగురుప్రాజ్ఞ 17-14
దేవాన్ భావయతానేన 03-11
దేహినో'స్మిన్ యథా దేహే 02-13
దేహీ నిత్య మవధ్యో'యమ్ 02-30
దైవమేవాపరే యజ్ఞమ్ 04-25
దైవీ సమ్పత్ విమోక్షాయ 16-05
దైవీహ్యేషా గుణమయీ 07-14
దోషైరేతైః కులఘ్నానామ్ 01-43
ద్యావా పృథివ్యోరిదమన్తరం హి 11-20
ద్యూతం ఛలయతామస్మి 10-36
ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞాః 04-28
ద్రుపదో ద్రౌపదేయాశ్చ 01-18
ద్రోణం చ భీష్మం చ
జయద్రథం చ 11-34
ద్వావిమౌ పురుషౌ లోకే 15-16
ద్వౌ భూతసర్గౌ లోకే'స్మిన్ 16-06

## ధ


ధర్మక్షేత్రే కురుక్షేత్రే 01-01
ధూమేనావ్రియతే వహ్నిః 03-38
ధూమో రాత్రి స్తథా కృష్ణః 08-25
ధృత్యా యయా ధారయతే 18-33
ధృష్టకేతుశ్చేకితానః 01-05
ధ్యానేనాత్మని పశ్యన్తి 13-25
ధ్యాయతో విషయాన్ పుంసః 02-62


## న


న కర్తృత్వం న కర్మాణి 05-14
న కర్మణామనారమ్భాన్ 03-04
న కాంక్షే విజయం కృష్ణ 01-32
న చ తస్మాన్మనుష్యేషు 18-69
న చ మత్‌స్థాని భూతాని 09-05
న చ మాం తాని కర్మాణి 09-09
న చైతద్విద్మః కతరన్నో గరీయః 02-06
న జాయతే మ్రియతే వా కదాచిత్ 02-20
న తదస్తి పృథివ్యాం వా 18-40
న తద్భాసయతే సూర్యః 15-06
న తు మాం శక్యసే ద్రష్టుమ్ 11-08
న త్వేవాహం జాతు నాసమ్ 02-12
న ద్వేష్ట్యకుశలం కర్మ 18-10
న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య 05-20
న బుద్ధిభేదం జనయేత్ 03-26
నభస్స్పృశం దీప్తమనేకవర్ణమ్ 11-24
నమః పురస్తా దథ పృష్ఠతస్తే 11-40
న మాం కర్మాణి లిమ్పన్తి 04-14
న మాం దుష్కృతినో మూఢాః 07-15
న మే పార్థాస్తి కర్తవ్యమ్ 03-22
న మే విదుః సురగణాః 10-02
న రూపమస్యేహ తథోపలభ్యతే 15-03
న వేద యజ్ఞాధ్యయనై ర్న దానైః 11-48
నష్టో మోహః స్మృతిర్లబ్ధా 18-73
న హి కశ్చిత్ క్షణమపి 03-05
న హి జ్ఞానేన సదృశమ్ 04-38
న హి దేహభృతా శక్యం 18-11
న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్ 02-08
నాత్యశ్నతస్తు యోగోఽస్తి 06-16
నాదత్తే కస్యచిత్పాపమ్ 05-15
నాన్తోఽస్తి మమ దివ్యానామ్ 10-40
నాన్యం గుణేభ్యః కర్తారమ్ 14-19
నాసతో విద్యతే భావః 02-16
నాస్తి బుద్ధిరయుక్తస్య 02-66
నాహం ప్రకాశః సర్వస్య 07-25
నాహం వేదై ర్న తపసా 11-53
నిమిత్తాని చ పశ్యామి 01-31
నియతం కురు కర్మ త్వమ్ 03-08
నియతం సంగరహితమ్ 18-23
నియతస్య తు సన్న్యాసః 18-07
నిరాశీ ర్యతచిత్తాత్మా 04-21
నిర్మానమోహా జితసఙ్గదోషాః 15-05
నిశ్చయం శ్రుణు మే తత్ర 18-04
నిహత్య ధార్తరాష్ట్రా న్నః 01-36
నేహాభిక్రమనాశోఽస్తి 02-40
నైతే సృతీ పార్థ జానన్ 08-27
నైనం ఛిన్దన్తి శస్త్రాణి 02-23
నైవ కించిత్కరోమీతి 05-08
నైవ తస్య కృతేనార్థః 03-18

### ప

| | |
|---|---|
| పఞ్చైతాని మహాబాహో | 18-13 |
| పత్రం పుష్పం ఫలం తోయమ్ | 09-26 |
| పరం బ్రహ్మ పరం ధామ | 10-12 |
| పరం భూయః ప్రవక్ష్యామి | 14-01 |
| వరస్తస్మాత్తు భావో౽న్యో | 08-20 |
| పరిత్రాణాయ సాధూనామ్ | 04-08 |
| పవనః పవతామస్మి | 10-31 |
| పశ్య మే పార్థ రూపాణి | 11-05 |
| పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్ | 11-06 |
| పశ్యామి దేవాం స్తవ దేవ దేహే | 11-15 |
| పశ్యైతాం పాణ్డుపుత్రాణామ్ | 01-03 |
| పాంచజన్యం హృషీకేశః | 01-15 |
| పార్థ నైవేహ నాముత్ర | 06-40 |
| పితాసి లోకస్య చరాచరస్య | 11-43 |
| పితాహమస్య జగతః | 09-17 |
| పుణ్యో గన్ధః పృథివ్యాం చ | 07-09 |
| పురుషః ప్రకృతిస్థో హి | 13-22 |
| పురుషః స పరః పార్థ | 08-22 |
| పురోధసాం చ ముఖ్యం మామ్ | 10-24 |
| పూర్వాభ్యాసేన తేనైవ | 06-44 |
| పృథక్త్వేన తు యద్ జ్ఞానమ్ | 18-21 |
| ప్రకాశం చ ప్రవృత్తిం చ | 14-22 |
| ప్రకృతిం పురుషం చైవ | 13-01 |
| ప్రకృతిం పురుషం చైవ | 13-20 |
| ప్రకృతిం స్వామవష్టభ్య | 09-08 |
| ప్రకృతేః క్రియమాణాని | 03-27 |
| ప్రకృతే ర్గుణసమ్మూఢాః | 03-29 |
| ప్రకృత్యైవ చ కర్మాణి | 13-30 |
| ప్రజహాతి యదా కామాన్ | 02-55 |
| ప్రయత్నాద్యతమానస్తు | 06-45 |
| ప్రయాణకాలే మనసా చలేన | 08-10 |
| ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ | 05-09 |
| ప్రవృత్తిం చ నివృత్తిం చ | 16-07 |
| ప్రవృత్తిం చ నివృత్తిం చ | 18-30 |
| ప్రశాన్త మనసం హ్యేనం | 06-27 |
| ప్రశాన్తాత్మా విగతభీః | 06-14 |
| ప్రసాదే సర్వదుఃఖానామ్ | 02-65 |
| ప్రహ్లాదశ్చాస్మి దైత్యానామ్ | 10-30 |
| ప్రాప్య పుణ్యకృతామ్ లోకాన్ | 06-41 |

### బ

| | |
|---|---|
| బన్ధురాత్మాత్మన స్తస్య | 06-06 |
| బలం బలవతాం చాహమ్ | 07-11 |
| బహిరన్తశ్చ భూతానామ్ | 13-16 |
| బహూనాం జన్మనామన్తే | 07-19 |
| బహూని మే వ్యతీతాని | 04-05 |
| బాహ్యస్పర్శేష్వసక్తాత్మా | 05-21 |
| బీజం మాం సర్వభూతానామ్ | 07-10 |
| బుద్ధియుక్తో జహాతీహ | 02-50 |
| బుద్ధిర్జ్ఞాన మసమ్మోహః | 10-04 |
| బుద్ధేర్భేదం ధృతేశ్చైవ | 18-29 |
| బుద్ధ్యా విశుద్ధయా యుక్తః | 18-51 |
| బృహత్సామ తథా సామ్నాం | 10-35 |
| బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్ | 14-27 |
| బ్రహ్మణ్యాధాయ కర్మాణి | 05-10 |
| బ్రహ్మభూతః ప్రసన్నాత్మా | 18-54 |
| బ్రహ్మార్పణం బ్రహ్మహవిః | 04-24 |
| బ్రాహ్మణక్షత్రియవిశామ్ | 18-41 |

## భ

భక్త్యా త్వనన్యయా శక్యః 11-54
భక్త్యా మామభిజానాతి 18-55
భయాద్ రణాదుపరతమ్ 02-35
భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ 01-08
భవాప్యయౌ హి భూతానామ్ 11-02
భీష్మద్రోణప్రముఖతః 01-25
భూతగ్రామః స ఏవాయమ్ 08-19
భూమిరాపో'నలో వాయుః 07-04
భూయ ఏవ మహాబాహో 10-01
భోక్తారం యజ్ఞతపసామ్ 05-29
భోగైశ్వర్య ప్రసక్తానామ్ 02-44

## మ

మచ్చిత్తః సర్వదుర్గాణి 18-58
మచ్చిత్తా మద్గతప్రాణా 10-09
మత్కర్మకృన్మత్పరమః 11-55
మత్తః పరతరం నాన్యత్ 07-07
మదనుగ్రహాయ పరమమ్ 11-01
మనః ప్రసాదః సౌమ్యత్వమ్ 17-16
మనుష్యాణాం సహస్రేషు 07-03
మన్మనా భవ మద్భక్తః 9-34, 18-65
మన్యసే యది తచ్ఛక్యమ్ 11-04
మమ యోని ర్మహద్బ్రహ్మ 14-03
మమైవాంశో జీవలోకే 15-07
మయా తత మిదం సర్వమ్ 09-04
మయాధ్యక్షేణ ప్రకృతిః 09-10
మయా ప్రసన్నేన తవార్జునేదమ్ 11-47
మయి చానన్యయోగేన 13-11
మయి సర్వాణి కర్మాణి 03-30
మయ్యావేశ్య మనో యే మామ్ 12-02
మయ్యాసక్తమనాః పార్థ 07-01
మయ్యేవ మన ఆధత్స్వ 12-08
మహర్షయః సప్త పూర్వే 10-06
మహర్షీణాం భృగు రహం 10-25
మహాత్మానస్తు మాం పార్థ 09-13
మహాభూతా న్యహంకారః 13-06
మాం చ యో' వ్యభిచారేణ 14-26
మాం హి పార్థ వ్యపాశ్రిత్య 09-32
మా తే వ్యథా మా చ విమూఢభావః 11-49
మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ 02-14
మానావమానయోస్తుల్యః 14-25
మాముపైత్య పునర్జన్మ 08-15
ముక్తసఙ్గో'నహంవాదీ 18-26
మూఢగ్రాహేణాత్మనో యత్ 17-19
మృత్యుః సర్వహరశ్చాహమ్ 10-34
మోఘాశా మోఘకర్మాణః 09-12

## య

య ఇదం పరమం గుహ్యమ్ 18-68
య ఏవం వేత్తి పురుషమ్ 13-24
య ఏవం వేత్తి హన్తారమ్ 02-19
యం యం వాపి స్మరన్ భావమ్ 08-06
యం లబ్ధ్వా చాపరమ్ లాభమ్ 06-22
యం సన్న్యాసమితి ప్రాహుః 06-02
య హి న వ్యథయన్త్యేతే 02-15
యః శాస్త్రవిధి ముత్సృజ్య 16-23
యః సర్వత్రానభిస్నేహః 02-57
యచ్చాపహాసార్థ మసత్కృతో'సి 11-42

| | |
|---|---|
| యచ్చాపి సర్వభూతానామ్ | 10-39 |
| యజన్తే సాత్త్వికా దేవాన్ | 17-04 |
| యద్‌జ్ఞాత్వా న పునర్మోహమ్ | 04-35 |
| యజ్ఞదానతపః కర్మ | 18-05 |
| యజ్ఞ శిష్టామృత భుజః | 04-31 |
| యజ్ఞశిష్టాశినః సన్తః | 03-13 |
| యజ్ఞార్థాత్కర్మణో౽న్యత్ర | 03-09 |
| యజ్ఞే తపసి దానే చ | 17-27 |
| యతః ప్రవృత్తి ర్భూతానామ్ | 18-46 |
| యతతో హ్యపి కౌన్తేయ | 02-60 |
| యతన్తో యోగినశ్చైనం | 15-11 |
| యత్కరోషి యదశ్నాసి | 09-27 |
| యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం | 05-05 |
| యతేన్ద్రియ మనో బుద్ధిః | 05-28 |
| యతో యతో నిశ్చలతి | 06-26 |
| యత్తదగ్రే విషమివ | 18-37 |
| యత్తు కామేప్సునా కర్మ | 18-24 |
| యత్తు కృత్స్నవ దేకస్మిన్ | 18-22 |
| యత్తు ప్రత్యుపకారార్థం | 17-21 |
| యత్ర కాలే త్వనావృత్తిమ్ | 08-23 |
| యత్ర యోగేశ్వరః కృష్ణః | 18-78 |
| యత్రోపరమతే చిత్తం | 06-20 |
| యథాకాశస్థితో నిత్యం | 09-06 |
| యథా దీపో నివాతస్థః | 06-19 |
| యథా నదీనాం బహవో౽మ్బువేగాః | 11-28 |
| యథా ప్రకాశయ త్యేకః | 13-34 |
| యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గః | 11-29 |
| యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ | 13-33 |
| యథైధాంసి సమిద్ధో౽గ్నిః | 04-37 |
| యదక్షరం వేదవిదో వదన్తి | 08-11 |
| యదగ్రే చానుబన్ధే చ | 18-39 |
| యదహంకారమాశ్రిత్య | 18-59 |
| యదా తే మోహకలిలమ్ | 02-52 |
| యదాదిత్యగతం తేజః | 15-12 |
| యదా భూతపృథగ్భావమ్ | 13-31 |
| యదా యదా హి ధర్మస్య | 04-07 |
| యదా వినియతం చిత్తమ్ | 06-18 |
| యదా సంహరతే చాయమ్ | 02-58 |
| యదా సత్త్వే ప్రవృద్ధే తు | 14-14 |
| యదా హి నేన్ద్రియార్థేషు | 06-04 |
| యది మామప్రతీకారమ్ | 01-46 |
| యది హ్యహం న వర్తేయమ్ | 03-23 |
| యదృచ్ఛయా చోపపన్నం | 02-32 |
| యదృచ్ఛాలాభ సంతుష్టః | 04-22 |
| యద్యదాచరతి శ్రేష్ఠః | 03-21 |
| యద్యద్విభూతిమత్సత్త్వమ్ | 10-41 |
| యద్యప్యేతే న పశ్యన్తి | 01-38 |
| యయా తు ధర్మకామార్థాన్ | 18-34 |
| యయా ధర్మ మధర్మం చ | 18-31 |
| యయా స్వప్నం భయం శోకం | 18-35 |
| యస్త్వాత్మరతి రేవ స్యాత్ | 03-17 |
| య స్త్విన్ద్రియాణి మనసా | 03-07 |
| యస్మాత్క్షరమతీతో౽హమ్ | 15-18 |
| యస్మాన్నో ద్విజతే లోకః | 12-15 |
| యస్య నాహంకృతో భావః | 18-17 |
| యస్య సర్వే సమారమ్భాః | 04-19 |
| యాతయామం గతరసం | 17-10 |
| యా నిశా సర్వభూతానాం | 02-69 |

యాన్తి దేవవ్రతా దేవాన్ 09-25
యామిమాం పుష్పితాం వాచమ్ 02-42
యావత్సంజాయతే కించిత్ 13-27
యావ దేతా న్నిరీక్షే'హమ్ 01-22
యావానర్థ ఉదపానే 02-46
యుక్తః కర్మఫలం త్యక్త్వా 05-12
యుక్తాహార విహారస్య 06-17
యుంజన్నేవం సదాత్మానమ్ 06-15
యుంజన్నేవం సదాత్మానం 06-28
యుధామన్యుశ్చ విక్రాన్తః 01-06
యే చైవ సాత్త్వికా భావాః 07-12
యే తు ధర్మ్యామృత మిదమ్ 12-20
యే తు సర్వాణి కర్మాణి 12-06
యే త్వక్షర మనిర్దేశ్యమ్ 12-03
యే త్వేతదభ్యసూయన్తః 03-32
యే'ప్యన్యదేవతాభక్తా 09-23
యే మే మత మిదం నిత్యం 03-31
యే యథా మాం ప్రపద్యన్తే 04-11
యే శాస్త్రవిధి ముత్సృజ్య 17-01
యేషాం త్వన్తగతం పాపం 07-28
యేషా మర్థే కాంక్షితం నః 01-33
యే హి సంస్పర్శజా భోగాః 05-22
యోగయుక్తో విశుద్ధాత్మా 05-07
యోగసన్న్యస్త కర్మాణం 04-41
యోగస్థః కురు కర్మాణి 02-48
యోగినామపి సర్వేషాం 06-47
యోగీ యుంజీత సతతం 06-10
యోత్స్యమానా నవేక్షే'హమ్ 01-23
యోన హృష్యతి న ద్వేష్టి 12-17
యో'న్తఃసుఖో'న్తరారామః 05-24
యో మాం పశ్యతి సర్వత్ర 06-30
యో మా మజ మనాదిం చ 10-03
యో మా మేవ మసమ్మూఢః 15-19
యో'యం యోగ స్త్వయా ప్రోక్తః 06-33
యో యో యాం యాం
తనుం భక్తః 07-21

## ర

రజసి ప్రలయం గత్వా 14-15
రజ స్తమ శ్చాభిభూయ 14-10
రజో రాగాత్మకం విద్ధి 14-07
రసో'హమప్సు కౌన్తేయ 07-08
రాగద్వేష విముక్తైస్తు 02-64
రాగీ కర్మఫలప్రేప్సుః 18-27
రాజన్ సంస్మృత్య సంస్మృత్య 18-76
రాజవిద్యా రాజగుహ్యమ్ 09-02
రుద్రాణాం శంకరశ్చాస్మి 10-23
రుద్రాదిత్యా వసవో
యే చ సాధ్యాః 11-22
రూపం మహత్తే బహువక్త్రనేత్రమ్ 11-23

## ల

లభన్తే బ్రహ్మ నిర్వాణమ్ 05-25
లేలిహ్యసే గ్రసమానః సమన్తాత్ 11-30
లోకే'స్మిన్ ద్వివిధా నిష్ఠా 03-03
లోభః ప్రవృత్తి రారంభః 14-12

## వ

వక్తు మర్హస్యశేషేణ 10-16

వక్త్రాణి తే త్వరమాణా విశన్తి 11-27
వాయుర్యమో'గ్ని ర్వరుణః 11-39
వాసాంసి జీర్ణాని యథా విహాయ 02-22
విద్యావినయ సంపన్నే 05-18
విధిహీన మసృష్టాన్నమ్ 17-13
వివిక్తసేవీ లఘ్వాశీ 18-52
విషయా వినివర్తన్తే 02-59
విషయేన్ద్రియ సంయోగాత్ 18-38
విస్తరేణాత్మనో యోగమ్ 10-18
విహాయ కామా న్యః సర్వాన్ 02-71
వీతరాగ భయక్రోధా 04-10
వృష్ణీనాం వాసుదేవో'స్మి 10-37
వేదానాం సామవేదో'స్మి 10-22
వేదావినాశినం నిత్యం 02-21
వేదాహం సమతీతాని 07-26
వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ 08-28
వ్యవసాయాత్మికా బుద్ధిః 02-41
వ్యామిశ్రేణేవ వాక్యేన 03-02
వ్యాస ప్రసాదాచ్ఛ్రుతవాన్ 18-75

శ

శక్నోతీహైవ యః సోఢుం 05-23
శనైః శనై రుపరమేత్ 06-25
శమో దమ స్తపః శౌచం 18-42
శరీరం యదవాప్నోతి 15-08
శరీరం వాఙ్మనోభిర్యత్ 18-15
శుక్ల కృష్ణే గతీహ్యేతే 08-26
శుచౌ దేశే ప్రతిష్ఠాప్య 06-11
శుభా శుభ ఫలై రేవం 09-28
శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం 18-43
శ్రద్ధయా పరయా తప్తం 17-17
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం 04-39
శ్రద్ధావా ననసూయశ్చ 18-71
శ్రుతి విప్రతిపన్నా తే 02-53
శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ 04-33
శ్రేయాన్ స్వధర్మో విగుణః 03-35
శ్రేయాన్ స్వధర్మో విగుణః 18-47
శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ 12-12
శ్రోత్రం చక్షుః స్పర్శనం చ 15-09
శ్రోత్రాదీ నీన్ద్రియాణ్యన్యే 04-26
శ్వశురాన్ సుహృదశ్చైవ 01-27

స

స ఏవాయం మయా తే' ద్య 04-03
సంకరో నరకాయైవ 01-42
సంకల్పప్రభవాన్ కామాన్ 06-24
సంనియమ్యేన్ద్రియగ్రామమ్ 12-04
సన్న్యాసం కర్మణాం కృష్ణ 05-01
సన్న్యాసః కర్మయోగశ్చ 05-02
సన్న్యాసస్తు మహాబాహో 05-06
సన్న్యాసస్య మహాబాహో 18-01
సక్తాః కర్మణ్యవిద్వాంసః 03-25
సఖేతి మత్వా ప్రసభం యదుక్తం 11-41
స ఘోషో ధార్తరాష్ట్రాణాం 01-19
సతతం కీర్తయన్తో మామ్ 09-14
స తయా శ్రద్ధయా యుక్తః 07-22
సత్కార మాన పూజార్థమ్ 17-18
సత్త్వం రజ స్తమ ఇతి 14-05

| | |
|---|---|
| సత్త్వం సుఖే సంజయతి | 14-09 |
| సత్త్వాత్సంజాయతే జ్ఞానం | 14-17 |
| సత్త్వానురూపా సర్వస్య | 17-03 |
| సదృశం చేష్టతే స్వస్యాః | 03-33 |
| సద్భావే సాధుభావే చ | 17-26 |
| సన్తుష్టః సతతం యోగీ | 12-14 |
| సమం కాయశిరో గ్రీవం | 06-13 |
| సమం పశ్యన్హి సర్వత్ర | 13-29 |
| సమం సర్వేషు భూతేషు | 13-28 |
| సమః శత్రౌ చ మిత్రేచ | 12-18 |
| సమ దుఃఖ సుఖః స్వస్థః | 14-24 |
| సమోఽహం సర్వభూతేషు | 09-29 |
| సర్గాణా మాదిరన్తశ్చ | 10-32 |
| సర్వకర్మాణి మనసా | 05-13 |
| సర్వ కర్మాణ్యపి సదా | 18-56 |
| సర్వగుహ్యాతమం భూయః | 18-64 |
| సర్వతః పాణిపాదం తత్ | 13-14 |
| సర్వద్వారాణి సంయమ్య | 08-12 |
| సర్వద్వారేషు దేహేఽస్మిన్ | 14-11 |
| సర్వధర్మాన్ పరిత్యజ్య | 18-66 |
| సర్వభూతస్థ మాత్మానం | 06-29 |
| సర్వభూతస్థితం యో మాం | 06-31 |
| సర్వభూతాని కౌన్తేయ | 09-07 |
| సర్వభూతేషు యేనైకం | 18-20 |
| సర్వమేతదృతం మన్యే | 10-14 |
| సర్వయోనిషు కౌన్తేయ | 14-04 |
| సర్వస్య చాహం హృది సన్నివిష్టః | 15-15 |
| సర్వాణీన్ద్రియ కర్మాణి | 04-27 |
| సర్వేన్ద్రియగుణాభాసం | 13-15 |
| సహజం కర్మ కౌన్తేయ | 18-48 |
| సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా | 03-10 |
| సహస్రయుగ పర్యన్తం | 08-17 |
| సాంఖ్య యోగౌ పృథగ్బాలాః | 05-04 |
| సాధిభూతాధిదైవం మాం | 07-30 |
| సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ | 18-50 |
| సీదన్తి మమ గాత్రాణి | 01-29 |
| సుఖం త్విదానీం త్రివిధం | 18-36 |
| సుఖ దుఃఖే సమే కృత్వా | 02-38 |
| సుఖ మాత్యన్తికం యత్తత్ | 06-21 |
| సుదుర్దర్శ మిదం రూపం | 11-52 |
| సుహృన్మిత్రార్యుదాసీన | 06-09 |
| స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా | 11-36 |
| స్థితప్రజ్ఞస్య కా భాషా | 02-54 |
| స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ | 05-27 |
| స్వధర్మమపి చావేక్ష్య | 02-31 |
| స్వభావజేన కౌన్తేయ | 18-60 |
| స్వయమే వాత్మనాత్మానం | 10-15 |
| స్వే స్వే కర్మణ్యభిరతః | 18-45 |


## హ



| | |
|---|---|
| హతో వా ప్రాప్స్యసే స్వర్గం | 02-37 |
| హన్త తే కథయిష్యామి | 10-19 |
| హృషీకేశం తదా వాక్యం | 01-21 |




కులపతి బుక్ ట్రస్ట్ ప్రచురణ

**కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.)** గారి

అపూర్వ రచనా ప్రణాళిక




# శ్రీమద్భాగవతము

(రహస్య ప్రకాశము, మూలము,
పద్యముల వివరణములతో)

శ్రీమద్భాగవత ప్రచురణా ప్రణాళికలో భాగముగా ప్రథమ, ద్వితీయ, పంచమ, షష్ఠ, సప్తమ, అష్టమ, నవమ స్కంధములు ఒక్కొక్కటి ఒక్కొక్క భాగముగా; తృతీయ, చతుర్థ స్కంధములు రెండేసి భాగములుగా; దశమ స్కంధము నాలుగు భాగములుగా; ఏకాదశ-ద్వాదశ స్కంధములు కలిపి ఒక సంపుటిగా; మొత్తం 12 స్కంధములు కలిపి 16 గ్రంథములుగా వెలువడినవి.

మొత్తం సెట్ వెల : రూ॥ **3,000-00**

*ప్రతులకు :*


**కులపతి బుక్ ట్రస్ట్,**

**15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.**

ఫోన్ : 0891-2565291.

e-mail : kulapathibooktrust@gmail.com



వ్యక్తికేది కావలయునో జాతికి కూడా అదే కావలయును. అనగా తన కేది కావలయునో ఇతరులకు కూడా అదే కావలయునవి యర్థము. దీనిని గుర్తించుటయే ధర్మమును గుర్తించుట. దీనిని గుర్తించునట్లు చేయు దివ్యవాక్కే "శంఖారావము". శరీరము అను రథములో నుండి యిది వినిపించును. ఈ శంఖారావమును విని, తానును పూరింపవలసినవాడు దేహములోని జీవుడు.

ఈ దేహమున ధర్మమనబడు శంఖారావము సారథి రూపుడైన నారాయణునిచే చేయబడును. ఈ రావము మనస్సు నుండి పంచేంద్రియముల లోనికి దిగివచ్చి, పంచభూతాత్మకమైన శరీరమును నిర్వహించుచు, పంచతన్మాత్రల మూలమున జన్యమైన సమన్వయముగా వినబడవలెను. కనుక శ్రీకృష్ణుడు ఊదిన శంఖము పేరు "పాంచజన్యము". ఇక నరుడు పూరించు శంఖము తన స్వంతము కాదు. దేవునిచే దత్తము. కనుక అర్జునుడూదిన శంఖము పేరు దేవదత్తము.

నారాయణుడు పూరించు శంఖారావము నరునకు (అనగా జీవునకు) ధర్మబోధయై వినిపించును. ఈ బోధనే వ్యాసుడు "భగవద్గీత" యని వ్యవహరించినాడు. 'గీత' యనగా గానము చేయబడినది. అది శ్లోక రూపము, సంగీత రూపము మాత్రమే గాక, జీవు డలవరచుకొనవలసిన గానము.

- మాస్టర్ ఇ.కె.

ISBN: 978-81-906949-1-9

9788190694919